రంగనాథ-వాల్మీకి రామాయణముల
తులనాత్మకపరిశీలనము

(Ph.D పట్టమునకై ఉస్మానియా విశ్వవిద్యాలయమునకు సమర్పించబడిన సిద్ధాంతవ్యాసము)

1981

డా॥ గుండి వేంకటాచార్యులు
M.A; Ph.D.
ఆంధ్రోపన్యాసకులు
ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, కామారెడ్డి.

రంగనాథ-వాల్మీకి రామాయణముల
తులనాత్మక పరిశీలనము.
డా॥ గుండి వేంకటాచార్యులు

ప్రథమ ముద్రణము = 1987
ప్రతులు = 1000

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల శాఖ
ఆర్థిక సహాయముతో ప్రచురితము.

ముద్రణ = కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్,
విద్యానగర్, హైదరాబాద్.

వెల = సాదాప్రతి = రూ॥ 85/-
అట్టబైండ్ = రూ॥ 100/-

ప్రతులకు,
జి. రామానుజాచార్యులు
H.No. 5-5-69,
వివేకానంద కాలనీ,
P.O. కామారెడ్డి,
Dist. నిజామాబాద్.

ఓం

శ్రీరామాయ నమః

రామాయ రామభద్రాయ రామచంద్రాయ వేధసే।
రఘునాథాయ నాథాయ సీతాయాః పతయేనమః॥
ఆపదా మపహర్తారం దాతారం సర్వసంపదాం।
లోకాభి రామం శ్రీరామం భూయో భూయో నమామ్యహం॥

శ్రీరామచంద్ర చరణౌ మనసా స్మరామి।
శ్రీరామచంద్ర చరణౌ వచసా గృణామి।
శ్రీరామచంద్ర చరణౌ శిరసా నమామి।
శ్రీరామచంద్ర చరణౌ శరణం ప్రపద్యే॥

మనోజవం మారుత తుల్య వేగం
జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠం।
వాతాత్మజం వానర యూథముఖ్యం
శ్రీరామ దూతం శిరసా నమామి॥

చరితం రఘునాథస్య శతకోటి ప్రవిస్తరం।
ఏకైక మక్షరం ప్రోక్తం మహాపాతక నాశనం॥

కూజంతం రామరామేతి మధురం మధురాక్షరం।
ఆరుహ్య కవితాశాఖాం వందే వాల్మీకి కోకిలం॥

అంకితము




శ్రీరామచంద్రు డాశ్రిత పారిజాతు

డీరేడు లోకాల నేలెడు స్వామి

అఖిల కల్యాణ గుణాంబుధియైన

మఖ భోక్త కర్పింతు మనసార కృతిని.





పూజ్య పితృపాదులు

శ్రీమాన్ గుండి శ్రీనివాసాచార్యులుగారు



రచయిత : గుండి వెంకటాచార్యులు
సతీమణి : శ్రీనివాస



అత్తమామలు

శ్రీమతి : ఆండాళు

శ్రీమాన్ : నమిలికొంత నరహరిస్వామిగారు

-: మున్నుడి :-

రంగనాథ రామాయణమును గూర్చిన విమర్శనాత్మక వ్యాసములలో ప్రధానంగా చర్చింపబడు నంశములు మూడు. 1. కర్తృత్వము. 2. అవాల్మీకములు. 3. వైష్ణవతత్త్వము. కర్తృత్వము నెంత చర్చించి నిర్ధరించినను, విమర్శకులలో భిన్నాభిప్రాయము లుండనే యుండును, ఇక, విమర్శకులు చెప్పిన అవాల్మీకాంశముల పట్టికలను జూచినపుడు, "వాల్మీకి జాడ చెప్పెద ననిన రచయిత యిన్ని అవాల్మీక కథాంశములను జొప్పించినాడా? నిజముగా ఈ పట్టికలలోని వన్నియు అవాల్మీకములేనా? ఇవిగాక నింక నేమేనియున్నవా?" యని యాలోచనయు విమర్శనాత్మక దృష్టితో పఠించు పాఠకులకు గలుగు చుండును చాలమంది విమర్శకులు రంగనాథ రామాయణము సోమనాథుని వీరశైవ మతప్రచారమునకు ప్రతిభటముగా వైష్ణవ మతవ్యాప్తికొఱకు వ్రాయబడినదని చెప్పెదరు కాని దానిలోని వైష్ణవ మత తత్త్వాంశములను విశేషముగా చర్చించినవారుకారు.

కామారెడ్డి లోని "హితసాహితీ సంస్థ" ప్రేరణమున నేనీ రంగనాథ రామాయణమును పరిశోధింప బూనుకొంటిని. ముద్రితమైన వివిధ రంగనాథ రామాయణ ప్రతులను— వావిళ్ళప్రతి, రాయల్ అండ్‌కో ప్రతి, ఆంధ్ర విశ్వకళా పరిషత్తు సంశోధిత ముద్రితప్రతి, సి. వి. కృష్ణాడిపోవారి ప్రతి మొదలగు వానిని- పరిశీలించితిని. ఇట్లే వాల్మీకిరామాయణ వివిధ ప్రతులను- దాక్షిణాత్యప్రతి, పశ్చిమోత్తర శాఖీయ ప్రతి, గౌడీయప్రతి, తాళపత్రి లిఖిత వాల్మీకి రామాయణప్రతులను- అతి కష్టముగా సంపాదించి రంగనాథ రామాయణ వివిధ ప్రతులతో పోల్చి చూచితిని; మరియు గ్రంథమునందలి "పురాణమార్గంబు" అను శబ్ద ప్రయోగ కారణమున పద్మపురాణ, స్కాందపురాణ, శివపురాణాగ్ని పురాణాదులను చూడవలసి వచ్చినది గ్రంథకర్త రామాయణ మర్మ ధర్మజ్ఞుడగుట చేత, అధ్యాత్మ, ఆనందాది రామాయణములు, వివిధ కవులువ్రాసిన హనుమన్నాటక (హనుమద్రామాయణ) చంపురామాయణ, ఉత్తర రామచరిత్రాది గ్రంథములతో రంగనాథ రామాయణమును పోల్చిచూడవలసిన ఆవశ్యకత యేర్పడినది, ఈ మొదలయిన గ్రంథములతో బహుశ్రమకోర్చి చేసిన కృషి ఫలితమే నాయీ సిద్ధాంత వ్యాసము.

విషయము విస్తృతమగుటవలన, ప్రతిపాద్యాంశముల సమ్యగవగాహనకై ఈవ్యాసమును ఎనిమిది ప్రకరణములుగా విభజించితిని.

1. మొదటి ప్రకరణమునందు— కర్తృత్వమును గూర్చిన ఆయావిమర్శకుల భిన్నాభిప్రాయాలను క్రోడీకరించి, ఈ గ్రంథమునకు తొలుతటినుండి యున్న పేరు రంగనాథ రామాయణమనియు, ఈ గ్రంథకర్త బుద్ధారెడ్డి యనియు మరికొన్ని అంతరంగిక ప్రమాణములను చూపి నిరూపించితిని.
2. రెండవ ప్రకరణమునందు— బుద్ధభూపతి ఏయే పద్ధతుల ద్వారా వాల్మీకి రామాయణమును పెంచి, కుదించి, మార్చి రచించి తెలుగున అత్యుత్తమ గ్రంథముగా తీర్చి దిద్దియున్నాడో, సోదాహరణముగా వానిని తెలియ జేసితిని.
3. మూడవ ప్రకరణమునందు— అవాల్మీకాంశములుగా పరిగణింపబడుచున్న వానిలో పెక్కు కథాంశములకు మూలములు వివిధ వాల్మీకి రామాయణ ప్రతులలో గోచరమగుచున్నందున నుట్టంకించి ఔచిత్యవిచార చర్చయు గావించితిని.

4. నాల్గవ ప్రకరణమునందు— బుద్ధనృపతి వాల్మీకి రామాయణము ననువదించు వేళ గ్రంథ గౌరవ సంపాదనకై వివిధ రామాయణముల నుండి గ్రహించి పొందు పరచిన కథాంశములను, భావ ములను నుట్టంకించి, తద్వారా సాధింపబడిన ప్రయోజనములను చర్చించితిని.

5. ఐదవ ప్రకరణమునందు— కొన్ని అవాల్మీకాంశములకు ఆధారభూతములైన ఆయాపురాణ ములను చూపి, వానిని గ్రహించినందు వలన గలిగిన ప్రయోజన ప్రాశస్త్యములను వక్కాణించితిని.

6. ఆరవ ప్రకరణమునందు— కవి దేశమునందు వ్యాప్తములైన గేయకీర్తనాది రూపములలో నున్న రామాయణ కథాంశములను కొన్నింటిని గ్రహించి పొందుపరచుటయే గాక, తన కావ్యమును దేశి కావ్యముగా మలచుటకై ప్రయత్న పూర్వకముగా చూపిన ద్విపదచ్ఛందము సంచలి మెలకువల ను, దేశి భాషా ప్రయోగ విశేషములను ప్రస్తావించితిని,

7. ఏడవ ప్రకరణమునందు— రంగనాథ రామాయణమున నారాయణ పరతత్త్వ, ప్రపత్తి, అర్థపంచక, నవవిధ సంబంధాది వైష్ణవ తత్త్వములను సముచితముగా జొప్పించిన పట్టులను చూపి యథాశక్తి వివరించితిని.

8, ఎనిమిదవ ప్రకరణమునందు— రంగనాథ రామాయణమున ధర్మవీరము అంగి రసముగా పోషింప బడినదనియు, మూలము నందు వలెనే ఇందుకూడ అన్ని రసములు సందర్భాను గుణముగా పోషింప బడినట్లును నిరూపింప ప్రయత్నించితిని. అలంకార వర్ణనాంశములందు కవి గైకొన్న అను వాద పద్ధతులను ఉదాహరించితిని.

ఈరీతిగా యథాశక్తి పూర్తి చేసిన యీసిద్ధాంత వ్యాసమును విద్వత్పుంగవులు సహృదయతతో స్వీకరింతురుగాక.

“రంగనాథ వాల్మీకి రామాయణములు— ఒక తులనాత్మక పరిశీలనము” అను విషయము పరిశోధనముగా నెన్నుకొని పర్యవేక్షకులుగా నుండుటకై డా॥ శ్రీ జి. వి. సుబ్రహ్మణ్యము గారిని సమీపించగా, వారు దయతో నంగీకరించి, వ్రాసిన ప్రతి యంశమును ఓపికతో చూచి, చర్చించి అమూల్యములైన సలహాలనొసంగు చుండిరి. వారికి నాహృదయ పూర్వక కృతజ్ఞతలు.

U. G. C వారు F. I. P. పథకము క్రింద రెండు సంవత్సరములు నాకుపకారవేతనము నొసంగి, పరిశోధింప నవకాశము నెక్కువగా కలిగించి యున్నారు, వారికి నా మనః పూర్వక కృతజ్ఞతలు—

నా యీప్రయత్నమున అన్నివిధాల సహకరించి ప్రోత్సహించిన సర్వశ్రీ ఉస్మానియా విశ్వ విద్యాలయోపాధ్యక్షులైన డా॥ జి రామిరెడ్డి గారికి, ఆచార్య డా॥ బి. రామరాజు గారికి, డా॥ యం. కులశేఖరరావు గారికి, డా॥ నాయిని కృష్ణకుమారి గారికి, శ్రీమాన్ మరింగంటి శ్రీరంగాచార్యుల గారికిని హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ గ్రంథముద్రణకు రూ॥లు 5000/- ప్రభుత్వము వారు ఆర్థిక సహాయముగా నొసంగి యున్నారు, వారికి సర్వదా కృతజ్ఞడను—

ముఖమునకు తిలకము శోభించునట్లు ముందుమాటగా “అభినందన” వ్రాసిన శ్రీ ఆచార్య డా॥ యం కులశేఖరరావు గారికిని “పీఠిక” వ్రాసిన శ్రీ ఆచార్య జి. వి. సుబ్రహ్మణ్యము గారికిని, “యథార్థోక్తులు” వ్రాసిన కందళై శ్రీరంగాచార్యుల వారికిని ఆశీః పంచరత్నములచే ఆశీర్వదించిన శ్రీమాన్ కలకుంట్లనృసింహాచార్యులకును కృతజ్ఞతలు తెలియ జేయుచున్నాను.

అందముగా ముద్రించి యిచ్చిన శ్రీ కర్షక్ ఆర్ట్ ప్రింటర్ వారికి ధన్యవాదములు తెలియ చేయుచున్నాను.

చేదోడు వాదోడుగా నుండి సహకరించిన నా సహోపన్యాసకులు డా॥ శ్రీ కే. వెంకటరెడ్డి గారికిని, అందముగా ముఖపత్రము వ్రాసియిచ్చిన శ్రీ నపేశ్వరశర్మ గారికిని హృదయపూర్వక కృతజ్ఞతలు—

ఎందరో మహానుభావులు — అందరికి వందనములు

కామారెడ్డి

బుధజనవిధేయుడు

గుండి వేంకటాచార్యులు.

అభినందన

రంగనాథ రామాయణము అనే మహాకావ్యాన్ని గూర్చి డా. గుండి వేంకటాచార్యులు రచించిన ఈ సిద్ధాంత గ్రంథం ఈ రామాయణానికి సర్వస్వం అనదగినట్లుగా ఉన్నది. రంగనాథ రామాయణం గురించి, దాని కర్తను గురించి, ఆనాడు వీరేశలింగం గారి నుండి ఈనాటి వరకు చర్చలు నడుస్తూనే ఉన్నవి. డా. ఆచార్యులుగారు అందరి చారిత్రకుల, విమర్శకుల అభిప్రాయాలను సేకరించి, గోన వంశ విశేషాలను సమీకరించి, హేతుబద్ధమైన నిర్ణయంచేసి బుద్ధభూపతియే రంగనాథ రామాయణాన్ని రచించినాడని చెప్పడం సమంజసంగానే కాన్పిస్తున్నది. ఈ నిర్ణయంతో ముందు ముందు అందరును ఏకీభవించవచ్చు.

రంగనాథ - వాల్మీకి రామాయణాల, కథార్థముల తులనాత్మక పరిశీలనము అనే భాగం ఈ గ్రంథంలో ప్రామాణికమైంది. ఈ పరిశోధకుడు సంస్కృత భాషమీద, సంస్కృత రామాయణం మీద తగినంతకు అధికారం కలిగిన వాడు కాబట్టి ఈ రెండింటి తులనాత్మక పరిశీలన చాలా సమగ్రంగాను జరిగింది. సూక్ష్మాతి సూక్ష్మమైన విశేషాలు ఈ భాగంలో చర్చించబడ్డాయి. అస్త్ర శస్త్రాల పేర్లు, కథాగమనంలో ఉండే విశేషాలు కూడ ఈ చర్చలో చోటు చేసుకున్నాయి. కొన్ని సందర్భాలలో రంగనాథ రామాయణకర్త వాల్మీకి రామాయణాన్ని ఎంత సన్నిహితంగా అనుసరించినాడో ఈ పరిశోధకుడు ఎత్తిచూపించడం ఎంతో సముచితంగా ఉన్నది.

పట్టణంబునఁ దీరువడఁ దోరణములు
గట్టించి బహుపతాకలు కల్వడములు
కలయంగ నెత్తించి గంధోదకములు
పొలుపొందఁ జల్లించి, పుష్పధూపములు
కరమొప్పు రాజమార్గమున వాసింప

దీనికి మూలము ఎంత దగ్గరగా ఉన్నదో చూడండి,

పుష్పైర్గంధైశ్చ ధూపైశ్చ
సర్వతః సమలంకృతః
రాజమార్గ స్తథాకీర్ణో
జలేనచ సముక్షితః
సముచ్ఛ్రిత పతాకంచ
తూర్యోత్కృష్ట నినాదితం

ఇటువంటి పరిశోధన గ్రంథానికి అలంకార ప్రాయంగా ఉన్నది. రెండు రామాయణాలను అత్యంతం తులనాత్మకంగా చేసి చెప్పడం శ్రీ ఆచార్యుల వారి ప్రజ్ఞాపాటవానికి నిదర్శనంగా ఉన్నది.

ఈ గ్రంథంలోని రంగనాథ రామాయణము-వైష్ణవ తత్త్వం అనే భాగం మకుటాయమానమైంది శ్రీఆచార్యుల వారికి విశిష్టాద్వైత సిద్ధాంతమునందు కలిగిన ప్రావీణ్యానికి ప్రతీకగా ఉన్నది, భగవంతుడు అనంత కల్యాణ గుణగణాలు కలిగినవాడు పరబ్రహ్మ ఒకడే భగవంతుడు, విశిష్టాద్వైత మతావలంబులైన వైష్ణవులు ఐశ్వర్యాది గుణాలకు ప్రాధాన్యము ఈయరు. వాత్సల్యము, స్వామిత్వము సౌశీల్యము, సౌలభ్యము, జ్ఞానము, శక్తి అనే వాటికి ప్రాముఖ్యము ఇస్తారు, రామాయణం కథానాయకుడైన, భగవత్స్వరూపుడైన శ్రీరాముని వాత్సల్యాది షడ్గుణాలను ప్రతిపాదిస్తున్నది, ఈ షడ్గుణాలు రంగనాథ రామాయణంలో ఏ విధంగా ప్రతిపాదితమైనాయో శ్రీ ఆచార్యులవారు చాలా చక్కగా నిరూపించినారు. రామాయణం శరణాగతి శాస్త్రంగా ఎందుకు ప్రఖ్యాతి వహించిందో కూడ వారు చర్చించినారు

ఈ సిద్ధాంత గ్రంథంలోని అనేకానేక విషయాలలో ఇవి అల్పాంశం మాత్రమే, డా॥ గుండి వేంకటాచార్యుల వారు ఏ విషయాన్ని గ్రహించినా, తలస్పర్శిగా పరిశీలించే సామర్థ్యం కలిగినవారు, ఈ సిద్ధాంత గ్రంథంలో వారి సంప్రదాయాభిజ్ఞత, వారి పాండిత్యం సార్థకమైనాయి, ఇంత ఉత్తమ గ్రంథం వ్రాసినందుకు శ్రీ ఆచార్యుల వారిని నేను హృదయ పూర్వకంగా అభినందిస్తున్నాను,

విజ్ఞానపురి - విద్యానగరం,
హైదరాబాదు,
20-2-87

డా॥ ఎం. కులశేఖర్‌రావు.

రమణీయ దర్శనము

పరిశోధనలో తులనాత్మక పరిశీలనము ఒక ప్రత్యేక శాఖ. తులనాత్మక పరిశీలనమునకు ప్రత్యేకమైన అధ్యయన విధానము పరిశీలన పద్ధతుల నిర్మాణము అభివృద్ధి చెందుచున్న రోజులివి. పరిశోధనకు బహుభాషా సాహిత్య పరిచయమే కాక, వానియందు గాఢమైన అభినివేశము ఉండవలెను. పాండిత్యముతో సృజనాత్మకమైన సత్యాన్వేషణము కూడ అవసరము. మిత్రులు డా॥ జి. వెంకటాచారిగారు సంస్కృతాంధ్ర భాషలలో పండితులు. ఉభయ సాహిత్యములందును లోతైన అధ్యయనము చేసి తులనాత్మక పరిశీలన ప్రవృత్తిని పెంపొందించుకొనినవారు. "రంగనాథ రామాయణము వాల్మీకి రామాయణము - తులనాత్మక పరిశీలనము" అను నీ పరిశోధనాంశము వారి పాండితీ ప్రతిభలకు పరిశోధన సామర్థ్యమునకు సముచితమైనదై భాసించుచున్నది

డా॥ జి వెంకటాచారిగారు శ్రీమద్వాల్మీకి రామాయణమును పురాణముగా చెప్పుట నేనెరుగుదును. పురాణమును అధ్యాత్మ ప్రవచనముగా నిర్వహింప గలిగిన ప్రజ్ఞ వారికి కరతలామలకము. రామాయణముపై వారుపన్యాస పరంపరల నిచ్చుట నేనెరుగుదును. సంస్కృతాంధ్రములందున్న బహురామాయణముల పరిశీలనాత్మకమైన వ్యుత్పత్తి వారి ఉపన్యాసములలో సహజముగా జాలువారు చుండును, వారెంతటి వినయ మూర్తులో అంతటి విద్వాంసులు. విశేషించి వెంకటాచార్యులవారు వైష్ణవమత సంబంధమైన అనేక శాస్త్ర గ్రంథములను కూలంకషముగా చదివినవారు. రామానుజులు వేదమునకును, గీతకును, రామాయణమునకును, ఇచ్చిన సమన్వయములు వెంకటాచారి గారి వ్యాఖ్యాన సూత్రములు. వాల్మీకమును గురించిన గాఢమైన పాండిత్యము వెంకటాచారి గారి తులనాత్మక పరిశీలనకు ప్రాతిపదికలను సమకూర్చినది.

శ్రీమద్రామాయణమును గురించిన వాఙ్మయ మనంతము. అట్లే తెలుగున వెలసిన రామాయణములలో రంగనాథరామాయణమును గురించిన విమర్శయు ప్రత్యేకముగా పేర్కొనదగినది. ఆ కావ్యమును గురించి వివాదములే ఎక్కువ. కర్త ఎవరు? కాలమేది? దేశీయ కల్పనలేవి? ప్రక్రియా విధానమెట్టిది? మొదలైన అంశము లెన్నియో విమర్శకుల విభిన్న సమన్వయములకు ఆలవాలమై యున్నవి. రంగనాథ రామాయణములోని అవాల్మీక కల్పనలను గురించి పలువురు ప్రసిద్ధవిమర్శకులు తమ తమ పరిశోధన ఫలితములను వెలువరించియున్నారు. డా॥ వెంకటాచారిగారు, సమస్యాలమయమైన ఈ పరిశోధనాంశమును గ్రహించి నూత్నాంశములను ప్రతిపాదింప గలిగినారు. నేనెరిగినంతవరకు ఆధునికులలో రంగనాథ రామాయణమును గురించి ఇంతటి సాధికారికమైన పరిశోధన చేసినవారు మరొకరు లేరు.

డా॥ వెంకటాచారిగారు రంగనాథ రామాయణమును అనువదించిన విధానమును అనుశీలించిన పద్ధతి ప్రత్యేకముగా ప్రశంసింపదగినది రంగనాథ రామాయణ కర్త మూలముగా నేరామాయణము

గ్రహించినను విషయమును నిర్ధారించుటకు పెక్కు వాల్మీకి రామాయణ ప్రతులను వెంకటాచారి గారు సేకరించి పరిశీలించినారు. బుద్ధారెడ్డి రామాయణ కథార్థములకు మూలములను అన్వేషించిన వెంకటాచారి గారి కృషి ఉత్తమ పరిశోధనకు ప్రమాణముగా నిలుచుచున్నది.

రంగనాథ రామాయణమునందు కానవచ్చు మూల రామాయణాంశములను అమూలక రామాయణాంశములను వివిధ రామాయణముల ప్రభావముల వలన కానవచ్చు కథాంశములను నిర్ధారణ చేయుట సముద్రమునకు ఏతము ఎత్తుట వంటిది వైష్ణవ మతాభిమానియైన బుద్ధారెడ్డి విష్ణుతత్త్వ ప్రతిపాదకములును, వైష్ణవధర్మ ప్రతిపాదకములును అయిన అంశములను పెక్కింటిని తన రామాయణమునందు సంపుటీకరించిన వైనమును డా॥ వెంకటాచారి గారు విశేషకృషి ఫలితముగా వివరించినారు. రంగనాథ రామాయణమునందలి దేశి లక్షణములను నిరూపించిన అధ్యాయము విశ్లేషణాత్మకముగా నున్నది. వెంకటాచారి గారు రంగనాథ రామాయణమునందలి వైష్ణవ తత్త్వమును వ్యాఖ్యానించిన విధము వారి పరిశోధన పరమార్థమును పట్టియిచ్చుచున్నది.

డా॥ జి. వెంకటాచారి గారు నా పర్యవేక్షణలో ఉస్మానియా విశ్వవిద్యాలయమునందు పరిశోధన చేసినారు. ఎఫ్ ఐ పి. కార్యక్రమము క్రింద వారికి యు.జి.సి. సాహాయ్య మొనర్చినది. వారితో నేను జరిపిన చర్చలు నాకుపయోగపడినవి. కొన్ని విషయములలో మా యిరువురికిని ఏకాభిప్రాయము కుదరక పోవుటయు జరిగినది. అయినను తర్కసహమైన వాదము ననుసరించి పరిశోధనమునందు అట్టి అంశములను ప్రతిపాదించుటయైనది. అభిప్రాయములు వేరైనను సాటి పరిశోధకుల భావములను గౌరవించెడి ఉత్తమ సంస్కారము డా॥ జి. వెంకటాచారి గారికి సహజ సిద్ధము. వారు పరిశోధననొక తపస్సుగా సాగించినారు వారి పరిశోధనలో పర్యవేక్షణావకాశమును పొందిననేను, ఒక సాహితీయజ్ఞ నిర్వహణమునందు యాజమాన్యమును వహించిన సంతృప్తిని పొందినాను. సంతత పరిశోధన ప్రవృత్తి పరిమళించెడి ఒక సహచరుని పొందిన ఆనందమునందినాను. డా॥ వెంకటాచారి గారి విలువైన పరిశోధనాంశములు సాహితీ విజ్ఞాన పరిధి విస్తృతియగుటకు తప్పక తోడ్పడగలవని విశ్వసించుచున్నాను. ఈ బృహద్గ్రంథమును ప్రచురింపగలుగుచున్నందులకు డా॥ వెంకటాచారిగారిని అభినందించుచున్నాను. ఒక్క మాటలో చెప్పవలెనన్నచో ఈ గ్రంథము రంగనాథ రామాయణ రమణీయ దర్శనము.

హైదరాబాదు,

30-6-1987.

జి. వి. సుబ్రహ్మణ్యం

రమణీయ దర్శనము

పరిశోధనలో తులనాత్మక పరిశీలనము ఒక ప్రత్యేక శాఖ. తులనాత్మక పరిశీలనమునకు ప్రత్యేకమైన అధ్యయన విధానము పరిశీలన పద్ధతుల నిర్మాణము అభివృద్ధి చెందుచున్న రోజులివి. పరిశోధనకు బహుభాషా సాహిత్య పరిచయమే కాక, వానియందు గాఢమైన అభినివేశము ఉండవలెను. పాండిత్యముతో సృజనాత్మకమైన సత్యాన్వేషణము కూడ అవసరము. మిత్రులు డా॥ జి. వెంకటాచారిగారు సంస్కృతాంధ్ర భాషలలో పండితులు. ఉభయ సాహిత్యములందును లోతైన అధ్యయనము చేసి తులనాత్మక పరిశీలన ప్రవృత్తిని పెంపొందించుకొనినవారు. "రంగనాథ రామాయణము వాల్మీకి రామాయణము - తులనాత్మక పరిశీలనము" అను నీ పరిశోధనాంశము వారి పాండితీ ప్రతిభలకు పరిశోధన సామర్థ్యమునకు సముచితమైనదై భాసించుచున్నది

డా॥ జి వెంకటాచారిగారు శ్రీమద్వాల్మీకి రామాయణమును పురాణముగా చెప్పుట నేనెరుగుదును, పురాణమును ఆధ్యాత్మ ప్రవచనముగా నిర్వహింప గలిగిన ప్రజ్ఞ వారికి కరతలామలకము. రామాయణముపై వారుపన్యాస పరంపరల నిచ్చుట నేనెరుగుదును. సంస్కృతాంధ్రములందున్న బహురామాయణముల పరిశీలనాత్మకమైన వ్యుత్పత్తి వారి ఉపన్యాసములలో సహజముగా జాలువారు చుండును, వారెంతటి వినయ మూర్తులో అంతటి విద్వాంసులు. విశేషించి వెంకటాచార్యుల వారు వైష్ణవమత సంబంధమైన అనేక శాస్త్ర గ్రంథములను కూలంకషముగా చదివినవారు. రామానుజులు వేదమునకును, గీతకును, రామాయణమునకును, ఇచ్చిన సమన్వయములు వెంకటాచారి గారి వ్యాఖ్యాన సూత్రములు. వాల్మీకమును గురించిన గాఢమైన పాండిత్యము వెంకటాచారి గారి తులనాత్మక పరిశీలనకు ప్రాతిపదికలను సమకూర్చినది.

శ్రీమద్రామాయణమును గురించిన వాఙ్మయ మనంతము. అట్లే తెలుగున వెలసిన రామాయణములలో రంగనాథరామాయణమును గురించిన విమర్శయు ప్రత్యేకముగా పేర్కొన దగినది. ఆ కావ్యమును గురించి వివాదములే ఎక్కువ. కర్త ఎవరు? కాలమేది? దేశీయ కల్పనలేవి? ప్రక్రియా విధానమెట్టిది? మొదలైన అంశము లెన్నియో విమర్శకుల విభిన్న సమన్వయములకు ఆలవాలమై యున్నవి. రంగనాథ రామాయణములోని అవాల్మీక కల్పనలను గురించి పలువురు ప్రసిద్ధవిమర్శకులు తమ తమ పరిశోధన ఫలితములను వెలువరించియున్నారు. డా॥ వెంకటాచారిగారు, సమస్యలమయమైన ఈ పరిశోధనాంశమును గ్రహించి నూత్నాంశములను ప్రతిపాదింప గలిగినారు. నేనెరిగినంతవరకు ఆధునికులలో రంగనాథ రామాయణమును గురించి ఇంతటి సాధికారికమైన పరిశోధన చేసినవారు మరొకరు లేరు.

డా॥ వెంకటాచారిగారు రంగనాథ రామాయణమును అనువదించిన విధానమును అనుశీలించిన పద్ధతి ప్రత్యేకముగా ప్రశంసింపదగినది రంగనాథ రామాయణ కర్త మూలముగా నేరామాయణము

గ్రహించినను విషయమును నిర్ధారించుటకు పెక్కు వాల్మీకి రామాయణ ప్రతులను వేంకటాచారి గారు సేకరించి పరిశీలించినారు. బుద్ధారెడ్డి రామాయణ కథార్థములకు మూలములను అన్వేషించిన వెంకటాచారి గారి కృషి ఉత్తమ పరిశోధనకు ప్రమాణముగా నిలుచుచున్నది.

రంగనాథ రామాయణమునందు కానవచ్చు మూల రామాయణాంశములను అమూలక రామాయణాంశములను వివిధ రామాయణముల ప్రభావముల వలన కానవచ్చు కథాంశములను నిర్ధారణ చేయుట సముద్రమునకు సేతువు ఎత్తుట వంటిది వైష్ణవ మతాభిమానియైన బుద్ధారెడ్డి విష్ణుతత్త్వ ప్రతిపాదకములును, వైష్ణవధర్మ ప్రతిపాదకములును అయిన అంశములను పెక్కింటిని తన రామాయణమునందు సంపుటీకరించిన వైనమును డా॥ వెంకటాచారి గారు విశేషకృషి ఫలితముగా వివరించినారు. రంగనాథ రామాయణమునందలి దేశీ లక్షణములను నిరూపించిన అధ్యాయము విశ్లేషణాత్మకముగా నున్నది. వెంకటాచారి గారు రంగనాథ రామాయణమునందలి వైష్ణవ తత్త్వమును వ్యాఖ్యానించిన విధము వారి పరిశోధన పరమార్థమును పట్టియిచ్చుచున్నది.

డా॥ జి. వెంకటాచారి గారు నా పర్యవేక్షణలో ఉస్మానియా విశ్వవిద్యాలయమునందు పరిశోధన చేసినారు. ఎఫ్ ఐ పి. కార్యక్రమము క్రింద వారికి యు.జి.సి. సాహాయ్య మొనర్చినది. వారితో నేను జరిపిన చర్చలు నాకుపయోగపడినవి. కొన్ని విషయములలో మా యిరువురికిని ఏకాభిప్రాయము కుదరక పోవుటయు జరిగినది. అయినను తర్కసహమైన వాదము ననుసరించి పరిశోధనమునందు అట్టి అంశములను ప్రతిపాదించుటయైనది. అభిప్రాయములు వేరైనను సాటి పరిశోధకుల భావములను గౌరవించెడి ఉత్తమ సంస్కారము డా॥ జి. వెంకటాచారి గారికి సహజ సిద్ధము. వారు పరిశోధననొక తపస్సుగా సాగించినారు వారి పరిశోధనలో పర్యవేక్షణావకాశమును పొందిననేను, ఒక సాహితీయజ్ఞ నిర్వహణమునందు యాజమాన్యమును వహించిన సంతృప్తిని పొందినాను. సంతత పరిశోధన ప్రవృత్తి పరిమళించెడి ఒక సహచరుని పొందిన ఆనందమునందినాను. డా॥ వెంకటాచారి గారి విలువైన పరిశోధనాంశములు సాహితీ విజ్ఞాన పరిధి విస్తృతియగుటకు తప్పక తోడ్పడగలవని విశ్వసించుచున్నాను. ఈ బృహద్గ్రంథమును ప్రచురింపగలుగుచున్నందులకు డా॥ వెంకటాచారిగారిని అభినందించుచున్నాను. ఒక్క మాటలో చెప్పవలెనన్నచో ఈ గ్రంథము రంగనాథ రామాయణ రమణీయ దర్శనము.

హైదరాబాదు,

30-6-1987.

జి. వి. సుబ్రహ్మణ్యం

యథార్థోక్తులు

శ్రీమాన్ గుండి వేంకటాచార్యులు సంస్కృతాంధ్ర పండిత శుశ్రూషా ప్రభావమున ఉభయ భాషా పాండిత్యమును ప్రాచీన పద్ధత్యధ్యయనముతో సంపాదించిన మేధావులు. ఆకాలంలో శ్రీమాన్ శిరిశినహళ్ వేంకటాచార్యులు, శ్రీమాన్ చందుభట్ల లక్ష్మణమూర్తియు, వీరును సంస్కృత శాఖలో ఉత్తమశ్రేణి వహించి నిజాం కళాశాలకు శోభను కల్గించి విరాజిల్లిన నక్షత్రత్రయము.

వారిద్దరికంటె, వైదికత్వమును పుణికి పుచ్చుకొన్న బ్రాహ్మణశ్రేష్ఠుడు, యాజ్ఞికోత్తముడు, సదాచారపరాయణుడు, తండ్రియగు గుండి శ్రీనివాసచార్యుల ప్రతీకగా నిలిచినాడు. ఋషిసత్తముడైన వాల్మీకి యనుగ్రహమున అనర్ఘయోగ్యతను సంపాదించి రామాయణ విమర్శకుడైనాడు. విషయాభిరుచి స్వభావాన్ని బట్టి లభించును. "శోభియన్ శెప్పినత్తిప్పి" అని అప్పయ దీక్షితులచే ప్రశంసింపబడిన పెరియ వాచ్చాన్ బిళ్ళైగారు సాధించిన రామాయణ సంప్రదాయార్థ రత్నములను రంగనాథ రామాయణ సాగరమునందు వెలికి వెలికి దీసిన సంప్రదాయాభిజ్ఞుడు.

వీరు వ్రాసిన "రంగనాథ, వాల్మీకి రామాయణముల తులనాత్మక పరిశీలనము" అను సిద్ధాంత వ్యాస గ్రంథమును స్థాలీ పులాక న్యాయముగా చదివి, ఆనందంతో నాలుగు మాటలను యథార్థోక్తులుగా నందించుచున్నాను.

కర్తృత్వచర్చలో ఇతరుల అభిప్రాయములను సేకరించి, తర్కించి, కర్త గోనబుద్ధ భూపతియేయని ఆశ్రిత కవిపుంగవుడు రంగనాథుడనువాడు రచనలో సహకరించినాడని సమర్థించి సమన్వయ మార్గము ప్రతిపాదింపబడుట ముదావహము. బుద్ధభూపతి జపించిన శ్రీరామ మంత్రమేదియో నిరూపింపబడినది. అతని యోగాది తత్త్వవిద్యా విజ్ఞానము ప్రకటితమైనది.

జైనబౌద్ధమత రామాయణాది దుష్ట రచనా ప్రభావ విధ్వంసనమునకై, వైదిక సంస్కృతి యుక్త తత్త్వ సమర్థనమునకై, కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతమువలెనే, ఇతిహాస శ్రేష్ఠమై వాల్మీకి సంస్కృత రామాయణమున తెలుగున రంగనాథ రామాయణముగా నవతరించినది.

శ్రీ వైష్ణవ శైవ సంప్రదాయములు అనాదులు; ఐనను వైష్ణవ సంప్రదాయమునకు ప్రమాణ ప్రాబల్యము, ఉపపత్తి, యుక్తి, అనుభవము అనునవి బహుళముగా నున్నవి. యుగయుగాల్లో ఉత్థాన పతనములు హ్రాస వృద్ధులు సహజములు. కృష్ణరాయాదులు ఆముక్తమాల్యదాది కావ్యముల ద్వారా వైష్ణవ ధర్మ ప్రచార మాంధ్ర దేశమున గావించినట్లు, తత్పూర్వము శైవ సంప్రదాయమున కెదురీత ఈదిన గోనవంశీయ రాజులు వైష్ణవ సంప్రదాయ ప్రచారము నిచ్చట గావించిరి. ఈ రంగనాథ రామాయణ కావ్యంతో తదభివృద్ధి పుంజుకొన్నది. తేనెటీగ తేనె తెట్టెను పెట్టినట్లు "మక్షికే మక్షీ మేరే ఖాయినే లిక్షీ" అన్నట్లుగాక, స్వతంత్రరచనగా నీ గ్రంథము రూపొందినదని ఇందలి సంగ్రహ విస్తరణాన్యథా కరణాదులు పాఠకుల పఠనాపేక్షను పురికొల్పుచున్నవి.

గౌడీయ పశ్చిమోత్తర శాఖీయ, దాక్షిణాత్య ప్రతులైన మూలభూత వాల్మీకి రామాయణములతో, చెన్నపురి, కడప, వావిళ్ళ ప్రచురిత రంగనాథ రామాయణముల తులనాత్మక పరిశీలన సమగ్రముగా గావింపబడి "కాండ ప్రారంభాంత విభాగాది" విషయములు కూలంకషముగా చర్చింపబడి నిర్ధరింపబడిన విషయములు అసత్యములన జాలము.

అనేకములైన అవాల్మీక విషయములకు మూలములు చూపబడినవి. కొన్నింటి కల్పనలకు వివిధ రామాయణాధారములు ఉట్టంకింపబడినవి.

"సర్వపురాణ విచార తత్పరుడ"ను వాక్యోక్తి నాధారముగాగొని, దీనిపై పడిన ఇతర పురాణ ప్రభావ తద్వైశిష్ట్య ప్రదర్శనము ఇతని బహుముఖ పురాణజ్ఞానమునకు నిదర్శనము.

వైష్ణవాచార్యుల మత ప్రచారానికి ప్రామాణికమై, రసవత్తర ఘట్ట ప్రదర్శన పూర్వకముగా తద్విషయ సమర్థకమై, ద్వయార్థ ప్రతిపాదకమై, తత్త్వహిత పురుషార్థ ప్రకాశకమై, శరణాగతి శాస్త్రమై, వాల్మీకి రామాయణము వలెనే యీ రంగనాథ రామాయణమును నొప్పుచున్నదని అనేకానేకోపపత్తులతో సిద్ధాంతీకరింపబడి యున్నది. కావున వేంకటాచార్యస్వామికి శ్రీ భాష్యాది సంప్రదాయ విజ్ఞాన వైశిష్ట్యము వలన ఆంధ్రదేశ విశిష్టాద్వైత సిద్ధాంత ప్రచారక సభలలో మహా విద్వద్గౌరవము నందుట ఇట్టి సంప్రదాయ కావ్య విమర్శనలో బంగారు తావుల మేళనంతో సమానత్వమును ప్రదర్శించినదై సమన్వితమైనది.

ఇట్లు అనేకానేకాంశములతో కూడియున్న "రంగనాథ, వాల్మీకి రామాయణముల తులనాత్మక పరిశీలనము" ఇటీవల సమర్పింపబడిన సిద్ధాంత గ్రంథములలో మేల్తరమైనదని విశ్వవిద్యాలయ పరీక్షకులచేత, కార్యాలయ నిర్వాహకులచేతను పొగడబడినది,

నిష్పక్షపాత బుద్ధులైన పరిశీలనాశీలురు దీనిని చదివి వ్రాతలు "యథార్థోక్తు"లని పునరుక్తి దోష రహితసూక్తి బలంతో బలపరచుదురుగాక.

శ్రేయోభిలాషి.

జానకీ నివాసము.
ఇసామియాబజార్,
హైదరాబాద్.

కందాళ (చిక్కుడుగాయల) శ్రీరంగాచార్యులు
(విశిష్టాద్వైత వేదాంత శిరోమణి, తెలుగువిద్వాన్,
ఉభయ వేదాంత విద్వాన్, ఉభయ వేదాంతరత్న.)

ఆశీః పంచ రత్నాని

శ్రీమాన్ కలకుంట్ల నృసింహాచార్యవర్యాః॥

శ్రీ మద్గుండ్యన్వయే జాతః
శ్రీ రామాయణ తత్త్వవిత్।
జీయా చ్ఛ్రీ వేంకటాచార్యః
యావచ్చంద్ర దివాకరౌ॥

యో రామచంద్ర చరితాబ్ధి నిగూఢ భక్తి
తత్త్వామృతం హరి రివ ప్రదదౌ జనాయ।
ఉద్ధృత్య యేన న భవే జ్జననాది భిః
సోఽయం చిరం విజయతాం వర వేంకటార్యః॥

జీవేశయో ర్నవ విధా న్నవరత్నకల్పాన్
బంధాన్విమథ్య రఘు వీరచరిత్ర సింధుమ్॥
ప్రాదర్శయ త్సహృదయా నభినందయ న్యో
తంపాతు శ్రీ రఘుపతి ర్వర వేంకటార్యమ్॥

అత్రేతి పద్య గత లింగ సమర్చనార్థ
భేద మంతద్వయ విరుద్ధ మపాస్య సత్యం॥
పౌరాణికం సమ రసార్థ మదర్శయ ద్యః
బోభూయతాం రఘుపతేః కృపయా చిరం సః॥

వాల్మీకి నిర్గత పవిత్రతమం సమగ్రం
సీతాపతే శ్చరిత మీప్సితముక్తిదం యత్।
తస్యార్థ సారవిదుషే రఘునాయకోఽస్మై
దత్వావతా త్సుచిర మాయురభీష్టసిద్ధిమ్॥

విషయసూచిక

1.	రంగనాథరామాయణము-కర్తృత్వాదిచర్చ	1-39
2.	రంగనాథ రామాయణము-అనువాద విధానము	40-108
3.	రంగనాథ-వాల్మీకి రామాయణముల కథార్థములు-తులనాత్మక పరిశీలనము	109-239
4.	రంగనాథ రామాయణముపై వివిధ రామాయణముల ప్రభావము	240-300
5.	రంగనాథ రామాయణముపై పురాణముల ప్రభావము	301-343
6.	రంగనాథ రామాయణము-దేశి	344-391
7	రంగనాథ రామాయణము-వైష్ణవతత్త్వము	392-464
8.	రంగనాథ రామాయణము-కావ్యశిల్పము	465-564
9.	అనుబంధము	565-580
10.	ఉపయుక్త గ్రంథములు	581-586
11.	సవరణలు	587-594
12.	విరాళ దాతల పేరులు	595-

ఆశీః పంచ రత్నాని

— శ్రీమాన్ కలకుంట్ల నృసింహాచార్యవర్యాః॥

శ్రీ మద్గుంద్యన్వయే జాతః
శ్రీ రామాయణ తత్త్వవిత్।
జీయా చ్ఛ్రీ వేంకటాచార్యః
యావచ్చంద్ర దివాకరౌ॥

యో రామచంద్ర చరితాబ్ధి నిగూఢ భక్తి
తత్త్వామృతం హరి రివ ప్రదదౌ జనాయ।
ఉద్ధృత్య యేన న భవే జ్జననాది భీతిః
సోఽయం చిరం విజయతాం వర వేంకటార్యః॥

జీవేశయో ర్నవ విధా న్నవరత్నకల్పాన్
బంధాన్విమథ్య రఘు వీరచరిత్ర సింధుమ్॥
ప్రాదర్శయ త్సహృదయా నభినందయ న్యో
తంపాతు శ్రీ రఘుపతి ర్వర వేంకటార్యమ్॥

అత్రేతి పద్య గత లింగ సమర్చనార్థ
భేద మంతద్వయ విరుద్ధ మపాస్య సత్యం॥
పౌరాణికం సమ రసార్థ మదర్శయ ద్యః
బోభూయతాం రఘుపతేః కృపయా చిరంసః॥

వాల్మీకి నిర్గత పవిత్రతమం సమగ్రం
సీతాపతే శ్చరిత మీప్సితముక్తిదం యత్।
తస్యార్థ సారవిదుషే రఘునాయకోఽస్మై
దత్వావతా త్సుచిర మాయురభీష్టసిద్ధిమ్॥

విషయసూచిక

1.	రంగనాథరామాయణము-కర్తృత్వాదిచర్చ	1-39
2.	రంగనాథ రామాయణము-అనువాద విధానము	40-108
3.	రంగనాథ-వాల్మీకి రామాయణముల కథార్థములు-తులనాత్మక పరిశీలనము	109-239
4.	రంగనాథ రామాయణముపై వివిధ రామాయణముల ప్రభావము	240-300
5.	రంగనాథ రామాయణముపై పురాణముల ప్రభావము	301-343
6.	రంగనాథ రామాయణము-దేశి	344-391
7	రంగనాథ రామాయణము-వైష్ణవతత్త్వము	392-464
8.	రంగనాథ రామాయణము-కావ్యశిల్పము	465-564
9.	అనుబంధము	565-580
10.	ఉపయుక్త గ్రంథములు	581-586
11.	సవరణలు	587-594
12.	విరాళ దాతల పేరులు	595-

రంగనాథ రామాయణము - కర్తృత్వ చర్చ

శ్రీ రంగనాథ రామాయణము ఆంధ్రమున వెలసిన రామాయణములన్నింటిలోను మొట్ట మొదటిది. తిక్కన యుగమున నిది జనించి, దేశీయతా ముద్రను భద్రముగా సంతరించుకొన్న గ్రంథ రాజము; కావ్యపురాణ దేశ్యమార్గములకు త్రివేణీ సంగమము; పాఠ్యగేయముల కనువైన రీతిగా అనుష్టుప్ ఛందములో వ్రాయబడిన వాల్మీకి రామాయణము వలెనే మధురాతి మధురమైన మనోహర శైలిలో, దేశీయ చ్ఛందమైన ద్విపదలో వ్రాయబడిన రమణీయ కావ్యము; రసాలంకార వర్ణనలచే విలసితమై విబుధులందఱు మెచ్చగా వాల్మీకి చెప్పిన జాడలో రామాయణ మర్మ ధర్మజ్ఞుడైన గోన బుద్ధ భూపతిచే రచితమైన రసవత్తర కావ్యరాజము.

ఈ గ్రంథాదియందును, ప్రతి కాండాంతమునందును కర్త గోన బుద్ధ భూవిభుడని స్పష్టముగా కనబడుచున్నది. అయినను సాహిత్య విమర్శకులలో తత్కర్తను గూర్చి అభిప్రాయ భేదములు కోకొల్లలుగా నున్నవి. కర్త రంగనాథుడని కొందఱు, బుద్ధారెడ్డియని మఱికొందఱును వాగ్వాదము లను గావించియున్నారు; పరస్పర దూషణ భూషణములను, తిరస్కార పురస్కారములను గావించు కొన్నారు. అయినను ఎవ్వరును ఇదమిత్థమని తత్కర్తను గూర్చి సర్వజనాంగీకార నిర్ణయమును చేసినవారు కారు. సమస్య సమస్యగానే యుండి పోయినది. ఈ విషయమున నా యభిప్రాయమును దెలుపుటకు ముందు ఇతః పూర్వము చారిత్రక సాహిత్యక విమర్శకులు ప్రకటించిన యభిప్రాయ ములను క్రోడీకరించుట సమంజస మనుకొందును.

I రంగనాథ రామాయణ కర్త రంగనాథుడు, కాని బుద్ధారెడ్డి కాదు. దీనిని సమర్థించుటకు ఒసంగిన ఉపపత్తు లిట్లున్నవి :—

(1) "రంగనాథుడను కవి రచించి దీనిని ధనాశతోఁ గాబోలు బుద్ధ రాజున కంటగట్టెనను ప్రతీతి యున్నది ..... ధనాశచే తాము రచించిన గ్రంథములను ప్రభువుల కీయవలసియు పూర్తిగా ఆత్మాపహారము చేసికొన నిష్టపడక, తమ యింట వేఱు ప్రతులను వ్రాసికొని యందు తమ కర్తృ త్వము తృప్తిగా స్థాపించుకొన్న కర్తలు లేరా ?"[1] అట్టి ప్రతిని నాటి ప్రజలు, పండితులు చూచి యుండుట చేత రంగనాథ రామాయణ మని పిలిచియుండవచ్చును. కావున "రంగనాథుడు కృత్రిమ పురుషుడనుటకు వీలులేదు."[2]

1, 2 :—శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ-"సారస్వతా వలోకము"లో "రంగనాథ రామా యణము"- (వ్యాసము) పుటలు 93, 95, 98.

దీనిలో ఇంకను నిట్లున్నది :—

"కూచిమంచి తిమ్మకవి మొదలగు లాక్షణికులు రంగనాథ రామాయణము నుండి కొన్ని

(2) కృతి సమర్పణ గాథ :—

"గోన బుద్ధ భూపతి 'తన తండ్రి పేర రామాయణమును తాను వ్రాసినట్లు రచింపుమని రంగనాథుని కోరెను. ఈ సంగతిని భాస్కరుడు విని రామాయణమును పద్యకావ్యముగ రచించెను. రంగనాథుడు తన ద్విపద రామాయణమును పూర్తిచేసి రాజుగారి కొలువు కూటమునకు కృతినిచ్చుటకై వచ్చెను. అదే సమయమున భాస్కరుడును కావ్యమును పూర్తిచేసి, కొలువునకు వచ్చి తన కృతిని స్వీకరింపుమని రాజును కోరెను. బుద్ధభూపతి తాను చెప్పి వ్రాయించినది యగుటచే రంగనాథ రామాయణమును కుడిచేతితోను, తనకుదానై కృతి రచించి కృతినీయ దెచ్చియున్న భాస్కర రామాయణమును ఎడమ చేతితోడను గ్రహించెను. దీనిచేత భాస్కరకవి రాజు తన నవమానించినట్లు దలంచి, తదవమాన జనిత దుర్వారకోపమున "రసజ్ఞుడు కాని రాజునకుగృతి నిచ్చుట కంటె, నేగుఱ్ఱములను గాచెడి వాని కిచ్చినను మేలే యని సభనుండి లేచి పోవుచుండ, బుద్ధరాజు గుఱ్ఱములను కాయువాడెదురుపడి "సత్యవాక్కులరగు మీరాడిన మాట నెరవేర్ప మీ కావ్యమును నాకుకృతియిండు" అని పల్కెను. కవియట్లె యొనర్చెను. ఇట్లు భాస్కరుని రామాయణమును కృతినొందినవాడే సాహిణి మారుడు."[1]

ఈ గాథ వలన ద్విపద రామాయణ కర్త రంగనాథుడనియు, ద్రవ్యాశకై రాజు రచించినట్లే దానిని వ్రాసెననియు, భావించుట కవకాశము గలుగుచున్నది. శ్రీ రావూరి దొరసామి శర్మయు పై కథాభిప్రాయమును బలపరచుచు "రాజు కోరికపై నతని పేర గ్రంథమును వ్రాసి యిచ్చెనని యూహింపక తప్పదు.[2] మన వాఙ్మయమును పరికించిన నిట్లెందరో కవులు తమ కాశ్రయుల పేర

ద్విపద లుదాహరించినారు రంగనాథుడను వాడొకడు కవులలో పరిగణితుడై నురికెక్కినాడు........ రంగనాథుడను కవి యొకడుండి యీ రామాయణమును వ్రాసి బుద్ధ రాజు పేర ప్రకటించుట, దీని నెఱింగిన సమకాలికుల మూలమున దీనికి రంగనాథ రామాయణమని పేరు నిలుచుట అసంభవములు కావు; మఱి బుద్ధరాజే రచించి యుండుటయు అసాధ్యము గాదు-కొంతవఱకు అసంభవమని మాత్రము చెప్పక తప్పదేమో!"

(ఈ యభిప్రాయము గోడమీది పిల్లివాటముగా నున్నది.)

1. ఈకథ

(a) చాగంటి శేషయ్య—ఆంధ్ర కవి తరంగిణి IV సం. పుట-2

(b) జనమంచి శేషాద్రిశర్మ—రంగనాథ రామాయణము-పీఠిక. వావిళ్ళ ప్రతి. పుట-3

(c) గురుజాడ శ్రీరామమూర్తి—కవుల జీవితములు-పుట-126

(d) తేరాల సత్యనారాయణ—అవతారికలు-చరిత్ర. పుట-66 మొదలగు గ్రంథములలో నీయబడినది—

2. జనమంచి వెంకట సుబ్రహ్మణ్యశర్మ - పీఠిక (సమాలోచనము) - రంగనాథ

కర్తృత్వముంచి రచించిన కృతులు కానవచ్చు చున్నవి. అట్టిదే యిది"1 యని తెలిపి యున్నారు.

(3) గ్రంథ వ్యవహార నామము ;—

ఈ ద్విపద రామాయణము "రంగనాథరామాయణము"ని లోకమున వ్యవహరింప బడు చున్నది. గ్రంథమునందెచటను ఈ పేరుగానరాదు. ఉత్తర కాండమును వ్రాసిన కాచవిభుడు, పిన విఠల భూపతియు దీనిని పూర్వరామాయణమనియే చెప్పియున్నారు. సాహితీ ప్రపంచమునందు రామాయణము లనేకములు, గాన ఇతర రామాయణముల కంటె స్వోద్దిష్టరామాయణమునకు భిన్నత్వమును దెలుపుటకై తరువాతి కవులు, పండితులు కవి పేరుతో కలిపి యాగ్రంథమును పిలుచు చుండుట లోకాచారము. వాల్మీకి రామాయణము, మొల్లరామాయణము, భాస్కర రామాయణము, గోవిందరామాయణము ఇత్యాదులు నిదర్శనములు. ఆయా రామాయణములకు పూర్వపదములుగా నున్నవారు తత్కర్తలైనట్లు రంగనాథ రామాయణమునకు రంగనాథుడును తత్కర్తయై యుండవలెను. ఆ రంగనాథుడను కవి బుద్ధారెడ్డికి కవి యశమును గూర్పదలచి అవతారికలోను, కాండాంతము లందును బుద్ధారెడ్డి పేరు పెట్టినను సత్యము దాగదు కనుక, సమకాలిక ప్రజలు, పండితులును దీనిని రంగనాథ రామాయణమనియే పిలువఁ జొచ్చిరి. అదియే లోకమున స్థిరపడి పోయినది అట్లు కానిచో దీనికి బుద్ధరామాయణమనియో విఠ్ఠల రామాయణమనియో పేరుండవలెను కాని, రంగనాథ రామాయణమని పేరెట్లు పొసగును? కావున లోకము, కవి పరంపర, పండిత బృందము మొదటి నుండియు రంగనాథ రామాయణమని వాడుచుండుట చేతను నీ కావ్యకర్త రంగనాథుడని స్పష్టమగుచున్నది".2

(4) పూర్వ కవి స్తుతులు :—

రంగనాథ రామాయణ జననమునకు పిమ్మట సుమారు అరువది డెబ్బది సంవత్సరములలో నున్న అనంతామాత్యాది కవి పుంగవులు తమ గ్రంథములందు పూర్వకవి స్తుతులలో రంగనాథుని చేర్చి స్తుతించి యున్నారు.

ఈయనంతామాత్యుడు క్రీ. శ. 1400 సంవత్సర ప్రాంతమున నుండినవాడు. ఇతడు భోజ రాజీయమునందు:—

"నన్నయభట్టుఁ దిక్కకవినాయకు భాస్కరు రంగనాథుఁ బే
రెన్నిక కెక్కినట్టి యమరేశ్వరు నెఱ్ఱయ మంత్రినాదిగాఁ

రామాయణము"లో" ఇదే యభిప్రాయము వ్యక్తీకరించబడినది.

1. రావూరి దొరసామిశర్మ - "తెలుగు సాహిత్యము - రామకథ" పుట - 122.
ఇంకనునిందు "బుద్ధరాజు పేరున్న మాట కాదనలేము గాని, వ్యవహారములో నున్న గ్రంథము పేరు, పూర్వకవి స్తుతి, లక్షణకారుల యుదాహరణ నిర్దేశము మున్నగునవి రంగనాథుని కర్తృత్వములకుఁ బ్రబల సాక్ష్యము ల"నియు ఘంటాపథముగా ఘోషింప బడినది :—

2. ఈ విషయము

జన్న కవీంద్రుల న్నపరసస్ఫుట వాణులనంగ ధాత్రిలో
నున్న కవీంద్రులందలతు నుల్లమెలర్పగ వాగ్విభూతికిన్"[1]

అని "భాస్కరు-రంగనాథు" అని వరుస క్రమమునఁ జెప్పియుండుటచే భాస్కర, రంగనాథ రామాయణములను దన మనస్సునందుంచుకొని. తత్కర్తలను నుతించినాడని యెంచఁ దగినది. ఇట్లే,

"అనఘ హుళక్కి భాస్కరు, మహామతిఁ బిల్లల మఱ్ఱి వీరరా
జును, ఘను నాగరాజుఁ, గవిసోముని, దిక్కన సోమయాజిఁ గే
తన కవి, రంగనాథు. నుచితజ్ఞుని నెఱ్ఱన, నాచిరాజు సో
మన నమరేశ్వరుం దలతు మత్కులచంద్రుల సత్కవీంద్రులన్"[2]

అని క్రీ.శ. 1500-1530 నడుమనున్న గోపరాజు సింహాసన ద్వాత్రింశిక లోను,

"అలఘుని శబ్దశాసన పదాంకితుఁ దిక్కన సోమయాజి, ని
శ్చలమతి శంభుదాసు, బుధ సన్నుతు నాచన సోమనార్యుఁ జె
న్నలరిన చిమ్మపూడి యమరాధిపు, భాస్కరు, రంగనాథునిం
దలతు నపూర్వ చిత్రకవితా మహనీయ సమగ్ర చిత్తులన్"[3]

అని 1650 ప్రాంతమందున్న నూతన కవి సూరన "ధనాభిరామ మందును";

"స్తుత గుణోద్దాము నాచన సోము, భీము,-నవ్య మంజుల వాగ్ధుర్యు నన్నపార్యు,
రసికుడై నట్టి శ్రీనాథు, రంగనాథుఁ - దిక్క కవిరాజు, భోజునుతించి మించి"[4]

అని మొల్ల రామాయణము నందును;

"రంగ ద్విశాలాంత రంగంబునందు - రంగనాథునిఁ గవిరాజున్యుఁ దలచి"[5]

(ఎ) చాగంటి శేషయ్య "ఆంధ్రకవి తరంగిణి" IV సంపుటి 7.
పింగళి లక్ష్మీకాంతం "పీఠిక-రంగనాథరామాయణము 7పుట 1. ఆంధ్ర విశ్వకళా పరిషత్తు ప్రచురణము. మొదలగు గ్రంథములలో చెప్పబడినది.

1. అనంతామాత్యుడు "భోజరాజీయము". ఆశ్వా-1. పద్య-9 ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ముద్రణము-1969.
2. కొరవి గోపరాజు - "సింహాసనద్వాత్రింశిక" ఆశ్వా-1 పద్య-12
3. వేదములక్ష్మీనారాయణశాస్త్రి - పీఠిక- రంగనాథరామాయణము. వావిళ్ళముద్రణము. పుట.-14
4. మొల్ల "రామాయణము" అవతారిక పద్యము - 9,
5. వేటూరి ప్రభాకరశాస్త్రి-"సింహావలోకనము" పుట 28 లో ఉదాహృతమైనది.

అని క్రీ. శ. 1530-42 ప్రాంతమందున్న భద్రకవి లింగకవి సానందోపాఖ్యానము నందును, రంగనాథుడను కవి స్తుతింపబడినాడు. ఇట్లే "కొలని గణపతి దేవుడు (1400), పోతన (15వ శతాబ్ది), భానుకవి (పంచతంత్ర కర్త-1510-30), వెన్నెలకంటి సూరన (16వ శతాబ్ది), తురగా రాజకవి, అయ్యంకి బాల సరస్వతులు (16వ శతాబ్ది), లింగమగుంట తిమ్మన (1560), ఆంధ్ర కవి రామయ్య (15వ శతాబ్ది), చేకుమళ్ళ రంగశాయి (18వ శతాబ్ది), అప్పకవి (19వ శతాబ్ది) మొదలగువారు"[1] తమ గ్రంథములందు రంగనాథుని పేర్కొని నుతించినారు.

(ఛ) లాక్షణికోదాహరణములు :—

పూర్వకవులే కాక, అప్పకవ్యాది లాక్షణికులు[2] తమ గ్రంథములందు ఉదాహరణములను

---

1. డా జి. నాగయ్య — "తెలుగు కావ్యావతారికలు"-పుట. 77

2. (a) పొత్తపి వెంకటరమణ కవి రచించిన లక్షణ శిరోమణి యను లక్షణ గ్రంథములో "అచ్చవెల్లి రంగన్నగారు" అను పేర రంగనాథ రామాయణ ద్విపద లుదాహరింపబడినవి. (శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి. 'సింహావలోకనము' పుట. 29)

(b) లింగమగుంట తిమ్మన (1560) తన "బాలబోధ చ్ఛందస్సు" లో రంగనాథుని ఈ క్రింది తోటకవృత్తాన్ని ఉదాహరించాడు.

"ఉప వాసము లెల్లను నుండుటనీ- కృప వచ్చుటకా యది రిత్తసుమీ !
యపవిత్రుని బుల్లని యంబలికై-సుపవిత్రుని జేయుట సుద్దిగదే।"

హనుమచ్ఛందస్సులో కూడ ఇతనిదైన మరొక తోటక వృత్తం ఉదాహరింపబడింది. (ఆరుద్ర-సమగ్రాంధ్రసాహిత్యం-సం II పుట. 229)

చెలువారగజాజిన చేలముతో-గళనీలిమతో నహి కంకణుడై
తలఁజంద్ర కళం గలదైవము మా-కులదైవము దైవత కోటులలోన్.

(c) పెదపాటి జగన్నాథ కవి సంకలనం జేసిన ప్రబంధరత్నాకరంలో రంగనాథునివై మూఁడు పద్యాలున్నాయి.

(i) అదలని తేరు, తేరునకు నాదరువైతగు విల్లు, వింటికిం
గుదురగు నారి, నారి పయి గూర్కొ-శరంబు, శరంబు బొడ్డునం
బొదలిన యంత, యంత ముఖముల్ నిజవాసములైన గుఱ్ఱముల
చెదరక నీకు నెట్టి పని సేయునయా గిరిజాధినాయకా (407)
ఓజుచేముట్టక యొగ్గానఁబట్టక-చక్కగా దివిఁబాఱు చక్రములును
లాయాన గట్టక లలిమేత వెట్టక-వర్ణహీనంబైన వారువములు
తవన వెట్టక జీవితము కాసుముట్టక-సత్వసంపదఁజూపు సారథియును
కడచీలఁదట్టక ఘనముగామెట్టక-గంభీర సంపద గలుగు విరుసుఁ
గలిగి తనరారు నరదంబుఁగడక నెక్కి-త్రిపుర విజయంబుఁ జేకొన్న దేవదేవ

జూపుచు "రంగనాథ రామాయణము" అని పేర్కొనిరి. అప్పకవి రంగనాథ రామాయణ మనక "రంగనాథుని రామాయణ"[1] మని స్పష్టముగాఁ జెప్పుట ప్రత్యేకముగా గమనింపఁదగినది. కాని బుద్ధ భూపతిని పేర్కొనిన లక్షణ గ్రంథమొక్కటియు గానరాదు.

డిందు శేఖరు డానంద మంది రుండు-మనలఁగరుణా విధేయుడై మనుచుగాత (408)

గోశత పంచవార్ధులును గోయగవార్ధులు గోత్రవార్ధులున్

గోశర వార్ధులున్ విదిత గోశర (వార్ధులు) పంచవార్ధులా

కేశవ తల్ప, పద్మభవ, కేకిపవాహన. దానవేశ, దే

వేశుల కిచ్చునట్టి పరమేశ్వరుడీవుత మాకభీష్టముల్ (409)

(ఆరుద్ర-సమగ్రాంధ్ర సాహిత్యం II సం. పుట-230)

(వేటూరి ప్రభాకరశాస్త్రి-సింహావలోకనం. పుట-27, 28, 29)

(d) అచ్చువెల్లి రంగన్నగారు రామాయణం ద్విపద 1వ పాదార్ధమున సహజస్వరయతి లక్షణం—

ద్వి॥ ఎసఁగ దివ్యులఁ బెంప ఋషుల రక్షింప-నసురుల శిక్షింప నవని బాలింప (యుద్ధ 519)

(ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక-సం॥ 51 భాగములు III & IV

1. అప్ప కవి :—

(i) నిత్య సమాస విశ్రాంతులు :—

విశ్వామిత్ర శబ్దమునకు "రంగనాథుని రామాయణము" నందు-

ద్వి॥ ఎక్కడా గురుడని యెఱుగని నీకు-నక్కటా గురుడు విశ్వామిత్రుడయ్యె (యుద్ధ 4523)

(అప్పకవీయము తృతీయాశ్వాసము పద్య-161)

(ii) కాకుస్వర వళులు :—

ఉదా :-రంగనాథుని రామాయణమునందు.

ద్వి॥ అట్టి నామీద నీవాయలిగెదవు-పట్టి చెట్టలు వాపి పాఱపై చెదను (యుద్ధ-4348)

(అప్పకవీయము తృతీయాశ్వాసము పద్య-248)

(iii) ఖండా ఖండ ప్రాసములు- రామాయణమునందు-

ద్వి॥ మూఁగి చరించునమ్మొకరి తుమ్మెదలు-బాగొప్పఁ గొప్పునఁ బరిగిన దాని (యుద్ధ-6674)

(అప్పకవీయము తృతీయాశ్వాసము పద్య-308)

(iv) తృతీయ సరళము అనునాసికముగ పలుకఁ బడుట.

"పోడిమియు నురవడియును నాడెమునను-బలుకుల తృతీయ సరళముల్ పలసినపుడు

భువి స్వకీయాను నాసికంబులును గాఁగఁ-బలుకఁబడు నాది కవుల కబ్బముల కలిమి"

రంగనాథుని రామాయణమునందు ద్విపదము-

"రాజీవాస్త్రదోహి రావణుఁబట్టి-పోఁడిమి చెఱుపవా బుధులు నుతింప-

(అప్పకవీయము-ద్వితీయాశ్వాసము పద్య-161)

ఇట్లు పూర్వకవులచే నుతిఁగన్న, లాక్షణికులచే నుదాహరింప బడిన రంగనాథుడను నొక కవియున్నట్లు అవశ్యము మన మంగీకరించి తీరవలయును.

ఇక మొదట వీరవైష్ణవుడై, వీరశైవుడై నయన రగడాదులను రచించిన చక్రపాణి రంగనాథుడు ద్విపద రామాయణ కర్త రంగనాథుడును ఒక్కడేయని కొందరను,1 కాదని కొందఱును2 వాదింతురు.

(V) ఇంతియేగాక ప్రయోగ రత్నాకరమునందును, ప్రబంధ రత్నావళిలోను రంగనాథుని పద్యము లనేకము లుదాహరింపబడినవి.

(శ్లిష్టా రామకృష్ణశాస్త్రి. ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సర్వస్వము పుట-562)

(VI) లక్షణ గ్రంథములలో బుద్ధ భూపతి పేరు కానరాక పోవుటకు కారణము బ్రాహ్మణేతర కవులను బ్రాహ్మణ కవులు స్తుతింప రాదనెడి యాచారమేయని కట్ట మంచి రామలింగారెడ్డిగారు విమర్శించినారు.

(అనుబంధ పీఠిక - రంగనాథ రామాయణము ఆ.వి.క.ప్ర.)

అయినచో కృష్ణ దేవరాయ, రఘునాథ భూపాలాది శూద్ర కవులు బుద్ధభూపతిని పేర్కొన లేదేమి? యని రాళ్లపల్లి అనంత కృష్ణ శర్మ వంటి వారు ఆక్షేపించినారు - (సారస్వతాలోకము)

కావున వర్ణ ప్రాతిపదికపై చేసిన కట్టమంచి వారి వాదమంత సమంజసమైనది కాదని నాయభిప్రాయము.

1. వేటూరి ప్రభాకర శాస్త్రి "సింహావలోకనము" పుట - 19
2. చాగంటి శేషయ్య-"ఆంధ్రకవి తరంగిణి" IV సం॥ పుట 49

(i) "కాలము చేతను, శ్రీ వైష్ణవ నియోగి బ్రాహ్మణ భేదముచేతను ఇరువురు భిన్నులు"

(చక్రపాణి రంగనాథుడు-వ్యా)

(ii) మల్లంపల్లి సోమశేఖరశర్మ పీఠిక-రంగనాథరామాయణము-రాయల్ అండ్ కో ప్రచురణము. పుటలు. 9-11

చక్రపాణి రంగనాథుడు పాల్కురికి సోమనకు సమకాలికుడు. అనగా క్రీ.శ. 1280-1340 కాలము వాడు. రంగనాథ రామాయణాన్ని, అది వ్రాసిన కవి ఎవరైనా 14వ శతాబ్ది చివరి భాగంలో 1380 ప్రాంతాల వ్రాసి ఉండాలి.

(iii) ఆరుద్ర - "సమగ్రాంధ్ర సాహిత్యం" II సం॥ చక్రపాణి రంగనాథుడు, వ్యా-పుట 223, మరియు 221

"లాక్షణికుల ఉద్దేశంలో రంగనాథుని ఇంటిపేరు అచ్చవెల్లివారేగాని చక్రపాణి వారుకాదు."

(iv) తెలుగు కవులలో రంగనాథుడనే పేరున్నవాడు చక్రపాణి రంగనాథుండు దప్ప ఇంకెవరు లేక పోఁబట్టి ఇతడే రామాయణాన్ని రచించినట్లు చాలమంది భావిస్తున్నారు. అయితే అంతరంగ సాక్ష్యాన్ని బట్టి రంగనాథుడనే వాడెవడు అసలు రామాయణాన్ని వ్రాయలేదు. ఒకవేళ ఎవరైనా చక్రపాణి రంగనాథుడు మాత్రం దానిని వ్రాసి ఉండడానికి వీల్లేదు."

విరక్త తోంటె దార్యుడు కన్నడమున వ్రాసిన "సోమనాథ పురాణం"లో చక్రపాణి రంగనాథుని గూర్చి ఇట్లున్నది. "చక్రపాణి రంగనాథుడనే వైష్ణవునితో పాల్కురికి సోమనాథునకు వాదము తటస్థించెను. శైవేతరుని సోమనాథుడు చూడడు గావున, ఇరువురి మధ్య తెర కట్టబడినది. కాని సోమనాథుడు తన పుత్రుడగు చతుర్ముఖ బసవేశ్వరుని వాదమునకు నియోగించెను. రంగనాథుడు వాదమున నోడిపోయెను![1] పరాజయ దుఃఖమున నతడు తిరిగి పోవుచు మార్గమున నున్న శ్రీశైల మల్లికార్జునుని ద్వేష బుద్ధితో దర్శించలేదు; కావున నతడంధుడయ్యెను. అహోబిలమునకు పోయి నరసింహస్వామిని ప్రార్థింపగా నతడు శివాధిక్యమును బోధించెను. అంత లజ్జితుడై అతడు తిరిగి శ్రీశైలమునకు వచ్చి మల్లికార్జునుని నయన రగడచే స్తుతింపగా నొక కన్ను వచ్చెను. తరువాత సోమనాథుని దర్శించి క్షమాభిక్ష వేడగా, నతని యనుగ్రహమున రెండవ కన్నును వచ్చెను పిదప రంగనాథుడు సోమనాథుని ప్రార్థించి, అతని కుమారుడగు చతుర్ముఖ బసవేశ్వరునిచే శివదీక్ష నొంది శైవుడయ్యెను."[2]

ఇదే వృత్తాంతము ప్రతాప చరిత్రము[3] (కాసె సర్వప్ప రచించిన సిద్ధేశ్వర చరిత్రము)లో శ్రీశైలమునకు బదులు త్రిపురాంతకమనియు అహోబిలమునకు బదులు శ్రీరంగమనియు నీషద్భేదముతో కనిపించుచున్నది.

(v) ఆరుద్ర - "సమగ్రాంధ్ర సాహిత్యం" III సం॥ పుట 231

"బహుశః అచ్చవెల్లి రంగనాథుడు కావచ్చు."

1. ఈ ఓడిపోయిన సంగతి సిద్ధనంజేశకవి వ్రాసిన "గురు రాజ చరిత్ర" యను కన్నడ కావ్యములో నున్నది. (సింహావలోకనము. పుట 23)

2. వేటూరి ప్రభాకర శాస్త్రి "సింహావ లోకనము" పుట-22

3. కాసె సర్వప్ప-సిద్ధేశ్వర చరిత్రము" పుటలు 160, 161

సంపాదకులు ఖండవల్లి లక్ష్మీ రంజనంగారు

"తదనంతరంబున రంగనాథుని బిలువనంపిన నతండు దక్షిణదేశంబు నందుండి అందోళిక పైనెక్కి చనుదెంచునపుడు త్రిపురాంతక విజయ గోపురంబులు చూచి అవి యేమి యని యడిగిన యాశిబికలు(?) త్రిపురాంతక గోపురంబు అని పల్కుటయు, యాశివభవనంబు జూడనొల్లక మైనపు జడ్డు కప్పించు కొనియె. అప్పుడు రంగనాథుని నేత్రంబులు కానరాక జాత్యంధుని పగిది చలింప లేక రంగనాథుండు మగుడి శ్రీ రంగంబునకుంబోయి, యద్దేవుని ప్రసన్నుని జేసుకొని నేత్రంబులు పోయెనని మొఱయిడుటయు అద్దేవుండు కరుణించి త్రిపురాంతక దేవుని వేడుకొను మనుటయు, రంగనాథుండు మళ్ళి త్రిపురాంతకంబున కేతెంచి యద్దేవునకు నమస్కరించి తనయెత్తు కృతులు సమర్పింతునని వ్రతంబు సేసి భక్తిమయంబగు నొకరగడ చెప్పిన నద్దేవుండు ప్రసన్నుండయి రంగనాథునకు (ని)లువు కన్నులొసంగుటయు, రంగనాథుండు పాల్కురికి రాజసి సోమనాథునిచే శివదీక్షం గైకొని యాయయ్యవద్ద శైవ రహస్యంబులు తెలుసుకొనుచుండె"

ఇట్లు ప్రాచీన గ్రంథములలో ప్రస్తుతుడయిన చక్రపాణి రంగన కవియే బుద్ధ భూపాలునకు రామాయణ రచనలోఁ దోడ్పడిన రంగనాథుడు కాగూడును.1

6. శైలీ సామ్యము:—

"పూర్వోత్తర రామాయణముల శైలి యొకే రీతిగా నున్నది. రెండు గ్రంథములందును "బహుపురాణజ్ఞులు" మొదలుగా ననేక శబ్దము లొకే రీతి వర్ణనములలో ఒకే విధముగా నుపయోగింప బడినవి."2 నిశితముగా చదివి చూచి నప్పుడీ విషయము స్పష్టమగును. కావున "రంగనాథుడే బుద్ధ నృపతి పేరున పూర్వ రామాయణమును, కుమారుల పేరున నుత్తర రామాయణమును రచియించెనని తోపక మానదు."3

7. కాండాంతములందలి విశేషణములు :—

రంగనాథ రామాయణము ప్రతి కాండాంతమునందు ఈ క్రింది ద్విపదలలో బుద్ధ భూవిభునికి వేయబడిన విశేషణములు రంగనాథునినే కర్తగా సమర్థించుచున్నవి.

"అనియాంధ్రభాష భాషాధీశ విభుడు - వినుత కావ్యాగమ విమల మానసుడు
పాలితాచారు డపార ధీశరధి - భూలోక నిధి గోనబుద్ధ భూవిభుడు
తమ తండ్రి విట్ఠల ధరణీశు పేర................................
రసికమై చెలువొందు రామాయణంబు"4

ఇందు "1. భాషాధీశవిభుడు, 2. వినుత కావ్యాగమ విమల మానసుడు, 3. పాలితాచారుడు, 4. అపార ధీశరధి, 5. భూలోకనిధి" అను ఐదు విశేషణములు వాకొనబడి యున్నవి "సాధారణముగావిద్వత్కవులు ఆత్మస్తుతిని చేసికొనువారుకారు; ఎవరైనను అట్లు చేసికొన్నను ఈ బాగున వ్రాసికొనరు, తోరణముగా గూర్చినట్లున్న ఈ విశేషణములు స్వ విషయమున బుద్ధారెడ్డి స్వయముగా చేర్చికొని యుండుననుట సమంజసముగా లేదు. సాధారణముగా స్తుతి పరాయణులైన వారు ఇతరులచే పొగడించుకొందురు. నన్నయాదులు వ్రాసికొన్నను అవి ప్రథమ పురుషములోఁ గలవు. మల్లినాథుడు

---

1. వేటూరి ప్రభాకరశాస్త్రి- సింహావలోకనము పుట-19
కాని తెరాల సత్యనారాయణగారు దీనినిట్లు ఖండించినారు.
"ఈ సిద్ధేశ్వర చరిత్రలో భాస్కర, రంగనాథ రామాయణైతిహ్యమునకు సంబంధించిన సమాచార మేదియు లేక పోవుటయే కాక భాస్కరుడు రామాయణము రచించినట్లు తెలుపబడినదే కాని రంగనాథుడు రామాయణమును వ్రాసినట్లుగాని రామాయణ రచనలో ఈ తనికి సంబంధము గలదని కాని పేర్కొనబడలేదు"
"అవతారికలు - చరిత్ర (సిద్ధేశ్వర చరిత్ర)" వ్యా పుట-185.
2. చాగంటి శేషయ్య "ఆంధ్రకవి తరంగిణి" సం॥ IV పుట-7.
3. ,, ,, ibid ,, సం॥ పుట-8.
4. రంగనాథ రామాయణము బాలకాండము. ద్వి 2468-2474 రాయలీ అండ్ కో ప్రతి

"వాణీంకాణభు జీమజీగణ దవాశాసీచ్చ వైయాసికీ
మంతస్తంత్ర మరంస్త పన్నగ గవీ గుంభేషు చాజాగరీత్ ।
వాచామాకలయ ద్రహస్యమఖిలం యస్త్వాక్ష పాదస్ఫురాం
లోకే భూద్యదుపజ్ఞమేవ విదుషాం సౌజన్య జన్యం యశః[1]॥

అని చెప్పుకొన్నను అతడు వ్యాఖ్య రచించిన వాడే, కాని మూల గ్రంథకర్త కాదు." ఇంతేగాక "తమ తండ్రి విఠల ధరణీశుపేర" అనుచో దన తండ్రియనక తమ తండ్రియనుట చేతనే వారి యాశ్రితుడొకడు ఈ గ్రంథమును రచించి ప్రభువు వ్రాసిన రీతి వారు వ్రాసినట్లే చెప్పుచు, వారి యందుదనకు గల గౌరవాతిశయమున నేకవచనము చెప్పుట ధర్మము కాదని "తమ" యని బహువచనము చెప్పినాడు. ఈ యూహనిజమైనచో రంగనాథుడే కృతికర్త యనుటకు సందేహము లేదు"[2]

8. ఆదినుండి యున్న పేరు :—

ఈ గ్రంథమునకు "రంగనాథరామాయణ"మను పేరు తొల్లింటి నుండియు కలదు. నడుమ వచ్చినదని చెప్ప సాహసించువారు ఎవరును ఉండరు; ఉన్నచో తొలినాటి పేరేమైయుండునని యడిగినప్పుడు చెప్పలేరు. అదిగాక ఎంత ప్రయత్నించి ప్రచారము చేసినను నడుమ వచ్చిన పేరులు తొల్లిటి వానిని తుడిచివేయలేవు. కావున ఈ గ్రంథమునకు మొదటినుండియు "రంగనాథ రామాయణమనియే పేరు."[3] వాల్మీకి రామాయణమునకు వాల్మీకియు, మొల్ల రామాయణమునకు మొల్లయు, భాస్కర రామాయణమునకు భాస్కరాదులును కర్తలైనట్లు రంగనాథరామాయణమునకు రంగనాథుడను వాడు కర్తయైయుండవలెను. అట్లు కానిచో బుద్ధరామాయణమనియో, విఠల రామాయణమనియో, పేరుండవలెను. కాని రంగనాథ రామాయణమని పేరెట్లు పొసగును?"[4]

కావున "రంగనాథుడను ప్రసిద్ధకవి రాజునాస్థానమున నుండి, రామాయణమును వ్రాసి యాశ్రితుడగు బుద్ధభూపతి పేర వెలయించెను. అట్లే వారి పుత్రుల కీర్తిని వెలయింపగోరి యుత్తరకాండమును రచించి పుత్రుల పేర నంటగట్టెనే కాని, బుద్ధరాజుగాని తత్పుత్రులు గాని యీ కావ్యరచన గావించినట్లు గన్పట్టదనుట నిస్సంశయము."[5]

---

1. రఘు వంశకావ్య సంజీవనీ వ్యాఖ్యావతారికాశ్లోకము,
2. జనమంచి శేషాద్రి శర్మ-పీఠిక-రంగనాథరామాయణము పుట-1,2. వావిళ్ళ ప్రతి.

ఈ అభిప్రాయముతో వీరేశలింగం పంతులుగారును ఏకీభవించిరి. (కవుల, చరిత్ర-సం॥ I రంగనాథుడు. వ్యా పుట-229.

3. పింగళి లక్ష్మీకాంతం "గౌతమవ్యాసాలు" పుట-123.
4. "ఇది కొందఱి యభిప్రాయమున కనువాదము". పింగళి లక్ష్మీకాంతం-"పీఠిక-రంగ నాథరామాయణము" పుట-1. ఆంధ్రవిశ్వకళాపరిషత్తు ప్రచురణము.
5. వారణాసి వేంకటేశ్వరులు-"ఆంధ్రసాహిత్య సంగ్రహ చరిత్ర" పుట-123లో "జనమంచి వెంకట సుబ్రహ్మణ్య శర్మ "సమాలోచనము" నుండి ఉద్ధృతము—

9. సామర్థ్యము :—

సంస్కృత వాల్మీకి రామాయణమును ఆంధ్రీకరించుటకు కవికి చక్కని సంస్కృత పాండిత్య ముండవలయును. రాజకీయ వ్యవహారములందు కాలము గడుపు బుద్ధభూపతి యట్టి పాండిత్య ప్రతిభలు గలిగి మూలానుసారముగా రామాయణము వ్రాయగలడా? యనుట విచార్యము. కావున రంగనాథుడను కవియే రచించి, కర్తృత్వమును బుద్ధరాజునకు నొసగి తగిన ప్రతిఫలమును గ్రహించెనని విశ్వసింపనగును."[1]

II రంగనాథ రామాయణ కర్త బుద్ధారెడ్డియే కాని రంగనాథుడు కాడు. ఏతత్సమర్థనకై ఈ క్రింది హేతువులను వారు వారు చూపుచున్నారు.

1. గ్రంథస్థ నిదర్శనము :—

"గ్రంథకాల కర్తృత్వాది నిర్ణయమునకు అక్కరకు వచ్చు సాధనములలో గ్రంథస్థ నిదర్శ నము పరమ సాధనము. గ్రంథాంతర నిదర్శనములు దాని యభావమున అనుమాన ప్రమాణములుగా పర్యాలోచింపఁ దగినవే కానిస్వతః ప్రమాణములుగా గ్రహింపదగినవి కావు."[2] "గ్రంథావతారిక ప్రతికాండాంత ద్విపదల యందు ఈ రామాయణమును బుద్ధ భూవిభుడు రచించి తన తండ్రి విఠలుని పేర ప్రఖ్యాతము చేసినట్లు కలదు. ఇది ప్రత్యక్షమైన అంతర ప్రమాణము."[3]

ఇట్లే ఉత్తర రామాయణ కర్తలైన కాచ, విఠల భూవిభులు "తమ తండ్రియు, పూర్వ రామాయణ కర్తయునైన బుద్ధ భూవిభుని ఆదేశముచే ఉత్తర కాండను వ్రాయు చున్నామ"ని[4] స్పష్టముగా చెప్పియున్నారు. ఇది బాహిర ప్రమాణము. కావున బుద్ధారెడ్డియే రంగనాథ రామాయణ కర్త యనుట సమంజసము.

2. భిన్న పితృనామ సమర్థనము :—

బుద్ధ నృపతి తండ్రి విఠలక్ష్మానాథుడని పూర్వ రామాయణమునను, గన్నారెడ్డియని ఉత్తర రామాయణమునను అవతారికలందు భిన్న నామములతో పేర్కొనబడి యున్నాడు. ఈ భిన్నత్వమును సమర్థించుటకు ఈ క్రింది యూహలు చేయబడినవి.

---

1. శిష్టా రామకృష్ణశాస్త్రి-ఆంధ్రవాఙ్మయ చరిత్ర సర్వస్వము-సం॥ 1 పుట-557.
2. (a) పింగళి లక్ష్మీకాంతం గౌతమ వ్యాసములు పుట-139
   (b) ,, ,, "ఆంధ్ర సాహిత్య చరిత్ర" పుట-158
3. శిష్టా రామకృష్ణశాస్త్రి గారిట్లు దీనిని ఖండిచిరి.—

"ఈ గ్రంథావతారిక కాండాంతములలోని కర్తృత్వ విషయమును గోన వంశీయులు తరువాత మార్పుచేసి యుండవచ్చును. కాని సమకాలికులైన జనులీ సత్యము నెరింగి యా రామాయణమును రంగనాథుని పేరు తోడనే వ్యవహరించు చుండిరి. (ఆంధ్ర వాఙ్మయ చరిత్ర) సర్వస్వము సం॥ 1 పుట-557

4. రంగనాథ రామాయణము "ఉత్తరకాండము" అవతారిక.

(i) కొన్ని రాజ వంశములలో పుట్టుకతోనొక పేరును, పట్టాభిషేకముతో నొక బిరుదు పేరును రాజులకు కలుగుచుండును బుద్ధారెడ్డి తండ్రికున్నట్టి "గన్నారెడ్డి—విట్ఠల క్ష్మానాథుడు" అను రెండు పేర్లలో ఒకటి బిరుదు పేరు. మరి యొక్కటి తలిదండ్రులిడిన నామము. ఇట్లే "గోన బుద్ధారెడ్డికి కూడ పట్టాభిషేకముతో "రంగనాథు"డను బిరుదు పేరు ఎర్పడి యుండును. ఆ పేరనే రంగనాథ రామాయణమని బుద్ధారెడ్డి రచించిన రామాయణము ప్రసిద్ధి పొందిది యుండును. కావున బుద్ధారెడ్డి రంగనాథులు భిన్నులు కారు. బుద్ధారెడ్డియే రంగనాథుడు, రంగనాథుడే బుద్ధారెడ్డి. బుద్ధారెడ్డికి రంగనాథుడను పేరే చాలవ్యాప్తి నొందినది పూర్వపు పేరు మరుగున బడి పోయినది."[1]

(ii) "కోన వంశమున చెప్పబడిన మొదటి బుద్ధ భూపతికి విట్ఠల, కోట గన్న భూపతు లిర్వురును కొడుకులు వారు తమ పుత్రులకు తమ తండ్రి బుద్ధ భూపతి పేరునే పెట్టుకొనిరి. విట్ఠలుని కొడుకు బుద్ధ భూపతి పూర్వ రామాయణ కర్తయయ్యెను. గన్న భూపతి పుత్రుడైన బుద్ధ నృపుని కుమారులగు కాచ, విట్ఠల భూపాలులు ఉత్తర రామాయణ కర్తలయిరి. పూర్వోత్తర రామాయణములకు సహోదరుల కొడుకు, మనుమలు కర్తలగుట తేలిన విషయము."[2]

కావున బుద్ధ భూపతి నామధేయులిరువురు; వారి తండ్రులు విట్ఠల గన్న భూపతులు; ఇట్లు పూర్వోత్తర రామాయణావతారికా విషయములను సమన్వయించిన సందేహము దూరమగును. అప్పుడు రంగనాథ రామాయణ కర్త బుద్ధ భూవిభుడని తేల వచ్చును.

3. నామైక దేశ న్యాయము :—

"విట్ఠలుని పూర్తి పేరు "పాండురంగ విట్ఠల నాథుడై" యుండ వచ్చును. "నామైక దేశే నామ మాత్ర గ్రహణం" అను శాస్త్ర మర్యాదచే దీనిలో నుచ్చారణ సౌలభ్యము గల "రంగ-నాథ" యను నేక దేశమును రామాయణమునకు లగించి కవి రంగనాథ రామాయణమని కర్ణపేయమైన పేరు పెట్టియుండ వచ్చును. ఇట్లు పెట్టుటకు కారణము తండ్రి పేర ప్రఖ్యాతము చేయు నుద్దేశమే "మా తండ్రి విట్ఠలక్ష్మానాథు పేర" అనేడి పంక్తి విట్ఠలుని పుత్రుడు దప్ప మరొకడు వ్రాయలేడు"[3] కావున కర్త బుద్ధారెడ్డియే తండ్రి పేర రంగనాథ రామాయణమని ప్రఖ్యాతము చేసెను."[4]

---

1. డా. జి. నాగయ్య-"ద్విపద వాఙ్మయము" పుట.-142
2. వేటూరి ప్రభాకర శాస్త్రి-"సింహావ లోకనము" పుట-17
3. పింగళి లక్ష్మీకాంతం-"పీఠిక రంగనాథ రామాయణం" పుట-10 ఆంధ్ర విశ్వకళా పరిషత్తు ప్రచురణము
4. శ్లిష్టా రామకృష్ణ శాస్త్రి గారు దీనినిట్లు ఖండించిరి—

"బుద్ధ భూపతి తన తండ్రి పేరు విట్ఠల నాథుడనియు, విట్ఠల భూపతి యనియు వ్రాసికొనెనే కాని, "పాండురంగ విట్ఠలనాథు"డని యెక్కడను రచింపలేదు. నామైకదేశ నామమాత్ర గ్రహణ వాక్యమునకు నామ మందలి పూర్వార్థముగాని యుత్తరార్థముగాని స్వీకరింపనగును. కాని, యొక నామమును నాలుగైదు ముక్కలు చేసి యిష్టము వచ్చిన యక్కడక్కడి ముక్కలను జేర్చినచో

4. ఔరస సంబంధము :—

రంగనాథుడే వ్రాసినాడని యనుకొందమన్నను, "మా తండ్రి విట్ఠల క్ష్మానాథుపేర" అని విట్ఠల ప్రభుపున కాత ఔరస పుత్రుడైనట్లు వ్రాసియుండడు. ప్రభువు ప్రజలకు, ఆశ్రితులకు తండ్రి వంటివాడు గదా! ఆ సంప్రదాయముచే కవి "మా తండ్రి" యని చెప్పినాడని వాదింతురు. కాని నిండు పేరోలగంబున నున్న సదస్యులు "నీతనూ జన్ముండు నిపుణ మానసుడు" అని కవిని సూచించినట్లుగా బ్రహ్మ వంశ సంజాతుడైన రంగనాథు డౌచిత్యమును మఱచి ప్రయోగించునా? అని సందేహము కల్గుచున్నది. ఉత్తమ మధ్యమ పురుషములను పరిహరించి ప్రథమ పురుషయందు రచించి పితాపుత్రల సంబంధము నింత సహజముగా చెప్పక తప్పించుకొనవచ్చును గదా! కావున కర్త రక్త సంబంధము లేనివాడు కాక సొంత కొడుకువలెనే కానవచ్చుచున్నాడు.[1]

5. క్షేత్ర దేవతా పరము :—

బుద్ధారెడ్డి వంశీయులు వైష్ణవ మతస్థులు. వీరశైవమత ప్రతిభటముగా, వైష్ణవమత ప్రచారము నుద్దేశముతో బుద్ధారెడ్డి రామాయణమును వ్రాసినాడు. వైష్ణవులకు ప్రధాన దైవము శ్రీరంగమునందలి రంగనాథుడు. "ధర్మపురి రామాయణము, లేపాక్షి రామాయణము వలె శ్రీరంగక్షేత్రదేవతాపరముగ రంగనాథ రామాయణమని ప్రచారము చేసి యుండవచ్చును."[2]

6. ఉభయకర్తృత్వము :—

"నన్నయభట్టునకు నారాయణభట్టువలెను, కంకంటి పాపరాజునకు పుష్పగిరి తిమ్మనవలెను బుద్ధభూపతికి రంగనాథుడను కవియొకడు తోడ్పడి యుండవచ్చును. బుద్ధారెడ్డి ఈ విషయమును చెప్పక పోవుటము వలన రంగనాథ సహాయకపాత్రను తెలిసినవాళ్ళు దీనికి రంగనాథ సంబంధాన్ని ప్రచారం చేశారేమో!"[3] కాని "రంగనాథుని కర్తృత్వమునుబట్టియే రంగనాథ రామాయణమయ్యె

నేకదేశ సంప్రదాయము సిద్ధింపదు. "పాండు-రంగ-విట్ఠల-నాథ" యను భాగములలో రెండునాలుగు భాగములను జేర్చి మధ్య విట్ఠల పదమును త్యజించినచో లక్ష్మీకాంతముగారి సంకల్పము నెరవేరు నేమో గాని, రసాభాసము మాత్రమగును. విట్ఠలనాథుడు పాండురంగ క్షేత్రమందలి స్వామి. రంగనాథుడు శ్రీ రంగక్షేత్రమందలి స్వామి. అయ్యవారిని జేయబోయిన కోతియైనట్లున్నది వీరి యూహ. కాన రంగనాథ రామాయణ నామము కృతిపతిననుసరించి వచ్చినదనుట కల్ల. ఇది రంగనాథుడను కవి ననుసరించియే వచ్చి యుండ వచ్చును. (ఆంధ్ర వాఙ్మయచరిత్ర సర్వస్వము సం॥ 1 పుటలు 555-556)

1. శ్రీమతి పి. యశోదారెడ్డి "ఆంధ్ర సాహిత్య వికాసము" పుట-142.
2. (i) పింగళి లక్ష్మీకాంతం-"పీఠిక-రంగనాథరామాయణము." పుట-10 (ఆంధ్ర విశ్వ కళాపరిషత్తు ప్రచురణము)
   (ii) పి. యశోదారెడ్డి "ఆంధ్రసాహిత్య వికాసము" పుట-143.
3. ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్యము III సం॥ పుట-231.

నేని బుద్ధారెడ్డి యువరాజుగానున్నప్పుడు పూర్వ రామాయణమును వ్రాయ మొదలుపెట్టి, అతడు బ్రతికియున్న కాలమున పట్టాభిషేకము వరకు వ్రాసి, అతని మరణానంతరము మరల యతని కుమారుల నాశ్రయించి వారికిని తన కవితా తపస్సును ధారపోసెననుట హాస్యాస్పదము."[1] కావున రామాయణకర్త బుద్ధారెడ్డియేకాని రంగనాథుడు కాడు.

7. ప్రతిని వ్రాయించినవాడు రంగయ్యయగుట :—

ఈ ద్విపద రామాయణ ప్రతిని వ్రాయించిన రంగయ్య కారణముగ దీనికి "రంగనాథ రామాయణ" మని నామాంతరము కలిగి, అదియే తరువాత ప్రచారము చెందియుండవచ్చును:—

"తంజపురి పుస్తకశాలలో ఈ రామాయణ ప్రతులు పదమూడున్నవి. వీనిలో కొన్నింటి కెదురుగా బుద్ధభూపాలుని పేరును, మరి కొన్నింటికెదురుగా రంగనాథుని పేరును ప్రాచీన పుస్తకముల పట్టికలో నున్నవి. రంగనాథుని పేర నున్న ప్రతిలో యుద్ధకాండము చివర మరియొక ద్విపద గలదు. ఇది 30 చరణముల వరకునుండును. అచ్చుపుస్తకములలోనిది గానరాదు. కొన్నింటిని చూడుడు;—

"చెలగు నా గోపాలశెట్టి గర్వమున — మదనుండొ యనఁజాలు మహనీయమూర్తి
సౌరిది రామాయణ సుధ గ్రోల నేర్చు - వెరవు గల్గిన యట్టి విఖ్యాత సుమతి
సంగీత సాహిత్య చాతుర్యపరుడు - రంగయ్య యను పేర రహినెక్కు నతడు
ఇంగితజ్ఞుడు రంగయ (?) యేపు దీపింప - నొకనాడు ననుబిల్చి యురుతర పుణ్య
మకలంక కీర్తులొనర్చెడు (?) రామ — చరితంబు వ్రాయింప సంభ్రమయ్యె.
వరుసగఁ దప్పులు పఱలక యుండ - వ్రాయుము నీవని వస్త్ర తాంబూల
మాయెడ బహుమాన మర్థిగావింప - వ్రాయంగఁ బూనితి వరమతియుతులు
మాయురే యని పలుమారులు మెచ్చ — నిటలాక్ష కామినీ నిహిత ప్రసన్న
పటు చిత్తుడైన కుప్పయ మంత్రివరుడ."

ఈ ద్విపదను బట్టి రంగయ్య యాజ్ఞవలన కుప్పయ్య యను బ్రాహ్మణుడు బుద్ధ భూపాలుని రామాయణమునకు ప్రతిని వ్రాసినట్లు స్పష్టమగుచున్నది. పేరునుబట్టి కుప్పయ మంత్రి దాక్షిణాత్యుడు. కాన రంగనాథరామాయణ మను పేరు ఈ విధముగా దక్షిణాదిలో ప్రచురితమై యుండవచ్చును."[2] అంతేకాని కర్తమాత్రము బుద్ధ భూవిభుడే.

8. పితృనామ సవరణ:—

పూర్వ రామాయణమున బుద్ధరాజు తనతండ్రి పేరు విట్ఠలనాథుడని తెలిపెను. ఉత్తర

---

1. పింగళి లక్ష్మీకాంతము-పీఠిక-రంగనాథరామాయణము." పుట-4. ఆంధ్ర విశ్వకళా పరిషత్తు ప్రచురణము.
2. కట్టమంచి రామలింగారెడ్డి "పంచమి" రంగనాథరామాయణము వ్యా. పుట-19.20లలో నుద్ధృతమైనవి. (భారతి-రక్తాక్షి-పుష్యమాసము)

కాండములో కాచ, పిన విట్ఠల భూపతులనెడు సోదరకవులు తమ తండ్రి పేరు బుద్ధరాజని చెప్పి, తాత పేరు మాత్రము "గన్నభూపతి" అని చెప్పినారు. ఒకవేళ రంగనాథుడే పూర్వోత్తర భాగములను రచించినచో, రెండు భాగములలో రెండు విధములుగా వ్రాయునా? అను ప్రశ్నయుదయించును. కావున "ఉత్తర రామాయణములోని "నా నొప్పుగోనగన్న క్షితీంద్రునకును" అను ద్విపదను "నా నొప్పు విట్ఠల నరనాథమణికి" అని సవరింపనైన సవరింప వలెను. లేదా యీ ద్విపదకును తరువాతి ద్విపదకును నడుమ గన్నారెడ్డికిని, విట్ఠల నాథునకును గల సంబంధమును దెలుపుచు విట్ఠలుని పేరుదాహరించి, మఱి రెండు ద్విపదలనైనను చేర్చవలయును."[1] అని సమన్వయ మార్గ మూహింపబడినది. కాని నామ భిన్నత్వముచే బుద్ధారెడ్డి కర్తృత్వము నిశ్చయింప వీలగును.

9. బుద్ధారెడ్డి తండ్రి విట్ఠల రంగనాథుడు :—

ఉత్తర రామాయణములోని "నా నొప్పుగోన గన్న క్షితీంద్రునకు" అను ద్విపద పాదము నందలి వ్యక్తి చారిత్రక పురుషుడైనను, ఇది మూలపాఠము కాదు. దీని పాఠాంతరము చాల మార్పుతోఁ కూడియున్నది.

"గోన వంశార్ణవ కువలయ ప్రియుడు - నానొప్పు గో (కో)న గన్న క్షితీంద్రునకు
నను కూలమై యున్న యన్నమాంబికకుఁ - దనయుండు సాహిత్య తత్త్వ కోవిదుడు.
దాన ప్రసిద్ధుండు ధర్మశీలుండు - భానుతాచారుండు బుద్ధ భూవిభుడు"[2]

దీని పాఠాంతరము :—

"గోన కులార్ణవ కుపలయేశుండు - నానొప్పు గొన (రం) గక్షితీంద్రునకు
సనఘాత్మ యగుచున్న నన్నమాంబికకుఁ - దనయుండు.......... ....
....బుద్ధ భూవిభుడు."[3]

పూర్వ రామాయణము బాలకాండలో - "మా తండ్రి విట్ఠల క్ష్మాపాలు పేర"

అనియున్నది. ఉత్తర కాండలోని ఈ పాఠాంతర భాగమును, బాలకాండ - అవతారికా భాగమును చారిత్రకముగా సమన్వయము చేసినచో "రామాయణ కృతిపతి విట్ఠల-రంగనాథుడని" గుర్తింప వీలగుచున్నది.

"నా నొప్పు గోన రఙ్ఞ[4] క్షితీంద్రునకు" అని వ్రాయుట పూర్వ సంస్కృత పద్ధతి. అప్పుడది

---

1. చాగంటి శేషయ్య-"ఆంధ్రకవి తరంగిణి" IV సం॥ పుట-25,26,
2. (a) ఆరుద్ర-"సమగ్రాంధ్రసాహిత్యం III సంపుటము పుట-251లోను,
(b) చాగంటి శేషయ్యా-"ఆంధ్రకవి తరంగిణి," IV సం॥ పుట-16 లోను నుద్ధరింపబడిన పాఠము
3. దేవరపల్లి వెంకటకృష్ణా రెడ్డి - "రంగనాథ రామాయణము" వ్యా.
(భారతి-జూలై-1961 కలగూరగంప పుట-94)
4. కవి జనాశ్రయము. దోషా-25 పద్యమైన పూర్వ లక్షణ ప్రయోగ మిందుకుదాహరణము.

సంయుక్త యతి యగుచు ఈ గోన వంశ కవి చరిత్ర నెఱుగని, లాక్షణికుడెవడో ఇందలి 'నా-జ్ఞ' యతి తప్పని నా-న్న యతిగా మార్చి లక్షణము సాధించాడు. అనగా, "రజ్ఞ"ను "గన్న" గా మార్చినాడనుట.

రాయచూరు శాసనమున "గోన గంనయ రడ్డి వారు విఠల నాథ భూనాథుడు సమకాలికులుగా పేర్కొన్నను" రంగనాథ రామాయణ కృతిపతి గోన గన్నరెడ్డి కాడు. ఇతడు విఠల రంగనాథునికి ప్రభువు. ఏ కవి కూడ తన తాత పేరును వంశక్రమ విరుద్ధముగా మార్చి కులద్రోహము కావింప డనుట నైజము కావున చారిత్రకముగా

"నా నొప్పు గోన ర-జ్ఞ క్షితీంద్రుడే"[1]

కృతిపతి యనుట యూహింప దగినది; అనగా నామైక దేశ నామములు "గోన విట్ఠల-రంగనాథ" కృతిపతిని సూచించుచున్నవనుట కావున "గోన విట్ఠల రంగనాథ రామాయణ" మన్న సంపూర్ణ నామము "రంగనాథ రామాయణము"ను సంగ్రహ నామముగా పరిణమించి వ్యవహారమున రూఢికెక్కిన దనుట సమంజసము. ఈ గ్రంథ వవ్యహార నామమును పురస్కరించుకొని, రంగనాథ కవియను వాడొకడు కనబడినంతనే దీని రచయిత రంగనాథు డనుట ప్రక్షిప్త కవి చరిత్ర యగును.

"మా తండ్రి బుద్ధ క్షమానాథు పేర - ... .
.... మేము - గైకొన్న యుత్తర కథ యెట్టిదనిన"[2]

---

1. మల్లంపల్లి సోమశేఖర శర్మగారు ఈ పాఠాంతర విషయమున తమ యభిప్రాయ మిట్లు ప్రకటించిరి.

"పితామహుని పేరు ఈ విధముగా వ్యత్యస్తముగా నుండుటకుఁ గారణము తెలియదు. ఒకవేళ నిది లేఖకుని పొరపాటు కావచ్చునేమో యని ప్రభుత్వమువారి ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారము లోని ఉత్తరకాండ వ్రాత ప్రతులు పరిశీలింపబడినవి. ఈ భాండాగారమున ఐదు ప్రతులున్నవి. వీనిలో రెండు ప్రతులలో అచ్చయిన ముద్రిత ప్రతిలో వలెనే ప్రారంభమునందు-

"గోన వంశార్ణవ కువలయ ప్రియుడు - నా(గా) నొప్పు గోన (కోట) గన్న క్షితీంద్రునకు"

అనియు; కాండాంతములందు

"అనతాహిత లోకుడగు గోన గన్న - భూనాథ తనయుడు బుద్ధ భూవిభుని"

అని యున్నది. మిగిలిన మూడు ప్రతులలోను ప్రారంభమున నున్నట్లే యున్నది. కాని, కాండాంత చరణములలో మాత్రము కర్తల తాత పేరు లేదు. ఇన్ని ప్రతులలో-రెంటిలో ప్రారంభమునందును చివరను, మిగిలినవానిలో ప్రారంభమునందును-బుద్ధ భూవిభుని తండ్రి పేరు గన్న భూపాలుడని యుండగా దానిని లేఖక ప్రమాదమని భావింపలేము. తాత పేరు ఈ విధముగా వ్యత్యస్తముగా నుండు టకు కారణము నూహింపలేము. ఈ విషయమున చిక్కు విడదీయుటకు ప్రయత్నించుట నేల విడచి సాము చేయుటయే.

(పీఠిక-రంగనాథ రామాయణము. పుట-11. రాయల్ అండ్ కో ప్రతి)

2. దేవరపల్లి వెంకట కృష్ణారెడ్డి 'విట్ఠల రంగనాథ రామాయణము. వ్యాసము భారతి కలగూర గంప. పుట-92. అక్టో-1961)

అని ఉత్తర రామాయణ కర్తలైన "కాచ, పిన విట్ఠల విభు సోదరులు స్పష్టముగా తమ తండ్రి బుద్ధ" రాజు పేర నతని యాజ్ఞపై ఉత్తర కథ వ్రాయు చున్నామని చెప్పి యున్నారు. కర్త బుద్ధ భూపతి యనుటకు ఇంతకంటె ప్రబల నిదర్శన మేమి కావలయును.

10. పూర్వ కవుల చారిత్రక జ్ఞానా భావము :—

"రంగనాథ రామాయణము నుండి లక్ష్యములను ఉదాహరించిన లాక్షణికులు గ్రంథము పుట్టిన పిదప 4,5 శతాబ్ధాల తర్వాతి వారు. వారికిని (అట్లే పూర్వ కవులకును) లోక వదంతియే ఆధారము గాని వేరు చారిత్రకాధారములుండవు; వారు చరిత్ర పరిశోధకులు గారు. ఒకరిది ఇంకొకరి దిగా నుదాహరించుట లాక్షణికుల పరిపాటి. ఈ లోపము అప్ప కవిలోనే కలదు; కావున అది నమ్మ దగినది కాదు."[1]

11. C. P. బ్రౌను అభిప్రాయము.

C.P. బ్రౌను దొరగారు వ్రాత ప్రతులలో ఈ క్రింది రీతి వ్రాసిన వ్రాతలు బుద్ధా రెడ్డి కర్తృత్వమును బలపరచు చున్నవి.

"This Translation of the Ramayana is always attributed to a poet named Ranganatha, but his name is now here mentioned in the book; whil it is asserted in each volume that the author was Buddha Raja who wrote that the desire of his father vittal Raj."[2]

మరియు,

This Ramayana is Valugarly attributed to Ranganadha; but I can not discover the reason."[3]

12. సామర్థ్యము :—

అలనాటి రాజులు పండితులును, కళావేత్తలునైన ఉత్తమ గురువులను నియమించి తమ కుమారులకు సకల విద్యలను నేర్పించు వారు. కావున రాజులు కవి రాజులు గూడ కావచ్చును "నన్నె చోడ, కృష్ణ దేవరాయ, రఘునాథ నాయకాది రాజ కవీంద్రులు ఉత్తమోత్తమమైన గ్రంథ రచన గావింప లేదా? ... అట్లె, గోన బుద్ధ భూపతియు విద్వాంసుడై కవియై రామాయణ మహా కావ్యమును ద్విపదలలో తెనిగించి యుండవచ్చును."

ఇట్లు ఉద్దండులైన పండిత ప్రకాండులు, పరిశోధకులు, చారిత్రక సాహిత్య విమర్శకులు ఊహ కొలది సాధారములతో తర్జన భర్జనలు, వాదోపవాదములు గావించినారు. ఇందు సర్వశ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ గారు. వేటూరి ప్రభాకర శాస్త్రిగారు కందుకూరి వీరేశలింగం

---

1. పింగళి లక్ష్మీకాంతం - 'ఆంధ్ర సాహిత్య చరిత్ర పుట - 159
2, 3—డా. జి. నాగయ్య - "ద్విపద వాఙ్మయము" పుట-141లో ఉద్ధృతమైనవి.
4. వారణాసి వెంకటేశ్వరులు. ఆంధ్ర సాహిత్య సంగ్రాహ చరిత్ర పుట-123

పంతులుగారు, జనమంచి శేషాద్రి శర్మగారు, గురజాడ శ్రీరామ మూర్తి పంతులుగారు చాగంటి శేషయ్య గారు, శిష్టా రామకృష్ణ శాస్త్రిగారు, డా. టి సుశీలగారు ప్రభృతులు రంగనాథుని పక్షమునను; సర్వ శ్రీ కట్టమంచి రామలింగారెడ్డి గారు, పింగళి లక్ష్మీ కాంతంగారు, డా.జి. నాగయ్యగారు, డా.పి. యశోదారెడ్డి గారు, దేవరపల్లి వెంకట కృష్ణారెడ్డి గారు, వారణాసి వెంకటేశ్వర్లు గారు, ప్రభృతులు బుద్ధారెడ్డి పక్షమునను వాదించుచు సిద్ధాంత నిర్ణయము చేయుటకు ప్రయత్నించినారు; అనగా వారు ఏక పక్ష సిద్ధాంతమును ప్రతిపాదించినారు.

ఇట్లుండ మరి కొందరు "బుద్ధభూపతి వ్రాసెను; ఆస్థాన విద్వత్కవియైన రంగనాథుడు సరిచూచెను". అని ఉభయపక్ష వాదములను సమర్థించి సమన్వయ సిద్ధాంతమును లేవదీసినారు. వీరు చూపిన హేతువులిట్లున్నవి.

(1) "నన్నయ భట్టునకు నారాయణ భట్టు వలెను, కంకంటి పాప రాజునకు పుష్పగిరి తిమ్మనవలెను, బుద్ధ భూపతికి రంగనాథుడను కవియొకడు తోడ్పడి యుండవచ్చును. బుద్ధారెడ్డి ఈ విషయం చెప్పక పోవడం వలన రంగనాథ సహాయక పాత్రను దెలిసిన వాళ్ళు దీనికి రంగనాథ సంబంధాన్ని ప్రచారం చేశారేమో!"[1]

(2) బుద్ధ భూపతి

"కవి సార్వభౌముండు, కవి కల్ప తరువు
కవి లోక భోజుండు, కవి పురందరుడు"[2]

అని సభ్యులచే కీర్తింప బడినాడు. "ఇతడు కవి కల్పతరువు. ఈ కల్ప తరువును ఆశ్రయించు కొన్న ఏ కోకిలో గొంతెత్తి పాడిన స్వరాలు కొన్ని ఈ రామాయణంలో మారు ప్రోగితే వింతలేదు.[3]

3. "గోన బుద్ధారెడ్డి రాజ్య కాలమందు ప్రసిద్ధుడైన మహాకవి యొక్కరుడు మహా కావ్యముల రచింప నాతని నాహ్వానించి, యగ్రహారాది దానములచే సన్మానింపగా, నా ప్రభువు సహృదయత్వమున కలరి యాతడు రచించిన కావ్యము నక్కడక్కడ సవరించి సంస్కరించె ననుట సాధారణమై యొప్పును."[4]

బుద్ధారెడ్డి యను కవి కల్పతరువు నాశ్రయించిన కోకిల రంగనాథుడు. అతని స్వరాలు (చేర్పులు, మార్పులు కూర్పులకు సంబంధించిన ద్విపదలు) కొన్ని యిందు చోటు చేసి కొన్నవి. కావున రంగనాథ బుద్ధ భూపతు లుభయులును ఈ రంగనాథ రామాయణ రచనకు కారకులయిన వారే. ఈ కాలము నందును కొందరు కవులు ఏవో కావ్యములను వ్రాసి, కొందరు పరిశోధకులు ఏవో వ్యాసములను వ్రాసి, పండితుల వద్దకు తీసుకొని పోవుటయు, వారు వానిని సవరించుట

1. ఆరుద్ర - "సమగ్రాంధ్ర సాహిత్యం" III సం॥ పుట.-231
2. రంగనాథ రామాయణము అవతారిక పుట-4 ద్వి-86
3. ఆరుద్ర - "సమగ్రాంధ్ర సాహిత్య" III సం॥ పుట-232
4 డా. పి. యశోదారెడ్డి - ఆంధ్ర సాహిత్య వికాసము పుట-141

యును జరుగుచునే యున్నది. అట్లే ఈ రామాయణ రచనయు జరిగినదని భావించుట సమంజసమే యగును.

ఈ విధముగా నితః పూర్వము వాదించిన వారి యభిప్రాయములు కన్పించుచున్నవి. కాని "వీనిని గూర్చి యింతవరకు పండితులలోను, చరిత్రకారులలోను, ఏకీభావము కుదురలేదు. అభిప్రాయ భేదములుండనే యున్నవి"[1]

కావున ఇది యిప్పటికిని తేలని సమస్యగానే యుండి పోయినది. ఈ విషయములను పరిశీలించు నపుడు ఒండు రెండువిషయములు నా యూహకు తట్టినవి. ఇవి సత్యకథనమునకు, భావి పరిశోధకుల కును దోహదము కావచ్చునని తలంచుచున్నాను.

ఏతద్రంగనాథ రామాయణము వలన దెలియవచ్చు విషయములు :—

బుద్ధ భూపతి తండ్రి విట్ఠల క్ష్మానాథుడొకనాడు నిండు సభలో కొల్వు దీరిన వాడై పురాణ జ్ఞులను, శాస్త్రవిదులను, కవులను, హిత మంత్రి పురోహితాదులను, నందఱను జూచి,

"రమణమైఁ దెనుగున రామాయణంబు - క్రమమొప్పఁ జెప్పెడి ఘనకావ్యశక్తి
గల కవులెవ్వారు గలరుర్విఁ?"[2]

అని ప్రశ్నించెను. అంత విబుధులైన సభికులు బాగుగా నాలోచించి,

"నీ తనూ జన్ముండు నిపుణ మానసుడు - ధాత కల్మషుడు బంధుర నీతి యుతుడు
సర్వజ్ఞుడనఘుండు చతుర వర్తనుండు - సర్వపురాణ విచార తత్పరుడు
కమనీయ బహుకళాగమ విచక్షణుడు - సుమనీషి పోషణోత్సుక సుభోన్నతుడు
కవిసార్వభౌముండు కవి కల్ప తరువు - కవిలోక భోజుండు కవిపురందరుడు
ప్రత్యర్థి రాజన్యబల వజ్రపాణి - ప్రత్యర్థి నృపదావ పావకోజ్జ్వలుడు
భీకర నిజఖడ్గ బింబిత స్వర్గ - లోకానురక్త త్రిలోక దుర్దముడు
పరసాధు జలజాత వనజాతహితుడు - పురుష చింతామణి బుద్ధ భూ విభుడు
నీ కరిభక్తుండు నిఖిల శబ్దార్థ - పాకజ్ఞు డత్యంత పాండిత్యధనుడు
మఱియు రామాయణ మర్మధర్మజ్ఞుఁ - డెలుగు నాతనిఁ బిల్వు మీ కథఁ జెప్పు"[3]

అని బుద్ధ భూపాలుని గొప్పతనమును, రామాయణ రచనా సామర్థ్యమును బొగడి "అతడే రామాయణ రచనకు సర్వమైన వాడు కావున పిలిపించుడని విట్ఠలునికి నివేదించిరి. ఆ తరువాత,

మజ్జనకుఁడుదాత్త వర్తనుడు - నను నర్థిఁ బిలిపించి నను గౌరవించి
భూమిఁ గవీంద్రులు బుధులును మెచ్చ - రామాయణంబు పురాణ మార్గంబు

---

1. మల్లంపల్లి సోమశేఖర శర్మ - "పీఠిక-రంగనాథ రామాయణము" పుట-1
రాయల్ అండ్ కో ప్రతి

2. రంగనాథరామాయణము. అవతారిక, పుట-4 ద్వి-80-81.

3. రంగనాథరామాయణము. అవతారిక. -పుట-4 ద్వి-83-91

తప్పక నా పేరఁ దగ నంధ్రభాషఁ - జెప్పి ప్రఖ్యాతంబు సేయింపు మిర్వి."[1]

అని తండ్రి విట్ఠలుడు కుమారుడైన బుద్ధ భూపాలునికి తన పేర రామాయణమును నాంధ్ర భాషయందుఁ జెప్పి యుర్వి ప్రఖ్యాతంబు సేయింపుమని యాజ్ఞ నొసంగెను. అపుడు

"........... అమ్మృదూక్తులకు - ననయంబు హర్షించి యట్ల కావింపఁ
బనిపూని యరిగండ భైరవు పేర - ఘనుపేర మీసర గడాంకు పేర
లలిత సద్గుణ గణాలంకారు పేర - నలఘు నిశ్చల దయాయత బుద్ధిపేర
ఆతత కృతిపేర నతిపుణ్యు పేర - మా తండ్రి విట్ఠల క్ష్మానాథుపేర
రాజులు బుధులును రసికులు సుకవి - రాజులు గోష్ఠిని రాగిల్లి పొగడఁ
బదము లర్థంబులు భావముల్ గతులు - పదశయ్య లర్థ సౌభాగ్యముల్ యతులు
రసముల కల్పనల్ ప్రాస సంగతులు - నసమాన రీతులు నన్నియుఁ గలుగ
నాది కవీశ్వరుడైన వాల్మీకి - యాదరంబునఁ బుణ్యులందఱు మెచ్చఁ
జెప్పిన తెలుగున శ్రీ రామ చరిత - మొప్పఁ జెప్పెద"[2]

నని బుద్ధనృపతి ప్రతిజ్ఞచేసి పనిపూని తండ్రి మీది భక్తి పెంపున ద్విపదలలో రామాయణమును వ్రాసెను. ఇది గ్రంథావతారికయందు స్పష్టముగాఁ జెప్పబడిన సంగతి ఇట్లు ప్రతి కాండాంతంబునందును :—

"భూలోకనిధి గోనబుద్ధ భూ విభుడు
తమ తండ్రి విట్ఠలధరణీశు పేరఁ - గమనీయ తరధైర్య కనకాద్రిపేరఁ
బనుగొన నరిగండ భైరవు పేర - ఘనుపేర మీసర గండని పేర
నలఘు నిశ్చల దయాయత బుద్ధిపేర - లలిత సద్గుణ గణాలంకారు పేర
నా చంద్ర తారార్కమై యొప్పు మిగిలి - భూ చక్రమున నతి పూజ్యమై యొప్పు
నసమాన లలిత శబ్దార్థ సంగతుల - రసికమై చెలువొందు రామాయణంబు
పరగనలంకార భావనల్ నిండఁ - గరమర్థి (మొప్ప) నీ బాలకాండంబుఁ జెప్పె."[3]

అని గోనబుద్ధ భూవిభుడు తమ తండ్రి విట్ఠలధరణీశుపేర రామాయణంబు చెప్పినట్లు గలదు. ఉత్తర రామాయణమును వ్రాసిన గోన కాచ భూపతి-విట్ఠల రాజులు కూడ తమ తండ్రియైన
"............బుద్ధ భూ విభుడు - ....
తెలుగున నొప్పగా ద్విపద రూపమున - నలిఁబూర్వరామాయణము మున్నుఁ జెప్పి"[4]
నాడనియు, అతడు ఉత్తర కథను గూడ వ్రాయ సంకల్పించి యిష్టదేవతా ధ్యానము సేయగా, నా దైవము :—

---

1. రంగనాథ రామాయణము. అవతారిక పుట-4, ద్వి-92-94
2. ,, ibid ,, పుట-4 ద్వి-95-103.
3. ,, ibid ,, బాలకాండాంతము ద్వి-2469-2475.
4. రంగనాథరామాయణము, ఉత్తరకాండము, అవతారిక

"గరుడాధి రూఢుడై కరపంకజముల - నరుదుగా శంఖ శార్ఙాదులు మెఱయ

.... - ....

భానుకోటి ప్రభా భాసితుండగుచు - మానసంబునఁ దోచి మహిత వాక్యముల
నీవు నాకెంతయు నెరయభక్తుడవు - నీవు పుణ్యుండవు నీవు మాన్యుడవు
గావున నీభక్తిఁ గైకొంటి మేము - నీవింక మముఁగూడి నెమ్మినేతెమ్ము
నీవాంఛితార్థంబు నిర్వహింపంగ - నీ వర నందనుల్ నిపుణమానసులు
వారి నియోగింపు వారు నీకోర్కె - గారవంబునఁ జేయఁ గలవారు మీద."1

నని పలుకగా, బుద్ధ భూపతి తన కుమారులను బిల్వఁ బంచి, తన స్వప్న కథను వారికి వివరించి,

"................................ - నాకీర్తి వర్ధనుల్ నా కూర్మి సుతులు
గాన నా పూనిన కథ యెల్ల జనులుమానుగాఁ గొనియాడ మధుర వాక్యముల
నెమ్మిచెప్పుడు మీరు నిపుణులై యనుచు"2 నాజ్ఞాపింపగా, ఆ కుమారులు.

"..............మా తండ్రి ప్రతిన -

....

చిరకీర్తులెసగంగఁ జెల్లింపఁగనుట-పరమ ధర్మంబని భక్తితోఁగోరి
రామావతారంబు రమణీయమగుట - రాము పావన చరిత్రము దివ్యభాష
లోకాను రంజన శ్లోక బంధములఁ - జేకొని వాల్మీకి చెప్పిన జాడ
మా తండ్రి బుద్ధ క్షమానాథు పేర - నాతాత ఘనుపేర ననఘుని పేర
ఘనుడు మీసరగండ కాచ భూవరుడు - వినుత శీలుడు పిన విఠల భూపతియు
నని జనుల్ గొనియాడ నర్థితో ...."3

ఆంధ్ర భాషయందు "ఉత్తర కథను" జెప్పినారు, అనగా విట్ఠలనాథుని ఆదేశమున నతని కుమారుడు బుద్ధరాజు "పూర్వరామాయణమును" బుద్ధ భూపాలుని యాజ్ఞమేర నతని కుమారులైన కాచ, పిన విట్ఠల విభులు "ఉత్తర రామాయణమును" వ్రాసినట్లు పూర్వోత్తరరామాయణావతారిక-కాండాంత ద్విపదల వలన తేలుచున్న సారాంశము. రంగనాథుడే వ్రాసినాడని చెప్పుచో, ఈ నలుగురి వ్రాతలును, "రామో ద్విర్నాభి భాషతే" యని ప్రఖ్యాతినొంది, సత్య విక్రముడు, ధర్మాత్ముడు, ఆదర్శమానవుడు, దైవావతారమైన శ్రీరాముని స్వప్న కథనమును అసత్యములన వలసి వచ్చును. మరియు రంగనాథుడు ధనాశచే బుద్ధారెడ్డి వ్రాసినట్లు వ్రాసినాడనియన్నచో రాజైన విట్ఠల నాథుని పేర వ్రాయక పోవుటకు కారణమేమి? యను ప్రశ్నకు సమాధానము

1,2,3. రంగనాథ రామాయణము. ఉత్తరకాండము. అవతారిక. కర్తలు :- గోనకాచ భూపతి; విఠల రాజులు ఈ ద్విపదలు "ఆంధ్రకవి తరంగిణి" సం॥ IV పుటలు, 33,34,35లలో, అవ తారికలు-చరిత్ర పుట 76,77 లలో ఉద్ధరింపబడినవి)

లభింపదు. కవులచే స్తుతింపబడిన రంగనాథుడు అచ్చవెల్లి రంగనయో, చక్రపాణి రంగనయో మరియు రంగనాథుడో కావచ్చును. లేక ఈ ద్విపద రామాయణమును వ్రాసినవాడు రంగనాథుడని జనశ్రుతి యందేర్పడిన కల్పిత పురుషుడయిన రంగనాథుడేని కావచ్చును. కాని గ్రంథస్థ ప్రత్యక్ష సాక్ష్యము లను త్రోసి పుచ్చి బుద్ధ భూపాలుని కర్త కాదని చెప్పవలను పడదు.

2. బుద్ధ నృపతి తండ్రి 'పాండు రంగ విఠ్ఠల నాథుడు'[1] అని పింగళి లక్ష్మీకాంతంగారు, "విఠ్ఠల రంగనాథుడ"[2] ని దేవరపల్లి వెంకట కృష్ణారెడ్డి గారు ఊహించి 'రంగనాథ రామాయణ ము'ను పేరును సమర్థించుటకు ప్రయత్నించినారు. నేను రంగనాథ విఠ్ఠలుడయ్యు నుండ వచ్చునని మరొక ఊహ చేయుచున్నాను.

"విఠలుడు" అనగా విష్ణుమూర్తి. విష్ణువే ప్రధాన దైవమని తలంచువారు వైష్ణవులు. ఈ లీలా విభూతిలో వెలసిన వైష్ణవులకు ప్రధాన దైవమైన అర్చారూప దైవము శ్రీరంగమునందలి రంగనాథుడు.

"కావేరీ విరజాసేయం - వైకుంఠం రంగమందిరం ।
సవాసుదేవో రంగేశః - ప్రత్యక్షం పరమం పదం॥"[3]

అని వైష్ణవుల విశ్వాసము. ఈ రంగనాథుడే పండరిపురమందు వెలయుటచేత పాండురంగ విఠలు డైనాడు. ఇతడే రంగనాథ (భర్త) విఠలుడు. గోన బుద్ధారెడ్డి తన తండ్రియైన విఠలుని పేర వైష్ణవ మతమునకు పట్టుగొమ్మయైన రామాయణమును రచించినాడు. "పితృదేవో భవ"[4] యన్నట్లు తన తండ్రికి రంగనాథునికి అభేదమును భావించినాడు.

బాల యుద్ధ కాండాంతములందు - "పనుగొన సరిగండ భైరవు పేర"[5]

అను దానికి పాఠాంతరముగా

"వన జోదరుని పేర వనమాలిపేర" - ఘనుపేర మీసర గండని పేర"

అను ద్విపద పాదము కలదు. ఇందలి వనజోదర, వనమాలి శబ్దములు విఠ్ఠల ధరణీశునకు విశేషణ ములయి యొప్పుచున్నవి; కాదేని రంగనాథునికి విశేషణములు 'వనజోదర శబ్దము'[6] జగదండ

---

1. పింగళి లక్ష్మీకాంతం — "ఆంధ్ర సాహిత్య చరిత్ర" పుట-164
2. దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డి - "విఠల రంగనాథ రామాయణము"
   వ్యాసము-కలగూరగంప. భారతి-జూలై 1961 పుట 94
   మరియు, భారతి—అక్టోబర్ 1961 పుట-92
3. ఆభాణక శ్లోకము
4. తైత్తిరీయోపనిషత్తు - "శిక్షావల్లి" ప్రథమ ప్రశ్న ॥ప్ర. 20సూ
5. రంగనాథ రామాయణము పుట 91, మరియు 650
   అధస్సూచిక - ఆంధ్రవిశ్వకళా పరిషత్తు ప్రచురణము
6. కియాన్ భరోమమ జగదండ మండలీతి - అతృప్తితః క్రశిత మివోదరం విభోః
   రిరక్షి షోచిత జగతీ పరం పరాం - పరామివ ప్రథయతి నాభి పంకజం ॥ 114శ్లో.

మండలమును నుదరమున నుంచుకొనియు, బ్రహ్మ ద్వారా సృష్టి చేసియును రక్షించుట, (సృష్టి ప్రళయములందు రక్షించుట), 'వనమాలి'[1] శబ్దము సరేశత్వము అనెడి ముఖ్య గుణములను దెలుపుచున్నది. "నా విష్ణుః పృథివీపతిః" అనుటచే రాజునకు విష్ణువునకు అభేదము చెప్పవచ్చును. రాజైన విఠలుడును, రాజ్యరక్షాభారమును, నరేశత్వమును వహించినవాడు. జగద్భార రక్షా, సర్వేశత్వములుగల రంగనాథుడే తన తండ్రి యని భావించుట చేతనే బుద్ధ భూవిభుడు 'వనజోదర - వనమాలి' విశేషణములను తన తండ్రి విఠ్ఠలునకు కూర్చినాడు. అప్పుడు బుద్ధారెడ్డి తండ్రి విఠ్ఠల రంగనాథుడో, లేక రంగనాథ విఠ్ఠలుడో యగును. తాను వ్రాసినది శ్రీ రామచరితము అయినను తండ్రియైన విఠ్ఠల నృపుడు

"రామాయణంబు పురాణ మార్గంబు
తప్పక నాపేరం దగ నంధ్రభాషఁ - జెప్పి ప్రఖ్యాతంబు సేయింపు మర్వి"[2]

యని కోరుటచేత 'రంగనాథ విఠ్ఠలుడు' లేక 'విఠ్ఠలరంగ నాథుడు' అనెడి తండ్రియొక్క పేరులోని ఉచ్చారణసౌలభ్యము గల రంగనాథ శబ్దమును నామైకదేశ నామగ్రహణ న్యాయముచే గ్రహించి, రామాయణ శబ్దమునకు లగించి, 'రంగనాథరామాయణ' మని పిలిచియుండును. వైష్ణవమతమును "ఈ గ్రంథము ద్వారమున ప్రచారము గావించుటకొఱకు కొందఱీ ద్విపద రామాయణమును ఇంటింట ప్రవేశపెట్టియుందురు. అందుకు వైష్ణవ ధర్మ సూచకమైన ప్రభువు నామము సముచితముపకరించినది. అపుడా రామాయణము గోనబుద్ధ భూవిభుకృతమైన రామాయణముగా కాక కృతిభర్తయైన విఠలుని పేర ప్రఖ్యాతమైనది.[3]

3. గోన వంశీయులలో కొందరు శైవమతావలంబకులు. మరికొందరు పరమ వైష్ణవులు. రాయచూరి శాసనమునందు గోన గంనయ రడ్డి రాజ్య రక్షామణియని చెప్పబడిన విఠ్ఠలనాథుడు వైష్ణవుడు, విష్ణుభక్తుడు, శ్రీ నారాయణ దేవ దివ్య శ్రీ పాద పద్మారాధకుడు. కృతి కర్తృభర్తలైన బుద్ధ - విఠ్ఠల క్ష్మాపాలురు విష్ణుభక్తి తత్పరులనుటకీ రామాయణమే సాక్ష్యము. ఆదియందు శ్రీ కామినీనాథుడు, అంతమున శ్రీ రంగనాథుడు[4] కీర్తింప బడినాడు. ఉత్తర కాండ కర్తలును కుల స్వామి యగు విష్ణుని గొలిచియే కావ్య ప్రారంభము చేసినారు. కావున వీరికి ఇలవేల్పు విష్ణువు- వైష్ణవుల ప్రధాన దైవమైన శ్రీ రంగనాథుడు.

---

1. వక్షస్థస్థల్యాం తులసి కమలా కౌస్తుభైర్వైజయంతీ
సర్వేశత్వం కథయతితరాం రంగధామ్నస్తదాస్తాం॥ 118శ్లో
(శ్రీ పరాశర భట్టార్యులు-శ్రీరంగ రాజస్తవము పూర్వ శతకము-114, 118 శ్లోకములు)

2. రంగనాథ రామాయణము-అవతారిక. పుట 4 ద్వి-94

3. డా. పి. యశోదారెడ్డి "ఆంధ్ర సాహిత్య వికాసము" పుట 143.

4. రంగనాథ రామాయణము. అనుబంధము, 2 పుటలు-842, 843 ఆంధ్రవిశ్వకళాపరిషత్తు ప్రచురణము.

గోన వంశ ప్రస్తావము గల శాసనములందు వర్ధమానపురము,[1] రాయచూరు, బూదపూరు గ్రామములు ప్రస్తావింప బడినవి. వర్ధమాన పురమునకిపుడు వద్దె (డ్డె) మానని పేరు. ఈ వర్ధమాన పురము, బూదపూర్‌లు నేడు మహబూబ్‌నగర్ జిల్లాలో నున్నవి. బుద్ధారెడ్డి కూతురు కుప్పాంబిక భర్త చనిపోయిన మీదట బూదపూరు గ్రామమున ఒక దేవాలయమును గట్టించి అందు తన భర్త గుండయ పేర లింగ ప్రతిష్ఠ చేసినట్లు శాసనమునందున్నది.

ఇట్లే గోన వంశీయులు రంగనాథుని ఆలయములను కట్టించినట్లు ఊహింప వీలగుచున్నది, బూదపూర్ పూర్వ రూపము బుద్ధాపురము; అది మధ్య కాలమున బూదపూరై నేడు భూత్‌పూర్ అని పిలువబడుచున్నదని ఆయూరి పెద్దల వక్కాణ. ఈ బుద్ధాపురము నేడు జడ్చర్లకు సుమారు 12 మైళ్ళ దూరములో నున్నది. ఈ జడ్చర్ల గ్రామము నానుకొని యొక కొండ, ఆ కొండ మీద నొక దేవాలయమున్నది. ఈ యాలయమును "రంగనాథాలయమని" పిలుచుచున్నారు. కొందఱు గోవింద రాజాలయమనుచున్నారు. నేడిది శిథిలావస్థలోనున్నది. గోన వంశీయుల చేత ఈ ఆలయము నిర్మింప బడవచ్చునని ఇక్కడి ప్రజలు తలంచుచున్నారు. ఇట్టి యాలయములు గోనవంశీయుల ఇలవేల్పు రంగనాథుడు-విష్ణువు అనుటకు నిదర్శనములు

"పలికెడిది భాగవతమట - పలికించెడి వాడు రామభద్రుండట"[2]

యని పోతన చెప్పినట్లు, తన తండ్రి రూపమున ఆదేశించినవాడు, తనచే రచింప జేయువాడు రంగనాథుడే యని భావించి బుద్ధ భూవిభుడు తన గ్రంథమును రంగనాథరామాయణముగా ప్రచారము చేసి యుండవచ్చును,

"రంగనాథుడు సత్యకాముడు, సత్య సంకల్పుడు[3] గదా"

4. ఈ రంగనాథ రామాయణమునందు రామేశ్వర ప్రతిష్ఠా విషయము చెప్పబడినట్లే రంగనాథ ప్రతిష్ఠా విషయమును [4] గ్రంథాంతమున చెప్పబడినది.

శ్రీ రామ పట్టాభిషేకానంతరము శ్రీ రామునిచే బహూకృతులై సుగ్రీవాదులు స్వస్వ నెలవులకు పోవుచుండిరి, అట్లే విభీషణుడును పోయెను. ఆ సందర్భమున వాల్మీకి రామాయణములో

---

1. రాయచూరు శాసనము (ఇది గోన గన్నారెడ్డి రాజధాని నగరము) ఆంధ్రకవితరంగిణి సం॥ IV లో నుద్ధరింపబడినది.

2. బమ్మెర పోతన-భాగవతము అవతారిక పద్య-18.

3. భగవద్రామానుజాచార్యులు "శ్రీరంగ గద్య" చివరి పంక్తులు "సత్యకామ : సత్యసంకల్ప ఆపత్సఖ! కాకుత్స్థ ———శ్రీ రంగనాథ! మమనాథ!"

4. రంగనాథ రామాయణము అనుబంధము-2 పుటయి 842,843 ఆంధ్రవిశ్వకళా పరిషత్తు ప్రచురణము.

"లబ్ధ్వాకులధనం రాజాలంకాం ప్రాయాద్విభీషణః"[1] అని కలదు. "కులధనం" అనగా శ్రీ రంగనాథ పేటిక. (శ్రీ రంగనాథ విగ్రహముతో కూడిన విమానాకార మంజూషిక) అని గోవింద రాజీయ వ్యాఖ్యయున్నది ఇక్ష్వాకు మహారాజు తపః ఫలముగా సంప్రాప్తమైన దీరంగనాథ దైవము. అది ఆ మహారాజు మొదలుకొని తద్వంశీయులందరిచే నారాధింపబడుచు వచ్చుచున్నది. రాముడును ఆ రంగనాథుని అర్చించినట్లు—

"సహపత్న్యా విశాలాక్ష్యా నారాయణ ముపాగమత్"[2]

అని వాల్మీకి రామాయణము నందును.—

"శ్రీ రంగశాయనం దేవం సమభ్యర్చ్య యథావిధి"[3]

అని ఉమాసంహితయందును,—

"సాయంకాలే పునస్స్నాత్వా హుత్వాజప్త్వాచ రాఘవః।
శ్రీరంగశాయినం విష్ణుం సమభ్యర్చ్య యథావిధి।"[4]

అని దేవీ రామాయణమునందును జెప్పబడియున్నది.

తన వియోగము భరించలేక విచారపడుచున్న విభీషణునికి శ్రీరామచంద్రుడు తన ఆరాధ్య దైవమైన రంగనాథుని (కులధనమును) ఇచ్చి యోదార్చి పంపించినాడు. ఆతడు దీనిని లంకకు గొనిపోవుచుండగా, దేవతలు గణనాథుని ద్వారా అవరోధము కల్పించి, ఉభయ కావేరి మధ్యమున రంగనాథుడు ప్రతిష్ఠితుడగునట్లు చేసినారు.

ఈ రంగనాథ ప్రతిష్ఠా వృత్తాంతాముతో బుద్ధనృపరి ద్విపద రామాయణము సమాప్తమైనదిగా చెప్పవచ్చును.

వైష్ణవుల ప్రధాన దైవము రంగనాథుడు గదా! "ఇతడెట్లు ఎవరిచే ఉభయకావేరి మధ్య ప్రతిష్ఠింపబడినాడు? విభీషణుని చేత. అతనికెట్లు లభించినది? శ్రీ రాముని వలన. అతడెవరు? అవతారపురుషుడు; దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ, ధర్మోద్ధరణకై అవతరించిన మహా విష్ణువు. చరిత్ర ఏమి? చెప్పెదను. వినుము," అని యిట్లు ప్రశ్నోత్తర రూప విషయమును మనసునందు భావించి కవి శ్రీ రాను చరిత్రను వివరముగా వర్ణించి అంతమున శ్రీ రంగనాథ ప్రతిష్ఠా విషయమును వ్రాసి, దానితో గ్రంథ సమాప్తి కావించినాడని తలంచుచున్నాను. ఈ రంగనాథ విషయమునకు సంబంధించిన ద్విపదలు ఆంధ్రవిశ్వకళా పరిషత్తు ప్రచురించిన "రంగనాథ రామాయణము" అనుబంధము-2. పుటలు 842,843లో రెండు పాఠ భేదములతో వివరముగా నీయబడినవి—

---

1. వాల్మీకి రామాయణము (దా. ప్రతి.) యుద్ధ కాండము సర్గ 131, శ్లో॥ 85
2. వాల్మీకి రామాయణము (దా. ప్రతి) అయోధ్యాకాండము. సర్గ 6 శ్లో॥1
3. ములుకుట్ల నరసింహావధాని-"శ్రీరామాయణ సారోద్ధారము" యుద్ధ కాండము- ద్వితీయభాగము- పుట 788లో ఉద్ధరింప బడినది.
4. ములుకుట్ల నరసింహావధాని-"శ్రీ రామాయణ సారోధారము" ఉత్తర కాండము. ప్రథమ భాగము- పుట-94 లో ఉద్ధరింపబడినది—

(ఇవి ఇతఃపూర్వ ముద్రిత ప్రతులందు కానరాక, కేవలము వ్రాత ప్రతులందు (తాళ పత్రములందు) మాత్రమే కానవచ్చినవని సంపాదకులు తెలియజేసినారు.) కావున రంగనాథ ప్రతిష్ఠకు కారణ భూతమై, రంగనాథ ప్రతిష్ఠయే ఫలముగా వ్రాయబడిన రామాయణము గావున రంగనాథ రామాయణమని తర్వాత ప్రచారము చెంది యుండవచ్చును.

(5) కవులు గ్రంథనామము ననేక విధములుగా నేర్పరింతురు. నాయికా నాయకులను బట్టియు, ప్రధాన కథను బట్టియు, మధ్యనెక్కడనో ఘటిల్లి కథనంతయు నల్లుకొని పోయిన ఘటనను పురస్కరించుకొనియు, ఫలమును బట్టియు, నిట్లు అనేక విధములుగా పేరులు పెట్టబడుచుండును. ఈ ద్విపద రామాయణాంతమున వర్ణింప బడిన ఘట్టము శ్రీ రంగనాథ విషయము. దీనికి పూర్వ సంబంధముగా రామకథ యున్నది. కావున ఫలమును పురస్కరించుకొని, శ్రీ రంగక్షేత్ర దైవతము పేర రంగనాథ రామాయణమని పిలువబడి ప్రఖ్యాతి వహించి యుండవచ్చును.

రంగనాథ విట్ఠలుడు లేక విట్ఠల రంగనాథుడనెడి తండ్రి పేరుతో గాని, వైష్ణవుల ప్రధాన దైవమైన రంగనాథుని పేరుతో గాని, "పట్టాభిషేకముతో వచ్చిన రంగనాథుడనెడి బిరుదు నామముతో"1 గాని, ఈ ద్విపద రామాయణమునకు రంగనాథ రామాయణమని తొలినాటి నుండియు వచ్చిన పేరనుటలో అసామంజస్య మేదియు లేదు.

కావున రంగనాథ రామాయణమునకు కర్త బుద్ధ భూపతియే. ఇతరులనుకొన్నట్లు రంగనాథుడనునొక యాశ్రిత కవి పుంగవుడు రచనలో సహకరించి యుండవచ్చును. కాని పూర్తిగా రంగనాథుడే వ్రాసి బుద్ధారెడ్డి పేరు పెట్టినాడనుట ప్రత్యక్ష ప్రమాణమునకు విరుద్ధము.

బుద్ధ భూపతి వంశము

పూర్వోత్తర రంగనాథ రామాయణములందు వర్ణింపబడిన కృతికర్తృ వంశ వివరములను ఒకచోట కూర్చిన ఈ క్రింది రీతిగా వంశ వృక్షమేర్పడ గలదు.

"గోనకాట భూపతి
|
రుద్ర భూపతి
|
తెలియదు
|
బుద్ధ భూపతి
|

1. డా. జి. నాగయ్య "ద్విపద వాఙ్మయము" పుట-142

విట్ఠల భూపతి (గన్న భూపతి)[1]

బుద్ధ భూపతి

కాచ భూపతి — పిన విట్ఠల భూపతి"[2]

కొందఱు గోన వంశ ప్రస్తావన గల శాసనస్థ[3] విషయములను పూర్వోత్తర రంగనాథ రామాయణస్థ విషయములను క్రోడీకరించి, సమన్వయించి, ఈ క్రింది రీతిగా వంశ వృక్షమును కనబరచిరి.

"1. గోన కాట భూపతి

2. రుద్ర భూపతి

3. పేరు తెలియదు

4. బుద్ధ భూపతి — 5. కాట భూపతి (1250-58)

(4. బుద్ధ భూపతి): 6 గన్నయ (1284-1294) 7. కుప్పమ 8. మల్లయ్య 9. బుద్ధయ 10. విట్ఠయ (1284)

(5. కాట భూపతి): 11. కాటయ గారి గుండయ్య 11. దత్తుడు గుండయ

12 బుద్ధయ్య

(12 బుద్ధయ్య): 14. కాచయ 15. పిన విట్ఠయ్య (ఉత్తర రామాయణ కర్తలు)

(10. విట్ఠయ): ? ? ? 13. బుద్ధయ (పూర్వ రామాయణ కర్త)

---

1. పూర్వ రంగనాథరామాయణ కృతికర్తయైన బుద్ధ నృపతి తన తండ్రి విట్ఠల క్ష్మానాథుడనియు ఉత్తర రామాయణ కృతి కర్తలు, బుద్ధ భూపతి కుమారులైన కాచవిభు పిన విట్ఠల రాజ సోదరులు తమ తాత గోన గన్న క్షితీంద్రుడనియు పేర్కొన్నారు. కొందఱు గన్న భూపతి విట్ఠల భూపతికి నామాంతరమనిరి. దీనిని కొంద అంగీకరించరైరి.

2. (ఎ) రంగనాథ రామాయణము (పూర్వ) అవతారిక.

(బి) రంగనాథ రామాయణము (ఉత్తర) అవతారిక.

3. మూడు బూదపూరు శాసనములు, ఒకటి కుప్పాంబ శాసనము, ఒకటి రాయచూరు శాసనము, మరొకటి తిరుప్పుక్కుళ్ళి శాసనము- వెరసి మొత్తము ఆరు శాసనములు—

సూచన :— 11వ సంఖ్యగల వ్యక్తులు ఇద్దరూ ఒక్కరే"[1]

విట్ఠల-గన్నభూపతులు:—

కాకతీయ గణపతి-రుద్రాంబల యుద్ధ దండనాయకుడుగా నుండిన మల్యాల గుండయ భార్య కుప్పాంబిక. ఈమె గోన బుద్ధ భూపతి కుమార్తె[2] మల్లయ్య, బుద్ధయ్య, విట్ఠయ, గుండయ అను వారు నలుగురు ఈమెకు తమ్ములు.

ఈమె వంశ వృక్షములోని మొదటి బుద్ధ భూపతి కుమార్తెయయినచో, రంగనాథరామాయణ కర్తయైన బుద్ధనృపతికి మేనత్తయగును. అపుడు కుప్పమ సోదరులలో విట్ఠయ యొకడున్నాడుగదా! అతడే కృతికర్త బుద్ధ భూవిభుని తండ్రి విట్ఠల క్ష్మాపాలుడని భావించవలయును. అప్పుడు గన్నయ (గన్నక్షితీంద్రుడు) కృతికర్తకు పెద్ద తండ్రి యగును. అతడును తన కుమారునకు బుద్ధయ యనియే పేరు పెట్టి యుండవచ్చును. ఆ బుద్ధయ్య కుమారులైన కాచవిభుడు, పిన విట్ఠల రాజులను కృతికర్త బుద్ధ భూవిభుడు సంతానము లేమిచే తన కుమారులుగ భావించి పోషించియుండును. అప్పుడు ఉత్తర రామాయణ కర్తలు తమ తాతను గన్నవిభునిగా పేర్కొనుటయు, కృతికర్త బుద్ధనృపతి తన తండ్రిని విట్ఠల క్ష్మాపాలుడుగా పేర్కొనుటయు సమంజసమే.[3] ఇట్లయినచో పూర్వోత్తర రామాయణములకు సహోదరుల కొడుకు మనుమలు కర్తలగుదురు.[4]

చిలుకూరి వీరభద్రరావుగారు "కుప్పాంబిక రంగనాథ రామాయణ కృతికర్తయగు బుద్ధ భూపతి కూతురనియు, సోదరులని చెప్పబడిన విట్ఠలదే ఉత్తర రామాయణ కర్తలలో నొకడగు విట్ఠలుడనియు కాచరాజునే కాటయయని శాసనమున నుదాహరించిరని"[5] యభిప్రాయ పడి యున్నారు.

---

1. ఆరుద్ర-సమగ్రాంధ్ర సాహిత్యము-III సం॥ పుట-252.

2, కుప్పాంబ బూదపూరు శాసనము: —

"కాకతీయ రుద్రదేవ మహారాజులు ఓరుగంటను పృథివి రాజ్యంబు సేయుచుండగాం దత్ప్రసాదాసాదిత రాజ్యలక్ష్మీ నివాసుడయిన శ్రీ మల్యాల గుండ దండాధీశ్వరుని ధర్మపత్ని కుప్పాంబిక.

....

శ్రీ గోనవంశ నిజశేఖర బుద్ధయాఖ్య - పుత్రీ పవిత్రచరితాభరితా గుణౌఘైః।
శృంగార కారకరణిః కరణీయ దక్షా - కుప్పాంబికా జనిచ తస్యసతీ కలత్రం॥

3 చాగంటి శేషయ్య "ఆంధ్రకవితరంగిణి" IV సం॥పుట-20.

4. వేటూరి ప్రభాకరశాస్త్రి "సింహావలోకనము" పుట-16.

5. చిలుకూరి వీరభద్రరావు ఆంధ్రుల చరిత్రము.

ఇట్లే మానవల్లి రామకృష్ణ కవిగారు కూడ "రాయచూరు శాసనమునందు ప్రస్తావింపబడిన గోన గన్నారెడ్డి; విట్ఠల భూపతియను నిరువురు సోదరులనియు, నిందలి విట్ఠల భూపతియే రంగనాథ రామాయణ కృతికర్తయనియు, అతడు బుద్ధ భూపతికి పిన తండ్రియైనను, మనలో పిన తండ్రిని తండ్రియని పిలిచెడి యాచారమున్నది కావున రంగనాథరామాయణమున నతనిని తండ్రియని వ్యవహరించినార"[1] నియు అభిప్రాయపడి యున్నారు.

కాని చాగంటి శేషయ్యగారు పై యిరువురి అభిప్రాయములను ఖండించినారు.[2]

సరే, ఏ విధముగ చూచినను, రాయచూరు శాసనమునందు జెప్పబడిన గన్నారెడ్డి విట్ఠలులకును పూర్వోత్తర రామాయణములందు జెప్పబడిన గన్నారెడ్డి విట్ఠలులకును సంబంధమున్నను, లేక పోయినను, ఈ రెండు కుటుంబములవారు గోన వంశీయులగుటచే తప్పక దాయాదులై యుందురను టలో సందేహము లేదు. మరియు విట్ఠల భూపతి-గన్నక్ష్మాపాలురు ఇరువురు భిన్న వ్యక్తులే కాని ఒక్కరు మాత్రము కారు.

రచనా కాలము

రంగనాథ రామాయణ కర్తృత్వము గూర్చివలెనే, తత్కర్తల కాలమును గూర్చి విమర్శకులలో భిన్నాభిప్రాయములు ప్రబలి యున్నవి చరిత్రకారులలో ఏకీభావము కుదరలేదు. అయినను వానిని గూర్చి తెలిసికొనుటలోను, యథాశక్తి కాలనిర్ణయమునకు ప్రయత్నించుటలోను తప్పులేదు.

గోన బుద్ధ భూపతి కాలమును నిర్ణయించుటకు రంగనాథ రామాయణ పూర్వోత్తర భాగము లలో నెట్టి యాధారములును లేవు. కావున చారిత్రకులు, విమర్శకులు శాసనములను బట్టి నిర్ణయిం చుటకు ప్రయత్నించినారు.

ఉప లబ్ధములైన శాసనములలో గోన వంశ్యనామ చిహ్నితములైన శాసనములు మూడు గలవు. వీనికి బూదపూరు శాసనములని పేరు. ఇవి మూడును 13వ శతాబ్దమునకు చెందినవి

---

1. చాగంటి శేషయ్య "ఆంధ్రకవి తరంగిణి" IV సం॥ పుట-22 లో ఉద్ధృతము—
2. "ఆంధ్రకవి తరంగిణి" IV సం॥ పుటలు-20,22,23,24

ఖండన సారాంశము :—

i) కాచయ్య కాటయలందు చటల భేదమున్నది. శాసనమునందు విట్ఠలునకు కాటయ తమ్ముడైనట్లుండగా, ఉత్తర రామాయణమున అగ్రజుడైనట్లున్నది,

ii) రాయచూరు శాసనము కుప్పాంబిక శాసనమునకు 18 సంవత్సరముల తర్వాతిది. కావున గన్నారెడ్డి కుప్పాంబిక శాసనకాలము నాటికి జీవించి యున్నాడనుట స్పష్టము. గన్నారెడ్డి యామెకు సోదరుడైనచో నా శాసనమున నతడు కూడ నుండి యుండును. అట్లులేదు. కావున ఇందలి గోన గన్నారెడ్డి కుప్పాంబికకు సోదరుడు కాడని నిర్ణయింపదగియున్నది. అయినచో రామా యణకర్తయైన బుద్ధ భూపతికి రాయచూరు శాసనమునందు చెప్పబడిన గన్నారెడ్డితో నెట్టి సంబం ధము లేదు. అట్లె విట్ఠలునితో కూడ లేదనవచ్చును.

ఇది మల్యాల గుండ దండాధీశుడు
వీనిలో నొకటి శకవర్షము 1181 (క్రీ. శ. 1259) నాటిది. ఇది మల్యాల గుండ దండాధీశుడు తెలుపుచున్నది. రెండవది శక
తన భార్య కుప్పాంబిక పేర కుప్ప సముద్రమును నిర్మించినట్లు తెలుపుచున్నది
వర్షము 1194 (క్రీ.శ. 1272) నాటిది. ఇది గుండ దండాధీశుని విజయములను తెలుపుచున్నది
మూడవది శక వర్షము 1198 (క్రీ. శ. 1276)నాటిది. ఇది కుప్పాంబ తన భర్త మరణించిన
పిదప, అతని పుణ్యలోక ప్రాప్తికై బూదపూరు గ్రామమున దేవాలయమును గట్టించి. యందు శివ
లింగ ప్రతిష్ఠచేసి, దానికై చేసిన భూదానాదులను వివరించుచున్నది. మొదటి రెండు శాసనములలో
"కుప్పాంబ గోన వంశమున జనించి"1 నట్లును మూడవ శాసనములో ఆ కుప్పాంబ "బుద్ధ భూపతి
కూతురైనట్లు"2 స్పష్టముగా చెప్పబడియున్నది. "ఈ కుప్పమ రామాయణ గ్రంథకర్త యైన
రెండవ బుద్ధ భూపతి కూతురైనచో, క్రీ.శ. 1259 నాటికి అత్తింట కాపురము చేయుచు శాసనములో
ప్రస్తుతింపబడ దగిన వయస్సులో నున్న కూతురు గల బుద్ధారెడ్డికి ఆనాటికి సుమారు 45 సంవత్స
రముల వయస్సైనను ఉండును. ఇది నిజమైనచో కవి క్రీ. శ. 1210 ప్రాంతమున జనించి 1240
ప్రాంతములో గ్రంథమును రచించియుండును.

లేదా, కుప్పమ తండ్రి మొదటి బుద్ధ భూపతి అనగా గ్రంథకర్తకు తాతయైనచో. తండ్రికి
సమవయస్కురాలగు మేనత్తకంటె కవి దాదాపు ఇరువది యైదు సంవత్సరములు చిన్నవాడై
యుండినచో క్రీ.శ. 1259 శాసనము నాటికి దరిదాపులోనే ఇతడు జనించి యుండును. అప్పుడు
రామాయణ గ్రంథకర్త బుద్ధారెడ్డి క్రీ.శ. 1260 ప్రాంతమున జనించి, క్రీ. శ. 1295 ప్రాంతమున
రచన చేసి యుండును. కాని కుప్పమ రామాయణ కర్తకు కుమార్తె యనుటయే సమంజసముగా
నుండును—

ఇక తిక్కన మొదటి కావ్యము నిర్వచనోత్తర రామాయణము- ఇది క్రీ శ 1260 ప్రాంత
మున రచింపబడినదని చరిత్ర పరిశోధకులు నిర్ణయించినారు. తిక్కనామాత్యుడు "తనకంటె
పూర్వము ద్విపదలో పూర్వ రామాయణము రచితమై యున్నందున, దానిని పూర్తిచేయు తలంపు
తోడనే ఉత్తర కాండమును నిర్వచనోత్తర రామాయణమును పద్యకావ్యముగా రచించినాడు, లేనిచో
పూర్వ రామాయణము నతడు వదలుటకు సరియైన కారణము కనబడదు-"3 దీనిచే తిక్కన నిర్వచ

1. (a) గోన వంశ మహనీయ పయోధిజాత.

(b) గోన కుల దుగ్ధాబ్ధి జాత.

2. శ్రీ మన్మల్యాల వంశే శశికర నికరాందోళనోన్మీలన శ్రీ
మిశ్రీభూత ప్రకట పటు నటత్కీర్తి వల్లీ వితానః।
ఆసీదాసీర లూనావళి మిళిత లసత్సంపదున్మేషభూషా
వేషా శేషాభిరామః క్షితి తలతిలకో గుండదండాధినాథః॥
శ్రీ గోనవంశ నిజశేఖర బుద్ధ యాఖ్య - పుత్రీ పవిత్ర చరితా భరితా గుణౌఘైః।
శృంగార కార కరణిః కరణీయదక్షా - కుప్పాంబికా జనిచ తస్య సతీ కలత్రం॥

3. ఈ యభిప్రాయముతో కందుకూరి వీరేశలింగం పంతులుగారును ఏకీభవించినారు.

నోత్తర రామాయణమునకంటె దాదాపు 20 సంవత్సరముల ముందు రంగనాథ రామాయణము రచిత మైన దనుటలో విప్రతిపత్తి లేదు.

రంగనాథ రామాయణమొక వేళ క్రీ.శ. 1280 ప్రాంత మందు పుట్టెనేని క్రీ. శ. 1320 ప్రాంతమునఁబుట్టిన భాస్కర రామాయణమునకు చాల దగ్గరగా నుండును. భాస్కర రామాయణము నందు రంగనాథ రామాయణానుసారములైన కథాంశము లనేకములు గలవు. అవి బుద్ధారెడ్డిపై భాస్కరాదులకు గల గౌరవమునకు సూచకములు. సమకాలికులకు విద్యాస్పర్ధలు మెండు. ఇది సమానేతివృత్తములను రచించెడు కవులలో మరియు నెక్కువ. పరస్పరము గౌరవించుకొనుట అరుదు. కాని భాస్కరుని వంటి ప్రౌఢ కవిచే గౌరవము పొందఁదగిన ఈ ద్విపద రామాయణము ఆనాటికి చాల ప్రాచీన గ్రంథముగా ప్రసిద్ధికి వచ్చియుండవలయునని యూహించినను, ఇది క్రీ. శ. 1240 ప్రాంతముననే రచింపబడి యుండునన్నుట సమంజసము" అని శ్రీ పింగళి లక్ష్మీకాంతం గారు దీర్ఘ ముగా చర్చించి, బుద్ధ భూపతి జననము క్రీ. శ. 1210 ప్రాంతమనియు, రామాయణ రచనాకాలము క్రీ. శ. 1240 ప్రాంతమనియు తేల్చివేసిరి.

కాని శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రీ గారు "కుప్పమ మొదటి బుద్ధ భూపతి కుమార్తె యగు ననియు, అయినచో రంగనాథ రామాయణ కృతికర్త బుద్ధ భూపతికి మేనత్త యగు ననియు, రంగనాథోభయ రామాయణములు కాకతీయ రుద్రాంబ పాలనపుఁ దుదికాలమును, కాకతీయ ప్రతాప రుద్రుని పాలనా రంభమును నగు క్రీ. శ. పదమూడవ శతాబ్ది తుది భాగమున ననగా క్రీ. శ. 1280-1300 ప్రారంభమున రచితములై యుండు"[2] ననియు తలంచిరి.

శ్రీ చాగంటి శేషయ్యగారు వేటూరి ప్రభాకరశాస్త్రిగారివలెనే "కుప్పమ మొదటి బుద్ధ భూపతి కూతురు రామాయణ గ్రంథకర్త రెండవ బుద్ధభూపతికి మేనత్తయనియే ఊహించిరి; కాని గ్రంథకర్త జననము క్రీ.శ. 1270 ప్రాంతమనియు, తద్గ్రంథ రచనాకాలము క్రీ.శ. 1310-1320 నడుమనై యుండు"[3] ననియు అభిప్రాయపడినారు. వారు తమ అభిప్రాయమునకు క్రీ.శ. 1276 నాటిదైన మూడవ బూదపూరు శాసనము నాధారముగా గ్రహించి ఈ క్రింది రీతి ప్రతిపాదించిరి.

"క్రీ.శ. 1276 శాసన కాలమునాటికి కుప్పాంబికకు కొంత వయసు వచ్చిన తనయు లున్నారు. కావున నామెకప్పటికి సుమారు ఏబది యేండ్లుండునని తలఁచవచ్చును. అయినచో నామె జననము క్రీ.శ. 1226 అగును. ఈ శాసనములో నీమెకు మల్లయ, బుద్ధయ, విట్ఠయ, కాటయయను వారలు సోదరులైనట్లు కన్పడుచున్నారు. ఇందులోని విట్ఠయయే బుద్ధభూపతి తండ్రియై యుండ వలెను. (ఇతడు కుప్పమకు మూడవ సోదరుడు; కావున ఇతని జన్మ క్రీ.శ. 1240 ప్రాంత

(కవుల చరిత్ర—సం॥ I పుట-230)

1. "ఆంధ్ర సాహిత్య చరిత్ర—"పుటలు-168, 169.
2. "సింహావలోకనము" రంగనాథరామాయణము వ్యాసము. పుటలు-17, 18.
3. చాగంటి శేషయ్య "ఆంధ్రకవి తరంగిణి" సం॥ IV పుట-19.

మగును; తరమును ముప్పది సంవత్సరములుగా లెక్కించిన) రామాయణ గ్రంథకర్త బుద్ధ భూపతి జననము క్రీ.శ. 1270 ప్రాంతమై రామాయణ రచనాకాలము క్రీ.శ. 1310-1320 నడుమనై యుండును."[1] అని శ్రీ శేషయ్యగారి అభిప్రాయము.

శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు చెంగల్పట్టు జిల్లా కాంచీపురము తాలూకా తిరుప్పుక్కుళి శాసనము నాధారముగా చేసికొని రామాయణ రచనా కాలము 14వ శతాబ్దాంత్యకాలమని నిర్ణయించిరి. వారి వాద సారాంశమిది.

"ఈ తిరుప్పుక్కుళి శాసనములో కోన కాటయ యొక్కడు గానవచ్చుచున్నాడు. ఇతడు కాకతి గణపతిదేవ మహారాజు మంత్రి. క్రీ.శ. 1250లో కాకతి గణపతిదేవ మహారాజు కాంచీపురమును జయించినందున కోన కాటయయు నప్పుడా ప్రాంతమున నుండవలయును. ఈ కోన కాటయయు, రామాయణ కృతికర్త బుద్ధ భూపతి పూర్వుడయిన గోన (కోన) కాటయయు నొక్కరని తోచుచున్నది. సుమారు తరమున కిరువది పురుషాంతరములు సరాసరి లెక్కించిన బుద్ధభూపతి క్రీ.శ. 1375 ప్రాంతమున నుండినట్లు తేలును. కావున నేతద్రామాయణ రచనాకాలము క్రీ.శ. పదునాల్గవ శతాబ్ది చివరి భాగమగును. అంతకు పూర్వపుది కానేరదు;"[2] అను నీఅభిప్రాయమునకు బలకరముగ నుండుటకై "దళవాయి, పడాలు, అయ్యేవి, ఇర్వదుర, నల్వదుర, చనుదేకయున్న" వంటి పదములను, ప్రయోగములను, బిరుదు పెండెము ధరించునట్టి వీరాచారమును నుదాహరించిరి.

శ్రీ ఆరుద్రగారు "క్రీ.శ. 1294లో వేయించబడిన రాయచూరు శాసనంలోని గోన గంనయ రెడ్డి రాజ్య రక్షామణియైన విఠ్ఠలుడే రామాయణ కర్త తండ్రి విఠ్ఠల భూపతియని "మిసరగండ" బిరుదు ఆధారంగా ఊహించి, ఆ శాసన మతని పరహలా పచ్చీసులో వేయించి ఉంటే దాదాపు అదే ప్రాంతంలో బుద్ధ భూపతి జనించియుండుననియు, రామాయణ మర్మమును కరతాలామలకము చేసికొనే వయస్సు దాదాపు ముప్పయ్యో సంవత్సరమనుకొన్న 1294 + 30 = 1324 అగుననియు, కాని అది ప్రతాప రుద్రుడస్తమించుటచే నేర్పడిన అల్లరుల కాలం కావున ఢిల్లీ సుల్తానుల బెడద తప్పి కాపయ నాయకుడు శాంతిని సుస్థిరము చేసిన కాలంలో అనగా క్రీ.శ. 1340 సంవత్సర ప్రాంతంలో రామాయణ రచన జరిగి యుండవచ్చు" నని అభిప్రాయ పడినారు.[3]

ఈ రీతిగా బుద్ధ భూపతి కాలము క్రీ.శ. 1210 మొదలు క్రీ.శ. 1380 ప్రాంతము వరకు పోవుచున్నది. రంగనాథరామాయణము పాల్కురికి సోమన తిక్కనామాత్యుల నడిమి కాలమున వ్రాయబడినట్లు నేను తలంచుచున్నాను. వీరశైవ మత ప్రతిభటముగా, వైష్ణవ మత ప్రచారము చేయు నుద్దేశముతో వ్రాయబడిన దగుటచేత పాల్కురికి సోమన బసవ పురాణ, పండితా

---

1. చాగంటి శేషయ్య "ఆంధ్రకవి తరంగిణి" సం॥ IV పుటలు 19, 20.

2. "పీఠిక రంగనాథ రామాయణము" పుటలు-7 నుండి 18 వరకు. రాయల్ అండ్ కో ప్రచురణము-1957 (శా.శ.1879).

3. ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్యం. సం॥ III పుటలు-224, 225.

రాధ్య చరిత్రలకు తరువాతను, కేవలము వీరవైష్ణవ దృష్టితో కాక రామేశ్వర మహాత్మ్యాదులను వర్ణించి,

"పరికింప రామ భూపాలకుండపుడు - హరుడు విష్ణుఁ డానయను మాడ్కి నుండె"[1]

యని చెప్పుమత సహన దృష్టితో రచింపబడి తిక్కన హరిహరాద్వైతమునకు మార్గదర్శకమగుట చేత కవిబ్రహ్మకు పూర్వమునను ఈ గ్రంథము రచితమైనదని చెప్పనొప్పును. అప్పుడు పూర్వ రామాయణ మున్నందుననే తిక్కన ఉత్తర రామాయణమును వ్రాసినాడనుటయు సమర్థింపబడును.

వీర శైవ మతకర్తయైన బసవేశ్వరుడు క్రీ.శ. 1168లోను, మల్లికార్జున పండితారాధ్యుడు క్రీ.శ. 1170 ప్రాంతములోను, వీరి సమకాలికుడైన వేమనారాధ్యుడు దాదాపు క్రీ.శ. 1170లోను మరణించిరని చరిత్రకారులు నిర్ణయించి యున్నారు.........కావున పండితారాధ్యుని శిష్యుడగు కరస్థలి సోమనాథయ్యకు సమకాలికుడై వేమనారాధ్యుని మనుమని యొద్ద వేదవేదాంగముల నభ్యసించి పండితారాధ్యుని మనుమలను స్వయముగా చూచి యానందించి యాశీర్వదించిన పాల్కురికి సోమనాథుడు క్రీ.శ.1160 ప్రాంతమున జనించి, అనుభవసారాది గ్రంథములనే కాక క్రీ.శ. 1192 ప్రాంతమున బసవ పురాణమును, క్రీ.శ. 1230 ప్రాంతమున పండితారాధ్య చరిత్రను రచించి క్రీ.శ. 1240 ప్రాంతమున శివైక్యము నొందినాడు"

ఈ సోమనాథుడు "క్రీ.శ. 1180-1220 మధ్యకాలము వాడని చిలుకూరి వీరభద్రరావు గారును, క్రీ.శ. 1180 సంవత్సర ప్రాంతము వాడని వీరేశలింగం పంతులుగారును, క్రీ.శ. 1150 ప్రాంతము వాడని శేషాద్రి రమణ కవులును, క్రీ.శ. 1190 ప్రాంతము బసవ పురాణ రచనా కాలమని వేటూరి ప్రభాకర శాస్త్రిగారును వ్రాసియున్నారు."[3]

ఇక తిక్కనామాత్యుడు నెల్లూరు నేలిన మనుమసిద్ధి మహారాజునకు మంత్రి, ఆస్థానకవి నిర్వచనోత్తర రామాయణ, విరాట పర్వాది మహాభారత రచయిత, కవిబ్రహ్మ. ఈ మనుమసిద్ధి మహారాజు శాసనములు క్రీ.శ. 1256 నుండి కనిపించుచున్నవి.......... సింగళ దేవమహారాజు తరువాత నద్దంకి సీమకుఁ బాలకుడైన సారంగపాణి శిలా శాసనములు క్రీ.శ. 1255 నుండి కనిపించుచున్నవి."[4] మనుమసిద్ధి మహారాజు ఈ సారంగ పాణిని సంగ్రామంబున పారద్రోలినట్లు నిర్వచనోత్తర రామాయణమునందు

"శృంగారంబు నలంగదేమియును బ్రస్వేదాంకురశ్రేణిలే
దంగంబుల్ మెఱుఁగేద నించుకయు మహారాష్ట్రి సామంతు సా
రంగుందోలి తురంగముం గొనిన సంగ్రామంబునందప్రతి స

1. రంగనాథ రామాయణము-యుద్ధకాండము ద్వి-8767.
2. బండారు తమ్మయ్య "పీఠిక బసవ పురాణము" పుటలు-52 53, 55,57 వావిళ్ళప్రతి,
3. చాగంటి శేషయ్య-"ఆంధ్రకవి తరంగిణి" సం॥ III పు-136.
4. నండూరి రామకృష్ణమాచార్యులు-కవిత్రయము-తిక్కన-పుట-26.

ప్రాంగస్ఫార యశుండు మన్మరిభ ప్రపైవన్న సైన్యంబుననన్"[1]

అని వర్ణింపబడియున్నది మనుమసిద్ధి శౌర్యమును వర్ణించు నిర్వచనోత్తర రామాయణము క్రీ.శ. 1255 తర్వాత క్రీ.శ. 1256 ప్రాంతమున వ్రాయబడినదనుట సర్వవాదము.

ఇట్లు పాల్కురికి సోమన, తిక్కన సోమయాజుల కాలములను పరిశీలించిన మీద, వారి నడిమి కాలమున అనగా క్రీ.శ. 1190 నుండి క్రీ.శ.1255 మధ్యకాలమున బుద్ధభూపతి యున్నట్లు తలంచవచ్చును. ఇది నిజమైనచో, కుప్పమ రామాయణ కర్త యైన బుద్ధ భూపతి కూతురనియు, అతని తాతయైన బుద్ధభూపతి కుమార్తె కాదనియు, స్పష్టముగా బోధపడును. ఈ ద్విపద రామాయణము మతదృష్టి తోడ రచింప బడినదనెడి గ్రంథాంత స్సాక్ష్యాధారమున చేయు కాలనిర్ణయము పింగళి లక్ష్మీకాంతంగారు శాసనాధారమున జేసిన కాలనిర్ణయమునకు కొలది హెచ్చుతచ్చుగా సరిపడుచున్నది కావున క్రీ.శ. 1240 ప్రాంతమున రంగనాథరామాయణము విరచితమై యుండుననుట ఎంతయో సముచితముగా నున్నది.

వంశము

గోన బుద్ధారెడ్డి రంగనాథరామాయణమని వాడుకలో నున్నది. గ్రంథమునందు ఇతడు రెడ్డి వంశమునకు చెందినవాడని ఎన్నటను చెప్పబడలేదు. కాని "శాసనములు ఇతని దాయాదులైన గోన వంశజులు రెడ్డి కులమునకు చెందినట్లు చెప్పుచున్నవి."[2] కావున వీరు పుట్టుకచే రెడ్డి కులజులై రాచరికమును బట్టి భూపతులు, భూవిభులనియు వ్యవహరింపబడినారు.

వీరిది కోన వంశమా? లేక గోన వంశమా? యనియు విమర్శకులలో వివాదమున్నది శాసనములందును,[3] గ్రంథములందును[4] గోన శబ్దమే ప్రయుక్తమైనది.

శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారు "పరుషాక్షరములతో నారంభమైన పదములుకొన్ని సరళాక్షరాదిపు పదములైనవి; పూర్వము హల్ సంధియు, గసడదవాదేశము ను తప్పక పాటింపబడుచు వచ్చినవి; అను కారణముల వలన మొదట "కోన" గా నుండి పిదప "గోన"గా వ్రాయబడియుండవచ్చును. కావున వీరిది 'కోన' వంశమునుగా వచ్చుననుటలో విప్రతిపత్తి లేదని"[5] అభి

1. తిక్కన-నిర్వచనోత్తర రామాయణము- ప్రథమాశ్వాస-పద్య-43.
2. రాయచూరు శాసనము :— " శ్రీమతు మీసియర గండగోన గంనయ రడ్డివారు వర్ధమాన పురమునంచు"
3. (i) గోనవంశనిజశేఖర బుద్ధయాఖ్య పుత్రీ - బూదపూరు శాసనములు
   (ii) గోన వంశ మహనీయ పయోధిజాత ,,
   (iii) గోనకులదుగ్ధాబ్ధిజాత ,,
4. రంగనాథ రామాయణము బాల కాండము ద్వి. 41,53,57,58
   శ్రీరమణీయులై కృష్టిసత్తములు.
   గోరి వర్ణనసేయు గోన వంశమున-ఇత్యాదులు
5. మల్లంపల్లి సోమశేఖర శర్మ "పీఠిక-రంగనాథ రామాయణము. పుట-6 రాయల్ అండ్ కో ప్రచురణము.

వ్రాయపడినారు. ఇది కేవలము సంభావ్యమైన యూహయేగాని సాధారము మాత్రముగాదు. "గండి కోట, గాజులపేట" ఇత్యాదులు మొదటి నుండియు సరళాక్షరాదిమ పదములైనట్లు, వీరిది సరళాక్ష రాదిమ పదముగల "గోన" వంశమని ఆధారము లభించువరకు తలంచుట యుత్తమము.

అవతారికా-కాండాంత విశేషములు.

1. కవి దేవతాస్తుతిలో నారాయణుని, శారదా దేవిని దప్ప ఇతర దేవతలను, పూర్వ కవి స్తుతిలో వాల్మీకి, వ్యాస శుక మహర్షులను దప్ప ఇతర సంస్కృత కవులనుగాని, తెలుగుకవులనుగాని స్మరించలేదు.[1] పూర్వాంధ్రకవిస్తుతి సంప్రదాయము నితడు పాటించలేదు.

2. "శ్రీ" తోకావ్యము ప్రారంభింపబడుటయేగాక, ప్రతికాండము మొదట శ్రీ నిలుపబడినది.

3. కాండ ప్రారంభాంతములందు కృతి పతిని గూర్చిన సంబోధనాంత ద్విపదలు లేవు.

4. షష్ఠ్యంత రచన లేదు.[2]

5. గ్రంథాంతమునకు బదులు ప్రతి కాండాంతమునందును ఫలశ్రుతి చెప్పబడినది. ఈ ద్విపదలు అన్నింట సమానము.

6. పురాణ మార్గమున వాల్మీకి జాడ వ్రాయబడినది

7. ఈ వంశజులకు "మీసరగండ" యనెడి బిరుదున్నది.

8. బుద్ధ భూపతి భోజమహారాజుతో పోల్పబడినాడు.[3]

బుద్ధ నృపతి-వ్యక్తిత్వము

1. ఇతడు రామ మంత్రోపాసకుడు. శ్రీరామ మంత్రము లనేకములు గలవు. కామనా సహితముగాను, నిష్కామముగాను ఉపాసకులు వీనిని జపించుచుందురు. ఇట్టియనేక రామ మంత్ర ములలో బుద్ధ విభుడు "పంచదశాక్షరిని" జపించువాడని

"ఆరూఢ పంచదశాక్షర ప్రసవ - పారిజాతాకారు బ్రణవానుకారు"[4]

అని గ్రంథారంభమున శ్రీ మహావిష్ణుని స్తుతించిన తీరును బట్టి తెలియనగుచున్నది.

శ్రీ రామ రహస్యోపనిషత్తునందు—

"శ్రీ రామేతి పదంచోక్త్వా జయరామ తతః పరం।
జయద్వయం వదేత్ ప్రాజ్ఞో రామేతి మనురాజకః॥
త్రయోదశార్ణం ఋష్యాది పూర్వవత్సర్వకామదః।

---

1. పాల్కురికి సోమన గూడ తన గ్రంథములందు పూర్వాంధ్రకవులను స్తుతించు సంప్ర దాయము పాటింపలేదు.

2. ఇది నన్నెచోడునిచే ప్రారంభితమై తిక్కనాదులచే ననుసరింపబడినది.

3. "కవిలోకభోజుండు కవిపుర దరుడు" రంగనాథ రామాయణము-అవతారిక. ద్వి-86.

4. రంగనాథ రామాయణము అవతారిక ద్వి-౬.

....

త్రయోదశార్ణ ముచ్చార్య పశ్చాద్రామేతి యోజయేత్।
స వై పంచ దశార్ణస్తు జపతాం కల్పభూరుహః॥[1]

అని కలదు- "శ్రీరామ జయరామ జయజయరామ", అనునది పదమూడక్షరముల శ్రీరామ మంత్రము ఇది సమస్తకామముల నొసంగునది. దీనికి రామ అని జోడించినచో

"శ్రీ రామ జయరామ జయజయ రామరామ"

అని పదునైదక్షరముల మంత్రమును "జపించువారికిది కల్పవృక్షము; కోరిన కోరికలను పూర్తి చేయునది." కావున బుద్ధ భూపతి ఈ పంచదశార్ణమనువు నుపాసించువాడు, ఉపనిషత్తునందలి కల్పవృక్ష శబ్దమును సూచించునట్లుగా, నితడు పారిజాత శబ్దమును ద్విపదయందు ప్రయోగించినాడు,

పై ద్విపదకు రెండు పాఠాంతరములున్నవి.[2]

(i) ఆరూఢి పంచషడక్షర

(ii) ఆరూఢ పంచాశదక్షర - అనునవి.

(i) పంచషడక్షర మంత్రము అనగా పదునొకండక్షరముల మంత్రము "జానకీ వల్లభాయ హుంస్వాహా" లేక "రామాయ ధనుష్పాణయే స్వాహా "అను దశాక్షరముల మంత్రములకు ఆదియందు "ఓం,హ్రీం,శ్రీం,క్లీం,ఐం,రాం" అను ఆరింటిలో నొకదానిని చేర్చగా పదునొకండక్షరముల మంత్రరాజములు సిద్ధించును.[3]

ఇక పంచాశదక్షర మంత్రరాజము (50 అక్షరములు గల మంత్రము) చాల దీర్ఘమై జపము కష్టసాధ్యమైయుండును. లేక ఇది "అకారాది హకారాంతమైన పంచాశద్వర్ణ (అక్షర) జపమును కావచ్చును. కాని ద్విపదయిందలి "పారిజాత" శబ్ద సాహచర్యము వలన బుద్ధ నృపతి "శ్రీ రామ జయరామ జయజయరామరామ" అను మంత్రమును జపించినట్లు స్పష్టముగా చెప్పవచ్చును త్రయోదశాక్షర మంత్రమును తులసీదాసు జపించి కృతార్థుడైనాడు; "రామచరిత మానస" గ్రంథమును హిందీ భాషలో రచించినాడు. బుద్ధ నృపతి పంచదశాక్షర మనువును జపించి తెలుగు భాషలో రంగనాథ రామాయణమును వ్రాసినాడు.[4] వాల్మీకియు శ్రీ రామ మంత్రమును జపించినవాడేకదా!

---

1. రామరహస్యోపనిషత్తు-ద్వితీయోధ్యాయము.
2. రంగనాథ రామాయణము. పుట-1 అధసూచిక. ఆంధ్ర విశ్వకళాపరిషత్తు ప్రచురణము.
3. రామ రహస్యోపనిషత్తు. ద్వితీయాధ్యాయము.
4. బుద్ధ భూపతి పితృాజ్ఞ పాలకుడును, సత్యసంధుడునైన శ్రీ రాముని ఉపాసించుచు, పితృాజ్ఞపై రామాయణమును రామానుగ్రహమును కోరి వ్రాసినాడు. కాని రంగనాథుడనువాడు వ్రాసిన దానిని తాను వ్రాసినట్లు అబద్ధమును జెప్పుకొనునా? "శ్రీ రాముడు బుద్ధ భూపతిని అనుగ్రహించి ఉత్తర కాండను కుమారులకు వ్రాయనప్పగించి తనయొద్దకు రమ్మని ఆజ్ఞాపించినాడనెడి ఉత్తరరామాయణ పీఠికా వృత్తాంతము బుద్ధారెడ్డిపై ప్రసరించిన శ్రీ రామానుగ్రహమును చెప్పక చెప్పుచున్నది. ఈ యంతరంగ సాక్ష్యము చేత రంగనాథ రామాయణ పూర్వభాగమును బుద్ధారెడ్డియే వ్రాసినాడని సిరీకరింప వచ్చును.—

2. యోగాభ్యాస చతురుడు :—

ఇతడు "మనస్సును ఇంద్రియ విషయములందు పరుగెత్తనీయక ఏకాగ్రత పరచుట, పరిచితాసనమున పదిలమై నిలుచుట, వాయువును నిరోధించుట, కోణత్రయ శుద్ధి గావించుట, కుండలినీ శక్తిని మేల్కొలుపుట, కమల షట్కమును గడచి చంద్రమండలమును జేర్చుట, అక్కడ పరమ వ్యోమమై తమ్ము మఱచుట (తన్మయత్వము, ఆనందము నొందుట) మొదలగు యోగ విద్యా రహస్యము లెఱుంగుటయే కాక, తదనుభవానందమును గలవాడు"

3 జ్ఞాని

"అంతర్నాడియూపము, మనస్సు పశువు, నియమము వేదిక, ఇంద్రియములు సమిధలు జ్ఞానము అగ్ని, యోగామృతము నేయి, ఆనందయోగమే ఫలము"[2]గా నితడు నిత్యము జ్ఞాన యజ్ఞమొనర్చువాడు.[3] ఉపనిషద్విద్య నెఱింగినవాడు;[4] తత్త్వము తెలిసినవాడు;[5] సర్వపురాణ విచార తత్పరుడు. కమనీయ బహుళకళాగమ విచక్షణుడు, కవి సార్వభౌముడు, సర్వజ్ఞుడు, అత్యంత పాండిత్యధనుడు, నిఖిల శబ్దార్థ పాకజ్ఞుడు, మీదు మిక్కిలి రామాయణ మర్మ ధర్మజ్ఞుడు.

---

1. రంగనాథ రామాయణము. బాలకాండము. అవతారిక ద్వి-14-22.
(కుప్పమ భర్తయైన మల్యాల గుండ దండాధీశుడును అష్టాంగ యోగ రహస్యము లెరిగినవాడని బూదపూరు శాసనము (శకవర్షము 1161) తెలియజేయుచున్నవి. 19,20 శ్లోకముల భావము.
"అతనిని సదా రాజ్యాంగ సప్తకము, అష్టాంగ యోగములు స్థిరముగా నాశ్రయించి యుండెను: జనక చక్రవర్తియే గుండడై పుట్టెను. లేకున్న ఈ యైశ్వర్య యోగదృష్టి లెట్లలవడును." అని.

2. రంగనాథరామాయణము. అవతారిక ద్వి-26,28.

3. ఇట్టి జ్ఞానయజ్ఞ సంబంధి రూపకము యాజ్ఞికి నారాయణోపనిషత్తునందు కనబడుచున్నది.
"తస్యైవం విదుషో యజ్ఞస్యాత్మా యజమాన, శ్రద్ధా పత్నీ, శరీర మిధ్మ, మురో వేది, ర్లోమాని బర్హి ర్వేద శ్శిఖా, హృదయం యూపః, కామ ఆజ్యం, మన్యుః పశు, స్తపోగ్ని, ర్దమశ్శమయితా, దక్షిణావా. గ్హోతా ప్రాణ ఉద్గాతా చక్షు, రధ్వర్యుర్మనో, బ్రహ్మ శ్రోత్ర మగ్నీత్— (యాజ్ఞికి నారాయణోపనిషత్తు-దశమ ప్రపాఠకము-అనువాకము-64)

4. రంగనాథ రామాయణము అవతారిక ది -9-13.
"తత్త్వమస్యా"ది వాక్య-భేదాతి రూపు (అవతారిక ద్వి-13) దీనికి మూలము:
"ఐతదాత్మ్యమిదగ్ం సర్వం తత్సత్యగ్ం స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో-
సామవేదీయఛాందోగ్యోపనిషత్తు-షష్ఠప్రపాఠకము అష్టమ ఖండము-7 మంత్ర॥)

2. రంగనాథరామాయణము అవతారిక ద్వి-24,25
"ఒగి రెంటఁబెఱయక, మూటనేర్పడక-తగిలి నాల్గవ త్రోవ తత్త్వమై యుండి
ఐదింటి కాదియై ఆఱింటి గడచి-యాదికి నాదియై యమరిన దేవు."
(బాలకాండము ద్వి-24,25)

టీక:— రెండు = సుఖదుఃఖాది ద్వంద్వము
మూడు = త్రిగుణములు సత్వరజస్తమస్సులు. (ప్రకృతి)

బుద్ధ భూపతియొక్క యిన్ని యోగ్యతలను కేవలము నేతి బీరకాయ యని తలంప జాలము. ఇంతేకాక రంగనాథుడు వ్రాసినాడని యంగీకరించినపుడు బుద్ధనృపతి చోరుడు, అసత్యవాది యని యంగీకరింప వలసివచ్చును. ఆచంద్రార్కము అపకీర్తి పొందినవాడగును. "ఇంతమహోత్తమమైన కావ్యమును వ్రాయించిన కీర్తి యితనికి దక్కినది". అని కొందఱు మెచ్చుకొనుచు సమాధానపడినను అది వ్యాజస్తుతియే యగును. కావున రంగనాథ రామాయణమును బుద్ధ భూపతి వ్రాసినాడనుటయే సముచితమును, సమంజసముననగును.

వాల్మీకి రామాయణమును గ్రహించుటకు హేతువు

బుద్ధ భూపతికి పూర్వమే తెలుగు దేశమున జైన, భౌద్ధమతములు విస్తరిల్లినవి. ఇవి రెండును అవైదిక మతమలు వైదిక మత దూషణబుద్ధితో, తమ మతానుసరణముగా వ్రాసిన జైన బౌద్ధ రామాయణములు (రామకథలు) బహుళ ప్రచారము నందియుండును. కాని సీతారాముల అదర్శజీవితముతో నైక్యభావమాపాదించుకొనిన తెలుగువారికి ఆ రామాయణము అంతగా రుచింప లేదు కారణ మేమనగా—

1. "దశరథుని జ్యేష్ఠ భార్యయందు సీతారామలక్ష్మణు లుదయించిరి. పిదప రాముడు సీతను వివాహమాడెను.

(అనగా సోదరీ సోదరులు భార్యాభర్తలైరి.)

2. మొదటి భార్య మరణించిన తర్వాత దశరథుడు రెండవ వివాహము చేసికొనెను."[1]

3. "హనుమంతుడు రావణుని మిత్రుడు. ఇతడు వజ్రముఖుని కూతురగు లంకాసుందరిని శూర్పణఖ కూతురగు అనంత కుసుమను, రావణుని కూతురగు సత్యవతిని పరిణయమాడెను.

4. సుగ్రీవుని కూతురగు సుభద్రను రావణుడు వివాహమాడెను.

5. రావణ కుంభకర్ణులు మరణింపలేదు.

6. సీత అయోనిజ కాదు. ఈమె జనకునకు విదేహ వలన జనించినది.

నాలుగు = ధర్మార్థకామ మోక్షములు లేక యామ్య, గర్భ. ధూమ, అర్చిరాది మార్గములు.

ఐదు = పంచభూతములు (గాలి, నీరు, అగ్ని, ఆకాశము, భూమి)

ఆరు = అరిషడ్వర్గము (కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములు)

తాత్పర్యము :— (ద్వంద్వములకు చిక్కుబడక, త్రిగుణాత్మకమైన ప్రకృతిచేదెలియరాక, మోక్షమనెడి (అర్చిరాదియనెడి) నాల్గవ త్రోవయందు తత్త్వమై యుండి, పంచభూతముల కాదియై (కారణభూతుడై) అరిషడ్వర్గము నతిక్రమించినట్టి ఆదికాదియై యమరినవాడు భగవంతుడు)

1. దశరథజాతకము (డా. జి. నాగయ్య-దాక్షిణాత్య సాహిత్య సమీక్ష పుటలలో (8నుండి 11 వరకు) ఉద్ధృతము.

7. రాముడు ఏకపత్నీ వ్రతుడు కాడు."[1]

8. "దశరథుని భార్య మండోదరి"[2]

అనియిట్లు చెప్పెడి జైన బౌద్ధ రామాయణ కథలకును, ప్రతి పాత్రను కూడ ఆదర్శవంతముగా చిత్రించిన వాల్మీకి రామాయణ కథకును అనేక భేదములు కనిపించుచున్నవి. వైదిక మతమును పునరుద్ధరించుటకు నన్నయ భట్టారకుడు భారతమునెట్లు చేబట్టినాడో, అట్లే బుద్ధ భూవిభుడు వాల్మీకి రామాయణమును చేబట్టినాడు. అతనికి నారాయణ భట్టు తోడ్పడినట్లు ఇతనికి రంగనాథుడను వాడు తోడ్పడి యుండవచ్చును భారతము ముగ్గురు కవులచే పూర్తి అయినట్లు ఈ రంగనాథరామాయణమును ముగ్గురు కవులచే (బుద్ధ భూపతి కాచవిభుడు, పినవిట్ఠల రాజు) పూర్తి గావింపబడినది. ఇతిహాస కావ్యములైన భారత రామాయణములు తెలుగున మొదట అనువదింపబడునపుడు ఈ రీతి సామ్య ముండుట దైవ చిత్రము. కావున వైదిక ధర్మ రక్షణార్థము, బౌద్ధ, జైన, వీరశైవ మత ప్రతిభటముగా బుద్ధ నృపాలుడు ఆది కవీశ్వరుడయిన వాల్మీకి చెప్పిన తెఱగు ననుసరించి శ్రీరామ చరితమును (తెలుగులో ద్విపదచ్ఛందమునందు) వ్రాసినాడు. చిరకాలము స్థిరముగా నిలుచునట్లాకాంక్షినాడు.[3]

---

1. విమలసూరి "పఉమ చరిఅ"
(డా.జి. నాగయ్య - "దాక్షిణాత్య సాహిత్య సమీక్ష" 8 నుండి 11 వరకు గల పుటల లో ఉద్ధృతము.)

2. "మలేషియా రామాయణము" (ఇదియు దాక్షిణాత్య సాహిత్య సమీక్ష – పుట 15 లో ఉద్ధృతము)

3. నతేవా గన్నృతా కావ్యే కాచిదత్ర భవిష్యతి.
యావత్ స్థాస్యంతి గిరయ స్సరితశ్చ మహితలే।
తావద్రామాయణ కథా లోకేషు ప్రచరిష్యతి॥
—రామాయణము-బాలకాండ-సర్గ-2-శ్లో॥ 35, 36

ఎందాక కులగిరు లెందాక జలధు - లెందాక రవి చంద్రు లెందాక దిశలు
ఎందాక వేదంబు లెందాక ధరణి - యెందాక భువనంబు లేపు దీపించు
నందాక ఈ కథ యక్షరానంద - సందోహ దోహళాచారమై పరగు
రంగనాథ రామాయణము - ప్రతికాండాంత ద్విపదలు—

—o—

రంగనాథ రామాయణము - అనువాద విధానము

ఒకరు చెప్పిన దానిని మరొకరు విషయ భేదము లేకుండా మరల చెప్పుటను, ఒక భాషలోని దానిని మరొక భాషలోనికి మార్చుటను అనువాదమందురు. మొదటి దానియందు ప్రక్రియా రచనా భేదమును, రెండవ దాని యందు ప్రక్రియా రచనా భేదముతో పాటు భాషా భేదమును నుండును. గద్యమును పద్యాదుల లోనికిని, పద్యమును గద్యాదులలోనికిని మార్చుట ప్రక్రియా భేదమనబడును.

డా. శ్రీ దివాకర్ల వేంకటావధానిగారు "ఏదైన నొక గ్రంథమును నన్యభాషనుండి యనువదించునపుడు ప్రధానముగా మూడు పద్ధతుల నవలంబింపవచ్చు"[1] నని తెలిపి యున్నారు.

"1. కథానువాద పద్ధతి. 2. భావానువాదపద్ధతి. 3. పదానువాద పద్ధతి"

1. కథానువాద పద్ధతి :—

ఇది భాషాంతరీకర్త మూల గ్రంథమునందలి కథను గ్రహించి యందలి వివిధ సన్నివేశములను విడువకుండ. వివిధపాత్రలు నిర్వహించు కార్యముల నుజ్జగింపకుండ, వర్ణనాదులను, రసపోషణమును దనయిచ్చ వచ్చినట్లొనరించుచు రచన సాగించుట.

ఇందు మూలమునకును అనువాదమునకును కథా విధానమునందు మాత్రమే సన్నిహితమైన సంబంధము కనిపించును. మిగిలిన రసభావ వర్ణనాదులందు మూల కర్త యాత్మీయత కంటె ననువాద కర్త యాత్మీయతయే యధికముగా గోచరించును. అందుచే నిది నామమున ననువాదమయ్యును, స్వభావమున స్వతంత్ర గ్రంథము వలెనే కానవచ్చును.

2. భావానువాద పద్ధతి :—

ఇది భాషాంతరీ కర్త మూలమునందలి కథనే కాక భావములను గూడ సన్నిహితముగా ననుసరించుట. ఆ భావముల నుచితమైన భాషలో, సుందర శైలిలో స్పష్టముగా వ్యక్తము చేయుట యందే అనువాద కర్త నైపుణ్యము గోచరించును. ఈ పద్ధతి యందు కథాఘట్టములు కాక భావములు, లేక వానిని వెలువరించు వివిధ శ్లోకాదులు ప్రమాణముగా స్వీకరింపబడును. ఇది యంత యతి విధేయముగాని మధ్యస్థ పద్ధతి.

3. పదానువాద పద్ధతి :—

ఇది మూలము నందలి కథాభావములే కాక పదములు కూడ ప్రమాణములుగా గ్రహింపబడుట. ఇందు మూలస్థ పదములన్నియు ననుసరింపబడును. ఇది మూలమునకతి విధేయమైన పద్ధతి. ఇందు మూలమునందలి పదమునకు బదము వేయుట కంటె భాషాంతరీ కర్త స్వతంత్రత యేమియు గోచరింపదు."[2]

---

1. డా. దివాకర్ల వెంకటావధాని "నన్నయ భారతము ప్రకరణము-8 పుట-522.
2. డా. దివాకర్ల వెంకటావధాని "నన్నయ భారతము" ప్రకరణము-8 పుట-522.

ఈ విభజనము విమర్శనా సౌకర్యార్థము గావింపబడినది. అనువాద కావ్యమేదియైనను ఇతర పద్ధతుల సాంకర్యము లేకుండ ఒకే యొక అసలైన సిసలైన అనువాద పద్ధతికి చెందినదని నిరూపింప జాలము. అధిక్యతను బట్టి తదనువాద పద్ధతిని నిర్ణయించినను. ఇతర పద్ధతులును అటనట కొట్టవచ్చినట్లు కనబడుచునే యుండును.

ఈ మూడింటిలో "కర్త ప్రత్యేకతను స్వాతంత్ర్యమును దృష్టి యందిడు కొని చూచినచో మొదటి పద్ధతి విశిష్టముగా గోచరించును. ఈ పద్ధతికి మార్గ దర్శకుడు నన్నయభట్టు"1 బుద్ధ భూపతియు ఈ మార్గమునే అవలంబించెను.

రాజరాజ నరేంద్రుడు-

జననుత కృష్ణ ద్వైపా-యనముని వృష భాభిహిత మహాభారతబ

ద్ధనిరూపితార్థ మేర్పడఁ-దెనుగున రచియింపు మధిక ధీయుక్తిమెయిన్"2

అని నన్నయ భట్టారకుని కోరెను; కాని, యథామూలముగా (పదానువాదము) చేయుమని కోరలేదు. అట్లే బుద్ధ భూపతి తండ్రి విట్ఠలనాథుడును;

"భూమి కవీంద్రులు బుధులును మెచ్చ - రామాయణంబు పురాణమార్గంబు

తప్పక నాపేరఁ దగ నంధ్రభాషఁ - జెప్పి ప్రఖ్యాతంబు సేయింపుమర్థి"3

అని కుమారుని కోరెను.

"పురాణ" శబ్దమునకు ప్రాచీనమనియు నర్థము కలదుగదా! అప్పుడు ప్రాచీన మార్గమును దప్పక రామాయణమును రచించుమని తండ్రి కొడుకును గోరినట్లు ఊహింపవచ్చును. ఈ యూహ నిజమైనచో, ఆ ప్రాచీన మార్గము నన్నయచూపిన మార్గమే యగును. పూర్వకవి స్తుతిలో బుద్ధారెడ్డి నన్నయాదులను స్తుతింపక పోయినను "పురాణ మార్గ" శబ్ద ప్రయోగముచే వారిని తాను స్మరించి, స్మరింప జేసినాడు. దీని చేత, పదమునకు పదముగా, శ్లోకమునకు ద్విపదగా (పద్యముగా) యథామూలముగా రచింపుమని తండ్రి కుమారుని కోరలేదని తాత్పర్యము తేలును. బుద్ధ భూపతియు తండ్రి యాజ్ఞను శిరసావహించి——

"ఆది కవీశ్వరుడైన వాల్మీకి - యాదరంబునఁ బుణ్యులందఱు మెచ్చఁ

జెప్పిన తెలుంగున శ్రీ రామ చరిత - మొప్పఁజెప్పెద"4

నని తన యనువాద విధానమును తేట పఱచినాడు. పై ద్విపదలకు వికల్పముగా రెండు విధముల నర్థము చేయవచ్చును. 1. ఆసక్తి (మన్నన)తో పుణ్యులందఱు మెచ్చునట్లుగా వాల్మీకి చెప్పిన తెలుంగున శ్రీ రామ చరితమును వ్రాసెదను.2 వాల్మీకి దయతో వసిష్ట విశ్వామిత్రాది పుణ్యులందఱు

1. డా. దివాకర్ల వేంకటావధాని నన్నయ భారతము ప్రకరణ-8 పుట-523.
2. నన్నయ-భారతము. ఆదిపర్వము ఆశ్వాస-1 పద్య-16.
3. రంగనాథ రామాయణము. బాల. ద్వి-93, 94.
4. రంగనాథ రామాయణము బాలకాండ-ద్వి-102,103.

మెచ్చఁ జెప్పిన పద్ధతితో రామచరితమును వ్రాసెదను. ఇవి ఈ రెండర్థములు. మొదటిది యథాతథానువాదము; రెండవది "కథానువాదము. కావ్యమునందటనట ఈ రెండు విధములైన యనువాదములు గోచరించును కావున "రంగనాథరామాయణము భారతాంధ్రీకరణముఁ బోలె వాల్మీకి రామాయణమునకు స్వేచ్ఛానువాదమేకాని యథా మాతృకానువాదము మాత్రము కాదు."1 కాని నన్నయాదులు గైకొనిన స్వేచ్ఛకంటే బుద్ధ భూపతి గైకొనిన స్వేచ్ఛ అత్యంత పరాకాష్ఠ చెందినది. రసానుగుణముగ మూలమునందలి కథాంశములను పరిహరించుట, సంగ్రహించుట, విస్తరించుట, మార్చుట మాత్రమే కాక వాల్మీకి రామాయణమునందు కానరాని కథలనుగూడ కవియిందు జొప్పించినాడు.

వాల్మీకి రామాయణ మాదికావ్యము. దీని తర్వాత విరచితములైన అధ్యాత్మాదానందాది వివిధ రామాయణములును, పురాణోప పురాణములందలి రామచరితలును, దేశీయ గీతములందలి రామ కథాంశములును వాల్మీకి రామాయణమునకు వ్యాఖ్యాప్రాయములే; భిన్న భిన్న దృష్టులతో రచింపబడినవే.

మధుకరము అందుబాటులో నున్న పూవు పూవుకు తిరిగి, బొట్టుబొట్టుగా మకరందమును సేకరించి, దానిని తేనె పెరలో సమకూర్చి భాగ్యవంతుడైన భోక్తకందించునట్లు బుద్ధ భూపతియు తన కుపలబ్ధములైన పూర్వ విరచిత రామకథా గ్రంథములను పరిశీలించియు, వాల్మీకి రామాయణమునకు సంబంధించిన వివిధ ప్రతులను దెప్పించుకొని పరిశోధించి మేలైనవానినన్నింటిని సంగ్రహించియు, తన రామాయణమునందు యథాశక్తి పొందుపరచినావను యతిశయోక్తి కానేరదు. దేశీయులు మకరందము రీతి నాస్వాదించి తుష్టి పుష్టులను పొంది తరింప వలెననియే యిట్లు గావించుటలోని యతని యుద్దేశము. కావున కవికి యథావాల్మీకముగా రచింపవలెనని తలంపు లేదనుట యథార్థము. తనది అనువాదమైనను స్వతంత్ర గ్రంథమువలె భాసింపవలెననియే అతని దృఢ సంకల్పము. అందువలన అనువాద విషయమున నతడు వేసికొన్న ప్రణాళిక బృహత్తరమైనది. అది యిట్లుండును.

I. యథామూలము II. సంగ్రహము III. విస్తరణము IV. అన్యథాకరణము V. సంకలనము.

ఇట్టి బృహత్ప్రణాళికతో రామాయణ మర్మ ధర్మజ్ఞుడైన బుద్ధరాజు రంగనాథరామాయణమును రచించెను. కావున ఇది "మక్కికి మక్కి" యనువాదము కాదు; యథేష్టముగా సాగించిన స్వతంత్ర రచనమును కాదు; ఉభయ గుణశోభితమనగుట యిందలి వైశిష్ట్యము.

పైన పేర్కొనిన అనువాద పద్ధతులలో ప్రతిదానికి నిదర్శనముగా కొన్నింటిని ఇచట పేర్కొందును.

---

1. వేమూరి వెంకటరామయ్య "ఆంధ్ర సారస్వతము-రాజకవులు" పుట-51.

I. యథా మూలము:—

మూలమునందలి యర్థమునకు భంగము కాని రీతి పదమునకు పదము వేసి యనువదించుట యథామూలానువాదము.

రంగనాథ రామాయణ ద్విపదలను వాల్మీకి రామాయణ శ్లోకములతో పోల్చి పరిశీలించినపుడు కవి యటనట యీ పద్ధతి ననుసరించినట్లు విదితమగును.

సామాన్య విశేష భేదముచే రామాయణమునందలి శ్లోకములను రెండు తెఱగులుగా విభజించ వచ్చును. భావుకుని బుద్ధిబలము, పండితుని పాండిత్యబలము ననుసరించి విశేషార్థములను స్ఫురింప జేయునవి విశేష (ప్రధాన) శ్లోకములు; కేవల కథాగమనమునకు చెందినవి సామాన్యములు.

బుద్ధరాజు ప్రధానా ప్రధాన, సామాన్య విశేషములనెడి ప్రత్యేకతను పాటించక, తన వీలును దొరణిని అనుసరించి ఆయాశ్లోకములకు యథా మూలానువాదము చేసినట్లు స్ఫురించుచున్నది. ఇట్టి యనువాద ద్విపదలయందు ఒకటి రెండు పదములు, పాదములు పెరుగుటయో, తగ్గుటయో జరుగుచున్నది. దీని కతని ఔచిత్యదృష్టియు, పాదపూరణ భావమును, స్వేచ్ఛయు కారణములు. చూడుడు.

1. సుమిత్ర అడవికి పోవు తన కుమారుడైన లక్ష్మణునికి హితోపదేశమును గావించును.

"రామం దశరథం విద్ధి - మాం విద్ధి జనకాత్మజాం।
అయోధ్యామటవీం విద్ధి - గచ్ఛతాత యథాసుఖం॥"[1]

దీనియనువాదము :—

"రాముని దశరథ రాజుగాఁజూడు - భూమిజ నన్నుగాఁ బుద్ధిఁ జింతింపు
మడవి నయోధ్యగా నాత్మలోఁ దలపు - కడు భక్తి యుక్తి రాఘవు గొల్చియుండు."[2]

ఇందు చతుర్థ పాదము తప్ప తక్కినదంతయు పదానువాదమే.

2. శ్రీ రాముడు జాబాలికి చెప్పిన సమాధానము:—

"సత్యంచ ధర్మంచ పరాక్రమంచ - భూతానుకంపాం ప్రియవాదితాంచ।
ద్విజాతి దేవాతిథి పూజనంచ - పంథాన మాహు స్త్రిదివస్య సంతః॥"[3]

దీని యనువాదము :—

"సత్యంబు ధర్మంబు శమమును దమము
నిత్యభూత దయయు నీతి విక్రమము
ప్రియ వాక్యమును దేవ విప్ర పూజనము

---

1. దా. ప్రతి వాల్మీకి రామాయణము. అయోధ్యా- సర్గ-40 శ్లో-9
2. రంగనాథ రామాయణము. అయోధ్యా. ద్వి-935,936.
3. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. అయోధ్యా. సర్గ. 109 శ్లో-31.

రయమొప్ప స్వర్గ మార్గము లండ్రు బుధులు"1

ఇందు "శమమును, దమమును, నిత్య, నీతి, రయమొప్ప, అను పదములు పాదపూరణకై" చేర్చబడినవి. అతిథి పదమునకు పదము వేయబడలేదు.

3. నిష్కారణ వైరము వలదని చెప్పినపుడు రాముడు తన తత్త్వము నిట్లు వెల్లడించును.

"అప్యహం జీవితం జహ్యాం - త్వాంవా సీతే సలక్ష్మణాం।
నతు ప్రతిజ్ఞాం సంశ్రుత్య - బ్రాహ్మణేభ్యో విశేషతః॥[2]

దీని యనువాదము :—

"విడుతుఁ బ్రాణమునైన విడుతునిన్నైన - విడుతుఁ దమ్మునినైన విడువనే ప్రతిన"[3]

ఇందు మూలమునందలి చివరి పాదము (బ్రాహ్మణేభ్యో విశేషతః) సాధారణీకరణ దృష్టితో విడువబడినది.

4. మారీచుడు రావణునకు హితోపదేశము చేయును.

"ప్రసీద లంకేశ్వర రాక్షసేంద్ర - లంకాం ప్రసన్నోభవ సాధుగచ్ఛ।
త్వంస్వేషు దారేషు రమస్వ నిత్యం - రామ స్సభార్యో రమతాం వనేషు॥"[4]

దీనియనువాదము.

"..................... దానవనాథ ! నీవు (మరలి)
చనుము లంకకు సుప్రసన్నుడవగుము-గనుము సౌఖ్యము నీదుకాంతల వలన"[5]

ఇందు మూలమునందలి చివరి పాదము అనువదింపకున్నను తనంతటనె అర్థము స్ఫురించుటచే వదలబడినది.

5. మారుతి మండోదరిని గాంచి సీతయని భ్రమించి కపిత్వమును ప్రదర్శించును.

ఆస్ఫోట యామాస చుచుంబ పుచ్ఛం - ననంద చిక్రీడ జగౌ జగామ।
స్తంభా నరోహ న్నిపపాత భూమౌ - నిదర్శయన్ స్వాం ప్రకృతిం కపీనాం"[6]

దీని యనువాదము :—

"..................... ఆనంద - వివశుడై గంతులు వేయుచు, సచట
కంబముల్ ప్రాకుచుఁ, గలిత వాలాగ్ర - చుంబనం బొనరించుచును, నటించుచును

---

1. రంగనాథరామాయణము. అయోధ్యా. ద్వి-1767,1768.
2. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. ఆరణ్య. సర్గ 10 శ్లో 19.
3. రంగనాథ రామాయణము, అరణ్య. ద్వి. 144.
4. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. అరణ్య-సర్గ 31 శ్లో-49.
5. రంగనాథ రామాయణము ఆరణ్య ద్వి-702,703.
6. దా. ప్రతి వాల్మీకి రామాయణము. సుందర.-సర్గ-10 శ్లో.-54 1/2.

గాపేయ జాతి వికారముల్ గొంత - సేపిటు చూపుచు"[1]

ఇందుమూలమునందలి "ఆస్ఫోటయామాస, జగామజగామ" యనుపదములు తప్ప మిగిలిన అన్నింటికి తదర్థ బోధక పదములు వేయబడినవి ___

6. రావణ మరణానంతరము మండోదరి విలాపము :___

"పితా దానవ రాజోమే - భర్తామే రాక్షసేశ్వరః।
పుత్రోమే శక్ర నిర్జేతా - ఇత్యేవం గర్వితా భృశం॥"[2]

దీనియనువాదము :___

"మయుడు నా తండ్రి నామగడు రావణుడు - ప్రియపుత్రు డాహవ ప్రియు డింద్రజిత్తు
డని గర్వమున నుంటి"[3] ....

ఇందాహవప్రియుడనునది అధికముగా చేర్చబడిన శబ్దము. మూలము నందలి "భృశం" అనునది వదలబడినది.

7. భరతుడు భరద్వాజునకు తన తల్లిని పరిచయము చేయును.

"యస్యాఃకృతే నరవ్యాఘ్రౌ - జీవనాశమితో గతౌ।
రాజపుత్ర విహీనశ్చ - స్వర్గం దశరథో గతః॥
మమైతాం మాతరం విద్ధి - నృశంసాం పాప నిశ్చయాం।
యతోమూలం హి పశ్యామి వ్యసనం మహదాత్మనః॥[4]

దీని యనువాదము :___

"ఏ తల్లికై కాన కేగె మాయన్న - ఏ తల్లి కతమున నీల్గె మాతండ్రి
యే తల్లి కోర్కె నన్నింతకుఁ దెచ్చె - నాతల్లి మా తల్లి హత పుణ్య పాక॥[5]

ఇది పదాను వాదము గాక మూల విషయ మే మాత్రము లోపింపని భావానువాదము.

ఇట్లనేక శ్లోకములను, తదనువాద ద్విపదలను యథామూలానువాదమునకై యుదాహరింప వచ్చును.

II. సంగ్రహము (కుదింపు)

వాల్మీకి రామాయణముతో రంగనాథ రామాయణమును పోల్చి పరిశీలించి చూచినపుడు మూలము నందలి కొన్ని విషయములు కుదింపబడినట్లు కనబడును. తత్సంగ్రహమునకు ఈ క్రిందివి కారణములు కావచ్చును.

---

1. రంగనాథ రామాయణము. సుందర-ద్వి-141 - 143.
2. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. యుద్ధ. సర్గ 114 శ్లో. 40.
3. రంగనాథ రామాయణము. యుద్ధ. ద్వి-7937, 7938.
4. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. అయోధ్యా. సర్గ 92 శ్లో. 24 1/2, 26 1/2.
5. రంగనాథ రామాయణము. అయోధ్యా. ద్వి-1571, 1572.

1. ప్రధాన కథతో ఎక్కువ సంబంధము లేకపోవుట.
2. దీర్ఘ దీర్ఘ సంభాషణములు.
3. పునరుక్తులు.
4. కథాగతికి ఎక్కువగా భంగము కలిగించెడి భాగములు.
5. ఏక పాఠగతములు.
6. కథా దృష్టి.

ఇవియేకాక కొన్ని తాననుసరించెడి ప్రతిలోను లేక పోవచ్చును.

ప్రస్తుతము లభ్యమానమగుచున్న ముద్రిత త్రివిధ ప్రతుల పాఠములను దృష్టిలో పెట్టుకొని చూడగా అయోధ్యారణ్య కిష్కింధా సుందర కాండములు అధికముగా సంగ్రహింప బడినట్లు తెలియును. వానిలో ప్రధానమైన వాని నిట పేర్కొందును. అన్నింటిని చెప్పకుండుటకు కారణము గ్రంథ విస్తర భీతియే.

1. ప్రధాన కథతో అధికముగా సంబంధములేనివి.

(ఎ) సోమదా వృత్తాంతము.[1]

సోమదయను గంధర్వియోర్తు చూళియను మునీంద్రునికి శుశ్రూషయొసర్చి ప్రీతుడైన ముని యనుగ్రహము వలన బ్రహ్మతేజస్వియైన బ్రహ్మదత్తాఖ్య మానస పుత్రుని బడయును.-

రంగనాథ రామాయణమునందు "చూళియను మునీంద్రునకుఁ దనుజన్ముడగు గుణోత్తరు బ్రహ్మదత్తు", అని చెప్పబడినది; సోమదా వృత్తాంతము వదిలి వేయబడినది.

(బి) కూర్మావతార వర్ణనము :—

"దేవదానవులు సముద్రమును మథించు చుండగా, మందర పర్వతము పాతాళమును ప్రవేశించెను. దేవ గంధర్వాదులు మధుసూదనుని స్తుతించిరి. హృషీకేశుడు కూర్మ రూపమును దాల్చి పర్వతమును వీపుపై ధరించి సముద్రమున శయనించెను. కేశవుడు దేవతల ముందు నిలిచి పర్వతాగ్రమును చేతఁబట్టి మథించెను."[3] అను వృత్తాంతము వదలి వేయబడినది.

(సి) కామధేను వృత్తాంతము :—

"దివి యందలి కామధేను వొకప్పుడు నేలమీద దున్నుచు బాధపడు వృషభములను జూచి పుత్రశోకమున విలపించెను దాని కన్నీటి బిందువులు క్రిందనుండి పోవుచున్న శక్రుని శరీరము పై బడెను. అతడు సురభిని సమీపించి దుఃఖ కారణ మడిగెను. ఆది కర్షకునిచే హింసింప బడు వృషభ

---

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. బాల. సర్గ-33 శ్లో. 11-19.
2. రంగనాథరామాయణము. ఆం.వి.క.ప. పాఠము అను ౭.

పుట 686-687లలో ఈ కథకు చెందిన 28 ద్విపదలు కలవు. కాని మూల పాఠమునందు కానరావు. ఈ కథ భాస్కర రామాయణము నందు బాల-పద్య 330-332 లలో నున్నది.

3. దా. ప్రతి వాల్మీకి రామాయణము. బాల-సర్గ-45 శ్లో. 27, 32.

ములను చూపి పుత్ర సమమయిన ప్రియ వస్తువు లేదని దుఃఖితు రాల నయితి ననెను. ఇంద్రుడు దాని నామోదించెను."[1]

(భరతుడీయితిహాసమును కైకకు దెలిపి బహుపుత్రయైన సురభియే పుత్ర దుఃఖమును సహింపలేదనిన ఏకపుత్ర కౌసల్య యెట్లు రాముని విడిచి యుండగలదని వాపోయెను.) మూలము నందలి ఈ కామధేను వృత్తాంతము రంగనాథరామాయణమునందు విడువబడినది.

(డి) సర్వభూత సృష్టి క్రమము :—

జటాయువు శ్రీ రామునకు సర్వభూత సృష్టిక్రమమును తన వంశమును చెప్పుటకు పూర్వ రంగముగా వివరించెను.

"పూర్వము కర్దముడు, విక్రీతుడు, శేషుడు, సంశ్రయుడు, బహుపుత్రుడు, స్థాణువు, మరీచి, అత్రి, క్రతువు, మహాబలుడు, పులస్త్యుడు, అంగిరసుడు, ప్రచేతసుడు, పులహుడు, దక్షుడు, వివస్వంతుడు, అరిష్టనేమి, కశ్యపుడు అనువారు ప్రజాపతులు. అందు దక్ష ప్రజాపతికి 60 మంది కుమార్తెలు. వారిలో అదితి, దితి, దనువు, కాళిక, తామ్ర, క్రోధ, వశ, మనువు, అనలా యనువారు, కశ్యపుని పెండ్లి యాడిరి. అదితికి ఆదిత్యులు, వసువులు, రుద్రులు, అశ్వినులును; దితికి దైత్యులును దనువునకు అశ్వగ్రీవుడును; కాళికకు నరక కాలకులును; తామ్రకు క్రౌంచి, భాసి, శ్యేని, ధృతరాష్ట్రి శుకి యను కూతులును జనించిరి. క్రౌంచికి ఉలూకములు, భాసికి భాసములు, శ్యేనములు, గృధ్రములును, ధృతరాష్ట్రికి హంసలు చక్రవాకములును, శుకికి నతయు, నతకు వినతయు ఉద్భవించినవి. క్రోధవశకు మృగి, మృగమంద, హరి, భద్రమద, మాతంగి, శార్దూలి, శ్వేత, సురభి, సురస, కద్రువలు ఉదయించిరి. మృగి మృగములను, మృగమంద ఋక్షములను, సృమరములను, చమరములను; హరి వానరములను, భద్రమద ఇరావతియను కన్యకను, మాతంగి మాతంగములను శార్దూలి వ్యాఘ్ర గోలాంగూలములను, శ్వేత దిగ్గజములను, సురస రోహిణి, గంధర్వి యను కన్యలను జనింప జేసెను. రోహిణికి గోవులు, గంధర్వికి గుఱ్ఱములు, సురసకు నాగులు, కద్రువకు పన్నగములు, మనువుకు మనుష్యులు, అనలకు వృక్షములు జనించినవి. వినతకు అరుణుడు, గరుడుడు అను కుమారులు, అరుణునికి సంపాతి, జటాయువు అను తనయులు కలిగిరి. కావున జటాయువు శ్యేని వంశమునకు చెందినవాడు."[2]

ఇంత దీర్ఘముగా చెప్పిన సర్వభూత సృష్టి క్రమము ఈ ద్విపద రామాయణమునందు గ్రహింప బడలేదు. కాని భాస్కర రామాయణమునందు మూడు పద్య గద్యములలో అనువదింప బడినది.[3]

---

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. అయోధ్యా. సర్గ 74 శ్లో. 15-29.
2. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. అరణ్యా. సర్గ 14 శ్లో. 6-32.
3. భాస్కర రామాయణము. అరణ్య. ఆశ్వాసము-1 పద్య-108-111.

(ఇ) దండకారణ్య వృత్తాంతము :—

"దండునిచే పాలింపబడి శుక్ర శాపదగ్ధమై, నిర్మానుష్యమైన యా యడవి అగస్త్యుని రాకచే సస్యశ్యామలమయ్యె"[1] నను వృత్తాంతము వదలబడినది.

2. దీర్ఘ దీర్ఘ సంభాషణములు :—

మూలమునందలి యిట్టి సంభాషణములలో కొన్నివి పూర్తిగా పరిత్యజింప బడినవి; మరికొన్ని ఒకటి రెండు ద్విపదలచే సంగ్రహింపబడినవి.

(ఎ) ఈ క్రిందివి పూర్తిగా పరిత్యజింపబడిన సంభాషణములు :—

(i) రావణ వధోపాయము :—

"విష్ణువు దేవతలను రావణ వధోపాయ మడుగును. వారు బ్రహ్మ వరమును ప్రస్తావించి మానుష తనువుతో రావణుని కడతేర్పుమందురు."[2]

(ii) రామ గుణ ప్రశంస :—

కైకేయి రాముని గుణగణములను మంథరకు తెల్పును; మంథర తిరిగి దుర్బోధ చేయును,"[3]

(iii) దైవ పౌరుషములు :—

"రాముడు దైవబలము గొప్పదిగా వాదించును. లక్ష్మణుడు దైవము కంటె పౌరుషము గొప్ప దని, దైవమును పౌరుషముచే తొలగింతునని వాదించును."[4]

(iv) దశరథ కైక సంభాషణము :—

"దశరథుడు సుమంత్రునితో ధనధాన్య సైన్యాదులు సర్వస్వము రాముని వెంబడించగా, భరతుడు తచ్ఛూన్యమైన అయోధ్యను పాలించు"ననును. కైక కోపించి "అట్టిది భరతున కవసరము లేదనును."[5]

(v) వీడ్కోలు :—

"శ్రీరాముడు కోసల దేశమునకు వీడ్కోలు చేయును. గంగానది సుందర దృశ్యమునకు ముగ్ధుడగును."[6]

---

1. ప. ఉ. ప్రతి. రామాయణము. ఆరణ్య-సర్గ 17 శ్లో. 15-21.
2. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. బాల-సర్గ 16 శ్లో. 1-8.
3. ,, ibid ,, అయోధ్యా. సర్గ 8 శ్లో. 13-19.
4. ,, ibid ,, అయోధ్యా సర్గలు 22,23 శ్లో. (30 + 41) మొత్తము 70 రంగనాథ రామాయణము ఆంధ్ర వి.క.ప. ప్రతి. అనుబంధము 2 పుట-696లో ఈ సంభాషణకు చెందిన ద్విపదలు కొన్ని గలవు.)
5. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. అయోధ్యా-సర్గ. 36 శ్లో, 1-14,
6. ,, ibid ,, ,, సర్గ 50 శ్లో 1-29.

(vi) కౌసల్యాశ్వాసనము :—

"కౌసల్య సుమంత్రునితోని క్షణ కాలమును బ్రతుకను, తనను గూడ రాముని యొద్దకు గొని పొమ్మని కోరుచు అతిగా విలపించును. సుమంత్రుడు సీతారాముల కెట్టి కష్టము లేదని చెప్పి యోదార్చును."[1]

vii. కౌసల్యా విలాపము :—

కౌసల్య భర్తను దూషించుచు రామునికై విలపించును."[2]

viii. భరత విలాపము :—

"దశరథ మరణమునకు భరతుడు పరిపరి విధముల దుఃఖించును. వసిష్ఠుడు సాంత్వన పరచును."[3]

ix. కౌసల్యాదుల విలాపము :—

"కౌసల్యాదులు మందాకినీ తీరమున పితృర్థముగా రామ దత్తమైన గారపిండి పిండములను గాంచి, రామ లక్ష్మణ దశరథులను దలంచుకొని విలపింతురు."[4]

x. పితృ ప్రాధాన్యము :—

"వసిష్ఠుడు గురు ప్రాధాన్యమునుగ్గడించి తన మాటను గురు వచనముగా స్వీకరింపుమని రాముని హెచ్చరించును. రాముడు పితృ ప్రాధాన్యమును తేటపఱచి గురు వాక్యముకంటె పితృ వాక్యము గురుతరము; అవశ్య కర్తవ్యమని పలుకును.[5]

xi. మారీచ హితబోధ :—

"సీతాపహరణమున సహకరింపుమని అర్థించిన రావణునకు మారీచుడు రామగుణ పరాక్రమాదుల నుగ్గడించి, సీతాపహరణమున కలుగు నష్టములను వివరించును."[6]

xii. సుగ్రీవ పశ్చాత్తాపము :—

"వాలి మరణానంతరము తారావిలాపాదులను జూచి, సుగ్రీవుడు పశ్చాత్తప్తుడై రామునిజేరి పరిపరి విధముల శోకించును."[7]

xiii. అయోధ్యా నగర స్త్రీల విలాపము :—

"తమసా నదినుండి మరలి వచ్చిన భర్తలను గాంచి, వారి కాంతలు సీతారాములు తమ్ము విడిచిపోవుటకు పరిపరి విధముల విలపింతురు."[8]

---

1 దా. ప్రతి వాల్మీకి రామాయణము అయోధ్యా. సర్గ. 60 శ్లో.లు 23.
2. ,, ibid ,, అయోధ్యా. సర్గ. 61 శ్లో.లు 27.
3. ,, ibid ,, అయోధ్యా సర్గ. 84 శ్లో.లు 24.
4. ,, ibid ,, అయోధ్యా. సర్గ. 103 శ్లో.లు 2-16.
5. ,, ibid ,, అయోధ్యా. సర్గ. 111 శ్లో.లు 32.
6. దా. ప్రతి వాల్మీకి రామాయణము అరణ్య. సర్గ. 37 శ్లో.లు 25.
7. ,, ibid ,, కిష్కింధా. సర్గ. 24 శ్లో.లు 1-23.
8. ,, ibid ,, అయోధ్యా. సర్గ. 48 శ్లో.లు 6-32.

xiv. కర్తవ్య జ్ఞాపనము :—

లక్ష్మణుడు శ్రీరామునితో "నీవు దశరథ తపఃఫలమున జనించితివి; అల్పుని వలె దుఃఖమును సహింపక జగదున్మూలన మొనర్చుటకై కోపించుట తగదు; యయాతి వసిష్ఠాదులును పూర్వము దుర్దశ నొందినవారె. నీకు బోధింప నెంతటి వాడను; సర్వ వినాశకరమైన క్రియను మాని శత్రువును గుర్తించి సంహరింపుమని పలికి కర్తవ్యమును జ్ఞప్తికి దెచ్చును."[1]

xv. సీతా సాంత్వనము :—

"సీత మారుతిని తన దుఃఖమును తొలగింపుమని కోరును. అతడట్లే ప్రతిజ్ఞ చేయును. రామ లక్ష్మణులు సముద్రమును దాటి యెట్లు వత్తురని సీత పరితపించును. తన భుజములపై రామ లక్ష్మణులు వానరులతో గూడ వచ్చి రావణుని చంపి నిన్ను తీసుకొని పోగలరని పల్కును."[2]

xvi. తారా సాంత్వనము :—

"శ్రీరాముడు తార నోదార్చుచు హితోపదేశము చేయును."[3]

xvii. శ్రీరాముని విరహ వేదనము :—

"శ్రీరాముడు సుగ్రీవాదులతో సముద్రమును చేరిన పిదప సీతను దలంచి విలపించును."[4]

బి. ఈ క్రిందివి ఒకటి రెండు ద్విపదలచే సంగ్రహింపబడినవి.

1) కౌసల్యా విలాపము :—

"రాముని అరణ్యా వాసమును దలంచుచు పరిపరి విధముల శోకించిన కౌసల్యా విలాపము,"[5]

"కౌసల్యయును నంతకంటె శోకింప"[6]

అని సగము ద్విపదచే సూచింపబడినది.

2) కౌసల్యా సాంత్వనము :—

"సుమిత్రాదేవి కౌసల్యానాయారీతుల నోదార్చిన రీతి"[7]

"ఆ సుమిత్రాదేవి యడలార్పుచుండె"[8]

అని సంగ్రహింప బడినది.

3) "లక్ష్మణుడు కౌసల్యా సుమిత్రాదులు తమకై దుఃఖించు తీరును తలపోసి గుహునకు

---

1. దా. ప్రతి వాల్మీకి రామాయణము. అరణ్య. సర్గ. 66 శ్లో.లు 20.
2 ,, ibid ,, సుందర సర్గ, 39 శ్లో.లు 54.
3. ibid ,, కిష్కింధా. సర్గ. 25 శ్లో 1-11.
4. ,, ibid ,, యుద్ధ. సర్గ. 5 శ్లో 4-21.
5. ,, ibid ,, అయోధ్యా సర్గ 48 శ్లోలు 21.
6. రంగనాథ రామాయణము. అయోధ్యా. ద్వి-1001.
7. దా. ప్రతి. వాల్మీకి రామాయణము అయోధ్యా. సర్గ. 44 శ్లో 1-31.
8. రంగనాథ రామాయణము. అయోధ్యా. ద్వి. 1001.

చెప్పుచు విలపించును."[1]

ఇది

"ఆ రామసీత లత్యంత దుఃఖములఁ - గూరెడు తెరగెల్ల గుహునకుఁ జెప్పి
అడరి కౌసల్యయు నా సుమిత్రయును - బడియెడు శోకంబు పలుమాఱు చెప్పి
సొఱిది నిద్దఱు గూడి శోకించుచుండ"[2]

అని కుదింప బడినది.

4) గుహ భాషణము :—

గుహుడు "సీతారాముల భూశయనాదులను గూర్చి సౌమిత్రి దుఃఖించుట, అతనికి తనకు నైన సంభాషణము, సూర్యోదయానంతరము వారు జడలను దాల్చి భాగీరథిని దాటి పోవుట" యను విషయమును భరతునికి వివరించును.[3]

"గుహుని భాషణమును విని భరతుడు మూర్ఛిల్లును. శత్రుఘ్నుడు రోదించును, కౌసల్యాదులు భరతుని సాంత్వన పరతురు. భరతుని కోరికపై గుహుడు శ్రీ రాముని రాత్రి చర్యలను నివేదించును." [4]

ఈ రెండు సర్గల విషయమంతయు

"…. …. …. …. …. …. కొనిపోయి గుహుడు కాకుత్స్థుండు తొల్లి
విడిసిన చోటనే విడియించి ప్రీతి - జడలు గట్టినచోటు చని యటు చూప"

అని సంగ్రహింపబడినది.

5) భరత విలాపము :—

"భరతుడు రాముడు నిద్రించిన తృణశయ్యాదులను, వికీర్ణములైన సీతా భరణములనుండి జారిపడిన కనక బిందువులను, పొరలునపుడు చిక్కుకొని తెగియున్న పట్టు వస్త్ర తంతువులను, ఇంగుదీ మూలమును గాంచి యా యా విషయములను తల్లులకు చెప్పుచు ఆక్రోశించును."[6]

ఇది

…. … … … కనుగొని భరతుండు కడుశోక మంది
సీత రాముండును జేరి పరుండ - నాతత తృణశయ్యలందు గన్పడెడు
తరుచైన కనక వస్త్ర చిహ్నములు - పొరిఁగనుగొని మది పురపురఁబొక్కి"[7]

యని సంగ్రహింపబడినది:—

1. దా. ప్రతి వాల్మీకి రామాయణము. అయోధ్యా. సర్గ. 51 శ్లో.లు 27.
2. రంగనాథ రామాయణము. అయోధ్యా. ద్వి-1065-1067.
3. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. అయోధ్యా. సర్గ. 86 శ్లో.లు 25.
4. ,, ibid ,, అయోధ్యా సర్గ 87 శ్లో.లు 23.
5. రంగనాథరామాయణము. అయోధ్యా. ద్వి-1517,1518.
6. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. అయోధ్యా. సర్గ. 88 శ్లో.లు 30.
7. రంగనాథ రామాయణము. అయోధ్యా. ద్వి-1519-1521.

6) లక్ష్మణాగస్త్య శిష్యాదుల సంభాషణము :—

లక్ష్మణుడు అగస్త్య శిష్యునకు తమ రాకను దెల్పును. అతడగస్త్యునకు విన్నవించి, తదను మతిని సౌమిత్రికి దెల్పును.[1]

ఇది

....అందొక్క

మునిచేతఁ దమరాక మున్నెఱిగించి - చని వొచ్చి"[2] యని సంక్షిప్త పరచబడినది.

7) ఖర శూర్పణఖా సంభాషణము :—

"పునరాగమన కారణమడిగిన ఖరునకు శూర్పణఖ చతుర్దశ రాక్షస వధను దెలిపి రాముని చంపుమని ప్రోత్సహించును"[3] ఇది

"ఖరునకు లోక భీకరునకు వారి - మరణంబు రఘురాము మహిత రణంబు

నుగ్గడించుటయు"[4] అని సంగ్రహింపబడినది.

8) లక్ష్మణ కోపశాంతి :—

"సుగ్రీవుడు లక్ష్మణుని కోప శాంతికై మొదట తారను పంపగా; నామె వచ్చి అతనిని కోపకారణ మడుగును. లక్ష్మణుడు సుగ్రీవుని ప్రమత్తతను వెల్లడించును. తారఅతని పక్షమున క్షమాపణగోరి కోప శాంతికర వాక్కులచే లక్ష్మణుని శాంతపరచి, సుగ్రీవ ప్రయత్నమును వివరించి అతనిని లోనికి తోడ్కొని పోవును."[5]

ఇది

"ఆరాక విని యొంటినపుడు దా రాక - తారాసమేతుడై తడయక వచ్చి"[6]

అని కుదింప బడినది.

9) ప్రియోక్తులు :—

"రాక్షస వనితలు రావణుని అభిజనైశ్వర్య పరాక్రమాదుల నుగ్గడించి అతని మాట నంగీ కరింపుమని ప్రియోక్తులు పలుకుదురు."[7] ఇది పూర్తిగా వదలబడినది.

10) రాక్షస వనితల విలాపము :—

రావణ మరణానంతరము అతని స్త్రీలు వివిధములుగా విలపింతురు.[8]

---

1. దా. ప్రతి వాల్మీకి రామాయణము ఆరణ్య. సర్గ. 12 శ్లో 1-15.
2. రంగనాథ రామాయణము. ఆరణ్య ద్వి- 207, 209.
3. దా. ప్రతి వాల్మీకి రామాయణము. ఆరణ్య. సర్గ. 21 శ్లో.లు 22.
4. రంగనాథ రామాయణము. ఆరణ్య. ద్వి-479, 480,
5. దా ప్రతి వాల్మీకి రామాయణము. కిష్కింధా సర్గ 33 శ్లో.లు 30-62.
6. రంగనాథ రామాయణము. కిష్కింధా ద్వి. 831.
7. దా. ప్రతి వాల్మీకి రామాయణము. సుందర. సర్గ. 23 శ్లో.లు 21.
8. ,, ibid ,, యుద్ధ. సర్గ. 113 శ్లో.లు 8-27.

ఇది

"కని యంతశోకాబ్ధి కరడులందేలి - దన జేశు పైఁ బడి దానవాంగనలు

పనవ"3

అని యొక్క ద్విపదతో సంగ్రహింపబడినది.

(3) పునరుక్తులు :—

ఒకచోట చెప్పిన వృత్తము మరొక చోట మరొకసారి యదే గ్రంథమున చెప్పుట పునరుక్తి. కథయందు జరిగిన ఘటనలను ఎటనైన ఒక్కొక్కప్పుడు సందర్భము ననుసరించి పునరుక్తము చేయ వలసి వచ్చును. అవి దీర్ఘములైనచో పాఠకులకు విన్నదే విన్నట్లయి విసుగు కొల్పును. కవి ఔచిత్యమును పాటించి అట్టి చోటులందు ముఖ్యాంశములను మాత్రము గ్రహించును, లేదా సూచించును, అనవసరమని భావించినచో వాన్నిని పూర్తిగా విడచి వేయును.

ఈ పద్ధతుల నవలంబించి బుద్ధారెడ్డి రామాయణములోని ఆయా పునరుక్తాంశములను సంగ్ర హించి యున్నాడు.

(ఎ) మూలమునందు అయోధ్యా కాండము సర్గ. 14 లో "సుమంత్రుడు వసిష్ఠాదేశమున కైక గృహమునకు వచ్చి దశరథుని ప్రబోధించి (మేల్కొలుపు పాడి) కైకేయి యాదేశమున శ్రీరాముని పిలిచికొని వచ్చుటకు బయలుదేరును.

మరల సర్గ 15లో "రామానయనార్థము రామ మందిరమునకు పోవు సూతుడు సభాసదుల పౌరుల వచనములను విని కైకేయి మందిరమును ప్రవేశించి, రాజునకు మేల్కొలుపు పాడి దశ రథాజ్ఞచే రాముని తీసుకొని వచ్చుటకై బయలు దేరును."

పునరుక్తమువలె భాసించు ఈ 15 వ సర్గ వృత్తము రంగనాథ రామాయణమునందు పూర్తిగా పరిత్యక్తమైనది.

(బి) అయోధ్యాకాండము సర్గ 79లో రాజకర్తలు భరతునియొద్దకు వచ్చి రాజ్యమునకు పట్టము గట్టుకొని, అనాయకము గాకుండ రక్షింపుమని కోరుదురు, భరతుడు సమ్మతింపక, "రాముని తెచ్చి పట్టము గట్టుదును. మార్గములను చక్కబరచుడని" హెచ్చరించును. వారు సంతసించి పోవుదురు. అయోధ్యాకాండము సర్గ 82లో వసిష్ఠుడు భరతుని పట్టము గట్టుకొమ్మని పలుకును. భరతుడు రాజకర్తల కిచ్చిన సమాధానమునే మరల వసిష్ఠుని కొసంగును.

ఇచ్చట 82 వ సర్గ 79వ సర్గకు దాదాపు పునరుక్తము వలె భాసించును. కావున ఈ రెండు సర్గల వృత్తాంతమును సంక్షిప్త పఱచి వసిష్ఠునిచే ఒకచేసారి సభలో పట్టాభిషేక విషయ మును ప్రస్తావింపఁ జేసినాడు; అనగా 79 వ సర్గను వదలినాడు.

(సి) బాలకాండము సర్గ 70లో శ్రీరామ కళ్యాణ సందర్భమున వసిష్ఠుడు సూర్యవంశ రాజ క్రమమును జనకమహారాజు నెదుట వివరించును.

1. రంగనాథ రామాయణము. యుద్ధ. ద్వి-7898,7899.

అయోధ్యాకాండము సర్గ 110లో - వసిష్ఠుడు "లోక సముత్పత్తిని, సూర్యవంశ రాజ క్రమమును ప్రస్తావించి, ఇక్ష్వాకు రాజులలో అగ్రజుడుండగా అనుజుడు రాజగుట లేద"ని రామునితో పలుకును.

రెండవసారి వసిష్ఠుడు చెప్పిన సూర్యవంశ రాజక్రమము దాదాపు మొదటి దానికి పునరుక్తమగుటచే రంగనాథ రామాయణమునందు

"అంత వసిష్ఠ సంయమి సూర్యవంశ - మంతయు నిక్ష్వాకు దాదిగా నెన్ని"[1]

అని ఒక్క ద్విపదలో సంగ్రహింపబడినది.

(డి) వాతాపి వృత్తాంతము :—

అరణ్యకాండము సర్గ 11 లో (శ్లో-56-68) రాముడు అగస్త్య మాహత్మ్యమును వివరించుచు అతడు వాతాపిని సంహరించిన విధమును చెప్పెను. అరణ్య కాండము సర్గ 43 (శ్లో 40-45) లో మరల ఈ వాతాపి వృత్తాంతము రాముని చేత "మాయామృగమైనచో చంప దగినదనుటకు నిదర్శనముగా" చెప్పబడినది.

రంగనాథ రామాయణమునందు పునరుక్త భావనచే రెండవసారి చెప్పబడలేదు.

(ఇ) మాయావి (దుందుభి) వృత్తాంతము :—

కిష్కింధా కాండము సర్గ 9 లో సుగ్రీవుడు వాలి వైర కారణమును చెప్పుటకుగా "మాయావి వృత్తాంతమును శ్రీరామునకు తెలిపెను. మరల కిష్కింధా కాండము సర్గ 43 లో శ్రీరాముడు "ఈ ప్రదేశములన్నియు నెప్పుడు చూచితివని" ప్రశ్నింపగా, నతడు దుందుభి వృత్తాంతమును చెప్పి, వాలి తనను తరుమగా నాల్గుదిక్కులకు పరుగెత్తి పరుగెత్తి చివరకు హనుమంతుడు జ్ఞాపకము చేయగా, నీ ఋష్యమూకమునకు వచ్చి నిలిచితినను.

రంగనాథ రామాయణమునందు రెండవసారి "మాయావి" వృత్తాంతము చెప్పబడక

……… వాలికి నాడేను వెఱచి - వేవేగ యతడు నా వెనువెంట దగుల"[2]

అని సంగ్రహింప బడినది. ఈ సంగ్రహమునకు పునరుక్తమే కారణము.

(ఎఫ్) ఆంజనేయ బాల్య విక్రమము :—

కిష్కింధా కాండము సర్గ 66 (శ్లో.21-30)లో బాలాంజనేయుడు ఉదయించు సూర్యుని గాంచి ఫల భ్రాంతి ఆకాశమున కెగయును, వజ్రి వజ్రాయుధమున తాడించును ఆ దెబ్బతో నతడు కొండపై పడగా, దౌడ పగులును. వాయువు కోపించి స్తంభించును. త్రైలోక్యము సంక్షుభిత మగును. అప్పుడు బ్రహ్మాదులు వచ్చి వరము లొసంగుదురు. నాటినుండి అతనికి హనుమంతుడని ప్రసిద్ధ నామ మేర్పడినది. ఇది జాంబవంతునిచే సముద్ర లంఘనార్థము హనుమ త్ప్రోత్సాహన సందర్భమున జెప్పబడినది.

---

1. రంగనాథ రామాయణము. అయోధ్యా. ద్వి-1774.
2. రంగనాథ రామాయణము. కిష్కింధా కాండము, ద్వి-1000.

యుద్ధకాండము సర్గ. 28 (శ్లో 12-17) లలో శుకుడు రావణునితో వానర వీరులను గూర్చి చెప్పుచు హనుమంతుని గురించి చెప్పునపుడు ఈ వృత్తాంతమును ప్రస్తావించెను.

ఇట్లు రెండుచోట్ల ఒకే విషయము వర్ణింప బడినది. కావున రంగనాథ రామాయణమునందు కిష్కింధా కాండ కథస్థ వృత్తాంతము విడువ బడినది. యుద్ధ కాండములోనిది గ్రహింపబడినది.

జాంబవంతుడు చెప్పుటకంటె, చారుడైన శుకుని నోట రావణుని యెదుట ఆంజనేయుని పరాక్రమమును చెప్పించుట సముచితమని కవి భావించి యుండును.

(జి) కాకాసుర వృత్తాంతము :—

సుందర కాండము సర్గ 38,39 లలో సీతాదేవి అభిజ్ఞానముగా మారుతికి ఈ కాకాసుర వృత్తాంతమును దెలిపినది.

మరల సుందరకాండము సర్గ, 67,68 లలో మారుతి శ్రీ రామునకు సీతా సందేశమును వినిపించుచు, అభిజ్ఞానముగా నామె చెప్పిన కాకాసుర వృత్తాంతమును పునరుక్తము చేసెను. ఇది రంగనాథ రామాయణమునందు,

.... మీదేవి

తను చిత్రకూటాద్రిఁ దగనొక్క కాకి - చెనకుటయును"[1] అని సంగ్రహింపబడినది.

ఇట్లు రెండు పర్యాయములువచ్చిన వానిని ఒకసారి చెప్పి సంగ్రహించుటయే కాక, జరిగిన కథా ఘటనలను తరువాత నెటనైన ప్రస్తావింప నావశ్యకత ఏర్పడినపుడు కవి వీలును బట్టి వానిని గూడ సంక్షిప్త పరచి యున్నాడు; కొన్నింటిని వదలి యున్నాడు కూడ.

1. భరత విలాపము :—

"దశరథ మరణానంతర ద్వాదశ దిన శ్రాద్ధ కర్మలన్నియు పూర్తియైన తర్వాత 13వ నాడు భరత శత్రుఘ్నులు విలపింపగా వసిష్ఠుడు వారినోదార్చును."[2] ఇది రంగనాథరామాయణమునందు పరిత్యక్తము.

2. సీతా భర్త్సనము :—

"రావణుడు జటాయువును హతమార్చి ఆకాశ మార్గమున సీతను గొని పోవుచుండగా, ఆమె శ్రీరామ బల పరాక్రమాదుల నుగ్గడించి, రావణుని దూషించును."[3]

రంగనాథ రామాయణమున నిది విడువ బడినది. మాటి మాటికి భూషణ దూషణాదు లెందు కని కవి యభిప్రాయము కావచ్చును.

3. సీతా వృత్తాంత కథనము :—

---

1. రంగనాథ రామాయణము. సుందరకాండము. ద్వి-1139, 1140.
2. దా ప్రతి వాల్మీకి రామాయణము. అయోధ్యా. సర్గ 77 శ్లో.లు 26.
3. ,, ibid ,, ఆరణ్య. సర్గ. 53 శ్లో.లు 27.

మారుతి జాంబవదాదులకు "తాను సీతనోదార్చిన విధమును"[1] వెల్లడించును, ఇది రామునితో చెప్పుట సముచితము కాని, వానరులతో చెప్పిన యంత ప్రయోజనకారి కాదని కవి తలంపు కావచ్చును. కావున రంగనాథ రామాయణమున వదలి వేయబడినది.

4. శార్దూల చారత్వము :—

రావణుడు శుకసారణుల తర్వాత శార్దూలుని పిలిచి రామాదుల వృత్తాంత మరయ పంపెను. అతడు పోయి విభీషణునిచే పట్టుబడి, రామునిచే విడువబడి, తిరిగి వచ్చి దానవనాథునకు తాను చూచివచ్చిన సంగతులను వానర యూథపతుల బలాబలములను వివరించెను. రావణుడతనిని భర్త్సించి పంపి వేసెను.[2]

శుకుని, శుక సారణులను పంపి, విషయము తెలిసికొనిన తరువాత మరల శార్దూలాదులను పంపుట అనవసరము. విషయము పునరుక్తమని తలంచి బుద్ధారెడ్డి ఈ శార్దూల గూఢచారత్వ విషయమును వదలి యున్నాడు.

5) అంగద కథనము :—

అంగదుడు సంపాతికి ఆత్మవృత్తాంత కథన పూర్వకముగా జటాయు మరణ వృత్తాంతమును వివరించును."[3]

ఇది

.... వాలి - సుతుచేత నంతయుఁ జొప్పడఁదెలిసి"[4]

అని సంగ్రహింప బడినది.

5) మారుతి కథనము :—

ఆంజనేయుడు "సముద్ర లంఘనము మొదలు లంకలో వెదకి, సీతను జూచి, మాటాడి, తోట విఱిచి, రక్కసులఁ జంపి, రావణుని పల్కరించి, లంకఁ గాల్చి తిరిగి వచ్చిన వృత్తాంతమంతయు అంగదాదులకు వివరించును."[5] ఇది ఐదు ద్విపదలలో ఈ క్రింది రీతి సంగ్రహించ బడినది.

"కపులార! యేను మీ కరుణమైఁ జేసి - యుపమింప నరుదైన యుదధి లంఘించి
యగణిత వైభవంబగు లంకఁజొచ్చి - తగిలి శోధించి సీతాదేవిఁ గాంచి
యిన కులాధి పుడానతిచ్చిన తెఱగు - జనక నందన తోడ సకలంబుఁ జెప్పి
యింతికి ముద్రిక నిరవొంద నిచ్చి - యింతి శిరోమణి యిదె పుచ్చుకొనుచు

---

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము.సుందర. సర్గ. 59 శ్లో.లు 37.
2. ,, ibid ,, యుద్ధ. సర్గలు 67, 68.
3. ,, ibid ,, కిష్కింధా. సర్గ. 57 శ్లో.లు 1-20.
4. రంగనాథ రామాయణము. కిష్కింధా ద్వి-1121.
5. దా. ప్రతి వాల్మీకి రామాయణము. సుందర. సర్గ 58 శ్లో,లు 167.

వచ్చితి నేనన్న వనచరాధిపులు"[1]

ఈ విధముగా కవి తన కావ్యమునందు యథాశక్తి ఔచితీ భంగముకాని విధముగా పునరుక్త పరిహారము నొనరించినాడు.

4. కథాగతి నిరోధకములు :—

ప్రధాన కథా గమనమున కంతరాయము కలుగకుండుటకై పుర, నదీ, పర్వత ఋతు వర్ణనాదులును, వ్యక్తి వస్తు నామముల పట్టికలును, స్త్రీ, రాజ ధర్మాదులును సంగ్రహింపబడు చుండును. బుద్ధ భూపతి ఈ పద్ధతిని కూడ అవలంబించి కొన్నింటిని సంక్షిప్త పరచినాడు.

ఎ) మార్గస్థ పుర, గిరి, వన నామములు :—

జయంతాదులు భరతానయనార్థము రాజ గృహమునకేగునపుడును,[2] భరత శత్రుఘ్నులు రాజ గృహమునుండి యయోధ్యకు తిరిగి వచ్చినపుడును,[3] వారు మార్గ మందధిగమించిన నదీ, నగర వన, మహీధరాదులు మూలము నందు వివరముగా వర్ణింపబడినవి.

జయంతాదులు రాజగృహమునకు పోయిన మార్గము వేరు; భరత శత్రుఘ్నులు అయోధ్యకు వచ్చిన మార్గము వేరు. ఇవి యన్నియు భౌగోళిక విషయములు; కథకు వీని వలన ప్రయోజన మధికముగా లేదు. కావున బుద్ధ భూపతి వీనిని వదలి యున్నాడు.

బి) మార్గ సంశోధనాదులు :—

"భరతాజ్ఞను పురస్కరించుకొని, ఆయా శిల్పులు, కర్మకారులు అయోధ్య మొదలు గంగ వరకు మార్గమును బాగు చేయుట, వసతులను కల్పించుట, వస్తువులను సమకూర్చుట, ఇత్యాది వర్ణనము"[4] రంగనాథ రామాయణమున వదలి వేయబడినది.

సి) భరతుని వెంట చిత్రకూటమునకు బయలు దేరిన నాగరికుల వైవిధ్యములను దెలుపు నామములు,[5]

డి) అగస్త్యాశ్రమస్థ దేవతాస్థాన నామములు,[6]

ఇ) వృక్ష మృగాదుల నామములు[7]

రంగనాథ రామాయణమునందు వదలివేయబడినవి.

ఎఫ్) గృహనామములు :—

---

1. రంగనాథ రామాయణము. సుందరకాండ. ద్వి-
2. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. అయోధ్యా. సర్గ. 68 శ్లో.లు 12-20.
3. ,, ibid ,, అయోధ్యా. సర్గ. 71 శ్లో.లు 1-17.
4. ,, ibid ,, అయోధ్యా. సర్గ. 80 శ్లో.లు 1-22.
5. ,, ibid ,, అయోధ్యా. సర్గ. 83 శ్లో.లు 10-18.
6. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. అరణ్యా. సర్గ. 12 శ్లో.లు 13-21.
7. ,, ibid ,, యుద్ధ. సర్గ. 4 శ్లో.లు 74-88.

మూలమునందు "ప్రహస్తుని యిల్లు కాల్చి, ఆమీద మహాపార్శ్వుని గృహము దహించి, తర్వాత వజ్రదంష్ట్రుని భవనము".... ... అని యిట్లు మారుతి దహించిన ప్రముఖ రాక్షస గృహములు ప్రస్తావింప బడినవి.[1]

ఇది రంగనాథ రామాయణమునందు.

"బలిసి విభీషణ భవన మొక్కటియ - వెలిఁ గాగఁ బురమెల్ల వ్రేల్మిడిలోన
దరికొని మండె"[2]

యని సంగ్రహింప బడినది.

జి) శుభనిమిత్తములు :—

లక్ష్మణుడు రామునకు దెల్పిన విజయ సూచక శుభ శకునములు,[3] రాముడు లక్ష్మణునకు దెల్పిన నిమిత్తములును[4] వదలి వేయబడినవి.

యచ్) ప్రస్రవణగిరి వర్ణనము :-

శ్రీరాముడు వర్షాకాలము గడుపుటకై ప్రస్రవణ గిరిపై నివసించును. "అచటి కానన, నదీ, తరులతాది సుందర దృశ్యములు వర్ణింప బడిన సర్గమొత్తము[5] వదలి వేయబడినది.

ఐ) దేవతా ప్రార్థనము :—

అశోక వన ప్రవేశమునకు ముందు మారుతి "ఆదిత్య వసు, రుద్రాది దేవతలకు, సీతారామ లక్ష్మణులకు నమస్కరించి తనకు సిద్ధిని కలిగింతురు గాక"[6] యని ప్రార్థించిన విషయము విడువబడినది.

జె) పతివ్రతా ధర్మములు :—

"అనసూయ సీతకు జెప్పిన పతివ్రతా ధర్మములు"[7]

"తెలఁగొప్పఁ గొన్ని పతివ్రతా గుణము - లెఱిగించి"[8]

యని మాత్రము సూచన చేయబడినది.

ఇట్లు కథాగమనమును నిరోధించునట్టి ఆయా విషయములు నామాదులు సంగ్రహింప బడినట్లు తెలియును.

---

1. దాక్షిణాత్య ప్రతి. వాల్మీకి రామాయణము. సుందర సర్గ. 54 శ్లో.లు 8-18.
2. రంగనాథ రామాయణము, సుందర. ద్వి-955, 956
3. దా. ప్రతి వాల్మీకి రామాయణము. యుద్ధ. సర్గ. 4 శ్లో.లు 45-56.
4. ,, ibid ,, యుద్ధ. సర్గ. 23 శ్లో.లు 16.
5. ,, ibid ,, కిష్కింధా. సర్గ. 25 శ్లో.లు 28.
6. ,, ibid ,, సుందర. సర్గ. 13 శ్లో.లు 56-70.
7. ,, ibid ,, అయోధ్యా. సర్గ 117 శ్లో.లు 22-29.
8. రంగనాథ రామాయణము. అరణ్య. ద్వి-10.

5) ఏక పాఠగతములు :—

వాల్మీకి రామాయణ త్రివిధ పాఠభేదముల కారణముగా, ఒక ప్రతిలో నున్న కథాంశములు కొన్ని మరొక ప్రతిలో కనబడకుండ నున్నవి. బుద్ధభూపతి వీనిలో కొన్ని ఏక పాఠగతములను గ్రహించినను, మరికొన్నింటిని ఔచిత్య దృష్టితో అనువదించక వదలి యున్నాడు. పరిత్యక్తము లయిన అట్టి సర్గస్థ వృత్తాంతముల నిట పేర్కొందును.

1) చైతన్య ప్రాసాద విధ్వంసనము :-

"మారుతి కింకరులను హతమార్చి జంబుమాలి వచ్చులోపల చైత్య ప్రాసాదమును విధ్వంస మొనర్చి, తత్ప్రాసాదస్థ రాక్షసులను హతమార్చెడి"[1] విషయము వదల బడినది.

2) విభీషణుని కైలాస ప్రయాణము :-

"విభీషణుడు రావణ బహిష్కృతుడై కైలాసమునకు పోవును. అచట కుబేరుడు, శివుడు శ్రీరాముని శరణాగతి నొందుమని హెచ్చరింతురు, విభీషణుడు తిరిగి వచ్చును,"[2]

గౌడీయ ప్రతి యందలి ఈ వృత్తాంతము వదిలివేయబడినది.

3) కైకసి అభ్యర్థనము :-

రావణునకు హితోపదేశము చేయు "మనికైకసి విభీషణుని కోరి పంపును"[3]

విభీషణుడు తల్లి మాటపై రావణునకు హితోపదేశము చేసినాడు, స్వ ధర్మ బుద్ధిచే కాదని తోపింపఁ జేసెడి అనౌచిత్యమైన ఈ విషయమును బుద్ధ భూపతి తన రామాయణ గ్రంథమున పరిత్యజించినాడు.

4) లంకా దహన వర్ణనము -

సరమ సీతాదేవికి లంకాదహనమును వర్ణించి చెప్పు వృత్తాంతము[4] వదల బడినది.

5) రావణ సభ :-

రావణుడు మంత్రి సేనా పత్యాదులతో సభ దీర్చును. ఇందు "రావణ వాక్యము, ప్రహస్త వాక్యము, మహోదర వాక్యము, విరూపాక్ష వాక్యము, విభీషణ వాక్యము, రావణ వాక్యము. రావణ ప్రతివ్యాహరణము"[5] అను పేరులతో నొప్పు సర్గస్థ వృత్తాంతములు రంగనాథ రామాయణమున విడువబడినవి.

6) వజ్ర దంష్ట్రి యుద్ధము :-

"ధూమ్రాక్ష మరణానంతరము రావణాజ్ఞచే వజ్రదంష్ట్రుడు రాక్షస సైన్యముతో యుద్ధమునకు

---

1. దా. ప్రతి వాల్మీకి రామాయణము. సుందర. సర్గ. 43 శ్లో.లు 25.
2. గౌడీయ ప్రతి. వాల్మీకి రామాయణము. సుందర, 89 శ్లో.లు 5-42.
3. పశ్చిమోత్తర శాఖీయ ప్రతి. వాల్మీకి రామాయణము. సుందర. సర్గ. 75 శ్లో.లు 24.
4. ,, ibib ,, సుందర. సర్గ. 51 శ్లో.లు 18.
5. ,, ibid ,, సుందర సర్గలు. 81,82,83,84,85,88,89.

వచ్చి వానర బలము నెదిరింపగా, అంగదుడతనితో తలపడి హతమార్చెడి వృత్తము"[1] వదలి వేయబడినది.

7) ఇంద్రజిల్లాఘవము :-

"ఇంద్రజిత్తు భగ్నరథుడై, యుద్ధము చేయ రాక్షసులను హెచ్చరించి, లంక కేగి మరొక రథముపై క్షణములో యుద్ధమునకు రాగా, లక్ష్మణాదులు కడు విస్మయ మందిరి."[2] (లక్ష్మణ సాయకములచే మరల మేఘనాథుడు విరథుడయ్యెను.)

ఇది ఇంద్ర జిల్లాఘవ నిరూపణకు తగి యున్నది. పెద్ద ప్రయోజనమేమియు లేని కారణమున వదలబడినది.

8) అంగద కుంభకర్ణుల యుద్ధము[3] వదలబడినది.

9) తార హితబోధ.

సుగ్రీవుడు రెండవసారి యుద్ధమునకు వచ్చినపుడు తార వాలిని యుద్ధమునకు పోవలదని చేసిన ఉపదేశము4 వదలబడినది.

10) హనుమన్మంగలము.

హనుమంతుడు సముద్ర లంఘనము చేయువేళ వానరులతనికి చేసిన మంగళాశాసనము[5] వదలబడినది.

11) మారీచుని హితబోధ :-

మారీచుడు రావణునకు సీతాపహరణము కీడు దెచ్చునని రాముని పరాక్రమాదుల నుగ్గడించి చేసిన హితోపదేశము[6] గ్రహింపబడలేదు.

12) సంపాతి యాదేశము :-

సంపాతి తన పుత్రుని సుపార్శ్వుని బిలిచి అంగదుని వీపుపై మోచికొని సముద్రమున కవతలి యొడ్డును చేర్చుమని యాదేశించు[7] విషయము వదలబడినది.

6. కథా సంగ్రహ దృష్టి :—

మూలముతో పోల్చినపుడు, పైన చెప్పబడిన పద్ధతుల క్రిందికి రాక రంగనాథ రామాయణమునందు పరిత్యక్తమైన కథాంశములు కొన్ని గలవు, కవి వీనిని శాస్త్రీయ దృక్పథములనియో, వర్ణ

---

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. యుద్ధ. సర్గలు. 53,54.
2. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. యుద్ధ. సర్గ, 91 శ్లో. 1-32.
3. ,, ibid ,, యోద్ధ. సర్గ. 64 శ్లో 43-50.
4. పశ్చిమోత్తర శాఖీయ ప్రతి. వాల్మీకి రామాయణము. కిష్కింధా. సర్గ. 11 శ్లో.లు 15.
5. ,, ibid ,, కిష్కింధా. సర్గ. 59 శ్లో.లు 13.
6. ,, ibid ,, ఆరణ్య. సర్గ. 45 శ్లో 22.
7. గౌడీయ ప్రతి. వాల్మీకి రామాయణము. కిష్కింధా. సర్గ 55 శ్లో 32-36.

నాత్మకములనియో, చెప్పక పోయినను కథాభంగము కలుగదనియో, అనౌచిత్యములనియో వదలి యున్నాడు. వీనిని వదలుటలో కథా సంగ్రహ దృష్టియే ప్రధానాశయమన వచ్చును. అట్టి వానిలో కొన్నింటి నిట నుదాహరింతును.

1. సుమంత్రుడు దశరథునికి పల్కిన సుప్రభాతము.[1]

2. యమునా నది తరణము :—

రామలక్ష్మణులు పూలనావను గట్టి దానిలో సీతను కూర్చుండబెట్టి యామెను యమునా నది దాటించుట[2]

3. చార ప్రేషణము :—

రావణుడు సీతను లంకకు చేర్చిన తర్వాత దండకయందలి శ్రీరామ వృత్తాంతమును తెలిసి కొని తెలుపుటకై వీలయినచో నతనిని హతమార్చుటకై ఎనిమిది మంది రాక్షసులను పంపుట.[3]

4. ముహూర్త ఫలము :—

"రావణుడు సీతనపహరించినది విందమ ముహూర్తము. అట్టి ముహూర్తమున పోయిన వస్తువు స్వామికి తిరిగి లభించునని జటాయువు రామునకు చెప్పుట.[4]

5. సీతాన్వేషణము :-

అంగదుడు సీత కనబడమిచే దీనులైన వానరులకు ధైర్యము గొలిపి తిరిగి అన్వేషింపు మనుట, గంధమాదనుడా మాటలను బలపరచుట, వానరులు తిరిగి వింధ్యారణ్య ప్రాంతములను వెదకుట[5]

6. హనుమత్ప్రశంస :-

సుగ్రీవుడు ప్రత్యేకముగా హనుమంతుని తేజోబుద్ధి పరాక్రమాదులను బొగడి సీతా వృత్తాంతము దెలియునట్లు ప్రవర్తింపుమని ప్రత్యేకముగా కోరుట.[6]

7. మహా గృహాది వర్ణనము :-

ఆంజనేయుడు లంకయందు సీతాన్వేషణ చేయునపుడు రావణాధిష్ఠిత మహాగృహ, మహానగ రాంతర్వర్తి గృహ, పుష్పక విమాన, తత్సౌందర్య వైభవాదుల వర్ణనము.[7]

8. శృంగార విషయములు :-

ఆంజనేయుడు లంకయందు రావణుని గృహమున దేవ దైతేయాది కామినులు పాడి, యాడి

---

1. డా. ప్రతి వాల్మీకి రామాయణము. అయోధ్యా-సర్గ. 14. శ్లో.లు 47-57
2. ,, ibid ,, సర్గ. 55. శ్లో.లు 14-23
3. ,, ibid ఆరణ్య సర్గ. 54. శ్లో.లు 18-30
4. ,, ibid ,, సర్గ. 68. శ్లో.లు 8-16
5. డా. ప్రతి వాల్మీకి రామాయణము. కిష్కింధా-సర్గ. 49-శ్లో.లు 22
6. ,, ibid ,, సర్గ. 44-శ్లో.లు 1-7
7. ,, Ibid సుందర-సర్గ. 6 శ్లో. 28-45
మరల-సర్గ 7-శ్లో. 17

తత్సాధనములనట్లే పట్టుకొని, కౌగిలించుకొని, విడువక నిద్రపోయిన దృశ్యములను గాంచెను. ఈ సందర్భమున మూలము నందు వారలకు వాడబడిన శృంగార సంబంధానే కోప మానములు.[1] (వీనిని వదలుటలో అనౌచిత్యమే గాక అశ్లీల దృష్టి కూడ కలదు.)

9. సీతా దీనస్థితి :-

ఆకాశ పర భాగమునొందిన చంద్రుడు మారుతికి సీతాన్వేషణమునందు తోడ్పడుట, సీతను పరివేష్టించియున్న ఏకాక్షి, ఏక కర్ణ, మొదలైన విరూప రాక్షస స్త్రీల స్థితి, సీతాదైన్య దశల వర్ణనము.[2]

10. సీతా ప్రలోభనము :-

రావణుడు సీతకు తన ఐశ్వర్యాదులను జూపి ప్రలోభ పరచుట.[3]

11. హనుమచ్చింతనము :-

ఆంజనేయుడు "సీతతో భాషించుటయా" భాషింపక పోవుటయా, ఆమె నాశ్వాసింపక పోయినచో కలిగెడి దోషములు, ఆమెతో మాటాడినచో వచ్చెడి అనర్థములు" వీనిని గూర్చి చేసిన ఆలోచనము.[4]

12. ఉత్తమ మధ్యమాధమ భేదము :-

రావణుడు సభలో ఉత్తమ మధ్యమాధమ భేదములుగా పురుషులను, మంత్రము (ఆలోచన) లను వర్గీకరించి వివరించుట.[5]

13. సేనా విభాగము :-

"శ్రీరాముడు వానరులతో సభ తీర్చుట, విభీషణుడు తన చారుల వలన తెలిసికొనిన రావణ సేనా వ్యూహమును గూర్చి, రావణ రాక్షస సామర్థ్యమును గూర్చియు విన్నవించి, సేనను వ్యూహ పరచి యుద్ధము చేయవలెనని రామునకు మనవి చేయుట, నీలుడు పూర్వ ద్వారమున ప్రహస్తుని తోడను, అంగదుడు దక్షిణ ద్వారమున మహా పార్శ్వ మహోదరుల తోడను. హనుమంతుడు పశ్చిమ ద్వారమున ఇంద్రజిత్తు తోడను, తాను లక్ష్మణునితో కూడి ఉత్తర ద్వారమున రావణునితో తలపడెదనని పల్కుట, సుగ్రీవుడు జాంబవంతుడు విభీషణుడు సేనా మధ్యమమున నుండి గుల్మము రక్షించునట్లు రాముడు హెచ్చరించుట".[6] ఈ సర్గ వృత్తాంతమంతయు పరిత్యజింపబడినది.

14. ఇంద్రజిదాంజనేయ యుద్ధము :-

ఇంద్రజిత్తు నికుంభిళా హోమమునకు విఘ్నమేర్పడగా, విరమించి, తత్సమయమున యుద్ధము

---

1. దా. ప్రతి వాల్మీకి రామాయణము. సుందర-సర్గ. 10 శ్లో. 37-49.
2. ,, ibid ,, సుందర-సర్గ. 17 శ్లో.లు 30
3. ,, ibid ,, సుందర. సర్గ. 20 శ్లో.లు.
4. ,, ibid ,, సుందర. సర్గ. 30 శ్లో.లు 44.
5. ,, ibid ,, యుద్ధ. సర్గ. 5 శ్లో.లు 4-21.
6. ,, ibid ,, యుద్ధ. సర్గ. 37 శ్లో లు 38.

చేయుచున్న హనుమంతునితో తలపడెను. ఈ యిరువురికి జరిగిన యుద్ధము[1] వదలి వేయబడినది.

15) మహోదరుని కూటనీతి :-

మహోదరుడు రాముడు మరణించినట్లు చాటించి సీతను జేరి ధనధాన్యాదులచే లోభపరచిన, అకామయైనను అనాథయైన సీత నిన్ను పొందునని రావణునికి సలహా చెప్పుట.[2]

16) ఆలోచనము :-

విభీషణుడు రాముని శరణాగతి వేడెను. అపుడు సుగ్రీవుడు విభీషణుని నమ్మరాదనగా, శ్రీరాముడు వానరుల యభిప్రాయములను గోరును. అంగద, శరభ, మైంద, జాంబవంతులు వివిధాభిప్రాయములను దెలియజేయగా; మారుతి వానిని ఖండించును. ఈ వానరుల వివిధాభిప్రాయ నివేదనము, పావని ఖండనము[3] విడువబడినది.

17) జోస్యము :-

లక్షణజ్ఞులు, భిక్షిణి తనకు వనవాసము కలదని వివాహాత్పూర్వమే జోస్యము చెప్పిరని సీత రామునకు తెలుపుట[4] వదలబడినది.

18) భరత సాంత్వనము :-

రామ భరత సంభాషణమును అంతర్హితులైన మునులు విని విస్మితులై, రావణ వధను కాంక్షించి, రాముని అనృణునిగా కోరుచున్నామని భరతునితో పల్కుదురు. భరతుడు భయపడి రాజ్య రక్షణమందు తన యసమర్థతను వెల్లడించుచు రాముని పాదముల పై బడును. రాముడు లేవనెత్తి సాంత్వన పరచును.[5] ఈ వృత్తాంతము పరిహరింప బడినది.

19) మతంగ శిష్యాదుల మహిమ :-

శబరి శ్రీరామునకు తమ గురువులైన మతంగ శిష్యాదులయొక్క వాడని పుష్పోపహారము, తడియారని వల్కలములు, ఒకచోటనే నెలకొన్న సప్త సాగరములు, ఇత్యాది మహిమలను చూపెట్టును[6]

ఇది

"అని యా మహత్వంబు లన్నియు దెలిపి"[7]

యని సంగ్రహింపబడినది.

20) మతంగ శాపము :-

"మతంగుడు వాలినే కాక, తత్సచివాదులైన వానరులను సాయంత్రములోపల అతని వనము విడిచి వెళ్ళనిచో, పెక్కువేల సంవత్సరములు శిలలై పడియుందురని శపించును. వాలి

---

1. దా. ప్రతి వాల్మీకి రామాయణము-యుద్ధ-సర్గ 86 శ్లో-18-35
2. ,, ibid యుద్ధ-సర్గ 64 శ్లో 31-36
3. ,, ibid యుద్ధ-సర్గ 17 శ్లో 29-59
4. ,, ibid అయోధ్యా-సర్గ 28 శ్లో 8-13
5, దా ప్రతి వాల్మీకి రామాయణము అయోధ్యా-సర్గ 112 శ్లో 1-10
6 ,, ibid ,, ఆరణ్య-సర్గ 74 శ్లో.లు 19-28
7, ,, ibid ,, కిష్కింధా-సర్గ 11 శ్లో.లు 55-64

వాలి వారి ద్వారా మతంగ శాపమును విని ముని యొద్దకు వచ్చి శాపమును తొలగింపుమని ప్రార్థించి నిరాకృతుడై శాప భీతి పొంటిపోవును.[1] ఇది గ్రహింపబడలేదు.

21) వాలి చరమ సంస్కారము :-

"తారుడు శిబికను దెచ్చుట. తచ్ఛిబికా సౌందర్య వర్ణనము, దానిలో వాలినుంచి మోసికొని పోవుట, ఏకాంత స్థానమున దింపగా తార అతని మీద పడి విలపించుట, అంగదు డగ్గి పెట్టుట, చితికి అప్రదక్షిణము చేయుట, సుగ్రీవాదులు నీళ్ళువదలుట"[2] అను వృత్తమంతయు

"అలోన రఘురాము ననుమతి వడసి-వాలికిఁ బరలోక వైదిక క్రియలు
చేసి యాదశరాత్ర శేషకృత్యములు-భాసుర గతిఁదీర్చి పరిశుద్ధిఁబొంది"[3]

యని రెండు ద్విపదలలో సంగ్రహింపబడినది.

22) ఫల మాహాత్మ్యము :-

సుగ్రీవాజ్ఞచే కిష్కింధకు వచ్చు వానరులు మహేశ్వరుడు యజ్ఞము చేసిన స్థలమందు జనించిన వృక్షఫలాదులను గ్రహించి సుగ్రీవునకు కానుకగా దెచ్చి సమర్పింతురు. తత్ఫలభుక్తిచే నెల దినముల వరకు ఆకలి దప్పులు శ్రమ కలుగదనెడి వృత్తాంతము,[4] పరిహరింపబడినది.

23) సుగ్రీవుడు సీతాన్వేషణకై వానరులను చతుర్దిశలకు పంపుచు, అన్వేషింపదగిన తత్తత్ స్థలముల విశేషములను వర్ణించి చెప్పును.[5] రంగనాథ రామాయణమునందు కేవలము స్థల నామ నిర్దేశము గావింపబడినది. విశేషములు వర్ణింపబడలేదు.

24) పానశాలా వర్ణనము :-

మారుతి లంకయందు పానశాలలో నిద్రితలైన రాక్షస కాంతలను, తత్పరివేష్టిత దశగ్రీవుని, అచ్చట పడియున్న భుక్తశేష మద్య మాంసాదులను పరికించును. ఈ వర్ణన మంతయు[6]

.... అవల-మేదుర పరికరామ్రేడితామోద
మానితాసవ రక్త మధుమాంసయుక్త-పానశాలా పరంపరలెల్లఁ జూచి"[7]

యని సంగ్రహింప బడినది.

25) సీతా దైన్యస్థితి :-

"వేకువ జామున మదనోన్మత్తుడైన రావణుడు అశోక వనమునకు వచ్చి సీతను సమీపించును. అప్పటి సీతా దీనదశ అనేకోపమానములతో మూలమునందు వర్ణితమైనది."[8] అది యంతయు.

---

1 రంగనాథరామాయణము ఆరణ్యా. ద్వి 1455
2 దా ప్రతి వాల్మీకి రామాయణము కిష్కింధా. సర్గ 25 శ్లో 20-53
3. రంగనాథ రామాయణము. కిష్కింధా. ద్వి-692,693.
4. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. కిష్కింధా. సర్గ. 37 శ్లో. 1-37.
5. ,, ibid ,, కిష్కింధా. సర్గలు. 40,41,42,43.
6. ,, ibid ,, సుందర. సర్గ. 11 శ్లో. 5-36.
7. రంగనాథ రామాయణము-సుందరకాండము. ద్వి-148,149.
8. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. సుందర. సర్గ. 19 శ్లో. 4-23.

"పులిఁగన్నలేడినిబోలె చిత్తమునఁ - గలగుచు నున్నట్టి కళ్యాణిఁజూచి"[1]
యని సంక్షిప్తపరచబడినది.

26) రామగాథ :-

"మారుతి సీతకు తన మాటలయందు శ్రద్ధ కలుగుటకై అప్పటివరకు జరిగిన శ్రీరామ చరిత్రను మధురముగా వినిపించెను."[2] ఇదియంతయు-

"రవికుల క్రమము, రాము పౌరుషము-వివిధ భంగుల వేడ్క వినుతి సేయుచును"[3]
అని ఒక్క ద్విపదలో సంగ్రహింపబడినది.

27) సీతా స్వదురవస్థా కథనము :-

"సీతాదేవి తానుపడు బాధలను మారుతికి వివరముగా చెప్పును."[4]
స్వయముగా చూచినవానికి ప్రత్యేకముగా చెప్పుట యెందులకని కవి దీనిని వదలియుండును.

28) సీత ఆత్మ వృత్తాంత కథనము :-

"హనుమంతుడు నీవెవరు? సీతవా?అని వేసిన పరిప్రశ్నకు సమాధానముగా సీత ఆత్మవృత్తాంతమను మారుతికి వివరించి చెప్పును"[5]

ఇందలి కొన్ని శ్లోకములు అరణ్యకాండము సర్గ. 47లో సీత రావణునకు స్వవృత్తాంతమును చెప్పుచోట నున్నవే, అవి యిట పునరుక్తములైనవి.

అదియుగాక, ఆయా యభిజ్ఞానములచే సీతయని ఆంజనేయుడు గుర్తించిన పిదప, మరల సీతను నీవెవరు అని యడుగుటయు, ఆమె తన వృత్తాంతమును చెప్పుటయు కవికి సముచితమనిపించలేదు. కావున ఈ సర్గవిషయమునే గ్రహింపక వదలివేసినాడు.

29) విభీషణ ప్రార్థన :-

మూలమునందు యుద్ధకాండము సర్గ 112లో విభీషణుడు రామునితో "రావణుడాహితాగ్ని మహా తపస్వి. వేదాంతగుడు, గురు దైవతములను చక్కగా పూజించినవాడు, భోగభోక్త, వీరాగ్రేసరుడు; నేనితనికి ప్రేత కార్యములను చేయ గోరుచున్నానని" ప్రార్థింపగా రాముడంగీకరించును.

మరల సర్గ 114లో-రాముడు విభీషణునితో "ఇతనికి ప్రేతకార్యముల నొనరింపుమని" పల్కగా, విభీషణుడు రావణుడు త్యక్త ధర్ముడు. పాపి, పరదారాభిమర్శి, భ్రాతృరూప శత్రువు; కావున నేను చేయననెను"

ఇది పూర్వాపర విరోధముగా దోచును. విభీషణుని శీలమునకు మచ్చదెచ్చునదై అతని కూట నీతిని నిరూపించును కావున బుద్ధ భూపతి 112 సర్గలోని విషయము ననువదించక వదలివైచినాడు.

---

1. రంగనాథ రామాయణము. సుందర. ద్వి. 281.
2. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. సుందర. సర్గ. 32 శ్లో.లు 20.
3. రంగనాథ రామాయణము. సుందర. ద్వి. 454.
4. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. సుందర. సర్గ. 37 శ్లో. 1-17.
5. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. సుందర. సర్గ. 33 శ్లో.లు 32.

ఇట్లు పరిశీలించుచు పోయిన సంగ్రహింపబడిన విషయము లెన్నియో కనబడును. పైన చెప్పబడిన వన్నియు సుమారుగా మూలమునందలి దశాధిక శ్లోకముల కథాంశములకు సంబంధించినవి.

III విస్తరణములు.

బుద్ధ భూపతి రామాయణమును అనువదించువేళ అచ్చటచ్చటి కొన్ని కథాంశములను పెంపొందించి యున్నాడు. ఈ పెంపుదల ఎక్కువగా యుద్ధకాండమునందు కనబడుచున్నది. ఈ యుద్ధ కాండము కావ్యమునందు సగముకంటె ఎక్కువ భాగము నాక్రమించి యున్నది. దీనికి పెంపుదలయే కారణము.

కవి కావ్యమునందు కలిగించిన అనువాద విస్తరణములను స్థూలముగా ఐదు విధములుగా వింగడించవచ్చును.

1. పదమును, పదసమూహమును, పాదమును విస్తరించుట.

2. స్తుతులను, సంభాషణలను పెంచుట, లేనిచోట సందర్భమును పురస్కరించుకొని చొప్పించుట.

3. కల్పనలను, వర్ణనలను క్రొత్తవి చేర్చుట, లేక ఉన్నవానిని పెంపొందించుట.

4. కథాంశములను విపులీకరించుట.

5. ఆలంకారికమైన పెంపు.

రంగనాథ రామాయణమునుండి వీనికనేక నిదర్శనములెత్తి చూపవచ్చును. గ్రంథ విస్తర భీతి కొన్నింటిని మాత్రమిచట పేర్కొందును.

1) పద పదసమూహ పాదముల విస్తృతీకరణము.......................

మూలమునందలి పదములను, పదసమూహములను ఆధారముగా గ్రహించి వాని భావము విశదీకరింపబడును. ఆ పదములు వ్యక్తుల, వస్తువుల నామములైనపుడు వానికి సముచితమైన విశేషణములు ప్రయుక్తమగుచుండును.

1) విశ్వామిత్రుడు తన వంశమును వివరించు వరకు అర్ధరాత్రమయ్యెను. ఆ రాత్రిని వర్ణించు సందర్భములోని-

"నిష్పందా స్తరవస్సర్వే నిలీనా మృగ పక్షిణః"[1]

అనుదానికి

"చలియింపకున్నవి సకల వృక్షములు-మెలగవు వనభూమి మృగ సమూహములు

నెఱి విహంగంబులు నీడముల్ సేరి-మఱచి యున్నవి తమ మంజుల ధ్వనులు"[2]

అని యనువాదము. ఇందలి "నిలీనా మృగ పక్షిణః" అనుదాని భావము మూడు పాదములుగా పెంపొందింపబడినది.

2) అగ్నికేతు దుర్ధర్షాది రాక్షసులు రామునిపై శర వర్షమును కురిపించిరి. ఇచ్చట

1. ధా. ప్రతి. వాల్మీకి రామాయణము. బాల. సర్గ. 34 శ్లో. 15.

2. రంగనాథ రామాయణము. బాల. ద్వి-1007,1008.

"అగ్నికేతుశ్చ దుర్ధర్షో-రశ్మికేతుశ్చ రాక్షసః
సుప్తఘ్నో యజ్ఞకోపశ్చ-రామం నిర్బిభిదు శ్శరైః॥"1

అను శ్లోకములోని-దుర్ధర్షః, నిర్బిభిదుశ్శరైః" అను పదముల భావము-

"రాముపై సుప్తఘ్న రశ్మికేతువులు-నామెయి యజ్ఞకోపాగ్నికేతువులు
భీమ ప్రతాపులై పేర్చి యంతంత-వేమఱు గర్జించి వెస విజృంభించి
కెరలి మేఘంబుల క్రియ నంపసోన-గురిసిరి గుణరావఘోర గర్జనల"2

అని నాల్గుపాదములలో విశదీకరింపబడినది,

3) "హా లక్ష్మణా" యనెడి మరణోన్ముఖుడైన మారీచుని పిలుపును విని సీతాదేవి భయపడి లక్ష్మణుని రామునికి తోడుగా పొమ్మని హెచ్చరించును. బయలు దేరకుండ అచ్చటనే నిలిచి యున్న యతనిని పరుషముగాఁ దూలనాడును. అట్టి చోట మూలమునందు-

"మమ హేతోః ప్రతిచ్ఛన్నః ప్రయుక్తో భరతేనవా?"3

అనికలదు. ఇందలి ప్రతిపాదమునకు-

అనుచితమతిఁ బూని యనుమాన ముడిగి-ననుఁబొందఁ దలచెదో నాన వోవిడిచి
కాదేనిఁగొని పోయి కైకేయి సుతుని-కాదట నొప్పింతునని తలంచెదవో?"4

యని ఒక్కొక్క ద్విపద కూర్చబడి మూలభావము స్పష్టీకరింపబడినది.

4) రావణుని తనయుడు అతికాయుడు లక్ష్మణునెదిరించి వీరాలాపములాడి అతనిపై శరములను ప్రయోగించెను.

ఇచ్చట

"ఏకం త్రీన్ పంచసప్తేతి-సాయకాన్ రాక్షసర్షభః
ఆదదే సందదేచాపి-విచకర్షోత్ససర్జచ॥"5

అనుభావమును పెంపొందించి రచితములైన వానిని చూడుడు.

"చలమొక్కటియుఁ దక్కఁ జంపుదునన్న-చెలువున నొక్క నిశిత బాణమేసె
మూడంబకముల మూర్తి గాచినను-బోడిమి దక్కింతుఁ బొమ్మన్న కరణిఁ
జటుల వేగంబున సంధించి మఱియుఁ-బటు తరంబగు మూడు బాణంబులేసె
ననయంబుఁ బెఱుకుదు నైదు ప్రాణములు-ననుమాడ్కి వెండియు నైదమ్ములేసె
నేడు వార్ధులు సొచ్చి యీదిపోయినను-దోడనే చని మీఱి త్రుంతు నన్నట్టి
కరణి నెంతయు భుజా గర్వంబు మీఱి-యిరవొంద సంధించి యేడమ్ము లేసె"6

---

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. యుద్ధ. సర్గ. 43 శ్లో. 25 1/2.
2. రంగనాథరామాయణము. యుద్ధ. ద్వి-2334,-2336.
3. దా. ప్రతి. వాల్మీకి రామాయణము ఆరణ్య. సర్గ. 45 శ్లో. 24.
4. రంగనాథ రామాయణము. ఆరణ్య. ద్వి-948,949.
5. దా. ప్రతి. వాల్మీకి రామాయణము, యుద్ధ. సర్గ. 71 శ్లో 78.
6. రంగనాథ రామాయణము. యుద్ధ. ద్వి- 4564-4569.

మూలమునందలి ఏక, త్రి, పంచ, సప్త శబ్దములకు వివరణాత్మకముగా చక్కని కల్పనలు సమకూర్చి ప్రతిపదమునకు ఒకటి రెండు ద్విపదలుగా భావమును పెంపొందించి రచితములైనవి.

5) శ్రీరాముడు గాంధర్వాస్త్రమును ప్రయోగించి అసంఖ్యేయ రాక్షస సైన్యమును ఛిన్నాభిన్నము చేసెను. దానవ కాంతలు బంధు నిధనమునకు శోకించుచు, రాముని దేవునిగా తలంచి భయపడసాగిరి. ఇచట మూలమునందు-

"రుద్రోవా యదివా విష్ణు-ర్మహేంద్రోవా శతక్రతుః।
హంతినో రామ రూపేణ- యదివా స్వయ మంతకః"[1]

అని కలదు-దీనియనువాదము-

కులశైల పక్షముల్ కులిశఘాతమున-నలుకమై దునుమాడు నాపురందరుడొ
మధుకైటభాదుల మర్దించునట్టి-యధికుడా విష్ణుడో, యదియు డంతకుడొ
ప్రళయ కాలమునాటి ఫాలలోచనుడొ-యిల రాముడై పుట్టి యిటు చంపదొడగె"[2]

మూలమునందలి రుద్ర, విష్ణు, మహేంద్రాంతక శబ్దములు తత్తదుచితముగా విశేషింప బడి విషయ విస్తృతి గావింపబడినది.

6) దశగ్రీవుడు విద్యుజ్జిహ్వునితో "రాముని మాయా శిరోధనుశ్శరముల సృష్టించి తీసికొనిరమ్ము" అని శాసించి అశోక వనమునకేగి సీతను గాంచెను.

మూలమునందు దీనురాలైన సీతాదేవి అప్పటి స్వరూపము.——

"తతోదీనా మదైన్యార్హాం-దదర్శ ధనదానుజః।
అధోముఖీం శోకపరాం-ఉపవిష్టాం మహీతలే॥
భర్తార మేవ ధ్యాయంతీం-అశోకవనికాం గతాం।
ఉపాస్యమానాం ఘోరాభి-రాక్షసీభి రితస్తతః॥"[3]

అని వర్ణింపబడినది. ఇందలి అధోముఖీం, శోక పరాం, ఉప విష్టాం, మహీతలే, భర్తారమేవ ధ్యాయంతీం" అను విశేషణ పదములకు చక్కని కల్పనల నూహించి ఒక్కొక్క విశేషణమునకు రెండు రెండు ద్విపదలుగా కవిచే నుత్ప్రేక్షింప బడినవి.

పెల్లగు నీపగ బెట్టనే కంటి-తల్లి నన్నని వసుంధర దూఱుకరణి
దలవంచుకొని విన్నదనమున దూలి-సొలవక ధాత్రి జూచుచు నున్నదాని
నొడల చిత్తమున బెంపొందు తాపాగ్ని-నుడికి పొంగుచు వెలికుఱుకుచు నున్న
రాక్షసుపై రోష రసధారలనగ-నక్షీణ బాష్పధారావళి దాని
"బుత్త్రి యీ దురవస్థ బొందితే" యనుచు-ధాత్రి దానును బరితాపంబునొంది
యాలింగనము సేసి నట్టి చందమున-ధూళి గప్పిన మేనితో నున్నదాని
రావణ నిన్ను నీ రాక్షస కోటి-నేవిధంబున జంపకేల పోనిత్తు

---

1. దా. ప్రతి. రామాయణము. యుద్ధ. సర్గ. 95 శ్లో. 29 1/2.
2. రంగనాథ రామాయణము. యుద్ధ. ద్వి-6173-6175.
3. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. యుద్ధ. సర్గ. 81 శ్లో. 11,12.

నని వాని క్రూర కర్మాధి దైవంబు-గొన కొన్న కైవడిఁ గూర్చున్నదాని,
అమరారులను నీరసావనీజములఁ-దమకించి వెస పీట తాటంబు సేయ
నని దొరకొను విలయానిలు పగిదిఁ-దనరు నిట్టూర్పులు దఱుచైన దానిఁ గని"1

కావున పై ద్విపదలు తత్తద్విశేషణ పదములకు విస్తృతీ కరణములు.

7) హనుమంతుడు తాను చూచి వచ్చిన లంకాపట్టణ వైభవమును శ్రీరామునకు విన్న వించును ఇచట మూలమునందు-

"హృష్ట ప్రముదితా లంకా-మత్త ద్విప సమాకులా।
మహతీ రథ సంపూర్ణా- రక్షోగణ సమాకులా॥
వాజిభిశ్చ సుసంపూర్ణా-సాపురీ దుర్గమాపరైః।2

అని యున్న శ్లోకముల యనువాదము ఈ క్రిందిరీతి విస్తరింపబడినది,

"ఉడుగని మదధార లొలుకుచునుండ-కడునొప్పు పర్వతాకారంబులగుచు
రౌద్రంబు మోములు రంజిల్లుచుండు-భద్ర దంతావళ ప్రతతు లగ్గలము;
పెక్కాయుధంబులఁ బెరిగి చూడ్కులకు- నక్కజంబై ఘోరమై కనుపట్టు
గొడుగులఁ బడగలఁ గొమరారు పెక్కు-నడియాలములుఁ డెక్కియంబులుఁ గ్రాల
భాను బింబ ప్రభా పటలంబు పగిది—మానైన మణి దీప్త మహిమ వెలుంగు
రథిక సారథి మనోరథములై యుండు-రథములెక్కుడు దశరథరాజ తనయ;
ఘన వీర రసవార్ధి కరడులో యనఁగఁ-దనరారి యెంతయుఁ దఱుచు వన్నియల
మెఱసి చూడ్కులకును మిఱుమిట్లు గొలుప- వఱలిన హేషా రవంబులు సెలగ
హరి ఘోటకంబుల నైన వేగమున-హరియింప నోపిన హరిశక్తి గలిగి
హరులెంతయును మనోహరములైయుండు_హరి వాజులను మెచ్చునట్టి వగ్గలము;
పిడుగుల తోడఁ బ్రబ్బిన నల్ల మొగుళు-లడరి దానవ రూపులయ్యెనో యనగ
నేర్చి రౌద్రంబుతో నెనసి యంగంబు-గూర్చిన నల్లని కొండలో యనఁగఁ
గాదేని హరుడు మ్రింగగఁబడ్డ గరళ-మీదైత్యకోటియై యెసగెనో యనగఁ
బ్రళయ కాలమునాటి పావక ధూమ-మలవడ రాక్షసులై రాకో యనఁగఁ
గలిగిన యట్టి రాక్షసులకు సంఖ్య- గలుగదు; దేవ! రాఘవ! ధరాధీశ"3

మూలమునందలి "మత్తద్విప, మహతీరథ, రక్షోగణ, వాజిపూర్ణ" శబ్దముల యాధారముగా కవి స్వతంత్రించి స్వపాండిత్య ప్రతిభలు ప్రదర్శించుటకు చేసిన సరసమైన వర్ణనమే కాని అనువాద మనుటకు వీలులేని రచన. మరొక రీతి చూచిన మూలపద భావములకు కల్పనాత్మక విస్తృతీకరణ ములు అనదగును.

8) రావణుడు నీలునిపై శరవర్షము కురిపించెను. అప్పుడు నీలుడు తన శరీరమును

---

1. రంగనాథ రామాయణము. యుద్ధ. ద్వి-1641-1650.
2. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. యుద్ధ. సర్గ. 3 శ్లో. 10,11.
3. రంగనాథ రామాయణము. యుద్ధ. ద్వి-39-53.

కుంచించుకొని, దశగ్రీవ రథ ధ్వజముపై కురికి అటనుండి చాపాగ్రమునకు, అటనుండి కిరీటాగ్రమునకు లంఘించెను. ధ్వజాగ్ర చాపాగ్ర కిరీటాగ్రములందు దుమికి రావణునకు పట్టుబడక ఆడుచున్న నీలునిగాంచి రామ, లక్ష్మణ, పవన సుతాదులు విస్మయమందిరి. ఇప్పట్టున మూలమునందలి శ్లోకమిట్లున్నది;

"ధ్వజాగ్రే ధనుషశ్చాగ్రే - కిరీటాగ్రేచ తంహరిం।
లక్ష్మణోథ హనూమాంశ్చ - దృష్ట్వా రామశ్చ విస్మితాః॥"[1]

బుద్ధ భూపతి ఈ విస్మయ కారణమును తన ప్రతిభా పాటవమున భేదించి, విశదీకరించి పాఠకులను నిజముగా విస్మయ పరచినాడు. చూడుడు-

వడిఁబేర్చియారథధ్వజమున కెగసి-పొడిచేసి చాపాగ్రమునకు లాఁగొప్ప
నెగసి చలంబున నెక్కొడలించి-మగుడి రావణు ఘన మకుటముల్ ద్రొక్కి-
యురుభుజ నిజ విక్రమోన్నతి మెఱసి-సురసిద్ధ సాధ్యులు చోద్యంబు నొంద
నొక మౌళిపై నుండి యొక మౌళి వ్రేసి-యొక మౌళిపైనుండి యొక మౌళి యూచి
యొకమౌళి పైనుండి యొకమౌళి డుల్చి-యొక మౌళి పైనుండి యొకమౌళిఁదన్ని
మకుటంబు లన్నియు మట్టి మల్లార్చి-యకలంకుడై నలు డంతటఁ బోక
వారక తనుఁ బట్ట వచ్చిన సూక్ష్మ-మై రావణునిఁ జూచి యందంద నగుచు
గొడుగులు సించి గ్రక్కున మీదఁ ద్రోచి- పొడిగాగఁ జామరంబులు ద్రుంచివైచి,
విఱుగంగ నరదంబు వీకఁ దాటించి- కఱికఱి తోడ నుత్కంఠ దీపింప
దనుజేశు నుఱుముష్టిఁ దాచి హారములు- పెనచి రాఁదిగిచి యాపృథుల వక్షంబు
జఱచి యందంద యుత్సాహంబు మెఱసి- యుఱక యీగతి నాడుచుండుటఁ జూచి
తరుచర సేనలు దైత్య సేనలును- బొరిఁ బొరి నద్భుతంబుగఁ జూచుచుండ
వెఱగంది రారామవిభుడు లక్ష్మణుడు"[2]

ఇది స్వతంత్ర వర్ణనవలె గానవచ్చినను, మూల భావమును విశదీకరించుటయే-

ఇట్లు మూలమునందలి పదమును, పదసమూహమును, పాదమును, శ్లోకమును యొక ప్రమాణముగా (unit) గ్రహించి మూల భావ సౌందర్యమునకు పోషకముగా, కొలదిగానో, గొప్పగానో కొన్ని చోట్ల విశదీకరింపబడినట్లు పరిశీలన వలన దెలియనగును.

2. <u>స్తుతులు</u>, సంభాషణములు :—

కావ్యమునందు అచ్చటచ్చట <u>స్తుతులు</u>, సంభాషణములు కొన్ని పొడిగింప బడుటయే గాక, కొన్ని క్రొత్తవియును చేరియున్నవి. ఇవియు గ్రంథము పెరుగుటకు కారణములు. అట్టివానిలోని కొన్నింటిని ఇచ్చట కనబరచెదను.

అ) <u>స్తుతులు</u>—

దశరథుడు పుత్రకామేష్టి యాగము చేయుచుండగా, దేవతలు బ్రహ్మను పురస్కరించుకొని, విష్ణువును సమీపించి, <u>స్తు</u>తించి, రాక్షస వధార్థము లోకమున నవతరింపు మని ప్రార్థించిరి.

---

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. యుద్ధ. సర్గ. 59 శ్లో. 81
2. రంగనాథ రామాయణము. యుద్ధ. ద్వి-3345-3357.

మూలమునందు-

"బ్రహ్మణాచ సమాగమ్య-తత్రతత్స్థౌ సమాహితః।
తమబ్రువన్ సురాస్సర్వే-సమభిష్టూయ సన్నతాః॥"1

అని కలదు. ఇందలి సమభిష్టూయ శబ్దాధారమున బుద్ధ నృపతి-

... ... "కనకాక్ష శిక్ష లోకత్రయాధ్యక్ష
వనజాలయా వక్ష వసుమతీ రక్ష-వనజాక్ష మాకు నెవ్వరు లేరు దిక్కు-
నీవొక్కడవు దక్క నిక్కమీ మాట-గోవింద పరిపూర్ణ గుణ చిదానంద
దేవ జగన్మయ దేవాదిదేవ-దేవనిస్తారక దివ్యావతార
శుభ మూర్తి శరణంబు జొచ్చిన మాకు-నభయ మిచ్చితి గాదె యమృతాబ్ధిఁ దొల్లి
తలపోయ దానవదళన నీబాహు-బల విక్రమంబులఁ బరగు లోకములు
భక్త వత్సల నిన్నుఁ బరికింపఁ దరమె-భక్తి యోగము దక్క బయలు మాటలను
మధుసూదనుడ నిన్ను మదిలోన నమ్మ-నధిక పుణ్యులకెందు నాపదల్ గలవే
జగదుద్భవ స్థితి సంహారగతులు-దగ వినోదంబులై తనరు నీ మాయ
ఆధార భూతమై యఖిల లోకములు-మాధవ దాల్చు నీ మహనీయ తనువు
అహిరాజ తల్ప నీయలరు వైభవము-మహిమఁ జూడగ నవాఙ్మనస గోచరము
శరణాగత త్రాణ శరణు లోకేశ- శరణార్థులగు మమ్ముఁ జనుఁగావ నీకుఁ
గావునఁ ద్రైలోక్య కంటకుండైన-రావణుఁబొలియించి రక్షింపు మమ్ము
మా కొక కార్యంబు మనలక చేసి-లోక కీర్తులఁ బొందు లోకైక వినుత."2

అని సుమారు, 14 ద్విపదల స్తుతిని రచించినాడు. ఈ స్తోత్రము భక్తి ప్రాధాన్యమును, భగవన్మహిమను వెలార్చుచున్నది.

2) అహల్యా స్తుతి :—

శ్రీరామ పాదరాజీవ పరాగముచే శాపముక్తయైన యహల్య ఆమహామహునకు అతిథి సత్కారములు చేసి వినుతించినది. మూలమునందు—

"స్మరంతీ గౌతమ వచః-ప్రతి జగ్రాహ సాచతౌ।
పాద్య మర్ఘ్యం తథా/తిథ్యం-చకార సుసమాహితా॥"3

అని మాత్రమే కలదు- కాని స్తుతి లేదు.

రంగనాథ రామాయణము నందు

..................ఆవేదండయాన
యామహా మహునకు నాతిథ్యమొసగి-శ్రీ మీఱ నిటకు విచ్చేసితి గానఁ
జరితార్థ నైతి నీ చరణ పద్మములు-దరిసించి శ్రీరామ! త్రైలోక్యనాథ।
మీ పాద తీర్థమే మిన్నేఱు భువన-పాపంబు లెడఁ బాపఁ బొల్పుదెననగ

1, దా. ప్రతి. వాల్మీకి రామాయణము. బాల. సర్గ. 15 శ్లో. 17.
2. రంగనాథ రామాయణము. బాల. ద్వి- 476-488.
3. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. బాల. సర్గ. 49 శ్లో. 17 1/2

నిలయెల్ల నొకట మిన్నెక్కటి గెలిచి-బలిమెట్టి బ్రహ్మాండ భాండంబు ముట్టి
వేద శిరోవీథి విహరించు నీదు-పాదముల్ నాదుశాపముఁ బాపుటరుదె"[1]

యని రాముని వినుతించినట్లు 5 ద్విపదల స్తోత్రము రచితమైనది. ఇది—

"ఓం భగవాన్ వాసుదేవః పవిత్రం, తత్పాదౌ పవిత్రం, తత్పాదోదకం పవిత్రం"[2]

అనియు,

"విలాస విక్రాంత పరాపరాలయం-నమస్యదార్తి క్షపణే కృత క్షణం"[3]

అనియు ఆచార్య పురుషులచే చెప్పబడుచున్న భగవత్పాద, తత్పాద తీర్థ మహిమను ప్రత్యేకముగా చెప్పనుద్దేశించియే చేర్చబడినది.

3. శబరీ స్తుతి :—

రామ లక్ష్మణులు కబంధ దర్శిత మార్గము ననుసరించి ప్రయాణమై నడచి శబర్యాశ్రమమును చేరిరి. శబరి ఎదురుగా వచ్చి సాగఁబడి లేచి మ్రొక్కి యథావిధి వారిని సత్కరించినది.

ఇచట మూలమునందు శబరి రాముని స్తుతించినట్లు లేదు-రాముని కుశల ప్రశ్నకు సమాధానముగా నయ్యింతి—

"అద్యప్రాప్తా తపస్సిద్ధి-స్తవ సందర్శనాన్మయా।
అద్యమే సఫలం తప్తం-గురవశ్చ సుపూజితాః॥
అద్యమే సఫలం జన్మ-స్వర్గశ్చైవ భవిష్యతి।
త్వయిదేవ వరే రామ-పూజితే పురుషర్షభ॥
చక్షుషా తవసౌమ్యేన-పూతాస్మి రఘునందన।
గమిష్యామ్యక్షయాన్ లోకాం-స్త్వత్ప్రసాదా దరిందమ॥"[4]

అని రామునికి విన్నపము చేసినది; ఇది స్తుతికాదు. కాని రంగనాథ రామాయణము నందు—

"దశరథ వరపుత్ర తాటకా జైత్ర-కుశిక సంభవయాగ కుశల ప్రయోగ
చిరముని ధ్యేయ శిక్షిత తాటకేయ-పరమ గంగా తీర పాద సంచార
పదరజోనైర్మల్య పాలితాహల్య-విదళిత హరచండ విపుల కోదండ
భీమ భార్గవరామ బిరుద విరామ-కామిత పితృవాక్య కరణ సుశ్లోక
ప్రకటాపరాధ విరాధ నిరోధ-సకల ముని త్రాణ సత్యప్రవీణ
ఖరదూషణాది రాక్షస శిరశ్ఛేది-మరణార్థి మారీచ మర్ది నారాచ
సీతావియోగ సూచిత మోహరాగ-ఖ్యాత ఖగాధ్యక్ష కల్పిత మోక్ష
యలఘు విక్రమధామ యతిపుణ్యనామ-నెలకొని రఘురామ నినుఁ జూడఁగంటి"[5]

అని సుమారు 9 ద్విపదలతో రచితమైన శబరీ స్తుతి గలదు. జన్మ ప్రభృతి శబర్యాశ్రమాగమము

---

1. రంగనాథరామాయణము. బాల. ద్వి-1500-1505.
2. దేవతా తిరుకల్యాణము, భట్టీయము-పుణ్యాహవాచనము.
3. యామునాచార్యులు-స్తోత్ర రత్నము-శ్లో. 30
4. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. ఆరణ్య. సర్గ. 74 శ్లో. 11,12,13.
5. రంగనాథ రామాయణము. ఆరణ్య. ద్వి-1442-1449.

వరకు జరిగిన రామ చరిత్ర ప్రధాన కథాంశముల సూచనయే ఈ స్తుతి ముఖ్య ప్రయోజనము. పట్టాభిషేకాంతమగు షట్కాండ పరిమిత రామాయణములో అర్ధ భాగమైన అరణ్యకాండము శబరీ వృత్తాంతముతో పరి సమాప్తమగుచున్నది. అంతవరకు జరిగిన వానిని ఒక్కసారి నెమరు వేయ దలచి సింహావలోకనముగా కవి ఈ శబరీస్తుతి నిట కల్పించినాడని తోచెడిని.

4) విభీషణ స్తుతి :—

రావణ బహిష్కృతుడైన విభీషణుడు రాముని యొద్దకు వచ్చి శరణు కోరగా, అతడభయము నొసంగెను. ఇచ్చట మూలమునందు విభీషణ స్తుతి లేదు. అతడు రాముని పాదములపై పడి "నేను రావణుని తమ్ముడను, బంధుమిత్రాదులను వదలి నిన్ను శరణు పొందితిని; నా జీవిత రాజ్యములు నీయధీనమని"1 నేరుగా పల్కినట్లు కలదు. కాని రంగనాథ రామాయణమునందు—

....దండ ప్రణామముల్ దగఁజేసి పలికె
నిత్య సత్య త్రాణ నిత్య కల్యాణ-నిత్య జగత్త్రాణ నిత్య గీర్వాణ
జగదన్వయాకార జగదేక వీర-జగదుదయాకార జగదబ్ధిపూర
సర్వ సంగాతీత సర్వానుభూత-సర్వజగత్పూత సర్వసమేత
గురులఘు క్రమరూప గురుబోధ దీప-గురుమధురాలాప గురుచారుచాప
పద్మ సన్నిభనేత్ర బహుజీవ సూత్ర-పద్మాకలిత గాత్ర పరమ పవిత్ర
కవి మనస్సంవేద్య కరుణానవద్య-వివిధ శాస్త్రోక్త్యాద్య వేదాంత వేద్య
పరమాత్ముడవు నీవ పరమంబు నీవ-పరమ విద్యయు నీవ పరికింపనెందు
భువన కర్తవు నీవ భువనంబు నీవ-భువన హర్తవు నీవ భువనైక వీర
యాగ భోక్తవు నీవ యాగంబు నీవ-యాగ ఫల ప్రదుం డరయంగ నీవ
చంద్రార్కులును నీవ జలధులు నీవ-యింద్రాదులును నీవ యిలయును నీవ
శబ్దార్థముల్ నీవ శబ్దముల్ నీవ-శబ్దముల్ భేదించు శ్రవణముల్ నీవ
మూడు మూర్తులు నీవ మూడు మూర్తులకుఁ-బోడిమి నవ్వలి పొడవును నీవ
క్షరమును నీవ యక్షరమును నీవ—క్షర సాక్షి నీవ యక్షర సాక్షి నీవ
త్రిభువన వందిత దేవాది దేవ-యభయ మీ దేవ నా కఖిలాధి నాథ
జయ జయ శతకోటి జలజాప్త తేజ-జయజయ సంసార సర్ప సుపర్ణ
లలితాగమస్తోత్ర లక్ష్మీ కళత్ర-విలసద్దయా పాత్ర విబుధారి జైత్ర
దినకర శశి నేత్ర దివ్య చారిత్ర-యనుపమ శుభగాత్ర యఖిలైక సూత్ర
వేయినోరుల భోగి విభుడైన నుతులు-సేయంగ నోపునే శ్రీ రామ నిన్ను
నప్పద్మ సంభవుండైన నీ మహిమ- నొప్పార నుతియింప నోపునే తవిలి

---

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. యుద్ధ. సర్గ. 19 శ్లో. 2-6.

అనుజో రావణస్యాహం-తేన చాప్యవ మానితః।
భవంతం సర్వభూతానాం-శరణ్యం శరణాగతః॥
పరిత్యక్తా మయా లంకా-మిత్రాణిచ ధనానిచ।
భవద్గతం మే రాజ్యంచ- జీవితంచ సుఖానిచ॥ (4 1/2, 5 1/2)

నేనిన్ను నుతియింప నెంతటి వాడ-దాసపుండను వృథా తరళ చిత్తుడను
భూనాథ నీవాది పురుషోత్తముడవు-నేనెంతవాడను నిజముగాఁ దెలియ"[1] అను
వరకు సుమారు 22 ద్విపదల స్తోత్రము గలదు.

విభీషణుడు ధర్మాత్ముడు. బ్రహ్మను గ్రహమున పర తత్త్వ స్వరూప జ్ఞానమునొందినవాడు అట్టివాడే రామ తత్త్వమును నిజముగా గ్రహించును. అతడు చేసినది, చెప్పినది, ఇతరుల కుపదేశము ఆదర్శమునగును. కావున కవి యిచ్చట విభీషణస్తుతిని జొప్పించినాడు. "ఉపనిషత్సార భూతమైన' పరమాత్మజగద్వ్యాపకత్వ, విరాట్ తత్త్వమును ఈ స్తుతి ద్వారా ప్రతిపాదించుట కవి ప్రధానోద్దేశ్యము."

5) నదీస్తుతి :—

శ్రీ రాముని బ్రహ్మాస్త్రను సంధానమునకు వెఱచి, సముద్రుడాతని శరణాగతి జొచ్చెను. సాగర పత్నులైన గంగాది నదులును తమ మంగళ సూత్రములు నిలుపుమని రాముని ప్రార్థించినవి ఈ సందర్భమున రంగనాథ రామాయణమునందు అమూలకమున నదులొనర్చిన శ్రీ రామ స్తోత్ర మొకటి కలదు. అది

"శరణార్థులము రామ జగపతి రామ-కరుణింపవే మమ్ము కరుణా సముద్ర
యభయంబు వేడెద మయ్య యంచలము-నభినవంబుగను నీ యర్థింగాచి
శుభతర మంగళ సూత్రముల్ నిలుపు-త్రిభువనాధీశ్వర దీన మందార!
యపరాధిఁ గాచుట యదియె నీ గుణము-కృపఁజూచి రక్షించు గీర్వాణ వంద్య
నీ మహిమల నెంచ నేరవు శ్రుతులు-నే మెంత వారము యిట మిమ్ముఁబొగడ
దేవతామయుడవు దేవ దేవుడవు-కావను బ్రోవను గర్తవు నీవు
భూమీశ లోకేశ భూరి ప్రకాశ-భూమిజాహృదయేశ పుణ్య స్వరూప"[2] అను
వరకు 7 ద్విపదలతో రచితమైనది. ఈ స్తుతి సర్వ దేవతా మయుడైన శ్రీరాముని అపరాధి రక్షా గుణమును ప్రకాశింప జేయుట కుద్దిష్టమైనది.

6) స్వస్త్యయనము :—

నికుంభిలా యాగమొనర్చు మేఘనాధ వధార్థము సౌమిత్రి విభీషణాదులతో బయలుదేరగా శ్రీరాముడతని నాశీర్వదించును. ఇచ్చట మూలమునందు—

"విభీషణేన సహితో-రాజ పుత్రః ప్రతాపవాన్।
కృత స్వస్త్యయనో భ్రాత్రా-లక్ష్మణస్త్వరితో యయౌ॥"[3]

అని కలదు. ఇందలి "కృతస్వస్త్యయనో భ్రాత్రా" అనుదాని నవలంబముగా బుద్ధ భూపతి ఈ క్రింది కవచమును (దీవనను) రచించెను.

అనిశంబు జయము శ్రీహరి యొనఁగూర్చు-ఘనతర శుభము శంకరుడిచ్చు; నజుడు
నీకాయువు ఘటించు, నిఖిల దేవతలు-గైకొని దిశలందుఁ గాతురు నిన్ను

---

1. రంగనాథ రామాయణము. యుద్ధ. ద్వి. 673-694,
2. రంగనాథ రామాయణము. యుద్ధ. ద్వి-932-938.
3. దా. ప్రతి. వాల్మీకి రామాయణము, యుద్ధ. సర్గ. 85 శ్లో 30 1/2.

అనలుండు ననిలుండు నభిరక్షణంబు-దనరఁజేయుదురు ముందఱ వెన్క-నీకు"[1]

ఇది రాముడు లక్ష్మణునికి చేసిన అమూలకమైన స్వస్త్యయనము; ఇట్లే ఇతడు హనుమంతునికిని స్వస్త్యయన మొనర్చి యున్నాడు. అదియు అమూలకమె.

రావణ శక్తిచే మూర్ఛిల్లిన సౌమిత్రిని బ్రతికించు నిమిత్తము ఆంజనేయుడు సుషేణోప దేశంబున సంజీవ కరణిని గొనివచ్చుటకై ద్రోణాద్రికి పోవ సిద్ధమై రాముని యడుగుల కెఱఁగగా అతడతనిని లేవనెత్తి ఆలింగనము సేసి రక్ష పెట్టెను. మూలమునందు—

త్వర వీర స్త్వయాగత్వా-ఆనయస్వమహౌషధీః।
స్వస్తితేస్తు మహాసత్త్వ-గచ్ఛయాత్రాం ప్రసాధయ॥"[2]

అని మాత్రమే కలదు. ఇందలి "స్వస్తితేస్తు మహాసత్త్వ" అనుదాని యాధారముగా ఈ క్రింది రక్షా కవచము రచితమైనది.

ఇంద్రుడు నీ శిర, మినుడు నీ ముఖముఁ-జంద్రుండు నీ మది. శక్తి నీ పిఱుదు
అనిలుండు నీవెన్ను హరుడు నీవాల-మనలుండు నీ యగ్రము, అజుడు నీ బుద్ధి
వరుణుండు నీ శక్తి, వాణి నీవాణి-గరుడ కేతనుడు నీ ఘన బాహు యుగముఁ
గుంజ రాననుడు నీ కుక్షి రక్షింతు-రంజనాసుత వేగ యరిగి రమ్మనుడుగ"[3]

మహా భాగవతాది పురాణములందు, ఆనందాది రామాయణములందు నారాయణ కవచ, శ్రీరామ కవచ హయగ్రీవ కవచాది రక్షాస్తోత్రములు కలవు. వాని మాదిరి కవి యిట సర్వదేవతా కవచ రక్షాస్తోత్రములను దెలుగున రచించి రామునిచేత సౌమిత్రి మారుతులకు వానితో రక్ష పెట్టించినాడు.

ఇట్టి స్తుతులును దీవనలును కావ్య విస్తరణలో కొంతవరకు దోహద మొనర్చినవి.

ఇ) సంభాషణములు :—

రస పోషణము, ఔచిత్యము, పాత్రల శీలమును దృష్టియందు పెట్టుకొని, బుద్ధ భూపతి మూలమునందలి సంభాషణలను కొన్నింటిని పెంచియున్నాడు; సందర్భమును పురస్కరించుకొని కొన్నింటిని క్రొత్తగా జేర్చి యున్నాడు.

ఇదువరలో మూలమునందుండి అనువాదమున తగ్గించినట్టి, లేక పూర్తిగా త్యజించినట్టి వానిని సంగ్రహ భాగమున తెలిపి యుంటిని. ఇప్పుడు గ్రంథ విస్తృతికి దోహద మొనరించెడు నట్టి కొన్ని క్రొత్తగా చేర్చిన సంభాషణలను, ఉన్నను పెంపొందింప బడిన వానిని కొన్నింటిని పేర్కొందును.

1) కబంధుడు రావణ వృత్తాంతమును దెలుపుట :—

మూలమునందు శాపవిముక్తుడైన కబంధుడు శ్రీ రామునితో "సుగ్రీవుని స్నేహితునిగా జేసికొనుము; అతడు సీతాన్వేషణములో తోడ్పడ గలడ"ని చెప్పి ఋష్యమూకమునకు మార్గమును చూపెను.[4] కాని రావణుని గూర్చి ఒక్క మాటయు పలుకలేదు.

శ్రీరాముడు కబంధునితో—

---

1. రంగనాథ రామాయణము. యుద్ధ. ద్వి-5443-5445.
2. ప. ఉ. ప్రతి వాల్మీకి రామాయణము. యుద్ధ. సర్గ. 81 శ్లో 49.
3. రంగనాథ రామాయణము యుద్ధ. ద్వి-6593-6596.
4. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. ఆరణ్య. సర్గలు. 71, 72, 73.

"రావణేన హృతా భార్యా-మమసీతా యశస్వినీ।
నిష్క్రాంతస్య జనస్థానా-త్సహ భ్రాత్రా యథాసుఖం॥
నామ మాత్రం తుజానామి-నరూపం తస్య రక్షసః।
నివాసం వా ప్రభావం వా-వయం తస్య నవిద్మహే॥

... ...

సత్వం సీతాం సమాచక్ష్వ-యేనవా యత్రవా హృతా।
కురు కల్యాణ మత్యర్థం-యది జానాసి తత్త్వతః॥[1]

అని యడిగి యుండెను. అప్పుడతడు "శాపదోషముచే నా జ్ఞానము నశించినది; నన్ను అవటము నందుంచి దహింపుము. శాప ముక్తుడనై స్వ స్వరూపమునొందిన నేను రాక్షసుని తెలియగలవాని గూర్చి తెలిపెద"నని తర్వాత అట్లే చెప్పియున్నాడు. కాని రాముని ప్రశ్నలకది సరియైన సమాధానముకాదు; దివ్య జ్ఞానము కలవాడు చేసెడునది కాదు; మూలమునందు ప్రశ్న ప్రశ్నగానే యుండిపోయినది.

కావున బుద్ధ భూపతి మూలమునందలి ఈ లోపమును సవరించుటకో యన—

"వినుమింక రావణు విధమెల్ల నేను-వినిపింతు(దేటగా వివరించి, యతడు
ధనదానుజుడు, పులస్త్య బ్రహ్మ కూర్మి-మనుమండు తన తపో మహిమ మెప్పించి
నలువచే వరము లున్నతిఁ గాంచినాడు-చెలగి దిగ్విజయంబు చేసినవాడు
తొలి వేలుపులకెల్ల దొరయైనవాడు-కలవేలుపులకెల్లఁ గంటకైనవాడు
బలు తలల్ పదియును, బాహులిర్వదియుఁ-గలవాడు, లవణ సాగర ఖేయమైన
లంకా పురంబు పాలన సేయువాడు-బింకాన రజతాద్రిఁ బెకలికినవాడు"[2]

అని రావణుని రూప, నివాస, ప్రభావములను 6 ద్విపదలలో సంక్షిప్తముగా పొందు పఱిచి రాముని ప్రశ్నలకు సమాధానముగా కబంధునిచే చెప్పించినాడు-

2) సుమంత్రుడు దశరథుని ఓదార్చుట :—

శ్రీ రాముదులను రథముపై వనమునకు తోడ్కొనిపోయి, మరలి వచ్చిన సుమంత్రుడు (సూతుడు) దశరథునకు వారి సందేశమును వినిపించెను. దశరథుడు "రాముని జూడకున్న నేన ప్రాణములు నిలువవు రాముని యొద్దకు తననుగొని పొమ్మ"నిసుమంత్రునితో పలికి శోకించుచుండెను.

ఈ సందర్భములో సుమంత్రుడు దశరథుని యోదార్చినట్లు ప్రత్యేకముగా మూలమునందు కనిపించదు; కాని రంగనాథ రామాయణమునందు—

"విను. నీవు శ్రీరాము వెదుకొని పోవఁ-గని ప్రజ శోకించుఁ, గైక దూషించు
నిది విచార్యంబుగా, దిది బుద్ధిగాదు-మది నింత వగవకు మనుజేంద్ర నీవు
ధైర్యంబు వదలకు ధర్మంబు నిలుపు-మార్యులు గొనియాడ ననఘుండవగుము
అఱలేక యడవుల నఖిల భోగములు-మఱచి నీ సుతులు నెమ్మది నున్నవారు"[3]

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. ఆరణ్య. సర్గ. 69, శ్లో.లు 21 1/2, 22 1/2 51/2
2. రంగనాథ రామాయణము, అరణ్య, ద్వి-1426-1431.
3. రంగనాథ రామాయణము. అయోధ్యా. ద్వి. 1175-1178.

అని సుమంత్రుడు దశరథుని నోదార్చినట్లు కవి నాల్గు ద్విపదల నధికముగాఁ జొప్పించి యున్నాడు మూలమునందు శ్రీరాముడు సుమంత్రునకు సందేశము నొసంగుచు—

"ఇక్ష్వాకూణాం త్వయాతుల్యం-సుహృదం నోపలక్షయే।
యథా దశరథో రాజా మాం నశోచేత్తథాకురు॥"1

అని ప్రత్యేకించి అతనికి హెచ్చరిక చేసియుండెను. ఆ హెచ్చరిక ననుసరించి సుమంత్రుడు దశరథుని సాంత్వన పఱచి యుండవలెను; కాని లేదు. కావున బుద్ధారెడ్డి తల్లోపమును పూరించుటకై నాల్గు ద్విపదల నధికముగా చేర్చినాడని తోచుచున్నది.

3) వాలి సుగ్రీవ సంభాషణము ;—

రెండవసారి యుద్ధమునకు వచ్చిన సుగ్రీవుని గాంచి వాలి క్రోధ తామ్రాక్షుడై—

"ఏష ముష్టిర్మయా బద్ధో-గాఢ స్సన్నిహితాంగుళిః।
మయావేగ విముక్తస్తే-ప్రాణానాదాయ యాస్యతి॥"2

యని పలుకగా,

"తవైవ చాహరన్ ప్రాణాన్-ముష్టిః పతతు మూర్ధని"3

యని సమాధానమొసగి వాలిచే తాడితుడై రక్తము గ్రక్కుచు నేల గూలెను.

మూలమునందింత మాత్రమే వాలి సుగ్రీవుల సంభాషణము కలదు. కాని, రంగనాథ రామాయణమునందిది వీరాలాపములతో రసోచితముగా పరస్పరాధిక్షేపకముగా ఈ క్రింది రీతి విస్తరింపబడి యున్నది. చూడుడు—

"నాతోడఁ బోరాడి నాకోడి పాఱి-యేతెంచితే యేరి యిటు లజ్జ మాలి,
యేతెంతు గాకేమి యిప్పుడు జముని-వాకిటి నిను సుట్టవడియంపొనర్తు
బెదరక చెదరక బిట్టు బీరములు-పదరక యొక్కింత వడినిల్వు చాలు
నాలంబులో ముష్టిహతి నిన్ను నేలఁ-గూలిచి ప్రాణముల్ గొందు నేననుచు"4

వాలి ముష్టితో పొడవగా, సుగ్రీవు డొఱగి, నెత్తురు గ్రక్కి యొయ్యనఁ దెలిసి—

అన్నవు నాకుఁ బూజార్హుండ వనుచు- నిన్నాళ్ళు సైచితి నింతియ కాని
విగ్రహంబున కేను వెఱతునే తొంటి-సుగ్రీవుడనుగాను జూచి పోరాడు
వాలి నిన్నిప్పుడవశ్యంబు చంపి-పాలింతుఁ గపిరాజ్య పదము నేననుచు"5

కోపించి వాలిపై సాల వృక్షమును పడవైచెను.

4) అతికాయ భాషణము.

ధాన్య మాలిని కుమారు డతికాయుడు యుద్ధమునకు వచ్చెను. ఇతడు వృద్ధసేవి, శ్రుతిధరుడు

---

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. అయోధ్యా. సర్గ. 52 శ్లో. 22.
2. దా. ప్రతి. వాల్మీకి రామాయణము, కిష్కింధా. సర్గ, 16 శ్లో. 20
3. ,, ibid ,, కిష్కింధా. సర్గ. 16 శ్లో. 21.
4. రంగనాథ రామాయణము. కిష్కింధా. ద్వి-491-494.
5. రంగనాథ రామాయణము. కిష్కింధా. 498-500.

సర్వాస్త్ర విదుషాం వరుడు;[1] పరతత్త్వవేది;[2] ఇతడు మారుతాత్మజ కుముద మైందాదులు మహీధ్రము లతో తనమీదికి రాగా, నవ్వి—

"కలహ విక్రమ కళా కలిత సత్వములు-గలుగవు తొలగుడు కపులార! మీరు
త్రిజగంబులును మెచ్చఁ దివిరి వారాశి-నిజ శరాగ్రంబున నిల్పిన శూరుఁ
డతడెవ్వ డిటుచూపు డతనిపైఁ గాని-యతులితంబైన నాయస్త్రంబు విడువ,
దురమున నింద్రజిత్తుడు గట్టినట్టి-యురగ పాశంబుల నూడ్చుకొన్నట్టి
యతడెవ్వ డిటు చూపుడతనిపై గాని-యతులితంబైన నాయస్త్రంబు విడువ
మూడు లోకంబులు మునుమిడి గెల్చి-వాడిమి మగటిమి వాలిన శూరు
నలఘు బలోదీర్ణు నాకుంభ కర్ణుఁ-దలఁ ద్రెవ్వనేసి యుద్ధతిఁ బేర్చి యున్న
యతడెవ్వడిటుచూపు డతనిపైఁగాని-యతులితంబైన నా యస్త్రంబు విడువ
దేవ దానవ యక్ష దివిజుల కాజి-భావింప నెక్కుడై పరగిన యట్టి
రావణునోర్చెద రణములో ననుచు-నీ విధంబున లంక కేతెంచు మీరు
డతడెవ్వడిటుచూపు డతనిపైఁగాని-యతులితంబైన నా యస్త్రంబు విడువ"[3]

నని పెక్కు గర్వములాడుచు పల్కిన వాక్యములు అమూలకములు.

ఇతడు రామున్ని సమీపించి—

"రథే స్థితోహం శరచాప పాణి-ర్న ప్రాకృతం కంచన యోధయామి।
యశ్చాస్తి కశ్చిత్ వ్యవసాయయుక్తో-దదాతుమే క్షిప్ర మిహాద్య యుద్ధం॥"[4]

అని సగర్వముగా ఘోషించినట్లు మూలమునందున్న ఈ యొక్క శ్లోకము అతని వృద్ధ సేవిత్వము నకు, శ్రుతి ధరత్వమునకు, పరతత్త్వవేదిత్వత్వమునకు జాలదు. రాముడు నరుడుకాదు, మానిసి యైన పరమాత్మయే-నారాయణుడే-యని యతని మాటలు ప్రస్ఫుటీకరించవలెను. అది మూలము నందలి పై శ్లోకమున గాన వచ్చుచులేదు గదా! కావున ఈ యవకాశమును జారవిడువకుండ, బుద్ధారెడ్డి రాముని యవతార కారణమును, పరమాత్మతత్త్వమును, ఇంక పూర్వ మెత్తిన యవ తార విషయములను అతికాయుని చేతనే అధిక్షేపింపఁ జేయుటకై

"రామ యీ సమర ధరాస్థలిలోన-నీమగటిమిఁజూపు నిక్కంబు నాకు
ఎంతటి వాడవో యెవ్వరు నిన్ను-నింతటి వాడని యెఱుగ రెన్నడును
మా తండ్రి కతమున మానిసివైతి-మాతండ్రి కతమున మహిరాజవైతి;
.... మొదలుకొని ....

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. యుద్ధ. సర్గ. 71 శ్లో 28
తస్యాసీ ద్వీర్యవాన్ పుత్రో రావణ ప్రతిమోరణే।
వృద్ధసేవీ శ్రుతి ధరః సర్వాస్త్ర విదుషాం వరః॥
2. రంగనాథరామాయణము. యుద్ధకాండము. ద్వి-4466.
3. ,, ibid ,, యుద్ధ. ద్వి-4481-4491.
4. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. యుద్ధ. సర్గ. 71 శ్లో. 45.

ధారుణీ సుర వేషధారి కుఠారి-వై రాజ సంహారి వసుదుగాకేమి
తలపు నీ మీదివే తప్పదు నాకు-జలుకు లేటికి నిన్నుఁ బట్టెద వెదకి
అచ్చెరువైన దుగ్ధాంబుధిలోనఁ-జెచ్చెర నిన్ను మోచియుండెలియఁడ
బరికింప నల వట పత్త్రంబు గాదు- కరము భీషణము నాకంక పత్త్రంబు
దురమున నను నీకుఁ దొడరంగరాదు-పరగర్వమున నెందు వాలిన హడ"[1]

వరకు సుమారు 35 ద్విపదలను రచించి మూలమును పెంపొందించినాడు. ఇవి యన్నియు అమూల్య భావనలే—

5) ఇంద్ర జిద్విభీషణ సంవాదము :—

రావణుడు మంత్రి సేనాపతి రాక్షస పుంగవులతో సమాలోచన సభ నేర్పాటు చేసెను. అందు విభీషణుడు "రాముని గెల్చుట అసాధ్య" మనెను. ప్రహస్తుడు "ఉరగాదులతో పోరాడి ఓటమి నెఱుగని మేము దురములో రామునకు నోడుదుమే? ఇవి యేటి మాటల"ని పల్కెను. ఆ సమయమున ఇంద్రజిత్తాగ్రహమెత్తి స్వపరాక్రమాదుల నుద్ఘోషించి విభీషణుని దూషించెను. విభీషణుడును మేఘ నాదుని మందలించెను.

ఇచ్చట మూలమునందు "ఇంద్రజిద్వాక్యములు 6 శ్లోకములలో నున్నవి"[2] తద్భావమును దెలుపు ద్విపదలు రంగనాథ రామాయణమునందును రచితములైనవి[3] కాని ఇవి దురానదుడైన ఇంద్రజిత్తు దురహంకారమును అంతగా వెల్లడించుచు లేవు; బుద్ధభూపతి దీనినూహించి—

"అనలునిఁగారించి యంతకు నొంచి-దనుజుదూఱించి యాతఱి పాశినొంచి
గాలిఁ దూలించి యక్షపుని మర్దించి-శూలి నోడించి నిష్ఠురత వాటించి
యేచిన నాచేత నీనరుల్ చావ-రా? చెప్పెదుబ్బ వారలఁ బెద్దసేసి!
కలతునా సప్త సాగరములు సొచ్చి-మలపుదు నామేరు మందరంబులను
దాటుదునా ధరాతల మెల్లఁ గడవ-మీటుదునా నేల మింటితో నంట
వంతునా జగములు, వనచర కోటి-ముంతునా బెగడొంద మున్నీటిలోనఁ
బుడమి మోచిన నాగ పుంగవుఁబట్టి-పిడుతునా విషమెల్లఁ బిచ్చిలి పోవ
నొక్కట దుండంబు లొడిసిరా దిగిచి-దిక్కరీంద్రుల నీడ్చి తెత్తునా పూని
భూమితో నిప్పుడు భుజ శక్తి మెఱసి-ప్రాముదునా చంద్రభాను బింబముల
వనచర కోటుల వైతునా పట్టి-దినకర బింబంబు దిక్కులు గడవ
నాలంబులో వానరాలి రక్తములు-గ్రోలింతునా భూత కోటుల చేతఁ
గప్పుదునా యంపగములచే మిన్ను-నిప్పుడమియు దిక్కులన్నియుఁ గూడఁ
గడు నొగల్ కరములఁగబళించి త్రిప్పి-యడతునా నేలలో నరుకని రథముఁ
బెడచేత లోచేతఁ బృథివియు మిన్ను-నడతునా పొడి పొడియై రాలి పోవ

1. రంగనాథ రామాయణము. యుద్ధ. ద్వి-4506-4540.
2. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. యుద్ధ. సర్గ. 15 శ్లో.లు 2-7.
3. రంగనాథరామాయణము. యుద్ధ. ద్వి-455-458.

దనుజాధి నాథుని తమ్ముడ వగుట-నిను నొండనాక మన్నించితిఁగాని
యొరుడైన సైతునే? యూరక యుండు—వెరవిడి మాటలు వేయాడనేల?"[1]

అని మేఘనాదుని క్రొవ్వును దుర్మదాంధత్వమును పట్టి యిచ్చుటకై పదునాలు ద్విపదలను రచించి కూర్చియున్నాడు.

ఇట్లు పెంచి వ్రాసిన ద్విపదలలోని ఇంద్రజిదష్ట దిక్పాలక జయ విషయమును విభీషణుడు ఖండించక పోయినచో ఇంద్రజిత్తునకు సరియైన సమాధానము చెప్పినట్లు కాదు. కావున దీనిని కూడ కవి యూహించి—

ఎవ్వనిగాఁ జూచితి వినకులేశ్వరుని-క్రొవ్వి పల్కెద వీవు కొలువు లోపలను
గణుతింప నింద్రుండు గాడు నీ కోడ-రణభీషణుండగు రాముండు గాని
గణుతింప ననలుండు గాడు నీ కోడ-రణభీకరుండగు రాముండు గాని
.... మొదలుకొని ....
వారి నోర్చిన రీతి వచ్చునే యోర్వ-నా రామ విభునకు నాలంబులోన"[2]

అని ఉద్గాఢ వాక్యములు గల 10 ద్విపదలను రచించి, మూలాను గుణముగా రచించిన ద్విపదలకు ముందు కూర్చి ఔచిత్యమును ఘటించినాడు. తాత్పర్యమేమనగా మూలము నందలి యుద్ధకాండము సర్గ 15 లోని 7 వ శ్లోకము తర్వాత 9వ శ్లోక విషయమునకు పూర్వము ఈ యిరువది నాలు ద్విపదలు చొప్పించబడినవని తెలును. ఇవి మూల భావమునకు పెంపుదలలు, అమూలకములు.

6) రావణ విభీషణ సంవాదము :-

మంత్రాలోచన సభయందు విభీషణు డింద్రజిత్తు దురహంకార వాక్యములను ఖండించి, రామునికి సీతాదేవి నొసంగుటయే తగునని పల్కెను రావణుడు కోపించి పాముతోనైనను మెలగ వచ్చుకాని పగవానితో గూడి మసరాదు; తమ్ముడవు గావు నీవు పగవాడివని విభీషణుని దూషించెను. కుంభ కర్ణుడు ఇటు తమ్మని, అటు అన్నను ఎవరిని ఏమియు అనలేక తన గుహకు నిద్రింపగ బోయెను.

ఇచ్చట రంగనాథ రామాయణమునందు
"అన్నవు గాన నీయాపద" కులికి-యన్నియుఁ జెప్పితి హితవని నీకుఁ
బొసగదు బహుముఖంబులు గాన నీకు-నసురేశ చెప్పిన యాప్తుల బుద్ధి
హితవు చెప్పెడి మంత్రులెందును గలరు-హితవని వినురాజు లెందు గల్గుదురు
తగునాకుఁ జెప్పట తగునీకు వినుట— .... మొదలుకొని.........
ప్రళయానిలము ఘన పర్వత శిఖర-ములు ద్రోచు పగిది రాముడు ఖండనమున
నీతల లందంద నేలపైఁ గూల్చి-నేతెఱంగున నింక నేఁజూడనేర్తు"[3]

వరకు సుమారు 32 ద్విపదలతోఁ గూడిన అమూలకమైన విభీషణ దశగ్రీవ సంభాషణము గలదు

1. రంగనాథ రామాయణము. యుద్ధ. ద్వి. 459-474.
2. ,, ibid ,, యుద్ధ. ద్వి. 476-485
3. రంగనాథ రామాయణము. యుద్ధ. ద్వి-502-534.

దా. ప్రతి ననుసరించి చూచిన ఇది యుద్ధ కాండము 16వ సర్గ 15వ శ్లోకము తరువాతిదిగా సమన్వయమగును.

ఈ అమూలక సంవాదమెంతయో ప్రయోజనవంతమైనది. "దైవము ప్రతికూలమైనచో బలమెంతయున్నను లాభము లేదు. దైవమనగా వేరులేదు; రాముడే దైవము"ని విభీషణుడు దెల్పగా "ఆకులలములు దినువాడు, స్త్రీ కొరకై యేడ్చువాడు, కోతిని మఱుగు జొచ్చినవాడు దేవుడా? యని రావణుడు వాదించెను. అంతట విభీషణుడు "అతని మహిమలు వనజాసనాదులకును దెలియఁ దరము గాదు. దివ్యులఁ బెంప, ఋషుల రక్షింప నాది నారాయణుడు దాశరథిగా జన్మించెను. అతడు వచ్చి తలలు తఱుగక ముందే సీతనప్పగింపుమని యుపదేశించెను."
ఇది తద్వాద సారాంశము.

బుద్ధ భూపతి ఆయా సందర్భాలలో ఆయా పాత్రల ద్వారా శ్రీ రాముని దైవత్వమును వాచ్యముగా నిరూపించుచున్నాడని పరిశీలన వలన తోచెడిని. కావున కవి ఇచ్చటను తదుద్దేశ పూర్తికై మానవునిగా దలంచి విరోధము పెట్టుకొన్న రావణునికి అవతార రహస్య ప్రకటన పూర్వకముగా రాముని దైవత్వమును విభీషణుడు చెప్పినట్లు రావణ విభీషణ సంవాదమును పెంచి మూలమునకు భంగము కాని రీతి నడుమ సముచితముగా సమకూర్చియున్నాడు.

7) లక్ష్మణ ప్రోత్సాహము :-

మకరాక్ష వధానంతరము, ఇంద్రజిత్తు హోమము చేసి దివ్య రథశస్త్రాదులను బడసి, అంతర్ధాన గతుడై వానర సైన్యమును ఛిన్నాభిన్నము చేయుచుండెను. కపులు కుప్పలు కుప్పలై కూలుచుండిరి. అప్పుడు లక్ష్మణుడు కోపించి

"బ్రాహ్మమస్త్రం ప్రయోక్ష్యామి-వధార్థం సర్వ రక్షసాం"[1]

అని అన్నతో పలికినట్లు మూలమునందు కలదు. కాని రంగనాథ రామాయణము నందు-

"... .... భూమీశ వీనిచే పొలిసిరి కపులు
ఇఁక యేమి దేవ! నీవిట్లూర కునికి-ఇదె చూడుమా భూమినెల్ల దిక్కులను
బడి పొర్లుచున్నారు భల్లూక పతులు-మడిసి రనేకులు మర్కటేశ్వరులు
జగదీశ! నిను నమ్మి సకల వానరులు-మిగిలిన భక్తితో మేకొని వచ్చి
తగిలి యీ యింద్రారి దారుణాస్త్రముల-నొగిలి నీ నామమే నొడువుచున్నారు
పగవాడు చేరి నీబలమెల్లఁ ద్రుంపఁ-దగదింకఁ దెగకున్నఁద్రైలోక్యనాథ!
... మొదలు .... -ఈ నిశాచరకోటి నీ యింద్రజిత్తు
నేన చంపెద దేవ నీ మహత్వమున"[2]

వరకు 13 ద్విపదలు అమూలకములు లక్ష్మణ వాక్యములుగా రచితములైనవి.

బ్రహ్మాస్త్రము మహాస్త్రము. అన్ని వేళలందది ప్రయోగింప దగినది కాదు ప్రత్యేక సమయ సందర్భములందే తద్వినియోగ మున్నది. లక్ష్మణుని బ్రహ్మాస్త్ర ప్రయోగమునకు ఆవశ్యకమైన

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. యుద్ధ. సర్గ, 80 శ్లో. 37.
2. రంగనాథ రామాయణము. యుద్ధ. ద్వి-52 53-5265.

ప్రత్యేక సందర్భము ఘటిల్లినదని మూలమునందలి లక్ష్మణ వాక్యములందు ప్రతిపాదింప బడలేదు. తాను చేయ బోయెడి కార్యమునకు తగినంత సమర్థనము లేనిచో ప్రతిపాదిత విషయ వాక్యమునకు రాణింపు ఉండదు కావున బుద్ధ భూపతి మూలమునందలి బ్రహ్మాస్త్రమును ప్రయోగింతుననెడి వాక్య సమర్థనమునకై పై ద్విపదలను రచించి, కూర్చి, మూలమునకే మెఱుగు దిద్దినాడు.

8) ఇంద్రజిద్రావణ సంవాదము :-

శ్రీ రామ చంద్రుడు లక్ష్మణునితో "ఒక్కనికై బ్రహ్మాస్త్ర ప్రయోగము తగదని, బల వంతులైన వానరులను పంపిన వారతనిని హింసింతురనియు, అది సాధ్యము కాని పక్షమున నేనే ఇంద్రజిత్తు నెక్కడికి పోయినను, ఎవరు కాపాడినను వదలక ద్రుంతుననియు" పల్కెను.

ఇచ్చట మూలమునందు-

"విజ్ఞాయతు మనస్తస్య-రాఘవస్య మహాత్మనః।
సన్నివృత్యాహతాత్తస్మా-త్సంవివేశ పురంతతః॥
సోను స్మృత్య వధం తేషాం రాక్షసానాం తరస్వినాం।
క్రోధ తామ్రేక్షణ శ్శూరో నిర్జగామ మహాద్యుతిః॥"1

అని రెండు శ్లోకములు కలవు. ఇవి రాముని యభిప్రాయమును గమనించిన ఇంద్రజిల్లంకాపుర గమనా గమనములకు (రాక పోకలకు) చెందినవి. ఆ తర్వాత హనుమదాదులు చూచుచుండగా, ఇంద్రజిత్తుచే మాయాసీతా ఖండనము జరిగినది.

రంగనాథ రామాయణమునందు-ఇంద్రజిత్తు లంక రాక పోకల నడుమ-

"కట్టల్క గపులను గయ్యంబునందు-నెట్టనే నేసిరి నేలపైఁ గూల
మనుజుల నిద్దఱ మానవుల్ గొంటి-సనవుడు రావణుండతనిఁ గోపించి
యిదియేమి పోకయో యిదియేమి రాక-యిడియేమి సేతగా నెన్ని చెప్పెదవు?
ఒక పరియును బంప కూరక వచ్చి-ప్రకటించె దంచయు వడిగని నీవు
నీవేచి నడచిన నిఖిల లోకములు-భావింప నప్పుడే భస్మమై పోవు
యది గాక యిదియొక్క యధికంబుగాను-మదిఁ దలంపకుము సమ్మదమున నీవు
మగటిమి రామ లక్ష్మణుల వానరులఁ-దెగటార్చి కాని నాదెస కేగుదేకు
మనవుడు నొగాక యని యింద్రజిత్తు-దనుజేంద్రు వీడ్కొని తన మదిలోన"2

ననెడి 8 ద్విపదలతో గూడిన ఇంద్రజిద్రావణ సంభాషణము చొప్పింపబడినది.

మాయ సీత తలను ఖండించుటకు ప్రధానోద్దేశ్యము నికుంభిళా హోమమునకు నిరాటంక సమయము లభించుట; దీనికి కారణము రామలక్ష్మణులను తెగటార్చుటకయిన గట్టి పట్టుదల; ఈ పట్టుదలకు కారణము రావణుని పోటు మాటలు; అవి యేమిటి? వనినచో మూలమునందు సమాధానము లభించదు. అది పూరించుటకై కవి ఈ సంభాషణమును కూర్చినాడని తోచును. కావున ఇది యౌచిత్యవంతమైన కూర్పు.

---

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. యుద్ధ. సర్గ. 81 శ్లో. 1,2.
2. రంగనాథ రామాయణము. యుద్ధ. ద్వి. 5278-5285.

9) లక్ష్మణేంద్రజిత్సంవాదము :-

నికుంభిలా యాగము విఘ్నము కాగా, ఇంద్రజిత్తు రథమెక్కి కార్ముకము ధరించి, బాణములతో వానరులను నొప్పించుచుండెను. విభీషణుడు లక్ష్మణునకు ఇంద్రజిత్తు చేయుచున్న హోమమును కుండము నుండి నగము వరకు వచ్చిన రథమును జూపి యతనిని తెగటార్పుమనెను. అప్పుడు సౌమిత్రి పౌలస్త్యునితో

సమాహ్వయే త్వాం సమరే-సమ్యగ్యుద్ధం ప్రయచ్ఛమే।[1]

అని పలికినట్లు మాత్రమే మూలము నందు కలదు ఇంద్రజిత్తు దీనికి సమాధాన మొసంగనులేదు,

మాయా విదుడైన, కూట యుద్ధ నిపుణుడైన నలినజువర గర్వితుడైన, పూర్వాపకారియైన ఇంద్రజిత్తుని కన్నుల యెదుట గాంచి ఉప్పొంగిన లక్ష్మణుడింత మాత్రమే మాటాడునని మన మూహింప జాలము. ఇది పాత్రోచిత భాషణము కానేరదు. కావున ప్రతిభా సంపన్నుడైన బుద్ధరాజు దీనిని చక్కగా దలంచి, ఈ క్రింది రీతి లక్ష్మణేంద్రజిత్తుల సంభాషణను కొన సాగింప చేసినాడు.

మాయలఁ బనియేమి మగవాడవైన-నా యెదుటికి వచ్చి ననుజూతు గాక
నిక్కంపు లావున నీవు కయ్యమునఁ-జక్క నిల్వుము, నిను జముఁ జూడఁబుత్తుఁ
గపటంబుఁ గైకొన్నఁ, గైకొనకున్నఁ-గపట రాక్షస నిన్నుఁ గడతేర్తువేగ"[2]

నని లక్ష్మణుడు కడు నల్కతోఁ బల్కను. రోష సంకలితుడైన ఇంద్రజిత్తు-

"బాలుడవై యిట్టి పంతంబులేల-యీ లీల నిలువు మీ యించుకఁ దడవు
లక్ష్మణ నిన్ను నాలముఁన వీర-లక్ష్మికిఁ బెడఁబాపి లావెసలించి
యసువుల నాదు బాణావలిఁ బెటికి-వసుమతిపైఁ గూల్చి వారక వచ్చి
కాకుల గ్రద్దలఁగడుపఁ దనిపి-భీకరాకారతఁ బెంపారువాడ
నుఱక నాకట్టిన యురగపాశములు-మఱచితే నేడు నీమనమున నదియు"[3]

నని లక్ష్మణుని యధిక్షేపించెను. ఇది అమూలకమైన పెంపుదం,

ఇక అధికముగా వివరింపక పెంపుదలకు చెందిన మరికొన్ని సంభాషణముల నిట పేర్కొందును.

అ) విశ్వామిత్రుడు నిర్విఘ్నముగా యాగము పూర్తి చేసికొని. జనక మహారాజు యజ్ఞము చూడ మిథిలకు రామ లక్ష్మణులతో బయలు దేరి, మార్గ మధ్యమున విశాలా పురాధిపతి సుమతిచే సత్కరింపబడి. అతడడుగగా, రామలక్ష్మణులను పరిచయము చేసెను.

ఇచ్చట మూలమునందు-

"తస్య తద్వచనం శ్రుత్వా-యథావృత్తం న్యవేదయత్।
సిద్ధాశ్రమ నివాసంచ-రాక్షసానాం వధం తథా॥"[4]

---

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. యుద్ధ. సర్గ. 87 శ్లో. 9.
2. రంగనాథ రామాయణము. యుద్ధ. ద్వి. 5497-5499.
3. రంగనాథ రామాయణము. యుద్ధ. ద్వి-5501-5505.
4. దా. ప్రతి వాల్మీకి రామాయణము. బాల. సర్గ. 48. శ్లో. 7.

అని కలదు- రంగనాథ రామాయణమునందు ఇది

"…. …. …. …. …. -ఓ రాజ కులచంద్ర యో సుగుణాబ్ధి
వీరి వృత్తాంతంబు వినుము దెల్పెదను-సరయువు పొంతఁ గోసల దేశమునను
నరుదొప్పగ నయోధ్యయను పురిమొప్పు-…….మొదలుకొని……….
ఈ రాజ శీతాంశు లిన వంశ కులులు-వీరి సామర్థ్యంబు వినఁగఁజోద్యంబు"1

వరకు 9 ద్విపదలుగా పెంచివివరింపబడినది.

2) అరుంధతీ వసిష్ఠ సంభాషణము :-

సీతా రామ లక్ష్మణులు వనవాసమునకు సిద్ధమై తమ వస్తువుల నన్నింటిని అరుంధతీ, వసిష్ఠ సుయజ్ఞాదులకు భక్తితో సర్పించిరి.

"అప్పుడరుంధతి యకట యిక్ష్వాకు-లిప్పాటు పడుచుండ సిటు చూడఁ దగునె
యని భర్త నడుగంగ నమ్మహామౌని-తన బుద్ధి నెంతయుఁ దలపోసి చూచి
యే రూపమున బోవదిది దైవ యోగ-మూరకుండుము చూచుచుండుద మనియె"2

ఇది అవాల్మీకము; అమూలకము.

వసిష్ఠుడు బ్రహ్మర్షి కదా! తెలిసి తెలిసి యతడు పెట్టిన ముహూర్తమున పట్టాభిషేకము జరుగలేదేమి? యను సందేహము సామాన్యముగా కలుగును. తెలిసియే దైవ యోగము చేతనే ఆతడట్లు పెట్టినాడు. పట్టాభిషేక ముహూర్తము పెట్టక పోయినచో, ఒక దానితోనొకటి సంబంధము గల తర్వాతి ఘటనలు జరుగక రామ వన వాసము ఘటిల్లదు. రాక్షస సంహారము జరుగదు. కావున అతని యెంచుకలో లోపము లేదు; దైవ యోగము చేతనే ఘటిల్లిన దను సమాధానమునకై ఈ పై ద్విపదలు కూర్చబడినవని తోచెడిని.

3) లక్ష్మణ వాక్యము :—

రాముడు ఖర దూషణాదులతో యుద్ధము చేయ నమకట్టి లక్ష్మణునితో "సీతను గొనిపోయి పర్వత గుహ నాశ్రయింపుమని పలికి

"ప్రతికూలితు మిచ్ఛామి-నహి వాక్య మిదం త్వయా।"3

యని యనెను. మూలమునం దీ సందర్భమున లక్ష్మణుని మాటలు పేర్కొనబడలేదు. కాని రంగనాథ రామాయణమునందు—

"ఇన వంశ వల్లభ యే నెట్లు పోదు-నినుడించి యటుగాన నీవు సీతయును
పర్వత గుహఁ జేరి పరికింపు మేన-దుర్వార దనుజులఁ ద్రుంతు మీ కృపను."4

---

1. రంగనాథ రామాయణము. బాల-ద్వి- 1444-1452.
(ఆ- వి. క. ప. ప్రతిలో మాత్ర మీ ద్విపదలు అనుబంధము 1లో చేర్చబడినవి)
2. రంగనాథ రామాయణము. అయోధ్య 724-726. (ఆం. వి. క. ప. ప్రతిలో పుట 120 లో ఇవి అధస్సూచిక యందీయబడినవి)
3. దా. ప్రతి వాల్మీకి రామాయణము-ఆరణ్య- సర్గ 24-శ్లో. 13
4. రంగనాథ రామాయణము- అరణ్య- ద్వి. 515-516.

అని వ్యాఖ్యానమువోలె లక్ష్మణ వాక్యములు చొప్పించబడినవి.

4) ఆంజనేయుడు సుగ్రీవుని వెఱపును మాన్పుట :—

పంపా సరోవర ప్రాంతమున విహరించు రామలక్ష్మణులను గాంచి సుగ్రీవుడు భయపడగా, మన స్తత్వ పరిశీలకుడైన మారుతి—

"పూని వీరలఁ జూడ పుణ్యమానసులు-గాని కానేరరు కపట మానసులు

ఆ రవి చంద్రులో యన నొప్పు వీరు-కారణచిత్తులు కరణి నున్నారు.

నే రూపమున వచ్చి నిందున్నవారో-వీరి చొప్పెరుగక వెఱవ నేమిటికి"[1]

అని విమలుడై పల్కెను. మూలము నం దిట్టి సంభాషణము గానరాదు.

5) నరాంతకాధిక్షేపణము :—

నరాంతకుడు వానరులను హతమార్చుచుండగా, నిరాయుధుడైన యంగదు డతనిని సమీపించి—

"తిష్ఠ కిం ప్రాకృతై రేభి-ర్హరిభి స్త్వం కరిష్యసి

అస్మిన్ వజ్ర సమ స్పర్శం - ప్రాసం క్షిప మమోరసి॥"[2]

అని గర్జించెను. ఆ తర్వాత మూలమునందు నరాంతకుని ప్రతివచనము రచింపబడలేదు. అంగద నరాంతకుల పోరు మాత్రము వర్ణింపబడినది. కాని రంగనాథ రామాయణమునందు—

అనపుడు నవ్వి నరాంతకు డోరి-వనచర నీ వెంతవాడవు నాకు

అఖిల దిక్పాలకుల నదటడంచితిని-నిఖిల దేవతల మన్నింప కేచితిని

అట్టి నాతోడ నీవా యెదిరెదవు-పట్టి చట్టలు చీరి పాఱవైచెదను

నరయంగ ముకుపచ్చలారవు నేడు-బిరుదు పిచ్చుకలతోఁ బెనగఁ జూచెదవు

నను జూడఁ గాక"[3]

యను నరాంతకు నధిక్షేప వాక్యములును, తర్వాత నంగదుడును

" .. : .. దనుజ ! దశగ్రీవ దర్పంబు మాన్చి

పూని యా ఖర సూతిఁ బొరిమాల్చి పిదప-నే నేగునపుడు నీ వెఱుగవే నన్ను"[4]

అని పలికిన వీరాలాపములును మూలాతిరేకముగా కవి కూర్చినవే.

6) లక్ష్మణుని యుపశమన వాక్యము :—

శ్రీరాముడు తనకు దారి యీయని, పొడ సూపని సముద్రునిపై బాణములను వదలెను. సాగర సంక్షోభ మేర్పడెను. ఇంకను శర ప్రయోగమునకై ధనువు లాగుచున్న రామునియొద్దకు లక్ష్మణుడు శీఘ్రముగా వచ్చి "వలదు వలదని" ధనుపును పట్టుకొనెను.

---

1. రంగనాథ రామాయణము. కిష్కింధా ద్వి. 66-68.
2. వా. ప్రతి వాల్మీకి రామాయణము. యుద్ధ. సర్గ 69- శ్లో. 89.
3. రంగనాథ రామాయణము- యుద్ధ. ద్వి. 4346-4350.
4. ,, ibid ,, యుద్ధ. ద్వి. 4350-4351.

మూలము నందిచట "మా మేవచోక్త్వా ధను రాలలంబే"[1]యని కలదు. అనగా సౌమిత్రి నోటినుండి "మామా" శబ్దములు మాత్రమే వెలువడినవి. తత్సమర్థన కావింపబడలేదు. కాని రంగనాథ రామాయణమునందు- "వలదు వలదు"నుటకు సమర్థకముగా—

"మానవేశ్వర యిది మథనంబు సేయ-రాని దుర్దుని రోష రసవార్ధి గాదు
మానవేశ్వర యిది మథనంబు సేయ-రాని కాలుని కోప రసవార్ధి గాదు
ఈ నీరు నిప్పులం గి నెఱయింపఁ దొడగె-మాన కిప్పుడు నీవు మార్గణ పఙ్క్తి
వెలికి నేతెంచి దిగ్వితతితోఁ గూడఁ--గలయ లోకంబెల్లఁ గాల్చునో తుదకు
సర్వ జగద్ధిత చరితంబుఁ బూని-యుర్వీశ యీ కోప ముపసంహరింపు
నీ కోపమునకు నీ నీరధి యెంత-తేకాప్కుకంబింకఁ దెగగొన కధిప-"[2]

యని ఆరుద్విపద లధికముగా విరచితములైనవి.

(7) రామ విభీషణ సుగ్రీవ సంవాదము:-

రాముడు సువేలాచలంబెక్కి, మహావైభవముగా గోపుర శృంగస్థుడై విరాజిల్లుచున్న రావణుని గాంచెను. సుగ్రీవుడును అతనిని జూచి, కోపించి, అకస్మాత్తుగా లేచి, కొండ మీదినుండి గోపురము మీదికి లంఘించెను,"[3] ఇప్పట్టున మూలమునం దెవరికి నెట్టి సంభాషణము జరిగినట్లు లేదు. కాని రంగనాథ రామాయణమునందు—

రా విభీషణ ! గోపురంబున నెక్కి--యీ విధంబున నున్న యితడెవ డొక్కొ-
ప్రళయ కాలమునాటి భాను బింబముల-వెలుగుల పోది వోలె వెలుగుచున్నాడు
.... మొదలుకొని ......—

అనపుడు సుగ్రీవు డా రాము తోడ-ననిమొ మీ యెదుట నీ యసుర గర్వించి
వైభవ మిటు చూపువాడె శ్రీరామ ! - యే భంగ మొనరింతు నిప్పుడ యనుచు"[4]

వరకు గల శ్రీరామ, విభీషణ, సుగ్రీవ సంవాదము మూలాతిశయముగా కూర్పబడినది—

8) రావణ పిరాలాపము :—

చివరకు రామ రావణ యుద్ధము ఘోరముగా జరుగుచున్నది యుద్ధకాండము సర్గ. 106లో రాముడు రావణు నాక్షేపించుచు పిరాలాపము లాడెను. దీని తర్వాత ప్రతిసమాధానముగా రావణాధిక్షేపముండి యుండవలెను కాని మూలము నందిది లేదు. దీనిని పూరించుటకై రంగనాథ రామాయణమునందు—

"దురమున కొండఱు తుచ్ఛరాక్షసులఁ-బెరిగి చంపితినని పేర్చెదు కడగి
నన్నెఱుంగవు నీవు, నా లావు కొలది-మున్నెఱుంగవు, నేను మునుమునఁ దొల్లి
యతిలోక కృతులైన యక్ష గంధర్వ- పతుల దేవతల దిక్పతులఁ బెక్కండ్ర

---

1. దా ప్రతి వాల్మీకి రామాయణము- యుద్ధ. సర్గ. 21-శ్లో. 33.
2. రంగనాథ రామాయణము- యుద్ధ. ద్వి. 894-899.
3. దా. ప్రతి వాల్మీకి రామాయణము- యుద్ధ. సర్గ. 40-శ్లో. 7,8.
4. రంగనాథ రామాయణము, యుద్ధ. ద్వి.1797-1804.

బలువిక్రిఁగారించి, భంగించి, నొంచి-చెలగి వర్తింతు విశృంఖల వృత్తి
సమబల ప్రౌఢి విచారింప కేను-సమరంబులో నిన్ను సరకు సేయుదునె ?
నిన్ను నీ తమ్ముని నేఁడాజిఁ జంపి-కన్నుల పండువుగాఁ జూచి కాని
యీ లంకఁ జొర నింక నేనంచు"[1]

కాలాగ్నికల్పుడైన రావణుని వీరాలాపాధిక్షేపణములుగా 8 ద్విపదలు అధికముగా నిచట కూర్చ బడినవి—

ఇట్లు పరిశీలించుచు పోయిన, మూలమున లేని సంభాషణములు కొన్ని అధికముగా కూర్చ బడినట్లును, ఉన్నవి పెంపుదల చేయబడినట్లును కనిపించును. కావ్యము పెరుగుటలో ఈ అమూలక సంభాషణములును తోడ్పడుచున్నవని నిస్సంశయముగా చెప్పవచ్చును.

3) వర్ణనలు, కల్పనలు; 4) అలంకారములు

కల్పనాత్మకమైన వర్ణనల తోడను, అలంకారముల తోడను కావ్య గౌరవము పెరుగును. అనువాద కావ్యమైనచో, కవి తన ప్రతిభనంతటిని వర్ణనా విషయములందును, అలంకార సంయోజనమునందును ప్రదర్శించును. అనుచితములని తోచినప్పుడు తప్ప, కథాంశములను యథాతథముగా ననుసరించును; వర్ణనలందును, అలంకార ప్రయోగములయందును స్వేచ్ఛగా ప్రవర్తించును.

రంగనాథ రామాయణమునందలి వర్ణనల యొక్కయు, అలంకారముల యొక్కయు పెంపు కుదింపు, మార్పుల గూర్చి కావ్య శిల్ప ప్రకరణమునందలి వర్ణనాధ్యాయమందును, అలంకారాధ్యాయమందును తులనాత్మకముగా విశేష పరిశీలన కావింపబడినది

5) కథాంశ విపులీకరణములు :—

వాల్మీకి రామాయణ త్రివిధ పాఠ భేదములతో రంగనాథ రామాయణమును తులనాత్మకముగా పోల్చి పరిశీలించినపుడు మూల పాఠమునందును కొంత గ్రంథ పాతము జరిగినట్లు తోచుచున్నది. ఇందలి కొన్ని కథాభాగములు త్రివిధ ప్రతులందు కానరామియే కారణము. తత్తత్కథాంశముల మూలము కనబడువరకు ప్రస్తుతము వానిని కవి పెంపొందించిన భాగముల క్రిందనే పరిగణింపబడెను. అట్టివాని నిట పేర్కొందును—

(i) వనపాలక వధ:—

"ఆంజనేయు డశోకవన విధ్వంసన మొనరించుచుండగా, తద్వనపాలకులు మేలుకొని, అగ్గలమైమంది కరవాల హస్తులై యుద్ధసన్నద్ధులై అతని నెమర్కొనిరి. మారుతి తన పేరు, రాక, పరాక్రమముల నుగ్గడించి వీరులైన ఎనిమిది వేల రాక్షసులను తెగటార్చెను." ఈ వృత్తాంతము రంగనాథ రామాయణమునందు—

వన పాలకులు భీతి వడి మేలుకాంచి-హనుమంతు చేతకు నగ్గలమైమంది
యనుపమ కరవాల హస్తులై కదియ ......మొదలుకొని........

1. రంగనాథ రామాయణము- యుద్ధ. ద్వి. 7582—7588

పవమాన తనయు డప్రతిముడై పేర్చి యపలీలఁ దెగటార్చి యార్చిన బెదరి"[1]

వరకు 8 ద్విపదలు అధికముగా కింకర వధాత్పూర్వము[2] కూర్చబడినవి. మూలమునం దీ వన పాలక వధ వృత్తాంతము లేదు.

"వనపాలకులు తేరా ? మారుతి వనభంగమును చూచి యూరకొనిరా ? ఎటు పోయిరి ఏమయిరి ? అను ప్రశ్నలకు మూలమునందు సమాధానము లభింపదు.

కథాక్రమానుసార మాలోచించినచో, ఇచ్చట వనపాలు రెదిర్చి మడిసిన వృత్తాంతము తప్పక మూలమునందుండి యుండవలెను. త్రివిధ పాఠములం దిది లేకపోవుటచే గ్రంథ పాతమని కాని, ఔచిత్య దృష్టితో బుద్ధ భూపతిచే క్రొత్తగా చేర్చబడినదని కాని గ్రహించుట సమంజసము.

(ii) పింగళాక్షాదుల యుద్ధము :—

కింకర వధానంతరము రావణుడు పింగళాక్ష, దీర్ఘజిహ్వ, వక్రనాస, అశ్మపక్ష, శార్దూల ముఖులను ఐదుగురు ప్రముఖ రాక్షస వీరులను మారుతిని తెగటార్చి రండని పంపగా, వారు సైన్యములతో వచ్చి అతనితో పోరి మడిసిరి.

ఈ వృత్తాంతము :—

"ఆ పంక్తిముఖుడు కాలాంతకు పగిదిఁ-గోపించి పింగళాక్షుని, దీర్ఘజిహ్వు,
వక్రనాసుని, నశ్మవక్షుని, వైరి-చక్ర భీకరుడైన శార్దూలముఖుని
వేవేగ పిలిపించి వీరులై మీర-లా వానరునిఁ దెగటార్చి రండనుచుఁ
బనిచిన .... మొదలుకొని.........
ఉరవడి దీర్ఘజిహ్వుని వచ్చి తాకి-యురుముష్టి సంహతి నుర్విపైఁ గూల్చి
యాలోనఁ బవనజు డసమాన విజయ-లోలుడై వాని నాలుక పీకి చంపె"[3]

వరకు 21 ద్విపదలలో వర్ణితమైనది. వీనికి మూలము లభ్యమగు ముద్రిత త్రివిధ రామాయణ ప్రతులలో కానరాదు.

ఈ విషయమును గూర్చిన అస్తినాస్తి విచికిత్సను గావింతము— వనపాలక వధానంతరము హనుమంతుని మీదకు పంపబడినవారు ఉత్తరోత్తర బలవంతులై యుందురని యూహింపవచ్చును. మొదట సామాన్య కింకరులు, పిదప కొంత పేరుమోసిన పింగళాక్షాది వీరపంచకము, తదనంతరము మంత్రిసుతులు, అటు తర్వాత సేనాపతియైన ప్రహస్తుని తనయుడు, జంబుమాలి, అటు పిదప పంచ సేనాగ్రనాయకులు, తర్వాత అక్షకుమారుడు, చివరకు ఇంద్రజిత్తు— రంగనాథ రామాయణము నందలి ఈ వరుస సముచితముగా నున్నదని తలంతును. రామాయణమునం దిట్లే యుండవలెను. ఈ దృష్టితో పరిశీలింపగా, కింకర వధానంతరము, మంత్రిపుత్రులు యుద్ధమునకు రాకపూర్వము సుందరకాండము మూల పాఠములో పింగళాక్షాది వధకు చెందిన ఒక సర్గ గ్రంథ పాతము జరిగినదని భావించుట సమంజసము—

(iii) మంత్రిసుత నామధేయములు :-

సుందరకాండము సర్గ 45 లో- రావణుడు పంపిన మంత్రిపుత్రు లేడుగురు హనుమంతు

1. రంగనాథ రామాయణము- సుందరకాండము. ద్వి. 626-633.
2. దా, ప్రతి. వాల్మీకి రామాయణము- సుందర- సర్గ. 42.
3. రంగనాథ రామాయణము- సుందరకాండము. ద్వి.లు 662-682

సంహరించి హతులైన వృత్తాంతము కలదు. రామాయణ త్రివిధ పాఠములలోను ఈ మంత్రిసుతుల నామములు వక్కాణింపబడలేదు. కాని రంగనాథ రామాయణమునందు-

"సోమించి నిజమంత్రిసుతులైన రక్త-రోముని, శతజిహ్వు, రుధిర లోచనుని,

స్తనితహస్తుని, శూలదంష్ట్రు, దుర్ముఖుని,-ఘనసత్త్వడగు వ్యాఘ్రకబళుని బిలిచి"[1]

యనెడి ద్విపదలు వారి నామములను ప్రకటించుచున్నవి. కథాక్రమము ననుసరించి "మంత్రిసుత వధ" సుప్రసిద్ధము, కావున బుద్ధభూపతి వీరి పేర్లను స్వయముగా కల్పించినాడని యనజాలము. ఈ నామములకు చెందిన కొన్ని శ్లోకములు లబ్ధప్రతులందు లుప్తములైనవని నిర్ధారింపవచ్చును.

iv) మహాకాయాదుల యుద్ధము :-

అకంపన వధానంతరము రావణసుతుడు మహాకాయుడు తండ్రి యానతిపై రాక్షస సేనతో యుద్ధమునకు వచ్చెను, మహాకాయుని మంత్రులు (1) రుధిరాశనుడు, (2) వజ్రనాభుడు, (3) కాలదంష్ట్రుడు, (4) కాలకల్పుడు, (5) వపాశుడు, (6) శతమాయుడు, (7) ధూమ్రుడు, (8) దుర్దముడు అనువారలు అంగదాదులను తాకిరి. పృథుడు, పనసుడు, గవాక్షుడు మున్నగువారు రాక్షసులతో తలపడిరి, పరస్పర యుద్ధము భయంకరముగా జరిగెను. గవాక్షుడు రుధిరాశనుని, పృథుడు వజ్రనాభుని, ఋషభుడు కాలదంష్ట్రుని, పనసుడు కాలకల్పుని, గజుడు వపాశనుని, క్రోధన మేఘపుష్పకులు ధూమ్రదుర్దములను, శతబలి శతమాయుని హతమార్చిరి. అంగదుడు మహానాదుని సంహరించి, చివరకు మహాకాయుని నేలగూల్చెను.

రంగనాథ రామాయణమునం దీ వృత్తాంతము—

"పరులచే నని నకంపనుడు కూలుటయుఁ-బరితాపమును బొంది పంక్తి కంధరుడు

మనుజుల కపులను మడియించి వేగ-చనుదెమ్ము నీ బల శౌర్య మింపార

నని మహాకాయుని నప్పుడ యనిచె- ....మొదలుకొని..........

హతశేషులగు రాక్షసావళి చెప్ప-గతపడ్డ యమ్మహాకాయుని దలచి

విన్ననై తలవాంచి వెఱగంది కుంది కన్నీరు నించి రాక్షస కులేశ్వరుడు."[2]

వరకు సుమారు 80 ద్విపదలయందు వీరోచితముగా వర్ణింపబడినది. ప్రస్తుత ముద్రిత త్రివిధ వాల్మీకి రామాయణ మూలపాఠములందీ విషయము లేదు. ఇంత దీర్ఘ వృత్తాంతము కవి కల్పిత మనుటకును వీలులేదు. ఈ ద్విపద రామాయణ కథాక్రమమును బట్టి ఈ మహాకాయవధ యుద్ధ కాండము సర్గ 56. సర్గ 57 లకు నడుమ (అకంపన వధ - ప్రహస్త యుద్ధ ప్రయాణములకు నడుమ) యుండియుండవలెను. కావున మూలమునందిచ్చట తప్పక కనీసము ఒండు రెండు సర్గల గ్రంథపాతము జరిగినదని నిస్సందేహముగా చెప్పవచ్చును. ప్రత్యేక ప్రయోజన మే మాత్రము లేని ఈ మహాకాయ యుద్ధ వర్ణనము కవి కల్పితమనుటకును వీలులేదు.

(v) ఖడ్గరోమాదుల యుద్ధము :-

దశగ్రీవుడు మూడవసారి- ఇదియే చివరిసారి- యుద్ధమునకు బయలుదేరగా "నతని వెంట

---

1. రంగనాథ రామాయణము- సుందర- ద్వి. 685-686.
2. రంగనాథ రామాయణము- యుద్ధకాండము ద్వి. 2823-3009.

ఖడ్గరోమ, వృశ్చికరోమ, సర్పరోమ, అగ్నివర్ణులును బయలు వేరిరి."[1] ఖడ్గరోముడు హనుమంతునితోను, సర్పరోము డంగదునితోను, వృశ్చికరోముడు నీలునితోను యుద్ధముచేసి నేలగూలిరి. అగ్నివర్ణుడు యుద్ధమునకు రాగా, రాముడు విభీషణుని వలన అతని విషయమును దెలిసికొని వారుణాస్త్రమేసి అతనిని హతమార్చెను."

రంగనాథ రామాయణము నందిది—

అప్పుడు హనుమంతు డసురేశు మీద-నుప్పొంగి కవియు నుద్యోగంబు చూచి

యచలనిభాకారు డతి బలోన్నతుడు - రుచిర ఖడ్గుడు ఖడ్గరోముండు గినిసి

.... మొదలుకొని

ఆలంబులో నప్పు డగ్నివర్ణుండు—గూలుట గనుగొని క్రూరుడై పేర్చి."[2]

వరకు సుమారు 42 ద్విపదలలో వర్ణితమైనది. ఇది త్రివిధ రామాయణ మూలపాఠములందు కానిపింపదు.

ఆధ్యాత్మ రామాయణమునందు—

"హనుమానంగదశ్చైవ-నలోనీలస్తథైవ చ।

చత్వారః సమవేత్యాగ్రే-దృష్ట్వా రాక్షస పుంగవాన్॥

అగ్నివర్ణం తథాసర్ప-రోమాణం ఖడ్గరోమకం।

తథా వృశ్చిక రోమాణం-నిర్జఘ్నుః క్రమశోఽసురాన్॥"[3]

అని ఖడ్గరోమాదుల యుద్ధము సూచితమైనది. కాని ఈ తెల్గు ద్విపదలకు ఆధ్యాత్మ రామాయణ మాధారము కాదు. "క్రమశః" అను పదముచే హనుమంతు డగ్నివర్ణునితోను, అంగదుడు సర్పరోమునితోను, నలుడు ఖడ్గరోమునితోను, నీలుడు వృశ్చికరోమునితోను తలపడి హతమార్చిరని తెలియును. ఆధ్యాత్మ రామాయణము నందలి ఈ కథాంశమందు రాముని ప్రశంసయు, ఈ ద్విపద రామాయణమునందు నలుని ప్రశంసయు లేదు. అందుచేత రెండు జంటలు సరిపడినను మరి రెండింటితో (హనుమ దగ్నివర్ణులు, నల ఖడ్గరోములు)- రంగనాథ రామాయణము విరోధించుచున్నది.

ఇంత దీర్ఘ వృత్తాంతము కవి కల్పితమనియు ననరాదు. తనకు లభించిన యేదో యొక ప్రతి నాధారముగా గొనియే ఈ విషయమును కూర్చినాడు. ప్రస్తుతము దానిని గ్రంథపాఠముగా గ్రహించవచ్చును.

vi) ఖరసూతి వధ—

రాయబారమున కేగిన యంగదుడు విఫలుడై రావణుని మేడ కూలదన్ని తిరిగివచ్చుచుండగా, రాక్షసేశ్వరుని యాజ్ఞను కొందరు దానవు లతని పట్టికట్టగా వెంబడించిరి. వారిలో

---

1. రంగనాథ రామాయణము- యుద్ధ- ద్వి. 7307-7308.
2. ,, ibid ,, యుద్ధ- ద్వి. 7369-7410.
3. ఆధ్యాత్మ రామాయణము- యుద్ధ- వర్గ 11 శ్లో. 12, 13.

ఖరసూను సుఖుడను వాడొకడు. అత డంగదుని నిలుసిలుమని, ఐదు బాణముల నదరు నాటనేసి నొప్పింపగా- నతడు ముష్టిఘాతమున సుఖుని హతమార్చెను. ఈ వృత్తాంతము.

"వెండియు నంగదు విడువక పట్టి-బొండసి దైత్యులఁ బుచ్చె రావణుడు

.... మొదలుకొని .... దానవేశ్వరుడు చింతామగ్నుడయ్యె."[1]

వరకు 9 ద్విపదలలో వర్ణితమైనది; కాని మూలమునందు లేదు. కథాక్రమము ననుసరించి యిది దా. ప్రతి. రామాయణము యుద్ధకాండము 41 వ సర్గలో 9 వ్వర మరియు 10 వ్వర శ్లోకముల మధ్య నుండదగినది—

ఈ విధముగా గ్రంథ పాతములని యూహించిన విస్తృత కథాంశములన్నియు యుద్ధ సంబంధములు. బుద్ధభూపతి—

"ప్రత్యర్థ రాజన్యఖల వజ్రపాణి-ప్రత్యర్థి నృపదావ పావకోజ్జ్వలుడు

భీకర నిజఖడ్గ బింబిత స్వర్గ-లోకానురక్త త్రిలోక దుర్దముడు"[2]

కావున యుద్ధప్రియుడు, యుద్ధ సంభాషణములందు, యుద్ధ వర్ణనలయందు నాసక్తి కలవాడై, ఆయా ప్రతులను పరిశీలించి. పండితులచే ప్రధాన పాఠమున వదలివేయబడిన సామాన్య కథాంశములను గూడ గ్రహించి, వీర రస గర్భితముగా వర్ణించి తన రామాయణమును విస్తృత పరచినాడనుటలో సందేహము లేదు.

ఇట్టి యుద్ధ సందర్భములందే కాక, ఆయా చోట్ల ఔచిత్యమును పురస్కరించుకొని కొలదిగా కథాంశ విస్తరణమును గావించి యున్నాడు! కొన్నింటి నిట పేర్కొందును.

1) బాలకాండ వృత్తము

నారదుడు వాల్మీకి మహామునికి నుపదేశించిన సంక్షేప రామాయణ కథానుక్రమణిక[3]లో బాలకాండ వృత్తము లేదు. వ్యాఖ్యాకారులు ఈ లోపమును పూరించుటకై ....

"ఇక్ష్వాకు వంశ ప్రభవ ఇత్యవతరణం, మహావీర్య ఇతి తాటకా తాటకేయ వధః, ధనుర్వేదే చ నిష్ఠితః ఇతి కౌశికాధిగత నిఖిల దివ్యాస్త్రప్రవృత్త్వం. శ్రీమానితి వైదేహీ లాభశ్చేతి బాలకాండ కథాసూచనాత్"[4] అని వ్రాసిరి. ఇది పాండిత్య బలమున నూహించి వ్రాసిన విషయము.

ఈ బాలకాండ కథావృత్తము మొదట అనుక్రమణికలో లేకుండుట చేత యాకోబి మొదలగు పండితులు "శ్రీమద్రామాయణమునందు అయోధ్యా కాండము మొదలు యుద్ధకాండము వరకు గల ఐదు కాండములే వాల్మీకి విరచితములు. బాలకాండోత్తర కాండములు తరువాత చేర్చబడిన ప్రక్షిప్త భాగములని[5] అభిప్రాయపడి క్షుణ్ణముగా చర్చించి యున్నారు. కాని గోన బుద్ధభూపతికి కొన్ని వందల సంవత్సరముల పూర్వము- సుమారు క్రీ.శ. ప్రథమ శతాబ్దము వరకే సప్తకాండయుత రామాయ

---

1. రంగనాథ రామాయణము యుద్ధ. ద్వి. 2088–2096.
2. రంగనాథ రామాయణము బాలకాండము ద్వి. 87, 88.
3. దా. ప్రతి. వాల్మీకి రామాయణము బాల. సర్గ. 1.
4. గోవింద రాజీయము బాల. సర్గ. 1 శ్లో. 19, 20, 21 ల వ్యాఖ్యానము—
5. హెచ్. యాకోబి. దస్‌రామాయణ. పుటలు 28–64.

ణము సంకలిత మగుటయే కాక అనేక పాఠ భేదములతో ప్రచారమునకు వచ్చినది. కావున అతడు బాలకాండమును వాల్మీకి విరచితముగానే సంపూర్ణముగా విశ్వసించియున్నాడు. అందువలన మూలము నందలి సంక్షేప రామాయణ కథాక్రమణికలో బాలకాండ వృత్తాంతము లేని లోపమును పూరించుటకై —

కౌసల్య కానందకరుడు శ్రీకరుడు-భాసుర త్రైలోక్య పావన మూర్తి
రాముడై పుట్టి, యా రాజర్షి వచ్చి రాముని మ్మని వేడ రాజు పంపగను
...... మొదలుకొని ......
ఏపున నందఱి యెద వేడ్క-మీఱ-నా పట్టుననే వచ్చి యప్పురిఁ జేరి"[1]

వరకు 10 ద్విపదలు రచించి చొప్పించియున్నాడు.

2) గంగోత్పత్తి :—

అంశుమంతుడు కపిల కోపాగ్ని దగ్ధులైన తన పినతండ్రులకు తిలోదకంబు లీయగోరి పాతాళంబున నుదకంబు వెదకి కానక విచారించుచుండెను. అప్పుడు వైనతేయుడు వచ్చి—

"కపిలేనా ప్రమేయేన-దగ్ధాహీమే మహాబలాః।
సలిలం నార్హసి ప్రాజ్ఞ- దాతుమేషాం హి లౌకికం॥
గంగా హిమవతో జ్యేష్ఠా-దుహితా పురుషర్షభ।
తస్యాం కురు మహాబాహో-పితౄణాం సలిలక్రియాం॥"[2]

అని సలహా నొసంగెను. ఇచ్చట మూలమునందు గంగోద్భవ వృత్తాంతము వర్ణితము కాలేదు.

బుద్ధారెడ్డి గంగయొక్క అలౌకికత్వమును, పవిత్రీకరణ సామర్థ్యమును దెలుపుటకై—

"సరసిజాసన వంద్య చరణారవిందు-డరవింద దళ నేత్రు డాదిపురుషుడు
బలి దానవేశ్వరు బంధించు నప్పు-డలుకఁ ద్రివిక్రముడై నిండఁ బెరిగి
యగణిత శక్తి రెండడుగుల యందు-జగతీ తలంబెల్ల సరి నాక్రమించి
జలజాత ఖచర శంఖచక్రమ్ము-లలవడునట్టి మూడవ పదాంబుజము
కడుకొని బ్రహ్మలోకము దాకఁ జాపఁ-గడువేగమున వచ్చి కమల సంభవుడు
తలకొన్న భక్తితోఁ దన కమండలువు-జలములఁ దత్పాదజలజముల్ గడిగెఁ
బొగడొందఁ దజ్జలంబులు నభోవీథిఁ-దగిలి వర్తించు మందాకిని యనగ."[3]

యని 7 ద్విపదలలో త్రివిక్రమావతారపూర్వక గంగోత్పత్తిని వివరించియున్నాడు.

విష్ణువు త్రివిక్రముడై పెరిగి యున్నవేళ బ్రహ్మ కమండల జలముతో తత్పాద ప్రక్షాళనము చేయగా, నది గంగయై ప్రవహించినది. కావున గంగ పతిత పావనుడైన విష్ణు పాదోద్భవి; అనగా తత్పాద తీర్థము. అగుటచే పాపాత్ముల పాపములను పారదోలుటయందు సామర్థ్యము గలది. నీ పిన తండ్రులు దురహంకారులై భగవదవతారమైన కపిలుని భర్త్సించి పాపాత్ములైరి. తత్పాప పరిహార

1. రంగనాథ రామాయణము బాల— ద్వి. 120-129.
2. దా. ప్రతి వాల్మీకి రామాయణము బాల. సర్గ 41 శ్లో. 18, 19.
3. రంగనాథ రామాయణము బాల. ద్వి. 1212-1218.

మున కాతని పాద తీర్థమే కావలయును. కాని లౌకిక జలము పనిచేయదు. కావున నీవింక ఆకాశ గంగను తో డ్తెమ్మని కార్యకారణ భావమును వైనతేయుడు వ్యక్తీకరింపదలచినాడనునట్లు కవి అమూలకమైన ఈ గంగోత్పత్తి వృత్తాంతమును జొప్పించినాడు. ఇది కవి హేతువాద దృష్టికి తార్కాణము.

3) మారుతి దూరాలోచనము :—

"శింశుపా వృక్షముపై నున్న మారుతి రావణు గర్వమును, సీతా శోకమును గాంచి కోప తాపములు కలుగగా, రావణునిపై దుమికి రణము చేయదలంచి "రావణుని సంహరించినచో, రామునకు సీతా క్షేమమును చెప్పగలను; కాని మరణించినచో, లంకలోని సీతా వృత్తాంతము తెలియమిచే రాముడు ప్రాణములు విడుచును. ఇంత చేసిన చేతలు నిష్ఫలమై ప్రభుకార్యము చెడి పోవును, కాన ఇది అనిసేయు సమయముగాదని ప్రూనిమీదనే ధీరుడై యూరకుండెను."[1]

రంగనాథ రామాయణమునం దీ కథాంశము అధికముగా 10 ద్విపదలలో వర్ణితమైనది. మూలమునందు రాక్షస కాంతలు సీతను బెదరించునపుడు—

"అపలీన స్సనిర్వాక్యో హనుమాన్ శింశుపాద్రుమే।
సీతాం సంతర్జయంతీస్తా రాక్షసీ రశృణోత్కపిః॥"[2]

అని మాత్రమే కలదు. మారుతి నిర్వాక్యుడై దాగియుండుటకు గల అతని ఆలోచనము మూలము నందు చెప్పబడలేదు.

సీతారాములందు భక్తియు, బలపరాక్రమములును గల ఆంజనేయుడు "రావణుడు రాముని దూషించుచు సీతను బెదరించుచుండగా" చూచి మౌన మేల వహించెను ? అని సాధారణముగా ప్రశ్న యుదయించును. వాల్మీకమున తత్సమాధానము గానరాదు. కవి ఈ సందేహమును దొల గించుటకై యిచ్చట మారుతి యాలోచనమును రచించి కూర్చినాడు.

ఇక, హనుమంతుడు సీతతో సంభాషించునప్పుడు, ఆమెయు నతనిని రాక్షసుడని భావించి యిట్టి సందేహమును పొందవచ్చును. కావున ఆమెకు విశ్వాసము కలిగించుటకై మారుతి తన మౌన కారణమును తప్పక తెలుపవలసి యుండును. కవి దీనిని కూడ యూహించి—

"పలనేది యిప్పుడు వచ్చి రావణుడు-తలకక నినుఁ బల్కు తఱి నున్నవాడ;
ఘనశక్తి వానితోఁ గయ్యంబు సేసి-యని వానిఁ జంపెద నని విచారించి,
పూని నిన్ దర్శించి పొందుగా నీకు-నీ నాథు సేమంబు నిజముగాఁ జెప్పి
దనుజుఁ బిమ్మటఁ జంపఁ దలపోసి కాని-వనిత నా ప్రాణముల్ వంచించి కాదు."[3]

అని ఆంజనేయ వాక్యములుగాఁ గూర్చి పూర్వాపరములకు చక్కని సంబంధమును గల్గింపఁ జేసినాడు.

---

1. రంగనాథ రామాయణము- సుందరకాండము ద్వి. 347—358.
2. దా. ప్రతి వాల్మీకి రామాయణము. సుందర. సర్గ. 24. శ్లో. 14 1/2.
2. రంగనాథ రామాయణము. సుందరకాండము. ద్వి. 516—519.

4) కుంభకర్ణుడు సభను వీడిపోవుట :—

"రావణుడు విభీషణుని "ఛీ" కొట్టినపుడు, తన్ని సంహరింప సిద్ధపడినపుడును, ప్రహస్తుని ద్వారా లంకనుండి వెడలగొట్టించినపుడును" ఆ సభయం దుపస్థితుడైన కుంభకర్ణుడు ఊరక చూచు చున్నాడా ? మాటాడలేదేమి ? అంతకుపూర్వమే వెడలిపోయినాడా ? యని సందేహము మూలము చదివిన వారికి కలుగును. రంగనాథ రామాయణమునందు ఇట్టి సందేహములకు తావీయకుండ రావణుని ధిక్కారమునకు పూర్వమే కుంభకర్ణుడు సభను వీడిపోయినట్లు—

"అనవుడు బ్రహ్మ శాపాతిశయంబు-గొనకొనుటయుఁ జూచి కుంభకర్ణుండు
తమ్ముని మాటలు తగవనలేక-ఇమ్ముల నాయన్న నెట్టన రాక
యగ్గౌరవముతోడ నన్నకు మ్రొక్కి-దిగ్గన గుహకు నిద్రింపంగఁ జనియె."[1]

అని మూడు ద్విపదలు మూలాధికముగా రచింపబడినవి. కావున ఈ విభీషణ తిరస్కారము కుంభ కర్ణునకు తెలియదు. యుద్ధార్థము ప్రత్యేకముగా ప్రబోధింపబడి సభకు వచ్చిన యతనికి రావణు నికి నడుమ అమూలకమైన సంభాషణను[2] కల్పించి కవి దీనినింకను సమర్థించియున్నాడు.

5) కృత్తి సృష్టి :—

"మకరాక్ష వధానంతరము రావణాదేశమున నింద్రజిత్తు ఆభిచారిక హోమముచేసి కృత్తిని బుట్టించుకొని, తత్సహాయమున నదృశ్యుడై మాయా యుద్ధముతో రామలక్ష్మణులను వానరులను సాధింపసాగెను. తుట్టతుదకు శ్రీరాముడు వాయువచనమున ఆగ్నేయాస్త్రమును ప్రయోగించి కృత్తిని బారద్రోలెను మేఘనాదుడు శరవర్షమున వానరులను మూర్ఛ నొందించి, లంకకు దిరిగివచ్చి తండ్రికి తన సంగర క్రీడను విన్నవించి హర్షింపజేసెను.[3]

ఈ వృత్తాంతము సుమారు 150 ద్విపదలలో సుందరముగా వర్ణితమైనది. దీనిమూలము మాత్రము ముద్రిత రామాయణ త్రివిధ పాఠములలో గానరాదు. కావున ఈ విషయమునకు చెందిన ఒండు రెండు సర్గలు గ్రంథపాతము చెందవలెను; లేదా కవి కల్పిత మగియు ననుట కవ కాశము కలదు

పురాణములం దిట్టి కృత్యసృష్టి కనబడుచున్నది దుర్వాసుడు అంబరీషునిపై ఆగ్రహము చెంది తపః ప్రభావమున కృత్యను సృష్టించి తోలగా, అది విష్ణువు రక్షణార్థ మొసంగిన సుదర్శన చక్రముచే భస్మీభూతమయ్యెను.

లోకమునందు గిట్టనివారు ఆభిచారిక జప హోమాదుల నొనర్చి శత్రువులపై కృత్యలను ప్రయోగించి బాధించుచుందురు.

బుద్ధ భూపతి దండయాత్ర సందర్భములందు శత్రు ప్రయుక్తమైన యిట్టి శక్తుల నెదిరించియు నుండవచ్చును.

కావున కవి తన యనుభవమును, లోక, పురాణ గత విషయములతో జోడించి ఇచ్చట ఈ

---

1. రంగనాథ రామాయణము. యుద్ధ. ద్వి- 498-500.
2. రంగనాథ రామాయణము. యుద్ధ. ద్వి. 3736-3742.
3. రంగనాథ రామాయణము యుద్ధ. ద్వి. 5056-5222.

కథాంశమును కల్పించి, పెంచి వ్రాసినాడనియు తోచుచున్నది. హోమాది వర్ణన విషయములందు కొంత పునరుక్తి కనబడుచున్నది.

6) గుహాగ్ని ప్రవేశము :—

"శ్రీరాముడు వ్రతము సెల్లిన మీద రాక యాలస్యమైనందున, గుహు డాందోళనము సెంది ఆతని కేమి యాపద సమకూడినదో యని చింతించి, కుండమునందు సొదఁ జేర్చి, ఆ యగ్నిలోఁ జొర సిద్ధముగా నుండ, హనుమంతు డడ్డుపడి వారించెను.1

మూలమునందు భరతుని అగ్ని ప్రవేశ ప్రయత్నమున్నది కాని, గుహాగ్ని ప్రవేశ వృత్తము లేదు. కాని కవి యిచ్చట గుహుని శీలమునకు వన్నె పెట్టఁదలచి దీని నధికముగా జేర్చి యున్నాడని తలంచవచ్చును.

ఇట్లాయా కథాంశములు సందర్భశుద్ధికై కొలదిగా విస్తృత పరచబడినవి.

ఆంధ్ర విశ్వకళా పరిషత్తు సంశోధిత ముద్రిత ప్రతియైన రంగనాథ రామాయణము, అనుబంధము-2 నందు ఈయబడిన అధిక పాఠ, రచనాంతర ద్విపదలలో కొన్ని అమూలక కథాంశములు సూచితములైనవి.

1. మేష దంపతుల కథ
2. దత్తాత్రేయ గాథ
3. వాలి రావణుని పట్టి తెచ్చి కుమారుని తొట్లెకు గట్టుట.
4. పరశురాముడు యుద్ధమునకు వచ్చినవేళ దశరథుడు స్త్రీల మఱుగుఁ జొచ్చుట.
5. మారుతి లంకలో సీతకై యన్వేషించువేళ దేవకాంతల నూరడించుట,
6. అక్ష కుమారుని మరణమునకు మండోదరి విలపించుట.
7. హనుమంతుని బ్రహ్మాస్త్ర బంధనమునకు కారణమైన ఋషిశాపము.
8. ఆంజనేయుడు వాలముతో రావణునకు సరిగద్దె వేసి కూర్చుండుట.
9. రావణుడు చెడుటకైన యేడు కారణములు.
10. శ్రీరాముడు మావి వృక్షంబు నీడను శయనించుట.
11. రంగనాథ ప్రతిష్ఠాపనము.
12. పుష్పక విమానము మరల శ్రీరాముని చేరుట. మొదలగునవి.

ఇట్టి కథా కల్పనల చేత రంగనాథ రామాయణ గౌరవము పెరిగినది.

iv అన్యథా కరణములు :-

రంగనాథ రామాయణమును మూలముతో పోల్చి చూచినపుడు అచటచట కొన్ని మార్పులు కనబడుచున్నవి. బుద్ధభూపతి వీనిని బుద్ధి పూర్వకముగానే మార్చియున్నాడో, లేక అతడు చూచిన ప్రతి యందట్లుండెనో స్పష్టముగా తెలియరాదు. కొన్ని మార్పులకు అనౌచిత్య పరిహారము ప్రధాన కారణమని తోచును. ఏ యుద్దేశ్యముతో మార్చినను, ఇవి కావ్య సౌందర్యము నినుమడింపజేయుచున్న వనుటలో సందేహము లేదు—

1. రంగనాథ రామాయణము, యుద్ధ. ద్వి. 8520-8529.

ఇవి (A) కథాగతములు (B) క్రమవిపర్యయములు అని రెండు విధములు.

A) కథాగతములు :—

ఔచిత్యమును పురస్కరించుకొని కొన్ని కథాంశములలో మార్పులు చేయబడినవి, వానిలో కొన్ని ఈ క్రింద పేర్కొనబడినవి—

1) ది (శా) గ్గజములు :—

సగర చక్రవర్తి కుమారులు తండ్రి యానతిపై యజ్ఞాశ్వమును వెదకుచు, భూమిని త్రవ్వి రసాతలము నన్వేషించిరి.

ఇచ్చట "సగర కుమారులు పూర్వ, దక్షిణ, పశ్చిమోత్తర దిశలందు విరూపాక్ష, మహాపద్మ, సౌమనస, భద్రనామక దిగ్గజములను దర్శించి పూజించి యీశాన్యమున కరిగి"[1]రని మూలము నందు కలదు.

కాని వీనికి భిన్నముగా "ఐరావత, పుండరీక, వామన, కుముదాంజన, పుష్పదంత, సార్వభౌమాఖ్య దిశాగజములను గాంచి మ్రొక్కి. అష్టమ దిశయైన ఈశాన్యమున కరిగినట్లు"[2] రంగనాథ రామాయణమున మార్చబడినది.

మూలమునందు మూలదిశల, తద్దిగ్గజముల ప్రస్తావన లేదు. పూర్వ దక్షిణ పశ్చిమోత్తర దిశలను వెదకిరనగా, మూలలను కూడ వెదకిరని అధ్యాహారము చేసికొనవచ్చును; ఉత్తర దిశాగజ దర్శనానంతరము ఈశాన్యమునకు పోయిరని చెప్పియున్నది గదా! కాని దిగిభ నామములందు భేదమున్నది. ఇట్టి మార్పునకు అమరకోశ ప్రభావము కారణమైయుండును.

సంస్కృతాభ్యాసము చేయువారు ఇప్పటికిని పదజాలమునకై అమరకోశము వల్లెవేయు చున్నారు. అందు;

"ఏరావతః పుండరీకో-వామనః కుముదోఽంజనః।
పుష్పదంత స్సార్వభౌమ-స్సుప్రతీకశ్చ దిగ్గజాః॥"[3]

అని అష్ట దిక్సామజముల పేళ్ళు చెప్పబడినవి- లోక ప్రచారమునందున్న ఈ విషయమును చెప్పుట సముచితమని బుద్ధభూపతి ఈ మార్పును చేసి యుండవచ్చును. భాస్కర రామాయణమున నీ మార్పులేదు."[4]

రంగనాథ రామాయణము, ఆం. వి. క. ప. సంశోధిత ముద్రణా ప్రతియందు 46వ పుట అధస్సూచికయందు "విరూపాక్ష, మహాపద్మ, సుమనస, భద్రాఖ్య, చతుర్దిగ్గజములను తెలియజేయు యథామూలక పాఠాంతర ద్విపదలు గలవు- శైలి భేదముచే నివి రచయితవి కావని తోచును తర్వాత పండిత లేఖకు లెవ్వరో, మూల విరోధమును తొలగింపదలచి వీనిని రచియించియుందురు.

---

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. బాల. సర. 40, శ్లో. 12-23.
2. రంగనాథ రామాయణము- బాల. ద్వి. 1173-1193.
3. అమరకోశము ప్రథమకాండము దిగ్వర్గము శ్లో. 3
4. భాస్కర రామాయణము బాల, పద్యగద్యములు 436, 437.

ఇక, తెలుగు రామాయణమునందు- తూర్పు దిగ్గజము శుభ్రసామజేంద్రము"1గా పేర్కొన బడినది. కాని యిది పొరపాటు- తూర్పుదిశాగజమైన ఐరావతమునకు "అభ్రమాతంగము" అని పర్యాయపదము.

"ఐరావతోఽభ్ర మాతంగై రావణాభ్రము వల్లభాః॥2 అని యమరము. కావున కవి

"చతురత గల యభ్రసామజేంద్రంబు"3

అని వ్రాసి యుండనోపును. పాఠకులు దీనిని గమనింపవలెను. లేక "వెల్లయేనుగు" అను నర్థములో "శుభ్ర సామజేంద్రము" అని క్రొత్త పదబంధమును సృష్టించినాడేమో !

2) జనక వంశ ప్రవక్త :—

మూలమునందు సీతారాముల కల్యాణ సందర్భమున వసిష్ఠుడు రాముని వంశక్రమమును తెలియఁజేసిన తర్వాత జనక చక్రవర్తి—

"ప్రదానేహి కులశ్రేష్ఠ-కులం నిరవశేషతః।

వక్తవ్యం కులజాతేన-తన్నిబోధ మహామునే॥"

యని తన వంశ క్రమమును తానే వివరించినట్లు కలదు. కాని రంగనాథ రామాయణమునందు- సమయజ్ఞుడైన శతానందుడు జనకానుమతిని తద్వంశక్రమమును వసిష్ఠాదులకు వివరించినట్లు మార్చబడినది.

కన్యాదానము చేయువాడు ఉత్తమ కులమున పుట్టిన వాడయ్యేని తన వంశమును వాడెఱింగించుట అత్యావశ్యకము. ఈ ధర్మసూక్ష్మము ననుసరించి మూలమునందు జనకుడే తన వంశమును తెలిపినట్లు వాల్మీకి వర్ణించెను.

బుద్ధ భూపతి చేసిన ఈ మార్పునకు కారణమూహించవలెను. దశరథుడు సూర్యవంశమునకు, జనకుడు చంద్రవంశమునకు చక్రవర్తులు. సూర్యవంశ క్రమమును దశరథ పురోహితుడు వసిష్ఠుడు చెప్పగా, చంద్రవంశ క్రమమును జనక పురోహితుడైన శతానందుడు చెప్పుట సముచితము. కాని, జనకుడు చెప్పుట కాదు. అట్లయిన రాజనీతికి మర్యాద భంగము వాటిల్లును. బుద్ధారెడ్డియు రాజుకదా ! కావున రాజోచిత రీతి కనుగుణముగా నీ మార్పు చేయబడినది.

భాస్కర రామాయణమును ఈ మార్పు ననుకరించినది.6

(3) వాతాపీల్వల వృత్తాంత ప్రవక్త—

మూలమునందు- శ్రీరాము డగస్త్య భ్రాత్రాశ్రమమును గూర్చి లక్ష్మణునకు అగస్త్య మాహా

---

1. రంగనాథ రామాయణము బాల. ద్వి. 1175
2. అమరకోశము ప్రథమకాండము స్వర్గవర్గము శ్లో. 46
3. రంగనాథ రామాయణము బాల. ద్వి. 1175.
4. దా. ప్రతి. వాల్మీకి రామాయణము బాల. సర్గ. 71 శ్లో. 2
5. రంగనాథ రామాయణము బాల. ద్వి. 2107-2109.
6. భాస్కర రామాయణము బాల. పద్య 724.

త్మ్యమును వివరింపఁ దలచి వాతాపీల్వల వృత్తాంతమును చెప్పెను-[1] కాని రంగనాథ రామాయణము నందు- శ్రీరాము డగస్త్య భ్రాతాశ్రమమున నిలిచి. ఆ రాత్రి సుఖగోష్ఠినుండి-

"అయ్య ! యగస్త్య మహాముని దొల్లి-యియ్యెడ వాతాపి నెబ్బంగిఁ జంపె."[2]

నని యడుగగా, నతడా పుణ్య కథను శ్రీరామునకుఁ జెప్పినట్లు మార్చబడినది.

మహాత్ములను పెద్దలను దర్శించినపుడు గౌరవార్థము కాని, సందేహ నివృత్తికిగాని తెలిసిన విషయములనైనను వివరములకై తెలియనడుగుట పరిపాటి. ఇదిగాక వాతాపివృత్తాంతము శ్రీరాముని కంటె అగస్త్య భ్రాతకు స్పష్టముగాఁ దెలియును.

మూలమునందు-

"న్యవసత్తాం నిశామేకాం- ప్రాశ్యమూల ఫలాని చ।"[3]

అని మాత్రము కలదు. ఇట్లు వ్రాయుటకంటె- శ్రీరాము డగస్త్య భ్రాతతో రాత్రి సుఖగోష్ఠి నుండుట. అత డగస్త్య మాహాత్మ్యమును వివరింపగ వాతాపి వృత్తాంతమును చెప్పుట ఔచితీ శోభితము. కావున బుద్ధభూపతి యీ మార్పును చేసియున్నాడు.

భాస్కర రామాయణము నం దీ మార్పు కనబడదు.[4]

4) హేమంత ఋతు వర్ణనము :—

మూలమునందు హేమంత ఋతు శోభను లక్ష్మణుడు వర్ణించినట్లు కలదు.

"ప్రహృష్టతోఽను వ్రజన్ భ్రాతా-సౌమిత్రి రిద మబ్రవీత్॥"[5]

అని. ఏతద్వర్ణనా పురస్సరముగా భరతుని ప్రస్తావన దెచ్చి, హేమంతమున నతడు పడు కష్టము లను గుర్తుచేసి. అట్టి సద్గుణోపేతుడైన భరతునకు క్రూరశీలినియైన కైక తల్లి యెట్లయినదని లక్ష్మణుని చేత కైకను నొవ్వనాడించి, ఈర్ష్యా క్రోధములు గల లక్ష్మణ స్వభావమును వ్యక్తీక రించుట— అతనిచేత హేమంత ఋతువును వర్ణింపజేయుటలోని వాల్మీకి కవి యాంతర్యము.

కాని, రంగనాథ రామాయణము నందిది మార్పు చేయఁబడినది.

"చనుచోట రాముండు సౌమిత్రిఁ జూచి-కనుఁగొంటివే శీతకాలంబు మహిమ"[6]

యని శ్రీరాముడే హేమంతమును వర్ణించినాడు. ఏతద్వర్ణనా పురస్సరముగా భరతుని దలంచి శ్రీరాముడు దుఃఖితు డగునట్లు చేసి అతని భ్రాతృ వాత్సల్యమును తేటపఱచుట కవి బుద్ధారెడ్డి యాంతర్యము. ఈ మార్పుచేత సౌమిత్రి ఈర్ష్యాక్రోధ స్వభావము మఱుగున పడును. "లక్ష్మణుడు కైకను నిందించుట, రాము డతనిని మందలించుటకు, భరత గుణములను ప్రస్తావించుటకును"[7] అవకాశముండదు.

---

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము- ఆరణ్య. సర్గ 11 శ్లో 47-69.
2. రంగనాథ రామాయణము ఆరణ్య ద్వి. 181-185.
3. దా. ప్రతి వాల్మీకి రామాయణము ఆరణ్య. సర్గ. 11, శ్లో. 71.
4. భాస్కర రామాయణము ఆరణ్య, ప్రథమాశ్వాసము పద్య. 78-81.
5. దా. ప్రతి వాల్మీకి రామాయణము అరణ్య. సర్గ. 16, శ్లో. 3,
6. రంగనాథ రామాయణము ఆరణ్య. ద్వి. 243,
7. దా. ప్రతి. వాల్మీకి రామాయణము ఆరణ్య. సర్గ. 16, శ్లో. 35-37.

ఇది చూడగా చిన్న మార్పయినను, ఎంతయో గొప్ప ప్రయోజనమును సాధించినది.

5) మధువన భంగ తాత్పర్య గ్రహిత :—

"దధిముఖుడు వచ్చి సుగ్రీవునకు మధువన భంగ వృత్తాంతమును విన్నవించెను. లక్ష్మణుడు సుగ్రీవుని ఏమిటని యడిగెను. అంతట సుగ్రీవుడు మధువన భంగ విషయమును దెలిపి "దక్షిణ దిశ కేగిన హనుమదాదుల చేత సీత చూడబడినది; సందేహములేదు; లేనిచో ధైర్యమున నిట్లు వనభంగ మొనర్తురా ?" యని పలుకగా సౌమిత్రి రాఘవులు సంతసించిరని"[1] దా. ప్రతి. వాల్మీకి రామాయణము.

"సుగ్రీవుని యీ వాక్యమును విని మతి సంపన్నుడైన లక్ష్మణుడును తర్కించి నిజమని యామోదించినట్లు[2] పశ్చిమోత్తర శాఖీయ ప్రతిలో అధికముగా గలదు.

కాని రంగనాథ రామాయణమునందు— దధిముఖుడు మధువన భంగ వృత్తాంతమును దెలుపగా—

"............ అలిగి సుగ్రీవు-డెనసి మర్దింప నూహించినఁ జూచి"[3]

సౌమిత్రి యా వృత్తాంతమును దెలిసికొని,

""............ సుగ్రీవ ! నీ యాజ్ఞ వలన
తల కొకింతయు లేక తమయంతఁ జొచ్చి-నలిఁ దేనె ద్రావుచున్నారేని వినుము
ఆతత భుజశక్తు లగువారి చేత-సీతాధిపతి పనుల్ సిద్ధింప నోపు
కాకున్న నీ యాజ్ఞ గడప నోపుదురె-గైకొని పిలిపింపు కడకతో వారి"[4]

సని బుద్ధి సెప్పినట్లు మార్పు చేయబడినది.

దీనివలన మధువన భంగ నిగూఢార్థమును గ్రహించినవాడు సుగ్రీవుడు కాక, సుగ్రీవ సౌమిత్రి లిరువురు గాక, తద్భిన్నముగా మతి సంపన్నుడైన లక్ష్మణుడని చెప్పుట బుద్ధారెడ్డి యాశయము. సుగ్రీవుడు వానరు డగుటచేత. వానరుని కంటె నరుడు మతి సంపన్నతయందు గొప్పవాడని వ్యక్తపరచుటకై, సుగ్రీవ ప్రాధాన్యమును తగ్గించుటకై యీ మార్పు చేయబడి యుండనోపును.

6) ధాన్యమాలిని-మండోదరి

అశోక వనమున సీతను రావణుడు బెదరించు వేళ ధాన్యమాలిని[5] అడ్డు వచ్చినట్లు మూలము నందున్నది.

హనుమంతుడు వానరులతో లంకలోని వృత్తాంతమును చెప్పుచు నీతద్విషయ ప్రస్తావమున-

---

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము సుందర. సర్గ 63, శ్లో. 11-25
2. ప. ఉ. ప్రతి. వాల్మీకి రామాయణము సుందర. సర్గ. 71, శ్లో. 29-34.
3. రంగనాథ రామాయణము సుందర. ద్వి. 1054.
4. రంగనాథ రామాయణము సుందర- ద్వి. 1056-1060.
5. దా. ప్రతి వాల్మీకి రామాయణము సుందర. సర్గ. 22 శ్లో. 39.

"వరా మండోదరీ నామ తయాచ ప్రతిషేధితః"[1]

అని మండోదరి నామమును గ్రహించెను.

ఇపుడు "మండోదరీ-ధాన్యమాలినులు ఒక్కరా ? ఇద్దరా ? సీతను బెదరింపగా అడ్డము వచ్చిన వారెవ్వరు ? అని సందేహము కలుగును.

గోవిందరాజీయమునందు- "ధాన్యమాలినీ- రావణస్య కనిష్ఠపత్నీ; ఇదం మండోదర్యా అప్యుప లక్షణం- ఉత్తరత్ర వానరాన్ ప్రతి హనుమద్వచనే తథా వక్ష్య మాణత్వాత్॥"[2] అని వికల్పాభిప్రాయము తెలుపబడినది.

బుద్ధ భూపతి ఈ వికల్పమునకు తావీయక, కాలనేమి వృత్తాంతమునందు వచ్చెడి ధాన్యమాలినియా ? యను యనుమానమును కలుగనీయకుండ-

"అమల మండోదరి యడ్డమై నిలిచి-కొమరొప్పఁ బలికె నా కుమతియౌ విభుని"[3]

యని మండోదరి యని పేర్కొనినాడు. ఈ మార్పు మూలమునకు సవరింపు-

7) రాముని ఏకపత్నీత్వము :—

మూలమునందు మూడుచోట్ల రామునికి బహుభార్య లుండినట్లు సందేహము కలిగించు శ్లోకములు కలవు.

(I) మంథర కైకకు

"రాముడు పట్టాభిషిక్తుడైనచో ఆతని యుత్తమ స్త్రీలు సంతసింతురు. భరతునికి దుర్గతి కలుగగా నీ కోడండ్రు దుఃఖింతురు;"[4] అని బోధించినది.

(ii) శ్రీరాముడు సముద్రుని ప్రసన్నుని చేసికొనుటకై దర్భశయ్యపై తన కుడి భుజమును తలగడగా చేసికొని పరుండెను. అప్పుడు వాల్మీకి "ఆ బాహువు ఉత్తమ వనితల భుజముల చేత పలువిధాల పరిష్వంగము చేయబడినట్టిదని"[5] వర్ణించియున్నాడు.

iii) అశోకవనము నందలి సీతాదేవి రాముని తలంచుకొని, "తండ్రి యాజ్ఞను పూర్తిచేసి అరణ్యమునుండి వెనుదిరిగిపోయి నీవు వీతభయుడవై విపులేక్షణలైన స్త్రీలతో రమింపవని తలంతు[6]" నని విలపించినది

గోవిందరాజాది వ్యాఖ్యాతలు కట్టిచోట "స్త్రీ లనగా పరిచారిక లనియు, సైరంధ్రిక లనియు" అర్థము చేసి యున్నారు. ఇక మూడవదానికి "సీత వినాశనానంతరమ"ని యర్థ మూహింపబడినది ఇవి రాముని ఏకపత్నీత్వమును సమర్థించుటకు చేయబడిన యూహలు-

---

1. దా. ప్రతి వాల్మీకి రామాయణము సుందర. సర్గ 58, శ్లో. 76.
2. గోవింద రాజీయము సుందర. సర్గ. 58 శ్లో. 38 1/2-40 వ్యాఖ్యా,
3. రంగనాథ రామాయణము సుందర. ద్వి. 366.
4. దా. ప్రతి వాల్మీకి రామాయణము అయోధ్యా. సర్గ. 8 శ్లో. 12.
5. దా. ప్రతి వాల్మీకి రామాయణము యుద్ధ. సర్గ. 21, శ్లో, 3
6. దా. ప్రతి, వాల్మీకి రామాయణము సుందర. సర్గ. 28- శ్లో. 14

కాని బుద్ధభూపతి ఈ మూడు స్థానములందు—

i) రాచదేవి యటంచు రమణి సీతకును-నీ చిన్నకోడ లెన్నికిఁ గొల్వ వలయు."1

ii) "ఉర్వీ తనూజా మృదూపధానంబు"2

iii) ".... హా లక్ష్మణాగ్రజ! హా ధర్మనిరత!

నీకైన యేకపత్నీత్వంబు నేడు - చీకాకు పడ హత్యచే జత్తు ననుచు"3 అని భావమును మార్చి యనువదించి, పాఠకులు సంశయించుట కవకాశము లేకుండ రాముని ఏకపత్నీత్వమును స్థాపించి యున్నాడు. ఈ మార్పు ఔచిత్య పోషణకు నిదర్శనము.

8) భగీరథాదుల తపః కాలము :—

సగర కుమారుల యుద్ధరణకై వైనతేయుడు ఆకాశగంగను తెమ్మనెను. అంశుమంతు డీ విషయమును సగరునకు దెల్పెను.

మూలమునందు ఇచ్చట— "సగరుడు ముప్పదివేల వత్సరములు రాజ్య మొనర్చెను అంశుమంతుడు తన రాజ్యభారమును దిలీపున కప్పగించి 32 వేల వత్సరములు తప మాచరించెను. దిలీపుడు గంగా నయన చింత కలవాడై 30 వేల వర్షములు రాజ్యముచేసి వ్యాధి పీడితుడై దివంగతుడయ్యెను. భగీరథుడు వేయి వత్సరములు తప మాచరింపగా బ్రహ్మ ప్రత్యక్షమయ్యెను" అని వర్ణితమైనది.

వీరిలో అంశుమంతుడు, భగీరథుడు మాత్రము గంగా నయనార్థము ప్రత్యేకముగా తప మాచరించిరి; సగరున కేమి చేయవలెనో తోచలేదు; దిలీపుడు గంగానయన చింతన కలవాడైనను, యజ్ఞములు సేయుచునే రాజ్యమును పాలించినాడు.

ఈ నల్వురి కాలము 30 + 32 + 30 + 1 = 93 మొత్తము వత్సరములు.

కాని రంగనాథ రామాయణమునందు- సగరుడు 30 వేలు, అంశుమంతుడు 30 వేలు, దిలీపుడు 30 వేలు భగీరథుడు 10 వేలు ప్రత్యేకముగా గంగ కొఱకై తపము చేసినట్లు వర్ణితమైనది."5

ఒక మహాకార్యము ఒక్కరిచే సాధ్యము కాదు. కొందఱు పట్టుదలతో ఒకరి తర్వాత నొక్కరుగా విడువక చేసిన అది సాధ్యమగును బ్రహ్మ సాక్షాత్కారమునకు ఒక లక్ష సంవత్సరముల తప మవసరము. సగరుని మొదలు భగీరథుని వరకు అది నిరంతర దీక్షతో చేయబడినది. భగీరథుడే గంగను దెచ్చినాడని ప్రథ యున్నను, దాని వెనుక మిగిలిన ముగ్గురి పరిశ్రమయున్నది. ప్రఖ్యాతి చివరి వానికే వచ్చును, వచ్చినది. ఈ లోక విషయమును విదిత పరచుటకై బుద్ధభూపతి మూలమును కొలదిగా మార్చియున్నాడు.

---

1. రంగనాథ రామాయణము అయోధ్యా. ద్వి. 133.
2. రంగనాథ రామాయణము యుద్ధ. ద్వి. 836.
3. రంగనాథ రామాయణము సుందర. 443, 444
4. దా. ప్రతి. వాల్మీకి రామాయణము బాల సర్గ. 41 శ్లో. 25-27

మరియు బాల. సర్గ. 42 శ్లో. 1-25.

9) సీతా క్షమాపణము :—

సీతాదేవి శ్రీరామునితో వనవాసమునకు వెంట వచ్చెదనని పట్టు పట్టెను. అతడు కాంతార దోషములను వివరించి ఆమెను గొనిపోవ నంగీకరింపలేదు. అప్పుడు సీతాదేవి—

"కిం త్వా మన్యత వైదేహః పితామే మిథిలాధిపః।
రామ జామాతరం ప్రాప్య స్త్రియం పురుష విగ్రహమ్॥"[1]

అని ప్రణయాభిమానములచే శ్రీరాముని "పురుష రూపమున నున్న ఆడదాని"వని పరిక్షేపించినట్లు మూలమునందు కలదు.

కాని రంగనాథ రామాయణమునందు— ఈ పరిభూషణ మనువదింపబడలేదు; మీదుమిక్కిలి సీతాదేవి—

"ఎఱింగి నేఁ జేసితినే మున్ను తప్పు-మఱచి చేసితినేని మన్నింపు నన్ను"[2]

అని తన జ్ఞాతాజ్ఞాత దోషములను క్షమింపుమని పాదములఁ బట్టి ప్రార్థించినట్లు మార్చబడినది. ఇది సీతాదేవి శీలమునకు వన్నె పెట్టుట.

మఱికొన్ని మార్పులను సంక్షిప్తముగా నుట్టంకింతును.

వాల్మీకి రామాయణము	రంగనాథ రామాయణము
1. కుశుని నల్గురు కుమారులలో ఆధూర్త రజసు డొకడు.[3]	1. ఇందు ధూర్తరజసుడైనాడు.[3]
2. సాంకాశ్య నగరము నందలి కుశధ్వజుని పిలిచికొని వచ్చుటకు జనకానుమతిని దూతలు పోయిరి.[4]	2 శతానందు డేగెను.[4]
3. శ్రీరాముని నావను నడిపి గంగను దాటించిన వారు నావికులు.[5]	3. గుహుడే స్వయముగా దాటించెను.[5]
4. పంచవటియందు పర్ణశాలను రామాదేశమున లక్ష్మణుడొక్కడే నిర్మించెను.[6]	4. ఇరువురు కలిసికట్టిరి.[6]

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. అయోధ్యా. సర్గ. శ్లో. 3.
2. రంగనాథరామాయణము, అయోధ్యా. ద్వి. 643.

3. దా. ప్రతి వాల్మీకి రామాయణము బాల. సర్గ. 32 శ్లో. 7 (ప. ఉ. ప్రతిలో అమూర్త వయసుడని కలదు)	3. రం. రామా. బాల. ద్వి. 941, 947
4. దా. ప్రతి వా. రామా. బాల. సర్గ.70. శ్లో.5	4. రం. రామా. బాల. ద్వి. 2009-2015
5. ,, ibid ,, అయోధ్యా. సర్గ. 52 శ్లో. 78, 80	5. ,, అయోధ్యా. ద్వి. 1109-1110 (ద్విపదలను ముందు వెనుకలుగా మార్చిన మూలానుసారమగును)
6. ,, ibid అరణ్య. సర్గ.15. శ్లో.20-25	6. ,, అరణ్య. ద్వి. 238. 239.

5. సఖ్యము కుదిరిన మీద సుగ్రీవుడు రామునికి పర్ణాసనము వేయగా, మారుతి లక్ష్మణునకు వేసెను.[1]	5. హనుమంతుడే రాఘవులకు సుగ్రీవునకు పర్ణాసనమును వేసెను.[1]
6. లక్ష్మణ సుగ్రీవు లొకే పల్లకిలో కూర్చుండి రాముని సన్నిధికి పోయిరి.[2]	6. వేరువేరు పల్లకులందు పోయిరి.[2]
7. హనుమంతుడు లంకా ద్వార స్థిత సైన్య వర్ణనమును తూర్పునుండి ప్రారంభించి ఉత్తర పరిసమాప్తి గావించెను. ఇది సవ్య వర్ణనము.	7. ఇందు పడమరనుండి ప్రారంభించి ఉత్తర పరి సమాప్తి గావించ బడినది. ఇది అపసవ్య వర్ణనము.[3]
8. విభీషణ శరణాగత సందర్భమున రాముడు కిరాత కపోత వృత్తాంతము నుదాహరించెను.[4]	8 ఇందు శిబి కపోత వృత్తాంత ముదాహృత మైనది[4]
9. శ్రీరాము డగస్త్యుడొసంగిన బ్రహ్మాస్త్రముచే రావణుని సంహరించెను.[5]	9. విశ్వామిత్రుడొసంగిన బ్రహ్మాస్త్రముచే సంహరించెను.[5]

ఇట్టి అల్పమైన మార్పులు అటనట కనఁబడుచున్నవి.

(B) క్రమ విపర్యములు :—

మూలానువాదములందు కొన్ని కథాంశములలో విషయ భేదము లేకున్నను. కథాక్రమ పౌర్వాపర్యములందు మార్పు పొడమినది. అట్లు వానిని ముందు వెనుకలుగా మార్చుటలో బుద్ధభూపతి యాశించిన ప్రత్యేక ప్రయోజనము గొప్పగా లేదు—

(1) అంగుళీయ ప్రదానము :—

మూలమునందు - ఆంజనేయుడు రాముని రూప గుణములను, సుగ్రీవ స్నేహమును, స్వవృత్తాంతమును దెలిపిన తర్వాత (సుందర సర్గ-35) ప్రత్యయము కొఱకై అతడొసంగిన రామ నామాంకిత ముద్రిక నీయగా నామె గ్రహించెను.[6]

---

1. దా. ప్రతి. వా. రామా. కిష్కింధా. సర్గ. 5 శ్లో. 19-21; సర్గ 8 శ్లో. 13-14	1. రం. రామా. కిష్కింధా. ద్వి. 224-225
2. దా. ప్రతి. వా. రామా. కిష్కింధా సర్గ. 38 శ్లో, 10-12	2. ,, కిష్కింధా. ద్వి. 860-862
3. ,, ,, యుద్ధ. సర్గ. 3 శ్లో 24-28	3. ,, యుద్ధ. ద్వి. 75-90
4. ,, ,, యుద్ధ. సర్గ. 18 శ్లో. 24-26	4. ,, యుద్ధ. ద్వి. 659-660
5. ,, ,, యుద్ధ, సర్గ. 111 శ్లో. 4.	5. ,, యుద్ధ; ద్వి. 6794-7795

6. దా. ప్రతి. వాల్మీకి రామాయణము సుందర. సర్గ 37, శ్లో. 2, 3, 4.

రంగనాథ రామాయణమునందు—రామ సుగ్రీవ వృత్తాంతము. స్వవృత్తాంతమును చెప్పక పూర్వమే, మారుతి—

"జనపతి నీకు విశ్వాసము పుట్టు - నని యిచ్చి పుత్తెంచె నంగుళీయకము

నని చూపి మ్రొక్కిన"[1]

సీత యతనిని గాంచి,

అదరెడు దనుజ మాయల ననుకలము - సుడుకుల(బడి వేగు చుండుదు గాన

యనఘాత్మ రఘురాము నంగుళీయకము(- గనియు విశ్వాసంబు గలుగదు నాకు"[2]

అని పలికి, "నీవెవ్వడవు, నీపేరేమి" యని మొదలుగా ప్రశ్నించెను. ఆంజనేయుడపుడు "ఆత్మ వృత్తాంత కథన పూర్వకముగా రామసుగ్రీవ సంబంధ వృత్తాంతమును దెలిపి,

"ఆ పుణ్యు డంగుళీయక మప్పుడిచ్చె."[3]

నని కలదు.

మారుతి మొదట ముద్రికను చూపుట, సీత నమ్మక పోవుట, విశ్వాసమునకై సీతా ప్రశ్నలకు సమాధానముగా రామ వృత్తాంతాదులను చెప్పి ముద్రికనిచ్చుట."

అనునది కథా క్రమము నందలి మార్పు—

రాక్షసులు మాయావులు; ఎట్టి వస్తువులనైనను సృష్టింపగలరు; ఎట్టి రూపములనైనను ధరింప గలరు. రావణుడే వానర రూపమును ధరించి యుండనోపునని యనుమానించి మౌనము వహించి యున్న సీతకు ఆనవాలైన శ్రీరామ ముద్రిక కూడ నమ్మకము కలిగింపలేదని చెప్పుట కవి యాశయము- ఇక రావణుడు రాముని పొగడడు; రాముని స్తుతించినచో అతడు రావణుడు కాడని నమ్మవచ్చును. కావున సీత ప్రశ్నలకు, ఆంజనేయ సమాధానమున కవకాశము గలిగినది.

ii) మారుతి విశ్వరూపము :-

"హనుమంతుడు సీతతో, శ్రీరాముడు నా వలన నీ వృత్తాంతమును విని వానర సైన్యముతో గూడి తప్పక వచ్చు"నని పలికి "అలస్య మెందులకు, నా వీపు నెక్కుము, నేడే సముద్రమును దాటి రాముని యొద్దకు చేర్చగలనని" పలికెను. సీత ఆశ్చర్యపడి "హనుమంతుడా! నీ వల్ప శరీరుడవు: నన్ను చాల దూరమెట్లు మోసికొనిపోజాలుదువు; నీ కపిత్వము ఇప్పుడు వ్యక్తమైనదని" పలికెను. మారుతి తన సత్త్వ ప్రభావములను చూపుటకై శరీరమును పెంచి మేరు మందర సంకాశుడై సీత ముందు నిలబడెను.[4]

రంగనాథ రామాయణమునందు మారుతి స్వస్వరూప ప్రదర్శన మిట్టి సందర్భమున చెప్పబడ లేదు. అతడు సీతా సందేశమును గ్రహించి రాముని యొద్దకు తిరిగి పోవువాడై

1. రంగనాథ రామాయణము. సుందర. ద్వి- 479-480.
2. రంగనాథ రామాయణము. సుందర. ద్వి. 481, 482.
3. రంగనాథ రామాయణము సుందర. ద్వి. 526.
4. దా. ప్రతి. వాల్మీకి రామాయణము సుందర. సర్గ 37 శ్లో. 18-36.

"అచ్చుగా రఘురాము నంగుళీయకము-తెచ్చి యొప్పించితి దేవి నీ కర్థి
ధరణిజ రిక్తహస్తము తోడ మగుడ-మరలుట దూత ధర్మముగాదు నాకు
అతివ ముద్రారత్న మానతిమ్మని"[1] యడుగగా, నప్పుడు సీతాదేవి—
నీవు విచారింప నిసుమంతగాని-లేవు సముద్ర మేలీల దాటితివి (దాటెదవు)
యారూఢ బల విక్రమాస్పదంబయిన-నీ రూప మెట్టిదో నిజముగాఁ జూపు
మేను నీ నిజ రూప మేర్పడఁ జూచి-కాని నా తలమానికము నీకు నీయ"[2]

నని పలుకగా, మారుతి పెరిగి విశ్వరూపమును చూపినట్లు మార్చబడినది. ఈ సంభాషణము, సందర్భము అంతయు కవి కల్పించినదే.

మారుతి విశ్వరూప దర్శనమునకు మూలమునందు వర్ణితమైన కారణమే ఔచిత్యవంతముగా నున్నది.

ఇట్టి క్రమ విపర్యయ కథాంశముల పట్టిక.

వాల్మీకి రామాయణము	రంగనాథ రామాయణము
1. స్కందోత్పత్తికి పూర్వము ఉమాదేవి దేవతలకు శాప మొసంగినది.	1. కుమారోద్భవానంతర మిది వర్ణితము
2. శ్రీరామాదులు యమునా నదిని దాటిన పిదప సిద్ధవటమును (న్యగ్రోధమును) సేవించిరి.	2. సిద్ధవటమును సేవించిన తరువాత యమునా నదిని దాటిరి.
3. సైన్య కలకలమును విని లక్ష్మణుడు రామాదేశమున వృక్ష మారోహించి భరత సైన్యమును గాంచి చెట్టుమీద నుండియే అన్నతో సంభాషించెను.	3. చెట్టు దిగివచ్చి శ్రీరామునితో సంభాషించెను.
4. మాయా మృగమును గాంచి, సౌమిత్రి మారీచ రాక్షస మాయ గానోపునని మాటాడిన పిదప సీత సంభాషించును.	4. సీత సంభాషణానంతరము లక్ష్మణ సంభాషణము గలదు.
5. వాలి మరణానంతరము తార శ్రీరాము నుపాలంభించినది.	5. వాలి మరణాత్పూర్వమే తార శ్రీరాము నుపాలంభించినది.
6. ఆంజనేయ జంబుమాలుల సంగ్రామము, జంబుమాలి వధ మంత్రిసుత వధకు పూర్వము జరిగినది.	6. మంత్రిసుత వధానంతరము జంబుమాలి సంగ్రామ వధలు వర్ణితములైనవి.
7. ఆదిత్య హృదయోపదేశ పూర్వమే సారథి మూర్ఛాగతుడైన రావణుని రథమును రణభూమినుండి దూరముగా తోలుకొని పోయెను.	7. ఆదిత్య హృదయోపదేశానంతరము రావణుడు మూర్ఛ నెందును; సారథి రథమును దూరముగా తోలుకొని పోవును.

ఇట్టివి మరికొన్ని గలవు; అవి అంత ప్రధానమైనవి కావు.

---

1. రంగనాథ రామాయణము- సుందర- ద్వి. 598-600.
2. రంగనాథ రామాయణము సుందర. ద్వి. 601 603.

V సంకలనములు

బుద్ధ భూపతి వాల్మీకి రామాయణ మాధారముగా శ్రీరామ చరిత్ర కావ్యమును వ్రాయగఁ బూనినను, సంస్కృత భాషయందు తనకుముందు విరచితమైయున్న వివిధ రామాయణ గ్రంథముల నుండియు, పురాణముల నుండియు, దేశీయ గీతములనుండియు, తనకు నచ్చిన విషయములను గ్రహించి, కొన్నింటిని యథాతథముగాను, మరికొన్నింటిని కొలదిగా మార్చియు ననువదించి తన గ్రంథమున జొప్పించి యున్నాడు. తన రామాయణమున కొక ప్రత్యేకత గల్పింపవలెననెడి కవి యాశయమే ఇట్టి పనికి ప్రోత్సాహ కారణ మనవచ్చును. ఇట్లితర గ్రంథాధారమున రచించిన భాగములచే గ్రంథము కొంత విస్తృతమైనది. ఇట్టి విషయములన్నియు సంకలనముల క్రిందికి చేర్చబడును. వీనిలో కొన్ని కథాంశ గతములు, మరికొన్ని భావ గతములు (కల్పనలు). ఇవి యన్నియు పురాణ ప్రభావము, వివిధ రామాయణ ప్రభావము, దేశి యనెడు ప్రకరణములయందు వివరముగా చర్చింపబడినవి. మచ్చున కొకటి రెండు భావగత సంకలనముల నిట నుదాహరింతును—

1) శ్రీరాముని విలుగంటలు మ్రోగుట :—

రఘురాముడు రావణుని మూలబలముపై సమ్మోహనాస్త్రమును ప్రయోగించి, దానినుండి వెడలునట్టి అసంఖ్యాక శరములతో సమయించునపుడు—

"పది కోట్లు రథము లిర్వదివేలు హరులు (వేల కరులు)
పది నూఱు గజములు పద్మంబు బలము (పదుల రదములు)
నాలంబు లోపల నతి దారుణముగఁ-గూలిన నొక యట్ట గునియుచు నాడు
నట్టలు కోటైన నద్దివి కెగసి-బెట్టుగా నొకతల పెడబొబ్బవెట్టు
నట్టివి కోటైన నా రాము వింట—గట్టిన యొకగంట ఖణిలని మ్రోయు
మరగంటలును నాదమాన కిరేడు—మొరసె నవ్విభు చాపమున పలుమారు (నరజాము)
భావింపరాకుండఁ బదునేడు గడియలు"[1]

అని వర్ణింపబడిన భావ మవాల్మీకము. ఇది శ్రీరాముని సమర నైపుణ్య కరశర లాఘవ సామర్థ్యమునే కాక, రావణుని మూలబల సంఖ్యాతీతమును కూడ స్పష్టపరచును. కాని ఈ భావ కల్పనము కవి సొంతము గాదు.

"నాగానా మయుతం తురంగ నియుతం సార్ధం రథానాం శతం
పత్తీనాం శతకోటి నాశ సమయే త్వేకా కబంధా నృతిః।
ఏవం కోటి కబంధ నర్తన విధా వేకాధ్వనిః కింకిణే
ర్త్రింశత్తాః ప్రహరార్ధతో రఘుపతేః కోదండ ఘంటారణే"॥[2]

అను శ్లోక భావమును కొలదిగా మార్చి పెంచి వ్రాసిన రచనము.

---

1. రంగనాథ రామాయణము యుద్ధ. ద్వి 6123-6128.
2. ఆనంద రామాయణము సారకాండము సర్గ. 11 శ్లో. 258.

2) శ్రీరాముడు సీతకై పొందిన నిందాద్వయము:—

సీతాపహరణానంతరము దాశరథి విలపించుచు—

"పౌరి సురాసుర లోక పూజార్హ మైన-హరువిల్లు విఱిచితి నతివ నీ కొఱకుఁ
బహునిగాఁ దలపోసిఁ బ్రాహ్మణుం డనక-పరశురాముని భంగపఱిచితిఁ గడగి
నీరజలోచన నీకునై పూని-యీ రెండు నిందల నేను గైకొంటి."[1]

నని బాధ పడును. ఈ యవాల్మీక భావము

"చన్ద్రార్ధ శేఖర శరాసన మద్రిసారం-మీన ధ్వజస్య మయిచాప వికర్షణం చ।
శౌర్య స్మయం భృగుపతేశ్చ సమాపయంతీ-లబ్ధా చ సుందరి మయాఽలఘునోద్యమేన॥"[2]

యనెడు శ్లోకమున కనుసరణము. మూలశ్లోకమునందలి ద్వితీయ పాద విషయము పరిహరింప బడినది.

3) వామ దక్షిణ హస్త సంభాషణము.

శ్రీరాముడు బాణము సంధించునపుడు ఎడమ చేయి వెనుకకుఁ బోయిన కుడి చేతిని జాచి,

"ధనువంది యేను ముందఱ నడువంగ-మనుజేశు మఱుగుకు మగుడఁ బోయెదవు
కుడువఁ గట్టను దొడుకొనఁ బూయఁగాక-యెడపక యని నిల్వ నెవ్వని తరము
దారాత్మ సుత భోగ తతిఁ బొందునపుడు-నీ రాజ్యమై యుండు నీ రాము నొద్ద
నన విని వలపలి హస్తంబు నవ్వి-వెనుకదీయుట గాదు వినుము నామాట
యసుర నీ వేళను నతివేగ చంప-వసుధేశునకుఁ జెప్ప వలెనని యేను
జెవిఁ జేరి విన్నవించెద నంచు దలచి-భువన రహస్యమై పోయితిఁ గాక
యని కేను వెఱతునె యద్భుతంబుగను-నను జూడు మింతలోననె..."[3]

యని యుత్తరముఁ జెప్పెను. ఈ సంభాషణ మద్భుతావహము; అవాల్మీకమైన యీ కల్పనము.

"ఆ కృష్టే యుధికార్ముకే రఘుపతే ర్వామోఽబ్రవీ ద్దక్షిణం
దానాదాన సుభోజనేషు పురతో యుక్తం కిమిత్థం తవ।
వామాన్యః పునరబ్రవీ న్మమ నభీః ప్రష్టుం జగత్స్వామినం
ఛేత్తుం రావణ వక్త్ర పంక్తి మితి యోచద్యాత్సవో మంగళం"[4]

అనెడి శ్లోకమున కచ్చమైన యనుకరణము.

---

1. రంగనాథ రామాయణము ఆరణ్య ద్వి. 1251-1253.
2. హనుమద్రామాయణము నందలిదిగా రామాయణ సారోద్ధారము, ఆరణ్యకాండము, పుట 157 లో ఉద్ధరింపబడినది.
3. రంగనాథ రామాయణము (ఆ. వి. క. ప. ప్రతి) అనుబంధము 2 పుట 831.
4. హనుమన్నాటకము అంకము 14 శ్లోకము 35

ఈ రీతి బుద్ధ నృపతి "అచ్చటచట మూలశ్లోకములకు యథాతథానువాదము చేసియు, కొన్ని చోట్ల అనుచితములని తోచిన కథాంశములను పరిత్యజించియు, అవసరమైన చోట్ల వర్ణనా సంభాషణాదులను పెంచియు తనకు పూర్వమందున్న కవుల కావ్యములనుండి, పురాణముల నుండి కొన్ని మనోహరమైన కల్పనలను, కథాంశములను గ్రహించియు, రంగనాథ రామాయణమును సర్వాంగ పరిపుష్ట సుందర జాతీయ మహాకావ్యముగా తీర్చి దిద్ది యున్నాడు. ఇది యనువాద గ్రంథము వలె గాక, స్వతంత్ర గ్రంథముగా విరాజిల్లవలెనని కవి తలంపు. అవిఫలవంతమైనది: కవికీర్తి నాచంద్ర తారార్కముగా నిలుపుచున్నది. పఠితలకు దివ్యమై, భవ్యమై, శ్రీకరమై, విజ్ఞాన దాయకమై రసానంద హేతువై శుభోన్నతుల గలిగింపఁ జేయుటలో సమర్థమై యున్నది.

రంగనాథ-వాల్మీకి రామాయణముల కథార్థములు తులనాత్మక పరిశీలనము

1. బుద్ధ నృపతి ప్రతిజ్ఞ :—

శ్రీరంగనాథ రామాయణము దేశీయచ్ఛందమైన ద్విపదలో ఇహపర ద్విపద లాభమునకై అత్యంత మంజులమైన శైలిలో రచితమైన తెలుగు కావ్యము. రచయిత శ్రీ గోన బుద్ధారెడ్డి

"ఆది కవీశ్వరుడైన వాల్మీకి - యాదరంబున(బుణ్యులందఱు మెచ్చ(
జెప్పిన తెఱ(గున శ్రీరామ చరిత - మొప్ప(జెప్పెద"1

నని ప్రతిజ్ఞ చేసి దీనిని రచించినట్లు తెలియుచున్నది. ప్రస్తుతము మన తెలుగు దేశమున ప్రచారము నందున్న వాల్మీకి రామాయణ ప్రతితో దీనిని పోల్చి చూచినపుడు అనేక వ్యత్యాసములు కాన(బడు చున్నవి. ఈ భేదములు కథాంశములయందు, వర్ణనలందు, అలంకారాది భాషా సాహిత్య ప్రయోగ ములందును కలవు. కావున చాలా మంది విమర్శకులు బుద్ధారెడ్డి వాల్మీకి చెప్పిన తెఱంగున శ్రీరామ చరిత మొప్ప(జెప్ప లేదనియు, అనేకములైన అవాల్మీకాంశముల నిందు(జేర్చినాడనియు చర్చించుచు అందు ముఖ్యములైన "నారదాగమన, పాతాళ హోమాది వృత్తాంతములను పట్టికగా వ్రాసి"2 చూపించియున్నారు. కాని, ఇన్ని అవాల్మీకాంశములను జేర్చి రచయిత స్వవచో వ్యాఘాతమునకు గురి యైనాడా? యని సత్యాన్వేషణ తత్పర బుద్ధి కలిగిన పరిశోధకునకు సందేహము కలుగక మానదు. ఆ యథార్థ గవేషణాసక్తి తోడనే నేను రంగనాథ రామాయణమును పరిశీలించితిని.

2. రామాయణ రచన :—

వాల్మీకి విరచితమైన శ్రీమద్రామాయణమున కంటె పూర్వము రామ కథకు సంబంధించిన ఆఖ్యానములు దేశమునందు వ్యాప్తిలో నున్నవి. వైదిక సాహిత్యము నందును దీనికి(దగిన ఆధార

---

1. రంగనాథ రామాయణము అవతారిక ద్వి. 102, 103

2. a) వేదము లక్ష్మీనారాయణశాస్త్రి "పీఠిక—రంగనాథ రామాయణము" పుటలు 16-18 వావిళ్ళ ప్రచురణము.

b) పింగళి లక్ష్మీకాంతం "ఆంధ్ర సాహిత్య చరిత్ర" పుటలు 174-178.

c) ఆరుద్ర "సమగ్రాంధ్ర సాహిత్యం" సం. III పుటలు 234-139 (మొదలగు గ్రంథములు)

ములు కనిపించుచున్నవి. "ఇక్ష్వాకు, దశరథ, జనక, అశ్వపతి, సీతా, రామ వసిష్ఠాది శబ్దములును"1 తత్సంబంధేతి వృత్తములును ఋగ్వేదాది సంహితల యందును, బ్రాహ్మణములందును, ఉపనిషత్తు యందును ప్రపంచింప బడినవి. ఋక్సంహిత యందు శ్రీరామ చరిత్రము స్పష్టముగా కనబడు చున్నది.2 వీని నాధారము చేసికొని, వాల్మీకి మహాముని నారదోప దేశమునను, బ్రహ్మ యానతిని శ్రీమద్రామాయణమును రచించెను. కావున

"వేద వేద్యే పరేపుంసి జాతే దశరథాత్మజే।

---

1. a) ఇక్ష్వాకు శబ్దము :—
"యస్యేక్ష్వాకు రుపవ్రతే రేవాన్ మరాయ్యేధతే" ఋగ్వేద 10-60-4
(ఎవని సేవ వలన ధనవంతుడు, ప్రతాపవంతుడునైన ఇక్ష్వాకువు వృద్ధి యయ్యెనో)

b) దశరథ శబ్దము :—
"చత్వారింశ ద్దశరథస్య శోణాః సహస్ర స్యాగ్రే శ్రేణిం నయంతి."
(ఋగ్వేద. 1 అష్టక. 1 అధ్యా. 2 వర్గ. 3 మంత్ర)
(దశరథుని నలుబది ఎఱ్ఱని గుఱ్ఱములు వేయి గుఱ్ఱములచే లాగదగిన రథమునకు ముందు రథ చక్ర పంక్తిని నడిపించుచున్నవి)

c) జనక శబ్దము :—
1) జనకోహ వైదేహో బహుదక్షిణేన యజ్ఞేనేజే"
(బృహదారణ్యకోపనిషత్తు-అధ్యాయ. 5 బ్రాహ్మణము-1)
("వైదేహుడైన జనకు డనేక దక్షిణలు గల యజ్ఞ మొనర్చెను)
2) "జనకగ్ంహ వైదేహం యాజ్ఞవల్క్యో జగమ"
(బృహదారణ్యక అధ్యా-5 బ్రాహ్మణము-3).

d) అశ్వపతి శబ్దము :—
"తాన్ హోవాచాశ్వపతిర్వై భగవంతోఽయం కైకయ స్సంప్రతీమ మాత్మానం వైశ్వానర మభ్యేతి" (ఛాందోగ్యోపనిషత్తు-ఖండము-11 మంత్రము 4)
(కేకయ రాజైన అశ్వపతి ఇప్పుడు వైశ్వానరాత్మను ఉపాసించుచున్నాడని వారికి చెప్పెను.)

e) సీతాశబ్దము :—
"ఇంద్రః సీతాం నిగృహ్ణాతు తాంపూషాను యచ్ఛతు."
(ఋగ్వేద-8 అష్టక. 3 అధ్యా. 24 వర్గ. 13 మంత్రము)
[ఇంద్రుడు (శ్రీరాముడు) సీతను స్వాధీన పరచుకొనును. పూష (జనకుడు) అనంతరము ఆమెను (శ్రీరామునకు) ఇచ్చును).

2. భద్రో భద్రయా సచమాన ఆగాత్-స్వసారం జారో అభ్యేతి పశ్చాత్।
సుప్రకేతై ర్ద్యుభి రగ్ని ర్వితిష్ఠ-న్రుశద్భి ర్వర్ణై రభిరామ మస్థాత్॥
(ఋగ్వేద. 10-3-3; సామవేద. 1548)

వేదః ప్రాచేతసా దాసీత్ సాక్షాద్రామాయణాత్మనా॥"[1]
అను శ్లోకము వేదోప బృంహణమే రామాయణమని నిరూపించు చున్నది.

3. రామాయణ రచనా కాలము :—

వాల్మీకి మహర్షి త్రేతా యుగమునందు రామాయణమును విరచించెనని భారతీయాస్తికుల విశ్వాసము. దీని ననుసరించి, ద్వాపరము 864000 సంవత్సరములు, వర్తమాన కల్యాది గతాబ్దములు 5080, చెరసి మొత్తము 869080 సంవత్సరముల పూర్వమునుండి వాల్మీకి రామాయణము దేశమున ప్రచారమునందున్నదని చెప్పవచ్చును. కాని నేటి ఆధునిక చారిత్రక పరిశోధకులు తమకు లభించిన ఆధారములపై తర్జన, భర్జనలు చేసి కనీసము క్రీ పూ, 500 నుండి రెండవ శతాబ్దము మధ్య కాలమున రామాయణ రచన జరిగినదని నిర్ణయించుచున్నారు.[2] అయినను తెలుగు రంగనాథ రామాయణ రచనకు సుమారు రెండువేల సంవత్సరముల పూర్వమే సంస్కృత వాల్మీకి రామాయణ రచన జరిగినదని నిష్కర్షగా చెప్ప వచ్చును.

4. రామాయణము - పాఠ భేదములు :—

వాల్మీకి రామాయణమును రచించి కుశీలవులకు (కుశలవులకు) చెప్పి కంఠస్థము చేయించెను. వారు మునుల యెదుట, ప్రజల నడుమ, రచ్చల యందు, రాజ మార్గములందు, సభా మధ్యమునం బాడుచు ప్రచారము చేసినారు. ఈ రీతిగా, కంఠపాఠమొనర్చిన కుశీలవుల మౌఖిక రూపమున నిది ప్రచారము లోనికి వచ్చినది. కాని వాల్మీకి కృతమైన మొదటి రామాయణ ప్రతి స్వరూపము తెలియదు. క్రమముగా కాలము గడచిన కొలది, జ్ఞాపక శక్తి తగ్గిన కొలది, కంఠ గతమై కంఠోక్తిగా రామాయణమును గాన ప్రవచనాదుల రూపమున ప్రచారము చేయువారికి మధ్య మరపు గలిగినపుడు కొన్ని విడచుటయు, కవితా పాండిత్య శక్తి గలిగి యున్నవారు అద్భుత రస పోషణకై, పవిత్రతా ప్రాప్తికై, అసమంజసములని తోచిన వానిని సమర్థించుటకై, సందేహ నివారణకై, రమ్యతా పాదనమునకై కొన్నింటిని క్రొత్తగాం జేర్చి చెప్పుచుండుటయు, అవియే చాలకాలము తరువాత భిన్నభిన్న పరంపరల ఆధారముపై స్థాయీ లిఖిత రూపమును ధరించుటయు సహజమైన విషయ

(రామభద్రుడు సీతాదేవితో కలిసి (యడవికి) వెళ్ళెను. జారుడగు రావణుడు సీతను గ్రహించుటకు రామలక్ష్మణుల పరోక్షమున వచ్చెను. రాముడు రావణాదులను చంపి, సీత యగ్ని ప్రవేశము జేయగా, యగ్ని రాముని కెదురుగా సీతతోగూడ శోభన కాంతులతో నిలిచి యుండెను.) ఇట్టి మంత్రముల నన్నింటిని క్రోడీకరించి వేద రామాయణ మను పేరుతో వ్యాఖ్యా సహితముగా శ్రీ ములుకుట్ల నరసింహావధానులుగారు ప్రకటించియున్నారు.

1. రామాయణ ప్రార్థనా శ్లోకము (అగస్త్య సంహితలోనిదని చెప్పుచున్నారు).

2. 'The cumulative evidence of the above arguments makes if difficult to avoid the conclusion that the kernel of the Ramayana was composed before 500 B. C; While the more recent portions were probably not added till the second century B.C and later."
Arthur, A Macdonell. "A History of Sanskrit literature.' P. 260.

ములు. అందుచే రామాయణ పాఠములన్నియు ఒకే విధముగా నుండకుండ అనేక పాఠాంతరము లేర్పడినవి. అందేవి నిజముగా వాల్మీకి రచితము లను ప్రశ్న పొడముచున్నది. దీనికి సమాధానము చెప్పుట కష్టసాధ్యము.

గోన బుద్ధారెడ్డి కాలములో రామాయణ ప్రతులు చాలా యుండినట్లును, ఆయా ప్రతులలో భేదము కన్పించిన చోట తన బుద్ధికి తోచిన, నచ్చిన విషయములను స్వీకరించి. తదితరమైన పాఠములను వదలినట్లును, ఏ పాఠములోనైన నూతనాంశము- ఇతర ప్రతులలో లేనిది— కన్పించినచో దానిని స్వీకరించినట్లును, అనుచితములనియు. అనవసరము లనియు తోచిన కథాంశ ములను వదలినట్లును, రచించిన కథాంశములలో కూడ జన బాహుళ్యము నందధికముగా వ్యాప్తిలో నున్న వానినే స్వీకరించినట్లును. మన మీనాడు రంగనాథ రామాయణమును జూచి యొక యభి ప్రాయమునకు రావచ్చును. కాని బుద్ధారెడ్డి ఒకేయొక్క ప్రతిని జూచి తన తెనుగు ద్విపద రామా యణమును వ్రాసినాడని పోల్చి చెప్పఁజాలము. ఆనా డత డనుసరించి వ్రాసిన ప్రతికాని, ప్రతులు గాని ఇదమిత్థమని మన కీనాడు లభించవుగదా! కావున ఒక నిర్ణయమునకు రావచ్చును. ఆధు నికులు రామాయణ ప్రతులను బాగుగా పరిశీలించి, పాఠ భేదములను నిరూపించి, ముఖ్యముగా మూడు విధములుగా వింగడించి ముద్రించినారు. నేడు ఆ మూడు విధములైన రామాయణ పాఠ భేదములే ప్రచారము నందున్నవి. బుద్ధారెడ్డి కాలమునకే రామాయణమున కీ మూడు విధములైన ప్రతు లేర్పడినవనుట కవకాశమున్నది. (1) దాక్షిణాత్యప్రతి (2) ఔత్తరాహప్రతి లేక పశ్చి మోత్తర శాఖీయ ప్రతి (3) గౌడీయ (వంగీయ) ప్రతి.

1. దాక్షిణాత్య పాఠము :—

నిర్ణయ సాగర ముద్రిత ప్రతి (బొంబాయి), గుజరాతీ ముద్రణాలయ ప్రతి (బొంబాయి) మరియు దక్షిణ దేశ సంస్కరణ ప్రతులన్నియు ఈ వర్గమునఁ జేరియున్నవి. దేశమునం దీ పాఠమే ఎక్కువ వ్యాప్తిలో నున్నది.

2. పశ్చిమోత్తర శాఖీయ ప్రతి :—

ఈమధ్య దయానంద మహావిద్యాలయ సంస్కృత గ్రంథమాల-లాహోర్ (లవపురం) వారు వంగ దేశమునను, ఉత్తర దేశమునను, పంచవటి యందును లభించెడి వాల్మీకి రామాయణ హస్త లిఖిత ప్రతులను, తాళపత్ర ప్రతులను సంపాదించి, సంశోధించి, శ్రీరామ లభాయా, ఆచార్యులు ఖాలసా కాలేజి, అమృతసర్; శ్రీ భగవద్దత్త బి.ఎ.; శ్రీ విశ్వబంధుశాస్త్రి, ఆచార్యులు, లాహోరు విశ్వవిద్యాలయము గారల సంపాదకత్వమున ఆ యా కాండములను పరిష్కరించి ప్రచురించిరి. ఈ రామాయణమునకు "పశ్చిమోత్తర శాఖీయం-వాల్మీకి రామాయణమ్" అని పేరుంచఁబడినది.

ఈ ప్రతిని సిద్ధము చేసిన సంపాదకులకు లాహోరు, పంచవటి, కురుక్షేత్రము, పూనా, భరతపుర, నాసిక్, గుజరాతు మొదలగు ప్రాంతములందు లభించిన హస్తలిఖిత ప్రతులాధారములు. ఈ ప్రతులలో అన్నియు సమగ్రములు కావు. కొన్నింటిలో కొన్ని సర్గలు, శ్లోకములు. కాండము లును లభింపవేదని సంపాదకులు తమతమ పీఠికలలో తెలియఁబరచి యున్నారు. ప్రతి సర్గ ప్రారంభమునందు ఎడమ భాగమున వంగ దేశీయ ప్రతి సర్గ సంఖ్య, శ్లోక సంఖ్యయు, కుడి భాగ

మున దాక్షిణాత్య ప్రతి సర్గ సంఖ్య, శ్లోక సంఖ్యయు నీయబడుటయే కాక, అధస్సూచికలందు తమకు లభించిన ప్రతులలోని పాఠ భేదములు నుట్టంకింపబడినవి. ప్రతి కాండాంతమున శబ్ద విశేషములు, వ్యక్తి విశేష నామములు, పట్టణ, నదీ, పర్వత, వన, దేశ, శస్త్రాస్త్ర, వృక్షలతాదుల నామముల సూచికలు, ముఖ్యములైన ఉపమాద్యలంకారములు గల శ్లోక భాగ సూచికయు పాఠకుల సౌకర్యార్థ మొసంగబడినది.

పాఠ విశేషములు :—

1) ప్రతి సర్గాంతమున తత్సర్గ విషయ సూచక నామ కరణము కాన్పించుచున్నది.

ఉదా :— ఇత్యార్షే రామాయణేఽయోధ్యాకాండే రామస్య చీర పరిగ్రహో నామ చత్వారింశ స్సర్గః, ఇట్లే "గుహ సమాగమోనామ, ఇషీకాస్త్ర విసర్జనం నామ," అని ప్రతి సర్గకు పేరులను చూడవచ్చును.

2) దాక్షిణాత్య ప్రతిలో కాని, వంగదేశ ప్రతిలో కాని ఆ సర్గలు, శ్లోకములు, శ్లోక భాగములు లేనిచో N (Nil = నాస్తి), O (Omission) అను సంజ్ఞలు పాఠకుల సౌకర్యార్థము సూచించబడినవి.

3) అధస్సూచికలలోని పాఠ భేదములలో "లంకా పర్వణి", అయోధ్యా పర్వణి" అని కానబడుచున్నవి. వీనివలన రామాయణము కాండముల వారిగానే కాక, పర్వము లను పేర ఉప విభాగము కూడ కావింపబడినదేమో యను నూహకు తావేర్పడుచున్నది. 18 పర్వముల మహా భారతము మరల ఉప పర్వములుగా విభజింపబడినట్లు సప్తకాండ పరిమితమైన రామాయణ ముప పర్వములుగా భాగింపబడియు నుండవచ్చును. దీనికి మహాభారత ప్రభావమును హేతువుగా చెప్ప వచ్చును. క్షేమేంద్రుడు కూడ తన రామాయణ మంజరిలో "ఇతి శ్రీ క్షేమేంద్ర విరచితే రామాయణ కథా సారే కిష్కింధా పర్వ", "ఇతి శ్రీ క్షేమేంద్ర విరచితే రామాయణ కథా సారే కిష్కింధా కాండః సమాప్తః" అనియు మధ్యమధ్య "ఇతి సముద్రపర్వ, ఇతి భరతపర్వ", అనియు నామ కరణము చేయబడిన పర్వోపరి విభాగము చూడ, వాల్మీకి రామాయణమునందును నిట్లుపవిభాగము కలదేమో యను నూహ కవకాశము గలుగుచున్నది. కాని సంపాదకులు మాత్రము అట్టివానిని అధస్సూచికలలో చేర్చుటచేత అవి లేఖకుల వ్రాతలని గ్రహింపబడి యుండవచ్చును.

3) గౌడీయ పాఠము (వంగీయ పాఠము)

కలకత్తా సంస్కృత సీరీజ్ వారు సంస్కరించి ముద్రించిన ప్రతియు, ప్యారిస్ వారు ప్రకటించిన ఇటాలియన్ ప్రతియు ఈ కోవకు చెందినవి.

ఈ ముప్పిధములైన పాఠ భేదములను[1] పరిశీలించి తులనాత్మకాధ్యయనము చేయగా, గౌడీయ-పశ్చిమోత్తర శాఖీయ పాఠములు రెండును- కించిద్భేదముల నుపేక్షించినచో - సన్నిహిత ములుగా నున్నట్లును, వీనికి చాల భిన్నముగా దాక్షిణాత్య పాఠమున్నట్లును తెలియనగును.

ఆది వాల్మీకి రామాయణము క్రమక్రమముగా, మెల్లమెల్లగా భిన్నమై మొదట ఔత్తరాహ

---

1. It (Ramayana) has been preserved in three distinct recensions, the west Indian (A), the Bengal (B) and the Bombay" (c).
Arthur-A Macdonell. "A History of sanskrit literature" Page 254.

పాఠము. దాక్షిణాత్య పాఠమని రెండు రూపములను పొందినట్లును, ఆ పిదప ఔత్తరాహ పాఠము కాలము గడచిన కొలది ఈషద్భేదమును వహించి గౌడీయ (వంగ) పాఠమనియు, పశ్చిమోత్తర శాఖీయ పాఠమనియు రెండు రూపములను పొందినట్లును తలంపవచ్చును. కావుననే గౌడీయ, పశ్చిమోత్తర శాఖీయ పాఠములలో ఎక్కువ అంతరము (భేదము) కానవచ్చుట లేదు. క్రీ. శ. 11వ శతాబ్ది కాలమునాటికి రామాయణము ఈ త్రివిధ పాఠ భేదముల నొంది దేశమున ప్రచారము నందున్నది "క్షేమేంద్రుడు 11వ శతాబ్దము మధ్యభాగము నందున్నవాడు. అతడు వ్రాసిన రామాయణ కథాసార మంజరి గౌడీయ, పశ్చిమోత్తర శాఖీయ పాఠముల ననుసరించి యున్నది. అదే శతాబ్దమువాడైన భోజమహారాజు వ్రాసిన రామాయణ చంపువు దాక్షిణాత్య ప్రతిని బోలి యున్నది.[1] కావున ఈ పాఠ భేదములు (ప్రతుల భేదములు) గోన బుద్ధ భూపతిక పూర్వమే స్థిర పడిపోయినవని చారిత్రకముగా ఋజువగుచున్నది. ఈ మూడు విధములైన ప్రతులలో కేవలము పదములందును, శ్లోకములందును గల పాఠభేదములే కాక, కొన్ని కథాంశములందును వ్యత్యాసము గాన్పించుచున్నది. సర్గలకు సర్గలుగా తేడా గోచరించుచున్నది. దాక్షిణాత్య ప్రతిలోని కొన్ని సర్గలు పశ్చిమోత్తర శాఖీయ ప్రతిలోను; పశ్చిమోత్తర శాఖీయ, గౌడీయ ప్రతులలోని కొన్ని సర్గలు దాక్షిణాత్య ప్రతిలోను లేకుండ నున్నవి. రంగనాథ రామాయణమును ఈ ప్రతులతో పోల్చి పరిశీలించి చూచినపుడు, కొన్ని విషయములు దాక్షిణాత్య ప్రతితోను, మరికొన్ని విషయములు పశ్చిమోత్తర శాఖీయ-వంగీయ ప్రతులతోను సరిపడుచున్నవి[2] అనగా రంగనాథ రామాయణ మందలి కొన్ని కథాంశములకు ఆధారములు పశ్చిమోత్తర శాఖీయ - గౌడీయ ప్రతులలో గనిపించుచున్న వనుట- ఇదెట్లు సంభవ మను ప్రశ్న యుదయించును :

బుద్ధభూపతి నివసించెడి వర్ధమానపురము రాయచూరు ప్రాంతమునకు సమీపము. ఔత్తరాపథులు సామీప్య కారణమున ఈ ప్రాంతములకు వచ్చి రామాయణ కథాంశములను వినిపించువారు. అవి దాక్షిణాత్య పాఠముతో కొన్ని పట్టుల భిన్నించుట వలన బుద్ధారెడ్డికి ఆశ్చర్యము కలిగి యుండ వచ్చును. తాను రాజు కావున రామాయణము యొక్క భిన్నభిన్న ప్రతులను వివిధ ప్రాంతముల నుండి తెప్పించుకొని, క్షుణ్ణముగా అధ్యయనము చేసి రామాయణ మర్మ ధర్మజ్ఞుడయ్యెను. అత్యంత పాండిత్య ధనుడగు నాతడు రామాయణ రచనా సందర్భమున ఈ త్రివిధ పాఠములలోని విషయములను, ఔచిత్యమును పాటించి, గ్రహించి యుపయోగించుకొనెను. రామాయణ మర్మ ధర్మజ్ఞుడు కావున ఏ ప్రతిలోని ఏ విషయము నెంతవరకు గ్రహింపవలెనో, దానినంతవరకే గ్రహించినాడు

---

1. Moreover Kshemendra's poetical abstract of the Epic, the Ramayana Kathasara Manjari. which follows the contents of the original step by step proves that its author used A (west edition) and perhaps B (The Bengal recension) also, in the middle of the eleventh century. Bhoja, the composer of another epitome, the Ramayana Champu. probably used c (the Bombay recensions) in the same century."Aurthur-A-Mecdonell (A History of sanskrit literature" page-255.
2. వివిధ కథాంశ పాఠ భేదముల పట్టిక అనుబంధమున నీయబడినది.

కాని, యే యొక్క ప్రతిని ఆదినుండి అంతము వరకు అనుసరించిన వాడు కాడు. అ వాల్మీకములని యనుకొనుచున్న అనేక కథాంశములు ఈ యౌత్తరాహ పాఠములలో కానవచ్చు చుండుట వలన బుద్ధభూపతి త్రివిధ పాఠముల నుపయోగించు కోన్నాడని నిష్కర్షగా చెప్పవలసగు చున్నది ఇందులో ఎక్కువగా దాక్షిణాత్య ప్రతిని ప్రధానముగా గ్రహించియున్నాడు. బుద్ధభూపతి తెలుగువాడు. (తెలుగు దేశము దక్షిణ దేశమునందలిది) గీర్వాణ భాషా విరచితమగు రామాయణము యొక్క ఆర్షత్వమును, మౌలికత్వమును ప్రాచీనత్వమును ఎక్కువగా ఈదాక్షిణాత్యపాఠమే భద్రపరచినది.

5. రంనాథ రామాయణ ప్రతులు:—

వ్రాతపతుల రూపమున నున్న రంగనాథ రామాయణమును చాలమంది పరిష్కరించి ప్రచురించిరి అట్టి ప్రచురణములలో మూడు ముఖ్యములైనవి.

1. వావిళ్ళ ప్రచురణము; చెన్నపురి
2. రాయల్ అండ్ కో. ప్రచురణము; కడప.
3. ఆంధ్ర విశ్వ కళా పరిషత్తు ప్రచురణము; వాల్తేరు.

ఈ మూడింటిలో మూడవది ప్రధానమైనది. తంజావూరు, మద్రాసు, మొదలగు ప్రాంతము లందు లభ్యమగుచున్న వ్రాత ప్రతులను, పూర్వ ముద్రిత ప్రతులను సేకరించి, కీ.శే. వేటూరి ప్రభాకర శాస్త్రి గారి సంపాదకత్వమున సంశోధింపబడి ముద్రితమైన పాఠము. ఇందు రెండను బంధములు చివర గలవు. పూర్వ ముద్రిత ప్రతులందుండి, వ్రాత ప్రతులందు లేని ద్విపదలను, 1వ అనుబంధమునను, పూర్వ ముద్రిత ప్రతులందు లేక వ్రాత ప్రతులందు కనిపించు ద్విపదలను, ప్రక్షిప్తములుగా సంభావితములైన వానిని 2వ అనుబంధమునను జేర్చియున్నారు. అధిక పాఠములు పాఠాంతరములును అధస్సూచికలందు నొసంగ బడినవి.

ఈనాడు ముద్రణా రూపమున లభించుచున్న పశ్చిమోత్తర శాఖీయ ప్రతి, ఇటాలియన్ ప్రతి (గౌడీయ ప్రతి, గోవింద రాజీయ వ్యాఖ్యోపేతమైన దాక్షిణాత్య ప్రతి వాల్మీకి రామాయణములతో రంగనాథ రామాయణమును తులనాత్మక దృష్టితో పరిశీలించి, ఏ యంశములు ఏ ప్రతితో సరిపోలు చున్నవో తెలుపుచు రచయిత వానిని గ్రహించుటకు గల కారణములను వాని యౌచిత్యమును నా యూహకు స్ఫురించినట్లు చెప్పటయే ఈ ప్రకరణ ముఖ్యోద్దేశము. ఇంత వరకిట్లు రంగనాథ రామాయణమును ప్రత్యేకముగా పరిశీలించిన వారు తెలుగున లేనంచున నేనీ సాహసమునకు పూనుకొన్నాను. ఇట్లు చేయుట వలన ఇతః పూర్వము చాలా మంది విమర్శకులు అవాల్మీకములని చెప్పుచున్న రంగనాథ రామాయణము నందలి అనేక కథాంశములు వాల్మీకములనియే బయటపడి సత్య నిర్ణయమగు చున్నది.

ఇక దక్షిణ దేశమునందు లభించెడి వాల్మీకి రామాయణ తాళ పత్ర - వ్రాత ప్రతుల నన్నింటిని సేకరించి సామ్య భేదములను పరిశీలించి, పరిష్కరించి, దాక్షిణాత్య శాఖీయ వాల్మీకి రామాయణ ప్రతినొక దానిని ముద్రించినచో రామాయణ పరిశోధకులకు సహకారి యగుటయే గాక, అనేక నూత్న విషయములును బయట పడుట కవకాశమేర్పడును. శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మ గారును ఇదే యభిప్రాయమును వెల్లడించి యున్నారు.1

1. "పీఠిక- రంగనాథ రామాయణము" పుట-34 రాయల్ అండ్ కో ప్రచురణము 1957.

6. పరిశీలనాంశములు :—

గౌడీయ పశ్చిమోత్తర శాఖీయ దాక్షిణాత్య వాల్మీకి రామాయణ ప్రతులతో రంగనాథ రామాయణమును పోల్చి పరిశీలించునపుడు సౌకర్యార్థము ఈ క్రింది విభాగములు చేసికొనుట సముచితమనిపించును.

1. దాక్షిణాత్య ప్రతిలో లేక పశ్చిమోత్తర శాఖీయ ప్రతిలో నున్న వానితో తుల్యములైన కథాంశములు.

2. పశ్చిమోత్తర శాఖీయ ప్రతితో లేక దాక్షిణాత్య ప్రతిని సరిపోలుచున్న కథాంశములు.

3. కేవలము గౌడీయ ప్రతితో తుల్యములైన కథాంశములు.

4. మూలమునందుండి (త్రివిధ ప్రతులలోనుండి) రంగనాథ రామాయణమున లేని కథాంశములు. (అనువాద విధానము నందలి పరిత్యక్త కథాంశముల విభాగ మీ కోవకు చెందును.)

5. మూడు ప్రతులకును భిన్నమైన కథాంశములు. (ఔచిత్య దృష్టితో రచయిత చేసిన మార్పులనియు, కూర్పులనియు వీనిని గ్రహింపవచ్చును.) వీనిపైన వివిధ రామాయణ, పురాణ, దేశీయ గాథా ప్రభావ మమితముగా నున్నది. (వీనికి ప్రత్యేక ప్రకరణములు నిర్దేశింపబడినవి చూడుడు).

ఇట్లు వివరముగా వివేచించి పరిశీలించినపుడు రచయిత ఎంతవరకు వాల్మీకి ననుసరించినాడనునది తేటపడును.

ఇట్లు పరిశీలించు నంశములను పరిమాణము ననుసరించి (1) విస్తృత కథాంశములు, (2) స్వల్ప ఘటనలు, (3) పదానుసరణములు" అని మూడు ఉప విభాగములను మరల నొనర్పవచ్చును. కాని ఇచ్చట కథానుసారముగా చూచునట్టి క్రమము పాటింపబడినది.

గౌడీయ. పశ్చిమోత్తర శాఖీయ, దాక్షిణాత్య ప్రతులలోని పరస్పర భిన్న కథాంశములతో రంగనాథ రామాయణ మెంతవరకు సరిపోలుచున్నదో సులభముగా. దెలియు నిమిత్తము కాండముల ప్రకార మొక పట్టికను సిద్ధముచేసి అనుబంధమునందు, జేర్చితిని. ప్రస్తుత మా యా భిన్న కథాంశములు పరిశీలింపబడును.

రంగనాథ రామాయణము - కాండ ప్రారంభాంత విభాగము

వాల్మీకి రామాయణ భిన్న పాఠములను పరిశీలించినపుడు ఒక పాఠములో నొకరీతి, మరొక పాఠములో వేరొక రీతి కాండ ప్రారంభాంతములు విభజింపబడి యుండుటచే పరస్పర వ్యత్యాసము కనబడుచున్నది.

పరిచితమైన దాక్షిణాత్య ప్రతితోనే రంగనాథ రామాయణమును పోల్చి పరిశీలించినవారు "మూలమున హనుమంతుని సముద్రోల్లంఘన ప్రయత్నమంతయు సుందరకాండారంభమున నుండ నిందు కిష్కింధా కాండాంతముననే చేర్చినాడు. తెనుగు రామాయణమున సుందరకాండము హనుమంతుని సముద్ర లంఘనముతో నారంభించు"[1] నని కిష్కింధా కాండాంత సుందరకాండ ప్రారంభములను మూలాతిక్రమణముగా భావించి అవాల్మీకముగా పరిగణించినారు. కాని ఇది మూలాతిక్రమణము కాదు. ఇట్లే ఇతర కాండ ప్రారంభాంతములందును వ్యత్యాసము కనిపించుచున్నది, ఆ విషయ మేదోయొక పాఠమును బోలుచున్నదని పరిశీలన వలన తెలియుచున్నది; చూడుడు.

రంగనాథ రామాయణము -

1. బాలకాండ మన్ని ప్రతులందు సమానము; కాబట్టి వాల్మీకి - నారద ప్రశ్నోత్తర రూపమైన సంక్షిప్త రామాయణముతో ప్రారంభమై, వంగ ప్రతిని బోలి భరత శత్రుఘ్నుల రాజగృహ నివాస సీతారామ విహారముతో సమాప్తమగుచున్నది.

2. అయోధ్యాకాండము దాక్షిణాత్య పాఠమును బోలి, శ్రీరాముని గుణవర్ణన ప్రజానురంజకత్వముతో ప్రారంభమై, ప. ఉ. ప్రతి, వంగ ప్రతులను బోలి శ్రీరామ పట్టాభిషేకముతో సమాప్తమగుచున్నది.

3. ఆరణ్యకాండము ప. ఉ. ప్రతి, వంగ పాఠముల వలెనే శ్రీరామాదుల అత్ర్యాశ్రమ ప్రయాణముతో మొదలై, దా. పాఠము ననుసరించి శ్రీరామ సౌమిత్రులు పంపా సరోవరమును జేరుటతో ముగియుచున్నది.

4. కిష్కింధాకాండము దా. ప్రతి. ననుసరించి పంపా కానన వర్ణనముతో ప్రారంభమై, ప. ఉ. ప్రతి ననుసరించి హనుమంతుడు సముద్రమును దాటి లంకను జేరుటతో సమాప్తమగుచున్నది.

5. సుందరకాండము ప. ఉ. ప్రతిని బోలి హనుమల్లంకా ప్రవేశముతో మొదలై, దా. పతిని బోలి హనుమంతుడు స్వీకృత సీతా సాంత్వన ప్రకారమును శ్రీరామునికిఁ దెలుపుటతో ముగియుచున్నది.

6. యుద్ధ కాండము దా. ప్రతి ననుసరించి శ్రీరామకృత హనుమత్ప్రశంసతో నారంభమై సీతారామ పట్టాభిషేకముతో సంపూర్ణ మగుచున్నది.

ఇట్లు రంగనాథ రామాయణమునందు ప్రతి కాండ ప్రారంభాంతములు ఒకేయొక పాఠము ననుసరించి లేవు. శుభముతో, సుఖముతో సమాప్తము గావలె ననెడి రచయిత దృష్టియే ఈ విభాగ వ్యత్యాసమునకు కారణము కావచ్చును.

1. యుధాజిత్తు భరత శత్రుఘ్నులను తీసికొని పోవుటకు వచ్చెను. వివాహానంతరము తండ్రియను

1. వేదము లక్ష్మీనారాయణశాస్త్రి "పీఠిక-రంగనాథ రామాయణము" పుట. 17 వావిళ్ళ ముద్రణము-1960.

మతితో వారు తాతగారింటికి పోయిరీ. కావున వారి రాజ గృహ నివాసముతో, అయోధ్యలోని సీతారాముల విహారముతో బాలకాండము సమాప్తమగుట సుఖాంతము.

2. శ్రీరామ వనగమన, దశరథ మరణ, భరతాదుల విలాపములతో కూడియున్న అయోధ్యా కాండము శ్రీరామ పాదుకా పట్టాభిషేకముతో ముగియుట శుభాంతము.

3. సీతాపహరణముచే విలపించు శ్రీరాముడు పంపను జేరి సౌమిత్రి సాంత్వనమున నూరడిల్లుటతో అరణ్య కాండము ముగియును. ఇచ్చట పుణ్యక్షేత్ర దర్శనము శుభాంతము

4. సముద్ర తరణమునకు చింలిల్లు వానరుల భయమును తొలగించి, హనుమంతుడు సముద్రము ను లంఘించి, లంకను సుఖముగా చేరుటతో ముగియు కిష్కింధా కాండము సుఖాంతము.

5. సీతకై శోకించు రామునికి "సీతను దర్శించి యామె నోదార్చి వచ్చితినని" శుభవార్తను దెలిపి ఆంజనేయుడు శ్రీరాముని దుఃఖోపశమనము గావించుటతో ముగియు సుందర కాండము సుఖాంతము.

6. శ్రీ జానకీ రాఘవుల పట్టాభిషేక మహోత్సవ భోజనా (విందులతో యుద్ధ కాండము ముగియుట సుఖాంతము, శుభాంతము.

ఇట్లు బుద్ధారెడ్డి ప్రతి కాండమును సుఖాంత, శుభాంతములగునట్లు విభజించి "మంగళాదీని, మంగళ మధ్యాని, మంగళాంతాని శాస్త్రాణి (కావ్యాని) ప్రథంతే" యనెడి సంప్రదాయమును పాటించినాడు. అతడీ యుద్దేశముతోడనే రామాయణ వివిధ పాఠములను ముందుంచుకొని, ఔచిత్య మును పాటించి, ఆయాప్రతుల యాధారమున రంగనాథ రామాయణములో ప్రతికాండ ప్రారంభ, సమాప్త విషయముల నేర్పరించుకొన్నాడనుట సమంజసమైన యూహ యగును.

వాల్మీకి రామాయణము-వివిధ పాఠముల సర్గ సంఖ్య, ప్రారంభాంతములు

క్రమసంఖ్య	కాండము	దాక్షిణాత్య పాఠము			పశ్చిమోత్తరశాఖీయ ప్రతి			గౌడీయ ప్రతి			రంగ. రామాయణము	
		సర్గ సంఖ్య	ప్రారంభము	అంతము	సర్గ సంఖ్య	ప్రారంభము	అంతము	సర్గ సంఖ్య	ప్రారంభము	అంతము	ప్రారంభము	అంతము
1	బాలకాండము (ఆదికాండము)	77	వాల్మీకి నారదుని ప్రశ్నించుట (సంక్షేప రామాయణము)	వివాహానంతర మయోధ్యలో సీతా రాముల సుఖ వర్తనము	72	వాల్మీకి నారదుని ప్రశ్నించుట (సంక్షేప రామాయణము)	వివాహానంతర మయోధ్యలో సీతారాముల సుఖ వర్తనము	78	వాల్మీకి నారదుని ప్రశ్నించుట (సంక్షేప రామాయణము)	భరత శత్రుఘ్నులు మేనమామ ఇంటికి పోయి నివసించుట సీతారాముల సుఖ వర్తనము	వాల్మీకి నారదుని ప్రశ్నించుట (సంక్షేప రామాయణము)	భరత, శత్రుఘ్నులు మేనమామ యింట విద్యలు నేర్చి సుఖముగా నుండుట (వంగ పాఠానుసరణము)
2	అయోధ్యా కాండము	119	రాముని గుణ వర్ణనము. ప్రజానురంజకత్వము	అత్యాశ్రమమునుండి సీతారామ లక్ష్మణులు బయలుదేరుట	128	భరత శత్రుఘ్నులు మేనమామ యింటికి పోయి నివసించుట. విద్యాభ్యాసము	శ్రీరామ పాదుకా పట్టాభిషేకము (దా. ప్రతిలోని 115 సర్గ ఇందు చివరి సర్గయైనది)	127	రాముని గుణవర్ణనము ప్రజానురంజకత్వము	శ్రీరామ పాదుకా పట్టాభిషేకము	రాముని గుణవర్ణనము ప్రజానురంజకత్వము (దా. ప్రతి యనుసరణము)	శ్రీరామపాదుకాపట్టాభిషేకము (ప.ఉ. ప్రతి వంగ ప్రతుల యనుసరణము)

	దాక్షిణాత్య పాఠము	పశ్చిమోత్తర శాఖీయ ప్రతి	గౌడీయ ప్రతి	రం. రామాయణము
3 అరణ్య కాండము	75	82	79	
	దండకారణ్యమున రామాదుల మున్యాశ్రమ గమనము	మునులు రామునికి రాక్షసుల బాధలు తెలిపి చిత్రకూటము వీడిపోవుట (దా. ప్రతిలోని అయోధ్యాకాండ 116, 117, 118 సర్గలు ఇందు ప్రారంభ సర్గలు)	మునులు రామునికి రాక్షసుల బాధలు తెల్పి చిత్రకూటము వీడిపోవుట (దా. ప్రతి అయోధ్యాకాండ 116, 117, 118 సర్గలు ఇందు ప్రారంభ సర్గలు)	రాముడు మునుల వీడ్కొని అత్యాశ్రమమునకు పోవుట(ప.ఉ. ప్రతి అనుసరణము)
	రామసౌమిత్రులు పంపను చేరుట	పంపా దర్శనముచే గలిగిన రామోన్మాదము. రాముడు ఋష్యమూకముపై పు బయలు దేరుట. (దా. ప్రతి కిష్కింధాకాండ ప్రథమ సర్గ ఇందు చివరి సర్గ.)	పంపా దర్శనముచే గల్గిన రామోన్మాదము. రాముడు ఋష్యమూకము పైపు బయలు దేరుట (దా. ప్రతి కిష్కింధా కాండ ప్రథమ సర్గ. ఇందలి చివరి సర్గ.)	రాముడు పంపను జేరి విశ్రమించుట (దా. ప్రతి. అనుసరణము)
4 కిష్కింధా కాండము	67	62	63	
	పంపా కానన వర్ణనము	సుగ్రీవుడు రామసౌమిత్రుల యొద్దకు ఆంజనేయుని పంపుట (దా. ప్రతిలోని రెండవ సర్గ ఇందలి ప్రారంభ సర్గ)	సుగ్రీవుడు రామసౌమిత్రుల యొద్దకు ఆంజనేయుని పంపుట (దా. ప్రతిలోని రెండవ సర్గ ఇందలి ప్రారంభ సర్గ)	పంపా కానన వర్ణనము (దా. ప్రతి యనుసరణము)
	ఆంజనేయుని సాగరలంఘన సన్నాహము	ఆంజనేయుడు సాగరమును లంఘించి లంకను జేరుట. (దా. ప్రతి. సుందరకాండ లోని ప్రథమ సర్గ ఇందలి చివరి సర్గ)	సంపాతి సీత లంకలో నున్నట్లు వానరులకు దెలిపి పోవుట (సంపాతి గమనము) (దా. ప్రతిలోని 63వసర్గ ఇందలి చివరిసర్గ)	ఆంజనేయుడు సాగరమును లంఘించి లంకను జేరుట-(ప.ఉ. ప్రతి అనుసరణము)

		దాక్షిణాత్య పాఠము	పశ్చిమోత్తర కాశ్మీయ ప్రతి	గౌడీయ ప్రతి	రం. రామాయణము
5	సుందర కాండము	68 మహేంద్రగిరినుండి హనుమదుత్పతనము (సాగర లంఘనము) హనుమంతుడు స్వకృత సీతా సాంత్వన ప్రకారమును రామునికి వివరించుట	100 హనుమంతుడు త్రికూటము నందలి లంకను గాంచి ప్రవేశించుట (దా. ప్రతిలోని రెండవ సర్గ ఇందలి ప్రారంభ సర్గ) రావణుడు రాక్షసులతో సమాలోచనము చేయుట (దా. ప్రతి యుద్ధకాండములోని 22వ సర్గ తర్వాతి వృత్తాంతము ఇందలి చివరి సర్గ)	95 సంపాతి వచనముచే అంగదాదులు సముద్ర తీరము చేరుట (దా. ప్రతి కిష్కింధాకాండ లోని 64వ సర్గ ఇందలి ప్రథమ సర్గ) సేతు బంధన సమాప్తి. దేవతా ప్రశంస రాముడు వానరులతో సముద్రమును దాటుట (దా. ప్రతి యుద్ధకాండ 22వ సర్గ ఇందలి చివరి సర్గ)	హనుమంతుడు లంకను గాంచి ప్రవేశించుట (ప. ఉ. ప్రతి అనుసరణము) హనుమంతుడు స్వకృత సీతా సాంత్వన ప్రకారమును రామునికి చెల్పుట (దా. ప్రతి అనుసరణము)
6	యుద్ధకాండము (లంకా కాండము)	131 శ్రీరాముడు ఆంజనేయుని ప్రశంసించుట-లంకను గూర్చి అడుగుట శ్రీరామ పట్టాభిషేకము	110 రావణాజ్ఞచే శుక సారణులు కపి రూప ధరులై రాముని సైన్యమును ప్రవేశించుట (దా. ప్రతి యుద్ధకాండములోని 25వ సర్గ ఇందలి ప్రథమ సర్గ) శ్రీరామ పట్టాభిషేకము	113 రావణాజ్ఞచే శుక సారణులు కపి రూప ధరులై రాముని సైన్యమును ప్రవేశించుట-(దా. ప్రతి యుద్ధకాండములోని 25వ సర్గ ఇంధలి ప్రథమ సర్గ) శ్రీరామపట్టాభిషేకము	శ్రీరాముడు ఆంజనేయుని ప్రశంసించుట లంకను గూర్చి అడుగుట (దా. ప్రతి అనుసరణము) శ్రీరామ పట్టాభిషేకము

రామాయణ కథాంశ కల్పనలు-ఔచిత్య విచారము

వాల్మీకి రామాయణము త్రివిధ పాఠ భేదములతో నొప్పుచున్నదనియు, కొన్ని కథాంశము లందు పరస్పర వ్యత్యాసములును, మరికొన్ని కథాంశము లొక పాఠము నందుండి వేరొక పాఠము నందు లేకపోవుటయు కనబడుచున్నదనియు ఇదివరలో సూచించియుంటిని. రంగనాథ రామాయణము నందలి అట్టి కథాంశముల నా యా మూల పాఠములతో పోల్చి వాని యౌచిత్యమును విచారించి నపుడు బుద్ధభూపతి పాండిత్య ప్రతిభలు తెలియనగును; అతని కీర్తి ప్రతిష్ఠలు మరింత విస్తృతమగును—

బాలకాండము

1. వాల్మీకి ప్రశ్న :—

తనయొద్ద కేతెంచిన నారద మహామునితో వాల్మీకి వేసిన ప్రశ్న యిట్లున్నది.

"కోన్వస్మిన్ సాంప్రతం లోకే గుణవాన్ కశ్చ వీర్యవాన్

....

ఏతదిచ్ఛా మ్యహం శ్రోతుం పరం కౌతూహలం హి మే"[1]

ఇచట సాంప్రత శబ్దము విచారింపదగినది. దేశములో కొందరు రామావతారమునకు పూర్వమే రామాయణము రచింపఁబడినదనియు, మఱికొందఱు రాముని కాలమునందే పట్టాభిషే కానంతరమే వ్రాయబడినదనియు వాదింతురు. అట్టి వారందరి యనుమానమును ఈ "సాంప్రత" శబ్దము నివారించును. ప. ఉ. ప్రతిలో నిచట "ప్రథితం"[2] అని పాఠాంతరమున్నది. కాని దాని కంత ప్రాధాన్యము కనిపించదు, వ్యాఖ్యాకారులు "సాంప్రతం-అస్మిన్ కాలే. ని. అస్మిన్ కాలేఽ-ధునేదానీం సంప్రత్యేత్యర్థా సాంప్రతం[3] అని సాంప్రతమునకు 'ఈ కాలమునందు-ఇప్పుడు' అని యర్థము చెప్పినాడు. 'ఈ కాలమునందే, యని వాల్మీకి యడుగుటకు కారణము నూహించి "లోకాం తరే విష్ణోర్విదితత్వా దత్రైవ కాలాంతరే నృసింహాదేః ప్రసిద్ధత్వాచ్చ తద్వ్యావృత్యర్థ మేవము క్తం"[4] అని యా వ్యాఖ్యాతలు సమాధానము నిచ్చియున్నారు. కాని రంగనాథ రామాయణ కర్త-

"ఎవ్వఁడు శ్రీమంతు డెవ్వఁడు శాంతుడు ....

అట్టివా డిలఁ బుట్టి యరిగెనో ? యిప్డు పుట్టెనో ? యికమీదఁ బుట్టనున్నాఁడా?"[5]

అని వాల్మీకిచే నడిగించినాడు. భూత, వర్తమాన, భవిష్యత్కాలములను మూడింటిని నిర్దేశించి అట్టి గుణవంతు డెప్పు డుండునని వాల్మీకి ప్రశ్నోద్దేశము. కృష్ణుని యవతారమా ? అప్పటికి రాలేదు. భావికాలమున నున్నను అతని చర్యలు మానవాతీతములు. నృసింహాద్యవతారములు వచ్చినను, అవి

---

1. దా. ప్రతి. రామాయణము బాలకాండము ప్రథమసర్గ శ్లో. 2, 4 1/2.
2. ప. ఉ. ప్రతి. రామాయణము బాలకాండ. ప్రథమసర్గ శ్లో. 2
3. గోవిందరాజీయము బాలకాండ. 1వ సర్గ 2వ శ్లోక వ్యాఖ్యానము
4 గోవిందరాజీయము బాలకాండ. 1వ సర్గ 2వ శ్లోక వ్యాఖ్యానము
5. రంగనాథ రామాయణము బాలకాండ. ద్వి. 103-111.

గుణ సంపూర్ణములైనను, మానవాదర్శకములు కావు. వర్తమానమున శ్రీరాముడున్నను, అతని విషయమున నారదాది మహర్షుల యభిప్రాయి మెట్లుండునో యని తలంచి వాల్మీకి భూత వర్తమాన భవిష్యత్కాలముల నిర్దేశించి ప్రశ్నించుటయే సమంజసము. ఒకవేళ మూలానుసారముగా "సాంప్రతం"- (ఇప్పుడు) అని యడిగిన అట్టివాడు భూతభవిష్యత్తులందు నుండవచ్చును గదా! అప్పుడు త్రికాలజ్ఞుడు త్రిలోకజ్ఞుడు నైన నారదునికి వారిని గూర్చి ప్రస్తావించ నవకాశము లేక పోవును; తన ప్రశ్న కసమగ్రత గలుగును. కావున బుద్ధభూపతి సాంప్రత మను శబ్దమునకు-

"అట్టివా డిలఁ బుట్టి యరిగెనో? యిప్డు పుట్టెనో? యికమీదఁ బుట్టనున్నాడో?"[1]

యని యౌచిత్య దృష్టితో విపరించి యున్నాడు. తర్వాత నారదుడు-

"............... -తన బుద్ధి నెంతయుఁ దలపోసి చూచి

యీ మహి శ్రీవిష్ణు డిపుడు జన్మించె-రాముడై దశరథ రాజున కతడు"2

అని సమాధానము చెప్పినాడు. వాల్మీకి యుపయోగించిన "సాంప్రత" శబ్దార్థము "ఇపుడు" అను నది నారదుడు సమాధానము చెప్పుచోట ప్రయోగించబడినది.[3] ఇచట మూలమునందు—

"మునే వక్ష్యామ్యహం బుద్ధ్వా తైర్యుక్త శ్శ్రూయతాం నరః।

ఇక్ష్వాకు వంశ ప్రభవో రామో నామ జనైః శ్రుతః॥"[4]

అని మాత్రమే కలదు. "రాముడు విష్ణువనియు" (మూలమునందు) నారదునిచే వక్కాణింపబడలేదు. కాని బుద్ధభూపతి నీ వడిగిన గుణములు గలవాడు శ్రీవిష్ణుడనియు. అతడిపుడు దశరథునకు రాముడై జన్మించినాడనియు" వ్యక్తి నిర్దేశమును, కాల నిర్దేశమును నారదునిచే చేయించినాడు.

నిర్దుష్టమైన గుణములు గలవాడు భగవంతుడైన విష్ణువే కాని మరొక్కడు కాడనియు, భూత భవిష్యద్వర్తమాన కాలములందు నతడు స్వీకరించిన యవతారములలో తద్గుణములతో ప్రవర్తించిన కాలము "ఇపుడు" (వర్తమానము) అనియు, అతడే దశరథ రాముడనియు, మానవులతని నడవడినే ఆదర్శముగా గ్రహించవలెననియు, చెప్పినట్లయినది. ఇది కవి ప్రతిపాదించ దలచిన యర్థము. శ్రీరాముడు వాల్మీకి సమకాలీను డగుటయే కాక, రామావతారమునకు తరువాతనే రామాయణ రచన జరిగినదని సూచించినట్లయినది.

ప. ఉ. ప్రతిలో దీనికి పాఠాంతరముగా నథస్సూచికయందు "కింతు వక్ష్యామ్యహం తుభ్యం భవిష్యతి మహాయశాః।[5] అని కలదు. ఇందలి భవిష్యతి శబ్దము రామావతారమునకు పూర్వమే

---

1. రంగనాథ రామాయణము బాల. ద్వి. 111
2. ,, ,, ,, ద్వి. 112, 113.
3. దా. ప్రతి వాల్మీకి రామా. బాలకాండ ప్రథమసర్గ శ్లో. 7 1/2
4. భాస్కర రామాయణమునందు మూలానుసారముగా వాల్మీకి ప్రశ్నించు చోటనే గలదు. "ఈ జగంబున నిప్పుడెవ్వడు గుణశాలి. అవ. పద్య. 11.
5. ప.ఉ. ప్రతి. రామాయణము బాలనాం. సర్గ 1 శ్లో. 11 నకు పాఠాంతరము Foot Notes No-11.

రామాయణ రచన"మని తెలుపుచున్నది; కాని సీతామహాసాధ్విపైన (రజకుడు మోపిన)[1] యప వాదును తొలగించుటకే వాల్మీకి రామాయణమును వ్రాసినా డనుట సమంజసము. అపుడీ పాఠాంతరము సముచితము కాదు. కావున దా. ప్రతి వాల్మీకి రామాయణములోని "సాంప్రత" శబ్దమును గ్రహించి వాల్మీకి యడిగిన సందర్భమునందు కాక, నారదుడు సమాధానము చెప్పిన చోటికి రంగనాథ రామాయణమున మార్చబడి ప్రయోగింపబడినది.

2) వాల్మీకి కిరాతుని శపించినది స్నానాత్పూర్వమా ?

"నారద ముని రామ చరిత్రను సంగ్రహముగా వాల్మీకికి నుపదేశించి నలినజు పురికి పోయిన పిదప, వాల్మీకి శిష్యుడగు భరద్వాజునితోఁ గూడ తమసా నదికి స్నానార్థ మేగెను. అచట, రమణీయ ప్రసన్నాంబువుల భాసిల్లు నట్టి అకర్దమ తీర్థమును గాంచి, స్నానము చేయఁ దలచి, భరద్వాజు డందించిన వల్కలమును గ్రహించి, విశాలమైన వన సౌందర్యమును జూచుచు సంచరింపఁ దొడగెను. అపుడొక బోయవాడు కామజు కేళిమై కలిసియున్న క్రౌంచద్వంద్వము నందలి మగపిట్టను కొట్టెను, ఆడపిట్ట శోకించుచుండ, దానిని చూడజాలక వాల్మీకి కోపించి వ్యాధుని శపించెను. అంతట శ్లోక రూపమున పరిఢవిల్లిన ఆ శాప వాక్యములకు విస్మయపడుచు, తత్తీర్థమున స్నానమాడి, ఆ శ్లోకార్థమునే భావించుచు వాల్మీకి యాశ్రమమునకు వచ్చెను"[2]

ఇది దా. ప్రతి యందలి శ్లోకావిర్భావ వృత్తాంతము.[3] ఇచట వాల్మీకి స్నానాత్పూర్వమే వ్యాధ విద్ధ క్రౌంచ దర్శన జనిత శాపరూప శ్లోకోత్పత్తి జరిగినదనుట చర్చనీయాంశము.

రంగనాథ రామాయణమునందు వాల్మీకి స్నానానంతరము క్రౌంచ యమళ దర్శనాది ఘటన సంభవించినట్లు—

తమసా నదికిఁ బోయి తన్నదిఁ దోఁగి-తమ యనుష్ఠానముల్ దగఁ జేయుచుండి
యా యేటి దరిఁ గ్రౌంచ యమళంబు ప్రేమఁ-గా యజు కేళిమై గవయుచో"[4]

ననెడి ద్విపదలు తెలుపుచున్నవి. అపుడిది కవి చేసిన మార్పా ? అని సందేహము కలుగును. కాని ప. ఉ. ప్రతిలో స్నానానంతరము క్రౌంచ వృత్తాంతము ఘటించినట్లు చెప్పబడినది.5 ఇట్లే

---

1. దా. ప్రతి వాల్మీకి రామాయణమునందు ఉత్తర కాండలో రజక వృత్తాంతమే కనబడదు.
2. దా. ప్రతి వాల్మీకి రామా. బాల. సర్గ-2 శ్లో. 1-20.
3. స్నానాత్పూర్వమే క్రౌంచ దర్శనాది వృత్తాంతము ఘటించినట్లు ఆనంద రామాయణము నందును వర్ణింపబడినది. యాత్రాకాండ సర్గ 1. శ్లో. 10, 11.
4. రంగనాథ రామా. బాల. ద్వి. 143, 144.
5. "సశిష్య హస్తాదాదాయ పరిధాయచ వల్కలం।
అవగాహ్య జలం స్నాత్వా జప్త్వా జప్యంచ వాగ్యతః॥
తర్పయిత్వాచ విధివత్ తోయేన పితృదేవతాః।
నిరీక్షమాణో వ్యచరత్ తత్తీర్థం తమసాంచతాం॥
(ప. ఉ. ప్రతి వాల్మీకి రామా. బాల. సర్గ-2 శ్లో 10, 11)

క్షేమేంద్ర కృత రామాయణ మంజరియందును గలదు.[1] కావున బుద్ధభూపతి ఈ విషయమును ప.ఉ. ప్రతి ననుసరించి వ్రాసినాడు.[2]

స్నానముచే కాయశుద్ధి, జపముచే వాక్శుద్ధి, శాస్త్రోక్త కర్మాచరణముచే మానసిక శుద్ధి యేర్పడును. ఇట్లు త్రికరణములందు శుచిర్భూతుడైన వాల్మీకి నోటినుండి ఆదికావ్యావిర్భావమునకు బీజభూతమైన సంస్కృత ప్రథమ శ్లోకోత్పత్తి జరుగుట ధర్మము కాని, అశుచిగా నున్నవేళ జరుగుట అంత సముచితము కాదు రామాయణాది పవిత్ర గ్రంథములను స్నానముచేసి శుచియై పారాయణము చేయవలె ననెడి సదాచారము పెద్దలచే అనుష్ఠింపబడుచునే యున్నది. అట్టిచో ఆది శ్లోకావిర్భావము స్నానాత్పూర్వము జరిగిన దనుట సబబు కాదు. కావున బుద్ధనృపతి ప. ఉ. ప్రతి ననుసరించి, సంప్రదాయమును సదాచారమును పాటించి, ప్రథమ శ్లోకావిర్భావము స్నానానంతరమే జరిగినట్లు వ్రాసి యౌచిత్యమును పోషించినాడు.

3. సర్గ సంఖ్య:—

ఆదికవి రచించిన రామాయణమునందలి సర్గలెన్నియో స్పష్టముగా మనకుఁ దెలియదు ప్రస్తుతము ప్రచలితమై, ప్రచురితమై యున్న వివిధ పాఠములలో వివిధ సంఖ్యలు పొడ కట్టుచున్నవి.

దాక్షిణాత్య ప్రతిలో—

"చతుర్వింశత్సహస్రాణి శ్లోకానా ముక్తవాన్ ఋషిః।
తథా సర్గ శతాన్ పంచ షట్కాండాని తథోత్తరమ్॥"[3]

అనియు, పశ్చిమోత్తర శాఖీయ ప్రతిలో—

"సర్గాణాం షట్ శతానీహ వింశతిశ్చైవ సంఖ్యయా।
....
చతుర్వింశతి సాహస్రం సర్వపాప భయాపహం॥"[4]

అనియు కలదు. మరియు ఇదే ప్రతిలోని అనుక్రమణికాధ్యాయమునందు ప్రతి కాండమునందుండు సర్గ సంఖ్యయు, శ్లోక సంఖ్యయు వివరించబడినది. దీనిచేత "సప్తకాండములలోని సర్గల మొత్తము ౬౭౦"[5] ఆగుచున్నది. ఇంతేకాక, ప్రచురితమైన గ్రంథము నందలి సర్గ సంఖ్యకును, అనుక్రమణికాధ్యాయమునందు చెప్పబడిన సర్గ సంఖ్యలకు పొంతన లేదు.

---

1. సగత్వా తమసాతీరం తీర్థే స్నాత్వా కృతార్చనః।
   చచార శిష్యసహితః పుణ్యాసు వనభూమిషు॥
   (క్షేమేంద్రుడు "రామాయణ మంజరి" బాల. శ్లో. 15.
2. భాస్కర రామాయణమున నిట్లే యున్నది. (బాలకాండ. వచనము-6) "ఆ పుణ్యవాహిని నవగాహంబు సేసి వెడలి నిలువంబడునెడ"—
3. దా. ప్రతి. వాల్మీకి రామా. బాలకాండ. సర్గ 4 శ్లో. 2.
4. ప. ఉ. ప్రతి వాల్మీకి రామా. బాలకాండ. సర్గ. 3 శ్లో. 143, 144.
5. ,, ,, సర్గ 3 శ్లో. 29, 42, 57, 72, 92, 120, 141

ప్రస్తుతము ముద్రింపబడిన వాల్మీకి రామాయణ వివిధ పాఠములందు సర్గ సంఖ్య లిట్లున్నవి[1]

1. దాక్షిణాత్య పాఠము = 537 సర్గలు. ఉత్తరకాండముతో 648.
2. పశ్చిమోత్తర శాఖీయ పాఠము = 554 సర్గలు. ఉత్తరకాండముతో 666
3. గౌడీయ (వంగీయ) పాఠము 555 సర్గలు ,, 670.

ఇట్లు గ్రంథస సంఖ్యకు ముద్రిత పాఠ సంఖ్యలకు అధికమైన వ్యత్యాసము గానవచ్చు చున్నది చాలకాలము వరకు లిఖిత రూపమునగాక, మౌఖిక రూపమున నుండుటయు, పండితులు ప్రక్షేపముల ననేకములను జేర్చుటయు సర్గ సంఖ్యాధిక్యతకు కారణము కావచ్చును.

బుద్ధ నృపతి మాత్రము దా. ప్రతి ననుసరించి వ్రాసినాడు.

"వెలయ నిర్వదినాల్గు వేల శ్లోకములు-గలిగి యేనూఱు సర్గల వి స్తరిల్లి
కాండంబు లాఱింట(గర మొప్పు మిగిలి—యుండ రామాయణ మొప్ప(గావించి
యొనర తక్కిన కథలుత్తర కాండ-మున(జెప్పి వాల్మీకి మునినాథు డంత"[2]

బుద్ధారెడ్డి కాలమున దా. ప్రతి రామాయణములో "ఏనూఱు" సర్గలు సరిగా నున్నవో ? లేవో ? అనువాదము కావున శ్లోకమునందున్నట్లు వ్రాయబడినదని మాత్రము చెప్పవచ్చును. భాస్కర రామాయనమునం దిట్లే యున్నది.[3]

4. అయోధ్యా నగర వైశాల్యము :—

"అయోధ్యా నగరము పొడవు 12 యోజనములు, వెడల్పు 3 యోజనములని మూలమునందు చెప్పబడినది"[4] కాని రంగనాథ రామాయణమునందు—

"ద్వాదశయోజనా త్యాయతంబగుచు-నైదు యోజనముల నది వెడల్పగుచు[5]

అని యున్నది. వెడల్పులో "మూడింటికి ఐదు" అని కవి జేసిన మార్పు. ఐదు శబ్దము ప్రాస స్థానమునందు ప్రయోగింపబడుటచే లేఖకుల పొరపాటు కాదు. భాస్కర రామాయణమునందు మూలానుగుణముగానే "అమర(ద్రియోజన విస్తీర్ణము(దగ(బండ్రెండు యోజనంబుల నిడుపై, కొమరారు నయోధ్యా నగరమనియే[6] వర్ణింపబడినది

---

1. పట్టిక చూడుడు— పుటలు 119, 120, 121.
2. రంగనాథ రామాయణము బాలకాండము ద్వి. 214-216
3. భాస్కర రామాయణము, అవతారిక, వచనము-24 "ఉత్తరకాండ కథయునుం గూడ నేడు కాండంబులు నేనూఱు సర్గలు"
4. "ఆయతా దశచద్వేచ యోజనాని మహాపురీ॥
   శ్రీమతీత్రీణి విస్తీర్ణా సువిభక్త మహాపథా॥"
   దా. ప్రతి. బాల. సర్గ 5 శ్లో. 7
5. రంగనాథ రామాయణము బాలకాండము ద్వి. 230.
6. భాస్కర రామాయణము బాలకాండము పద్య-28.

బుద్ధారెడ్డి చేసిన ఈ మార్పులో విశేషమేమైన నుండవచ్చునని వాస్తు శాస్త్రముతో పరిశీలించి చూచినను, ధన, ఋణ, ఆయ సంఖ్యా విశేషములలో ఏ మాత్రమును భేదము రానందున ప్రయోజనము కలుగలేదు. లబ్ధ పదము 36 అయినను, 60 అయినను శ్వానాయనమే. కావున విశేషమేమియు లేదు.

ప. ఉ. ప్రతి అధస్సూచిక యందిచ్చిన పాఠాంతరములలో "దశచ"[1] అను దానికి "పకంచ" (పంచచ?) అని కలదు. ఈ పదమును గ్రహించిన "ఆయతా పంచచ ద్వేచ" యగును. దీనియందు పఠన, సౌకర్యము, లయాత్మకత అంతగా లేదు. కావున ఆ "పంచ" శబ్దమును "శ్రీ"కి బదులు చేర్చినచో "శ్రీమతీ పంచ విస్తీర్ణా", యని యగును. ఇది బుద్ధారెడ్డి చెప్పిన దానికి సరిపడును.

పట్టణము, పెద్ద పట్టణము (నగరము, మహానగరము) అని చెప్పుట జన వ్యవహారము. 36 యోజనముల వైశాల్యము కల దానికంటె 60 యోజనముల వైశాల్యము కలది పెద్ద పట్టణమగును. కావున ఈ దృష్టితో "పంచ" పాఠమును గ్రహించి "ఐదు యోజనముల నది వెడల్పుగుచు" నని బుద్ధారెడ్డి వ్రాసినాడని తలంపవచ్చును. ఇది పెద్దగా చెప్పవలెననెడి యతని తహతహకు నిదర్శనమగుచున్నది—

5. దశరథుని భార్యలు :—

దశరథ చక్రవర్తికి "హ్రీ శ్రీ కీర్తుల"ను బోలు ముప్వురు భార్యలు కలరు."[2] వారే కౌసల్య, సుమిత్ర కైకేయిలను వారలు.

రంగనాథ రామాయణమునందు కథా ప్రారంభముననే

"అన్నరనాథు కులాంగ నా మణులు - మున్నూట యేబండ్రు, ముఖ్యులై యందు
నచలిత సౌశీల్యయైన కౌసల్య - కుచకుంభ నిర్జిత్ర కోక యాకైక
యనఘ చరిత్ర యౌ నాసుమిత్రయును - వినుతికెక్కిరి త్రయీ విద్యలో యనగ"[3]

యని దశరథునికి "మూడు వందల యేబది మంది" భార్యలని వర్ణింపబడినది; ఆనంద రామాయణమునందు దశరథ పత్నుల సంఖ్య "700"[4] అని కలదు. కావున కొందఱు విమర్శకులు "దశరథుని పత్నుల సంఖ్య శతాధికముగా నుండుట అవాల్మీక కల్పనము; దీనిపై ఆనంద రామాయణ

---

1. ప.ఉ. ప్రతి. వాల్మీకి రామా. బాలకాండ సర్గ 5 శ్లో. 3 నకు Foot Notes No. 5 (ఈ "పంచచ" అను పాఠము పంచవటియం దుపలబ్ధమైన ప్రతిలోనిదట).
2. దా. ప్రతి. రామా. బాలకాండ. సర్గ 15 శ్లో. 19.
   "తస్యభార్యాసు తిసృషుహ్రీశ్రీ కీర్త్యుపమాసుచ"
3. రంగనాథ రామాయణము బాలకాండ ద్వి. 249-251.
4. ఆనంద రామాయణము సారకాండము సర్గ 1 శ్లో. 74, 75.
   "కౌసల్యా చ సుమిత్రా చ కైకేయీ చ గిరీంద్రజే।
   ....
   తథాఽన్యాని సప్తశత కలత్రాణ్యకరో న్నృపః॥"

ప్రభావము కలదు. ఇదే రీతిగా కల్పవృక్షాది[1] కావ్యములు దశరథుని పత్నులను అధిక సంఖ్యలో పేర్కొన్నవి"[2] అని తలంచిరి.

కాని మూలమునందే "దశరథునికి మున్నూట యేబండ్రు పత్నుల"ని యున్నది చూడుడు. "వన వాసమునకుఁ బోవు శ్రీరాముడు మీ దర్శనార్థమై నిలబడి యున్నాడని సుమంత్రుడు దశరథునికి మనవి చేయగా, నతడు

"సుమంత్రా నయ మే దారాన్ యే కేచిదిహ మామకాః।

దారైః పరివృతస్సర్వైర్ద్రష్టు మిచ్ఛామి ధార్మికం॥".[3]

అని సుమంత్రునితో పలికెను. అంతట నతడంతఃపురమునకేగి రాజాజ్ఞను దెలిపి "రండ"నగానే 350 మంది కౌసల్యతో గూడి వచ్చిరి.

"అర్ధసప్త శతాస్తాస్తు ప్రమదాస్తామ్రలోచనాః।

కౌసల్యాం పరివార్యాథ శనైర్జగ్ముర్ధృతవ్రతాః॥"[4]

వ్యాఖ్యాకారుడును "అర్ధ సప్త శతాః - అర్ధం సప్తశతస్యేతి విగ్రహః"[5], అని సమాసమునకు విగ్రహము చెప్పి వివరించినాడు. ఏడు నూర్లలో సగము. అనగా 350 మంది దశరథుని భార్యలని స్పష్టపడినట్లే గదా।

వనవాసమునకేగు శ్రీరాముడు పిన తల్లులను దర్శించి ప్రార్థించుచోట వాల్మీకి ఈ దశరథ భార్యా సంఖ్యను మరల చెప్పియున్నాడు.

"త్రయశ్శత శతార్ధాశ్చ దదర్శా వేక్ష్యమాతరః।

తాశ్చాపి స తథైవార్తా మాతౄ ర్దశరథాత్మజః॥

ధర్మయుక్త మిదం వాక్యం నిజగాద కృతాంజలిః"॥[6]

దీనికి గోవింద రాజీయమున "త్రయశ్శత శతార్ధాశ్చ - త్రయశ్శతం - త్రిశతం: తేత్రయ సాదేశః శతార్ధం - పంచాశత్ - త్రయశ్శతం శతార్ధం ప్రమాణం యాసాం తాస్తథోక్తాః.— మాతరః -" అని వ్యాఖ్యానింపబడినది—

ఇచట ప. ఉ. ప్రతిలో.—

అర్ధ సప్త శతాస్తత్ర దదర్శాన్యా విమాతరః"[7] అని యున్న పాఠాంతరమైనను దశరథుని భార్యలు 350 అని తెలుపుచున్నది—

---

1. విశ్వనాథ సత్యనారాయణ "రామాయణ కల్పవృక్షము"
2. పండా శమంతకమణి "తెలుగు సాహిత్యములో రామకథ" పుట 167, 399.
3. దా. ప్రతి రామాయణము అయోధ్యా. సర్గ 34 శ్లో. 10.
4. ,, ,, ,, సర్గ 34 శ్లో. 34.
5. గోవింద రాజీయము అయోధ్యా. సర్గ 34 శ్లో. 13 వ్యాఖ్యానము.
6. దా. ప్రతి. రామాయణము అయోధ్యా. సర్గ 39 శ్లో. 36, 37.
7. ప. ఉ. ప్రతి రామాయణము అయోధ్యా. సర్గ 42 శ్లో. 36.

ఇంతే కాక, భరతుడు మృతుడైన దశరథుని చూడబోవునపుడు అతని వెంట 350 మంది రాజదారలును చూడబోయినట్లు కలదు.

"అర్ధ సప్త శతాస్తాశ్చ స్త్రియో రాజ పరిగ్రహాః।
భరతం పురతఃకృత్వా యయుర్ద్రష్టుం మృతం నృపం॥"1

ఇన్ని స్థలములందు దశరథ పత్నుల సంఖ్య 350 అని కనిపించుచుండగా "ఇది అవాల్మీక కల్పనము" అనుట సరిగా గ్రంథమును పరిశీలించక పోవుటయే యగును.

వాల్మీకి మహాముని కథను వరుసగా జరిగినది జరిగినట్లుగా చెప్పడు. ఎప్పుడేది ఎంత వరకవసరమో, అచ్చట దానినంత వరకే చెప్పగలడు. ఇది యతని ప్రత్యేకమైన శైలి. "అయోధ్యకు దశరథుడు రాజు"ని చెప్పి వెంటనే అతనికి భార్యలు ముగ్గురని చెప్పరేదు. ఈ ముగ్గురు భార్యల ప్రస్తావముఅతని పుత్ర కామేష్టి సందర్భమున వచ్చినది. భాగ ప్రతిగ్రహార్థమై వచ్చిన దేవతలు తమ మధ్యవిరాజిల్లిన విష్ణువు ననేక విధముల స్తుతించి "దశరథుని ముగ్గురు భార్యలందు నలుగురు కుమారులుగాజనించి లోక కంటకుడైన రావణుని సంహరింపు"2 మని ప్రార్థించిరి. ఇచట దశరథుని ముగ్గురు భార్యల ప్రస్తావము వచ్చినది. ఈ సందర్భమున వాల్మీకి చెప్పదలచిన విషయము "దశరథుని ముగ్గురు భార్యలందు విష్ణువు నలుగురు కుమారులుగా జనించవలయు"ననుటయే కాని దశరథ భార్యా సంఖ్యా కథనము కాదు, ఆ సంఖ్యను అయోధ్యా కాండలో విదితము చేసినాడు. దశరథుని భార్యల నధిక సంఖ్యలో పేర్కొనుట వాల్మీకి సమ్మతమే. "రాజానో బహువల్లభాః" అను సామెతయు గలదు గదా॥

భాస్కర రామాయణము నందును ఈ సంఖ్య అనువదింపబడినది. "దశరథ భార్యల సప్త శతార్ధ సంఖ్యలందొక్కని"3 యని.

6. దశరథుని మంత్రులు.

దశరథునికి ఎనమండుగురు మంత్రులు గలరు.

"అనఘాత్మకుడు ధృష్టియనువాడు విజయు-డనువాడు, సిద్ధార్థుడనువాడు మఱియు
నర్థసాధకుడు, జయంతుడు, నీతి_తీర్థు డశోకుండు, ధీమంతుడైన
మంత్రపాలకుడు, సుమంత్రుడు ననగ - మంత్రులు గల రెనమండ్రు నాతనికి."4

ఇది దాక్షిణాత్య ప్రతిని సరిగాఁ బోలియున్నది.5 కాని ప. ఉ. ప్రతిలో "ధృష్టికి బదులు వ్యాప్తి

---

1. ప. ఉ. ప్రతి వాల్మీకి రామాయణము అయోధ్యా. సర్గ 85 శ్లో. 6
2. దా. ప్రతి వాల్మీకి రామాయణము అయోధ్యా. సర్గ 15 శ్లో. 18_20 1/2
3. భాస్కర రామాయణము అయోధ్యాకాండ_ వచనము 179.
4. రంగనాథ రామాయణము బాలకాండ. ద్వి. 253_255.
5. దా. ప్రతి వాల్మీకి రామాయణము బాలకాండ. సర్గ 7 శ్లో. 3.
"ధృష్టిర్జయంతో విజయస్సిద్ధార్థోహ్యర్థ సాధకః
అశోకో మంత్ర పాలశ్చ సుమంత్రశ్చాష్టమోఽభవత్॥"

యనియు, మంత్రపాలునికి బదులు ధర్మపాలుడనియు"1 నామ భిన్నత్వము కలదు. అదే ప్రతిలో పాఠాంతర శ్లోకమున "అర్థ సాధకునికి బదులు రాష్ట్రి వర్ధనుడనియు, అశోకునికి బదులు అకోపు డనియు సిద్ధార్థునికి బదులు సురాష్ట్రి డనియు"2 చెప్పబడినది.

వ్యుత్పత్త్యౌచిత్యమును బట్టి "ధృష్టి = దిట్టతనము గలవాడు, మంత్రపాలుడు = మంత్రమును (రహస్యమును-ఆలోచనను) రక్షించువాడు" అను నామములే వృష్టి ధర్మపాలురకంటే సమంజస ములు. రాజనీతి ననుసరించి3 రాజు ధర్మపాలుడై యుండవలె, మంత్రులు మంత్రిపాలురై యుండ వలెను. కావున దాక్షిణాత్య పాఠమే సముచితమైనది. బుద్ధభూపతి ఈ పాఠమునే అనువదించినాడు భాస్కర రామాయణ కర్త మాత్రము అర్థ సాధకునికి బదులు రాష్ట్రి సాధకుడని"4 చెప్పుట చేత, ఉత్తర దేశ పాఠమును గ్రహించినాడని చెప్పవచ్చును.

7. యాగదక్షిణ:—

దశరథుడు హయమేధమును యథావిధిగా నిర్వహించి బ్రహ్మాదులకు నలుగురికి దక్షిణగా తిన సామ్రాజ్యములోని నాలుగు దిశలను ఒసంగినట్లుగా దా. ప్రతిలో నిట్లున్నది. "హోతకు ప్రాగ్దిశను, అధ్వర్యునకు పశ్చిమ దిశను, బ్రహ్మకు దక్షిణ దిశను, ఉద్గాతకు ఉత్తర దిశను యజ్ఞ దక్షిణగా సమస్త భూమిని ఇక్ష్వాకులకు రాజొసంగెను."5

కాని రంగనాథ రామాయణమునందు-

అధ్వర దక్షిణకై పూర్వదేశ-మధ్వర్యునకును, బ్రహ్మకు దక్షిణంబు
పొనరంగఁ బశ్చిమ భూమి హోతకును-దనర నుత్తర ముద్గాతకు నిచ్చె
నిల నయోధ్యయుఁ దక్క నెల్లదేశముల-౯ లరి యిచ్చిన ముదమంది ఋత్విజులు"6

అని పై దాక్షిణాత్య వాల్మీకి రామాయణ పాఠమునకు వ్యత్యాసముగా నున్నది. ఇక ప. ఉ. ప్రతిలో—

"ప్రాచీ మధ్వర్యవే రాజా దిశం స్వీతాం దదౌ తదా।
దక్షిణాం బ్రహ్మణే హోత్రే ప్రతీచీ మదదా ద్దిశం॥

---

1. ప. ఉ. ప్రతి. వాల్మీకి రామాయణము బాలకాండ. సర్గ 7 శ్లో. 3.
"వృష్టిర్జయంతో విజయ స్సిద్ధార్థోత్యర్థ సాధకః।
అశోకో ధర్మపాలశ్చ సుమంత్రశ్చాష్టమో మహాన్॥"
2. ప. ఉ. ప్రతి. రామా. అధస్సూచిక పాఠాంతరము బాల. సర్గ 7 శ్లో. 3.
3. "యథా రాజా తథా ప్రజా" (అభాణక శ్లోక పాదము)
4. భాస్కర రామాయణము బాలకాండ. వచనము 51.
"విజయుండును ఘృష్టియు, మంత్రపాలుండును, సిద్ధార్థుండును, రాష్ట్రి సాధకుండు, నశోకుండును, జయంతుడును, సుమంత్రుండును."
5. దా. ప్రతి. రామా. బాలకాండ. సర్గ 14 శ్లో. 41, 42, 43.
6. రంగనాథ రామాయణము బాలకాండ, ద్వి. 440-442.

ఉద్గాత్రే చ తథోదీచీం దక్షిణైషా వినిర్మితా।"[1]

అని కలదు. ఈ పాఠమునే బుద్ధభూపతి యనుసరించినాడని తెలియుచున్నది.

"ఏ దిశ నెవరి కిచ్చిన నేమాయె? ఇది యొక పెద్ద భేదమా?" యని కొందఱనుకొన వచ్చును. కాని దేనికైనను క్రమము పాటింపబడవలెను. దిశలను జంటలుగా చెప్పునప్పుడు ప్రాక్పశ్చిమములు (తూర్పుపడమరలు). దక్షిణోత్తరములు అని వాడుదురు. ప్రదక్షిణము ప్రాగ్దక్షిణ పశ్చిమోత్తర క్రమముననే జరుగును. అధ్వర్యువు మొదలగు ఋత్విక్కుల నాహ్వానించి యర్చించి, తద్దిశాభిముఖుడై తద్దిశలను వారివారికి క్రమముగా దక్షిణగా నొసంగినా డనుట సమంజసము. కాని తూరుపు నొసగి పిదప పడమటి దిశ నిచ్చినాడనుట, అట్లే దక్షిణ దిశ నొసగి, పిదప ఉత్తర దిశ నిచ్చినాడనుట హనుమంతుడు గంతులు వేసినట్లుండును. ఇది యాలోచించియే కవి ప.ఉ. ప్రతి పాఠము ననుసరించినాడు.

భాస్కర రామాయణమున మాత్రము దా. ప్రతిని బోలి యీ దిశాదక్షిణ విషయము చెప్పబడి యున్నది[2] ఈ పాఠ భేదానుసరణము ఇరువురిలోని విద్యా స్పర్థకు గుర్తు.

8. పాయస విభాగము :—

దశరథ మహారాజు ప్రాజాపత్య పురుషు డొసంగిన సంతానప్రద పాయసమును తన ముగ్గురు భార్యలకు పంచిపెట్టెను. ఆ పంపకము వివిధ రామాయణములలో వివిధములుగా గానవచ్చుచున్నది.

దాక్షిణాత్య ప్రతి వాల్మీకి రామాయణములో—

"కౌసల్యాయై నరపతిః పాయసార్ధం దదౌ తదా।
అర్ధాదర్ధం దదౌచాపి సుమిత్రాయై నరాధిపః॥
కైకేయ్యై చా వశిష్టార్ధం దదౌ పుత్రార్థ కారణాత్।
ప్రదదౌ చావశిష్టార్ధం పాయసస్యామృతోపమం॥
అనుచింత్య సుమిత్రాయై పునరేవ మహీపతిః"[3]

అని చెప్పినదాని ననుసరించి "కౌసల్యకు సగము, సుమిత్రకు ఒక పాతిక మరియొక అష్టామాంశము కైకేయికి కేవలము అష్టమాంశము మాత్రమే లభ్యమైనట్లు తెలియుచున్నది.

దీనికి వ్యత్యాసముగా పశ్చిమోత్తర శాఖీయ వాల్మీకి రామాయణ ప్రతిలో "కౌసల్యకు సగము, కైకేయికి పాతిక, సుమిత్రకు పాతిక భాగమును రెండుగా విభజించి రెండు సారులుగా నిచ్చినట్లు[4] చెప్పబడియున్నది.

---

1. ప. ఉ. ప్రతి వాల్మీకి రామాయణము బాలకాండ. సర్గ 10, శ్లో. 33, 34.
2. భాస్కర రామాయణము. బాలకాండ. పద్య. 1261.
   "చనహోతకుఁ బ్రాగ్దేశం బునుబ్రహ్మకు దక్షిణంపుఁ బుడమియు నధ్వ
   ర్యునకుం బశ్చిమ దేశం బును నుద్గాతకునుదీచ్య భూమియు నిచ్చెన్
   ఇట దిశాక్రమము పాటింపఁబడినది. కాని విషయము దాక్షిణాత్య పాఠాను సరణమే
3. దా. ప్రతి రామాయణము బాలకాండ. సర్గ 16 శ్లో. 28, 28 1/2.
4. ప.ఉ. ప్రతి రామాయణము బాలకాండ. సర్గ 11 శ్లో. 26-29.

క్షేమేంద్రుని రామాయణ మంజరిలోను ప. ఉ. ప్రతిలో చెప్పబడినట్లే యున్నది.[1] ఈ రామాయణ ద్వివిధపాఠములకు విరుద్ధముగా పద్మపురాణమందు "రాజు పాయసమును జ్యేష్ఠకనిష్ఠభార్యలకు చెరిసగము చేసి యిచ్చెను. ఇంతలో సుమిత్ర యటకురాగా, కౌసల్యా, కైకేయిలు తమభాగములో సగము సగము సుమిత్రకు నిచ్చిరి"[2]ని చెప్పబడినది. దీనివలన పాయసము నాల్గు సమ భాగములుగా విభజింపబడినట్లు లగుచున్నది ఈపద్మపురాణములో చెప్పబడినట్లె అధ్యాత్మరామాయణము[3], భోజుని చంపూరామాయణము[4] నారసింహ పురాణము[5], కాళిదాసుని రఘువంశము[6], లందును గలదు.

ఆనందరామాయణమునం దీపాయస విభాగము ఇంకను విచిత్రముగా నున్నది.

రాజు ముగ్గురు భార్యలకు పాయసమును పంచి యిచ్చెను. అప్పుడొక గ్రద్ద కైకెయి చేతినుండి పాయసము నపహరించు కొని పోయి అంజనగిరిపై పడవేసెను. పిదప కౌసల్యా సుమిత్రలు కైకేయికి తమ తమ భాగమునుండి కొలదిగా పాయసము నొసంగిరి."[7]

ఇట్లు వాల్మీకి రామాయణ ప్రతులలోను, పురాణములలోను, వివిధ రామాయణములలోను భిన్న భిన్నముగా పాయస విభాగము చెప్పబడినది. దీనికి కారణమేమి ?

"సోఽంతఃపురం ప్రవిశ్యైవ కౌసల్యా మిద మబ్రవీత్।
గృహాణార్ధ మితోదేవి పుత్రీయం హిత మాత్మనః
అర్ధాదర్ధం దదౌ చాపి కైకేయ్యాః స నరాధిపః।
చతుర్భాగం ద్విధాకృత్వా సుమిత్రాయై దదౌ తథా॥
ప్రదదౌ చా విశిష్టం చ పాయసం దేవ నిర్మితం।
అనుచింత్య సుమిత్రాయై పునరేవ నరాధిపః॥"

1. క్షేమేంద్రుని రామాయణ మంజరి. బాలకాండ శ్లో. 74.
"తతోఽర్ధం ప్రాప కౌసల్యా చతుర్భాగంచ కైకయీ।
చతుర్భాగం సుమిత్రాచ స్వయం తేన ద్విధా కృతం॥"
2. పద్మ పురాణము. ఉత్తర ఖండము. అధ్యా-242. శ్లో. 59-61.
3. అధ్యాత్మ రామాయణము, బాలకాండ. సర్గ. 3 శ్లో. 10,11,12.
కౌసల్యాయై సకైకేయ్యై అర్ధమర్ధం ప్రయత్నతః।
తతః సుమిత్రా సంప్రాప్తా జగృధ్నుః ప్రౌత్రికంచరుం॥
కౌసల్యాతు స్వభాగార్ధం దదౌ తస్యై ముదాన్వితా।
కైకేయీచ స్వభాగార్ధందదౌ ప్రీతినమన్వితా॥"
4. భోజుని చంపూ రామాయణము, బాలకాండ శ్లో. 50
5. నారసింహ పురాణము, అధ్యాయము 47. శ్లో. 36,38.
6. కాళిదాసు రఘువంశము, సర్గ 10. శ్లో. 54,55,56.
7. ఆనందరామాయణము సారకాండము. సర్గ. శ్లో. (103-108)

(1) "విష్ణో పుత్రత్వ మాగచ్ఛ కృత్వాత్మానం చతుర్విధం॥
అని దేవతలు విష్ణువును ప్రార్థించిరి.

తతః పద్మ పలాశాక్షః కృత్వాత్మానం చతుర్విధం।
పితరం రోచయామాస తదా దశరథం నృపం॥"[2]

అని విష్ణువు కూడ కాంక్షించెను. వీనిలోని కృత్వాత్మానం చతుర్విధం" అనుదానిని గ్రహించి విష్ణువే నాలుగు సమానాంశముల తోడనే అవతరించె"నని తలంచి కొన్ని గ్రంథములందు పాయస సమానాంశ విభాగ కల్పన చేయబడినది. కాని కథను పరిశీలించినపుడు రామలక్ష్మణుల, భరత శత్రుఘ్నుల వీర్యమునందును. ప్రాధాన్యమునందును వ్యత్యాసము కనబడును. కావున రామచంద్ర మూర్తికంటే లక్ష్మణుడు తక్కువవాడుగా నుండవలెను. రామలక్ష్మణులు కబంధునిచే పట్టుబడినపుడు, ఇంద్రజిన్నాగ పాశములచే బద్ధులైనప్పుడు, ఇట్లే ఇతర ఘటనలందును వారి వీర్య, ధైర్య పరాక్రమ తారతమ్యము గోచరించుచున్నది. కావున నలుగురు సమానాంశములచే జనించినారనుట సమంజసము కాదు.

(2) లక్ష్మణునికంటే భరతునికి జ్యేష్ఠత్వమును. అవడలుగా జనించిన లక్ష్మణశత్రుఘ్నులకు సమానత్వమును ప్రతిపాదింపదలచి పాయసములో కౌసల్యకు సగము, కైకేయికి నాల్గవ భాగము సుమిత్రకు నాల్గవ భాగమును రెండుగా విభజించి రెండు సారులును ఈయబడినట్టి కల్పనము కొన్ని గ్రంథములందు చేయబడి యున్నది[3]

(3) రామ సౌమిత్రులు, భరత శత్రుఘ్నులు జంటలు జంటలుగా నుండుటకు గల కారణమును చెప్పదలచి "రాజుచే తమకు సమానముగా నీయబడిన పాయస భాగములోనుండి సగము సగము పాయసమును దీసి సుమిత్రకు కౌసల్యా కైకేయి లొసంగి రనెడి కల్పనము కొన్నింట కావింపబడినది.[4]

(4) భరత శత్రుఘ్నులకంటే రామలక్ష్మణులకే రామాయణమునం దెక్కువ ప్రాధాన్యము కలదు. లక్ష్మణుని కన్న రాముని కధి ప్రాధాన్యము గోచరించును. దశరథుని నలుగురు కుమారులు "రామ లక్ష్మణ భరత శత్రుఘ్న లనెడి వరుసలో చెప్పబడుచున్నారు. ప్రాముఖ్యము ననుసరించి యీ వరుస యేర్పడినది కాని, జన్మ క్రమమును బట్టి కాదు. కావున ఈ దృష్టితో రామలక్ష్మణ భరత శత్రుఘ్నులు అర్ధ, చతుర్థ అష్టమా ష్టమాంశములతో జనించునట్టి పాయస విభాగ కల్పనము మరి కొన్నింట జేయబడినది.[5]

ఇట్లా యా యుద్దేశములతో నా యా విధములుగా పాయస విభాగ కల్పనము జరిగినట్లూహించ వచ్చును.

బుద్ధభూపతి దా. ప్రతి ననుసరించి పాయస విభాగమును వ్రాసియున్నాడు.

---

1. దా. ప్రతి వాల్మీకి రామాయణము బాలకాండ. సర్గ 15 శ్లో. 19 1/2.
2. దా. ప్రతి ,, ,, సర్గ 15 శ్లో. 30 1/2.
3. పశ్చిమోత్తర శాఖీయ వాల్మీకి రామాయణము బాల. సర్గ 11 శ్లో. 26-29
4. అధ్యాత్మ రామాయణ, పద్మపురాణాది గ్రంథములు.
5. దా. ప్రతి వాల్మీకి రామా. బాలకాండ. సర్గ 16 శ్లో. 27, 28 1/2.

"..................అమర నిర్మితమైన యాపాయసంబు
సగము కౌసల్యకు, సగములోఁ బుచ్చి-సగము సుమిత్ర కా, సగములో సగము
కైకకు నిచ్చి యుత్కంఠ నా సగము-ప్రాకటంబుగ సుమిత్రకు నిచ్చె మఱియు"[1]

భాస్కర రామాయణమునందు నిట్లే యున్నది.

దాక్షిణాత్య విభాగ క్రమమే ధర్మబద్ధమైనది.

(1) "జ్యేష్ఠ భార్య పట్టపుదేవి, కావున కౌసల్యకు పాయసములో సగమిచ్చెను రెండవ భార్య సుమిత్ర కావున మిగిలిన సగములో సగము నిచ్చెను; అనగా నాల్గవ భాగ మొసంగెను. ఇంకను మిగిలినది నాల్గవ భాగము. దీనిని కైక కిచ్చిన సుమిత్రా కైకలను సమముగా చూచినట్లగును. కావున అందు సగము అనగా ఎనిమిదవ భాగము కైక కొసంగెను. ఆ తరువాత ఆలోచించి యా మిగిలిన యెనిమిదవ భాగమును సుమిత్ర కిచ్చినాడు. కైకేయి సంభోగ విషయమునఁ బ్రియురాలు. న్యాయముగా భాగమునందు మాత్రము కాదు. ఇట్టి తారతమ్యము లేనిచో పెద్ద పిన్న గౌరవము పాటింపనట్లగును."[3]

ఇట్లు ధర్మయుక్తముగా విభజించి ఈయబడినది కావుననే అతని రాణులు మాఱు మాటాడకుండ—

"అప్పాయసాన్నంబు లర్థి భుజించి-యప్పుడు గర్భిణులైరి వారెలమి."[4]

(2) డా. జి. వి. సుబ్రహ్మణ్యంగారు ఈ పాయస విభాగ క్రమములో దశరథుని రాజనీతియు నున్నదని యిట్లు తలంచుచున్నారు.

"దశరథుడు కైకేయి కుమారుని రాజుగాఁ జేసెదనని ఆమె వివాహ సందర్భమున వాగ్దానము చేసియున్నాడు. అది న్యాయము కాదని అతని స్మృతిలో మెదలుచునే యుండును. కావున పాయస ప్రదానవేళ "ఏ విధముగానైనను కైక కుమారుడు కౌసల్యా తనయునికంటే బలవంతుడు కాకూడదని దీర్ఘముగా నాలోచించినాడు. కౌసల్యకు సగమును, సుమిత్రకు నాల్గవ భాగము నొసంగినాడు. ఇక మిగిలిన నాల్గవ భాగమును కైకకిచ్చిన, ఆమె కొడుకుతో సుమిత్రా పుత్రుడేకమైన, వారిరువురు కౌసల్యా నందనునితో సమాను లగుదురు. ఇది ప్రమాదమునకు దారితీయును. అందుచే నాల్గవ, భాగమును రెండుగా విభజించి, ఒక భాగము కైకకు, అవశిష్ట భాగమును మరల సుమిత్ర కిచ్చెను ఇప్పుడు సుమిత్ర కిరువురు పుత్రులగుదురు. రాజ్యాధికార సమస్య వచ్చినపుడు ఈ యిరువురు భరతునికి తోడ్పడరు. ఇందులో నొకడు రామునకు సహకరించిన కౌసల్యా పుత్రుని బలమే హెచ్చగును. రాజ్యము జ్యేష్ఠ కుమారునికి దక్కున, సుమిత్రా తనయు లిరువురు, కైకేయీ పుత్రు

---

1. రంగనాథ రామాయణము బాలకాండ. ద్వి. 512-514.
2. భాస్కర రామాయణము బాలకాండ. పద్య 157.
3. వావిలకొలను సుబ్బారావు శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణము మంధరము బాలకాండ. పుట. 539.
4. రంగనాథ రామాయణము బాలకాండ. ద్వి. 515.

డొకడు ఒక్కడైనప్పుడు గదా సమస్య బయలుదేరును. అప్పటికిని బలములు సమానముగా నుండును; అయినను అది అసంభవము. అట్లయినచో, మంత్రులు, పురోహితులు, ప్రజలు రామునికి తప్పక తోడ్పడుదురు. ఎటుచూచి, ఎటు వచ్చినను రామునికి రాజ్యము దక్కవలెను." అని దశరథుని రాజకీయపు ఎత్తుగడయు పాయస విభాగమున పనిచేసి యుండవచ్చును.

ఈ యాలోచనయు చాల యొప్పిదమై ఆధునిక రాజకీయవేత్తలను తలలూపించునదై యున్నది.

ఇట్లు (1) వీర్య తారతమ్యము, (2) కథా ప్రాధాన్యము, (3) రాణులలోని పెద్ద పిన్న క్రమము, (4) దశరథుని రాజకీయపు టాలోచన అనెడి అనేక హేతువుల చేత, దాక్షిణాత్య పాఠమే సమంజసమైనదిగా భావించి, బుద్ధభూపతి యట్లే యనువదించినాడు. ఇదియే ఔచిత్య వంతమైనది.

9. శ్రీరామాదుల జన్మ తిథులు :—

కౌసల్యాదేవి శ్రీరామ చంద్రుని

"వర్ణిత మధుమాస వరశుక్లపక్ష-పూర్ణయౌ నవమిని బుధవారమున
మహిఁబునర్వసుతార మధ్యాహ్న వేళ-గ్రహపంచకము నుదగ్రస్థితిఁదనరఁ
దొలగక గురుడు చంద్రుడు గూడియుండ-లలిత కర్కాటక లగ్నంబునందు"[1]ను

కైకేయి భరతుని

"భూలోక విదితమై పుష్యనక్షత్ర-లాలితంబగు మీన లగ్నంబునందు"[2]ను

సుమిత్రాదేవి లక్ష్మణ శత్రుఘ్నులను

"ప్రణుతింపఁదగునట్టి ఫణితారకమున-గణిత కర్కాటక లగ్నంబున"[3]ను

కనిరి. రంగనాథరామాయణమునందు ఉల్లేఖింపఁబడిన శ్రీ రామాదుల జన్మతిథ్యాదులలో నొకవారము దప్ప మిగిలిన వన్నియు దా. ప్రతి వాల్మీకి రామాయణములో[4] చెప్పబడినవి. కాని ప.ఉ. ప్రతిలో నివి మూల పాఠమునందులేక అధన్యూచిక యందధిక పాఠముగా నీయబడినను, నందు భరత లక్ష్మణ శత్రుఘ్నుల జన్మతిథ్యాదులు లేనే లేవు. కావున కొందఱు వీనిని క్రీ.శ. 6వ శతాబ్దము తర్వాత చేర్చబడిన ప్రక్షిప్తములని తలంచుచున్నారు.[5] అయినను బుద్ధారెడ్డి కాలము వరకె రామాయణమునందివి చేర్చబడి యున్నవని చెప్పవచ్చును.

వైష్ణవ సంప్రదాయమున తిరునక్షత్రము లాచరించు పద్ధతి కలదు. తిరునక్షత్రము లాచరించుట అనగా జయంతి (జన్మదిన మహోత్సవమును) జరుపుకొనుట. ఈసంప్రదాయమున తిథికి బదులు

---

1. రంగనాథరామాయణము. బాలకాండము. ద్వి. 550-552.
2. ,, ,, ,, ద్వి. 559.
3. ,, ,, ,, ద్వి. 561.
4. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. బాలకాండము. సర్గ. 18. శ్లో. 8 1/2, 9 1/2 14 1/2
5. Quarterly Journal Mithie Society. Part 12 Page. 73.

నక్షత్రమునకుఁ బ్రాధాన్యమీయబడినది. శ్రీరామచంద్రుని "చక్రవర్తి తిరుమకనార్" అని అందురు అతని తిరునక్షత్రమునందు "ఈ శ్లోకములు"[1] ఇప్పటికి వైష్ణవులచేత అనుసంధింపబడు చున్నవి. ప్రక్షిప్తములని భావింపబడుచున్నను, వైష్ణవాభిమాని యైన బుద్ధారెడ్డి వీనిని గ్రహించి చెప్పుట సముచితము. వ్యాఖ్యాకారులెందరో ఈ తిథ్యాదులందు జనించిన వారి జాతక ప్రభావమును గూర్చి జ్యోతి శ్శాస్త్ర రీత్యా ఎంతో చర్చను గావించి యున్నారు.[2]

మూలమునందు "బుధవార" ప్రస్తావము లేదు. మొల్ల కవయిత్రి "కౌసల్యాది కాంతా త్రయమ్మును జైత్ర మాసంబున, శుక్ల పక్షమున, నవమి, భాను వాసరమ్మునఁ బునర్వసు నక్షత్రమునఁ, గర్కాటక లగ్నంబున శ్రీరామ భరత లక్ష్మణ శత్రుఘ్నులం గాంచిన" అని నలుగురి జన్మమేక కాలమున జరిగినట్లు వ్రాసినది. ఇది అవిచార మూలము. ఇందు "భానువాసర"మని పేర్కొనబడుట గమనార్హము. శ్రీరామునిది సూర్య వంశము గావున 'భానువాసర'మని మొల్ల కవయిత్రి పేర్కొని యుండవచ్చును.[3]

రంగనాథ రామాయణమునందు వలెనే భాస్కరరామాయణమునందును,[4] యథా వాల్మీకమని చెప్పబడుచున్న కట్టా వరదరాజు రామాయణమువందును[5] "బుధవారమనియే" నుట్టంకింపబడినది. మూలరామాయణమునందు చెప్పబడని వార నిర్దేశమునకు ఆకరము జ్యోతిశ్శాస్త్రమని పరిశీలన వలనఁ దెలియుచున్నది.

హోరానుభవ దర్పణమునందు "స్వస్తిశ్రీ వైవస్వత మన్వంతరాంతః ప్రాప్త చతుర్వింశే మహాయుగే త్రింశతి సహస్ర వర్షా వశిష్టాయాం తస్మిన్ వర్తమాన వ్యావహారిక బార్హస్పత్యమానేన విళంబి నామ సంవత్సరే వసంతర్తౌ మేష సంక్రమణే చైత్ర శుక్ల నవమ్యాం "బుధవాసరే"

---

1. దా. ప్రతి వాల్మీకి రామా. బాలకాండ. సర్గ 18 శ్లో. 9, 10 1/2, 14 1/2.

   "తతశ్చ ద్వాదశే మాసే చైత్రే నావమికే తిథౌ।
   నక్షత్రేఽదితి దైవత్యే స్వోచ్చసంస్థేషు పంచసు॥
   గ్రహేషు కర్కటే లగ్నే వాక్పతావిందునాసహ।
   ప్రోద్యమానే జగన్నాథం సర్వలోక నమస్కృతం॥
   కౌసల్యా జనయద్రామం సర్వ లక్షణ సంయుతం।
   ....
   పుష్యే జాతస్తు భరతో మీనలగ్నే ప్రసన్నధీః
   సార్పేజాతౌతు సౌమిత్రీ కుళీరేఽభ్యుదితేరవౌ॥"

2. గోవింద రాజీయ వ్యాఖ్యానము బాలకాండ. సర్గ 18
   శ్లో. 8 1/2, 9 1/2, 10 1/2.

3. మొల్ల రామాయణము బాలకాండము వచనము 45.

4. భాస్కర రామాయణము బాల. పద్య 167.

5. కట్టా వరదరాజు రామాయణము బాల ద్విపదపాదము 1692, పుట 70

పునర్వసూ నక్షత్రే శూలనామయోగే కౌలవాకరణే మధ్యాహ్న సమయే కర్కాటక లగ్నే పంచగ్రహే షూచ్చం గతేషు శ్రీరామమూర్తే రవతారః"[1] అని కలదు.

ఇందు బుధవారమని స్పష్టముగా నిర్దేశింపబడినది దీనిచేత తెలుగు రామాయణముల రచనా కాలమునాటికే కొన్ని జ్యోతిష గ్రంథములందు రామావతార కాల జాతక విశేషాదులు చర్చింపబడి నట్లు తెలియుచున్నది రామాయణమునందు శ్రీరాముని జన్మమునకు మాస, తిథి నక్షత్ర లగ్నములు చెప్పబడి వారము లేకపోవుట లోపముగా భావించి. జ్యోతిషశాస్త్ర గ్రంథాధారమున "బుధవార"మని బుద్ధనృపతి పూరించగా తదితరు లనుసరించినారు. లేక "బుధ" శబ్దమునకు దేవతార్థమును[2] గలదు. శ్రీరాముడు పరదైవమని యూహించి బుధవారమనియు చెప్పి యుండవచ్చును.

10. దశరథుని వయస్సు :—

విశ్వామిత్రుడు "యజ్ఞ సంరక్షణార్థము శ్రీరాముని బంపుమని" యడుగగా, దశరథుడు-

"షష్టిర్వర్ష సహస్రాణి జాతస్య మమ కౌశిక॥

దుఃఖేనోత్పాదితశ్చాయం న రామం నేతుమర్హసి॥"[3]

అని పలికినాడు. దీనిచే దశరథు డరువది వేలేండ్లు జీవించినట్లు తెలుపబడినది. ఇందుకు విరుద్ధముగా ప. ఉ. ప్రతి రామాయణములో—

"నవ వర్ష సాహస్రాణి మమ జాతస్య కౌశిక,

దుఃఖేనోత్పాదితాశ్చేమే న రామం నేతు మర్హసి॥"[4]

యని "తొమ్మిది వేల సంవత్సరములు"గా తెలుపబడినది. వీని తేడా 51 సంవత్సరములు. అధ్యాత్మ రామాయణ కర్త ఈ సంఖ్య జోలికి పోకుండ,

"బహువర్ష సహస్రాంతే కష్టే నోత్పాదితాః సుతాః॥"[5]

అని తప్పించుకొన్నాడు. కాని పురాణములలో[6] దశరథుని జీవితకాలము 60 వేల యేండ్లని చెప్పబడి యున్నది. కావున సర్వపురాణ విచార తత్పరుడైన బుద్ధనృపతి, దా, ప్రతి పాఠమునే గ్రహించి,

"అఱువది వేలేడు లవనిఁ బాలించి-తఱిదప్పి పుట్టిరి యీతనిఁ గంటి నేను."[7]

అని వ్రాయగా భాస్కరాదులు నిట్లే అనుసరించినారు.[8]

---

1. ములుకుట్ల నరసింహావధానులు శ్రీరామాయణ సారోద్ధారము బాల. ద్వితీయ భాగము. పుట 510 లో ఉద్ధృతము.
2. శబ్దార్థ చంద్రిక పుట 964,
3. దా. ప్రతి వాల్మీకి రామాయణము బాల. సర్గ 20 శ్లో. 10 1/2.
4. ప. ఉ ప్రతి ,, ,, సర్గ 18 శ్లో. 8.
5. అధ్యాత్మ రామాయణము బాల. సర్గ 4 శ్లో. 9.
6. భవిష్య పురాణము
7. రంగనాథ రామాయణము బాలకాండ. ద్వి. 686.
8. భాస్కర రామాయణము బాలకాండ. పద్య 195.

11. ఊన షోడశ వయసు :—

విశ్వామిత్రుడు శ్రీరాముని యజ్ఞమును గాపాడగా పంపుమని దశరథుని కోరినపుడు, రాజు నిరాకరించుచు చూపిన హేతువులలో శ్రీరాముని ఊనషోడశ వయస్సొకటి.

"ఊన షోడశ వర్షోమే రామో రాజీవ లోచనః।

నయుద్ధ యోగ్యతా మస్య పశ్యామి సహరాక్షసైః"1.

ఊనషోడశ వర్షుడు = పదునారేండ్లకు తక్కువవాడు. అనగా సుమారు 15 సంవత్సరముల వయస్సు వాడని తెలును. కాని వ్యాఖ్యాతలు కొందఱు ఆయాఘట్టము లందలి శ్లోకములను గ్రహించి "ఊనషోడశ వర్షుడు = పన్నెండేండ్ల వయస్సు గలవాడని నిర్ణయించిరి. ఆ నిర్ణయ మిట్లున్నది—

వివాహానంతరము సీతారాముల అయోధ్యావాసము పండ్రెండు వత్సరములు. వన ప్రవేశ కాలమున శ్రీరాముని వయస్సు ఇరువది యైదేండ్లు.

ఇది సీతాదేవి భిక్షురూపుడైన రావణునితో—

"ఉషిత్వా ద్వాదశ సమా రాఘవస్య నివేశనే।

భుంజానా మానుషాన్ భోగాం త్సర్వకామ సమృద్ధినీ॥"3

....

మమ భర్తా మహాతేజా వయసా పంచవింశకః"4

అని చెప్పిన మాటల వలన విదిత మగుచున్నది.

విశ్వామిత్రుని యజ్ఞ విఘ్నము సేయు మారీచుని పారద్రోలినపుడు శ్రీరాముని వయస్సు పండ్రెండేండ్లు. మారీచుడు రావణునితో—

"బాలోద్వాదశ వర్షోయ మకృతాస్త్రశ్చ రాఘవః" అని స్వయముగా చెప్పియుండెను.

ఇప్పుడు సీతాదేవి రావణునితో చెప్పిన వన ప్రవేశ కాల శ్రీరాముని వయస్సు 25 సంవత్సరముల నుండి అయోధ్యావాస కాలము 12 సంవత్సరములు తీసివేసిన 13 సంవత్సరము లగును. ఇది "గర్భస్థితి నుండి" యని గ్రహించినచో మారీచుడు చెప్పిన శ్రీరాముని ద్వాదశ వర్ష వయస్కత యేర్పడును. కావున ఊనషోడశత్వమనగా ద్వాదశవర్ష మనుట యని తలంపవలెను.

ఇక కౌసల్యాదేవి శ్రీరామునితో—

*దశ సప్త చ వర్షాణి జాతస్య తవ పుత్రక।

ఆసితాని ప్రకాంక్షంత్యా మయా దుఃఖ పరిక్షయం"6

అని పల్కిన మాటలకు ద్విజన్మత్వ ప్రాప్తి ప్రభృతి యనియు, 8వ యేట ఉపనయన మయినచో

---

1. దా. ప్రతి వాల్మీకి రామాయణము బాలకాండ. సర్గ 20 శ్లో. 2.
2. గోవింద రాజీయము. బాలకాండ. సర్గ 20 శ్లో. 3 వ్యాఖ్య.
3. దా ప్రతి రామాయణము అరణ్యకాండ. సర్గ 47 శ్లో. 4.
4. ,, ,, సర్గ 47 శ్లో. 10 1/2
5. ,, ,, సర్గ 38 శ్లో. 6.
6. ద. ప్రతి. వాల్మీకి రామాయణము అయోధ్యా. సర్గ, 20 శ్లో. 45.

వనమునకు పోవునప్పటికి (17 + 8 = 25) ఇరువది యైదేండ్లగునని సమన్వయించి సమాధానించిరి.

కాని బుద్ధారెడ్డి "ఊనషోడశ వర్ష" సమాస పదమునకు—

"పదియు నైదేండ్ల ప్రాయంబువాడ"[1]ని యనువదించినాడు. మరియు అరణ్యవాసానుమతిని కోరి వచ్చిన శ్రీరామునితో—

"ఎలమిమై యిరువదియేను వత్సరము-లలరి పెంచితి నిన్ను నఖిలంబు నెఱుగ"[2] నని కౌసల్యాదేవిచే ననిపించినాడు.

ఇచట "ఎలమిమై యిరువదియేడు వత్సరములు" అని యుండుట లెస్స. పదునైదేండ్లకు అయోధ్యావాస కాలమైన పండ్రెండు వత్సరములు కలిపిన ఇరువది యేడగును. "ఇరువది యేన"ని వ్రాయుట లేఖకుల పొరపాటు.

ఈ రెండు స్థలములందుఁ దప్ప రంగనాథ రామాయణమునందు మరెచ్చటను శ్రీరాముని వయశ్చర్చ రాలేదు. తల్లిదండ్రులు, భార్య చెప్పిన వయోనిర్ణయము గణనీయము, కాని యెవరో చెప్పినది గ్రాహ్యము కాదు. కావున మారీచుడు చెప్పినది యనువదింపబడలేదు. అతడంచనాతో (సుమారుగా) చెప్పినట్లు తలంచవలెను. దాక్షిణాత్య వాల్మీకి రామాయణ పాఠమందలి దానికి, రంగనాథ రామాయణములో చెప్పబడినదానికి వ్యత్యాస మున్నది. ఈ వ్యత్యాసమునకు బుద్ధభూపతి కల్పనము కారణము కాదు ఇతడు పశ్చిమోత్తర శాఖీయ ప్రతిని అనుసరించినాడు; చూడుడు.

"దశ సప్తచ వర్షాణి జాతస్య తవ పుత్రక।"[3] అనుదానికి.

"అద్య జాతస్య వర్షాణి దశ చాష్టౌ చ తేఽనఘ।"[4] అనియు,

"మమ భర్తా మహాతేజా వయసా పంచవింశకః।"[5] అనుదానికి,

"మమభర్తా మహాతేజా వయసా సప్తవింశకః।"[6] అనియు పశ్చిమోత్తర శాఖీయ ప్రతిలో పాఠాంతరములు కనిపించుచున్నవి. కౌసల్యా వాక్యమునకు ఉపనయన ప్రభృతి యని గ్రాహ్యము.

"గర్భాష్టమేఽబ్దేకుర్వీత బ్రాహ్మణస్యోపనాయనం।
గర్భా దేకాదశే రాజ్ఞో గర్భా త్తుద్వాదశే విశః॥"[7]

అని మనుస్మృతి ప్రమాణము పాటించిన, రాజులకు జనన మాది పదియవ యేట వడుగు చేయ

---

1. రంగనాథ రామాయణము బాలకాండ. ద్వి. 630.
2. ,, అయోధ్యా. ద్వి. 470.
3. దా. ప్రతి వాల్మీకి రామాయణము అయోధ్యా. సర్గ 20 శ్లో. 45
4. ప. ఉ. ప్రతి వాల్మీకి రామా. అయోధ్యా. సర్గ 20 శ్లో. 35.
5. దా. ప్రతి వాల్మీకి రామా. అరణ్య సర్గ 47, శ్లో. 10 1/2
6. ప. ఉ. ప్రతి. వాల్మీకి రామా. అరణ్య. సర్గ 52. శ్లో. 9.
7. మనుస్మృతి- అధ్యాయము-2 శ్లో. 36.

వలయును. "కౌసల్య చెప్పిన 17 నకు 10 (పది) సంవత్సరములు కలిపిన 27 అగును "[1] ప.ఉ. ప్రతిలో సీత చెప్పిన "వయసా సప్తవింశకః" అనుదానికి సరిపోవును. అట్లే దశరథుడు చెప్పిన రాముని ఊనషోడశ వర్షత్వ్వమునకు అనగా పదునై దేండ్లకు అయోధ్యావాస కాలమైన పండ్రెండు వత్సరములు గలిపినచో ప ఉ. ప్రతిలోని వయసా సప్తవింశకః" అను పాఠము సరిపోవును. అవుడు ఊనషోడశ వర్షమునకు పదునైదు వత్సరములనియు, చక్కగా అర్థము చెప్పవచ్చును. పండ్రెండా ? పదునైదా ? అని తర్జన భర్జన కవకాశముండదు. కావున బుద్ధారెడ్డి ప. ఉ ప్రతి వాల్మీకి రామాయణములోని "వయసా సప్తవింశకః" అనెడి పాఠమునే ప్రమాణముగా గ్రహించి "పదియు నైదేండ్ల ప్రాయంబువాడు" అని "ఊనషోడశ" వర్షమునకు అనువాదము చేసినాడు. ఇక "ఉపనయన ప్రభృతి" అని వివరించిననే కౌసల్యా వాక్య మర్థమగును. ఈ చిక్కెందులకని మార్చి, సీత చెప్పిన "వయసా సప్తవింశకః" అను పాఠమును గ్రహించి యిచట—

"ఎలమిమై యిరువదియేడు వత్సరము" లని కౌసల్య చేత శ్రీరాముని వయస్సును స్పష్టముగా చెప్పించినాడు. ఇట్లు తల్లిదండ్రులచే వయస్సు చెప్పినమీద, తిరిగి భార్య సీతాదేవి చెప్పిన పునరుక్తమగునని తలంచి, రావణునితో సీత సంభాషించు వేళ ఈ వయః ప్రస్తావమును మానుకొనినాడు.

భాస్కర రామాయణమునందు కూడ "ఊనషోడశ"వచనకు "పదియేనేడులనియు"[2] శ్రీరాముని అరణ్యవాస ప్రారంభము "సప్తవింశతి ప్రాయమున"[3] నయినట్లును చెప్పబడినది. ఈ "సప్తవింశతి" శబ్దము ఇతరులు మార్చరాకుండ ప్రాసస్థానమునందు ప్రయోగింపబడుట విశేషము. "ఇరువది యేను"కు బదులు "ఇరువది యేడ"ని సవరించుట లెస్స యని నేను సూచించిన దానికి ఈ భాస్కర రామాయణ "సప్తవింశతి" ప్రయోగ ముపబలకము.

---

1. ప. ఉ. ప్రతి వాల్మీకి రామాయణ పాఠమును గ్రహించిన, ఉపనయనము 9 వ యేట జరిగినదని చెప్పవలెను. "గర్భాదేకాదశేరాజ్ఞో" యను ప్రమాణము ముఖ్యకాలమైన పదియవ సంవత్సరమును మించరా దనుటయే కాని తొమ్మిదవ యేట చేయరాదని నిషేధము కాదు. "సప్తమే చాష్టమే వర్షే నవమే దశమే తథా। ఏకాదశే ద్వాదశే చ హ్యుపనీయు ర్ద్విజాతయః" అని స్మృతిరత్నమునందున్నది (వావిల కొలను సుబ్బారావు మందరము బాలకాండ. పుట 616 లో ఈ శ్లోకము ఉద్ధరింపబడినది). కావున తొమ్మిదవ యేటను వడుగు చేయుట శాస్త్ర సమ్మతమే। అప్పుడు ప. ఉ. ప్రతి పాఠాంతర శ్లోకములోని "18 సంవత్సరములకు" 9 వర్షములు చేర్చిన 27 అగును.
2. భాస్కర రామాయణము బాలకాండము పద్య. 198 "పదియేనేడుల బాలుని"
3. భాస్కర రామాయణము అయోధ్యా. పద్యము. 213

"..................మేదినీ
గుప్తికై కని యెట్టకేనియు గోడ్డు వీగితి నంచునే
సప్తవింశతి హాయనంబులు సంతసంబున నుండితిన్॥"

ఇట్లే పద్మ పురాణమునందును చెప్పబడినది.

"రామః పంచదశే వర్షే షడ్వర్షా మథ మైథిలీం।
ఉపయేమే వివాహేన రమ్యాం సీతా మయోనిజాం॥

....

తతోద్వాదశ వర్షాణి రేమే రామ స్తయా సహ।
స ప్తవింశతిమే వర్షే యౌవరాజ్య మకల్పయత్॥"[1]

అని 15వ యేట వివాహము, 12 సంవత్సరము లయోధ్యావాసము, 27వ యేట అరణ్యావాసమని స్పష్టముగాఁ దెలియుచున్నది.[2] కావున వ్యాఖ్యాతల, పండితుల నిర్ణయముకంటే పురాణజ్ఞుడు, రామాయణ మర్మజ్ఞుడైన బుద్ధభూపతి అనువాదము సముచితము, సమంజసమును. దీనికి పశ్చిమో త్తర శాఖీయ ప్రతి యాధారము.

12. శ్రీరాముడు మారీచ సుబాహులపై వేసిన అస్త్రములు

మారీచ సుబాహులు విశ్వామిత్రుని యాగ విఘ్నము చేయుచుండ, శ్రీరాముడు మారీచుని పారద్రోలి, సుబాహుని హతమార్చి మహర్షి యాగమును సంరక్షించెను.

ఇచట దా. ప్రతి రామాయణమునందు "శ్రీరాముడు మానవాస్త్రమున మారీచుని నూఱామడ దూరమునందున్న సముద్రమున పాఱవైచి, సుబాహుని ఆగ్నేయాస్త్రమున హతమార్చి, తక్కిన రాక్షసులను వాయవ్యాస్త్రమున నేల పడగొట్టి మునులకు ముదము కూర్చినట్లు"[3] వర్ణింపబడినది.

ప. ఉ. ప్రతియందు "శ్రీరాముడు మారీచునిపై పావనాస్త్రమును సుబాహువుపై ఆగ్నేయా స్త్రమును తక్కిన రాక్షసులపై వాయవ్యాస్త్రమును ప్రయోగించినట్లు"[4] కలదు. ఈ యస్త్ర ప్రయోగ మున రెండు పాఠములు పరస్పరము భేదించుచున్నవి.

---

1. పద్మపురాణము పాతాళ ఖండము అధ్యా. 36 శ్లో. 15 1/2, 17.
2. మల్లాది సూర్యనారాయణశాస్త్రి- సంస్కృత వాఙ్మయ చరిత్రలో- "ఎటు చూచినను బై మాటలు వీరి వయస్సు విషయమునఁ బరస్పర విరుద్ధములే- ఇవి ఋషి వాక్యము లనుటకు మనసొప్పదు. ప్రక్షిప్తము లనుటకు వీలు కనబడదు. కావున వీనిం గూర్చి చర్చింపక విడుచుటయే యుచితము" అని పల్కిరి. కాని వీరు ఉత్తర దేశ ప్రతులను చూడలేదు. చూచినచో ఇట్లు వ్రాయువారు కారు.
సంస్కృత వాఙ్మయ చరిత్ర-లౌకిక వాఙ్మయము సం-2, పుట. 52.
3. దా. ప్రతి వాల్మీకి రామాయణము బాలకాండ. సర్గ 30 శ్లో. 16-21.
4. ప. ఉ. ప్రతి ,, ,, సర్గ 28 శ్లో. 12-19.
పవనాస్త్రం తతోరామః ప్రగృహ్యాస్త్ర విశారదః।
మారీచోరసి చిక్షేప నాతికోప సమన్వితః॥

....

ప్రగృహ్యాస్త్ర మథో దివ్య మాగ్నేయం రఘునందనః।
విద్ధ్వా సుబాహుమురసి పాతయామాస భూతలే॥
అన్యానపి చ వాయవ్య మస్త్ర మాదాయ రాఘవః।
నిజఘాన సరక్షాంసి మునీనాం వర్ధయన్ సుఖం॥

భాస్కర రామాయణ మీ విషయమునందు చక్కగా ప.ఉ. ప్రతిని బోలి యున్నది.[1] కాని రంగనాథ రామాయణము ఏ పాఠమును కూడ పూర్తిగా ననుసరించలేదు. బుద్ధభూపతి, చిఱు మార్పుచేసి ఔత్తరాహ దాక్షిణాత్య పాఠములను రెండింటిని ఔచిత్య దృష్టితో సమన్వయించి వ్రాసినా డని తోచుచున్నది. చూడుడు.

" ....రామభద్రుండు వొంగి

.... బలువిడి వాయవ్య బాణమేయుటయు

నురువడి మారీచు నుద్వృత్తుగాగ-సరభసవృత్తిమై శత యోజనములు

గొనిపోయి యతిముఱిఁ గ్రూర రాక్షసుని-వనధి లోపలఁ బాఱవైచె నా శరము...........

అతిమతి రఘురాము డగ్ని బాణమున-నురక సుబాహుని నురమేసి చంపె

దక్కిన రాక్షస దళముల నొకటఁ-జక్కాడె మానవ శర మహత్త్వమున"[2]

వాయవ్యాస్త్రమున ఘనవాతూలము జనించును. అది జలధరంబులను పారద్రోలినట్లు శత్రువు లను దూరముగా నెత్తి పడవేయును. భావి కార్యాంతర సాధనకై మారీచుని ప్రాణములను దీయక దూరముగా నెట్టివేయవలెను; అది మారుతాస్త్రము వలనగాని జరుగదు. కావున మారీచునిపై మారు తాస్త్రమును శ్రీరాముడు ప్రయోగించినా డనుట ఎంతయు సమంజసము. ఈ విషయమునందు ప. ఉ. ప్రతి అనుసరింపబడినది.

పవన మారుత, వాయవ్య, వాతూలాదులు పర్యాయ పదములు. ఏ పదముతో చెప్పినను అస్త్ర మొక్కటే! తక్కిన రాక్షసులపై ఆ వాయవ్యాస్త్రమును ప్రయోగించిన వారును దూరమున నెట్టివేయబడుదురు అదికాక, వేసిన బాణమే తిరుగ వేసినట్లగును. కాన సముచితము కాదు. అందు వలన "మారీచునిపై ప్రయోగింపబడిన మానవాస్త్రమును బుద్ధభూపతి తక్కిన రాక్షసులపై శ్రీరాము నిచే ప్రయోగింపఁజేసినాడు. అనగా దా. ప్రతియందు "మానవాస్త్రము మారీచునిపై ప్రయోగింప బడినట్లు చెప్పఁబడినది; రంగనాథ రామాయణమునందు- "అది రాక్షసులపై ప్రయోగింపబడినది"[3] ఈ చిఱు మార్పునకు ముఖ్యముగా రెండు కారణములని ఊహింపవచ్చును.

1. అస్త్రనామ సార్థక్యము
1. వేసిన యస్త్రమును తిరిగి వేయకుండుట (పునరుక్త దోష నివారణము).

సుబాహువుపై ఆగ్నేయాస్త్రము ప్రయుక్తమైనట్లు రెండు ప్రతులందును సమానముగానే చెప్పబడినది.

---

1. భాస్కర రామాయణము బాలకాండము పద్యము 300-303.
2. రంగనాథ రామాయణము బాలకాండ. ద్వి. 901-911.
3. అధ్యాత్మ రామాయణమునందు "శ్రీరాముడు రెండస్త్రములను ప్రయోగించి ఒకదానితో మారీచుని పారద్రోలి, రెండవ అగ్నిమయ బాణముతో సుబాహుని హతమార్చగా, సౌమిత్రి తక్కిన రాక్షసులను సంహరించె"నని కలదు. ఇందు మిగిలిన యస్త్ర నామముల ఊసే ఎత్తబడలేదు. చూడుడు,
అధ్యాత్మ రామాయణము బాలకాండము సర్గ 5 శ్లో. 6-8.

ఇట్లు బుద్ధ భూపతి చేసిన మార్పు ఔచితీ శోభితమై తర్కసహముగా నున్న దనుటలో సందేహము లేదు.

13 జహ్నుమహర్షి గంగా పాన వృత్తాంతము—

జహ్నుమహర్షి గంగాపాన కథాంశము[1] దా. ప్రతిలో కలదు; కాని గౌడీయ, పశ్చిమోత్తర శాఖీయ పాఠములలో లేదు. ఈ జహ్నుముని చరిత్ర రంగనాథ రామాయణమునందు—

"………. అరుగ జహ్నుడు యాగ మాత్రోవఁజేయ
యాగోప కరణంబు లవివెల్లిబోయి-యాగ విఘ్నంబైన నతఁడాగ్రహించి
………. మొదలుకొని ……….
ఉమిసి యొంగిలి సేయనొల్లక యతడు-రమణమై తన కర్ణ రంధ్రంబు నుండి
వెడలింప నెప్పటి విధమున గంగ-యడరుచు జాహ్నవియను పేరఁబరగె"[2]

అను పంక్తి వరకు సుమారు 19 ద్విపదలలో వ్రాయబడినది. వీనిలో

"అని మిషముని వరు లాభగీరథుని-గనుగొని పల్కిరి కరమర్థి మీఱి
………. మొదలుకొని ……. -పుడమిలో నా కీర్తి పొలుపొందు ననుచు"[3]

అను పంక్తి వరకు గల 13 ద్విపదలు ఆం. వి. ప. ప్రచురణలో 1 వ అనుబంధమునఁ జేర్చబడినవి వీనికి బదులు

అనిమిష మునివరు లాభగీరథుడు-వినుతించి జహ్నుని వేడినఁ జూచి

ఆనెడి ద్విపద తత్ప్రచరణమున మూల పాఠము నందు గ్రహింపబడినది. కాని పరిశీలించగా ఈ మొత్తము భాగము మూలమునకు మెఱుగు పెట్టబడినట్లు బుద్ధారెడ్డి చేతనే రచితమైనదని తోచుచున్నది.

1. మూలమునందు దేవ గంధర్వ ఋషులు జహ్నుమహర్షిని పూజించి స్తోత్రము చేసినట్లున్నది, కాని భగీరథుని ప్రసక్తి లేదు.[4]

గంగ నతి కష్టమునఁ దెచ్చునాతు భగీరథుడు. కాని దేవతలు కారు. జహ్ను ముని

---

1 దా. ప్రతి వాల్మీకి రామాయణము. బాలకాండ. సర్గ. 43. శ్లో. 34-38.
కపిల మహర్షిచే దగ్ధులైన సగర పుత్రుల నుద్ధరించుటకై భగీరథుడు గొప్ప తపము చేసి ఆకాశ గంగను పాతాళమునకు తీసుకొని వచ్చుచుండెను. త్రోవలో జహ్నుముని యాశ్రమమునందు యజ్ఞము చేయుచుండెను. గంగానది అతని యజ్ఞ వాటమును యాగోపకరణంబు లన్నియు వెల్లి వోవునట్లు ముంచెత్తెను. దాని గర్వమును గాంచి జహ్నుముని గంగా జలము నంతను త్రాగి వేసెను. మునులు సురులతనిని స్తుతించిరి. అతడు గంగను చెవులనుండి ప్రవహింప జేసెను. నాటినుండి గంగకు జాహ్నవి జహ్నుతనయ యని నామములేర్పడినవి."

2. రంగనాథ రామాయణము. బాలకాండ. ద్వి. 1298-1318.

3. రంగనాథ రామాయణము. బాలకాండ. ద్వి. 1303-1315.

4. దా. ప్రతి వాల్మీకి రామాయణము. బాలకాండ. సర్గ. 43. శ్లో. 36,37.

గంగా పానముచే తన ప్రయత్న మంతయు వ్యర్థమైనదని బాధపడి చింతించువాడు భగీరథుడే కాని, దేవతలు కారు ఇదివరలో, శివుడు గంగ గర్వమణచగా. తన జటా జూటమున నదివెలికి రాకుండ బంధించి నపుడు, పరమశివుని ప్రసన్నుని చేసికొనినవాడు భగీరథుడే కదా! కావున ఇచ్చట కూడ భగీరథుడే జహ్నుమునిని ప్రార్థించుట ముఖ్యము, దేవతల ప్రార్థన గౌణముగా నుండ వచ్చును. అందు వలన మూలమునందు భగీరథుని ప్రస్తావము లేకపోవుట, లోపము. ఈ లోపము దొలగింపఁదలచి "దేవతల హితోపదేశమున భగీరథుడు జహ్నుమునీంద్రుని స్వయముగా సమీపించి, కృపపుట్టునట్లు స్తుతించి ప్రార్థించగా, జహ్నుముని కనికరించినట్లు"[1] రంగనాథ రామాయణమున వివరించబడినది. బుద్ధ భూపతి చేసిన ఈ వివరణము జహ్నుభగీరథ పాత్రోచితమై యొప్పుచున్నది.

2. మూలమునందు "జహ్నుమహర్షి గంగను కర్ణములనుండి మరల విడిచెనని"[2] కార్యము మాత్రము చెప్పబడినది. కాని చెవులనుండియే విడుచుటకు గల కారణము" వివరింప బడలేదు, బుద్ధభూపతి.

"ఉమిసి యెంగిలిసేయు నొల్లక యతడు – రమణమైఁ దన కర్ణ రంధ్రంబు నుండి వెడలింప"[3] నని కార్యముతో పాటు కారణమును గూడ కల్పించి తన యద్భుత ప్రతిభను చాటినాడు. ఈ కారణ మమూలకము.

మనుష్యునికి నవ రంధ్రములున్నవి. వీనిలో మల మూత్రద్వారముల నుండి వచ్చునవి అపరిశుద్ధములు, అసహ్యములు, అనాదరణీయములు. నాసిక నుండి వచ్చునది కూడ గ్రాహ్యముకాదు ఇక "సర్వేంద్రియాణాం నయనం ప్రధాన"మ్మను నేత్ర రంధ్రములు జలపూరితములగుచో దృష్టి నిరోధ మేర్పడును మరి. ముఖ రంధ్రము నుండి వచ్చుదానికి "ఉమియుట, ఎంగిలి యగుట" అను రెండు దోషములున్నవి; కావున పనికి రాదు. ఇక మిగిలినది కర్ణ రంధ్రము.

బుద్ధ భూపతి ప్రధానమైన, సహ్యమైన ముఖ సంబంధ మలిన దోషముల నెత్తిచూపి, ఇతర దేహ ద్వార దోషములను పాఠకుల యూహకు వదలి వేసి. అన్నింటికంటె నిర్దుష్ట ద్వారము శ్రవణము కావున కర్ణ రంధ్రము నుండి గంగను వదలినాడని కారణముతో కార్యమును జతపరచి చెప్పెను. ఇది ప్రశంసనీయమగు కథన పద్ధతి.

శ్రవణము శబ్ద గుణకమైన ఆకాశము యొక్క ప్రతిరూపము. దివి నుండి వచ్చు గంగా జలమెంత పవిత్రమో జహ్నుముని శ్రోతమునుండి వచ్చిన జలము కూడ నంతియే. గంగా జలమున కపవిత్రత కలుగలేదని ధ్వని-

3. ఈ కథాంశమును-

పురుష పురాకృత పుణ్యంబు వలన-దొరకొన్న విఘ్నంబుఁ ద్రోచి యేతెంచు

---

1. రంగనాథ రామాయణము. బాలకాండ. ద్వి. 1303-1315.
2. దా. ప్రతి వాల్మీకి రామాయణము బాలకాండ. సర్గ. 43 శ్లో. 38.
3. రంగనాథ రామాయణము. బాల ద్వి. 1316. 1317.

వెరవున నారాజు వెనుక నేతెంచి"[1]

అనెడి చక్కని యుపమానముతో జోడించుటచే "హితోపదేశము చేయుట" యను ప్రయోజనమును నెరవేర్పబడిన ది.

మానవుడు మహత్కార్యములను చేయునపుడు నడుమ విఘ్నములు వచ్చును. "శ్రేయాంసి బహు విఘ్నాని భవంతి మహతామపి" ఆ విఘ్నములు తొలగి పోవుటలో అతడు చేసిన పురాకృత పుణ్య విశేషము తోడ్పడును.

"స్వల్ప మప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్"[2]

అని గీతా వాక్యము.

జహ్నుపానము భగీరథునికి గంగానయన కార్యమునందు ఘటిల్లిన విఘ్నము. అది యతని పురాకృత తపః ఫలంబున పై దొలగినది. అట్లే "మీరును పుణ్యంబులను జేయుడు. అవి భవిష్యత్కార్య విఘ్నములను దొలగించి మీ కోరిక నెరవేర్చు" ననెడి హితోపదేశము ఇందిమిడి యున్నది

ఔత్తరాహరామాయణ ప్రతులలో లేకున్నను, పై ప్రయోజనముల నాశించి, కవి బుద్ధారెడ్డి దా. ప్రతి యాధారమున నీ జహ్నుపాన కథాంశమును గ్రహించి, కొంత కూర్చి, మూలమునకు మెరుగులు దిద్దినాడు.

భాస్కర రామాయణమునందీ విషయమున దా. ప్రతి కేమాత్రమును భేదము లేకుండ మూడు పద్యములు వ్రాయబడినవి.[3] రంగనాథ రామాయణమునందలి వివరణము, ఉపమా కల్పనము భాస్కర రామాయణమునందు కనిపించవు.

14. అహల్య శిలయగుట-

రంగనాథ రామాయణమునందు-

అడరి గౌతము డహల్యాదేవిఁజూచి-పడతి పాషాణమై పడియుండు మీవు

కరము గ్రమగునెండ గాలిపెంధూళిఁ-బొరలుచునెందును బొడఁ గానఁ బడక"[4]

యని శపించినట్లు స్పష్టముగా వ్రాయబడినది.

వేదము లక్ష్మీనారాయణశాస్త్రి గారు "అహల్యా శాపవిమోచన ఘట్టమున అహల్య రాయిగా పడియుండెననుట- ఇది పద్మ పురాణములోని"[5]దని అవాల్మీకవు క్రింద దీనిని జమకట్టినారు. పింగళి లక్ష్మీకాంతము[6] డా. టి. సుశీల[7] ఆరుద్ర[8] మొదలగువారు నిట్లె తలంచియున్నారు. కాని మూల

---

1. రంగనాథరామాయణము. బాలకాండ. ద్వి. 1318, 1319.
2. భగవద్గీత అధ్యాయము-2 శ్లో. 40.
3. భాస్కర రామాయణము. బాలకాండము. పద్య. 467-470.
4. రంగనాథ రామాయణము. బాల. ద్వి 1481, 1482
5. వేదము లక్ష్మీనారాయణ శాస్త్రి పీఠిక పుట. 16. రంగనాథరామాయణము వావిళ్ళప్రచురణ.
6. ఆంధ్ర సాహిత్య చరిత్ర. పుట. 175.
7. ఆంధ్ర ద్విపద సాహిత్య చరిత్ర. పుట. 190, 191.
8. సమగ్ర ఆంధ్ర సాహిత్యం. సం. III పుట. 234.

ముతో పోల్చి పరిశీలించినపుడిది వాల్మీకమనియే బోధపడుచున్నది.

రామాయణమునం దీ యహల్యా వృత్తాంతము రెండు పర్యాయములు వచ్చియున్నది.

1. బాలకాండము సర్గలు 48, 49.

2. ఉత్తరకాండము సర్గ 30.

బాలకాండము నందలి అహల్యా వృత్తాంతమున "నిరాహారవై, భస్మశాయినివై అదృశ్యావై తపించు"[1] మని గౌతముడు శాప మొసంగినట్లున్నది కాని, "శిలవగు" మని లేక "శిలారూపము నొందు" యని కానిలేదు ఇక ఉత్తరకాండము నందలి వృత్తాంతమున గౌతముడు "శిలవగుమ"ని శపించినట్లు చెప్పబడకున్నను "తరువాత నామె శిలారూపము నొంది తప మాచరించె"[2]నని స్పష్టముగా వివరింపబడియున్నది.

పూర్వోత్తర కాండములు రెండును వాల్మీకి విరచితములే గదా; బాలకాండలో "విశ్వామిత్రుడీ గాథను శ్రీరామునకు చెప్పినట్లును, ఉత్తరకాండలో "బ్రహ్మ స్వయముగా నింద్రునకు చెప్పిన"[3]ట్లును ప్రపంచింపబడినది విశ్వామిత్ర కథనముకంటే బ్రహ్మ కథనము విశ్వసనీయము, యథార్థము. పూర్వ పరములలో పరమే బలీయమైనది. అహల్య శిలయైన వృత్తాంతము రామాయణమునం దెచ్చట చెప్పబడినను వాల్మీకమగునే కాని అవాల్మీకము కాజాలదు గదా:

ఇట్లు ఉత్తరకాండములో చెప్పబడిన అహల్యా శిలారూప వృత్తాంతమే తరువాత ఇతర రామాయణములందును,[4] పురాణములందును[5] ప్రధానముగా గ్రహింపబడి ప్రవచనాదుల ద్వారా

---

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము బాల. సర్గ 48, శ్లో. 31.
2. దా. ప్రతి. ,, ఉత్తరకాండము సర్గ 30. శ్లో. 53, 54 వావిళ్ళ ప్రచురణము.
   "ఏవ ముక్త్వాసవిప్రర్షి రాజగామ స్వమాశ్రమం।
   తపశ్చచార సుమహత్సాపత్నీ బ్రహ్మవాదినః॥
   శిలారూప మను ప్రాప్యత్వత్సంగకృత కిల్బిషా॥"
3. దా. ప్రతి వాల్మీకి రామా. ఉత్తరకాండ. సర్గ 30 శ్లో. 25.
   తంతుదృష్ట్వా తథా భూతం ప్రాహదేవః ప్రజాపతిః॥
4. a) ఆనంద రామాయణము సారకాండ. సర్గ 3 శ్లో. 16.
   "గమనావసరే మార్గే భర్తృశప్తాం శిలాంమునిః।"
   b) అధ్యాత్మ రామాయణము సర్గ 5 శ్లో. 27, 31, 36.
   "దుష్టేత్వం తిష్ఠ దుర్వృత్తే శిలాయామాశ్రమే మమ।
   ....
   యదాత్వదాశ్రయశిలాం పాదాభ్యా మాక్రమిష్యతి
   ....
   రామః శిలాం పదా స్పృష్ట్వాతాంచాపశ్యత్తపోధనాం॥
5. పద్మ పురాణము ఉత్తరఖండము అధ్యాయ. 242, శ్లో. 135.
   "అభూత్సురూపా వనితాసమాక్రాంతా మహాశిలా"

ప్రజల నడుమ వ్యాపించి పాటలుగా, కీర్తనలు1గా రచింపబడి ప్రచారము చెందినది అంతేకాని అవాల్మీకమని చెప్పఁదగదు.

శ్రీ పింగళి లక్ష్మీకాంతం గారు—

"కీర్తన :- రాతినాతిగఁ జేసె నీపద రజమటంచును ఖ్యాతిగా విని

చరణము :- ప్రీతితో నెఱ నమ్మితిని నా పాతకము లెడబాపు తండ్రీ।

పల్లవి :- సీతామనోహరా! రారా! సేవకుడ నను బ్రోవవేరా॥"

అహల్య రాతిగాఁ బడియున్న దనెడి యర్థముగల యిట్టి కీర్తనలు, ఇంత కంటెను ప్రాచీన మైనవి, తెనుగు దేశమున నెప్పటి నుండి కలవో యెవని కెఱుక.

"అడిరి గౌతము డహల్యా దేవిఁ జూచి - పడరి పాషాణ రూపము దాల్చి యిచట

కరముగ్రమగు నెండ గాలిఁ బెంధూళిఁ - బొరలు చుండుము నీవు పొడగానఁ బడక."

ఈ పంక్తులలో బుద్ధారెడ్డి గ్రహించిన దా కీర్తనలలోని యర్థమే కదా"2 యని వ్రాసినారు. కాని యిది సాహసముతో వ్రాసిన వ్రాత.

"శిలారూప మను ప్రాప్య" యని రామాయణోత్తర కాండము నందు స్పష్టముగా కనిపించు చుండగా, వివిధ రామాయణ, పురాణములందును ఇది చెప్ప బడగా బుద్ధారెడ్డికి పై కీర్తనల లోని యర్థమే యాధారమనుట దేశిని గొప్పచేసి నట్లగునేమో కాని సత్య దూరమనుటలో సందేహము లేదు. ఆ కీర్తనలకును, ఈ బుద్ధ భూపతి ద్విపదలకును వాల్మీకము ప్రధానముగాను, వివిధ రామాయణ పురాణములు గౌణములుగాను ఆధారములన వచ్చును.

బుద్ధ భూపతి ఔచిత్యమును పాటించి అటనట ఇతర విషయములను సవరించి వ్రాసినట్లే, ఇచట కూడ బాలకాండ విషయము వదిలి, ఉత్తర కాండ విషయమును ప్రధానముగా గ్రహించి జన బాహుళ్య కథా ప్రకారమునకు దోహదమొనర్చినాడు.

యథా వాల్మీకాను వాదము చేసిన కొందఱు ఉత్తర కాండ యందలి ఈ క్రింది శ్లోకమునకు

"తపశ్చచార, సుమహత్సా పత్నీ బ్రహ్మ వాదినః ।

శిలా రూపమను ప్రాప్య త్వత్సంగకృత కిల్బిషా॥"

అనువాదముగా

"బ్రహ్మవాది పత్ని పచరించె నట్లులే"3

యని మాత్రము వ్రాసి మిగిలిన భాగమును వదలినారు బాలకాండ కథార్థమునకు విరోధము పొసగునని వారు తలచి యుండ వచ్చును.

---

1. కోరాడ రామకృష్ణయ్య- "దక్షిణదేశ భాషా సారస్వతములు-దేశి" పుట-184.
"రాతి నాతి జేసి పురా-రాతి చేతి విల్లు విఱిచి,
భూతలేంద్రులెల్ల మెచ్చగా, ఓ రామచంద్ర-సీతనూ వివాహ మాడవా ;
ఇది కందుకూరి రుద్రయ్య-సుగ్రీవ విజయములోనిది.

2. ఆంధ్ర సాహిత్య చరిత్ర పుట-174.

3. వావిల కొలను సుబ్బారావు శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణము ఉత్తరకాండ పద్య - 687

కదలక మెదలక పడియుండు వారిని మొద్దని బండని లోకమున నిందించుచుండుట సర్వజన విదితమే. కొన్ని వేల యేండ్ల తరబడి కదలక మెదలక పడియున్న అహల్య రాయిగాక మరేమగును? జడము కాక పోయిన నెట్లు పడియుండును? వేల యేండ్లు కదలిక లేక యెట్లు పడియున్నది? అను ప్రశ్నకు "రాయి వలె పడియున్నది. రాయియై పడియున్నది." అని సూటియైన సమాధానము సులభముగా లభించును.

కావున బుద్ధ భూపతి ,ఉత్తరకాండ కథ నాధారముగా చేసికొని, వివిధ రామాయణ పురాణ గాథలు తోడు చూపగా, "అహల్య శిలయైనట్లు వ్రాసి వాల్మీకి మతమునకు మెఱుగులు దిద్దినాడు.[1] అంతియే

విశ్వనాథ సత్యనారాయణ గారు "శిలా రూపమైనయహల్య స్వస్వరూపము (చైతన్యము) చెందునపుడు"[2] వ్రాసిన పద్యము అత్యంత సుందరము, హృదయావర్జకమై యొప్పియున్నది.

15. సీతా జన్మ వృత్తాంతము - మందస కల్పనము

జనక చక్రవర్తి జన్నము సేయదలచి భూస్థల శుద్ధికై యాగ ప్రదేశము దున్నుచుండ, నాగేటి చాలునం దొక మందసము బయల్పడెను. దానిని తెఱచిచూడ నందులో నొక బాలిక యాశ్చర్య లీల పొడచూపెను. ఆ బాలకు సీతయని నామ కరణము గావించి, తన కూతురని జనకుడు పెంచి పెద్ద జేసెను. ఈ విధముగా నా బాల మొదట భూజాతయై సీతా నామమున నొప్పి, జనకునిచే పెంచ బడి జానకి యైనది.

కొన్ని రంగనాథ రామాయణ ముద్రిత ప్రతులలో నున్న మందస వృత్తాంతమునకు సంబంధించిన ద్విపదలు.

"... .... అతులితంబుగఁ జాలునందొప్ప మిగిలి
మందసంబును రాగ మదినుబ్బి చూచి - మందసంబును నేను మమతఁ దీయంగ
నతి వైభవంబుగా నందులో నతడు[3] ...."

అనునవి ఆంధ్ర విశ్వ కళా పరిషత్తు ప్రచురణములో మూలము నందు గాక 1వ అనుబంధమున చేర్చ బడినవి. దా ప్రతి రామాయణమునందు "జనకుడు సీతా జనన వృత్తాంతమును రామాదులకు వినిపించు చోటనీ మందసము ప్రస్తావింప బడలేదు."[4] ఇక సీతాదేవి అనసూయతో తన

---

1. భాస్కర రామాయణమునందును "పాషాణంబై" పడియున్నట్లె వ్రాయబడినది. (బాలకాండ. వచన-527).
2. విశ్వనాథ సత్యనారాయణ "రామాయణ కల్పవృక్షము" బాలకాండము. అహల్యాఖండము పద్య. 556-557.
3. రంగనాథ రామాయణము బాల. ద్వి. 1857-1860.
4. దా. ప్రతి వాల్మీకి రామాయణము సర్గ 66 శ్లో. 13, 14.

"అథ మే కృషతః క్షేత్రం లాంగలా దుత్థితామయా।
క్షేత్రం శోధయతా లబ్ధా నామ్నా సీతేతి విశ్రుతా॥
భూతలాదుత్థితా సాతు వ్యవర్ధత మమాత్మజా॥

జన్మ కథను వివరించు చోట మందస ప్రస్తావన గావింప లేదు.1 భాస్కర రామాయణము నందు మంజూషా వృత్తాంతము కనబడదు.2 కావున రంగనాథ రామాయణము నందలివి ప్రక్షిప్తములా?

పన్నిద్దరాళ్వార్లలో నొకతెయై, ఆండాళను పేరతో ప్రసిద్ధి చెందిన గోదాదేవియు విష్ణుచిత్తుడు తులసీ వనమును త్రవ్వుచుండ నందు జనించి లభించినదని ప్రపన్నామృతము నందును3 చెప్పబడినది అంతే కాని ఆమెయు మంజూష యందు లభించినట్లు ప్రస్తావింపఁబడలేదు.

ఈ సామ్యము చేతను, మూలమునందు లేకపోవుట చేతను మందస వృత్తాంతము కల్పితమని తలంపబడుచున్నది. అయినచో, ఈ పేటికా వృత్తాంత మమూలకమా? అని సందేహము పొడమును.

శ్రీ రామాయణ సారోద్ధారము నందు "వాల్మీకి రామాయణోత్తర కాండ సప్తదశ సర్గ అధిక పాఠములోనివని" ఈ క్రింది శ్లోకము లుద్ధరించ బడినవి.

"పురాలక్ష్మీ స్త్వభూజ్జాతా పద్మకోశే సరోవరే।
లంకాయాం శివపూజార్థం రావణేన మహాత్మనా॥
పద్మాన్యాహర్తు కామేన దృష్టాసా శుభలక్షణా।
ప్రహస్తాదిభిరాలోచ్య మంత్రిభి ర్మంత్రకోవిదై॥
నిక్షిప్యతాం పేటికాయాం సింధు మధ్యే వినిక్షిపత్।
పేటికాంత స్థ్సితా తన్వీ మిథిలానగరం గతా।
ఏవం స్థితే విదేహానాం రాజా సీరధ్వజోమహాన్॥
హలేన కర్షణం చక్రే సర్వేషాం పశ్యతాం సతాం॥"4

కావున వాల్మీకి రామాయణమునందే ఈ పేటికా కల్పనము తెలుగు రామాయణ రచనాత్పూర్వమే కలదని చెప్పవచ్చును.

---

1. a) రంగనాథ రామాయణము అరణ్యకాండ ద్వి. 16-17.
....మిథిలకు విభుడైన యట్టి-జనకుడొక్కెడ యాగశాల దున్నింపఁ
గలిగితినే, నది కారణంబునను-కలిత సీతా నామకమున నొప్పితిని
b) దా. ప్రతి. వాల్మీకి రామాయణము అయోధ్యా. 118 శ్లో. 28.
తస్యలాంగల హస్తస్య కర్షతః క్షేత్రమండలం।
అహంకిలోత్థితా భిత్వా జగతీం నృపతేస్సుతా॥
2. భాస్కర రామాయణము బాలకాండ. పద్య. 689.
3. ప్రపన్నామృతము
సవిష్ణు చిత్త స్తులసీ వనాలిం-ఖనిత్ర వజ్రేణ నిఖాయతత్ కలౌ।
శుభే ముహూర్తే శుచిమాసి ఫాల్గునీ-ప్రతీతతారే తులసీ వనాంతరే॥
భువోద్భవత్ కాంచనా బాలకన్యకాం-భూమ్యంశకాం వీక్ష్య విసిస్మయేముదా॥
4. ములుకుట్ల నరసింహావధాని "రామాయణ సారోద్ధారము" ఉత్తరకాండము-ద్వితీయభాగము సర్గ 9 పుట-48.

"రాజు దున్నునపుడు హలసీరాగ్రము జనించు బాలికకు తగలకుండ నున్నదా? సుకుమారియు, లేత కూనయునగు నా సీతకు హలసీరాగ్రఘాత జనిత బాధ ఎంత భరింపరానిదయ్యెనో?" యని ఆలోచించినపుడు లోక రక్షణకై అవతరించెడి లక్ష్మ్యంశజురాలికి ఈ సీరాగ్రఘాత మర్హమైనది కాదనిపించును. ఇది తప్పింపఁజేయుటకై మందస కల్పన మవసరమైనది.

కావున బుద్ధభూపతి యుత్తరకాండలో కొన్ని ప్రతులలో కనబడు నీ యపక పాఠ శ్లోక భావమును గ్రహించి, జనకుడు సీతాదేవి జన్మ కథను రాఘవ విశ్వామిత్రులకు చెప్పుచోట పొందుపరచి ఔచిత్యమును ప్రదర్శించి యున్నాడు. కాని యిది యమూలకమైన కల్పిత వృత్తాంతము కాదు.

సీతాదేవి జనక చక్రవర్తి మానస పుత్రికయని గౌడీయ, పశ్చిమోత్తర శాఖీయ ప్రతులలో నొక విశేష వృత్తాంతము కలదు.

"జనకునికి సంతతి లేకుండెను. అతడు యాగార్థమై యొకనాడు భూమిని దున్నసాగెను. ఇంతలో నాకసమున పోవుచున్న సుందరాంగి మేనక జనకుని కంటబడెను. సంతానార్థమై అతడామె పొందు నాకాంక్షించెను. వెంటనే "మేనక వలన నతని కొక పుత్రిక జనించును. ఆమె తల్లికంటే నధిక సౌందర్యవతియై యొప్పు" ననెడి యాకాశవాక్కు వినిపించెను. ఆ పలుకులకు విస్మయపడి, అతడు దున్నుచు ముందుకు పోయి భూమినుండి గలిగిన సీతను గాంచెను. మరల "మేనకాయాః సముత్పన్నా కన్యేయం మానసీ తవ." యని ఆకాశవాణి వినబడినది జనకుడామెను పెంచి పెద్దజేసెను."[1]

ఉదీచ్య రామాయణ ప్రతుల ననుసరించి వ్రాసిన క్షేమేంద్రకృత రామాయణ మంజరిలోను ఈ కథ యిట్లే యున్నది.[2] కావున "మేనక కారణముగా జనించిన సీతాదేవి జనకుని మానస పుత్రిక." ఈ కథ మరెచ్చటను సంస్కృత గ్రంథములందు చెప్పబడలేదు. భాస్కర రామాయణము నందిది యనుసరింపబడినది.[3] కాని రంగనాథ రామాయణమునందు లేదు బుద్ధనృపతి ఈ కథను గ్రహింపకపోవుటకు కారణ మాలోచింపవలెను.

ఈ వృత్తాంతము జానకీ జనక చక్రవర్తుల మాహాత్మ్య పారిశుద్ధ్యాదులను భంజించునదిగా నున్నది కర్మిష్ఠియు జ్ఞానియునైన జనక చక్రవర్తిని (సంతానార్థమైనను) ఇంద్రియలోలునిగా నిది

---

1. ప.శా. ప్రతి వాల్మీకి రామాయణము అరణ్యా. సర్గ 2 శ్లో. 8-9.
2. క్షేమేంద్రుని రామాయణమంజరి అరణ్యకాండ. శ్లో, 344-346.

"పురాజనక భూపాలో మేనకాం నాక కామినీం।
దృష్ట్వా తత్సంగమే పుత్రలాభాయ విదధేమతిం॥
జాతే మనోరథే తస్య వాగువాచాశరీరిణీ।
అయోనిజ మపత్యంతే భవిష్య త్యచిరాదితి॥
తతః క్రతుక్రియారంభే విపులే తస్య భూపతేః।
హేమలాంగల కృష్టాయాః సంజాతాహం సుతాభువః॥

3. భాస్కర రామాయణము అయోధ్యాకాండ పద్య. 433-439.

చిత్రించుమన్నది. సౌందర్యాధికతా సమర్థనకై మేనకను జానకీ మాతనుగా నిర్దేశించుచున్నను, సీతాదేవి పారిశుద్ధ్య, లక్ష్మ్యంశ మాహాత్మ్యాదులు ప్రక్కకు నెట్టబడినవి. ఉత్తరకాండలో గల వేదవతీ చరిత్రాదులకు దీనికి వ్యతిరేకత గలుగుచున్నది. కావున ఇట్టి యాలోచనలుగల బుద్ధారెడ్డి ఔచిత్యభంజకమగునని ప. ఉ. ప్రతిలోని సీతాజన్మ మేనకా కారణత్వ వృత్తాంతమును బుద్ధిపూర్వకముగానే వదలినా డనవచ్చును.

ఇక, వివిధ రామాయణములలో సీతాదేవి జన్మ వృత్తాంతము వివిధములుగా కనబడుచున్నది. సీతాదేవి—

i) జనకుని ఔరస పుత్రిక.[1]

ii) మొదట వేదవతి; మరుజన్మమున పద్మజయై ఆ పిదప భూమిజయైనది [2]

iii) అగ్నినుండి జనించినది.[3]

iv) మునుల రక్తమును విషమని త్రాగుటచే కలిగిన మండోదరీ గర్భసంభూతురాలు.[4]

v) దశరథుని కూతురు[5]

జైన బౌద్ధ రామాయణములు విరచింపబడిన తరువాత దేశమున "సీత రాముని కేమి కావలెన"ను సామెతయు పొడమియున్నది.

ఇట్లు వివిధములుగా కనబడుచున్న సీతాదేవి జన్మ వృత్తాంతములలో నేదియు సర్వప్రామాణికముగా కనబడుచు లేదు. అన్నింటిలో అపూర్ణత్వమే భాసించుచున్నది. గౌడీయ, ప. ఉ. ప్రతి రామాయణములందలి మేనకా వృత్తాంతము సీతా జన్మ కథకు పూర్ణత నాపాదించుటకు జరిగిన ప్రయత్న మనవచ్చును. కాని సీతాదేవిని తమ ఆడపడుచుగాను, ఆ తల్లి సుఖ దుఃఖములు తమవిగాను తలంచు తెలుగువారికి ఆమె జన్మకు కారణమైన ఈ మేనకా సంబంధ వృత్తాంతము అంతగా రుచించదు. దా. ప్రతియందును నిది లేదు. ప.ఉ. ప్రతిలోనుండి అనేక కథాంశములు గ్రహించిన రంగనాథ రామాయణ కర్త కిది తెలియదని యనుటకు వీలులేదు. సమకాలీన భాస్కర రామాయణమునందిది గ్రహింపబడియే యున్నది. కావున కవి బుద్ధభూపతి ఔచిత్యమును పాటించి, బుద్ధిపూర్వకముగా దీనిని వదలి, తెలుగువారికి నచ్చిన మందస, భూమిజా వృత్తాంతమునే గ్రహించినాడనుట సమంజసము. ఈమెయే వేదవతియైన పద్మజ.

---

1. మహాభారతము అరణ్యపర్వము అధ్యాయ 274 శ్లో. 9.
"విదేహ రాజో జనకః సీతా తస్యాత్మజా విభో।"

2. దా. ప్రతి. రామా, ఉత్తరకాండ సర్గ 17, శ్లో. 9, 10, 36, 39, 40,

3. ఆనంద రామాయణము సారకాండము సర్గ. 1 శ్లో. 214, 215
ఏకదా వహ్ని కుండాత్సా పద్మా శక్తిః స్థిరా హరేః।
బహిర్నిర్గత్య కుండస్య సమీపే సముపావిశత్॥

4. అద్భుత రామాయణము

5. బౌద్ధుల దశరథ జాతక కథ.

16. భరత శత్రుఘ్నుల రాజగృహ నివాసము :—

శ్రీరామాదుల కళ్యాణమునకు ముందు భరతుని మేనమామ యుధాజిత్తు తన మేనల్లుని మాతామహ గృహమునకు తీసికొనిపోవుటకై యయోధ్యకు వచ్చియుండెను.

పరిణయానంతర మొకనాడు దశరథుడు భరతుని పిలిచి,

"అయం కేకయ రాజస్య పుత్రో వసతి పుత్రక।
త్వాంనేతు మాగతో వీర యుధా జిన్మాతులస్తవ॥
ప్రార్థితస్తేన ధర్మజ్ఞ మిథిలాయా మహం తథా.
ఋషిమధ్యేతు తస్యత్వం ప్రీతిం కర్తు మిహార్హసి॥"[1]

అని చెప్పగా. భరతుడు శత్రుఘ్న సహితుడై వేసమామతో కేకయ రాజ్యమునకు పోయినాడు. రామ వనవాస పర్యంత మచ్చటనే యున్నాడు.

దా. ప్రతి రామాయణములో ఇంతమాత్రమే భరత శత్రుఘ్నుల రాజగృహ ప్రయాణము గూర్చి ఉల్లేఖింపబడినది. కాని రంగనాథ రామాయణమునందు—

"ఒకనాడు దశరథుం డుచిత మెఱింగి-ప్రకటిత శుభరతు భరతు నీక్షించి, ...మొదలుకొని ...... రాజపత్నులకు నా రామ లక్ష్మణుల- కోజ నెంతయుఁ జెప్పె నుల్లంబు లలర"[2]

అను పంక్తివరకు సుమారు 30 ద్విపదలలో వీరి ప్రయాణ రాజగృహ నివాసాదులు వివరముగా వర్ణింపబడినవి.

ఇందలి ప్రధాన విషయములు:—

1. మాతామహు నింటికి పోవు భరతునకు దశరథుడు బుద్ధులు చెప్పుట - విద్యల నభ్యసింపు మనుట.

2. భరతుని ప్రయాణ రీతి.

3. కేకయ రాజపురమును అలంకరింపఁజేసి, మనుమలను మహా వైభవముగా తోడ్కొని వచ్చుట.

4. భరత శత్రుఘ్నులు పురోహితుడైన గార్గేయునొద్ద అస్త్రశస్త్రాది సకల విద్యల నభ్యసించుట,

5. విద్యాభ్యాసానంతరము భరతుడు తండ్రికి బ్రాహ్మణోత్తముని ద్వారా తమ క్షేమమును. పితృ దర్శనాభిలాషను వ్యక్తీకరింపఁజేయుట,

కేవలం దా. ప్రతి వాల్మీకి రామాయణమును జూచిన వారలకు రంగనాథ రామాయణ మందలి ఈ బాలకాండాంత విషయములు బుద్ధభూపతి కల్పనములని, అవాల్మీకములని యనిపించును. కాని పశ్చిమోత్తర శాఖీయ ప్రతి అయోధ్యాకాండములో మొదటి రెండు సర్గలయందును, గౌడీయ ప్రతి బాలకాండములో 79, 80వ సర్గలందును ఈ భరత శత్రుఘ్నుల ప్రయాణ, రాజగృహ నివాసాదులు వివరముగా సుమారు 82 శ్లోకములలో వర్ణింపబడినవి. ఆ సర్గలకు భరత గమనము, భరత దూతాగమన మనియు నామములు.

---

1. దా. ప్రతి వాల్మీకి రామాయణము బాల. సర్గ 77 శ్లో. 17, 18.

2 రంగనాథ రామాయణము బాలకాండము ద్వి. 2430-2457.

ఈ రెండు సర్గలు దా. ప్రతిలో లేనందువలన పరిశీలనకై కొన్ని సమాన విషయము లీ క్రింద చూపబడినవి.

ప. ఉ ప్రతి వాల్మీకి రామాయణము	రంగనాథ రామాయణము
1. నిత్యశశ్చ త్వయా కార్యా శుశ్రూషా మాతులస్యవై ॥18 ఆర్యకస్య చ తే నిత్యం కా లేకాలేభివాదనం। కాలేకాలేయథోక్తం చ బ్రాహ్మణా నభివాదయః॥ 20	తాతకు నవ్వకుఁ దగ మేనమామ కా తాత భక్తితో ననిశంబు మ్రొక్కుచు. సురలకాఁ దలచి భూసురులకు వత్స పరమ ప్రియంబునఁ బరిచర్య చేయు.
2. తేభ్యః సర్వాణి శస్త్రాణి వేదాంశ్చ వదతాం వర॥23 అస్త్రం శస్త్రం మహాస్త్రం చ విధివత్ పుత్ర ధారయ। అశ్వపృష్ఠే రథే చైవ వ్యాయామం కురు నిత్యశః॥24 గంధర్వ విద్యాసు తథా పారగో భవ పుత్రక। అన్యేష్వపి చ శిల్పేషు యత్నః కార్యః సుతత్వయా॥25	వారల చేత నవారణస్యంద నారోహణములు శస్త్రాస్త్ర విద్యలును నెఱి వేద శాస్త్రముల్ నీతి శాస్త్రములు నురుకళా విద్యలు నొగి నభ్యసింపు.
3. పుష్పై ర్గంధైశ్చ ధూపైశ్చ సర్వతః సమలంకృతం॥38 రాజమార్గ స్తదాకీర్ణో జలేనచ సముక్షితః। సముచ్ఛ్రిత పతాకం చ తూర్యోత్కృష్ట నినాదితం॥39	పట్టణంబునఁ దీరువడఁ దోరణములు గట్టించి, బహుపతాకలు కల్వడములు కలయంగ నెత్తించి, గంధోదకములు పొలు పొందఁ జల్లించి, పుష్ప ధూమములు కరమొప్ప రాజ మార్గమున వాసింప —
4. పురతోనృత్య మానాభి ర్వాద్యానుగతశోభితం। నరముఖ్యైశ్చ బహుభిః సూత మాగధ వందిభిః॥ స్తూయమానో యథాన్యాయం భరతః ప్రవివేశహ॥	వరుస నానా గీత వాద్య నృత్యములు పరమ శుభాచార భంగుల నడుమఁ బ్రీతి నెదుర్కొని ప్రియమొప్ప వంది సూత మాగధ జనస్తుతు లోలిఁ జెలఁగ.
5. సందిదేశ తదా దూతం బ్రాహ్మణం శుభ లక్షణం। అయోధ్యాం గచ్ఛ భద్రంతే	విమలైక మతి నొక విప్రునిచేతఁ దమ తండ్రియగుచున్న దశరథేశునకు సముచిత స్థితి మేము సకల విద్యలును చెలువంబుగా నభ్యసించితి మింకఁ

ప. ఉ. ప్రతి వాల్మీకి రామాయణము	రంగనాథ రామాయణము
దూత శీఘ్రం నృపోత్తమం॥	దలపు పుట్టెడు మాకుఁ దము జూడవలయు
పితరం కుశలం బ్రూహి	నని చెప్పుమన నయోధ్యా పురంబునకుఁ
మాతౄశ్చ భ్రాతరౌ తథా।	జనుదెంచి....................
... .	
యథాజ్ఞప్తం కృతం తాత	
మహత్తవ శుభం ప్రియం॥	

ఇట్లు బుద్ధారెడ్డి ఈ రెండు సర్గల వృత్తాంతమును సంగ్రహముగా అనువదించినాడు. కావున ఇది అమూలకము కాదు. ఇందొక్క విశేషము గలదు. ఈ వృత్తాంతము ప. ఉ. ప్రతిలో అయోధ్యా కాండ ప్రారంభమునందును, గౌడీయ ప్రతిలో బాల కాండాంతమునను గలదు. బుద్ధ భూపతి బాలకాండాంతమున దీనిని వ్రాయుటచే గౌడీయ ప్రతి ననుసరించినాడని తలంచ వచ్చును.

ఉదీచ్య ప్రతులలోని యీ ఘట్టమును కవి స్వీకరించుటలో గల ఔచిత్య మాలోచించవలసి యున్నది.

సీతా వివాహానంతరము 12 సంవత్సరములు గడచిన మీదట దశరథుడు శ్రీరామ యువరాజ పట్టాభిషేకమును దలంచియున్నాడు. ఇంతకాలము భరతశత్రుఘ్నులు కేకయపురమున మాతా మహుని ఇంట నున్నారు. ఇన్ని వత్సరములు వారికి ఊరక గడచినదా: ఎట్లు గడచినది? తల్లి దండ్రులను గూర్చి, అయోధ్యకు పోవుటను గూర్చి వారికి ఆలోచనలు కలుగలేదా? అని పాఠకు లకు సందేహములు పొడమును. తత్సమాధానమునకై ఈ ఘట్టమును చెప్పవలసి యున్నది. తండ్రి యనుమతి చేతనే, భరత శత్రుఘ్నులు మాతామహుఁడేర్పరచిన ఆచార్యుల యొద్ద విద్యాభ్యాసము చేయు చున్నారు సర్వ విద్యలు పూర్తియగుసరికి దాదాపు 12 సంవత్సరములు పట్టినవి. అది వారికి గురుకుల వాస తుల్యము. గురుకులవాసము చేయుచు. విద్య నభ్యసించువారు విద్య కాకముందు ఇంటికి తిరిగిరారు గదా! కావున విద్యలు పూర్తికానందున భరత శత్రుఘ్నులు అయోధ్యా నగరమునకు రాలేదు. తరువాత తండ్రికి తాము వచ్చెదమని తమ అభిలాషను బ్రాహ్మణుని ద్వారా తెలిపియున్నారు. ఈ మధ్య కాలమున శ్రీరాముని గుణగణములు తలిదండ్రులకు, అయోధ్యావాసులకు విదిత మగుటకును, వారికి తనపై ప్రేమ గౌరవములు గలుగుటకును అవకాశ మేర్పడినది. దీనిని స్వయముగా చూచిన మంథర "అయోధ్యా నగరమునందు భరతు డిదే రీతి నున్నచో తప్పక ప్రజల యభిమానమును భరతుడు చూఱగొనగలడని" తలంచియే శ్రీరామునకు 14 సంవత్సరముల యరణ్యవాసమును కైకెయిచే అడిగింపజేసినది.

కావున బుద్ధభూపతి ఈ వృత్తాంతమును స్వీకరించి వ్రాయుట ఔచిత్య శోభితమే.

భాస్కర రామాయణమునందు భరతుడు మాతామహ గృహమునకు వచ్చినట్లు సూచనా మాత్రముగానైనను బాలకాండాంతమునఁ గాని అయోధ్యాకాండ ప్రారంభమునందుఁ గాని చెప్పబడలేదు. దశరథ మరణానంతరము వసిష్ఠుడు జయంతాదులను బిలిచి గిరివ్రజపురమున నున్న భరతుని దోడ్కొని రమ్మని నియోగించు విషయమును జదువువరకు పాఠకులకు భరతుడు కేకయ

నగరమున నున్నట్లు తెలియదు. కథ ప్రసిద్ధము కావున చెప్పనవసరము లేదన్నను అస్పష్టమన వలసి వచ్చును. ఇట్లిది సూచింపఁబడకపోవుటకు ఒక కారణము నూహించవచ్చును. భాస్కర రామాయణములోని బాలకాండమును మల్లికార్జున భట్టు, అయోధ్యాకాండమును కుమారరుద్రదేవుడును వ్రాసియున్నారు. ఇక ఈ భరత రాజగృహ నివాస వృత్తాంతము ప. ఉ. ప్రతిలో అయోధ్యాకాండ ప్రారంభముననను, గౌడీయ ప్రతిలో బాలకాండాంతముననను నున్నదిగదా! అయోధ్యాకాండమును వ్రాయు రుద్రదేవుడు దీనిని బాలకాండాంతమున మల్లికార్జున భట్టు చెప్పునని విడిచియుండును. మల్లికార్జున భట్టు దీని అయోధ్యాకాండములో చెప్పియుండునని తలంచవచ్చును. ఇట్లుభయుల తలంపులచే, నిది భాస్కర రామాయణమున లేకపోయినది

అయోధ్యా కాండము

17. మంథర కోప కారణము.—

శ్రీరామచరిత్రమందు కథా విస్తృతికి ముఖ్యమైన పాత్రలు రెండు (1) మంథర (2) శూర్పణఖ. వీరిరువురు రామాయణమునందు లేనిచో రామ కథయే లేదు. శ్రీరాముని అవతార ప్రయోజనమును నెరవేర్చుటలో వీరిద్దరు పరోక్షముగా తోడ్పడి రనవచ్చును. అయోధ్యయందు పట్టాభిషిక్తుడు కాకుండ వనవాసము పోవుటకు మంథరయు, సీతాపహరణ కారణముగా రావణవధ జరుగుటకు శూర్పణఖయు కారకురాండ్రు. వీరిరువురికి శ్రీరామచంద్రునిపై ద్వేషము పొడమినది. దానికి అర్థ కామములు మూలములు. ధర్మాపేతమైన అర్థకామములు అనుభవించవలె ననెడి కోరిక ఎట్టి కీడును కలిగించునో అది వీరి ప్రవర్తన వలన స్పష్టపఱుపబడినది. ఇందు మంథర వృత్తాంతము వాల్మీకి రామాయణమున వివరముగా తెలుపఁబడలేదు.

శ్రీరామచంద్రునకు పట్టాభిషేకము చేయదలచి దశరథుడు పౌర, జానపద, మంత్రి, సామంత పురోహితాదుల యంగీకారముతో నిశ్చయించినాడు. పట్టణమంతయు చక్కగా నలంకరింపఁబడినది. ప్రజలందఱు మహోత్సాహముతో ఉత్సవములను చేసికొనుచున్నారు. కౌసల్యా మాత బ్రాహ్మణాదులకు దానములను చేయుచున్నది చుట్టుప్రక్కలనుండి ప్రజలు శ్రీరామ పట్టాభిషేక మహోత్సవము జూడ నయోధ్యకు గుంపులు గుంపులుగా నేతెంచుచున్నారు. శ్రీరాముని కల్యాణ గుణగణములకు సంబంధించిన మాటలనే మాట్లాడుకొనుచు హర్షించుచున్నారు. ఇట్టి సందర్భమున వాల్మీకి రామాయణమునందు మంథర ప్రవేశపెట్టఁబటినది.

"జ్ఞాతి దాసీ యతోజాతా కైకేయ్యాస్తు సహోషితా।
ప్రాసాదం చంద్ర సంకాశ మారురోహ యదృచ్ఛయా॥"[1]

ఈ మంథర ఎక్కడ పుట్టినదో (యతోజాతా) ఎవరికిని తెలియదు. కాని కైకేయికి వివాహము కాకపూర్వమే కైకేయి తల్లిగారి యంతఃపురమున దాసిగా (జ్ఞాతిదాసీ) చేరినది. చిన్నప్పటినుండి కైకేయికి దాదియై పోషించినది. కైకేయి కల్యాణానంతరము. ఆమె అయోధ్యకు వచ్చునపుడు అరణపు దాసిగా ఆమెతోడ వచ్చినది. ఆమెతోనే కాలము గడుపుచున్నది. శ్రీరామ

---

1. ద. ప్రతి. వాల్మీకి రామాయణము అయోధ్యాకాండ. సర్గ 7 శ్లో. 1.

పట్టాభిషేక మహోత్సవ కోలాహల సమయమున అనుకోకుండ (యదృచ్ఛయా) అబుద్ధి పూర్వకముగా చంద్ర సంకాశమైన ప్రాసాదము నధిరోహించినది దానికి ప్రజల యానందము, పట్టణాలంకారము, కౌసల్య యొనర్చు దానాదులు కనిపించినవి. సమీపము నందున్న మరొక ధాత్రి నడిగి విషయమును దెలిసికొన్నది. క్రుద్ధురాలై శీఘ్రముగా ప్రాసాదము దిగి పండుకొనియున్న కైకేయిని సమీపించి దుర్బోధ చేసినది. ఇచ్చట వాల్మీకి మహాముని మంథరకు "పాపదర్శినీ"[1] అను విశేషణమును తగిలించినాడు. ఇది సహజముగా పాప స్వభావము గలది, కావున ఇతరుల మేలును సహించనిది; అపకారము చేయునది; అను అర్థములు "పాపదర్శినీ" విశేషణముచే ధ్వనించుచున్నవి. కాని, శ్రీరామునిపై దాని కెందులకు కోపము కలిగినదో? కారణ మేమిటో? వాల్మీకి స్పష్టముగా తెలిపిన వాడు కాడు. ఇతర రామాయణ కర్తలు ఇచ్చటి యీ లోపమును పూరించుటకును, రామునిపై గల మంథరా ద్వేష కారణమును చెప్పుటకును ప్రయత్నించిరి.

అధ్యాత్మ ఆనంద రామాయణములందు "దేవతల ప్రార్థనచేత వాగ్దేవి మంథరలో ప్రవేశించి అట్టి దుర్బుద్ధిని కలిగింపజేసినది. ఆ పిదప మంథరా దుర్బోధ విఘ్నయత్నే ఆచరింపజేయుటకై సరస్వతి కైకేయి యందును ఆవహించినది."2 అని తెలుపబడినవి. దీనివలన ఇది దేవతల పన్నాగమే కాని యిందు మంథరా కైకేయులు నిర్దోషులని తెలియుచున్నది.

భారతమునందు "దుందుభి యను గంధర్వి బ్రహ్మాదేశము చేత దేవ కార్యార్థసిద్ధికై మంథరగా జనించినదని"[3] తెలుపబడినది. "ఏ కార్య సాధనకై ఎవరెవరు భూమియందు జనించి నారో, వారువారు సందర్భమును పురస్కరించుకొని ఆయా పనులను నెరవేర్చినా"రని ప్రకటించుట భారత రామ కథోద్దేశ్యమని తెలియుచున్నది.

సత్యోపాఖ్యాన రామాయణమునందు "పూర్వజన్మ కర్మ పరజన్మకు కారణమ"నెడి సత్యమును నిరూపించునట్లు ఈ క్రింది వృత్తాంతము చెప్పబడినది.

---

1. దా. ప్రతి వాల్మీకి రామాయణము అయోధ్యాకాండ సర్గ 7 శ్లో. 13
   సా దహ్యమానా కోపేన మంథరా పాపదర్శినీ।
   శయానా మేత్య కైకేయీ మిదం వచన మబ్రవీత్॥"
2. అధ్యాత్మ రామాయణము అయోధ్యాకాండము సర్గ. 2 శ్లో. 44-46.
   "ఏ తస్మిన్నంతరే దేవా దేవీ వాణీ మచోదయన్
   గచ్ఛదేవి భువోలోక మయోధ్యాయాం ప్రయత్నతః।
   రామాభిషేక విఘ్నార్థం యతస్వ బ్రహ్మవాక్యతః॥
   మంథరాం ప్రవిశస్వాదౌ కైకేయీం చ తతః పరం।
   తతో విఘ్నే సముత్పన్నే పునరేహి దివం శుభే।
   తథేత్యుక్త్వా తథా చక్రే ప్రవివేశాథ మంథరాం॥"
3. భారతము, వనపర్వము, అధ్యాయము 76, శ్లో. 9, 10.
   "పితామహ వచశ్శ్రుత్వా గంధర్వీ దుందుభీ తతః।
   మంథరా మానుషే లోకే కుబ్జా సమభవ త్తదా॥"

"విరోచనుడను రాక్షస రాజు కూతురు మంథర. ఇతనిచే పరాజితులైన దేవతలు సురాచార్యుని సలహాపై బ్రాహ్మణ వేషధారులై వచ్చి విరోచనుని తన దేహము నిమ్మని యాచించిరి. మహోదారుడైన విరోచనుడు వారి కోరికను మన్నించి శరీరమును విడిచెను. అప్పుడు దుఃఖించు రాక్షసులను రక్షించుటకై మంథర ముందుకు వచ్చెను. దేవ రాక్షసులకు ఘోర యుద్ధము జరుగుచుండగా, మంథర తన మాయచే దేవేంద్రాదులను పాశములతో బంధించెను దేవతల ప్రార్థనపై శ్రీహరి వారి పాశములను ఛేదించి, మంథరా హననమునకై యింద్రుని ప్రోత్సహించెను. ఇంద్రుని వజ్రాయుధముచే మంథర తల పగిలెను. శరీరము మూడు వంకలుగా తిరిగెను. తన మరణమునకు శ్రీహరి కారణమని భావించి, శ్రీహరికి కష్టము కలిగించుదాననని స్మరించుచు ప్రాణములను విడిచెను. "ఈ అంత్య స్మృతి వలన కేకయ పట్టణమున దాసీ పుత్త్రిగా జనించి, కైకేయితో అయోధ్యకు వచ్చి, పూర్వ విరోధ కారణమున శ్రీరామునిపై పగబూని. సమయము రాగా కైకేయికి నూరిపోసి విజయము సాధించినది "[1]

ఈ వృత్తాంతము మంథరా విరోధమునకు పూర్వజన్మ కర్మ కారణమని ప్రకటించుటయేకాక, భగవద్గీత యందలి

"యం యం వాపి స్మరన్ భావం త్యజత్యంతే కళేబరం।

తం తమేవైతి కౌంతేయ సదా తద్భావ భావితః॥ (భ.గీ. అధ్యాయము 8 శ్లో. 6)

అను శ్లోక భావమును ద్రఢీకరించుచున్నది.

ఇట్లు మంథర శ్రీరామునిపై పగ బూనుటకు వివిధ రామాయణములలో వివిధములుగా కారణములు చెప్పబడినవి. కాని రంగనాథ రామాయణ కర్త వీనిలో దేనిని గ్రహించలేదు. మీదు మిక్కిలి ఈ జన్మయందు రాముడు తనకు కీడు చేయుట చేతనే పగ బూనినట్లు కల్పనచేసి రచించిన ఆ ద్విపదలు అద్భుతములు.

శ్రీరాముడు బాల్యమునం దొకనాడు మిత్రులతో బంతి యాడుచున్నాడు.

"మాయా వినోదముల్ మరగి యాడుచును-నాయెడ రఘురాము డాప్తులుం దాను

నిండారు ప్రేమతో నెట్టెలు గట్టి-చెండును దండంబు చెలువొప్పఁబట్టి

తరమిడి యాడెడు తఱిని గైకేయి-వరవుడా మంథర వడి నేగుతెంచి

చిట్టంటు చేతలఁ జెండు దట్టటయుఁ-గట్టల్క రాము డా కాష్ఠంబు చేత

నడచిన నొక్క కాలప్పుడే విఱిగెఁ-దడయక యందందఁ దమకించి రాము

1. లక్కావజ్ఝల వెంకటకృష్ణశాస్త్రి "ఆశ్చర్య రామాయణము" అయోధ్యా. పుటలు 68-72 లలో ఇది ఉద్ధరింపఁబడినది.

"అంత్యస్మృతి మనుస్మృత్య కేకయేంద్రస్య పత్తనే।

జాతా కేకయ దాస్యాస్తు పుత్రీరూపేణ మంథరా॥

కైకేయ్యాః ప్రేషణే కాలే కేకయో ప్రేషయచ్ఛతాం।

పూర్వ వైరానుసారేణ మంథరా కైకయీం పునః।

నడరెడు వేడ్కతో నాడంగం జూచి-తడయక రాముపైఁ దగఁ గ్రౌర్యముంచి
విటిగిన కాలితో వెసఁ గైక నగరి-కటిగి తద్వృత్తాంత మంతయుఁ దెలుపఁ
దరమిడి కైకేయి దశరథాధిపున-కెటిగింప నంతయు నెటిగి భూవిభుడు"[1]

వసిష్ఠుని రావించి "వేదాది విద్యల నేర్పుడ"నుచు నతనికి శ్రీరామాదుల నప్పగించి నాడట.

ఇచ్చట కైకేయికి మంథర తన గోడు చెప్పుకొనినను, ఆమె మహారాజునకుఁ దెలిపినను లాభము లేకపోయినది. దశరథుడు శ్రీరాముని శిక్షించినవాడు కాడు, కనీసము చీవాట్లు పెట్టినవాడు కాడు కావున మంథర కోపమట్లే మనస్సున నుండిపోయినది. రాముని చూచినప్పుడెల్ల అది భగ్గున మండుచు, ప్రతీకారమునకు పాల్పడి అవకాశమునకు నెదురుచూచుచుండెనని యూహింపవచ్చును. ఇట్లు కాలము గడువగా, శ్రీరాముని పట్టాభిషేకము వచ్చినది. అది దానికి చక్కని అవకాశము. కావున ఈ సమయమును జారవిడువక ఉపయోగించుకొన్నది. శ్రీరాముని అపకారమును తలపెట్టినది, అందుకే కవి

"పనివడి రాముండు బాల్యంబునందుఁ-దన కాలు విటిచిన తప్పు సాధింప
నిది నాకు తటియని యిచ్చఁ జింతించి-యది వచ్చి (హెచ్చి) కైకతో నంతయుఁ"[2]

జెప్పినది. చక్కగా యుక్తులమీద యుక్తులు పలికి కైక మనస్సును మార్చి రామ వనవాసమునకు మూలకారణ మయినది. అసూయయే దీని కాధారము.

"ఈ కల్పన మమూలకమైనదనియు రచయిత యొక్క ప్రతిభా శక్తి కిది చక్కని నిదర్శన మనియు"[3] శ్రీ పింగళి లక్ష్మీకాంతం వంటి విమర్శకులు వేనోళ్ళ పొగడియున్నారు.

"కవి కల్పించిన యీ యుపపత్తికి జనశ్రుతి యాధారము కావచ్చున"[4]ని శిష్టా రామకృష్ణ శాస్త్రిగారు అభిప్రాయపడినారు. "మూలమున "మంథరా పాపదర్శినీ" యని యున్నది. అది యెందువలన పాపదర్శిని యైనదో యీ కవి "తన కాలు విటిచిన తప్పు సాధింప"నని నిరూపించినా డ"ని[5] శ్రీ వారణాసి వేంకటేశ్వరులుగారు వ్యాఖ్యానించినారు.

అయినచో, నిట్టి యద్భుత కల్పన మీ కవియొక్క స్వీయ ప్రజ్ఞామూలకమా? లేక జన శ్రుతిని బట్టి వచ్చిన కల్పనయా? లేక ఇంకను ఛాయామాత్రముగా నెచ్చటనైనను ఆధారము లభించునా? అని పరిశీలించగా ఈ క్రింది విషయములు తెలియుచున్నవి.

వాల్మీకి రామాయణమున శ్రీరాముని బాల్య క్రీడలు వర్ణింపఁబడలేదు. కాని ఇతర రామాయణ పురాణములందు కొన్ని వర్ణింపఁబడినవి.

---

1. రంగనాథ రామాయణము, బాలకాండ. ద్వి. 560-597.
2. రంగనాథ రామాయణము, అయోధ్యాకాండ. ద్వి. 145-146.
3. ఆంధ్ర సాహిత్య చరిత్ర పుట-175.
4. ఆంధ్రవాఙ్మయ చరిత్ర సర్వస్వము సంపుటి-1 పుట-573.
5. ఆంధ్ర సాహిత్య సంగ్రహ చరిత్ర పుట-134.

అధ్యాత్మ రామాయణమునందు "శ్రీరాము డాకలియని కౌసల్య యొద్దకుఁబోయి భోజన మడుగగా, నామె వినిపించుకొనలేదు. శ్రీరాముడు కోపించి కఱ్ఱ దీసికొని కుండల నన్నింటిని పగులగొట్టెను. ఉట్టిమీది పాలుపెఱుగు వెన్నలను క్రింద నొలకబోసెను; తల్లి పట్టుకొనుటకు రాగా పారిపోయెను"[1] అనియు

పద్మ పురాణమునందు "దశరథ మహారాజు భుజించుటకు కూర్చుండగా, రామచంద్రుడు దుముకుచు పరుగులిడుచు వచ్చి రాజు ముందరి బంగారు పళ్లెరమందున్న యన్నమును గ్రహించి రాజుపై వెదజల్లెను"[2] అనియు

ఆనంద రామాయణమునందు "నిర్మలాకాశ మందలి నిండుచంద్రుని జూచి, తనకది కావలె నని మొండి పట్టుపట్టి యేడ్చుచుండ, బుజ్జగించి బుజ్జగించి చివరకు అద్దమును దెచ్చి అతని చేతి కందీయ. నందు ప్రతిబింబించిన చంద్రబింబమును గాంచి కిలకిల నవ్వెను"[3] అనియు నిట్లు ఒండు రెండు బాల్యక్రీడా వర్ణనలు కనిపించుచున్నవి. కాని యిట్టి యాట లేవియు ప్రధాన కథావిస్తృతికి పనికి రాకున్నవి—

అగ్ని పురాణమునందు—

"పాదౌ గృహీత్వా రామేణ కర్షితాసాఽపరాధతః।
తేన వైరేణ సా రామం వనవాసం చ కాంక్షతి॥"[4]

అని మంథర రాముని వనవాసమును కాంక్షించుటకు పూర్వవైరము కారణముగా చెప్పబడినది.

రామాయణ మంజరియందును—

"శైశవే కిల రామేణ పురా ప్రణయ కోపతః।
చరణే నాహతా తత్ర చిరంకోప ముదావహసా॥"[5]

అని మంథర కోపమునకు కారణము శ్రీరాముడు బాల్యమున దానిని ప్రణయ కోపముతో తన్నుట యని ప్రపంచింపబడినది. క్షేమేంద్రుని రామాయణ మంజరి ఉత్తర భారతమున ప్రచారములో నున్న వాల్మీకి రామాయణ పాఠమునకు సంగ్రహ రూపమే. కావున ఈ భావన వాల్మీకిదే కావచ్చును. కాని ప్రస్తుతము లభించు రామాయణ ప్రతులలో కనీస మధిక పాఠముగానైనను పొడకట్టదు.

భాస్కర రామాయణమునందు "ఈ సందర్భమున రామాయణ మంజరి శ్లోకమునకు సరియైన యనువాద వచనము కానబడుచున్నది. "తొల్లి కౌసల్యా తనయు చేతం దనకునైన చరణ తాడన భంగంబు వైర కారణంబుగా గొని"[6] యని యా వచనము.

---

1. అధ్యాత్మ రామాయణము. బాలకాండ. సర్గ 3. శ్లో. 52-58
2. పద్మపురాణము. పురాకల్పీయ రామాయణము. పాతాళఖండము. గద్యము-37.
3. ఆనంద రామాయణము.
4. అగ్నిపురాణము. అధ్యాయము 6 శ్లో. 8.
5. క్షేమేంద్రుడు "రామాయణమంజరి" అయోధ్యా. శ్లో. 667.
6. భాస్కర రామాయణము. అయోధ్యా. వచనము—52.

బుద్ధభూపతి వివిధ రామాయణ పురాణ విషయములను గూడ చదివి పర్యాలోచించి, రాముని బాల్య క్రీడలకు మంథర అసూయా ద్వేషములకు కార్యకారణ సంబంధము (సమన్వయ సంబంధము) ఏదియు లేనందున వానిని త్యజించినాడు. అగ్నిపురాణ రామాయణ మంజర్యాధారముగా నూతన కల్పన గావించి మూలమున లేని బంతి యాటను ప్రవేశపెట్టినాడు.

“మంథర చిట్టంటు చేతలఁ జెండు దట్టిన, శ్రీరాముడు దాని కాలును కఱ్ఱతోఁ గొట్టగా నది విరిగెను. అంతట నది రాముని దౌష్ట్యమును కైకేయిద్వారా మహారాజుకు దెలిపినను అతడు పట్టించుకొనలేదు. అందువలన మంథర అతనిపై కలిగిన కోపమును మనసునందే నిలిపి, పట్టాభిషేక సమయము నవకాశముగా గ్రహించి, తన చాతుర్యముచే కైకకు బోధించి రామునిపై కక్ష సాధించెను”[1] (రాముడు దాని కాలును విఱిచెను. మంథర అతని పట్టభంగము కావించినది. ఇది కార్యకారణ సంబంధ రూప సమన్వయము).

బుద్ధభూపతి మూలమునందువలె మంథరను శ్రీరాము పట్టాభిషేక సమయమున నకస్మాత్తుగా ప్రవేశపెట్టలేదు. బాలకాండమునందు బీజ (హేతు) రూపమున శ్రీరాముని బంతి యాట వేళ మంథరను ప్రవేశపెట్టి, రామునిచే దాని కాలు విరుగగొట్టించి, కోపమును కలిగింపఁజేసి, పట్టాభిషేక సందర్భమున తత్పూర్వ ఘటనను దానిచే స్మరింపఁజేసి, కార్యరూపమున కైకేయికి చేసిన బోధను వర్ణించినాడు. ఇట్లు రచయిత పూర్వాపరములకు చక్కని సమన్వయము చేసి, ఔచిత్య శోభిత మొనర్చి సహృదయుల ప్రశంసకు పాత్రుడైనాడు. కవి చేసిన మంథరా కోప హేతు భూత పూర్వ వైర కల్పనకు అగ్నిపురాణ, రామాయణమంజర్యాది గ్రంథము లాధారములు. రామాయణ మంజరి యందున్న వృత్తాంతము రామాయణమునందును నుండవలెను.[2]

18. కైకేయి నిర్దోషిత్వము :—

కేకయ దేశాధిపతియైన అశ్వపతి మహారాజు కూతురు కైక. ఈమెకే కైకేయి, కైకయా అని పర్యాయపదములు. కైకకు జనించిన వానినే రాజుగా చేయుదునని దశరథుడు శపథము చేయగ, అశ్వపతి నమ్మిక వడసి యామె నతని కొసంగి పెండ్లి చేసెను. శ్రీరాముడు స్వీయముగా నీ విషయమును భరతునితో చిత్రకూట పర్వతమున వెల్లడించియున్నాడు.

“దశరథేశునకు మీ తల్లిని మున్ను-విశదంబుగా నిచ్చువేళ మీతాత
నా కూతునకు గల్గు నందను నఖిల-భూకాంతుగా నీవు పూన్పుమీ యనుచు
నమ్మిక వడసి వెన్కనుఁ బెండ్లిచేసె.”[3]

---

1. రంగనాథ రామాయణము. బాలకాండ. ద్వి. 590-596.
 ,, ,, అయోధ్యా. ద్వి. 145-146.
2. భాస్కర రామాయణము నందుండుట దీనికి నిదర్శనము.
3. రంగనాథ రామాయణము అయోధ్యా. ద్వి. 1736-1738.
 మూలమునం దిట్లే యున్నది. అయోధ్యా. సర్గ 107 శ్లో. 2.
 “పురా భ్రాతః పితానస్స మాతరం తే సముద్వహన్॥
 మాతామహే సమాశ్రౌషి ద్రాజ్యశుల్క మనుత్తమమ్॥

అట్టి యీ కైకేయి దేవాసుర యుద్ధంబులో దశరథుని శంబరాసురుని మాయనుండి కాపాడి, అతడొసంగిన వరముల నాధారముగా చేసికొని బుద్ధిఁ దప్పక భరతుని పట్టాభిషేకమును, శ్రీరామ వనవాసమును గోరినది. రాజు మాటఁ దప్పక యొసంగినాడు. కైకేయి యీ కోరికకు మంథరా దుర్బోధయు దోహద మొనర్చినది. కావున లోకము కైకను కుటిలురాలనియు, అర్థకామపరురాలనియు, నిందించుచున్నది. "వాల్మీకి మహామునియు దీనిని శ్రీరామాది ప్రధాన పాత్రలద్వారా అచ్చటచ్చట స్పష్టపరచినాడు."[1]

కాని కైకేయియొక్క నిర్దోషిత్వమును స్థాపించుట కొఱకు గౌడీయ, పశ్చిమోత్తరశాఖీయ రామాయణ పాఠములందు ప్రత్యేకముగా బ్రాహ్మణ శాప మొకటి ఉట్టంకింపబడినది.

"కైకేయి తన బాల్యమున మూర్ఖ (రూక్ష) రూపియైన బ్రాహ్మణునొకని అసూయచే పరిహసించెను. అంత నా బ్రాహ్మణుడు "రూపమద దర్పాతిరేకమున నసూయచే నిందించితివి గావున నీవును లోకమున కుత్సితమైన అసూయచే నపకీర్తిని పొందగలవని శపించెను.

---

1. a) శ్రీరాముడు సీతాలక్ష్మణులతోడ
"సాహిదేవీ మహారాజం కైకేయీ రాజ్య కారణాత్।
అపి నచ్యావయేత్ ప్రాణాన్ దృష్ట్వా భరతమాగతం॥ (అయోధ్యా. సర్గ 53 శ్లో. 7)
అని పలికియున్నాడు.

b) ఇట్లె శ్రీరాముడు సీతాదేవి విరాధాంకగతయైనప్పుడు—
"యదభిప్రేత మస్మాసు ప్రియం వరవృతం చయత్।
కైకేయ్యాస్తు సుసంపన్నం క్షిప్రమద్యైవ లక్ష్మణ॥
అద్యేదానీం సకామాసా యామాతా మమ మధ్యమా। (అరణ్యకాండ సర్గ 2 శ్లో. 19,20)
అని లక్ష్మణునితోఁ జెప్పియున్నాడు.

c) సీతాదేవియు శ్రీరాముని మాయా శిరమును జూచి
"విజగర్హే చ కైకేయీం క్రోశంతీం కురరీయథా।
సకామాభవ కైకేయి హతోఽయం కులనందనః॥
కులముత్సాదితం సర్వం త్వయా కలహశీలయా।
ఆర్యేణకింతే కైకేయి కృతం రామేణ విప్రియం।
యన్మయాచీర వసనస్త్వయా ప్రస్థాపితో వనం॥ (యుద్ధకాండ. సర్గ 32 శ్లో. 3, 4, 5)
అని తనలో కైకను నిందించెను. రంగనాథ రామాయణమున నిట్లే యున్నది.
(యుద్ధకాండ ద్విపదలు 1689-1690)
కటకటా కైకెయి కలహంబు వన్ని-యిటుఁ బ్రుంగజేసితే యిక్ష్వాకు కులము
నీ రాఘవేశ్వరు డెగ్గేమి సేసె-నూరక యడవుల నుండంగఁబనుప"

ఆ శాప కారణముగ కైకేయి మంథరా దుర్బోధకు వశురాలై శ్రీరామ వనవాసమునకు హేతు భూతయైనది."[1]

ఈ వృత్తాంతము దా. ప్రతి వాల్మీకి రామాయణములో లేదు. ఇట్లే కొన్ని యితర రామాయణములలోను, రామ నాటకములలోను కైకేయి నిర్దుష్టత్వ స్థాపనకై కొన్నికొన్ని కల్పనలు చేయబడినవి.

i) రామ పట్టాభిషేక విఘ్నార్థము దేవతా ప్రార్థితయైన వాగ్దేవి మంథరా కైకేయుల నావేశించి మోహింపజేయుట.[2]"

II) సీతా స్వయంవర సమయమున శూర్పణఖ మంథరా రూపమున దశరథుని యొద్దకు వచ్చి కుహనా పత్రము నొకదాని నొసంగెను. అందు "శ్రీరాము నరణ్యమునకు పంపి నాకిచ్చిన వరమును నెరువేర్పుమని కైక కోరియున్నది. తత్ఫలితముగా శ్రీరాముడు తన పాదుకలను భరతుని కొసంగి, తాను మిథిలనుండియే అరణ్యమునకు ప్రయాణమై పోవును."[3]

iii) కైకేయీ దశరథులు ఇంద్రుని యొద్దకు పోయిన సమయమును కనిపెట్టి శూర్పణఖా, రావణ పరిచారికలు ముగ్గురు కైకేయీ, దశరథ, మంథరా వేషధారులై అయోధ్యకు వచ్చి నాటక మాడి శ్రీరాముని వనమునకు పంపుదురు.[4]

iv) ఋషి శాపమువలన దశరథుడు మరణింపకుండనుండుటకై, శ్రీరాముని కధికమైన విపత్తి రాకుండ నుండుటకై కైకేయి వసిష్ఠ, వామదేవాదులతో నాలోచించి, శ్రీరాము నరణ్యమునకు పంపుచు. మఱపుచేత 14 దినములకు బదులు 14 సంవత్సరములని కోరును."[5]

v) కైకేయి బాల్యమునం దొకానొక ముని ముఖమునకు మసి బూసి, నల్లగాం జేసి పరిహసించెను. అతడును అపవాదము వలన నీ ముఖమును లోకులు చూడ

---

1. ప ఉ ప్రతి వాల్మీకి రామాయణము అయోధ్యా, సర్గ 11 శ్లో. 37-40.
"నహితద్బుబుధే పాపం శాపదోషేణమోహితా,
కేకయేషుహి సాబాల్యే బ్రాహ్మణం మూర్ఖరూపిణం.
అసూయితవతీ బాలా తేనశప్తామహాత్మనా.
2. అధ్యాత్మ రామాయణము అయోధ్యా సర్గ 2 శ్లో. 44.
యస్మాదసూయసే విప్రం త్వం రూప మదదర్పితా,
తస్మాదసూయాం త్వమపి లోకే ప్రాప్స్యసి కుబ్జితా॥
ఇతిశాప సమాచ్ఛన్నా మంథరా వశమాగతా,
అపేవ హృష్టా కైకేయీ మంథరాం పరిషస్వజే॥
3. a) మహావీరచరితము అంకము 4.
b) అనర్ఘరాఘవము అంకము 4.
4. బాల రామాయణము అంకము 6.
5 ప్రతిమా నాటకము అంకము 6.

కుందురని"[1] శపించెను, తత్కారణమున కైకేయి మంథరా దుర్బోధకు లోనైనది.

బుద్ధభూపతి తన రామాయణమున కైకేయియొక్క నిర్దోషిత్వ నిరూపణకై ఎట్టి కల్పనను గ్రహించలేదు. సీతాలక్ష్మణాదులు ఆ యా సందర్భములందు కైకను నిందించినను, రాముని చేత మాత్రము కవి తన గ్రంథమున కైకను దూషింపఁజేయలేదు. శ్రీరాముడు నిందించలేదనగా, అతని దృష్టిలో కైక దోషి కాదనియే గ్రహించవలసినదని బుద్ధారెడ్డి అభిప్రాయము.

"ఈ కైక లోకైక హితము గావించె-మీకెల్ల తెల్లమౌ మీద దాననుచు"2

నని భరద్వాజుని చేతను,

"భరత నీ విదియేమి బాలుండవైన-కరణిఁ బల్కెదు ధర్మగతిఁ దప్పనాడి
యా కైక నేల పోనాడెదు"3

అని శ్రీరాముని చేతను తల్లిని దూషించుచున్న భరతునికి మూలానుసారముగా హితోపదేశము చేయించినాడు.

లక్ష్మణుడు హేమంత ఋతువును వర్ణించి, భరతుని దలంచి కైకను నిందించినట్లు మూలమున నుండగా, లక్ష్మణుడు కైకను నిందించిన ఘట్టమును వదలివేసి,

"ఏ తల్లి పనుపున నెల్ల సంయముల-చేత దీవెనలు గాంచితి వేడ్క నేను
నట్టి కైకను నొవ్వనాడునో తెలియ-దట్టేల కావించు ననఘాత్ము డతడు"4

అని శ్రీరాముడు కైకవలన లాభము పొందినట్లును, కైక స్వభావమును గుర్తించక, భరతుడు నిందించునో ? యేమో ? యని బాధ పడినట్లును బుద్ధభూపతి మార్చి వ్రాసినాడు. దీనివలన, కైకేయి నిర్దోషిత్వ నిరూపణకై కల్పనలకంటే రామవాక్యమే ప్రధానమని తలంచియుండుటచే, ప. ఉ. ప్రతిలోని కల్పనను గాని, తదితరమైనవానిని గాని బుద్ధభూపతి గ్రహించలేదని తోచుచున్నది

19. కైకేయి విద్యా-వరప్రాప్తి:—

"దశరథు డొకప్పుడు కైకేయితోఁ గూడి శక్ర సహాయార్థము శంబరాసురునితో యుద్ధము చేయఁబోయెను రాక్షసాస్త్రములచే రాత్రియందు దశరథుడు నష్టచేతనుడై పడియుండ, "కైకేయి

---

1. ఆనంద రామాయణము సారకాండ. సర్గ. 1 శ్లో. 80-87.
"తయాతు పూర్వం బాల్యత్వా న్మష్యాస్యం కస్యచిన్మునేః।
కృష్ణవర్ణం కృతం తేన శప్తా తేఽప్యపవాదతః।
ముఖమగ్రే నిరీక్ష్యంతి దైవలోకాః కదాచన॥"
2. రంగనాథ రామాయణము అయోధ్యా ద్వి. 1575.
3. ,, ,, అయోధ్యా. ద్వి. 1706-1707.
4. ,, ,, ఆరణ్య. ద్వి. 262-263.
మూలమునందు లక్ష్మణుడు కైకను నిందించిన శ్లోకమిది.
భర్తా దశరథోయస్యా స్సాధుశ్చ భరతస్సుతః।
కథంనుసాఽంబా కైకేయీ తాదృశీ క్రూరశీలినీ॥ (అరణ్య, సర్గ 16 శ్లో. 35)

రథమును రణరంగమునుండి దూరముగా తోలికొనిపోయి శీతోపచారములచే పతిని రక్షించెను. సంతుష్టుడైన రాజామెకు రెండు వరముల నొసంగె"1 నని దా. ప్రతి రామాయణమునందు విషయము సామాన్యముగ చెప్పబడినది ఇది "కైకేయికి రథ సారథ్య నైపుణ్యము" గలదనుటకు సూచితమే కాని "రథమును దూరముగా తీసికొనిపోయినప్పు డచటికి రాక్షసులు రాలేదా? వారు తమ మాయను ప్రయోగించలేదా ?" అను సందేహములకు ఈ దా. ప్రతి సమాధానమీయదు.

ఈ సందేహ నివారణకై గౌడీయ, ప. ఉ. ప్రతులలో "కైకేయికి దుష్ప్రధర్షణమైన విద్య బాల్య కాలమున సంప్రాప్తమైనట్లు ప్రస్తావించబడినది.

మూర్ఖవేషుడగు ద్విజోత్తము డొకడు కైకేయిచే బాల్యము నందొకప్పుడు ప్రహసింపబడెను ప్రసన్నుడైన యతడు ఇతరులకు దుష్ప్రధర్షణమైన విద్య నామెకు అనుగ్రహించెను. ఆమె రాక్షస నివారణమున బలము లేనిదయినను, ఏతద్విద్యా ప్రభావమున దుష్ప్రధర్షణురాలై రాక్షస భయము నుండి దశరథుని సంరక్షించెను."2

ఇదే ప. ఉ. ప్రతిలో మరోచోట "రాజు ఒక్కడే యుద్ధమునకు వెళ్ళి, శస్త్ర పరిక్షతుడైనను జయించి తిరిగి వచ్చెను కైకేయి అతనికి పరిచర్య చేసి గాయములను మాన్పెను రాజు సంతుష్టుడై రెండు వరముల నొసంగె"3నని కలదు.

---

1. అపవాహ్య త్వయాదేవి సంగ్రామాన్నష్ట చేతనః।
తత్రాఽపి విక్షతః శస్త్రైః పతిస్తే రక్షిత స్త్వయా॥
(దా. ప్రతి. రామా. అయోధ్యా. సర్గ 9 శ్లో. 16).

2. ప. ఉ. ప్రతి వాల్మీకి రామాయణము అయోధ్యా. సర్గ 11 శ్లో 48-54,
"మయా ప్రహసితో బాల్యే మూర్ఖ వేషోద్విజో త్తమః।
జీర్ణ వస్త్ర పరిచ్ఛన్నః శ్మశ్రుల స్తృణ భూషణః।
భస్మ భూషిత సర్వాంగో వృద్ధో హర్ష వశం గతః।
అవిజ్ఞాత కథాభాష శ్చేష్టాభి రన వస్థితః।
ప్రసన్నాత్మాహ విప్రస్స సస్మితాం మధురాం గిరం॥
ప్రీతో ఽస్మి నృపతేః కన్యే బ్రూహి కిం కరవాణితే।
స మయా ప్రహ్వయా భూత్వా బద్ధ్వా చాంజలికుట్మలం॥
ఉక్తో వాక్య మిదం కుబ్జే లజ్జయా ప్రగ ళితాక్షరం।
న కించిదహ మిచ్ఛామి కృత మేతావతా మమ॥
యన్మే క్రోధం పరిత్యజ్య ప్రసన్న స్త్వం ద్విజో త్తమ।
ఏవ ముక్తేన తు మయా తేన హర్షిత చేతసా।
మమాఽనుసృష్టా విద్యేయం బహుమానాన్మయాధృతా॥

3. ప. ఉ. ప్రతి అయోధ్యా, సర్గ, 11 శ్లో. 14-15.
తస్మిన్ మహతి సంగ్రామే రాజా శస్త్ర పరిక్షతః।
విజిత్యాభ్యాగతో దేవి త్వయో పచరిత స్స్వయం॥

ఇచట కైక దశరథుని వెంబడి పోయినట్లు స్పష్టపరచబడలేదు. ఇట్లొకే ప్రతిలో పై రెండు విధములైన వృత్తాంతము లుండుటచే ఇందులో నేది గ్రాహ్యమని సందేహము పొడమును.

ఇక అధ్యాత్మ రామాయణమునందు "దశరథుడు రాక్షసులతో యుద్ధము చేయుచుండ నతని రథాక్షకీల ఊడి పడిపోయెను. కైకేయి తన వ్రేలును చీల రంధ్రము నందుంచి చక్రము పడిపోకుండ కాపాడెను. పిదప మహారాజు స్థిరిని గాంచి, సంతసించి, కైకేయికి వరముల నొసంగె"[1] నని కలదు.

ఈ వృత్తాంతము "కైకేయి ధైర్యమే వర ప్రాప్తికి ప్రధాన కారణ"మని తెలుపుచున్నది. అయినచో కైక వ్రేలు చీలకంటే దృఢమెనదా? అను సందేహమునకు సమాధాన మిందు లభింపదు. ఆనంద రామాయణమున దీని కుత్తరము దొరకుచున్నది.

"కైకేయి బాల్యమున నొకానొక ముని ముఖమునకు మసి బూసి, శప్తురాలై, అతడు పోవుటకు సిద్ధముగా నున్నవేళ తన యెడమచేత అతనికి దండాదికములను భక్తితో నందించెను. అప్పుడా ద్విజోత్తముడు "నీ యెడమచేయి వజ్రముకంటే కఠినమై నాశము పొందకుండనుండగలదని" వర మొసంగెను."[2]

ఇచట ముని పేరు పేర్కొనబడలేదు.

ఇదే ఆనంద రామాయణముయొక్క మరొక పాఠములో "కేకయ గృహమున కొకనాడు ధవళాంగుడను ముని వచ్చెను. రాజు కైకేయి నతని పరిచర్యకై నియమించెను. ఆమె యతని కనేక విధముల సేవజేసి, పోవుటకు సిద్ధముగా నున్న యతనిని వరములిమ్మని వేడెను. అప్పుడతడు "నిన్ను చక్రవర్తి వివాహ మాడగలడు. ఎడమచేత నమస్కారము చేసిన కారణమున నా చేయి వజ్రముకంటే కఠినమై యుండగలదని వరముల నొసంగి, రాక్షసుల మాయను నశింపజేయు ప్రతిక్రియల నుపదేశించి ధవళాంగముని వెడలిపోయెను"[3] అని యున్నది.

ఈ వృత్తాంతము "కైకేయి వామకరము వజ్రముకంటే కఠినమగుటను, రాక్షస మాయా నివారణ శక్తి సామర్థ్యమును దెలుపుటకు సమర్థమై యున్నది.

వ్రణ సంరోపణం చాస్య తత్ర దేవి త్వయాకృతం।
పరితుష్టేన తే దత్తౌ వరౌ ద్వౌనను భామిని॥"

1. అధ్యాత్మ రామాయణము అయోధ్యా. సర్గ 2 శ్లో. 68, 69.
2. ఆనంద రామాయణము సారకాండము సర్గ 1 శ్లో. 82, 73.
3. లక్కావజ్జల వెంకట కృష్ణశాస్త్రి "ఆశ్చర్య రామాయణము" బాలకాండము సర్గ 7 పుట 170 లో ఉద్ధరింపబడినది.

"గంతు కామం మునిందృష్ట్వా వరం వవ్రేథ కైకయా।
తామువాచ ముని స్త్వాంతు చక్రవర్తీ పరిష్యతి॥
తవ వామకరం వజ్రాత్ కఠినం భవతి ధ్రువం।
యతస్త్వం వామహస్తేనాఽకరో ర్మమ నమస్కృతిః॥
ఇత్యుక్త్వా రక్షసాం మయా నాశినీశ్చ ప్రతిక్రియాః।
ఉపదిశ్య చ కైకేయ్యై గతవాన్ ధవళాంగకః॥

బుద్ధభూపతి "ధవళాంగముని వృత్తాంతమును ఆనంద రామాయణానుసారముగ గ్రహించెను. కాని "వామకర కాఠిన్యము, అక్షరంధ్రమున కీలమునకు బదులు వ్రేలును చొనుపుట" అను విషయములను పరిత్యజించెను.

ప. ఉ. ప్రతిలో " కైక బ్రాహ్మణుని ప్రహసించి అతని వలన విద్యాబల ప్రాప్తి నొంది, రాక్షసులకు దుష్ప్రధర్షణురాలై యుండి భర్తను రక్షించినట్లు" చెప్పబడినది కదా :

ఇచట "ప్రహసించి వరమును పొందినది" అనుటకంటె "సేవజేసి అనుగ్రహమును పొందినది" యనుట మర్యాదాన్వితము. "పేరులేని ముని" కంటె "పేరుగల ముని" ఆదరణీయుడు. "వామహస్తమున నమస్కరించుట" లోక శాస్త్ర విరుద్ధము; కేవల వామాచారమునకు సంబంధించినది. కావున కైకేయి వామహస్తమున నమస్కరించినను, లేక చండాలుల నందించినను ముని యనుగ్రహించినా డనుట లోకమున కిది సదుపదేశము, సదాచార బోధయు కాదు. ఎట్లు చేసినను పరవా లేదనెడి బుద్ధికి మూలమగును.

ఈ చర్చా ఫలిత మేమనగా, బుద్ధభూపతి "వామహస్త వృత్తాంతమును వదలి, పేరులేని మునికి (మూర్ఖవేశ ద్విజోత్తమునకు) ధవళాంగ నామమును మాత్రము చేర్చి ప. ఉ. ప్రతి రామాయణ వృత్తాంతమునకు మెరుగు పెట్టినాడనుట. ఈ విషయమును కైకేయి రామ పట్టాభిషేక భంగము గోరు మంథరతో దాని దుర్బోధవేళ చెప్పినట్లు మూలమునందు కలదు. దీనికంటె "ఎప్పుడో కైక మంథరకు దీనిని చెప్పినట్లును, కైకమీది అభిమానమున మంథర దానిని గుర్తుంచుకొని పట్టాభిషేక వేళ కైకకు దుర్బోధ చేయు నవసరమున గుర్తు చేసినట్లు వ్రాయుట ఎంతయు సముచితము. ఇది ప. ఉ. ప్రతి పాఠమున కిచ్చుట కవి చేసిన మార్పు. చూడుడు.

"........ మంథర చెప్పఁ దొడగెఁ
బడతుక తొల్లి శంబరుడు నింద్రుండు-దొడరి పోరాడ నింద్రునకునై పూని
నినుఁ దోడుకొని సైన్య నివహంబుఁ దాను-జని రాత్రి మార్కొన్న శంబరుతోడఁ
బోరాడ దశరథ భూపాలుమీద- నా రాక్షసుడు మాయ లలుకఁ బన్నుటయు
ధవళాంగుడను ముని దయ నీవు గన్న-నవిరళంబగు మాయ నా మాయలడచి
నీ విభు నాదైత్యు నిశితాస్త్రనిహతిఁ-జావకుండగఁ గాచి సంప్రీతుఁ జేసి
వసుధేశుచే రెండు వరములు నాడు-మసలక పడసితి మఱచితేవాని"[1]

రాక్షసుని మాయ లడచినందుకొక వరమును, రాజును రక్షించినందు కొక వరమును— ఈ రీతిగా రెండు వరములు వసుధేశు డొసంగినట్లు ధ్వనించుచున్నది,

భాస్కర రామాయణమునందును రంగనాథ రామాయణమున నున్నట్లే "ధవళాంగ ముని వృత్తాంతమే కలదు."[2] కాని "ఈ దశరథ శంబరుల యుద్ధము వైజయంత పురమున జరిగినట్లు

---

1. రంగనాథ రామాయణము అయోధ్యా. ద్వి. 190-196.
2. భాస్కర రామాయణము అయోధ్యా. వచనము 63.
"రాక్షసుం డనేక మాయలు గావింప నీవు ధవళాంగుడను ముని వలనం బడసిన మంత్ర విద్య చేత వానికిం బ్రతీకారంబు లొనర్చుటకు మెచ్చి నాడు నీకు రెండు వరంబు లిచ్చినాడు,"

మూలమున[1] నుండగా, జయంత పురమున జరిగినట్లు భాస్కర రామాయణమునందు కలదు. ఇది లేఖకుల పొరపాటు కానచ్చును. రంగనాథ రామాయణమునందు పురవర్ణనా ప్రస్తావమే లేదు.

20. రక్ష రేఖ :—

శ్రీరాముడు వనమున కేగు సమయమున కౌసల్యా మాత కుమారునికి స్వస్త్యయన మాచరించి, అరణ్యమునందు ఎవరి వలనను నెట్టి బాధ కలుగకుండుటకై

"పొలుపొంద వెల్పులఁ బూజించి రాము-వలచేత నొక రక్ష వలనొప్పఁ గట్టి"[2] దీవించినది.

డా॥ శ్రీ పల్లా దుర్గయ్యగారు "దీనిని అవాల్మీకమని వ్రాసియున్నారు. కాని కౌసల్యాదేవి విశల్యకరణియను ఓషధిని మంత్రములచే నభిమంత్రించి రామునికి రక్షకట్టినట్లు మూలమునందు నున్నది.

"ఓషధీం చాపి సిద్ధార్థాం విశల్యకరణీం శుభాం।
చకార రక్షాం కౌసల్యా మంత్రై రభి జజాపచ॥[4]

ఈశ్లోకమునకు "సిద్ధార్థాం దృష్టఫలాం విశల్యకరణీంచ అంతర్గత శల్య నిర్గమన కారిణీంచ, ఓషధీం మూలికాం, మంత్రై రభిమంత్ర్య,రక్షాంచకార రక్షా హేతుత్వేన హస్తే బబంధేత్యర్థః"[5] అని గోవిందరాజు వ్యాఖ్యానించి యున్నాడు.

సౌమిత్రికి రక్షరేఖగా "విశల్యకరణి"యను ఓషధి కట్టబడలేదు. కావుననే యుద్ధమునందు అతడు రావణేంద్రజిత్తులచే ప్రయోగింపబడిన బాణశక్తులచే మూర్ఛాక్రాంతుడు కాగా, వానిని విశల్యపరచుటకై యా యోషధి యవసరమయ్యెను. తదోషధ్యానయనార్థము సంజీవనీ పర్వతమునకు హనుమంతుడు వెళ్ళవలసి వచ్చినది.

ఇట్లు పూర్వాపర కథా దృష్టిచే పరిశీలించినను, "ఈ శ్లోకము"[6] ప్రక్షిప్తమని చెప్ప వలను పడదు. కావున "కౌసల్య శ్రీరామునకు రక్షరేఖ కట్టుట" అను విషయము రంగనాథ రామాయణమున క్రొత్తగా చేర్చబడినది కాదు; వాల్మీకము ననుసరించియే వ్రాయబడినది.

---

1 దా. ప్రతి. వాల్మీకి రామాయణము అయోధ్యా. సర్గ 9 శ్లో. 12.
"వైజయంత మితి ఖ్యాతం పురం యత్ర తిమిధ్వజః॥"

2. రంగనాథ రామాయణము అయోధ్యా. ద్వి. 568.

3. డా. పల్లా దుర్గయ్య "ప్రబంధ వాఙ్మయ వికాసము" సం. 1 పుట. 169.
"శ్రీరాముడు వనవాసమున కేగు సమయమునఁ గౌసల్య యతనికి రక్షరేఖ కట్టుట............ అనునవి రంగనాథ రామాయణమున క్రొత్తగాఁ జేర్చబడినవి,"

4. దా. ప్ర వాల్మీకి రామాయణము అయోధ్యా. సర్గ 26 శ్లో. 38 1/2.

5. ,, ,, ,, గోవిందరాజీయ వ్యాఖ్య.

6. కౌసల్య శ్రీరామునికి రక్షరేఖ కట్టినదని తెలుపు శ్లోకము.
దా. ప్రతి వాల్మీకి రామా. అయోధ్యా. సర్గ 25 శ్లో. 38 1/2.

21. చిత్రకూటాద్రిపై శ్రీరామ వాల్మీకి సమాగమము—

శ్రీరాముడు సీతాలక్ష్మణులతో గూడి చిత్రకూట పర్వతమును జేరి వాల్మీకిముని యాశ్రమమునకు చని నమస్కరించెను. వాల్మీకి యధికముగా సంతసించి, వారికి స్వాగతముపలికి యథావిధిగా పూజించెను.

"ఈ శ్రీరామ వాల్మీకి సమాగమ వృత్తాంతము దా. ప్రతి రామాయణములో నున్నది.[1]

ఈ వృత్తాంతము వలన శ్రీరామ వనవాస సమయమున 'వాల్మీకి వాసస్థానము చిత్రకూట'మని విదితమగు చున్నది. కాని బాల కాండమందలి " రామాయణ కథోత్పత్తి గాథ ననుసరించి వాల్మీకి నివాసము తమసానదికి దక్షిణ భాగమునను, ఉత్తరకాండములోని సీతాపరిత్యాగ ఘట్టము ననుసరించి గంగా సమీపమునను నున్నట్లు తలంపబడుచున్నది. ఇట్లు రామాయణమునందే వాల్మీకి వాసస్థానము పరస్పర భిన్నముగా నిర్దేశింప బడినది. వీనికి సమన్వయమెట్లు కుదురును? అను ప్రశ్న పొడమును.

ఇక. సీతారామ లక్ష్మణులు చిత్రకూటముపై వాల్మీకిని దర్శించినట్లు శ్లోకములు గౌడీయ పశ్చిమోత్తర శాఖీయ ప్రతులలో కనిపించవు. అందువలన కొందరు వీనిని ప్రక్షిప్తముగా భావింప వచ్చును. కాని గోవిందరాజాది వ్యాఖ్యాతలు కొందరు ఈ శ్లోకములను రామాయణస్థములుగానె తలంచి పరస్పర భిన్నస్థల నివాస సమన్వయము నిట్లు చేసి యున్నారు.

"భరతుడు శ్రీరామ పాదుకలను గ్రహించి అయోధ్యకరిగిన తర్వాత 'చిత్రకూట పర్వత మందలి ఋషులెల్లరు రాక్షసులు పెట్టుబాధలను శ్రీరామునకు విన్నవించి రక్షించుమని ప్రార్థించి వెడలిపోయిరి."[2] వారితో గూడ వాల్మీకి చిత్రకూట పర్వతమును త్యజించి తమసానదీ ప్రాంతమునకేగి యచట నివసింప మొదలిడెను. కావున బాలకాండమునందు చెప్పబడిన వాల్మీకి తమసా తీర నివాసము ఈ చిత్రకూట నివాసముతో విరోధించదు."[3]

తమసానది గంగానదికుపనది. వాల్మీక్యాశ్రమము గంగానదికి సమీపమున తమస యొడ్డున నున్నట్లు అదే రామాయణ కథోత్పత్తి ఘట్టమునందలి

"జగామ తమసాతీరం జాహ్నవ్యాస్త్వవిదూరతః।"[4]

అను శ్లోక పాదమున చెప్పబడుట చేత 'గంగాతీరమున నతని యాశ్రమము గలద'నెడి ఉత్తర కాండకథ యందును అసామంజస్య మేదియు లేదు.

---

1. దా. ప్రతి. వాల్మీకి రామా. అయోధ్యా. సర్గ 56 శ్లో. 16,17,18.
2. దా. ప్రతి రామాయణము. అయోధ్యా. సర్గ.117. శ్లో. 1.
   "రాఘవస్త్వథయాతేషు తపస్విషు విచింతయన్।
   నతత్రారోచయద్వాసం కారణైర్బహుభిస్తదా॥"
3. గోవిందరాజీయవ్యాఖ్య. దా. ప్రతి. రామా. అయోధ్యా. సర్గ. 56, శ్లో. 16,17
   తదానీం చిత్రకూటే వాల్మీకేర్వాసః। భరతగమనానంతర మృషి నిర్గమన కథానాత్తతః ప్రభృతి తమసాతీర ఇతిజ్ఞేయం। అతోన బాలకాండ కథా విరోధః।
4. దా. ప్రతి. వాల్మీకి రామాయణ. బాల. సర్గ.2 శ్లో. 3.

వాల్మీకి మొదట చిత్రకూట పర్వతముపై వసించి, తరువాత మునులతో కూడ తానును విడిచి పోయిగంగకు దగ్గరగా తమసానది యొడ్డున వాసమేర్పరచుకొనెనని పరస్పర విరుద్ధ ఘట్టముల నిట్లు ఏకసూత్రమున బంధించి సమన్వయింప వచ్చును.

రంగనాథరామాయణమునందు 'శ్రీరాముడు వాల్మీకిని దర్శించినట్లు ప్రత్యేకముగా జెప్పబడలేదు.

సలలిత తరులతా సానుకూలములు-చెలువు దీపించిన చిత్రకూటాద్రిం

గని యెక్కి యందున్న ఘన తపోధనులం-గని మ్రొక్కి మిగుల సత్కారముల్ వడసి"[1]

అని మునులు సామాన్యముగా నిర్దేశింపబడిరి. "భాస్కర రామాయణమునందును నిట్లే యున్నది."[2]

అధ్యాత్మ రామాయణమునందు "శ్రీరాముడు చిత్రకూటగిరి నున్న వాల్మీకిని దర్శించి, నమస్కరించి, తాము నివసింపదగిన చోటును చూపుడని ప్రార్థింపగా, వాల్మీకియు శ్రీరాముని స్తుతించి, పూర్వము కిరాతుడుగా నుండి సప్తర్షుల వలన రామ మంత్రోపదేశము నొంది, తప మాచరించి వాల్మీకియైన తన వృత్తాంతమును దెలిపి, శిష్యులద్వారా పర్ణశాలను నిర్మింపజేసెన"[3]ని కలదు.

ఆనంద రామాయణమునందును "శ్రీరామాదులు వాల్మీకిని దర్శించినట్లు"[4] చెప్పబడినది.

ఇట్లు దా. ప్రతి రామాయణములోను, అధ్యాత్మానంద రామాయణములలోను నున్న శ్రీరామ వాల్మీకి సమాగమ వృత్తాంతమును బుద్ధభూపతి తన గ్రంథమున గ్రహింపకపోవుటలో నీ క్రిందివి కారణములు కావచ్చును.

1. అన్ని ప్రతులలో లేకపోవుట. అనగా దా. ప్రతిలోనుండి ఉదీచ్య ప్రతులలో లేకపోవుట.

2. బాలకాండ అయోధ్యాకాండములలో వాల్మీకి వాస స్థానము పరస్పర భిన్నముగా నిర్దేశింపబడుట.

3. ఇతర ఋషిశ్వాసులతోం గూడ వాల్మీకియు చిత్రకూటమును విడిచి తమసా ప్రాంతమునకు వలస పోయినాడని ప్రత్యేకముగా చెప్పబడకుండుట.

4. (ఇతడు చిత్రకూటమును వదలి తమసా ప్రాంతమునకు పోయినట్లు) కేవలము వ్యాఖ్యాతలు చేయు సమన్వయము మాత్రమై యుండుట,

5. తపస్సంపన్నుడైన వాల్మీకి మహాముని చిత్రకూటముపై స్వయముగా సీతారాములను జూచియు, రామభరత సమాగమ సందర్భమున ఇతరమునులతోపాటు తానును సభయందుండి రాముని

1. రంగనాథ రామాయణము. అయోధ్యా ద్వి 1137, 1138.
2 భాస్కర రామాయణము. అయోధ్యా. పద్య. 290.
3. అధ్యాత్మ రామాయణము. అయోధ్యా. సర్గ 6 శ్లో. 43-92.
4. ఆనంద రామాయణము. సారకాండము సర్గ 6 శ్లో. 82.
"వాల్మీకే రాశ్రమం గత్వా తస్థౌతేనాతి పూజితః॥"

గుణగణ శీలములను గ్రహించియు, తన యొద్దకు వచ్చిన నారద మునీంద్రుని

"కోన్వస్మిన్ సాంప్రతం లోకే గుణవాన్ కశ్చ వీర్యవాన్"[1]

అని మొదలైన ప్రశ్నలు వేయుట యేల? నని తలంచుట.

ఈ పై కారణములచే బుద్ధభూపతి "చిత్రకూటాద్రిపై శ్రీరామ వాల్మీకి సమాగమమును ప్రత్యేకముగా తెలుపక వదలివేసి, ఘన తపోధనులను గని మ్రొక్కి"నట్లు సాధారణముగా నిర్దేశించి పాఠకులు సందేహింపకుండ నొనర్చినాడు. ఇది అతనియొక్క ఔచిత్యవంతమైన సంగ్రహ రచన కుదాహరణము.

22. యజ్ఞదత్త ముని కుమారుని వృత్తాంతము :—

దశరథుడు యువరాజుగా నున్నప్పు డొకనాడు వర్షా ప్రారంభవేళ అడవికి వేటకుబోయి. శబ్దవేధి పరిజ్ఞాన గర్వముచే నడురేయి సరయువు పొంత వన్యమృగాగమనమునకై శర చాపములు పూని కాచుకొని యుండెను అంతట "నీటికై కలశమును ముంపగా మ్రోగెడి గుటగుట ధ్వనిని" విని ఏనుగని భ్రమసి బాణమును ప్రయోగించి యొక ముని కుమారుని హతమార్చెను. అతని యార్త ధ్వని విని, బాలుని సమీపించి, వృత్తాంతము నెఱింగి, అంధులైన, వృద్ధులైన యతని తలిదండ్రులను సమీపించి తన తప్పును దెలిపి మన్నింపుడని ప్రార్థించెను. ఆ వానప్రస్థులు పుత్ర దుఃఖముతో మరణించుచు, "నీవును మావలె పుత్ర దుఃఖముతో ప్రాణములను విడుతు" వని శపించిరి.

ఇది ముని కుమారుని వృత్తాంతము. దా. ప్రతి రామాయణమున నీతని పేరు చెప్పబడలేదు. "శ్రవణకుమారుడని" జన ప్రసిద్ధి గలదు. కాని రంగనాథ రామాయణమున నితని పేరు యజ్ఞదత్తుడని"[2] పేర్కొనబడినది.

భాస్కర రామాయణమునందును ఇతని పేరు "యజ్ఞదత్తుడ"నియే[3] యున్నది.

ఆనంద రామాయణమునందు-

"కరండస్థౌ స్వపితరౌ స్వస్కంధే శ్రవణోవహన్।[4]

---

1. a) దా. ప్రతి రామాయణము. బాలకాండము. సర్గ 1 శ్లో. 2

b) రంగనాథ రామాయణమున దీనికి అనువాదము

"ఎవ్వడు శ్రీమంతు డెవ్వడు శాంతుడు" మొదలుగా గలది.

2. a) "తనియక కాపున్న తజ్ఞి యజ్ఞదత్తుడను నొక్క మునిపుత్రు డమ్మహానదికి"

(అయోధ్యా. ద్వి. 1202)

b) ఓ విమలాత్మక యో యజ్ఞదత్త-యో విశ్రుతాచార యో ధర్మనిపుణ"

(అయోధ్యా. ద్వి. 1291)

3. భాస్కర రామాయణము అయోధ్యా. వచనము 339. మరియు 347.

"తల్లియుల్లం బెఱియ నెలుంగెత్తి "హా యజ్ఞదత్తా" యనుచుం దనూజుం బేర్కొని".

" యజ్ఞదత్తుండును నొక్క దివ్య విమానం బెక్కి."

4. ఆనంద రామాయణము. సారకాండము. సర్గ 1 శ్లో. 88.

"పపాత శ్రవణస్తోయే హా కేనాహం ప్రతాడితః॥1"

అనెడ శ్లోక పాదములందు "శ్రవణః" అని స్పష్టముగా చెప్పబడినందునను, ముని కుమారుడు "శ్రవణ కుమారుడ"ని జన ప్రసిద్ధి యేర్పడినది. కావున కొందఱు "యజ్ఞదత్తు డనునది రంగనాథ రామాయణ కర్త కల్పనము. భాస్కర రామాయణకర్త దీనిని సంగ్రహించినా"డని[2] చెప్పుచున్నారు. కాని పశ్చిమోత్తర శాఖీయ వాల్మీకి రామాయణ ప్రతిని పరిశీలింపగా ఈ ముని పుత్రుని నామము నిజముగా "యజ్ఞదత్తు"డనియే స్పష్టమగుచున్నది. చూడుడు.

దశరథుని యడుగుల యలికిడి విని మునికుమారుని తండ్రి—

"యజ్ఞదత్త చిరంతాత పానీయే క్రీడితం త్వయా।
ఉత్కంఠితా తే మాతేయం తథాహమపి పుత్రక॥"[3]

అని కుమారుని పిలిచినాడు. దీనికి పాఠాంతరముగా దాక్షిణాత్య ప్రతిలో నున్న శ్లోకమునందు[4] ఈ పేరు లేదు.

ఇక, ముని పత్ని కుమారుని మరణమునకు దుఃఖించుచు

"నన్వహంతే యజ్ఞదత్త ప్రాణేభ్యోపి ప్రియావిభో।
స కథం దీర్ఘ మధ్వానం ప్రస్థితో మాం నభాషసే॥"[5]

అని యజ్ఞదత్త నామోచ్చారణముతో ప్రలాపించినది.

ఈ శ్లోకముకాని, దీనికి పాఠాంతర శ్లోకముకాని దాక్షిణాత్య ప్రతిలో లేదు.

క్షేమేంద్రకృత రామాయణ మంజరియందును ముని కుమారుడు యజ్ఞదత్తుడుగా పేర్కొనబడినాడు.[6]

కావున ఈ యాధారములచే "మునికుమారుడు యజ్ఞదత్త నామధేయుడనుట వాల్మీకి మతమే కాని రచయిత కల్పనము కాదు. మొదట అతడు యజ్ఞదత్తుడు. పిదప నతడు శ్రవణకుమార ప్రసిద్ధి నొందినట్లు చెప్పవచ్చును.

"శ్రవణః-శృణోతీతి శ్రవణః" అను వ్యుత్పత్తిచే శ్రవణ శబ్ద మేర్పడును. ఇతని తలిదండ్రులు అంధులు; వృద్ధులును. వారి కాధారము ఈ బాలకుడే. వారేది చెప్పినను వినువాడు

---

1. ఆనంద రామాయణము. సారకాండము సర్గ 1 శ్లో. 92.
2. పండా శమంతకమణి. తెలుగు సాహిత్యములో రామకథ. పుట-174.
3. ప. ఉ. ప్రతి రామాయణము. అయోధ్యా. సర్గ 70 శ్లో. 6.
4. దా. ప్రతి వాల్మీకి రామాయణము. అయోధ్యా సర్గ 64 శ్లో. 8.
"యన్నిమిత్త మిదం తాత సలిలే క్రీడితం త్వయా।
ఉత్కంఠితా తే మాతేయం ప్రవిశ క్షిప్రమాశ్రమం॥"
5. ప. ఉ. ప్రతి వాల్మీకి రామాయణము. అయోధ్యా. సర్గ 71 శ్లో. 28.
6. "ఏహ్యేహి యజ్ఞదత్తాస్మత్పాణి సంగేన సంస్పృశ।
నకోపితః కదాచిత్త్వం చిరేణ కథమాగతః॥
(క్షేమేంద్రుడు-రామాయణ కథామంజరి అయోధ్యా. శ్లో. 957)

(చెప్పినట్లు చేయువాడు); అంతటి పితృభక్తి కలవాడు. కావున అతని శీలద్యోతకముగా తరువాత నేర్పడిన నామము శ్రవణుడు. ఇది మొదటి పేరును మరుగునకు ద్రోసినది. కార్య గౌరవమున వచ్చిన బిరుదు పేరే తరువాత ప్రచలితమై ప్రసిద్ధమగుట సహజము. అందుచేత శ్రవణకుమారు డను పేరే జన వ్యవహారమున నలిగి ఆనందాది రామాయణములందు గ్రహింపబడినదని భావించవచ్చును. లేదా ముని కుమారుని నడవడిని ప్రతిబింబింపజేయు శ్రవణుడను పేరే ఆనంద రామాయణాదులందు చెప్పబడి జన వ్యవహారమున ప్రసిద్ధియైనదనియు తలంపవచ్చును. ఎట్లు చెప్పినను, ముని కుమారుని మొదటి పేరు మాత్రము యజ్ఞదత్తుడు. అదియే బుద్ధభూపతి మొదలగు వారిచే తమ గ్రంథములందు స్వీకరింపబడినది, కావున నిది అవాల్మీకము కాదు.

(2) ఇక, రంగనాథ రామాయణమున ముని దంపతుల నివాస స్థానమును గూర్చి మూల భిన్నములైన ద్విపదలు కానిపించుచున్నవి.

"భూపాల యీ కొండ పొంత పశ్చిమపు-గోపున నొక మఱ్ఱి కొమరొందుచుండు
నా వటవృక్ష కోటరమందు రేయి-కావడి ఘటియించి కడు సంతసమున
గురుతుగా నేను నా గురుల నందుంచి-యరసి పోషణ సేయ నందున్నవారు,"[1]

అని ముని కుమారుడు దశరథునకు తన తలిదండ్రుల నివాసము గుర్తు చెప్పెను. అట్లే దశరథుడు పోయి

"చెట్టెక్కి కావడి శీఘ్రంబ డించి-యట్టిట్టు వడకుచు నతి దీన వృత్తి"[2]

నుండి విషయమును చెప్పుదునా? వలదా? అని తడబాటుతో నూహించుచుండెను.

ఈ ద్విపదల వలన "ముని కుమారుడు తన తండ్రిని తల్లిని ఒకానొక కావడి యందుంచి వలసిన చోటికి మోసికొనిపోవుచు, రాత్రియందు మఱ్ఱి తొఱ్ఱ యందుంచి కాపాడుచునుండెను." అని తెలియుచున్నది.

వాల్మీకము నందిట్లు లేదు—

"ఇయ మేక పదీ రాజన్ (యాతు) యతో మేపితురాశ్రమః।
తం ప్రసాదయ గత్వాత్వం నత్వాం సకుపితః శపేత్॥"[3]

అని ముని కుమారుడు దశరథునితో చెప్పగా, దశరథుడు

"తత స్తం ఘటమాదాయ పూర్ణం పరమవారిణా।
ఆశ్రమం తమహం ప్రాప్య యథాఽఽఖ్యాత పథంగతః॥"[4]

అట్లే పోయినాడు. ఇచట కేవలము "ఆశ్రమము" అని మాత్రమే చెప్పబడినది; కావడి కాని, వటవృక్ష కోటర నివాసము కాని ప్రస్తావింపబడలేదు.

---

1. రంగనాథ రామాయణము అయోధ్యా. ద్వి. 1245-1247.
2. ,, ,, అయోధ్యా ద్వి. 1264.
3. దా. ప్రతి వాల్మీకి రామాయణము. అయోధ్యా. సర్గ 63, శ్లో. 44 1/2.
4. ,, ,, అయోధ్యా. సర్గ 64 శ్లో. 3.

ఆనంద రామాయణమునందు "కావడి" ప్రస్తావన వచ్చినది; కాని "మఱ్ఱి తొఱ్ఱయందు నడురేయినుంచి కాపాడుట" అను విషయము లేదు "[1]

రాత్రులందు క్రూర మృగ భయ మరణ్యమునందుండుట సహజము. ఎంతటి వారైనను రాత్రియందు నిదురించుటయు ప్రకృతి సిద్ధము. తాను నిద్రించినపుడు, క్రిందనుంచిన, అంధులైన, వృద్ధులైన తలిదండ్రులను ఏ క్రూరమృగమో వాత వేసికొనిపోవచ్చును. కావున వారు క్షేమముగా నుండవలెనన్న, మృగముల కందని రీతి ఎత్తయిన స్థానమున నివాస మేర్పరచవలెను. వృక్షములే గదా అట్టి సౌకర్యమునకు తగినది కావున ఆనంద రామాయణమందలి ఈ కరండస్థ విషయమును గ్రహించి, చక్కని కల్పనతో బుద్ధారెడ్డి ఈ ద్విపదలు వ్రాసినాడనవచ్చును.

కాని పరిశీలింపగా ఈ ద్విపద పంక్తులు ప్రక్షిప్తములని తోచుచున్నది.

"ఆ వటవృక్ష కోటరమందు రేయి

అను పాదమున యతి భంగ మేర్పడినది అందుకే కాబోలు, ఆంధ్ర విశ్వకళా పరిషత్తువారి ప్రచురణ మూలపాఠమునుండి ఈ ద్విపదలు తొలగింపబడినవి. వీనికి రచనాంతరమని ఈ క్రింది ద్విపదలు-

"ఈ కొండ పడుమర నీకొండ క్రేవ-వాక పట్టున నొక వృక్షమందు

సమ్మదంబునం బర్ణశాల గావించి-యొమ్మిక గురుల నందుంచిన వాడ"[2]

అనునవి అనుబంధము 2 లో చేర్చబడినవి. (అనగా నివి కొన్ని వ్రాత ప్రతులలో వారికి కనిపించినవి).

ఈ ద్విపదలయందు "కావడి, కరండముల" ప్రసక్తే లేదు. ఇవి సలక్షణముగా, మూలమునకు చాల దగ్గరగా. ఔచిత్యవంతముగా నున్నవి కళాత్మక దృష్టిచే చూచినప్పుడు తలిదండ్రుల కావడి మోయు శ్రవణకుమారుని పితృభక్తియే మనస్సు నలరింపజేయును.

3) ఈ ముని కుమారుని జన్మ నిర్ణయమందును పాఠ భేదము పొడగట్టుచున్నది.

దా. ప్రతి పాఠములో యజ్ఞదత్తుడు "శూద్ర స్త్రీకి వైశ్యుని వలన జనించిన వాడ"[3]నియు,

---

1. ఆనంద రామాయణము. సారకాండ సర్గ 1 శ్లో. 87-90.
"ఏతస్మిన్నంతరే తత్ర వనే వారాణసీ పథా।
కరండస్థౌ స్వపితరౌ స్వస్కంధే శ్రవణోవహన్॥
కాశీం నేతుం యయౌ వైశ్యో ఘర్మబాధా భయాన్నిశి।
నీరం పాతుం శిశోర్దేహి చావయో శ్చేతి ప్రార్థితః।
తాభ్యాం కరండకేన్యస్య తటాకే జలసన్నిధౌ.
గత్వాజలే స్వయంకుంభం న్యుబ్జం తస్థౌజలేక్షణం॥"

2. రంగనాథ రామాయణము. అనుబంధము 2 పుట - 703,
(ఆంధ్ర విశ్వ కళాపరిషత్తు ప్రచురణము)

3. దా. ప్రతి రామాయణము అయోధ్యా. 64 శ్లో. 50 1/2.
"న ద్విజాతి రహం రాజన్ మాభూత్తే మనసో వ్యథా।
శూద్రాయామస్మి వైశ్యేన జాతో జనపదాధిప॥"

ప. ఉ. ప్రతి పాఠములో "శూద్ర స్త్రీకి బ్రాహ్మణుని వలన జనించినాడ"[1]నియు తెలుపబడినది.

రంగనాథ రామాయణ కర్త ఈ విషయమునందు-

"ఏను బ్రాహ్మణుడఁగా, నెలమి వైశ్యునకు-భూనాథ శూద్రకుఁ బుట్టినవాడ"

నటుగాన నిది బ్రహ్మ హత్యయు గాదు."[2]

అని దాక్షిణాత్య పాఠమునే అనుసరించినాడు.

అధ్యాత్మ రామాయణములోను,[3] ఆనంద రామాయణము[4]లోను ముని కుమారుడు వైశ్యుడుగానే చెప్పబడినాడు.

క్షేత్ర బీజములలో బీజమునకే అధిక ప్రాధాన్యముండును. కావున బ్రాహ్మణ బీజ సంభూతుడు కొంతవరకైనను బ్రాహ్మణుడు కావలసి వచ్చును. అతనిని చంపినను బ్రహ్మ హత్య సంభవించును. కాని ఇచ్చట "రాజా! నీకు బ్రహ్మహత్య సంభవింప"దని స్పష్టముగా చెప్పబడినది. అట్టిచో ప. ఉ. ప్రతి పాఠమును గ్రహించిన, శంకకు తర్కమునకు నవకాశ మేర్పడును. ఆ శంకాతర్కముల కవకాశము కలిగించకుండ, బుద్ధభూపతి ఇతర రామాయణములతో సరిపోలుచున్న దా. పాఠమునే గ్రహించినాడు. ఇదియే సమంజసము కూడ.

4) రంగనాథ రామాయణమునందు మునిపత్ని శోకము 8 ద్విపదలలో హృదయ ద్రావకముగా వర్ణింపబడినది[5]

కుమారి పండా శమంతకమణిగారు "ఇప్పట్టున వాల్మీకి రామాయణము మహర్షి శోకమును వర్ణించగా రంగనాథ రామాయణము మునిపత్ని శోకమును వివరించుట మరియొక విశేషము"[6]గా తెలియఁజేసినారు. ఇది అవాల్మీకమని ఆమె యభిప్రాయము.

దా. ప్రతి రామాయణమునం దీ మాతృశోకము వర్ణింపబడని మాట నిజమే; కాని, అవాల్మీకము కాదు. ప. ఉ. ప్రతి వాల్మీకి రామాయణమున ఈ క్రింది శ్లోకములందు మాతృవిలాప వర్ణనము గలదు. చూడుడు-

"మాతా చాస్య మృతస్యాపి జిహ్వయా లిహ్యతీముఖం।
విలలాపాతి కరుణం గౌర్వివత్సేవ విహ్వలా॥

---

1. ప. ఉ. ప్రతి రామాయణము అయోధ్యా. సర్గ. 69 శ్లో. 43 1/2.
"బ్రాహ్మణేన త్వహం జాతః శూద్రాయాం వసతో వనే"।
2. రంగనాథ రామాయణము. అయోధ్యా. ద్వి. 1239-1240.
3. అధ్యాత్మ రామాయణము అయోధ్యా. సర్గ 7 శ్లో. 27.
"బ్రహ్మహత్యా స్పృశేన్నత్వాం వైశ్యోఽహం తపసి స్థితః।
4. ఆనంద రామాయణము సారకాండ. సర్గ 1 శ్లో. 91.
"వైశ్యం రాజా ద్విపం మత్వా వివ్యాధన పతత్రిణా।"
5. రంగనాథ రామాయణము. అయోధ్యా. ద్వి. 1289-1298.
6. పండా శమంతకమణి- "తెలుగు సాహిత్యములో రామకథ," పుట-174.

నన్వహంతే యజ్ఞదత్త ప్రాణేభ్యోఽపి ప్రియావిభో।
స కథం దీర్ఘ మధ్వానం ప్రస్థితో మాం నభాషసే।
సంపరిష్వజ్య తావన్మాం పశ్చాత్పుత్ర గమిష్యసి।
కిం వత్స కుపితోమేఽసి యేన మాం నాభిభాషసే।
అనంతరం పితాచాస్య గాత్రాణ్యంతః పరిస్పృశన్॥"[1]

బుద్ధభూపతి ఈ శ్లోక భావములను గ్రహించి, కరుణరస పుష్టికై ఔచిత్యమును పురస్కరించుకొని కొంత పెంచి మాతృవిలాపమును వర్ణించినాడు. అంతేకాని, వాల్మీకమున మునిపత్ని శోకము వివరింపబడలేదనుట పరిశీలనము లేనిమాట. ఇదివరకు చెప్పినట్లు, కవి కాలమున ఎట్టి ప్రతు లందుబాటులో నుండెడివో, అత డేయే ప్రతుఁను పరిశీలించి వ్రాసినాడో ఈనాడు మనము చెప్పలేము. కావున శక్తికొలది విభిన్న ప్రతులను సంపాదించి, వానితో రంగనాథ రామాయణమును పోల్చి, ఏది అవాల్మీకమో నిర్ణయింపవలెను, కాని ఒక్క ప్రతిని మాత్రమే చూచి, అందు లేనివాని నవాల్మీకము లని నిశ్చయించుట తొందరపాటు కాగలదు.

ఇట్టి ఒకటి రెండు సామ్య వైషమ్యముల చర్చ అంత సారవంతమైనది కాదు. ఈ వృత్తాంతముచే మహత్తరమైన సదుపదేశ మొకటి బోధింపబడుచున్నది. అదియే సంసారగతుడైన మానవుని కతి ముఖ్యమైనది.

నరుడు శుభాశుభ కర్మముల నాచరించును. అవి జ్ఞాతములు కావచ్చును; అజ్ఞాతములును కావచ్చును. బుద్ధిపూర్వకముగాను, లేక అబుద్ధిపూర్వకముగాను ఆ కర్మ లాచరింపబడవచ్చును. కాలాంతరమున పక్వ దశకు వచ్చినపుడు ప్రతి కర్మమునకు ఫలిత మేర్పడును. మానవు డా కర్మల సుఖదుఃఖ ఫలముల ననుభవింపవలసినదే; తప్పదు. దీనికి

"అవశ్య మనుభోక్తవ్యం కృతం కర్మ శుభాశుభం"

అనెడి ఆభాణకమును,

"యదాచరతి కల్యాణి శుభం వా యది వాశుభం।
తదేవ లభతే భద్రే కర్తా కర్మజ మాత్మనః"[2]

అని దశరథుడు అనుభవ పూర్వకముగా పలికిన మాటలును, దీని ననుసరించియే చక్కగా వ్రాసియున్న

"దైవంబులకు నైనఁ దమ కర్మఫలము-భావించి కుడువక పాయరాదెందు"[3]

అనెడి రంగనాథ రామాయణ ద్విపదలును లక్షణవంతములు. ఇందులకు ముని కుమారుని కథ లక్ష్యము.

---

1. ప. ఉ ప్రతి వాల్మీకి రామాయణము అయోధ్యా. సర్గ 70 శ్లో. 28-31.
2. దా. ప్రతి రామాయణము. అయోధ్యా. సర్గ 63 శ్లో. 6.
   దీనికి ప. ఉ. ప్రతి రామాయణములోని శ్లోకము.
   "యదాచరతి కల్యాణి నరః కర్మ శుభాశుభం।
   సోఽవశ్యం ఫలమాప్నోతి తస్య కాలక్రమాగతం॥ (సర్గ 69 శ్లో. 5)
3. రంగనాథ రామాయణము. అయోధ్యా. ద్వి. 1195.

బాల్యమున అబుద్ధిపూర్వకముగా, అజ్ఞాతముగా దశరథుడు ముని కుమారుని సంహరించినాడు; తరువాత దానిని మరచిపోయినాడు. అప్పటి కతనికి వివాహమే కాలేదుగదా! కొన్ని వేల యేండ్ల తరువాత కైకేయి వర మిషచే పుత్ర వియోగము సంభవించి, మరణ మాసన్నమైనది. అప్పు డీతనికి బాల్య వృత్తాంతము జ్ఞప్తికి వచ్చినది.

జంతు (నర) జీవితము కర్మ ప్రధానము. సదసత్ కర్మల వలన సుఖదుఃఖములు కలుగును, కావున "సత్కర్మల నాచరింపవలె" ననెడిదే ఈ కథ వలని మహత్తరోపదేశము.

23. కాక వృత్తాంతము :—

"కాకాసురుడు సీతాస్తనమును జీరిన వృత్తాంతము సీత హనుమంతుని ద్వారా శ్రీరామునికి పంపిన సందేశమున మాత్రము వాల్మీకి ప్రకాశింపజేసెను"[1] అని కుమారి పండా శమంతకమణి యొకచోట వ్రాసి, అదే గ్రంథమునందు మరోచోట "అవాల్మీకమైన కాకాసుర వృత్తాంతమును పెక్కు రామాయణములు స్వీకరించినవి."[2] అని వ్రాయుట స్వవచో వ్యాఘాతము చేయుటగా నున్నది. ఇంకను ఈమె "రంగనాథ భాస్కర రామాయణములందట్లుగాక అయోధ్యాకాండము సుందరకాండములందు కూడ పేర్కొనబడెను."[3] అని వ్రాయుట రామాయణ ప్రతులను సరిగా చూడకుండ వ్రాయుట.

రామాయణమునందిది ఎచ్చట వచ్చినను వాల్మీకమగునే కాని అవాల్మీక మనబడదు. సుందర కాండము 38 వ సర్గలో ఈ కాక వృత్తాంతము సీతాదేవిద్వారా ఆంజనేయునికి అభిజ్ఞానార్థమై ప్రకటించబడినది; 67 వ సర్గలో- లంకనుండి తిరిగివచ్చిన హనుమంతుడు శ్రీరామునకు సీతాదేవి కుశలమును దెలుపుచు ఆనవాలుకై దీనిని పునరుక్తము చేసినాడు.

పవమానసుతుడు సీతాదేవిని చూచివచ్చి యథార్థమే పలుకుచున్నాడని శ్రీరామచంద్రుడు నమ్మవలెను. ఆ నమ్మికకై కేవలము సీతారాములకు మాత్రమే తెలిసిన, అన్యుల కపరిచితమైన రహస్య వృత్తాంత మొకటి కావలెను. కావున సీతామాత ఆంజనేయుని కోరికపై ఈ వాయస వృత్తాంతము నాతనికి అభిజ్ఞానార్థముగా వినిపించినది. కావున సుందరకాండలో సీతా సుందరిచే నిది చెప్పబడుట నెంతయో సుందరమైనది.

అయోధ్యా కాండలో - చిత్రకూటాద్రిపై సీతారాముల యేకాంతమునందు ఘటించిన ఈ వాయస వృత్తాంతమును వాల్మీకి మహాముని అచ్చట వెంటనే చెప్పక, ఎంతయో సంయమనమును బూని, మనసులోనే దాచుకొని, సుందరకాండలో- ఆంజనేయుని కభిజ్ఞాన మొసంగువేళ సీతాదేవిచే ప్రకటింపజేసెను. వాల్మీకి ప్రతిభా పాటవమునకు, అతని కవితా నైపుణ్యమునకు ఈ యొక్క నిదర్శనము చాలును.

కొన్ని దాక్షిణాత్య ప్రతులలో అయోధ్యాకాండమునందు 95 వ సర్గ తర్వాత అధిక పాఠ సర్గ యొకటి కలదు. అధిక పాఠమనుటచే ఇది ప్రక్షిప్తమని తత్పూర్వ పరిష్కర్తల యభిప్రా

1. "తెలుగు సాహిత్యములో రామకథ" పుట. 177
2. పండా శమంతకమణి "తెలుగు సాహిత్యములో రామకథ" పుట. 401.
3. ,, ,, పుటలు 177, 178.

యము. ఈ అధిక పాఠ సర్గలో చెప్పబడిన కాక వృత్తాంతమునకు, సుందరకాండలోని దానికిని ఈషద్భేదము కనబడుచున్నది.

"గిరి వన విహారానంతరము సీతారాములు లక్ష్మణుడు సిద్ధపఱచిన మాంసమును భుజించిరి. పిదప శ్రీరాముడు సీతాదేవి తొడపై నిదురించెను. ఆమె పతి యానతిపై మిగిలిన మాంస ఖండములను కాకులకు వేయుచుండెను. తన్మాంస ఖండములకై వచ్చిన కాకులలో నొకటి సీతా స్తన మాంస లోలుపయై, ఎంత వారించినను తొలగిపోక ఆమె వక్షోజమును ముక్కుతో పొడువసాగెను."1

ఆ తర్వాతి వృత్తాంతము సుందరకాండమున చెప్పబడిన వృత్తాంతముతో సమానముగా నున్నది.

ఇట్లు దాక్షిణాత్య వాల్మీకి రామాయణమున నొక పాఠములో అధిక పాఠ సర్గగా నున్న వృత్తాంతము పశ్చిమోత్తర శాఖీయ ప్రతిలో ప్రక్షిప్తముగా (అధిక పాఠముగా) లేక "ఇషీకాస్త్ర విసర్జనం నామ నవోత్తర శత తమస్సర్గః" అని అయోధ్యాకాండములో ఇతర సర్గలతోపాటు మూల పాఠ సర్గగా క్రమానుసారముగా గణింపబడినది. గౌడీయ ప్రతిలో నిది అయోధ్యాకాండములో 105 వ సర్గగా నున్నది.

కావ్య దృష్టితోఁ జూచినపు డిది సుందరకాండములో చెప్పబడుటయే సముచితము. కాని గౌడీయ ప. ఉ. ప్రతులలో మూలపాఠముగాను, కొన్ని దా. ప్రతులలో అధిక పాఠముగాను అయోధ్యాకాండమం దిది కనబడుచుండుట చేత పురాణ మార్గ మవలంబించిన బుద్ధభూపతి పాఠకులకు సుబోధము చేయుటకై తన రామాయణమున సుందరకాండమందే కాక, అయోధ్యాకాండమందును ఈ కాక వృత్తాంతమును వక్కాణించినాడు. కాళిదాసు దీనికి మార్గదర్శకుడుగా నున్నాడు.2

---

1. దా. ప్రతి, వాల్మీకి రామాయణము. అయోధ్యా. అధిక పాఠ సర్గ 96, శ్లో. 37-40 1/2.
"శిష్టం మాంసం నికృత్తం యచ్ఛోషణాయావ కల్పితం।
తద్రామ వచనాత్సీతా కాకేభ్యః పర్యరక్షత॥
తత్రాజగ్ముస్తదా కాకా మృగ మాంస బుభుక్షయా।
తేష్వేకోఽపీడయ త్సీతాం తత్ స్తనా మిష లోలుపః॥
నివార్యమాణోఽపి ముహు ర్న వ్యావర్తత సోఽధమః।

2. కాళిదాసు రఘువంశము. సర్గ. 12 శ్లో. 21,22, 23,
"ఇందు భరతుడు పాదుకలను గొని పోయిన తర్వాత ఈ కాక వృత్తాంతము జరిగినట్లు వర్ణింప బడినది. కాని రామాయణమందు భరతుడు రాకముందీ ఘటన జరిగినట్లున్నది. కొలదిగా ముందువెనుకల చెప్పబడునట్టి భేదమే కాని, కాళిదాసుచేత ఈ వృత్తాంత మరణ్యవాస కాలమునందే వర్ణింపబడినది,

బుద్ధ భూపతి ఈ కథా రచనమునందు కొన్ని మార్పులను కూర్పులను చేసి యున్నాడు.

(1) సుందరకాండములో— సీతాదేవి ఆంజనేయున కానవాలునకై చెప్పువేళ 9 ద్విపదలలో ముఖ్యాంశము వదలక వ్రాయబడినది. మరల హనుమంతుడు శ్రీరామునకు చెప్పువేళ -

"తనుఁజిత్రకూటాద్రిఁ దగనొక్క కాకి-చెనకుటయును"[1]

అని ఒక్క ద్విపదలోనే సమస్త వృత్తాంతము సూచితమైనది. పునరుక్త దోషమును పరిహరించుటయు, పాఠకులకు విసుగు కలగకుండ నుండుటయు కవి యుద్దేశమని తలంప వచ్చును.

(2) అయోధ్యా కాండములో "భోజనానంతరము సీతాదేవి కాకులకు మాంసపు ముక్కలను వేయుచుండె"[2] ననుటకు బదులుగా

"ఒగిఁగందమూలాదు లుపహారమునకుఁ-దగ నాయితము సేయుతఱి భీతిలేక"[3]

అని మార్చినాడు.

ముని వృత్తినుండువారికి సాత్త్వికాహారము సేవ్యముకాని మాంసాహారముకాదు. శ్రీరాముడు మాంసమును దిన్నట్లు వాల్మీకమున నచ్చటచ్చట చెప్పబడినను, బుద్ధభూపతి మాత్రము ఆయా స్థలములందు కందమూలాదులు, ఫలాదులు ఆహారముగా స్వీకరించినట్లు వ్రాసి యున్నాడు; మాంసమును దిన్నట్లు తన రామాయణమున నెచ్చటను బేర్కొనలేదు;[+] అవతార పురుషుడు, ఆదర్శ

---

1. రంగనాథ రామాయణము. సుందర కాండము. ద్వి. 1140,
2. ప. ఉ. ప్రతి రామాయణము. సర్గ. 109. శ్లో. 39 మరియు
 దా. ప్రతి రామాయణము. అధికపాఠ సర్గ. 96 శ్లో. 37 1/2.
3. రంగనాథ రామాయణము. అయోధ్యా. ద్వి. 1145.
4 (ఎ) దా. ప్రతి వాల్మీకి రామాయణము. అరణ్యా. సర్గ. 44. శ్లో. 27.
 "నిహత్య పృషతం చాన్యం మాంస మాదాయ రాఘవః।"
 (బి) దా. ప్రతి. రామాయణము. సుందర. సర్గ. 36 శ్లో-41.
 "నమాంసం రాఘవో భుంక్తె నచాపి మధుసేవతే॥"
 వీనికి అనువాదములుగా రంగనాథ రామాయణమునందు
 (ఎ) .... రామచంద్రుఁ-డాయెడ మఱియొక యన్య మృగంబుఁ
 జంపి తన్మాంసంబుఁ జర్మంబుఁగొనుచు-నింపొంది మరలి తానేతెంచుచోట
 (అరణ్య ద్వి 1173, 1174)
 (బి) నేలపై పవళించు నిద్రయెఱుంగ-డోలి మాంసాహార మొల్ల డెన్నడును.
 (సుందర ద్వి. 544)

అని ద్విపదలు కలవు. ఇందు మొదటిదానికి (ఎ) మాంసమును గొనివచ్చుట తినుటకు కాదు; బలికి, అతిథి సత్కారమునకు, మఱి దేనికైనను కావచ్చుననియు ఊహించవచ్చును. ఇక రెండవదానికి (బి) ఓలిమై నాహారమొల్ల డెన్నడును" అని పాఠాంతరమును కలదు.

పొనపుడ. శ్రీరాముడు మాంసమును తినినాడని వ్రాయుట సముచితము కాదని కవి యభిప్రాయమై యుండును.

(3) "మూడు లోకములు తిరిగి శ్రీరామునే కాకము శరణు పొందినద"[1]ని మూలము నందు సామాన్యముగా చెప్పఁబడగా,

"... ...... —....తడయక యది జగత్త్రియ మెల్లఁదిరిగి
కావుడీ యనుచు దిక్పాలుర బ్రహ్మ-దేవుని నమ్మహదేవుఁ బ్రార్థింప
వారలు తమచేత వారింపఁబడునె-శ్రీరామ శరమన్న శీఘ్రంబె మగుడఁ
జనుదెంచి మఱి తన్ను శరణు సొచ్చుటయు"[2]
అని వివరింపఁ బడినది.

ఈ ద్విపద పంక్తులపై పద్మ పురాణ ప్రభావము[3] గోచరించుచున్నది. ఇందు బ్రహ్మ రుద్రాదులును వాయస రక్షణము నందశక్తులైనట్లు చెప్పుట గమనార్హము. సంశయ విపర్యయములు కలుగకుండ బ్రహ్మమహాదేవ శబ్దములను ప్రయోగించి, తద్వారా రాముడుగా నవతరించిన విష్ణువునకు సర్వదేవతాధిక్యము చెప్పుట కవి యుద్దేశము లేనిచో, ఈ వివరణము అనావశ్యకము.

(4) "....రాఘవు డంత సీతచే నున్న-ఫలములు దేవతార్పణములు సేసి
యాయున్న ఫలముల నందఱుఁదృప్తు-లై యుండి రిమ్ముల"[4]
ననెడు ద్విపదలమూలకములు. "తాను భుజించెడి పదార్థమును మొదట దేవతార్పణ చెయవలె"నని లోకమునకు హితోపదేశము చేయుటకై కూర్చబడినవి. యనుట సమంజసము.

ఇట్లు బుద్ధ భూపతి పై ప్రయోజనముల నాశించి అయోధ్యా కాండమునందు కాకవృత్తాంతమును ఉదీచ్య రామాయణ ప్రతులాధారముగా పొందుపరచినాడు.

అయోధ్యా-సుందర కాండములందు చెప్పబడిన కాకవృత్తాంతమునందు భేదములేదు; కాని చెప్పిన తీరును బట్టి వేరువేరు ప్రయోజనములు సాధింపబడినవి.

అయోధ్యాకాండమందలి కాకవృత్తాంతము రాముని సాత్వికత్వ, అహింసా ప్రియత్వ, సర్వదేవతాధికత్వ, ఫల నివేదన త్వాదులు ప్రయోజనముగా గలది. ఇక సుందర కాండమందలి కాక

---

1. దా. ప్రతి. రామాయణము. అధికపాఠ సర్గ. 96. శ్లో. 49.
"సతేనాఽభిద్రుతః కాకః త్రీన్‌లోకాన్ పర్యగాత్తతః"।
2. రంగనాథ రామాయణము. అయోధ్యా, ద్వి 1150-1158.
3. పద్మ పురాణము. ఉత్తరఖండము. అధ్యా. 242. శ్లో. 201,202.
"బ్రహ్మాణ మింద్రం రుద్రంచ యమం వరుణమేవచ।
శరణార్థీ జగామాఽశు వాయసః శస్త్ర పీడితః॥
తందృష్ట్వా వాయసం సర్వే రుద్రాద్యా దేవ దానవాః।
నశక్తాస్మోవయం త్రాతు మితి ప్రాహుర్మనీషిణః॥
4. రంగనాథ రామాయణము. అయోధ్యా. ద్వి. 1156,1157.

వృత్తాంతమునకు అభిజ్ఞానమే ప్రధాన ప్రయోజనము.

అధ్యాత్మ రామాయణమున "కాకము సీతాదేవి పాదాంగుష్ఠమును చీరినట్లు కలదు."[1]

స్త్రీల భోగ్యావయవములలో స్తనములు ప్రధానములు. తన ప్రేయసి స్తనములు విదారింప బడుటను చూచినప్పుడు ప్రియుడత్యంతాగ్రహము నొందును. అంతటి యాగ్రహము పాదాంగుష్ఠ విదారణ దర్శనము వలన నతనికి గలుగదు. కావున శ్రీ రాముడు సీతాస్తన విదారణమును జూచి పట్టరానంత ఆగ్రహము నొంది, కాకిపై బ్రహ్మాస్త్రమును సంధానము చేసినాడు. అందువలన వాల్మీకి చెప్పినదే ఔచిత్య శోభితము. బుద్ధారెడ్డి వాల్మీకినే యనుసరించినాడు.

అరణ్యకాండము.

24. అగస్త్య భ్రాత—

లోకమున ఊరుపేరు లేని అనామకుని అగస్త్యభ్రాత యనుచున్నారు. అగస్త్యునకు నొక సౌదరుడున్నట్లు, అగస్త్యాశ్రమ సమీపముననే యున్న యతనిని శ్రీరామచంద్రుడు దర్శించినట్లు వాల్మీకమునందు కలదు. కాని ఎచ్చటను ఇతని వ్యవహార నామము చెప్పబడలేదు. అగస్త్యభ్రాత యనియే ఉట్టంకింప బడినాడు.[2] రంగనాథ రామాయణ కర్తయు వాల్మీకి చెప్పిన జాడననుసరించి.

"అగస్త్యాను జన్ము నమఘాశ్రమంబున కరిగి"[3]

అని అనామకునిగానే పేర్కొనినాడు. భాస్కర రామాయణమునందును ఇతని పేరు చెప్పబడలేదు,

కాని ఇతర గ్రంథములందు ఇతనిపేరు "సుదర్శనుడని" తెలుపబడినది.

పురాణ పండ రామమూర్తిగారు అధ్యాత్మ రామాయణ తెనుగువ్యాఖ్యానమునందు "అగస్త్య భ్రాత అగ్నిజిహ్వుడ"[5]ని తెలియ చేసినారు. కాని ఆధారము నొసంగ లేదు. మూలమునందు మాత్రము అగస్త్యానుజుడనియె యున్నది.

"ఇతడు పుట్టినప్పటినుండి బ్రహ్మవేత్తగా నుండి వ్యవహార జ్ఞానము, ప్రాపంచిక సంబంధము లేనివాడగుట వలన అనామకుడై అగస్త్య భ్రాతయని వ్యవహరింప బడవచ్చును. రామాయణము నందతని వలన ప్రయోజన మిసుమంతయు లేనందున, ఇతడున్నను లేనివాడే. అప్రయోజకుని అగస్త్య భ్రాతయని పిలుచు వాడుక బుద్ధ భూపతి కాలము నాటికే తెలుగుదేశమున స్థిరపడియుండ వచ్చును. కావున బుద్ధ భూపతి లోక వ్యవహారమును పాటించి, యథా మూలముగా "అగస్త్యాను

---

1. అధ్యాత్మ రామాయణము. సుందరకాండము. సర్గ 3 శ్లో. 54.
   ఐంద్రః కాకస్తదా గత్య నఖైస్తుండేన చాసకృత్।
   మత్పాదాంగుష్ఠ మారక్తం విదదారామిషాశయా॥
2. వాల్మీకి రామాయణము అరణ్య. సర్గ. 11. శ్లో. 39, 48, 54, 72
3. రంగనాథరామాయణము అరణ్య ద్వి. 181.
4. (ఎ) వావిలకొలను సుబ్బారావు. మందరము. అరణ్య. పుట. 124.
   (బి) సనత్కుమార సంహిత,
   "యవీయా నేషమే భ్రాతా సుదర్శన ఇతిస్మృతః॥"
5. అధ్యాత్మ రామాయణము. వ్యాఖ్యానము. అరణ్య పుట. 24.

జన్మ" అని వ్రాసినాడు, కాని ఇతర గ్రంథములందు చెప్పబడిన "సుదర్శనే" త్యాది నామములను పరిగ్రహించలేదు. ఇదియే సముచితము.

25. శ్రీరాముని తేజో విశేషము :—

ఖర దూషణాదుల నెదుర్కొనుటకై శ్రీరాముడు సాయుధుడై నిలబడిన వేళ అతనిని ఒక విధమైన తేజస్సావేశించెను.

రంగనాథ రామాయణమునం దద్భుతమైన రాముని ఈ తేజో విశేష మహిమను తేట పరచుటకై ఏడెనిమిది ద్విపదలు వ్రాయబడినవి.

"పదివేల కోటుల భాను తేజములు—పొదిగొను లోకముల్ పొదివినయట్లు
రాముని తేజ మరణ్య భూజములు-భూమియు నభము నబ్ధులు గప్పుటయును
జడమతులై సర్వ సంభ్రమం బుడిగి-మిడుకుచు కన్నులు మిఱుమిట్లు గొనగ
కడునంధులైన రాక్షసులను జూచి-కడకతోఁబల్కె నా ఖరుడు దూషణుని
ఇది యేమి దూషణ యీ సేన నడవ-బెదిరినొ పరసేన యేరడ్డ పడెనొ
యనిన దూషణుడేగి యటుఁజూచి వచ్చి-దనుజేశ రాము నుద్దండ తేజంబు
కలయఁ బర్వుటయును గతిఁదప్పెననుడు-నలుకమై ఖరుడు సైన్యముల దిట్టుచును
నరద మత్యుగ్రత నట దోలుకొనుచు -నరుగుచో..................."1

"పదివేల కోట్ల సూర్య తేజములు లోకము లాక్రమించిన రీతి శ్రీ రాముని తేజస్సు భూమ్యాకాశ వనసముద్రము లంతయు నిండెను. జడమతులైన రాక్షసులు కన్నులు మిఱుమిట్లుగొనగా నంధులై గతి దప్పిరి. ఖరుడు దూషణుని జూచి ఇదియేమి? ఈ సేన నడవదు, పరసేన యెదిరేనా? లేక యెఱడ్డపడెనా? అని యడిగెను. దూషణుడు చూచివచ్చి సర్వవ్యాప్తమైన రాముసుద్దండ తేజమున సైన్యము గతి దప్పెనని నుడివెను. ఖరుడు కోపించి సైన్యములన్ దిట్టుచు తన రథమును ముందునకు తోలించెను."

కేవలము దాక్షిణాత్య ప్రతిని జూచిన వారికి ఈ కల్పనము రంగనాథ రామాయణ కర్తదే యని తోచును. కాని ప.ఉ. ప్రతి రామాయణమునందు అరణ్యకాండలో వీనికాధార శ్లోకములు కానగుచున్నవి కాని కవి యిందు ఒకటి రెండు చిరు మార్పు గూర్పులు గావించి యున్నాడు.

1. (ఎ) తేజో విష్టుడై నిల్చియున్న రాముని గాంచి సైన్యమాగిపోయినదని మూలమున నుండగా, సర్వత్ర వ్యాపించిన శ్రీ రాముని తేజస్సునకు నంధులై సైనికులు సంభ్రమముడిగి నిలిచి పోయినట్లు రంగనాథ రామాయణమున గలదు.

ఇచ్చట వాల్మీకి శ్రీ రామునకు ప్రాధాన్య మీయగా బుద్ధ భూపతి అతని తేజస్సునకు ప్రాధాన్య మిచ్చియున్నాడు.

(బి) "ఇచ్చట దాట దగినది నదిలేదు. సైన్యమెందుకు ఆకస్మాత్తుగా నాగినదో

1. రంగనాథ రామాయణము. అరణ్య. ద్వి. 529-536.

తెలిసికొనుము"[1] అని మూలమునందలి సూటియైన ఖరుని ప్రశ్న ఇందు

"ఇదియేమి దూషణ యీ సేన నడవ-దెదిరెనో పరసేన యేఅడ్డ పడెనా"

అని సందేహాత్మక ప్రశ్న రూపమున మార్చబడినది.

(2) "ఎదిరెనో పరసేన" అని మూలమున లేని క్రొత్త వికల్పమొకటి కూర్చబడినది నిర్నిరోధముగా నిరాఘాటముగా నేగు సైన్యమకస్మాత్తుగా ఆగిన దనినచో "పరసేన యెదుర్కొనవలెనని యూహించుట సహజము. ఈ యూహకు కారణ భూతమైనది. శ్రీ రాముల తేజస్సు

ఆనంద రామాయణమున "శ్రీరాముడు పదునాలుగు వేల రూపముల దాల్చి రాక్షసులను మర్దించె నని యున్నది. రాక్షస సైన్యమునకు వెనుక తట్టున నున్న ఖరునకు శ్రీరాముని అనంత రూపములు పొడగట్టి "ఎదిరెనో పరసేన" అని యతడు ప్రశ్నించుట కవకాశ మేర్పడినది. కవి మనస్సులో ఆనంద రామాయణ శ్లోక భావము మెదలుచుండుటచేతనే ఈ క్రొత్త వికల్పము కూర్చబడినదనవచ్చును.

ఎండ కాలములో అతిశయిత సూర్యకాంతి (ఎండ) ప్రవాహము ప్రవహించుచున్నట్లు భ్రాంతి కలిగించును. దీనిని మృగతృష్ణయని, యెండమావులని యందురు. అఖండమైన శ్రీరాముని తేజో విశేషము ఖరునకు సైన్యము ముందు నది ప్రవహించుచున్నట్లు పొడకట్టినది. కావున "ఏఅడ్డ పడెనా" అని ప్రశ్నించినాడు. ఎండ మావుల యాథార్థ్యమును గ్రహించక మృగములు నీరని పరుగెత్తి పరుగెత్తి ప్రాణములు వీడునట్లు, ఖరుడును శ్రీ రాముని తత్త్వమును గ్రహించక, ప్రాణములను వీడ నున్నాడనియు విశేషార్థము పై ప్రశ్నయందు ధ్వనించుచున్నది.

ప.ఉ. ప్రతిలోని ఈ విషయమందిట్టి విశేషత యున్నందుననే బుద్ధభూపతి దీనిని గ్రహించి అనువదించినాడు. భాస్కర రామాయణమునందీ విషయము లేదు.

26. అకంపన వృత్తాంతము:—

కొందరు విమర్శకులు అకంపనుని వృత్తాంతము రంగనాథ రామాయణమున లేదని తమ అభిప్రాయములను వెలిబుచ్చినారు. వారిలో ముఖ్యులు పింగళి లక్ష్మీకాంతంగారు[3] మరియు వేదము లక్ష్మీనారాయణ శాస్త్రిగారు[4] కాని ఈ అకంపనుని వృత్తాంతము రంగనాథ రామాయణమునందు-

---

1. ప.ఉ. ప్రతి వాల్మీకి రామాయణము. ఆరణ్య. సర్గ. 29. శ్లో. 39.
   నచాత్రాస్తి నదీతాన్యా స్థితమేక పదే బలం।
   కిమర్థం జ్ఞాయ తాం తావ చ్ఛీఘ్రం దూషణ గమ్యతాం॥
2. ఆనంద రామాయణము సారకాండము. సర్గ 7 శ్లో. 62.
   "చతుర్దశ సహస్రాణి స్వీయ రూపాణి రాఘవః।
   కృత్వా తేషాంచ పురతః శరైస్తా న్మర్థయత్ క్షణాత్॥"
3. పింగళి లక్ష్మీకాంతంగారు, ఆంధ్రసాహిత్య చరిత్ర. పుట. 175
4. వేదము లక్ష్మీనారాయణశాస్త్రి పీఠిక, రంగనాథరామాయణము. పుట. 17 వావిళ్ళ ప్రతి.
   "అకంపనుని మాటమీద రావణుడు రామునిం జంప బయలుదేరి వచ్చుచు త్రోవలో మారీచుని

"అపుడకంపనుడు రయప్రకంపనుడు-విపులార్తి లంకకు వేగంబె పోయి
యా రావణుని గాంచి........................ మొదలుకొని...................
అనిన మారీచు వాక్యంబు లప్పటికి-విని లంక కేతెంచె వింశతిభుజుడు"[1]

వరకు సుమారు 34 ద్విపదలలో కలదు. వావిళ్ళ ప్రతియందును, రాయల్ అండ్ కోవారి ప్రతియందును, ఆంధ్ర విశ్వ కళా పరిషత్తు ప్రతియందును ఒకటిరెండు ద్విపదలు హెచ్చు తచ్చులుగా నీయకంపనుని వృత్తాంతము మొదటిసారిదైన మారీచ హితోపదేశముతో పాటు కనబడు చున్నది. దీనిని లేదనిన విమర్శకులు పొరబడి రనుట సమంజము "ప్రమాదో ధీమతా మపి" గదా!

ఇది దాక్షిణాత్య ప్రతి వాల్మీకి రామాయణమునందు అరణ్యకాండలో 51 శ్లోకములతో నొప్పు 31వ సర్గ. కాని లాభపురము (లాహోరు) వారు ప్రచురించిన పశ్చిమోత్తర శాఖీయ ప్రతి అరణ్య కాండమునందు లేదు. అందు ఖరవధ 35వ సర్గ యందును, శూర్పణఖ రావణుని తర్జించిన వృత్తాంతము 36 వ సర్గ యందును కనిపించును. ఈ రెండింటికి నడుమ అకంపన వృత్తాంతముండవలెను. ఇట్లు ప. ఉ. ప్రతిలో లేక దా. ప్రతియందు కాన్పించుచున్న కొన్ని వృత్తాంతములలో నిది (ఈ యకంపన వృత్తాంత సర్గ) యొకటి-

బుద్ధ భూపతియు మూలము ననుసరించి ఏ కొంచెమును గూడ వదలకుండ వ్రాసినాడు. వేదము లక్ష్మీనారాయణ శాస్త్రిగారు చెప్పినట్లు సీతాపహరణ ప్రేరకత్వమంతయు నొక శూర్పణఖకే యారోపించలేదు.

మొదట చెప్పిన అకంపనుని ప్రేరణయందు రావణునకు శూర్పణఖా వాక్కులతో బలమైన విశ్వాసమేర్పడినది. దెబ్బమీద దెబ్బపడినచో బాధయెక్కువగునట్లు. పోటు మీద పోటుపడినచో కంబము దృఢముగా నాటుకొని పోవునట్లు, ప్రేరణము మీద ప్రేరణము కలిగినది. కావుననే రావణునకు సీతాపహరణమున తిరుగులేని దృఢ మనో నిశ్చయ మేర్పడినది. దీనిని వదలినచో రచయిత సరసత మాట యటుంచి, ఈ ఘట్టమునకు సహజత్వమునే చెడగొట్టిన వాడై యుండెడివాడు. కాని యట్లు గావించలేదు.

27. అయోముఖి వృత్తాంతము-

"జటాయు మోక్షానంతరము రామలక్ష్మణులు జానకిని వెదకుచు దక్షిణ దిశగా పోయి పోయి క్రౌంచారణ్యమును ప్రవేశించిరి. అచట అయోముఖియను రాక్షసి యొకతె ఎదురుపడి సౌందర్య విగ్రహుడైన లక్ష్మణుని కామించి, చేయిబట్టి తనను పొందరమ్మని కోరగా, సౌమిత్రి యా యయో ముఖియొక్క ముక్కు చెవులు స్తనములను గోసెను అది భయపడి పారి పోయెను." ఇది అయో ముఖికథ.

ఉపదేశము విని లంకకు మరలినట్లును, తరువాత శూర్పణఖ ప్రేరణమున మరల నుద్యుక్తుడైనట్లును మూలమున నుండ కవి రంగనాథ రామాయణమున ప్రేరకత్వ మంతయు నొక్క శూర్పణఖకే యారోపించి యీ ఘట్టమునకు సరసత గూర్చినాడు; అంతేగాదు ఈకవి యకంపనుని వృత్తాంతమును పూర్తిగా వదలినాడు"

1. రంగనాథ రామాయణము. అరణ్య. 671-704 ద్విపదలు.

డా. జి. నాగయ్యగారు "రంగనాథరామాయణమునందు అయోముఖి కథ కానరాదు"[1] అని వ్రాసినారు. ఇది వారి పొరపాటు. ఈ వృత్తాంతము రంగనాథ రామాయణమున సుమారేడెనిమిది ద్విపదల2లో వర్ణింప బడినది.

దీనికి మూలము గౌడీయ, పశ్చిమోత్తర శాఖీయ ప్రతులలో కానరాక కేవలము దాక్షిణాత్య పాఠమునందే[3] కనిపించుచున్నది. కావున బుద్ధ భూపతి దా. ప్రతిననుసరించి దీనిని వ్రాసినాడన వచ్చును.

రామాయణము నందీ కథాంశము లేకున్నను ప్రధాన కథకుఁగాని, అవాంతర కథలకుఁగాని ఎట్టి బాధకము లేదు. కాని, కవి యెట్టి ప్రయోజన మపేక్షించి దా. ప్రతి యాధారమున దీనిని గ్రహించి యుండునని ఆలోచించ వలసి యున్నది.

రామాయణమునందు ముగ్గురు దానవకాంతలు రామలక్ష్మణులను ఎదిరించినట్లు వర్ణింప బడినది. వీరు తాటక, శూర్పణఖ, అయోముఖి యనువారు. వీరు ముగ్గురును సౌమిత్రి చేత ముక్కు సెవులు పోగొట్టుకున్నవారె. ఇంతె కాక తాటక ప్రాణములను పోగొట్టుకొన్నది. శూర్పణఖ పంతము బూని పగసాధింప దొరకొన్నది; అయోముఖి పాఱిపోయి ప్రాణములను గాపాడుకొని మరల తెరువు రాకున్నది. లోక కంటకలైన దానవ స్త్రీలయందలి తమోగుణాత్మక త్రివిధ ప్రకృతులకు ఈ మూడు స్త్రీ పాత్రలు ప్రతిబింబములు.

దానవులు తమోగుణ ప్రధానులు. వారి స్త్రీలును అట్టివారే. రజస్సత్వములు వారియందు మిశ్రరూపమున నుండును. ఈ కారణమున వారియందు త్రివిధ భేదమేర్పడినది.

1. తాటక :-

ఇది శుద్ధ తమోగుణ భూయిష్ఠురాలు "తమము అజ్ఞానము వలన జనించును సమస్త ప్రాణులకు మోహమును గలుగ జేయును."[4] ఈ కారణమున వీరు ఎదుటి వారి శక్తిని గ్రహింపరు; అభిమానాధిక్యతచే తాము పట్టు వదలరు; తమను బాధించిన వారిని ప్రాణాంతము ఎదిరింతురు. తాటక ప్రవర్తన ఇట్లే యున్నది

తాటక స్త్రీ యైనందున, శ్రీరాముడు దానిని చంప మొదట నిచ్చగింపలేదు. లక్ష్మణుడు తత్కర్ణనాసా విచ్ఛేదమును గావించెను. కాని అది యింకను రోషించి, మాయచే శిలావర్షాదులను రాఘవులపై కురిపించగా, శ్రీరాముడు విశ్వామిత్రునానతిపై దానిని పరిమార్చెను.

ముక్కు సెవులు గోయబడిన తర్వాత, తాటక బుద్ధిమంతురాలై, ఎదుటి వారి శక్తిని గ్రహించినదైనచో పారిపోయియుండవలెను. కాని యది యట్లుచేయక, మిక్కిలి రోషించి రాఘవులపై తిరుగబడినది. గావుననే ప్రాణములను పోగొట్టుకొన్నది.

---

1. డా. జి. నాగయ్య "దాక్షిణాత్య సమీక్ష" మొదటి సంపుటము. పుట.74.
2. రంగనాథ రామాయణము. అరణ్యా. ద్వి. 1390-1396
3. దా. ప్రతి వాల్మీకి రామాయణము. అరణ్యా. సర్గ. 69 శ్లో. 5-18.
4. "తమస్త్వజ్ఞానజం విద్ధి మోహనం సర్వదేహినాం॥ భగవద్గీత. అధ్యాయ. 14 శ్లో. 8.

"శ్రీరాముడు బాల్యముననే గుర్వాజ్ఞను పాలించి, తాటకా దుష్ట స్త్రీ సంహారము చేసి, శిష్ట రక్షణ గావించిన పరమ ధర్మాత్ముడని" అతని ధర్మ తత్పరత నీ వృత్తాంతము ప్రతిపాదించు చున్నదని పలువురు చెప్పుదురు.

ఇంతేకాక, ఈ వృత్తాంతము ద్వారా ఎదుటివారి శక్తిని గ్రహించక ఎదిరించెడు తమోగుణావిష్టులు పొందు ఫలమును ప్రతిపాదించుచున్నదనియు చెప్పవచ్చును.

2. శూర్పణఖ :—

ఈమె రజస్సహిత తమోగుణ భూయిష్ఠురాలు. "రజోగుణము రాగాత్మకమైనది; స్త్రీపురుషుల పరస్పర స్పృహకు హేతుభూతమైనది; మరియు తృష్ణా సంగములకు సముద్భవ స్థానమైనది."1 అమిత కామాసక్తియు, తన కామమును దీర్చక భంగపరచెడు వారిపై పగబూనుటయు, ఏ విధముగా నైన సాధించుటకు, అపకృతి గావించుటకు ప్రయత్నించుటయు రజోగుణావిష్టుల స్వభావము, శూర్పణఖ ఈ కోవకు చెందినది. చారిత్రకముగా చిత్రాంగిని గ్రహించవచ్చును.

శూర్పణఖ శ్రీరామలక్ష్మణులను కామించినది. తన కడ్డుగా నున్న సీతను మ్రింగఁబోయినది. సౌమిత్రి దానికర్ణ నాసా విచ్ఛేదమును గావించినాడు.2 తన కాంక్షను తీర్చకుండుటయేకాక, తన్ను భంగపరచి వికలాంగత్వమును గావించిన వారిపై పగబట్టిపోయి ఖరదూషణాదులను పిలిచి కొని వచ్చినది. రావణునిచే సీతాపహరణమును గావింపఁజేసినది. ఇట్లు రాక్షస వినాశమునకు హేతు భూతమై లోకనిందకు గురియైనది.

కర్ణనాసా విచ్ఛేదానంతరము శూర్పణఖ రాఘవుల నెదిరించలేదు. ఎదిరించినచో తాటక గతియే దీనికిని పట్టెడిది. కాని, పారిపోయి, పగబట్టి తరువాతి కథావిస్తృతికి కారణమైనది.

సృష్టికి రజోగుణమే అవసరము. ఇది కామ కారణము. ఈ కామ మెన్నివిధములుగానైనను నుండవచ్చును. మంథరయు, మంథరాప్రేరిత కైకయు రజోగుణావిష్టురాండ్రే. వీరు అర్థకాములు, శూర్పణఖ రతికామ, మంథరా శూర్పణఖలు లేనిచో రామాయణమే లేదు. ఇట్టివారిచేతనే సుఖదుఃఖములు కీర్త్యపకీర్తులు సంసారమునందు కలుగుచుండును. కామభగ్నలైన రజస్సహిత తమోగుణ ప్రధానస్త్రీల ప్రవర్తనకు ఈ శూర్పణఖా వృత్తాంతము నిదర్శనము.

---

1. రజోరాగాత్మకం విద్ధి తృష్ణాసంగ సముద్భవం।
తన్ని బధ్నాతి కాంతేయ కర్మసంగేన దేహినం॥ భగవద్గీత. అధ్యా. 14 శ్లో. 7.

2. కంబరామాయణమునందు శూర్పణఖ ముక్కు చెవులతో పాటు, ఆమె వక్షోజములు కూడ ఖండింప బడినట్లు వర్ణింపబడినది. ఈ స్తన ఖండమునకు మూలము కానరాదు. కాని వాల్మీకి రామాయణమునందు అయోముఖియొక్క కర్ణనాసములతో పాటు స్తనములను ఖండింప బడినట్లు వర్ణితమై యున్నది, "కర్ణనాసౌ స్తనౌచాస్యానిచకర్తారిసూదనః"॥
(దా. ప్రతి. అరణ్య. సర్గ. 69 శ్లో. 7.
కంబన్ దీనిని శూర్పణఖావర్ణనమునందు జేర్చి స్వారస్యము కూర్చినాడు.

3) అయోముఖి :—

ఇది సత్వ సహిత తమోగుణోపేత. శుద్ధసత్వము సంసారమునందెవరికిని నుండదు. సాధారణముగా ప్రతి జీవియు త్రిగుణాత్మక ప్రకృతిచే బద్ధుడై యుండును, కాని ప్రత్యేక గుణాతిశయముచే ఆ జీవి తద్గుణావిష్టుడని యందురు.

"సత్వ గుణము నిర్మలమగుటచే ప్రకాశకమైనది."[1] అనగా వస్తుయాథాత్మ్యావబోధమైనది"[2]

ఇట్టి సత్వగుణము, రజోగుణ సంబంధమున నణచబడినప్పుడు కామము వర్థిల్లును. తమోగుణ ప్రేరణమున అభిమాన మేర్పడును. కాని దెబ్బతిన్న పిదప తిరిగి సత్త్వగుణము ప్రవృద్ధమగుటచే యుక్తాయుక్త విచార జ్ఞానమేర్పడును. ఈ కోవకు చెందిన అయోముఖి లక్ష్మణుని కామించి, కర్ణనాసాస్తన విచ్ఛేదమునొంది. దూరముగా పారిపోయినది. తాటకవలె తిరిగి ఎదిరించి ప్రాణములను బోగొట్టుకొనలేదు. శూర్పణఖ వలె పగబట్టి సాధించ ప్రయత్నించలేదు. కథనుండి దూరముగా తొలగి పోయినది. ఇట్టివారి వలన లోకులకు తాత్కాలిక కష్టమేకాని, స్థిరమైన బాధయుండదు. అయోముఖి ఈ పరమార్థమును బోధించుచున్నది.

ఈ విధముగా విచారించినపుడు తాటకా, శూర్పణఖా వృత్తాంతము ఉండి తీరవలెను. కథా దృష్టితో చూచినప్పుడు ప్రత్యేక ప్రయోజనము లేనిదగుటచే నిది అనవసరమనిపించును. ఈ దృష్టి భేదముచేతనే ఇది దాక్షిణాత్య ప్రతులందు గ్రహింపబడి, ఔత్తరాహ ప్రతులయందు వదలివేయబడియుండవచ్చును. కాని బుద్ధభూపతి దానవ కాంతల త్రివిధ భేదములను ప్రతిపాదింప దలచి ఈ అయోముఖి వృత్తాంతమును గ్రహించినాడనుట సమంజసము

కిష్కింధా కాండము

28. సాలములా? తాలములా?

శ్రీరాముడు సుగ్రీవునికి విశ్వాసము కలిగించుటకై అతని కోరికపై సప్తతాళభంజనమొనర్చెను.

ఇచట దా. ప్రతియందు "సాల" (మద్దిచెట్టు) శబ్దమే ప్రయుక్తమైనది—

"1. ఇమేచ విపులా స్సాలా స్సప్త శాఖావలంబినః॥

2. సాలం మేకంతు నిర్భింద్యా భవే ద్వ్యక్తి ర్బలాబలే॥

3. సాలముద్దిశ్య చిక్షేప జ్యాస్వనైః పూరయన్ దిశః॥

4. యేన సప్త మహాసాలా గిరి ర్భూమిశ్చ దారితాః।"[3]

గోవింద రాజీయాది వ్యాఖ్యానకర్తలు గూడ సాల శబ్దమునే గ్రహించినారు. స్కాంద పురాణమునందును—

"సప్త భూమీ స్సప్త గిరీన్ సప్త సాలాన్ మహాబలాన్"[4] అని సాలశబ్దమే ప్రయుక్తమైనది.

---

1. "తత్ర సత్త్వం నిర్మలత్వాత్ ప్రకాశక మనామయం॥" భగ. అధ్యా. 14 శ్లో. 6.
2. శ్రీ భగవద్రామానుజాచార్యులు- గీతా భాష్యము అధ్యా. 14 శ్లో. 6.
"ప్రకాశః— వస్తు యాథాత్మ్యావబోధః॥"
3. కిష్కింధా కాండము 11వ సర్గ, శ్లో.లు 67, 90; 12వ సర్గ శ్లో. 2, 9.
4. స్కాందపురాణము-

కాని ప. ఉ ప్రతిలో సాల శబ్దమునకు బదులు "తాల" శబ్దము వాడబడినది.

"1. ఇమేతే విపులా స్తాలా స్స ప్త సాఖావలంబినః।
2. తాలా నేతాంస్తు నిర్భిద్య భవేచ్ఛక్తి ర్బలాబలే॥
3. తాలా నుద్దిశ్య చిక్షేప పూరయిష్యన్ స్వవైరిణః।
4. యేన సప్త మహాతాలాః గిరి ర్భూమిశ్చ దారితాః॥"[1]

ఇట్లే ఆనంద రామాయణమునందును[2], అధ్యాత్మ రామాయణమునందును[3], "తాల" శబ్దము ప్రయుక్తమైనది

రంగనాథ రామాయణమునందు కవిచే "సాల" శబ్దము గ్రహింపబడలేదు. "తాల" శబ్దమును, దాని వికృతియైన "తాడి" శబ్దము యొక్క బహువచన రూపమైన "తాళ్లు" అను శబ్దమును ప్రయోగింప బడినవి.

"ధరణీశ యియ్యేడు తాళ్లను దొల్లి - ....
అడరి యీ తాళంబులం దొక్కటైన - ....
తలకొని యొక కోల తాళంబులేడు - ....
వన చరాధిప తాళ్ళు వదలక చూపు - ....

మించి యొక్కటఁ బంక్తిముఖు నాళ్ళ తాళ్ళు - దెంచిన గతిఁ దాళ్ళు తెగ నేయుటయును"[4] అని బుద్ధభూపతి ఈ విషయమున ప. ఉ. ప్రతిని అనుసరించినాడు. దా. ప్రతిని మాత్రము చూచిన వారికి ఇది కవి చేసిన మార్పుని తోచును.

కిష్కింధ తెలుగుదేశము లోనిది. ఇచట తాటి తోపులు ఎక్కువగా గలవు. ఈ నైసర్గిక ప్రకృతిని బట్టి చూచినను "తాల" శబ్దముండుటయే సమంజసము. మొదట వాల్మీకి "తాల"శబ్దమునే ఉపయోగించగా, కొంతమంది లేఖకులు పొరపాటున సాల శబ్దముగా లిఖించియుందురు. అది దాక్షిణాత్య ప్రతులలో చోటు చేసికొన్నది.

తాల వృక్షమైనచో నిటారుగా, చాల ఎత్తుగా, దృఢముగా, దాని మట్టలు చేతితో విరువ రానివిగా నుండును. సాల వృక్షమట్లు కాదు. వాలి ఈ తాల వృక్షములను చేతితో నిష్పత్రములుగా చేయువాడు.[5] ఈ బలము వలననే సుగ్రీవుడు భయపడినాడు.

కొంతమంది తెలుగు కవులు నిశితముగా నాలోచించక సాల వృక్షమనియే తమ రామాయణము లందు అనువదించినారు.[6] కాని రంగనాథ రామాయణ కర్త గ్రహించిన "తాల" పాఠమే

---

1. కిష్కింధాకాండము.
2. ఆనంద రామాయణము. సారకాండము సర్గ 8 శ్లో. 37, 44.
3. అధ్యాత్మ రామాయణము. కిష్కింధా. సర్గ 1 శ్లో. 72, 74.
4. రంగనాథ రామాయణము. కిష్కింధా. ద్వి. 370, 372, 373, 377, 380.
5. దా. ప్రతి రామాయణము. కిష్కింధా సర్గ 11, శ్లో. 67,
"యత్రైకం ఘటతే వాలీ నిష్పత్రయితు మోజసా"
6. వావిలకొలను సుబ్బారావు. శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణము. కిష్కింధాకాండము పద్య. 299, 300 ఇత్యాదులు—

సరియైనది; సమూలకమైనది; నిర్దుష్టమైనది. "తాలవృక్ష" వృక్షములున్నట్లే శిల్ప సాక్ష్యాలున్నవి[1]

29. అంగుళీయ ప్రదాన సర్గక్రమ వ్యత్యాసము :—

సుగ్రీవుడు వానరులను సీతాన్వేషణకై నలు దిసలకు పంపించెను.

దా. ప్రతిలో ఈ చతుర్దిశల యందలి విచేయ స్థల వర్ణనము క్రమముగా 40, 41, 42, 43 సర్గలలో కలదు. పిదప 44వ సర్గయందు "సుగ్రీవుడు నిశ్చిత కార్యసాధన సామర్థ్యము హనుమంతునియందు గలదని నిశ్చయించుకొని, అతనికి ప్రత్యేకముగా చెప్పగా, శ్రీరాముడును ఇది గ్రహించి స్వనామాంకోపశోభితమగు అంగుళీయకమును అభిజ్ఞానార్థము హనుమంతునికి నొసంగినట్లు" కలదు. అనగా 41వ సర్గలో దక్షిణ దిగ్వర్ణన వృత్తాంతము, 44వ సర్గలో ముద్రికా ప్రదాన వృత్తాంతము గలదనుట. ఇక పశ్చిమోత్తర శాఖీయ ప్రతిలో దక్షిణ దిగ్వర్ణనము (33వ సర్గ) తర్వాత అంగుళీయ ప్రదాన వృత్తాంతము (34వ సర్గ) కలదు. అనగా సుగ్రీవుడు హనుమదంగదాదులకు దక్షిణ దిశకు పోయిరండని ఆజ్ఞాపించిన వెంటనే శ్రీరాముడు హనుమంతుని బిలిచి తన ముద్రిక నొసంగి సందేశమును దెలిపెను. ఆపిదప సుషేణ శతవలి ప్రముఖులను పశ్చిమోత్తర దిశలకు పంపెను.

ఇట్లిచట దాక్షిణాత్య ప్రతికిని పశ్చిమోత్తర శాఖీయ ప్రతికిని సర్గక్రమములో వ్యత్యాసము గోచరించుచున్నది. ఇందులో ఏది సమంజసము?

వానర రాజు ఆయా కపి ప్రముఖులకు చతుర్దిగ్వర్ణన గావించి. పొమ్మని ఆదేశించిన పిదప, శ్రీరాముడు తన ముద్రిక నెవరికి, ఏ దిశకు పోవువారికి ఈయవలెనని బాగుగ నాలోచించి. రావణుడు సీతాదేవిని దక్షిణదిశకుఁగొని పోయినాడని కబంధాదులద్వారా వినియుండుట చేతను, హనుమత్సామర్థ్యము నిదివరకే తాను గ్రహించి యుండుటచేతను, తద్దిశకు పోవువారిలో ముఖ్యుడైన యతనిని బిలిచి, ప్రీతి పూర్వకముగా తన ముద్రికను ఇచ్చినాడనుట ఒకవిధముగా సముచితమనిపించును. కాని సుగ్రీవుడు హనుమదాదులను దక్షిణదిశ వెదకి రమ్మని ఆదేశించిన వెంటనే శ్రీరాముడు హనుమంతుని బిలిచి ముద్రికనిచ్చి సందేశమొసంగుట క్రమము. సీతాదేవి దక్షిణ దిశయందే యున్నదని రామునికి దృఢవిశ్వాసము. సుగ్రీవుడు కూడ వానరులలో ముఖ్యాతి ముఖ్యులైన అంగద జాంబవదాంజనేయాదులను దక్షిణాశకు పంపినాడుగదా! అయినచో పూర్వ పశ్చిమోత్తర దిశలకు వానరులను పంపుట అనవసరమని సందేహము పొడమును. రావణుడు దక్షిణదిశకు సీతను గొనిపోయిన మాట వాస్తవమైనను ఈ మధ్యకాలములో నతడామెను నేదిశయందైనను దాచవచ్చును. కావున ఒక్క దక్షిణ దిశకే పంపించినచో, పోయినవారు వచ్చి తెలియదనినచో, అప్పుడు పునఃప్రయత్నమైకాల యాపన జరుగును. కావున అన్ని దిశలు వెదకవలెను. అనుమానము విశ్వాసమున్న దిశయందు విశేషముగా యత్నించవలెను" అను న్యాయముచే సుగ్రీవుడు సరిగానే ప్రవర్తించినాడు. కావున అతడు వినతుని ససైన్యముగా తూర్పుకు పంపించినాడు. పిదప దక్షిణ దిశకు పోవుటకై హనుదంగ

---

1. అహోబిలము దేవాలయమునందలి శిల్పములు.

దాదుల నాదేశించగా, వెంటనే రాముడు ఆంజనేయునికి ముద్రిక నొసంగినాడు. వారుపోయిన తర్వాత పశ్చిమోత్తరములకు సుషేణ శతవల్యాదులను పంపినాడు, ఇది క్రమము. ఆదేశించిన తరువాత ప్రయాణము కాకుండ పందెపు పోటీయందు వలె అందరు ఒకేసారి బయలు దేరవలెనని నియమ మున్నట్లు లేదు. అటయిన కాలయాపనకు కారణమగును.

ఇంతే కాకుండ, దా. ప్రతి సర్గ. శ్లోక పదములందు కొలది భేదమును కనవచ్చుచున్నది.

1. దక్షిణాం ప్రేషయామాస (దక్షిణమునకుఁబంపించెను)

2. జగ్ముర్దిశంతాం వరుణాభి గుప్తాం (పడమటి దిశకేగిరి)

ఇచట "ప్రేషయామాస, జగ్ముః" అను క్రియలు వారు బయలుదేరి పోయిరనియే తెలుపు చున్నవి, దీని తర్వాతిది శ్రీరాముడు హనుమంతుని కుంగరమిచ్చిన 44వ సర్గ. ఆ తరువాత 45వ సర్గలో—

"సర్వాంశ్చాహూయ సుగ్రీవః ప్లవగాన్ ప్లవగర్షభః।
సమస్తా నబ్రవీద్భూయో రామ కార్యార్థ సిద్ధయే॥[1]

అనియు, "పూర్వాందిశం ప్రతియయా" అనియు,

"ప్రతస్థే హరి శార్దూలో దిశం వరుణ పాలితాం"[2]

అనియు శ్లోక పాదములు కనబడుచున్నవి. ఇప్పుడు పూర్వ సర్గలలోని "జగ్ముః" అనుదానికి వెళ్ళిరి. అని అర్థము చెప్పవలెనా? లేక "వెళ్ళుటకు సిద్ధపడిరనియా!" 45 సర్గలోని శ్లోకములకు సార్థకత యేర్పడ వలెనన్న అన్ని దిశలు పోవువారికి సందేశ మందువరకు అందరును అచటనే యుండవలెను.

కావున వీనినన్నింటిని ఆలోచించి బుద్ధ భూపతి ప.ఉ. ప్రతి క్రమమే సముచితమని భావించి ఈ విషయమున తత్సర్గక్రమము ననుసరించినాడు. భాస్కర రామాయణమునందును నిదేక్రమము పాటింపబడినది.

30 హనుమచ్చరిత్ర :—

శ్రీరామభక్తుడు, భక్తవత్సలుడు, ప్రఖ్యాత బల పౌరుష విక్రమ సంపన్నుడు, చిరంజీవియు నగు హనుమంతుని జన్మ బాల్య పరాక్రమ, మాహాత్మ్యాదులకు సంబంధించిన చరిత్ర వాల్మీకి రామాయణములో కిష్కింధా, సుందర, యుద్ధోత్తర కాండములందు వివరముగను, బాలకాండము నందు సూచనా ప్రాయముగను ప్రస్తావింపబడినది. దీనితో రంగనాథ రామాయణ హనుమచ్చరిత్రను పోల్చి చూచినపుడు మూలమునందుకంటె ఈ తెలుగు ద్విపద రామాయణమునందే అనేక నూతన విషయములు కానిపించుచున్నవి. కవి ఆయా పురాణ, రామాయణ గ్రంథములనుండి అనేక విషయ

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. సర్గ. 45 శ్లో. 1.
2. ,, ,, సర్గ. 45 శ్లో. 7.

ములను సేకరించి తనకు నచ్చినవానిని సముచితముగా పొందుపరచి తద్భిన్న విషయములను వదలినాడని తోచును.

ఆంజనేయునికి కేసరిపుత్రుడు, అంజనానందనుడు, పవనసుతుడు, రుద్రావతారుడు, రుద్ర బీజుడు అనునవి జన్మతః వచ్చిన నామములు; హనుమంతుడు, రామదూత, అక్షహంత ఇత్యాదులు తత్కార్యముల వలన వచ్చిన బిరుదు పేరులు.

ఆంజనేయుని తల్లి అంజనా (స్త్రీ) దేవి; తండ్రి కేసరియను వానరపుంగవుడు. ఇతడు వాయు దేవుని వలన జనించినవాడు. బాల్యమున ఫలభ్రాంతిచే సూర్యుని కబళింపబోయి, వజ్రి వజ్రహతుడై హనువు భగ్నముకాగా హనుమంతుడై పిదప సకల దేవతా వరప్రభావమున సర్వావధ్యుడై వెలసెను సూర్య శిష్యుడై వ్యాకరణాది సమస్త శాస్త్రముల నభ్యసించెను. తదనంతరము సూర్యసుతుడైన సుగ్రీవునకు మంత్రియై, తత్ప్రేషణమున శ్రీరామునిజేరి రామదాసుడై రామదూతయయ్యెను. తర్వాతి కథ జగద్విదితము. రంగనాథ రామాయణమునందు కవిచే ననువదింపబడిన ఈ మూల వృత్తాంతమునందు మార్పులేదు; కాని జన్మ విధానము మొదలగు వానియందు కొలది భేదములు పొడకట్టుచున్నవి.

1. వాయు పుత్రుడు ఆంజనేయుడు :-

(ఎ) గౌడీయ, పశ్చిమోత్తర శాఖీయ రామాయణ ప్రతులందు దాక్షిణాత్య పాఠములో లేని క్రొత్త విషయమొకటి కిష్కింధాకాండము 66వ సర్గలో సుమారు 28 శ్లోకములనే వర్ణింపబడి యున్నది. సముద్రమును లంఘింప నుద్యుక్తుడైన హనుమంతుడు జాంబవదాదులకు తన జన్మ వృత్తాంతమును దెలియజేసిన సందర్భమిది.

"పశ్చిమ సముద్రమునందొక ప్రభాసమను పుణ్య తీర్థముకలదు. శంఖశబలమను దుష్టమహా గజమొకటి స్నానార్థము వచ్చెడి మునులను చంపుచుండెను. ఒకప్పుడు భరద్వాజుని మీదికి పరుగెత్తెను. సమీప పర్వత శిఖరముపైనున్న కేసరి ఈ దృశ్యమునుగాంచి, కుంజరముపై లంఘించి తీక్ష్ణములైన నఖదంతములచే దానిని చీరి, కోరల పెకలించి హతమార్చెను. భరద్వాజుడు హర్షించి కేసరిని వెంటబెట్టుకొని వచ్చి, తత్తీర్థ మునులకా విషయమును దెలిపి అతనికి వరమొసంగుడని వారితో బలికెను. కేసరి మారుత విక్రముడు, కామరూపి, అవ్యయుడైన కుమారుని గోరెను; వారు తథాస్తనిరి.

ఒకనాడు కామరూపయు, కుంజరనామక వానరేంద్రుని దుహితయు కేసరి భార్యయునైన అంజనాదేవి మానవ రూపమున మలయ పర్వతముపై విహరించుచుండ, పవనుడు తత్సౌందర్యమును గాంచి సంకల్పజ శరవిద్ధుడై, ఆమెను బాహువులతో పరిష్వజించి, పాతివ్రత్యమునకు భంగము కాకుండ "హృదయసంగంబు"[1] సలిపెను. తదనుగ్రహమున బలవేగ విక్రమ పౌరుష శౌర్యంబులు గల పుత్రుడంజనకుగలిగెను. ఆతడే కేసరిక్షేత్రజుడు, వాయుపుత్రుడైన ఆంజనేయుడు.

---

1. మానసిక సంగమము, అనగా సంకల్పము.
"సంతానోత్పత్తికి 6 విధములైన పద్ధతులు గలవు"

ఈ శంఖ శబల నామక మత్తగజ సంహార పూర్వకమైన మహర్షివరము అంజనా పవమానుల సంబంధమునకు పూర్వ రంగమును సమకూర్చినది. తండ్రి కేసరి "మారుత విక్రముడైన పుత్రుడు కలుగవలెనని కోరుట, ఋషుల వరప్రదానమును తత్సంబంధమునకు కారణములైనవి. మహావేగ మహాబలములందు వాయువును మించినవాడు లేడు. అతడు కామరూపి, సర్వవ్యాపి, అవ్యయుడు కూడ, అతనివంటివాడు కావలయునన్న అట్టివానికతడే కారకుడు కావలయును. "ఆత్మావై పుత్ర నామాసి"1 అనెడి శ్రుతి ఇందులకు ప్రమాణము. కావున హనుజ్జన్మకుపై వృత్తాంతము బీజ ప్రాయమైనది.

రంగనాథ రామాయణమునందీ ప.ఉ. ప్రతి వృత్తాంతము గ్రహింపబడలేదు. భాస్కర రామాయణమునందిది తు.చ. తప్పక "9 గద్య పద్యములలో"2 వర్ణితమైనది. కాని ఇందును మూలముతో పోల్చినపుడు ఒకటి రెండు భేదములు కానవచ్చుచున్నవి.

A) మూలమున శంఖశబ(వ)ల మను పేరుగల గజమొక్కటి3 యని యుండగా నిందు "శంఖశబల నామంబులు గల దుష్టగజంబులు రెండు"4 అని యున్నది. ఏతదను గుణముగానే "బలువిడినార్చుచున్ గజముపై గజమున్ బడవైచి"5 అనియు" అట్లగ్గజంబులం జంపిన"6 అనియు నిట్లే బహువచన రూపము కనబడుచున్నది. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు సంక్షిప్త పరచి ప్రచురించిన భాస్కరరామాయణమునందును తత్పరిష్కర్తలు ప.ఉ. ప్రతి రామాయణము మరియు పూర్వ ముద్రిత ప్రతులను బహుశః చూడని కారణమున వావిళ్ళ ప్రతిలో నున్నట్లె గ్రహించుట జరిగినది. మా యింటిలో పై యట్టలు పోయిన ప్రాచీన ముద్రిత భాస్కర రామాయణ

"దేవాశ్చేశ్వరవంతో వై శరీరాణ్యావిశంతివై।
సంతిదేవ నికాయాశ్చ సంకల్పా జ్జనయంతియే॥
వాచాదృష్ట్యా తథా స్పర్శాత్ సంఘర్షేణేతి పంచధా॥"
(భారతము ఆశ్రమవాసిక పర్వము. 30 అధ్యా. 21,22 శ్లోకములు)
1. సంకల్పము, 2. వాక్కు 3. దృష్టి 4. స్పర్శ 5. సంభోగము

1. ఏకాగ్నికాండ. ద్వితీయ ప్రశ్న. 11వ అధ్యా.
"అంగాదంగాత్సంభవసి హృదయాదధి జాయసే।
ఆత్మావై పుత్రనామాసి సజీవ శరదశ్శతం॥"

2. భాస్కర రామాయణము. కిష్కింధాకాండము. గద్యపద్య 814-822 వావిళ్ళ ముద్రణము.

3. ప.ఉ. ప్రతి. వాల్మీకిరామాయణము. కిష్కింధా. సర్గ. 58 శ్లో. 15.
"తచ్ఛంఖ శబ(వ)లోనామ ధృష్టః కశ్చిన్ మహాగజః।

4. భాస్కర రామాయణము కిష్కింధా. గద్య. 814.

5. ,, ,, పద్య. 815,816.

6. ,, ,, పద్య. 816.

మొకటి కలదు. దానిని పరిశీలించగా కుంజర మొక్కటని తెలియుచున్నది. ఆపద్య భాగములను జూడుడు.

"బలువడి నాడ్చుచున్ గజముపై గదియంబడి తీవ్రత న్నఖం
బుల వడి దాని నేత్రములు భూరి రయంబున వచ్చి......
... ...
... ... వధించె నక్కరిన్ ...
... ...
దురమున భీకరమగునా-కరిఁ జంపితిఁ గాన"[1]

ఈ పద్య పాదములు వావిళ్ళ ప్రతి భాస్కర రామాయణము కిష్కింధాకాండములోని 815, 816, 817 పద్య గద్య భాగములకు పాఠాంతరములు. ఇచట గజమని ఏకవచనము ప్రయోగింపబడుట గమనార్హము. ఇందును ఒకచోట "దిగ్గజంబులు ..... దుష్టమానంబు లగుచు" అని బహువచనము కనబడుచున్నది. ఇది లేఖక ప్రమాదముగా భావించవచ్చును. దా. ప్రతి రామాయణమునం దీ వృత్తాంతము లేకపోవుట చేతను, ప. ఉ. ప్రతి, గౌడీయ ప్రతులను చూడ నందునను, గజమొక్కటియా? రెండా? అని తేల్చుకొనలేక ఆ ప్రాత ప్రతి ముద్రాపకులు వ్రాత ప్రతులలో నున్నదున్నట్లు ముద్రించియున్నారు; కాని వారు తప్పొప్పుల సవరింపును గూర్చి పట్టించుకొనలేదు. కావున "శంఖశబల నామంబుగల దిగ్గజంబు ... దుష్ట మానసం బగుచు"నని సవరించిన ప్రాచీన ముద్రణా పాఠము మూలానుసారియై యొప్పును. అవసరమగుటచే విషయాంతర మింత దీర్ఘముగా చర్చించితిని.

b) "మాల్యవత్పర్వతమున నుండు కేసరి దేవర్షులచే నియుక్తుడై గోకర్ణ క్షేత్రమున కేగి సముద్ర తీర్థోపద్రవకారియగు శంబసాదనుడను రాక్షసుని సంహరించెను. మహర్షులు హర్షించి వర మొసంగిరి. తత్ప్రభావమున వాయువు హేతువుగా ఆంజనేయుడు జనించినాడు."[2] దాక్షిణాత్య ప్రతి యందలి ఈ వృత్తాంతము పశ్చిమోత్తర శాఖీయ ప్రతి యందలి దుష్ట గజ సంహారమునకు మారురూపము. రంగనాథ రామాయణమునందు ఇది గ్రహింపబడలేదు. భాస్కర రామాయణమునను లేదు,

---

1. భాస్కర రామాయణము ప్రాచీన ముద్రిత ప్రతి పాఠము.

2. దా. ప్రతి వాల్మీకి రామాయణము. సుందర. సర్గ 35, శ్లో. 80, 81, 89.

మాల్యవాన్నామ వై దేహి గిరీణా ముత్తమో గిరిః।
తతో గచ్ఛతి గోకర్ణం పర్వతం కేసరీ హరిః॥ 80
స చ దేవర్షిభిర్దిష్టః పితా మమ మహాకపిః।
తీర్థే నదీపతేః పుణ్యే శంబసాదన ముద్ధరత్॥ 81
... .
హంతేఽసురే సంయతి శంబసాదనే-కపి ప్రవీరేణ మహర్షి చోదనాత్।
తతోఽస్మి వాయు ప్రభవోహి మైథిలి-ప్రభావత స్త త్ప్రతిమశ్చ వానరః॥ 89

c) జాంబవంతుడు హనుమంతుని లంఘనార్థము ప్రోత్సహించుచు, నతని జన్మ వృత్తాంత మిట్లు చెప్పెను. "పుంజిక స్థల ఒక అప్సరః కాంత; ఈమె శాపవశమున కుంజరాఖ్య వానరేంద్రు నకుఁ గుమార్తెయై "అంజన" నామమొంది కేసరికి భార్యయయ్యెను. ఒకనాడు మానవ రూపమున సంచరించుచుండ, వాయువు ఈమె సౌందర్యమునకు పరవశుడై పరిష్వజించి పాతివ్రత్యమునకు భంగము కలిగించకుండ మానస సంగమము నలిపి తననంటి మహావేగ బల సంపన్నుడైన కుమారు నకు గ్రహించెను."

దాక్షిణాత్యోదీచ్య పాఠములు రెండింటియందు కిష్కింధాకాండములో నీ వృత్తాంతము దాదాపు సమానముగా నున్నది.[1] రంగనాథ రామాయణమున నిది గ్రహింపబడినది.[2] ఇందు మూలముకంటె విశేషమొక్కటి అధికముగా కూర్చబడినది. అది "అగ్నిశాపమున వానర వనితయగుట"[3]. మూలమున కేవల "మభిశాప"[4] మనియే కలదు. అది ఎవరిదో తెలియరాదు. భాస్కర రామాయణమునను కేవలము "శాప"[5] మనియే యున్నది. ఇచ్చట ఒక ఊహ చేయవచ్చును. ఇతడు చూచిన సంస్కృత ప్రతిలో "అభి"కి బదులు "అగ్ని" యని యుండెనేమో ? నాగరి లిపిలో "భి" మరియు "గ్ని" అను నక్షరములు ఈగకాలంత భేదము కలిగి దాదాపు ఒకే తీరున నుండును. కావున మొదట "అగ్నిశాపాత్" అని యుండి తరువాతి లేఖకుల పొరపాటుచే "అభిశాపాత్" అయి యుండును. ఇది నిజమైనచో కవి మూలమును అర్థవంతముగా సవరించినట్లగును. అపుడు అగ్ని శాపమునకు కారణము తెలియరాదు.

d) "కుక్కుట వృత్తి నవలంబించి సీతను భోగింపుము" అని పలికిన మహాపార్శ్వునితో రావణుడిట్లు తన శాపమును చెప్పెను. "పుంజికస్థల యను నప్సరః కాంత యొకనాడు బ్రహ్మ కొలువునకుఁ బోవుచుండ దశకంఠుడామెను బలిమిమై పట్టి భోగించెను. ఇది యెఱింగి బ్రహ్మ రావణుని కోపించి "ఇకముందు ఏ కాంతనైన బలిమిని భోగించిన తల నూఱు వ్రయ్యలగునని శపించెను"[6] సీతా సాధ్విని బలాత్కరించకపోవుట కదియే కారణము.

ఈ పుంజికస్థల వరుణుని కన్యక.[7] రావణుని చేత బలిమిగా భోగింపబడిన ఈ పుంజిక స్థలయు శప్తురాలై వానర వనితగా జనించిన పుంజికస్థలయు ఒక్కతెయై యుండును. కావున

---

1. దా. ప్రతి రామా. కిష్కింధా. సర్గ 66 మరియు
   ప. ఉ. ప్రతి రామా. కిష్కింధా. సర్గ 57.
2. రంగనాథ రామాయణము కిష్కింధా. ద్వి. 1218-1230.
3. ,, ,, ,, ద్వి. 1218-1210.
4. దా. ప్రతి రామాయణము కిష్కింధా సర్గ 66 శ్లో. 9.
5. భాస్కర రామాయణము కిష్కింధా. పద్యము 800.
6. దా. ప్రతి రామాయణము యుద్ధకాండము సర్గ 13 శ్లో, 11-15.
7. దా. ప్రతి రామా. యుద్ధకాండము సర్గ 60 శ్లో. 11 1/2.
   ఉమానందీశ్వర శ్చాపి రంభావరుణ కన్యకా।
   వరుణకన్యకా = పుంజికస్థలా అని గోవిందరాజీయము.

"పూర్వజన్మ స్మృతి కలిగిన అంజన శివమూర్తియైన వాయువు నారాధించి, ఆంజనేయుని పుత్రునిగా బడిసి, అతనిద్వారా రావణునిపై పగ సాధించుకొన్నది" యని సమన్వయము చేయవచ్చును. ఈ యుద్దేశ్యము తోడనే కాబోలు బుద్ధభూపతి గౌడీయ, పశ్చిమోత్తర శాఖీయ రామాయణ ప్రతులలో లేనట్టి పుంజికస్థల బ్రహ్మశాప వృత్తాంతములను దా. ప్రతి ననుసరించి గ్రహించి సుమారు 12 ద్విపదలను వ్రాసినాడు.[1] భాస్కర రామాయణమునను నిది గలదు.[2]

(2) రుద్రబీజుడు, శివావతారుడు ఆంజనేయుడు—

శ్రీరాముడు వటు రూపుడైన హనుమంతుని మొదట చూచి

"ఈ రూపు రేఖయు నిలఁ గోరి రుద్రు-డా రూఢిగా నితడై పుట్టినాడొ"[3]

యని రుద్రావతారునిగా సందేహించెను.

ఇంద్రజిత్తు "అరుదంది రౌద్రాస్త్ర మతనిపై నేయఁ-బెరిగి యాతడు రుద్రబీజంబు గానఁ
గదలక నిలిచిన"[4]

యనుచోట హనుమంతుడు రుద్రబీజునిగా చెప్పబడెను. వాల్మీకి రామాయణ త్రివిధ పాఠములందు ఆంజనేయుడు శివావతారుడు, రుద్రబీజుడని చెప్పబడలేదు. దీనికి ఇతర రామాయణ పురాణములు ఆధారములు.

A) శుకసారణులు రావణునికి ఆంజనేయుని గూర్చి చెప్పునపుడు అధిక పాఠమొకటి ఆంధ్ర విశ్వకళాపరిషత్తువారి రంగనాథ రామాయణము రెండవ అనుబంధము యుద్ధకాండము. పుట. 777లో కలదు. ఆపాఠవృత్తాంత మిట్లున్నది.

"గౌరీగరళ కంధరులు పరిణయానంతరము మదన మనోరథముల కూడికూడి వన విహారము సలుపుచు నొక్కచో మర్కట కూటంబును గాంచిరి. పార్వతి యాశ్చర్యపడి ఈశ్వరునకు తన తలంపును దెలిపెను. అంతట పార్వతీ పరమశివులు కపిరూపముల ధరించి క్రీడింపగా, నామెకు గర్భమయ్యెను ఆయుమాదేవి తద్గర్భ భారము భరింపలేక యవనిపైఁ బెట్టెను. కుంభినియు మోయ జాలక సదాశివుని శరణువేడెను, అతడు దానిని గ్రహించి, వేయేండ్లు దాల్చి వాయుదేవర కొసంగెను. కేసరి పత్ని అంజని పుంజిక స్థలమునకుఁబోయి పుత్రుని గూర్చి తపమాచరించుచుండ పవనుడు మెచ్చి తనచేతి గర్భంబు నంజనిదోయిటనిడెను. అంజని దానిని మ్రింగి గర్భవతియై ద్వాదశ మాసానంతరము కొడుకును గాంచెను."

ఇదే విషయము కిష్కింధాకాండము రెండవ అనుబంధము పుట 716లో కొలది తేడాతో వర్ణింపబడి యున్నది.[5] వటు రూపుడైన హనుమంతుడు శ్రీరామునకు తన చరిత్ర చెప్పు సందర్భ

---

1. రంగనాథ రామాయణము యుద్ధకాండము ద్వి. 415-421.
2. భాస్కర రామాయణము. యుద్ధకాండము పద్య. 113.
3. రంగనాథ రామాయణము. కిష్కింధా. ద్వి. 89,
4. ,, ,, సుందర. ద్వి. 837.
5. రాయల్ అండ్ కోవార్ప్రతి రంగనాథ రామాయణమున మూలపాఠమునందీ ద్విపదలు చేర్చబడినవి.

మిద్ది, "మర్కట రూపులైన శివ పార్వతులు ఉపరతియందుండగా, రేతంబు దిగజారి భూమికేగగా కరువలి దానిని తవ రెండు కరంబుల ధరించుకొని వచ్చి అంజనీదేవి కరాంజలి యందుంచగ, ఆమె దానిని మ్రింగి గర్భవతియై పిదప నర్భకునిగాంచెను." ఇది పూర్వపుదానికి దీనికి గల భేదము.

ఆంజనేయుడు రుద్రబీజుడు[1] వానర రూపుడును అగుటకు కపిరూపధారియైన రుద్ర వీర్యము వాయువు తోడ్పాటున నంజనా గర్భమునఁబడుట కారణమని మీద చెప్పబడిన కథలలోని ప్రధాన సారాంశము.

పరాశర సంహిత శివ పటలమునందీ వృత్తాంతమున్నది. ఇందు శివుడు వానర ద్వంద్వమును జూచుచు పార్వతియందు వీర్యము వదలినాడని కలదు, కాని పార్వతీ పరమశివులు మర్కటు లైనట్లు లేదు.[2] ఈ భేదము దప్పమిగిలిన కథ యంతయు సమానమే.

అగ్ని శివ పురాణములందు "వానరరూపధారియైన శివ వీర్యమే ఆంజనేయోత్పత్తికి కారణ" మనెడి వృత్తాంతములు చెప్పబడినవి.[3]

రంగనాథరామాయణము అనుబంధ ద్విపదలయందలి ఈ వృత్తాంతము ప్రక్షిప్తమేగాని, అసలు కర్త దికాదని పరిశీలించిన తెలయగలదు.

శివ మతమున శివుని కెంత ప్రాథమ్యమో, రామాయణమున హనుమంతునకంతగలదు. గణేశోత్పత్తికి, గజముఖముగలుగుటకు సంబంధించిన గాథలెన్నో పురాణములందుండగా, నన్నె చోడుడు తన కుమార సంభవమునందు గజాననోత్పత్తికి గజరూపధారియైన శివ వీర్యము కారణ మైనట్లు వర్ణించినాడు.[4]

యజ్జాతి శరీరముతో రమించినపుడు స్ఖలనమైన తద్వీర్యమున తజ్జాతి రూపముగల శిశువు

---

1. దూర్వాస రామాయణము :
   ....హనుమాన్ రుద్రబీజజః।
   అష్టమూర్తేశ్శివస్యాసీ ద్వాయు రూపాత్ సుతోఽబలీ॥
   హనుమాన్ కేసరి క్షేత్రె మకారార్థస్స ఉచ్యతే॥
   (రామాయణ సారోద్ధారము-యుద్ధకాండము. ప్రథమ భాగము 248 పుటలో ఉద్ధృతము)

2. పరాశరసంహిత శివ పటలము.
   "శ్రీశైలేశివయా శంభు ర్విహరన్ రతిలాలసః।
   దృష్ట్వాచ వానర ద్వంద్వం పార్వత్యాం వీర్యముత్సృజత్॥
   సాతద్భర్తుమశక్తాచ తద్దావగ్నయే, సచ।
   వాయవే చార్పయామాస, వాయుదేవోఽపి చార్పయత్
   అపత్యం ప్రతి తప్యంత్యా అంజనాయాః కరేసహి॥
   (రామాయణ సారోద్ధారము కిష్కింధా. పుట 150, 151లో ఉద్ధృతము)

3. వాడ్రేవు శేషగిరిరావు. అష్టాదశ పురాణ సంగ్రహము. పుటలు. 51,52,1010.

4. నన్నెచోడుడు- కుమారసంభవము. ఆశ్వా-1 పద్యగద్య. 101-107.

జనించునని శాస్త్రవేత్తలు చెప్పుదురు. కావున శివభక్తుడొకడు హనుమజ్జననమునకు సంబంధించిన యిట్టి కథను పురాణోక్తమైన దానిని గ్రహించి, ద్విపదలు గూర్చి నడుమజేర్చి విష్ణు ప్రాధాన్యమును దగ్గించుటకు యత్నించినాడని తోచుచున్నది. ఈ యనుబంధ ద్విపదలయందు యతి భంగాది దోషములు గనబడుచున్నవి.

a) యతి భంగము-

1) గొనకొన్న పరిమళంబులు గ్రోలిక్రోలి

2) అరయంగ సుఖ వినోదము లాడియాడి

3) తరుణి యప్పుడు గర్భమతి భరమైన

4) స్థావర జంగమాదులు నాది గాగ

మొదలగునవి—

b) గణభంగము-

1) సద్యో గర్భంబు సన్నిధి నయ్యె.

2) పుంజిక స్థలమునకుఁ బోయితన పేర్మి

c) "పుంజికస్థల" యను నప్సరఃకాంత వానరియైనట్లు వాల్మీకము. ఇందు "పుంజిక స్థలము"అని ప్రదేశ నిర్దేశము నూతనము.

కావున ఆం. వి. క. పరిషత్తు రంగనాథ రామాయణ పరిష్కర్తలు ఈ ద్విపదలను ప్రక్షిప్తముగా నెంచి అనుబంధము 2-న చేర్చినారనుట సమంజసము—

(b) శివపురాణము శతరుద్ర సంహిత 29 వ అధ్యాయములో ఈ క్రింది వృత్తాంతము గలదు.

"దానవులను మోహింపజేయు నిమిత్తము విష్ణువు మోహినీ రూపము దాల్చెను. దాని యతిలోక సౌందర్యమును గాంచి శివుడు కలతఁ జెందెను. ఆయంతః క్షోభముతో స్ఖలితమైన ఊర్ధ్వరేతస్కుని రేతో వీర్యమును సప్తర్షులు పత్రపుటమున గ్రహించి గౌతమముని పుత్రికయైన యంజనా దేవి కర్ణములలో పోసిరి. ఆమె గర్భవతియై ఆంజనేయుని బడసెను."[1]

ఇది ఆంజనేయుడు శివ వీర్యోత్పన్నుడనుటను దెలుపుచున్నది. ఇందు అంజన గౌతమ ముని పుత్రికగాను, శివ వీర్య స్ఖలనమునకు మోహినీ సౌందర్య దర్శనమును కారణముగా చెప్పబడుట విశేషము. రంగనాథ రామాయణమునందు ఈ వృత్తాంతము ప్రక్షిప్తముగానైనను చేర్చబడలేదు ఆంజనేయ జన్మను దెలుపుటచేత అప్రస్తుతమైనను, ఈ వృత్తాంత ముట్టంకింపబడినది.

3) నందీశ్వరావతారము ఆంజనేయుడు-

మేఘనాదుని బ్రహ్మాస్త్రముచే బంధితుడై సభకు గొనిరాబడిన హనుమంతుని జూచి రావణుడు "పూర్వము నన్ను శపించిన నందీశ్వరుడే ఈ రూపమున వచ్చెనా ?" అని తలంచెను.[2] భోజమహా

---

1. శివపురాణము, శతరుద్ర సంహిత. తృతీయ భాగము అధ్యా-20. శ్లో. 3-7.
2. దా. ప్రతి రామాయణము సుందర. సర్గ 50 శ్లో. 2, 9.

రాజు చంపూ రామాయణమున నిట్లే చెప్పినాడు.1

రంగనాథ రామాయణము సుందరకాండములో "రావణుడు హనుమంతుని నందీశ్వరునిగా తలంచిన శ్లోకము" అనువదింపబడలేదు, కాని

"అలనంది కోపాన లార్చులఁ బడెనే"2

అని శూర్పణఖ పుత్ర మరణమునకు దుఃఖించుచు, రావణునకు గలిగిన ఇతర శాపములతోఁ బాటు నంది శాపమును నెమరు వేసినది. ఈ నంది శాప వృత్తాంతము ఉత్తర కాండములో గలదు.

"రావణుడు కుబేరుని జయించి, పుష్పక విమానముపై వచ్చుచుండ కైలాస మడ్డుపడెను. విమానము కదలలేదు. దానిపై నున్న నందీశ్వరుడు "శంకరు డీ పర్వతమున క్రీడించుచున్నాడు; మరలిపొమ్మని" హెచ్చరించెను. దశకంఠుడు నంది కోతిమోమును జూచి పరిహసించెను. నంది క్రుద్ధుడై "వానరాస్యముతో నున్న నన్ను హసించితివి గాన, నా ముఖముతో సమానమైన ముఖముగల కపులు మద్వీర్య సంపన్నులై నీ కుల వినాశనమునకై జనించగలరని" దశగ్రీవుని శపించెను."3

విష్ణు ధర్మోత్తర పురాణము ప్రథమ భాగము 222 అధ్యాయము 5 నుండి 8 శ్లోకములలో నీ శాప వృత్తాంత మిట్లె యున్నది.

ఉపర్యుక్త నందిశాప వృత్తాంతమునందు నందీశ్వరుని రుద్రాంశము హనుమద్రూపమున వెల్లడి యగునట్లు సూచింపబడినది. ఏకాదశ రుద్రులలో నంది పదునొకండవ వాడు. విష్ణువు శ్రీరాముడుగ నవతరింపగ, నితడు తత్సహాయమునకై హనుమద్రూపమున నవతరిల్లెను 4

శిలాదుని తపస్సునకు ప్రసన్నుడై ఈశ్వరుడే అతనికి తనయుడుగా అయోనిజుడై నంది నామమున జనించెను,5 కావున శిలాద తనయుడు నంది. నందీశ్వరుడు ఏకాదశ రుద్రుడు. ఈ ఏకాదశ రుద్రరూపుడైన శివునకు రావణునిపై కోపము గలదు. దశకంఠుడు తన శీర్షములను ఛేదించుకొని, ఒక్కొక్క శిరమును ఒక్కొక్క రుద్రనామక శివునకు నర్పించుచు దశరుద్రులను బూజించెను; పదునొకండవ తల లేనందున ఏకాదశ రుద్రుని పూజంపక వదలిపెట్టెను. దానిచే శివుడు తన కవమానము జరిగినట్లు తలంచినాడు. కావున కోపించి అట్టి ఏకాదశ రుద్రాంశ ముతో శివుడు రావణునితో తలపడి యుద్ధము చేయుటకై రామ సహాయార్థము వాయు దేవత ద్వారా, అంజనీ గర్భమునఁ బ్రవేశించి ఆంజనేయుడై అవతరిల్లెను.

---

1. భోజుడు. చంపూ రామాయణము. సుందర. శ్లో. 88.
2. రంగనాథ రామాయణము. అరణ్య. ద్వి. 361.
3. దా. ప్రతి రామాయణము. ఉత్తరకాండము. సర్గ 26, శ్లో. 16, 17.
4. స్కందపురాణము. మాహేశ్వర ఖండము (కేదారఖండము) అధ్యా-8 శ్లో. 99, 100.
5. శివపురాణము. శతరుద్ర సంహిత అధ్యా-6 శ్లో. 34.

వాయువు శివుడే- ఇతడు అష్టమూర్తి సంపన్నుడు.[1] కవికుల గురువైన కాళిదాసు తన్న అభిజ్ఞాన శాకుంతల నాటకము నందలి నాందీ శ్లోకమున శివుని ఈ అష్టమూర్తిత్వమును విశదపరచి నాడు. కావున వాయువు మహాదేవుని అష్టమూర్తులలో నొకటి, కావున పవన శివుల కభేద మనుట సారాంశము.

ఇపుడు నందిశాప రుద్రబీజజ, వాయుపుత్ర, శివావతార వృత్తాంతములను సమన్వయముచేసి, ఏకసూత్రమున బంధించినచో "శివుడు తన ఏకాదశ రుద్రరూపమును రావణుడు పూజింపక అవమానించగ కోపించి, పుష్పక విమానముపై మహాగర్వమున నేగు నతనిని పరిహాస మిషతో నంది రూపమున శపించి, వానర రూపమున స్ఖలితమైన తన వీర్యమును మూర్త్యంతరమైన వాయు దేవతద్వారా అంజనా గర్భమున నెలకొలిపి, ఆంజనేయుడుగా నవతరించి, రామునికి సహాయపడి రావణుని సాధించినాడ"ని తాత్పర్యము వచ్చును. "తాను పుత్రుడుగా జనించును" అనుటకు "ఆత్మావై పుత్రనామసి" యనెడి శ్రుతి ప్రమాణము.

ఇట్లు రంగనాథ రామాయణము నందలి విశేషణముల కాధార వృత్తాంతములను పురాణముల సహాయమున పరిశీలించగా, భిన్న వృత్త సమన్వయమే కర్త యుద్దేశ్యమని విదితమగును—

4. విష్ణ్వవతారము హనుమంతుడు.

ఆనందరామాయణమున ఆంజనేయుడు విష్ణ్వవతారమని చెప్పబడినది. "దశరథుడు పుత్ర కామేష్టి యాగమున లభించిన పాయసమును కౌసల్యా సుమిత్రా కైకేయీలకు పంచిపెట్టెను. ఒకా నొక గ్రద్ద కైకేయి హస్తమునందలి యా పాయస పాత్రను అకస్మాత్తుగా లాగుకొని ఎత్తుకొని పోయి అంజనాద్రిపై తపమాచరించుచున్న అంజనీదేవి చేతిలో పడవేసెను. ఆమె దానిని భుజించి గర్భవతియై ఆంజనేయుని కనెను."[2]

ఈ కథవలన హనుమంతుడు శ్రీరామ సహోదరుడగుచున్నాడు. రావణుని శక్తిచే లక్ష్మణుడు మూర్ఛాక్రాంతుడయ్యెను. సుషేణుడు హనుమంతునితో ద్రోణాద్రికి పోయి సంజీవనౌషధము తెల్ల వారులోగా తెచ్చిన లక్ష్మణుడు బ్రతుకునని చెప్పెను. ఇదివిని శ్రీరాముడు హనుమంతునిగాంచి.

"పడియున్న లక్ష్మణు ప్రాణంబులెత్తి-పడయుము త్రిభువన ప్రఖ్యాత కీర్తి
అనుజులు మువ్వురు రరయ నాకిప్పు-డనిలనందన నల్వురైరి నీతోడ"[3]

అనిపల్కియున్నాడు. వాల్మీకమునందిట్లె యున్నది. ఆంజనేయుడు విష్ణ్వంశ సంభూతు డనుటకు చేయబడిన ఆనంద రామాయణమునందలి కల్పన శ్రీరాముని పై మాటలపై యాధారపడి యున్నది, కాని ఇది వాల్మీకి మతమునకు విరుద్ధమగుటచేత బుద్ధభూపతి దీనిని గ్రహింపలేదు.

---

1. శివపురాణము. తృతీయ ఖండము ద్వితీయాధ్యాయము శ్లో. 4.
"భూమ్యంభోఽగ్నిమరుద్వ్యోమ క్షేత్రజ్ఞార్క నిశాకరాః।
అధిష్ఠాతాశ్చ శర్వాద్యై రష్టరూపైః శివస్యహి॥
2. ఆనంద రామాయణము. సారకాండ. సర్గ 13 శ్లో 157-161.
3. రంగనాథరామాయణము. యుద్ధకాండము. ద్వి. 6588,6589.

విష్ణుపారమ్యమును బోధించదలచి యున్నందున రుద్రబీజుడైన హనుమంతుని మూలము ననుసరించి శ్రీరాముని దూతగానే, శ్రీరాముని బంటుగానే తెలిపి యున్నాడు.

ఆంజనేయుడు హనుమంతుడగుట:—

అంజనా నందనుడు బాల్యమున నుదయించు సూర్యమండలమును జూచి, ఫలభ్రాంతితో ఆకటి పెల్లున దానిని పట్టంగ మూడువేల యోజనంబులు గగనంబునకెగసి, అటనుండి పూర్వాద్రిపై బడగా అతని హనువు భగ్నమయ్యెను. అందువలన అతడు హనుమంతుడయ్యెను."[1]

శుకసారణులు ఈ వృత్తాంతమును రావణునకు దెలిపిరి. లంకా దహనముచే పూర్వపరచితుడైన ఆంజనేయుడు బాల్యముననే ఇంతటి బాహుబలవేగ పరాక్రమములు కలవాడనియు, అతడు శ్రీరాముని పక్షముననుండి నీతో తలపడ పోవుచున్నాడనియు తెలిపి రావణుని భయపెట్టుట ఇందలి యుద్దేశము. రంగనాథ రామాయణమున ఇది మూలానుసారముగానే యున్నది.

ఉత్తరకాండమందిది కొన్ని విశేషములతో వివరించబడినవి. "ఫల భ్రాంతితో సూర్యుని పట్టుకొనుటకెగసిన కాలము సూర్యగ్రహణ కాలము. సూర్యుని మ్రింగుటకు వచ్చు రాహువు బాలాంజనేయుని జూచి, మరియొక రాహువని భయపడి, పారిపోయి ఇంద్రునితో మొఱపెట్టుకొనెను. అతడైరావతముపై వచ్చి ఆంజనేయుని వజ్రముతో కొట్టగా, నతడు పూర్వాద్రిపైఁబడెను. అతని ఎడమ దౌడ (హనువు) భగ్నమయ్యెను. పవనుడా శిశువునెత్తికొని పర్వత గుహనాశ్రయించి, వాయు సంచారమును స్తంభింపఁజేయ, లోకములు సంక్షోభమునకు గురియయ్యెను. ప్రజాపతి దేవతలతో వచ్చి హనుమంతుని పునర్జీవితుని జేసి సర్వావధ్యత్వ వరముల నొసంగెను. దేవతలను గ్రహించిరి."[2]

శుకసారణులు హనుమజ్జన్మ వృత్తాంతమును జెప్పునప్పుడు రాహువిషయ ప్రస్తావము రాలేదు. ఆంధ్రవిశ్వకళాపరిషత్తువారి రంగనాథరామాయణము అనుబంధము2లో ఈ సందర్భమునకు సంబంధించినట్టి సుమారు 85 ద్విపదలలో ఒక విచిత్ర కథాంశము కనిపించుచున్నది.

"వజ్రి వజ్రహతుడై భగ్నహనువైన ఆంజనేయుడు పూర్వ సముద్రమున బడెను జలచరంబు లీతనిని ద్రుంచికొని మ్రింగినవి. అంజనీదేవి కుమారుడు కనబడనందున మారుతుని దలంచి పెక్కుభంగుల శోకించినది. వాయువామెనోదార్చి, లోకములు సుక్కింపగ ప్రతినబట్టి పోయి, శ్రీధరుని గర్భమున శిథిలుడై యుండెను; జగమంతయు తల్లడిల్లెను. బ్రహ్మ ఇంద్రాదులతో వచ్చి, వాయువును ప్రార్థించి, సముద్రము నొద్దకు పోయి వరుణుని రప్పించెను వరుణునానతిని మీన, కూర్మ, కర్కటక, సర్పాది జలచరములు తాము మ్రింగిన హనుమంతుల అవయవములను దెచ్చి యీయగా, కమలజుడు వానిని సంధించి, అనిలాత్మజుని బ్రతికించెను. దేవతలెల్ల వరము లొసంగిరి."[3]

---

1. రంగనాథ రామాయణము. యుద్ధకాండ. ద్వి. 1586-1590.
2. దా. ప్రతి రామాయణము. ఉత్తరకాండము. సర్గ 35 శ్లో. 31-65 మరియు సర్గ. 36 శ్లో. 1-30
3. రంగనాథ రామాయణము. (ఆం.వి.క.ప. ప్రచురణము.) అనుబంధము. 2. పుట. 768.

"జలచరములు పవనజుని ద్రుంచికొని మ్రింగుట, పిదపనవి వరుణుని యాజ్ఞచే మ్రింగిన యవయవములను దెచ్చి బ్రహ్మకర్పించుట, వానినతడు సంధించి హనుమంతుని పునర్జీవితుని జేయుట" యనెడి కథాంశములు ఆశ్చర్యము గొల్పును. కాని యివి యమూలకములే కాక బుద్ధభూపతి వ్రాసినవి కావు. యతి ప్రాసాది దోషములుండుట ఇందుకు కారణము.

యతిభంగము :- ఊహించి యనిలుని హృదయాన నిలిపి ఇత్యాదులు.

గణభంగము :- అమరపతి తనచేత యాయుధంబులను ఇత్యాదులు.

ఆంజనేయుని తపస్సు :-

పవన సుతుడు బ్రహ్మను గూర్చి తపముఁజేసెను. ఆతడు సాక్షాత్కరింపగా, వేవేలు విధములుగా సన్నుతించి.

"గతిమోక్ష కామ్యార్థ కారణంబులకుఁ-బతియెవ్వడ"ని

యడిగెను. అపుడజ్జసంభవుడు

..................నీమేని యురుభూషణములు కలుగొన్నయాతడే గతియును, బతియును, సకల భూతజాలంబులకు భువికెల్ల కర్త, అతడే విష్ణువు అతడే నీగతియని యాత్మ తెలియుమని తెలిపెను.1

ఇట్టి హనుమంతుడు సుగ్రీవునాదేశమున బ్రహ్మచారి రూపముతో శ్రీరాముల యొద్దకురాగా, నతడు లక్ష్మణుని తోడ.

"కనకవు వన్నెయుఁ గరమొప్పుముంజి-ఘనరత్నకుండల కలిత కర్ణములు
నురుతర హారంబు లొంటి జన్నిదము- కరమొప్పుగోచియుఁ గరకంకణములు
నుపమింప యరుదైన యొప్పులనొప్పు-గపిరూపు మనుజుడు గైకొనె నొక్క"2

అనికొని యాడగా, ఆంజనేయుడు విని, అతనిని విష్ణువుగా గుర్తించి తనసంగతి దెలిపి శ్రీరామునకు భృత్యుడై సర్వ విధములు సేవచేసెను.

రంగనాథ రామాయణమునందలి ఈ విషయము వాల్మీకమున లేదు. పద్మపురాణమునందు శ్రీరాముడాభరణ యుక్తుడైన వానర బ్రహ్మచారిని చూచినట్లు వర్ణింపబడినది.

"వానర మేకం మణికుండలం హేమపింగలం సుదృఢబద్ధమౌంజీ కాపీన మచ్ఛోపవీతిన మతిచంచలం ఫలమాదాయాత్మని విక్షిపరతం..........రామో వీక్ష్య లక్ష్మణ మభాషత."3

ఆయా గ్రంథములలోని ఆంజనేయ స్తోత్రముల వలన అతని తనూకాంతి స్వర్ణవర్ణనము,

---

1. రంగనాథ రామాయణము. కిష్కింధా. ద్వి. 130-138.
2. ,, ,, కిష్కింధా. ద్వి. 86, 87.
3. పద్మ పురాణము. ద్వితీయ ఖండము పురాకల్పీయ రామాయణము. పుట. 280 సంస్కృతిక సంస్థాన ప్రచురణము.

అతని వస్త్రాభరణములు మౌంజీ కౌపీన కుండల హారములని తెలియును.[1] బ్రహ్మచారి గావున అతడు ఒంటి జందెము గలవాడు, అతని కీ యాభరణములు జన్మసిద్ధము లనియు కాదు; బ్రహ్మ వరముగా నొసంగినాడనియు భిన్నాభిప్రాయములు గలవు. ఇతడు తప మాచరించినట్లు స్కాంద, పద్మ, శివ, బ్రహ్మాండాది పురాణములందుగాని, ఆనంద, ఆధ్యాత్మ రామాయణములందు గాని లేదు. ఆకరము లభ్యము గానందున బుద్ధారెడ్డి స్వీయకల్పనమనియు చెప్ప వలనుపడదు. అర్వాచీనమైన ఆశ్చర్య రామాయణమునం దీ విషయము వర్ణితమై యున్నది.[2] తత్కర్తలు దీనిని రంగనాథ రామాయణాధారముగా వ్రాసియుందురు.

మూలమునందు లేని ఈ ఆంజనేయ భూషణ కథాంశమును ఒక ప్రత్యేక ప్రయోజనమును కాంక్షించి కవి గ్రహించినాడని తోచును. "ఈ భూషణములు బ్రహ్మవరమున నితరులకు కనబడ కుండుట, కాంచినవాడు గతి మోక్ష కామ్యార్థ కారణంబులకు పతియు గతియునగు శ్రీహరియగుట, అతనికై హనుమంతుడు అన్వేషించుచు తిరుగునప్పుడు ఇతరులెవ్వ రాభూషణములను గాంచకుండుట, శ్రీరాముడు వానిని గాంచి తమ్మునకు దెలుపుటచే నతడే విష్ణువని గుర్తించుట, ఇట్టివి కార్యకారణ సంబద్ధములై ప్రయోజనవంతములైనవి. శ్రీరాముని దూషించువారున్నారు కాని, ఆంజనేయ దూషకులు లేరు. అతని ప్రభావము నాన్యతోదర్శనీయము. గుప్తాభరణముల గుర్తింపు వలన శ్రీరాముడే శ్రీవిష్ణువని బ్రహ్మ వచనమున ఆంజనేయుడు గుర్తించి జానకీపతిని అతడు సేవించినా డనుట గతిమోక్ష కామ్యార్థములకు పతియు గతియు విష్ణువని ప్రకటించుట, తద్ద్వారా విష్ణు పార మ్యమును బోధించుట కర్తయొక్క ముఖ్యోద్దేశ్యము.

"ఆంజనేయుని తపస్సు, బ్రహ్మవరము, ఉరుమేని భూషణ దర్శనములకు సంబంధించిన ఈ ద్విపదలు ఆంధ్ర విశ్వ కళాపరిషత్తువారి ప్రతిలో రెండవ అనుబంధమునఁ జేర్చబడినవి. యతి ప్రాస గణ భంగాది దోషములు లేవు. ఒకటి రెండు పాదాంత విసంధులు మాత్రము గలవు. రాయల్ అండ్ కో, వావిళ్ళవారి ప్రతులందు మాత్రము మూలగ్రంథముననే చేర్చబడినవి.

ఇట్లు రంగనాథ రామాయణము నందలి ఆంజనేయ వృత్తాంతము మూలాభిన్నమై, కొలది సంకోచ వికాసములకు లోనై, పురాణ ప్రభావ మధికముగా గలిగి యున్నదని పరిశీలనపై తెలియుచున్నది.

---

1. a) ఆథర్వణీయ రామరహస్యోపనిషత్తు, ద్వితీయాధ్యాయము.
"ద్విభుజం స్వర్ణ వర్ణాభం రామసేవా పరాయణం।
మౌంజీ కౌపీన సహితం మాంధ్యాయేద్ రామ సేవకం॥"

b) మంత్ర మహార్ణవము పుట 184.
వజ్రాంగం పింగ కేశాఢ్యం స్వర్ణకుండల మండితం॥

2. లక్కావజల వెంకట కృష్ణశాస్త్రి- ఆశ్చర్య రామాయణము
కిష్కింధా కాండము సర్గ 3 శ్లో. 20-26.

యుద్ధకాండము

31. రావణుడు విభీషణుని సభలోఁ దన్ని వెడలగొట్టుట :—

సిందుసభలో ఇంద్రజిదాదులు దశకంఠుని చర్యను సమర్థించుచు, సీతను రామునికప్పగింపఁ గూడదనియు, రామలక్ష్మణులను సుగ్రీవాది వానరులతోఁ గూడ హతమార్తుమనియు రావణుని పెడదారి పట్టించు మాటలను మాటాడుచుండిరి. అపుడు విభీషణుడు లేచి వారినందరిని వారించి "ఆదినారాయణుం డర్కవంశమున దశరథునకుఁ దనయుడుగా నవతరించినాడనియు, అతడు వారిధి దాటివచ్చి లంకను భస్మము సేయకమున్నె సీతాదేవిని శ్రీరామభద్రునకు అర్పింపుమనియు రాముని మహిమను దెలుపుచు రావణునకు యథార్థమైన హితోపదేశమును జేసెను. ఈ మాటలు విని రావణుడాగ్రహోదగ్రుడై

.......విభీషణు నదరంటఁ జూచి-

................గద్దియనుండి దిగ్గన లేచివచ్చి

యడిదంబు ఝళిపించి యటు వ్రేయఁబూని-యుడిగి విభీషణు నుగ్రతఁ దన్నెఁ

దన్నిన వజ్రంబు తాకునఁ గూలు-నున్నత గిరివోలె నుర్విపైఁ బడియె."1

ఇంతేకాక, రావణుడు విభీషణుని సంహరించుటకు వాలనెత్తెను. కాని ప్రహస్తు డడ్డము వచ్చి యా ఖడ్గమును లాగుకొనెను. అంతఁ గన్నులనుండి నిప్పులు రాలగా దశాననుడు ప్రహస్తునిఁ జూచి,

"వీని దురుక్తులు వింటె ప్రహస్త-వీని నమ్ముదురె యెవ్విధిఁ దమ్ముడనుచు

వెడలంగఁ ద్రోయుము. వేగంబె వీని-నెడచేసి మొగ మోడితేని నా యాన"2

అని పలుకగా, ప్రహస్తుడు విభీషణునిఁ గాంచి,

"వలదిట నీవుండ, వలసిన యెడకు-వెలువడి యరుగు మిప్పటికిఁ బాసి"3

యని యాగ్రహ వృత్తిఁ దోపగా నుడివెను. అప్పుడు విభీషణుడు తన నలుగురు రాక్షసులతో రావణుని వీడివచ్చెను.

ఇట్లు రంగనాథ రామాయణమునందు రావణుడు తమ్ముడైన విభీషణుని నిండు సభలో తన్నుటయే కాక, చంప నుద్యుక్తుడై, దురుక్తులాడి, ప్రహస్తునిచే గెంటించినాడని స్పష్టముగాఁ గలదు. దా. ప్రతి రామాయణమునందు "రావణుడు విభీషణుని దన్నినట్లు లేనందున విమర్శకులు4

---

1. రంగనాథ రామాయణము యుద్ధకాండ. ద్వి. 535, 538-540.
2. ,, ,, యుద్ధకాండ. ద్వి. 544-545.
3. ,, ,, యుద్ధకాండ. ద్వి. 547.
4. ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్యము సంపుటము-3, పుట-234.
   వారణాసి వేంకటేశ్వరులు- ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహము పుట-135.
   వేదము లక్ష్మీనారాయణశాస్త్రి పీఠిక- రంగనాథ రామాయణము వావిళ్ళ ప్రతి పుట-17.
   మొదలగువారు.

చాలామంది దీనిని అమూలకముగాను, అవాల్మీకముగాను లేక మూలాతిక్రమణముగాను ఘంటాపథముగా ఘోషించుచున్నారు.

దా. ప్రతి వాల్మీకి రామాయణమునందు ఈ సందర్భములో రావణుడు "శత్రువును సేవించుచు మిత్రునివలె నటించుచున్న వానినుండి చాల దూరముగా నుండవలెను. లోకమునందు జ్ఞాతులు ప్రచ్ఛన్నహృదయులు, ద్రోహకారులు. తామరాకులపై పడిన నీరు సంగతము కానట్లు అనార్యులతోడి స్నేహము సంగతము కాదు. తుమ్మెద మకరందమును గ్రహించిన పిదప పుష్పమును వీడునట్లు అనార్యుల తోడి స్నేహము స్వార్థము పూర్తియైన పిదప దూరమగును." అని యిట్లు క్రోధముతోం బలుకుచు

"అన్యస్త్వేవం విధం బ్రూయా ద్వాక్యమే తన్నిశాచర।
అస్మిన్ముహూర్తే నభవేత్వాంతు ధిక్కుల పాంసనం॥"1

అని విభీషణుని ధిక్కరించగా,

"ఇత్యుక్తః పరుషం వాక్యం న్యాయవాదీ విభీషణః।
ఉత్పపాత గదాపాణి శ్చతుర్భి స్సహరాక్షసైః॥"2

అని యుండినట్లు విభీషణుడు నల్గురు రాక్షసులతో ఎగిరివచ్చెను. కావున విమర్శకులు అమూలకమనియు. అవాల్మీకమనియు ననవలసి వచ్చినది.

ఇచట చర్చనీయాంశ మొకటి కలదు,

"రావణుడు కేవలము తమ్ముని దూషించినంత మాత్రమున విభీషణు డతనిని విడనాడినాడనుట అంత బలవత్తరమైన కారణము కాదు. తనకు విరుద్ధముగాం బలికిన తమ్ముని దూషించుట లోక సహజమే. అజ్ఞానాంధకారములో నున్న దశకంఠుడు కొలదిగా కఠినముగా మాట్లాడినాడు; అంతే. ఆ మాత్రమునకే అతడు రావణుని వీడవలెనా ? ధర్మజ్ఞుడైన తమ్ముడు అన్నను క్లిష్ట పరిస్థితిలో వీడివచ్చుట దోషము. అది అతని స్వార్థమును దెల్లము జేయును" అని వాదించుటకు ఆస్కారము కలదు. అందుచేత బుద్ధభూపతి తన రామాయణమునందు "రావణునిచే విభీషణుని దన్నించినాడు; అంతేకాదు, దురుక్తులాడి ప్రహస్తునిచే గెంటించినాడు. ఇవ్వీటికిం బాసి వలసిన యెడ కరుగుమని సేనాపతిచే ననిపించినాడు. రాజు తర్వాత రాజంతవాడు, రాజ సోదరుడైనవాడు విభీషణుడు నిండు సభలో అన్నచేతను, రాజోద్యోగి చేతను అవమానితుడై ఇంక నే మొగము పెట్టుకొని లంకయందుండును. అభిమానవంతు డుండునా ? కావున విభీషణుడు లంకను, అన్నను వదలినాడు. కేవలము దురుక్తులు కావు; తన్నుట, గెంటుట, పొమ్మనుట అను బలవత్తరమైన హేతువు చేతనే విభీషణుడు లంకను వీడినాడు; అతని చర్య ధర్మబద్ధమే" యని పాఠకులకు సమాధానము చెప్పుటకై బుద్ధారెడ్డి ఈ మార్పు చేసినాడు. ఇది యద్భుతమైన కల్పనమని కవిని మనము మెచ్చుకొనవచ్చును. కాని, ఇది బుద్ధభూపతి స్వీయ కల్పనముకాదు; అమూలకమును

1. దా. ప్రతి రామాయణము యుద్ధకాండము సర్గ 16 శ్లో. 15.
2. ,, ,, ,, సర్గ 16, శ్లో. 16.

తెనలేకాదు. పరిశీలింపగా, ఈ విషయము తు.చ. తప్పకుండ స్పష్టముగా పశ్చిమోత్తర శాఖీయ ప్రతి వాల్మీకి రామాయణమునందు కనబడుచున్నది. చూడుడు.

"ఏవముక్తస్తు సంరబ్ధో రావణః క్రోధ మూర్ఛితః ।
ఉత్పపాత సనిస్త్రింశో హంతు కామో విభీషణం ॥

— — — — — — —

ఆసనాత్ తూర్ణముత్పత్య పాదేనాభి జఘాన తం
అభవత్ పతితో భూమౌ వాసనాత్ స విభీషణః ।
వజ్రపాత హతశ్శ్రీమాన్ విశీర్ణ ఇవ పర్వతః ॥

— — — — — — —

ప్రహస్తస్త్వసి హస్తం తం కుపితం రాక్షసేశ్వరం ॥
శనైర్నివారయామాస కోశేచాప్యకరో దసిం ॥

— — — — — — —

అథ తం జ్ఞాపయామాస ప్రహస్తం రాక్షసేశ్వరః ।
రాజ్యాన్మమ పరిభ్రష్టో దిశోయాతు విభీషణః ॥
ఏవ ముక్తస్తతో రాజ్ఞా ప్రహస్తోవాహినీపతిః ।

— — — — — — —

నశక్యం భవతాస్థాతుం గచ్ఛయా తే గతిర్మతా । "[1]

ఇట్లే ఔత్తరాహ, వంగ పాఠములైన వాల్మీకి రామాయణముననుసరించి వ్రాయబడిన క్షేమేంద్రుని రామాయణ మంజరిలోను గలదు.

"శ్రుత్వైతత్ కోప సంతప్తః సముత్థాయ దశాననః ।
సామ్రాజ్యమివ పాదేన జఘానాశు విభీషణం ॥

— — — — — — —

తూర్ణం నిష్క్రాస్యతామేష నిలయాన్నిరపత్రపః ।

— — — — — — —

ప్రహస్తో హస్త ముద్యమ్య భ్రాంత భ్రూయుగలోఽభ్యధాత్ ।

— — — — — — —

ఉక్త్వేతి హస్తే నాకృష్య ప్రహస్తో రావణానుజం ।
ఉవాచ గచ్ఛ గచ్ఛేతి క్రోధాధ్మాతః పునః పునః ॥ "[2]

ఇట్లు రావణుడు విభీషణుని దన్నినాడనుటకు మూలము స్పష్టముగా గోచరమగుచున్నది. కావున ఇది అవాల్మీకము కాదు ; అమూలకమును గాదు.

---

1. ప.ఉ. ప్రతి, వాల్మీకి రామాయణము. సుందరకాండ. సర్గ. 90 శ్లో. 1-3,4,6,61,62,63.
2. క్షేమేంద్రుడు. రామాయణ మంజరి. యుద్ధకాండము. శ్లో. 152,156,166,169.

" విభీషణుకు రావణుని వీడి వచ్చుట కింత తతంగము జరిగినది. అతనియంద ధర్మముకాని, దోషముకాని లేదు. తన స్థానమునుండి వెడలగొట్టఁబడిన అభిమానియైన అనాథుడు స్వశ్రేయస్సును గోరి శత్రువునాశ్రయింపక యెటు పోవును. మీదు మిక్కిలి అతడిదివరకే శ్రీరాముని పరాక్రమమును, శరణాగత వాత్సల్యమును విన్నవాడాయె. కావున విభీషణుని చర్య సముచితమైనద"ని భావించి బుద్ధారెడ్డి దాక్షిణాత్య ప్రతిలోలేని యీ యంశమును ఔత్తరాహ ప్రతులనుండి గ్రహించి సుంద ర్యౌచిత్యమును పాటించినాడు. కథాగతికి రసపోషణకు భంగములేని రీతిగ సంగ్రహించినాడు.

32 విభీషణుని నలుగురు మంత్రులు.

విభీషణునికి సర్వవిధముల అనుకూలురైన నలుగురు మంత్రులు కలరు. వీరు నీడవలెనే అతనిని ఎప్పటికిని వెన్నంటియుందురు. ఈ మంత్రుల నామములు పూర్వరామాయణమునందు కనిపించవు. అన్ని చోట్లను "చతుర్భిఃసహరాక్షసైః"[1] చతుర్భిస్సచివైస్సార్ధం।"[2] అని యిట్లు చెప్పబడినది. కాని రంగనాథరామాయణమునందు

" ... . విభీషణుండతి కోపుడగుచు

అనలుండు, నలుడును హరుడు, సంపాతియను వారితోఁ గూడి " 3 వచ్చినట్లును, భాస్కర రామాయణము నందు

"తన మంత్రులు నల, నీల, హిత, సంపాతులను వారలు నలువురుదానును గదాపాణులగుచు నాస్థానంబు వెడలి"[4] యనియు విభీషణుని మంత్రుల పేర్లు ప్రస్తావింపబడినవి. ఈ నాలుగింటిలో "నీల, హితు" లనెడు రెండు భాస్కరరామాయణమునందలి నామములు "అనల, సంపాతు" లనెడి రంగనాథ రామాయణము నందలి నామములతో విరోధించుచున్నవి. ఇందులో ఏవి మూలానుసారి ? యని సందేహము తప్పక పొడమును. తెలియని విషయమునందు కుతూహలమధికము.

పరిశీలింపగా, ఉత్తరకాండలో రావణాది రాక్షసోత్పత్తి కథా సందర్భమున నీవిషయము కన బడినది.

మాల్యవంతుడు సుమాలి, మాలియను వారలు ముగ్గురన్నదమ్ములు. వీరిలో మాల్యవంతునికి వజ్ర ముష్టి, విరూపాక్షాదులు, సుమాలికి అకంపనప్రహస్తాదులు, కేకస్యాదులును; మాలికి అనల, అనిల, హర, సంపాతులనువారలు తనూజులు. "ఇందులో మాలి కుమారులే విభీషణ సచివులు.[5]

అనిలశ్చానలశ్చైవ హరస్సంపాతి రేవచ ।
ఏతె విభీషణామాత్యాః మాలేయాస్తే నిశాచరాః ॥ "[6]

---

1. దా. ప్ర. రామాయణము - యుద్ధకాండము - సర్గ-16 శ్లో-16
2. ,, ,, ,, సర్గ-91 శ్లో-3
3. రంగనాథ రామాయణము - యుద్ధకాండ - ద్వి-548,549
4. భాస్కరరామాయణము - యుద్ధకాండ - వచనము-155
5. దా. ప్రతి-రామాయణము - ఉత్తరకాండము - సర్గ 5 శ్లో 44,45
6. ,, ,, ,, సర్గ 5 శ్లో. 44,45

ఈ అనిలానలహర సంపాతులు నలుగురు విభీషణునకు మేనమామలగుదురు. ।

ఏది యెంతవరకు నెక్కడ చెప్పవలెనో, అంత మాత్రమే వ్రాయుచు పాఠకునకు ప్రరోచనను గలిగించుట వాల్మీకి శైలి లక్షణమని చెప్పుకొంటిమి. కావున యుద్ధకాండములో నలుగురు మంత్రుల తోడ, నని మాత్రమే తెలిపి వారి యుత్పత్తి కథా సందర్భమున తెలియఁదగిన అంశములను దెలిపి యున్నాడు. బుద్ధారెడ్డి పురాణౌచిత్యమును పాటించి పాఠకునకు సంశయ విపర్యయములు కలుగకుండ మొదలే తెలిపినాడు.

ఇక రంగనాథ రామాయణమునందలి ద్విపదను

" అనిలుఁడనలుఁడును హరుడు సంపాతి "

యనియు, భాస్కర రామాయణమునందలి వచనమును

"తన మంత్రులనిలానల హరసంపాతు" లనియు నవరించిన మూలానుసారులగును.

33. బహిష్కరింపబడిన విభీషణుడు తల్లిని దర్శించుట.

" దశగ్రీవునిచే తన్ని వెడలగొట్టబడిన విభీషణుడు ముహూర్త కాలమునసనే శ్రీరామ చంద్రుని యొద్దకువచ్చి ఆకాశమున నిలువబడి శరణాగతి గోరె"2 నని దా ప్రతి. వాల్మీకిరామాయణమునందు గలదు

కాని రంగనాథరామాయణము నందు-" బహిష్కృతుడైన విభీషణుడు నేరుగా రామునియొద్దకు రాక తల్లియైన కైకసి యొద్దకుఁ బోయి, ఏడ్చుచు తనకు జరిగిన పరాభవమును విన్నవించెను. ఆమెయునప్పుడు తన స్మృతికి వచ్చిన గత వృత్తాంతమును విభీషణునకు ఇట్లు దెలిపెను.

"రావణ కుంభకర్ణుల హింసాకాండకు తట్టుకొనని దేవతలు బ్రహ్మతోఁగూడి యమృతాబ్ధికినేగి విష్ణువును ప్రార్థించి మొఱబెట్టుకొనగా, నతడు దశరథ కుమారుడై యవతరించి రావణ కుంభకర్ణాదులను చంపెదననెను. అంత తాను (కైకసి) భయపడి కులమును నిలుపగల వాడెవ్వడో సెలవివ్వమని పతిని యడుగగా, కడగొట్టు కొడుకు విభీషణుడు రాముని కృపఁగోరి లంకను పాలింపగలడని పలికి తపమున కరిగెను" ఇట్లు చెప్పి కైకసి విభీషణు నోదార్చి రాముని యొద్దకు బోయి శరణాగతినొంది రాక్షస కులమును కాపాడుమని దీవించి వీడు

---

1. దా. ప్రతి రామాయణము - యుద్ధకాండ - సర్గ 37 శ్లో 7
అనలః శరభశ్చైవ సంపాతిః ప్రఘసస్తథా ।
గత్వాలంకాం మమామాత్యాః పురీం పునరిహాగతాః ॥
(ప-ఉ-ప్రతి రామాయణమునందు - అనిలశ్చ హరశ్చైవ-అని కలదు.
మూలపాఠమునందే వ్యత్యాసము గానబడుచున్నది.
(ప్రహస్తుని తమ్ముడు ప్రఘసుడు - ప్రఘసశరభులే అనలహరులు కాబోలు-వావిలకొలను సుబ్బారావు. మందరము యుద్ధ పుట 408)

2. దా. ప్రతి. రామాయణము - యుద్ధకాండ సర్గ 17 శ్లో 1
(ఇత్యుక్త్వా పరుషం వాక్యం రావణం రావణానుజః।
ఆజగామ ముహూర్తేన యత్రరామస్సలక్ష్మణః॥)

కొలిపెను అంతనతడు తల్లికి నమస్కరించి. మరిలోన పొంగుచు సచివులతోఁగూడి శ్రీరాముని సమీపమునకు వచ్చెను."[1] అని అధికముగా సుమారు 52 ద్విపదలతో వర్ణింపబడియున్నది. వేదము లక్ష్మీనారాయణ శాస్త్రి. ఆరుద్ర మున్నగువారు దీనిని అవాల్మీకము క్రింద జమకట్టినారు,[2] కట్టమంచి రామలింగారెడ్డిగారు దీనిని కవి కల్పనగా భావించి ఈ క్రింది రీతి వ్యాఖ్యానించారు:—

"తుదకు రాజద్రోహి, భ్రాతృద్రోహియైన విభీషణునికిఁగూడ శత్రుశరణము తన తల్లియైన కైకసి బోధవల్లఁజేసినట్లు సమాధానము కల్పించి, వాని వర్తనము అంత చెడ్డదికాదని చూపించి యుండుటయుఁజింత్యము ఎందరో స్త్రీలను అన్నగారు చెఱఁబట్టుచుండగాఁ జూచిచూచి యూరకుండిన వాడు హఠాత్తుగా ధర్మకర్తృత్వము వహించుట చోద్యము"[3] అని.

కాని ఇది బుద్ధ భూపతి అవాల్మీక కల్పన మాత్రముకాదు. ప.ఉ. ప్రతి సుందరకాండ 91వ సర్గలో 83 శ్లోకములతో అనుబంధపాఠముగా నీయబడినది. క్షేమేంద్రుడు కూడ తన రామాయణ మంజరిలో ఈ విషయమునంతటిని ఒకే యొక్క శ్లోకములో సంగ్రహపరచినాడు.

"సదృష్ట్వా మాతరం తూర్ణం ప్రణిపత్యాభివాద్యచ।
నివేద్యాస్య యథావృత్తం ప్రయయౌ వ్యోమ వర్త్మనా॥"

ఈ వృత్తాంతమును గ్రహించుటలో బుద్ధ భూపతి ఒక గొప్ప ప్రయోజనమును కాంక్షించినాడు.

రావణ కుంభ కర్ణులకంటే విభీషణుడు ధర్మాత్ముడు, వినయాది సద్గుణములు కలవాడు; ముఖ్యముగా మాతా పితృాజ్ఞ జవదాటనివాడు. ఇతఃపూర్వము" తల్లి కైకసి హనుమత్కర్మను, అక్షకుమారాది రాక్షస మరణమును, సాట్ట ప్రాకారతోరణ లంకాదాహమును విని భయపడినదై ఒక్కనాడు విభీషణునితో నిట్లు పలికినది; కుమారా! రాక్షస రాజునకు మహోపప్లవము దాపురించినది. అతడొనర్చిన యధర్మము శీఘ్రముగా సౌఖ్యమును నశింపఁజేయుటయేకాక శత్రుప్రీతిని వృద్ధి పొందించు మహదాపదను కలిగించును క్రుద్ధుడైన రాముడు సముద్రమునైనను శోషింపజేయును. ఇదివరకే ఖరదూషణాదులైన 14వేల రాక్షసులతనిచే నాశమొందిరారు. రాక్షసకోటియందు శ్రీరామునితో సమానుడైనవాడు లేడు. కావున నీవు హితమును రావణునికి బోధింపుము. సీతను మరల రామునకప్పగింపుమని చెప్పుము. మన్మథ నిద్రాహతుడైదారుణ కర్మలచే శ్రాంతుడైన రావణుని చల్లని ధర్మవాక్య మారుతములచే బోధించుము. నీవు కీర్తితో రాజిల్లగలవు"[5] అని

---

1. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి. 553-610.
2. వేదము లక్ష్మీనారాయణ శాస్త్రి. పీఠిక. రంగనాథరామాయణము పుట. 18. ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్యం. పుట. 18.
3. కట్టమంచి రామలింగారెడ్డి. అనుబంధ పీఠిక. రంగనాథ రామాయణము. ఆం.వి.క.ప. ప్రచురణము. పుట vii,
4. క్షేమేంద్రుడు .రామాయణమంజరి. యుద్ధకాండము. శ్లో. 171.
5. ప.ఉ. ప్రతి. రామాయణము. సుందరకాండము. సర్గ. 75 శ్లో. 1-24. దీనికిఁదగిన అనువాద ద్విపదలు రంగనాథరామాయణమునఁ గనిపించవు బుద్ధ భూపతియే

పలుకగా, విభీషణుడు సరేయని తల్లికి నమస్కరించి రాక్షసరాజును దర్శించనేగెను. రావణుడు సభదీర్చి మంత్రాలోచనము చేయుచుండగా, విభీషణుడును వచ్చికూర్చుండి, వారివారి మాటలను శ్రద్ధగా విని, అన్నింటిని తర్కబద్ధముగా ఖండించి. సీతను రామునికప్పగించి శరణాగతినొందుమని పదేపదే హితవచనములను బోధించినాడు. పిదప రావణునిచే తన్నబడి. బహిష్కృతుడై, తన తల్లికి వృత్తాంతమును దెలిపి, యామె యాజ్ఞను పాటించి శ్రీరాముని యొద్దకు వచ్చినాడు.

ఈయనుక్రమము పూర్వాపర సందర్భమునకు దగినదిగానున్నది.

1. తల్లిచే పంపబడినవాడు మరల తల్లియొద్దకు వచ్చిజరిగిన వృత్తమును నివేదించుటయను మర్యాదయు కాపాడబడినది.

2. అన్నచే అవమానితుడైన వ్యక్తి దుఃఖితుడై తలిదండ్రుల యొద్దకు వచ్చి తనగోడును వివరించుకొనుట లోకసహజమైన విషయము. విభీషణుని తండ్రి విశ్రవసుడపుడెక్కడనో హిమాలయములందు తపము చేసికొనుచున్నాడు. ఆ సమయమున అతనియొద్దకు పోవవలనుకాదు; కావున తల్లి కైకసి యొద్దకు వచ్చి యాయవమానమును దెలిపి, తరువాత చేయదగు రీతిని దెలుపుమని కోరినాడు.

3. విభీషణునికి లంకలో దల్లిదప్ప ఇఁక నెవ్వరును తన శ్రేయస్సును కాంక్షించువారు లేరు. కావున తల్లి యొద్దకు వచ్చుట. ఆమె తన శ్రేయస్సును దెలుపునని కోరియే.

4. తల్లికిఁ జెప్పకుండ రాముని సన్నిధానమునకు బోయినచో, రావణాది సంహారానంతరము కడుపు చిచ్చునకు లోనైన జనని అతిశయక్షోభతో ఆగ్రహించి తనకు శాపము పెట్టినను పెట్టవచ్చును. ముందు దెలిపి వచ్చినచో ఆ భావ్యనర్థమునకు ఆస్కారముండదు.

5. "తల్లిని మించిన దైములేదు"। మాతృదేవోభవ" అని వేదవాక్కు[1]. సకల వేదతత్వజ్ఞుడైన విభీషణుడు మాతృదేవి యొద్దకు వచ్చి. వృత్తాంతమును నివేదించి, ఆపైని ఆమె యాజ్ఞప్రకారము తదాశీర్వాదమునఁ జేయుట శ్రేయః ప్రాప్తికి మూలమని గుర్తించి అదేరీతిగ ఆచరించినాడు. శ్రీరాముడును మాత్రాజ్ఞ ప్రకారమే దీవనలు పొంది వనవాసమునకు వచ్చినాడని విభీషణునికి విదితమే గదా! సేవ్యసేవక మార్గము విభిన్నముగాక ఒకే రీతిగా నుండవలెను.

6. శ్రీరాముడు శ్రీమన్నారాయణావతారమని తాను దెలిసికొన్నను, తల్లి చెప్పిన మీదట, అది మనస్సున నింకను దృఢపడును.

7. జ్ఞాతివైరమున, స్వలాభాపేక్షచే క్లిష్టపరిస్థితిలో అన్నను వీడి వచ్చినాడనెడి అపయశము తనకు రాకుండును. "విభీషణుని తప్పేమియులేదు. ఎన్నోరీతులుగా చెప్పిచూచినాడు, కాని లాభము లేక పోగా. తన్నబడి బహిష్కృతుడైనాడు. అప్పటికిని అన్నను, లంకను వీడలేదు. తల్లికడకేగి

రచించలేదో, లేక రచించినను లేఖక ప్రమాదమున లుప్తములైనవో తెలియరాదు. దా ప్రతిలో మాత్రమీవృత్తాంతములేదు.

1. యజుర్వేద తైత్తిరీయోపనిషత్తు. శీక్షావల్లి.

జరిగిన వృత్తాంతమును నివేదించినాడు; కులరక్షకుడు విభీషణుడు కాగలడని భర్తయగు విశ్రవో బ్రహ్మవలన విన్న కైకసి రావణ వధానంతరమైనను కులమును లంకను కాపాడగోరియే విభీషణుని రామునొద్దకు పొమ్మని ఆశీర్వదించి పంపినది. తల్లి యాజ్ఞ ననుసరించియే అతడు శ్రీరాము నాశ్రయించినాడు. కాని స్వార్థమున కాదని" లోకులు గ్రహింతురు. అపుడు అతడు లోకనిందనుండి దూరముగా నుండును.

ఈ పై ప్రయోజనముల నుద్దేశించియే బుద్ధభూపతి దా. ప్రతిలో లేని వృత్తమును ప. ఉ. ప్రతినుండి గ్రహించి రచించినాడు.

34. దశరథ-సాగర స్నేహము ;—

శ్రీరామచంద్రుడు జలనిధిపై ఎక్కిడిన అమోఘాస్త్రమును అతని ప్రార్థనచే మరుభూమిపై ప్రయోగించి అందలి నీటిని శోషింపజేసెను. ఆ మరుభూమి సర్వకామ సమృద్ధిగా నుండునట్లు వర మొసంగెను. అప్పుడు సముద్రుడు-

"మీ తండ్రి దశరథ మేదినీశ్వరుడు-దైతేయ దేవ యుద్ధమునఁ బెంపొంది
నన్నయోధ్యకుఁ గొని నరనాథ పోయి-మన్నించి యప్పుడు మగుడ వీడ్కొల్పి
పుత్తేర వచ్చితి భూతలాధీశ !-యిత్తెఱంగున మీకు నేఁ దక్కినాడ
దొరకొని కట్టు సేతువు రాఘవేంద్ర-తరుచర సేన నుద్ధతి నడపింపు"[1]

మని శ్రీ రఘురామునితో నన్నట్లు రంగనాథ రామాయణమునఁ గలదు. దా. ప్రతి వాల్మీకి రామాయణమును జూచిన వారికి "ఈ దశరథ సముద్ర సంబంధము, దశరథుడు సముద్రమునకుఁ జేసిన మర్యాద" అను విషయము క్రొత్తదిగాను, అవాల్మీకముగాను దోచును. జటాయువు కూడా నీ తండ్రికి నేను నఖుడనని చెప్పినట్లు, ఇచ్చట సముద్రుడు కూడ అట్లే చెప్పినాడు. చెప్పుటయే కాదు, ప్రత్యుపకారము చేయుటకై "యిత్తెఱంగున మీకు నేఁ దక్కినాడ- దొరకొని కట్టు సేతువు రాఘవేంద్ర" యని పలికినాడు. రామాయణమునందిది లేదు కావున బుద్ధభూపతి కల్పితమైనను కావలెను, లేక ఇతర రామాయణ పురాణములందు చెప్పబడిన దానిని గ్రహించియైన యుండవలెనని" పూర్వపక్ష మేర్పడును. కాని ప. ఉ. ప్రతి సుందరకాండము 96వ సర్గలో ఈ విషయము 42 శ్లోకమునుండి 66వ శ్లోకమువరకు విపులముగా వివరింపబడినది. దాని సారాంశమిది.

"దేవ రాక్షసులకు యుద్ధము సంభవించినది ఆ యుద్ధమున దశరథుడు దేవ పక్షమున పోరాడెను. అప్పుడు అచ్చట అతనికి సముద్రునితో మైత్రి యేర్పడెను. వేలకొలది యసురులు సంహరింపబడిరి. తత్సంహారముచేత తుష్టులైన దేవతలు దశరథుని వరము గోరుమనిరి. రాజు పుత్ర సంతతిని గోరెను. వారు నలుగురు పుత్రులు కలుగుదురని అతనికి వర మొసంగి, రథమును, చూడామణిని, అనేక రత్నములను కానుకగా నిచ్చిరి. దశరథుడు వానిని గ్రహించి సముద్రునితో అయోధ్యకు వచ్చెను. రాజు సముద్రుని ఘనముగా సత్కరించెను. దశరథుని భవనమున సముద్రుడు నెల దినములుండి సెలవు దీసికొని తన యింటికి తిరిగి వచ్చెను."

1. రంగనాథ రామాయణము యుద్ధకాండము ద్వి. 954-957

క్షేమేంద్రుని రామాయణమంజరిలోను, నీ వృత్తాంతము ప్రస్తావింపబడినది.[1]

ఈ రంగనాథ రామాయణమునందు "అసుర సంహారముచే సంతసించిన దేవతలు దశరథునికి నలుగురు కుమారులు కలుగ గల వరమును, రథమును, చూడామణిని రత్నముల నొసంగుట, వాని నతడు గ్రహించుట", యను విషయము గ్రహింపబడలేదు. తనకును దశరథునకును గలిగిన స్నేహ మర్యాదలను గూర్చి రామునకు చెప్పుచోట, తనకు సంబంధములేని దశరథ వర ప్రాప్తిని గూర్చి సముద్రుడు చెప్పుట అనుచితము. కావున బుద్ధారెడ్డి ఆ విషయమును వదలివేసినాడు. ఇక మిగిలిన విషయము "దశరథునితో తాను అయోధ్యకు పోయి సత్కరింపబడి, ఒకటి రెండు కాదు నెల దినములుండి తిరిగివచ్చుట, ఈ ఆతిథ్య స్నేహ సత్కారమునకు తగిన కృతజ్ఞత ఆ రాజునకు చూపలేకపోయితి ననుట" యను భాగము మాత్రము గ్రహింపబడినది.

తండ్రిచే నుపకారము పొందినవాడు తిరిగి ప్రత్యుపకార మతనికి చేయు నవకాశము కలుగనిచో, అవసరము వచ్చినవేళ కుమారునికి తప్పక తోడ్పడుట ఉత్తమనీతి. దీనిచే సముద్రుడు రామునకుఁ దోడ్పడఁ దలచి, సేతు నిర్మాణమునకు నలుని చూపి ఉపాయము చెప్పినాడు.

"ఈ ప్రత్యుపకార బుద్ధి మొదటనే సముద్రున కుండదగినది కదా! దర్భశయనుడై శ్రీరాముడు తరణోపాయమును చూపుమని సముద్రునికి శరణాగతుడైనప్పుడు అతడు పొడ చూపలేదు. ధనువు నెక్కు పెట్టినపుడే బుద్ధివచ్చి, రాముని శరణుజొచ్చి దశరథునికిఁ దనకుఁగల స్నేహమును ప్రస్తావించి సహాయము చేయుదునన్నాడుగదా!" దీని యర్థము పరిశీలింపవలెను.

సముద్రుడు జడుడు. జడునితోఁ జేసిన స్నేహము, జడునకుఁ జేసిన సన్మానము సమయమునకు అక్కరకు రానివి. ఏమి ప్రత్యుపకారము చేయవలెనని తలంచుచు కాలము గడపునే కాని ఏమియు చేయడు. అతనికే చేయనప్పుడు అతని సంతతివారికిని జేయక కృతఘ్నుడుగానే యుండును. అట్టివాడు దండన చేతనే చక్కబడును. తన కపాయము కలుగబోవు సమయమున పూర్వ స్నేహమును స్మృతికిఁ దెచ్చి పిదప తోడగుటకు సిద్ధపడును. ఇది లోక జడ లక్షణము. దీనిని పాఠకులకు విదితము చేయుటకే బుద్ధభూపతి దాక్షిణాత్య ప్రతిలో లేకున్నను, ప. ఉ. ప్రతినుండి గ్రహించి అనౌచిత్య విషయములను పరిహరించి, సంక్షిప్తముగా నాలుగు ద్విపదలు వ్రాసినాడు కావున నిది పాఠ భేదమేకాని, అవాల్మీక మనిపించుకోదుగదా!

35. సేతు నిర్మాణ దినసంఖ్య :—

సముద్రుని యుపాయోపదేశము నొందిన శ్రీరాముని యాజ్ఞను బురస్కరించుకొని, వానరులు పర్వత, శిలా, పాదపములను దెచ్చి యిచ్చుచుండగా నలుడు సేతు నిర్మాణమును ప్రారంభించి "ఐదు దినములలో క్రమముగా 14. 20, 21, 22, 23 యోజనములు వెరసి మొత్తము 100 యోజనములు పూర్తి చేసినాడు."[2]

---

1. క్షేమేంద్రుడు-రామాయణమంజరి. యుద్ధకాండ. శ్లో. 244-250.
2. దా. ప్రతి. రామాయణము. యుద్ధకాండ సర్గ 22 శ్లో. 66-72.

దీనికి విరుద్ధముగా రంగనాథ రామాయణమునందు "సేతు నిర్మాణము క్రమముగా 14, 26, 50, 10 యోజనములు వెరసి మొత్తము 100 యోజనములు పూర్తి చేయబడినదని"[1] వ్రాయబడి యున్నది. అనగా మూలమునందలి 5 దినములను 4 దినములుగా బుద్ధారెడ్డి మార్చినట్లు స్పష్టమగును. కాని ఇది అమూలకము గాదు. ప. ఉ. ప్రతి ననుసరించి వ్రాసినాడు. చూడుడు.

"కృతాని ప్రథమే నాహ్నా యోజనాని చతుర్దశ।

... ...

దివసేన ద్వితీయేన షడ్వింశద్యోజనాని తు॥

....

దివసేన తృతీయేన పంచాశద్ యోజనాని తు।

బద్ధాని కపిభిర్ వీరైః శేషంతు దశయోజనం॥

... ...

ప్రభాతాయాం నిశాయాం తు ... .

... .

దశయోజన మాత్రంతు సర్వబద్ధ మశేషతః॥"[2]

ఇందులో ఏది సత్యమో మనము నిర్ధారించలేము. కాని నాలుగు దినములలో పూర్తియైన పాఠమును గ్రహించుటలో బుద్ధభూపతి యుద్దేశ్య మేమని చర్చించవచ్చును.

1) వానరులందరు లంక నెప్పుడెప్పుడు చేరుదుమా? రావణుని హతమార్చుదుమా? సీత చెర విడిపించుదుమా? యని యుత్సుకతతో నున్నారు. వారు కాలవిలంబము నోర్వజాలరు. కావున మహాబలులైన ఆంజనేయాదులు 6, 7 యోజనముల పొడవైన పర్వతములనే మోసికొనివచ్చి సముద్రమున పడవేయుచుండిరి. కాల మెంత తగ్గిన అంత మంచిది. దానికి తగినట్లు—

"కథం ద్రక్ష్యేత సాలంకా కథం బద్ధ్యేతి సాగరః ।

ఏవం సముత్సుకా భూత్వా సేతవే వానరర్షభాః ॥

ఉత్సాహయుక్తా హరయః కౌతూహల సమన్వితాః ।

— — — — — — —

అహం పూర్వ మహంపూర్వ మితిశైలాన్ ప్రచిక్షిపుః ॥"[3]

అనెడి శ్లోకములలో వారి పరస్పర స్పర్థను. సేతు నిర్మాణమందలి త్వరను కాంచవచ్చును.

2. సేతు నిర్మాణమును త్వరగా పూర్తిచేసి శ్రీరామచంద్రునికి సంతోషమును కలిగించవలె ననెడి కార్యదీక్షయు తమలో నున్నదని వానరులు తెలియచేసినట్లగును.

---

1. రంగనాథ రామాయణము. యుద్ధకాండ. ద్వి. 1023, 1068-69, 1086, 1088.
2. ప. ఉ. ప్రతి. రామాయణము. సుందరకాండము సర్గ 76 శ్లో. 13 1/2, 49 1/2, మరియు సర్గ 78, శ్లో. 9, 17 1/2.
3. ప.ఉ ప్రతి. రామాయణము - సుందరకాండము - 97 వ సర్గ. శ్లో 19,20
98 వ సర్గ. శ్లో 3

దీనికుపబలకముగా దా ప్రతి కంటె విశేషముగా వానరులు ప్రతిదినమెట్లుత్సాహవంతులై సేతు నిర్మాణము చేసినారో ప-ఉ-ప్రతిలో వివరముగా వర్ణింపబడినది. క్లుప్తముగా దినమింత సేతు నిర్మాణము జరిగినదని సాధారణముగా చెప్పుటకంటె, క్రిందటి దినమునకంటె నాడు ఎక్కువ నిర్మాణమెందులకు జరిగినదో తెలుపుటకై వారి యుత్సాహాదులను స్పష్టముగా చెప్పిన పాఠకుల మనస్సుకు హత్తును. వారిలోను ఉత్సాహమినుమడించును.

తొలినాడు 14 యోజనముల నిర్మాణము జరిగినది. ఇది చాలా తక్కువ. అందుకే మరునాడు ద్విగుణీకృతోత్సాహముతో పనిసేయగా సుమారు రెండింతలు 26 యోజనముల నిర్మాణము పరిసమాప్తమైనది. దీనికిని తృప్తిపడని వానరులు మూడవనాడును రెండవ నాటికన్న ద్విగుణీకృతోత్సాహముతో పూనుకొని పనిసేయగా సుమారు రెండింతలు 50 యోజనములు పూర్తిచేయగలిగిరి. శేషించినదానిని 4 వ నాడు పూర్తిచేసిరి. కార్యనిర్వాహకులు తమ పనులను దినదినము ద్విగుణీకృతోత్సాహముతో కపిపుంగవులవలె పని చేయవలయుననియు, అట్లుచేసిన అచిర కాలముననే తమ పని ఫలవంతముగా పరిసమాప్తి చెందగలదను అర్థము సరసముగాను, ఉపదేశాత్మకముగాను నున్నదని గోనబుద్ధారెడ్డి తలంచి దాక్షిణాత్యప్రతిని వీడి ప.ఉ. ప్రతి పాఠమును ఇచట అనుసరించినాడని చెప్పవచ్చును. అప్పుడే రచయిత గ్రహించిన విషయమునకు సరియైన హేతువేర్పడును. సహృదయులకు సమంజసమను తలంపు గలుగును.

36. శ్రీరామునకు సాగరుడు రాజోచిత వస్త్రాభరణాదులొసగుట.

సముద్రముపై నలసేతు నిర్మాణము పూర్తియైనది. దేవర్షిసిద్ధ చారణాదులా సేతువును దర్శించి ఆశ్చర్యమొంది శ్రీరాముని బహువిధముల స్తుతించి పుష్పవర్షము గురిపించిరి; దేవదుందుభులు మ్రోగించిరి.

ఇచట రంగనాథరామాయణమునందు నూతన విషయమొకటి కనిపించుచున్నది. "సముద్రుడు శ్రీరామచంద్రుని సైన్యసహితముగా తన సదనమునకు గొనిపోయి దివ్యాస్త్రభూషాంబరములను, వజ్రకవచమును అతనికొసంగి, మునివేషముమాని చారు వస్త్రభూషణాదులను ధరింపుమని ప్రార్థించెను. అట్లు వారు రాజోచిత వేషధారణమొనర్చి సూర్యచంద్రులోయనునట్లు వెలుంగగా, సముద్రుడు ఆశీర్వదించి పంపించ. రామలక్ష్మణులు అనిలజ నీలుర యంసములనధిరోహించి సేతు మార్గమున లంకాభిముఖులై నడచిరి" [1]

ఈ సముద్ర దత్త రాజోచిత భూషణ ధారణము దాక్షిణాత్యప్రతిలో లేదు. కాని ప.ఉ. ప్రతి సుందరకాండ నవ నవతితమసర్గలో విపులముగా వర్ణింపబడినది.[2] ఇందులో మొత్తము 12 శ్లోకములు గలవు.

ఇవి యనుష్టుప్ ఛందముసగాక వృత్త ఛందమునందు రచించబడినవి.

మూలవృత్తమునకు దీనికి (బుద్ధ భూపతి వ్రాసినదానికి) కొలదిగా భేదమున్నది.

---

1. రంగనాథ రామాయణము - యుద్ధకాండము - ద్వి. 1146-1157
2. క్షేమేంద్రకృత రామాయణమంజరి యుద్ధకాండములో ఈ వృత్తాంతము భూషణప్రదానమను పేరున శ్లో. 271-278లలో గలదు,

1. సముద్రదత్త వస్త్రాభరణాదులను శ్రీరాముడు ధరించిన తరువాత, సముద్రుడతనిని వరుణుని యనుగ్రహమునకై వరుణాలయమునకు దీసికొనిపోయెను. అచట శ్రీరాముడు దేవరాజైన వరుణుని యాశీస్సులనొంది సముద్రునిచే తీరమునకుఁజేర్చబడెను. ఇచట సముద్రుడు శ్రీరాముని వరుణాలయమునకుఁదీసుకొని పొయినట్లున్న సంగతిని బుద్ధభూపతి పరిత్యజించెను.

సముద్రుడును వరుణుడును వేరువేరని మూలము వలన దెలియుచున్నది. సముద్రాధి దేవత సముద్రుడు; జలాధి దేవత వరుణుడు; పశ్చిమదిగధిపతియు వరుణుడే; ఇతడాయుష్కారకుడని" తత్త్వాయామి బ్రహ్మణా వందమాన స్తదాశాస్తే యజమానో హవిర్భిః। అహేళా మానో వరుణేహ బోధ్యురుశగ్ం సమానఆయుః ప్రమోషీః ॥" అని వేదమంత్రము ఘోషించుచున్నది. రావణునితో యుద్ధము చేయబోవు శ్రీరామునకు వరుణుని దీవెన తప్పక అవసరమై యున్నది. కావుననే సముద్రుడు వరుణుని యొద్దకు శ్రీరాముని గొనిపోయినాడు.

బుద్ధారెడ్డి ఈ తత్వమును గ్రహింపలేదేమో! కావున ఒక్క సముద్రునే ప్రవేశపెట్టి అతనిచే వస్త్రాభరణాదులనిప్పించి మునివేషమును మాన్పింపఁజేసినాడు. ఇక్కడ ప్రధానముగా గావలసినది శ్రీరాముడు మునివేషముమాని, రాజోచిత వేషభూషాదులను ధరించి రావణునితో యుద్ధముచేయుట.

ముని వేషముననుండి యుద్ధము చేయుట అధర్మము. అయినచో ఖరదూషణాదులతో నెట్లు తలపడినాడను శంక కలుగును. ఆ ఖర దూషణాదులే తన మీదకురాగా, "ఆత్మరక్షణ కర్తవ్యము" గాన శ్రీరామచంద్రుడు వారితో తలపడినాడు. కాని ఇచ్చట శ్రీరాముడు స్వయముగానే రావణునిపై దండెత్తుచున్నాడు. క్షత్రియుడైనవాడే శత్రురాజుల మీదికి రణమున కేగవచ్చును. క్షత్రియోచితమైన గంభీర వేషము ఎదుటి శత్రువుపై తనంత ప్రభావమును వేయును. చూడగానే శత్రువు హడలిపోయి పాదాక్రాంతుడగునట్లు వీరోచిత వేషము సముచితము. అది ప్రస్తుతము శ్రీరామునకు లేదు. "రావణునిపై దండెత్తుట స్వీయభార్యా రక్షణార్థముకాదా? మునివేషముండుటవలన దోషమేమి కలదు?" అనియు శంక పొడమును. బుద్ధారెడ్డి ప్రభువగుటచే రాముడు క్షత్రియోచిత వేషధారణము చేసెననెడి కల్పనమునందు ప్రీతిని ప్రకటించి యుండనోపును. ఈ యభిమతము తనకు ప్రేరణ కలిగించగా, దా. ప్రతిలో లేని యీ వృత్తాంతమును ప.ఉ. ప్రతినుండి గ్రహించి, వరుణుని విషయమును విడిచి, సముద్రుడే శ్రీరామున కాభరణామలొసంగి ఆశీర్వాదము గావించినాడని బుద్ధారెడ్డి వ్రాసినాడు. ఇది తత్కాలిక సందర్భౌచిత్యము ననుసరించి చేసినమార్పు.

(2) సముద్ర తరణానంతర మిది జరిగినట్లు మూలమున నుండగా, తరణాత్పూర్వమే జరిగినట్లు వ్రాయబడినది.

(3) ఇక దాక్షిణాత్య ప్రతిలో శ్రీరాముడు ఆంజనేయునియొక్కయు, లక్ష్మణుడు అంగదుని యొక్కయు భుజస్కంధములపై నారోహించి మకరాలయమును దాటినట్లు కలదు.[2] "అనిలజ

---

1. యాజుష స్మార్త మంత్రపాఠము. సంధ్యావందనము- సాయాహ్నిక సూర్యోపస్థానమంత్రము (విశ్వామిత్రుడు శునశ్శేపునికి ఉపదేశించిన రెండు మంత్రములలోనిది. రెండవది).
2. దా. ప్రతి. రామాయణము. యుద్ధకాండము సర్గ 22 శ్లో. 80.

నీలుర యంసంబు లెక్కి"[1] దాటినట్లు ప. ఉ. ప్రతి యాధారముగా మార్పు చేయబడినది.

అంగదునికి బదులు నీలుని లక్ష్మణు డారోహించినా డనునది ఇచటి భేదము. అంగదుడు యువరాజు, రాజు తర్వాత రాజంతటివాడు; గౌరవింపదగినవాడు. నీలుడు సేనాపతి; యువరాజు కన్న అధికారమున కొంచెము తక్కువ అంతస్తువాడు. కావున లౌకిక రాజమర్యాద ననుసరించియు, పాఠభేదములుండు కారణమునను, బుద్ధారెడ్డి "అంగద" పాఠమునకు బదులు "నీలు నధిరోహించి" అను పాఠమును గ్రహించి ఔచిత్య పాలన మొనరించినాడు.

4) సముద్రదత్త వేషభూషాదులను ధరించిన శ్రీరామలక్ష్మణులు చంద్రోశనసులవలె శోభిల్లిరని మూలము. ఇందు

"ఆ రవిచంద్రులో యన వెలుంగుచును" అని చేయబడిన మార్పు. ఇచట ఆ "రవిశుక్రులో యన వెలుంగుచును" అని వ్రాసిన మూలానుసారి యగును. గణభంగాదులు కలుగవు. కాని స్వయముగా బుద్ధారెడ్డియే ఈ మార్పు చేసినాడో? లేక లేఖకుని ప్రమాదమో? కాక ప్రక్షిప్తమో? చెప్పజాలము. ఒకవేళ బుద్ధారెడ్డియే వ్రాసినా డనుకొందము. అతని యభిప్రాయ మేమై యుండును?

శుక్రుడు రాక్షస గురువు. రాక్షసులమీదికి దండెత్తి పోవుచున్న రామలక్ష్మణులను చంద్ర శుక్రులతో పోల్చుట స్వభావ విరుద్ధము. జ్యోతిశ్శాస్త్రము ననుసరించి చూచినను శుక్రునకు చంద్రుడు శత్రువగును. ఈ ఉపమానబంధముచే లక్ష్మణునకు రాముడు శత్రువగును. ఇది మొదటికే గొడ్డలి పెట్టు వంటిది. చంద్రసూర్యులకు పరస్పర మిత్రత్వము కలదు. కావున ఉపమానము నందలి శుక్రశబ్దము తొలగింపబడినది. తత్స్థానమును చంద్రుడు, చంద్రస్థానమును సూర్యుడును స్వీకరించినాడు.

శుక్రుడెంత గొప్పవాడైనను కాంతియందు చంద్రునికంటె తక్కువవాడగుట లోక సాక్ష్యము. "చంద్రమామనసోజాతః."[2] చంద్రుడు పురుషోత్తముని మనస్సు వలన జనించినవాడు. శేషాంశ సంభవుడైన లక్ష్మణుడు "రాముని బహిః ప్రాణ"[3] మగుటయేకాక రాముని మనస్సు నెఱింగి వర్తించువాడు,[4] కావున మనస్స్థానీయుడైన లక్ష్మణుని, కాంతి ధావళ్యముతో నొప్పు లక్ష్మణుని శుక్రునికి బదులు చంద్రునితో బోల్చుట సమంజసమైన మార్పు. ప్రతాపమున సూర్యుడు గణనీయుడు. సూర్యమండలాంతర్వర్తియగు పురుషోత్తముడే శ్రీరాముడు గదా! కావున రాముని పై

---

1. ప. ఉ. ప్రతి. రామాయణము సుందరకాండము సర్గ 98, శ్లో. 28.
2. యజురారణ్యకము. తృతీయ ప్రశ్న. (చిత్తిపన్నములోని పురుషసూక్తము) మంత్రము 37, 38 పుట. 63
3. దా. ప్రతి. రామాయణము. బాలకాండ సర్గ 18 శ్లో. 29.
4. దా. ప్రతి. రామాయణము. అరణ్యకాండ. సర్గ 15 29.

"భావజ్ఞేన కృతజ్ఞేన ధర్మజ్ఞేన చ లక్ష్మణ।
త్వయా పుత్రేణ ధర్మాత్మా న సంవృత్తః పితామమ॥

దండె త్తఁబోవు శ్రీరాముని రవిగాఁ బోల్చుట ఎంతయో ఔచిత్యశోభితము: కావున చంద్రశుక్రులకు బదులు సూర్యచంద్రులని బుద్ధారెడ్డి చేసిన ఈ మార్పు భావనామయముగా నున్నది.

37. నారదాగమన వృత్తాంతము :-

ఇంద్రజిన్నాగ పాశములచే బంధితులైన రామలక్ష్మణులలో శ్రీరామచంద్రుడు సాత్త్వగుణ మాహాత్మ్యమునఁ దెలివొంది తన తమ్ముని జూచి విలపింపసాగినాడు. సుషేణుడతని నోదార్చుచు "ద్రోణగిరి నున్న దివ్యౌషధములను దెచ్చుటకు హనుమంతుని పంపు"మనుచున్నాడు.

ఇప్పట్టున దాక్షిణాత్య ప్రతి రామాయణమునందు లేని ఈ క్రింది నూతన విషయమొకటి రంగనాథ రామాయణమునందు కనిపించుచున్నది. అదియే నారదాగమన వృత్తాంతము.

"నారదుడు శ్రీరాముని సన్నిధికి వచ్చి, అతని నిజరూప స్వభావములను స్మరింపఁజేసి "ఆదినారాయణుండవైన నీవు రాక్షస సంహారమున కీ యవతారమును స్వీకరించితి వనియుఁ దెలిపి, వాహనమైన గరుడని తలంచిన యతడు వచ్చి నాగులను పారద్రోలుననియు పలికి అనుజ్ఞనొంది అంతర్హితుడైనాడనియు, శ్రీరాముడును వైనతేయుని స్మరింపగా నతడు వచ్చినా"[1] డనియు రంగ నాథ రామాయణమునందు సుమారు ముప్పదియారు ద్విపదలలో వర్ణింపబడి యున్నది.

ఈ సందర్భమున దా. ప్రతిలో సుషేణుడు "ద్రోణగిరియందు దేవతలచే భద్రపరచబడిన పరమౌషధములను దెచ్చుటకై

"అయం వాయుసుతోరాజన్ హనుమాంస్తత్రగచ్ఛతు"

అని పలుకుచుండగనే మహాబలుడైన గరుత్మంతుడు వచ్చినట్లు పన్నగములు పారిపోయినట్లు గలదు."[2] కావున చాలామంది విమర్శకులు ఈనారదాగమన వృత్తాంతమును అవాల్మీక ఘట్టముగా తమ విమర్శనా వ్యాసములందు పేర్కొనినారు.[3] కాని, ఆరుద్ర మొదలగువారు ఇది లాహోరు ప్రతి యుద్ధకాండము 26వ సర్గలోఁ గనిపించుచున్నదని అవాల్మీక గాథల పట్టికలో కేవలము ఉట్టంకించి నారు.[4] పరిశీలింవగా ఈ వృత్తాంతము పశ్చిమోత్తర శాఖీయ ప్రతి రామాయణమునందు యుద్ధ కాండము 27వ సర్గలో స్పష్టముగా గలదు. క్షేమేంద్రుడు కూడా తన రామాయణ మంజరిలో ఈ విషయమును వ్రాసియున్నాడు.[5] కావున ఇది అవాల్మీకముకాదు. బుద్ధభూపతి దీనిని ఉత్తరదేశ ప్రతినుండి స్వీకరించినాడు.

---

1. రంగనాథరామాయణము యుద్ధకాండము. ద్వి. 2627-2662.
2. దా. ప్రతి. రామాయణము. యుద్ధకాండము సర్గ. 50 శ్లో. 31-37.
3. ఎ) వేదము లక్ష్మీనారాయణ శాస్త్రి. పీఠిక. పుట. 18 రంగనాథరామాయణము. వావిళ్ళప్రతి.
   బి) పింగళి లక్ష్మీకాంతము. ఆంధ్ర సాహిత్య చరిత్ర. పుట. 175,
4. ఆరుద్ర. సమగ్రాంధ్ర సాహిత్య చరిత్ర పుట. 237.
5. క్షేమేంద్రుడు. రామాయణమంజరి. యుద్ధకాండము. శ్లో. 550-556.

"అనుకొనకుండ వైనతేయుడు సమరాంగణమునకెట్లు వచ్చినాడు? అతనికీ విషయమెట్లు తెలిసినది? అను సందేహములు దాక్షిణాత్య ప్రతి రామాయణము చూచినవారికి తప్పక పొడమును తన్నివృత్తికిఁదగు సమాధానము దాక్షిణాత్య ప్రతియందు లభింపదు. ఇంతేకాక వైనతేయుడు "1. నేను నీకు స్నేహితుడను. 2. ఈ వృత్తాంతమును విని తొందరపడి యిటకు వచ్చితిని"[1] అని పలుకును. దీనిచేత పాఠకులకు మరిరెండు సందేహములు పొడమును.

1. ఇతడు రామునకు స్నేహితుడెపుడెట్లయినాడు?

2. ఈ నాగపాశ బంధన వృత్తాంతము నెవరివలన విన్నాడు?

దా. ప్రతియందు వీనికి సమాధానములును దొరకవు. కావున బుద్ధారెడ్డి నారదాగమన వృత్తాంతము ద్వారా ఆ సందేహములను నివారించినాడు.

నారదుడు త్రికాలజ్ఞుడు, త్రిలోకజ్ఞుడు. ఎచ్చటికైనను, ఎప్పుడైనను, ఎట్లైనను పోవుటకు అతని కత్యంత శక్తి కలదు మానవ రూపుడైన శ్రీరాముడు తన మానవత్వమును కనీసము రావణ వధ వరకైనను కాపాడుకొనవలెను. కష్టములో నున్నవాడు తాను శక్తిమంతుడుకాకపోయినను పెద్దల ఉపదేశముచే కష్టసమయమున స్వత్వమును స్మరించుట సహజము. నారదుడు బ్రహ్మర్షి; ఉపదేష్టృత్వమునకు యోగ్యుడైనవాడు, లోక కళ్యాణమును కాంక్షించువాడు. వా. ప్రతి వాల్మీకి రామాయణమునందు కాక పోయినను ఇతర రామాయణములందు నారదుడు రామ వనవాసాత్పూర్వము అతనియొద్దకు వచ్చి మరల దేవతల ప్రార్థన విన్నవించినట్లును,2 రావణుని యొద్దకుఁ బోయి దశరథ కౌసల్యా గర్భసంభూతుడగు రామునిచేత నతనికి చావు తప్పదని చెప్పినట్లు3ను కలదు. ఇ ట్లు ఇతర సందర్భములందు నారద పాత్ర ప్రవేశము రామ చరితయందుఁ గనబడు చున్నది. రామ జన్మకును నారద శాపము కారణ మైనట్లు అద్భుత రామాయణమునందు కలదు. అసలు వాల్మీకి రామకథను వ్రాయుటకు ఉపదేశించినవాడు నారదుడే అట్టి నిరంతర నారాయణ స్మరణ తత్పరుడైన నారదుడు దా. ప్రతియందు ప్రవేశించి యథోచిత భగవత్సేవ చేసినట్లు కనిపించదు. కావున అట్టి నారద పాత్రను వ. ఉ. ప్రతి వాల్మీకి రామాయణానుసారముగా బుద్ధారెడ్డి తన గ్రంథములో సందర్భోచితముగా ప్రవేశపెట్టి, దా. ప్రతి లోపమును సవరించి, వైనతేయాగమనమునకు హేతువును సమకూర్చి పాఠకుల సందేహములను దొలగించినాడు.

ఇక, తన నారాయణత్వమును శ్రీరాముడు దలంచి వైనతేయుని స్మరించుటచే రాముని మానవత్వ నటనకు భంగము వాటిల్లలేదా? యనియు శంకించవచ్చును.

---

1. దా. ప్రతి. రామాయణము యుద్ధకాండము సర్గ. 50 శ్లో. 46, 51.
2 ఆధ్యాత్మ రామాయణము. అయోధ్యాకాండము. సర్గ 1 శ్లో.
3. ములుకుట్ల నరసింహావధాని "రామాయణ సారోద్ధారము" బాలకాండ సర్గ 11 లో ఈవిషయము పులస్త్య రామాయణము లోనిదిగా కొన్ని శ్లోకములు ఉద్ధరింపబడినవి. పుట. 288.
4. దా. ప్రతి. రామాయణము. బాలకాండ సర్గ 76 శ్లో. 17.

శ్రీరామ పరశురామ సమాగమ సమయమున పరశురాముడు "అక్షయ్యం మధుహంతారం జానామిత్వాం సురేశ్వరం"1 అని స్తుతించి శ్రీరామతత్త్వమును రామునికి విదితము చేసినప్పుడు ఆ సంభాషణమును ఎవరును వినలేదు, కావున రాముని నారాయణత్వము బహిరంగము కాలేదనవచ్చును. కాని నారదుడు శ్రీరామునికి స్వీయ నారాయణత్వమును దెలుపునపుడు విభీషణుడు, జాంబవంతుడు, ఆంజనేయుడు మొదలైన వానరులున్నారుగదా! ఇది ఎట్లు సమర్థింపఁబడును? అని సందేహము కలుగక మానదు.

"ఆదినారాయణుడవు నీవే"2- అనగా అంతర్యామిగా నారాయణుడున్నాడు;3 అతని శరీరమే నీవు (నీవే అతని శరీరమవు) కాన నారాయణుడుగఁ దలంచుకొని వైనతేయుని స్మరింపుము" అని నారదు డుపదేశించినాడనియు, శ్రీరాముడును నారాయణ స్మరణ పూర్వకముగా వైనతేయుని స్మరించినాడని వానరాదులు భావించినారనియు సమన్వయించుకొనినచో మన శంక దూరమగును. రహస్యము బయల్పడినట్లుకాదు, కథ రక్తి కట్టును. ఇచ్చట నారద పాత్రకుఁ దగినంత ప్రాధాన్య మేర్పడును.

ఇంకొక విషయముకూడ ఈ సన్నివేశముచే తెలియుచున్నది. "ఇది ఆచార్యుడు మంత్రము నుపదేశించుట. శిష్యుడు దానిని ధ్యాన పూర్వకముగ స్మరించుట, పిదప మంత్రాధిష్ఠాన దేవత సాక్షాత్కరించి ఇబ్బందులను దొలగించి, సుఖమును కలిగించుట అనునది". రామునకు వైనతేయుడు తెలియదా? నారదోపదేశమునకు ముందు రాము డతనిని స్మరింపకపోవుటకు కారణమేమి?

"మానవుడు తనకుఁ దెలిసిన మంత్రమైనను, జపించినచో సిద్ధి కలుగదు. గురుముఖతః ఉపదేశము నొందిననే అది సిద్ధించు"నని లోకమునకు వెల్లడి చేయుటకే యని తెలియవలెను. అప్పుడే ఈ సన్నివేశమునకే సార్థక్య మేర్పడును.

"వైనతేయుడు రామునకు మిత్రుడెట్లు?" అనుదానికి సమాధానము రామాయణమున లభింపదు. దీనికి పౌరాణిక గాథ యొకటి కలదు. "విష్ణువు శ్రీరాముడుగా నవతరించబోవుచు శంఖ చక్రములను, ఆదిశేషుని, మహాలక్ష్మినిగూడ భూమిమీద అవతరించుడని చెప్పుచుండగా, ఎదుట సమీపమున నున్న గరుడడు "నేను మీతోపాటు భూమిమీదకు వచ్చెద. నన్నుగ్రహించు"డని ప్రార్థించెను. కాని శ్రీమహావిష్ణువు అతని ప్రార్థనను మన్నింపక "ఒకప్పుడు నాగాస్త్రములచే నేను బంధింపబడుదును, ఆ విషయమును గుర్తుంచుకొని నీ యంతట నీవే వచ్చి నాగాస్త్రబంధ విముక్తిచేసి నీ కోరికను పూర్తిచేసికొందువు గాక" యని చెప్పినాడట."4 దానిని గుర్తుంచుకొన్న వినతానందనుడు తత్సమయమున వచ్చి శ్రీరాముని సేవఁజేసి ధన్యుడైనాడని యిట సమన్వయించుకొనవలెను. ఈ రహస్యము వెల్లడి చేయకూడదు. కావున వైనతేయుడు తెలుపలేదు.

ఈ పురాణగాథను అన్వయించినచో నారదాగమము నిరర్థకమగును. కావున దా. ప్రతిలో

---

1. దా. ప్రతి. రామాయణము. బాలకాండ. సర్గ. 76 శ్లో. 17.
2. ప.ఉ. ప్రతి రామాయణము యుద్ధకాండ సర్గ 27 శ్లో. 19.
3. మంత్రపుష్పము "అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్యనారాయణ స్థితః।"
4. లక్కావజ్ఝల వెంకటకృష్ణశాస్త్రి. ఆశ్చర్య రామాయణము- యుద్ధకాండము పుట. 263-264 లలో ఉద్ధరింపబడినది. కాని దీని ఆకరము పేర్కొనబడలేదు.

నారదాగమన వృత్తాంతము వదలబడినది. ఇక ప. ఉ. ప్రతిలో నారదాగమన వృత్తాంతముతోఁ బాటు రామునకు గరుడని తోడఁగల వయస్యత్వమును[1] సూచింపఁబడినది. రహస్యము గావున కారణము వచింపబడలేదు. ఇప్పుడు నారదాగమన వృత్తముతో పైనఁ జెప్పబడిన పౌరాణిక కథ సమన్వయింపఁబడక పరస్పర విరోధ మేర్పడును. ఈ చిక్కును గమనించియే బుద్ధారెడ్డి సమూలకమై ప్రయోజనవంతమైన నారదాగమన వృత్తమును తన గ్రంథమున ననువదించి, రామునకు గరుత్మంతునకు గల మిత్రత్వము పొసగనిదౌటచే ఔచిత్యమును బాటించి దానిని సూచించక వదలివేసినాడు.

ఇందలి నారద స్తుతి రెండు ప్రయోజనములను సాధించినది.

1) శ్రీరామునికంటే పూర్వపువైన వరాహ, నరసింహ, కపిల, పరశురామ, నారాయణ ఋష్యవతారము లెట్లు దుష్టశిక్షణ, శిష్టరక్షణకై పచ్చినవో, అటులే రామావతారమును వచ్చినదని గుర్తుచేయుట.

2) శ్రీరాముని విరాట్పురుషునిగా పేర్కొనుట— అనగా సర్వదేవతామయుడు, సర్వ యజ్ఞస్వరూపుడు, సృష్టి స్థిత్యంతకారకుడు శ్రీరాముడే యనుట.

ఇంతేకాక, దేవతా భేద బుద్ధిని మాని, అన్నింటిని పరమాత్మ స్వరూపములుగాఁ దలంచి, సమదర్శులై యుండవలె ననెడి యుపదేశమునిది యొసంగుచున్నది.

కావున ఈ నారదాగమన వృత్తాంతము అవాల్మీకము కాదనియు, పాఠకుల సందేహ నివృత్తికి ప. ఉ. ప్రతినుండి ఇది బుద్ధారెడ్డిచే స్వీకృతమైనదనియు, దీనివలన పూర్వాపర సందర్భౌచిత్యము సంరక్షింపఁబడినదనియు నిర్ధారింపవచ్చును.

38) రావణునకు మండోదరి హితోపదేశము-

"ప్రహస్త వధానంతరము రావణుడు శోకవివశుడై "తానే యుద్ధమున కేగెదనని" మంత్రులతోఁ బలికెను. ఈ పలుకులను విన్న మండోదరి మాల్యవంతుని చేయి పట్టుకొని; అతికాయుడు తోడురాగా, దైత్య వనితలు గొలువగా రావణుని సభాస్థలికి వచ్చెను. రావణు డామెను అర్ధాసనాసీనఁగాఁ జేసి "కొలువులోపలి కిట్లు నెన్నడును రానిదానవు, ఇప్పుడు వడవడ వడకుచు వచ్చిన కారణమేమ"ని యడిగెను. మండోదరి తన భర్తను జూచి "దనుజేశ! నేను వచ్చినది ఎగ్గుగా గ్రహింపకుము. ప్రహస్తాది వీరులందరు యుద్ధరంగమున నీల్గినారు. విరాధ ఖర కబంధాది రాక్షస హంతకుడు, వాలి నిషూదనుడైన శ్రీరాము డాదినారాయణుడు గాని నరుండుగాడు. ఇంద్రాది దేవతలతని నెదిరింపలేరు అట్టి రాముడు నీకేమి యపకారము గావించినాడు? అతని దేవిని వంచనచేఁ దెచ్చితివి. సామ దాన భేదములు విడిచి యతనిని దండింపఁ జూచెదవు; కాని అది అసాధ్యము. అతనిని శరణు పొందుము. మన విభీషణు డక్కడ నున్నాడు. మణిభూషణాది సహితముగా మహీజాత నొసంగి మాల్యవంతాదులను రాముని సన్నిధికిఁ బంపి సంధిఁ గోరుము.

---

1. ప. ఉ. ప్రతి రామాయణము యుద్ధకాండము సర్గ 28 శ్లో. 25.
"కారణం చ వయస్యత్వే న ప్రష్టవ్యోఽస్మి రాఘవ।
నిహతే రావణే పాపే సఖిత్వం జ్ఞాయసే స్వయం॥"

విభీషణు డీ సంధిని సమకూర్చును. కార్తవీర్యుని గెల్చిన పరశురాముని గెల్చిన శ్రీరాము డీ సంధికిఁ దగడా ?" యని మండోదరి హితోపదేశముచేసి ప్రార్థించెను. కాని రావణుడు విన్నవాడు కాడు. అతడు మండోదరిని జూచి "నీ జెప్పిన మాటలయం దొక్కటియు మనసునఁ బట్టదు. చెలియలిని విరూపను జేసిన, ఖరాదులను హతమార్చిన రామలక్ష్మణులను హతమార్చి పగను పంతమును సాధింతును; కాదేని రణమున మడియుదును; కాని సంధి చేయను, జానకి నీయను. ఇంద్రజిత్తు మొదలైన నీ తనూజులుండగా వెఱవనేల ? యని పలికెను. ఈ మొండి మాటలు విని చేయునది లేక మండోదరి సభ వీడిపోయెను."[1]

ఇది దాదాపు 58 ద్విపదలలోఁ జాల చక్కగా వర్ణింపఁబడినది. దీనిని వేదము లక్ష్మీనారాయణశాస్త్రి,[2] వారణాసి వేంకటేశ్వరులు,[3] శ్లిష్టా రామకృష్ణశాస్త్రి[4] మొదలైన ప్రముఖ విమర్శకులు అవాల్మీకమనియు, కవియొక్క అద్భుతమైన కల్పన యనియు స్తుతించి యున్నారు.

కాని, ఇది పశ్చిమోత్తర శాఖీయ ప్రతి వాల్మీకి రామాయణము యుద్ధకాండములో 35, 36 సర్గలుగా నున్నది. ఇందు ఈ సర్గలకు సమానముగా నిచ్చిన దా. ప్రతి సర్గ సంఖ్య "59" అని వ్రాసి మరల క్రింది పంక్తిలో దా. ప్రక్షిప్త 1. 2 అని ముద్రింపబడియున్నది. ఇందువలన ఈ విషయము కొన్నింటిలో నున్నది, మరికొన్నింటిలోఁ బ్రక్షిప్తముగాఁ జెప్పబడినది, వేఱే కొన్నింటిలో మొదటికే లేదు" అని ఊహించవచ్చును. కాని నేను చూచిన దాక్షిణాత్య ప్రతి వాల్మీకి రామాయణములో మాత్ర మీ రెండు సర్గలు లేవు-

కేవలము దా ప్రతితో పరిచయ మున్నవారికి ఈ విషయ మవాల్మీకమగును. రంగనాథ రామాయణమందలి ఈ ద్విపదలు ప. ఉ. ప్రతి రామాయణము యుద్ధకాండములో 35, 36 సర్గల శ్లోకములకు సరిసమానముగా ననువదింపబడినవని పరిశీలించిన దెలియును.[5] ఇందు ఒకటి రెండు ఉపమానములు మాత్రము క్రొత్తగా చేర్చబడినవి. అవి-

1. మండోదరి రావణుని సభాస్థలము ప్రవేశించునపుడును

"కడు నొప్పు నీల మేఘముఁ జొచ్చు మెఱుపు-వడువునఁ జొచ్చె రావణ సభాస్థలము".[6]

2. ఆమె సభను వీడిపోవునపుడును-

"రమణీయతరమైన రావణులక్ష్మి-క్రమమేది తొలగెడి కైవడిఁ దోప"[7]

అనునవి. ఇక మూలమున "రాముడు మనుష్యుడు కాడు"[8] అని మాత్రముండగా,

---

1. రంగనాథ రామాయణము. యుద్ధకాండము ద్వి. 3115–3172.
2. వేదము లక్ష్మీనారాయణశాస్త్రి. పీఠిక. పుట-18 రంగనాథ రామాయణము. వావిళ్ళ ప్రతి.
3. వారణాసి వేంకటేశ్వరులు "ఆంధ్ర సాహిత్య సంగ్రహ చరిత్ర.
4. శ్లిష్టా రామకృష్ణశాస్త్రి- ఆంధ్ర వాఙ్మయచరిత్ర సర్వస్వము పుట-572.
5. ఇది భాస్కర రామాయణమునందును గలదు. యుద్ధకాండ గద్యపద్యములు 765-783.
6. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి. 3123.
7. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి. 3172.
9. ప. ఉ ప్రతి. రామాయణము. యుద్ధకాండ. సర్గ 35 శ్లో. 29.

"ఆదినారాయణుం డతడు గాడేని-మేదిని నింతటి మిక్కిలి నరుడు కలుగునే"[1]
అని కవి మండోదరిచే ననిపించినాడు ఈ విశేషములు దప్ప మిగిలినదంతయు మూలాను సరణమే.

దా. ప్రతిలో లేక ఔత్తరాహ ప్రతులలో నున్న ఈ ఘట్టమును కవి గ్రహించుటలో ఆశయ మేమిటి ?

రావణుడు మూర్ఖుడు"[2] మూర్ఖుడు స్వయముగా వివేచించి చూడడు; ఇతరులు జెప్పినను నడు. తన దగ్గరి బంధువులు, హితముం గోరు సన్నిహితులు చెప్పినను వినడు. దురభిమానముతో నుండును.

"అజ్ఞః సుఖమారాధ్యః సుఖతర మారాధ్యతే విశేషజ్ఞః॥
జ్ఞాన లవ దుర్విదగ్ధం బ్రహ్మాపి నరం నరంజయతి॥"[3]
అనెడి శ్లోక తాత్పర్యమునకు దృష్టాంతము రావణుడు. బుద్ధభూపతి దీనిని స్పష్టము చేయ దలంచి నాడు. కావుననే ప. ఉ. ప్రతిలోనున్న అనేక సర్గలను, రావణుని మూర్ఖత్వమును బ్రతిపాదించు వానిని గ్రహించి తెనుగు చేసినాడు. రావణునికి తల్లి, తమ్ముడు, భార్య, కుమారుడు, తండ్రి తాతలేకదా దగ్గరివారలు. తమ్ముడైన విభీషణుడు సంపూర్ణముగా మొగమోటము విడిచియు, కుంభకర్ణుడు పిల్లివాటముగాను హితోపదేశము చేసినారు. అపుడు రావణుడు విభీషణుని తన్ని వెడలగొట్టినాడు; కుంభకర్ణుని బెదిరించి తన పనిలోం దోడ్పడునట్లు చేసికొన్నాడు. ఇక తల్లి కైకసి స్వయముగా సభకు వచ్చి, తండ్రి యోగదృష్టిచేం దనకు దెల్పిన రాముని తత్త్వమును దెలియంజేసి, అతనితో విరోధము వలదని హెచ్చరించినది. కాని, రావణుడు వినక తల్లి గావున మర్యాదగనే పంపించినాడు. కుమారుడైన అతికాయుడును నీతిని బోధించినాడు. రావణు డాత్మం గైకొనలేదు. అట్లే తాత మాల్యవంతుడును హితోపదేశము చేసినాడు; కాని లాభము లేకపోయినది. ఇక చిట్ట చివరకు మిగిలినవారు- భార్యయైన మండోదరియే కదా ! ఆమె పతివ్రత ! పతి క్షేమమును ఆమె కంటె ఎక్కువగా కోరువారు ఇతరులుండరు. మరియు రావణుని ఆత్మ స్థానీయురాలు. అర్ధ శరీరిణి.

"అర్ధో వా ఆత్మనో యత్పత్నీ" అని శ్రుతి. కాంత సమయాసమయములు గుర్తించి ఎప్పు డెట్లు చెప్పిన తన భర్త వినునో, అట్లుచెప్పి, వశీకరించుకొని అతనిచేత తత్తత్కార్యములను చేయించును లేక మాన్పించును. లాక్షణికులు గూడ కావ్యోపదేశమును కాంతోపదేశముతో సమాన ముగాం బరిగణించినారు. కావున భార్యయైన మండోదరి చెప్పిన రావణుడు వినకపోవునా ? అనెడి సందేహము దీరుటకై కవి మండోదరి చేత కూడ రావణునకు ఉపదేశము చేయించవలెను. కాని దా. ప్రతిలో ఇదిలేదు. అందుచేత ఔచిత్యానౌచిత్యములు బాగుగాం దెలిసిన బుద్ధారెడ్డి విభీషణ,

---

1. రంగనాథ రామాయణము యుద్ధకాండము ద్వి. 31, 38;
2. ద్వావేతౌ జగత్యాం మూర్ఖౌ దుర్యోధన దశాననౌ,
   గోగ్రహం వనభంగం చ దృష్ట్వాయుద్ధం పునః పునః॥ ఆభాణక శ్లోకము-
3. భర్తృహరి సుభాషితములు. నీతి శతకము. మూర్ఖపద్ధతి. శ్లో. 2.

కుంభకర్ణ, కైకసుల హితోపదేశ ఘట్టములు ఔత్తరాహ ప్రతినుండి గ్రహించినట్లు, ఈ మండోదరీ నీత్యుపదేశమును గూడ దానినుండి గ్రహించి, తెలుగుచేసి తన రామాయణమున కెనలేని ప్రసిద్ధిని సమకూర్చుకొనెను. ఆమె స్వయముగా అతికాయాది కుమారులతో, మాల్యవంతునితో నిండు సభకు వచ్చి, మంత్రి సామంతాది రాక్షసుల యెదుట హితోపదేశమును జేసినను వినని, విషయమును గ్రహించని మొండి పట్టుగల మూర్ఖుడు రావణుడు గదా! యని విదితమగును. అయినచో ఆమె తన అంతఃపురమునకు రావణుడు వచ్చినప్పుడు ఉపదేశించవచ్చును; కాని తెగించిన యాడదివలె నిండు సభకు పతి యనుమతి లేనిది రావచ్చునా? దోషము కాదా? యని సందేహము కలుగును.

విషయ మిదికాదు. అంతఃపురములో ఒంటరిగా నున్నప్పుడు చెప్పిన మరేదైనా వినవచ్చును కాని, రావణుడు ఈ విషయమును (సీత నప్పగించుట) చెవిని బెట్టడు. ఇట్లు జరిగి యుండవచ్చును కూడ. కాని లోకులు "రాక్షస నాశనమునకు మండోదరి కూడా పరోక్షముగా కారకురాలైనది. ఆమె రావణుని సరిదిద్దలేదు." అని ఆమెను నిందించుటకు ఆస్కారము కలదు. ఆ యపకీర్తిని బాపుకొనుటకై మండోదరి నిండు సభకువచ్చి రావణునకు హితబోధ చేసినది.

ఒంటరిగా నున్నవేళ చెప్పినపుడు విననివాడు సంఘ మర్యాదకు, లోకాపవాద భీతికిలోనై పదిమందిలోఁ జెప్పినపుడు వినవచ్చును, ఆ యాశతోనే మండోదరి నిండు సభకు వచ్చినది. దీనిచే ఆమె పాతివ్రత్యమునకు భంగము కలుగలేదు; పతి నెదిరించిన దోషమును లేదు. లోకులకు ఆమె ప్రయత్నము స్పష్టముగా విశదమైనది. ఈ ఘట్టమును జొప్పించుట వలన, కవికి ఔచిత్య పరిజ్ఞాన మెంతయో గలదనియు తెలయనగును. ఇది మూలమందున్నదే, కాని అమూలకము మాత్రము కాదు. కాని ప్రతుల భేదమని చెప్పవచ్చును. ఈ రంగనాథ రామాయణమునందు ఘటన తర్వాత ఘటనగా క్రమానుగుణముగా కథ కొనసాగింపఁబడినది. కావున ప్రక్షిప్తమనుటకు వీలులేదు. రంగనాథ రామాయణమునందు మండోదరీ హితోపదేశము లేకపోయిన స్త్రీ ముఖమున తిలకము లేనట్లుగానే యుండును.

39. కుంభకర్ణుడు శ్రీరామతత్త్వమును రావణునకుఁ దెలుపుట :—

రామ రావణుల ప్రథమ సమరమున రావణుడు రామునియెదుట నిలువలేక సింహముచేఁ బడి చావునకు తప్పివచ్చిన సామజమువలె లంక జొచ్చెను; కుంభకర్ణుని మేల్కొలుపఁ జేసెను. అతడు సభకు వచ్చి, అన్నకు మ్రొక్కి తనను పిల్చిన కారణము నడిగెను. రావణుడు, ప్రహస్తాది వీరులు శ్రీరాముని చేతిలో మడియుటను దెల్పి, ఆరామ సౌమిత్రుల భంజించి లంక చెడకుండ రక్షించుమని" కుంభకర్ణుని కోరెను. అంతట కుంభకర్ణుడు అన్నకు నీతిని బోధించెను. ఈ బోధ "కుంభకర్ణుడు రావణునంత అధర్ముడు, క్రూరుడు, నీచుడు, పరదారలోలుడు కాడనియు, నీతి గలవా" డనియు విశదపరచుచున్నది.

రావణుడు కుంభకర్ణునిపైఁ గోపించే "వృథాజల్పములను మాని, కాదనక, కార్యమును జక్కఁ జేయు"మని హెచ్చరించెను. అపుడత దన్నతో నిటు పలికెను.

"ఒకనాడు నేను నిద్రనుండి మేల్కొని పెక్కుజీవులఁ దిని ఏకాంతమున్నవేళ, నారదు డాకసమున నరుగుచుండ, నతని సమీపించి, "సంభ్రమమున నెక్కడకు పోవుచున్నారని" యడిగి

తిని. అతడు బంగరుకొండనుండి తాను వచ్చుచున్నాననియు, బలికి అచటి వార్తల నిట్లు దెలిపెను. "బ్రహ్మ విష్ణు మహేశులు సకల దేవతలతో సభ జేసిరి. ఆ సభలో సురగురుడు లేచి "దశకంధరుడు దేవతలను, స్త్రీలను, మునులను బాధించుచున్నాడు; అతడు చెడు నుపాయమును జింతింపుడని పలికెను. బ్రహ్మ రావణుని వరమును ప్రస్తావించి "విష్ణువును మనుజలోకమున మానవునిగా నవతరించుమ"ని సురలతోఁగూడి ప్రార్థించెను. ఆ హరి వారి కోరికను మన్నించి భూమిపై రాముడుగా పుట్టెను" అని చెప్పి నారదుడు పోయెను. కావున శ్రీరాముడు మనుజుడు గాడు, ఆదిదేవుడు; జానకి నొసంగి యతని శరణు వేడుము" అని కుంభకర్ణుడు రావణునకుఁ దెలిపెను. కాని దశకంఠుడు కోపించి "మీరందఱు విష్ణుడు విష్ణుడనుచు భయపడుచున్నారు. నేను మాత్రము వెఱవను. సరసిజోదరుడు వైరముపూని రాముడై భువిని జన్మించినప్పుడు. అతనితో మనకు సంధి యెట్లు పొసగును ? అతడు వామనుడై బలిని మూడడుగులు యాచించుకొని, అప్పుడే యాతనిని బంధించినాడు అత డుపకారికి అపకారము సేయువాడు దేవతల మీదికి దండెత్తి పోయినవేళ, అపుడత డెక్కడికి పోయినాడు నీతో నీతిని వినగోరి నిన్ను మేల్కొల్పలేదు, ప్రాణము తీసైనచో నీవు నెమ్మది నుండుము. నేనింత గొప్పగా బ్రతికి ఇతరులవలె నతని. మ్రొక్కజాలను. నేనే ఆ రాముని వానరులతోఁ గూడ చంపెదను. సరే. ఆ రాముడు విష్ణువుకి సీత లక్ష్మియని నే నెఱుంగుదును. కామక్రోధములచే నేను సీతనుఁ జెఱఁబట్టి తేలేదు. రామునితో రణమున నీల్గి పరమపదమును నొందదలచియే సీతను దెచ్చితిని. ఇది నిక్కము" అని కుంభకర్ణునికి తన ఆంతరంగిక రహస్యమును దెలిపెను."

ఈ రావణ కుంభకర్ణ సంభాషణము- నారదుడు తనకుఁ జెప్పిన సంగతిని రావణునకుఁ దెలిపి రాముని శరణు పొందుమని కుంభకర్ణుడు బోధించుట తెలిసియే సీత నెత్తుకొని వచ్చితినని రావణుడు సమాధాన మొసంగుట- యనునది రంగనాథ రామాయణమునందు-

"విను దానవేశ్వర వేడుక నొక్క-దినమున నే నిద్ర దెలిసిననాడు
.... మొదలుకొని ... ...
రణము లోపల రఘురాముచే నీల్గి-ప్రణుతింప విష్ణుని పరమపదంబు
దక్కక పొందంగఁ దలచియే సీత-నిక్కంబు దెచ్చితి నీ కేల దాప"[1]

అను ద్విపదవరకు సుమారు 70 ద్విపదలలో గలదు. ఇవి కుంభకర్ణుని శీలమునకుఁ జక్కని ఒరవడిని పెట్టుచున్నవి. "విభీషణుని వలెనే కుంభకర్ణుడును రావణునకు శ్రీరామతత్త్వము నుపదేశించినాడు. కాని మూర్ఖుడైన దశకంఠుడే వినలేదు; అని ఈ సంభాషణ ప్రధానోద్దేశ్యము. ఇట్టి అమూల్యమైన ద్విపదల కాధార శ్లోకములు దా. ప్రతి వాల్మీకి రామాయణమునందు లేవు. కావున ఇది అవాల్మీక మనవలసి వచ్చును.. కాని ప ఉ. ప్రతి యుద్ధకాండము నందలి 41వ సర్గలోని 32 వ శ్లోకమునుండి 42వ సర్గలోని 25 శ్లోకములు ఆధారములు.

త్రికాలవేది, త్రిలోకజ్ఞుడునైన నారదుడు చెప్పినది అసత్యముంకాదు; కావున రాముడు దేవుడే. సీత లక్ష్మియే అని కుంభకర్ణుడు విశ్వసించి అన్నకు హితోపదేశము చేసినను, అతడు

---

1. రంగనాథ రామాయణము యుద్ధకాండము ద్వి. 3663-3732.

మూర్ఖుడెనందునను, వినాశకాలమునకు విపరీత బుద్ధి కలిగినందునను వినలేదు" అని స్వారస్యమును ఈ సంభాషణద్వారా తెలుపుట కవి ముఖ్యోద్దేశ్యము. "రాముడు విష్ణువనియు తెలిసియే చేసితి" ననియు రావణుడు పలికిన మాటలు వ్యంగ్యములై యెన్నియో యూహలకు తావలము లగుచున్నవి.

1. సోదరా! నీవు చెప్పినది క్రొత్తదికాదు. తెలిసియుండియే పగకు పూనినానని కుంభకర్ణుని ఎగతాళిచేయుట.

2. శాపగ్రస్తులమైన మన శాప మోక్షము రామునిచే తెగటారుట వలననే కావలసినదిగదా! కావున ముక్తిని కోరియే చేసితినని తన జ్ఞానమును తెలియజేయుట.

3. కుంభకర్ణుని మాటలను నిరాకరించిన, అత డాగ్రహించి తనకు దోడ్పడకపోవచ్చును. అతని పలుకులు నిజములని యంగీకరించుచునే తదనుగుణముగా తాను పలికి కుంభకర్ణుని సమరమునకు సమ్మతింపజేయుట.

4. "నేను తెలిసియే యుద్ధమునకు దలపడినాను. మీరో వెఱచి నీతిని గఱపుచున్నారు. అట్లైనచో రణమునకు రాక ప్రాణముల తీపితో బ్రతుకుడనుట" కుంభకర్ణుని మర్మములు నాటునట్లు పొడిచి, పౌరుషమును కలిగించి తనకు సహాయపడునట్లు చేసికొనుట- ఇట్లిది కుంభకర్ణుని శీలమును, రావణుని యెత్తుగడలను, ఎత్తిపొడుపులను విశదపరచుచున్నది-

ఆనంద రామాయణమునను నీ విషయము సంగ్రహముగా కలదు 1

కావున బుద్ధభూపతి "ఈ రావణ కుంభకర్ణ సంవాదము" ఔచిత్యశోభితమై యున్నందున, దాక్షిణాత్య ప్రతిలో లేకున్నను ఔత్తరాహ ప్రతి ననుసరించి రంగనాథ రామాయణమున పొందుపరచినాడు 2

ఇందులో-

ఆ రాఘవుడు విష్ణుడగుగాక యేమి-యా రామునకు దమ్ముడైన సౌమిత్రి
యారయశర్వుండె యగుగాక యేమి? యా రవిసుతు డింద్రు డగుగాక యేమి?
సురలయై యుండంగ సొరిది నే వెఱవ"

అని రాయల్ అండ్ కో మరియు వావిళ్ళ ప్రతులలోను,

"ఆ రాఘవుడు విష్ణు డగుగాక, యింద్రు-డా రాఘవుని తమ్ముడౌగాక, హరుడు
నా రవినందనుం డగుగాక యెందు-బోర వారికి విధి పోయెను దలప."4

అని ఆంధ్ర విశ్వకళాపరిషత్తువారి ప్రతిలోను కనిపించుచున్నవి. వీనికి మూలమైన ఈ క్రింది శ్లోకముతో

"యది రామ స్స్వయం విష్ణుః లక్ష్మణోఽపి శతక్రతుః।

1. ఆనంద రామాయణము. సారకాండము. సర్గ 11 శ్లో. 142-147.
2. భాస్కర రామాయణమునను ఇది కలదు- యుద్ధ. పద్య. 891-900.
3. రంగనాథ రామాయణము. యుద్ధకాండము, ద్వి. 3688-3700.
4. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. పుట.456.

సు\[గీవస్త్ర్యంబకస్సాక్షాత్ స్వయం\[బహ్మాచజాంబవాన్"1
అని పోల్చినచో ఆం. వి. క. పరిషత్తు పాఠమే మూలమునకు దగ్గరగా నున్నది. "స్వయం \[బహ్మా చ జాంబవాన్" అనునది వదలఁబడినది.

40. విభీషణ కుంభకర్ణ సమాగమము:—

అన్న యానతిపై కుంభకర్ణుడు యుద్ధమునకు వచ్చి, భయంకరముగా రణ మొనర్చుచు వానరులను హతమార్చుచుండెను. ఆ సమయమున విభీషణుడు గదాపాణియై కోపముతోఁ గడు వేగమున వచ్చి అన్న యెదుట నిలిచెను. "అప్పుడు కుంభకర్ణుడు తమ్మునిఁ జూచి "నీ ప్రతాపమున కిది మంచి సమయము. అన్నదమ్ముల ధర్మమని బాధ చెందవలదు. నీవు శ్రీరాముని అనుగ్రహమును పొందితివి. గావున నెన్నఁడును నిన్నాపదలు చేరవు. నీవు తప్ప లంక నేలుట కెవ్వరును లేరు. పౌరుషముతో నన్ను దాకి రణ మొనర్చుమని పలికితివి. కాని యీ సమయమున నా యెదుట నిలువరాదు. వంశమున నొక్కడైనను బ్రతికి యుండవలె"నని పలుకగా విభీషణుడు "అన్నా! రాక్షస కులము దగ్ధమైపోవునని రావణాగ్రజునికి నీతి విధము దెలిపితిని. కాని యతడు వినలేదు. ఇక లాభము లేదని యతనిని విడిచి శ్రీరాముని శరణు పొందితిని" అని పలికి కన్నుల నీరు గారగా, మిగుల దుఃఖపడి కుంభకర్ణునిఁ జూడఁజాలక దూరముగా దొలగి పోయెను."2

ఇది రంగనాథ రామాయణమున సుమారు 18 ద్విపదలలో చక్కగా వర్ణింపబడినది.2 కొందరు విమర్శకులు ఈ కుంభకర్ణ విభీషణ సమాగమము నద్భుతమైన కవి కల్పన యనియు, దీనిచే కుంభకర్ణ శీలమునకు వన్నె పెట్టబడినదనియు ప్రస్తుతించుచున్నారు3 ఇది దాక్షిణాత్య ప్రతి యందు లేకపోవుట వలన వారట్లు భావించుట దోషముగాదు. కాని పశ్చిమోత్తర శాఖీయ ప్రతి వాల్మీకి రామాయణమునం దీ విషయము గలదు.4

ఇచట పశ్చిమోత్తర శాఖీయ ప్రతిలో అధిక పాఠ మొకటి కనబడుచున్నది. "విభీషణుడు కుంభకర్ణుని పాదములకు ప్రణామము చేసి "రాముడు సాక్షాజ్జనార్దనుడు, సీత నిమ్మని బోధించినను అన్న రావణుడు వినకుండ ఖడ్గమునెత్తి భీ పొమ్మని నన్ను దూషించెను నేను శ్రీరాముని శరణు పొందితి"నని నుడివెను. కుంభకర్ణుడును తమ్ముని కౌగిలించుకొని "వత్స! కులరక్షణకై, రాక్షసుల మేలునకై నీవు రామ పదాశ్రితుడవై జీవించుము. నీవు మహాభాగవతుడవని పూర్వము నారదుని వలన వింటిని ఇపుడు మదమత్త విలోచనుడనైన నాకు స్వపర భేదము కనబడుచు లేదు. నీవు పోవలసినదని పలికెను. అంతట విభీషణు డన్నకు నమస్కరించి చింతించుచు రాముని ప్రక్క చేరెను.5

---

1. ప. ఉ. ప్రతి వాల్మీకి రామాయణము యుద్ధకాండము. సర్గ 42 శ్లో. 8.
2. రంగనాథ రామాయణము యుద్ధకాండము ద్వి. 4082-4099.
3. శిష్టా రామకృష్ణశాస్త్రి "ఆంధ్ర వాఙ్మయచరిత్ర సర్వస్వము సంపుటి-1 పుట-571.
4. ప.ఉ. ప్రతి రామాయణము. యుద్ధకాండము. సర్గ 46 శ్లో. 82-91.
5. ప. ఉ. ప్రతి రామాయణము. యుద్ధకాండము. సర్గ 46 పుటలు 239-240.

రంగనాథ రామాయణ మందలి విషయ మధిక పాఠముకంటెను ఇతః పూర్వము వ్రాయబడిన మూలపాఠ మూలశ్లోకములను పోలుచున్నది.

భాస్కర రామాయణమునందును ఈ విషయము గ్రహింపబడినది.1

వాల్మీకియే కుంభకర్ణుని శీలమునకు వన్నె పెట్టినాడు, కాని బుద్ధభూపతి మాత్రము కాదు. ఈ విభీషణ కుంభకర్ణ సమాగమము వారి సోదర ధర్మమునకు అద్దము పట్టినట్లున్నది. రాక్షసుడు ఎంత క్రూరుడైనప్పటికిని అతనికిని మనస్సున్నది. ప్రతిపక్షమునఁ జేరిన సోదరుడు కనిపించినపుడు తనంతటనే ప్రేమ మదిలోఁ బొంగివచ్చును. తన వంశము నిర్వంశము కావలెనని ఎవడును కోరడు. ధర్మబుద్ధిగలవానియం దీగుణ మధికముగా పరిస్ఫుటమగును. ఇది లోకసహజము. కుంభకర్ణుడు రావణుని తమ్ముడైనను అతని యంతటి యధర్మాత్ముడు మాత్రముకాడు. ఇది నిండుసభలో రావణునితో మాటాడిన కుంభకర్ణుని తీరును స్పష్టపరచుచున్నది కావున ఏతదనుగుణముగా కుంభకర్ణుని శీలమున కిది పోషకముగా నున్నది. బుద్ధభూపతి ఇట్లు తలంచి, దా. ప్రతిలో లేకున్నను ఈ ఘటనను ఉత్తరదేశ ప్రతి (ప.ఉ. ప్రతి)నుండి గ్రహించి తన రామాయణమునఁ బొందు పరచినాడు. కవి కల్పన మాత్రముకాదు. కేవలము దా. ప్రతిని అనుసరించి వ్రాసిన ఇతర రామాయణ కర్త లెవ్వరును తమ గ్రంథమున ఈ విషయమును ప్రస్తావించలేదు,

41. కాలనేమి వృత్తాంతము:—

రంగనాథ రామాయణమునందు అవాల్మీక గాథలుగా పరిగణింపఁబడుచున్న వానిలో కాలనేమి వృత్తాంత మొకటి.2 కీ. శే. పింగళి లక్ష్మీకాంతంగారు "ఏతత్ కావ్య సౌందర్యాపాదకములైన మూడు ముఖ్య గాథలలో దీనిని ఒకటి"3గా పరిగణించియున్నారు. కాని ఆధ్యాత్మ, ఆనంద రామాయణములందే కాక ఈ వృత్తాంతము వాల్మీకి రామాయణము ఇటాలియన్ ప్రతిలోను,4 ప. ఉ. ప్రతిలోను5 గలదు. దాక్షిణాత్య ప్రతులలో మాత్రమిది కానరాకున్నది. ములుకుట్ల నరసింహావధానులుగారు ఈ కథ తాళపత్ర లిఖిత వాల్మీకి రామాయణమునందు నున్నదని తెలుపుచు కొన్ని శ్లోకములను రామాయణ సారోద్ధారమున నుట్టంకించినారు. కాని ఈ ప్రతి యెచ్చట నున్నదో తెలియకున్నది. "సంస్కృతమున నిది ప్రక్షిప్తమని పరిశోధకుల యభిప్రాయమట."6 అయినచో నిది ప్రథమముగా ఏ యపర వాల్మీకి యద్భుత కల్పనమో చెప్పజాలము. కాని యుత్తరదేశ ప్రతులందు

---

1. భాస్కర రామాయణము. యుద్ధకాండము. పద్య. 944-947.
2. a) రావూరి దొరసామి "తెలుగుసాహిత్యము-రామకథ" పుట. 124.
   b) పండా శమంతకమణి "తెలుగు సాహిత్యములో రామకథ" పుట. 184.
   c) వేదము లక్ష్మీనారాయణశాస్త్రి- పీఠిక-రంగనాథరామాయణము పుట. 18 వావిళ్ళ ప్రతి.
3. ఆంధ్ర సాహిత్య చరిత్ర. పుట. 176.
4. మల్లంపల్లి సోమశేఖర శర్మ- పీఠిక. రంగనాథ రామాయణము
   రాయల్ అండ్ కో ప్రతిలో ఈ కాలనేమి వృత్తాంత మూలపాఠము ఒసగబడినది.
5. ప. ఉ. ప్రతి రామాయణము యుద్ధకాండము సర్గ 81 శ్లో. 1-204.
6. రావూరి దొరసామి శర్మ- తెలుగు సాహిత్యము-రామకథ పుట. 124.

నిది యుండుటచే, ఇది వాల్మీకమే యనియు, ఆ యా కవు లాశ్చర్య చమత్కారములకై సముద్ర నడుమ కొన్ని మార్పులు, కల్పనలు చేసినారనియు తలంపవచ్చును. అట్లే బుద్ధభూపతియు దీనిని సర్వాంగ సుందరముగా మలచినాడు. మూల పాఠముతో పోల్చిచూచిన కవి చేసిన మార్పులు, కూర్పులు తెలియగలవు-

ఈ కథ యందలి ప్రధానాంశము "రావణుని శక్తిచే లక్ష్మణుడు హతుడు కాగా, హనుమంతుడు ద్రోణాద్రికి పోయి, సంజీవనీ పర్వతముతోఁ దిరిగి యుద్ధరంగము జేరి లక్ష్మణుని బ్రదికించుట" ఇది అన్ని రామాయణ ప్రతులందు సమానమే. "సూర్యోదయాత్పూర్వమే వచ్చుట, ఆవేళ దాటినచో, ఓషధి పని చేయకపోవుట" విశేష విషయము. కావున హనుమంతునకు మార్గ మధ్యముననే కాలయాపన జరుగవలెను దీనికి రాక్షసులు పన్నిన మాయలు తోడుపడవలెను. ఈ విఘ్నముల నన్నింటిని బుద్ధిబలము, బాహుబలముచే ఆంజనేయు డధిగమించి గడువు లోపలనే రావలెను. అప్పుడే అతని ఘనత, శ్రీరాముని యందలి భక్తివిశ్వాసములు, అచంచలమైన కార్యదీక్ష, విఘ్ననివారణ దక్షత ఇత్యాదులు వెల్లడి యగును. కావున కాలనేమి వృత్తాంతమందలి కాలనేమి మోసము, గంధర్వాదుల పోరు. భరతుని దర్శనము, మాల్యవదాదుల యెదిరింపు మొదలగునవి కథ కెంతో రమ్యత నాపాదించినవి.

ఇచ్చట డా॥ పింగళి లక్ష్మీకాంతంగారి యీ క్రింది మాటలు ఎంతయో యథార్థములై యొప్పియున్నవి.

"ఇందు మనల నాశ్చర్యమగ్నుల చేయునది రాక్షసుల ప్రతిక్రియా చతురత. అది యటుండ రావణు శక్తిచే మూర్ఛ పడియున్న లక్ష్మణు డెప్పుడు పునర్జీవితుడగునా యని తహతహ పడు పాఠకులకు ఈ అవాంతర కథ వలన కలిగిన కాలయాపన భరింపరాని ఉత్కంఠను కలిగించి దుర్భర సంశయాస్పదమైన పరిస్థితిని సృష్టించి అంతమున చేకూరిన శుభమును ఇనుమడిగా కమ్మ దిగా ఆస్వాదయోగ్యమొనర్చుచున్నది.1

రంగనాథ రామాయణమునందిది యుద్ధకాండములో సుమారు నాల్గువందల ద్విపదలలో దీర్ఘముగా కలదు. ఇదికేవలము ఒకేయొక వాల్మీకి రామాయణ ప్రతిని పోలినదని కాని, అధ్యాత్మ ఆనందాది రామాయణములలో నొక ప్రత్యేక రామాయణమును పోలుచున్నదని కాని చెప్పజాలము. కవి తనకు అందుబాటులోనున్న వాల్మీకి రామాయణ ప్రతులను, ఇతర రామాయణములను జూచి. సందర్భోచిత్యములను బాటించి, కథలోని ఘటనలను ముందువెనుకలుగా మార్చి, పరస్పరభిన్నమైన కథాంశములలో ఉచితమైనవానిని గ్రహించి కాలనేమి వృత్తాంత పూర్వకముగా లక్ష్మణుని పునర్జీవిత గాథను సరస సుందరముగా వర్ణించినాడు. ఆయా గ్రంథముల మూలభాగములను తులనాత్మకముగా పరిశీలించినపుడు కవి యనుసరించిన గ్రంథ భాగములు, మార్పులు స్పష్టముగా విదితమగును.

---

1. ఆంధ్ర సాహిత్య చరిత్ర పుట. 177.

I పశ్చిమోత్తర శాఖీయ వాల్మీకి రామాయణ ప్రతిలో లేక ఆధ్యాత్మ రామాయణము ననుసరించిన కథాంశములు :—

1. రావణుడు కాలనేమి గృహమునకు స్వయముగా నేగుట.[1]

2. కాలనేమి రావణునకు హితబోధ చేయుట.[2]

3. కాలనేమి యాశ్రమమును జూచి మార్గము తప్పితినేమో యని మారుతి చింతించుట.[3]

4. కపట ముని మారుతికి మొదట కలశ జలము నొసంగి, ఫలాదులు గ్రహించి, విశ్రాంతి దీసికొని, మంత్రోపదేశము నొంది పొమ్మని హెచ్చరించుట. ఆ నీరు చాలదనగా పిదప సరోవరము చూపించుట.[4]

5. శాపవిముక్తురాలైన గంధర్వి పేరు ధాన్యమాలి యగుట.[5]

(ప. ఉ. ప్రతిలో విద్యున్మాల యనియు. ఇటాలియన్ ప్రతిలో గంధకాలి యనియు నున్నది.)

6. మకరిని జంపి తిరిగివచ్చిన మారుతిని గురుదక్షిణ యిమ్మని కాలనేమి యడుగుట.[6]

భేదము :—

ఆధ్యాత్మ రామాయణమున ఈ కాలనేమి వృత్తాంతము కుంభకర్ణ మేఘనాదవధాదులకంటె పూర్వము కలదు. కాని రంగనాథ రామాయణమున కుంభకర్ణ వధాదుల తర్వాత వర్ణింపబడినది. కావున బుద్ధారెడ్డి ఇచ్చట మూలము (ప. ఉ. ప్రతి) నందలి కథాక్రమమును పాటించినాడు.

II ధాన్యమాలిని శాప వృత్తాంతము :—

ఇది రెండు విధములుగా నున్నది.

(1) "గంధకాలియను అప్సరస విమానమునందు కుబేర మందిరమున కేగుచు తపము చేయుచున్న యక్షుడను మునిని విమాన వేగమున నవమానించెను. అతడు క్రోధ తామ్రాక్షుడై గంధ మాదన పర్వత సరోవరమునందు మకరివై పడియుండుమని యామెను శపించెను. పిదప హనుమంతుని వలన శాపమోక్ష మగునని యనుగ్రహించెను."[7]

(2) "శాండిల్యుఁ డను ముని ధాన్యమాలినిపై మోహమునొంది తన్ను చేరుమని యాహ్వా

ప.ఉ ప్రతి యుద్ధకాండ సర్గ 81	ఆధ్యాత్మ రామా. యుద్ధ. సర్గ 6,7	రంగనాథ రామా. యుద్ధకాండము
1. శ్లో. 51(ఇంటికి పోలేదు)	1. సర్గ 6 శ్లో. 34-38	1. ద్వి. 6605-6608
2. శ్లో.61(హితబోధ లేదు)	2. సర్గ 6 శ్లో. 43-46	2. ద్వి. 6615-6622
3. శ్లో.64-65(చింతించలేదు)	3. సర్గ 7 శ్లో. 6-9	3. ద్వి. 6633-6636
4. శ్లో. 74-77 (నేరుగా కొలనునే చూపించెను)	4. సర్గ 7 శ్లో. 14-20	4. ద్వి. 6640-6665
5. శ్లో. 83 (విద్యున్మాల)	5. సర్గ 7 శ్లో. 24	5. ద్వి. 6732
6. శ్లో. 94 (గురుదక్షిణ ప్రస్తావమే లేదు)	6. సర్గ 7 శ్లో. 29-31	6. ద్వి. 6784-6787

7. ప. ఉ. ప్రతి రామాయణము. యుద్ధకాండము. సర్గ 81 శ్లో. 83-87.

నించెను. ఆమె "నే నిపుడు రజస్వలనై యున్నాను. ఋతుస్నానానంతరము వచ్చెదనని" పలికి, అదేరీతిగా నాల్గవ దినమున మునియొద్దకు వచ్చుచుండెను. మార్గమధ్యమున దశగ్రీవు డా యప్సరసను గాంచి, బలాత్కారముగా సంభోగించి, సద్యోగర్భమున సతికాయుడు జనించగా, నాతని చేకొని లంక కేగెను. "పిమ్మట ధాన్యమాలి మునియొద్దకు రాగా, అతడు జరిగిన దెఱింగి "వ్రతభ్రష్టురాలవు; మకరివి కమ్మని శపించి, తరువాత ఆమెయందు తప్పులేదని గ్రహించి, ప్రసన్నుడై "హనుమంతునిచే చీల్చివేయబడి నిజరూపమును బడయగలవని" శాపాంతమును ప్రసాదించెను. అంతేకాక, "స్త్రీ నిమిత్తముగా రావణుడు సకుటుంబముగా నశించగలడని దశగ్రీవునకును అతడు శాపమొసంగెను."[1]

ఆనంద రామాయణమున నిది కేవలము సూచింపబడినది.[2]

రంగనాథ రామాయణ కర్త శాండిల్య వృత్తాంతమును గ్రహించి సరసముగా వర్ణించుటయే కాక, తద్ద్వారా ఈ క్రింది సత్యములను ప్రకటించి కథను ప్రయోజనవంత మొనర్చినాడు—

1. ఎట్టి మునులైనను కామ క్రోధములకు వశులగుదురు.

2. ఋతుమతియైన స్త్రీలను మూడు దినముల వరకు స్పృశింపరాదు. కామవశులై తత్కాలమున రమించిన రాక్షస ప్రవృత్తి గలవారలు జనింతురు.

3. సాధారణముగా స్త్రీలకు సత్యమునకు నెంతయో దూరము.

ఈ ధాన్యమాలిని కథా సందర్భమున "శాండిల్యుడు ధాన్యమాలిని గూర్చి పలికిన ఈ క్రింది ద్విపదలు హేతువుగా నొక కట్టుకథ లోక ప్రచారమున నున్నది.

"ఇది తపః ఫలసార మెలనాగ నాకు-నిది పుణ్య ఫలసార మెలనాగ నాకు
ఇది మోక్ష సాధన మెలనాగ నాకు-ఇది స్వర్గ సోపాన మెలనాగ నాకు"[3]

"రంగనాథుడు బుద్ధారెడ్డి యాస్థాన పండితుడు. రాజుగారు కవి వ్రాసిన పై భాగమును విని తన భార్యయగు నెలనాగయందు కవి బద్ధానురాగుడయ్యె నని తలచి తన భార్యతో నాతని వాంఛితమును దీర్చవలెనని యాజ్ఞాపించినాడట. కవి యా సంగతి విని తన కామెయందుఁగల మాతృభావమును భక్తిని దెలిపినాడట."[4]

ఈ గాథ రంగనాథుని నిర్మల మనఃశుద్ధిని దెలుపుటకు కల్పితమైన దనుటకాక భంగ్యంతరముగా రంగనాథ కర్తృత్వమున కుపబలకముగా నున్నది. కాని యిది యంత విశ్వసనీయముగా లేదు—

---

1. రామాయణ సారోద్ధారము. యుద్ధకాండము. పుట. 492, 494 లో "ఈ వృత్తాంతము తత్త్వసంగ్రహ రామాయణము, తాళపత్ర లిఖిత రామాయణములందు గలదని" ఉద్ధరింపబడినది.
2. ఆనంద రామాయణము. సారకాండము సర్గ 11 శ్లో. 56.
3. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి. 6743-6744.
4. జనమంచి శేషాద్రి శర్మ. పీఠిక. పుట. 4 రంగనాథ రామాయణము. వావిళ్ళ ప్రతి.

III హనుమద్భరత సమాగమము :—

కాలనేమి కథ ప్రధానముగాఁ గల సంజీవినీ పర్వతానయన వృత్తాంతమునందు మారుతి భరతుల సమాగమము ఒక ముఖ్యమైన ఘటనము. ఇది కొన్ని ప్రతులలో "ఆంజనేయుడు ద్రోణ గిరికిఁ జేరకముందే, కాలనేమి వధకు పూర్వమే జరిగినట్లును,"[1] కొన్ని ప్రతులందు "ఓషధీ కుధరమును దీసికొని వచ్చునపుడును ఘటించినట్లు"[2] కనబడుచున్నది.

ఈ హనుమద్భరత సమాగమ వృత్తాంతము ప. ఉ. ప్రతియందును, ముద్రిత దాక్షిణాత్య ప్రతులందును గానరాదు. ఆనంద రామాయణమునందును,[3] హనుమన్నాటకము నందు[4] నిది సూచింపబడినది. ఇట్లు భిన్న గ్రంథములందు విభిన్న రీతులుగా నున్న ఈ కథ ఆయా ప్రయోజనముల కాంక్షించిన రచయితలచే మార్పు నొందినదని తలంపవచ్చును.

1. "ద్రోణగిరికి పోవు మారుతికి అయోధ్యాపుర సమీపమున భరతుడు గుర్తునకు వచ్చెను. నంది గ్రామముననున్న భరతుడును హనుమంతుని భూతముగా దలచి బాణముచే పడగొట్ట నుంకించెను. దానిని ప్రతిషేధించ దలచి మారుతి కృతాంజలియై లక్ష్మణ వృత్తాంతమును నివేదించి, తాను ద్రోణగిరికి ఓషధ్యానయనమునకు పోవుచున్నట్లు తెలుపగా, భరతుడు చింతిల్లి, తనను, తల్లిని నిందించి రాముని సమీపమునకు కొనిపొమ్మని కోరెను; కాని పావని అతని నోదార్చి ద్రోణగిరి కేగెను. భరతుడు రావణ వధకై సైన్యము కూర్చగా సముద్యోగించెను."

ఇది ఇటాలియన్ ప్రతిలోనిది. ఈ కల్పనచే భరతునికి సీతాపహరణాది వృత్తాంతము దెలియుటయు, అతడును సానుభూతితో సహాయము చేయుటకు సైన్య సమీకరణము కావించుటయు ముఖ్య ప్రయోజనములు. దీనివలన భరతునికి రామునిపై క్షేమ యున్నదనియు, రాజ్యముపై నాపక్తి లేదనియుఁ దెలుపుట ప్రధానోద్దేశ్యము. సుందరకాండములో సీతాదేవి హనుమంతునితో

కచ్చి దక్షౌ హిణీం భీమాం భరతో భ్రాతృవత్సలః॥
ధ్వజినీం మంత్రిభిర్గుప్తాం ప్రేషయిష్యతి మత్కృతే॥"[5]

అని యడిగినది. భరతునికి సీతాపహరణ. రామరావణ రణ వృత్తాంతము దెలియనిచో అతడెట్లు సైన్యమును బంప సముద్యోగించఁగలడు ? భరతునికి సంగతి యెట్లు దెలియవలె ? జానకి హనుమంతునితో నడిగినది; అనగా భరతునకుఁ దెలుపు బాధ్యతను హనుమంతునిపై పరోక్షముగా సీతాదేవి ఉంచినదని ఊహింపవచ్చును. కావుననే, ద్రోణగిరికిఁ బోవు ఆంజనేయునకు అయోధ్యను చూడగానే భరతుడు తలఁపునకు వచ్చుటయు, అనుకొనకుండ భరతుడు తనను

---

1. వంగీయ ప్రతి రామాయణము (ఇటాలియన్ ప్రతి) ఇది మల్లంపల్లి సోమశేఖర శర్మగారి పీఠికయందును ఉద్ధృతమైనది.
2. "తాళపత్ర లిఖిత వాల్మీకి రామాయణము" అని రామాయణ సారోద్ధారమునందు ఉద్ధృతము- యుద్ధకాండము. పుట. 493.
3. ఆనంద రామాయణము. సారకాండము. సర్గ 11 శ్లో. 61-68.
4. హనుమన్నాటకము. అంకము-13 శ్లో. 22-30.
5. దా. ప్రతి వాల్మీకి రామాయణము. సుందరకాండము సర్గ 36 శ్లో. 24.

భూతముగా భావించి బాణముతో కొట్ట నుంకించగా, దానినుండి తప్పుకొనవలసిన అవసరముండుటయు సహజములు. ఈ రెండు కార్యములు భరతుని కలియుటతో నెరవేరును. ఈ దృష్టితోఁ జూచినపుడు ద్రోణగిరికిఁ జేరుటకుముందే హనుమద్భరత సమాగమము వర్ణించిన ఒటారంగున్ ప్రతి పాఠము సముచితమైనది.

2. ద్రోణగిరిని పెల్లగించి తెచ్చునపుడు కావింపబడిన హనుమద్భరత సమాగమ కల్పనము, మారుతి గర్వభంజనము ప్రయోజనముగా గలది. అది యిట్లున్నది—

"భరతునకు దుస్స్వప్నము వచ్చినది. మేల్కొని పరితపించుచు, వసిష్ఠాదులను బిలిపించి, వారి యానతిని భరతుడు శాంతి హోమమును జేయించుచుండెను. ఆ సమయమున మారుతి ద్రోణగిరితో అయోధ్యాపురి మీదుగా పోవుచుండగా, నదేదో మహాభూతమని భావించి తన బాణమున పడవేసెను. "రామా! లక్ష్మణా!" యనుచు పావని భూమిపైఁ బడి మూర్ఛాక్రాంతు డయ్యెను. భరతుడు సమీపించి, ఆంజనేయునిచే యావద్వృత్తాంతము నెఱింగి, దుఃఖించి తన శరముపై పర్వతముతోఁ గూడ నతనిని కూర్చుండఁజేసి సంధించి విడిచెను. అది మనోవేగమున రామాదులను జేర్చెను."[1]

ఒకప్పుడు రాముడు భరతుని బాహుబలవర్ణనము జేయుచుండ, ఆంజనేయున కసూయ పొడమినది[2] ఆతడు

"పాతాలతః కిము సుధారస మానయామి-నిష్పీడ్య చంద్ర మమృతం కిముతా హరామి।
ఉద్దండ చండ కిరణం నను వారయామి-కీనాశ పాశమనిశం కిము చూర్ణయామి।"[3]

అని గర్వించి పలికెను. తద్గర్వభంజకమే ఈ కల్పనయొక్క ప్రయోజనము—

3. భరతాంజనేయులకుఁ బరస్పర దర్శనమేకాని పరస్పర సంభాషణము జరుగలేదని మూడవ కల్పనము—

"మారుతి ద్రోణగిరితో వచ్చుచు దుస్స్వప్న శాంతికొఱకు హోమము చేయుచున్న భరతుని గాంచి, రాముడని తలంచెను; సౌమిత్రిని విడిచి, రాముని చంపక పారివచ్చినాడా? యని శంకించెను; పిదప రామునిబోలు నొక తపోధనుడు కావచ్చునని నిర్ణయించుకొనెను. ఇంతలో భరతుడు "హనుమంతుని దుర్గ్రహముగా భావించి శర ప్రయోగమున కాటోపించగా, అశరీరి 'ఇతడు మీ బంధువు, ఇతనిపై హితబుద్ధి చూపుమని' పల్కెను. భరతుడు శరచాపములు విడిచెను మారుతి సముద్రమును సమీపించెను."[4]

ఈ కల్పనలో, హనుమంతునకు "ఇతడు రాముని తమ్ముడు భరతు"డనియు, భరతునకు "ఇతడు రామునిబంటు ఆంజనేయు"డనియు స్పష్టముగాఁ దెలియదు. పరస్పర సంభాషణము

---

1. హనుమన్నాటకము. అంకము 13 శ్లో. 24-32 మరియు ఆనంద రామాయణము.
2. హనుమన్నాటకము. అంకము 13 గద్య 11
3. హనుమన్నాటకము. అంకము 13 శ్లో 16.
4. తాళపత్ర లిఖిత వాల్మీకి రామాయణము (ములుకుట్ల నరసింహావధాని-రామాయణ సారోద్ధారము యుద్ధకాండము, ద్వితీయభాగము. పుట. 498 శ్లో. 37-41).

పరిత్యజింపబడినది. భరతుని జూచి రాముడని మారుతి తలంచుట, భూతమని భరతుడు శర సంధానము చేయుట, అశరీరి వాక్కులు. వీనిచే కొంత కాలయాపనము అల్పవిఘ్నము మాత్ర మైనది. ఈ కల్పనచే కవి యుద్దేశించిన ప్రయోజనము పాఠకులకు తహతహ పెంచుటయే.

ఒకవేళ హనుమద్భరత సమాగమ సంభాషణాదులను సమకూర్చినచో తరువాతి కథాంశ మునకు వ్యాఘాత మేర్పడును. రాముడు భరద్వాజాశ్రమమునకు వచ్చి హనుమంతుని భరతుని యొద్దకు పంపుచు

"... ....నంది గ్రామపురికి
సరిగి మా భరతున కతి శుభ్రవతుం-కురుదయా రతునకు నున్నతాత్మునకు
నేము వచ్చితిమని యెఱిగించిరమ్మని"[1]

అని చెప్పినాడు. ఇదివరకే హనుమంతుడు భరతునితో సంభాషించియుండినచో, శ్రీరాముడు పల్కిన భరతుని ఈ విశేషణములు భరత తత్త్వమును దెలిసికొన్న హనుమంతునికి పునరుక్తుల మాదిరి యగును. అదిగాక ఆంజనేయుని జూచి భరతుడు

"నీ కులం బెయ్యది? నీకుఁ బేరేమి?-చేకొని యిటకు వచ్చిన పనియేమి?
ఎవ్వండ? వెందుండి యెటకేగెదు..."[2]

అని ప్రశ్నించుటయు సముచితము కాదు. పూర్వ పరిచయముండినచో భరతు డిట్లడుగజాలడు కదా! కావున ఇచ్చట ద్రోణగిర్యానయవేళ మారుతి భరతులకు పరస్పర సమాగమ సంభాష ణాదుల కాస్కారము లేదు.

బుద్ధారెడ్డి చక్కగా నాలోచించి, తన రామాయణమున ఈ మూడవ కల్పనావృత్తమునే గ్రహించి పొందు పరచినాడు. ఇదియు వాల్మీకి రామాయణ ప్రతి భేదమేకదా!

IV మాల్యవంతాదులతోడఁ బోరు:—

ఇది కాలయాపనకే ఉద్దేశింపఁబడినది. ఏ విధముగానైనను, సూర్యోదయమువర కాంజనే యుని ఓషధీ పర్వతముతో సౌమిత్రి వద్దకు రాకుండజేయుటయే ఈ కల్పన వలని ప్రయోజనము. రావణుడు మారుతికి కల్గించిన విఘ్నములలో నిది యొకటి.

ప. ఉ. ప్రతిలో "స్థూలదంష్ట్రాదులు రావణుని పనుపున వచ్చి హనుమంతునితోఁ బోరు సలిపినట్లును, చివరకు స్థూలజంఘు డనువాడు పారిపోయి రావణున కీ వృత్తాంతము దెలిపినట్లును"[3] గలదు. ఇందు మాల్యవంతుని పేరు ప్రస్తావింపఁబడలేదు.

కాని తాళపత్ర లిఖిత రామాయణ, తత్త్వ సంగ్రహ రామాయణములందు "మాల్యవంతుడే రాక్షసులతోఁ గూడివచ్చి మారుతి నెదిరించినట్లు"[4] స్పష్టముగా కనబడుచున్నది. బుద్ధభూపతి యిచట దీని ననుసరించినాడు.

---

1. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి. 8516-8518.
2. రంగనాథ రామాయణము యుద్ధకాండము. ద్వి. 8550-8551.
3. ప. ఉ. ప్రతి. రామాయణము. యుద్ధకాండము. సర్గ 81 శ్లో. 138-160.
4. రామాయణ సారోద్ధారము యుద్ధకాండము భాగ-2 సర్గ 25 పుట 500 లో ఉద్ధృతము.

ఇట్లే లక్ష్మణుని గూర్చిన శ్రీరాముని విలాపము, సర్వప్రపంచమును ప్రళయము చేసెదనని శ్రీరాముడు పూనుట, సుగ్రీవాదుల ఓదార్పు, హనుమంతుని సూర్యుడని భ్రమించి రాముడు దుఃఖించుట, ఇత్యాదు లాయా ప్రతులలో ఈషద్భేదములతోఁ గానవచ్చుచున్నవి. అవి యంత ప్రధానములు కావు.

ఈ కాలనేమి వృత్తాంతము నింత దీర్ఘముగా చర్చించుటకు కారణము ఇది అవాల్మీకముకాదని నిరూపించుటయే. రామాయణ ప్రతు లనేకములు. రంగనాథ రామాయణ కర్త కే ప్రతు లందుబాటులో నుండెనో తెలియదు. కాని యతడు భిన్నభిన్న ప్రతులను పరామర్శించి ఆ యా కథాంశముల నౌచిత్యవంతముగా రచించినాడని చెప్పవచ్చును. అందులో నీ కాలనేమి వృత్తాంత మొకటి.

42. పాతాళ హోమము :—

రంగనాథ రామాయణమునందు ప్రధానముగాఁ జెప్పబడిన కథాంశములలో రావణుని పాతాళ హోమ మొకటి. వేదము లక్ష్మీనారాయణశాస్త్రి,[1] పింగళి లక్ష్మీకాంతం, డా. జి. నాగయ్య[3] వంటి ప్రముఖులు దీని నవాల్మీక కథాంశములలోఁ జేర్చియున్నారు. కాని ఇది అవాల్మీకము గాదు. గౌడీయ, దాక్షిణాత్య రామాయణ పాఠములలో నిది కానరాకున్నను, పశ్చిమోత్తర శాఖీయ వాల్మీకి రామాయణ ప్రతిలో 82 వ సర్గగా మండోదరీ కేశగ్రహణ మనుపేర వెలయుచున్నది. ఈ సర్గ యందు 65 శ్లోకములును, 16 అధిక పాఠ శ్లోకములును గలవు- తత్కథాంశమిట్లున్నది.

"యుద్ధమున పరాజితుడైన దశగ్రీవుడు లంకను ప్రవేశించి, శంభుదత్తమైన అభేద్య రథ కవచాస్త్రాదులను హోమముద్వారా సంపాదించి, శ్రీరాముని జయింతునని తలంచెను. వెంటనే దేవాయతనమున కేగి, సమాధిస్థుడై అగ్నియందు వేల్వ గడంగెను. రావణ సంహారమునకు శపథ మొనర్చిన జానకీపతి విభీషణుని వలన దశాననుడు హోమము చేయుచున్నాడని గ్రహించి, తద్విఘ్నమునకై హనుమదంగదాది దశయూథపులను, సైన్యముతోఁ బంపెను. వారు రావణుని దేవతాగారమును జొచ్చి, కావలియున్న రక్కసులను ఛిన్నాభిన్నము చేయుచు, హోమమును ధ్వంసము చేయుచున్నను, రావణుడు కోపించక సమాహితుడై యట్లే హోమ మొనర్చుచుండెను. సమయజ్ఞుడైన హనుమంతుడు మండోదరిని పట్టితెండని పలికెను. అంగదు డంతిపురమున కేగి మండోదరి కేశములను బట్టి, పైట చెదరగా, నీవి ఊడగా ఈడ్చుకొని రావణుని యెదుటికిఁ దెచ్చెను. తన యెదుట జరుగు మండోదరీ మాన భంగమునకుఁ దట్టుకొనలేక రావణుడు ఆగ్రహము జెంది, హోమము చాలించి లేచి, అంగదాదులతో తలపడెను. వానరులు స్రుక్స్రువాది ద్రవ్యములను కుండమునందు పడవేసి, హోమవిఘ్న మాచరించి, తప్పించుకొని శ్రీరాముని సన్నిధిని జేరిరి రావణుడు మండోదరిని సాంత్వన పరచి యుద్ధమునకు బయలుదేరెను."

---

1. రంగనాథ రామాయణము. పీఠిక. పుట-18 వావిళ్ళ ప్రతి.
2. ఆంధ్ర సాహిత్య చరిత్ర పుట-175.
3. ద్విపద వాఙ్మయము. పుట-149.

బుద్ధభూపతి మాత్రము తన రామాయణమునందలి పాతాళహోమ వృత్తాంతమునకు ప. ఉ. ప్రతినికాక, అధ్యాత్మ రామాయణమునందలి కథాంశము నెక్కువగా నాధారము చేసికొన్నాడు. రెండు గ్రంధములతో పోల్చినప్పుడిది స్పష్టమగును. చూడుడు.

ప. ఉ. ప్రతి రామా. యుద్ధ. సర్గ 82	అధ్యాత్మ రామాయణము యుద్ధ. సర్గ 10	రంగనాథ రామాయణము. యుద్ధకాండము
1. "రావణుడు శుక్రు నొద్దకుఁబోయి విలపించి, తదుపదేశమున పాతాళ హోమమునకు కడగినట్లు లేదు. ఇది హనుమన్మండోదరుల యుపాలంభములందు తరువాత సూచితమైనది.[1]	1, రావణుడు శుక్రునొద్దకుఁబోయి విలపించగా, నతడోదార్చి పాతాళహోమము చేయుమని మంత్రాదుల నుపదేశించినట్లు స్పష్టముగా నున్నది.[1]	1. "రావణుడు శుక్రు సన్నిధికేగి ప్రుక్కుచు మ్రొక్కి నేను బాణములతో నెబ్బంగి నిలుతు నానతి యిమ్మన్న నా శుక్రుడనియె ఏ విఘ్నములు లేక యీపు హోమంబు గావించు...... ... హోమ మంత్రములెల్ల నుపదేశమిచ్చి పొమ్మన్న[1]... ....
2. రావణుడు దేవాయతనమునకుఁబోయి హోమమాచరించెను.[2]	2. పాతాళ సదృశ గుహను నిర్మించుకొని యందు ప్రవేశించి, హోమ మొనర్చెను."[2]	2. పాతాళ గుహఁజొచ్చి పదిలుడై నిల్చి"[2]
3. రావణ సంహారమునకుఁ బ్రతిజ్ఞ చేసిన శ్రీరాముడు అతని యునికిఁగూర్చి విభీషణు	3. హోమోత్థితమైన పొగను జూచి, రామునకు జూపించి, రావణుడు హోమము	3. "ఆ మహాధూమంబు లప్పుడుఁజూచి రాముతో ననియె నా రావణానుజుడు

1. ప.ఉ. ప్రతి సర్గ 82 శ్లో. 42 మరియు అధిక పాఠ శ్లో. 4
2. ప.ఉ. ప్రతి సర్గ 82 శ్లో. 13

1. అధ్యాత్మరామా. యుద్ధకాం. సర్గ 10 శ్లో. 4, 5, 6, 7, 10
2. అధ్యాత్మరామా. యుద్ధ. సర్గ.10 శ్లో. 11.12

1. రంగనాథ రామా. యుద్ధ. ద్వి. 7073-7085
2. రంగనాథ రామా. యుద్ధ. ద్వి 7091

ప. ఉ. ప్రతి రామా. యుద్ధ. సర్గ 82	అధ్యాత్మ రామాయణము యుద్ధ. సర్గ 10	రంగనాథ రామాయణము. యుద్ధకాండము
నడుగగా, రావణుడు హోమము చేయుచున్నట్లు తనకు చారులవలన దెలిసినదని విభీషణు డుత్తర మిచ్చెను."1	చేయుచున్నాడని విభీషణుడు రాము డడుగక మున్దే చెప్పెను.1	....రావణుడు విపుల జయార్థమై వేల్చుచున్నాడు కావున హోమ విఘ్నము సేయవలయు వేవేగ వానర వీరులఁ బనుపు మనవుడు-"1
4. రావణుని వెదకు వానరులకు విభీషణుని భార్య సరమ "అతడు పాతాళ గుహయం దున్నాడని" సంజ్ఞచేయుట, అంగదుడు గుహాద్వారమున కడ్డుగా నున్న బండను బ్రద్దలుచేయుట-" ఈ ప.ఉ. ప్రతిలో లేవు.	4 సరమ "రావణుడు పాతాళగుహాయం దున్నాడని" సంజ్ఞ చేయగా, అంగదుడు గుహా ద్వార పిహిత మహాశిలను బ్రద్దలు చేసినట్లు కలదు.2	4. వానరుల్ వెదకంగ వారి నీక్షించి చతురతమై విభీషణు పత్ని సరమ వడి నంగదునకు రావణు డున్నచోటు చిడిముడిపాటుతోఁ జేసన్నఁ జూపె ... యప్పు డా గుహ వాతనున్న శిల నుగ్గుగాఁ దన్ని చెచ్చెరఁ జొచ్చె "2
5. "మండోదరిని పట్టి తెండని, బలాత్కారముగా సీతను పట్టి తెచ్చిన పాపఫల మిత దనుభవించుగాక" యని ఆంజనేయుడు పలుకగా. అంగదుడు మండోదరి కేశములనుబట్టి ఆమె నీడ్చుకొని వచ్చెను.2	5. ఇందాంజనేయుడు మండోదరిని పట్టి తెమ్మనలేదు. అంగదుడే స్వయముగా అంతఃపురమునకు పోయి మండోదరి వెంట్రుకలను పట్టి ఆమె నీడ్చుకొని వచ్చెను."3	5 రావణుడు......... కినియక కదలక కృత నిష్ఠనుండె అంగదుడు..... అంతఃపురమున కరిగి... ... మందోదరి రాజాస్యఁ గదిసి.... ....పట్టి యీడిచి తెచ్చె"3

1. ప.ఉ. ప్రతి సర్గ 82 శ్లో. 5, 6, 8, 13, 15
2. ప.ఉ. ప్రతి యుద్ధ. సర్గ 82 శ్లో. 46-53

1. అధ్యాత్మరామా. యుద్ధ. సర్గ 10 శ్లో. 13,14
2. అధ్యాత్మరామా. యుద్ధ. సర్గ 10 శ్లో. 18,19
3. అధ్యాత్మరామా. యుద్ధ. సర్గ 10 శ్లో. 23,24

1. రంగనాథ రామా. యుద్ధ. ద్వి. 7105-7113
2. ,, ,, ద్వి. 7140-7146
3. రంగనాథ రామా. యుద్ధ. ద్వి. 7161-7192.

ప. ఉ. ప్రతి రామా. యుద్ధ సర్గ 82	ఆధ్యాత్మ రామాయణము యుద్ధ. సర్గ 10	రంగనాథ రామాయణము యుద్ధకాండము
6. మండోదరి మేఘనాదుని దలంచుకొని దుఃఖించుట ఇందులేదు.	6. "మండోదరి మేఘనాదుని దలంచు కొనుచు దుఃఖించినది."[1]	6. "ఇంద్రజిత్తుడు నన్ను నిటు జాలివైచి ఇంద్రలోకమునకు నేగక యున్న నన్నిట్లు చూచునే నా కొడుకున్న"[1]
7. "యజ్ఞ విఘ్నానంతరము కపులు వెడలిపోయిన పిదప మండోదరి విలపించుచు రావణు నుపాలంభించినది.	7. నిష్ఠతోనున్న రావణుని యెదుటికి ఈడ్చుకొని రాబడిన మండోదరి తన దశకు దుఃఖించుచు రావణు నుపాలంభించినది; రావణుడు లేచి కపులతోఁ దలపడెను.	7. ఇందును మండోదరి దుఃఖోపాలంభము చేతనే రావణు డాగ్రహించి హోమము చాలించి లేచెను.—

ఇంతేకాక, అంగదు డీడ్చుకొనివచ్చినప్పటి మండోదరీ స్వరూపవర్ణనాదులును ఆధ్యాత్మ రామాయణము ననుసరించియే యున్నవి. ఈ రీతి పోల్చి చూడగా, ఈ పాతాళహోమ వృత్తాంతముపై ఆధ్యాత్మ రామాయణ ప్రభావ మధికముగా నున్నది.

ఆనంద రామాయణమునందును నిది కలదు.[2] కాని ఆధ్యాత్మ రామాయణ కథాంశమునకు సంక్షిప్తమైనదివలె భాసించును. పద్మపురాణమునందు నిది ఆభిచారిక హోమముగా సూచితమైనది.[3]

ఆవశ్యకత :-

పూర్వాపర సందర్భముల ననుసరించి యాలోచించిన, నిచట నీ పాతాళహోమ వృత్తాంతముండుట అత్యంత సముచితము; తప్పునిసరికూడ. లక్ష్మణుడు శ్రీరాముని సూర్యాస్తమయమునకు ముందే రావణ సంహార మొనరింపుమని నిర్బంధించెను. రాముడు మౌనము వహించెను.[4] దానిని రామాంగీకార

1. ఆధ్యాత్మరామాసర్గ 10 శ్లో. 31,32 1. రంగనాథ రామా. యుద్ధ. ద్వి. 7197-7198

2. ఆనంద రామాయణము సారకాండము సర్గ 11 శ్లో. 229-245.

3. పద్మపురాణము ఉత్తర ఖండము అధ్యా. 242 శ్లో. 314, 315

4. అహంతు వధ మిచ్ఛామి శీఘ్ర మస్య దురాత్మనః॥

ముగా భావించిన చారుల వలన సంగతి నెఱింగి రావణుడెంతయు చింతించి శుక్రుని సన్నిధికేగెను. శుక్రునియొద్ద కిట్లు పోవుట రావణుని కాపట్యమును పరోక్షముగా ధ్వనింపఁజేయుట.

రాముడు సత్యప్రతిజ్ఞుడు. అతని ప్రతిజ్ఞ నెరవేరకుండ రావణు డా దినము బ్రతుకవలెను. శ్రీరాము నెదిరించిన అది సాధ్యముకాదు. మంత్రతంత్ర మాయా విద్యల రహస్యముల నెఱింగిన శుక్రాచార్యుల నాశ్రయించిన, నత డుపాయమేదైనను చెప్పును. రాముని ప్రతిజ్ఞ భంగమగును. అప్పుడు రాము డేమగును ? నీరో నిప్పో చూచుకొనును. "ఎంతయుఁ జింతించి" యను మాటలో నీ యూహ యంతయు నిమిడియున్నది.

పరమార్థము :—

ప్రపత్తి ప్రాధాన్యముగల వైష్ణవ మతమున భగవత్సేవ, భాగవత కైంకర్యము, ఆచార్య నిష్ఠ తప్ప, మంత్రాంతర, సాధనాంతర, దేవతాంతరముల భజనము వైష్ణవుడైన వానికి పనికి రాదు. దైవానుగ్రహమునే తప్ప పౌరుషము నాశ్రయింపకూడదు. ఆశ్రయించినను అది ఫలింపదు. అజ్ఞతచే భగవద్విరోధముగా నాచరించు పౌరుషము పలు విఘ్నములకు లోనై కర్తను చెఱచును. స్త్రీకి పతి దప్ప ఇతరుడు సేవ్యుడెట్లు కాడో, వైష్ణవునికి విష్ణువు దప్ప అన్యు డారాధ నీయుడు కాడు.

రాముడు శ్రీమన్నారాయణుడు; రావణుడు పూర్వజన్మమున జయాఖ్యుడను వైకుంఠ ద్వార పాలకుడు; కావున వైష్ణవుడు. కాని శాప దోషమున రాము నాశ్రయింపక అహంకార, మమకార ములకు లోనయి అతనితో విరోధించెను; అతనిని సాధింప పౌరుషము కనఁబరచెను; లాభము లేకపోగా, శుక్రోపదేశమున దేవతాంతర మంత్రాంతరములను భజించి, ఆభిచారిక హోమాది (పాతాళ హోమాది) సాధనాంతరములన్ను పరిగ్రహించెను. అవియు భగవంతుడైన శ్రీరాముని సాధించుటకు, అతని నామరూపములు లేకుండ చేయుటకు చేపట్టెను. శ్రీరాముడు తన మార్గమునకు విరుద్ధముగా, దనను సాధించుటకు చేసెడి క్రియా కలాపమును ఫలవంత మొనర్పఁజాలడు. మీదు మిక్కిలి కర్త కపజయము, అవమానమును కలుగును. రావణున కట్లే జరిగినది.

ఈ పరమార్థ రహస్యమును ప్రకటించుటకోయన, బుద్ధారెడ్డి గౌడీయ, దాక్షిణాత్య రామాయణ ప్రతులలో లేకున్నను, పశ్చిమోత్తర శాఖీయ ప్రతిలోని మండోదరీ కేశ గ్రహణమను 82వ సర్గ వృత్తాంతమును గ్రహించి, రామణీయకతకై ఆధ్యాత్మ రామాయణము నాశ్రయించి, రావణుని పాతాళహోమ ఘట్టమును పరమ సుందరముగా తీర్చిదిద్దినాడు.[1]

యావదస్తం నయాత్యేష కృతకర్మా దివాకరః॥ వాల్మీకిరామా. యుద్ధ. సర్గ102 శ్లో.46 1/2.
ఇచట సర్గ పూర్తి అయినది మరల సర్గ ప్రారంభమునందు-
లక్ష్మణేన తు తద్వాక్యముక్తం శ్రుత్వా స రాఘవః।
సంధధే పరవీరఘ్నో ధనురాదాయ వీర్యవాన్॥ సర్గ 103 శ్లో. 1.
కావున ఈ రెంటి నడుమ పాతాళహోమ ముండుట సముచితము—

1. భాస్కర రామాయణమునందలి పాతాళహోమ వృత్తాంతము కథాకథనక్రమమునందును, వర్ణనము లందును, అలంకారాదుల పొందికయందును అచ్చముగా రంగనాథరామాయణమునుబోలియున్నది.

43. ఆదిత్య హృదయము:—

యుద్ధమునందు శ్రీరాముడు రావణుని శర వేగగతి గాంచి యాశ్చర్యపడి. అతనిని సంహ రింపజాలక చింతించుచుండగా, అగస్త్యుడు చనుదెంచి సర్వమంగళ హేతుభూతమును సర్వశత్రు వినాశకారియు జయావహమును నగు ఆదిత్య హృదయమును దాశరథి కుపదేశించి పోయెను. రాఘ వేంద్రుడు సౌర జప మాచరించి యత్యున్నతుడై యుప్పొంగెను.

దా. ప్రతి వాల్మీకి రామాయణమునందు 107వ సర్గగా నున్న ఈ ఆదిత్యహృదయ స్తోత్రము గౌడీయ, పశ్చిమోత్తర శాఖీయ ప్రతులలో పొడకట్టదు. భూషణ వ్యాఖ్యాత గోవిందరాజును "అయం చ సర్గః కేషుచిత్ కోశేషు నదృశ్యతే। ఉదారిణా న వ్యాఖ్యాతశ్చ। ఆరంభాత్ ప్రభృతి ప్రబంధ ప్రతిపాదిత నారాయణపరత్వ విరుద్ధం చాత్ర ప్రతిభాతి సూర్యపరత్వం"[1] అని వ్రాసి యున్నాడు. దీనివలన దక్షిణదేశ ప్రతులు కొన్నింటిలోనే ఈ సర్గలేదని తెలియుచున్నది. కావున ఇది ప్రక్షిప్తమనుటలో సందేహము లేదు. గౌడీయ. ప ఉ. ప్రతులలో లేక పోవుట కిదియే కారణమై యుండ వచ్చును.

అగస్త్యకృతమై, మహామహిమోపేతమై యున్న యీ ఆదిత్య హృదయ స్తోత్రమేకాలమున రామాయణమునందు చేర్చబడినదో గుర్తింపరాదు. రంగనాథ రామాయణమున నిది స్వీకరింప బడుటచే క్రీ.శ. పదియవ శతాబ్దము వరకే ఈ సర్గ రామాయణము దాక్షిణాత్య ప్రతులందు నెలకొని స్థిరపడినట్లు చెప్పవచ్చును. ఇది ఆదిత్యుని పరత్వమును ప్రతిపాదించునదైనప్పటికిని, తత్త్వదృష్టితో చూడగా, తదంతర్యామియగు పరమాత్మనే ప్రకటించుచున్నదని చాలామంది వాఖ్యాతలు—

" య ఆదిత్యేతిష్ఠన్ ఆదిత్యస్యాంతరో యమాదిత్యోనవేద యస్యాదిత్యశ్శరీరంయ అదిత్య మంతరో యమయతి "[2]

" య ఏషోంతరాదిత్యే హిరణ్మయః పురుషోదృశ్యతే హిరణ్యశ్మశ్రుర్హిరణ్యకేశ ఆప్రణఖాత్సర్వ ఏవ సువర్ణః "[3]

" సయశ్చాయం పురుషే। యశ్చాసావాదిత్యే। సఏకః।"[4]

ఇత్యాది శ్రుత్యాధారముచేత నారాయణ పరముగానే యర్థములను విశదీకరించియున్నారు. కావున రామాయణము విష్ణుపారమ్య ప్రతిపాదక గ్రంథమైనను, ఆదిత్యహృదయ మిందుండుటలోగాని, రాముడు సౌరజపము చేయుటలోగాని, దోషము లేదు.

" సహపత్న్యా విశాలాక్ష్యా నారాయణముపాగమత్ "[5]

అనినపుడు శ్రీరాముడు అర్చారూపుడైన నారాయణుని ఉపాసించినాడనియు. ఇచ్చట సూర్యాంతర్వర్తియైన నారాయణుని అనగా అంతర్యామి స్వరూపమును ఉపాసించినాడనియు చెప్ప

1. గోవింద రాజీయ వ్యాఖ్యానము-దా-ప్రతి-రామా--యుద్ధకాండ. సర్గ. 107
2. అంతర్యామి బ్రాహ్మణము.
3. ఛాందోగ్యోప నిషత్తు-ప్రథమ ప్రపాఠకము-ఖండము-6 మంత్రము-6.
4. భృగువల్లి. (తైత్తిరీయఉపనిషత్తు)-అనువాకము-10.
5. దా.ప్రతి రామాయణము. అయోధ్యా-సర్గ-6 శ్లో-1

వచ్చును. ఇంతేకాక, రామాయణమునందు సూర్యోదయాస్తమయములు చెప్పబడిన చోట్లలో శ్రీరాముడు సంధ్య నుపాసించినట్లు, గాయత్రిని జపించినట్లు వర్ణింపబడినది. గాయత్రీ మంత్ర ప్రతిపాదితుడు సూర్యనారాయణుడేకదా!

అందువలన బుద్ధారెడ్డి మహామహిమోపేతమైన ఈ ఆదిత్యహృదయ స్తోత్రమును ప. ఉ. ప్రతి, గౌడీయ ప్రతులలో లేకున్నను దా. ప్రతి యాధారమున గ్రహించి సుమారు పన్నెండు ద్విపదలలో సంగ్రహించి,[1] తన రంగనాథ రామాయణమునందు జేరియున్నాడు.

మూలము నంపలి ఈ స్తోత్రమును ముఖ్యముగా మూడు భాగములుగా విభజింప వచ్చును.

1. రుచ్యుత్పాదనకై ప్రయోజన (ఫల) ప్రసక్తిన పూర్వకముగా ఆదిత్యహృదయ మాహాత్మ్యమును వర్ణించునది.
2. ఆదిత్యనామ మంత్రములతో కూడిన స్తోత్రము-(ఇవి 108 నామములని తీర్థీయము. 125 అని కతకము.[2])
3. స్తోత్రఫలము (శ్రీరాముడు జపించుట-సూర్యుడనుగ్రహించుట.)

బుద్ధభూపతి ఈమూడు భాగములలో ఆద్యంతములను సంగ్రహముగా అనువదించి నడుమనున్న మంత్రభాగమును వదలివేసినాడు. దీనికి కారణమిట్లు తలంపవచ్చును.

1. భారతమున అనుశాసనిక పర్వమునందు విష్ణుసహస్రనామ స్తోత్రమున్నది. భీష్ముడు ధర్మరాజునకు దీనినుపదేశించెను. తిక్కనామాత్యుడు ఆంధ్రమహాభారతమున వీనినన్నింటిని పూస గ్రుచ్చినట్లు వ్రాయక,

   "అని పలికి విశ్వంబు విష్ణుండు వషట్కారుండు భూతభవ్యభవత్ప్రభు వనునివి మొదలైన రథాంగపాణి యక్షోభ్యుండు సర్వ ప్రహరణాయుధుండనియెడునివి తుదగాఁగల సహస్రనామంబు లుపన్యసించి"[3]

   అని ఆద్యంతములతో సంక్షేపించినాడు. ఈ వచనమునకు మొదట సహస్ర నామస్తోత్ర మాహాత్మ్యమును, చివర ఫలమును, మూలమునువలె చెప్పియున్నాడు. రసభంజకముగాని యీ మార్గమే ఔచిత్యశోభితము. బుద్ధభూపతి ఈ పద్ధతి నవలంబించి తిక్కనకు మార్గదర్శకుడైనా డనవచ్చును.
2. ఆదిత్య హృదయము మహాశక్తిమంతమైన మంత్రనామస్తోత్రము "మంత్రం యత్నేన గోపయేత్"[4] అన్నట్లు అన్నివేళల అందరికి దానిని ప్రకటింపకూడదు. అర్హులైన వారికే ఉపదేశించవలెను.

---

1. రంగనాథ రామాయణము. యుద్ధకాండ. ద్వి, 7529-7541.
2. ("సర్వదేవాత్మకో హ్యేష-మొదలు...లోక సాక్షిణే. వరకు-108 రశ్మిమంతం.... మొదలు...సర్వవీప రవిప్రభుః-వరకు 125)
3. తిక్కన శ్రీమదాంధ్ర మహాభారతము, అనుశాసనిక-అశ్వా-5 పద్య-324.
4. ఇది "శేషసంహిత" లోనిదని "తాత్పర్యదీపిక" (బాలసరస్వతీకృత ముముక్షుప్పడి సంస్కృత వ్యాఖ్యానము) పుట-6లో నుద్ధరింపబడినది.

ఛతుర్థ్యంతె నమశ్శబ్దాదులతోఁ గూడిన నామ మంత్రములు ప్రభావవంతములైనట్లు భాషానువాద నామములు కానేరవు.

"శ్రీరామాయనమః" అనునది రామతారక షడక్షరీ మంత్రము-"శ్రీరామునికి నమస్కారము" అనునది భాషానువాదము. ఇది తదర్థము నొసంగినను మంత్రము కాదు.

"శబ్దశక్తి, అర్థశక్తి" అనిశక్తులు రెండువిధములు. భాషానువాదములు కేవలము అర్థశక్తి గలవి మాత్రమగును. గీర్వాణ భాషయందలి మూలమంత్రములు, ఆర్షస్తోత్రములు అర్థశక్తితోఁ బాటు శబ్దశక్తిని గూడ కలిగినవై, మహాప్రభావముగలవై, అర్థము తెలియక జపించినను, పఠించినను రక్షించునవిగా నుండును.

పంచదశాక్షర శ్రీరామ మంత్రమును జపించు బుద్ధ భూపతి ఈ రహస్యమును తెలిసినవాడే, కావుననే ఆదిత్య హృదయమందలి నామ మంత్రశ్లోకములను అనువదించకుండ

"ఈ లోక లోచనుండెల్ల లోకములఁ — జాల రశ్ములు నిండఁ జరియించుచుండు,
బ్రహ్మయు విష్ణుండు పాలలోచనుడు — బ్రహ్మ కల్పాదిని భానుడైనాడు.
మది సర్వదేవతామయునిగా నెఱిగి"[1]

అనుద్విపదలను "ఏష దేవాసుర గణాన్ లోకాన్ పాతి గభస్తిభిః, ఏషబ్రహ్మాచ విష్ణుశ్చశివః బ్రహేశానాచ్యుతేశాయ, సర్వదేవాత్మకో హ్యేషః" అనువాని యాధారముగా రచించి, మంత్ర భాగమును వదలి, ఆద్యంతములందలి మాహాత్మ్యఫల వర్ణనములతో పాఠకునకు రుచి కలిగించినాడు. అభిలాషగలవాడు మూలమును జపించి కృతార్థుడగును.

కావున బుద్ధ భూపతి నిర్నిరోధ కథాగమనమునకై, రసభంగ నివారణకై, మూలమంత్ర గౌరవరక్షణకై, మంత్రభాగమును సంగ్రహించి, మహాప్రభావ సంపన్నమగుటచే ఔత్తరాహ ప్రతులలో లేకున్నను దాక్షిణాత్య ప్రతి ననుసరించి వ్రాసి తన గ్రంథమునందు చేర్చినాడు.

భాస్కర రామాయణమునందును ఇది యిట్లే సంగ్రహింపబడినది.[2]

మూల శ్లోకములందున్న శక్తి ద్విపదలయందు లేదు. ద్విపదలయందలి జిగి వచనమున రానులేదు. దీనిచే భాస్కర రామాయణకర్త ఆదిత్య హృదయమునకు బుద్ధారెడ్డి యిచ్చినంత ప్రాముఖ్య మీయలేదని తెలియనగును. తిక్కన విష్ణుసహస్రనామస్తోత్ర విషయమును వచనమునందు వ్రాసినట్లు సుకరమగుటచే వచనమున వ్రాయబడినదనియు తలంపనగును.

---

1. రంగనాథ రామాయణము యుద్ధకాండ. 7536-7538.
2. భాస్కర రామాయణము-యుద్ధకాండ-వచన 2078.

రంగనాథ రామాయణముపై
వివిధ రామాయణముల ప్రభావము

వాల్మీకి మహాముని యే శుభముహూర్తమున శ్రీమద్రామాయణ రచన ప్రారంభించినాడో, యేమోగాని, చాలా మంది కవులు తమతమ శక్తి కొలది, ఊహకొలంది, విజ్ఞానముకొలది, మర్యాదా పురుషోత్తముడైన, ఆనంద కందుడైన శ్రీరామచంద్రుని యశోగానము చేయుట యందు నిమగ్నులై రమనీయ కళాచమత్కృతిని తమ లేఖినిద్వారా ప్రదర్శించినారు. వస్తువుసందీ భేదమున్నను, ఘటనల యందును, కూర్పునందును భేదము గోచరించుచున్నది. ఈ ఘటనా భేదములను పురస్కరించుకొని నాస్తికులు, హేతువాదులు రామాయణము కల్పిత వృత్తమేగాని, సత్యముకాదని తమ నిశిత కర్కశ తర్క బుద్ధిచే విమర్శించు చున్నారు. ప్రజలను పెడదారి పట్టించుచున్నారు. ఇట్టి ధోరణులు భవిష్యత్కాలమున పొడచూపునని కాబోలు పురాణ కర్తలు కల్ప భేదముచే[1] అన్నియు సత్యములేయని యుద్ఘోషించి యున్నారు.

ఇక భాషా ఛందోలంకారాది రచనా విశేషములు కవి చాతుర్యమునకు. పాండిత్య విశేషమునకు బహువిధ ప్రపంచ పరిశీలనా పరిజ్ఞానమునకు సంబంధించి యుండును. కావున కల్పభేదముల ననుసరించియు. ఘటనా భేదము లేర్పడి అనేక విధ రామాయణ రచనలకాస్కార మేర్పడినది.

కొందఱు నవవిధ[2] రామాయణములనియు. మఱికొందరు చతుర్వింశత్యార్షేయ[3] రామాయణము లనియు, సంఖ్యాబద్ధము గావించిరి. ఆనంద రామాయణమునందు పార్వతి యడిగిన ప్రశ్నకు ప్రత్యుత్తరముగా పరమ శివుడు ముప్పది యొక్క రామాయణముల పేరులను చెప్పి ఇంకను వేల రామ చరితములు గల వనియు, వాని సంఖ్య చెప్పశక్యముగాదనియు పలికినాడు[4] అవి యివి.

1. వాల్మీకి కృత శతకోటి ప్రవిస్తరరామాయణము.
2. వాల్మీకి రచిత చతుర్వింశతి సహస్ర రామాయణము.
3. యోగవాసిష్ఠ రామాయణము.
4. హనుమద్రామాయణము.
5. అధ్యాత్మ రామాయణము.
6. నారద రామాయణము.
7. లఘు రామాయణము.
8. బృహద్రామాయణము.
9. అగస్త్య రామాయణము.
10. సార రామాయణము

---

1. ఆనంద రామాయణము సారకాండము. సర్గ 11. శ్లో. 277 మరియు సర్గ 3 శ్లో. 22.
   శతమూర్ధ్నో రావణస్య చైకోత్తర సహస్రకం। ఛిన్నం తత్కల్ప భేదేన వదంతీ త్యపి కేచన.
2. పింగళి లక్ష్మీకాంతం. ఆంధ్ర సాహిత్య చరిత్ర. పుట-173.
3. ములుకుట్ల నరసింహావధాని. రామాయణ సారోద్ధారము.
4. ఆనందరామాయణము. మనోహరకాండ. సర్గ 8 శ్లో. 61-70.

11. దేహ రామాయణము. 12. వృత్త రామాయణము.
13. బ్రహ్మ రామాయణము. 14. భారద్వాజ రామాయణము.
15. శివ రామాయణము 16. క్రౌంచ రామాయణము
17. భరత రామాయణము 18. జైమిని రామాయణము
19. ఆత్మ రామాయణము 20. ధర్మ రామాయణము
21. శ్వేతకేతు రామాయణము 22. జటాయు రామాయణము
23. సూర్య రామాయణము 24. పులస్త్య రామాయణము
25. దేవీ రామాయణము 26 గుహ రామాయణము
27. మంగళ రామాయణము 28. విశ్వామిత్ర రామాయణము
29. సుతీక్ష్ణ రామాయణము 30. సుగ్రీవ రామాయణము
31. విభీషణ రామాయణము 32. ఆనంద రామాయణము.

ఇవియేకాక, అద్భుత రామాయణము, బోధాయన రామాయణము, యాజ్ఞవల్క్య రామాయణము, భుశుండీ రామాయణము, దూర్వాస రామాయణము, లోమశ రామాయణము, తత్త్వ సంగ్రహ రామాయణము ఇత్యాదులు ప్రఖ్యాతములు.

ప్రస్తుతము వీనిలో కొన్ని మాత్రమే ఉపలభ్యమానములై దేశమున బహుళవ్యాప్తి గాంచినవి. వీనిలోని కొన్ని ఘట్టములు ఆయా భాషలలో పాటలు, పద్యములు, కీర్తనలు మొదలగు రీతులలో రచింపబడి సామాన్య జనులలో నలిగిపోయినవి; గీర్వాణ వాఙ్మయమునందు కావ్యనాటకాది వివిధ ప్రక్రియా రూపములలో కవిపుంగవులచే మనోహరముగా రచింపబడి సహృదయులచే ఆస్వాద్యమానములగుచు నేటికిని నిలిచియున్నవి.

బుద్ధభూపతి ద్విపదలలో రంగనాథ రామాయణమును వ్రాయక పూర్వము తనకంటెముందు రచింపబడిన రామకథా సంబంధిత రచనల నన్నింటిని కాకపోయినను, కొన్నింటినైనను బహుళ వ్యాప్తములైన రామాయణములను, కావ్య నాటకాదులను శ్రద్ధగా పఠించి, జాగ్రత్తగా పరిశీలించి, తన బుద్ధికొలది వాని మర్మములను, ఔచిత్యానౌచిత్యములను గ్రహించియున్నాడనుటలో ఆవంతయు సందేహములేదు. ఇందుకు విఠలనాథుని సభికులు బుద్ధరాజును ప్రశంసించుచు "రామాయణ మర్మ ధర్మజ్ఞుడు"[1] అని పలికిన మాటలే ఆధారము కావున అతడు తన రచనా సందర్భమున అవసరమనుకొన్నప్పుడు కొన్ని విషయములను వాల్మీకేతర రామాయణములనుండి గ్రహించి యథా మూలముగానో, మార్పులను కూర్పులను చేర్చియో తన గ్రంథమునందు జొనిపియున్నాడు. రంగనాథ రామాయణమునందు ఆయా రామాయణ కథాగతాంశములు కనిపించుచుండుట ఇందుకు ప్రత్యక్ష ప్రబల సాక్ష్యము. వీనిని అవాల్మీకము లనవచ్చును.

కావున ఉపలబ్ధములైన రామాయణములను పరిశీలించి, తత్తద్విషయములను రంగనాథ రామాయణ కథాంశములతో పోల్చి, అవాల్మీకాంశముల యాథార్థ్యమును ఔచిత్యానౌచిత్యములను చర్చించుట ఈ ప్రకరణము నందలి ముఖ్యాంశము.

---

1. రంగనాథ రామాయణము. బాలకాండము. పీఠిక. ద్వి-42.

ఇతఃపూర్వము మూడవ ప్రకరణమునందు కాలనేమి, రావణ పాతాళహోమ వృత్తాంత ములపై ఆధ్యాత్మ రామాయణ ప్రభావ మెంతవరకు పడియుండెనో, మూలముతో పోల్చి చర్చించి యుంటిని. వానినిగూడ ఇచ్చట గ్రహించవలయును. కావున పునరుక్తిని విడిచి తదితరములను పరిశీలింతము.

(1) కౌసల్యాదుల దౌహృద లక్షణములు:—

కౌసల్యా సుమిత్రా కైకేయులు పాయసాన్నములను భుజించి గర్భము దాల్చిరి. రాజు పుత్రోత్పత్తి నెదురుచూచుచు నెలమితో నుండెను. అంతట 12 నెలలు నిండగా కౌసల్యాదులకు శ్రీరామాదులు జనించిరి.

ఇచ్చట మూలమునందు కౌసల్యాదుల గర్భిణీ లక్షణములు వర్ణింపబడలేదు. కాని బుద్ధభూపతి వారి కౌనులు బలియుట, దేహము వెల్వెల్లఁ బాఱుట, చన్మొక్కలు నల్లెక్కుట, నాభులు నిక్కుట, చిట్టుములు (వేవిళ్ళు) తఱుచగుట, కోర్కులు పొడముట"[1] ఇత్యాది దౌహృదములను వర్ణించినాడు.

మహాకావ్యోచిత- అష్టాదశ వర్ణనలలో కుమారోదయ మొకటి[2] మణికొండలు చెప్పిన ఇరువది రెండు కావ్య వర్ణనలలో[3] దౌహృదను చోటు చేసికొన్నది.

ఆది కావ్యమైన రామాయణమును తెలుగులో మొదట వ్రాయుచున్న బుద్ధారెడ్డి కావ్యోపయోగి యైన వర్ణనలను చేతనైనంతవరకు తన కావ్యమున చేర్చవలెనని తలంచియుండవలె ననుట సమంజసము. మూలమునలేని యీ వర్ణనము చేయుటలో భోజుని చంపూ రామాయణ మితనికి స్ఫూర్తి నిచ్చినది. ఇతడు కవిలోక భోజుడు కదా!

చంపూ రామాయణమునందు............ చకాశిరే దౌహృద లక్షణాని॥
మంద మంద ముపయ ద్వళిత్రయా-గాధతా విషయ నాభి గహ్వరా।
కోసలేంద్ర దుహితు శ్శనై రభూ-న్మధ్య యష్టిరపి దృష్టిగోచరా॥
న్యగ్రోధ పత్ర సమతాం క్రమశః ప్రయాతా-మ గీచకార పునరప్యుదరం కృశాంగ్యాః।
జీవాతవే దశముఖోరగ పీడితానాం-గర్భచ్ఛలేన వసతా ప్రథమేన పుంసా॥"[4]

అని కౌసల్యాదేవి దౌహృద చిహ్నములు వర్ణింపబడినవి. ఈ వర్ణనమందు "దశముఖ సర్ప దష్టులైనవారికి జీవనౌషధముగా గర్భస్థ వ్యాజమున ఆదిపురుషుడు వెలుగొందుచున్నా"డనుట యొక్కటి మాత్రము కథా సూచకము. అట్లె బుద్ధారెడ్డి చేసిన వర్ణనలో "రావణు సామ్రాజ్య రమ ముక్కు నల్పు గావించుటకు సూచకము లివి యనగఁ జను ముక్కుల నల్పు మొనసిన"దనుట యొక్కటి కథాసంబంధి. ఇక మిగిలినవి సాధారణ గర్భిణీ చిహ్నములు. పీడితుల రక్షించుట

---

1. రంగనాథ రామాయణము. బాలకాండము. ద్వి. 543-549.
2. ఏ) దండి. "కావ్యాదర్శము"
   బి) విద్యానాథుడు. ప్రతాపరుద్రీయము. కావ్య ప్రకరణము. శ్లో. 70.
3. అప్పకవి- అప్ప కవీయము. ప్రథమాశ్వాసము పద్యము-28.
4. భోజమహారాజు-చంపూ రామాయణము. బాలకాండము-శ్లో॥ 53, 54.

కనినను, పీడించువాని నణచుటకనినను ఫలితార్థమొక్కటే. పీడించువాడు సంహరింపబడిన పీడితులు రక్షింపబడుదురుగదా !

కావున బుద్ధభూపతి తన కవిలోక భోజ బిరుదును సార్థకము చేయుటకు భోజుని చంపూ రామాయణ మాధారముగా మహాకావ్యోచితమైన ఈ దౌహృద వర్ణనమును గ్రహించి, ఎక్కువ పెంచక తచ్ఛ్లోక భావార్థమునే ద్విపదలుగా వ్రాసినాడని తోచుచున్నది—

ఈ రంగనాథ రామాయణ ప్రభావము తరువాతి ఆంధ్ర కవులపై ఎక్కువగా పడినది. మొల్ల కవయిత్రి,1 అయ్యలరాజు రామభద్రుడు,2 ఆంధ్ర వాల్మీకి వావిలకొలను సుబ్బారావు3 మొదలగువారు తమ ప్రబంధములందు ఈ దౌహృద వర్ణనమును విస్తృతముగా చేసి యున్నారు.

(2) సార్థక నామకరణము :—

వసిష్ఠ మహర్షి దశరథ రాజనందనులలో పెద్దవాడైన కౌసల్యాతనయునికి రాముడనియు, కైకేయీపుత్రునికి భరతుడనియు, సుమిత్రాసుతులకు లక్ష్మణశత్రుఘ్నులనియు నామకరణ మొనర్చెను,4

మూలమునందిచ్చట ఆ నామములకుగల వ్యుత్పత్తి చెప్పబడలేదు. కాని రంగనాథ రామాయణ కర్త-

..........కౌసల్యాసుతుని
రము క్రీడయని ధాతు రమ్యార్థ మమరు-గమయతి యన నొప్పు రామనామంబు
కైకేయి తనయుండు ఘన బలాన్వితుడు-సుకుమారతనుడు సుశ్లోకుండుగాన
భరత నామంబున బరగు, సుమిత్ర-కిరవైన సుతులకు నింపుసొంపెసగ
లక్షణ5గుణులు సంలక్షించిచూచ-లక్ష్మణ శత్రుఘ్నులను నామమొసవు"6

అని నామ వ్యుత్పత్తులతో నామకరణము చేయించినాడు. మూల వ్యాఖ్యానాలలో ఇప్పట్టున-

"1 రమంతే సర్వేజనా గుణై రస్మిన్నితి రామః,
2. రాజ్యస్య భరణాత్ భరతః।
3. (రామకైంకర్య) లక్షణ సంపద్యుక్తత్వాత్ లక్ష్మణః।
4. శత్రూత్ హంతీతి శత్రుఘ్నః॥"7

అని వ్యుత్పత్తులు వివరింపబడినవి

---

1. కుమ్మరిమొల్ల. రామాయణము. బాలకాండము. పద్య. 42-44.
2. అయ్యలరాజు రామభద్రుడు- రామాభ్యుదయము. ఆశ్వా-3 పద్య. 82-101.
3. వావిలకొలను సుబ్బారావు. ఆంధ్ర వాల్మీకి రామాయణము. బాల. 496-498.
4. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. బా. సర్గ. 18 శ్లో. 20 1/2
5. రాయల్ అండ్ కో వారి ప్రతిలో- "లక్ష్మంబు గుణములు లక్షించిచూడ"అని కలదు.
6. రంగనాథ రామాయణము. బాల. ద్వి. 570-574.
7. గోవిందరాజీయము. బాలకాండము. సర్గ-18 శ్లో, 20 1/2.

ఆనంద రామాయణమునందు—

"రమణా ద్రామ ఏవాసౌ లక్షణై ర్లక్ష్మణ స్త్వితి।

భరణాద్భరతశ్చేతి శత్రుఘ్నశ్శత్రు తర్జనాత్॥"[1]

అని కలదు. కావున బుద్ధవిభుడు వ్యాఖ్యానాదులను జూచి పై ద్విపద పంక్తులను వ్రాసినాడనుట కంటే, అతని కానంద రామాయణ మాధారమనుట సమంజసము. ఇదియు వాల్మీకికృతమైన మూల గ్రంథమగుట ప్రామాణికమగును.

కవి మూలానికొనుగా నిచ్చుట వ్రాయుటకు కారణము. తన రామాయణమును పఠించువాడు భాషా వ్యాకరణ పరిజ్ఞాన మంతగా లేనివాడైనను నామ వ్యుత్పత్తిని ఇతరుల సహాయ మవసరము లేకుండగనే తెలిసికొనవలెనని తలంపు కావచ్చును. ఇది తన గ్రంథమునకు తానే భాష్యము చెప్పు కొనెడి ఫక్కి. ఇంతేకాక, వసిష్ఠుడు బాగుగ నాలోచించియే నామకరణము చేసియున్నాడని దశరథాది కథా పాత్రలకు అతనియందు గౌరవ భావము కలిగించినట్లు కాగలదు.

కాని పరిశీలించగా ఈ పై ద్విపదలు రంగనాథ రామాయణ కర్తవి కావని తోచుచున్నవి. దాని కీ క్రింది దోషములు కారణములు.

1. ప్రాసభంగము-

లక్ష్మణగుణులు సంలక్షించిమాడ-లక్ష్మణ శత్రుఘ్నులను నామ మొదవు.

"క్ష -క్ష్మ" ప్రాస.

సంయుక్తాక్షరములలోనే యొక హల్లుతో సామ్యమున్నను సరే యనివ్రాసిన శివకవుల రచనల నిది పోలియున్నది.

"కైకేయి తనయుండు ఘన బలాన్వితుడు-సుకుమారతనుడు సుశ్లోకుండుగాన"

"కైక—సుకుమార"

హ్రస్వ-దీర్ఘ పూర్వములతో ప్రాస.

మరియు నిది "(రాజ్యస్య) భరణాత్ భరతః" అనెడి యర్థమును సరిగా స్పష్టపరచుచు లేదు.

అప్పకవ్యాదులచే లాక్షణిక కవిగా పరిగణింపబడిన రంగనాథ రామాయణ కర్త ఇట్టి సామాన్య దోషముల నొనర్చడు. అందుకే కాబోలు ఆంధ్ర విశ్వకళాపరిషత్తు గ్రంథ పరిష్కర్తలు దీనిని ఒకటివ అనుబంధమునం జేర్చియున్నారు.

3) సుబాహుని తలిదండ్రులు.

విశ్వామిత్ర యాగ విఘ్నమునకు మారీచునితో వచ్చిన సుబాహువు శ్రీరాముని అగ్నేయాస్త్ర బాణమున హతుడయ్యెను. వాల్మీకి రామాయణమున మారీచుని వృత్తము వివరింపబడినది. కాని సుబాహువెవ్వరో, అతని తల్లిదండ్రులెవ్వరో తెలుప బడలేదు.

సుకేతుడను యక్షునికి బ్రహ్మవరమున కలిగిన ఆడబిడ్డ తాటక. ఈమె సుందునికి భార్యయై

---

1. ఆనంద రామాయణము. సారకాండము, సర్గ. 2 శ్లో-11.

ఆతని వలన మారీచుని పుత్రునిగా పొందెను. సుందుడు చనిపోయిన పిదప, వీరు అగస్త్యుని ధర్షించి తచ్ఛాపమున రాక్షసులైరి."[1]

ఇట్టి మారీచుడు సుబాహువును అనుచరులతోఁగూడి విశ్వామిత్రుని యజ్ఞవేదిపై మాంస, రక్తవర్షమును గురిపించిరి. అపుడు మారీచుడు పావనాస్త్రమున దూరముగా పడవేయబడెను. ఆగ్నేయాస్త్రమున సుబాహువు నేల గూలెను."[2]

ఇది మూలమునందలి వృత్తము, దీనిచే సుబాహువును గూర్చిన వివరములు తెలియుచు లేవు.

క్షేమంద్రకృత రామాయణ మంజరి యందు "సుందకుమారుడు మారీచుడు, ఉపసుంద కుమారుడు సుబాహువని"[3] స్పష్టపరచబడినది దీనిచేత సుందోపసుందులు అన్నదమ్ములు గావున మారీచ సుబాహువులు పెదతండ్రి పినతండ్రి కుమారులైన అన్నదమ్ములని తెలియనగును. కాని రంగనాథ రామాయణమునందు "సుబాహువు కూడ తాటకాసుంద పుత్రుడని"[4] చెప్పబడినది. కవి యిట్లు చెప్పుటకాధారము ఆనందరామాయణము. ఇందు-

"మారీచశ్చసుబాహుశ్చ సుందాత్తస్యాః సుతావుభౌ"[5]॥

అని మారీచ సుబాహువులు సుంద తనయులుగా చెప్పబడిరి.

ఇట్లు చెప్పుటలో ఔచిత్యమేమి? యని పరిశీలింతము.

యాగ సందర్భమున ప్రత్యేకముగా రాముని యాగ్నేయాస్త్రమున నేల గూలిన సుబాహు వెవ్వరు? అతడంత గొప్పవాడా? యని రామాయణమును చదువు వారికి సందేహము పొడమక మానదు. తత్సందేహ నివృత్తికి రచయిత ఆనంద రామాయణ మానరాగా గ్రహించి సుబాహువును తాటకాపుత్రుడని చెప్పుట సందర్భోచితమై యొప్పుచున్నది. "సుబాహు వెవ్వరో కాదు మారీచుని సోదరుడు; అనగా మారీచసంతతి మాయావి. ఒక్క మారీచుని మాయయే భవిష్యత్తులో సీతాపహరణమునకు కారణ భూతమగును. అట్టి మారీచునికి సుబాహువు తోడైన ప్రాణాపహరణమే కావచ్చును. ఈ సుదూర దృష్టికలిగినవాడు శ్రీరాముడు. కావుననే అతనిపై ఆగ్నేయాస్త్రమును ప్రయోగించి ప్రత్యేకముగా అప్పుడే హతమార్చి. మారీచునకు తత్సహాయము లేకుండ జేసినాడు." అని పాఠకునికి సంతృప్తి కలుగును. శ్రీరాముని ఘనతకు వన్నె పెట్టబడినట్లగును.

(4) జంబుకుమారుని వృత్తాంతము:—

ఇది అరణ్య కాండమున గలదు. వాల్మీకి రావణుని సోదరి శూర్పణఖ సీతారాములున్న పంచవటికి వచ్చుటకు ఎట్టి హేతువును జెప్పలేదు.

---

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. బాల-సర్గ. 25-శ్లో. 4-8
2. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. బాలకాండము సర్గ. 25 శ్లో. 12-20.
3. క్షేమేంద్రుడు. రామాయణ మంజరి. బాలకాండ. శ్లో-180. "ఉపసుందసుతే భగ్నే సుబాహౌ బలశాలిని"।
4. రంగనాథ రామాయణము. బాల. ద్వి. 757-758.
5. ఆనంద రామాయణము. సారకాండము-సర్గ-3. శ్లో-9.

"హేమంతఋతువు నందొకనాడు గోదావరీ స్నానాదులను ముగించుకొని, శ్రీరాముడు సీతాలక్ష్మణ సమేతుడై వివిధ కథా కాలక్షేపము చేయుచుండు సమయమమున శూర్పణఖయను రాక్షసి యదృచ్ఛగా నచటి కేతెంచినదని"[1] మూలమునందుకలదు.

"అప్పుడే యచ్చటి కెందుకది రావలెను"? అను ప్రశ్నకు తగిన సమాధానము వాల్మీకి రామాయణమునందు లభింపదు. హేతువాద దృష్టితో చూచు వారికి ఇచ్చట "యాదృచ్ఛయా" అను పద ప్రయోగము తృప్తిని కలిగింపదు. అందువలన కారణమును వెదక వలెను. అది సమంజసముగా నుండవలెను, లేనిచో తన రామాయణము పృచ్ఛకుల మనస్సును రంజింపజేయునది కాకపోవచ్చును." అని యిట్లు బుద్ధ భూపతి తలంచి యుండవచ్చును. కావున రామాయణ మర్మముల నెఱింగినవాడైన యతడు "ఆనంద రామాయణమునుండి యీ కథను గ్రహించి, ఎంతయో మార్పు చేసి, రసపోషణకు భంగము కలుగనిరీతి పెంచి, తన గ్రంథమునందు కూర్చి కావ్యమున కెనలేని విలువను ఘటింప చేసినాడు.

ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారు

"కరుణా రస భరితమును, అనతి విస్తృతమును ఆయిన ఈ చిన్నకథ శూర్పణఖా ప్రవేశమునకు ఉపపత్తిని గలిగించి సార్థక మయ్యెను; పరిహాస పాత్రమైన ఆ రాక్షస స్త్రీ చరితము ఈ కథ వలన శోచనీయమును దయనీయమును అయ్యెను";[2] అని దీని నధికముగా ప్రశంసించి యున్నారు.

ఆనంద రామాయణమునందీ జంబుకుమారుని వృత్తాంతము సుమారు 6 శ్లోకములలో సంక్షిప్తముగా కలదు 3

---

1. య. ప్రతి. వాల్మీకి రామాయణము. అరణ్య-సర్గ-17. శ్లో. 5, 6.
"తథాఽఽసీనస్య రామస్య కథా సంసక్త చేతసః।
తందేశం రాక్షసీ కాచిదాజగామ యదృచ్ఛయా॥
సాతు శూర్పణఖానామ దశగ్రీవస్య రక్షసః। భగినీ"......
2. ఆంధ్ర సాహిత్య చరిత్ర. పుట-177
3. ఆనంద రామాయణము-సారకాండము. సర్గ-7 శ్లో 41-46.
"వనే శూర్పణఖా పుత్రం తపంతం సాంబ నామకం।
బ్రహ్మదదౌ దివ్యఖడ్గం, తంసాంబో న దదర్శ సః॥
తద్దృత్వా లక్ష్మణః ఖడ్గం, వృక్షాన్ వల్లీర్బభంజ సః।
వృక్ష గుల్మే హతః సాంబ స్తతో రాఘవ మబ్రవీత్॥
ప్రాయశ్చిత్తం బ్రహ్మహణం మాంవదత్వం రఘూత్తమ।
రామోఽప్యాహ హతః సాంబో రాక్షసోనమునిర్వ్రతః॥
తచ్ఛ్రుత్వా లక్ష్మణస్తుష్టః సాంబ మాత్రాఽపి తచ్ఛ్రుతం।
తత్ స్మరంతీ పుత్ర దుఃఖం రాక్షసీకామ రూపిణీ॥
విచచార శూర్పణఖా నామ్నీచ సర్వఘాతినీ।

ఈ వృత్తాంతమునందు "సాంబుడెందు కొఱకు తపమాచరించినాడు?" అను ప్రశ్నకు సమాధానము లేదు.

ఇదే ఆనంద రామాయణమునందు మరొక్కచోట "రావణుడు విద్యుజ్జిహ్వునికి శూర్పణఖను పారిబర్హముగా దండకారణ్యమును నొసంగెను ఆ విద్యుజ్జిహ్వ డచిరకాలమున మరణించినందున ఖరదూషణాదులను తత్సహాయార్థము అచ్చట నిలిపెను."[1] అని కలదు. ఇందు విద్యుజ్జిహ్వుడెందు వలన, నెప్పు డెవరిచే హతుడయ్యెనో. తెలుప బడలేదు.

ఇక వాల్మీకి రామాయణము-ఉత్తరకాండలో—

"రావణుడు దిగ్విజయార్థము బయలు దేరి వారి వారిని జయించుచు అశ్మనగరమునకుపోగా, కాలకేయాది రాక్షసులతని నెదిరించిరి విద్యుజ్జిహ్వుడును రావణునితో యుద్ధమొనర్చెను. అరణ్యమున శూర్పణఖాపతి హతుడయ్యెను. వైధవ్యమునకు గురియైనశూర్పణఖ అన్నయైన రావణునితో మొఱపెట్టుకొని యేడ్చినది. ఆతడు సోదరిని స్వాంతన పఱచి దండక వనమునిచ్చి, తత్సహాయార్థము ఖరదూషణాదులను నిల్పెనని"[2] కలదు.

ఇచ్చట కాలకేయాదులతో కూడివచ్చి ఎదిరించినందున రావణుడు విద్యుజ్జిహ్వుని చంపెనని తోచును. కాని ఇది తత్సంహారమునకు ప్రత్యేకత చెప్పబడినట్లు కాదు.

ఇక, బుద్ధారెడ్డి "ఈ యానంద-వాల్మీకి రామాయణములందలి కథాంశముల కుచితములైన మార్పులుచేసి సరసమైన రీతిలో పెంచి వ్రాసినాడు.[3] ఇవి సుమారు 120 ద్విపదలు-

మార్పులు:—

(a) సాంబు డనుపేరు జంబుడవి యుండుట-

... ... రావణుని

చెలియలి కొడుకు నేచిన జంబుడనెడు-తులువను నిర్జించె... ....

.... చటులోగ్రబలుడైన జంబుకుమారు."[4]

ఇచట జంబుడను పదమును తొలగించి "సాంబు" డని చేర్చిన యతి, గణ, ప్రాసాది భంగము కానేరదు. రచయిత సాంబుడని వ్రాయగా, లేఖకులు పొరపాటున జంబుడని మార్చినారేమో?

ఏకదా పంచ వట్యాంసా రామంద్రుష్ట్వాథ రాక్షసీ।
పుత్రదుఃఖం సమాక్రాంతా ధృత్వా రూపం మనోహరం।
కాపట్యా బుద్ధ్యా శ్రీరామం సానుజం హంతు ముద్యతా॥"

1. ఆనంద రామాయణము. సారకాండము. సర్గ. 13 శ్లో. 61, 62.
2. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. ఉత్తరకాండ. సర్గ 23 శ్లో. 17, 18 మరియు సర్గ 24, శ్లో. 25-44
3. రంగనాథ రామాయణము- అరణ్యకాండము ద్వి. 270-390.
4. రంగనాథ రామాయణము. అరణ్య-ద్వి-313, 337.
ఇచట "చెలియలి కొడుకగు జృంభుని నేడు" అని వావిళ్ళ పాఠము. అప్పుడు "జృంబుడా? జంబుడా?" అన్న సందేహమును తొలగింపగా, ఆంధ్ర విశ్వకళాపరిషత్ పరిశోధకులు "జంబుడని" సవరించిరి.

(b) "బ్రహ్మను గూర్చి తపమాచరించెనను మూలపాఠము "రవిని" గూర్చి తపము గావించినట్లు మార్చబడినది.

(c) మూలమునందు సాంబుడను దైత్యుడు హతుడైనాడని శ్రీరాముడు లక్ష్మణునితో చెప్పగా నిందు ఆ విషయము మునులచేత చెప్పించ బడినది.

రాముడు "సాంబుడని" చెప్పుట అనౌచిత్యము. ఇది రామునికెట్లు తెలియును? సర్వజ్ఞత్వము చేత; అని యన్నచో రాముని మానుష భావనకు భంగమేర్పడును. ఇతః పూర్వము "సాంబుడు దండకయందు తపము చేయుచున్నాడని ఎవరును చెప్పినట్లు లేదు. కావున జంబు కుమారుని మరణముచే సంతసించిన మునులు రాముని దర్శించి అతని చరిత్రమును చెప్పుట ఔచిత్యశోభితము.

(d) మూలమున "తపము చేయుటకు కారణము" చెప్పబడలేదు. ఇందు-

"... ... వాడు పెద్దయై యా తల్లిచేత
దన జనకుని చావు దప్పక తెలియ — విని తండ్రి పగ దీర్ప వెరవు చింతించి"[1]

తపము చేయఁదలచినాడని హేతువు చూపఁబడినది.

(e) "బ్రహ్మ"ను విడిచి సూర్యుని గూర్చి తపము చేయుట-

"బ్రహ్మను గూర్చి తపంబు సేసినను — బ్రహ్మ వరంబీడు: భవుని గొల్చినను.
అతని భక్తుడుగాన నలుగడాతనికి — నతులిత గతి విష్ణు నర్థింతునేని
జాల నాతడు మెచ్చి చనుదెంచి వరము — పాలించుటెప్పుడు? నా పగ దీఱు టెప్పు?
దరయఁద్రిమూర్తులౌ హరి హరి బ్రహ్మ — లరవింద హితరూపమై యుండు రంద్రడు
కావున రవిఁగూర్చి కడునిష్ఠఁ దపము — గావించి మెప్పించి కదన రంగమున
దనుజనాయకుడైన దశకంఠుఁ ద్రుంతు"[2]

నని సహేతుకముగా సమర్థింపఁబడినది ఇది మూలాతిశాయి రచనము.

మూలమునందు-కాలకేయాదులతో గూడి విద్యుజ్జిహ్వుడు రావణు నెదిరించగ, అతడాతనిని చంపెనని సామాన్యముగా కలదు. కాని రంగనాథ రామాయణము నందు ఈ విద్యుజ్జిహ్వ సంహారమునకు విశేష కారణము చూప బడినది.

"రావణుడు దిగ్విజయార్థము పోవుచు, ఇతరులను నమ్మక పోదరి భర్తయైన విద్యుజ్జిహ్వునికి లంకనప్పగించి పోయెను. ఈ విద్యుజ్జిహ్వుడు దశకంఠుని లంకకిక రానీయకుండఁ జేయుటకై పాతాళము నందలి అస్మయ నగరమునకుఁబోయి రాక్షసులయొద్ద మాయలు నేర్చుచుండెను. తిరిగి వచ్చిన రావణుడు తన మఱిది కథలను దెలిసికొని, అతి విస్మయ కోపుడై యరిగి ఖడ్గముచే నతని తలఁ దెగ వ్రేసెను."[3]

ఈ మార్పు-అనగా విద్యుజ్జిహ్వ సంహారమునకుఁ జెప్పిన ఈ హేతువెంతయో ఔచిత్య

1. రంగనాథ రామాయణము-అరణ్యకాండము. ద్వి-337-338.
2. రంగనాథ రామాయణము. అరణ్యకాండము. ద్వి-339-344
3. రంగనాథ రామాయణము అరణ్యా-ద్వి-319-332

సుందరమై "తిన్నయింటి వాసములు లెక్కపెట్టువాని నెవ్వనినైనను తగురీతి శిక్షించవలె"నను అభిప్రాయమునకు బలమును కలిగించుచున్నది.

ఇక, బుద్ధ భూపతి ఈ జంబుకుమారుని వృత్తాంతమును తన గ్రంథమున క్రొత్తగా చేర్చి రెండు మూడు ముఖ్య ప్రయోజనములను సాధించినాడు.

1. సూర్యుడు త్రిమూర్త్యాత్మక స్వరూపుడు.[1] ఉదయ, మధ్యాహ్న, సాయం సమయములందతడు బ్రహ్మ. శివ, విష్ణు, స్వరూపములు విరాజిల్లును.[2] హరిహర బ్రహ్మలను ప్రత్యేక ప్రత్యేకముగా గొల్చుట కంటె భాస్కరు నారాధించిన, మూర్తి త్రయమును సేవించినట్లే యగును. ఇదికాక ప్రత్యక్ష భగవానుడు సూర్యుడే. గాయత్రీ మంత్రాధిష్ఠాన దేవత సూర్యనారాయణుడే కాదా?![3] కావున తదారాధనము శీఘ్ర ఫల ప్రదము" అని బోధించుట.

2. తానారాధించు దేవత ప్రత్యక్షమైనను, కాకున్నను, యనుగ్రహించినను అనుగ్రహించక పోయినను, దగ్గరలోనున్నను దూరమునందున్నను ఆ దేవతను అవమానింపరాదు. అట్లవమానించినచో, తనకే ముప్పు వాటిల్లును.

ఇచ్చట "జంబు కుమారుడు తపమాచరించగా వనరుహాప్తుడు వరఖడ్గమును పంపించెను. కాని జంబు కుమారుడు దర్పాంధుడై సూర్యుడు స్వయముగా వచ్చి యీయలేదను కోపమున నా ఖడ్గమును గైకొనక తృణీకరించెను. అందుచే నది లక్ష్మణునికి లభించెను. అతడు దానిచే వెదురు జొంపమును ఖండింపగా, తన్మధ్య భాగముననుండి తపమాచరించుచున్న జంబుకుమారుడు ఖండింపబడి మడిసెను."[4] ఇది దైవకృతము.

పౌరుషముకంటె దైవమే బలీయమనియు, ఆరాధ్య దైవము నవమానించుటచే ఆపద వాటిల్లుననియు చెప్పుట ఈ ఘటన యందలి పరమార్థము.

3 శూర్పణఖ రామునియొద్దకు వచ్చుటకు సోపపత్తికత యేర్పడినది.

నియత కాలమున ఆహార పానీయములను దెచ్చిన శూర్పణఖ కుమారుడు మడియుటగాంచి, పలవించి పలవించి, అనతి దూరమున నున్న మునులను చేరబోయి, తన కుమారుని చంపిన విధమెఱిగింపకున్న పట్టి మ్రింగుదుననుచు వారి మీదకు పోయెను. మునులు భీతిల్లి జరిగిన వృత్తాంతమును దెలిపి, లక్ష్మణుడు పోయిన మార్గమును జూపిరి. ఆమె కనలుచు లక్ష్మణుడు చన్నట్టి యడుగుల చొప్పున నరిగి పర్ణశాలను జేరి లోకాభిరాముడైన రాముని కనుగొని తత్సౌందర్యముచే సమ్మోహితురాలయ్యెను."[5]

---

1. సూర్యాష్టకము. శ్లో. 4. త్రైగుణ్యంచ మహాశూరం బ్రహ్మవిష్ణుమహేశ్వరం.
2. బ్రహ్మ స్వరూప ముదయే మధ్యాహ్నేతు మహేశ్వరం।
   సాయంధ్యాయేత్సదా విష్ణుం త్రిమూర్తించ దివాకరః॥ (అభాణక శ్లోకము)
3. తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి।
   ధియోయోనః ప్రచోదయాత్॥ (ఇది గాయత్రి మంత్రము. సూర్యోపనిషత్తు)
4. రంగనాథ రామాయణము. అరణ్య. ద్వి, 343-348.
5. రంగనాథరామాయణము. అరణ్యకాండము. ద్వి. 353-397.

వాల్మీకి చెప్పిన "యదృచ్ఛయా" అనుదానికంటె నిది సోపపత్తికము: ఔచిత్య శోభితము.

4. దుఃఖితులకును, క్రోధితులకును, ఎట్టి యుద్దేశము చేత వచ్చిన వారికైనను, శ్రీరాముని దివ్యమంగళ విగ్రహ సౌందర్యము పరవశత్వమును కలిగించి, తనయందు బద్ధానురాగులను జేయును.

కావున శూర్పణఖ శ్రీరాముని జూడగానే కోపమును, వచ్చిన పనిని గూడ మఱచి, కామ వికారమునకు లోనై తన్ను పొందుమని కోరినది. అతడు "పుంసాం దృష్టి చిత్తాపహారి"యును పుంసాం మోహన రూపుడును నైనప్పుడు స్త్రీలకు కాకుండునా!

5. పుత్ర మరణమునకై శోకించిన శూర్పణఖ తీరు అచ్చమైన మాతృహృదయమునకు ప్రతీక.[1]

"అనరణ్య, కార్తవీర్యార్జునాదుల చేతను దెగనిరావణుడు నీచేత దెగడు, సాహసము వలదు." అని చెప్పినను తల్లిమాట వినక చెడిపోయితివి. ధర్మదేవత మాటతల్లి మాటంత్రు. నిర్మలాత్మక విననేరవైతకట"[2] అని శోకించిన శూర్పణఖ చరిత్ర దయనీయమైనట్లు మూలాతిశయముగా రంగనాథ రామాయణమునందు తీర్చి దిద్ద బడినది.

"తన భర్తను చంపినవాడు, తన కుమారుని చావునకు పరోక్షముగానైనను కారణమైన వాడును అగు రావణుని సమూలముగా నాశనము చేయుటకే శూర్పణఖ తలపడినది"అనెడి నిగూఢార్థము కూడ ఈ కథలో పొందు పఱచి బుద్ధారెడ్డి వ్యంజింప జేసినాడని స్ఫురించుచున్నది.

ఈ కథాంశముపై జైన రామాయణ ప్రభావమధికముగా నున్నట్లు తోచుచున్నది. విమల సూరి యను గొప్ప జైన పండిత కవి మహారాష్ట్రి ప్రాకృతములో "పఉమ చరి" అను గ్రంథ ముచు రచించెను. ఇది జైన ధర్మమను మూసలో పోత పోయబడిన రామకథా గ్రంథము. జాకోబి మొదలైన పండితులు క్రీ.శ. మూడు నాలుగు శతాబ్దుల కాలములోనిది రచింపబడినట్లు తలంచు చున్నారు.[3]

రవిషేణాచార్యుడు "పద్మచరిత"మను పేరుతో క్రీ.శ. 660లో దీనిని సంస్కృతము నందనువదించెను.[4] ఇందు "శంబూక వధ" జానకీహరణ కారణముగా రూపింప బడినది.

"రావణుని సోదరియైన చంద్రనఖను విద్యాధర వంశ రాజకుమారుడైన ఖరదూషణుడు వివాహమాడెను. శంబూకుడు ఈ చంద్రనఖా ఖరదూషణుల పుత్రుడు. ఇతడు సూర్యహాస ఖడ్గ సిద్ధికి ద్వాదశ వర్షములు తపమాచరించెను. అతని సాధన ఫలించి సూర్యహాసము పొడసూపెను. విధివశమున లక్ష్మణుడటకు వచ్చి, యా ఖడ్గమును గాంచి, విస్మయముతో గ్రహించి, దానితో సమీపమున నున్న వెదురు జొంపమును బలముగా కొట్టెను. ఆ వెదురు గుబురు నడుమ తపము చేయుచున్న శంబూకుని తల ఎగిరి పడినది. పిమ్మట చంద్రనఖ కుమారుని శవమును గాంచి, విల

1. రంగనాథ రామాయణము. అరణ్యకాండము. ద్వి. 356-372.
2. రంగనాథ రామాయణము. అరణ్యకాండము ద్వి. 360-372.
3. "रामकथा–उत्पत्ति और विकास" पृ 62, 63
4. " " "

పించుచు అడవిలో తిరిగి తిరిగి రామలక్ష్మణుల యొద్దకు వచ్చినది. వారి సౌందర్యమునకు ముగ్ధురాలై తాను వారికి భార్య కాగోరినది. కాని తన కోరిక నెర వేరనందున పతియైన ఖరదూషణుని యొద్దకు తిరిగి వచ్చి పుత్ర వధ వృత్తాంతమును వివరించినది. రావణునికిని ఈ సంగతి చెప్పంపినది. ఖరదూషణుడు సేనతో రామ లక్ష్మణుల మీదికి రాగా, లక్ష్మణుడొక్కడే యతని నెదుర్కొనెను. ఇంతలో రావణు డటకు వచ్చి సీతా సౌందర్యమునకు సమ్మోహము చెంది, అవలోకినీ విద్యాప్రభావమున రాముని పిలుచుటకు లక్ష్మణుడొనర్చినట్లు తాను సింహనాదము చేసెను. రాముడు లక్ష్మణుడు సింహనాదమును సంకేతముగా చేసినాడని గ్రహించి అతని యొద్దకుఁబోగా ఒంటరిగానున్న సీతను హరించుటలో రావణుడు సఫలీ కృతుడయ్యెను."[1]

ఇది జైన రామాయణము నందలి శంబూక వృత్తాంతము. ఇందు శూర్పణఖా విరూపకరణము పరిహరింప బడినది. వికారార్థమును దెలుపు శూర్పణఖ యను నామము "చంద్రనఖ" గా మార్చబడినది. ఖరదూషణులిరువురు గాక ఒక్కడే అయినాడు. ఇతడు సోదరుడుగాఁగాక భర్తగా రూపొందినాడు. సీతాపహరణమున మారీచుని వంటి మరొక పాత్రకు అవసరము కలుగలేదు.

ఈ వృత్తాంతమనేక రామకథలలో కొలది మార్పులతో చోటు చేసికొన్నది. వాల్మీకి రామాయణము ఉత్తరకాండలో-బ్రాహ్మణత్వ సిద్ధికై తపము చేయు శూద్రుడైన శంబూకుని వృత్తాంతమొకటి కలదు. నామసామ్యముచే పాఠకులకు తబ్బిబ్బు కలుగకుండుటకై జంబుమాలి, జంబుకుమారుడు, సాంబుడు అని ఆయా కవులు మార్చియుందురు.

బుద్ధారెడ్డి కాలమునాటికే జైనమతము తెలుగుదేశమునందు బహుళముగా వ్యాప్తి గాంచినది. ఇప్పటికిని తెలుగుదేశమున శిథిలమైయున్న జైన దేవాలయములు, జైన విగ్రహము లిందుకు నిదర్శనము. ఓరుగల్లు నందలి స్వయంభూ దేవాలయము మొదట జైన దేవాలయమట. వేములవాడలో రాజరాజేశ్వరస్వామి శివాలయమునందు సింహద్వార సమీపమున ముందు భాగమున పెక్కు జైనవిగ్రహము లుండినవి.[2] కావున జైనమతముతో వారి గ్రంథములను, ప్రజల నడుమ ప్రచారము చెందినవి. "పఉమ చరిఅ" లోని జానకీహరణ కారణముగా కల్పింపబడిన శంబూకవధ వృత్తాంతమును ప్రజలు మెచ్చియుందురు. అదియే ఆనోట- ఆనోట సలిగిపోగా, బుద్ధభూపతి దానిని గ్రహించి, బ్రాహ్మణ ధర్మముతో జోడించి, వాల్మీకి రామాయణమునకు విరుద్ధము గాని రీతిగా మార్చి, శూర్పణఖ రాముని యొద్దకు వచ్చుటకు హేతువుగా మలచినాడనియు తలంప నవకాశము గలుగుచున్నది. భాస్కర రామాయణమునందీ వృత్తాంతము గలదు[3] కాని రంగనాథ రామాయణములోని దానికంటె సరస సుందరము కాక పోవుటయే కాక ఒకటి రెండు భేదములును గలవు.

---

1. ''पउम चरिअ'' पर्व 43,44,45.
2. ఇప్పటి దేవస్థాన కమిటీవారు వానిని తీయించి, తచ్చిహ్నములు దేవాలయమున లేకుండా జేసినారు. బయట ఎక్కడనో భద్రపరచినారు.
3. భాస్కర రామాయణము- అరణ్య కాండము. పద్యగద్యములు. 108-113.

వాల్మీకి చెప్పిన "యదృచ్ఛయా" అనుదానికంటె నిది సోపపత్తికము: ఔచిత్య శోభితము.

4. దుఃఖితులకును, క్రోధితులకును, ఎట్టి యుద్దేశము చేత వచ్చిన వారికైనను, శ్రీరాముని దివ్యమంగళ విగ్రహ సౌందర్యము పరవశత్వమును కలిగించి, తనయందు బద్ధానురాగులను జేయును.

కావున శూర్పణఖ శ్రీరాముని జూడగానే కోపమును, వచ్చిన పనిని గూడ మఱచి, కామ వికారమునకు లోనై తన్ను పొందుమని కోరినది. అతడు "పుంసాం దృష్టి చిత్తాపహారి"యును పుంసాం మోహన రూపుడును నైనప్పుడు స్త్రీలకు కాకుండునా!

5. పుత్ర మరణమునకై శోకించిన శూర్పణఖ తీరు అచ్చమైన మాతృహృదయమునకు ప్రతీక.[1]

"అనరణ్య, కార్త వీర్యార్జునాదుల చేతను దెగనిరావణుడు నీచేత దెగడు, సాహసము వలదు." అని చెప్పినను తల్లిమాట వినక చెడిపోయితివి. ధర్మదేవత మాటతల్లి మాటంద్రు. నిర్మలాత్మక విననేరవైతకట"[2] అని శోకించిన శూర్పణఖ చరిత్ర దయనీయమైనట్లు మూలాతిశయముగా రంగనాథ రామాయణమునందు తీర్చి దిద్ద బడినది.

"తన భర్తను చంపినవాడు, తన కుమారుని చావునకు పరోక్షముగానైనను కారణమైన వాడును అగు రావణుని సమూలముగా నాశనము చేయుటకే శూర్పణఖ తలపడినది"అనెడి నిగూఢార్థము కూడ ఈ కథలో పొందుపఱచి బుద్ధారెడ్డి వ్యంజింప జేసినాడని స్ఫురించుచున్నది.

ఈ కథాంశముపై జైన రామాయణ ప్రభావమధికముగా నున్నట్లు తోచుచున్నది. విమల సూరి యను గొప్ప జైన పండిత కవి మహారాష్ట్రి ప్రాకృతములో "పఉమ చరి" అను గ్రంథ ముచు రచించెను. ఇది జైన ధర్మమను మూసలో పోత పోయబడిన రామకథా గ్రంథము. జాకోబి మొదలైన పండితులు క్రీ.శ. మూడు నాలుగు శతాబ్దుల కాలములోనిది రచింపబడినట్లు తలంచు చున్నారు.[3]

రవిషేణాచార్యుడు "పద్మచరిత"మను పేరుతో క్రీ.శ. 660లో దీనిని సంస్కృతము నందనువదించెను.[4] ఇందు "శంబూక వధ" జానకీహరణ కారణముగా రూపింప బడినది.

"రావణుని సోదరియైన చంద్రనఖను విద్యాధర వంశ రాజకుమారుడైన ఖరదూషణుడు వివాహమాడెను. శంబూకుడు ఈ చంద్రనఖా ఖరదూషణుల పుత్రుడు. ఇతడు సూర్యహాస ఖడ్గ సిద్ధికి ద్వాదశ వర్షములు తపమాచరించెను. అతని సాధన ఫలించి సూర్యహాసము పొడసూపెను. విధివశమున లక్ష్మణుడటకు వచ్చి, యా ఖడ్గమును గాంచి, విస్మయముతో గ్రహించి, దానితో సమీపమున నున్న వెదురు జొంపమును బలముగా కొట్టెను. ఆ వెదురు గుబురు నడుమ తపము చేయుచున్న శంబూకుని తల ఎగిరి పడినది. పిమ్మట చంద్రనఖ కుమారుని శవమును గాంచి, విల

---

1. రంగనాథ రామాయణము. అరణ్యకాండము. ద్వి. 356-372.
2. రంగనాథ రామాయణము. అరణ్యకాండము ద్వి. 360-372.
3. ''रामकथा–उत्पत्ति और विकास''पृ 62, 63
4. " " "

పించుచు అడవిలో తిరిగి తిరిగి రామలక్ష్మణుల యొద్దకు వచ్చినది. వారి సౌందర్యమునకు ముగ్ధురాలై తాను వారికి భార్య కాగోరినది. కాని తన కోరిక నెర వేరనందున పతియైన ఖరదూషణుని యొద్దకు తిరిగి వచ్చి పుత్ర వధ వృత్తాంతమును వివరించినది. రావణునికిని ఈ సంగతి చెప్పంపినది. ఖరదూషణుడు సేనతో రామ లక్ష్మణుల మీదికి రాగా, లక్ష్మణుడొక్కడే యతని నెదుర్కొనెను. ఇంతలో రావణుడటకు వచ్చి సీతా సౌందర్యమునకు సమ్మోహము చెంది, అవలోకినీ విద్యా ప్రభావమున రాముని పిలుచుటకు లక్ష్మణుడొనర్చినట్లు తాను సింహనాదము చేసెను. రాముడు లక్ష్మణుడు సింహనాదమును సంకేతముగా చేసినాడని గ్రహించి అతని యొద్దకుంబోగా ఒంటరిగానున్న సీతను హరించుటలో రావణుడు సఫలీ కృతుడయ్యెను."[1]

ఇది జైన రామాయణము నందలి శంబూక వృత్తాంతము. ఇందు శూర్పణఖా విరూపకరణము పరిహరింప బడినది. వికారార్థమును దెలుపు శూర్పణఖ యను నామము "చంద్రనఖ" గా మార్చబడినది. ఖరదూషణులిరువురు గాక ఒక్కడే అయినాడు. ఇతడు సోదరుడుగాంగాక భర్తగా రూపొందినాడు. సీతాపహరణమున మారీచుని వంటి మరొక పాత్రకు అవసరము కలుగలేదు.

ఈ వృత్తాంతమనేక రామకథలలో కొలది మార్పులతో చోటు చేసికొన్నది. వాల్మీకి రామాయణము ఉత్తరకాండలో-బ్రాహ్మణత్వ సిద్ధికై తపము చేయు శూద్రుడైన శంబూకుని వృత్తాంతమొకటి కలదు. నామసామ్యముచే పాఠకులకు తబ్బిబ్బు కలుగకుండుటకై జంబుమాలి, జంబుకుమారుడు, సాంబుడు అని ఆయా కవులు మార్చియుందురు.

బుద్ధారెడ్డి కాలమునాటికే జైనమతము తెలుగుదేశమునందు బహుళముగా వ్యాప్తి గాంచినది. ఇప్పటికిని తెలుగుదేశమున శిథిలమైయున్న జైన దేవాలయములు, జైన విగ్రహము లిందుకు నిదర్శనము. ఓరుగల్లు నందలి స్వయంభూ దేవాలయము మొదట జైన దేవాలయమట. వేములవాడలో రాజరాజేశ్వరస్వామి శివాలయమునందు సింహద్వార సమీపమున ముందు భాగమున పెక్కు జైనవిగ్రహము లుండినవి.[2] కావున జైనమతముతో వారి గ్రంథములును, ప్రజల నడుమ ప్రచారము చెందినవి. "ప ఉ మ చరి అ" లోని జానకీహరణ కారణముగా కల్పింపబడిన శంబూకవధ వృత్తాంతము ప్రజలు మెచ్చియుందురు. అదియే ఆనోట- ఆనోట సలిగిపోగా, బుద్ధభూపతి దానిని గ్రహించి, బ్రాహ్మణ ధర్మముతో జోడించి, వాల్మీకి రామాయణమునకు విరుద్ధము గాని రీతిగా మార్చి, శూర్పణఖ రాముని యొద్దకు వచ్చుటకు హేతువుగా మలచినాడనియు తలంప నవకాశము గలుగుచున్నది. భాస్కర రామాయణమునందీ వృత్తాంతము గలదు[3] కాని రంగనాథ రామాయణములోని దానికంటె సరస సుందరము కాక పోవుటయే కాక ఒకటి రెండు భేదములును గలవు.

---

1. ''पउम चरिअ'' पर्व 43,44,45.
2. ఇప్పటి దేవస్థాన కమిటీవారు వానిని తీయించి, తచ్చిహ్నములు దేవాలయమున లేకుండా జేసినారు. బయట ఎక్కడనో భద్రపరచినారు.
3. భాస్కర రామాయణము. అరణ్య కాండము. పద్యగద్యములు. 108-113.

రంగనాథ రామాయణము	భాస్కర రామాయణము
1. జంబుకుమారుడు సూర్యుని గూర్చి తపము చేసెను.	1. ఇతడు ఇంద్రుని గూర్చి తపమొనరించెను;
2. భానుడు వచ్చి స్వయముగా నీయలేదని ఖడ్గము నొల్లకుండెను.	2. అది తన యమిత తపోబలమున కల్పమని గ్రహించకుండెను.
3. ఖడ్గము పేరు లేదు.	3. ఖడ్గము పేరు చంద్రహాసము[1]
4. వెదురు జొంపమును ఖండించుటకై లక్ష్మణున కెవరి ప్రేరణమును లేదు.	4. మునుల ప్రేరణమున నతడు వెదురు జొంపమును తెగనఱికెను.

భాస్కర రామాయణము నందలి ఈ చిన్నకథ శూర్పణఖా ప్రవేశమునకు ఉపపత్తిని కలిగించునుకాని. కరుణరస పోషణము చక్కగా కావింపఁబడనందున, ఆ రాక్షస స్త్రీ చరితము అంతగా శోచనీయము, దయనీయము కాలేదు.

అవాల్మీకమైన జంబుకుమారుని వృత్తాంతమునకు మూలము పఉమ చరిఅ (పద్మ చరిత), ఆనంద రామాయణాదులు. బుద్ధ భూపతి దీనిని గ్రహించి, స్వీయ ప్రజ్ఞా పాటవమున కొలది మార్పులు చేసి, రచనాచాతుర్యమున ఔచిత్యవంతముగాఁ దీర్చిదిద్ది, వాల్మీకి రామాయణము నందలి "యదృచ్ఛయా" కంటె ఎక్కువగా శూర్పణఖా ప్రవేశమునకు సహేతుకత నాపాదించి. పతి-పుత్ర దుఃఖములకు లోనైన రాక్షసి-భోగవిదూరయైన రాక్షసి-ఇంతకంటె నేమి చేయగలదనెడి పాఠకుల సానుభూతికి పాత్రురాలినిగాఁ జేసినాడు.

(5) బరులు గీయుట :—

సీతా ప్రతిరోధముచే పర్ణశాలను వీడిపోవు లక్ష్మణుడు-

పర్ణశాలకుఁ జుట్టు బరులేడు వ్రాసి — వర్ణించి యీ బరుల్ వడి దాటకమ్మ
ఎవ్వడే నీ బరుల్ వెసదాటి వచ్చు — నవ్వీరవరు తల లవియు నాక్షణమే యని పల్కి"[2]

సీతను వహ్ని కొప్పగించి రాముని జాడను పోయినాడు.

ఈ ద్విపదలు ఆంధ్ర విశ్వకళా పరిషత్తు వారి సంశోధిత ముద్రిత ప్రతిలో మూలపాఠము నుండి తొలగింపఁబడి 1వ అనుబంధమునఁ జేర్చఁబడినవి వావిళ్ళ, రాయల్ అండ్‌కో వారి ప్రతులందు మూల పాఠమునందే యున్నవి. దీనివలన ఆం-వి-క-ప-ప్రతి పరిష్కార కర్తలకిది ప్రక్షిప్త మయినది. కాని డా॥ పింగళి లక్ష్మీకాంతం,[3] డా॥ జి. నాగయ్య[4] వంటి ప్రసిద్ధ పరిశోధకులు ఈ విషయమును అవాల్మీక కథాంశ పట్టికలోఁ జేర్చి ప్రత్యేకముగాఁ జెప్పి యున్నారు. వారికిది

---

1. చంద్రహాస పదమునకు అర్థము ఖడ్గమే. కాని ఖడ్గ పర్యాయ పదములు వాడక మూడుచోట్ల "చంద్రహాస" శబ్దమే ప్రయుక్తమైనందున ఇది ఖడ్గము పేరనుట సముచితము.
2. రంగనాథ రామాయణము. అరణ్య కాండము. ద్వి-960-962.
3. డా॥ పింగళి లక్ష్మీకాంతం. ఆంధ్ర సాహిత్య చరిత్ర. పుట-175.
4. డా॥ జి. నాగయ్య. ద్విపద వాఙ్మయము. పుట-146.

ప్రక్షిప్తము కాదు.

వావిళ్ళ ప్రభృతి ముద్రాపకులు కూడ ఏదోయొక తాళపత్ర ప్రతి నాధారముగాఁ జేసికొనియే ముద్రించి యున్నవారగుట చేతను, శైలీ సామ్యము చేతను ఇది రంగనాథ రామాయణ రచయితదే యని తలంచుచ మన్నను. ఇందలి

"ఎవ్వడే నీ బరుల్ వెనదాటి వచ్చు"

పాదములోని "ఎ"కు "వె"తో వేయబడిన యతి మైత్రియును, "సౌమిత్రి......నమరంగ" అను పాదముల హ్రస్వ దీర్ఘ పూర్వ ప్రాస మైత్రియు ప్రక్షిప్తమని చెప్పక చెప్పుచున్నది. కావున మూల గ్రంథకర్త వ్రాసినవి కావని నిస్సందేహముగా చెప్పవచ్చును.

ఎవరు వ్రాసినను, ఈ కథాంశమునకు ఆధారము ఆనంద రామాయణము.[1] అందిట్లున్నది.

"శ్రీరామాజ్ఞను పురస్కరించుకొని రక్షించుచు నున్న నన్ను వాక్శరములతో తాడించితివి. త్వరగా దీని ఫలితమనుభవింతువు అయినను హితము చెప్పుదును, వినుము. నీ సంరక్షణకై దుష్టులకు దుర్విలంఘ్యమైన నొక రేఖను ధనుస్సుతో గీయుచున్నాను నీవు మాత్రము ప్రాణములు కుత్తుక వరకు వచ్చినను ఆ రేఖను దాట వద్దని పలికి సౌమిత్రి ధనుష్కోటిచే పంచవటికి వెలుపల పరిఘవలె నొక రేఖను చుట్టు గీచి, సీతకు నమస్కరించి మౌనముగా పోయెను."[2]

ఇచట సీతచుట్టు ఒక్కటే రేఖ గీయబడినది. కాని రంగనాథ రామాయణమునందు-7 రేఖలు గీయబడినవి. సంఖ్యా భేదమే కాని, కవి చేసిన పెద్ద మార్పేమి లేదు. సప్తరేఖలు గీయుటకు దేశి కథలు స్ఫూర్తినిచ్చినవేమో!

బాలనాగమ్మ కథయందీ రేఖా విషయము గలదు. ఈ కథ ఎప్పటిదో తెలియదు. ఇందు "కార్యవద్దిరాజు గండికోట కార్యానికి పోవుచు "తన భార్య బాలనాగు ఉండు మేడకు మేడ ముందర యేడు గిరులు వ్రాసి "ఓ భామా! బాలనాగూ! దాసరి వచ్చిన, జంగము వచ్చిన, భట్టు బ్రాహ్మణ వగైరాలు వచ్చిన ఏడు గిరులు దాటి భిక్షము పెట్టవద్దు. అట్లనే జెప్పిన హద్దుదాటి భిక్షం పెడితే కాశిలో గోహత్య చేసిన పాపమున పోదువు. మీ తల్లి భూలక్ష్మిని చంపిన పాపమున పోదువు" అని దిట్ట పరచి అన్నలతో పోయెను. తరువాత మాయల మరాటి ఫకీరు వేషమున వచ్చి, భిక్షము వేడి, తాను గిరులు దాటలేక, బయిటకు వచ్చి బిచ్చము వేయనిచో వెడలి పోదునని బెదిరించి, భయపడి గిరులు దాటి వచ్చిన బాలనాగును మంత్ర దండమున శునకముగా మార్చి తీసికొని పోయెను."[3]

ఈ రంగనాథ రామాయణమునందు కూడ ఇట్లే-సీతాదేవి-

"సౌమిత్రి వ్రాసిన చక్కని బరులు — నమరంగ గడచియు నతిభక్తితోడఁ

బొలతి యభ్యాగత పూజఁ గావించి — కలగు చున్నట్లున్న గల్యాణిఁ జూచి"

---

1. ఆనందరామాయణము. సారకాండ-సర్గ-7. శ్లో-97-101
2. ఆనంద రామాయణము. సారకాండ-సర్గ. 7, శ్లో. 97-101.
3. బాలనాగమ్మ కథ (స్త్రీలపాట) యన్. వి. గోపాల్ ప్రచురణము.

భిక్షుక వేషధారియైన రావణు డపహరించెను."[1] కావున బరులు గీయుటకు మూలాధారము ఆనందరామాయణము; సప్తసంఖ్యకు దేశి గాథా ప్రభావమును కారణమని యూహించవచ్చును.

ఒక గీత యైనచో బలిష్ఠుడైన భిక్షుకుడు, గీతలోపల నుండి బిక్షము పెట్టుచున్న వనితను పట్టుకొని బలముగా బయటకు లాగి అపహరించుకొని పోవుట కవకాశ ముండును.[2] అవియే యేడు గీతలైనచో, ఇతడు ముందుకు వంగినను ఎక్కువగా గట్టి పట్టు దొరకమి లాగ జాలక పోవచ్చును. ఇది లౌకికముగా స్థూల దృష్టికి తోచు సమాధానము.

ఇచట సప్త సంఖ్యకు ప్రాధాన్య మీయబడినది. దీని అంతరార్థము పరమ గంభీరముగా నున్నది.

1, దాసుడైన లక్ష్మణుడు సీత పరుష భాషణములను విని పోయినచో రాముడప్పగించిన సీతారక్షణ కార్యమును నెరవేర్చ నందున స్వామిద్రోహమును చేసిన వాడగును. తాను బోయినచో తప్పక ప్రమాదము వాటిల్లును. కావున సీత చుట్టు ఏడు గీతలు గీచినాడు.

శరీరమునందు సప్త ధాతువు లుండును. ఏది బలహీన మైనను దేహపుష్టి తగ్గును. ఇచట ఏడు గిరులను గీయుట అనగా తన దేహమందలి సప్తధాతువుల బలమును నిక్షేపించుట; తద్వారా సీతను రక్షించుట. సీతాదేవి బరులు దాటి రానంతవరకు ఆమెకెట్టి అపాయము లేదు. కావున సీతా రక్షణము తాను జేసి నట్లెయగును. తన మాటను పాటించక గీతలు దాటి వచ్చినచో అపాయము సంభవించినచో, స్వామి యాజ్ఞను లక్ష్మణుడు పాటించలేదనే దోషము అతనికి రాదు, మీదు మిక్కిలి "చెప్పిన మాటను వినక సీత చెడిపోయినది," అని దోషము సీతపై యుండును. ఈ ఆశయముచే సౌమిత్రి ఏడుగిరులు గీచినాడేమో!

2. దుర్గమునకు సప్తప్రాకారములు, భవనమునకు సప్తకక్ష్యలు ఉండును ఎవడైనా బలవంతుడు ప్రవేశింప ప్రయత్నించవచ్చును. ఆతడులోన చేరులోపల తాము రావచ్చును గదా!

3. సీతాదేవి పరాశక్తి. తద్దర్శన ప్రాప్తికి సాధకుడు సప్తచక్రములను (సప్తావరణములను) భేదించి అధిగమించి పోవలెను. నిగ్రహము లేనివాడు ప్రయత్నించిన అపాయము నొందును. ఆమెయే కరుణించి తానే ఆవరణములను దాటి వచ్చిన దుష్టసాధకు డాశక్తిని దుర్వినియోగము చేయును.

ఈ యవాల్మీకాంశమును కూర్చుటయందు రచయిత కిట్టి యూహలు ఉండియుండ వచ్చును.

(6) ఫల యాచనము :—

శ్రీమదాంజనేయుడు లంకలో అశోకవనమున సీతమ్మను దర్శించి, ఓదార్చి, తత్సందేశమును గ్రహించిన తరువాత, రాక్షస బలాబలములను, రావణ హృదయమును తెలిసికొన గోరెను. "సామదాన భేదములు రాక్షసులందు పనిచేయవు; పరాక్రమొక్కటే ఫలదాయ రాక్షసులతో యుద్ధము చేసిన, రావణునితో సమాగమము తటస్థించును; అతనితో సంభాషించిన మీదట తద్హృదయ మవగతమగును; తన పని నెరవేఱు"[3] నని తలంచి, ఆంజనేయుడు నందన

---

1. రంగనాథ రామాయణము. అరణ్యకాండము. ద్వి. 977-978
2. బిచ్చము పెట్టుట గృహస్థ ధర్మము. దానికై స్త్రీలు తప్పక బయటకు వత్తురుగదా!
3. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. సుందరకాండము. సర్గ 41 శ్లో. 2-9.

వనముతో తుల్యమైన అశోక వనమును ధ్వంసము చేయఁ బూనుకొనెను.

రంగనాథ రామాయణము నందిట నొక క్రొత్త అవాల్మీకాంశము చేర్చబడినది. అది హనుమంతుడు పండ్లు నడుగుట. చూడుడు—

"పంతంబు తానిక పక్తికంపునకు — నింతటఁ దనరాక నెఱిగింతు ననుచుఁ
కదల్లి నేనాకొంటిఁ దనరంగ వనము — నెల్లెడ ఫలములు నేను గైకొందు
ననవుడు సీత యాహనుమంతుఁ జూచి — యనె రాక్షసావళి యల్ల కాపుండుఁ
గ్రమ్మి రాలిన పండ్లు క్రమముతో నమలి — పొమ్ము వేగ" యటంచుఁ బొందుగా ననుపఁ]
దనమదిఁ గొండొక తడవు చింతించి — వనభంగ మొనరించు వాడునై పెరిగి"[1]

భగ్నము చేయఁ దొడంగెను.

[ఈ పై కుండలీకరణము లందలి ద్విపదలు ఆ.వి.క.ప. ప్రతిలో 1వ అనుబంధమునఁ జేర్చబడినవి.]

ఈ అవాల్మీకాంశమున కాధారము ఆనంద రామాయణము. కాని రంగనాథ రామాయణకర్త అచటి పూర్తి విషయమును ఉన్నదున్నట్లు గ్రహించక కొంత జార్చినాడు. పరిశీలింపుడు:—

హనుమంతు డాకలిని తీర్చుకొనఁ దలచి సీతాదేవితో "ఫలములను తిందు" ననెను. కాని జానకీ మాత తన హస్త కంకణమును దీసి "ఇదిగో! దీనిని గ్రహింపుము. లంకానగరమందు అంగళ్ళలో ఫలములను కొని భుజింపుమనెను. అపుడు హనుమంతుడు "ఇతరుల చేతి ఫలములను తినను. ఇది నా వ్రతము" అని పోఁబోయెను. సీతాదేవి అతనితో "ఈ వనాధిపుడు రావణుడు. నా కధికారము లేదు. నీ వెట్లు తినగలవు" అని పలికెను. "నాయొద్ద శ్రీరామ మంత్రశస్త్ర మున్నది. దానివలన రాక్షసులందఱు గడ్డిపఱక లయ్యెదరు" అని మారుతి పలుకగా, విని సీతాదేవి "క్రింద రాలిన పండ్లను తినుమని" నుడివెను. అపు డాంజనేయుడు తోకచే చెట్ల నూపసాగెను."[2]

ఇచటి సీతామారుతి సంభాషణ మెంతో యుక్తియుక్తముగా, పరమాహ్లాదకరముగా ఔచిత్య వంతముగా నున్నది. కాని బుద్ధభూపతి దీని నంతటిని వదలి, కేవలము అద్యంత విషయములను మాత్రమే. అనగా 123. 124, 130, 131 శ్లోకాభిప్రాయమును— గ్రహించి, తన గ్రంథమునందుఁ గూర్చినాడు.

ఇందలి ఔచిత్యమును విచారింతము.

1. సీతాదేవికి పరిచయము లేక వనమును భగ్నపఱిచినచో కోలాహల మేర్పడును. ఆమెకు భయ సంశయములు పొడమును. తనను రామదూతయని నమ్మలేకపోవును. కావున ఏదో మిషతో భావి వనభగ్నమును సూచించవలెను.

2. ఆంజనేయుడు పరతంత్రుడు; రామాజ్ఞపై లంకకు వచ్చినవాడు. అతని రాకకు సీతాదర్శనమే ఫలము, ఆ పిమ్మట తత్కుశల వార్తను దీసికొనిపోయి శ్రీరామున కెఱిగించవల

---

1. రంగనాథ రామాయణము. సుందరకాండము. ద్వి. 615-619.
2. ఆనంద రామాయణము. సారకాండము. సర్గ-9 శ్లో. 122-135

సినదే. కాని స్వతంత్రించి వనభంగము చేసినచో, సీత కేదైన ప్రమాదము సంభవించిన, దానికి బాధ్యుడు తాను (ఆంజనేయుడు) అగును. కాని ప్రభువుల యాదేశముపై చేసినవాడు ఫలాఫలములకు బాధ్యుడు కాడు. యజమాని లేనప్పుడు యజమానురాలి యనుమతిని గ్రహించ వచ్చును. అట్లుచేసిన, తన పరతంత్రతా భావమునకు కొఱంతరాదు.

3. అశోకవనము రావణునిదైనను, ప్రస్తుతమది సీతానివాసము. ఆ వనమునందలి వారు సీతాదేవి యాజ్ఞను శిరసావహించి ప్రవర్తింప వలసినదనియే రావణుని హెచ్చరిక. కావున అశోకవనమున కధికారిణి *సీత యగును సీతాదేవి యనుమతించినచో తానేమైనా చేయ వచ్చును.

4. "వనమును భగ్నము చేయుటను అనుమతించు"మని మారుతి కోరిన, సీత సమ్మ తింపదు. దానికి నెప మవసరము. కావున అతడు "తన కాకలి యగుచున్నది; తోట నిండ పండ్లున్నవి; వానిని తిందును; సమ్మతింపుము" అని కోరుట యుక్తియుక్తము. కాని సీత తన స్థితిని తాను గ్రహించినది. "వనము రావణునిది. దానిపై తన కధికారము లేదు. మరియు నందు రాక్షసులు కాపున్నారు. పండ్లను భక్షించుటలో ప్రమాదము రావచ్చును. మారుతి చెట్లనెక్కి, కొమ్మల నూపిన వనపాలకులు మీదికి వత్తురు; కయ్య మేర్పడును. రామదూతను పట్టుకొని బంధించుటయో, కొట్టి చంపుటయో జరుగును. అపుడు తన వార్త శ్రీరామచంద్రునకు దెలియకుండ పోవును. మొదటికే మోసము వచ్చును. ఇట్లని ఆకలిగొన్న హనుమంతునికి ఆహారము లేకపోయిన మరల సముద్రము నెట్లు దాటగలడు. తాను పెట్టలేకున్నను, లభించు మార్గమునైనను చూపవలెను. మారుతి శాఖామృగము; కావున పండ్లను గోరినాడు." ఇది సీత యాలోచన. కావున రాలిన పండ్లను నమలి పొమ్మని హనుమంతుని గోరినది.

7. ఆజ్ఞ దొరికినది గదా యని, అతడు పెరిగి వన ధ్వంసము చేయ మొదలిడినాడు.

ఇంతటి ఆలోచనతో పూర్వాపర సందర్భౌచిత్య మొప్పునట్లుగా వ్రాయబడిన ద్విపదలు సీతా హనుమత్ పాత్రల శీలమునకే కాక మూలకథకును మెఱుగు పెట్టుచున్నవి. శైలీ సామ్యమును గమ నించినచో నివి ప్రక్షిప్తములు గావు.

7) నల వరము ;—

దాశరథి బ్రహ్మాస్త్రానుసంధానమునకు సముద్రుడు భయపడి వచ్చి శ్రీరాముని శరణాగతి పొంది "విశ్వకర్మసుతుడైన నలుడు పితృదత్తవరుడు. నిర్మాణమునందు తండ్రితో సమానుడు. ఇతడు నిర్మించు సేతువును జలములపై నేను ధరింపగలను"1 అని వారధి నిర్మాణమున కుపాయము దెల్పెను. అప్పుడు నలుడును "ఔనౌను. సముద్రుడు చెప్పినది సత్యము. అకృతజ్ఞులయందు దండమే ఉత్తమమని యూరకుంటిని. తండ్రి సామర్థ్యమును వహించి సేతువును నిర్మింపగలను. నా తండ్రి విశ్వకర్మ నా తల్లికి "నాతో సమానుడైన పుత్రుడు కలుగగల"డని వర మొసంగెను. ఇది నా కిపుడు సముద్రుని మాటలచే స్మృతికి వచ్చినది. ఇతరులు చెప్పనిచో, ఆత్మ గుణములు

---

* సీతాదేవి ప్రకృతి. రావణు డహంకారము. అహంకారము ప్రకృతికి లోనైనది.

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము, యుద్ధకాండము. సర్గ 22. శ్లో. 43-45.

స్ఫురించవు. నేడు వానరులు నీరధి పై వారధిని బంధింతురుగాక", అని శ్రీరామచంద్రునితో పలికి తన్నిర్మాణమునకు పూనుకొనెను.

మూలమునందింత మాత్రమే కలదు. కాని రంగనాథ రామాయణము నందిచట అవాల్మీక వృత్తాంత మొకటి కనబడుచున్నది.

"శిశువేళ వింధ్యాద్రి చేరువ యడవిఁ — బహు కణ్వుఁడను ముని పజ్జ నాడుచును
ముని యనుష్ఠాన మిమ్ములఁ జేయఁబోవ — ముని వేల్పులను బట్టి మోర తోపునను
వనధి లోపలఁ బాఱవైచె నీ నలుఁడు — చనుదెంచి యమ్ముని చయ్యన నెఱిగి
చాలంగఁ గోపించి శాస్తిఁ గావింప — బాలుండు తగదని పరగఁ జింతించి
తన సొమ్ము పోకుండఁ దానె దెచ్చుటకు — ననువుఁ జింతించి యా యర్భకుఁ జూచి
తన తపో మహిమ నత్తాప సోత్తముఁడు — ఘన తరంబగు నొక్క కట్టడ సేసె.
నీ యబ్ధి లోపల నేతృణంబైనఁ — బాయక వీడేమి పట్టివైచినను
అవి దేలుగాకని యా వరంబీయ — నవి యంతలోఁ దేల నతఁడు గైకొనియె.
నదిగాన తేలెడు నతనిచే గిరులు — వదలక నేఁగట్టు వడియెద నపుడు;"[2]

ఇది సముద్రుడు చెప్పిన నలుని శక్తి సామర్థ్యములు. బాల్యము నందతడు పొందిన వరప్రసాదము.

ఆనంద రామాయణమునందు — "నలుడొకప్పుడు ఒక బ్రాహ్మణుడు పూజించు శాలి గ్రామమును గంగా జలమునందు పడవేసెను అప్పుడా ద్విజుడు కోపించి నీ చేరి నుండి పడవేయబడు పాషాణాదులు నీళ్ల లో తేలుగాక యని శపించెను. ఇచట నది వరముగా సంభావింపదగు"[3] నని సముద్రుడు చెప్పినటున్న వృత్తము పై ద్విపదలకు ఆధారము.

అధ్యాత్మ రామాయణమునందు "నలుడు లబ్ధవరుడ"[4]ని మాత్రమున్నది. కాని ఇచట నలునికి వరమెట్లు లభించినదో వివరింపబడ లేదు.

ఇక రంగనాథ రామాయణము నందలి ఈ వృత్తమున కాధారమని తలంపబడు వృత్తమునకు ఒకటి రెండు చిరు భేదములు గలవు.

1. పేరు లేని ఋషికి (ద్విజునకు) బహుకణ్వుడని నామమిడుట.
2. గంగా జలమునకు బదులు సముద్ర జలమనుట.
3. శాలి గ్రామమును "ముని వేల్పు"గా చెప్పుట.
4. శాపము పెట్టినాతనుటను వరమిచ్చినాడని మార్చుట. మిగిలిన కథ యంతయు సమానమే.

బుద్ధారెడ్డి ఔచిత్య దృష్టికి ఈ కథాంశము చక్కని నిదర్శనము.

వాల్మీకి రామాయణము నందలి విశ్వకర్మ వరము[5] సేతు నిర్మాణ సామర్థ్యమును

---

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము యుద్ధ. సర్గ. 22 శ్లో. 42-52
2. రంగనాథ రామాయణము. యుద్ధకాండ. ద్వి. 978-986.
3. ఆనంద రామాయము. సారకాండము సర్గ 10. శ్లో. 66—68.
4. అధ్యాత్మ రామాయణము యుద్ధకాండము. సర్గ. 3. శ్లో. 84.
5. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. యుద్ధకాండ సర్గ 22 శ్లో. 49 1/2

దెలుపుటకు సాధనమగును. కాని, నీళ్ళపై గుండ్లు బెండ్లుగాఁ దేలుటకు హేతువు కాజాలదు. దీని కుచితమైనది ఆనందరామాయణము నందలి వృత్తమే. కావున కవి ఏ తద్వృత్తాంతమును చేర్చుటచే రంగనాథ రామాయణమునకు పై లక్షణ్య మేర్పడినది.

ఇక మూలమును బట్టి "శాలి గ్రామమును గాఁగ జలములో పడవేసిన" నలుని వయ స్సెంతయో తెలియదు. అతడు క్షమార్హుడౌనో కాదో తెలియదు. కావున ద్విజుడతనిని శపించినాడు. కాని రంగనాథరామాయణము నందలి నలుడు బాలుడు. ముని వేల్పును మోరతోపునఁ బడవేసినా డనగా అతడు "ఆంబాడు" వయస్సులో నున్న బాలుడు. కావున అజ్ఞాని. అట్టివానిని తపస్సిద్ధి సంపన్నుడైన ముని పశుకణ్వుడు శపించిన. జ్ఞానులతనిని దూషింతురు అందువలన బాలుని శపించకూడదు. అతడాట నెపమున నిక ముందు పడవేయు ముని వేల్పులే కాదు, ప్రతి వస్తువును మరల తనకు లభించవలెను ఈ విషయము నాలోచించి ముని "నలుడు జలములందు పడవేసిన తృణం బైనను తేలుగాక"[1] యని వరమిచ్చెను. తృణము నీటియందు తేలును. కావున ప్రతివస్తువు తృణము వలె తేలునని ధ్వని-అల్పార్థమునను, విలువలేని వస్తువు విషయమునను తృణ శబ్దము నుపయోగింతురు. "రాళ్ళు విలువ లేనివి గదా! అవియును తేలెడిని" అనియు స్ఫురించును.

ఇది పశు కణ్వుడిచ్చిన వరము; సముద్రునిచే శ్రీరాముని యెదుట స్మరింపబడినది "ఇతరులచేఁ జెప్పబడిననే గాని నాయంతట నేను నాయాత్మగుణములను గ్రహించను; అవి స్మృతి యందుండవు. ఇప్పుడు గుర్తునకు వచ్చినవి. ఇక సేతువును నిర్మింతును;"[2] అనెడి వాల్మీకి చెప్పిన విషయముతో చక్కగా సంబంధము కలుపబడినది.

(8) గణేశ నమస్కారము :—

శ్రీరామ చంద్రుడు సేతు ప్రారంభమునకు పూర్వము శ్రీ గణేశుని ప్రార్థించి నమస్కరించినట్లు.

"ఆ యెడ శైల వృక్షావళిఁ దెచ్చి — తోయధిఁ గట్ట నుద్యోగించి రపుడు
రామచంద్రుండను రాజు గణేశుఁ — దామది లోపలఁ దలచి మ్రొక్కుచును"[3]

మమ మాతుర్వరోదత్తో మందరే విశ్వకర్మణా।
ఔరస స్తస్య పుత్రోఽహం సదృశో విశ్వకర్మణా॥
(మయా సదృశః పుత్ర స్తవ భవిష్యతీ త్యేవం రూపో వరః।) గోవిందరాజీయము.

1. రంగనాథరామాయణము. యుద్ధకాండము. ద్వి 984,
ఇచ్చట రాయల్ అండ్ కో ప్రతిలో—
"తోయధి లోపలఁ దృణమాదిగాగ" యనియున్నది. ఇచట యతి భంగ మేర్పడినది; కాన గ్రాహ్యము గాదు. (తృటియైనగాని)
2. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. యుద్ధకాండ. సర్గ. 22. శ్లో. 50 1/2
3. రంగనాథ రామాయణము. యుద్ధకాండ. ద్వి. 1001-1002.

అని రంగనాథ రామాయణమునందు చెప్పబడినది. దీనికి పాఠాంతరముగా ఈ క్రింది ద్విపదలు గలవు

తరణి కులుండగు ధరణీశ పాద — సరసిజంబులకును సాష్టాంగ మెఱఁగి
ఫణిరాజ భూషణుఁ బరమేశ పుత్రు — గణనాథునకు నమస్కారంబు చేసి"1 అని.

ఇది అవాల్మీకి విషయము. వాల్మీకి రామాయణమునందు శ్రీరాముడుగాని, సుగ్రీవుడుగాని, లేక నలుడుగాని గణాధిపతిని దర్శించి నమస్కరించినట్లు కానరాదు.

ఇక, పై ద్విపదలలో కొలది వ్యత్యాసమున్నది. గణేశుని మ్రొక్కిన వాడు శ్రీరాముడని మొదటి మూల ద్విపదలును; కాదు నమస్కారంబు చేసినవాడు సుగ్రీవుడని పాఠాంతర ద్విపదలును ప్రకటించుచున్నవి. ఇందులో ఏది ప్రక్షిప్తము; ఏది బుద్ధభూపతి రచితము? అని పాఠకులకు సందేహము కలుగును.

రచయిత నిరాధారముగా నీవిషయమును తన గ్రంథమునందు చొప్పించ లేదు. ఆనంద రామాయణము నందు

"నలమాజ్ఞాప యామాస సేత్వర్థం రఘునందనః।
సేతు మారభ మాణస్తు విఘ్నేశం స్థాప్య రాఘవః॥
నవగ్రహాణాం పూజార్థం పాషాణాన్నవ సాదరం।
నల హస్తేన సంస్థాప్య పూర్వం తత్ర మహోదధౌ॥2

అని శ్రీరాముడు విఘ్నేశ్వరుని స్థాపించినట్లు కనబడుచున్నది.

దీనిని బట్టి మొదటి ద్విపదలు రచయిత వనవలెను. కాని ఇవి తరువాత ద్విపదలతో సరిగా అన్వయమును కలిగించుచు లేవు. చూడుడు :—

"రామచంద్రుండను రాజు గణేశుఁ — దామది లోపలఁ దలచి మ్రొక్కుచును

అనునది తరువాతిదైన

ఆరయోజనంబైన యద్రి సుగ్రీవు — డురవడి గొనివచ్చి యుర్వర వగుల"3

అను ద్విపదతో సరిగా నతుకుచు లేదు. "మ్రొక్కుచును" అనునది శత్రర్థ చువర్ణ కాంతమైన అసమాపక క్రియ "ఉరవడి గొని వచ్చి" అనునది భూతకాల క్త్వార్థక-అసమాపక క్రియ ఈ రెండింటికిని "కర్తృఏకత్వము" సమన్వయము కుదురును, కాని భిన్న కర్తృక మగుటచే అతుకుల బొంతగా రచన యేర్పడినది. ఇచ్చటి రచనయు సాఫీగా సాగలేదు "రామచంద్రుండను రాజు గణేశు" అనుచోట "అనురాజు" అనునది యతి కొఱకు ప్రాకులాడి వేయబడినట్లు తోచును.

---

1. రంగనాథ రామాయణము. (ఆంధ్ర విశ్వకళా పరిషత్తు వారి ప్రతి.) అనుబంధము. 2. పుట.. 753.
2. ఆనంద రామాయణము. సారకాండము సర్గ. 10 శ్లో. 69-70
3. రంగనాథ రామాయణము యుద్ధకాండ ద్వి. 1003.

"తామది లోపలఁ దలచి మ్రొక్కగను" (మ్రొక్కిన తరువాత) అని సవరించిన కుదురునేమో? దీనికి విజ్ఞులు ప్రమాణము.

ఇక, ఈ సందర్భమందు పాఠాంతర ద్విపదలు చక్కని సమన్వయముతో నొప్పుచున్నది.

"వానరులు చెట్లు దెచ్చి సముద్రమును బంధించగా నుద్యోగించినారు అపుడు సుగ్రీవుడు శ్రీరామ పాద కమలములకు నమస్కారము చేసి, పిదప ఫణిరాజ భూషణుడును పరమేశ పుత్రుడైన గణనాథునకు మ్రొక్కి అరయోజనంబైన పర్వతమును గొని వచ్చి నలుని చేతికీయగా నతడు దానిని సముద్రమునందు నిల్పినాడు"[1] అని సమన్వయార్థము.

కావున, "సుగ్రీవుడు గణనాథునికి నమస్కారము చేసినాడ"ని తేలును. డా॥ జి. నాగయ్య మొదలగు విమర్శకులు ఈ ద్విపదల నాదరించిరి.[2] కాని ఇవియు రచయితవి కావేమోనని తోచు చున్నది. ఇందు గణనాథునకు విశేషణములు "ఫణిరాజ భూషణుఁ, బరమేశ పుత్రు" అనునవి.

"విశేష్యంబునకుం బోలె విశేషణంబునకు లింగ విభక్తి వచనంబులగు"[3] అను నియమము ననుసరించి, "ఫణిరాజ భూషణునకు, పరమేశ పుత్రునకు గణనాథునకు" అని యుండుట లెస్స. లేక విశేషణములు ప్రథమాంతములయియు,[4] భవత్యర్థ కాను (అగు, అవు, అయి, ఐ, ఔ) ప్రయుక్తంబు లయియు[5] నుండవలెను. ఇచ్చట విశేషణములు ప్రథమాంతములు గాక, ద్వితీయాంతమునను, విశేష్యము షష్ఠ్యంతమునను గలవు. బుద్ధభూపతి యిట్లు తన గ్రంథమున నెచ్చటను వ్రాయలేదు. కావున ప్రక్షిప్తములేమో?

అట్లుగాక, బుద్ధారెడ్డియే ఆ ద్విపదలు వ్రాసినాడనినచో, గణనాథునకు నమస్కరించిన వారు శ్రీరామ-సుగ్రీవులలో ఎవరు? సుగ్రీవుడైన అంత ప్రాధాన్యము లేదు; శ్రీరాముడు కావలెను. కావున ఆనంద రామాయణాధారమున రచితములైన మొదటి ద్విపదలు రచయితవి. (రామ చంద్రుండను రాజు గణేశునికి మ్రొక్కుట.) అయినచో నిపుడు పరను వైష్ణవులైన, లేఖకులెవరో "రాముడు విఘ్నేశుని నమస్కరించినాడనుట సహింప లేకయు. తద్భావమును పూర్తిగా తొలగింప లేకయు పాఠాంతర ద్విపదలను వ్రాసి తత్ స్థానమునందు జేర్చినారని వాదింప వచ్చును.

గణపతి పూజ నాటికి, నేటికి తెలుగువారి ఆచారము. భారతీయులు ముఖ్యముగా తెలుగువారు ప్రతి కర్మకు ప్రారంభమునందు తద్విఘ్నోప శాంతికి విఘ్ననాథుని తప్పక పూజింతురు.

"గణానాంత్వా గణపతిగ్ం హవామహే కవిం కవీనా ముప మశ్రవస్తమం। జ్యేష్ఠరాజం బ్రహ్మణా

---

1. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి. 1001-1005.
2. డా జి.నాగయ్య, ద్విపద వాఙ్మయము.
3. పరవస్తు చిన్నయసూరి. బాలవ్యాకరణము. కారక పరిచ్ఛేదము. సూ. 19.
4. " " " " సూత్రము. 27.
5. " " " " సూత్రము. 28, 29.

బ్రహ్మణస్పత ఆనశ్శృణ్వన్నూతిభి స్సీద సాదనం॥"[1] అని గణనాథుని స్తుతి.

పరమ వైష్ణవులు గణపతిని గాక విష్వక్సేనుని గొలుతురు. ఇతని నామములలో "భక్తాంతరాయ విధ్వంసీ"[2] యనునది యొకటి. "గజాస్యముఖ సేవితః"[3] అనునది మరియొక్కటి. ఇవి అతని విఘ్న నివారణశక్తిని, గణపతి చేతను సేవ్య మానుడగుటను దెలుపు చున్నవి

శుక్లాంబర ధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం।
ప్రసన్న వదనం ధ్యాయే త్సర్వ విఘ్నోప శాంతయే॥"

అనునది ప్రతికర్మ ప్రారంభమున అనూచానముగా పురోహితులచే పఠింపబడు పౌరాణిక శ్లోకము.

రాముడు దేవుడైనను, మానవుడై ఉత్తమ మానవాను కరణము చేసినాడు. కావున రచయిత అతనిచే గణేశుని ప్రార్థింపఁ జేసినాడు; లేదా పాఠాంతరము నందున్నట్లు సుగ్రీవునిచే నమస్కరింప జేసినాడు. ఎవరు చేసినను ఎవరిచే చేయించినను, "కర్మాదియందు తెలుగువారు గణేశ పూజాదులను విఘ్నోప శాంతికై చేయుదురు." అనెడి సాంఘికాచారమును సందర్భమును పురస్కరించుకొని రచయిత చొప్పించినాడని తృప్తిపడుట తర్జన భర్జనలకు తావు లేకుండ చేయును.

ఇక తెలుగు దేశమున ప్రత్యేక కార్యములందు తప్ప, ప్రతి పని యందును నవగ్రహా రాధనము జరుగదు. కావున వాల్మీకమున లేక, ఆనంద రామాయణము నందున్న నవగ్రహ స్థాపనమిట వదలి వేయబడినది

బుద్ధ భూపతి దండయాత్రకేగునపుడు విఘ్ననివారణ విజయప్రాప్తులకై గణనాథుని అర్చించువాడేమో! ఇతడు శ్రీరామునిచే గణపతిని మ్రొక్కించి, రామేశ్వర లింగ ప్రతిష్ఠాపన చేయించి ఇతర మతములయెడ సౌమనస్య బుద్ధిని ప్రకటించి. హరిహరనాథ తత్త్వమును ప్రతిపాదించి ప్రచారము చేసినవారికి మార్గదర్శకుడైనాడు ఇది అతిశయోక్తి కాదేమో!

9. గొడుగుల వృత్తాంతము :—

అంగద రాయబారము తరువాత "రావణుడు శ్రీరామచంద్రునికి తన వైభవమును జూప దలచి, కిరీటాద్యనేక కామూల్యాభరణాదుల నలంకరించుకొని, ఉత్తర గోపురంబునకు వచ్చి పఠవీర్చెను. ఎనుబదివేలమంది దనుజులు తెల్లని గొడుగులు పట్టిరి. అన్నివేల మంది చెలులు వ్యజనములు పూనిరి. అంతే సంఖ్యగల కాంతలు చామరంబులు దాల్చి ఇరుప్రక్కల వీవ దొడంగిరి. గీత నృత్యములు చెలరేగెను.

ఆ సమయమున శ్రీరాముడు సుగ్రీవుని తొడపై నొరగి, ఆంజనేయుడు తన తొడలపై చాచిన శ్రీరాముని పాదముల నొత్తుచుండ, దక్షిణముఖుడై పరుండి యుండి విభీషణునితో "అత

---

1. వేదమంత్రము. (గణపతి ప్రార్థన. వైదిక పూజావిధానము.)
2, 3. విష్వక్సేనుని షోడశ నామములు. (విష్ణు కల్యాణ విధానము. భట్టీయము.)

దెవ్వడ"ని యడిగెను. "రావణుడు మీకు స్వీయ వైభవమును జూపఁదలచి గోపురోపరి సీమ నారీతి కొలువై యున్నాడ"ని విభీషణుడు సమాధానమొసంగెను. అప్పుడతడు లక్ష్మణుడందీయగా ధనుస్సుపై అర్ధ చంద్ర బాణమును సంధించి, ప్రయోగించెను అది తచ్చామర, వ్యజన, దవళాత పత్రముల నన్నింటికన్ని రూపులైపోయి ఖండించెను. రావణుడు శ్రీరాముని విలువిద్య పెంపుగాంచి, తలలూచి, అతనిని మిక్కిల స్తుతించెను.

ఈ విషయము రంగనాథ రామాయణము యుద్ధకాండములో

"వీనుల కరుదుగా విని దశాననుడు-భానుజాదులకును భయము పుట్టంగఁ

దన వైభవము రామ ధరణీశ్వరునకు-ఘనముగాఁజూపెదఁ గాకంచుఁదలచి

——————————మొదలుకొని——————————

ఆ రాఘవుడు కరుణాంబునిధి గాన-ఘోరబాణంబున గొడుగులఁ ద్రుంచె

నిటు వంచి ద్రేసిన నింద్రటి తలలు-పటురయంబున నుచ్చి పాఱదే యనిరి"[1]

అనుదాని వరకు సుమారు 100 ద్విపదలలో గలదు.

వాల్మీకి రామాయణ దాక్షిణాత్య, పశ్చిమోత్తర శాఖీయ, గౌడీయ ప్రతులలో నిది కానిపించదు కావున అవాల్మీకము. కాని కవి కల్పన మాత్రము కాదు. అధ్యాత్మరామాయణములో

"ప్రాసాదాగ్రే సమాసీనః పశ్యన్ వానర సైనికాన్।

యుద్ధాయాయోజయత్ సర్వ రాక్షసాన్ సముపస్థితాన్"

రామోఽపిధనురాదాయ లక్ష్మణేన సమాహృతం।

దృష్ట్వారావణ మాసీనం కోపేన కలుషీకృతః॥

కిరీటినం సమాసీనం మంత్రిభిః పరివేష్టితం।

శశాంకార్ధ నిభేనైవ బాణేనైకేన రాఘవః॥

శ్వేతచ్ఛత్ర సహస్రాణి కిరీట దశకం తథా।

చిచ్ఛేద నిమిషార్ధేన తదద్భుత మివాభవత్॥

లజ్జితో రావణ స్తూర్ణం వివేశ భవనం స్వకం।"[2]

అని ఛత్రచ్ఛేదన వృత్తాంతము సంగ్రహముగా ప్రస్తావింపబడినది. ఆనంద రామాయణమునందును నిది సూచింపఁబడినది.[3] బుద్ధభూపతి అధ్యాత్మానంద రామాయణము లాధారముగా నీ విషయమును గ్రహించి, తన యమోఘ వర్ణనాచాతుర్యముతో స్వీయమనునట్లు పెంచి, శ్రీరామ దశకంఠ పాత్రల శీల స్వభావములు వ్యక్తమగునట్లు ఔచిత్యమునకు భంగముకాని రీతి రచించి, పాఠకుల కాశ్చర్యానందములను గలిగించినాడు. ఇట్లు వ్రాయుటలో కవి కొన్ని ప్రయోజనములను కాంక్షించినాడని పరిశీలించిన తెలియుచున్నది

---

1. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి. 2110-2213.
2. అధ్యాత్మ రామాయణము. యుద్ధకాండము. సర్గ. 5 శ్లో. 41-45.
3. ఆనంద రామాయణము. సారకాండము. సర్గ 10 శ్లో. 245, 246.

1. అహంకార స్వరూపుడైన రావణుని యహంభావమును వెల్లడించుట.

సుగ్రీవాదులకు భయము పుట్టునట్లు తన వైభవము శ్రీ రామునికి ఘనముగాఁ జూపెదనని తలంచి తదను గుణముగా అనేకామూల్య వస్త్రాభరణాదుల ధరించి ఆసనముపై విరాజిల్లుట. అనేకులు ఛత్రచామర వ్యజనాదుల ధరించుట. నృత్తగీత వాద్య సంరంభము; ఇత్యాదులద్వారా యతని యహంభావ వైభవము వ్యక్తము కావింపఁబడినది.

2. శ్రీరాముడు తనను సామాన్య నరునిగా తలచు రావణునకు కనువిప్పు కలిగించుట

శ్రీరాముని ఒకే యొక అర్ధచంద్రాకార బాణము తచ్చామర, వ్యజనచ్ఛత్ర కిరీటాదుల ఖండించుట ద్వారా రావణుని యహంభావమణగి, జ్ఞానోదయమైనది. రాముని అస్త్ర విద్యా నైపుణ్యము గాంచిన దశగ్రీవుడు పశ్చాత్తప్తుడై శ్రీరాముని శరణాగతి పొందవచ్చును శ్రీరాముడు దశగ్రీవాదుల తలలు దీయక కేవలము ఛత్రాదులను మాత్రమే ఖండించుట అతని కారుణ్యమును వ్యక్తీకరించుట; తెలిసినను రావణుడు శరణాగతి పొందకుండుట అతని మూర్ఖత్వమును ప్రకటించుట.

3. రుద్రాంశజుడైన ఆంజనేయునిచే శ్రీరాముని పాదారవిందముల నొత్తింపజేయుట-1 శివ సేవిత పాదార విందుడు నారాయణావతారుడైన శ్రీ రాముడే దేవాధి దేవుడని భంగ్యంతరముగాఁ దెల్పుట,

4. రావణుడంత నీచుడుగాదు; ఇతరుల గుణాగుణములను గ్రహించు నేర్పరి. శత్రువైనను శ్రీరాముని అస్త్ర విద్యా నైపుణ్యమును మెచ్చుకొనినాడు.

"నల్లయో రఘురామ నయనాభిరామ-విల్లువిద్య గురువ వీరావతార

— — — — — —

బాపురే రామభూపాల లోకముల-నీయట్టి విలుకాడు నేర్చునే కలుగఁ

బాటించి పురములపైఁబడ్డ హరుని-యేటొప్పు-ఁ గడిది నీ యేటొప్పుఁగాక

— — — — మేటి శూరుల పెంపు మెచ్చంగ వలదె"

అని ఇట్లు కవి రావణుని శీలమునకు వన్నెపెట్టి "అతడితరుల గొప్పదనమును గ్రహించునంతటి వివేకి" యని సాధించినాడు,

ఇచ్చట చాలామంది విమర్శకుల 3 "బుద్ధారెడ్డి వాల్మీకికన్న యీ విషయమున నొక యడుగు ముందుకు వేసి సందర్భోచిత్యముగా రావణుని పాత్రను దీర్చినాడ"ని మెచ్చుకొన్నారు. అట్టిమాట వాస్తవమే.

వాల్మీకి రామాయణమునందు "రామబాణములకు మూర్ఛాక్రాంతుడైన రావణుని యుద్ధము నుండి తప్పించుటకు అతని సారథి రథమును ప్రక్కకు దోలెను. రావణుడు మూర్ఛ నుండి తేరుకొన్న వాడై సారథిని ఛీవాట్లు పెట్టుచు

---

1. రంగనాథ రామాయణము. యుద్ధకాండము ద్వి 2146-2148.
2. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి 2194-2208.
3. డా॥ పింగళి లక్ష్మీకాంతం. ఆంధ్ర సాహిత్య చరిత్ర. పుట. 184.

"శత్రోః ప్రఖ్యాత వీర్యస్య రంజనీయస్య విక్రమైః।
పశ్యతో యుద్ధ లుబ్ధోఽహంకృతః కాపురుషస్త్వయా।"[1]

అని పలికెను." ఇందితడు రాముని పొగడినట్లు ధ్వనించుచున్నది.

శ్రీరామునకు బలవత్తర శత్రువు రావణుడు. అట్టి శత్రువు శ్రీరాముని ఎక్కడను ప్రస్తుతించినట్లు వాల్మీకి వ్రాసిన వాడుకాడు. కావున మూలమునందలి ఈ విశేషణము "శత్రోః ప్రఖ్యాత వీర్యస్య రంజనీయస్య విక్రమైః" అనునది అజాగళస్తనము వలెనుండి పోయినది.

శ్రీరామాయణ రహస్యములను గుర్తించిన వాడైన రంగనాథ రామాయణ కర్త ఆనంద, ఆధ్యాత్మ రామాయణాధారమున గోడుగుల వృత్తాంతమును గల్పించి, వానిని శ్రీరాముని చేఁదెగవేయింపఁజేసి, రామ పరాక్రమమును దశగ్రీవునిచే ప్రస్తుతింపఁ జేసినాడు. ఇది మూలమునకు మెఱుగు పెట్టుట.

(10) ఇంద్ర జిద్వధోపాయము :—

ఇంద్రజిత్తు నికుంభిళాహోమము చేయుచుండెను. విభీషణుడు శ్రీరాముని సాంత్వన పఱచి,

"మేఘనాధుని నికుంభిళా హోమము నిర్విఘ్నముగా పరిసమాప్త మాయెనా! అతనిని సంహరింప వాసవాదులకును తరముగాదు. బ్రహ్మ వలన నతడు బ్రహ్మ శిరోనామకాస్త్రమును కామగములైన తురంగములను బడసినాడు. ఇంతేకాకుండ "నికుంభిళా హోమమును చెఱచినవాడే ఇంద్రజిత్తును సంహరింప గలడు కావున తత్సంహారమునకై లక్ష్మణుని ససైన్యముగా మాతో పంపవలసినదని శ్రీరామున కుపాయము చెప్పెను."[2]

బుద్ధారెడ్డి ఈ విషయమును యథామూలముగా,
"దనుజు డాసుర హోమ తాత్పర్య బుద్ధి — జనులకునై యిట్టి చందంబు చేసె
... ... మొదలుకొని... ...
నీవు నికుంభిళ నెఱయ హోమంబు — గవించితేని నేగఁగ నజేయుడవు
కావించు హోమంబు గడమగునేని — రావణాత్మజ। నీవు రణము లోపలను
బగఱచేఁ బడుదని పలికినవాడు;"[3]

అనుదాని వరకు సుమారు 20 ద్విపదంలో అనువదించినాడు.

ఇంతేకాక, కవి ఇచ్చట అవాల్మీకమైన పూర్వ వృత్తాంత మొకదానిని చొప్పించినాడు అది యిట్లున్నది.

ఇంద్రజిత్తు తొల్లి శివునితో తనను యుద్ధమున గెల్చు వాడెవడని యడిగెను. అంతట సదాశివుడు

1. దా. ప్రతి. రామాయణము. యుద్ధకాండము. సర్గ. 106 శ్లో, 6.
2. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. యుద్ధకాండ. సర్గలు. 84, 85.
3. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి. 5411-5430.

"పదునాలు గేండ్లును బగలును రేయు-నిదుర యాహారంబు నెఱిలేని యట్టి
సదయుండు నిను గెల్చు సమర మధ్యమున"

అని పలికి యంతర్ధాన మొందెను. దీనిని విని రాముడు చింతించుచుండ లక్ష్మణుడు చేతులు మోడ్చి

పై దేహతోఁ గూడ వసుమతీనాథ — పాదపు వగతోడఁ బవళించి నిద్రఁ
బోవుచు నుండ నేఁబొసగ నశవుఁ — గావలియై మిమ్ముఁ గాచి యుండగను
అపుడు నిద్రాదేవి యాచహించి నను — ఇవుడు నంజేరకు మిందీవరాక్షి
యేనయోధ్యాపురి నెమి నున్నపుడు — పూని రమ్మిపుడు పొమ్మనఁ జనియె.
అదిగాన నిద్రలే దహరహంబులను — పదపడి మీకేను ఫలములు దేను
పొలుపొందు వనములఁ బూనియు వెదకి — ఫలములు గైకొని పఱతెంచి మీకు
నెలమి సర్పించుట నింరియే కాని, — యలర నే భుజియించినది లేదు దేవ,
ఇది దైవ ఘటనచే నిటు సంభవించె — పదపడి ననుఁ బంపు పగఱ నిర్జింతు."

నని మ్రొక్కి నిలిచెను.

ఈ విషయము వావిళ్ళ, రాయల్ ఆండ్‌కో ప్రతులందు లేదు. ఆంధ్ర విశ్వకళా పరిషత్ ప్రతి పరిష్కర్తలచే నిది మూల పాఠమునందు కాక, అనుబంధము 2 (పుట-781) నందు చేర్చ బడినది. ఇదివరకు ముద్రిత ప్రతులందు లేక, వ్రాత ప్రతులలో నున్న దీనిని అనుబంధము 2లో చేర్చుట జరిగినది.

ఇది మూల పాఠము నందుండుట సమంజసము. ఈ ద్విపదల శైలి రంగనాథ రామాయణ కర్త శైలి వంటిదే. యతిప్రాస గణభంగాది దోషములు లేవు. మీదు మిక్కిలి అయోధ్యా కాండము నందలి—

ఆరాత్రి నిద్ర మాయారూపు దాల్చి — ధీరుడా లక్ష్మణ దేవునిఁ జేరి
.. ..
అలయుచు నే దేవతాను గ్రహంబు — గలిగె నాకనుచు లక్ష్మణ దేవుడంటి"[1]

యనెడి నిద్రా లక్ష్మణ సంభాషణమునకు చెందిన ద్విపదలకును, యుద్ధకాండము నందలి

"అప్పుడు సౌమిత్రి ననురక్తి తోడ — నొప్పు నిద్రాదేవి యొగిఁ బొందుటయును."[2]

అను ద్విపదల యందలి "కొలువులోపల నున్న లక్ష్మణుని నిద్రనావరించినదని" చెప్ప బడిన విషయమునకును సంబంధమున్నది. పూర్వాపర సందర్భమునకు తగియుండిన సౌమిత్రి నిద్రాహార విసర్జనము ఇంద్రజిత్సంహారమునకు కారణ భూతమై, యొక విశిష్ట ప్రయోజనమును వెలార్చుచున్నది. కావున ప్రక్షిప్తము కాదు.

జన వ్యవహారమునందును "14 సంవత్సరములు నిద్రాహారములు మానిన వాని చేతిలోనే

---

1. రంగనాథ రామాయణము. అయోధ్యా కాండము. ద్విపద. 1056-1061.
   (ఇవి ఆం. వి. క. ప. ప్రతిలో 1వ అనుబంధమున జేర్చబడినవి.)
2. రంగనాథ రామాయణము. యుద్ధకాండము ద్వి. 8826.

ఇంద్రజిత్తు మరణించును. ఇది లక్ష్మణునిచే పాటింపబడినది. కావున అతడే ఇంద్రజిత్తును సంహరించె"నని కథలుగాఁ జెప్పుకొనబడుచున్నది.

ఈ అవాల్మీక వృత్తాంతము ఆనంద-ఆధ్యాత్మ-వాసిష్ఠ రామాయణములందు ఈ షద్భేదముతో జెప్పబడినది.

వాసిష్ఠ రామాయణమునందు-"బ్రహ్మ మేఘనాదుని తపమునకు మెచ్చి వర మొసంగి,

"చతుర్దశ చ వర్షాణి నిద్రాహార వివర్జితః।
శ్వశురాంశాత్తే తు జాతః తేన నాశో భవేత్తతః॥"

అని పలికి అంతర్ధానము చెందినట్లు కలదు. ఇందు రావణిని చంపుట కర్తృతయు చంపువాడును నిర్దేశింపబడినాడు. ఆనంద రామాయణమునందు—

"యస్తు ద్వాదశ వర్షాణి నిద్రాహార వివర్జితః।
తేనైవ మృత్యుర్నిర్దిష్టో బ్రహ్మణా సురాత్మనః॥
లక్ష్మణోఽయం యదాఽయోధ్యా పుర్యాస్త్వామను నిర్గతః।
తదాది నిద్రాహారాదీన్ న ప్రాప్తః సరఘూత్తమ ॥
సేవార్థం తవ రాజేంద్ర జ్ఞాతం సర్వమిదం మయా॥"[1]

అని విభీషణుడు లక్ష్మణుని నిద్రాహార విసర్జనమును, మేఘనాద వధోపాయమును జెప్పియున్నాడు.

అధ్యాత్మ రామాయణమునందివే శ్లోకములు[2] కొలది పద భేదములతో నొప్పుచున్నవి.[3]

ఈ రామాయణములందుఁ జెప్పబడిన విషయ సారాంశము

1. కొన్నింటిలో 12 సంవత్సరములనియు, మరి కొన్నింటిలో 14 సంవత్సరము లనియు రెండు విధముల నుండుట.
2. వర మొసంగినవాడు బ్రహ్మదేవుడు.
3. లక్ష్మణుడు నిద్రాహార వర్జితుడు, శేషాంశ సంభూతుడు, కావున నతడు మేఘనాదుని చంపగలడని విభీషణుడు శ్రీరామునకు నివేదించుట

బుద్ధారెడ్డి పై విషయములో చిరు మార్పులు చేసినాడు.

1. 14 సంవత్సరములని సంఖ్యను నిశ్చితముగా నిర్దేశించుట,
2. వరమొసంగిన వాడు బ్రహ్మగాక శివుడగుట.
3. విభీషణుడు 'లక్ష్మణుడు నిద్రాహార వర్జితుడ'ని శ్రీరామునకుఁ దెలుపుటకు బదులు

---

1. ఆనంద రామాయణము; సారకాండము. సర్గ. 11, శ్లో. 176-178.
2. అధ్యాత్మ రామాయణము. యుద్ధకాండము. సర్గ. 8, శ్లో. 64-66.
3. "యస్తు ద్వాదశ వర్షాణి" కి బదులు "యశ్చతుర్దశ వర్షాణి" అని పాఠాంతరమున్నట్లు రామాయణ సారోద్ధారము-యుద్ధకాండము.
ద్వితీయ భాగము. పుట 412లో నుద్ధృతమైన శ్లోకములు దెలుపు చున్నవి.

స్వయముగా సౌమిత్రియే తన సంగతిని విన్నవించి తనను సమరమునకుఁ బంపుమని కోరుట.

ఈ మార్పులు పరిశీలింపగా ఔచిత్య వంతములనియె తెలుచున్నవి.

1. 12 సంవత్సరములని యుండుటే సముచితము. 14 సంవత్సములని చెప్పినచో, అప్పటికి 14 సంవత్సరములు నిండ లేదు కదా! కొలది దినములైనను తక్కువగా నుండును. కావున వ్రత సమాప్తి కానిది ఫలసిద్ధి యెట్లు కలుగును? ఇంద్రజిత్తెట్లు సంహరింప బడినాడు?" అని ఆక్షేపము కలుగుచున్నది

ఈ ఆక్షేపము సమాధేయ మగుటకు జ్యోతిశ్శాస్త్ర పరిచయ మిచట అవసర మగును.

"వేదాంగమగు జ్యోతిశ్శాస్త్రమునందు ఐదు విధములైన మానములు గలవు

1. సౌరమానము. 2. బార్హస్పత్యమానము 3. సావనమానము. 4. చాంద్ర మానము. 5. నాక్షత్ర మానము.

సంవత్సరమునందు వీనికి క్రమముగా

"1-365 దినములు, 15 ఘడియలు 31 విఘడియలు, 31 పరలు, 24 లవలు.

2-361 దినములు.

3-360 దినములు-అధిక మాసమున నరవది దినములు క్షయ మాసమున రెండధిక మాసములు.

4-354 దినములు. అధికమాసమున దినాధిక్యతతో గూడి 366 దినములు.

5-324 దినములు,"

ఉండునని "సూతుల, పాతాళ, అతల, విమల నరాంగాశ్చ వత్సరాః పంచ" అనెడి సూత్రమున జెప్పబడినది.

"ఆయుర్దాయ విభాగశ్చ ప్రాయశ్చిత్త క్రియాశ్చహి।
సావనేనైవ కర్తవ్యా గార్గ్యస్య వచనం యథా॥
తిథిః కరణ ముద్వాహః క్షౌరం సర్వక్రియాతథా।
వ్రతోపవాస యాత్రాద్యా క్రియాచాంద్రేణ గృహ్యతే॥"

అను శాస్త్ర వచనములను బట్టి శ్రీరాముడు పితృవాక్య పరిపాలన వ్రతమును చాంద్రమానము ననుసరించి చేసినాడనియు, గార్గ్య మతముచే సావనమానము ననుసరించి ఆయుర్దాయ విభాగము లెక్కింపగా, లక్ష్మణుడు లంకకు వచ్చుటకు పూర్వమే పదునాల్గు వత్సరములు పూర్తియైనవనియు, చెప్పుట సమంజసము; సమయోచితమును. నాక్షత్రమానము ననుసరించి పరిశీలించినను 14 సంవత్సరములు లంకకు వచ్చుటకు పూర్వమే పూర్తియైనవి."[1] ఇక ద్వాదశ వత్సరములనినచో ఆక్షేపమున కవకాశమే యుండబోదు

కావున బుద్ధారెడ్డి జ్యోతిశ్శాస్త్ర విషయమును ప్రజలకు తెలుపుటకో యనునట్లును, లోక ప్రచారమును, వాసిష్ఠ రామాయణ ప్రభావమును పురస్కరించుకొని 14 సంవత్సరములు గ్రహించినాడనుట సబబు

---

1. ములుకుట్ల నరసింహావధాని "రామాయణ సారోద్ధారము" యుద్ధకాండము-ద్వితీయ భాగము, పుటలు 426-437

2. రావణాదుల యిలవేల్పు శివుడు. ఇంద్రజిత్తు సాక్షాత్తు శివ సాన్నిధ్యమునకుఁ బోయి వచ్చునంత శక్తియు, భక్తియు గలవాడు. సందర్భవశమున నెన్నడైనను ఇంద్రజిత్తు తన మరణమును గూర్చి మహాదేవు నడుగుటయు, సర్వజ్ఞుడు సంహారకర్తయునగు శంకరుడు చెప్పుటయు సంభావ్యములే. బ్రహ్మను గూర్చి తపముచేసి, బ్రహ్మాస్త్రమును, కామతురంగ యుక్త దివ్యరథ మును మాత్రము పడసినాడు, తన వధ విషయ మతనితో నడుగుటగాని, అతడు చెప్పుటగాని తటస్థించదు. అతడు చెప్పినను, అది సంహారకర్తయగు శివుని చేతిలోనిదే; కావున శివ సంకల్పము లేక యది ఘటిల్లదు. "శివుని యాజ్ఞలేక చీమైనా కుట్టదుకదా!" అందువలన ఇంద్రజిద్వధ గూర్చి బ్రహ్మకు బదులు శివుడు చెప్పినట్లు కవి మార్చుట మిగుల ఔచిత్యవంతము —

3. లక్ష్మణుడు నిద్రాహారములను మానినట్లు విభీషణుడు చెప్పుటకంటె, సౌమిత్రియే తనంతట తాను తత్కాలమునఁ జెప్పుట సముచితము. దీనివలన తన నడవడిని గుట్టుగా నుంచు శక్తి లక్ష్మణునకు గలదని తెలియు నట్లుగాక విభీషణునిచే చెప్పించిన "ఇది విభీషణున కెట్లు దెలిసినది? రామునకుఁ దెలియదా?" అను ప్రశ్న యుదయించును. లక్ష్మణుడెప్పుడైనను విభీష ణున కీ విషయము దెలిపియుండవలెను. అట్లు చెప్పినట్లు కథయం దెక్కడను లేదు. ఆధ్యాత్మ రామాయణములో—

"త్వత్తశ్శ్రుతం మాయాపూర్వం తన్నిబోధ రఘూద్వహ,"

అను అధిక పాఠ శ్లోకభాగము నంగీకరించినను, ఇచట విభీషణునిచే చెప్పించుటకంటే లక్ష్మణుడు తన సంగతి తాను చెప్పుటయే సమంజసము. "విభీషణుని మాటలను విని, లక్ష్మణుడు తనయం దా యోగ్యత యున్నట్లు విన్నవించి, ఇంద్రజిద్వధ కుత్సాహమును కనబరచినాడు. రాముడు సంతసించి, విభీషణుని తోడ్పాటున తమ్ముని వానరులతోఁ గూడ మేఘనాద వధకు పంపించినాడ"ని సంభాషణౌచిత్యము తేటతెల్లమగును.

ఈ అవాల్మీక విషయమును ఇచట జొప్పించుట వలన కవి సాధించిన ప్రయోజనములు.

1. ముఖ్యాతి ముఖ్యులైన రాక్షసుల వధకు ఏదో యొక బలవత్తర కారణ ముండి తీర వలెను రావణ వధకంటె రావణి వధ కష్టసాధ్యము పట్టాభిషేకానంతరము శ్రీరామదర్శనార్థము వచ్చిన అగస్త్యాది మునులు "రావణునికన్న రావణి వధను జేయించి ప్రశంసాపాత్రుడవైతి"వని స్తుతించుటను జూడగా, ఇంద్రజిద్వధయే లోక కల్యాణమునకు మూలమని తెలియు. అతని వధకు "నికుంభిలా హోమ విఘ్నమే" కారణమగు నదట అంత సరియైనదిగా ఆకర్షణీయమైనదిగా కనబడదు. మహోన్నతమైన ప్రత్యేక కారణమేదియైన నుండి, అది యితరులకసాధ్యమైనది కావలెను. అప్పుడే యది మాననీయమగును. తత్సంహారకుడు సర్వలోక పూజ్యుడగును. కావున అది 14 సంవత్సరములు నిద్రాహార వర్జితుడై యుండుట కారణజన్ముడైన లక్ష్మణునికి అనుకో కుండగనే తటస్థించిన దనుట.

2. రామునికంటె లక్ష్మణునికి ప్రాధాన్య మొసంగుట రెండవ ప్రయోజనము. ఒకవేళ దైవికముగా లక్ష్మణుడీ శపథమును బూని చతుర్దశ వత్సరములు నిద్రాహార వర్జితుడుగా లేకపోయి నచో, ఇంద్రజిత్సంహారము జరుగదు. అతని వధ జరుగనిచో, దశగ్రీవుడు సంహరింపబడడు. రాముని జయమంతయు రావణి వధపై యాధారపడి యున్నది. అట్టి మేఘనాదుని జంపిన సౌమిత్రి

చతుర్దశ వత్సరములు రామసేవకై నిద్రాహారములు మానిన ధన్యుఁడుగదా యని చెప్పుట తలంపు. ఇంతేకాక "భగవంతుని కంటె భక్తుడు గొప్పవాడని ప్రకటించుట" దీని అంతరంగ తాత్పర్యము.

1. శ్రీరాముడు స్వయముగా లక్ష్మణునితో—

"ప్రియః ప్రాణసమో వశ్యో భ్రాతాచాసి సఖాచ మే॥

అని పల్కుటయు, (అయోధ్యా- సర్గ-31 శ్లో. 10)

2. సుమిత్రాదేవి శ్రీరామునితో లక్ష్మణుని గూర్చి

"త్వయాఽపి పుత్ర రక్ష్యోఽయం లక్ష్మణ శ్శత్రు కర్శనః।

భక్తోఽనురక్తోఽనుగతో భ్రాతా భృత్యః సుహృచ్ఛ్రుతే॥"

అని చెప్పుటయు, (ప ఉ. ప్రతి అయోధ్యా సర్గ-43 శ్లో 13)

3. లక్ష్మణుడును హనుమంతునితో

"అహ మస్యావరో భ్రాతా గుణై ర్దాస్య ముపాగతః।"

అని తననుగూర్చి చెప్పుకొనుటయు, సౌమిత్రి భక్తుడనుట కాధారములు.

శేషుని చేతనే శేషికి ప్రాధాన్యము; భక్తుని చేతనే భగవంతునికి గొప్పదనము; ఇతడు లేనిచో పరమాత్మ మహిమ ప్రకటితము కాకయే యుండును.

ఇంతేకాక "తండ్రికన్న కుమారుడు గొప్పవాడు. అతని యెడఁద జూచుకొని దశాస్యుడు విఱ్ఱవీగి రామతత్త్వమును గ్రహింపలేకపోయినాడు అతని సంహారముతో రావణుని కుడి భుజమే పోయినట్లయినది" అనియు తెల్పినట్లయినది కావున భక్త ప్రాధాన్యము, పుత్రౌన్నత్యమును దెలుపుటయే ఈ విషయమును జొప్పించుటలోని ముఖ్యోద్దేశ్యము.

2) సులోచనా వృత్తాంతము :—

ప్రధానమైన అవాల్మీక గాథలలో నిది రెండవది సులోచన ఆదిశేషుని కూతురు; ఇంద్రజిత్తు భార్య; లక్ష్మణహతుడైన తన పతితో సహగమన మొనర్చి పాతివ్రత్యమును ప్రపంచమున వెలిగింపఁజేసిన పరమ సాధ్వీ రత్నము. వాల్మీకి రామాయణములో ఏ ప్రతి యందును సులోచన పేరైనను కనిపించదు. ఇది కొన్ని రంగనాథ రామాయణ ముద్రిత ప్రతులందు[1] ప్రకటింప బడినది; కాని ఆంధ్ర విశ్వకళాపరిషత్తువారి సంశోధిత ముద్రిత ప్రతియందు ఇది మూలపాఠము నుండి తొలగింపబడి 1వ అనుబంధమునఁ జేర్చబడినది ఇదిగాక, వ్రాత ప్రతులలో లభించిన మరి రెండు రచనాంతరములు రెండవ అనుబంధమున ముద్రితములైనవి. ఈవిధముగా మనకు సులోచన గాథ మూడు పాఠములుగా నుపలభ్యమగుచున్నది.

1. ప్రాత ముద్రణములలోనుండి వ్రాత ప్రతులలో కానరాని 162 ద్విపదలతోఁ గూడిన లఘు గ్రంథము (ఆం.విశ్వక.ప. ప్రతిలో నిది 1వ అనుబంధమునఁ జేర్చబడినది).

---

1. రాయల్ అండ్ కో. ప్రతి. యుద్ధకాండము. ద్వి. 5835—5996 మరియు వావిళ్ళ ప్రతి పుటలు. 411-415.

2. పూర్వ ముద్రణములలో లేక కొన్ని వ్రాత ప్రతులలో మాత్రముండిన సుమారు 1366 ద్విపదలు గల గురుగ్రంథము. ఇది మొదటి దానికి 8 రెట్లు పెద్దది.

3. మూలమునందు ముద్రితమైన మొదటి లఘుపాఠమునకు రచనాంతరము. ఇందు 132 ద్విపదలు గలవు.

(ఇందలి 2, 3 పాఠములు ఆం.వి.క.ప. ప్రతిలో రెండవ అనుబంధమునఁ జేర్చబడినవి.)

ఈ త్రివిధ భిన్న పాఠములలో నే యొక్కదానిని గూడ మూల పాఠమునందుఁ జేర్చక, మూడింటిని తొలగించుటలో ఆ వి.క.ప ప్రతి పరిశోధకుల యుద్దేశ్యము 'ఇది రంగనాథ రామాయణ కర్తది కాదనుకొనుట." అయినచో, 'అత డీ కథనే వ్రాయలేదా? లేక వ్రాసినది మనకు లభింప లేదా ?' అని సందేహము కలుగకమానదు.

డా. కట్టమంచి రామలింగారెడ్డిగారు "పూర్వ ముద్రిత ప్రతి సంపాదకులు నిరాధారముగా దీనిని ముద్రించలేదనియు, వారికి లభించిన ప్రతి (ప్రతులు) నేడు లభింపనందున ఇది మాతలేని సంతాన మనుటకు వీలులేదనియు, శైలిలో బుద్ధకృత మట్లున్నదని నా యభిప్రాయమనియు"[1] నుద్ఘోషించి యున్నారు.

డా. పింగళి లక్ష్మీకాంతంగారు- ఈ రమణీయ గాథ అనుబంధమున గాక, ప్రధాన గ్రంథ మునఁ జేరియుండవలసినది...... ఒకటవ యనుబంధములోని కథారచన పథాన గ్రంథ రచనకు ననుగుణముగా నున్నదికాని, అన్యకర్తృక మనిపించుట లేద"ని[2] కట్టమంచివారి యభిప్రాయముతో నేకీభవించిరి. అనగా 1వ అనుబంధమునఁ జేర్చిన సులోచనా వృత్తాంతము అసలు రచనలోనిదనియే వారి తలంపు.

కాని రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారు — "అచ్చులోని సులోచన కథ రంగనాథ రామాయణ రచనకన్న భిన్నముగాను, పలు విధములలో అపకృష్టముగాను కానవచ్చుచున్నది.... అసలు రచన చాల శుద్ధమైనది; బిగువైనది; మితి నెప్పుడును మీఱనిది; ధారాళమైనది. ఇక దీనియం దన్ననో యతి ప్రాస దోషములు, అన్వయ దోషములు అపశబ్దములు, పునరుక్తులు, సంప్రదాయ విరోధములు, వ్యర్థపదములు నిండియున్నవ"ని కట్టమంచి రామలింగారెడ్డి, పింగళి లక్ష్మీకాంతంగారల వాదమును ఖండించి, 1వ అనుబంధములోఁ జేర్చబడిన లఘుగ్రంథమునుండియే కొన్ని దోషములను ఎత్తి చూపిరి.

పరిశీలించిన మీదట రాళ్ళపల్లి వారి యభిప్రాయమే సమంజసమైనదని తోచుచున్నది.

---

1. అనుబంధ పీఠిక- పుట-(iv) రంగనాథ రామాయణము
(ఆం-వి-క-ప- ప్రచురణము మరియు పంచమి (వ్యాసము) పుట-11.

2. పీఠిక- పుట-20 రంకనాథ రామాయణము- (ఆం-వి-క-ప- ప్రతి)

3. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ- "సారస్వతాలోకము"
(రంగనాథ రామాయణము- వ్యాసము) పుట-90.

I లఘు గ్రంథ పరిశీలనాంశములు:—

A) యతి భంగములు :—

i) అరిగిన హరిహరాదుల కజేయుడవు- 'అలిగిన'యని సవరించిన ప్రాస యతియగును. అయిన 'ర-ల' కర్తకు సమ్మతమా?- సవరించనచో,'ర-ల'ప్రాస యతి సమ్మతమా?

ii) దేవత లంపిన జయలక్ష్మి రామ

iii) సంగర స్థలినున్న తరుచరాధిపులు

iv) భామకాదిది ధరాపుత్రియుఁ గాదు

v) చెప్పు మేర్పడ నీదు చందంబటన్న

vi) వెలయగ యోగ వియోగముల్ బ్రహ్మ

vii) తిర మొప్పగా నింద్రజిత్తు దేహంబు (స్థిరమని యున్న పొసగును)

viii) తలనిడి యా యింతి పతి కళేబరము (ధవు అని యున్న సరిపోవును).

ix) కదన భీకరుడు వాసవ భంజనుండు.

B) ప్రాసభంగములు :—

i) ఐన సులోచన యాత్మేశు చావు-విని చాల వగచుచు వివశత నొంది.

ii) అనిన నా దశకంఠు డతివ వీడ్కొలుప-మానినియును దన మామకు మ్రొక్కి.

ఇవి (ఐన-విని, అని-మాని) లఘుగురు పూర్వకములైన ప్రాస దోషములు.[1]

iii) తరమిడి యారామ ధరణీశు నాజ్ఞ — తలనిడి యాయింతి పతి కళేబరము.

(తర-తల) ర-ల ప్రాసము.

vi) కాక వేరొక దేవ కాంతయు నిందు — రాఁ గారణంబేమి రయమున ననుచు.

"క-గ," ప్రాసము.

(C) పునరుక్తులు :—

1) అంతఃపురంబున కటు చేర నరిగి — చింతించి తనమదిఁ జింతించి మరియు[2]

2) వెలయంగ యోగ వియోగముల్ బ్రహ్మ — వెలయంగఁ గల్పించె వెలది జీవులకు

(D) అన్వయ దోషములు :—

తరమిడి యారామ ధరణీశు నాజ్ఞ — తలనిడి యాయింతి పతి కళేబరము

---

1. ఇట్టిది అంగద రాయబార ఘట్టమునఁ గలదు.

"ఓరి యా వానరు డున్నాడొ లేదొ

వెరవారగా నాకు వివరించి చెప్పు. యుద్ధకాండము- ద్వి. 1034

ఆంధ్ర విశ్వకళాపరిషత్తువారి ప్రచురణములో నిది

"ఓరి యా వానర వీరు డున్నాడొ లేదొ

వీరత్వమునఁ జోక వివరింపుమనిన" అని సవరింపబడినది.

2. "చింతించి తనమది నిర్జించి మఱియు" అని వావిళ్ళ పాఠము; అట్లయిన యతి భంగమగును.

నిచ్చిన నురముపై నిడి రాఘవునకు — నచ్చపు భక్తితో నలివ వీడ్కొలుప
అతివేగమునఁ బురి కప్పుడే పోయి — యలివ మందిరమున కప్పుడే పోక

(E) సంప్రదాయ విరోధము :—

"మానుగాఁ బతిలేని మగువయే కాని — దానికి నదిగో ప్రత్యక్షంబు గలదు
అప్పుడతుక యున్న యరదంబు మీదఁ — గప్పిన ధూళి రాఘవ విలోకింపు.

రథముమీద ధూళి గప్పియు డెనా లోపల నున్నది విధవయే కాని సధవ కాదని హనుమంతుడు చెప్పుట శకున శాస్త్ర సంప్రదాయములకు విరోధము

రంగనాథ రామాయణము సలక్షణ గ్రంథము. చాలా మంది లాక్షణికులు తమ గ్రంథము లలో కొన్ని లక్షణములకు లక్ష్యములుగా నీగ్రంథము నుండి ఉదహరించిరి. అట్టిచో పై రీతి కోకొల్లలుగా దోషములున్న ఈ సులోచనా వృత్తాంతము (లఘు గ్రంథము) అసలు కర్తది కాదు; ప్రక్షిప్తమనుటలో సందేహము లేదు ఈ తలంపుననే కాబోలు ఆం. వి. క. ప. ప్రతిలో తత్పరి ష్కర్తలిచే నిది మూలమునుండి తొలగింపఁబడి 1వ అనుబంధమునఁ జేర్చబడినది.

ii. గురు గ్రంథ పరిశీలనాంశములు :—

రెండవ పాతమైన గురుగ్రంథము (సులోచనా వృత్తాంతము) నందును మొదటి పాఠము వంటివే యైన పెక్కు దోషములు గలవు.

(A) యతి దోషములు —

1) హితము గైకొనక మారీచ దైత్యుండు
2) శతకోటి హరి రుచి దంష్ట్రాగ్ర ఘోర
3) మోసంబుచే మునీంద్రుని తపంబగు "మో-ద్రు" యతి అంగీ కార్యమా?
4) దివ్య విమానము నందు దంపతులు
5) శ్రుతి చోదితంబులై సృష్టిపై వెలయు
6) ఋషి పత్నియైన యరుంధతి వోలె (రుసి పత్ని యన్న సరిపోవును.)
7) చండించి నీ పదా గ్రంబునకును"

(ఇచట పాదాంతమున నొక యక్షరము తక్కువ యైనది.)

(B) ప్రాస భంగములు :—

(1) పొసగఁ జెప్పెడు వేద భూరి మార్గములు — దాగైన నీవొక్క తపసివే చూడ [1]

(2) దర్శింప నిచ్చునే తద్దయు నలిన — హర్షించి యోగాక యనుచు దేవతలు

"ర్శి-ర్షి". శషప్రాస.

(3) వెళ్ళ నాడెద నేను నిన్నపంబొకటి — కల్ల గాదిది విను కాకుత్స్థ తిలక

"ళ్ల-ల్ల" ప్రాస.

---

1. రంగనాథ రామాయణము. (ఆం. వి క. పరిషత్తువారి ప్రతి.) అనుబంధము. 2 పుటలు. 801, 804, 792, 822, 809 815, 810, 792.

(C) గణ భంగము ;—

అరుదెంచి చూతమే మందరము గూడి — (అక్షరాధిక్యము).

(D) వైరి సమాసములు :—

(1) పరివార యుక్తలై పఱతెంచి రమిత — హరుషలై తుంబురు నారదుండు.

హర్షమునకు వికృతి హరుసము. అరుసము

కాని "అమిత హరుషలై" యనట అంగీకార్యమా?

(E) ఇతరములు :—

(1) దీవించి వీభూతి తిలకంబు పెట్టి" — (విభూతిని వీభూతి యనుట)

(2) . . . పంక్తి కంధరుడు,

మాదు గావలె నాకు. మయ పుత్రియైన — భామ మందోదరి— ఫణికులాధిపుడు

ఆదిశేషుడు తండ్రి యతుల విక్రముడు...

ఇందులో "మందోదరి" యేమి గావలెనో చెప్పబడ లేదు. "అత్త" యని యధ్యాహారము కాబోలు.

3. ముకుళిత హస్తయై మొగి సెల్వు వడసి,

("సెలవు" నందలి నడిమి లకారములోని అజ్లోపము)

4. (ఎ) చెండి సంహారంబు సేతు గాకిపుడు

(బి) మునినాథ నేను నీ ముందరఁ జేతు.[1]

(చేయుదు అనుటకు చేతు ననుట)

(F) సంధులు :—

1. ఇత్వసంధి.

చెనకెవ్వరు, తుదాదులు, ఉరువ డేతెంచి — దాక్షయణైన, లక్ష్మనగ, మొదలగునవి

2. పాద మధ్యమున విసంధి.

నాకు దోచదు ఇట్టు నాథ ని యాజ్ఞ,

3. కూడుక, కూర్చుండుక, మొదలగు ప్రయోగములు

(కొనునకు "క" ఆదేశము అర్వాచీనము)

(G) క్రమ భంగము :—

రావణాసుర కంఠ రంభా విభేద.[2]

---

1. రంగనాథ రామాయణము. (ఆంధ్ర విశ్వకళా పరిషత్తు ప్రచురణము.) అనుబంధము. 2. పుటలు 795, 819, 811, 817, 927, 820, 821, 796.

2. రంగనాథ రామాయణము. (ఆం. వి. క. ప. ప్రచురణము) అనుబంధము 2. పుటలు 794, 810, 808.

(అప్పటికి రావణాసురుడు వధింపఁబడలేదుకదా.)

(H) ఇంతేకాక, ఈ పాఠము మితిమీరి, యొక ప్రత్యేక గ్రంథమంత దైర్ఘ్యము కలిగియున్నది. దానికి పునరుక్తులు[1] కేవలము పేర్ల పట్టికతోఁ గూర్చబడిన ద్విపదలు[2] అనవసరమై తద్దైర్ఘ్యమునకు కారణమై యున్నవి.

(I) "రంగనాథ రామాయణమునందలి ద్విపదలు రసానుగుణముగ మారుచు పాదము లెక్కడికక్కడ బాడిసతోఁ జెక్కినట్లు కుదురుకొన్నవి."[3] ఒకే పదము రెండుగా విభజింపబడి రెండు ద్విపద పాదములలో (అనగా మొదటి ద్విపద చివర కొంత; రెండవ ద్విపద మొదట కొంత శిష్ట భాగము) వచ్చినట్లు ప్రధాన గ్రంథమునందు వెదకినను గనిపించదు, కాని ఈ సులోచన కథ యందిట్టివి అనేకములు.

ఉదా:- 1. "రుచిరాంగి పొమ్మన్న రూప లావణ్య — వతి సరస్వతి చతుర్వదనున కనియె.

2. సన్యస్తులైన సంసార తాపత్ర — యములు దూగక పోవునని ప్రయత్నమున."[4]

మొదలగునవి.

J. రంగనాథ రామాయణ కర్త తరువాత చాలా కాలమునకు వెలుగొందిన పోతన కవి పద్యచ్ఛాయలు ఇందు కనిపించు చున్నవి.

1. పతి కౌగిలించని పణతి కాయంబు
పవన కుంభిత చర్మ భస్త్రి గాకేమి — సవినయంబుగ సార సల్లాపములను
నమరంగఁ బతితోడ నాడని నోరు — ఢమ ఢమ ధ్వనితోడి ఢక్క గాకేమి.
వరుసేవ సేయని వర కరాబ్జంబు — తరసాస్థి నిర్మిత దర్విగాకేమి.
పురుషు నీక్షింపని పొలతి నేత్రములు — ధరఁ దను కుడ్య రంధ్రములు గాకేమి."[5]

భాగవతము నందలి ఈ క్రింది పద్యమున కిది యచ్చముగా ననుకరణము.

---

1. (ఎ) పతియె జీవనము. బతియె ప్రాభవము
... ...
పతి బాంధవావలి పతి సుహృజ్జనము. (20 పంక్తులు)

(బి) ఉడిగె శౌచాదులు నుడిగె స్నానములు
... ...
రాజవర్తనములు రాజుల కుడిగె. (20 పంక్తులు)

2. మునుల పేర్లు. (12 పంక్తులు), దేశముల పేర్లు (14 పంక్తులు), వృక్షముల పేర్లు (12 పంక్తులు) ఇత్యాదులు.

3. కవిత్వవేది-ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సర్వస్వము. పుట 82.

4. రంగనాథ రామాయణము. (ఆం. వి. క. ప. ప్రతి) పుటలు 810, 798.

5. ,, ,, ,, ,, అను. 2. పుటలు. 788, 787.

కంజాక్షునకుఁ గాని కాయంబు కాయమే — పవన గుంఫిత చర్మ భస్త్రి గాక.

....

తను కుడ్యజాల రంధ్రములు గాక."1

६ పతియు దూరంబైన బాంధవులేల - యతనిఁ బూజింపని యా చేతు లేల
యతనికి మ్రొక్కని శిరంబేల - యతనిఁ గన్గొన లేని యా కన్ను లేల
. . . . . - యతని చింతింపని యా చదువేల."2

ఇది ఈ క్రింది పద్యమును దాదాపు సరిపోలు చున్నది.

"కమలాక్షు నర్చించు కరములు కరములు

. . . .

చక్ర హస్తుఁ బ్రకటించు చదువు చదువు "3

K. శాస్త్ర సంప్రదాయ విరోధము :—

i) అగ్నివర్ణనము :-

"................ ...

చరణత్రయంబు మస్తత్రితయంబు - నరుణ జటా లోహితాక్ష యుగ్మమ్ము.
, ... - స్వాహ మహాదేవి సకియ మేధయును"4

....

అగ్నిముఖమందు తలలు రెండని, రెండవ భార్య స్వధాదేవియని యున్నది. చూడుడు-

"సప్త హస్త శ్చతుశ్శృంగ స్సప్త జిహ్వో ద్విశీర్షకః।

....

స్వాహాంతు దక్షిణే పార్శ్వే దేవీం వామే స్వధాంతథా॥"5

ఇచ్చట మస్తములు రెండుకు బదులు మూడనుట (మస్త్రతి తయంబు) "స్వధా" యను రెండవ భార్యకు బదులు "మేధ" యనుట శాస్త్ర విరోధము

వేదమునందును అగ్నికి రెండు శిరస్సులే యని యున్నది.

"చత్వారి శృంగా త్రయో అస్యపాదా - ద్వే శీర్షే సప్త హస్తాసో అస్య।"6

ii) "పరమ పతివ్రతా భామ లక్షణము - లరయంగఁ బరపురుషావ లోకనము."7

1, 3. పోతన భాగవతము. సప్తమ స్కంధము. పద్య; 170, 169.

2. రంగనాథ రామాయణము. (ఆం వి.ప.క. ప్రతి.)అను. 2 పుటలు. 788,

4. రంగనాథ రామాయణము. (ఆంధ్ర వి. క. ప. ప్రతి) పుటలు 816,

5. యాజుష స్మార్త మంత్ర పాఠమ. ద్వి. భాగము. విచ్ఛిన్నోపాసనము. పుట. 4. కూర్పరి. చల్లా లక్ష్మీ నృసింహ శాస్త్రి.

6. ఋగ్వేదము. 4-58-3 తై. ఆ. 10-10-3. (ఇదియు పై గ్రంథములో నుద్ధృతము.)

7. రంగనాథ రామాయణము. ఆంధ్ర వి. క. ప. ప్రతి) పుటలు. 788.

పతివ్రతా లక్షణము పర పురుషావ లోకనము కాదు. పర పురుషానవ లోకనము. ఇది సంప్రదాయ విరోధము.

iii) కార్యంబులకు మంత్రి, కరుణింప దాది - పర్యంకమున రంభ పనులకు దాసి
భోజనాదుల మాత, భువి శమాదులను - రాజిత ధర్మానురక్తురాలైన
ధరఁ గుటుంబిని కులోద్ధారిణియండ్రు."1

దీని కాధార శ్లోకము

"కార్యేషు దాసీ, కరణేషు మంత్రీ-రూపే చ లక్ష్మీః క్షమయా ధరిత్రీ।
భోజ్యేషు మాతా శయనేతు రంభా-షట్కర్మయుక్తా కులధర్మపత్నీ॥"2

ఇందలి "రూపే చ లక్ష్మీః" అనునది "కరుణింపదాది" యని మార్చఁబడి అనౌచిత్య మలముకొన్నది. ఇక "కరణేషు మంత్రీ" యనునది కార్యంబులకు మంత్రియని పేర్కొనఁబడుటయేకాక "పనులకు దాసి" యని అదే విషయము పునరుక్తమైనది. కార్యంబులకు-పనులకు", సంస్కృతాంధ్ర భాషా భేదము తప్ప విశేషమేమియు లేదు.

L. శైలియు గంభీరముగా లేదు, రచన పడికట్టు రాళ్ళతో గూడి పలుచబడి పేలవముగా నున్నది.

M. గ్రామ్య పదములు చాల గలవు.
చేసుట, కొర్త, ముత్తెరసరము, రాఘలా, ప్రొద్దుకు మొ॥నవి.

ఇంతేకాక, మొదటి సులోచనా వృత్తాంతమునకు (లఘు గ్రంథమునకును) రెండవ సులోచనా వృత్తాంతమునకును (గురు గ్రంథమునకును) కథా నిర్మాణములో కొలది భేదము లున్నవి.

మొదటి పాఠము	రెండవ పాఠము
1. వామ బాహు దక్షిణ బాహువుల వృత్తాంత మిందులేదు.	1. ఇందు కలదు సులోచన నమ్మికకై వామ హస్తము భూమి పత్రమున తన చావు దెలుపును; సహగమనము చేయుమని కోరును.
2. రావణుడు "తలను దెచ్చి యిచ్చెదనని బీరములు పలుకును.	2. తనతో కాదని పలుకును.
3. సులోచన రామునిసన్నిధికి రథముపై వచ్చినది.	3. ఇందు తేజి (గుఱ్ఱముపై) వచ్చినది.
4. తనకు పతిభిక్ష పెట్టుమని శ్రీరాముని సులోచన కోరినది కాని, అతడు ఆంజనేయుని సలహాపై ఆలోచించి మరొక జన్మములో ఇరువురు కలిసెదరనివర మొసంగినాడు. (ఆ జన్మమేది)	4. రాముడే ఇంద్రజిత్తును బ్రతికింప వరము నిచ్చెద ననెను. కాని బ్రహ్మాదులు భయపడి వాణిని బంపగా ఆమె సులోచన నాలుకపై కూర్చుండెను. కావున తనకు

1. రంగనాథ రామాయణము- ఆం వి.క.ప (ప్ర) అను-2 పుట-788.
2. నీతి శాస్త్రము (సంకలన గ్రంథము)

పరమపద మిమ్మని సులోచన కోరినది.

5. భర్తతో మాట్లాడిన ఆమె పాతివ్రత్యమును నమ్ముదుమని సుగ్రీవు డనెను.

5. ఇందు భర్తను నవ్వించుమని యనెను.

6. పతివ్రతా చరిత్ర, త్రిపురాసుర వనితల హోసము, అను అవాంతర కథ లిందులేవు.

6. ఇందు కలవు.

ఇట్టి ఈ భేదములేకాక మొదటి పాఠమున లేని కొన్ని క్రొత్త కథాంశములు రెండవ పాఠమున గలవు.

1. మండోదరి సులోచనకు త్రిపురాసుర వనితల పాతివ్రత్యమును, పతివ్రతా చరిత్రను దెలుపును.

2. ఇట్లే జయ విజయుల శాపవృత్తాంతము, విష్ణువు అవతారముల నెత్తి వారిని సంహరించు విషయము వర్ణింపఁబడినది.

3. యుద్ధము నిలిపి, పరివారముతో తన సహగమనమును జూడ రమ్మని సులోచన శ్రీరాముని ఆహ్వానించును.

4. బ్రహ్మ రుద్రాదులు, దిక్పాలకులు, మునులు, సమస్త దేవతలు సులోచన సహగమనమును జూడవత్తురు.

5. సులోచన మహా వైభవమున స్వర్గమున కేగును.

ఇట్లు పరిశీలింపగా, ఈ రెండవ పాఠము నైకదోషభూయిష్ఠమై, మితిని మించిన దై యున్నది; భేద విశేషములతో గూడియున్న రెండు పాఠములలో కర్తదేదో ఇదమిత్థమని నిర్ణయింప జాలము: కావున నీ రెండవ పాఠము ప్రక్షిప్త మనుటలో సందేహ మావంతయు లేదు.

iii) మూడవ పాఠము :—

ఇది మొదటి ముద్రిత పాఠమునకు రచనాంతరము. కథాంశములం దీ రెంటికిని భేదములేదు. ఒక్క మండోదరీ విలాపమునకు చెందిన కొన్ని ద్విపద లధికముగా నున్నవి. దీనియందును మొదటి పాఠమునందువలెనే యతిప్రాసాది దోషములున్నవి. చూడుడు :—

A) యతి భంగములు:—

1. అనుటయు మారుతాత్మజు డిట్టులనియె
2. అటువంటి వాని(జంపఁగ నీకుఁ దగునె
3. ఏమి మాటంటివి వెలది నాతోను
4. అసిమిష సిద్ధగంధర్వాదులెల్ల
5. ఇతరారు లెదిరిన విజయంబు నిచ్చు (మొ॥నవి).

B) ప్రాస భంగములు ;—

1. ప్రియవఖుల్ తెలుపంగఁ బెద్ద ప్రొద్దునకు—బై కొన్న రన మూర్ఛఁ బాసి చిత్తమున
2. సతులకుఁ బతివెంటఁ జనుట ధర్మంబు—యవతరించుక సేయు టదియ ధర్మంబు

3. నేస్తుని గనుగొని నెలత మూర్ఛిల్లి-భూస్థలి బడి కొంత ప్రొద్దుకు లేచి
4. పని గొని పతి కళేబరము రథము-పై నుంచి యెంతయుఁ బవన వేగమున (మొదలగునవి)

C. గణభంగములు :—

1. సౌమిత్రి శరములఁ జచ్చిపడియున్న } అక్షరాధిక్యములు
2. చంపినవాడెవడు జలజాయతాక్షి
3. గురుస్వప్రకాశ నిర్గుణశ్రీ పరమేశ

(స్వ, శ్రీ ల కన్న ముందున్న రు, ణ లను దేల్చి పలుకవలెను గాబోలు)

D. వైరి సమాసములు :—

సత్కుల వెలదులు, గంధర్వ వెలది ఇత్యాదులు.

ఇట్లు మువ్విధములైన ప్రతులలో కనబడుచున్న ఇట్టి దోషములు కేవలము లేఖకుల వలన సంభవించినవని యూహింపఁజాలము. చేయి తిరగని, అంతంత మాత్రను లక్షణ జ్ఞానముగల కవులెవరో వ్రాసి, ప్రసిద్ధికై రంగనాథ రామాయణ విభిన్న ప్రతులందుఁ జేర్చియున్నారు. కావున త్రివిధ పాఠ భేదము లేర్పడినవి.

ఇట్టి సులోచనా వృత్తాంతము రంగనాథ రామాయణ కర్తది కాకున్నను, అవాల్మీకమైనను అమూలకము మాత్రము కాదు. ఇది సువర్చన రామాయణమునందున్నదట! కాని యీ గ్రంథము నే డనుపలభ్యము. భుశుండి రామాయణ దక్షిణ ఖండమునందు కలదు ఇది ఇంకను అముద్రితమైన కారణమున దొరకమిచే మూలముతోఁ బోల్చు నవకాశము లేకపోయినది భుశుండి రామాయణ ముద్రిత పూర్వ ఖండమునందు సంపాదకులు కథా సంగ్రహములో సులోచన కథ సూచించినారు.

अन्त मे लक्ष्मण ने घन घोर बाण वर्षा कर उसको भुजाएँ तथा सिर काट डाला। पति की मृत्यु का संवाद पाकर सुलोचना विलाप करती हुई शव लेने के लिये युद्ध भूमि गई। उस दिन चैत्र कृष्णा चतुर्दशी था। उसने परम पुरुष के रूप मे राम की स्तुति की। राम ने दयार्द्र होकर उसके पति को जीवित करने की इच्छा व्यक्त की। सुलोचना ने इसे अस्विकर करते हुए उसका असुर भाव दूर कर राम से उसे जन्मांतर मे दस्य शक्ति प्रदान करने का अनुरोध किया। इसके अनंतर वह पति का शव लेकर सती होगई। राम की कृपा से कालांतर मे मेघ नाद ने सम्मुख गोप और सुलोचना ने उसको पत्नी के रूप मे जन्म लेकर अविरल दास्य भक्ति प्राप्त की।

ఇది మొదటి పాఠ వృత్తాంతమునకు ఇంచుమించు సరి వచ్చుచున్నది. మరొక జన్మలో కలిసెదరని రాము డిచ్చిన వరమునకు సమాధాన మొసంగుచున్నది కూడ.

దేవీ రామాయణమునందును సులోచనా వృత్తాంతము కలదు. "ఇందు ముఖ్యముగా పతిని మాట్లాడించుమని సులోచనను శ్రీరాముడు కోరగా ఆమె సంభాషించినట్లును, రావణుడు సులోచనా సహగమనమును చూడరమ్మని శ్రీరాముని కోరినట్లను, రాముడు యుద్ధమును నిలిపి సహగమన

1. రామదాస్ గౌడ్ हिन्दत्व పుట-137.
2. భుశుండి రామాయణము- పూర్వఖండము- సంపాదకులు భగవతీ ప్రసాద్‌సింహ్ కథావస్తు- పుట-27

కార్యమున సహకరించినట్లును కలదు."1 ఇది రెండవదైన గురు పాఠముతో కొంత సరి పోలుచున్నది.

ఆనందరామాయణమునందు ఈ వృత్తాంతము2 సుమారు 30 శ్లోకములలో వివరింపబడి యున్నది. ఈ శ్లోకముల విస్తరణ రూపమే గురుపాఠమునందలి సులోచనా వృత్తాంతము. ఇక దీనిలోని అవాంతర కథగా నున్న పతివ్రతా చరిత్ర స్కంద, గరుడ పురాణాదులలో నున్నను ఎక్కువగా పద్మపురాణ మందలి పతివ్రతా వృత్తాంతముతో పోలియున్నది. ఈ షద్భేదములు లేక పోలేదు.

గురుపాఠము.	పురాణములు.
1. విప్రకుమారుని పేరు ధృతి.	1. గరుడ పురాణమున "కౌశికుడ"నియు స్కంద పురాణమున "శౌనకముఖ్యుడ"నియు కలదు. పద్మపురాణమున పేరు లేదు.
2. పతివ్రత పేరు లేదు.	2; "సైవ్యా" అని పద్మ పురాణమునందును "శాండిలి" యని స్కంద పురాణమునందును కలదు. గరుడ పురాణమున పేరు లేదు.
3. మాండవ్యునిపై కోపగించిన యముడు పక్షి రూపముతో వచ్చి, మంచపు కోడునకుఁ దగిలించిన రంతి దేవ మహారాజు రత్నాల హారమును ముక్కున కఱచుకొని పోయి మాండవ్యుని మెడలో వేసెను. దానిని జూచి రాజభటులు అతనిని దొంగయని పట్టుకొని పోయిరి.	3. రాజభటులు ధనికుల యిండ్లు దోచుకున్న దొంగలను వెదకి, వేసారి. నగరోపాంతమున నున్న మాండవ్యుని దొంగయని పట్టుకొని పోయిరి.

"పతి వాంఛను దీర్పఁదలచి పతివ్రత వేశ్య యింటికి ప్రాతఃకాలముననే పోయి తద్గృహ వీథులను సమ్మార్జన లేపనాదులచే నలంకరించుట, దీనిని వేశ్య తెలిసికొని పతివ్రతను రప్పించి వాగ్దానము ప్రకారము భర్తను తన యింటికా దినము తీసికొని ఆమెను రమ్మనుట" యనెడి పురాణ వృత్తము ఇందు గ్రహింపఁ బడలేదు. విప్రకుమారుని దుష్ట జీవితము, భర్త కెదురాడక పతికిఁ జేసిన పతివ్రతా సేవ, ఆమె స్వార్థ త్యాగము, భర్త కోరిక మేరకు వేశ్యల నతనికి

---

1. a) "శిరసా భాషణం భద్రే కారయస్వ సదీ యది।
తథేతి సా పతిం నత్వా భాషితా పతినాసహ॥
b) తచ్ఛ్రుత్వా రావణస్తూర్ణం ప్రాఘోషయ దనాతురః
తదైవ రామః స్వాన్‌యోధాన్ యుద్ధం మా స్త్విత్యఘోషయత్॥
2. ఆనంద రామాయణము సారకాండము సర్గ. 11 శ్లో. 190-218.

సమకూర్చి ఊడిగము చేయుట ఇత్యాది వర్ణనములు పతివ్రతా శీల పోషణమునకై కవిచే చేయబడినవి.[1]

మొత్తముపై ఈ గురు గ్రంథము దోషములతోఁ గూడికొని యున్నను, "సులోచన" యను పేర నొక ప్రత్యేక ద్విపద కావ్యముదా నొప్పియున్నది; కాని, అమితమైనందున రంగనాథ రామాయణ మూలపాఠము నందుండఁ దగినది కాదు అదినుండి అనుశ్రుతముగా వచ్చుచున్నందున దోష భూయిష్ఠమైనను మిరిని మించని దగుట చేత మొదటి పాఠమును (అఘుగ్రంథమును) మూల గ్రంథమున అధస్సూచిక యందో, కుండలీకరణ చిహ్నములచే ప్రత్యేకించి వేర్పరచి ముద్రించుట సబబు; కాని వావిళ్ళ మరియు రాయల్ అండ్ కో వారివలె మూలపాఠమునందుఁ జేర్చుట తగదు; పూర్తిగాఁ దొలగించి ఎక్కడనో అనుబంధమునఁ జేర్చుట చేత పాఠకులకు ఔత్సుక్యమును తగ్గించినట్లగును.

శిష్టా రామకృష్ణశాస్త్రిగారు- "కట్టా వరదరాజు రామాయణములో సులోచనా వృత్తాంత మున్నది."[2] యని తెలిపియున్నారు కాని యేకైక ప్రతి నాధారము చేసికొని మద్రాసు ప్రభుత్వము వారు ప్రచురించిన కట్టా వరదరాజు రామాయణమునందు[3] సులోచనా వృత్తాంతము లేదు. పీఠికా కర్తలైన నిడుదవోలు వెంకటరావుగారును "సులోచనా వృత్తాంతము... వరదరాజు రామాయణము నందు కానరాదన్నారు.[4]

మఱుగున పడిపోయిన మఱియొక ద్విపద రామాయణము నందుండవచ్చును

ఏది ఏమైనను, రంగనాథ రామాయణమునందు సులోచనా వృత్తాంతము మాత్రము ప్రక్షిప్తమే.

భాస్కర రామాయణమునందును నిది గానరాదు.

12) కైకేశి హితబోధ :—

శ్రీరాముడు సువేలాద్రియందు సైన్యముతో విడిసెను. రావణుడు మంత్రాలోచనకై రాక్షసులతో కొలువు దీర్చెను. "తనయుడు ధర్మము దప్పి నడచిన యెడల, తలిదండ్రులతనికి బుద్ధి

1. పతివ్రతా చరిత్రయున్న పురాణములు-
   i) స్కందపురాణము- పంచమభాగము- అధ్యాయము 171, 172.
   ii) గరుడ పురాణము- అధ్యాయము-142. శ్లో. 19-29.
   iii) పద్మపురాణము- సృష్టిఖండము- అధ్యాయము-53
2. శిష్టా రామకృష్ణశాస్త్రి- "ఆంధ్ర వాఙ్మయచరిత్ర సర్వస్వము- సంపుటి 1. అష్టమ ప్రకరణము- పుట-574.
3. కట్టా వరదరాజు రామాయణము- యుద్ధకాండము- Vol (iv) Madras government Oriental series ప్రచురణ.
4. నిడుదవోలు వెంకటరావు- పీఠిక- పుట-20 కట్టా వరదరాజ రామాయణము-యుద్ధకాండము.

సెప్పుట తగ"దని కైకేశి తలపోసి మాల్యవంతునితో బయలుదేరి దశాననుని సభకు మహా వైభవమున వచ్చెను.

"కైకేశి ఆ నిండుసభలో 'విశ్రవసుడు తనకుఁ జెప్పిన దేవ రహస్యమును తనయునకు వినిపించి, శ్రీరాముని పరాక్రమమును బొగడి, రావణుని నీచ కర్మను దెగడెను. వాయుపుత్రు డొనర్చిన కార్యములను, వేదవతి యొసంగిన శాపమును గుర్తుచేసెను; అసురుల మర్దించి యమరులఁ బ్రోవ విష్ణువే రాముడుగా నవతరించెనని తెలిపి, అతని పూర్వావతార మహిమలను తేటపరచెను. జల వశయ సృష్టి స్థితులను వివరించెను. సీత నర్పించి, విభీషణునికి లంకా రాజ్యంబు పట్టంబుగట్టి రాముని శరణాగతి నొందిన. నతడు గజేంద్రుని రక్షించినట్లు అతనిని గాపాడునని బోధించెను. కాని రావణుడు సనత్కుమారునిచే విన్న యర్థము మనసున భాసించగా, రామునికి మ్రొక్కజాల ననియు యుద్ధమున నతనిని జంపుటో, లేక తాను జచ్చుటో నిశ్చయమనియు పలికి నగరికి విచ్చేయుమని తల్లితో మోమోటము లేకుండఁ జెప్పెను. కైకేశి చోద్యమంది "దైవకృత్యమే తెలియగునను దప్పద"ని సభాసదనముఁ బాసి తన నగరికిఁ బోయి ధర్మంబు దప్పకుండెను."[1]

ఈ కైకేశి హితోపదేశ వృత్తాంతము భాస్కర రామాయణమునందు లేదు, రంగనాథ రామాయణమునందు సుమారు 250 ద్విపదలలో చాల దీర్ఘముగా వర్ణింపబడినది.

సంస్కృత వాల్మీకి రామాయణ త్రివిధ పాఠములందును నీ వృత్తాంతము కానరాలేదు, అధ్యాత్మానందాది రామాయణములలోను పొడ కట్టలేదు. కావున ప్రస్తుతము అవాల్మీకమని తలంచుటయే కాక ఆధారము దొరకునంతవరకు అమూలకమనియు భావించవచ్చును.

పరిశీలింపగా ఈ కథాంశమును సూచించునట్టి ఒకానొక శ్లోకము దా ప్రతి వాల్మీకి రామాయణమునందు పొడకట్టినది.

"విభీషణుని భార్యయగు సరమ రావణు మాయా శిరోదర్శనముచే దుఃఖించు సీతాదేవి నాశ్వాసించి, తత్ప్రేషితయై అదృశ్యరూపమున దశాస్యుని సభకుఁ బోయి, అచ్చటి విషయముల నన్నింటిని కని, విని, వచ్చి సీతాదేవికి వానిని మరలఁ దెలియఁజేయును. అచ్చోట-

"జనన్యా రాక్షసేంద్రోవై త్వన్మోక్షార్థం బృహద్వచః।
అవిద్ధేన చ వైదేహి మంత్రివృద్ధేన బోధితః॥"[2]

అని కలదు. దీనికి గోవిందరాజీయమునందు—

"జనన్యా కైకసీ నామ్న్యా అవిద్ధేన అవిద్ధాఖ్యేన మంత్రి వృద్ధేన చ రాక్షసేంద్ర స్త్వన్మోక్షార్థం బృహద్వచనం బోధితః॥" అని వ్యాఖ్యానమును కలదు. (సీతమ్మా! రావణుని తల్లి కైకసి, వృద్ధ మంత్రియైన అవిద్ధుడును నిన్ను రామచంద్రమూర్తికి అప్పగించుమని పెక్కు విధముల రావణునికి బోధించిరి).

1. రంగనాథ రామాయణము- యుద్ధకాండము- ద్వి. 1173-1417.
2. దా. ప్రతి. వాల్మీకి రామాయణము- యుద్ధకాండ. సర్గ. 34, శ్లో-20

దీనికి తరువాత

"ఏవం సమంత్రివృద్ధైశ్చ విద్ధేన బహుభాషితః।

నత్వాముత్సహతె మోక్తు మర్థ మర్థ పరో యథా॥"1

అను మరొక్క శ్లోకమునకు పాఠాంతరముగా పశ్చిమోత్తర శాఖీయ వాల్మీకి రామాయణ ప్రతిలో-

ఏవం సమంత్రి ముఖ్యేన మాత్రాచ బహుభాషితః।

నత్వా ముత్సహతే మోక్తు మర్థ మర్థ పరోయథా॥ అని కలదు.

కాబట్టి ఈ రెండు శ్లోకములందలి "జననానీ.... బృహద్వచః। మాత్రాచ బహుభాషితః॥" అనెడి మాటలను ఆధారముగా జేసికొని విచారించినచో, కైకేశి హితబోధకు సంబంధించిన ఒకటి రెండు పెద్ద సర్గలు వాల్మీకి రామాయణమునందుఁ దప్పక యుండియుండవలెను. ఏ కారణముచేత ప్రస్తుతము ప్రతులందు మృగ్యములైనవో తెలియరాకున్నది.

కారణమేమనగా, బుద్ధారెడ్డి "ఇంత దీర్ఘ కథాంశమును స్వయముగాఁ గల్పించియుండడు రంగనాథ రామాయణ మందలి ప్రతి చిన్న కథాంశమునకు మూలము లభించుటయే యిందుకు సాక్ష్యము. దక్షిణ దేశమందలి వాల్మీకి రామాయణ తాళపత్ర ప్రతుల నన్నింటిని సంపాదించి పరిశీలించినచో, నిదియేగాక నింక నెన్నియో నూతనాంశములు వెలికి రాగలవు. ప్రభుత్వ సహాయమున గాని యిది నెరవేరదు.

ఆశ్చర్య రామాయణమునందు ఈ సందర్భమునఁ జెప్పఁదగిన మరొక కల్పనము కలదు. అది విశ్రవసుని తండ్రి పులస్త్యుడు తన శిష్యుని ద్వారా మనుమడైన రావణునికి సందేశమును పంపుట.

"పులస్త్య ప్రేషితః కశ్చి త్తదంతే వ్యాసభాగతః।

దశానన మిదం వాక్యమువాచాంజలి పూర్వకం॥"2

రావణుడు మూర్ఖుడు-

"ద్వావేతౌ జగతౌ మూర్ఖౌ దుర్యోధన దశాననౌ।

గోగ్రహం వన భంగంచ దృష్ట్వా యుద్ధం పునః పునః॥"

అని యొక యాభాణకము గలదు. అతడు బ్రహ్మ చెప్పినను వినువాడు కాడు.

"అజ్ఞః సుఖ మారాధ్యః సుఖతర మారాధ్యతే విశేషజ్ఞః।

---

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. యుద్ధకాండము. సర్గ 34, శ్లో. 23.

1. సోఽపిత్వం రఘురామ పట్టమహిషీ సంబద్ధ రాచోఽ సికింహో

పౌలస్త్య కళంకభూత మహిజాం శీఘ్రం విముఁచాద్యవా॥

(లక్కావఝ్ఝల వెంకటకృష్ణ శాస్త్రి. ఆశ్చర్య రామాయణము యుద్ధ సర్గ. 10, శ్లో. 1-4

జ్ఞానలవ దుర్విదగ్ధం బ్రహ్మాపి నరం నరంజయతి॥"[1]
అని భర్తృహరి నీతివాక్యమునిట స్మరింపఁదగినది.

"రావణుని సోదరులైన విభీషణ కుంభకర్ణులు, కుమారులైన అతికాయాదులు,[2] మాతామహుఁడైన మాల్యవంతుడు, సుఖ దుఃఖ సమభాగినియైన భార్య మండోదరి, మంత్రియైన మారీచుడు మున్నగువారు నీతిని బోధించిరి" ఇక మిగిలిన వారు పితృపితామహులు. చెడిపోవు కుమారుని జూచి ఏ తల్లిదండ్రులు బుద్ధి చెప్పకుండ నుండలేరు.

కావున తన భర్తయు, రావణుని తండ్రియునైన విశ్రవోబ్రహ్మ వలన దేవ రహస్యమును వినిన తల్లి కైకసి కుమారుడైన రావణునికి బుద్ధి చెప్పుట సైజము; సముచితము కూడ. వినక పోయినచో దోషము కుమారునిది కాని, తనదికాదు ఈ దృష్టితో బుద్ధారెడ్డి కైకేశి వృత్తాంతమును మూలమునందలి సూచనను బట్టి కల్పించి గ్రంథమునకు సమగ్రత నాపాదించినాడనుట సమంజసము.

(13) రావణుని నాభియందలి యమృతము :—

రాత్రిం దివములు పోరు ఘోరముగా జరుగుచుండెను. దాశరథి శరములచే రావణుని కరశిరములు తెగి మరల మొలుచుచుండెను. కాని అతడు మడియకుండెను ఈ దుష్టచిత్తుని నెట్లు తెగటార్తునని తలపోయుచున్న శ్రీరామునికి విభీషణుడు రావణ మరణ రహస్యము నిట్లు తెలిపెను.

"వనజాత జాతుని వరమునఁ జేసి — యినకులాధీశ్వర యీతని నాభి
నమ్మతమున్నది. కుండలాకృతిఁ గలిగి — యమృతత్వ మూలమై యది చంపనీదు.
దానవు తరలు నుద్దండ బాహువులు — మానక నీవెన్ని మాఱు లేసినను
మొలతెంచు చుండు నున్మూలముల్ గావు — ————
— — — — నీవు — చదురొప్ప నాగ్నేయ శరమేయు మింకి

నా నాభి మూల (వివర) మూలామృతం ఓగురు — దానవ పరి దాను దానలో దారు"[3] అని కాని ఇది అవాల్మీకము వాల్మీకి రామాయణమునందు "రావణ వధ గురించి విచారించుచు నున్న శ్రీరామునికి మాతలి పైతామహాస్త్రమును (బ్రహ్మాస్త్రమును) ప్రయోగించుమని గుర్తు చేసినాడని"[4] యున్నది. పశ్చిమోత్తర శాఖీయ ప్రతి రామాయణమునందు "తలనీయ గూడదు. మర్మములు భేదించ వలసినద"ని చెప్పుచున్నట్లున్న అధిక శ్లోకమొకటి కనిపించుచున్నది.[5] అంతేకాని ఈ

---

1. భర్తృహరి నీతి శతకము. మూర్ఖ పద్ధతి శ్లో. 2
2. అతికాయుని హితబోధ ప-ఉ- ప్రతి ననుసరించి వ్రాయబడినది. రంగనాథ రామా. యుద్ధ. ద్వి. 1435-2445. (దా. ప్రతిలో లేదు)
3. రంగనాథ రామాయణము. యుద్ధకాండము ద్వి. 7742-7748.
4. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. యుద్ధ సర్గ. 111 శ్లో. 1, 2.
5. "వినాశో నిర్మితో హ్యస్యస్వయమేవ స్వయంభువా।

ప్రతిలో ఎచ్చటను రావణుని నాభియం దమృతమున్నట్లు ప్రస్తావింప బడలేదు.

ఈ అవాల్మీక విషయము అధ్యాత్మ-ఆనంద రామాయణములలో స్పష్టముగాఁ జెప్పబడినది. చూడుడు -

"ఇతి చింతాకులే రామే సమీపస్థో విభీషణః।
ఉవాచ రాఘవం వాక్యం బ్రహ్మదత్త వరోహ్యసౌ,
విచ్ఛిన్నా బాహవోప్యస్య విచ్ఛిన్నాని శిరాంసిచ॥
ఉత్పత్స్యంతి పునః శీఘ్ర మిత్యాహ భగవానజః।
నాభిదేశేఽమృతం తస్య కుండలాకార సంస్థితం॥
తచ్ఛోషయానలాస్త్రేణ తస్య మృత్యుస్తతో భవేత్॥"[1]

అని అధ్యాత్మ రామాయణమునందు స్పష్టముగాను

"దృష్ట్వాతు రావణస్యాంతం విభీషణ మతేన సః।
నాభిదేశేఽ మృతం తస్య కుండలాకార సంస్థితం॥
పావకాస్త్రేణ తచ్ఛీఘ్రం శోషయామాస రాఘవః॥"[2]

అని ఆనంద రామాయణమునందును తెలుపఁబడినది.

కాబట్టి రంగనాథ రామాయణము నందలి పై ద్విపదల కాధారము అధ్యాత్మ-ఆనంద రామాయణము లనవచ్చును. రెండింటిలో ఒకే విధముగాఁ జెప్పబడినది.

"తల దీయగూడదు., మర్మములను భేదించవలెసినది." అనెడి వ.ఉ. ప్రతి అధిక శ్లోకార్థమును విచారించగా, మాకలికి రావణుని నాభి యందమృతమున్నదని తెలియును, కాని యతడు దానిని స్పష్టముగాఁ జెప్పలేక మర్మములను భేధించు మన్నాడ"ని తోచును.

ఇతర రామాయణములు దీనిని స్పష్టపరచినవి. ఇది దేవ రహస్యము.

రావణుని నాభియందమృతము ప్రవేశించిన కథయిట్లు చెప్పబడినది.

"క్షీర సముద్రము నుండి యుదయించిన యమృత కలశము నివతలకుఁ దెచ్చుచుండగా, తత్కలశములో నుండి యమృత బిందువులు ఒలికి క్రిందఁ బడుచుండెను. అదితి యా బిందువుల నెత్తి నొక సువర్ణ కలశములో భద్రపరచెను. రావణుని తల్లి కైకసి దీనిని సంగ్రహించెను. గుడ్డతో మూతిని గట్టియున్న ఈ కలశము నొకనాడు కైకసి బాలుడుగానున్న రావణునకు, క్రీడార్థ మొసంగెను. దానినతడు ఫలభ్రాంతి మ్రింగెను. కైకసి ఈ వృత్తాంతమును విశ్రవసుని తోఁ జెప్పుచుండగా. గర్భములోనున్న విభీషణుడు విని యున్నాడు. ఈ రహస్యమును విభీషణుడు యుద్ధసమయమున శ్రీరామునకుఁ జెప్పియున్నాడు."

ఉత్తమాంగం నచైతస్య ఛేత్తవ్యం రాఘవత్వయా।
నైష మూర్ధ్ని ప్రభో వధ్యోవధ్య ఏషహి మర్మసు॥"

1. అధ్యాత్మ రామాయణము. యుద్ధకాండము. సర్గ 11 శ్లో. 51-55
2. ఆనంద రామాయణము సారకాండము. సర్గ. 11 శ్లో. 78-79.

ఇది యొక్క పౌరాణిక గాథ! ఎందున్నదో స్పష్టముగాఁ దెలియదు

రావణుని శరశిరములు తెగి, మరల మొలచుట కేదైనా కారణముండ వలెను. ఇది తెలియనిచో శ్రోతలకు సంతృప్తి యుండదు. వాల్మీకి రామాయణ మీ సందేహ నివృత్తి చేయదు. బుద్ధారెడ్డి ఈ అమృత వృత్తాంత మును గ్రహించి, తన గ్రంథమునకు నిండుదనమును గలిగించు కొన్నాడు.

(14) హనుమద్రామాయణము :—

సంస్కృత సాహిత్యమునందు రామాయణ కథా సంబంధి నాటకములలో హనుమన్నాటక మొకటి. దీనికే మహానాటకము, నాటకాంతరము కంటె హనుమద్రచితమని ఇది ప్రశస్తిగాంచినది. ఇందు నాటక లక్షణముల కంటె మహాకావ్య లక్షణములే అధికము. గద్యపద్య మిశ్రితమై చంపూకావ్య ప్రశస్తికిది యెంతయో తగి యున్నది.

హనుమంతు డీ ప్రబంధమును రచించి శిలలపై చెక్కెను. వాల్మీకి మహర్షి దీనిని చూచి "విశ్వమున నిది ప్రచారము చెందిన తన రామాయణ మహిమ క్షీణింపఁ గలదని తలంచెను. అంతట హనుమంతుని ప్రార్థించి, తత్సమ్మతి పై ఈ కావ్య ప్రస్తరములను సముద్రనందు పడవేయించెను.

భోజమహారాజు రాజ్యకాలమున బెస్తవారికి ఒకానొక శిల అకస్మాత్తుగాఁ జేతికి దొరకగా, వారు దానిని భోజరాజున కర్పించిరి. ఆ శిలపై

ఇహఖలు విషమః పురాకృతానాం — భవతిహి జంతుః కర్మణాంవిపాకః!"

అనెడి శ్లోక పూర్వార్థముండినది, కాళిదాస మహాకవి

"శివ శిరసి శిరాంసి యాని రేజుః — శివశివ తాని లుఠంతి గృధ్రపాదైః॥"

అని దాని యుత్తరార్ధము నప్పుడు పూరించెనట. పిదప బెస్త వారిచే వెదకించగా, తదుత్తరార్ధ శ్లోక పాఠముగల శిలయు లభించినది భోజుడు కాల, కావ్య మర్మజ్ఞుడగుటచే సముద్రమునందలి రాళ్ళను వెదకించి వెలికి దీయించెను. ఉపలభ్య శ్లోకముల యాధారమున నతని సభా పండితుడు దామోదరమిశ్రుడు గ్రంథమును సమకూర్చెను. నాటకాంతము నందలి ఈ క్రింది శ్లోకము పైజనశ్రుతి కాధారమై యొప్పియున్నది.

"రచిత మనిల పుత్రేణాథ వాల్మీకి నాబ్ధౌ
నిహితి మమృత బుద్ధ్యా ప్రాఙ్ మహానాటకం యత్।
సుమతి నృపతి భోజే నోద్ధృతం తత్క్రమేణ
గ్రథిత మవతు విశ్వం మిశ్రదామోదరేణ॥"[2]

బల్లాల సేన కృత భోజ ప్రబంధమునందును ఈ కథ యిట్లే చెప్పఁబడినది.

దామోదర మిశ్ర రచితమైన ఈ హనుమన్నాటకమునందు 14 అంకములు, గద్యములుగాక 579 శ్లోకములు గలవు. దీనికి పాఠాంతరముగా మహానాటకమను పేరుతో మధుసూదన మిశ్ర

---

1. లక్కావజ్జల వెంకట కృష్ణశాస్త్రి "ఆశ్చర్య రామాయణము" యుద్ధకాండము. సర్గ 20. పుట. 887.

2. హనుమన్నాటకము. అంకము. 14 శ్లో. 96.

రచితమైన ద్వితీయ సంస్కరణ గ్రంథమును లభ్యమగుచున్నది. ఇందు 9 అంకములు మాత్రమే యున్నను, 791 శ్లోకములు గలవు. ఈ రెండు ప్రబంధముల తులనాత్మకాధ్యయనము చేసి పండితులు "దాదాపు 300 శ్లోకములు రెంటియందును సమానముగా నున్నవి; కావున ఈ రెండు కూడ ఒకే మూల గ్రంథాధారమున పల్లవితయై సంకలితమైనవ"[1]ని అభిప్రాయపడి యున్నారు.

ఈ హనుమన్నాటకము లేదా మహానాటకమునకు హనుమద్రచితమైన కారణమున హనుమద్రామాయణమని ప్రసిద్ధి యేర్పడినది. డా విల్సన్ మొదలగు విద్వాంసులు ఈ గ్రంథసంకలనము సుమారు 11వ శతాబ్దిలో జరిగి యుండ వచ్చునని భోజుని సమకాలీనతా సంబంధముచే సమర్థించి యున్నారు. దీనియందు అనర్ఘరాఘవ, ప్రసన్న రాఘవ, బాలరామాయణాది గ్రంథస్థ శ్లోకములు మిశ్రితమై యున్నవని పరిశీలనచే తెలియుచున్నది. ఇది సంకలన గ్రంథమని చెప్పవచ్చును. ఈ సంకలనము 11వ శతాబ్ది నుండి 13వ శతాబ్దమువరకు క్రమముగా కొనసాగి నేటి గ్రంథ రూపమును దాల్చినది.

ఏది యెటులైనను ఈ గ్రంథములు రంగనాథ రామాయణ రచనాత్పూర్వమే విరచితములై సంస్కృత సాహిత్యాకాశమున సూర్యచంద్రులవలె విరాజమానములై యున్నవి ఈ రెండింటిని గూడ హనుమద్రామాయణమని రూఢ్యర్థమున పిలుచుట సమంజసము.

ఈ గ్రంథములందలి కొన్ని సూక్తులు, శ్లోకములు, అద్భుత భావములతోఁ గూడి, అతి సుందరములై సంస్కృత ప్రేమికులైన విద్వాంసులలో, రామకథా రసికులలో, విశిష్ట స్థానము నాక్రమించినవి. తులసీదాసు వంటి మహాకవులు ఇందలి కొన్ని శ్లోకములను యథాతథముగా భాషాంతరీకరించి తమ కావ్యములందుఁ జొప్పించి యున్నారు అట్లే రంగనాథ రామాయణ కర్తయు తనకు నచ్చిన మనోహర శ్లోకములను గ్రహించి, యథాతథానువాదములను, అనుసరణలను గావించి, సందర్భమును బురస్కరించుకొని తన కావ్యమునఁ జొప్పించి యున్నాడని పరిశీలనచేఁ దెలియు చున్నది చూడుడు :—

(15) విశ్వామిత్రుని హెచ్చరిక :—

శ్రీరాముడు శివధనుస్సు నెక్కుపెట్టు చున్నాడు అప్పుడు కౌశికుడు—

"హరుని చాపము రాముడతి సత్త్వ యుక్తిఁ — బెరిగి నేడిదె యెక్కు పెట్టుచున్నాడు.

అదరకు భూదేవి యాత్మలో నీవు — బెదరి చలింపకు శేషాహి నీవు

కదక ధరింపుము కమఠేంద్ర నీవు — కడు నేమరకుడు దిక్కరులార మీర

లని"[2]————హెచ్చరించినాడు.

ఇవి అవాల్మీకములు. డా॥ పింగళి లక్ష్మీకాంతంగారు "విశ్వామిత్రుని యీ పలుకులు ఆ ఋషి గాంభీర్యమునకును కళంకములే"[3] యని విమర్శించి దోషోద్ఘాటన మొనర్చి యున్నారు. ఇది చర్చనీయాంశము.

---

1. ప్రేమ ప్రకాశ్" లక్కడ్ (భూమిక) "హనుమన్నాటకము," పుట. 7
2. రంగనాథ రామాయణము. బాలకాండము. ద్వి. 1939-1942.
3. ఆంధ్ర సాహిత్య చరిత్ర. పుట. 181.

పై దీనిపద పంక్తుల కాధారము హనుమన్నాటకము. అందిట్లున్నది. "లక్ష్మణో రామే సజ్యం ధనుః కుర్వతి సతి పృథివ్యాదీని భువనాన్యథో యాస్యంతీ త్యాశంక్యాహ॥

శ్లో॥ పృథ్విస్థిరా భవ భుజంగమ ధారయైనాం।
త్వం కూర్మరాజ తదిదం ద్వితయం దధీథాః।
దిక్కుంజరాః కురుత తత్రితయే దిధీర్షాం।
రామః కరోతి హర కార్ముక మాతతజ్యం॥"1

ఇందు లక్ష్మణుడు పృథ్వ్యాదులను సంబోధించి నట్లుడగా, రంగనాథ రామాయణమునందు విశ్వామిత్రుడు సంబోధించినట్లు మార్చబడినది. ఇది యొక్కటియే కవి చేసిన మార్పు.

పైశ్లోక-ద్విపదంలో ఆదిశేషుని గూడ సంబోధించుట జరిగినది. ఆది శేషాంశ సంభూతుడైన లక్ష్మణుడు ఆదిశేషుని సంబోధించుట తనను తాను సంబోధించుట వంటిది. ఇది యనుచితము. ఆత్మబోధకాదు గదా! కావున బుద్ధారెడ్డి లక్ష్మణస్థానమున విశ్వామిత్రుని నిలుపుట ఎంతయో సముచితము.

భూమి ఆది శేషునిపై, వీరిరువురు కూర్మరాజుపై, ఇవి యన్నియు దిగ్గజములపై మోయబడు చున్నవని పురణోక్తి, కూర్మరాజు పృష్ఠము దిక్కూలలయందున్న దిగ్గజములపై పీఠ రూపమున నమర్చబడియున్నది. దానిపై శేషుడు కుండలాకారుడై ఫణాసహస్రము నెత్తియున్నాడు. దానిపై భూమి స్థిరమై యున్నది. ఏ దిగ్గజ మేమరి యున్నను, రాముని జలాధికమున నామూల వంగును; తల క్రిందులుగును: ప్రళయము సంభవించును. కావున జాగ్రత్తగా నుండుమని వానికి హెచ్చరిక చేయబడినది. దిగ్గజములకంటె, ఆది కూర్మముకంటె, ఆదిశేషునికంటె. భూమికంటె వీని యన్నింటికంటెను శ్రీరాముడు బాహుబ సత్త్వమున మహాధికుడని వ్యంగార్థము. ఇది జనకునకు సభికులకును దేట పఱచుట కౌశికుని ముఖ్యోద్దేశ్యము. విశ్వామిత్రునకు రామ మహాత్మ, వేతృత్వము కలదని యివి తెలుపుచున్నవి. కావున కౌశికుని పలుకులు ఋషి గాంభీర్యమునకు గళంకములు కాజాలవు.

(16) శ్రీరాముని ఉక్తి చాతుర్యము :—

శ్రీరామచంద్రుడు జానకిని పరిణయ మాడి అయోధ్య కేగుచున్నాడు. పరశురాముడు శివ ధనుర్భంగ కథనువిని మహాక్రోధమునఁ బరుగెత్తికొని వచ్చి "నాగకంకణుని చాపమును విఱిచినందుకు సహి ప" ననుచు రామునెదిరించినాడు. అంతట శ్రీరాముడు "వినోదార్థమై యెక్కిడితివియగా నది విఱిగినది. నాబలమునకు శివుని విల్లెట్లు నిలుచునని పలికి,

"ఎసఁగి యుద్ధతులయి యిక్ష్వాకు కులులు పసుల బ్రాహ్మణులఁ జంపఁ దలపరెందు.
(నీవెన్ని పలికిన నీకవి చెల్లె — నీవు బ్రాహ్మణుడవు నినుఁ జంపనొల్ల)
నిదెనాదు కంధర మిదె నీదు పరశు — వదరక యుచిత కృత్యము సేయుమింక"2

నని సంభాషించెను.

---

1. హనుమన్నాటకము. అంకము. 1 శ్లో. 21.
2. రంగనాథ రామాయణము. బాలకాండము ద్వి. 2344-2346.

ఇది అవాల్మీకము. హనుమన్నాటకమున నిట్లున్నది.

"అయంకంఠః కుఠారస్తే కురురామ యథోచితమ్।

నిహంతుం హంత గోవిప్రాన్ నశూరా రఘువంశజాః॥"[1]

బాలరామాయణమునందును[2] నీశ్లోకమున్నది

"హింస చేయు వారును గోబ్రాహ్మణులను జంప కూడదు; అది మహాపాతకము. నీవో స్త్రీల మధ్యను, పశువుల మందల లోను దాగిన క్షత్రియులను, క్షత్రియజాతి నశింపకుండ ఆపద్ధర్మమును బురస్కరించుకొని బ్రాహ్మణోక్తములచే పుట్టింపబడిన క్షత్రియ శిశువులను అదయతతో సంహరించితివి గోబ్రాహ్మణులకంటె అధిక గౌరవార్హయురాలైనమాతృమూర్తిని వధించితివి ధర్మాధర్మ విచక్షణలేని పరమ పాపివినీవు. నీవొక బ్రాహ్మణుడవా? మేమో క్షత్రియులము; హింస చేయువారమే; అయినను రఘువంశ మర్యాదను పాటింతుము యుద్ధములందైనను పసులను బ్రాహ్మణులను వధింపము" అని పరశురాముని గూర్చి శ్రీరాముడు చేసిన యెత్తిపొడుపు మఱియు నతని సమానమును పైపంక్తులలో వ్యంజింపబడినవి. ఇంతే కాక, పరశురాముని నిర్దయత్వము, అనాలోచిత్వము, అహంకారము, ఔద్ధత్యమును; శ్రీరాముని కారుణ్యము, ధర్మాధర్మ విచక్షణత, సహనము వినయమును స్పష్టీకృతము లైనవి. శ్రీరామ పరశురాములలో గల యీతద్భేదమును గనపరచుటకును శ్రీరాముని ఉక్తిచమత్కారమును ప్రకటించుటకును, రంగనాథ రామాయణ కర్త హనుమన్నాటక శ్లోకభావమును యథాతథముగా ననువదించి, గ్రంథమునం జొప్పించి, గ్రంథ గౌరవమును బెంపొందించినాడు.

(17) సీత యుత్తరీయ యోగ్యత్వము :—

సుగ్రీవుడు సీత పడవేసిన యాభరణముల మూటను దెచ్చి రామున కిచ్చెను. అతడు వానిని జూచి విలపించుచు, నాయాభరణములు కట్టబడిన ఉత్తరీయమును (పయ్యెద చీర) చేత నుంచుకొని తత్పూర్వ వైభవము స్మృతికి రాగా, రాముడు వోలె విలపించెను

"ఇది నాకుం బ్రాణ నాయికయైన సీత — కుదురు నిండిన గబ్బి గుబ్బల మీదం

బాయని యీ జిల్గు పయ్యెద చీర — కీయెడ నిప్పుడు వచ్చె నేమన వచ్చుం

బన్నీట నాపాద పద్మముల్ గడిగి — యున్నం దడియొత్తు నొప్పుగ దీన,

సురటి గావించి భాసుర లీల దీని — భరిత శ్రమాంబువుల్ పలుచగాం జేయు

మెఱుగారు మైదీగ మెరయు చుండంగ, — మఱి యడుగులకును మడుగులు వైచు(పఱచు)

ననియని శోకించు"[3]

ఈ యద్భుత కల్పనకు హనుమన్నాటక మందలి ఈ క్రింది శ్లోకమాధారము.

"ద్యూతే పణః ప్రణయ కేళిషు కంఠపాశః

క్రీడా పరిశ్రమ హరం వ్యజనం రతాంతే।

---

1. హనుమన్నాటకము అంకము. 1. శ్లో. 39

2. బాలరామాయణము. అంకము. 4. శ్లో. 61.

3. రంగనాథ రామాయణము. కిష్కింధాకాండ. ద్వి. 237-242.

శయ్యా నిశీథ సమయే జనకాత్మజాయాః

ప్రాప్తం మయా విధివశా దిహ ముత్తరీయం"[1]

ఇది అత్యంత రమణీయమై, శృంగార రస తుందిలమై యొప్పుచున్నది. కాని సీతారాముల ఆదర్శ చరిత్రకు కొంత భంగకరముగా నున్నది. బ్రహ్మ చర్య నిష్ఠ నవలంబించిన వారికి రతిక్రీడ యెక్కడిది? కావున "క్రీడా పరిశ్రమహరం వ్యజనం రతాంతే" యనుట సీతారాముల శీల పోషణకు తగినంతగా లేదు, సందర్భము కూడ పాటించ వలెను కదా! ఎవడో శృంగార లాలసుడైన కవి యేదో సందర్భమున వ్రాసిన శ్లోకమును ఇచ్చట చేర్చినట్లున్నది.

బుద్ధారెడ్డి మాత్రము దీని రమణీయతకు ముగ్ధుడై గ్రహించినాడు; కాని సీతారాముల శీలమునకు భంగము కాని రీతి, వారియందు భక్తి కలిగిన వారి హృదయములత్తు కొను నట్లుగా మార్చి యున్నాడు.

"సీతాదేవి శ్రీరాముని పాదములు కడిగి ఆయుత్తరీయముచే తడి యొత్తునది. ఆయాసముచే కలిగిన చెమట బిందువులు పలుచ నగునట్లు దానిని సురటిగా చేసి విసరునది; సుకుమారమైన పతిపాదములు నడచు నప్పుడొత్తుకొని పోకుండా క్రింద అడుగులకు మడుగులుగా పఱచునది" అని చెప్పినపుడు సీతాదేవి ఎంత పతిభక్తి పరాయణురాలు; ఆమెతన సుఖమును కూడ లెక్కించ కుండ, ఉన్నంతలో తృప్తిపడి ఆ వస్త్రాదుల చేతనే పతిసేవ చేసినది. కావుననే ఆమె "నారీణా ముత్తమా వధూః" అని స్త్రీలకు మేలు బంతియైనది. అట్టి భార్యను దలంచుకొని విలపించుటలో అసామంజస్య మేదియు లేదు;" అని సీతారాముల ఆదర్శ దాంపత్యము ప్రస్ఫుటీకరింపబడినది. ఇది మూలమునకే మెఱుగు పెట్టుట.

(18) సీతపై శ్రీరాముని అనురాగాతిశయము :—

వానకాలము గడచి శరత్కాల మేతెంచెను. శ్రీరాముడు సీతను దలంచి కోర్కులు కొనలు సాగగా మదనాతురుండయ్యెను. చంద్రోదయ వేళ శ్రీరాముడు భ్రమసి భ్రాంతి చెందిన యవస్థ అతని మదనాతురత్వమునకు తార్కాణము; పరిశీలింపుడు.

"ఉదయాద్రిపైనున్న యుడురాజుఁ జూచి
యిదియేమి యుత్పాత మిదియేమి చంద — మిదియేమి యీ రాత్రి యినుడేల పొడిచె;
నామేని తాప మిన్మడిగాగఁ జొచ్చె — సౌమిత్రి ననుఁ దరు చ్ఛాయను జేర్చు
మనినఁ జంద్రుడుగాని యర్కుండు గాడు — జననాథ! హరిణ లాంఛన మదె చూడు
మని లక్ష్మణుడు పల్క హరిణాక్షి పోయె — నన సీతఁ బేర్కొని యట మూర్ఛవోవ"[2]

ఇచట భ్రమమను సంచారి భావముతోఁ గూడి (సీతా) స్మృతి యనెడి యనంగదశ (రామ) నాయకుని మూర్ఛా స్థితికి దారి తీసినది.

అద్భుతమైన యీ కల్పనము అవాల్మీకము. జయదేవుని ప్రసన్న రాఘవ నాటక మందలి హృదయంగమమైన ఈ క్రింది శ్లోకమునకు ఛాయానువాదము.

---

1. హనుమన్నాటకము. అంకము. 5. శ్లో. 1.
2. రంగనాథ రామాయణము, కిష్కింధాకాండము, ద్వి. 787-785.

"సౌమిత్రేనను సేవ్యతాం తరుతలం చండాంశు రుజ్జృంభతే।
చండాంశోర్నిశి కాకథా రఘుపతే చంద్రోయ మున్మీలతి।
వత్సైతద్విదితం కథంనుభవతా ? ధత్తేకురంగం యతః।
క్వాసి ప్రేయసి ? హాకురంగనయనే! చంద్రాననే! జానకి !"[1]
హనుమన్నాటకమునందును నీ శ్లోకమున్నది.[2]

రంగనాథ రామాయణ కర్త ఏతదనుగుణముగా ననువదించి గ్రంథములోఁ జొప్పించి ఒక ప్రత్యేక ప్రయోజనమును సాధించినాడు.

వర్షాకాలము గతించిన వెంటనే సీతాన్వేషణకుఁ బూనెదనని వాగ్దానముచేసి పోయిన సుగ్రీవుడు పట్టాభిషిక్తుడై తారా రుమాదేవులతో సుఖముగా నుండెను. కాలము గడచి శరత్తు పొడ సూపినను కామమోహితుడైన సుగ్రీవుడు రాలేదు. ఇక శ్రీరామునకు సీతాస్మరణ తీవ్రతను గలిగించి బాధపెట్టి, భ్రమియింపఁజేయు శరత్తు లంకపై దండెత్తుటకు కాల మనుకూలమైనదని సూచించు చున్నది.

"కామాత్ క్రోధోఽభిజాయతే"[3] అనినట్లు, సీతాదేవిపైగల అనురాగాతిశయము, మదనాతురత్వము సమయమునకు రాని సుగ్రీవునిపై కోపముగా పరిణమించి. సౌమిత్రిని పంపుటకు దారి యేర్పడినది. కార్యకారణ క్రమమున కథాగతికి వేగము కల్పించినది.

భాస్కర రామాయణమునందును దీని కచ్చమైన అనువాదము పొడకట్టుచున్నది. కాని యిది స్థాన భ్రంశము చెందినది.

"తపనుడు వేపఁ జొచ్చెననుఁ దమ్ముడ ! వృక్షము క్రిందఁ బెట్టునాఁ
తపనుడు రేయిలేడు వసుధావర ! చంద్రుడుగాని; చంద్రునిన్
నృపసుత। యెట్లెఱింగితివి నీవు, మృగాంకము చూడనున్కి; హా
చపల మృగాక్షి ! చంద్రముఖి ! జానకి యెక్కడ నున్నదానవే॥"[4]

19) శ్రీరాముని సంశయ నివారణము :—

హనుమంతుడు సీతను దర్శించి వచ్చి శ్రీరామునకు లంకా వృత్తాంతమును దెలుపుచు,

1. "ధాత్రీశ యింటింటఁ దప్పక యగ్ని-హోత్రములున్నవి యోంకార మెసఁగ
2. ననవుడు విని యత డతిచోద్యమంది-మనమునఁ జింతింప మారుతి యనియె
3. సత్యంబు ధర్మంబు శౌచంబు దయయు-నత్యంత శూన్యంబ యసురలయందు

---

1. జయదేవుడు-ప్రసన్న రాఘవము, అంకము-6, శ్లో-1.
2. హనుమన్నాటకము, అంకము-5, శ్లో. 18.
3. భగవద్గీత- అధ్యాయము-2, శ్లో. 62.
4. భాస్కర రామాయణము, అరణ్యకాండము, ఆశ్వా-2, పద్య-264.
(ఇది కిష్కింధా కాండమున నుండుటయే సముచితము).

4. నని పల్కుటయు సాధ్యమౌనని లంక-జనపతి ముదమందఁ జతురుడై "1 పల్కెను. ఇది అవాల్మీక భావన. హనుమద్రామాయణమునందున్న ఈ క్రింది శ్లోకము దీనికి ఆధారము.

"అగ్నిహోత్రాశ్చవేదాశ్చ రాక్షసానాం గృహేగృహే।
దయా సత్యం చ శౌచం చ రాక్షసానాం నవిద్యతే॥"2

పై ద్విపదలలో 1, 3 నంబర్లు గలవి ఈ శ్లోకమునకు అచ్చమైన అనువాద ద్విపదలు. 2వ నంబరుగల ద్విపద శ్రీరాముని మనోభావ వ్యాఖ్యానము. సంస్కృత శ్లోకమున నిది అధ్యాహారము.

వాయుపుత్రుడు "లంకాపురము నందింటింట అగ్నిహోత్రములు, వేదాధ్యయనములు ఎడ తెగకున్నవి" అని పలుకగా, రాము డాశ్చర్యపడి చింతింపసాగెను. ఎందుకు? "సాధువులు, సత్పు రుషులు, దైవభక్తి కలవారే పై కర్మల నాచరింతురు. నిర్నిమిత్తముగా, ఏ పాపము లేకుండా వారినెట్లు వధించవలె?" ననెడి సందేహము శ్రీరాముని చింతకు కారణము కావచ్చును. దీని నూహిం చిన మారుతి వెంటనే "రాక్షసులందు దయ, సత్యము, శౌచము ధర్మము లే"దనెను. అప్పుడు రామునకు "లంక సాధ్యమగు"నని ముదము జనించినది.

"దయాదులు లేని వాని మనస్సు కామక్రోధాదులకు లోనై క్రౌర్యములు చేయుటకు వెను కాడదు. అతడెంతటి వేదాధ్యయనపరుడైనను, హోమాది కర్మల నాచరించువాడైనను, దయాధర్మ, శౌచధర్మ వర్జితుడగుటచే తత్కర్మల వలన జనించెడి శక్తిని, మహిమను లోకోపద్రవమునకే వినియోగించుచుండును. హింసాదులు చేయువాడు పాపిష్ఠుడే; కావున వధార్హుడే; వారి దుష్టకార్యములే వారికి నాశనము సమకూర్చును అందుచే చింతించవలసిన యవసరము లేదని" భావించి శ్రీరాముడు ముదమందెను

మూల శ్లోకమునందు శ్రీరాముని మనోవిచారము, మనస్సంతోషము పాఠకుని యూహకు వదలివేయబడినది. కాని రంగనాథ రామాయణకర్త పాఠకులు సందేహపడకుండ స్వారస్యమును గ్రహించవలెనని తలంచియున్నందున పూర్వాపర వ్యాఖ్యాన మొనర్చి దురూహలకు తావు లేకుండ చేసినాడు. సందర్భ శుద్ధితోపాటు రచనా సారళ్యమున కిది యొక చక్కని నిదర్శనము—

20) అంగద రాయబారము :—

అంగద రాయబారము నందలి దశగ్రీవాంగదుల సంభాషణము వాల్మీకి రామాయణమునందు కంటే రంగనాథ రామాయణమున ఎంతయో సరససుందరమై యొప్పుచున్నది. దీనికి కారణము హనుమన్నాటక శ్లోకానుసరణమే యని తోచుచున్నది.

వాలిసూనుడు లంక కేగి రావణుని ముందు నిలిచెను. అంతట పంక్తికంధరుడు—

"క్రొవ్వి వానరుడ యీ కొలువు లోపలికి-నెవ్వగ నొందక నేడు వచ్చితివి

---

1. రంగనాథ రామాయణము- యుద్ధకాండము, ద్వి 65-68.
2. ఇది శ్రీరామాయణ సారోద్ధారము- యుద్ధకాండము; 1వ సర్గలో 50వ శ్లోకముగా నుద్ధరింప బడినది.

ఎవ్వరు బంచినా రెవ్వండ వీవు-ఎవ్వని తనయుండ వేమి నీపేరు
నివ్వటిల్లెడు లంక నీపటు చొచ్చి-యెవ్వరి పనిబూని యేగుదెంచితివి
వనచర చెప్పరా వచ్చిన కార్య"

మని యదలించి యడిగెను. అప్పు డంగదుడు క్రోధ వివశుడయ్యెను. వారి నడుమ సంభాషణ మిట్లు నడచెను.

"నీ వెవ్వడని పల్క యెఱుగవే నన్ను- రావణ! యేనురా రాముని బంట
రాముడెవ్వడు ? పరాక్రమమునఁ బరశు-రాముని గెలిచిన రణవిచక్షణుడు
అతడెవ్వ ? డుద్ధతుండై కార్తవీర్యు-నతివీరుఁ ద్రుంచిన యతుల విక్రముడు
అతడెవ్వ ? డెఱుగవా యాజిలో నిన్ను-జితుఁ జేసి కొనిపోయి చెఱనిడ్డవాడు
ఎవ్వని తనయుడో? యెఱుగవా నన్ను-నివ్వటిల్లగఁ బట్టి నినుఁ దోకఁ గట్టి
మొఱపెట్ట వార్ధుల ముంచి ముంచీడ్చి-కరుణించి విడువడే ఘనుడైన వాలి
యా వాలి మఱచితే యకట యింతటనె-యే వాలి సుతుడౌట యెఱుగవా యోరి
యంగదు డనువాడ ననురేశ వినుర"2

యని యుక్తి ప్రత్యుక్తి రూపములైన ద్విపదల కీ క్రింది శ్లోకము లాధారములు.

1) "క స్త్వం కస్యాసి పుత్రః క్వపున రిహగతః కింను కృత్యం చ కస్మాద్
... .

2) క స్త్వం వాలి తనూద్భవో రఘుపతే ర్దూతః న వాలీతి కః
కోవా వానర రాఘవ స్సముచతా తే వాలినో విస్మృతిః।
త్వాం బద్ధ్వా చతురంబు రాశిషు పరిభ్రామ్యన్ ముహూ ర్తేనయః
సంధ్యా మర్చయతిస్మ ని స్త్రిప కథం తాత స్త్వయా విస్మృతః॥

3) త్వద్దోర్దండ ప్రచండ ప్రతిహనన విధి ప్రౌఢ బాహోః సహస్ర
చ్ఛేద క్రీడా ప్రవీణస్థిర పరశు మహాగర్వ నిర్వాపకస్య।
దూతోహం రాఘవస్య త్వదపఘన ఘృణావాస వాలాగ్ర లోమ్నః
పుత్రః సుత్రామసూనోః ప్లవగ బలపతే ర్నామతశ్చాంగదో ఽహం॥"3

ఇట్లే రావణుని ప్రశ్నలు- అంగదుని సమాధానములు ఔచిత్య శోభితములు; శ్రోత్రమనోహరములు; సరస సుందరములు.

"వలసుగా నిట మున్ను వచ్చిన ధూత- యలరగఁ దన పేరు హనుమంతు డనుచు
....

1. రంగనాథ రామాయణము- యుద్ధకాండము- ద్వి. 1914-1917.
2. రంగనాథ రామాయణము- యుద్ధకాండము- ద్వి. 1919-1926.
3. హనుమన్నాటకము అంకము-8, శ్లో. 25, 39, 40.

పనుపడ్డ నిటువంటి పనులంపుచుండు"-నని యంగదుడు వల్కె"1

ఆరెడె ద్విపదలలో రావణుని లోని కంగారు, బయటి బడాయితనము (అనగా లోనిలొటారము బయటి పటారము), అంగదునిలోని గాంభీర్యము, బయటి నిర్భయత్వము, నిందాస్తుతి, స్తుతినిందా వ్యాజమున చాల చక్కగా వ్యక్తీకరింపబడినవి. అద్భుతమైన యీ కల్పన మీ క్రింది శ్లోకములకు ఛాయానుసరణము.

1) కస్త్వం వానర రామరాజభవనే లేఖ్యార్థ సంవాహకో
యాతః కుత్ర పురాగతః సహనుమాన్ నిర్దగ్ధ లంకాపురః
బద్ధో రాక్షస సూనునేతి కపిభిః సంతాడిత స్తర్జితః
స వ్రీడాత్త పరాభవో వనమృగః కుత్రేతి నజ్ఞాయతే॥

....

2) సోఽస్మాకం కటకే కదాచిదపి నో వీరేషు సంభావ్యతే।
దూతత్వేన ఇత స్తతః ప్రతిదినం సంప్రేష్యతే సాంప్రతం॥"2

ఇందలి "హనుమాన్ నిర్దగ్ధ లంకాపురః" (లంకాపురమును గాల్చిన హనుమంతుడు) అను విశేషణముచే హనుమంతుని గొప్పదనమే వ్యక్తమగును, గాని రావణు డతనిని నిందించినట్లు కాలేదు. దశకంఠు డా విషయమునే ప్రస్తావింపఁగూడదు. హనుమంతుని తోకఁ గాల్పించి శిక్షించిన రీతిని ప్రస్తావించిన తన్ను తాను పొగడుకొనినట్లగును. కావున బుద్ధారెడ్డి యిచట ఆ విశేషణమును దొలగించి "వలనొప్ప నిటవచ్చి...... మా చేత దండన మఱి పొందిపోయె"నని మార్చి నాడు. ఇది యెంతయును సమంజసము. ఇది యొక్కటి తప్ప మిగిలిన విషయమంతయు తచ్ఛ్లోకానుసరణమే.

అంగదుడు రావణునికి రాముని పరిచయము చేయుచు
"ఏర రావణ ! రాము నెఱుగవా యోరి- ....
అడరి నీ చెలియ లత్యాసక్తి డాయ-నడచిన నా శూర్పణఖ ముక్కు సెవులు
వడిఁ బట్టి కోసిన పగఖడ్గ ధార-పడియు నెత్తురుఁ దుడువంగ రోసిరోసి
ఖరదూషణాంగ రక్తంబులం గడిగి-కరమొప్పఁ జేసిన కాకుత్స్థతిలకు
నెఱుగవా రాముని ? నేటికిఁ బ్రేలెద"ని3

పల్కినాడు. ఇది రావణ గర్వాపహములే కాక, అతని మదికి శూలములై లజ్జ గల్గించుచున్నవి. ఇట్టి సుందరభావము

"రామో నామ స ఏవ యేన భగినీ నాసా వసా పంకిలః
ఖడ్గస్తే ఖర దూషణ త్రిశిరసాం ధౌతః శిరఃశోణితైః॥4

అనెడి శ్లోకార్థము ననుసరించినది.

---

1. రంగనాథ రామాయణము, యుద్ధకాండము, ద్వి. 1931-1943.
2. హనుమన్నాటకము, అంకము, శ్లో. 6. 7.
3. రంగనాథ రామాయణము, యుద్ధకాండము, ద్వి. 1945, 1960-1953.
4. హనుమన్నాటకము. అంకము-8, శ్లో. 30.

రావణుడు శ్రీరాముని శౌర్యమును నిందించుచు చేసిన అధిక్షేపణలు పాఠకుల కాహా యనిపించును.

"ఆ రాము పౌరుష మారాము కడిమి-ఆరాము భుజబలం బదియెంత పెద్ద
చలమునఁ దాటకఁ జంపెనఁటేని-తలపోయ నాఁటది; దాని పెంపెంత ?
జలకుని విలు ద్రుంచి జనక తనూజ-ఘనతఁ జేకొన్నట్టి ఘనుడంటి వేని
నా విల్లు నేటిదే; యది యెంచనేల? - ఆ విల్లు చివుకిది; అది యేమి దొడ్డు ?
....
పూని నా ముందఱఁ బొడవులు సేసి-వాన రాధమ రాము వర్ణించె దీవు"[1]

నన్నయ భట్టారకుడును శ్రీకృష్ణలీలలను గూర్చి శిశుపాలునిచే నిట్లె అధిక్షేపింపఁ జేసినాడు.

"పూత నాఘాతంబుఁ జేతనే తరమైన-శకటంబు ద్రోపును జరణవిహతి
పీకతోఁ గడుఁ బూచు మ్రాకుల విఱుపును-వల్మీక మాత్ర పర్వతము నెత్తి
కొని లావు గఁడు వీడన నేడు దివసంబు లునికియు వృష వధయును ననంగ
బమ్మిన కృష్ణ బీరమ్ములు వొగడుచు-నున్న నీ నాలుక యొక్కఁడయ్యు
వ్రయ్యవలయు నూఱు వ్రయ్యలు గా గన-ట్లయినఁ గావి చాల వతసిఁ బొగడ"[2]

బుద్ధ భూపతి యీ ఛాయనే యింతకంటె సరసముగా రావణునిచే రాముని వీరమ్మును ఉపాలంభింపఁ జేసినాడని స్ఫురించును. కాని ఈ ద్విపదలు ఈ క్రింది శ్లోకమునకు అచ్చమైన యను కరణములు.

"భగ్నం శంభుధను ర్గుణైరపహృత స్సంతాడితా తాటకా
సాఽపి స్త్రీ జరతీ ఖరప్రభృతయో వ్యాపాదితా స్తేఽర్భకాః।
తాలా స్సప్త హతా స్తృణాని ఖలుతే వాలీ హతోఽసౌ కపిః
బద్ధో వారినిధి ర్నిరుత్తర ఇతి శ్రోతాఽభవ ద్రావణః॥"[3]

ఇందలి "తాలాస్సప్త హతా స్తృణాని" యనునది వదలి వేయబడినది. పరశురామ, మారీచ వృత్తాంతములు రెండు క్రొత్తగాఁ జేర్చబడినవి. ఖరప్రభృతులు "అర్భకాః" అనుటకు బదులు "వృద్ధు"లని మార్చబడినది. ఇక మూలమునందలి

"బద్ధోవారి నిధిః" అనగానే "నిరుత్తర ఇతి శ్రోతాఽభవద్రావణః"

అనుట సమంజసముగా లేదు. ఇది రావణుని ఆలోచనాశక్తికి, సద్యస్సమాధాన యోగ్యతకు కళంకము నాపాదించుచున్నది. కావున రంగనాథ రామాయణ కర్త ఆలోచించి

---

1. రంగనాథ రామాయణము. యుద్ధకాండను. ద్వి. 2005-2018.
2. నన్నయ భారతము. సభాపర్వము. ద్వితీయాశ్వాసము. పద్య. 42.
3. హనుమద్రామాయణము. మరియు నానారామాయణ సారములోనిదని (రామాయణ సారోద్ధారము. యుద్ధకాండ. సర్గ. 10. పుట. 204లో ఉద్ధృతము.

"నిరుత్తరః" ను "అవార్ధి జలమాత్ర మదియేమి బలిమి"
అనిమార్చి తత్కాలమున దశకంఠుని ఘనతను పెంచినాడు.

ఇచట దశగ్రీవుడు ప్రయోగించిన రాజనీతి పరాకాష్ఠ చెందినది. ఇందు సామదాన, భేద, దండోపాయములు అను నాలుగుపాయములు ప్రధానములు. శ్రీరామునితో అంగదునికి ద్వేషము కలిగింప జేయుటకును ఆయంగదుని తనపైపు ద్రిప్పుకొనుటకును రావణుడు ప్రదర్శించిన దాన, భేద నీతులు అవాల్మీకములు, ఆశ్చర్యావహములు.

"వనచరాధమ యోరి వాలికి నీవు — తనయుండవై యుండి దశరథాత్మజుని
గొలిచిరి బంటవై కొల దిగనాడి — చలమున నీతండ్రిఁ జంపెను రాము
డట్టి రాముని గొల్చి తధమ వానరుడ — పుట్టితి వాలి కడ్డున వృథా నీవు
చంపిన పంగవానిఁ జంపక రాము — పంపు సేయుచు నిట్లు బంటవై తిరిగి
యెలమితోఁ గొలువంగ నీరాజె కాని — తలపోయ రాజులు ధరణిపై లేరె.
గొనకొని పగవానిఁ గొలిచిన వాని — నినుఁ గాని యెవ్వని నేనెందుఁగాన
నీమగటిమికిని నీదు పెంపునకు — నీమ వారెల్లను నీ యని నగరె
కొడుకైన పిమ్మట కులవైర మెల్ల — వడితొడ నీగని వాడెట్టి కొడుకు"[1]

హనుమన్నాటిక మందు ఈ సందర్భమున
"ధిగ్ధిగంగద మానేన యేన తే నిహతః పితా।
నిర్మానా వీర వృత్తిస్తే తస్య దూతత్వమాగతః"[2]

అనికలదు-ఇది చిన్న శ్లోకమైనను తనయందెంతయో విషయమును గర్భీకరించు కొన్నది. పరిశీలింపగా. బుద్ధ భూపతి దీనికి వివరణాత్మకముగానే పైపది ద్విపదలు వ్రాసినాడని తోచును ఇంతేకాక,

"....   ...   . — బగి దౌత్యమిటు సేయు చుండుటఁ దక్కి
ననుగొలిచిన నిన్ను నంగద యిపుడు — వనచరులకు నెల్ల వర విభుగాగ
ఘన భూషణంబుల ఘన వాహనముల — మన జేతు నిప్పుడు మహిమీద"[3]

ననిన రావణుని దాననీతి ప్రదర్శింపబడినది. ఆ భేదనీతి కిదాన నీతి తోడై రావణ సంభాషణకు సమగ్రత యేర్పడినది. తన తమ్ముడు విభీషణుడు శ్రీరాము నాశ్రయించగా, నతడతనిని లంకకు రాజును జేసినాడని చారుల ద్వారా వినియున్న దశగ్రీవు డదేయాయుధమును అంగదునిపై ప్రయోగించినాడు. ఇది రావణుని కూట నీతికి నిదర్శనము.

---

1. రంగనాథ రామాయణము యుద్ధకాండము. ద్వి. 2048-2056
2. హనుమన్నాటకము. అంకము. 8, శ్లో. 26.
3. రంగనాథ రామాయణము, యుద్ధకాండము. ద్వి. 2059-2061.

అంగదుడు

కర్మ పంకములెల్ల గడతేరి వాలి — నిర్మలాత్ముడు రామ నృపలిచే౯ జచ్చి
పదపడి వైకుంఠ పదముఁ గైకొనియె — నిది కీడుగా మమ్మ నెన్న నేమిటికి?"[1]

అని రావణునికి తగిన సమాధానము చెప్పినాడు.

హనుమన్నాటకమున నిచట నీ క్రింది శ్లోకమున్నది.

"యుక్తం కృతంతు రామేణ యేన మే నిహతః పితా,
త్రైలోక్యే శాస్త్ర కృత్యాయ వర్తతే సదురాత్మనాం॥''[2]

ఇది తనతండ్రి దుష్టుడని స్వయముగా నంగదుడు చెప్పినట్లయినది తండ్రి దోషి, దుష్టుడగుగాక; కాని ఉత్తమ పుత్రు డెప్పుడును స్వయముగా తన తండ్రి దుష్టుడని నోట పలుక కూడదు గదా! కావున బుద్ధారెడ్డి ముగింపులో పైరీతిగా ద్విపదలు వ్రాసి అంగదుని శీలము నాకసము కెత్తినాడు.

వాల్మీకి రామాయణమునందు "అంగదు రాయబారము" ఇంత దీర్ఘముగా, హృదయా వర్జకముగా లేదు "అంగదుడు శ్రీరాముని సందేశమును రావణునకు నిండు సభలో వివరించగా, నతడు కోపించి అంగదుని బంధింపుమని రక్కసుల కాజ్ఞ నిడినాడు."[3]

కావున 'అంగద రాయభార' ఘట్టములోని విషయమంతయు చాల వర కవాల్మీకము. ఉక్తి ప్రత్యుక్తులతో, నాటకీయ శైలిలో నొప్పి, రావణాంగదుల స్వభావములను ప్రతిబింబింపఁ జేయునదై, చదివిన కొలది చవులూరింపఁ జేయుచు రంగనాథ రామాయణమున సదిముకుటాయ మానమై విరాజిల్లుచున్నది. దీని కంతటికి కారణము పైనఁ జూపిన రీతిగా హనుమన్నాటక (హనుమద్రామాయణ) శ్లోక భావములను యథాతథముగా గ్రహించి వ్రాయుటయే.

(21) శ్రీరాముని శయన వైభవము :—

దశకంఠు డుత్తర గోపురమునకు వచ్చి మహావైభవోపేతముగా సింహాసనమున దు గూర్చుండెను. అట్టి సమయమున లంక యుత్తరపు దిశను విడిసియున్న రఘు రాముడు శయనించి యుండెను ఈ శయన రీతి

"ఆవేళ మాయా మృగాజినంబునను — దేవేంద్ర మణి కాంతి దేపించుమేని
వామ భాగము మోపి వామభుజాగ్ర — సీమఁ గపోల పూర్జితముగాఁ జేర్చి
.... మొదలుకొని............ ....
రమణీయ లీల శ్రీరాఘవేశ్వరుడు — అమర దక్షిణ ముఖమై యున్నవాడు"[4]

అను దాని వరకు అత్యంత మనోహరముగా వర్ణింప బడినది.

ఇది యవాల్మీకము. అద్భుతమైన యీ కల్పన మచ్చముగా హనుమన్నాటక మందలి ఈ క్రింది శ్లోకభావము ననుసరించి యున్నది

---

1. రంగనాథ రామాయణము. యుద్ధకాండము ద్వి; 2074-2076
2. హనుమన్నాటకము. అంకము. 8 శ్లో. 27.
3. వాల్మీకి రామాయణము. యుద్ధకాండము. సర్గ. 41 శ్లో. 75-82 1/2.
4. రంగనాథ రామాయణము. యుద్ధకాండము ద్వి 2148-2158

"అంకే కృత్వోత్తమాంగం ప్లవగబలపతేః, పాదమక్షస్యహంతుః
తారాపుత్రస్యహస్తం,[1] త్వచి కనక మృగస్యాంగ శేషం నిధాయ।
బాణం రక్షఃకులఘ్నం ప్రగుణిత మనుజే నాదరాదీక్షమాణః
చక్షుః కోణేన లంకాం త్వదనుజ వచనే దత్త కర్ణోఽయమాస్తే॥"[2]

రావణుడు ప్రతినాయకుడు; శ్రీరాముడు నాయకుడు. దశగ్రీవుడు ద్వేషాసూయలు గలిగి తన వైభవమును శ్రీరామునకుఁ జూపఁదలచి ఉత్తర గోపుర సింహాసనమున కొలువున్నవాడుగదా! అపుడు నాయకుడైన రామచంద్రుని వైభవము సహజముగా, రావణునికంటె అత్యుదాత్తముగా నుండవలెను. ఇరువురి వైభవములను బోల్చినపుడు ఇది ప్రస్ఫుటముగాఁ గనబడవలెను. కావుననే "అంకే కృత్వోత్తమాంగం" అనెడి శ్లోక భావము ననుసరించవలసిన అవసర మేర్పడినది—

వ్యత్యాసమును పరిశీలింపుడు—

రావణుడు.	శ్రీరాముడు.
1. ఇతడు కూర్చున్నాడు	1. ఇతడు శయనించినాడు.
2. కూర్చున్నది సమున్నత మాణిక్య జాల ప్రభా సింహాసనము నందు.	2. రాజసముగా నొఱగినది మాయా మృగాజి నమునందు.
3. ఇతడు అష్టదిక్పతులను జయించి కైకొన్న బిరుదు గండపెండెంబునుడాకాల ధరించి నాడు.	3. ఇతడు సుగ్రీవుని తొడలపై శిరమును, ఆంజనేయుని తొడలపై పాదములను జేర్చగా, పవనపుత్రుడు పాదసంవాహన మొనరించుచున్నాడు.
4 ఇరువంకల పరిచారకులున్నారు. మంత్రులు, రాక్షసులు కేవలము పరివేష్టించి యున్నారు.	4. సమీపమున అంగదుడున్నాడు. నలనీలా దులు వంది బృందములవలె నిలిచి సన్ను తించుచున్నారు.
5. అపరాచలము మీది అర్కుని బోలి యున్నాడు.	5. కందని పూర్ణరాకాచంద్రుని బోలి యున్నాడు
6. గొడుగుల నీడచే చీకటి వ్యాప్తమైనది.	6. తెలి కన్నుగవ కాంతి దిశలెల్ల నిండినది,
7. ఇతడు మౌనముద్రావలంబితుడు.	7. విభీషణునితో రహస్యముగా మాట్లాడు చున్నాడు.

శ్రీరామ దశకంఠుల ఈ రీవి వ్యత్యాసమును గమనించి ఆలోచించినచో, అనేక వ్యంగ భావములు స్ఫురించుచున్నవి.

1. ఓరి రావణ! నీవు సింహాసనముపై కూర్చున్నావు. ఇటు చూడునన్ను. సీతను సౌమిత్రిని మోసగించుటకు బంగారులేడి రూపుతో నే మారీచుని బంపితివో, అతనిని హతమార్చి నేనా చర్మముపైననే మేను వాల్చినాను. మారీచుని మాయలు నాయెడ చెల్లనట్లు, నీ మాయలను

---

1. దీనికి పాఠాంతరము- "భూమౌ విస్తారితాయాం"
2. హనుమన్నాటకము, అంకము-11, శ్లో. 7.

నాయందు పనిచేయవు. మారీచుని హతమార్చినట్లు నిన్నును హతమార్చగలను; జాగ్రత్త" యని రాముడు హెచ్చరిక చేసినట్లున్నది ఆ తీవి.

2. "ఓరి దశకంఠ ! నీవు కేవలము దిక్పాలకుల నిర్జీవ ప్రతిమలుగల బిరుదు గండపెండెంబును ధరించి గొప్పవాడనని అహంకరించుచున్నావు. వారు నా కాళ్ళు పట్టుకొన్నారని తలంచుచున్నావు. కాని దిక్పాలకుల కట్టి ప్రతిపత్తిలేదు; వారు కాలానికి, విధికి లొంగిపోయినవారేకాని వేరుగాదు. ఇదుగో ! ఇటుజూడు నా పాదములను ఆంజనేయుడు స్వయముగా పట్టుకొని సంవాహనము చేయుచున్నాడు. ఈ ఆంజనేయుడే సముద్రమును లంఘించి, నీ వనమును జెఱిచి, అక్షయ కుమారాదులను సంహరించి, లంకనుగాల్చి, క్షేమముగా తిరిగివచ్చినాడు; స్మరించుచున్నావా ? అతనికి ప్రభువైన సుగ్రీవుడు తన తొడను తలగడగాఁ జేసినాడు; కనబడుచున్నదా ? నీవుకూడ వీరివలె నన్నాశ్రయించుము; క్షమింపబడగలవు. ఆలోచించుకొమ్ము" అని తెలిపినట్లున్నది ఆ శయన తీవి.

3. నీ కిరువంకల నున్నవారు సామాన్య రాక్షసులు, సర్పములు; పొట్టకూటికై నిన్ను సేవించువారు. నా సమీపమున నున్న వాడెవడో చూడుము. అంగదుడు; వాలి తనయుడు. ఈ వాలియేకదా నిన్ను చంక నిఱికించుకొని, పదితలల వింత పురుగని, బాలుడుగానున్న ఈ అంగదుని తొట్లెపై బంధించగా, ఆ యంగదుడు చిమ్మించి కొట్టిన మూత్రముచే నీ ముఖమంతయు తడిసి, నోటిలోను పడినది; గుర్తునకుఁ దెచ్చుకొమ్ము అట్టి వాలిని హతమార్చి, అతని ప్రార్థనపై కుమారుడైన అంగదునికి యౌవరాజ్య పట్ట మిప్పించినాను. నీవుకూడా శరణాగతి నొందితివా అంగదునివలెనే రక్షింతును" అని సూచించినట్లున్నది ఆ శయన తీవి.

4. నిన్ను పరివేష్టించియున్న అనేక మంత్రులు కేవలము స్ఫురితభూషణ వస్త్రభూషితులు- అనగా పై మెఱుగులవారు నన్ను పరివేష్టించి స్తుతించువారు నల, నీల, జాంబవదాది ప్రముఖ నాయకులు. సముద్రమును బంధించినవాడు నలుడు; ముయ్యేడుమాఱులు భూప్రదక్షిణము చేసిన వాడు జాంబవంతుడు; పావకపుత్రుడగు నీలుడు తండ్రితో సమానమైన బల పరాక్రమములు గలవాడు నీ మంత్రులు గొప్పవారో, వీరో విచారించుకొనుము. వీరివలె నన్నుతింతువా, నిన్ను కాపాడెదను" అని యుపదేశించినట్లున్నది యా శయన తీవి.

5. నీవు అస్తమించు సూర్యుని బోలినవాడవు- అనగా కొలది కాలములో సూర్యు డస్తమించునట్లు, నీకును అస్తమయ మాసన్నమైనది. నేనో కందని పూర్ణరాకా శశాంకుని బోలిన వాడను; వృద్ధిదశలో నున్నాడను. సూర్యుని తాపముచే లోకు లల్లాడినట్లు, నీ దౌష్ట్యముచే జగమంతయు సంక్షోభించినది. చంద్రోదయాభ్యుదయములచే తత్తాప ముపశమించునట్లు, నాచే నిక ముందు లోకుల మనస్సులు, కన్నులు చల్లబడును;" అని తన యుద్దేశమును ప్రకటించునట్లున్నది యా శయన పైభవము.

6. నీ గొడుగులచే చీకట్లే వ్యాపించినవి. నా కన్నుల కాంతిచే, చూపుల వెలుగులచే జగమంతయు వెలుగుచున్నది. చీకట్లను కాంతి ఛేదించినట్లు, నీ గొడుగులను నేను ఛేదింతును. నాకై పుణ్యమును చూచెదవుగాక;" యని భావిని ప్రదర్శింపఁజేయుచున్నది యా శయన తీవి.

7. తప్పు చేసినవాడు, చావుకు సిద్ధమైనవాడు నోట మాట యాగిపోగా నున్నట్లు నీవున్నావు. ఇదిగో! నీ తమ్ముడు; కాబోయే లంకాసార్వభౌముడు: విభీషణుడు రెండు చేతులను జోడించి నీ తప్పులను, రహస్యములను ఎట్లు విన్నవించుచున్నాడో! చూడుము. అతనివలెనే నీవును అంజలించి శరణాగతి పొందితివా, అతని మాటలను వినక తప్పులెన్ని యున్నను దయతోఁ గాచి రక్షింతును." అని కరుణతోడ బోధించునట్లున్నది యా శయన రీతి

ఇట్లనేక వ్యంగ్య భావములు పాఠకుల సంస్కారమును బట్టి పొడముచుండును. ఈ వర్ణనము రావణుని కృత్రిమ వైభవముకంటే శ్రీరాముని సహజ సౌందర్యవైభవమే-రీతియే గొప్పదని చెప్పక చెప్పినట్లున్నది. ఇట్టి అద్భుతమైన వర్ణనకు, కల్పనకు హనుమద్రామాయణ మందలి పై శ్లోక మాధారము. అయినను కవి బుద్ధభూపతి సందర్భోచిత్యమునకై ఒకటి రెండు చిరు మార్పులు చేసినాడు.

1) మూలమునందలి "బాణం రక్షఃకులఘ్నం ప్రగుణిత మనుజేనార్పితం తీక్ష్ణమక్ష్ణోః కోణేనోద్వీక్ష్యమాణః" అను భావము పరిత్యజింపబడినది.

2) పూర్వాపర విరోధము దొలగించుటకై, సమాన ప్రతిపత్తి గలిగించుటకై యిందు "నల నీల భల్లూక నాయకాదులు పరివేష్టించి వంది బృందముల రీతి శ్రీరాముని స్తుతించుట, తెలి కన్నులకాంతి, చూపు వెన్నెలలు వెదజల్లఁబడుట" యనునవి క్రొత్తగాఁ గూర్చబడినవి.

ఇచట ఒక చిన్న సందేహము.

"మారీచుడు మరణించునపుడు తన మాయా మృగత్వమును వదలినాడు. రాముడు మరి యొక మృగమును జంపి తచ్చర్మ మాంసములతో పర్ణశాలకు బయలుదేరినాడుకదా! అట్టిచో మాయామృగాజినము (కనకమృగ చర్మము) శ్రీరామున కెక్కడిది?" అని,

ములుకుట్ల నరసింహావధానులుగారు—

"హత్వైతచ్చర్మ మాదాయ శీఘ్రమేష్యామి లక్ష్మణ"[1]

యని శ్రీరాముడు సౌమిత్రితోఁ జెప్పిన మాట ననుసరించియే, ఆ చర్మము రామునకు లభించినది. భాగవతమునందు శ్రీకృష్ణునిచే శాపవిముక్తులైన యమళార్జున వృక్షములు మరల పూర్వమువలె నుండినటుల వర్ణింపఁబడి యున్నదిగదా! అట్లె యని తెలియవలెను"[2] అని సమాధానమును వ్రాసి యున్నారు.

కాని యిది సమంజసముగా లేదు; పూర్వాపర విరోధమనుటలో సందేహములేదు-

బుద్ధారెడ్డి ఈ హనుమద్రామాయణ శ్లోక రామణీయకత్వమునకు పరవశుడై, ఈ విరోధమును గమనించినవాడు కాడు. అదిగాకను, తాను వర్ణించెడి రావణ శ్రీరామ వైభవ వ్యత్యాసములను గనపఱచుటకు మిగుల నౌచిత్యవంతమై యిది యొప్పుచున్నది. అందుచే "మాయామృగ చర్మ మెక్కడిది? యను ప్రశ్నను పట్టించుకొన్నవాడు కాదనవచ్చును.


---

1. దా. ప్రతి వాల్మీకి రామాయణము అరణ్యకాండము, సర్గ 43, శ్లో. 49.
2. ములుకుట్ల నరసింహావధానులుగారు- "రామాయణ సారోద్ధారము యుద్ధకాండము. ప్రథమ భాగము. పుట-153.

మొత్తముపై రంగనాథ రామాయణము నందలి ఈ అవాల్మీక కల్పనము గ్రంథ గౌరవము నిబ్బడించుచున్నది.

ఇట్లు పరిశీలించిన, బుద్ధభూపతి వివిధ రామాయణములను బాగుగా నధ్యయనము చేసి, తనకు నచ్చిన విషయములను ఆ యా సందర్భములందు ఇతరులు పసిగట్టని రీతిగా చక్కగా పొదిగి యున్నాడు" అని విదితమగును.

శ్రీ సీతారామాభ్యాం నమః॥



రంగనాథరామాయణముపై పురాణముల ప్రభావము

గోన బుద్ధారెడ్డి "సర్వపురాణ విచార తత్పరుడు"1 ఇట్లని "బహుపురాణజ్ఞులు, బహు శాస్త్ర విదులు, బహు కావ్యనాటక ప్రౌఢిమానసులైన హిత మంత్రి పురోహితాదులచే నిండుకొల్వున నుతింపబడినాడు. బుద్ధారెడ్డి తండ్రియైన విట్ఠలనాథుడు కూడ కుమారుని పిలిపించి, గారవించి,

"రామాయణంబు పురాణ మార్గంబు

దప్పక నా పేరఁ దగ నంధ్రభాషఁ జెప్పి"2

ఉర్విఁ బ్రఖ్యాతంబు సేయింపుమని కోరినాడు. అట్లే తనయుడును

ఆదికవీశ్వరుడైన వాల్మీకి యాదరంబునఁ బుణ్యులందఱు మెచ్చఁ

జెప్పిన తెలుఁగున శ్రీరామచరిత"3ము

నొప్పఁజెప్పినాడు.

పీఠిక యందలి ఈ విషయముచేత రంగనాథ రామాయణమునందు పురాణ కథాంశములును జేర్చబడినవని యూహ కలుగుచున్నది.

పురాణ శబ్దమునకు (1) ప్రాచీనము (పురాతనము) అనియు (2) వేదోపబృంహణార్థమై రచింపబడిన పంచ4 దశ5 లక్షణ లక్షితమై యొప్పు ప్రత్యేక గ్రంథమనియు రెండర్థములు. మఱియు "పూర్వగాథ" లేక "ప్రాచీనకథ" యనియు నర్థము నిచ్చు విశేష్యముగాఁ గూడ పురాణ శబ్దము వాడబడుచున్నది.

---

1. రంగనాథ రామాయణము. బాలకాండము. పీఠిక ద్వి. 84
2. ,, ,, ,, ద్వి. 93-94.
3. ,, ,, ,, ద్వి. 103-104.
4. బ్రహ్మవైవర్తము- శ్రీకృష్ణ జన్మఖండము అధ్యాయ- 132

   సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వంతరాణి చ।

   వంశానుచరితం చేతి పురాణం పంచ లక్షణమ్॥
5. భాగవతము. స్కంధము- 12. అధ్యాయము-7. శ్లో. 8-10.

   పురాణ లక్షణం బ్రహ్మన్ బ్రహ్మర్షిభి ర్నిరూపితం॥

   శృణుష్వ బుద్ధి మాశ్రిత్య వేదశాస్త్రానుసారతః।

   సర్గోఽస్యాథ విసర్గశ్చ వృత్తీ రక్షాంతరాణి చ॥

   వంశో, వంశానుచరితం, సంస్థా, హేతు, రపాశ్రయః।

   దశభిర్లక్షణైర్యుక్తం పురాణం తద్విదో విదుః॥

   కేచిత్పంచవిధం బ్రహ్మన్ మహదల్ప వ్యవస్థయా॥

ఉదా ;— అది యొక పెద్ద పురాణము.

"పురాణమార్గము" అన్నపుడు ప్రాచీనమార్గము (నన్నయాది పూర్వకవులు చూపిన ప్రాచీనమైన అనువాదమార్గము) అని అర్థము చేసినను, "సర్వపురాణ విచారతత్పరుడు" అన్నప్పుడు పురాణ శబ్దమునకు బ్రహ్మాండాది పురాణ గ్రంథములనియే అర్థమగును. కావున బుద్ధారెడ్డి పురాణముల నన్నింటిని బాగుగా చదివి, వానిలోని పరస్పర విరుద్ధాంశములను సహేతుకముగా విచారించి సమన్వయము చేయుట యందాసక్తి కలవాడని ఆ విశేషణమున కర్థము.

సాధారణముగా ప్రతి పురాణమునందు కొలదిగానో, గొప్పగానో, సంగ్రహముగానో, వివరముగానో శ్రీరామకథ చెప్పబడినది. ఆయా రామకథలయందు వాల్మీకి రామాయణమునందు లేని కొన్ని వినూత్న కథాంశములును, తద్భిన్నమైన విషయములును కన్పించుచున్నవి. "బుద్ధభూపతి అట్టివానిలో తనకు నచ్చిన, సందర్భోచితమని భావించిన కథా విషయములను గ్రహించి వాల్మీకి జాడకు వ్యతిరేకముగాని రీతిలో తన శ్రీరామచరితమందు పొందుపఱచినాడు." అను నంశమును "సర్వ పురాణ విచారతత్పరుడు", "పురాణ మార్గంబు తప్పక" అనునవి దృఢముగా బలపఱచుచున్నవి; అనగా ఆయా పురాణములందు చెప్పబడిన కొన్ని ప్రత్యేకాంశములు రంగనాథ రామాయణమునందు జేర్చబడిన వనుట సారాంశము.

రామాయణమునందు కేవలము రామచరిత్రయే కాక సందర్భమును బురస్కరించుకొని కొన్ని పౌరాణికేతివృత్తములును చోటు చేసికొన్నవి. ఈ వృత్తాంతములను తీర్చిదిద్దుటలో తెలుగు కవికి ప్రధానముగా శివ, స్కంద, పద్మ, బ్రహ్మ, నృసింహ, భాగవత, అగ్ని, గరుడ, విష్ణుపురాణములు సహకరించినవి. ఇదువరలో ఆంజనేయ చరిత్రాదులయందు ఏయే పురాణముల ప్రభావము పడినదో తెలిసికొనియుంటిమి. ఇపుడు ఆయా వృత్తాంతములయందు గ్రహింపబడిన తత్తత్పురాణాంశములను పరిశీలించుటయే ఈ ప్రకరణ పరమోద్దేశ్యము.

1) ఆదిమ శ్లోకము :—

సురతానందమున మైమఱచి విహరించెడి క్రౌంచ పక్షుల జంటలో మగపక్షిని వ్యాధుడు బాణముతోఁ గొట్టెను. అది నెత్తుట మునిగి నేలబడి విలవిల తన్నుకొనుచు ప్రాణములు విడిచెను. ఆడపిట్ట దుఃఖముచే కన్నీళ్ళు రాలగా, కరుణాపూరితముగా కూయసాగెను. ఈ దృశ్యము గాంచి వాల్మీకి హృదయము ద్రవించగా బోయవాని నిట్లు శపించెను.

"మా నిషాద ప్రతిష్ఠాం త్వమగమశ్శాశ్వతీ స్సమాః।
యత్క్రౌంచ మిథునాదేక మవధీః కామమోహితం"[1]

రామాయణ రచనకు మూలభూత మీ శాపవాక్యము. పండితు లీ శ్లోకమున కనేక విశేషార్థము లను జెప్పుచున్నారు. అందులో రెండర్థములు ముఖ్యములు.

1. ఓయి నిషాదుడా! క్రౌంచ పక్షుల జంటలో కామమోహితమైన మగపక్షిని జంపి నందున నీవు బహుసంవత్సరములు జీవించవు.

---

1. దా. ప్రతి వాల్మీకి రామాయణము. బాలకాండ, సర్గ-2. శ్లో. 15.

శ్రీనివాసా ! మండోదరీ దశగ్రీవరూపమైన రాక్షస మిథునమునందు కామమోహితుడైన (సీతాపహర్తయైన) రావణుని సంహరించినందున నీవు బహుళ సంవత్సరములు ప్రతిష్ఠను బొందుదువుగాక !

ఇచట 'మా' శబ్దమును 'నిషాద' శబ్దముతోఁ గూర్చి "మానిషాద" (శ్రీనివాస) యనియు, "అగమః" శబ్దముతోఁ గూర్చి "మాఽగమః" (పొందకుందువుగాక) యనియు సభంగ శ్లేషను సాధించి యిట్టి యనేకార్థము లూహింపఁబడుచున్నవి. బుద్ధభూపతి ఈ యర్థ శ్లేషలను ఏమియు పట్టించుకొన్నవాడు కాడు. మిదుమిక్కిలి మూలార్థ భిన్నమైన ద్విపదలను వ్రాసినాడు. చూడుడు:

"ఓరి నిషాదుండ యోరి పాపాత్మ-ఓరి నీ కెగ్గేమి యొనరించె తొల్లి
కామించి క్రౌంచముల్ గవయుచో నొకటి-నేమిటికై చంపి తిబ్బంగిఁ గడగి
ఈ పాతకమ్మున కనేక దుఃఖముల్-ప్రాపించి తిరుగుము బహుళవత్సరములు

ఇచట మంగళార్థమేమియుఁ జెప్పనేరాదు. ఇక శాపార్థము కూడ ("బహుళవత్సరములు జీవించకుందువు గాక- శీఘ్రమే మరణింతువుగాక" అనుటకు బదులు "బహుళవత్సరము లనేక దుఃఖముల్ ప్రాపించి తిరుగుము" అని మార్చబడినది.

డా॥ పింగళి లక్ష్మీకాంతంగారు

"శాపము అశనిపాతము వంటిది దానిని అల్పాక్షరములతోనే వ్యక్తము చేయుట ఉచితము. అట్లుకాక పెక్కు మాటలలోఁ దిట్టినపుడు శాపముయొక్క తీక్ష్ణత మందగించిపోవును. పై ద్విపద పంక్తులలో గల తిట్లవలన శాపము పేలవమైనది. ఈ రహస్యమును గుర్తెరింగియే కాబోలు భాస్కర రామాయణమున "మానిషాద" అను శ్లోకము తెనిగింపబడక యథాతథముగా ఉల్లేఖింపబడినది."[2] అని తీక్ష్ణముగా విమర్శించియున్నారు. వారి దృష్టితోఁ జూచినపుడది సమంజసమే.

రామాయణ ధర్మమర్మజ్ఞుడైన బుద్ధభూపతి "ప్రథమ కబళే మక్షికాపాతః" అన్నట్లు మొదటనే యిట్లు అలవోకగా, పేలవముగా వ్రాయజాలడు. ఏదో ప్రధానోద్దేశ్యము తోడనే మూల ప్రసిద్ధార్థమును గూడ మార్చి వివరించియున్నాడు. అది ఆలోచింపఁదగినది.

ఆదిమ శ్లోకమునకుఁ జెప్పబడిన మంగళార్థము "రావణ సంహారానంతర శ్రీరామ పట్టాభిషేకముతో కావ్యము పరిసమాప్త మగు"నని సూచించుచున్నది. కొందఱు చెప్పినట్లు వాల్మీకిచే మొదట రామాయణము అయోధ్యాకాండ నుండి యుద్ధకాండము వఱకే రచింపబడినదని యిది నిర్దేశించుచున్నది. కాని ప్రచలిత రామాయణమునందు బాలకాండము మొదలు ఉత్తరకాండమువరకు వాల్మీకి వ్రాసినదే. అట్లున్ననే అవతారోదయమునుండి అవతార సమాప్తివరకైన కథ సంపూర్ణమైనదిగా భాసించును. కావున బుద్ధారెడ్డి కూడ సంపూర్ణ రామాయణమును దెనిగించఁదలచుకొన్నాడు. "ఇది విధి విలాసము వలన అతనిచేఁ గాక, అతని కుమారులచే పూర్తయినది"[3]

---

1. రంగనాథ రామాయణము. బాలకాండము. ద్వి. 147-149.
2. ఆంధ్ర సాహిత్య చరిత్ర పుట-179.
3. రంగనాథ రామాయణము. ఉత్తరకాండము. అవతారిక.

ఉత్తరకాండమందు ప్రధానముగా వర్ణితమైనది సీతావియోగ జనిత రాముని దుఃఖము. దీనికి కారణము భృగుమహర్షి శాపమని పురాణములందు సూచితము. ఆ శాప మిట్లున్నది.

"లోక మనింద్రముగాఁ జేయఁ గోరుచున్న భృగుపత్నిని విష్ణువు సురహితార్థము సంహరించెను. అపుడు భృగువు "నా వలెనే నీవును భార్యా వియోగ దుఃఖమును పొంది పెక్కు సంవత్సరము లనుభవించుచు బాధపడుమని విష్ణువును శపించెను. తచ్ఛాప మనుభవించుటకే నారాయణుడు శ్రీరామావతారము నెత్తెను. రావణాది వధ లోకమునకు ప్రధానము. కాని తనకు గౌణము. ఇట్టి శ్రీరాముడు కరుణరస పరిపూర్ణమైన తన చరిత్రను మిక్కిలి కరుణ గలవాడే వ్రాయజాలునని తలంచి, నారదోపదేశమున రామకథను సంక్షిప్తముగా నెఱింగియున్న వాల్మీకి కారుణ్యమును పరీక్షింపఁ గోరి తాను వ్యాధుడై క్రౌంచరూపుడైన రాక్షసుని మహర్షి చూచుచుండగనే సంహరించెను వాల్మీకి దానిని జూచి హృదయము కరిగి యాతనిని శపించెను. ఈ శాపము భృగుమహర్షి యిచ్చిన శాపమున కనువాదమే."

పద్మపురాణమునందు శ్రీరామ వైభవమును వర్ణించు సందర్భమున సీతా పరిత్యాగ ఘట్టములో నీ విషయము ప్రస్తావింపఁబడినది [1]

కతక వ్యాఖ్యాకారుడు గూడ నీ యర్థమునే నిచట చెప్పియున్నాడు [2]

కొంద ఱీ కతక వ్యాఖ్యానమును ఖండింతురు. అయినను కొందఱిచేనైనను ఈ శ్లోకమందీ యర్థము భావింపబడినదని చెప్పవచ్చును.

ఇదిగాకను ఈ శ్లోకమున కావ్యార్థము సూచింపఁబడలేదు. బ్రహ్మవచ్చి రామాయణమును రచింపుమని ఆజ్ఞాపించిన పిమ్మటనే వాల్మీకి కట్టి యభిప్రాయము గలిగెను. కాని అంతకు ముందా తలంపతనికి లేదు వ్యాధుడు చేసిన అధర్మ కార్యమునకు శోకము, కోపమును గలుగగా దానూరక నోటికి వచ్చినట్లు దూషించెను. అది శ్లోకముగా పరిణమించగా, నిదియేమి చిత్రమని యతడే విస్మయ మొందెను కావున కావ్యార్థ సూచన ముద్దిష్టముగాద"ని కొందఱు చెప్పుదురు.

---

1. ఆహూయ లక్ష్మణం ప్రాహ రామో రాజీవలోచనః।
ఋణుమే వచనం గుహ్యం సీతా సంత్యాగ కారణం॥
వాల్మీకి నాథ భృగుణా శప్తోఽస్మి కిల లక్ష్మణ।
తస్మాదేనాం త్యజామ్యద్య జనో నైవాస్య కారణం॥
(పద్మపురాణము)

2. ఓయి నిషాద! భర్తయు-దలి ప్రేమాతిశయముచే మైమఱచిన క్రౌంచ మిథునంబునందు (సీతారాములందు) సీతకు చావుతో సమానమైన భర్తృవియోగ దుఃఖమును గలిగించు యను హేతువు చేత బహుసంవత్సరములు నీకును ప్రతిష్ఠ లేకుండుగాక (అనేక సంవత్సరములు సుఖ జీవనము లేక వియోగ దుఃఖముతో బాధ పడుదువు గాక)" అని (ఇది సంస్కృత వ్యాఖ్యకు తాత్పర్యము)

ఈ మతమే సమ్మతమగుచో అప్పుడు ఎట్లు తిట్టినను (శపించినను) "అయ్యో! యీ యర్థము రాకపోయెనే! అల్పాక్షరములతో వ్యక్తము కాక పోయెనే; తీక్ష్ణత మందగించినదే! శాపము పేలవమైనదే!" యని బాధపడ నవసరముండదు.

ఇచ్చట మాత్రము బుద్ధారెడ్డి—

1. "భృగు శాపోద్దిష్టమైన సీతావియోగము
2 రామాయణము ఉత్తరకాండాంతము
3. మంగళార్థమైన కావ్యార్థ ముదిష్టముకాదు.
4. శోకోప హతుడైన కోపిష్ఠి ఇట్లు తిట్టవలెనని యూహింపకుండుట ప్రకృతి సిద్ధము. కావున ఎట్లులైనను దూషించ వచ్చును-"

అనెడి కారణములచే ఆదిమ శ్లోకమునకు వ్యాఖ్యారూపమైన ద్విపదలు వ్రాసినాడు.

ఈ రీతిగా రచయిత మొదటనే పౌరాణికార్థముతో ముడిపెట్టి తన రామాయణము నవగాహన చేసికొనుటకు. సమన్వయించుటకును పురాణ జ్ఞానమెంతేని యవసరమని సూచించినాడని తోచుచున్నది.

(౬) రాహు కేతువులు :—

క్షీరసాగర మథనమున నమృత ముద్భవిల్లినది. అసురు లాయమృతమును నపహరింపగా, విష్ణువు మోహినీ రూపముదాల్చి రాక్షసులను మోసగించి, అమృత కలశమును గైకొని దేవాసురులకు దానిని పంచ మొదలిడెను. దేవతలకు మొదటబోయు చుండెను. ఆసమయమున సింహికాగర్భ సంభూతుడైన రాహువు సురరూపము దాల్చి సూర్య చంద్రుల నడుమ కూర్చొనగా, మోహిని యతని కమృతమును బోసెను, ఇరుప్రక్కల నున్న రవిచంద్రులు అతడసురుడని సంజ్ఞచేసిరి విష్ణువు సుదర్శనమున నతని కుత్తుకను ఛేదించెను, అప్పటికే యమృతమతని కంఠము వరకు జారినది. అమృత స్పర్శమున పవిత్రమైన అతని తలకు కేతువనియు, మొండెమునకు రాహువనియు నామకరణ మొనర్చి గ్రహములుగా జేసి ఆకాశమునందితర గ్రహములతో పాటు వారిని నిలిపెను. ఆకారణమున రాహుకేతువులు కోపము చెంది పర్వకాలములందు సూర్యచంద్రులను గ్రహణ రూపమున పీడించు చున్నారు. ఇది మనకు తెలిసిన గాథ. చాల పురాణముల యందిట్లే యున్నది.

వాల్మీకి రామాయణములో సముద్ర మథన కథా సందర్భమునందు ఈ రాహువు కేతువుల విషయము ప్రస్తావించ బడలేదు. రంగనాథ రామాయణమున నిది చెప్పబడినది కాని ప్రచారము నందున్న కథకు ఇందలి కథకు భేదమున్నది. అది యిటున్నది—

మధుసూదనుడు మానినీ రూపము దాల్చి అమృతమును బంచెడి సమయమునందు రాహు కేతువులను" రాక్షసులిద్దరు దేవపంక్తిలో గూర్చుండి, చేయిజాచి పట్టిరి. అమెలత మెయిచాయ జూడక నమృత మొసంగెను. సూర్యచంద్రులు కళవళపడి కనుసైగ జేసిరి విష్ణువు చక్రముచే వారి శిరములు ఖండించి, ఆ తలలను గ్రహంబులుగా మింట నిలిపెను అది మొదలు వారా సూర్యచంద్రు

లను పర్వంబులందు బాధించుచుండిరి."[1]

ఒక్క రాహువే చక్రఖండితుడైన పిదప శిరః కబంధములకు వేరువేరుగా రాహు కేతువులను ప్రత్యేక నామము లొందినాడా? రాహు కేతువులను వారు వేరువేరు వ్యక్తులా? అనునది సందేహము.

మొదటి దానికే జన ప్రచారమధికము. రెండవ దానిని బుద్ధారెడ్డి గ్రహించినాడు. ప్రతిభా వంతుడైన వ్యుత్పత్త్యధికముగా గల వాడైన రచయిత విలక్షణమైన కథాంశము నెన్నుకొని తన గ్రంథమున ప్రత్యేకముగా ప్రతిపాదించును బుద్ధారెడ్డి ఇచట ఆపనియే చేసినాడు ఇది కల్పితము మాత్రము కాదు. స్కాంద పురాణాధారమున దీనిని వ్రాసినాడు అందులో—

"తతస్తథా విధాన్ దృష్ట్వా దైత్యాంస్తాన్ మోహమాశ్రితాన్।
తదా రాహుశ్చ కేతుశ్చ ద్వావేతౌ దైత్యపుంగవౌ॥
దేవానాం రూప మాస్థాయ అమృతార్థ త్వరాన్వితౌ।
ఉపవిష్టౌతదా పద్భ్యాం దేవానా మమృతార్థినౌ॥
యదా౽మృతం పాతుకామో రాహుః పరమ దుర్జయః
చంద్రార్కాభ్యాం ప్రకథితో విష్ణోరమిత తేజసః॥
తదాతస్య శిరశ్ఛిన్నం రాహోర్దుర్విగ్రహస్యచ।
శిరోగగన మాపేదే కబంధంచ మహీతలే॥

....
కేతుశ్చ ధూమరూపో౽సా వాకాశే విలయం గతః।
సుధాం సమర్ప్య చంద్రాయ తిరోధానగతో౽ భవత్"[2]

అనికలదు. దీనిచే రాహు కేతువులను వారు భిన్న వ్యక్తులని తెలుచున్నది. కాని యిందు కేతువుతల ఖండింపబడినట్లు చెప్పబడలేదు. అతడు చంద్రుని కమృతము నర్పించి, అదృశ్యుడయ్యెను. అయినను పర్వములందతడు సూర్యచంద్రులను పీడించుచున్నాడు. కాని అమరత్వ సిద్ధి యతనికి కలిగినట్లు స్పష్టీకరింపబడలేదు.

కవి ఈ విలక్షణ కథలో "ఇరువురి శిరములు ఖండితములైనట్లు అమృతస్పర్శ నమృతత్వము బడయుటచే ఆ శిరముల రెండింటిని మింట గ్రహములుగా నిలిపినట్లు" మార్పుచేసినాడు. ఈ మార్పు సముచితముగా నున్నది మ్రింగువాడు ముఖముతో మ్రింగును కాని వట్టి మొండెముతో మ్రింగడు. "రాహుకేతువులను వారు గ్రహణ కాలమున సూర్యచంద్రులను మ్రింగుదురు. దేవ ప్రార్థనచే విష్ణువు వారిని దూరముగా చక్రముచే పారద్రోలును" అనెడి జనవ్యవహార-పురాణ కథలు ఈ మార్పుకు కారణములు

---

1. రంగనాథ రామాయణము. బాలకాండము. 1374-1381.

2. స్కంద పురాణము. ప్రథమఖండము. అమృతవిభజన ఘట్టము శ్లో. 54-57, 62. అధ్యాయ.

(3) నాగులు విషపానము చేయుట :—

ఇది అమృత మథన సందర్భమున చెప్పబడిన వృత్తాంతము "సురాసుర లమృతమును మథించుచుండగనందు మొదట విషముద్భవించెను. శివుడు దానిని మ్రింగె."[1]

రంగనాథ రామాయణము నందిచట-

... ... — "వెలయంగ నటఁ బుట్టె విషముగ్రమగుచు

హరుడది గొని మ్రింగె నంత నమియుట — నురగముల్ ధరియించె నోలిఁ దద్విషము"[2]

అనియొక క్రొత్త విషయము కలదు.

ఈ అవాల్మీక గాథకు పురాణము లాధారములు పద్మ పురాణమునందు :—

"మహాదేవేన తృతీతం విషం గృహ్యాయదృచ్ఛయా।

తస్యపానా న్నీలకంఠస్తదా జాతో మహేశ్వరః॥

పీతావశేషం నాగాస్తు క్షీరాబ్ధేస్తు సముత్థితం।"[3]

అనియును, శ్రీమద్భాగవతమునందు —

ప్రసన్నం పిబతః పాణేర్యత్ కించి జ్జగృహుః స్మతత్,

వృశ్చికాహి విషౌదధ్యాదందశూకాశ్చ యేఽపరే॥"[4]

అనియు నాగుల విషపానమును గూర్చి ప్రస్తావించబడినది.

"త్రాగగా మిగిలిన దానిని నాగులు గ్రహించినవ"నుటగాని, "త్రాగుచుండ చేతినుండి జారిన విషమును తేళ్ళుపాములు గ్రహించినవ"నుటగాని అంతసరసముగాలేదు,

చేదు, ఒగరు వస్తువులు తినినపుడు నోరంతయు అసహ్యమై యుమియు చుండుట సహజము; ఆయుర్వేదౌషధములను స్వీకరించిన వారికి అనుభవైకవేద్యము. అందుచేతనే చేదు, ఒగరు మందులను స్వీకరించునపుడు అనుపానముగా తేనెను, శర్కరను వైద్యులు విధించుచుందురు,

విషమును చేదనియు నందురు అది తిన్న శివుడసహ్యముచే రోతచే ఉమియుట ప్రారంభించినాడు. విషమిశ్రితమైన యాయుమ్మిని సర్పాదులు మెసవినవి, విష జంతువులైనవి.

సర్పాదులు విషజంతువులగుటకు గల కారణమును తెలుపదలచియే కవిబుద్ధారెడ్డి అవాల్మీకమైన పౌరాణిక విషయమును గ్రహించి, అనుభవమును బురస్కరించుకొని దానిని సరసముగా మార్చి సందర్భోచితముగా నడుమ జొప్పించినాడు; మూలమునకు భంగముకాని రీతి తీర్చి దిద్దినాడు-

---

1. దా. ప్రతి. వాల్మీకిరామాయణము. బాలకాండము. సర్గ 450. అధిక శ్లోకములు.
2. రంగనాథ రామాయణము. బాలకాండము, ద్వి. 1356-2358.
3. పద్మ పురాణము ప్రథమ ఖండము. పుట. 66; శ్లో 55-56.
(సంస్కృతి సంస్థానము. బరేలీ ప్రకాశనము)
4. శ్రీమద్భాగవతము, అష్టమస్కంధము. అధ్యాయము. 7 శ్లో. 46.

(4) మునిపత్నుల గర్భధారణము :—

కార్తికేయ జననాత్పూర్వము చెప్పబడిన ఋషిపత్నుల గర్భధారణ వృత్తాంతము అవాల్మీకము—

"ఋషుల భార్యలు తమ తమ యుచిత కృత్యములను దీర్చుకొనుటకు గంగ కేతెంచి యందు దిగి జలకము లాడిరి. వారు చలిచేతఁ జిక్కి స్రుక్కుచు శరవణ స్థలమున తేజరిల్లుచున్న శివ తేజస్సును అగ్నులుగా తలంచి. సమీపించి, కాచుకొనుచుండిరి. అంతట జాత వేదుని యందలి శివ వీర్యము వారియందు చేరగా, వారలు గర్భవతులైరి. ఇంటికి వచ్చిన తమ భార్యల వృత్తాంతమును ఋషిపుంగవులు యోగదృష్టిచే గ్రహించి "మీ గర్వము మిమ్మింత చేసినది. మిమ్ము మన్నింపనేల ? పతిదూరలగుడని" వెడలఁద్రోచిరి. అంతట వారు జాహ్నవికి వచ్చి కరతాడనములచే గర్భములను బాదుకొనగా తద్గర్భము జారి ఆరు ఖండములై యవనిపై బడెను. ఋషిపత్ను లా ఖండములను శరవణంబునఁ బెట్టి తప మాచరించుటకై హిమాలయమున కరిగిరి.[1]

ఇది "అప్పుడు ఋషిపత్నులందఱు గూడి ....

.......మొదలుకొని.......

అరు దలరగ లేచి యా తలోదరులు-తపమున కరిగిరి"[1]

అను పంక్తివరకు సుమారు 20 ద్విపదలలో కలదు.

శివ పురాణమునందు దీనికి సంబంధించి రెండు కథలున్నవి.

1) అగ్నిహోత్రుడు కపోతరూపుడై దేవతల యనుమతిచే శివుడు జార్చిన వీర్యమును భక్షించి, అధిక దాహముచేత తప్తుడై, బాధ భరించలేక శివుని ప్రార్థించెను శివుడు కరుణించి "కొలది దినములలో నీ వీర్య మొక్క చక్కని గర్భమును జేరును, నీ దాహము తీరును అని యోదార్చెను. కొంతకాలమునకు సప్తర్షులు తమ పత్నులతో గంగకువచ్చి. స్నానాదులను పూర్తి చేసికొని, అగ్నియందు వేల్చిరి. అప్పుడు హవ్యవాహనుడు ఋషి భార్యల యందమును జూచి, మోహమునుచెంది, విరాళిచేఁ బొగులుచు నీట మునిగి ప్రాణంబు వీడ సమకట్టెను. పరమ పతివ్రత యైన స్వాహాదేవి తన భర్త యాశయమును గుర్తించి, అరుంధతి రూపమునఁ దప్ప తక్కిన ముని పత్నుల రూపముతో అగ్నిభట్టారకునిఁ బొందెను. మహేశ్వరుని వీర్యము స్వాహాదేవిని చెందుటచే వీతిహోత్రుడు దాహమునుండి విముక్తుడయ్యెను. స్వాహాదేవియు పారమేశ్వర వీర్యంబు నిజ గర్భంబునందు భరింపజాలక, శ్వేతాద్రి శిఖరంబుల జార్చి బాధనుండి విముక్తయయ్యెను. అది గంగయందుఁబడి తీరమునందలి శరవణ స్థలమునకు నెట్టబడినది. దానినుండి పిదప కుమారోదయ మయ్యెను. తమ భార్యలు హవ్యవాహనుని బొంది కుమారుని గాంచినారనెడి లోకప్రవాదముచే మునులు వారిని విడనాడిరి. స్వాహాదేవి వచ్చి నిజ మెఱిగించగా, వారు యోగదృష్టిచే సత్యమును గ్రహించినను, ప్రజల దురుక్తుల కాత్మను రోసి మరల తమ భార్యలను గ్రహింపరైరి అ ముని

---

1. రంగనాథ రామాయణము. బాలకాండము. ద్వి. 1073-1094.
(ఆం.వి. క.ప. ప్రతిలో నీ ద్విపదలు 1వ అనుబంధమునఁ జేర్చబడినవి).

పత్నులు తపము సేయగ మంచుమల కరిగిరి."[1]

2) ఇక రెండవ కథార్థము శివ మహాపురాణమునందు కలదు. ఇదియే రంగనాథ రామాయణ మందలి వృత్తాంతమునకు మూలమని పరిశీలించిన తెలియగలదు. చూడుడు.

బ్రహ్మోవాచ :—

తస్మిన్నవసరే తత్రాగతాః సప్త మునిస్త్రియః।
తపోమాసి స్నానకామాః ప్రాతః సన్నియమామునే॥
స్నానం కృత్వా స్త్రియస్తాహి మహాశీతార్దితాశ్చషట్।
గంతు కామామునే యాతా వహ్ని జ్వాలా సమీపతః॥
విమోహితాశ్చతా దృష్ట్వాఽరుంధతీ గిరిశాజ్ఞయా।
నిషి షేధ విశేషేణ సుచరిత్రా సుబోధినీ॥
తాఃషట్ మునిస్త్రియోమోహా ద్ధరా త్త్రాగతా మునే।
స్వశీత వినివృత్యర్థం మోహితాః శివమాయయా॥
తద్రేతః కణికాః సద్య స్తద్దేహాన్ వివిశుర్మునే।
రోమద్వారాఽఖిలావహ్ని రభూద్దాహ వివర్జితః॥
అంతర్ధాయద్రుతం వహ్ని ర్జ్వాలారూపో జగామహ।
సుఖీ స్వలోకం మనసా స్మరంస్త్వాం శంకరం చ తం॥
సగర్భాస్తాః స్త్రియః సోధోఽభవన్ దాహ ప్రపీడితాః।
జగ్ముః స్వభవనం తాతాऽరుంధతీ దుఃఖితాగ్నినా॥
దృష్ట్వా స్వస్త్రీ గతం తాతా నాథాః క్రోధాకులాద్రుతం।
తత్యజుస్తాః స్త్రియస్తాత సుసంమంత్ర్య పరస్పరం॥
అథతాః షట్ స్త్రియః సర్వాదృష్ట్వా స్వవ్యభిచారకం।
మహాదుఃఖాన్వితా స్తాతాऽభవన్నాకుల మానసాః॥
తత్యజుః శివరేత స్త ద్గర్భరూపం మునిస్త్రియః।
తా హిమాచలే పృష్ఠేऽథాభవన్ దాహ వివర్జితాః॥
అసహన్ శివరేత స్త ద్ధిమాద్రిః కంపముద్వహన్।
గంగాయాం ప్రాక్షిపత్తూర్ణ మసహ్యం దాహ పీడితః॥
గంగయాऽపిచ తద్వీర్యం దుఃసహం పరమాత్మనః।
నిఃక్షిప్తం హి శర స్తంబే తరంగై స్స్వైర్మునీశ్వర॥
పతితం తత్ర తద్రేతో ద్రుతం బాలో బభూవహ॥"[2]

---

1. శ్రీ ముదిగొండ నాగవీరయ్యశాస్త్రి "శ్రీ శివపురాణము" (తెనుగు పద్యకావ్యము) కుమార ఖండము. ఆశ్వా- 1. గద్యపద్య 60-65.
2. శ్రీ శివమహాపురాణము- రుద్రసంహిత- కుమారఖండము. అధ్యాయము-2 శ్లోకములు 55-66 1/2.

"స్వాహాదేవి మునిపత్నుల రూపమున అగ్నిభట్టారకుని పొంది పుత్రుని గాంచినద"నెడి మొదటి శివపురాణ వృత్తాంతము రచయితచే గ్రహింపఁబడలేదు. ఇక రెండవ వృత్తాంతము యథాతథముగా గ్రహింపబడినను అది కొంది మార్పు పొందినది

"మునిపత్నులు శివరేతస్సును హిమాచల పృష్ఠమున జార్చగా, నావలిమల దానిని గంగయందు నిక్షేపించ, నది శరవణమునకు నెట్టబడినదను" విషయము ప్రారంభముననే చెప్పబడుటచే మరల చెప్పుట పునరుక్తమగును. కావున "మునిపత్నులు గర్భతాడన మొనర్చుకొనిరి ఆ గర్భమవనిపై ఆరు ఖండములై పడెను. తత్ఖండచయము నొకచోట ముద్దగాఁ జేర్చి, శరవణంబునఁ బెట్టివారు తపమున కరిగిర"ని బుద్ధారెడ్డి మార్పు చేసెను. ఈ మార్పుపై భారతమునందలి గాంధారీ గర్భతాడన ప్రభావము పడినదిగా కనిపించుచున్నది.

"కుంతి ధర్మరాజు గన్నది. గాంధారి ఈ వార్తను విని తన గర్భమును బాదుకొన్నది. అదిజారి క్రిందఁబడగా. వ్యాసుడు వచ్చి దానిని 101 ఖండములుగా విభాగించి ఘృతకుంభములందు భద్రపఱచెను. వాని నుండి నూరుగురు కుమారులు, ఒక కుమార్తెయు జనించిరి" ఇది గాంధారీ గర్భతాడన వృత్తాంతము. అప్పటికే నన్నయ భారతము తెలుగు దేశమున ప్రచారము పొందినదిగదా!

మూలమునందు "ముని పత్నులు గర్భరూప శివరేతస్సును జార్చిరని" యున్నది. రేతస్సు పిండ రూపము పొందిన తర్వాత మరల దాహమనునది. యుండునా? ఇది అసంభవము, అసహజమును, అనౌచిత్యమును, అందువలన రంగనాథ రామాయణ కర్త "పౌరాణిక విషయమును గాంధారీ గర్భ వృత్తము వోలె మలచి, రామకథాంతర్గత కుమారస్వామి జన్మ వృత్తమునఁ జేర్చి తన పురాణ పరిజ్ఞానము నిట ప్రదర్శించినాడు.

ఇచట కవి సాధించిన ప్రయోజనములు రెండు మూడున్నవి.

1. తాన్వ్రాసెడి ప్రతి కథయందును అసాధారణమైన యేదో యొక అవాల్మీక కథను సాధారణముగాఁ జేర్చుట.

2. శివ మహిమకు విమోహితులు కానివార లెవ్వరును లేరనుట

3. తన్మాయా మోహమును తదనుగ్రహమున తరించవచ్చును. కాని తన స్వతంత్ర శక్తిచే మాత్రము కాదనుట.

4. బ్రహ్మజ్ఞాన సంపన్నులైన ఋషుల భార్యలు తమకింటె పాతివ్రత్యమునందు గొప్పవారు లేరని గర్వించగా, తద్గర్వమణచుట— దీనిచే ఎవ్వరికిని, ఎట్టివారికిని గర్వము పనికిరాదను నంశము వ్యంగ్యముగా బోధింపబడినది.

5. ఏకముఖమున జనించి, షట్కృత్తికల స్తన్యమును గ్రోలుటకై షణ్ముఖుడైనాడనుట కంటె, ఆరుగురు ఋషి పత్నుల కయిన గర్భమొక ముద్దగాఁ జేర్చబడి, దానినుండి కుమారుడొకడు పుట్టినను, ఆరుగురికి జనించినాడని తెలుపుటకై షణ్ముఖములను ధరించినాడనుట లోక సహజము. ప్రపంచమునందు పుట్టుకతోడనే మిక్కిలి చేతులు, మిక్కిలి కాళ్ళు

మొదలగు అవయవములతో పుట్టుచుండును. కావున మొదటనీ కుమారుడు షణ్ముఖములతో జనించినాడని చెప్పుట ప్రకృతి స్వభావమును చిత్రీకరించుట,

ఈ ప్రయోజనములను దృష్టిలో పెట్టుకొని, పౌరాణిక విషయమును తీర్చిదిద్దినాడు బుద్ధారెడ్డి. కాని ఈ విషయమునకు సంబంధించిన ద్విపదలు వావిళ్ళ రాయల్ అండ్ కో వారి ప్రతులలో మూలపాఠము నందును, ఆంధ్ర విశ్వకళా పరిషత్తు వారి ప్రతిలో 1వ అనుబంధము నందును జేర్చబడుటచే, ఇవి రచయితవి కౌనా? కాదా? అని పాఠకులకు సందేహము కలుగుచున్నది. శైలిననుసరించి చూచిన ఇవి ప్రక్షిప్తములు కావని తోచుచున్నది. పూర్వపు ముద్రాపకులును నిరాధారముగా దీనిని ముద్రించ లేదుకదా!

(5) యువనాశ్వుని వృత్తాంతము :—

వసిష్ట మహర్షి జనక మహారాజునకు (మాంధాతృజననము) ఇక్ష్వాకు వంశ క్రమమును వివరించుచుండెను ఆ వరుస క్రమమున—

"దుందుమారుని కుమారుడు యువనాశ్వుడు; యువనాశ్వుని కుమారుడు మాంధాత; మాంధాత కుమారుడు సుసంధి"[1] యని మాత్రమే మూలమునందు చెప్పబడినది కాని రంగనాథ రామాయణము నందు—

అతనికి దుందు మారావనీ నాథు — డతనికి యువనాశ్వుడను నరేశ్వరుడు
అతనికిఁ బ్రియభార్య లరిరూపవతులు — సతులిద్దఱకుఁ బుత్ర సంతతి లేమి.
... ...
మొదలుకొని
... ...
అతని సోదరుండా సుసంధియును — నాతత పుణ్యాత్ముడై భువినేలె"[2]

అనుపంక్తి వరకు సుమారు 36 ద్విపదలలో మాంధాతృ జనన వృత్తాంతము వివరింపబడినది. ఇది అవాల్మీకము. శ్రీ మద్భాగవతము నందున[3] విష్ణు పురాణము నందును ఈ కథ కనబడును. వీనితో రంగనాథ రామాయణ వృత్తాంతమును పోల్చినపుడు ఒకటి రెండు చిరు మార్పులు పొడ చూపుచున్నవి.

భాగవత విష్ణుపురాణములు.	రంగనాథ రామాయణము.
1. యువనాశ్వుని భార్యలు నూరుగురు.	1. అతని భార్య లిరువురు.
2. సంతతిగోరి యితడు మునులతో సంప్రదించుటకు వారి యాశ్రమ మండలమున కేగెను	2. అఖిల సన్మునులను తన యొద్దకు రప్పించుకొనెను. (ఇది రాజఠీవిని తెలిపెడిని)

---

1. దాక్షిణాత్య ప్రతి. వాల్మీకి రామాయణము బాలకాండ. సర్గ 70. శ్లో. 22, 23.
2. రంగనాథ రామాయణము. బాలకాండము. ద్వి 2038-2073.
3. శ్రీ మద్భాగవతము. నవమ స్కంధము. అధ్యాయ. 6. శ్లో. 25. 38.
4. విష్ణుపురాణము. చతుర్థాంశము. 2 గద్య పద్యములు. 48-69

3. మాంధాత భార్య బిందుతి.	3. అతని భార్య విమలాంగి.
4. మాంధాతకు ముగ్గురు కుమారులు.	4. అతనికిరువురు పుత్రులు.
1. పురుకుత్సుడు. 2. అంబరీషుడు.	1. ముచుకుందుడు. 2. సుసంధి.
3. ముచుకుందుడు.	

ఈ మార్పులు తప్ప మిగిలినది పురాణ కథను తు-చ-తప్పకుండ అనుసరించి యున్నది. బుద్ధభూపతి ఈ అవాల్మీక కథను గ్రహించుటలో ఈ క్రింది ప్రయోజనముల నాశించి యుండ వచ్చును.

1. "రావణుడు మాంధాత కాలమునుండి యున్నాడు. మాంధాత రావణుని పలుమారులు జయించి భూమి నంతటిని ఏకచ్ఛత్రాధి పత్యముగా నేలియుండెను. కావున సర్వ భూమండలము ఇక్ష్వాకులదే. మాంధాత తరువాత దశకంఠుడు విజృంభించి సురమునీంద్రాదులను బాధించుచుండెను. అతనిని సంహరించి, లోకుల బాధలను తొలగింప., ఆ మాంధాత వంశమున విష్ణువు శ్రీరాముడుగా నవతరించినాడు. తత్సంహారము సీతా వివాహము లేక సంభవింపదు. కావున శివుని విలు విరిచి నాడను పణదృష్టిచే మాత్రము కాక. లోక కల్యాణమువకై రామునకు సీత నొసంగవలసినదే" అను దానిని కర్మిష్ఠియు జ్ఞానియు నైన జనకునకు గుర్తు చేయుటకై వసిష్ఠుడు ప్రత్యేకముగా చెప్పియుండ వచ్చుననుట.

2. మాంధాత జననము అందరి జన్మల కంటె విలక్షణ మైనది. ఇతడు స్త్రీ గర్భమునుండి జనించలేదు. మంత్ర జలప్రభావమున యువనాశ్వుని గర్భమునుజేరి తదుదరము ఛేదించుకొని జనించిన అయోనిజుడు స్తన్యపానము లేకుండ తన ప్రదేశినిని చప్పరించి పెరిగినవాడు. ఇచట ఇతని జన్మకు యువనాశ్వుని యుదరము నిమిత్తమాత్రము; కాని శుక్ల శోణిత సంయోగము వలన ఇతని జన్మకాదు; అట్లే వృద్ధికి భోజన సారమైన స్తన్యమును కాదు. ఇదే విధముగా, సీతాదేవి జననమును, వృద్ధియును అయియున్నవని వినుచున్న దశరథాదులకు ధ్వనింప జేయుట.

3. నారాయణుని అనంతావతారములలో మాంధాతృనవతార మొకటి. అంశావతారముగా మాంధాతృ రూపమున జనించిన శ్రీమన్నారాయణుడే శ్రీరాముడుగా నవతరించినాడని వ్యంగ్యముగా జనకాదులకు సూచించుట.

4 "సీత అయోనిజగా స్త్రీ పురుష సంబంధము లేకయెట్లు పుట్టినది? అసంభవము. ఇదికల్పనయే:" అని వాదించువారికి సమాధానముగా "సీతయేకాదు. అంతకుపూర్వము లోకమున నిట్లె విలక్షణ వ్యక్తులు జనించిన వారు; వారిజననాదులకు దైవిక, మానసిక. మాంత్రికశక్తులు కారణములు" అని తెలుపుట.

5. మాంధాత షోడశ మహారాజులలో నొకడు. విష్ణ్వంశతో నొప్పిన వాడు; విలక్షణ జననము కలవాడు. సమస్త భూమండలము నేలినవాడు: రావణాదులను నిర్జించినవాడు విష్ణుభక్తుడై విలసిల్లినాడు; అత్యంత యోగశక్తి కలిగి, ఏకకాలమున అనేక సమాన స్వరూప దేహములను దాల్చి, కృష్ణునివలె 50 మందితో భోగ సుఖమును అనుభవించ పజాలిన సౌభరి మహర్షిని అల్లునిగా పొందినవాడు; ద్వాపరయుగమునందలి కాలయవన సంహారమునకు కారకుడై, కృష్ణదర్శన ప్రాప్తి

నొందిన హరిభక్తుడగు ముచుకుందునకు తండ్రియైనవాడు. ఇట్టి మాంధాతృ చరిత్రము[1] పవిత్రమైనది. పాఠకులకు తప్పక దీనిని దెలియజేయవలెనని రచయిత తహ తహ లాడియుండుటయు, సర్వపురాణ విచార తత్పరత్వమును ప్రకటించికొనఁ దలఁచియుండుటయు, రంగనాథ రామాయణమున నిది ప్రవేశించుటకు కారణమై యుండవచ్చును.

ఆంధ్ర విశ్వ కళాపరిషత్ ప్రతియందు ఇదియును 1వ అనుబంధమునఁ జేర్చబడినది. కాని వావిళ్ళ, రాయల్ ఆ.డ్ కో ప్రతులందు మూలపాఠముననే యున్నది.

శైలి ననుసరించి చూచినచో, ఇది బుద్ధారెడ్డి రచనయే యనుట నిస్సందేహము.

(6) ఇంద్రుడు కోడై కూయుట.

గౌతమ మహర్షి అహల్యతోఁ గూడి తపమాచరించుచుండెను. అతని తపము చెఱచుటకు ఇంద్రుడు—

"కుక్కుటంబై పోయి కుటజంబు సేరి-కొక్కొరోయని కూయఁ గౌమరొప్ప మౌని"[2] మనమునఁ జింతించి ప్రాతః కాలమయ్యెనని తలంచి నిజానుష్ఠానంబునకు పోయెను. ఇంద్రుడు గౌతమాకారమున వచ్చి యహల్యను గదిసెను.

ఇచ్చట "ఇంద్రుడు గౌతమాశ్రమము నెంత కోడియై కూసి ఆ ఋషిని తత్కాలమున నదీ స్నానమునకు వెళ్ళునట్లుచేయుట" అనునది అవాల్మీకమైన యంశము. "ఇది బుద్ధారెడ్డి యద్భుతమైన కల్పనము"ని[3] డా॥ పింగళి లక్ష్మీకాంతం మొదలగువారు[4] ప్రశంసించియున్నారు. ఇది యెంతయు సత్యము.

మహేంద్రుని ఈ కుక్కుట వేష ధారిత్వ సూచనము ఆంధ్ర సాహిత్యమున వెలసిన కొన్ని రామాయణములందును[5], తదితర గ్రంథములందును[6] చేయబడి యున్నది.

---

1. "యువనాశ్వునికి సంతతిలేదు. అతడు సన్మునుల రప్పించి, సత్కరించి తనకు తనయులను దయ సేయవలయునని ప్రార్థించెను వారు రాజుచేత ఐంద్రయాగమును జేయించిరి. కుంభము నందు జలముల మంత్రించి భద్రపరచిరి. ఆనాటి రాత్రి రాజునకు దాహ మధికమయ్యెను. మునులు, పరిచారకులు గాఢనిద్రలో నుండిరి. రాజు కలశమందలి జలమును త్రాగెను. రాజునకు గర్భమై పెరిగె, పిదప శిశువు యువనాశ్వుని యుదరమును జీల్చుకొని బయటకు వచ్చెను. విప్ర, దేవ ప్రసాదమున రాజు చావలేదు. ఇంద్రానుగ్రహమున బాలుడు తన ప్రదేశినిని చప్పరించి మాంధాత నామమున వృద్ధిపొందెను.
2. రంగనాథ రామాయణము. బాలకాండము. ద్వి.
3. ఆంధ్ర సాహిత్యచరిత్ర. పుట-174.
(శ్రీ వావూరి దొరసామి శర్మ, కట్టమంచి రామలి గారెడ్డి, వేదము లక్ష్మీనారాయణశాస్త్రి, కుమారి పండా శమంతకమణి మొదలగువారు).
4. కంకంటి పాపరాజు, "ఉత్తర రామాయణము. ఆశ్వా-4, పద్య-245.
"కాయజుబారి కోడి మసి గౌతమికై తమ కోడి జాతివాడాయె సురేంద్రుడు"
5. శ్రీ శేషము వెంకటపతి-శశాంకవిజయము. ఆశ్వా-4, పద్య-124.
"తొలి దేవేంద్రుడు మా కులంబు చొరలేదో."

భాస్కర రామాయణమునం దీ విషయములేదు. రంగనాథ రామాయణ ప్రత్యేకతను నిలబెట్టి నట్టి మహేంద్రుని యీ కుక్కుటి వేషధారిత్వమున కాధారము కొంతవరకు పద్మపురాణ మనవచ్చును.

"అందు ఇంద్రుడు గౌతమ రూపమున అహల్యను పొంది, అభీష్టమును నెరవేర్చుకొని, వెడలిపోవునంతలో గౌతముడు రాగా, అతడు భీతిల్లి పిల్లిరూపము నొంది దాగియుండె"[1] నని చెప్పబడినది.

"పరిపాడల్" అనే తమిళ కావ్యంలో అహల్యా కథను సంగ్రహంగా తెలియజేసే ఒక పద్యంలో ఇంద్రుడు పిల్లిరూపంతో గౌతమాశ్రమంలో సంచరించినట్లు ఉదాహరించబడినది.

మార్జాలము కాపట్యమునకు వంచనకు చిహ్నము. ఇంద్రుడు మార్జాల రూపమును ధరించుట గౌతముని వంచన చేయుటకే. కాని ఈ కల్పనమునందంత బిగువు కనబడదు. అంత పెద్ద ప్రయోజనము కాని, ఔచిత్యముకాని సాటింపబడలేదు కావున బుద్ధారెడ్డి ఇంద్రునికి కుక్కుట రూపము నమర్చి కథకెంతయో సొగసు నాపాదించినాడు.

గౌతముడాశ్రమమున నున్నచో ఇంద్రుడహల్యను పొందుట కవకాశములేదు. అతడు తెల్లవారు జామునగాని నదికి స్నానమునకై పోడేడు. ఇక ఇంద్రునకో అహల్యతో రతిసుఖమును తృప్తిదీర ననుభవించుటకు తగినంత రాత్రి యుండవలెను. కావున గౌతముడు చాల రాత్రి ఉండగనే ఆశ్రమమునుండి బయటకు పోవలెను. అట్లు పోవుటకు అతనికి తెల్లవారబోవుచున్న దనెడి తలంపును విశ్వసనీయముగా కలిగించవలెను. సమయమును దెలుపు గడియారములు లేని ఆ కాలమందు నక్షత్ర సంచారము, కోళ్ళకూతలు రాత్రియందును, ఛాయ (నీడ) పరిమాణ గణనము పగటియందును, కాలమును తెలియజేయు సాధనములు. కోడికి కాలజ్ఞానమని నామాంతరము. కావున కోడికూత వినినచో గౌతముడు తెల్లవారినదని లేచిపోవును; ఇంద్రుని కోరిక కవకాశ మేర్పడును. ఇట్టి యూహగల ఇంద్రుడు కుక్కుటంబై పోయి కుటజంబు సేరి, కొక్కరోయని కూమ రొప్పగూసెను. తలచినట్లే గౌతముడు మనమున చింతించి, మమత రెట్టించి అనుష్ఠానమునకై నదికి పోయెను.

---

1. పద్మ పురాణము. సృష్టిఖండము. అధ్యాయ. 56. శ్లో. 29, 30.
"శక్రో మునింతు సంలక్ష్య చౌతు దేహం వివేశహ।
గచ్ఛతో వృషదంశస్యా పద్ధతౌ ప్రచచాలహ॥
మునిస్తత్రావ దత్తం వై కస్త్వం మార్జాలరూపధృక్।
భయాత్తస్య మునేరగ్రే శక్రః ప్రాంజలి రాస్థితః॥"

2. డా॥ చల్లారాధాకృష్ణశర్మ. "రామాయణ సుధాలహరి" (తమిళ మళయాళ రామాయణముల వ్యాసము. పుట. 3. మరియు డా॥ జి. నాగయ్య దాక్షిణాత్య సాహిత్య సమీక్ష. పుట. 21.")

ఇచ్చట ఇంద్రుని కుక్కుట వేషధారణము గౌతము డాశ్రమమునుండి నిష్క్రమించుటకు కారణ భూతమైనది కాని మార్జాల వేషధారణము స్వరక్షణ మటుంచి, కనీసము తప్పించుకొని పోవుటకైనను ప్రయోజనకారి కాలేదు.

బుద్ధారెడ్డి పద్మపురాణ వృత్తాంతమును, తమిళ వాఙ్మయము ద్వారా దేశమున ప్రచారము జెందిన సంగతి గ్రహించి, ఇంద్రునికి పిల్లివేషమునకు బదులు కోడి వేషమును వేయించి అందమును ఔచిత్యమును ఎంతయో పోషించినాడు—

(7) తారా వృత్తాంతము :—

తార వాలి భార్య; తరువాత సుగ్రీవునికి ప్రియురాలయ్యెను; అయినను మహాపతివ్రతగా విరాజిల్లినది.

అహల్యా, ద్రౌపదీ, తారా, సీతా, మండోదరీ తథా।
పంచకన్యాః పఠేన్నిత్యం దుస్స్వప్నంతస్య నశ్యతి॥"[1]

అనెడి ఆభాణకమందు పంచకన్యలలో ఒకతెగా పరిగణింప బడుటయేకాక, సీతాసాధ్వితో సమానురాలై, ఏ మాత్రము జారత్వ దోషముమంటని స్త్రీగా ప్రశంసింప బడుచున్నది.

ఇట్టి తారయొక్క జన్మవృత్తాంతము, పతివ్రతగానైన కారణము. వాల్మీకి రామాయణము వలన స్పష్టముగా తెలియ రాకున్నది. రంగనాథ రామాయణకర్త ఈ విషయమును వాలి సుగ్రీవ వైర కథా ప్రస్తావన ప్రారంభముననే స్పష్టముగా ప్రతిపాదించి, పాఠకుల సందేహ నివృత్తికి ప్రయత్నించినాడు.

వాల్మీకి రామాయణమునందు-శ్రీరామచంద్రుడు

"కిం నిమిత్తమభూద్వైరం శ్రోతుమిచ్ఛామి తత్త్వతః॥
సుఖంహి కారణం శ్రుత్వా వైరస్యతవ వానర।
ఆనంతర్యం విధాస్యామి సంప్రధార్య బలాబలం॥"[2]

అని సుగ్రీవుని వైర కారణ మడిగెను.

అంత సుగ్రీవుడు—

"వాలీనామ మమ భ్రాతా జ్యేష్ఠ శ్శత్రుని. షూదనః।
పితుర్బహుమతో నిత్యం మమాపిచ తథాపురా॥
పితర్యు పరతేఽస్మాకం జ్యేష్ఠోఽయ మితి మంత్రిభిః।
కపీనా మీశ్వరోరాజ్యే కృతః పరమ సమ్మతః॥"[3]

అని తన కథను ప్రారంభించెను. ఇచట తారా జన్మ వృత్తాంతముకాని, ఆమెను తాము

---

1. అభాణక శ్లోకము.
2. దా. ప్రతి. వాల్మీకి రామాయణము కిష్కింధా. సర్గ. శ్లో. 41, 42.
3. ,, ,, ,, ,, సర్గ. 9 శ్లో. 1, 2.

పొందిన విధముకాని లేదు. ఈ లోపమును పూరించుటకోయన, రంగనాథ రామాయణ కర్త,

"మా తండ్రి తర్వాత మంత్రులు పెద్ద — యాతడంచును వానరేంద్ర పట్టంబు
వాలికిఁ గట్టిరి"[1]

అనిపై శ్లోకముల కనుగుణమైన ద్విపదలతో కథను ప్రారంభించి, పూర్వము—

"కడగ మందరగిరి కవ్వంబు సేసి — తడయక వాసుకిఁ దర్రాడు సేసి

— — — — — —

మొదలుకొని

— — — — — —

చెలువొప్పఁ బెండ్లియై చెలగు వేడుకల — వలనొప్పు రుమఁ గూడి వర్తించుచుండ"[2]

అనుపంక్తి వరకు సుమారు 20 ద్విపదలు వ్రాసినాడు. ఇవి సముద్ర మథన వృత్తాంతమునకు సంబంధించినవి.

బాలకాండలో- విశ్వామిత్రుడు శ్రీరామచంద్రునకు విశాల పుర వృత్తాంతమును జెప్పునపుడు సముద్ర మథన వృత్తాంతము వచ్చియున్నది. ఆదే కథ మరల నిచటఁ జెప్పబడుట పునరుక్తము కాదా? విశేషమేమి? యని ప్రశ్నలుదయించును.

బుద్ధభూపతి యిచ్చట ముఖ్యాతి ముఖ్యమైన రెండు మూడు విశేషముల నాశించి యున్నాడు. అవి కథాగమనమునకు పాఠకుల సందేహ నివృత్తి కి ఆధార భూతములైనవి.

(i) సముద్ర మథన వేళ వాలిసుగ్రీవులు దేవతలకుఁ దోడైరి.[3]

(ii) కామధేను, కల్పవృక్ష, మహాలక్ష్మ్యాదులతో పాటు "తార" యను సుందరాంగియు సముద్రమునుండి యుద్భవించినది. ఆతారాదేవిని వాలిసుగ్రీవులకు ఉమ్మడి సొత్తుగా, వారు చేసిన సహాయమునకు ప్రతిఫలముగాను దేవత లొసంగిరి.[4]

(iii) సుషేణుని కూతురైన "రుమాదేవిని" సుగ్రీవుడా తర్వాత వివాహమాడెను.[5]

ఇవి అవాల్మీకములు; వాల్మీకి రామాయణమునందు మీదు మిక్కిలి ఒకటి రెండుచోట్ల "తార" సుషేణుని బిడ్డగా సూచింపబడినది.[6]

---

1. రంగనాథ రామాయణము కిష్కింధా-ద్వి-283-284.
2. రంగనాథ రామాయణము. కిష్కింధా. ద్వి-264-282.
3. " " " " ద్వి 265-267.
4. " " " " ద్వి. 276-277, 280-287.
5. " " " " ద్వి. 281, 282.
6. (a) రామబాణ హతుడైన వాలివద్దకు వచ్చిన తార విలపించు చోట—
"తాంసమీక్ష్యతు సౌషేణీం క్రందంతీంకురరీం యథా"
అని తారకు సౌషేణీం (సుషేణుని కూతురు) అని ప్రయోగింప బడినది. ప త. ప్రతి. కిష్కింధాకాండ. సర్గ. 16. శ్లో-
(b) వాలి సుగ్రీవునితో తారను గూర్చి చెప్పుచోట (దా. ప్రతి కిష్కింధా-సర్గ-22-శ్లో-13)
"సుషేణ దుహితా చేయ మర్థ సూక్ష్మ వినిశ్చయే" అని చెప్పబడినది.

ఇట్లు తార సుషేణుని కూతురని మూలమునందు స్పష్టముగానుండ, బుద్ధారెడ్డి "తార సముద్రుని కూతురు" అని యెట్లు చెప్పగలిగినాడు? కొందఱు వ్యాఖ్యాతలును ఇట్టి సందేహమును ఆశంకించుకొని దానికి సమాధానమునిట్లు వ్రాసియున్నారు.

"సుషేణదుహితా- నను సముద్ర సంజాతాయా స్తారాయా స్సుషేణ దుహితృత్వం కథ? మితిచేత్- తత్రక్షీరాబ్ధి మథన సమయోత్పన్నాం తారాం దృష్ట్వా సుషేణో వామకర మగ్రహీత్- వాలీతు తారాయా దక్షిణకర మగృహ్ణాత్- తదాఽన్యోన్యం వివాదేసతి దేవై స్సుషేణ దుహితృత్వం తారాయాః, వాలినో జాయాత్వం చనిశ్చితం। తదుక్తంస్కాందే "దేవై స్సుషేణకలహే పుత్రీతి ప్రతిపాదితా। సుషేణో దుహితు స్తస్యా స్స్వయంవర మకల్పయత్॥ ఇత్థమూఢా కపీంద్రేణ తారా సర్వాంగ సుందరీ। సుగ్రీవ మేకదా రాత్రౌ రూపసాదృశ్య మోహితా॥ న మమాయోనిజాయా స్స్యాద్ధర్షితోఽను భవః పరైః"[1] ఇతి.

దీనివలనే "తార సముద్రమున జనించినది. పిదప సుషేణాత్మజయైనద"ని స్పష్టమగుచున్నది. కాని ఇచట తార సుగ్రీవుని రూపమును మోహించి, తానయోనిజ యగుటచే పరపురుష సంసర్గజ దోషము తన కంటదని తలంచి. ఒకనాటి రాత్రి సుగ్రీవుని పొందినది" అని చెప్పుటయే తార కామ ప్రవృత్తి, అమె శీల భంగము వెల్లడియగుచున్నది. ఆమె అయోనిజయైనను అది దోషమే కాదా! సుగ్రీవుని భార్యయైన రుమను వాలి యనుభవించుటచే "అధియధర్మ" మను కారణమున అతడు వధ్యుడైనటే కామప్రవృత్తిగల తారను సుగ్రీవుడు పొందుటచే అతడును వధార్హుడే. అట్లు సుగ్రీవుని శ్రీరాముడు వధింపక పోవుటచే, అతడు పక్షపాతి, అధర్మాత్ముడను నిందకు గురికావలసి వచ్చుచున్నది.

ఇది వాలి బ్రతికి యుండగా రహస్యముగా జరిగిన తారా సుగ్రీవుల సంబంధము ఇక వాలి మరణానంతరము తారను సుగ్రీవుడు బాహాటముగానే పొందినాడు. మొదటిది శ్రీరామునకు తెలియదనుకొందము; రెండవది. తెలిసియున్నను, శ్రీరాముడు కనీస మీవిషయమున సుగ్రీవుని మందలించనైన లేదుకదా! కావున రాముడు పక్షపాతి కాడా?

కొందఱు శ్రీరాముని యందలి యీ దోషమును తొలగించుటకై ఈ క్రింది సమాధానమును జెప్పుచున్నారు.

"నేటికిని ఎఱుకలు లోనగు క్షుద్రజాతులందు సోదరుడు మరణించిన పిమ్మట వాని భార్యను జీవించియుండు సోదరుడు గ్రహింప వచ్చుననియు, జీవించి యుండగా గ్రహింపరాదనియు కులమర్యాద గలదు దీనిని పూర్వులును అంగీకరించి యున్నారు. కావున సుగ్రీవుడు బ్రతికి యుండగా రుమను గ్రహించిన వాలి వధ్యుడగునట్లు. వాలి చని పోయిన పిదప తారను పొందిన సుగ్రీవుడు వధ్యుడు కాడు. ఇందురాముని అధర్మమును, పక్షపాతమును ఏమియులేదు"[2] వానరులు

---

1. లక్కావఝుల వేంకటకృష్ణశాస్త్రి "ఆశ్చర్యరామాయణము" కిష్కింధాకాండము పుట. 166-168.

2 వావిలకొలను సుబ్బారావు. "ఆంధ్ర వాల్మీకి రామాయణము-మందరము." కిష్కింధా కాండము-పుట. 116.

క్షుద్రజాతులలో చేరినవారే కదా! —

ఈ సమాధాన మందరికి అంగీకారయోగ్యము కాకున్నది. మఱి, మొదటి పురాణ వృత్తము మాట యేమి ?

కావున బుద్ధారెడ్డి తారా, సుగ్రీవ, శ్రీరామచంద్రుల దోషము తొలగింపబడునట్టి కల్పన చేయదలంచి, స్కాందపురాణము నందలి తారా జన్మ వృత్తాంతమును గ్రహించి యథాతథముగా వ్రాసి, వాలి సుగ్రీవులను పొందు విధమును మార్చినాడు.

1) సముద్ర మథన సమయమున తమకు సహాయము చేసిన వాలిసుగ్రీవులకు తారను ఉమ్మడి సొత్తుగా నొసంగియుండుట. ఇది "యొక్క వాలికే భార్య" అనుదానికి చేసిన మార్పు. ఈ మార్పువలన "తార వాలి భోగమున కెంత యర్హురాలో, సుగ్రీవునికిని అంతటి భోగార్హురాలే" యని చెప్పు వలను పడినది. ఇది ద్రౌపది ఏకకాలమున వివాహమాడిన పంచపాండవులకు పత్నియై అందరికి సమాన భోగార్హయైనట్లని తలంపవలెను. ఇప్పుడు సుగ్రీవుని దోషము దూరమగును. పాండవులు కట్టడి నేర్పాటు చేసికొనుటచే, వారి మధ్య సామరస్య భంగ మేర్పడలేదు. వాలి సుగ్రీవులలో నా కట్టుబాటు లేమిచే భ్రాతృస్నేహము బెడసికొట్టినది.

2) తార సముద్ర గర్భ సంజాత; అయోనిజ, పంచపాండవులను పొందిన ద్రౌపదికివలె తారకును స్వైరిణీ (వ్యభిచార) దోష మంటబోదు

3) తార సుషేణుని కూతురైన విషయము వదలబడినది.

ఇక, "రుమాదేవి తారుడను వా(నరు)ని కూతురని మూలమునం[1]దుండగ నిందు సుషేణుని కూతురుగా మార్చబడినది.

సుషేణుడు రుమాదేవిని సుగ్రీవుని కిచ్చి పెండ్లిచేసెను కావున రుమాదేవి ఒక్క సుగ్రీవునకే ఉపభోగార్హ. కాని వాలి సుగ్రీవుని రాజ్యమునుంచి కట్టుబట్టలతో వెడలగొట్టి చంపగా వెంబడించినాడు; అంతతోం బోక దుర్బుద్ధితో మరదలిని (రుమాదేవిని) బలాత్కారముగా చేబట్టినాడు ఇట్టివాడు ధర్మశాస్త్రము ననుసరించి వధార్హుడు కాక మరేమగు? ఇచ్చట శ్రీరాముడును

"ఔరసీం భగినీం వాఽపి భార్యాం వాప్యనుజస్యయః।

ప్రచరేత నరః కామాత్ తస్య దండో వధస్స్మృతః॥"[2]

అని ధర్మశాస్త్ర ప్రమాణము నుట్టంకించినాడు.

మనుధర్మశాస్త్రమునందును "మరదలి పొందు గురుతల్ప గమనముతో సమానముగా భావింపబడినది; అట్టివారికి మరణదండనము విధింపబడినది."[3] ఏతత్కారణమున వాలి వధ్యుడైనాడు. ఇందు శ్రీరాముని దోషము లేదు.

---

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము కిష్కింధా. సర్గ 19. శ్లో. 16.
   "పితారుమాయా స్సంప్రాప్త స్సుగ్రీవశ్వశురో విభుః"అను శ్లోక వ్యాఖ్యానము. "రుమాయాః పితా తారః" అని యున్నది (గోవింద రాజీయము).
2. దా. ప్రతి వాల్మీకి రామాయణము. కిష్కింధా. సర్గ-18 శ్లో. 22 1/2.
3. మనుస్మృతి. అధ్యాయము-9. శ్లో. 57 మరియు అధ్యాయ. 11 శ్లో. 58.
   a) భ్రాతుర్జ్యేష్ఠస్య భార్యాయా-గురుపత్న్యనుజస్యసా।

బుద్ధారెడ్డి తార జన్మ వృత్తాంతమును స్కాంద పురాణాధారమున గ్రహించి, తారా వాలి సుగ్రీవుల చర్యలను, వాలి వధను సమర్థించుటకై. శ్రీరాముడు నిష్పక్షపాతి యని నిరూపించుటకై "వాలిసుగ్రీవులకు తార ఉమ్మడి సొత్తుగా లభించుట" యనునట్టి మార్పునుజేసి. యచట సముద్ర మథన వృత్తాంతమును పై విశేషాంశముల కొఱకై మరల రచించి చొప్పించినాడు. దీనిచే కవి యెంతో దూరాలోచన గలవాడని వ్యక్తమగును. ఔచిత్యమును చక్కగా బోషింపబడినది.

ఆంధ్ర విశ్వకళా పరిషత్తు ప్రతియందు ఈ ద్విపదలు అనుబంధము 2 లోఁ జేర్చబడినవి. వావిళ్ళ, రాయల్ ఆండ్ కో ప్రతులందు మూలపాఠమునందే యున్నవి. శైలిని బట్టియు, కల్పనా ప్రాధాన్యము ననుసరించియు. పరిశీలించినవారికి ఇది ప్రక్షిప్తమని తోచదు.

ఇందు చెప్పబడిన నూతనాంశములు.

1. సముద్రమునఁ బుట్టిన జ్యేష్ఠాదేవిని కలిరాజు గైకొనుట.[1]

2. ఐరావణ, మేష, మహిష, మకర, కరేణువులు, హయవృషములు సముద్రముననే జనించి దిక్పాలకులకు వాహనములగుట,

ఇట్లు సముద్ర మథన వృత్తాంతము రంగనాథ రామాయణమునందు రెండవసారి చెప్పబడి నను విశేష విషయములు గలిగి. విశేష ప్రయోజనములతో నొప్పియున్నది.

5) కరుణావతి చరిత్రము:—

శ్రీరాముడు దుందుభి యస్థిపంజరమును పాదాంగుష్ఠంబునఁ బది యోజనములు మీదిపై చుటను స్వయముగాఁ చిమ్మించియు, సుగ్రీవుడు వాలి బలముకన్న శ్రీరాముని బలము మిన్న యని నమ్మ జాలకపోయెను; అంతట శ్రీరాముడు సుగ్రీవుని కోరికపై సప్తతాళముల నొక శరమున ఖండించెను

రంగనాథ రామాయణమునం దిచట రెండవాల్మీకాంశములు గలవు.

1. సప్తతాళముల నొక్కశరమునఁ దెగవేసిన వానిచేత వాలి మరణించు"నని మరుత్తుడను ముని తనకుఁ దెలిపినాడని సుగ్రీవుడు చెప్పుట.[2]

2. తాళ వృక్షములను దెగవేయగా, అందునుండి "కరుణావతి" యను కన్యక శాప ముక్తయై బయటకు వచ్చి, దూర్వాస శాపమునఁ దన కిట్టి రూపము కలిగినదని పలికి, రాముని కీర్తించి అమరేంద్రు నగరమున కేగుట.[3]

యవీయసస్తు యా భార్యా-స్నుషా జ్యేష్ఠస్య సాస్మృతా।"

b) రేతస్సేకః స్వయోనీషు కుమారీష్వంత్యజాసు చ।
సఖ్యుః పుత్రస్య చ స్త్రీషు గురుతల్ప సమం విదుః॥

1. పద్మపురాణము- బ్రహ్మఖండము. అధ్యాయ-9 శ్లో. 8 1/2, 20 1/2.
"తతోఽలక్ష్మీః సముత్పన్నా కాలాస్యా రక్తలోచనా।"
"ఇత్యాదిశ్య సురాజ్యేష్ఠాం సర్వేతం కలవల్లిభాః॥"

2. రంగనాథ రామాయణము కిష్కింధాకాండ. ద్వి. 375-376.

3. రంగనాథ రామాయణము కిష్కింధా: ద్వి. 384-388.

ఇచట "మరుత్తు" డనుటకు బదులు "మతంగుడని" పాఠాంతరమును కలదు.[1] మతంగాశ్రమము ఋష్యమూక పర్వత ప్రాంతమునందే కలదు. వాలి విసరివేసిన దుందుభి కాయము మతంగాశ్రమమునందు పడగా, అతడు కోపించి, వాలి తత్పర్వతమునకు వచ్చిన తల పగులునని శపించెను. అన్నమీది కోపమున, సుగ్రీవుడెప్పుడైనను మతంగుని కలిసినప్పుడు, అతడు "సప్త తాళ భంజకుడు వాలి హంత"యని రహస్యమును ప్రకటించి యుండవచ్చును. ఈ యూహ సరియైనచో ఇచట "మతంగ" పాఠమే యుండదగినది.

నృసింహ పురాణములో—

"యుగపత్సప్త తాలాంస్తు తరూన్ యోవై వధిష్యతి।
సతం వధిష్యతీ త్యుక్తం పురాణజ్ఞై ర్నృపాత్మజ॥"[2]

అని "పురాణజ్ఞు"లచే ఇది చెప్పబడినట్లు కలదు.

ఆనంద రామాయణములో— "సుగ్రీవుడు స్వయముగా "సర్పతాళ ఫల" వృత్తాంతమును దెలుపుచోట తన కీ కథను జెప్పినవారి పేరునైనను దెలుపలేదు. కావున శాపానుగ్రహ సమర్థుడైన మతంగుడు సమీపస్థుడైయుండ, "పురాణజ్ఞులు" వంటి సాధారణ జాతి నామవాచక శబ్ద ప్రయోగ మంత సముచితముగా నుండదని తలంచి, కవి "మతంగ" శబ్దము నుపయోగించి యుండవచ్చును.

"ఇక, ఆనంద రామాయణములో "కరుణావతి" కథకు భిన్నముగా తాళఫల వృత్తాంత మొకటి కలదు.

వాలి తాళ ఫలములను ఋష్యమూక పర్వతముపై నొక గుహలో దాచిపెట్టియుండగా, ఒకానొక సర్పము జూచి, వానిలో పేకింటిని భక్షించెను వాలి యిది గ్రహించి, "అది శిలగా పడి యుండుననియు దాని దేహములోనుండి ఏడు తాటిచెట్లు మొలచు"ననియు శపించెను. "ఈ తాళవృక్ష భంజకుడే వాలి మారకుడు కాగలడని" పాము ప్రతిశాప మొసంగెను."

శ్రీరాముడు తాళభంగము చేయగా, శాపముక్తమైన సర్పము దాశరథి యాదేశమున బోయి, నిద్రించుచున్న వాలి మెడలోని, ఎదుటివారి సగబలము నాకర్షించునట్టి ఇంద్రదత్త హేమమాలను అపహరించుకొని పోయెను."[3] (ఆ మాల లేని కారణమున మరునాడు సుగ్రీవుడు వాలితో పోరాడగలిగెను; శ్రీరాముడు వాలిని వధింపగలిగెను).

లభించిన రామాయణములను పరిశీలింపగా, "తాళవృక్ష భంజకుడే వాలిని చంపు"ననుటకు హేతువైన కథ "సర్పతాళ వృత్తాంత" మొకటి దప్ప మరొకటి కనిపించలేదు.[4] బుద్ధభూపతి

---

1. "మరుత్తు"డని వావిళ్ళ పాఠము. "మతంగు"డని రాయల్ అండ్ కో పాఠము.
2. నృసింహ పురాణము. అధ్యాయ-50. శ్లో. 20.
3. ఆనంద రామాయణము. సారకాండము. సర్గ-8. శ్లో. 37-46.
4. తులసీదాస రామాయణము (హిందీ)నందు కిష్కింధాకాండము ద్వితీయ విశ్రామములో ఈ సర్ప వృత్తాంతము కలదు. కాని పండిత జ్వాలా ప్రసాద్‌జీ మిశ్ర కృతసంజీవనీ టీకలో నిది ప్రక్షేపమని వ్రాయబడినది.

ఈ కథను గ్రహించలేదు. "వాలి చనిపోవుటకు ముందు సుగ్రీవుని పిలిచి, చివరి మాటలు కొన్ని చెప్పి, తన మెడలోని స్వర్ణమాలను దీసి యతనికిచ్చె"ననెడి తర్వాతి కథాంశముతో "సర్పము హారము నపహరించుకొని పోయిన పిదప మరల వాలి కేక్కడినుండి వచ్చిన"దని విరోధము కలిగి యున్నది. కావున రచయిత వదలి యుండవచ్చును. అయినచో "సప్తతాళ భంజకుడే వాలి హంత" అనుటకు హేతువైన కథ యొక్కటి యుండవలెను. ఆ కథయే కరుణావతి వృత్తాంతమా ? కాదని మనవి.

ఈ కరుణావతి వృత్తాంతమునకు పాఠద్వయమున్నది.

1) ఆంధ్ర విశ్వ కళాపరిషత్తువారి ప్రతియందు రెండవ అనుబంధమున జేర్చబడిన సుమారు 38 ద్విపదలు గల దీర్ఘపాఠము (పుట-720, 721)

2) వావిళ్ళవారును, రాయల్ అండ్ కో వారును ముద్రించిన గ్రంథములందు మూల పాఠముననే చేర్చబడిన 5 ద్విపదలు[1]. ఈ పాఠము ఆం.వి.క.ప. ప్రతి సంపాదకులకు లభించలేదు కావచ్చును. వారు దీని ఊసే ఎత్తలేదు.

ఈ రెండు పాఠముల వృత్తాంతములందు ఒకటి రెండు భేదములున్నవి.

1) శ్రీరాముడు శిలారూప సర్పము తోక ద్రొక్కి నిలువగా, (అహల్యవలె) తాళభంజనమునకు పూర్వమే అది శాప విముక్తయైనట్లు దీర్ఘపాఠము. తాళభంజనానంతరమని సంక్షిప్త పాఠము.

2) దూర్వాసముని తపోభంగమునకై ఇంద్రునిచే పంపబడి, అతని యెదుట లాస్యము చేయుచుండగా, అతడు కోపించి శపించినట్లు దీర్ఘపాఠము. నిరతము దూర్వాసు నిందించుటచే నత డలిగి శపించినట్లు సంక్షిప్త పాఠము.

3) "శిలా ప్రాయ సర్పంబవై యుండుమని" దీర్ఘపాఠము. "ఇట్టిరూపమై" యని సంక్షిప్త పాఠము. ఇది తాళవృక్ష భేదనానంతరము శాప ముక్తయైన కరుణావతి పల్కిన మాట గావున "ఇట్టిరూపమై" యనుట తాళవృక్ష రూపమునియే యర్థము గ్రాహ్యము.

దీర్ఘపాఠము "సర్పరూప శిలకును, సంక్షిప్తపాఠము "తాళవృక్షములకును" ప్రాధాన్య మొసంగుచున్నది.

ఇక, సంక్షిప్త పాఠమునందు "కరుణావతనెడు" "కరుణావతమరేంద్రు పురికి" యని ఇత్వ సంధులును;

ఆతులితంబగు రవ మాకాశవీథి-అతుల విమానంబు నందుండి పలికె"

యనుచోట కేవలము ప్రాస కొఱకైన శబ్ద పునరుక్తియు ననెడి దోషములున్నవి వీనినిబట్టి ఈ ద్విపదలు బుద్ధారెడ్డివి కావు; ప్రక్షిప్తములు. ఇట్టి వీనిని తొలగించి,

అలయక తీవ్రత నమ్మహా శరము-తొలగక రఘురాము దొనవచ్చి చొచ్చె
జొచ్చిన గనుగొని సుగ్రీవు డప్పు-డచ్చెరువును బొంది యానందమంది"[2]

---

1. రంగనాథ రామాయణము. కిష్కింధాకాండము. ద్వి. 384-388.
2. రంగనాథ రామాయణము కిష్కింధాకాండము. ద్వి. 388, 389.

అని పూర్వాపర ద్విపద పంక్తులను జేర్చి చదివినను కథాక్రమమున కెట్టి భంగము వాటిల్లదు; మీదు మిక్కిలి ముక్తపద గ్రస్తమై, రమణీయమై యొప్పును.

కావున ఈ సంక్షిప్త పాఠము ప్రక్షిప్తమగుట నిస్సందేహము.

ఇక దీర్ఘ పాఠము నందలి రచనాశైలి చాలవరకు రంగనాథ రామాయణ కర్తదిగానే తోచు చున్నది; కాని "తాళవృక్ష చ్ఛేదనకు పూర్వమే సర్పరూప శిల శాపవిముక్తయై కరుణావతియైనచో, తాళవృక్షముల యునికి యెట్లు సంభవ"మను ప్రశ్న యుదయించుచున్నది. అప్పు డా తాటిచెట్లు సర్పాకార శిలపై గాక వేరొకచోట నిలిచియున్నవని చెప్పవలెను. కథయం దట్లులేదు. ఒకవేళ చెప్పికొన్నను, ఈ కథవలన కవి సాధించిన ప్రయోజన మేమియులేదు. స్పర్శవలననే శాపమును తొలగించెడి శక్తి రాముని కున్నదని చెప్పుటయే ప్రయోజనమైనచో, దానికి అహల్యా వృత్తాంతము చాలును. ఇదిగాక, "తాళవృక్ష భంజకుడు వాలిని చంపును" అనుదానికిని ఈ కరుణావతి కథకును సంబంధములేదు. కావుననే కాబోలు ఆం.వి.క.ప. ప్రతి సంపాదకులు దీనిని రెండవ అనుబంధమునం జేర్చియున్నారు.

కావున,

ధరణీశ యీ సప్తతాళంబు లొక్క-శరమున వేగ వ్రేయు శౌర్యంబు గల్గు
పురుషునిచే వాలి పొలియు నటంచు-నరయ నాకు మతంగు డనుముని చెప్పె"

అనెడి అవాల్మీకాంశమునకు సరియైన కారణ కథ కానరాదు. అప్పుడు ఈ ద్విపదలను నృసింహ పురాణములో నున్నట్లు సాధారణముగాం గవి చెప్పినాడని కాని, లేక ప్రక్షిప్తములని కాని తలంచ వలెను—

9) త్రికూట పర్వతము—

శ్రీరామచంద్రుడు విభీషణుని కభయ మిచ్చిన తర్వాత-

"మాకు నిక్కము సెప్పు మా విభీషణుడ-నాకారి శక్తియు నమ్మిన బలము"[1]

అని యడుగగా, విభీషణుడు రావణుని బలపరాక్రమాదులను, అతని సుత, సోదరానుచరాదుల శక్తియుక్తులను చెప్ప మొదలిడెను. మొదట లంకాపుర మే పర్వతముపై నిర్మింపబడినదో, ఆ గిరికి త్రికూట మను పేరెట్లు వచ్చినదో, దానిని సుమారు 25 ద్విపదలలో వివరించెను.

"ఒకప్పుడు నారదుడు వాయువు వద్దకు బోయి శేషుని బలమును బొగడి, శేషుని యొద్దకు బోయి పవనుని బలమును స్తుతించి, వాయుశేషుల నడుమ పగను రగిలించెను. నారదుడు కలహ శనుడుగదా! అంతట పవనఫణి రాజులు మత్సరించి పరస్పర బలపరీక్షకుం బూనుకొనిరి. శేషుడు బంగరుకొండను చుట్టిపట్టిన, అది కంపము నొంద వీతునని గాలి యనెను. ఆదిశేషుడది యంగీకరించి తన వేయి పడగలతో మేరుపర్వతము యొక్క వేయి శిఖరములను పొదివిపట్టి తన శరీరముతో పర్వతమును జుట్టి అసదృశ లీల నుండెను. గాలి చలపట్టి సప్తవాయువులు వెలయగా వీవ దొడగెను. అప్పుడు ప్రళయము సంభవించెను. లోకములు వణకెను. రవి రథము చలించెను. సముద్రములు సంక్షోభించెను. చుక్కలు రాలెను; సర్వదిశలు నూటాడెను. భూమి కంపించెను. వేయేల మహాపదయే

1. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి. 703.

పొడమెను. ఈ ఆపదను నివారింపఁదలచి, బ్రహ్మాది దేవతలు ఫణిరాజును సమీపించి, "ఓయి నాగేంద్ర ! నీవైన సహించవలెను. మీ మత్సరముతో జగత్ సంక్షోభమే సంభవించినది. మామాట విని, మన్నించి, గాలిని గెలిపించి మమ్ము రక్షింపవలసిన"దని ప్రార్థించిరి. శేషుడు తత్ప్రార్థనకు శాంతించి తన పడగ నించుకయెత్తి గాలి వీచుటకు వీలు కలిగించెను. గాలి యప్పు డతిశయించిన వేగముతో వీవగా, ఒక మేరు శిఖరము విఱిగి, దూరముగా నెగిరి. సముద్ర మధ్య మున పడెను. ఆ ద్వీపమే శృంఖల (సింహళ) ద్వీపమై, తత్పర్వతమే మూమ్మొనలతో నొప్పి త్రికూట పర్వతమని విలసిల్లినది. దానిపై విశ్వకర్మ లంకా పట్టణమును సుందరముగా నిర్మించెను."[1]

ఇది ఆ ద్విపద పంక్తులలోని కథా సారాంశము.

ఇట బుద్ధభూపతి యుద్దేశము- త్రికూటపర్వత మనగా అదేదో కొండగాదు, శేష వాయువుల మాత్సర్య కారణముగా విఱిగి పడిన మేరుపర్వత శిఖర బాగమేయని చెప్పుట- అందుచేతనే లంకా పట్టణము స్వర్ణమయమై యొప్పినది.

వాల్మీకి రామాయణ త్రివిధ ప్రతులందును త్రికూట పర్వతమునకు చెందిన యీయితివృత్తమే కనిపించదు.

i) శ్రీరాముడు విభీషణుని మంచి మాటలచే సాంత్వనపఱచి,

"ఆఖ్యాహి మమ తత్త్వేన రాక్షసానాం బలాబలమ్।"[2]

అని యడుగగా. నతడు

"రావణస్య బలం సర్వ మాఖ్యాతు ముపచక్రమే।
అవధ్య స్సర్వ భూతానాం గంధర్వాసుర రాక్షసాం॥
రాజపుత్ర దశగ్రీవో వరదానా త్స్వయం భువః"[3]

అని రావణాదుల బల పరాక్రమములను దెలుప ప్రారంభించెను. కాని యిచట త్రికూట పర్వత వృత్తాంతమును గూర్చి ప్రస్తావించలేదు.

ii) ఆంజనేయుడు సీతా సందేశమును విన్నవించిన పిదప, రాముడడుగగా, లంకా దుర్గ నిర్మాణ విధానమును జెప్పుచు

"శైలాగ్రే రచితా దుర్గా సాపూర్దేవపురోపమా।"[4]

అని శైలాగ్రమున రచింపబడిన లంకా నగరమును గూర్చి చెప్పినాడేకాని, ఆ పర్వత విశేష కథను వివరించలేదు.

iii) వైశ్రవణుడు బ్రహ్మవలన ధనాధిపతిత్వమును, ఉత్తర దిక్పాలకత్వమును బొంది,

---

1. రంగనాథ రామాయణము యుద్ధకాండము. ద్వి. 706-728.
2. దా. ప్రతి వాల్మీకి రామాయణము. యుద్ధకాండము. సర్గ 19. శ్లో. 7.
3. దా. ప్రతి వాల్మీకి రామాయణము. యుద్ధకాండము. సర్గ, 19, శ్లో. 8,9.
4. దా. ప్రతి వాల్మీకి రామాయణము యుద్ధకాండము. సర్గ 3, శ్లో. 22.

తిరిగివచ్చి తనతండ్రియైన విశ్రవోబ్రహ్మను సమీపించి ప్రాంజలియై "నాకుఁ దగిన నివాసస్థానమును దెలుపు"డని ప్రార్థించగా, విశ్రవోబ్రహ్మ—

దక్షిణస్యో దధే స్తీరే త్రికూటో నామపర్వతః॥
తస్యాగ్రే తు విశాలాసా మహేంద్రస్య పురీయథా।
లంకానామ పురీరమ్యా నిర్మితా విశ్వకర్మణా॥"[1]

అని చెప్పి లంకకు పొమ్మనెను, కాని ఇచ్చటను త్రికూట పర్వత విషయము ప్రస్తావింపఁ బడలేదు.

అందువలన నిది అవాల్మీక గాథ. దీని కాధారమును పరిశీలించవలెను.

ఆనంద రామాయణమునందు త్రికూట పర్వతమునకు సంబంధించిన ఒక విచిత్ర గాథ చెప్పబడినది.

"క్షీరార్ణవముచే నావృతమై, త్రిశృంగములచే విశ్రుతమై త్రికూట మనుపేర నొప్పు నొక పర్వతము గలదు. దానిపై నొకచోట వరుణుని యుద్యానవన మున్నది అందు బంగారు తామరల నొప్పు నొక సరోవరము, దానిలో గజేంద్రములను గూడ తన లావుచే పట్టి లోనికి ఈడ్చుకొని పోగల క్రూర మకర మొకటి గలదు. ఒకప్పు డది డప్పిచే డస్సి నీరు ద్రాగవచ్చిన యొక గజ రాజమును పట్టి లోని కీడ్వసాగినది. ఆ కరి మకరములకు కొన్ని సంవత్సరముల వరకు పోరు భయంకరముగా కొనసాగినది. చివరకు సత్త్వ ముడిగిన గజేంద్రము దుఃఖించుచు "రక్షించు" మని శ్రీహరిని వేడెను. విష్ణువు గరుడుని మీద నటకువచ్చి, చక్రమున నక్రమును రూపుమాపి, గజము నుద్ధరించెను. ఇంద్రద్యుమ్ను డనురాజు అగస్త్య ముని శాపమున హస్తిరూపము నొందెను. దేవల మునిచే శపుడైన "హూహూ నామక గంధర్వుడు" నక్రమైనాడు. ఈ యిరువురు శ్రీహరి యనుగ్రహమున శాప విముక్తులు కాగా, వారి గజ, గ్రాహ శరీరము లచ్చట పడియుండెను. అంతట ఆకలి గొన్న గరుడుడు విష్ణువు నాహారమునకై ప్రార్థించ, నత డీ గజ గ్రాహములను భక్షించుమని గరుడుని హెచ్చరించెను. వైనతేయుడు వానిని దినుటకు పోయి, సరోవర సమీపమున నున్న భ్రూభంగ మనెడు గృధ్ర రాజమును కూడ సంహరించెను. అతడొక పాదమున ఏనుగు మొసళ్ళను, మరియొక పాదమున గ్రద్ద జేనిని ఇరికించుకొనిపోయి జాంబూనద వృక్షశాఖపై వ్రాలగ, నది విరిగెను. దాని నంటుకొని వ్రేలాడి తపము సేయుచున్న వాలఖిల్యాదులను రక్షించుటకై యా కొమ్మను ముక్కుతో పట్టుకొని, తండ్రి యాజ్ఞపై లంకా భూమికేగి, తన ఱెక్కలపై జాంబూనద తరుశాఖను నిలిపి, ఆ గజ, గ్రాహ, గృధ్ర రాజములను భక్షించి, వాని యెముకలను అచ్చట పారవేసెను ఆ యెముకల రాశులే పర్వతాకారములుగా నేర్పడినవి.

తత్త్యక్తైరస్థిభిస్తత్ర శృంగాణి త్రీణి చాభవన్।
త్రికూట ఇతినామ్నా స లంకాయాం గిరిరాడభూత్॥

ఇట్లా కరి, మకర, గృధ్ర రాజముల యస్థులచే నచ్చట మూడు ఎత్తైన శృంగము

---

1. దా. ప్రతి వాల్మీకి రామాయణము. ఉత్తరకాండము. సర్గ 3, శ్లో. 26, 27.

లేర్పడి త్రికూట మను పర్వతముగా నొప్పినది."[1]

ఈ కథవలన త్రికూటపర్వతము ఎముకల రాశి యని తెలియును. ఇది భారత భాగవతము లందలి కథకు విరుద్ధముగా నున్నది; అంత రసవత్తరముగాను లేదు; పవిత్రమైన రామాయణమున జేర్చుకొనదగినది కాదు. కావున బుద్ధారెడ్డి దీనిని గ్రహించలేదు.

ఇక, వామన పురాణమున గజేంద్రమోక్షణ కథా ఘట్టమునందు—

"సర్వ రత్నమయ శ్శ్రీమాం స్త్రికూటో నామ పర్వతః।
సుతః పర్వత రాజస్య సుమేరో ర్భాస్కర ద్యుతేః॥
క్షీరోద జల వీచ్యగ్రై ర్ధౌతామల శిలాతలః।
ఉత్థితః సాగరం భిత్వా దేవర్షి గణసేవితః॥"[2]

అని యిట్లు చెప్పబడినది. కాని దీనికిని రంగనాథ రామాయణము నందలి కథకును పొంతన యే మాత్రమును లేదు.

పరిశీలింపగా, వేంకటాచల మాహాత్మ్యమునకు సంబంధించిన ఇతివృత్తములలో త్రికూట పర్వత కథకు చాల దగ్గరగా నున్న యొక వృత్తాంతము పొడకట్టినది.

"ఇది బ్రహ్మపురాణము నందు దిలీప దుర్వాస సంవాదములో వాయుశేషుల పరస్పర బల పరీక్షాది వర్ణనమను పేర నొప్పు మొదటి యధ్యాయము."[3] దాదాపు 40 శ్లోకములలో నిది సంభాషణా త్మకముగా వివరింపబడినది.

బ్రహ్మపురాణము నందలి వేంకటాచల కథకును రంగనాథ రామాయణము నందలి త్రికూట పర్వత గాథకు పోలికలు చాలపరకున్నవి; అయినను ఒకటి రెండు భేదములు గలవు.

1) వేంకటాచల గాథకు మూలకారణము మధుసూదనుని సత్యసంకల్పము;[4] ఆదిశేషుని బలగర్వము.[5]

కాని త్రికూట పర్వత గాథకు మూలకారకుడు నారదుడు. ఇతడు శేషుని యెదుట వాయువును, వాయువు నెదుట శేషుని పొగడి పరస్పరము మాత్సర్య ద్వేషాదుల రగుల్కొల్పి పెంపొందించెను.

వాల్మీకి రామాయణమునందు నారదు డొక్కసారియే వాల్మీకికి రామకథ నుపదేశించు సందర్భమున మొదట కనిపించును, కాని రంగనాథ రామాయణమున మూడు నాలుగు పర్యాయములు పొడ సూపినాడు.

1, వాల్మీకికి నుపదేశము చేయుట.

---

1. ఆనంద రామాయణము. సారకాండము. సర్గ-9. శ్లో. 234-278.
2. వామన పురాణము.
3. శ్రీ వేంకటాచల మాహాత్మ్యము. భాగము-2. పుటలు-2-6.
(తిరుమల తిరుపతి దేవస్థానము ప్రచురణము-1961).
4. శేషమంతఃపుర ద్వారే భావి కార్యం సచింతయన్ (శ్లో. 14)
5. ఏవముక్తో హృషీకేశో శేషేణాత్యంత గర్వీణా। శ్లో. 19.

2. నాగ పాశబద్ధులైన శ్రీరామ లక్ష్మణుల యొద్దకు వచ్చుట

3. శేష వాయువుల మధ్య మత్సరమును గలిగించుట.

4. కుంభకర్ణునికి ఒకనాడు కనిపించి దేవతల సభలో విష్ణువు దీసికొన్న నిర్ణయమును దెలుపుట. ఇందు మొదటి ఘట్టము నారదుని త్రికాలజ్ఞత్వము, త్రిలోకజ్ఞత్వమును దెలియ జేయును.

రెండవది నారదుని భక్తిని నిరంతర నారాయణ నామ స్మరణను, సమయానుసార భగవత్సేవను దెలియజేయును.

మూడవది అతని కలహాశన ప్రియత్వమును ప్రకటించును.

నాల్గవది వార్తాహారిత్వమును, యథార్థ కథన స్వభావమును వ్యక్తపరచును.

రంగనాథ రామాయణకర్త నారదుని ఈ నాలుగు గుణగణ స్వభావములను వ్యక్తీకరించుటకై నాలుగు పర్యాయములు రామాయణమున నతని పాత్రను ప్రవేశింపఁజేసినాడనుట యుక్తియుక్తము-కావుననే ఈ త్రికూట పర్వతము లంకకు వచ్చుటకు కారణముగా నారదుని కలహ ప్రియత్వమును (కలహ కారకత్వమును) జెప్పుట ఇచ్చట ప్రధాన విషయము.

2. శేషుడు మేరువేంకటశైలములను పరివేష్టించియున్నాడనుటకు బదులు "ఒక్క అనిమిష గిరిఁ జుట్టి యున్నా" డనుట

ఇచట వేంకటాద్రి గాక త్రికూట పర్వతమును గూర్చి చెప్పుట ముఖ్యము. గనుక "వేంకటాచల" మనునది తొలగింపబడినది.

3. "దక్షిణ సముద్రమున కుత్తరమున పూర్వ సముద్రమునకు పడమర స్వర్ణముఖీ తటమున 32 యోజనముల దూరమున పర్వతము పడె"ననుటకు బదులు దక్షిణ సముద్ర మధ్యమునఁ బడెన"ని మార్చబడుట.

లంకయందలి పర్వతమును గూర్చి చెప్పబడునదైనందున ఈ మార్పు అత్యావసరము—

ఈ పైని చిన్న మార్పులను (భేదములను) మినహాయించిన మిగిలిన కథ యంతయు అచ్చముగా వేంకటాచల కథతో పోలియున్నది కవి వైష్ణవ మతానుయాయి. తిరుపతి, శ్రీరంగాది మాహాత్మ్య గ్రంథములను కూలంకషముగా చదివి, తత్తద్విషయములను కొలది మార్పులతో తన రామ చరితమున పొందుపరచవలెనని ఉబలాటపడియున్నట్లు ఇదలి త్రికూట, రామేశ్వర, శ్రీరంగనాథ వృత్తాంతములు నిదర్శనములుగా నున్నవి. వేంకటాచల వృత్తాంతమును నామభేదముతో త్రికూట వృత్తాంతముగా మార్చి, మూలమున లేకున్నను ఇచ్చట పొందుపరచుట కర్తయొక్క వైష్ణవాభినివేశమును మాత్రమే కాక, అతని బహుపురాణ పరిచయమును, సమయోచిత ప్రజ్ఞనుకూడ వెలార్చుచున్న దనుటలో అతిశయోక్తిలేదు—

10) పరిభక్తి:—

శ్రీ రాఘవుడు ప్రసన్నుడు కాని సముద్రునిపై కోపించి, బ్రహ్మాస్త్రమును ప్రయోగింపగా, అతడు భీతిల్లి రక్షించుమని శ్రీరాముని శరణాగతి నొందెను.

ఇచ్చట సాగరుని పత్నులైన గంగాది నదులు భరతోడ వచ్చి రాముని స్తుతించి [1]

---

1. రంగనాథ రామాయణము, యుద్ధకాండము ద్వి. 930-939.

"... ... అబ్ధీశు గాచి-శుభమతి మంగళసూత్రములీ నిలుపు"[1]

మని ప్రార్థించినట్లు. అతడు వారిని మన్నించి అభయ మిచ్చినట్లు రంగనాథ రామాయణమునందు సుమారు పది ద్విపదలు గలవు; ఇవి అవాల్మీకములు.

సముద్రుడు నదులతో మాత్రము వచ్చినట్లు మూలమునందున్నది.[2] కాని ఆ నదీమతల్లులు తమ మంగళసూత్రములు నిలుపుమని ప్రార్థింపగా, శ్రీరాము డభయ మొసంగినట్లు లేదు. ఇక, గంగాది నదులు వచ్చినట్లున్న ఆ శ్లోకముకూడ కుండలీకరణము నందుంచబడుటచే ప్రక్షిప్తమగుచున్నది. అయినను, ఆ శ్లోకమువంటిదానికే కవి చేసిన అద్భుత ప్రతిభా కల్పిత వివరణమే ఈ ద్విపదలు. ఇప్పట్టున వీనిపై భాగవత ప్రభావ మున్నదనుట నిస్సందేహము.

శ్రీకృష్ణుడు యమునా హ్రదములో దుమికి, దుష్టకాళీయుని మర్దించు నవసరమున, అతని పత్నులు నాగకాంతలు భయభీతులై వచ్చి, శ్రీకృష్ణుని శరణువేడి స్తుతించి,

"అపరాధః సకృద్ భర్త్రా సోఢవ్యః స్వప్రజాకృతః।
క్షంతుమర్హసి శాంతాత్మన్ మూఢస్య త్వామజానతః॥
అనుగృహ్ణీష్వ భగవన్ ప్రాణాంస్త్యజతి పన్నగః।
స్త్రీణాం నః సాధు శోచ్యానాం పతిః ప్రాణః ప్రదీయతాం॥"[3]

అని పతి ప్రాణములను గాపాడుమని కోరినట్లును, శ్రీకృష్ణ పరమాత్మ కాళీయుని దయదలచి విడిచినట్లును భాగవతమునందు కలదు. ఇట్లే విష్ణుపురాణమునందు నున్నది[4]

అబలలు దయనీయులు. అపరాధియే శరణాగతి నొంద నవసరములేదు. తత్సంబంధులు ప్రార్థించినను కాపాడునంతటి కరుణాళువు శ్రీరామచంద్రుడు. అపరాధిని కాంచుటయే తన వ్రతముగా ప్రకటించుకొన్నాడు. ఇంతేకాక, ఆడకుయ్యని, అలకుయ్యని వినజాలడు శ్రీరామచంద్రుడు

బుద్ధారెడ్డి ఈ విషయమును వ్యక్తీకరించుటకొఱకై, భాగవత ప్రభావము తనపై పనిచేయగా, వాల్మీకమునందు లేకున్నను గంగాది నదులచే పతి భిక్షను వేడింపజేసి శ్రీరామునిచే వారి కభయ మిప్పించినాడు. తప్పు జేసిన సముద్రుని శిక్షించుటకై ఏర్పడిన రాముని కోపము గంగాది నదుల ప్రవేశముచే సుకరముగా శాంతించినది.

గంగ విష్ణుపాదోద్భవి విష్ణ్వంశ సంభూతుడైన శ్రీరామునకు సముద్రు డల్లుడు. గంగ మోము చూచియే సముద్రుడు రక్షితుడైనాడు. అల్లుండ్రు దుర్మార్గులైనను, కూతుల మోము జూచి మామలు ఓర్చుకొందు రనుట లోకసహజము. ఈ నీతిని ప్రకటించుటకును కవి దీనిని కల్పించినా డనవచ్చును.

---

1. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి. 933-934.
2. దా. ప్రతి వాల్మీకి రామాయణము యుద్ధకాండము, సర్గ-23 శ్లో. 22.
   "దేవతానాం సురూపాణాం నానారూపాభి రీశ్వరః।
   గంగాసింధు ప్రధానాభి రాపగాభి స్సమన్వితః॥"
3. భాగవతము దశమ స్కంధము. అధ్యాయ-16, శ్లో. 51,52.
4. విష్ణుపురాణము. పంచమాంశము. అధ్యాయ-7. శ్లో. 54-59.

(11) రామేశ్వర ప్రతిష్ఠ :—

శ్రీరాముడు సేతు బంధన సమయమునందుగాని, రావణ వధానంతర మయోధ్యకు మరలి వచ్చునపుడుకాని రామేశ్వర ప్రతిష్ఠ చేసినట్లు వాల్మీకి రామాయణమున లేదు.

పుష్పక విమానముపై వచ్చుచు, రాముడు సీతాదేవికి ఆయా ప్రదేశములను జూపు చుండెను. అట్టిచో-

"ఏతత్తు దృశ్యతే తీర్థం సాగరస్య మహాత్మనః।
సేతుబంధ ఇతి ఖ్యాతం త్రైలోక్యేనాభి పూజితం॥
ఏతత్ పవిత్రం పరమం మహాపాతక నాశనం।
అత్రపూర్వం మహాదేవః ప్రసాద మకరోత్ ప్రభుః॥"[1]

అను శ్లోకములున్నవి. ఇచ్చట "మహాదేవ" శబ్దము చర్చనీయమై యున్నది.

శ్రీరామచంద్రుడు రామేశ్వర లింగమును స్థాపించలేదని వాదించు పరమ వైష్ణవులు "అత్ర పూర్వం మహాదేవః ప్రసాదమకరోత్ ప్రభుః।" అను శ్లోకార్థమునకు "అత్రపూః + అంమహాదేవః అని పదవిభాగము చేసి సముద్ర పరముగా అర్థము చెప్పుదురు[2] మరికొందరు "హే అత్రపూరు = హేసీతా" అనియు సంబోధనగా భావింతురు. కొందరు "మహాదేవః = సముద్రుడు"[3] అనియు నర్థము జెప్పుదురు—

ఈ శివలింగ ప్రతిష్ఠగూర్చి వైష్ణవుల వాద సారాంశ మిట్లుండును—

"శివుడు తనకు సంభవించిన బ్రహ్మహత్యను దీర్చుకొనుటకు శక్తిలేక తపమొనర్చి శ్రీమహావిష్ణు దేవుని వలన ఆ బ్రహ్మహత్యా పాతకమును నివారించుకొన్నట్లు శ్రుతులు ఘోషించు చున్నవి. కావున బ్రహ్మరుద్రాదులను గన్నవానికి జగన్మాతను చెప్పించిన రావణుని సంహరించిన బ్రహ్మహత్య దోషము కలుగునని ఏశాస్త్రమును జెప్పదు. కావున శ్రీరాముడు లింగపూజ సేయుటకు ప్రవర్తింపలేదు"[4] అని.

శ్రీరాముడు లింగ ప్రతిష్ఠ చేసినట్లు వాల్మీకి రామాయణమున స్పష్టముగా జెప్పబడకున్నను, వైష్ణవులు చేయలేదని ఎంతగా వాదించినను ప్రయోజన మంతగా గానరాదు. ఇతర రామాయణము

---

1. దా. ప్రతి వాల్మీకి రామాయణము-యుద్ధకాండము. సర్గ. 126, శ్లో. 15, 16. (ఈ శ్లోకములు పశ్చిమోత్తర శాఖీయ ప్రతిలో లేవు)
2. అత్రపూః = ఇచ్చట పూర్వము, అంమహాదేవః = అపాంమహాదేవః = జలములకు మహా దేవుడైన సముద్రుడను; ప్రభుః = రాజు; ప్రసాదమ్ + అకరోత్ = అనుగ్రహించెను. (అప్పుడు అత్రపూః + అంమహాదేవః = అత్రపూరం మహాదేవః అగును గదా)
3. "మహాదేవ ఇతి సముద్రరాజ ఉచ్యతే" = అని గోవిందరాజీయము.
4. శ్రీరంగం రామానుజయ్య. "ఉదయవరుల చరిత్రము". పుట. 35 (ఎస్.సి. స్వామి&సన్స్. ప్రచురణము. 1963)

లందును, పురాణములందును, రాముడు లింగ ప్రతిష్ఠ చేసినట్లు స్పష్టముగాఁ గనిపించుచున్నది. కాని ఒక్కటే చర్చనీయాంశము. "శ్రీరాముడు సముద్రమును దాటుటకు పూర్వము రావణుని జయించఁగోరి రామేశ్వర ప్రతిష్ఠ చేసినాడా? లేక రావణుని వధానంతరము అయోధ్యకు తిరిగి వచ్చుచు బ్రహ్మహత్యా పాతక నివృత్తికి లింగ ప్రతిష్ఠ చేసినాడా?" యనునది ఈ రెండు విధములకు ఆధారగ్రంథాధారములు గలవు. కావున రామేశ్వర ప్రతిష్ఠాకాల నిర్ణయమున పరస్పర భేదములు గలవు.

(1) శ్రీరాముడు రావణ వధాత్పూర్వమే సముద్రతరణ సందర్భముననే లింగ ప్రతిష్ఠ చేసెను. దీనికి ఈ క్రిందివాధారములు.

(a) ఆధ్యాత్మ రామాయణములోని

సేతు మారభమాణస్తు తత్ర రామేశ్వరం శివం।
సంస్థాప్య పూజయిత్వాహ రామో లోకహితాయచ॥"[1]

అనెడి శ్లోకము శ్రీరాముడు సేతు నిర్మాణము నారంభించువాడై రామేశ్వరుని స్థాపించి పూజించినట్లు తెలుపును.

(b) ఆనంద రామాయణమునందు—

తతఃసాగర సంయోగే స్వనామ్నా లింగముత్తమం।
స్థాపయామీతి నిశ్చిత్య మారుతిం వాక్యమబ్రవీత్॥''

అను శ్లోకము మొదలుకొని,

ప్రసిద్ధోఽభూచ్చరామేశః స్వర్గమృత్యు రసాతలే।
తతో రామాజ్ఞయా సేతుఁనలః కర్తుం సమనోదధే॥"[2]

అను శ్లోకము వరకు సుమారు 125 శ్లోకములతో హనుమల్లింగ, రామేశ్వర జ్యోతిర్లింగ, అగస్తి లింగముల స్థాపనమును గూర్చి వివరముగాఁ జెప్పబడినది. ఈ చివరి శ్లోకము సేతుబంధ నిర్మాణమునకు పూర్వమే రామేశ్వర ప్రతిష్ఠ జరిగినదని సాక్ష్యమిచ్చుచున్నది.

(c) శ్రీశివమహా పురాణములో—

"రాముడు పార్థివలింగ పూజ చేయగా, శివుడు ప్రత్యక్షమై రావణ యుద్ధమున 'జయము కలుగుగాక'ని వరమొసంగెను. అది రామేశ్వర నామమున ప్రసిద్ధమయ్యెను. రాముడు తద్వర ప్రభావమున రావణుని జయించెను"[3] అని యున్నది.

(2) రావణ వధానంతరము శివలింగ ప్రతిష్ఠ చేయబడినది. దీనికి క్రిందివి సాక్ష్యములు.

(a) స్కంద పురాణములో—

---

1. ఆధ్యాత్మ రామాయణము. యుద్ధకాండము సర్గ. 4. శ్లో. 1.
2. ఆనంద రామాయణము. సారకాండము. సర్గ. 10. శ్లో. 71-195.
3. శివమహా పురాణము. కోటి రుద్రసంహిత. అధ్యా. 31. శ్లో. 21-41.

రావణ వధ వలన జనించిన పాపమునకు నిష్కృతిని జెప్పుదని శ్రీరాముడగస్త్యాది మునుల నడుగగా, వారు దశగ్రీవ వధ దోషము తొలంగుటకును, లోక సంగ్రహేచ్ఛ చేతను, శివలింగ ప్రతిష్ఠ చేయుము"ని[1] చెప్పగా అట్లే శ్రీరాము డొనర్చెనని యున్నది.

(b) కూర్మ పురాణమునందు —

"ఆనయామాసతాం సీతాం వాయుపుత్ర సహాయవాన్
సేతు మధ్యే మహాదేవ మీశానం కృత్తి వాసనం।
స్థాపయామాస లింగస్థం పూజ యామాస రాఘవః॥"[2]

అని శ్రీరాముడు సీతను పొందిన తరువాతనే సేతుమధ్యమున మహాదేవుని స్థాపించి పూజించినట్లు చెప్పబడినది.

(c) దుర్వాస రామాయణమునందును —

పుష్పకంతు సమారుహ్య ససైన్యో రఘునందనః।
శివలింగ ప్రతిష్ఠాంచ కృత్వాతీరే మహోదధేః॥
పునః పుష్పక మారుహ్య వైదేహ్యా సహితో యయౌ॥"

అని రావణాదులను సంహరించి, లంకయందు విభీషణుని నిలిపి, పుష్పకము నెక్కి వచ్చి, సముద్ర తీరమున శివలింగము స్థాపించి, అయోధ్యకు తిరిగి వచ్చినట్లున్నది.

ఇట్లు రావణ వధాత్పూర్వము సముద్ర తరణ, రావణ వధార్థమై శ్రీరాముడు శివప్రతిష్ఠ చేసినట్లు కొన్నింటను, రావణ వధానంతరము బ్రహ్మహత్యా పాతక నివృత్తికై చేసినట్లు కొన్నింటను గనబడుచున్నది.

రంగనాథ రామాయణ కర్త మాత్రము రావణ వధానంతరమే బ్రహ్మహత్యా దోష నివారణకై శ్రీరాముడు రామేశ్వర ప్రతిష్ఠ చేసినాడని చక్కగా వర్ణించియున్నాడు ఇది యుద్ధ కాండములో —

"అని చెప్పుచునురాగ నారాఘవునకు — ఘన తర భీషణా కారంబుతోడ
నేతెంచి దశకంతు డెదుటఁ దోచుటయు — ....మొదలుకొని............
పరమాత్ముఁడట నుమాపతి ప్రతిష్ఠించి — ... ...
రమణఁ బూవుల వాన రఘురాము మీద — నమరులు గురియించి రగచరుల్ చెలగ"[3]

అను పంక్తి వరకు సుమారు 100 ద్విపదలలో వర్ణితమైనది. ప్రధానముగా నిచట స్కాంద పురాణము ననుసరించి రామేశ్వర వృత్తాంతము వ్రాయబడినట్లు పరిశీలించిన వారికి ప్రస్ఫుట మగును.

1. స్కాంద పురాణము. బ్రహ్మఖండము. అధ్యా. 44. శ్లో. 86-89.
2. కూర్మ పురాణము. పూర్వార్థము. అధ్యాయ. 21. శ్లో. 46.47.
3. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి. 8316-8414.

స్కాంద పురాణము నందలి యితి వృత్తము :—

"శ్రీరామ చంద్రుడు గంధమాదన పర్వతముపై సీతా, లక్ష్మణ, సుగ్రీవ విభీషణాది పరివార పరివృతుడై యుండెను. ఆవేళ దండకారణ్య వాసులైన అగస్త్యాది మునులు తమ జన్మ సాఫల్య మొందుటకై శ్రీరాముని దర్శింప నేతెంచి. మైథిలీ పతికి ప్రణామాదు లొనర్చి స్తుతించిరి, అపుడు శ్రీరాముడు "బ్రహ్మహత్యాదోష నివారణ కుపాయము చెప్పుడ"ని వారిని ప్రార్థించెను. వారు దశగ్రీవ వధదోష నివృత్తికై శివలింగమును ప్రతిష్ఠించి పూజింపుమనిరి; అది రామేశ్వర. లింగమున ప్రసిద్ధి వహించు ననియు పలికిరి. అంతట శ్రీరాము డాలోచించి, అప్పటికి రెండు ముహూర్తములకు శుభలగ్నమున్నదని గ్రహించి మారుతిని శివలింగమును దెచ్చుటకై కైలాసమున కంపెను. పావని కైలాసమునకేగి మహాదేవుని గానక. తదనుగ్రహము నొందుటకై జితేంద్రియుడై తపమాచరించి, పరమేశ్వర ప్రసాదమున శివలింగమును సంపాదించెను. హనుమంతుని రాకలో ఆలస్యము కాజొచ్చెను తత్త్వదర్శులైన మునులు కాల మతిక్రమింప బోవుచున్నదని రామునికి దెల్పిరి. అప్పటికి సీతాదేవి యిసుకతో లింగమును జేసెను. మునుల యనుమతిచే శ్రీరాముడు సీతాకృత సైకత లింగమును శుభముహూర్తమున నెలకొల్పి, దాని ముందు తాను జేసిన నందికేశుని స్థాపించెను. ధనుష్కోటితో కోటి తీర్థమును కల్పించి, తజ్జలముతో శివాభిషేక మొనర్చెను.

ఇంతలో హనుమంతుడు కైలాసమునుండి లింగమును మోసికొని వచ్చి, రాఘవ ప్రతిష్ఠిత సైకత లింగమును గాంచి తన పరిశ్రమ వృథాయైనదని అత్యంతముగా దుఃఖించెను. "సుగ్రీవ విభీషణాదులు సకాములై నిన్ను సేవించి, కళత్ర రాజ్యసంపద లొందిరి. నేను నిష్కాముడనై నిన్ను సేవించి యుద్ధములందు మిక్కిలి శ్రమపడి నందుకు, నాకు దుఃఖమే లభించినది. నీయాజ్ఞ చేతనే కైలాసమునకేగి లింగమును దెచ్చితిని. ఇంతలో వేరొక లింగమును ప్రతిష్ఠించితివి. ఈ అవమాన దుఃఖమును భరింపలేను; శరీరత్యాగము జేసెదనని విలపించుచుండెను.

శ్రీరాముడంజనా నందనుని సాంత్వన పఱచి, కన్నీళ్లను దుడిచి తత్త్వజ్ఞానోప దేశము చేసి. "తాను స్థాపించిన లింగమును దొలగించి తత్స్థానమున నతడు దెచ్చిన లింగమును ప్రతిష్ఠించుమని చెప్పెను. హనుమంతుడు లేచి సైకత లింగమును చేతితో పెకలించి వేయుటకు లఘు-గురు ప్రయత్నములను జేసెను; తన సమస్త బలమునుపయోగించెను; కాని యా యిసుక లింగమణు మాత్రమైనను కదలలేదు; తుమురు కూడ నేల రాలలేదు. పిదప నతడు లింగమునకు తన తోకజుట్టి చేతులతో నేలనాని దృఢముగా లాగుచు, బలముతో నాకసమున కెగసెను. తోక తెగగా, లింగమునకు క్రోసెడు దూరములో నాసాముఖముల నుండి నెత్తురు గ్రక్కుచు భూమిపై బడి మూర్ఛాక్రాంతుడయ్యెను. సీతారాములు మారుతిని తమయంకములందు పరుండ బెట్టుకొని చల్లని చేతుల నిమురుచు సేదదీర్చిరి. మారుతి కష్టమునకు దుఃఖించిరి. సీతారాముల స్పర్శ ప్రభావమున ఆంజనేయుడు మూర్ఛనుండి తేరి, తత్త్వమును (సత్యమును) గ్రహించి, రాముని స్తుతించి, తన తప్పును క్షమించుమని ప్రార్థించెను. శ్రీరాము డతని నోదార్చి, అనుగ్రహించి, అతడు దెచ్చిన లింగమును కూడ రామనాథ లింగమున కుత్తర దిగ్భాగమున ప్రతిష్ఠింపజేసి హనుమదీశ్వరుడను నామమున విలసిల్లజేసెను ఇప్పటికిని రామేశ్వర లింగమునకు తోకను జుట్టుటచే నేర్పడిన గుర్తులు కనబడుచున్నవి.

ఇట్లు శ్రీరాముడు శివలింగ ప్రతిష్ఠచేసి యర్చించిన యనంతర మా బ్రహ్మహత్య దూర మైనది. అచ్చట బ్రహ్మ విమోచనమను తీర్థమేర్పడినది ఇప్పుడును రావణు డచ్చట ఛాయా రూపమున గనబడును. రాముడా బ్రహ్మహత్యను నాగలోక బిలమునఁ బ్రవేశింపఁజేసి, బయటకు రాకుండ దానిపై మండపమును నిర్మించి రక్షార్థముగా భైరవస్వామినట నిల్పెను".[1]

బుద్ధ భూపతి ఈ స్కాంద పురాణ వృత్తాంతమును గ్రహించి వాల్మీకి రామాయణ కథా పరమార్థమునకు భంగముకాని రీతి ఒకటి రెండు మార్పులు చేసి తన గ్రంథమునఁ బొందు పరచినాడు. ఈ మార్పులిట్లున్నవి.

1. "శ్రీరాముడు తన దర్శనార్థమై వచ్చిన మునులతో బ్రహ్మహత్యా నివారణోపాయమును దెలుపుమని కోరగా వారు లింగ ప్రతిష్ఠ చేయుమని"రని స్కందపురాణము.

శ్రీరాముడు పుష్పక విమానముపై వచ్చుచుండ, ఎదుట రావణుడు ఛాయారూపుడై తోచుట, శ్రీరాముడు ఖిన్నుడై హతుడైన రావణుడు మరల నెట్లు వచ్చెనని విభీషణుని అడుగుట, అతడు బ్రహ్మను దలంపమని చెప్పుట, రాముడు క్రిందికి విమానము నుదించి అంబుజభవుని స్మరించుట, బ్రహ్మ పొడసూపి రావణుడు బ్రహ్మకులమున జనియించెను; ఎట్టి పాపాత్ముడైనను బ్రాహ్మణుని చంపకూడదు; నీవతనిని వధించితివి; అతడు మోక్షమును కాంక్షించి నీ యెదుట దోచెను నీ పేర అతనికై భవుని మున్నీటి కట్టపై ప్రతిష్ఠింపుము" అని చెప్పుట రంగనాథ రామాయణము నందలి మార్పు.

విమానముపై అయోధ్యా నగరమునకు వచ్చు శ్రీరాముడు విభీషణ బ్రహ్మల నడుగుటయే సముచితము. కాని మునుల నడుగుటకాదు.

2. "కైలాసమునకు మారుతిని శ్రీరాముడు లింగార్థము పంపెనని" స్కందపురాణము. ఇది "కాశీ"కి పంపెనని మార్చఁబడినది. ఈ మార్పుకు ఆనంద రామాయణ మాధారము —

కాశీంగత్వా శివాల్లింగం మానసీయ మనుత్తమం,

ముహూర్త మధ్యేనోచేన్మే ముహూర్తాత్క్రమో భవేత్॥"[2]

ఈ మార్పునకు ఉద్దేశ్యము (i) "కైలాసము కాశియు నొక్కటే" యనుటయు (ii) జాహ్నవీ జలంబులు దెచ్చి నీతెచ్చిన దేవుని కర్థి నభిషేకంబు సేయు నతడొనర్చిన బ్రహ్మ హత్యాదులు దొలగు" నని తరువాత చెప్పఁ బోవుదాని కుపబలకముగా నుండుటయు కావచ్చును.

ఇది కాశినుండి తేఁబడిన లింగము; కాశియందలి గంగా జలముచే నిది యభిషేకింపబడునది; ఆచటినుండి యిచటికి వచ్చుటచేనిది తద్గాంగ జలాభిషేకమునకు నోచుకొన లేకుండ పోవుచున్నది. కావున ఏవ్యక్తి కాశినుండి భాగీరథీ తోయమును దెచ్చి, ఇచ్చటి లింగము నభిషేకించునో, అతని

1. స్కంద పురాణము. బ్రహ్మఖండము అధ్యాయములు. 44, 45, 46, 47.
2. ఆనంద రామాయణము. సారకాండము. సర్గ. 10. శ్లో. 72.

యెడ శివుడధిక ప్రసన్నుడగును." ఇది కార్యకారణ భావమునకు సరిపోవుచున్నది. కనుక నిచట "కైలాసమునకు బదులు కాశి" యని మార్చుట సముచితము.

3. "పుణ్యకాలము రెండు ముహూర్తములని" స్కంద పురాణము; "ఒక ముహూర్తమని" మార్పు ఆనందరామాయణమున ముహూర్త మధ్యే" యని యుండుట గమనార్హము.

"కైలాసమునకు రెండు ముహూర్తముల"ని చెప్పబడినది అది "కాశి" కని మార్చబడినపుడు తక్కువ కాలముండుట సహజము. ఈ దూరాదూర భావములను విచారించి ఒక్క ముహూర్తమని చెప్పుట ఔచితీ శోభితము.

ఆంజనేయుడు రెండు ముహూర్తములలో వచ్చి రాముడు చేయు పరీక్షకు నిలువవచ్చును. తక్కువ కాలమును నిర్ణయించుటయే యుక్తమను తలంపు ఈ మార్పునకు కారణము కావచ్చును.

ఇవి అంత పెద్ద మార్పులు కావు. మిగిలిన కథ యంతయు స్కంద పురాణ వృత్తాంతమునే పోలియున్నది.

వాల్మీకమున లేని ఈ రామేశ్వర వృత్తాంతమును తన రామ చరిత్రమందుఁ జొప్పించి బుద్ధారెడ్డి సాధించిన ప్రయోజనములు —

(1) ఇది ప్రధానముగా ఆంజనేయ గర్వభంగమునకై సర్వజ్ఞుడు, శ్రీమన్నారాయణావతార మూర్తియైన రాముడు కల్పించిన ఘటనయే కాని వేరుకాదనుట.

"...మున్ను ద్రోణాచలంబేను — దక్కక యగలించి తనరఁ దెచ్చితిని.
భుజగ కంకణుతోడ భూతాలి తోడ — రజతాద్రి నెత్తిన రావణునకును
నెత్తంగ నలవి గాకెసగు సౌమిత్రి — నెత్తితి; నింద్రాదులెల్లఁ గీర్తింపఁ
దటుకున మేరు మందరముల నైన — బొటవేలఁ జిమ్ముదు భూరి సత్వమున"[1]

అనెడి అహంభావ మాంజనేయునకు గలిగినది. ఆ గర్వమును తొలగించుటకే రాముడు స్వహస్త స్థాపిత సైకత లింగమును దొలగించు మనెను. హనుమంతునకు దానిని తొలగింప సాధ్యము కాకపోవుటయే కాక,

"అగచరేశ్వరుడు ధైర్యము తోడ నభవు — నగలించ లేక బాహా గర్వ మెడలి
పటురక్తములు గ్రక్కి ప్రాణముల్ గలగ — యట మూర్ఛతోడి నయ్యవనిపై.
ద్రెళ్ళె"[2]

ననునవి "హనుమంతునికి గర్వము పొడమగా, శ్రీరాముడు తద్భంగము గావించె" ననుటకు నిదర్శనములు.

ఈ విషయ మానంద రామాయణములో స్పష్టముగా నుడువబడినది.

---

1. రంగనాథ రామాయణము. యుద్ధకాండము ద్వి. 8381-8384.
2. ,, ,, ,, ,, ,, 8389-8390.

"సేతుకాలే రాఘవేణ గర్వం దృష్ట్వా మయి స్థితం।
లాంగూలం ఖండితం పూర్వం లింగోత్పాటన హేతునా॥"[1]

2. శైవ వైష్ణవుల మధ్య సామరస్యమును గలిగించుట :—

బుద్ధ భూపతి కాలము వరకే తెలుగు దేశమున మత వైషమ్యము పెచ్చు పెరిగియుండెను. శైవులు వైష్ణవులును శివవిష్ణు పారమ్య విషయమున పరస్పరము పోరాడు కొనుచుండిరి. ఇరువురి నడుమ వాగ్యుద్ధములే కాక, రక్తపాతములును ప్రవహించు చుండెను.

"ఈ శివదూషకు నాలుకగోసి ఉప్పు నింపుడను"[2] చు వీర శైవులు విజృంభించు చుండిరి, వీరు "శివాత్ పరతరంనాస్తి"[3] యనగా, "అస్తి ద్రోణమతః పరం"[4] అని వైష్ణవులు శైవులను వెక్కిరించు చుండిరి. ఇట్టి సమయమున బుద్ధారెడ్డి రామకథను జేపట్టి, మూల వైశిష్ట్యముగా గంగావతార, కుమారస్వామి జననాదులను వ్రాయుటయేకాక, వాల్మీకమునందు లేనిదియు, ఇతర పురాణము లందున్నదియునగు రామేశ్వర వృత్తమును జొప్పించి "శ్రీమన్నారాయణుని పూర్ణావతారమయిన శ్రీరామచంద్రుడే సేతువునందు లింగ ప్రతిష్ఠ చేసినాడు; విష్ణు భక్తులైన మీరు శివుని ద్వేషింపకూడదు; భక్తి శ్రద్ధలతోఁ బూజింపుడని" వైష్ణవులకును, "రుద్రాంశ సంభూతుడైన ఆంజనేయుడే శ్రీరామునకు సేవ చేసినాడు; ఇంతేకాక గర్వించి తోకను తెంపుకొన్న వాడయ్యెను; మీరును విష్ణువును సేవింపుడు, గర్వింపకూడదు" అని శైవులకును బోధించి, వారినడుమ సఖ్యమును గూర్ప నెంచినాడనుట సముచితము. పరస్పర ద్వేషమువలన —

"మద్భక్తశ్శంకర ద్వేషీ మద్ద్వేషీ శంకర ప్రియః।
తావుభౌ నరకంయాతః యావచ్చంద్ర దివాకరౌ॥"[5]

అను ప్రమాణముచే "ఇరువురును నరకలోకమునకు పోవుదుర"ని హితోపదేశము చేయుటయు గూడనగును.

ఇంతేకాని, ఈ యాఖ్యానముచే శివ పారమ్య ముద్దిష్ట" మనుట పొసగదు. స్మరణ మాత్రముననే ఆశ్రితుల సకల పాపములను నివారింపఁజేయు శ్రీరామునికి-పవిత్ర పావనునికి-బ్రహ్మహత్య చుట్టుకొనినదనుట తన్నివారణకై రామేశ్వరుని ప్రతిష్ఠాపించినాడనుట నిప్పుకు చెదలు పట్టిన వనుట వంటిది. తనదోషమును తాను నివారింపుకొన లేనివాడు ఇతరుల దోషములనెట్లు పోగొట్టును? కావున బుద్ధారెడ్డి కూడ "రావణుడు మోక్షమును గోరి నీ యెదుటఁ దోచినాడు"[6] అని

---

1. ఆనందరామాయణము. సారకాండము. సర్గ. 12. శ్లో. 33.
2. నన్నెచోడుడు, కుమార సంభవము. అశ్వాస. 2. పద్య. 82.
3. ఆచార్య సూక్తిముక్తావళి. పుట. 212.
4. శ్రీరంగం రామానుజయ్య. "ఉడయవరుల చరిత్ర" పుట. 43. ఎస్.సి. స్వామి ముద్రణము. 1963.
5. శివపురాణము
6 రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి. 8340, 8341.

బ్రహ్మచే చెప్పించినాడు, కాని "ఓ రామా! నీకు బ్రహ్మ హత్య చుట్టుకొనినదని" చెప్పించలేదు అందువలన ఈ వృత్తాంతమునందలి ఘటనలు హనుమంతుడాలస్యముగా వచ్చుట, శ్రీరాముడిసుక లింగమును ఆలోగా స్థాపించుట, దానిని తొలగించుటకు ఆంజనేయుడభిమానముతో ప్రవర్తించి ప్రయత్నించుట. సాధ్యముగాక నెత్తురు గ్రక్కుచు నేలఁబడుట, తోక తెగుట" అనెడి సన్నివేశములు హనుమంతుని గర్వభంజనమునకు కల్పితము లైనవేకాని వేరుకాదు. బ్రహ్మహత్యా నివారణకై శ్రీరాముడు శివలింగమును స్థాపింపఁ దలచినచో, మొదటనే ఇసుక లింగమునుగాని, మరి శిలాలింగమును గాని, సిద్ధముచేసి స్థాపించవచ్చును గదా! ఆంజనేయుని కాశికిఁ బంపి ఒక ముహూర్తములోనే రావలెననుట సముచితము కాదు. ఆలస్యమగుటచే సైకత లింగమును స్థాపించి నాడందుమా! అది మీదికి సమాధానమేకాని, వేరుకాదు. కావున సూక్ష్మముగా విచారించినచో ఆంజనేయుని అభిమాన (గర్వ) భంగమే ముఖ్యమనియు, బ్రహ్మహత్యా నివారణమునకై యే రామేశ్వరుని స్థాపించి నాడనుట గౌణము (వ్యాజము) మాత్రమనియు చెప్పవచ్చును. ఎవరెట్లు చెప్పినను శ్రీరాముడు శివలింగ ప్రతిష్ఠ చేసి నాడనుట యథార్థము.

కావున బుద్ధ భూపతి ఈ కథాంశమును ప్రధానముగా స్కాంద పురాణమునుండి గ్రహించి, ఆనంద రామాయణాధారమున కొంత మార్పుచేసి, శైవవైష్ణవుల మధ్య సామరస్యమును గలిగించుటకై ఔచితీ వంతముగాఁ దీర్చిదిద్దినాడు. ఇప్పటికిని జనులు భక్తిశ్రద్ధలతో కాశీ రామేశ్వర యాత్రలు చేయుచుండుట మనము చూచుచుండునదే —

(12) ధనుష్కోటి :—

ఇదే సందర్భమున ధనుష్కోటి వృత్తాంతమును గలదు. ఇదియు అవాల్మీకమే —

"విభీషణుడు శ్రీరాముని జూచి "ఈ కట్ట తెరువుగా లంకకు నెవ్వరును రాకుండ జేయుము"ని ప్రార్థించెను. రాఘవుడు కొన్ని యడుగులు మగిడి, నడుసేతుమీద నిలచి లక్ష్మణుని చేతి ధనువంది పుచ్చుకొని ధనుష్కోటి గావించెను; అనగా కట్ట తెంపెను. ఇచట స్నానము చేసిన వారికి సర్వ పాప విముక్తియు సకల పుణ్య ప్రాప్తము చేకూరునని వరమొసంగెను."[1]

ఈ ధనుష్కోటి వృత్తాంతము రంగనాథ రామాయణమున సుమారు 12 ద్విపదలలో గలదు. అవాల్మీకమైన యీ విషయము స్కంద పురాణము[2]లో వివరముగాను, ఆనంద రామాయణములో[3] సూచనా మాత్రముగాను నున్నది.

మూలమునందు 'ఈసేతు మార్గమున బలోద్రిక్తులైన రాజులు లంకకువచ్చి పట్టణమునకుపీడ కల్గింతురు. కావున సేతువును భంజించుమ'ని విభీషణు డడిగి నట్లుండగా నిందు "ఈ కట్ట తెరువుగా నెవ్వరికైన-రాకుండఁ జేయుమో రామ లంకకును" అని మార్చబడినది. కారణము ప్రత్యేకముగా జెప్పబడలేదు.

---

1. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ది. 8415-8427.
2. స్కంద పురాణము. బ్రహ్మఖండము. అధ్యా. 30. శ్లో. 9-80.
3. ఆనంద రామాయణము. సారకాండము. సర్గ. 12. శ్లో. 46-48

బలో(ద్రిక్తులైన రాజులేకాక, లంకాదర్శనాభిలాషగల ఏ మనుజులైనను లంకకు పోవచ్చును. తమోగుణ ప్రవృత్తి, హింసాసక్తిగల రాక్షసులచే వారి కపాయ మేర్పడిన కలుగ వచ్చును. తద్ద్వారమున దోషము, సంక్షోభమును ఏర్పడును. అందువలన విభీషణుడు కారుణ్య దృష్టిచే శ్రీరాముని ప్రార్థించెను; కాని రాజుల పీడకు భయపడి కాదని ఊహించవచ్చును. ఇది సమంజస మైనచో, ఈ మార్పు విభీషణుని శీలమున మెఱుగులు దిద్దుచున్నదనుటకు చక్కని నిదర్శనము. ఈ యొక్క మార్పుదప్ప మిగిలినది స్కాంద పురాణము ననుసరించి యున్నది.

(13) శ్రీరంగనాథ ప్రతిష్ఠ :—

"శ్రీరామచంద్రుని పట్టాభిషేక మహోత్సవము మహావైభవముగా జరిగినది. పట్టాభి షేకానంతరము వానరాదులు శ్రీరామునిచే యథార్హముగా సత్కరింపబడి తమతమ నెలవులకు పోవుచుండిరి. వారిలో విభీషణుడొకడు. రావణ సంహార కార్యమున శ్రీరామునికి త్రికరణ శుద్ధిగా సహకరించినవాడు; అంతేకాక ధర్మాత్ముడు; శ్రీరాముని భక్తుడు గూడ అతడు శ్రీరాముని విడువ లేక పోయినాడు. అట్టి విభీషణు నోదార్చి, ఇక్ష్వాకుల కాలమునుండి ఆరాధింప బడుచు వచ్చుచున్న శ్రీరంగనాథ మూర్తిని తనకు బదులుగా కొల్చుచుండుమని శ్రీరామచంద్రుడు విభీషణునికి దాని నొసంగినాడు. విభీషణుడు దానిని దీసికొని పోవుచు కారణాంతరమున ఉభయ కావేరి మధ్య ప్రదేశమున నెలకొనఁజేసెను" కాని యిది వాల్మీకి రామాయణమునందు స్పష్టముగాలేదు. అందు—

లబ్ధ్వాకులధనం రాజా లంకాం ప్రాయా ద్విభీషణః।
స్వరాజ్య మఖిలం శాసన్ని హతారిర్మహాయశాః॥"[1]

అని మాత్రము కలదు. ఇచట కులధనమనగా శ్రీరంగనాథుడేయని "కులధనం- ఇక్ష్వాకు కులధనం- శ్రీరంగ విమాన మితి సంప్రదాయః"[2] అని కొందరు వ్యాఖ్యాతలు ఉట్టంకించినారు.

అయోధ్యలో నున్నకాలమున శ్రీరాముడీమూర్తిని అర్చించు వాడనియు తెలియుచున్నది.

"పౌరజానపదుల సమ్మతముతో, మంత్రి సామంతాదుల అంగీకారముతో దశరథుడు శ్రీరాముని పట్టాభిషేకమును నిశ్చయించి, పట్టాభిషేకానగముగ పూర్వదినమున చేయవలసిన కర్మలను సక్రమముగా శ్రీరామచంద్రునిచే చేయింపుమని వసిష్ఠుని ప్రార్థించెను. ఆవసిష్ఠుడు శ్రీరామ సౌధమునకేగి, యథాశాస్త్రముగా నతనిచే తత్తత్కర్మల నొనరింపఁజేసి, ఉపవాసవిధి నేర్పరచి భగవదర్చనాదులతో నారాత్రి గడుప వలెనని హెచ్చరించి తన యాశ్రమమునకుఁ దిరిగి వచ్చెను. అప్పుడా శ్రీరామచంద్రుడు నారాయణుని (శ్రీరంగనాథ విగ్రహమును) సీతాదేవితోఁగూడ నర్చించి, ఆమందిరమునందే శయనించె"నని వాల్మీకమునందిట్లున్నది —

"గతే పురోహితే రామః స్నాతో నియతమానసః।
సహపత్న్యా విశాలాక్ష్యా నారాయణ ముపామగత్॥

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. యుద్ధకాండ. సర్గ. 131. శ్లో. 85.
2. గోవిందరాజీయ వ్యాఖ్యానము.

ప్రగృహ్య శిరసా పాత్రీం హవిషో విధివత్తదా।
మహతే దైవతాయాజ్యం జుహావ జ్వలితేఽనలే॥
శేషంచ హవిషస్తస్య ప్రాశ్యాఽఽశాస్యాఽఽత్మనః ప్రియం।
ధ్యాయన్ నారాయణం దేవం స్వాస్తీర్ణే కుశ సంస్తరే॥
వాగ్యత స్సహ వైదేహ్యా భూత్వానియత మానసః।
శ్రీమత్యాయతనే విష్ణో శ్శిశ్యే నరవరాత్మజః॥"[1]

ఇచ్చట గోవింద రాజీయ వ్యాఖ్యానములో ఈ క్రింది పంక్తులు గమనార్హములు.

"........అత్రనారాయణ ఇతి శ్రీరంగనాయక ఉచ్యతే। ఉత్తరత్ర తస్యైవ విభీషణాయ దానోక్తేః... ... ఆత్మనః ప్రియ మాశాస్య శ్రీరంగార్పిత హవిశ్శేషం స్వస్యాత్యంత ప్రియత్వేనాను సంధాయ నారాయణం శ్రీరంగనాయకం ధ్యాయన్ కుశసంస్తరే..... శ్రీమతి విమానం ప్రణవాకార మిత్యాద్యుక్త వేదత్రయ సారభూత ప్రణవాకారే "ఋచస్సామాని యజూగ్ంషి-సాహి శ్రీరమృతాసతామితిశ్రుతేః"- విష్ణోరాయతనే శ్రీరంగధామని. శిశ్యే శయనం కృతవాన్, నరవరాత్మజః స్వస్య సాక్షాద్భగవదవతారత్వేపి శ్రీరంగ విగ్రహారోప్చప సర్జన స్వభావః స్వావతారాను మత క్షత్రియ ధర్మానుగుణః"[2]

"శ్రీరాముని చేత పూజింపబడిన నారాయణుడు శ్రీ రంగనాథుడే"యని వ్యాఖ్యాన సారాంశము కాని వాల్మీకి స్పష్టముగా "శ్రీరంగనాథ" శబ్దమును రామాయణమునందెచ్చటను ప్రయోగింపలేదు. అయినను తొలినాటినుండి ఈ విషయము పరంపరాగతముగానే వినబడుచున్నది. కావున శ్రీరామచంద్రుడు విభీషణునికి శ్రీరంగనాథ మందసమును తనకు ప్రతిగా నొసంగెననుట సమ్మతింపదగినదే. అతడు దానిని దీసికొని వెళ్ళుచుండగా మధ్యే మార్గమున ఉభయ కావేరీ మధ్యమున కారణాంతరములచే నది భూమిపై ప్రతిష్ఠాపింపబడినది. అది తిరిగి విభీషణునిచే నెత్త సాధ్యము కాలేదు. శ్రీరంగని ఆజ్ఞచేతనే విభీషణుడు లంకకు వెళ్ళిపోయినాడు, కొంతకాలమువరకు ప్రతి దినము వచ్చి రంగనాథుని అర్చించి పోవుచుండెను. ఆ పిదప ప్రత్యేక ఘటన యొకటి జరిగిన కారణముగా సంవత్సరమున కొక పర్యాయమే వచ్చి రంగని సేవించుకొని పోవుచున్నాడ"నెడి కథ ప్రజలలో వ్యాప్తమైయున్నది. దీనిని బుద్ధారెడ్డి గ్రహించి, తన గ్రంథాంతమున రచించి మంగళాంతము గావించినాడు.

అంత విభీషణుడా రాముఁజూచి-యెంతయు భక్తితో నిలఁజాగి మ్రొక్కి-
దేవ యిచ్చటనె మీ దివ్య శ్రీపాద-సేవఁజేయుచునుండుఁ జనగ నేనొల్ల
మనుజేశ నామది మఱి నిల్వదచట-యనవుడు రఘురాము డతని కిట్లనియె

---

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. అయోధ్యాకాండము. సర్గ. 6. శ్లో. 1-4.
2. దా ప్రతి వాల్మీకి రామాయణము. అయోధ్యాకాండము. సర్గ. 6. శ్లో. 1-4. (గోవింద రాజీయ వ్యాఖ్యానము)

అరయ మాస్వామి యగుచున్నయట్టి-శ్రీరంగ ధామునిచ్చెద నీవుగొమ్ము
పోయి నీవందు నెప్పుడు పూజసేయు-మాయందు భక్తియు మఱువకు మెపుడు
ననుచు శ్రీరంగనాయకునిచ్చెవేడ్క.
ననలొత్త శ్రీరంగనాయకుఁ గొనుచు-చనియె లంకకు విభీషణుదర్థి"1

అనెడి ద్విపద పంక్తులను, వీనికి రచనాంతరముగా గనబడుచున్నట్టి

చనక లంకకు విభీషణుడు రామునకు-ననియెను నపుడు కరాబ్జముల్ మొగిచి
— — — — — — మొదలుకొని
నిత్య నిత్యము నీవు నిచటికి వచ్చి-యత్యంత భక్తిఁ బూజలు సమర్పింపు
యనియానతిచ్చిన నర్థిఁబూజించి-చనియెలంకకు విభీషణుదర్థి"2

అను పంక్తి వరకును గల 33 ద్విపదలును ఈ విషయమును కొంత వివరముగాఁదెలుపుచున్నవి ఇందులో ప్రధాన వృత్తాంతము ప్రత్యేకముగా గమనింపఁదగినది.

"రంగనాథుని లంకను ప్రవేశించువరకు భూమి నెచ్చటను దింపకుమని రాముడు పల్కెను. దేవతలకిదియిష్టము లేదు కావున విఘ్నమునకై వారు మూషక వాహనుని ప్రార్థించిరి. అతడు వటు రూపమున విభీషణునికి కావేరీ తటమున నెదురు వచ్చెను. ఆ సమయమున విభీషణునికి కడుపుబ్బెను. కనుక నామందసమును రాక్షసేశ్వరుడు కుహనా వటువునకిచ్చి త్వరలో దేహ బాధ దీర్చుకొని వచ్చెదననెను. అంతట మాయా వటువు "ముమ్మారు నిన్ను పిలుతును. రానిచో మందసమునుబెట్టి పోవుదనని విభీషణునకు హెచ్చరికఁ జేసెను అతడు పోగానే ఆవటుగ్రామణి "ముమ్మారు" రాపలెనని పిలిచి, మందసమును భూమిని బెట్టి నవ్వుచు వెడలి పోయెను. విభీషణుడు తన శౌచ కర్మను దీర్చుకొని వచ్చి, శ్రీ రంగశాయి మందసము నెత్త లేక దీన చిత్తుడై ప్రార్థించుచుండగా "ప్రతి నిత్యము వచ్చి నీవు నన్నిచ్చటనే గొలుచుచుండుము. విచారింపక పొమ్ము" అని అనతీయగా విభీషణుడు తనవారితో లంకకు పోయెను.

ఈ గాథకు రచనాంతర ద్విపదలే కాక

రామునిచే రంగనాయకుగొనుచు-యామినీ చరపాలు డతిముదంబునను
కావేరీ చంద్ర పుష్కరిణీ తటమున-నా విమానము నుంచి యది రాకయున్న
చనియె మ్రొక్కుచు విభీషణుదర్థి"3

---

1. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. అనుబంధము 2 పుట. 842.
(ఆం.వి.క.ప. ప్రచురణము)
2. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. అనుబంధము 2 పుట. 842-843
(ఆం.వి.క.ప. ప్రచురణము)
1. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. అను 2. పుట 843.
(ఆం.వి.క.ప. ప్రచురణము)

ననెడి పాఠాంతర ద్విపదలును గానవచ్చుచున్నవి.

ఈ విధమైన త్రివిధ పాఠభేదములు ఆంధ్రవిశ్వకళాపరిషత్ ప్రచురణము; అనుబంధము 2 పుటలు 842, 843 లలో నీయబడినవి. ఈ మూడింటిలో కూడ యతి దోషాదులు, వింత ప్రయోగములు కనబడుచున్నవి.

1.	సేవ సేయుచునుండు జనగ నేనొల్ల	యతిభంగము
2.	జడియక యిప్పుడే చెప్పంగ వలయు	,,
3.	రామునిచే రంగ నాయకుఁ గొనుచు	,,
4.	అత్యంత భక్తిఁ బూజలు సమర్పింపు	,,
5.	మఱచెడి వారు రామావనీనాథ.	అఖండయ
6.	దేవ యిచ్చటనె మీ దివ్య శ్రీపాద.	

(దివ్య శ్రీ అను సమస్త పదము నఖండముగాఁ బల్కిన మగణమై, గణ భంగమగును. శ్రీ రేఫయుక్తము "వ్య" ను దేల్చి పల్కిన గణ భంగముకాదు)

7. నోమికతో బట్టుకుండుమీ యనిని

"పట్టుకొని యుండుమీ" అనుదాని సంగ్రహ రూపము పట్టుకొని + ఉండుమీ = పట్టుక + ఉండుమీ = పట్టుకుండుమీ)

ఇట్టి దోషములు కనబడుటచేఁ గాబోలు, సంపాదకులు వీనిని మూలమందుఁ జేర్చక అనుబంధమునందుఁ జేర్చినారు. వావిళ్ళ రాయల్ అండ్‌కో ప్రతులందు ఈ ద్విపదలు కానరావు అయినను పరిశీలించి చూడగా, పై త్రివిధ పాఠములలో సుమారు 33 ద్విపదలుగల రెండవ పాఠము సమగ్రమై పూర్వాపర సందర్భశోభితమై శైలిని బట్టి బుద్ధారెడ్డి రచనయనియె యూహింప వలనగుచున్నది,

1. "సేవ సేయుచునుండుఁ బోవనేనొల్ల.

2. జడియక యిప్పుడే నుడువంగ వలయు

3. రాముని చేత శ్రీ రంగేశుఁ గొనుచు

4, అత్యంత భక్తితో నర్చింపు మమ్మ"

అని సవరించిన యతి దోషములు తొలగును.

5. "మఱచెడి వారు రామావనీనాథ" అనుదానిలో అఖండయతి బుద్ధారెడ్డి కిష్టమే.

6. పట్టుకుండుమీ" ఇత్యాది ప్రయోగము లానాటి భాషా వ్యవహారమును దెలుపును.

ఇట్లు పైరీతిఁ బరిశీలించి, కలిగిన ఒండు రెండు లోపములు లేఖకులవి కావచ్చునని నిశ్చయించినపుడు, "ఈ రంగనాథ విషయక ద్విపదల" రచయిత బుద్ధారెడ్డియేయని నిర్ధారణ మయ్యెడిని. ఈ క్రింది యూహలును దీనికి దోహదములగును —

1. బుద్ధభూపతి యిలవేల్పు రంగనాథుడు.

2, వైష్ణవులకుఁ బ్రధానమైన దైవము శ్రీరంగనాథుడు.

3. మూలమన లేని రామేశ్వర వృత్తాంతమును జెప్పిన వాడు, దీనిని చెప్పకపోడు వాల్మీకమునందు ——

"అత్ర పూర్వం మహాదేవః" అని చెప్పబడియున్నట్లే, ఇచ్చటను "లబ్ధ్వాకుల ధనం రాజా" అని సూచన ప్రాయముగాను నిది చెప్పబడియే యున్నది.

4. వైష్ణవ మతమును, తదాధిక్యతను రామాయణము ద్వారా ప్రచారము చేయఁదలచినవాడు తప్పక ఈ ఘట్టమును వ్రాసియుండును.

5. అనేక నూతన విషయములను ఆయా పురాణముల నుండి, రామాయణములనుండి గ్రహించి మెఱుగులు పెట్టి సందర్భోచితముగా తన రామాయణమునందుఁ జొప్పించిన బుద్ధారెడ్డి తన ప్రధాన దైవ విషయమును అమూలకమైనను తప్పక వ్రాసియుండును వ్రాయ లేదనుట సబబు కాదు.

పై యూహలచే నివి రంగనాథ రామాయణము నందలి వనుటలో సందేహములేదు ——

కొంత మంది లేఖకులు బుద్ధి పూర్వకముగా- ఈ ఘట్టము వైష్ణవ మతమునకు సంబంధించినదని- తమ తాళ పత్ర రచనా సందర్భమున వ్రాయక మానుకొన వచ్చును మరి కొంతమంది "విభీషణునికి కడుపుబ్బుట, దేవతలు ప్రార్థించి పంపిన గణపతి వటురూపమున నెదుర్పడి విభీషణు నొద్దనుండి మందసమును గైకొని మోసగించి క్రింద పెట్టుట" అను విషయములపై అసహ్యాభావము కలిగి, దానిని దొలగించి, సంక్షిప్తపరచి మొదటి రచనా భేదములను రూపొందించి యుండవచ్చును. ఏ విధముగా జూచినను ఇది బుద్ధారెడ్డిదే. గ్రంథ నామమునకును దీనికిని చాల ప్రగాఢమైన సంబంధము గలదని కర్తృత్వచర్చలో వివరించి యుంటిని.

ఈ రంగనాథ విషయమున కాధారము పద్మపురాణము: మఱియు రంగనాథునిపై వెలసిన స్తోత్ర మాహాత్మ్యాది ప్రశంసలునై యున్నవి.

పద్మ పురాణమునందిట్లున్నది ——

"శ్రీరాముడవతారము చాలించ నుండెను. వానరులు కోసల దేశవాసులు తమను కూడ వెంటకొని పొండని ప్రార్థించిరి. శ్రీరాముడు సమ్మతించెను. అట్లే కోరుచున్న విభీషణునితో రాముడిట్లు పలికెను ——

"తైరేవ ముక్తః కాకుత్స్థో బాఢమిత్య బ్రవీత్తతః।
అథోవాచ మహాతేజా రాక్షసేంద్రం విభీషణం॥

రామ ఉవాచ॥

రాజ్యం ప్రశాధి ధర్మేణ మా ప్రతిజ్ఞాం వృథాకృథాః।
యావచ్చంద్రశ్చ సూర్యశ్చ యావత్తిష్ఠతి మేదినీ॥
తావద్రమస్వ సుప్రీతః కాలేమమ పదంవ్రజ॥

మహేశ్వర ఉవాచ :—

ఇత్యుక్త్వాథ సకాకుత్స్థః స్వార్చా విష్ణుం సనాతనం।
శ్రీరంగ శాయనం సౌమ్య మిక్ష్వాకు కుల దైవతం
సంప్రీత్యా ప్రదదౌ తస్మై రామోరాజీవ లోచనః॥"1

పైశ్లోకములు "సూర్యచంద్రాదు లున్నంత వరకు భూమిని పాలించి, ప్రళయవేళ తన స్థానమును జేరుమని పలికి శ్రీరామచంద్రుడు సనాతనమైన, ఇక్ష్వాకు కుల దైవతమైన శ్రీరంగ శాయిని స్వార్చా విష్ణువును ప్రీతితో విభీషణున కిడినట్లు" తెలుపుచున్నది.

ఇది పట్టాభిషేకానంతరము శ్రీరంగనాథుని విభీషణునకు శ్రీరాముడొసంగె"నను దాసితో కాల విషయమున భేదించుచున్నది

ఇక, శ్రీరంగనాథుడు ఉభయ కావేరి నడుమ నెలకొని యుండుటను దెలియజేయు కథలు రెండు మూడు గలవు.

1. పూర్వమున గంగా కావేరులకు 'ఎవరుగొప్ప'? అని వివాదము కలిగినది. బ్రహ్మ గంగానది గొప్పదని చెప్పెను. పిమ్మట కావేరి బ్రహ్మను గూర్చి తపము చేసెను. బ్రహ్మ ప్రత్యక్షమై 'నీవిపుడు గంగను సమాన మయితివ'ని వర మిచ్చెను. అంతటితో తృప్తినొందక కావేరి సారక్షేత్రమును జేరి విష్ణువును మిగుల భక్తితో కొన్ని వత్సరము లారాధింపగా, ఆ కరుణానిధి ప్రత్యక్షమయ్యెను. కావేరి "నాగర్భమందు మీరెడ తెగక ఉండవలెనని వరము కోరెను. భగవంతుడు దాని కంగీకరించెను.

శ్రీరాముడొసంగిన శ్రీరంగనాథుడు విభీషణుడు లంకాపురికిఁగొని పోవుచు ఉభయ కావేరి తీరమును జేరగానే. కావేరికిచ్చిన వరమును బురస్కరించుకొని ఆదైవమొకానొక నెపమున అచట దింపఁబడెను. పిదప విభీషణునకు ప్రణవాకార విమానముతో నున్న శ్రీరంగనాథుని ఎత్త సాధ్యము కాలేదు. అతడు పరి తపించుచుండ, సంవత్సరమున కొకదినమున నిచ్చోట నీయారాధన మంగీక రింతు"నని రంగధాము డాదేశించెను. విభీషణుడు లంకకు వెడలి పోయెను"

ఈ వృత్తాంతము శ్రీరంగ మహాత్మ్యమునందు సవిస్తరముగా వర్ణింపఁబడినది —

2. శ్రీరంగనాథ విగ్రహమును గొనివచ్చుచు. విభిషణుడు కావేరితీరమున నిత్యకర్మానుష్ఠానము కొఱకై యాగెను. పూజానంతరము విభీషణుడు శ్రీమూర్తిని లేవనెత్తగా నది లేవలేదు. అతడు దుఃఖంచి అన్నోదకములు వదలి భీష్మించి యచటనే కూర్చుండెను. నాల్గవనాట రాత్రి భగవంతు డతనికి కలలో కనబడి "విభీషణా! హఠము చేయకుము. ఇక్కడిరాజు శ్రీరామ పట్టాభిషేకమున కయోధ్యకు వచ్చి నన్నుజూచి ముగ్ధుడై శ్రీరామునినడుగ లేక వెడలి వచ్చి, నాకొఱకై యిచట తపము చేయుచున్నాడు. నేనతని కోరికను పూర్తి చేయవలసి యున్నది. నీవు సమర్థుడవు. లంకనుండి నీవిచటికి వచ్చి పూజించవచ్చును, నే[illegible]ముఖము పెట్టి నెలకొని యుందును. నీవు పొమ్ము" అని యాజ్ఞ నిచ్చెను విభీషణుడా యాజ్ఞను శిరసావహించి

1. పద్మ పురాణము. ఉత్తరఖండము. అధ్యాయము, 244. శ్లో. 63-64

లంకకు పోయెను."[1]

ఇది శ్రీరాముడు భక్త వత్సలుడను గుణమును ప్రకటించుచున్నది.

3. విభీషణుడు శ్రీరాము డొసంగిన శ్రీరంగనాయకస్వామి సంపుటమును నెత్తిమీదఁ బెట్టుకొని లంకకు వచ్చుచు శ్రీరంగ ప్రాంతము చేరుసరికి కడుపుబ్బి మూత్ర విసర్జనమునకు వెళ్ళ నవసరము కలిగెను. అతడు తత్సంపుటము నటనుంచి మూత్ర విసర్జనముచేసి తిరిగివచ్చి దానిని లేవనెత్తగా, నది కదలలేదని తెలుపు రెండు శ్లోకములు ఆశ్చర్య రామాయణములో నుద్ధరింప బడినవి- చూడుడు.

"విభీషణ ముపాగతం దశరథాత్మజ స్సార్ద్రధీ
స్స్వకీయ కుల సద్ధనం దిశతి భక్తహృన్మందిరః।
నిధాయ నిజమస్తకే నిశిచరోఽపి రంగస్థలే
నిధాయ సముపాగమద్బహుళ మూత్ర పీడార్దితః॥
తతోఽభయ ఝరీ స్థలే స్థిర మభూద్దశాస్యానుజో
విలోక్య నిజ తద్ధనం హృది తతాప దుఃఖార్దితః।
హరిం శరణ మీయివాన్ సపది రంగనాథోఽబ్రవీ
న్నతేఽస్తు శుగహం భవాన్ కురు మదీయ పూజాం సదా॥"[2]

మూడు విధములైన వృత్తాంతములలో, రంగనాథ రామాయణమందలి రంగనాథ ప్రతిష్ఠా సంబంధి ద్విపదలు మూడవ వృత్తాంతమందలి శ్లోక విషయమునకు చాల దగ్గరగా నున్నవి.

"దేవతలు గణపతిని ప్రార్థించుట, అతడు వటురూపమున విభీషణున కెదురుపడుట, కడు పుబ్బుచుండగా, విభీషణుడు దేహబాధా నివారణార్థమై పోవుచు రంగనాథ మందసమును వటువున కిచ్చుట, అతడు ముమ్మారు పిలిచి ఆ పిదప రానిచో నేలపై పెట్టెదననుట, అట్లే చేయుట" అనునవి కవి కల్పితములు, మనోజ్ఞములు,

"రావణుడు తల్లి కోరికపై తపముచేసి, శివుని మెప్పించి అతని యాత్మలింగమును గైకొని వచ్చుచుండగా, నిట్లే విఘ్న (గణపతి) వడ్డుపడి, దేహ బాధతో తికమకపడు దశగ్రీవుని చేతినుండి శివలింగమును గొని, ఆ పిదప మూడు పిలుపులకును రావణుడు రాకపోగా, దాని నతడు నేలపై నుంచెను. అది తరువాత రావణుని కెత్త సాధ్యము కాలేదు" అను పురాణకథా ప్రభావము ఈ రంగనాథ వృత్తాంతముపై పడినది. "లింగ" శబ్దమునకు బదులు "రంగనాథ" శబ్దము మార్పు జరిగినది. కాని, మిగిలినదంతయు సమానముగానే పొడకట్టును—


శ్రీమద్రామానుజాచార్యులవారు ప్రత్యేకముగా శ్రీరంగనాథుని వైభవమును గూర్చి యొక గద్యనే విరచించియున్నారు.

---

1. శ్రీ సుదర్శనసింహ- "భక్తవత్సల్ శ్రీరామ్" వ్యాసము శ్రీరామ వచనామృతాంక్ పుట-160 (హిందీ-కల్యాణ్ వార్షికాంక్)
2. లక్కావఝుల వెంకటకృష్ణశాస్త్రి- "ఆశ్చర్య రామాయణము. యుద్ధకాండము. పుట-450.

వైష్ణవ మతాభిమానియైన బుద్ధారెడ్డి మూలములోని సూచనను గ్రహించి, పురాణ, స్తోత్ర, క్షేత్ర మాహాత్మ్యము లాధారముగా, చక్కని కల్పనలతో విరచించి, గ్రంథాంతమునఁ గూర్చి, రంగనాథ రామాయణ మను పేరునకు సార్థకత్వమును గల్గించినాడు. తాను రచించినది శ్రీరామ చరితమైనను; గ్రంథాంత మందలి ఈ రంగనాథ వృత్తాంతము చేతను, ఇలవేల్పు రంగనాథు డగుట చేతను ప్రజలు, రచయితయును రంగనాథ రామాయణమని పిలువగా, నదియే ప్రసిద్ధినొంది ప్రచారము చెందెను.

ఇట్లు "సర్వ పురాణ విచార తత్పరుడు," "పురాణ మార్గంబు దప్పక" అనెడి పద బృంద మాధారముగా పరిశీలించినపుడు, రంగనాథ రామాయణమునందు సందర్భానుగుణముగాఁ జొప్పించ బడిన వివిధ పురాణాంశములు అద్దము నందలి ప్రతిబింబములువోలె పరిస్ఫుటముగాఁ దెలియవచ్చు చున్నవి ఇక, గ్రహింపబడిన పురాణాంశములలోని న్యూనాధిక పరిశీలన చేసినప్పుడు, రచయితపై స్కాందపురాణ ప్రభావ మమితముగా పడినదని నిష్కర్షగాఁ జెప్ప వీలగుచున్నది.



రంగనాథ రామాయణము - దేశి

"పాఠ్యే గేయే చ మధుర"[1] మ్మైన వాల్మీకి రామాయణమువలె ఈ రంగనాథ రామాయణ మును "గేయమై పాఠ్యమై కేవల పుణ్యదాయకమై"[2]నది "పాడుకొనువారికి పాటగా, చదువుకొను వారికి కావ్యముగా సమాదరపాత్రమై, పండిత పామరులకును వినియోగపడుచు సార్వజనీనమైన పేరును గడించినది."[3] "స్త్రీలు ఇప్పటికిని ఈ రామాయణములోని కొన్ని ప్రకరణములను పాటలుగాఁ బాడుకొనుచున్నారు. తోలుబొమ్మ లాటగాండ్రు రామాయణ కథా ప్రదర్శనము వేళ ఇందులోని ద్విపదలను గానము చేయుచున్నారు. హరికథకులు కొందఱు ఈ రామాయణములోని ద్విపదలనే గానముచేసి వివరించుచున్నారు."[4] వీనినిబట్టి రంగనాథ రామాయణమునకు తెలుగునాట వ్యాప్తి యెంతఁ గలదో గుర్తింపవచ్చును.

ఈ వ్యాప్తికి ఇందులోని అవాల్మీకాంశములేగాక, దేశితనము గూడ కొంత యుపకరించినది.

"కవిత్వము "మార్గ-దేశి" భేదముచే ద్వివిధము- సంస్కృత కవిత "మార్గ"మనియు, దేశ భాషలలోని కవిత "దేశి" యనియు కొందరి యభిప్రాయము. కేవల భాషా భేదముచే మార్గ-దేశీ కవిత్వముల నిర్ణయ మంత సబబైనది కాదు. "ఇతివృత్తము భాష. ఛందస్సు మొదలగు వాని విషయములో సంస్కృత సాహిత్య లక్షణ ప్రభావమునకు విధేయమైనదంతయు మార్గమని, తద్భిన్నమైన దంతయు దేశియని కొందఱు వ్యాఖ్యానించిరి."[5] మఱికొందఱు దీనినే "లక్షణ యుక్తమై నియమబద్ధమైన భాష, ఉదాత్త వస్తు, భావ, సంప్రదాయ, సిద్ధమగు ఛందస్సు, లాక్షణిక రస పోషణము కలది మార్గ కవిత్వమనియు, ఇట్టి నియమము లంతగాఁ బాటింపఁబడక రుచి ప్రధానమై దేశ, కాల, కర్తృ భావములచే మారునది దేశి కవిత్వమనియు"[6] చెప్పవచ్చునని మరొక విధముగా నిర్వచించిరి.

కన్నడమునందు ప్రామాణిక నిఘంటువును రచించిన కిట్టెలుగారు "దేశ"యన "The language or dialect of a country"అని భాషాపరముగానే అర్థము చెప్పిరి.

నేటివరకు వచ్చిన ఆంధ్రవాఙ్మయము నంతయు పరిశీలించి చూచిన, శుద్ధముగా నిది దేశ భాషలో రచితమైన దేశ కవితకు సంబంధించిన గ్రంథమని చెప్పదగిన దేదియులేదు. ఇతివృత్త,

---

1. డా. ప్రతి వాల్మీకి రామాయణము. బాలకాండము. సర్గ-4, శ్లో. 8.
2. రంగనాథ రామాయణము. బాలకాండము ద్వి-222.
3. పింగళి లక్ష్మీకాంతం-పీఠిక పుట-10. రంగనాథ రామాయణము (ఆం,వి.క.ప. ప్రతి)
4. తూమాటిదొణప్ప. "తెలుగులో కొత్త వెలుగులు" రంగనాథ రామాయణ వైశిష్ట్యము. వ్యాసము. పుట-2.
5. డా. జి. నాగయ్య- "దాక్షిణాత్య సాహిత్య సమీక్ష" పుటలు-99, 100.
6. ఆర్వీయస్-సుందరం- "తెలుగు సాహిత్యంలో దేశి కవిత" పుట-3.

భాషాచ్ఛందోఽలంకారాదులలోని బాహుళ్యతను బట్టి మార్గ దేశి భేదము నిర్దేశింపవలసినదే కాని వేఱుగాదు.

డా॥ శ్రీ దివాకర్ల వేంకటావధానిగారు "శార్ఙ్గదేవాదులు సంగీతమును గూర్చి చెప్పిన మార్గ-దేశి విచారమును బురస్కరించుకొని, వానిలోని ప్రధానమైన ఐదారు భేదములను వివరించి. ఆ భేదములను కవితాపరముగాను సమన్వయించి చూపిరి."[1] తత్సారాంశ మిట్లుండును—

మార్గ	దేశి
1. మార్గ నియమసహితము.	1. దేశి స్థిరనియమ రహితము
2. మార్గ బ్రహ్మచే మార్గితమై భరతాదులచే ప్రయుక్తమైనది.	2. దేశి ఆ యా దేశ ప్రజలచే వారి వారి రుచ్యనుగుణముగా నాదరింపబడినది.
3. ఇది పండిత రంజకము.	3. ఇది సామాన్య జనరంజకము,
4. ఇది అనాది సంప్రదాయసిద్ధము.	4. ఇది నూతనము.
5. ఇది లక్షణ ప్రధానము	5. ఇది లక్ష్య ప్రధానము
6. ఇది బుద్ధి రంజకము	6 ఇది హృదయ రంజకము.
7. దేశ కాలములను బట్టి, కవుల యభిరుచులను బట్టి భిన్నభిన్న విధములుగా గోచరింపక చాల వరకు రూప సాదృశ్యమును గలిగియుండుచు.	7. దేశ, కాల, కర్తృ భేదముల ననుసరించి మాఱుచు చిత్రచిత్ర స్వభావము గలదై యుండును.
8. ఇది higher style	8. ఇది lower style

పై భేదములను దృష్టిలో పెట్టుకొనియే కావచ్చును, డా॥ జి. నాగయ్యగారు ఈ క్రింది రీతిగా నిర్వచించిరి.

"ప్రత్యక్ష సంస్కృత ప్రభావమును ప్రతిబింబింపఁజేయక, కథావస్తువు, వర్ణనలు, భావము, భాష, రీతులు, అలంకారములు, కవి సమయములు, ఛందస్సు, సాహిత్య ప్రక్రియలు మొదలగువాని యందు దేశి లక్షణములను ప్రధానముగా నారోపించుకొని, దేశీయ ప్రజాజీవితమునకు సన్నిహితముగ జన సామాన్యమున వ్యాప్తికొఱకు ఉద్దేశింపబడిన ప్రజాకవిత దేశి కవిత యని స్థూలముగా నిర్వచింపవచ్చును "2

ఈ నిర్వచనము దీర్ఘమైనను కొంతవరకు సమంజసముగానే యున్నది. ప్రతిభావంతుడైన కవి ఇతర భాషేతివృత్తమును గ్రహించినను, దానికి దేశీయతా కవచమును దప్పక తొడుగుననుటలో సందేహము లేదు.

మొదట ఈ "దేశి" పదము సంగీత భేదమును నిర్దేశించుటకై వాడబడినది.

"స్త్రీలు, బాలురు, గోపాలురు, క్షితిపాలురు వారివారి దేశములందు స్వేచ్ఛగా అనురాగముతో పాడుకొని ఆనందించునది దేశి సంగీతము[3]"ని మతంగుడు బృహద్దేశి యనెడు సంగీత గ్రంథమున

1. ప్రాఙ్నన్నయ యుగము- పుటలు. 361-365.
2. "దాక్షిణాత్య సాహిత్య సమీక్ష" పుట-100,
3. "అబలాబాలగోపాలైః క్షితిపాలైర్నిజేచ్ఛయా।
గీయతే సానురాగేణ స్వదేశే దేశి రుచ్యతే॥"

తెలిపి యున్నాడు. ఆ తరువాత నిది రానురాను గానముతోఁబాటు వాద్యనృత్యాదుల భేదనిర్దేశమునకును వాడుట జరిగినది.

"దేశమునందలి జనుల రుచి ననుసరించి కావించబడెడు హృదయరంజకమైన గానము, వాదనము, నృత్యమును 'దేశి'యని చెప్పబడు"[1] నని మతంగుని తర్వాతివాడైన సంగీత రత్నాకర కర్తయగు శార్ఙ్గదేవుడు వక్కాణించియున్నాడు. విశృంఖలముగా మనోధర్మము ననుసరించి చేయు గానము, వాదనము, నృత్యమును దేశిగానము, దేశివాద్యము, దేశినృత్యము అనికాని, జానపద గానము, జానపద వాద్యము, జానపద నృత్యము (జానపద గాన వాద నృత్యములు) అనికాని చెప్పవలసియున్నది. వీనికి "జన చిత్తములను రంజింపఁజేయుటయే"[2] ప్రధానము.

ఆ పిదప, ఈ దేశి శబ్దము క్రమక్రమముగా కవితకు పరివ్యాప్తమై "దేశి కవిత" యని ప్రఖ్యాతి వహించి, ప్రచారమునకు వచ్చినది.

"మును మార్గ కవిత లోకం-బున వెలయఁగ దేశికవితఁ బుట్టించి తెనుం
గును (న) నిలిపి రంధ్ర విషయం-బునఁ జనఁ జాళుక్యరాజు మొదలుగఁ బలువుర్"[3]

అని తెలిపిన నన్నెచోడుడు "దేశిసత్కవులను" సంస్కృత కవులతోఁ బాటు స్తుతించుటయే కాక, "దేశి మార్గంబుల దేశీయములుగా"[4] కవిత చెప్పవలెనని పీఠికలో నిర్దేశించియున్నాడు.

ఈ దేశి కవిత్వము ప్రాయికముగా గేయకవిత్వము. ద్విపదకావ్యము లాగేయ భావమును సంరక్షించుచున్నవి యగుటచేత ప్రజాలోకమున పద్య కావ్యములకంటె బహుళ వ్యాప్తి నందగలిగి యున్నవి. ఈ రహస్యమును గుర్తించియే కాబోలు పాల్కురికి సోమనాథాదులు తమ శైవమత ప్రచారము నిట్టి ద్విపద కావ్యములద్వారా సాగించిరి. దీనికి ప్రతిఘటముగా శైవమత వ్యాప్తి నరికట్టి, వైష్ణవ మతమును ప్రచారము చేయుటకై బుద్ధారెడ్డి రామాయణమును దేశీయముగా నొనర్చి ద్విపదలలో సంతరించెను. ఈ ద్విపద రామాయణ వ్యాప్తి అప్రతిహతముగా నేటికిని తెలుగుదేశమున సాగుచునే యున్నది.

ఈ ద్విపద రామాయణము రచింపబడక పూర్వము తెనుగుదేశమున నీ రామకథ పాటలుగా పాడబడుచుండెడిది. క్రీడాభిరామమందు—

"కోయిల పంచమ స్వరము క్రోల్చిన భంగిని విద్ది కంచిరా (కూచిపా)
మాయణ మారుకాండములు నచ్యుత జాగరవేళఁ బాడె నా
రాయ వితంతు రత్న మనురాగముతోడ "నమశ్శివాయతాం

---

1. దేశేదేశే జనానాం యద్రుచ్యా హృదయరంజకం।
గానం చ వాదనం నృత్యం తద్దేశీ త్యభిధీయతే॥
2. సంగీత రత్నాకరము- "రంజకో జన చిత్తానాం"॥
3. నన్నెచోడుడు- కుమార సంభవము- ఆశ్వాస-1. పీఠిక. పద్య-23.
4. ,, ,, ఆశ్వా. 1 పీఠిక. పద్య. 36.

తాయ సమస్త దోష హరణాయ" సమానమె దాని కెవ్వరున్"[1]

అని కరణ బ్రాహ్మణ విట ముఖ్యుడొకడు ఓరుగంటి తిరిగి తిరిగి ఆకలిగొని యున్నట్టి మంచనశర్మ టిట్టిభశెట్టులకు పూటకూటింటి జాడ నెఱింగించి తత్సౌభాగ్యమును పైరీతి వర్ణించినట్లు కలదు ఆ విద్ధి కంచి రామాయణము ప్రస్తుత మనుపలబ్ధము- డా. బిరుదురాజు రామరాజుగారు "ఇప్పుడు ప్రచారమునందున్న రామాయణ సంబంధములగు పాట లన్నింటికి నిది మాతృక"[2] యై యుండవచ్చునని యూహించియున్నారు. విద్ధికంచి రామాయణమువంటి రామకథా సంబంధ దేశి (జానపద) గీతములు కలరి, వానిలోనుండి తన కుచితముగా నగుపడిన కొన్ని విశేషములను గ్రహించి, బుద్ధారెడ్డి తన రంగనాథ రామాయణమునందు జొప్పించుచు, వాల్మీకి చెప్పిన జాడ దప్పక అతి మనోహరముగా పాడదగిన ద్విపద చ్ఛందములో వ్రాసియున్నాడు. దీనికి దేశి కావ్యమని ప్రసిద్ధి గలిగినది. ఛందో భాషేతివృత్తములను బరిశీలించిన, ఇది యథార్థమని, సార్థక మని తేలును.

ద్విపద :—

"ఇతివృత్తము-భాష-ఛందస్సు"- ఈ మూడును శుద్ధ దేశీయములైననాడే దేశి కవిత్వమనే పదము సార్థకమగును."[3]

బుద్ధారెడ్డి దేశిచ్ఛందమైన ద్విపదలలో రంగనాథ రామాయణము నంతటిని నడపినాడు. తెలుగునాట ఉద్భవించిన తాళ ప్రధానమైన గేయమును కొలదిపాటి హ్రస్వదీర్ఘాదులతో సంస్కరించి గణ ప్రధానముగా ప్రస్తరించినపుడు ఏర్పడిన ఛందములలో నీ ద్విపద యొకటి. ఇది సంస్కృతము నందలి అనుష్టుప్ ఛందమువంటిది, కావ్యరచన కనుతముగా నుపకరించెడి సుకరమైన తెలుగు ఛందము. "కవి పూర్ణముగా స్వాతంత్ర్యము వహించుటకు ద్విపద యొక్కటి తప్ప మఱి యే యితరమగు ఛందమును అనువుపడియుండదని"[4] పలువురిచే ప్రశంసింపబడిన ఛందము.

5. "ద్విపది, ద్విపదిగ, ద్విపదీఖండము"[5] అనెడి సంస్కృత చ్ఛందముల పదములతో సామ్యమున్నను, ఈ రెండింటికిని లక్షణ సామ్యములేదు. తమిళమునందలి "అగవల్పా ఛందమునకు నిది కొంత సన్నిహితముగా నున్నను, ఈ రెండింటికి జన్యజనక భావ సంబంధము పొడకట్టదు కన్నడ చ్ఛందమునను 'దువయి, దువది'లోనగు నామములతో ద్విపదలు కలవని భాషావిమర్శ కులు పేర్కొని ఈ రెండింటికిని సమ సంబంధమును నిరూపింప ప్రయత్నములు చేసినారు.[6] కాని అంతగా ఫలింపలేదు. కావున "ఈ తెలుగు ద్విపద అచ్చముగా తెలుగువారిదే. తెలుగు భాషలో పుట్టినదే. తెలుగు జాతికి సహజమైనదే." అనుటలో సందేహములేదు[7]

---

1. క్రీడాభిరామము-పద్యము 171. వావిళ్ళప్రతి.
2. డా॥ బి రామరాజు-జానపదగేయ సాహిత్యము. పుట. 48.
3. పింగళి లక్ష్మీకాంతం ఆంధ్ర సాహిత్య చరిత్ర పుట-119
4. పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి- "సారస్వత వ్యాసములు" తృతీయసంపుటము- "ద్విపద కవిత్వము" వ్యాసము పుట-286.
5. డా॥ జి. నాగయ్య "ద్విపద వాఙ్మయము" పుటలు 31, 32.
6. వారణాసి వేంకటేశ్వరులు "ఆంధ్ర సాహిత్య సంగ్రహ చరిత్ర" పుట-181.
7. డా॥ జి. నాగయ్య-ద్విపదవాఙ్మయము-పుట-36.

ఇహ పరములను సాధించియిచ్చునట్టి వాల్మీకి రామాయణము వలెనే, తెనుగున వ్రాయ బడెడు ఈ రంగనాథ రామాయణమును ఇహపర ద్విపదములను పఠితలకు సాధించి యిచ్చుననెడి తలంపు కవికుండుట చేతనే, తత్సూచకము గా నతడు ద్విపదచ్ఛందమును గ్రహించినాడనుట తప్పుకాదేమో, "పాల్కురికి సోమనాథుడును ఇట్లేభావించి యున్నాడు కదా"[1]

ద్విపద లక్షణము :—

ఇంద్రగణములు మూడిన గణంబొకటి చంద్రాస్య! యతిరెంట పమకూర్పవలయు."[2]

ప్రతి పాదమునందు మొదట వరుసగా మూడింద్ర గణములును, తరువాత నొక సూర్య గణమును ప్రయోగించవలెను. తృతీయ గణాద్యక్షరముతోడి యతిమైత్రి పొసగును. ప్రాసనియమ ముండును. ప్రాస యతి యైచ్ఛికము. ఇట్టి రెండు పాదములు గూడి ద్విపదయగును. ప్రాస నియమము పాటింపబడని దానిని మంజరీ ద్విపద యందురు. శ్రీనాథుని పల్నాటివీర చరితము మంజరీ ద్విపదల యందే రచితమైనది.

ద్విపదపై ఈసడింపు ;—

పద్య కావ్యములందు ఛందోవైవిధ్యముండును. రసభావాను గుణముగా కవి జాత్యుపజాతి వృత్తపద్యములను మార్చి మార్చి పాఠకుల చిత్తమున కుల్లాసమును దీప్తిని కలిగించుచుండును. ఒకే చందములో నడుపబడిన కావ్యమంతయు ఒకే రీతిగా చదువబడుచు పఠితకు విసుగు కలిగింపఁ జేయును. తగినంతగా రసపోషణ జరుగకుండుటచే సంతోషము గొలుపదు. వాల్మీకి రామాయణము అనుష్టుప్ ఛందములో నున్నను తఱుచుగా ప్రతిసర్గాంతమునందు భిన్న వృత్తము (లు) వచ్చినది(వి); నడుమ నడుమను ప్రయుక్తమైనవి. కొన్ని సర్గలు భిన్న వృత్తములతోఁగూడి అనుష్టుప్ శ్లోక రహితమై కూడ నున్నవి."[3] సంస్కృతమునందు రఘువంశాది కావ్యములలో ఒక్కొక్క సర్గ ఒకే ఛందములో నడచుచుండు ననినవో ఆసర్గలు అతి విస్తృతములు గాకుండును. సర్గాంతమున క్రొత్తవృత్తము చేరును. సర్గసర్గకు ఛందస్సు మారును. కాని ద్విపద కావ్యములందు ఇట్టి మార్పుండదు. ఇంతేకాక "కృష్ణద్వైపాయన" వంటి శబ్దములను విధిగా ప్రయోగింప వలసి వచ్చినపుడు ద్విపద కావ్యకర్త వానిని ద్విపదలలో నిముడ్చలేక పర్యాయ పదములను స్వీకరించుటచే ఒక్కొక్కప్పుడు అర్థగాంభీర్యమును పోగొట్టుకొనును. భావానుగుణమైన శబ్ద ప్రయోగమునకు వాక్యరచనకు కూడ ద్విపదయందు చోటు లేకుండును[4]", అని కొందఱు విమర్శింతురు అట్టివారి దృష్టిలో —

ద్విపద కావ్యంబు, ముదిలంజ, దిడ్డికంత ఇయ్య నేరని రండ నాల్గేకరాశి"[5] యైనవి.

---

1. పండితారాధ్య చరిత్రము—అవతారిక-
   అదియును గాకైహి కాముష్మిక ద్విపద హేతువగుట ద్విపదనాఁబరగు"
2. భీమన-కవిజనాశ్రయము.
3. సుందరకాండములో 5, 7, 8 మున్నగు సర్గలను జూడవచ్చుమ.
4. డా॥ జి. నాగయ్య. ద్విపద వాఙ్మయము పుట-38.
5. వేణుగోపాల శతకము. పద్య. 55.
   (ఇది డా॥ బి. రామరాజుగారి "తెలుగు జానపద గేయసాహిత్యము" పుట 44లో నుద్ధరింప బడినది)

అయినను ద్విపదచ్ఛందో రచనమందు గుణములు లేక పోలేదు—

గుణములు :—

1. "పాఠ్యేగేయేచ మధుర" మ్మనునది ద్విపదకు ప్రధాన గుణము. "పాడదగిన పద కవిత్వ లక్షణము కొంత, పఠన యోగ్యమగు పద్య కవిత్వ లక్షణము కొంత సవరించుకొని గేయమును పాఠ్యమును నైనది ద్విపద.[1]" పండిత పామరులును, స్త్రీ బాలురును పాడుకొనుట కిది యనువైన ఛందము —

2. సూర్యేంద్ర గణములతోఁ గూడి యుండుటచే అక్షర గణ నిబద్ధమైన వృత్తములవలె కఠిన మైనదిగాక కవికి సులభ సాధ్యమైయుండును.

సూర్య గణమనిన రెండు సూర్యగణములలో నేదైన యొకటియు ఇట్లే ఇంద్రగణమనిన ఆరింద్ర గణములలో నేదైన యొకటియు నుపయోగించ వచ్చును కదా! ప్రాస నియమమును ఐచ్ఛికమే[2] ప్రాస యతియు అంగీకరింపబడినది.

3. ప్రాసయతి పాటించిన ద్విపదలు తాళలయానుగుణ్యముగా నుండి శ్రవణ పేయత నిను మడించును.

4. ఖండగతి (5 మాత్రల ఆవృత్తి) చతురశ్రగతి (4 మాత్రల ఆవృత్తి) లో నడచుచు, తాళభేదముచే భావరసాదుల భేదము నావిష్కరింప జేయును.

5. అక్షర యతికి ప్రాకులాడ వలసిన పనిలేదు

ఇట్టి సామాన్య గుణములే కాక, కవియొక్క ప్రతిభా పాండిత్య చాతుర్యములను బట్టి రస, భావాలంకార, శయ్యా రీతి పాకాదులును, చిత్ర విచిత్ర రచనా చమత్కారములును పొందు పఱుప బడుచుండు ననుటలో సందేహము లేదు —

రంగనాథ రామాయణమునందలి మెలకువలు ;—

బుద్ధారెడ్డి సోమనాథునికి ప్రతిభటముగా నిలిచి ఈ ద్విపద చ్ఛందమునందతడు చూపిన మెలకువలను తాను కనబరచినాడు. అతడు చేసిన దోషములను పరిహరించినాడు.

1. సోమనాథుడు

"ప్రాస మైనను యతిపై వడియైన — దేసిగా నిలిపి యాది ప్రాస నియతిఁ
దప్పకుండగ ద్విపదలు రచియింతు"[3]

నని ద్విపదలయందు "ప్రాస నియతిని" అంగీకరించెను. రంగనాథ రామాయణమునందీ ప్రాసయతి యున్నట్లు కనబడదు. కాని ఆం. వి. క. పరిషత్తు వారు ప్రచురించిన గ్రంథములోని అనుబంధ ద్విపదలయందు ఈ ప్రాస యతి పొడకట్టుచున్నది. అవి కవి రచనములు కావని తలంచియేకదా తత్పరిష్కర్తలు వానిని అనుబంధము లందు చేర్చుటయైనది. తరువాతి కొందఱు లాక్షణికులు ద్విపదలందు ప్రాసయతి కూడదని చెప్పినారు.

---

1. డా॥ జి. నాగయ్య. ద్విపద వాఙ్మయము. పుట. 39.

2. మంజరీ ద్విపదయందు ప్రాసనియతి లేదు—

3. పండితారాధ్య చరిత్ర. అవతారిక. పుట. 19.

"యతుల లోపలఁ బ్రాసయతి పక్క సకల — యతులు చెల్లును. బ్రయోగాను సారమున."[1]

అని వ్రాసిన తాళ్ళపాక చిన్నన్నకు ఈ రంగనాథ రామాయణము మార్గదర్శకమై యుండవచ్చును.

2. సోమనాథుని ద్విపద పాదము లేపాదమున కాపాదము తెగినట్లు లేక, కొన్ని చోట్ల ఒక్క పదమే రెండు భిన్న ద్విపద పాదముల నడుమ వరుసగా కొనసాగింపబడు చుండును. ద్విపద పద మధ్యమున నంతమొంద రాదను నియమమును సోమనాథుడు పాటింపలేదు. చూడుడు —

(i) సుస్థిర లీల లింగస్థల జంగ — మస్థల తత్ప్రసాద స్థలంబులను"[2]

(ii) "ఇమ్ముల సింహాసనమ్మిడి తత్క్ష — ణమ్మ విభూతి వీడ్యమ్ము లర్పించి."[3]

(iii) సప్తధాతు మధాది సర్వాంగ గుణవి — లుప్త చిత్తుండు సంసుప్తి దూరుండు"[4]

కాని రంగనాథ రామాయణమందలి ద్విపద పాదములు బాడిసెతో చెక్కినట్లుండి ఏ పాదమున కాపాదముతెగి తాళలయాన్వితమై మనోహరముగా నుండును.

"సరసిజనాభాయ పముద్రగ సాహ
సాయ నమోయంచు శబ్ద మొక్కటియు
రెండు పాదముల నీ క్రియఁ బంచి యిడక"[5]

అని అనంతుడు ద్విపదకుఁ జెప్పిన లక్షణమునకు కొంత వరకు రంగనాథ రామాయణ మాధార మనవచ్చును.

3. సోమనాథుడు ప్రాసలలో సర్వహల్ సామ్యముండ వలెననెడి నియమము నచ్చటచ్చట ద్రోసిరాజనినాడు

(i) "చిత్త జాంతకు ——
మృత్యువగతి."[6]
} చిత్త జాంత్రకు ——
మిత్తి వీవె త్రుంపు —— }
(పాఠాంతరము)

(ii) మర్త్యలోకమునకు మఱివెఱ యొకడు — కర్త యున్నాడె లోకత్రయ వరద"[7]

ఇటువంటి శాంతప్రాసలు[8] రంగనాథ రామాయణమునలేవు —

---

1. అష్టమహిషీ కల్యాణము. అవతారక పుట. 6.
2. బసవ పురాణము. పుట. 15. వావిళ్ళప్రతి.
3. " " పుట. 38. "
4. " " పుట. 82. "
5. అనంతుని ఛందోదర్పణము. ఆశ్వాసము. 3, పద్య, 49.
6. బసవ పురాణము. అశ్వాసము. 1. పుట. 56.
7. ,, ,, ,, పుట. 27. వావిళ్ళప్రతి.
8, శాంత ప్రాసము :- పద్య ప్రథమ చరణ ద్వితీయాక్షరము సంయుక్తాక్షరమైనప్పుడు వానిలో నున్నయన్ని యక్షరములను పాటింపక తక్కిన పాదములందు కతిపయహల్ సామ్యముతో మాత్రమే ప్రాసము గూర్చుట. (బసవ పురాణము. పీఠిక. పుట. 104. బండారు తమ్మయ్య.)

4) సోమనాథుడు

పాండురాంగంబైన పడతి గర్భమునఁ-బోఁడిగా వెలుగుచుఁ బుత్తు డీ క్రియను"[1]
వంటి అర్ధానుస్వార పూర్ణానుస్వారములకు ప్రాస మైత్రిని ఘటించినాడు. ఇట్టిది రంగనాథ రామాయణమున లేదు.

5 ఇంతేకాక "దీపకంబంబు",[2] "పుడమీశ"[3] వంటి వైరి సమాసములును, వ్యాకరణ నియమములకు వ్యతిరేకములైన ప్రయోగములు సోమనాథుని రచనలయందు గన్పట్టుచున్నవి; కాని రంగనాథ రామాయణమున మృగ్యములు.

అప్పకవి వంటి లక్షణ కర్తలు రంగనాథ రామాయణమును సలక్షణ కావ్యముగానెంచి, దీని నుండి ద్విపదలను కొన్నింటిని ఆయా లక్షణములకు లక్ష్యములుగా నుదాహరించియున్నారు. కావున బుద్ధభూపతి తెలుగు ద్విపద చ్ఛందమును గ్రహించి, యందు యతి ప్రాసములను లక్షణ విరుద్ధముగా పొందు పఱుపక, పద మధ్యముననే పాదమును దెగఁగొట్టక, పాఠకులకు విసుగు గొల్పని రీతి శ్రోత్ర పేయముగా రామకథను విరచించినాడు.

పద్య గ్రంథములందు రసభావానుగుణముగా వృత్తభేదము పాటింపబడునట్లు గ్రంథము సాంతము ద్విపద చ్ఛందమునందే కొనసాగింపబడినను, ఇందు రచనా (శైలీ) వైవిధ్యముచే వృత్తభేదము వలన కలిగెడు గుణము ఆపాదింపబడినది. "సత్కవి యగువాడు తన ప్రతిభావిశేషమున నే ఛందమునైన నందము నొందఁజేయగలడు"[4] బుద్ధారెడ్డి తీర్చిదిద్దిన ద్విపద చ్ఛందము నందలి యందము లిట్లు రామచరితము నలంకరించినవి. చూడుడు-

అందచందములు :—

1. ప్రతి గణమున కొకేయొక పదము వచ్చునట్లు వ్రాయుట-

a) "నీతియుఁ బ్రీతియు నేర్పును నోర్పు-ఖ్యాతియు భూతియుఁ గాంతియు దాంతి"[5]

b) "సురలును ఖేచరుల్ క్రతులును యతులు-తరులును గిరులును దాంతియు శాంతి"[6]

శ్రుతి సుభగత్వమునకై ప్రతి రెండేసి గణములకు అనుప్రాస పొందుపఱచబడినది.

2. రెండు గణముల సమస్త పదములు రెండు ప్రతిపాదమున నుండుట-

a) "మణి గోపురంబుల మణి తోరణముల-మణి కుట్టిమంబుల మణిగవాక్షముల
.... విమల సౌధంబుల విపణి మార్గముల"[7]

---

1. బసవపురాణము. ఆశ్వా. 1 పుట-33.
2. బసవపురాణము. ఆశ్వా. 1 పుట-12 | దీపకంబంబు లెత్తించిన యట్లు
3 బసవపురాణము. ఆశ్వా. 3 పుట-127 | పుడమీశ మీ ధనమునకు చేసాప.
4. పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి "ద్విపద కవిత్వము" వ్యాసము (సారస్వత వ్యాసములు సంపుటము-3 పుట-288).
5. రంగనాథ రామాయణము. అయోధ్యా. ద్వి 51.
6. ,, అయోధ్యా. ద్వి. 564;
7, ,, బాలకాండము. ద్వి. 234-237.

ఇచట ప్రతి పాదమునందు సరిగా $9+8=17$ మాత్రలు పొందుపరచబడినవి. ఇది అయోధ్యా నగర జీవిత మొడుదుడుకులు లేక సమానముగా నున్నదని తెలియఁజఉచుట.

b) లలితాగమ స్తోత్ర-లక్ష్మీకళత్ర—విలసద్దయా పాత్ర-విబుధారి జైత్ర
దినకర శశినేత్ర-దివ్యచారిత్ర—అనుపమ శుభగాత్ర-అఖిలైక సూత్ర"[1]

ఇతట ప్రతి పాదమునందు సరిగా $10+8=18$ మాత్రలు పొదిగింపఁబగినవి. మాత్ర ఎచ్చటనైన తక్కువగునపుడు పఠన సమయమున కొంత దీర్ఘము చేయవలెను- (ఇది దాదాపు ఖండగతిలో ఏకతాళమున నడచును) అంత్యానుప్రాసము నుపయోగించుట విశేషము.

c) ఆదియందు ఏకశబ్దావృత్తి- నడుమ యొక యక్షరమను మార్చుటచే అర్థభేదము కలిగి ద్వితీయ సమాస పద మేర్పడుట.

"వికృత మస్తకములు-వికృత హస్తములు—వికృత ప్రకోష్ఠముల్-వికృతోష్ఠములును"[2]

3. పాదాదియందు ఒక యక్షరము తక్కువగా మొదటి మూడు గణములవరకు సమాస పదము నుపయోగించుట— అనగా ప్రతి పాదమునకు 18 మాత్రలు వచ్చునట్లును, వానిని $13+5$ గా రెండు పదము లుండునట్లును విఁగడించి చివరి ఐదు మాత్రల పదము నావృత్తిచేసి ఖండగతిలో[*] ముక్తాయింపువలె నుండునట్లు వ్రాయుట.

a) బహుదివ్య శస్త్రాస్త్రపతులు-రాక్షసులు—మహితమాయా పాయమతులు-రాక్షసులు
నిపుణ సంగర కళానిధులు-రాక్షసులు—విపుల బాహాటోపవిభులు-రాక్షసులు"[3]

(ఇందు రాక్షసుల క్రూరత్వము, దశరథుని భయము పరిస్ఫుటమానమగుచున్నది).

b) సమాస విరహితముగా విడివిడి పదములతోడను నిట్టి ముక్తాయింపును గలిగించుట.

"జక్కులు లూడంగఁ బఱచు-గుజ్జులు—దిక్కులు సుడివడఁ దిరుగు-గుజ్జులు
... .
వికలంబులై పోరువిచ్చు-గుజ్జులు—నొకరూపు నేర్పడకుండు-గుజ్జులు"[4]

4. ప్రతి పాదంబున మొదటి మూడు గణములు సమస్తపదమై యుండుట.

"కర చరణానన కమలంబు-లొప్ప—వర కుచద్వయ చక్రవాకంబు లొప్ప
మహితలోల న్నేత్ర మత్స్యంబు-లొప్ప—సహజరోమావళి శైవాల మొప్ప"[5]

5. ప్రథమ గణాంతిమాక్షర ప్రభృతి పాదాంత పర్యంతము సమాసపదమై యుండుట-

"వేడి-పయోధర విమల మానసుడు ......వేడి నిరంతర వేదతత్పరుడు[6]

ఇచట తఱచుగా ప్రతి పాదమునందు $3+14=17$ మాత్రలుండును.

---

1. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి. 688-690.
2. ,, యుద్ధకాండము. ద్వి. 6068-6071.
3. ,, బాలకాండము. ద్వి. 633-634.
4. ,, యుద్ధకాండము. ద్వి. 4311-4313.
5. ,, యుద్ధకాండము. ద్వి. 8128-8130.
6. ,, అయోధ్యాకాండము. ద్వి. 1287-1288.

6. ప్రతి పాదమునందు మొదటి గణము వ్యస్తపదము, తర్వాతి మూడు గణములు సమస్త పదమై యుండుట.

"జయజయ- శతకోటి జలజాప్తతేజ-జయజయ సంసార సర్ప సుపర్ణ"[1]

7. ప్రతి పాదమున కొక్క సమాస పద ప్రయోగము.

"శీతపటీరాంబు సిక్తాంగణంబు- కేతనాన్విత ముని కేతనాంచితము

చందనాగరు ధూప సౌరభాన్వితము ....

.... పౌర జనాది సంభ్రమ దుర్గమంబు"[2]

(అవిరళ పట్టాభిషేక సంరంభ పట్టణాలంకారము సూచితము)

8. ద్విపద మొదటి పాదమున రెండు గణముల సమాస పదములు రెండు, రెండవ పాదమున మొత్తమును ఒకే సమాస పదముగా వ్రాయుట.

"దశరథ వరపుత్ర-తాటకాజైత్ర—కుశిక సంభవయాగ కుశలప్రయోగ

చిర ముని ధ్యేయ-శిక్షిత తాటకేయ—పరమ గంగాతీర పాదసంచార"[3]

ఇది "కా, కొ, కో" అని దీర్ఘము చేయుట వంటిది.

9. ద్విపద రెండు పాదములు కలిపి ఒకే సమాస పదముండుట.

"గంధ కస్తూరికా కలితాంబు పూర—గంధిల సకలమార్గ ధరాంగణంబు

....

దీపిత మాణిక్య దీప సాంద్రాణి-ధూప పుష్పకలాప ధూర్వహణంబు"[4] (హాపణము)

10. ప్రతి పాదమునందు మొదటి రెండు గణములు సమస్త పదము, తర్వాతి రెండు గణములు వ్యస్తపదములు.

"పర్వతాకారులై ఖాసిల్లువారు—పర్వత యోధులై పరుగెడువారు

గర్వదుర్వారులై -కడు నొప్పువారు.... ....

నిఖిల లోకోత్తరు-లై యొప్పువారు"[5]

11. ప్రతి పాదమునందు నడిమి రెండు గణములు (ద్వితీయ, తృతీయ గణములు) ముఖ్యముగా సమాస పదమై యుండుట. లేక రెండు ద్విపద పాదములను గలిపి అంత్యాదిగణములను వ్యత్యస్తములుగా (ఒక్కొక్కప్పుడు సమస్త పదములుగా) చేసి ప్రయోగించినను తప్పక ద్వితీయ తృతీయ గణములు సమాసపదముగా నుండునట్లు ప్రయోగించుట.

a) "వెలగు-సారస గుణసేవ్యమై-పుణ్య-సలిలమై యుత్ఫుల్ల జలజమై-మిగుల

ఫేనమై-నిత్యగంభీరమై-చారుమీనమై-యతి పుణ్యమిళితమై-యమరు."[6]

---

1. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి. 687.
2. ,, అయోధ్యాకాండము. ద్వి. 363-366.
3. ,, ఆరణ్యకాండము. ద్వి. 1440-1443.
4. ,, బాలకాండము ద్వి. 2149-2154.
5. ,, బాలకాండము. ద్వి 534-537.
6. ,, బాలకాండము. ద్వి. 1034, 1035.

b) రాముని-జితభృగుసుతరాముని<-గాంతి-సోముని- సద్గుణస్తోముని< గీర్తి
కాముని- సౌందర్యకాముని-శాంతధాముని-రవిసమధాముని-బాసి"[1]

ఇందు ప్రథమ తృతీయ గణములు ఏకపదముగా నుండుట విశేషము.

12. ప్రతి పాదమునందు మొదటి రెండు గణములు వ్యస్తపదములుగాను, పిదప రెండు గణములు సమాస పదముగాను నుండుట.

....పుణ్య-తనులార-ఘనులార-తాపసులార
కృతులార-హితులార-ఖేచరులార-....నరులార-సురలార-నాగేంద్రులార"[2]

ఇందు మొదటి రెండు గణముల ఆద్యక్షరము మాత్రము మారియుండుట విశేషము.

13. పాదమునందలి రెండవ గణమునుండి మరల తర్వాతి పాదమునందలి మొదటి గణమువరకు ఏకసమాసమై యుండుట.

"సహిత సం-భార వర్జిత హోమకుండ-సహితమై,యేక వింశతి రమ్య యూప
మహితమై,శ్రౌతధర్మ క్రియాచార-విహితమై-మాయాప్రవీణ దైతేయ
రహితమై,సకలాఘ రహితమై యొప్పు"[3]

త్రిప్రాసతో గూడియుండుట ఇందలి విశేషము.

14. ప్రతి పాదమునందు 16 మాత్రలుండునట్లు రచించుట. మొదటి రెండు గణములు నాల్గేసి మాత్రల చొప్పున 8 మాత్రలు; మూడు నాల్గు గణములు కలిసి 8 మాత్రలుండును. మొదటి రెండు గణములు విడివిడి పదములు- మూడు నాల్గు గణములు విడివిడిగా<గాని, సమస్త పదముగాగాని యుండును. ఇవి నాల్గు మాత్రల పదములుగా భాసించి చతురశ్రగతి యేర్పడును.

మునులకు-మ్రొక్కుచు-మునులున్న పుణ్య — వనులకు-జొక్కుచు-వనజకల్హార
సరసుల<-దేలుచు-సత్కథాలాప — సరణుల-నేలుచు<-జల్లని గాలి
రాకల<-బొగడుచు-రణిత ఝుల్లికల — ....
ఈరముల్-జొచ్చుచు-నినరశ్మిలేని కోనల< గానల<- గ్రుమ్మరు చట్టు"[4]

(ఇది సీతారామ లక్ష్మణులు అరణ్యమున సంచరించిన తీరు.)

ఇందు ప్రతి పాదమునందలి మూడవ గణమునుండి తరువాతి పాదములోని ద్వితీయ గణాంతము వరకు అన్వయ క్రమము. రెండవ గణము వర్తమాన శత్రర్థకచు వర్ణక్రియాంతముగా వాడుట-వారి విహారమున కెడతెరిపి లేనట్లు, వారికి దెలియకుండ కాలమే గడచి పోయినట్లు ధ్వనింపజేయుట-తఱచుగా ప్రతిపాదాంతము రెండవ పాదాది పదముతో సమాసమై ఒక తూగు నిచ్చుచున్నది.

---

1. రంగనాథ రామాయణము. అయోధ్యాకాండము. ద్వి. 321, 322.
2. ,, ఆరణ్యకాండము. ద్వి. 1066-1068.
3. ,, బాలకాండము. ద్వి. 424-426.
4. రంగనాథ రామాయణము. అరణ్యకాండము. ద్వి. 168-172.

15. ఒక యక్షరము అటునిటుగా, రెండు ద్విపద పాదములు ఒక సీస పద్య పాదముగా నేర్పడి (సీస పద్యాల ఛాయలో నడచి) అవిలేనిలోటు తీర్చబడుట. ద్విపద పాదాంతము ఒకేరీతి విశేషణ పదముగా నుండుట.

"మహనీయ శతకోటి మహిమచే నింద్రు — మహితాలయము పోలె మానైన దాని.

నిఖిలంబు నందును నెగడు తేజమున — శిఖి నివాసము పోలెఁ జెలువైన దాని.

.. ..

ఉరు విభూతికినెల్ల నునికి పట్టగుచు — హరునివాసము పోలె నలరిన దాని"[1]

ఇట్లు గణప్రయోగ విశేషముచే గతి భేదమున ఛందో వైవిధ్యము భాసించుటయేగాక, రచనా చమత్కార, శబ్ద ప్రయోగ విశేషగత శైలీ భేదముచే గతి వైవిధ్యము ప్రదర్శింపఁ బడినది.

1. క్త్వార్థక క్రియాప్రయోగ విశేషములు.

(a) ద్వితీయ గణాంతము క్త్వార్థక క్రియయై యుండుట. పాదాంతమునందలి తృతీయ చతుర్థ గణములు తర్వాతి పాదాది యందలి ప్రథమ ద్వితీయ గణములతో కలసి అన్వయింపబడుట. అనగా పాదమునందలి మూడవ గణము నుండి తరువాతి పాదములోని ద్వితీయ గణాంతము వరకు అన్వయ క్రమము.

"జలరాశిఁ దేలించి-జలజ షండములఁ — గలవాసిఁ దూలించి-గబ్బి జక్కవల

విరహార్తి నెలయించి, - వెడవింటి వాని — వరకీర్తి నలయించి, వాడిన కలువ

....

విందులఁ దనియించి,-విటవిటీ జనుల — పొందుల నలయించి, -పూర్ణ చంద్రికల

దిక్కుల కెల్లను దెపివి దీవించి"[2]

(b) ప్రతి పాదమునందు ద్వితీయ, చతుర్థ గణాంతమున క్త్వార్థక క్రియా ప్రయోగము చేయుట. అది అంత్యాను ప్రాసగా నుండుట విశేషము.

"వ్రతములఁ గడుడస్సి-వనటులఁ గ్రుస్సి — యతి దుఃఖమునఁ గుంది- యాత్మలోఁ గంది

విపులాశ్రువులఁదోగి-విరహాగ్నిఁ గ్రాగి — — —

చెక్కిట కెయిఁజేర్చి-చింతల కోర్చి — దిక్కులేమిఁదలచి-ధృతిదూర డించి"[3]

(c) ప్రతి పాదము క్త్వార్థక క్రియతో నంతమగుట

"పసిడి కంబములచే పఱపు దీపించి, వరరత్న తోరణా వళుల శోభిల్లి

.. .. .. — భూమిజఁ గానక బుద్ధిలో వగచి"[4]

---

1. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి. 3462-3470.

2. ,, ,, సుందరకాండము ద్వి. 96-103.

3. ,, ,, ,, ,, ద్వి. 215-218.

4. రంగనాథ రామాయణము. సుందరకాండము. ద్వి. 180-182.

(d) ప్రతి పాదాంతమునందు క్త్వార్థక క్రియను ద్విరావృత్తి చేయుట.

మరియలుగాఁ జక్రములఁ ద్రుంచి ద్రుంచి — పోరిఁబోరి నంకుశంబులఁ జించి చించి.

- - - - -

మును మిడి పట్టిసంబులఁ జిమ్మి చిమ్మి — కొనకొని కడిమి శక్తులఁ గ్రుమ్మి క్రుమ్మి"[1]

(e) ఈ క్త్వార్థక క్రియా ద్విరావృత్తి ద్విపద ద్వితీయ పాదాంతమున వచ్చుట.

ఇలంక ఘూర్ణిల్ల నంతంతఁ గలయ — నాలోక భయదంబులై మీఱి మీఱి

ఉరుసింహములఁబోలె సుగ్రీవుఁ బట్టి — కరికుంభ విదళన గతి మండి మండి

- - - - - -

పెలుకుఱి పఱతెంచు భీతుల పగిది — దొలగక నిగుడి గొందులు దూఱి దూఱి"[2]

(f) కర్మ + క్త్వార్థక క్రియ - కర్మ లేక కరణము + క్త్వార్థక క్రియ. ఇట్లు ప్రతిపాదమునందు రెండు జతలను గూర్చుట.

"కరవాలములఁ ద్రుంచి-గదల నొప్పించి — సురియల నాటించి-శూలాలఁ జించి

పరిఘల విదలించి-ప్రాసాల నొంచి — — — —

పట్టిసంబులఁద్రుంచి - పరశుల ద్రవ్వి"[3]

(2) శత్రర్థక చువర్ణ క్రియా ప్రయోగ విశేషములు.

(a) ప్రతి పాదమునందు మొదటి రెండు గణములు శత్రర్థక చువర్ణాంత క్రియలుగా నుండుట —

పాయుచు-డాయుచు-బలిమి నొండొరుల — ద్రేయుచుఁ ద్రోయుచు-విపుల సత్త్వముల

దూటుచు-దాటుచు-దోర్దోనఁ బగలు — దాటుచు మీటుచు సాంద్ర మర్మముల"[4]

(నిరువురు కడిమియై నిబ్బంగిఁ బోర)

ఇది వాలి సుగ్రీవుల యుద్ధ వర్ణనము. ఇందలి రెండు శత్రర్థక చువర్ణ క్రియలను ఒక్కని కొక్కటిగా నన్వయించినచో,

"ఒకడు పాయును, మరొకడు డాయును; ఒకడు ద్రేయును మరియొకడు ద్రోయును." అనియిట్లు సరసమైన యర్థము ధ్వనించి ఆపోరు కనులకుఁ గట్టినట్లగును.

(b) ప్రతి పాదమునందు ద్వితీయ గణము శత్రర్థక చువర్ణాంతమగుట.

"మునులకు మ్రొక్కుచు-మునులున్న పుణ్య — వనులకుఁ జొక్కుచు-వనజ కల్హార

సరసుల దేలుచు . . . .

ఈరముల్ జొచ్చుచు-నినరశ్మి లేని"[5]

---

1. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి 3079-3082.
2. రంగనాథ రామాయణము. సుందర కాండము. ద్వి. 973-979.
3. రంగనాథ రామాయణము యుద్ధకాండము. ద్వి. 2838-2840.
4. రంగనాథ రామాయణము. కిష్కింధా కాండము, ద్వి. 510-511.
5. ,, ,, అరణ్య కాండము. ద్వి. 163-171.

ప్రతి మూడవ గణమునుండి తరువాతి పాదములోని ద్వితీయ గణాంతము వరకు అన్వయ క్రమము.

(3) సమాపక క్రియా ప్రయోగ విశేషములు,

(a) పాదము మొదట క్రియాపదమును నిలుపుట.

"కలతునా-సప్త సాగరములు సొచ్చి — మలపుదునా-మేరుమందరంబులను
... ... —ముంతునా-బెగడొంద మున్నీటిలోన"[1]

(b) కర్త + సమాపక క్రియ ఇట్లు వరుసగాఁ గూర్చుట.

"బలభేది వణకె-దిగ్భాగంబు వగిలె — జలధులు గలగె -నాశాకరు లడగె
- - - - -
దిక్కులు ద్రెళ్ళె-నద్దివి యొద్దగిల్లె"[2]

(c) సమాపకక్రియ + కర్త వరుసగాఁ గూర్చుట.

"అడిగె తారాపతి యలికె నంగదుడు — నడికె గవాక్షుడు-న్నతిఁదక్కె గజుడు
....
వెఱగందె శరభుండు-వెఱచె ధూమ్రుండు"[3]

(d) క్రియా విశేషణము లేక కర్మ + క్రియ + కర్త.

ఈ క్రమమునఁ బ్రతి పాదమును గూర్చుట.

"కడుభీతి-నొందెను-గంధమాదనుడు — అదరి చూచుచునుండె-అనిల నందనుడు.
చూడ-భయంబొందె-జ్యోతిర్ముఖుండు — జాడ చేకొని-పాఱె-జాంబవంతుండు."[4]

(e) సమాపక క్రియ పాదాంతమున నుండుట.

"అలుకమైఁ గొందఱ నబ్ధిలో వైచె — అలుకమైఁ గొందఱ నదరి కాటించె
అలుకమైఁ గొందఱ నదరంట వ్రేసె — అలుకమైఁ గొందఱ నవనిపైఁ గూల్చె "[5]

(4) విశేష్యముల ప్రయోగము :—

(a) కేవల నామములను పట్టికగా వ్రాసినను వానిని తాళానుగుణముగా విసుగు గొల్పని రీతి విడివిడిగా ప్రథమాంతమునఁ గూర్చుట.

ఖండగతి-ఏకతాళము

"శరభుండు-ఋషభుండు-జాంబవంతుండు—సురథుండు-ధూమ్రుండు - సోముండు హరియు
గిరిభేది-సుతరుండు-కేసరి-పృథుడు — . . .
గ్రథనుండు-ధూమ్రుండు-గంధమాదనుడు"[6]

---

1. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి. 462-464
2. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి. 871-873.
3. రంగనానాథ రామాయణము. యుద్ధకాండము, ద్వి 3056-4058.
4. " " " " ద్వి. 4059-4060.
5. ,, ,, ,, ,, ద్వి 6830-6831.
6. ,, ,, ,, ,, ద్వి. 3994-3998.

(b) ప్రతి పాదమునందలి మొదటి రెండు గణములు అనుప్రాసయుక్త నామవాచకములై యుండుట. (తఱచుగా గణమున కొక పదముండును.)

"వదనముల్-రదనముల్-వాలముల్ బాహు — లుదరంబు-లధరంబు లూరులు బరులు
కక్షముల్-వృక్షముల్ కాళ్ళును వేళ్ళు . . . . ."[1]
కర్ణముల్- వర్ణముల్- కరము లంగములు"

(వాలి సుగ్రీవుల రూప సామ్యమిందు వర్ణితము. అవయవములు పట్టిక రూపమునఁ జెప్పబడి నను, తద్రూపతుల్యత కనులకు కట్టింపఁజేయుటకై అనుప్రాస ప్రయోగ మిందలి విశేషము).

c) పాదాంతము నామవాచకము. తత్పూర్వభాగ మా నామవాచకమునకు విశేషణముగా నుండుట.

"అందంద యుడుగక నాడు-నట్టలును—గ్రిందుగా మాంసముల్ గఱచు భూతములు
బెడిదంబుగా నార్చు-భేతాళములును-నదరెడు రక్తంబులాను-డాకినులు
. . . దండిగాఁ దునకలై ధరబడ్డ-గదలు"[2]

d) తద్ధర్మ విశేషణము + విశేష్యము; ఇట్లు వరుసగా కూర్చుట. ఈ వరుస తఱచుగా యతివద్ద విఱుగును.

"చదియు రథంబులు-నమయు సారథులు-జిదియు పీనుంగులు-చెదరు మానములు
. . . దొలుకాడు ప్రేవులుఁ దినియు ఖడ్గములు"[3]

e) జాతి నామవాచకమును తద్ధర్మార్థ విశేషణముచే నావృత మొనర్చుట- ఇదియు యతి స్థానము వద్ద విఱుగును.

పడియెడు వానరుల్-భ్రమయు వానరులు—మడియు వానరులును-మ్రగ్గు వానరులు
. . . అఱచు వానరులు-రూపఱిన వానరులు"[4]

f) ప్రతి పాదాంతమున రెండు విశేష్యములు అంత్యానుప్రాస గలిగి యొప్పుట - తత్పూర్వము తద్ధర్మ విశేషణ ముండుట.

"తునియు గంభీర-వేదులును జోదులును-తునకలై పడెడు పీతులును రౌతులును
త్రుంగెడు బహు పదాతులును హేతులును . . . .
నలియైన మాంస ఖండములు ముండములు"[5]

పాదమూ మొదటి తద్ధర్మార్థక క్రియా విశేషణము తర్వాతి నామవాచకములను ఉమ్మడిగా విశేషింపఁజేయుచున్నది. లేక ఏ పాదమున కా పాదముగా గ్రహించి యర్థము చెప్పినచో నదితద్ధర్మ కాల క్రియగా సమన్వయింపబడును. ఇది దీనిలోని విశేషము.

---

1. రంగనాథ రామాయణము. కిష్కింధాకాండము. ద్వి. 415-418.
2. ,, యుద్ధకాండము. ద్వి. 4729-4739.
3. ,, యుద్ధకాండము. ద్వి.
4. ,, యుద్ధకాండము. ద్వి. 3293, 3294
5. ,, ఆరణ్యకాండము. ద్వి. 551-555.

ఇక్లే అంత్యానుప్రాస గల రెండు విశేష్యములు- ఒకటి సమస్త పదము, రెండవది వ్యస్త పదముగాను నుండుట.

"అమరిక రత్నగేహముల వాహముల-రమణీయ రాజ మార్గముల దుర్గముల"[1]

g) పాదాంతములందు విభక్తి యావృత్తమగుట.

i) మొగి వసిష్ఠాది సన్మునులతోఁ గూడ-దగు బంధు రాజన్య తతులతోఁ గూడ
రమణీయ దివ్యాంబరములతోఁ గూడ-విమల మౌక్తిక వజ్ర వితతితోఁ గూడ.
. . . వినుత పుణ్యాంగనా వితతితోఁ గూడ"[2]

తృతీయా విభక్తి ఆవృత్తమైనది.

ii) "కరుణా సముద్రుడై కడుమించువాని-పరుల గుణంబుల పాటించువాని
బుద్ధి బృహస్పతిఁ బురుడించువాని ....
కుముద బాంధవు భంగిఁ గొమరొందువాని"[3]

ఇట ద్వితీయా విభక్తి ఆవృత్తమైనది.

iii) "వినుము మద్యంబు ద్రావిన వాని గతికిఁ- బెను పేద విప్రుఁ జంపిన వాని గతికిఁ
దెగి గురుపత్నిఁ బొందిన వాని గతికి....
నే యెడఁ గొండెగా డేగెడు గతికి"[4]

ఏక పదావృత్తి-కర్మార్థమున షష్ఠి.

h) ఇట్లు విభక్తులే కాక. పాదాంతమునందు విభిన్న క్రియలు ఏకకాల బోధకములై వాడబడును. (శత్రర్థ చువర్ణము పాదాంతమున నుండుట.)

"కొనిన విన్నాణ మెక్కుడుగఁ ద్రోయుచును-డాసి మోకాళ్ళ ఘట్టనలు సేయుచును
....గదిసి మోచేతు లంగముల మెత్తుచును"[5]

I) ఏక పదావృత్తి

i) ఇది పాదాంతమున నుండుట.

"అప్పుడు కపిసేన యార్పుల మ్రోత-యుప్పొంగి వారాశి యుబ్బెడు మ్రోత
....వదలి దిగ్గజములు వాపోవు మ్రోత"[6]

ii) పాదాది యందు ఏకపదావృత్తి.

"ఆగాలి నచలంబు లన్నియు విఱిగె-ఆగాలి భువనంబు లన్నియు వణకె
ఆ గాలిఁ జలియించె నర్కుని రథము-ఆగాలి భూతంబులన్నియు నఱచె"[7]

---

1. రంగనాథ రామాయణము. బాలకాండము. ద్వి. 1508-1510.
2. ,, బాలకాండము. ద్వి. 1978-1981.
3. ,, అయోధ్యాకాండము. ద్వి. 17-19.
4. ,, అయోధ్యాకాండము. ద్వి. 1436-1444.
5. ,, యుద్ధకాండము. ద్వి. 1822-1824.
6. ,, యుద్ధకాండము. ద్వి. 1055-1057.
7. ,, యుద్ధకాండము. ద్వి. 714-716.

iii) ఈ ఆవృత్తి ఏకక్రియా పదమైకూడ నుండుట.

"కామరొవ్వ కై సేసి కొడుకులు నడువ-సంగడిఁ గొలిచి రాజన్యులు నడువ
శృంగారములు సేసి చెలువలు నడువ
....మోదంబుతో మౌని ముఖ్యులు నడువ"[1]

j) ఈ పునః పునరావృత్తి పదములవరకే కాక, ఒకటి రెండు పదభేరములతో ద్విపదలే ఆవృత్తమగుట.

గణుతింప నింద్రుండు గాడు నీ కోడ-రణ భీషణుండగు రాముండుగాని
గణుతింప ననలుండు గాడు నీ కోడ-రణ భీకరుండగు రాముఁడుగాని
గణుతింపఁ గాలుండు గాడు నీకోడ-రణ మహోగ్రుండగు రాముండుగాని
....
గణుతింపఁ బశుపతి గాడు నీకోడ-రణ విచక్షణుండగు రాముండుగాని"[2]

k) ఇట్టి యావృత్తి ద్విపద రెండవ పాదము పూర్తిగా నుండుట.

"జలజాక్షి నినుగూడి సాకేతపురము-గలవాడనని కాని కాన నొండొకటి
కలకంఠి నిను గూడి కనక హర్మ్యములు-గలవాడననికాని కాన నొండొకటి
....
నెలతుక నినుగూడి సఖిల సౌఖ్యములు-గలవాడనని కాని కాన నొండొకటి"[3]

l) ఇట్టి యావృత్తి ద్విపద రెండు పాదములును నగుట

త్రిజగంబులును మెచ్చఁ దివిరి వారాశి-నిజ శరాగ్రంబున నిలిచిన తూరు
దత దెవ్వ డిటు చూపు దతనిపైఁ గాని-యతులితంబైన నా యస్త్రంబు విడువ
....
రావణు నోర్చెద రణములో నను-నీ విధంబున లంక కేతెంచు వీరు
దత దెవ్వ డిటు చూపు దతనిపైఁ గాని-యతులితంబైన నా యస్త్రంబు విడువ"[4]

m) ఈ యావృత్తి రెండు ద్విపదలలో మూడు పాదములును ఏకముగా నుండుట.

"చలియించి మీనమై సకల వారిధులు-సొలవక చొచ్చినఁ జొత్తుఁ గాకేమి
తలపు నీ మీదిదే తప్పదు నాకుఁ-బలుకు లేటికి నిన్నుఁ బట్టెద వెదకి
చలమున వికృత వేషమున నెందైన-సొలవక చొచ్చిన జొత్తు గాకేమి
తలపు నీ మీదిదే తప్పదు నాకుఁ-బలుకు లేటకి నిన్నుఁ బట్టెద వెదకి."[5]

ఈ విధముగా పదములు, పాదములు, ద్విపదలు భావదీప్తికై, చెప్పినదానిని బలపరచుటకై

---

1. రంగనాథ రామాయణము. బాలకాండము. ద్వి. 2232-2237.
2. ,, యుద్ధకాండము ద్వి. 477-484.
3. ,, అరణ్యకాండము. ద్వి. 1278-1281.
4. ,, యుద్ధకాండము. ద్వి. 4482-4491.
5. ,, యుద్ధకాండము. ద్వి. 4526-4553.

ఆవృత్తి చేయబడినవి. నన్నయ వ్రాసిన "మాకుఁ బ్రసన్నుఁడయ్యెడున్"[1] అని పద్యాంతము లందలి ఆవృత్తి శైలీ ప్రభావమే ఈ ద్విపదల యావృత్తికి హేతువని తోచును. కాని వాల్మీకి రామాయణమునందే-

"యస్యాఽఽర్యోప మతేగతః"[2]

"ప్రదీయతాం దాశరథాయ మైథిలీ"[3]

(దీనికి పాఠాంతరముగా "ప్రయచ్ఛరామాయ విదేహ పుత్రీ"[4]) అని యీ తీరున శ్లోక పాదములును

రక్షాంసి వక్షాంసి చ విక్షిపంతి-గాత్రాణి కాంతాసు చ విక్షిపంతి

రూపాణి చిత్రాణి చ విక్షిపంతి-దృఢాని చాపాని చ విక్షిపంతి"[5]

అని యీ రీతి పదములును ఆవృత్తమైనట్లు కనబడుచున్నది. కావున రంగనాథ రామాయణ కర్త ఈ రచనా విధానమును, శైలిని, మెలకువలను మూలమునుండియే గ్రహించి, వానిని అనేక భంగుల విస్తృత పరచినాడు.

ఇంతేకాక, ఒక్కొక్కచోట ఒకే యర్థముగల పెక్కు పర్యాయ పదములను విసుగు గొల్పని రీతిగా నుపయోగించి, పేరులు పూస గ్రుచ్చిన రీతి పేర్చబడినవి. అనగా అర్థమొకటైనను వచ్చిన పదము రాకుండును.

"శత్రుజిహ్వుఁడును గూలె, శార్దూల ముఖుడు-గతజీవుడయ్యెఁ, బింగళ నేత్రు డీల్గె

స్తనిత హస్తుడు చచ్చె, శార్దూల కబళు-డనిద్రుఁ దుంగె, మృతుడయ్యె నట జంబుమాలి,

సోమించి వక్రనాసుఁడు క్రుగ్గె, రక్తరోముండు లయమయ్యె. రుధిరాక్షు డణగె

దళములతో శూలదంష్ట్రుఁడు మడిసె-చెలువేది మది దీర్ఘజిహ్వుండు దెగియె

రూపఱి బోయె దుర్ముఖుడు, దుర్ధరుడు-ప్రాపించె మరణంబు. ప్రఘసుండు పడియె

నుఱుమయ్యె భాసకర్ణుండు, యూపాక్షు-డొఱిగె, విరూపాక్షు డుసురుతోఁ బాసె

నక్షుండు దెగటారె, హతుడయ్యె నశ్మ-వక్షుండు మడిసె దుర్వార సైన్యములు"[6]

ఇందు మడిసె. ఈల్గె మున్నగు పదములు "నశించె-చచ్చె" అను నర్థబోధకములై యున్నవి.

పై రీతిగా గణముల కూర్పుచే, రచనా చమత్కారముచే శైలీ రమ్యతచే రంగనాథ రామాయణము ద్విపదైక ఛ్ఛందమునందు వ్రాయబడినను, ఛందో వైవిధ్యముచే గలుగ రసభావానురూప దీప్తికి తావలమై యున్నది. గతి భేదములు గేయ రమ్యతకు సహకారులై నిలిచి యున్నవి—

1. నన్నయ భారతము. ఆదిపర్వము. ఆశ్వాస 1 పద్య. 105-108.
2. దా. ప్రతి. వాల్మీకి రామాయణము, అయోధ్యాకాండము. సర్గ 75. శ్లో. 21-58
3. ,, యుద్ధకాండము. సర్గ 14. శ్లో. 3, 4.
4. ప. ఉ. ప్రతి వాల్మీకి రామాయణము. యుద్ధకాండము. సర్గ 87. శ్లో. 27-32.
5. దా. ప్రతి వాల్మీకి రామాయణము సుందరకాండము. సర్గ. 5 శ్లో. 12.
6. రంగనాథ రామాయణము. సుందరకాండము ద్వి. 802-808.

ఇ తి వృ త్త ము :—

రంగనాథ రామాయణము నందలి ఇతివృత్తము 24 వేల శ్లోకములతోఁ గూడి ఆదికావ్య మనఁబరగిన వాల్మీకీయ రామాయణము జాడ ననుసరించి రచింపబడినది, కావున కథ గీర్వాణ వాఙ్మయ సుప్రసిద్ధమగుట పూర్వ పద్ధతికి చెందినది. అయినను ప్రతి కాండమునందును అవాల్మీక మైనట్టియు, ఏ యితర సంస్కృత రామాయణ పురాణములందు లభించనట్టి కథాంశములు— చిన్నవియో, పెద్దవియో- చొప్పించబడినవి. అవి అచ్చముగా దేశీయములు; జానపదులందు పాటల, గేయముల రూపమున ప్రసిద్ధముగా నున్న రామాయణ కథలనుండి గ్రహింపబడినట్లు తలంచ వచ్చును. నేడు రామాయణ గాథకు సంబంధించిన కొన్ని స్త్రీల పాటలు జానపద గీతములు లభించుచున్నవి. వానిలోని కొన్ని కథాంశములతో రంగనాథ రామాయణ కథాంశములకు సామ్యము కనబడుచున్నది. ఈ పాటలు అన్నియు రంగనాథ రామాయణ రచనకు పూర్వపువని చెప్పజాలము; కాని కొన్నియైనను కావచ్చుననుట నిస్సందేహము. దీనికి అహల్య రాయిగా పడియున్న దనెడు అర్థము గల—

"రాతి నారిగఁ జేసె నీ పదరజ మటంచును ఖ్యాతిగా విని
ప్రీతితో నెఱ నమ్మితిని నా పాతకము లెడబావు తండ్రీ!"

వంటి కీర్తనలు తెనుగు దేశమున నెప్పటినుండి కలవో ఎవరి కెఱుక?"1 యని వాని ప్రాచీనతగూర్చి పలికిన శ్రీ పింగళి లక్ష్మీకాంతంగారి పలుకులు ప్రబల సాక్ష్యములు.

తోలుబొమ్మ లాటగాండ్రు రంగనాథ రామాయణ ద్విపదలను పాడుచు ప్రదర్శించు చున్నారు. వారు ప్రదర్శించగా స్త్రీ పురుషులు చూచియు, వినియు, నచ్చిన అంశములకు తమ భావములను జేర్చి పాటలుగా గట్టి పాడుకొన్న గేయములే నేడు లభించుచున్న రామాయణ గీతములు అనికాని, లేక అతి ప్రాచీన కాలమునుండి జానపదులందు పాటల రూపమున ప్రసిద్ధముగా నున్న అంశములను సేకరించి, కొలదిగా సంస్కరించి, వానిని తన గ్రంథమునందు బుద్ధారెడ్డి యుపయో గించుకొన్నాడు అనికాని ఇతమిత్థమని నిర్ణయింపజాలము. కాని ఈనాటి స్త్రీల రామాయణపు పాట లందు, జానపద గీతములందు రంగనాథ రామాయణ కతిచిత్ కథాంశములతో ప్రత్యేక సామ్యము గోచరించు పంక్తులు కనబడుచున్నందున, అవి తెలుగువారి ప్రత్యేక కల్పనకు సంబంధించినవిగాఁ దలంచి వానిని దేశీయము లనుటలో అసామంజస్య మేమియు గలుగబోదు.

పాల్కురికి సోమనాథుని బసవ పురాణమునకు

"ఆతత సకల పురాతన భక్త-గీతార్థ సమితియే మాతృక"2

యైనందున దాని యందలి యితివృత్తము అచ్చమైన దేశి కాని రంగనాథ రామాయణము పూర్తిగా నట్లుకాదు. సీతమ్మను తమ యింటి యాడపడుచుగా, రామయ్యను ఇలవేల్పుగా చేసికొని, తెలుగు జానపదులు ఆ సీతారాముల చుట్టు తమ మనోనుగుణముగా అద్భుతములయిన భావములను సహజ

---

1. రంగనాథ రామాయణము. పీఠిక. పుట-14 (ఆం.వి.క.ప ప్రచురణ ప్రతి)
2. పాల్కురికి సోమనాథుడు. బసవ పురాణము. పీఠిక (అవతారిక) ఆశ్వాసము-1, పుట-9 వావిళ్ళ ప్రతి)

సుందరముగా నల్లుకొని పాడుకొని యున్నారు. బుద్ధారెడ్డి వానిలో మేలైన వానిని, తన కుచితమని యనిపించిన వానిని కొన్నింటిని ఎన్నుకొని తన గ్రంథ రచనా సందర్భమున తదంశములను పొందుపరచుకొనినాడని రంగనాథ రామాయణమునకు ఆయా జానపద గీతములకు తత్తత్సామ్యమును బట్టి ఊహింపనగును. ఈ గీతములు దేశి వగుటచే, ద్విపదలందలి తత్తుల్యాంశములు దేశీయమైన వనుట దోషము గాదు. అవియే యిట పరిశీలనాంశములు.

1) జనకాన్వయ క్రమ వక్త

"జనకుని నిండు కొల్వులో దశరథుడు బంధు మిత్ర పురోహితాదులతో కూర్చుండియుండెను. అపుడు వశిష్ఠుడు దశరథుని వంశ క్రమమును వర్ణించెను. పిదప జనక చక్రవర్తి స్వయముగా తన వంశ క్రమమును గూర్చి వివరించెను."[1] ఇది వాల్మీకి రామాయణము నందున్న విషయాను క్రమము. రంగనాథ రామాయణమునందు జనకుడు, స్వీయ వంశ వర్ణనము చేయుటకు[2] బదులు, శతానంద పురోహితుడు జనక వంశ వర్ణన మొనరించినాడు.[3] ఇది మూలమునకు బుద్ధారెడ్డి చేసిన మార్పు. ఇది చిన్నదియైనను, ఎంతయో ఔచిత్యవంతముగా నున్నది.

దశరథు డయోధ్యాధిపతి- జనకుడు మిథిలాధిపతి. విష్ణ్వంశమున శ్రీరాముడు జనించినాడు. శ్రీమహాలక్ష్మ్యంశమున సీత జనించినది. జనకుడు కర్మయోగానుష్ఠానమున సిద్ధి పొందినవాడు. ఇట్టియెడ, దశరథుని వంశ వర్ణనమును వసిష్ఠుడు చేయగా, జనకుడే తన వంశమును తాను చెప్పుట రాజ శీవికి, ఇతర విషయములందలి ఘనతకు చిన్నతనమగును. మఱి, అతనికి పురోహితులు లేరా? ఏ విషయమునందు జనకుడు దశరథునికంటె తక్కువవాడు? అను ప్రశ్నలుదయించును. కావున జనకాన్వయమును జనకుడు చెప్పుట సబబు గాదని తలంచి, బుద్ధభూపతి తన రామచరిత్రమునందు శతానంద పురోహితునిచే జనకాన్వయ క్రమ వివరణ చేయించినాడు,

ఈ మార్పుకు వైదిక వివాహకాండ పద్ధతియు, దేశీయాచారమును కొంత దోహదము చేసినవి—

వివాహ సందర్భమున వరుడు "మదర్థం కన్యాంవృణీధ్వ మితి చతురో బ్రాహ్మణ వరాన్ కన్యాయాః పిత్రాదీన్ ప్రేషయిత్వా।.... తే కన్యాదాతారం గత్వా। బ్రువతే"[4] అని వరప్రేషితులైన పురోహితులు వరుని గోత్రసూత్ర నామోచ్చారణ పూర్వకముగా మూడు తరాలవారిని అనగా వరుని ముత్తాత, తాత, తండ్రులను వర్ణించి చెప్పగా, కన్యా పక్షము నందలి పురోహితులు వధువు తండ్రి యనుమతిని ఆమె గోత్ర సూత్ర నామోచ్చారణ పూర్వకముగా మూడు తరములవారిని అనగా

1. దా. ప్రతి వాల్మీకి రామాయణము. బాలకాండము. సర్గ 71, శ్లో 1, 2.
2 దా. ప్రతి వాల్మీకి రామాయణము బాలకాండము. సర్గ 71 శ్లో. 1, 2
3, రంగనాథ రామాయణము బాలకాండము. ద్వి. 2107-2111
4. "సుహృద స్సమవేతాన్ మంత్రవతో వరాన్ ప్రహిణుయాత్।
తానాదితో ద్వాభ్యామభిమంత్రయేత-ప్రసుగ్మంతేతి"
అను సూత్రమునకు బట్టీయము. (ససూత్రైకాగ్నికాండ మంత్రభాష్యము- ప్రథమ ప్రపాఠకము).

కన్య ముత్తాత, తాత, తండ్రులను గూర్చి వర్ణించి చెప్పుట ఇప్పటికిని తెలుగుదేశమున ఆచారమై యున్నది. దీనిని ప్రత్యక్షముగాఁ జూచిన బుద్ధారెడ్డికి మూలమును మార్పు చేయవలెనని తోచినదేమో!

ఇదిగాకను, సాధారణముగా సంబంధములు మధ్యవర్తుల ద్వారానే ఎక్కువగా కుదురు చుండును. వరుని గూర్చి పిల్ల తల్లిదండ్రులకు నచ్చజెప్పుటయే కాక, గోత్రనామాది పొంతనమును పురోహితుల ద్వారా కలిగింతురు. ఆ పిదప ఉభయులకు సమాధానమైనచో నలుగురి యెదుట ముఖాముఖిగా ముచ్చటింతురు. ఈ వైవాహిక వివాహ సందర్భమున పురోహితుల పాత్రయు ఏమంత తక్కువైనదికాదు. ఈ సాంఘిక మర్యాద నేటికిని చాలా వరకు కానవచ్చుననే యున్నది,

ఈ లోక, శాస్త్ర మర్యాద ననుసరించి జనకుని స్థానమున శతానందుని నిలిపి ఆతనిచే జనకవంశ క్రమమును బుద్దారెడ్డి తన గ్రంథమున చెప్పించినాడు.

ఈ మార్పు భాస్కర రామాయణము నందును గలదు.[1] కావున దేశి ప్రభావమే ఈమార్పునకు కారణ మనవచ్చును

(2) శ్రీ సీతారామ కల్యాణము ;—

వాల్మీకి రామాయణమునందు సీతా వివాహ ఘట్టము మిగుల సంగ్రహముగా, వివాహకల్ప విధి ననుసరించి రచింపఁబడినది. "అభినవ నాళికేరాది పత్ర రచిత మండప మధ్యమున వేదిక నెలకొల్పి, గంధపుష్పాక్షతాదుల నలంకరించి సాంకురములైన పాలికలు, చిదకుంభములు, శరావములు, స్రుక్స్రువములు, లాజపూర్ణ పాత్రలు, ధర్భలు మున్నగువానిని పరిస్తరించి, వేదీ మధ్యమున విధి మంత్ర పురస్కృతముగా నగ్నిని ప్రతిష్ఠించి సర్వాభరణ భూషితురాలైన సీతా మహాసాధ్విని అగ్నిసమక్షమున శ్రీరాముని కెదురుగా నిలిపి మంత్రోదక పూర్వకముగా జనక మహారాజు సీతాహస్తమును శ్రీరాముని చేతఁబెట్టగా నతడు పాణిగ్రహణము చేసినట్లు,"[2] వాల్మీకి మహాముని నిరాడంబరముగా సీతారాముల వివాహమును వర్ణించినాడు. కాని రంగనాథ రామాయణ మునందు ఈ కథాంశము విస్తరిల్లబడి పెండ్లిపందిరి వేయుట మొదలుకొని కూతుల అంపకాల వరకు నాలుగు రోజుల వివాహ మతివైభవముగా వర్ణింపబడినది.

"ఈవర్ణనము నిజముగా సంపన్నులయిన ఆంధ్ర కుటుంబములయందు జరిగెడి వివాహములకు ప్రతిబింబము"[3] బుద్ధారెడ్డి తన కాలమునాటి తెలుగు జాతి వైవాహిక సంప్రదాయములను, ఆచార వ్యవహారములను ఇందు పొందుపరచినాడు ఈ దేశీయాచారములు అనాదిగా వచ్చుచున్న తెలుగు పురోహితుల వివాహ కల్ప విధి భట్టీయము ననుసరించి యున్నట్లు పరిశీలనపై తెలియనగు చున్నది. చూడుడు.

లగ్నముహూర్తమును (వేళను) నిర్ణయించుట, పురమునంతఃపురము నలంకరింపఁజేయుట,

---

1. భాస్కర రామాయణము. బాలకాండము. పద్యము. 725,
2. దా, ప్రతి. వాల్మీకి రామాయణము, బాలకాండము సర్గ. 73
3. పింగళి లక్ష్మీకాంతము ఆంధ్రసాహిత్య చరిత్ర. పుట. 187.

కల్యాణ వేదిక నమర్చుట, లక్ష్మీనారాయణుల వివాహ చిత్రములను గోడలపై లిఖింపఁజేయుట, వెంగ్లియరుగు నలికి ముగ్గులు వేయుట, పేరటాండ్రు పెండ్లి పాటలు పాడుచు వధూవరులను వారి వారి విడుదు లో పీటలపై కూర్చుండ బెట్టి తలలంటి నలుగులు పెట్టి అభ్యంజన స్నానములను చేయించుట, వధూవరులను వస్త్రభూషణాదుల నలంకరించుట, దశరథుడు "అభ్యుదయకర్మ" నొనర్చుట, "స్నాతక కర్మ",[2] "కంకణ ధారణము"[3] లగ్నమునకుముందు పెండ్లి కుమారుల నర్హ్యయానముల గూర్చుండబెట్టి అమరేంద్ర వైభవమున బంధుమిత్రాదులు వెంటరాగా ఎదుర్కొనుట[4] సువాసినీ మణులు హారతులొసంగి వరులను కల్యాణ వేదికకు గొనితెచ్చుట, అగ్ని నివేదికయందు ప్రతిష్ఠించి.[5] హోమ విధులాచరించి, "కన్యాదాత వరులకు మధుపర్క సమయముదీర్చుట.[6] తెర మఱుంగున వధూవరులను నిలుపుట,[7] మహాసంకల్ప పూర్వకముగా కన్యకలను వరుల చేతఁబెట్టి ధారవోయుట,[8] తలంబ్రాలు చల్లుట[9] జిల్కర బెల్లము వధూవరుల శిరస్సులమీద పెట్టుట,[10] సుముహూర్తమని తెఱతీయుట,[11] పరస్పర ముఖావలోకనము,[12] వధూవరులొక్క పీఠముపై కూర్చుండి లాజ హోమాదులు నిర్వర్తించుట,[13] అగ్నిప్రదక్షిణము, (అరుంధతీ సహిత) సప్తర్షి సేవనము.[14] సదస్సు[15] (మహదాశీర్వచనము) ఈ మొదలగు కార్యములతో పెండ్లి నాలుగు దినములు జరుగుట, తరువాత జనకుడు కూతులకు బుద్ధులు గఱపి భూషణాంబరాదుల కానుకల నొసఁగి సాగనంపుట" అను దేశీయ వైవాహిక పద్ధతు లతిరమణీయముగా తనిపితీర వర్ణింపబడి కావ్యమునకు శోభాహేతువైనవి ఇంకనుకొన్ని ప్రధానమైన తెలుగు దేశీయాచారములు-మంగళ సూత్రము కట్టుట,[16] మట్టెలు[17] పెట్టుట, బాషింగములు ధాల్చుట,[18] సప్తపది ఇత్యాదులు

ఈ క్రిందివి వైదిక వివాహ కల్పవిధి భట్టీయము నందలి వినియోగ వాక్యములు.

1. నాందీ శోభన దేవతాముద్దిశ్య సువర్ణాభ్యుదయ కంకర్మకృత్వా.
2 వేదమధీత్య స్నాస్మిన్ స్నాతకం కర్మ కరిష్యే ఇతి సంకల్ప్య.
3. విశ్వేత్తాతేతి విధివత్ రక్షాబంధనంకృత్వా.
4. అనుహవమితి శాకునాది మంత్రాన్ వాచయన్ వివాహాగారమేత్య.
5. తతో వరోఽగ్నిం ప్రతిష్ఠాప్య
6. అథ వరాయ మధుపర్కం కుర్వన్
7, మధ్యేయవనికాంధృత్వా 8. కన్యాదాన ముదక పూర్వందత్వా, అదౌ మహాసంకల్పం పఠేత్.
9. లోకాచార క్రమేణ మంగళాష్టకాని మూర్ధ్నికాని పఠిత్వా। 10. వధూవరయోశ్శిరసి గుడ జీరకాన్నిక్షిప్య.
11. తతస్సు ముహూర్తె ఇతి యవనికా మపోహ్య. 12. అఘోర చక్షురితి కన్యాం దృష్ట్వా.
13. తస్యాస్సోదరీయో లాజా నావపతీత్యేకే. 14. వరో వధూ మరుంధతీంచ దర్శయతి.
15. వివాహానాం మధ్యేతృతీయ దివసే చాతుర్వేద మహాదాశీర్వచనం కుర్యాత్. 16. మాంగల్యతం తునానేతి మంగళ సూత్రం వరః కన్యకాకంఠే బధ్నీయాత్.
17. పాద ముద్రికాం ధృత్వా-
18. శుభికేశిర ఇతి స్రజిగం శిరసినిధాయ.

వర్ణింపబడలేదు. బుద్ధారెడ్డి కాలమున మంగళ సూత్రధారణము తెలుగు వారిలో లేదనుటకు వీలు లేదు. సముద్ర పత్నులైన నదులు శ్రీరాముని శరణు వేడి,

శుభకర మంగళ సూత్రముల్ నిలుపు-త్రిభువనాధీశ్వర దీన మందార!"[1]

అని ప్రార్థించెను ఈ మంగళ సూత్రధారణము. కొన్ని జాతులందు నేడు కనబడదు. కులాచారము చే నిది ఐచ్ఛికముగా నున్నట్లు తోచుచున్నది. కావున బుద్ధారెడ్డి సీతారాముల వివాహవేళ నీమంగళ సూత్ర ప్రస్తావన చేయక, సముద్ర పత్నుల ప్రార్థనా సమయమున పేర్కొనుట చేత మంగళసూత్ర ధారణ మైచ్ఛికమని తెలిపి నట్లయినది,

ఈ సీతారాముల వివాహవర్ణనము మూలానుసారియైనను కథకు భంజకముగాని తీరున నుండి తెలుగు జాతి సంప్రదాయములకు ప్రతిబింబమైన కారణమున ఆక్షేపణీయముకాదు. మీదు మిక్కిలి శ్లాఘా పాత్రమైనది.

భాస్కర రామాయణమునందీ దేశీయాచార వర్ణనము కావింపబడలేదు. "దేశీయమగు ఆంధ్ర ప్రజా జీవితమును వర్ణించువిషయమున చంపూ కావ్య కర్తలకు మక్కువ తక్కువ"[2] యనుటకిది నిదర్శన మగుచున్నది.

ఆచారములు ఐదువిధములు.

"1 గ్రామాచారము, 2 కులాచారము. 3 వృద్ధాచారము 4 దేశాచారము 5 ప్రమదా చారము"[3]

ఇవి కలగా పులగముగా నుండి ఇదమిత్థమని ఈనాడు ప్రత్యేకముగా వింగడించరాకున్నవి.

ఆనంద రామాయణమునందు "అభ్యంజనము. ఎదుర్కోలు, మధుపర్కము తెఅపట్టుట తలంబ్రాలు" మొదలగునవి కొన్ని వర్ణింపబడినవి. వివాహానంతరము వరులు వధువులను తమ నడుమున కెత్తుకొని భోజన గృహమునకు పోయినట్లు"[4] వర్ణింపబడిన యాచారము మనకు విచిత్ర మనిపించినను, ఈనాడు మహబూబునగరమునంటి జిల్లాలలో కొన్ని జాతులలో నేడును ఆచారములో నున్నది —

గోన బుద్ధారెడ్డి పైన చెప్పబడిన పంచ విధాచారములలో పెక్కింటి గ్రహించి. సముచిత స్థానమున చక్కగాఁ జొనిపి, తన దేశీయతను ప్రదర్శించి యున్నాడు. సీతాకల్యాణ మిందులకు

---

1. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి. 934.
2. డా॥ జి. నాగయ్య "దాక్షిణాత్య సాహిత్య సమీక్ష" పుట-129.
3. ఆనంద రామాయణము. సారకాండము. సర్గ-3 శ్లో. 291
"గ్రామాచారం, కులాచారం, వృద్ధాచారంతథా పునః।
దేశాచారంచ ప్రమదా చారాదీనకరోన్నృపః"
4. ఆనంద రామాయణము, సారకాండము. సర్గ. 3 శ్లో-322.
"అథతేబాలకాఃసర్వే వధూః స్వాప్యకటీషువై॥
కౌసల్యాది వనితాభి ర్జగ్ముస్తే భోజనగృహాన్॥

పరమోత్కృష్టమైన నిదర్శనము —

(3) జటాయు ప్రాణ మర్మము ;—

దశగ్రీవుడు జానకి నపహరించి లంకకేగు వేళ, సీతయాక్రందన ధ్వని విని జటాయు మహారాజడ్డపడెను. ఇరువురికి ఘోర సంగ్రామమయ్యెను. ఆ సమయమున రావణుడు ఉపాయముతో జటాయువు నిట్లడిగెను.

"ఓ జటాయువ! నీవు నుత్తమాత్ముడవు — నోజమై నాయంబు లొగి నిద్దఱమును
జెప్పక యుద్ధంబు చేర (య)ఁబొమ్మనిన — నప్పుడు విహగేంద్రు డసురేంద్రుఁజూచి
యాయంబు ఱెక్కల యాసందె నాకు — నీయాయ మెక్కడ నిర్జరవైరి
యనవుడుఁ బాద మాయము నాకనెను."1

అప్పుడా ఖగ పతి యు గవేగమునఁ దరిమి వ్రేలొడ్డియంగఁ దప్పించి దానవ పతి ఖడ్గముచే దాని ఱెక్కలు తెగ నఱికెను.

ఱెక్కలు దెగిన పక్షి బ్రతుకలేదు. ఇది సహజము. కావున రావణుడు జటాయువు ఱెక్కలు ఖండించెను. కాని మూలములో "దశకంఠుడు జటాయువు నాయముల నడిగినట్లు లేదు; అతడు చెప్పినట్లు లేదు; ఇట్లే జటాయువు అడుగగా, రావణుడు "పాదమాయమని కపట బుద్ధితోఁ జెప్పినట్లునులేదు."

జటాయువు అమాంతముగా పాదమును పొడచుటకు వాలి (వచ్చి) నపుడు, దశకంఠుడు దాని రెక్కలు ఖడ్గముతోఁ దెగఁగొట్టుట సులభమగును. "రావణుడు సుకరముగా ఖడ్గముతో రెక్కలు దెగగొట్టినాడ"నుటకు బుద్ధారెడ్డి చేసిన అద్భుత కల్పన మిది యని తోచును, మాయల మరాఠి ప్రాణములు చిలుకలో నున్నవని"2నియు మైరావణుని ప్రాణములను దుమ్మెదలు అమృత స్పర్శచే రక్షించుచున్నవి"3 అను కల్పనలను బోలియున్నదిది,

ఈ జటాయు నాయము గూర్చి "లంకాసారథి" యను స్త్రీల పాటలో —
అనియిట్లు జగడంబు యిద్దరును సేయగా పక్షితో నిలువలేకా।
అధిక యుద్ధము సేయకపటుడై రావణుడు ఆయములు దెలుపు మనెనూ।
తప్పు చెప్పకురోరి తగురెక్కలాయంబు తగు నాయమేది నీకూ।
తనకాయ మంగుష్ఠ మనినంత పాదముల దన్ని చీల్చెను పక్షియూ।
తన్నినంతనె పక్షి రెండు రెక్కలు విఱుగ తావేసె శూలముననూ।" అని యున్నది. ఇదే విషయము సంక్షేప రామాయణము" నందు—

"రెండు ఱెక్కల నడుమ ఆయువని యెరిగి
చంద్రాయుధముతో పక్షి నేయగనూ।"

అని సంక్షేపముగా వివరింపబనడిది

---

1. రంగనాథ రామాయణము. అనుబంధము. 2. పుట. 713.
2. బాలనాగమ్మ కథ. (ఆం-వి-క-ప-ప్రచురణము)
3. ఆనంద రామాయణము సారకాండము. సర్గ. 11 శ్లో. 118, 119.

ఆంధ్రులకు నద్భుతముల మీద, మహిమల మీద, మంత్రముల మీద, మక్కువ మెండు. పశుం ప్రాణములు బలమును తెక్కల యందే యుండుట సహజము. ఈ విషయమును అద్భుతముగా మార్చి, ఆయముగా జేసి దేశీయులు చెప్పుకొనగా, అదే రంగనాథ రామాయణము నందనుసరింపబడి, తరువాత స్త్రీల పాటలయందు జానపద గీతములందును పొంద పరచబడినది. ఈ కల్పనము దేశీయమనుట నిస్సందేహము.

(4) ఉడుతభక్తి :—

"నలసేతువు సముద్రముపై నిర్మింపబడుచున్నది. ఆసమయమున ఒక యుడుత శ్రీరాముని యడుగు దామగులు మనమునం జేర్చి, భక్తితో వార్ధి మునిగివచ్చి, ఇసుకలో పొరలాడి, తన మేని కంటిన యా యిసుమును కట్టపై రాల్చి, మరల సముద్రమున మునిగి, గట్టునకేగి తిరిగి పొరలాడి యా యిసుకను కొండల సందున కట్టపై రాల్చుచుండెను. శ్రీరాముడది చూచి, లక్ష్మణునకు తెలిపి, ఆతనిచే నాయుడు తను దెప్పించి, ప్రేమతో దానిని తన దక్షిణ కరాగ్రమున దువ్వగా, దానికి వెన్నుపై త్రిరేఖ యమరెను"[1]

ఇది యుడుత భక్తి వృత్తాంతము-

"ఈ వానరులు తమ శక్తికి తగిన సేవచేయుచున్నారు; అటులనే మనమును చేయుదమని నిశ్చయించుకొని, యుడుత శ్రీరాముని సేవను భక్తితో యథాశక్తి చేసినది." అనుట ఫలితాంశము. "భగవంతుని చరణ కమల ద్వంద్వమును మదినిల్పి తృణము సమర్పించినను, అది వేల్పుగిరిని బోలును. భక్తి కారణముగాని, అతని కొసంగిన పదార్థము, తత్పరిమాణమును కాదు" అనుటయే ఈ తరుమూషక వృత్తాంత ప్రధానోద్దేశ్యము

"పత్రం పుష్పం ఫలం తోయం యోమే భక్త్యాప్రయచ్ఛతి।
తదహం భక్త్యుపహృత మశ్నామి ప్రయతాత్మనః॥"[2]

అనునదిందుకు ప్రమాణము.

ఈ ఉడుత గాథ అవాల్మీకము. లభించిన సంస్కృత రామాయణములలో నిది కనబడలేదు. ఈ కారణముననే ఇది దేశీయమని ప్రసిద్ధి వహించి యుండవచ్చును. తెలుగునాట "ఉడుతాభక్తి" అనెడి సామెత బహుళ ప్రచారమున నున్నది. ఇది తెలుగువారి సృష్టియే యని కొందరు భావించు చున్నారు.

క్రీ. శ. ఏడవ శతాబ్ది వాడైన తొండరపడి పొడి యాళ్వారు[4] (వీరె విప్రనారాయణులు)

---

1. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి-1098-1116.
2 భగవద్గీత. అధ్యాయము. 9 శ్లో. 26.
3.
4. "తొండరడిప్పొడి యాళ్వారు కలియుగాది 298 వదగు ప్రభవ సంవత్సరమున జనించి నారని వైష్ణవ సంప్రదాయము"
(సుదర్శనాచార్య స్వామి పీఠిక-"నిత్యానుసంధానము." పుట. 48 వావిళ్ళ ముద్రణము)
"ఇతడు క్రీ పూ. రమారమి 300 సంవత్సరముల క్రిందటి వాడని ద్రవిడ గ్రంథములలో నున్నది.... క్రీ.శ, ఏడవశతాబ్దిలోని వాడని ఐతిహాసికుల నిర్ణయము" శ్రీశివశంకర స్వామిప్రవేశిక పుట. 13. వైజయంతీ విలాసము." Ensco ప్రతి.

1. తిరుప్పళ్ళియెళుచ్చి, 2. తిరుమాలై యనురెండు దివ్య ప్రబంధముల ననుగ్రహించి యున్నారు ఇతడు తిరుమాలైయందలి ఈ క్రింది గీతమునందు "ఉడుత భక్తితో శ్రీరామునికి తోడ్పడుటను" గూర్చి ప్రశంసించియున్నాడు.

"కురఙ్గుగళ్ మలైయై నూక్క కుళిత్తుత్తామ్ పరణ్డిట్టోడి
త్తరఙ్గ నీరడై క్కలుత్త శలమిలావిణిలుమ్ పోలేన్.
మరఙ్గళ్పోల్ వలియ నెఞ్జమ్ వఞ్జవన్ నెఞ్జతన్నాల్
అరఙ్గనార్కాట్చెయ్యాదే అళయతే నయర్కిన్డేనే॥[1]

ముండా మరియు బిర్హోరులనెడి ఆదివాసుల రామకథలో "శ్రీరాముడు సీతను వెదకుచు అరణ్యమునఁ దిరుగాడుచున్నప్పుడు ఒక యుడుత సీతామార్గమును జూపించినదట.

రాముడు బహుమాన రూపమున దానివెన్నుపై మూడు రేఖలు లాగి, చెట్టునుండి క్రిందపడి నపుడు దెబ్బతాకకుండ వరమును గూడ నొసంగె"[2]నని కలదు.

పంజాబులో ఉడుత రామచంద్రుని భక్తుడని తలంప బడుచున్నది. సేతుబంధ సమయమున అది చేసిన సేవను గూర్చిన జానపద గీతములు ఆ భాషలో లభించుచున్నవి"[3]

ఆశ్చర్య రామాయణమునందు ఈ ఉడుత ప్రాగ్జన్మము గూర్చి ఈ క్రింది పౌరాణిక గాథ యొకటి చెప్పబడినది.

"ఒకానొక బ్రాహ్మణ బాలుడు కాశికి వెళ్ళి, సకల శాస్త్రముల నభ్యసించి, పండితుడై తిరిగి వచ్చి, వాదోపవాదములచే ప్రతి పక్షులను జయించుచు, అందరిచే కొనియాడబడు చుండెను. కాని తండ్రి మాత్రము "మాపిల్లవాని కేదియురాదు; ఇంతగా కొనియాడ నవసరములేదని అందరితోఁ జెప్పుచుండెను. తండ్రి యిట్లు నడువుటకు కారణము కుమారుని స్తుతింపఁగూడదను శాస్త్రోక్తిను సరణమే కాని అతని యందలి ద్వేషమునఁగాదు. కుమారుడిది తెలిసికొనిలేక, తండ్రిని జంపదలచి ఒకనాడు ప్రచ్ఛన్నుడుగా నుండి, బయటినుండి ఇంటిలోపలికి వచ్చుసమయమున తండ్రిని దుడ్డు కర్రతోఁ గొట్టెను. అతడాదెబ్బతో మూర్ఛిల్లి, పిదప లేచి, "దుష్ట మృగమవై జన్మించు" మని కొడుకును శపించెను. ఆ శాపమువలన నతడు పులియై అరణ్యమున సంచరించుచు, ఒకనాడు తండ్రి గ్రామాంతరముపోయి ఆయరణ్య మార్గమున వచ్చుచుండగా, నతనిఁ జంప మీదికి వచ్చెను. బ్రాహ్మణుడిది తెలిసికొని, "ఇచ్చట గూడ హింసయే జేయుచుంటివా?" అని పలికి ఎవ్వరిని బాధింపకుండ నుండు ఉడుతవుగా జన్మించుమని తిరిగి శపించెను. అంత పూర్వస్మృతి కలిగి వ్యాఘ్ర

---

1. తిరుమాలై పాశురము. 27.

(వానరవీరులు కొండలను దోసికొనిలాగా, నీటిలో మునిగి గట్టుటిసుకలో పొర్లి పరుగిడి, అలలపోటుగల సముద్రమును నింపశ్రమపడ్డ కపటతలేని ఉడుతను పోలిన వాడవైనను కాను; వృక్షములను బోలిన గట్టి మనస్సు గలవాడనై వంచకుడనై మందుడనగు నేను శ్రీరంగనాథునకు మనస్సుచేనైన కైంకర్యము చేయక అనర్థ పడుచున్నాను" అని తాత్పర్యము.

2. रेवरेंड फादर कामिल बुल्क– रामकथा उत्पत्ति और विकास पृष्ठ 335.
3. ,, ,, ,, पृष्ठ 335.

రూపమున నున్న యా కుమారుడు శాపవిముక్తి ననుగ్రహింపుని కోరగా, శ్రీరాముని హస్తస్పర్శమున శాపము దొలంగి, సద్గతి కల్గునని యనుగ్రహించెను అట్లే జరిగెను.

ఈ పౌరాణిక గాథ యెందున్నదో, ఆశ్చర్యరామాయణ గ్రంథకర్త చెప్పలేదు, కావున ఇది దేశమునందు అనుశ్రుతముగా వినవచ్చెడి కథ యని చెప్పవచ్చును.

శ్రీరామ భాగవతమునందు —

"తదా జాతిస్మరః కశ్చిత్క్రోడో రభసాన్వితః।
స్నాత్వా వాలుక యాంగేఽక్త స్సేతు మారోహతి ద్రుతం॥
స్నిగ్ధాంగత్వా ద్వాలుకా సా పతేత్యేవ గలితాభవత్।
పునః పునస్త థేవాసౌ కుర్వన్నపి నతుష్యతి॥
తద్ జ్ఞాత్వా ప్రేమకారుణ్య ప్రేరితో రాఘవః ప్రభుః।
ప్రేమ్ణా లిఖ్యతు తత్పృష్ఠ మదాత్తస్మై నిజంపదం॥"1

అని యుడుత వృత్తాంతమునకుఁ జెందిన పై శ్లోకములు గలవు కాని ఈ కావ్యము ఇటీవలిది- అందువలన నీశ్లోకములు రంగనాథ రామాయణాధారముగా లేక జనశ్రుతి యాధారముగా రచింపఁబడినవే.

తెలుగు వారికి కర్మజ్ఞానములకంటె భక్తియందే అభినివేశము మెండు; వైష్ణవులకిది మఱి యెక్కువ. దక్షిణ దేశమునందు ఆళ్వారాదులచే సృష్టింపబడిన ఈ వృత్తాంతము క్రమముగా తెలుగు దేశమునకును,, ఉత్తరాదికిని వ్యాపించి, జనమధ్యమున బహుళ ప్రచారము చెందినది. అందఱు మరచి పోయినను, తెలుఁగువారు మఱవలేదు. "ఉడత(తా)భక్తి" యనెడు సామెత రూపములో నిలుపుకొని, స్మరించుకొనుచున్నారు ఇది అచ్చముగా దేశీయ వృత్తమనుటలో సందేహము లేదు. భక్తిచేత మానవులే కాదు, పశుపక్ష్యాదులును తరించినవని చెప్పుట దీని ప్రధానోద్దేశ్యము. బుద్ధభూపతి విష్ణుభక్తి మహిమను దెలుపుటకే దీనిని తన రామాయణమున సముచితముగాఁ జేర్చినాడు.

(5) ఊర్మిళాదేవి నిద్ర ;—

జానకీ రాఘవులు లక్ష్మణ సహితులై వనవాసమున కేగుచు అయోధ్యనుండి బయలుదేరిన నాటి మఱిరోజు శృంగిబేర పుర సమీప గంగా తీరమున విడిసిరి. గంగోదకములచే నాకలి దీర్చుకొని, సీతారాములు తృణశయ్యపై పరుండిరి. అంత లక్ష్మణుడు -

"కర మొప్ప తమయన్నఁ గాచునన్ బుద్ధిఁ
బదునాలుగేండ్లును బగలును రేలు నిదుర వోపక యుండ నియమంబు సేసి
తమయన్న సెజ్జకుఁ దవ్వుల నిలిచి"

వారిని కని పెట్టుకొని యుండెను. అప్పుడు నిద్రాదేవి మాయరూపు దాల్చి లక్ష్మణుని సమీపించి "రాత్రి సమయమున నిద్రించుట విధి విధానము. దానిని నీవు త్రోసి రాజంటివి, కావున నిన్ను విడుచు మార్గమును చెప్పుమ"ని యడుగగా "తనభార్యయైన యూర్మిళను జేరి పదునాలు

1. శ్రీరామభాగవతము. అధ్యాయము. 1
2. రంగనాథరామాయణము. అయోధ్యాకాండము. ద్వి. 1053–1055.

గేండ్లును మగియు వరకు అహోరహంబులు నావేశించియుండుము. సమయము దీరిన వెనుక వచ్చి నిన్ను మరలఁగైకొందు"నని లక్ష్మణుడు నిద్రాదేవితో నియమ మొనర్చుకొనెను. నిద్రాదేవి యేగెను "[1] (ఊర్మిళ నావేశించెనని అధ్యాహారము).

వాల్మీకి రామాయణమునందు ఈ సన్నివేశము కనబడదు. కాని లక్ష్మణుడు శ్రీరామ చంద్రునితో తనను గూడ వనవాసమునకు వచ్చుట కనుమతించుమని ప్రార్థించుచు-

"భవాంస్తు సహ వైదేహ్యా గిరి సానుషు రంస్యతే।
అహం సర్వం కరిష్యామి జాగ్రత స్స్వపతశ్చతే॥"[2]

అని జాగ్రన్నిద్రావస్థలలో నున్న తమకు సర్వకాల సర్వవిధ కైంకర్యములను చేసెదనని పలికినాడు. ఈ మాటలచే "సర్వకాల సర్వవిధ కైంకర్యములను చేయవలెనన్న తాను నిద్ర పోకూడదు కదా!" అని వ్యంజితమగుచున్నది

పశ్చిమోత్తర శాఖీయ ప్రతిలో పైశ్లోకమునకు పాఠాంతరముగా-

త్వమార్యసహ వైదేహ్యా వనవాసేఽభి రంస్యసే।
రక్షతస్త్వాం గమిష్యంతి జాగ్రతో మమ రాత్రయః॥"

అని యున్నది. రాత్రులందు నేను జాగరూకుడనై మిమ్ము రక్షింపగలనని సౌమిత్రి స్పష్టముగా చెప్పినట్లు తెలుచున్నది. కావున దీని నాధారముగా చేసికొని, ఇతర రామాయణకర్తలు, జానపదులును నిద్రాదేవి కల్పనను, తదనుబంధముగా ఊర్మిళాదేవి నిద్రను సృష్టించినారని ఊహించ వచ్చును.

"ఊర్మిళాదేవి నిద్ర" యను స్త్రీలపాట (జానపద గేయము) ఒకటి కలదు. పట్టాభిషేకానంతరము సీతాదేవి శ్రీరామునితోఁ జెప్పి నిద్రపోవు మరదలు ఊర్మిళ వద్దకు లక్ష్మణుని పంపుటయు, ఆ తర్వాతనైన ఊర్మిళా సౌమిత్రుల సరస వృత్తాంతము, ఈ ఊర్మిళాదేవి నిద్రయందు వర్ణింపబడినవి. కాని దీనిలో "ఊర్మిళాదేవి నిద్రా కల్పనము" రంగనాథ రామాయణాంశమునకు భిన్నముగా నున్నది.

"లక్ష్మణుడు సీతారాముల వెంట నడవులకు పయనము కాగా, ఊర్మిళాసతియు ప్రయాణమయ్యెను. కాని సౌమిత్రి "వద్దు, నీవుండు"మని ఆమెను శాసించి తానొక్కఁడే సీతారాములను సేవింపఁబోయెను. నాడు మొదలు ఊర్మిళాదేవి సెజ్జపై కనుమూసి ఒరిగి పతి వచ్చువరకు నిద్రించుచునే యుండినది."[3]

---

1. రంగనాథ రామాయణము. అయోధ్యాకాండము. ద్వి. 1056-1060.
2. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. అయోధ్యాకాండము. సర్గ-31, శ్లో. 25.
3. "స్త్రీల రామాయణపు పాటలు—ఊర్మిళాదేవి నిద్ర" పుట-242.

"ముందు మన యడవులకును-పోగాను ముద్దుమరది వెంటనూ
పయనమై రాగ జూచి తన చెలియ। పయన మాయెను ఊర్మిళా।
వమ నీ వుండుమనుచు సౌమిత్రి। మనల సేవింపవచ్చె
నాడు మొదలు శయ్యపై కనుమూసి-నాటి పవళింపుచున్నది"

జానకీ రాఘవుల వెంబడి ఊర్మిళా లక్ష్మణులు వనములకుఁ బోయినచో, సౌమిత్రి రాముని సేవింపుచునుండ, ఊర్మిళ సీతను సేవించుచుండెడిది. కాని అట్లు జరుగలేదు. "పతివ్రతయైన ఊర్మిళాదేవి ఈ పదునాలుగు సంవత్సరములు పతిని విడిచి కాలము నెట్లు గడిపినది?" అను ప్రశ్నకు సమాధానముగాను, (కొన్ని రామాయణములలో నున్నట్లు) పదునాలుగు వత్సరములు నిద్రాహారములు లేనివాని చేతనే చచ్చునట్టి ఇంద్రజిద్వధకు అంకురార్పణగాను దేశీయులు చేసిన అద్భుత కల్పన మిదియని తోచుచున్నది.

రంగనాథ రామాయణము నందలి కల్పనము కేవలము సౌమిత్రియొక్క శీలౌన్నత్యమును రెట్టింపు చేయుచున్నది. అతని భ్రాతృ భక్తిని, సేవాపరాయణత్వమును పరిస్ఫుటముగా చిత్రించుచున్నది. ఇక, ఊర్మిళాదేవి నిద్ర యందలి కల్పనము సీతాదేవి కన్న పాతివ్రత్యమునందు ఊర్మిళాదేవి మిన్నయని ప్రతిపాదించుచున్నది. మైథిలి "అడవులకు రావలదని పలికిన పతి నెదిరించి, "పురుష రూపమున నున్న ఆడదానివని"[1] నిందించి, విడిచిపోయిన జలమో, అగ్నియో, విషమో చూచుకొని మరణింతునని బెదరించి, పతివెంట అడవులకు వచ్చినది. కాని ఊర్మిళాదేవి మాత్రము "వద్దు, నీ వుండుము" అని చెప్పిన భర్త మాటను పాటించి, సీతాదేవివలె అతని నెదిరించక, బెదరించక, అయోధ్యలోనుండి పోయి, పర పురుష దర్శనము వర్జించి, శయ్యపై పవళించి, పదునాలుగు సంవత్సరములు నిద్రించినది. పతి కెదురాడకపోవుటయే, అతడు చెప్పిన రీతి నడచుకొనుటయే సతీ ధర్మమని తన యాచరణ ద్వారా లోకమునకు చాటినది.

లక్ష్మణుడు వలదనగానే పతి మాట జవదాటక ఊర్మిళ అతని ననుగమింపకపోవచ్చునుగాని. రాత్రింబవళ్లు తదేకముగా నిద్రపోవుట యెట్లు? అను ప్రశ్నకు లక్ష్మణ దేవర నవ్వు సమాధాన మిచ్చుచున్నది.

ఆనంద రామాయణములో మేఘనాద వధ సందర్భమున విభీషణుడు శ్రీరామునితో—

లక్ష్మణోఽయం యదాయోధ్యా పుర్యాస్త్వామను నిర్గతః।
తదాది నిద్రాహారాదీన్ నప్రాప్తః సరఘూత్తమ॥
సేవార్థం తవ రాజేంద్ర జ్ఞాతం సర్వ మిదం మయా।"[2]

అని చెప్పినట్లు కలదు.

"లక్ష్మణ దేవర నవ్వు"లో పట్టాభిషేకానంతరము నిండు కొల్వులో నవ్విన లక్ష్మణుడు తన నవ్వునకు కారణమును విన్నవించును—

"......ముందు మన మడవులకు పోయున్ననాడు
ఆ పర్ణశాలలో మన ముండగాను। పరమాత్మ మీ సేవ చేయగాఁ జూచి
ఉండగానే వచ్చె ఉత్తమ్మ నిద్రా। రెండు జాముల వేళ నిద్ర యేతెంచె॥
....

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. అయోధ్యా. సర్గ-30 శ్లో. 3.
"రామ జామాతరం ప్రాప్య స్త్రియం పురుష విగ్రహం."
2. ఆనంద రామాయణము. సారకాండము. సర్గ. 11, శ్లో. 177, 178.

అప్పుడు లక్ష్మణుడు.

వలగొని ముమ్మారు ప్రదక్షిణముజేసి। సాష్టాంగ దండ నమస్కారములు జేసి।

మా యన్న రఘుపతికి మా వదినకూను। ఈ పర్ణశాలకే తాను కాపవెనూ।

బొమ్మడి అయోధ్య వేగపురి నగరు। తన్నుబాసి తన సతియుండ దగదు।

రాత్రియును పగలును లేవకుండగను। తను విడిచి పొందు మీ ధవళాక్షి నిద్ర

కడువేడ్క అయోధ్య కనకపట్నాన। కాకుత్స తిలకుడు గట్టిననాడు।

సేవలు మంత్రులు కొలువై యుండగను। అప్పుడు తను పొందుమని। పలికీతి"[1] ననెను

పైరీతి పరిశీలించి చూచినపుడు, "రంగనాథ రామాయణము"నందలి "ఊర్మిళాదేవి నిద్ర" కథాంశమునకు "ఊర్మిళాదేవి నిద్ర, లక్ష్మణ దేవర నవ్వు" వంటి దేశీయ గీతములే ఆధారములు కాని, ఆనంద రామాయణ మాధారము. కాజాలదు.

ఈ ఊర్మిళగాథ కరుణోద్వేలమైనది. ఈమెను వాల్మీకి మరచినను, జానపదులు మరచిన వారుకారు. బుద్ధారెడ్డి సందర్భోచిత్యముగా ఈ అంశమును గ్రహించి తన దేశాభిమానమును ప్రదర్శించినాడు —

(6) లక్ష్మణదేవర నవ్వు :—

శ్రీరాముడు పట్టాభిషేకానంతరము హితబంధు మిత్రాదులకు విందుచేసి, మహిమ దీపింప సకల భృత్యామాత్య సహితుడై కొలువు దీర్చియుండెను. ఆ సమయమున లక్ష్మణుడు నిద్రాదేవి తనను జెందగా కలకల నవ్వెను. అక్కడి వారందరు తమలోతాము తమ తమ కళంకములు కారణములుగానే సౌమిత్రి నవ్వినాడని తలంచి తలవంచి కినుక చెందిరి. శ్రీరాముడు లక్ష్మణుని కీ యనుచితహాసమునకు కోపము చెంది, తమ్ముని కారణ మడిగెను. అతడు చేతులు జోడించి —

"వనవాసమునకు దేవరఁ గొల్చివచ్చి — వనముల నున్నచో వచ్చెఁజూ నిదుర

వచ్చినఁ బదునాల్గు వత్సరంబులకు — నచ్చుగాఁ జేరకుమన నిద్ర చనియెఁ

బదునాలుగేండ్లును బరగ నిండుటయు — వదలక యిప్పుడు వచ్చెనా నిద్ర.

యది కారణంబుగా నవనీశ తిలక! — యిదియేను నవ్వితి: నిదియె నాతప్పు

నీవు సహింపుమో నిఖిలాధి నాథ॥"[2]

యని సంజాయిషీ చెప్పుకొనగా, నందఱును మనములందు ననుమానములను బాసి సంతసించిరి.

ఇది రంగనాథ రామాయణమునందు యుద్ధకాండము కడపట బుద్ధారెడ్డి ప్రవేశ పెట్టిన "సౌమిత్రి హాసము" తెలుగు వనితలు ఎల్లప్పుడు పాడుకొనునట్టి "లక్ష్మణదేవర నవ్వు"[3]నకిది ఛాయారూపము. ఈ నిద్రాదేవి కల్పనము ఊర్మిళ నిద్రకు కారణముగా, లక్ష్మణదేవర నవ్వు కార్యముగా పరిణమించినది.

---

1. లక్ష్మణ దేవర నవ్వు. స్త్రీల రామాయణపు పాటలు. పుట. 227.
2. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి. 8833-8837.
3 లక్ష్మదేవర నవ్వు-స్త్రీల పాటలు. పుట-227.

"లక్ష్మణ దేవర నవ్వు"లో ఇంకను కొంత విశేషము గలదు. లక్ష్మణుడు కొలువులో నవ్వి కలకలము బుట్టించి నందుకు శ్రీరాముడు కోపించి అతని తల తెగవేయుటకు ఖడ్గమెత్తెను. నిద్రాదేవి తన్నావహించి నందుకు నవ్వినట్లు సౌమిత్రి దెలిపిన వృత్తాంతమును విని తన పాప పరిహారమునకు ప్రాయశ్చిత్తమే లేదని శ్రీరాముడు తన తలను విడువఁదలఁచెను. వశిష్ఠుడడ్డుపడి ——

మీరు లక్ష్మన్నకే నిద్రపట మమర్చి పాదాలు వత్తుమ"ని శ్రీరాముఁతో పలికెను

పిదప లక్ష్మణుని నిద్రకుఁ దగిన యేర్పాట్లు ఘనముగా కావింపఁబడెను. సౌమిత్రి నిద్రించు చుండగా, ఊర్మిళ అతని దగ్గర లేదని తెలిసికొని, రాముడు స్వయముగా అతని శయన మందిర మునకుఁబోయి.

" పాన్పుపై గూర్చుండి శ్రీరాఘవులు —— తమ్ముని పాదములు తొడలపైనుంచి
వొయ్యన పాదములు వత్తుచున్నారు. —— ఒంమారు వత్తితే నూరుకొని యుండె.
రెండవ మాటికి కలగంటిననెను —— మూడవ మాటికి కనువిప్పి చూచి
కలగాదు నిజమని కడుభీతినొంది —— కలగాదు నిజమని కనువిప్పి చూచి
ధరణీశుడగుట దెలిసి ధరణిపై వ్రాలె"

అంత పాదములపై నున్న తమ్ముని లేవనెత్తి మరల రాజ సభకు తీసికొని వెళ్ళెను ——

వాల్మీకి రామాయణములో లేని ఈ "సౌమిత్రిహాస" కల్పనమున కాధారము దేశీయ గీతము లనుటలో సందేహము లేదు. బుద్ధ భూపతి దీనిని తనరామ చరితమునందుఁ బ్రవేశ పెట్టుటలో ప్రత్యేకమైన యొక యుద్దేశ్యమున్నదని తోచుచున్నది.

"లక్ష్మణుడు నవ్వినపుడు సభలోని వారు తమతప్పులను మదిఁదలంచుకొని తన్ని మిత్తముగానే నవ్వుచున్నాడని భావించిరిగదా!'' ఇందుకు మూలము "నకశ్చిన్నాపరాధ్యతి" (తప్పు చేయని వాడు విశ్వమున లేడు) అనునది.

రావణ వధానంతరము హనుమంతుడు రామాదేశమున నశోక వనమున నున్న సీతను దర్శించి, రాముని విజయవార్తను దెలిపి, సీతమ కష్ట పెట్టిన ఆ రాక్షసకాంతలను వధింపఁగోరెను. అప్పుడు సీతామాత -

"పాపానాంవా శుభానాంవా వధార్హాణాం ప్లవంగమ।
కార్యంకరుణ మార్యేణ నకశ్చిన్నాప రాధ్యతి॥"1

అని ఆంజనేయుని సమాధాన పరచినది. వైష్ణవ సంప్రదాయమున దీనికి విశేష వ్యాఖ్యయిట్లు చేయ బడుచున్నది.

(1) రామలక్ష్మణులందును దోషముగలదు -

స్త్రీలు చంచల చిత్తలు; ఎట్టిది. యైనను కోరుదురు. పురుషులు గుణదోషముల విచారించి వారి కోరికను దీర్చుటకు ప్రయత్నింపవలెను.

వనవాసమున సీతాదేవి స్వర్ణమృగమును జూచి తెమ్మని భర్తను కోరినది. శాస్త్రజ్ఞుడు.

---

1. వా. ప్రశా. వాల్మీకి రామాయణము. యుద్ధకాండము. సర్గ. 116, శ్లో. 44.

లోకజ్ఞుడు, సర్వజ్ఞుడునైన శ్రీరాముడు మారుమాటాడకుండగనే, సౌమిత్రి వారించినను లేడిని తెత్తునని పోయినాడు కదా!

ఇక అన్నయాజ్ఞను పాటించే లక్ష్మణుడును "ఆడది అపనింద వేసినను, కాలము మీద సత్యము దెలియవచ్చు" నని భావించియైనను పర్ణశాల యందు నిలువ వలెను; అట్లు నిలువక అన్న జాడను బట్టి పోయినాడు కదా!

ఇట్లు వారివురు లేక పోవుట వలన రావణాగమమునకు, సీతాపహరణమునకు అవకాశ మేర్పడినది. భార్యను హద్దులోఁ బెట్టక, స్వాతంత్ర్య మొసంగి, అడిగిన ప్రతిదానిని ఆలోచింపక చేయఁబూనుట పతి దోషము. ఆజ్ఞ నుల్లంఘించి రక్షణ కార్యమును వీడుట సేవకుని దోషమే. కావున రామలక్ష్మణులును తప్పు చేసినవారే.

(2) సీత యందును దోషము గలదు. పతి యాజ్ఞమంచిదైననుచెడ్డదైనను, ఎట్టిదైనను ఆచరించుట సతీధర్మము. శ్రీరాముడు వనములకు వలదనినను, ఎదిరించివచ్చుటయు "స్త్రియంపురుష విగ్రహం"1 అని అతనిని నిందించుటయు, 13 సంవత్సరముల నుండి మాతృభావమున సేవచేయుచునున్న లక్ష్మణుని శీలమును మాయ పిలుపుతో శంకించి తూల నాడుటయుఁ సీతాదేవి యొక్క చిన్నదైన, పెద్దదైన దోషము"2 కావున సీతయు తప్పు చేసినదే.

(3) పావని యందును దోషము కలదు అతడు అశోక వనమున సీత యున్నదనే విషయమునే మఱచి "కపిత్వము విజృంభించగా"3 లంకనంతటిని దహించి వైచెను.

ఆ మంటలలో సీతాదేవి కాలిపోయినను, లేక దీనికంతటికి మూలకారణము జానకియని ఏ రాక్షసస్త్రీయైన ఆమాంతముగ ఆమెను బట్టి మంటలలోఁ బడవేసినను, సర్వనాశనమగునదే కదా! ఇందుకు లంకాదహనానంతర హనుమత్పశ్చాత్తాపము నిదర్శనము.

ఇటువంటి భావనను గ్రహించి దేశీయులు "లక్ష్మణ దేవరనవ్వును" నిద్రాదేవి కల్పనకు ఫలితముగా సృజించిరి. నిండు సభలో లక్ష్మణుడు నవ్వినపుడు "చెఱనున్న సతిని దెచ్చి ఏలుచున్నందులకు శ్రీరాముడు, రావణునిచే హరింపబడి అతనియింట నుండి వచ్చి సభలో నున్నందులకు సీతాదేవి, ఇంత కాలము నీతి భూమండలంబేలి రామునొద్ద భక్తునివలె నున్నందులకు భరతుడు, ఇంతవరకు భరతు నాశ్రయించి పిదప రాముడు రాగానే అతని యొద్ద (రాజ్య వైభవమును గోరి) యున్నందులకు శత్రుఘ్నుడు, తనవారి మర్మములను రామునకు దెల్పి చంపించి నందుకు

---

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. అయోధ్యాకాండము. సర్గ. 30 శ్లో. 3.
2. ,, ,, ,, సుందరకాండము. సర్గ, 30. శ్లో. 48.
3. ,, ,, ,, ,, సర్గ. 55. శ్లో. 16.

విభీషణుడు, అన్నను జంపి ఆతని భార్యతో వాలి వర్తనముల్ మాని కులుకు చున్నందులకు సుగ్రీవుడును- ఈ రీతి వారివారికి తగినట్టి కళంకములు మదిని దోచుచుండగా మొగములు వంచి దిగులొందిరి. ఇట్లు వర్ణించుట ప్రతివ్యక్తియు ఏదోయొక యపరాధము చేసినవాడే కాని వేరుగాదనుట. కావున మానవులిది గుర్తించి ఇతరుల అకస్మాచ్చేష్టలకు తొందరపడి ఆగ్రహ మొందక, సావధానముగా విచారించి కార్యములకు పూనుకొనవలెననుట నీతి. అది యీ లక్ష్మణ దేవరనవ్వు నవ్వు ద్వారా బుద్ధారెడ్డి లోకమునకు విదిత మొనర్చినాడు. దేశీయగీతము శీకల్పనకు ప్రేరకమైనవి.

(7) శ్రీరాముని విందు ;—

"పట్టాభిషేకానంతరము శ్రీరాముడు భోజనాగారంబునకు అనుజులను, సకల బాంధవులను సుగ్రీవాది వానరులను, విభీషణాది దైత్యులను, గుహుని రావించి, ఉచితాసనంబులందు కూర్చుండజేసి అంజనాసూనుని తన పొత్తుల భుజియింపుమని కోరెను. బంగరు పళ్ళెరములందు వివిధ రుచ్య పదార్థములు ఫలములును వడ్డింపబడినవి. శ్రీరాము డాంజనేయుని ప్రీతితో దినుమని తానొక్క కబళమును గ్రహించెను. వెంటనే పావని యాపళ్ళెరము నెత్తి నెత్తిమీద పెట్టకొని, అధిక భక్తితో నాడుచు —

"...........ఓకపి శేఖరులార!
రండు రాముని పళ్ళెరము ప్రసాదంబు — దండిగా దొరకే నందఱకు నేననుచు"

ముని వృక్ష (అగస్త్యతరువు-అవిసె చెట్టు) మెక్కి దాని యాకులను ద్రుంచి యా ప్రసాదమున నొనరించి కపినాయకులకు పంచి పెట్టెను. వారును నా ప్రసాదమున తృప్తులైరి "[1]

(అది మొదలు అగిసె చెట్టునాకులకు ప్రాముఖ్య మేర్పడినది.)

రంగనాథ రామాయణమున యుద్ధకాండాంతము నందున్న యీ విందు భోజన వృత్తాంతము వాల్మీకి రామాయణమున లేదు.

ఆనంద రామాయణమందు విందు వృత్తాంతము కలదు. కాని ఆంజనేయు డగస్తి వృక్షమారోహించి తద్దళములను చేర్చి పంచిపెట్టినట్లు లేదు.[2]

---

1. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి. 8802-8818.
2. ఆనంద రామాయణము. సారకాండము. సర్గ. 12. శ్లో. 152-154.
"తతస్సర్వై రోభ్జనార్థం రాఘవః సంస్థితోఽభవత్।
రామేణ ప్రాణాహుతయో గృహీతా శ్చేతి మారుతిః॥
నిరీక్ష్యోడ్డీయ వేగెన రామాగ్రే భోజనస్యచ।
త్రిపదాయాం స్థితం పాత్రం హైమం పక్వాన్న పూరితం॥
నినాయ వామహస్తేన ధృత్వా చ విహసన్ ముదా।
స్వయం భుక్త్వా రామశేషం ప్రాక్షిపద్వానరా నపి॥"

అధ్యాత్మ రామాయణమునందీ వృత్తాంతము లేదు, కాని తన్మాహాత్మ్యమున "ఏకాదశినాడు ఉపవాసముండి. ద్వాదశినాడు నియతుడై అగస్త్యవృక్షమూలమున కూర్చుండి "రామగీతను" పారాయణము చేయునతడు సాక్షాత్తుగా రాఘవుడై సమస్త దేవతలచేత పూజింపబడునని"1 కలదు. ఇచ్చట అగస్త్య తరువునకును ప్రఖ్యాతి వచ్చిన కారణము చెప్పబడక ఫలితము మాత్రము తెలుపబడినది. రామభక్తి విశ్వాసములు గల తెలుగువారు నేడును ద్వాదశినాడు తప్పకుండ అగిసె యాకులను సంపాదించుకొని వంట యందుపయోగించుకొను చున్నారు-

"లక్ష్మణదేవర నవ్వు" జానపద గేయము (స్త్రీలపాడ) చివర ఈ విందు భోజనము వర్ణింపబడినది.

కౌసల్యా మాత భోజనము వడ్డించగా, శ్రీరాముడు భరత లక్ష్మణ శతృఘ్నులతో, బంధువులతోఁ గూడి భుజించుచుండి మారుతి నపుడు మరచియుండెను. ఇంతలో—

"పులుతు పులుతుమని వచ్చె హనుమాన్లు-ఇంటివాడవు గనుక నూరకుంటిమి
పొత్తున గూర్చొమ్మి ఉత్తమపురుష-నీ వంటి బంధుండు నే వంకలేడు
నీ వుండగాగదా సతిని దెచ్చుకునీ-అయోధ్య పట్నమ్ము యేలగలిగితిని
నీ వుండగాగదా తమ్ముల పంక్తి-భుజించగలిగితిని హనుమన్న వినుమ
పొత్తుల గూర్చొమ్మి ఉత్తమ పురుష"
అని శ్రీరామచంద్రుడు ప్రేమతో పిలువగా ఆంజనేయుడు—
"పొత్తున గూర్చుండ ఉత్తముడగాను" అని పలికి,—
"సర్వేశు భోజనము తాఁగాగ జూచి-ముందరా పళ్ళెమ్ము యెత్తుకొనిబోయె
తా బోయి హనుమన్న అగిసె చెట్టెక్కె-ద్వాదశికి ఒక ముద్ద కొమ్మపై నుంచె
అందుమీద పళెమ్మ అంది పడవేసె-వృక్షమున కెదురుగా రామచంద్రులు
చెయిజాచి హనుమన్నను రమ్మని బిలిచె-రామచిలుకవలె చేతిపై వ్రాలె
చేతిపై హనుమన్నను ధరణిపై దించి-ముత్యాలహారమ్ము మెచ్చి మెడవేసె॥"

అని యా విందు భోజన వృత్తాంతము. ఇందులో శ్రీరాముని పళ్ళెములోని ప్రసాదమును ఆంజనేయుడు పంచిపెట్టినట్లు లేదు. అతడగిసె చెట్టుపై పళ్ళెములోని ముద్దను ద్వాదశినాడుంచినందున, నా చెట్టునకు ప్రాముఖ్యము కలిగినట్లు దీనివలన తెలియుచున్నది.

బుద్ధారెడ్డి ఇట్టి దేశీయ గేయములలోని వృత్తాంతమును, ఆనంద రామాయణ వృత్తాంతముతో మేళగించి, దేశీయముగా మార్చి, తన అద్భుత ప్రతిభా పాటవముతో ఆంజనేయుని భక్తిని ప్రదర్శిం

---

1. బ్రహ్మాండ పురాణము-ఉత్తర ఖండము. అధ్యాత్మ రామాయణ మాహాత్మ్యము. శ్లో. 57.
స్థిత్వాఽగస్త్య తరోర్మూలే రామగీతాం పఠేత్తు యః।
స ఏవ రాఘవ స్సాక్షాత్ సర్వ దేవైశ్చ పూజ్యతే॥

చుటక ననుగుణముగా దీనిని మలచియున్నాడు. ఆనంద రామాయణములో "ఉచ్ఛిష్ట" శబ్దము వాడబడినది. (రాఘవోచ్ఛిష్టం, రామోచ్ఛిష్టార్థం) తెలుగున దీనికి "ఎంగిలి" యని యర్థము. ఇది అసహ్యతను ప్రకటించును. పెద్ద భుక్తశేషము "ఉచ్ఛిష్టము-ఎంగిలి" యైనను, చిన్నవారు "ప్రసాద"మని భక్తితో, ప్రీతితో స్వీకరింతురు.

రాముడు అవతరించిన దైవము. కావున బుద్ధారెడ్డి ఇచ్చట "ఉచ్ఛిష్ట" లేక "ఎంగిలి" శబ్దము నుపయోగింపక, ప్రసాద శబ్దమును వాడి రమ్యత నాపాదించినాడు. "తళియ ప్రసాద" మని వైష్ణవ సంప్రదాయము కలదు. తదనుగుణముగా "పళ్ళెరము ప్రసాదము" అని కూర్చుట విశేషము.

పళ్లెమందలి పదార్థములు పరిమితము. దైత్య వానర సంఖ్య అపరిమితము. అది ఎంతో మందికి సరిపోదు. కావున "ద్వాదశికి నొక ముద్ద కొమ్మపై నుంచె" వంటి గీతాభిప్రాయములను మార్చి,

"ముని వృక్షమెక్కి యిమ్ముల దాని దళము-లను వొందగా ద్రుంచి యా ప్రసాదమున
........నొనరించి"

ఆంజనేయుడు పంచిపెట్టినట్లు వ్రాయబడినది. సాధారణముగా వృక్షదళములను గణించుట కష్టము; అందులో ఒక్క పత్రమే అగణితముగా చీలిన అగిసెచెట్టు దళముల గణించుట మరీ అసాధ్యము. వానర దైత్యాదుల సంఖ్య అంత అధికముగా గలదని ధ్వని.

రామ ప్రసాద స్పర్శచే తత్తరువు పవిత్రమై, దాని దళములు రామప్రసాద తుల్యములైనవి ఈ కారణమున తెలుగువారు ద్వాదశినాడు తప్పక దాని నుపయోగించుకొనుచున్నారు. ఈ విషయమును దెలుపుటకై ఈ వృత్తాంతమును కవి గ్రహించియుండవచ్చును.

సాంఘిక విషయములు :—

బుదారెడ్డి ఇట్లు ప్రత్యేకముగా రామాయణము గూర్చి పరివ్యాప్తమైన దేశీయ గీతము లాధారముగా జేసికొని వాల్మీకి రామాయణములో లేని కొన్ని కథాంశములను కూర్చుటయేకాక అడుగడుగున సందర్భమును పురస్కరించుకొని తన కాలమునకు చెందిన దేశీయాచారములను, ఆహారవిహారములను. వింతలు వినోదములను ఔచిత్యశోభితముగా పొందుపఱిచియున్నాడు. వీనిని నాలుగు ఉప శీర్షికల క్రింద విభాగింపవచ్చును

1. ఆచార విచారములు 2. ఆహార విహారములు
3. క్రీడా వినోదములు 4. వస్త్రాద్యలంకారములు

ఇవి సంక్షిప్తముగా నిచట పరిశీలించుటయైనది.

I. ఆచార విచారములు :—

i) రాజులు శత్రురాజుల జయించి తజ్జయ సూచకముగా వారి బొమ్మలు చెక్కిన బిరుదైన గండపెండె(ర)ములను ఎడమకాలియందు ధరించువారు.

"గండడంచి జయించి కైకొన్న బిరుదు-గండపెండెంబు డాకాల ధరించి"[1]

అని ఉత్తర గోపురమున కొలువున్న రావణుని వర్ణన యిందుకు నిదర్శనము—

---

1. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి. 2124.

"ఇరవొందడాకాల నింద్రాది భయద — బిరుద భీషణ గండపెండెర మొప్ప"1
గా రావణుడు మూడవసారి యుద్ధమునకు వెడలెను.

(2) రాజులు శత్రురాజులను జయించియు ఘనకార్యము లాచరించియు, తద్విజయసూచకముగా శాసన స్తంభముల నానాడు నెలకొల్పువారు.

సేతువు కట్టువేళ సుగ్రీవుడు దెచ్చిన పర్వతమును నలుడు సముద్రములో నిలిపెను. ఆ శైలరాజము-

"తన చేయు సేతు బంధమునకు రాము — ననుపమ కీర్తిని నా విభీషణుని
వినుత పట్టమునకు విశదవిఖ్యాతిఁ — దనరు శాసన స్తంభంబు మాడ్కి"2
యుండుట గమనింపఁదగినది.

సౌమిత్రి ఇంద్రజిత్తును సంహరించి,

"........యట జయస్తంభంబు నిల్పి — రాముని యొద్దకు రయమునఁజనియె"3

(3) రాజులు, ప్రజలును శత్రుసంహారార్థమై, విజయసిద్ధికై కార్యలాభాపేక్షతో ప్రయాణమగునపుడు ముందు శుభ లగ్నమును నిర్ణయించుకొని. తత్పూర్వము పుణ్యాహ వాచనము, నవగ్రహ పూజలు, హోమములు గావించి, నూత్న వస్త్ర భూషణాదుల దాల్చి పెద్దల దీవనల నొంది బయలు దేరుచుండిరి

దశరథ మహారాజు శ్రీరామచంద్రుని గాధి పుత్రునకు యజ్ఞ రక్షణార్థమై ఇచ్చినప్పటి వర్ణనము దీనికి నిరూపకము.4

(4) జనులు నిర్విఘ్నకార్య పరిసమాప్తికై గణేశుని కొల్చువారు.
వానరులు తోయధిపై సేతువు బంధింప నుద్యోగించగా. సుగ్రీవుడు -
"తరణి కులుండగు ధరణీశుపాద — సరసిజంబులకును సాష్టాంగ మెఱిగి
ఫణి రాజభూషణుఁ బరమేశ పుత్రు — గణనాథునకు నమస్కారంబు చేసి."5
అరయ జనంబైన యద్రిని కొనివచ్చినలుని చేతికందించెను.

(5) వర్షాభావ మేర్పడినపుడు, వానలు కురియుటకై జపములు హోమములు చేయువారు.
రోమపాదుడు వర్షాభావముచే తన రాజ్యమున కాటకమేర్పడినపుడు వగచి,
వరమునీంద్రుల చేత వర్ష హోమములు — పరువడి చేయించి"6నాడు
"యజ్ఞాద్భవతి పర్జన్యః"7 అనుదానియందలి విశ్వాసమునిది తెలుపుచున్నది.

---

1. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి. 7293.
2. రంగనాథ రామాయణము యుద్ధకాండము ద్వి. 1006-1007.
3. ,, ,, ,, .. 5715
4. ,, ,, బాలకాండము. ద్వి. 682-685.
5. ,, .. యుద్ధకాండము. పుట. 272. వావిళ్ళప్రతి.
6. రంగనాథ రామాయణము బాలకాండము. ద్వి. 284.
7. భగవద్గీత. అధ్యాయము. 3. శ్లో. 14.

(6) మరణించిన వారికి తిలోదకములు విడుచువారు; పిండ ప్రదానములు సేయువారు.

భరతుడు —

.... దశరథ నృపతి దహించి

తగురీతి మఱి తిలోదకములు వోసి-తగవుతోఁ బిండ ప్రదానముల్ చేసి"[1]

....

తెఱగొప్ప పండ్రెండు దినములు వలయురీతుల నడిపి వర్తించెను.

శ్రీరాముడును చిత్రకూట పర్వతముపై భరతుని వలన తండ్రి మరణ వార్తను విని, మందాకినికి వచ్చి, కృతస్నానుడై

"......తండ్రికపుడు — మొనపి తిలోదకములు వోసి వగలు

పెనగొన మఱిగార పిండిచేఁ బుణ్య — ధనుడర్థిఁ బిండ ప్రదానముల్"[2] చేసెను.

మూలమునందిచ్చట

(a) "కృతోదకంతే భరతేన సార్థం"[3]

(b) ప్రగృహ్యచ మహీపాలో జలపూరిత మంజలిం

....

ఏతత్తే రాజ శార్దూల విమలంతోయ మక్షయం॥

పితృలోక గతస్యాద్య మద్దత్త ముపతిష్ఠతు॥"

అని కేవలము 'ఉదక' శబ్దమే ప్రయోగింపబడినది.

తిలోదకముల"నిన అడవియందు శ్రీరామునకు తిలలెట్లు లభించినవని చిలిపి ప్రశ్న యుదయించును. మూలమునందు "ఉదక" తోయ శబ్ద ప్రయోగముచే నీ ప్రశ్న కాస్కారము కలుగుచు లేదు. కాని బుద్ధారెడ్డి శ్రాద్ధాది కర్మలయందు "తిలోదక ప్రదానము" కనివిని యుండుటచే దానినే ఇట గ్రహించి, జనుల యాచారమును వ్యక్తము చేసినాడు.

(7) శకునములందు సామాన్య ప్రజలకేకాక, విద్వాంసులకును విశ్వాసముమెండు. "ముఖ్యముగా నక్కల అఱపును అపశకునముగాను. కనుబంటి, గబ్బిల్లు, బల్లిపల్కులును"[5] భావిసూచనలుగాను విశ్వసింపబడుచుండెడివి. తెలుగువారు నేడును, తమ గృహములలో బల్లి పలికినపుడు "కృష్ణకృష్ణ సత్యమనుట వినుచునే యున్నాము.

(8) ప్రతివ్రతలు తమ పతులు చని పోయినపుడు సహగమనము చేయు ఆచారము తెలుగునాట అప్పటచ్చట నుండి యున్నది. మూలమున లేని సులోచనా వృత్తాంత మిందుకు నిదర్శనము.

---

1. రంగనాథ రామాయణము. అయోధ్యాకాండము ద్వి. 1478-1480.
2. ,, ,, ,, ,, ద్వి. 1077-1079.
3. దా. ప్రతి వాల్మీకి రామాయణము. అయోధ్యా-సర్గ. 76. శ్లో. 23.
4. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. అయోధ్యా కాండము. సర్గ. 102 శ్లో. 26, 27.
5. రంగనాథ రామాయణము. అరణ్యకాండము. ద్వి. 1175, 1532.
   మరియు ,, ,, కిష్కింధా కాండము. ద్వి. 48-51.

దేశమునందున్న ఈ సతీసహగమనాచారము లార్డ్‌బెంటింగ్ గవర్నరు జనరల్‌గా నున్నప్పుడు "రాజారామమోహన్‌రాయ్" ప్రయత్నముచేత 19వ శతాబ్ద ప్రారంభమున శాసన రూపమున నిర్మూలింపబడినది.

(9) హరి, హర గణేశ కాత్యాయనీ దేవ్యారాధనతోఁ బాటు సూర్యారాధన, సూర్యోపాసనము కూడ ఆనాడు బహుళ ప్రచారమున నుండెను. సూర్యుడు త్రిమూర్త్యాత్మకుడుగా భావింపబడువాడు. జంబుకుమారుని వృత్తాంత మిందుకు నిదర్శనము.

(10) నిధులను సాధించుటకై దున్నపోతులను బలియిచ్చుచుండిరి. లక్ష్మణుడు మేఘనాదుని తలను

"కలుష భావమున లంకా నిధానంబుఁ — జలమున నుగ్రుడై సాధింపఁగోరి

బలియిచ్చు కొఱకునై పటులులాయంబు — తల ద్రుంచు వైచు విధముగ"1 ఖండించెను.

(11) నిధుల నంపి పెట్టుకొని భూతంబు లుండుననియు, వానిని సాధించుట కరుగు సాధకుల కాభూతంబు లడ్డుపడుననియు ప్రజలు విశ్వసించుచుండిరి

లంకను ప్రవేశించుచున్న హనుమంతునికి

"పెన్నిధి సాధింపఁ బ్రేరిమై నరుగు — చున్న సాధకునకు నొగి నడ్డపడగ

వడి మహాభూతంబు వచ్చు చందమున — నదరి లంకిణి వచ్చి యడ్డమై నిలిచె"2

(12) అంజనము వేసి నిధులు కనుగొనువారు.

సుగ్రీవుడు-

"అలవడ నాకు నీయట్టి యంజనము — గలుగుటఁ గంటి రాఘవ నిధానంబు"3

అని తనకు శ్రీరామ సఖ్యమును కలిగించిన హనుమంతుని ప్రశంసించి యున్నాడు.

(13) అస్పృశ్యతయు నాడధికారములో నుండెను. వాసిష్ఠ శాపమున మాలయైన త్రిశంకుడు

"ఒదవిన భయమున నొయ్య మెట్టుచును — నొదుగుచు జనులకు నోసరించుచును"4

పోయెను-

(14) కోటయందు గస్తీ తిరుగువారు 'తలార్లు' అని పిలువ బడుచుండిరి. హనుమంతుడు లంకలో —

"వడిఁగోట కావలివారుఁ దలార్లుఁ — బొడఁగానకుండ"5 సంచరించెను-

(15) శూన్య హస్తములతో జనులు మహాత్ముల వద్దకు పోవువారు కారు.

సుగ్రీవుడు పంపగా రామలక్ష్మణుల యొద్దకు వటు రూపమున వచ్చు ఆంజనేయుడు-

"అనుపమంబగు శూన్య హస్తంబు తోడఁ — జని మహాత్ములఁ గానఁ జన దటుగాన

---

1. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి. 5690-5691.
2. ,, ,, సుందర ,, ద్వి. 45, 46.
3. ,, ,, కిష్కింధా కాండము. ద్వి. 196.
4. ,, ,, బాల ,, ద్వి. 1669.
5. ,, ,, సుందర ,, ద్వి. 68.

నల రామునకు నియ్య నర్హమైనట్టి — ఫల మొక్కటపుడు చేపట్టి వేడుకను"[1]
నరుదెంచెను.

(16) సైనికులు శత్రుదుర్గముల నాక్రమించి నానావిధ ఘోరకృత్యములు చేసెడివారు.

రావణుని పాతాళహోమ వేళ లంక జొచ్చిన వానరులు చేసినట్టి బీభత్సము ఇందుకు ప్రతిరూపము [2]

11. ఆహార విహారములు :—

(1) సంపన్న గృహస్థులును సామాన్యులును నుసాధారణముగా

"మిలమిల మెఱసెడి మృదుతరాన్నము, పండ్లు, నేయి, పప్పులు, అప్పములు శాకములు, శర్కర, వెరుగు, పాయసము, నానవాలు, జుంటితేనెలు, శిఖరులు (సిగరలు), తియ్యచారులు, పానకము, బొబ్బట్లు, అంజళ్ళు, పచ్చళ్ళు, జున్ను, వడుగులు, వడియములు, ఊరుగాయలు, సెవె పాసెములు, లడ్వములు, అతిరసములు, మండెగలు, వెన్నలు, చీని చక్కెరలు, మద్యములు మాంసములు, పేరుచెప్పరాని భక్ష్యములు భోజన పదార్థములుగా వాడుచుండిరి.

భరద్వాజుడు శ్రీరామునకు చేసిన విందు,[3] పట్టాభిషేకానంతము శ్రీరాముడు వానరదైత్యులకు చేసిన విందు.[4] వసిష్ఠుడు విశ్వామిత్రునకు తత్సైన్యమునకును చేసిన విందు,[5] వేశ్యలు ఋష్యశృంగుని కొసంగిన ఫలములు పదార్థములు[6] ఆలనాటి ప్రజల ఆహార పదార్థములను సూచించుచున్నవి —

(2) బ్రాహ్మణులకు ధర్మసత్రములందు ఉచితముగా భోజనములు పెట్టబడుచుండెడివి.

ఖరుని సైన్యములు మడసిన తర్వాత భూతభేతాళములు —

"దండి రాముని రణధర్మ సత్రమున — వండి నారిదె రండు వరుస భుజింప"[7]

నని పరస్పరము పిలుచుకొని విందుచేసి కొన్నవి

(3) సంపన్నులు కర్పూర తాంబూలములను వేసికొనువారు. సుగంధ మాల్యములను సిగలందు ముడుచుకొనువారు.[8]

(4) ప్రత్యేకముగా విప్రులు అన్నము, పప్పు నేయి, శాకములు, సేవెపాసెములు, పిండివంటలు తియ్యనినీరు మొదలగు శాకాహారములను సేవించువారు; కాని మద్యమాంసాదుల గ్రహించువారు కారు[9]

---

1. రంగనాథ రామాయణము. కిష్కింధా కాండము ద్వి. 83, 84.
2. ,, ,, యుద్ధకాండము. ద్వి. 7119-7136.
3. ,, ,, ,, ,, ద్వి 8500-8503.
4. ,, ,, ,, ,, ద్వి. 8808-8810.
5. ,, ,, బాలకాండము. ద్వి. 1570-1572.
6. ,, ,, బాలకాండము. ద్వి. 346-348.
7. రంగనాథ రామాయణము. అరణ్యకాండము. ద్వి. 570.
8. ,, ,, యుద్ధకాండము ద్వి. 8821, 8822.
9. ,, ,, అరణ్యకాండము. ద్వి. 573-577.

బ్రాహ్మణేతరులు మద్య మాంసములు గ్రహించుచుండిరి.

III. క్రీడా వినోదములు.

(1) వినోద విజ్ఞానార్థము దారమును చేతఁ బట్టుకొని యాడించు తోలుబొమ్మల యాటలు ఆడఁబడు చుండెను.

శూర్పణఖ రాముని జూచి మోహించినది. రాముని మాటపై లక్ష్మణుని సమీపించినది. అతని మాటపై మరల రామునిఁ జేరినది. ఇట్లు తమ్ముడన్నను, అన్న తమ్ముని జూపగా,

"....త్రిమ్మరి తనకోర్కి తీదీపులాడ

మఱి మన్మథుని సూత్ర మహిమచేఁ దిరుగు — తెఱ బొమ్మయో యన"[1]

శూర్పణఖ పేరాసతోఁ దిరిగినది. ఇచట కవి శూర్పణఖను "సూత్రమహిమచేఁ దిరుగు తెఱబొమ్మ" యని యుత్ప్రేక్షించుట గమనార్హము—

(2) కీలుబొమ్మలాటలును ఆనాడు ప్రచారములో నుండినవి.

అంగద మహాకాయులు

"కీలు బొమ్మలు పోరు క్రియలును దోప — వాలిసుగ్రీవుల వడువున"[2]

మల్లయుద్ధము చేసినారు

(3) బాలురతి ప్రీతితో అనాడు కఱ్ఱ బంతియాట నాడుచుండిరి. ఇది ఈనాటి Hockey లేక Cricket వంటి ఆట యనవచ్చును.

శ్రీరామ చంద్రుడు బాల్యమునందు ఆప్తులు తాను

"నిండారు ప్రేమతో నెచ్చెలు గట్టి — చెండును దండంబు చెలువొప్పఁబట్టి

తరమిడి యాడెడు"[3]వాడు

ఇచట "చెండు, దండము"లు Ball, Bat లను తలపింప చేయును.

(4) పెంపుడు పశుపక్ష్యాదులను మచ్చుగా చేసి, ఉచ్చుపెట్టి సజాతీయ పశు పక్ష్యాదులను వేటాడుచుండిరి.

వారవనితలు ఋష్యశృంగుని

"ఒనరెడు దీమంబు లొకవింత మృగముఁ గొని వచ్చు తెఱగున గొనివచ్చి"నారు[4]

శ్రీరాముడు తన్నధిక్షేపించిన వాలికి

"అకలంకులై వేటలాడెడి వారు - నొకటి దీమమునొడ్డి యొకటి చేయుదురు"[5] (జంపుదురు.)

అని సమాధానము చెప్పినాడు.

"దీమ" శబ్దమునకు పశు పక్షులం బట్టుటకుఁ బెంచిన సజాతీయ పశుపక్షులు అనియు "ఎఱియుంచిన

---

1. రంగనాథ రామాయణము. అరణ్య కాండము. ద్వి. 435-436.
2. ,, ,, యుద్ధకాండము. ద్వి. 2994.
3. ,, ,, బాల ,, ,, 591, 592.
4. ,, ,, ,, ,, , 367.
5. ,, ,, కిష్కింధా కాండము, ద్వి 569.

బోను" అనియు నిఘంటువులందు అర్థమీయబడినది.

(ii) రాజులు పట్టపుటేనుంగుపై-పరివార మిరువైపుల ఛత్రచామరములను బట్టుకొనగా, నలువైపుల సేనలు గొల్చిరాగా ఊరేగువారు.

"పట్టపు టేనుంగుపై నొప్పు దెచ్చి — పెట్టె, లోకములెల్లఁ బ్రీతిఁ గీర్తింప
ఛత్ర చామరములు సరిదాల్చి పొలిచి — శత్రుఘ్నుడును దాను సద్భక్తి గొలిచి
చెలగి నల్దిక్కుల సేనలు గొలువ"[1]గా

అయోధ్యకు వచ్చెను. మూలమునందు-భరతుడు పాదుకలను తలపై పెట్టుకొని రథముపై వచ్చినట్లున్నది."[2]

IV. వస్త్ర భూషణాదులు :—

(1) "బాలురకు చెవులందు ముత్యాలు కెంపులు తుదలోఁ గూర్చి నిర్మించిన మద్దికాయలను శిరఃపురోభాగమందు శ్రీకరాకృతిగానున్న రావి రేకులను, వక్షస్థలమందు వజ్రాలతోఁ గూడిన పులిగోళ్ళను, నడుమునందు పచ్చలు తాపిన గంటల మొలనూళ్ళను, పాదములందు మువ్వలందెలను ఆభరణములుగా ధరింపఁ జేయువారు."[3] బాలురీ యలంకారములతో ముద్దులు గులుకుచు మోహనాకృతుల నొప్పి తలిదండ్రుల కెంతయో మురిపము గలిగించుచుండిరి.

(2) "సంపన్న గృహిణులు బంగారు సరిగ గన్పడు కుట్టు పనుల కంగుల అవికలు, మెడలో పచ్చ బన్న సరములు, ముత్యాల హారములు, నాసాగ్రములందు ముక్కరలు, చెవులందు మగరాల తళుకుఁ గమ్మలు, కట్టాణి బొగడలు, కైపుల బవిరలు, చేతులందు పచ్చల కడియములు నడుమున మొలనూళ్ళు, పాదములందు అందియల్ మొదలైన భూషణములు తాల్చుచుండిరి. కన్యకలు పావడలపై జాళువా సరిగ కొంగుల దుకూలములు గట్టుచుండిరి. తలలందు జాజి క్రొవ్విరులు తురుముచుండిరి"[4]

(3) సామాన్య స్త్రీలు మెడలందు సంకుపూసల పేర్లు ధరించుచుండిరి [5]

(4) స్త్రీలు దేహమునకు, ముఖమునకు సువాసనకై ఒకానొక బూడిదె పూతను నలదుకొనువారు. ఇది ఈనాటి "Snow-Powders" వంటి దనవచ్చును.

ఋష్యశృంగానయనమునకు పంపబడిన వేశ్యల "మేనిబూడిదె పూత మేల్తావి గొట్టు"[6]చుండెను.

---

1. రంగనాథ రామాయణము. ఆయోధ్యా కాండము. ద్వి. 1793-1795.
2. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. అయోధ్యా. సర్గ. 113. శ్లో. 1.
"తతశ్శిరసి కృత్వాతు పాదుకే భరతస్తదా।
ఆరురోహ రథం హృష్ట శ్శత్రుఘ్నేన సమన్వితః॥
3. రంగనాథ రామాయణము బాలకాండము. ద్వి. 581-585.
(అధ్యాత్మరామాయణమునందీ యర్థముగల శ్లోకములు. 44-45. సర్గ 3. బాల.)
4. రంగనాథ రామాయణము. బాలకాండము. ద్వి 2313-2221.
5. రంగనాథ రామాయణము అరణ్యకాండము. ద్వి. 581.
6. ,, ,, బాలకాండము. ద్వి. 328.

(5) వైష్ణవ సన్న్యాసులు (జీయర్లు) "నుదుట ఊర్ధ్వ పుండ్రములు. వక్షమున ఛిన్ముద్రలు, మెడలో తులసి పూసల పేరులు, కాళ్ళకు పాదుకలు (బావలు), తలపై ఎండవానలు తగులకుండ చింపి గొడుగు, జుట్టుముడి (శిఖ). కుడిచేత జపమాల, ఎడమచేత దండము, కమండలవు" దాల్చి కాషాయ వస్త్రధారులై సంచరించు చుండిరి. నోట "హరిహరి" యని పలుకుచుండిరి.

సీతాపహరణార్థమై వచ్చిన రావణుని సన్న్యాసి వేషము వైష్ణవ సన్న్యాసుల వేషమునకు ప్రతిబింబము.[1]

(6) మాలవారు నీలివస్త్రములు జుంజురు శిఖ, లోహభూషణములు దాల్చుచుండిరి.

వాసిష్ఠ శపుడైన త్రిశంకుని మాలరూపము ఇందుకు ప్రతిరూపము.[2]

ఇట్లు సూక్ష్మముగా పరిశీలించినపుడు, ఆయా వర్ణనాలంకార రూపమున బుద్ధారెడ్డిచే సంగ్రహింపబడిన దేశీయాచారాదులు గుర్తింపనగును,

"ఏ కవియు తనకాలమునాటి తన జాతి సంప్రదాయములను ఆచార వ్యవహారములను కథలో చొప్పింపక మానడు అట్టి కల్పనలు మూలకథకు భంజకములు కానప్పుడు హృదయంగమములును, ఆదరణీయములును అగును."[3] అని చెప్పిన పింగళి లక్ష్మీకాంతంగారి అభిప్రాయము సర్వధాయథార్థము. "తెలుగువారి నోట పదములుగా పాటలుగా, కీర్తనలుగా, నలిగి సంఘమున వేరు నాటుకొని పోయిన పద కవిత్వఖని నుండి కొన్ని జాతి రత్నముల నెన్నుకొని సానలదీర్చి తన రామాయణ మహామాలలో కూర్చి",[4] దేశీయాచారములను, ఆహార విహారాదులను సందర్భానుగుణముగ పొందుపఱచి బుద్ధారెడ్డి తన రామాయణమునకు దేశి తనము నాపాదించినాడనుట ఎంతయో సమంజసము సముచితము, యథార్థమునునై యొప్పియుచున్నది.

భాష :—

రంగనాథ రామాయణము దేశి కావ్యమనుటకు కవి యిందుపయోగించిన భాషయు మిక్కిలి దోహదకారిగా నున్నది. కావ్యాది పీఠికయందు —

"పదము లర్థంబులు భావముల్ గతులు — పదశయ్య లర్థ సౌభాగ్యముల్ యతులు"[5]

అనియు, ప్రరికాండాంతమునందును —

"అసమాన లలిత శబ్దార్థ సంగతులు — రసికమై చెలువొందు రామాయణంబు"[6]

అనియు కవి యుగ్గాడించియున్నాడు ఇంతేకాక, ఇతడు తనకు "ఆంధ్రభాషాధీశ నిభుడు" అను విశేషణమును తగిలించుకొని యున్నాడు.

కవి చెప్పినట్లుగానే గ్రంథమంతయు తెలుగు లలిత పదములతోను పద శయ్యాసౌభాగ్యము

---

1. రంగనాథ రామాయణము అరణ్యకాండము. ద్వి 965-973.
2. ,, ,, బాలకాండము. ద్వి. 1663-1665.
3. ఆంధ్ర సాహిత్య చరిత్ర. పుట. 18 .
4. ,, ,, పుట. 173.
5. రంగనాథ రామాయణము. బాలకాండము. ద్వి. 100.
6. ,, ,, ,, ద్వి. 2474.

తోను అర్థగాంభీర్యముతోను నొప్పుచున్నది. ఇందు దేశి పదములు పలుకుబళ్ళు, సామెతలు ఎక్కువగాను ప్రయుక్తము లైనవి. ఇక ఉపయుక్తములైన సంస్కృత పదములును, సమాసములును కూడ రసోచితముగా, తెలుగు పదముల కూర్పురీతి రమ్యత కనుగుణముగానే యున్నవి. మచ్చునకు చూడుడు —

(1) గంధకస్తూరికా కలితాంబుపూర — గంధిల సకల మార్గ ధరాంగణంబు"[1]

(2) క్రతుహోమ తత్ధూమ కబళిత వ్యోమ
కృతకాంబుదస్తోమ కేవల ముదిత — కృత లాస్య విపిన బర్హిణ బర్హ జాల
రచితాంతరాంతర రత్నవిచిత్ర — ఖచిత తోరణ పదక్రమమునై యొప్పు",

(3) "రణభేరి వేయించి రత్న శైలాభ — గణనీయ శబలాశ్వ కలిత వైడూర్య
మణికూబర సువర్ణమయ చక్ర దశక — రణజయ ప్రద ధనుర్బాణాసి పూర్ణ
రణిత కింకిణిమైన రథమెక్కి వెడలె"[3]

(4) "నూత్న శృంగార మనోహరాకార — రత్నవితర్దికా రమణీయ హార
రంగ వల్లీహార రంజిత ద్వార — రంగ ధ్వజోదార రమ్య పటీర
నీర పూరిత మార్గ నిరుపమాకార — పౌర సంచార సంభరితంబు గాగ"[4]

పాల్కురికి సోమనాథుడు

"ఉరుతర గద్య పద్యోక్తుల కంటె — సరసమై పరగిన జానుఁ దెనుంగు"[5]

అనియు

ఆరూఢ గద్య పద్యాది ప్రబంధ — పూరిత సంస్కృత భూయిష్ఠ రచన
మానుగా సర్వ సామాన్యంబు గామి — జాను తెనుగు విశేషము ప్రసన్నతకు"[6]

అనియు

"తెలుగు మాటలనంగ వలదు; వేదముల — కొలదియకాగ జూడుడు"[7]

అనియు,

అల్పాక్షరముల ననల్పార్థ రచన — కల్పించుటయ కాదే కవి వివేకంబు"[8]

అనియు నుద్ఘోషించినను, "నూటికి ఏఁబది పాళ్ళకు తక్కువ కాకుండ తత్సమ పదములన్ను దీర్ఘ సమాసములను ప్రయోగించుటకు"[9] వెనుకాడలేదు. "కవితయు ఒక్కొక్కమారు నిరర్గళ

---

1. రంగనాథ రామాయణము. బాలకాండము. ద్వి. 2149.
2. ,, ,, అయోధ్యాకాండము. ద్వి. 1528-1530.
3. ,, ,, అరణ్య కాండము. ద్వి. 484-486.
4. ,, ,, కిష్కింధా కాండము. ద్వి. 800-702.
5. బసవ పురాణము. ఆశ్వాసము. 1. పీఠిక-పుట-8
6. పండితా రాధ్యచరిత్ర. పీఠిక.
7, 8. బసవ పురాణము. ఆశ్వాసము. 1. పీఠిక-పుట-9.
9. పింగళి లక్ష్మీకాంతము. ఆంధ్ర సాహిత్య చరిత్ర- పుట-120.

ధారావేగమున బహుప్రౌఢముగాను, కొన్నిచోట్ల సరళమై సామాన్య జన గ్రాహ్యముగను, మరికొన్ని చోట్ల పేలవముగను సాగినది.[1]

కాని, బుద్ధారెడ్డి తన పాండిత్య ప్రదర్శనకై పైన చూపినట్లు యక్కడక్కడ దీర్ఘదీర్ఘ సంస్కృత సమాస భూయిష్ఠ రచనలు గావించియున్నను, అవియు నాతికఠినమై అన్వయ సౌలభ్యము కలిగి యొప్పుచున్నవి. పరిశీలింపగా, సంస్కృత పదములు స్వల్పముగను, తెలుగు దేశి పదములు మెండుగను ప్రయుక్తమైనట్లు గోచరించును.

మచ్చునకు చూడుడు—

1. "ఏనింక మాతండ్రి కేమని వగతు-ఏను రాముని మొగం బేమని చూతు
ఎంతలోఁ గుందెనో యిచ్చలో రాము-డెంత కోపించెనో యేచి లక్ష్మణుడు
ఎంత దూరెనొ కాన కేగుచో సీత-ఇంత కేమయ్యెనో యింతి కౌసల్య"[2]

2. "తిట్టుపాటున కోడి తివిరి నా కొడుకు-పట్టంబు మాన్పింపఁ బనిచెఁగా కధిప
సొంపేది రాముని స్రుక్కక కైక-చంపుమన్నను బట్టి చంపవే నీవు
పెద్దకాలము నాకు బిడ్డలు లేక-పెద్దయు శోకించి పెక్కులు నోచి
కడపట నొక్కనిఁ గని యేను గొంత-యుడుకాఱియున్నచో నుండనీవైతి."[3]

ఇట్లీ రంగనాథ రామాయణమునందు "దేశి రీతిలోని తియ్యందనము, మార్గపద్ధతిలోని గాంభీర్య (గభీర) మును చక్కగా"[4] మేళవింపఁబడినవి. సరళమైన అలతి యలతి లలిత పదములు ముద్దు ముచ్చటలు గొల్పుచున్నవి. ఇందు దేశి పదములు, పలుకుబళ్ళు, జాతీయములు, సామెతలు పుష్కలముగా "ఉద్దిష్టార్థ భావములకు దగినట్లు కడు నైపుణ్యముగా"[5] ప్రయుక్తమైనవి

ఈ తెలుగు పదములను రెండేసి, మూడేసి, నాల్గేసి అక్షరములతో కూడినవిగా వింగడింప వచ్చును.

I తెలుగు పదములు :—

i) రెండేసి అక్షరముల పదములు-

జంగ, ఎమ్మె,[6] బూమె[7] జాడు లావు, త్రుంగు, మొ॥నవి.

ii) మూడేసి అక్షరముల పదములు-

అలవు, ఒఱపు, వలతి, తిగుచు, అడరు మొ॥నవి.

---

1 శిష్టా రామకృష్ణశాస్త్రి. ఆంధ్ర వాఙ్మయచరిత్ర సర్వస్వము. పుట-578
2. రంగనాథ రామాయణము. అయోధ్యా కాండము. ద్వి. 1412-1414.
3. రంగనాథ రామాయణము. అయోధ్యాకాండము ద్వి. 1187-1190.
4. తూమాటి దొణప్ప. తెలుగులో కొత్త వెలుగులు పుట-28.
5. మల్లంపల్లి సోమశేఖర శర్మ- పీఠిక. పుట. 39. రంగనాథ రామాయణము. రాయల్ అండ్ కో ప్రతి.

6. అందము, విలాసము 7. వంచన, మాయ.

iii) నాల్గేసి అక్షరముల పదములు-

గవుసెన,[1] చప్పరము, ఉప్పరిగ,[2] ఊడిగము, కరువలి, వాలాయము, మగటిమి, అఱిముఱి,[3] కనుకని[4] ఇత్యాదులు.

iv) ఐదేసి అక్షరముల పదములు—

కలువడము,[5] ఉమ్మలికము,[6] అడియాలము[7]

II. పలుకుబళ్ళు :—

కొన్ని విడివిడి పదముల కున్న అర్థముకంటె వాని కలయికతో విభిన్నార్థ స్ఫూర్తి కలిగించే పదబంధమును"[8] పలుకుబడి యందురు. దీనినే నుడికారము, జాతీయము అని యందురు. ఇవి నామముపై నామముగాని, నామముపై ధాతువుగాని, ధాతువుపై ధాతువుగాని చేరుటచే నేర్పడి, పూర్వార్థమును గోలుపోయి నూతనార్థము నొసంగును. వీనిలో ఎక్కువగా శబ్దమునకు పల్లవము (ధాతువు) చేరగా నేర్పడిన రూపములు- శబ్దపల్లవములుండును. ఎక్కువగా నాలుగేసి అక్షరముల పలుకుబళ్ళే కనిపించును.

1) నామముపై నామము చేరి యేర్పడిన నానుడి :—

మగపొడి, ముక్కుముల్లు, మొగసాల, బయలు మాటలు- దిడ్డివాకిలి, చుక్కవాలు, ఓరంత ప్రొద్దు మొదలగునవి.

2) నామముపై ధాతువు చేరగా నేర్పడిన పలుకుబళ్లు :—

పొదిగొను, తలగొను చుఱపుచ్చు, వలగొను, కనుగ్రాము, కైసేయు, బమ్మెరవోవు, పనివడు, ఔడులుదీడు తఱిగొను మొ॥నవి.

3) ధాతువుపై ధాతువు చేరగా నేర్పడిన నానుడులు :—

కాడిపాఱు, తోడితెచ్చు, పోనాడు, కొనియాడు, తోడిబడు, అరుగుదెంచు, ఇత్యాదులు

ఈ పదబంధములను (పలుకుబళ్ళను) మూడేసి, నాల్గేసి, ఐదేసి అక్షరముల గమిగా మరొక రీతి విభజన చేయవచ్చును

1) మూడేసి అక్షరముల పలుకుబడులు:—

ఈడేరు, కైకొను, నుగ్గాడు, మోపెట్టు, మాఱాడు, చేకొను, మెండోడు, తండారు, త్రెక్కొను మేకొను మొ॥నవి.

2) నాలుగేసి అక్షరముల పలుకుబడులు :—

తుదమీఱు, తరమిడి, నఱిముఱి బడబాకి, మగపాడి, ఇరవారు, కిచకొట్టు, పొనుపడు, ఎడపడు మొ॥నవి.

3) ఐదేసి అక్షరముల పలుకుబడులు :— ఇవి తక్కువ. పాడిపంతము. తొగలువెట్టు, దండునడుచు, బమ్మెరవోవు, మేలుకట్లెత్తు, ముచ్చటపడు, దిడ్డివాకిలి మొ॥నవి.

---

1. ఒఱ 2. మేడ 3. సంభ్రమము 4. భయము
5. మేలుకట్టు 6. దుఃఖము 7. గరుతు.
8. చెలమచెర్ల రరంగాచార్యులు "ఆంధ్ర శబ్ద రత్నాకరము" (తెలుగు-తెలుగు నిఘంటువు) ద్వితీయ సంపుటము. పుట-705.

4) ఆరేసి అక్షరముల పలుకుబడులు :— ఇవి చాల తక్కువ. బయలు మాటలు, తోడ్పాటుమేకొను, నఱకుడువడు మొదలగునవి.

III సామెతలు-జాతీయములు

సామెతలకు సరియైన నిర్వచనము కల్పించుట కష్టము, ఎట్లు చెప్పినను అవ్యాప్తి, అతివ్యాప్తి దోషములు పట్టును. కావున స్థూలముగా "ఆకోట ఈనోట నలిగి ఎక్కువ వాడుకలో నున్న జనోక్తిని సామెతగా పరిగణించుట ఇప్పటికి యుక్తిసహజముగా కనిపించుచున్నది."[1] లోకోక్తి, జనోక్తి, నానుడి అను పదములను ఇంచుమించు సామెత యను నర్థమందే వ్యవహరింప బడుచున్నవి. ముఖ్యముగా సామెత యనగా, "జన వ్యవహార క్షుణ్ణమైన ఉక్తి అనగా నలుగురి నోట నలిగిన మాట"[2] యని యర్థము.

రంగనాథ రామాయణమునందు తెలుగుదేశ జన వ్యవహార క్షుణ్ణమైన సామెతలు, నానుడులు సందర్భానుసారముగా, ఔచిత్యభంగముకాని రీతి చాలగా వాడబడినవి.

1.	కొఱవిచే తల గోకుకొను	2.	కన్ను బోయెడునట్టి కాటుక గండె
3.	తన్ను మాలినయట్టి ధర్మంబు గలదె	4.	అందని పండ్లకు నఱుసాచు
5	లీల నున్నది యూరు లేనిది పాడు	6.	వాలికి నుట్టు వడియంబు
7.	తారుపెట్టిన చెట్టుఁ దారె త్రుంపుమరె	8.	కడిమాడ సేయ కుడుచు
9.	కొసరి యడుగు	10.	పులినాకి విడుచు
11.	మొగము చేటంతగాఁ జేయు	12.	అడుగులకు మడుగులు వైచు
13.	నేల యీనిన యట్లు	14.	మంటి పాలగు
15.	చేదు మ్రింగు	16.	ఉట్టి కట్టుక యూగు
17.	మీసముల నుయ్యాల లూగు	18.	కొండంత గెలుపు
19.	నుగ్గు నూచము సేయు	20.	కొండతోఁ దగరు డీకొనిన చందమున
21.	పడుగుఁ బేకయుఁ బోలె	22.	కరువలి సుడిగొన్న కారాకువోలె

ఇత్యాది సామెతలు జాతీయములు బహుళముగా కనిపించును. ఇంతేకాక, తోలితొప్పరలాడు, పెటిలి పేడెత్తు, మట్టి మల్లాడు, తీదీవులాడు, చెండుబెండాడు, పెఱి పెటాడు వంటి జంట పద క్రియా పదములు పెక్కులు వాడబడినవి.

IV సమాసములు

రంగనాథ రామాయణమునందు శుద్ధ సంస్కృత సమాసములతోఁ బాటు అలతి యలతి తెలుగు పదములతోఁ గూర్చిన సమాసములును పెక్కులు వాడబడినవి. వీనిని ఈ క్రింది విధముగా విభజించ వచ్చును.

1. రెండు పదముల సమాసములు:—

a) దేశ్యము + దేశ్యము :-

---

1. తెలుగు సామెతలు. పీఠిక. పుట-2 (సాహిత్య అకాడమీ)
2. ,, పీఠిక. పుట-3 (,,)

అంపతండము, తమ్మిచూలి, గాలిసోకులు, పలుకుఁ దొయ్యలి, రాచపాడి, వేని తొడవులు, పీనుగుపెంట, సోరణగండ్లు మొ॥నవి.

b) సంస్కృతము + దేశ్యము :-

గుహవాత, సీతకొప్పు, మీనాక్షి తొడవు, మునిపల్కులు, కాంతికరడులు, ధూర్జటి వాలు, శరనిధినురువు. (ఇవి తత్సమములతో తెలుగు పదములు సమసించుటచే నేర్పడినవి కాని వైరి సమాసములు కావు).

c) దేశ్యము + సంస్కృతము :—

తోకరోమము, కోతికీటంబు, చెనటికీటము, నలువ బాణము, వేడ శిఖరము, కారుమహిషము, రేరాజు, పైడిమృగము, పేదమానవుడు, నిప్పుకణములు, వాడిబాణము, కాపు జనులు, రిత్తరథము, ఆటప్రాయము మొ॥నవి.

2. మూడు పదముల సమాసములు :—

i) దేశ్యము + దేశ్యము + దేశ్యము:-

ఇఱికౌనులాగు, వెడదతొమ్మబెడంగు, చొఱమీలవాలము, పసిడి పూపొదలు, ఎఱమంట తునుకలు, చిగురు మానికపు సొమ్ములు, మిన్నేటి నురుపు మొ॥నవి.

ii) సంస్కృతము + సంస్కృతము + దేశ్యము -

నా కేశవైరి తమ్ముడు, కాలాహితల, ఇందువదన చూపులు, ధర్మదేవత మాట ఇత్యాదులు

iii) దేశ్యము + దేశ్యము + సంస్కృతము:-

కడువాడి ఖడ్గము, క్రొవ్వాడి శరము, నగుమోము కళ

iv) సంస్కృతము + దేశ్యము + దేశ్యము:-

పట్టపేనుంగు కొమ్ము, పతిచేతి వాలు మొ॥నవి.

v) దేశ్యము + సంస్కృతము + సంస్కృతము :—

రే రాజు కళ

vi) సంస్కృతము + దేశ్యము + సంస్కృతము :-

పతి వ్రేలి ముద్రిక.

ఇట్లు దేశ్య పదములతో, తత్సమ దేశ్య పదములతోఁ గూడిన అలతి యలతి సమాసములే రంగనాథ రామాయణమున ప్రయోగింపబడినవి. వైరి సమాసములు లేవనవచ్చును.

అచ్చ తెనుగు కావ్యములలో వాడబడినట్లు :-

1. పెద్ద తామర కెంపు బిగి పట్టియలు.1
2. వేల్పుమల వింటి దేవర.2

వంటి నాల్గేసి, ఐదేసి, ఆరేసి కృత్రిమ పదములతో కూడిన సమాసములు ఇందు కానరావు.

---

1. పొన్నిగంటి తెలగనార్యుడు. యయాతిచరిత్ర. ఆశ్వా 1 పద్య. 97.
2. ,, ,, ఆశ్వా 2 పద్య. 36.


అన్యదేశీయములు :-

తన కాలమునందు వాడుకలో నున్న అన్య దేశ్య పదములను కూడ వాడుటలో బుద్ధారెడ్డి వెనుకాడలేదు.

అపరంజి, కైపుసారాయి, జాళువా, తబుకు, పౌజు, ఖాపురే, అవధారు, కుందనము ఇత్యాదులు.

ఇట్లు తెనుగు పదములను, పద బంధములను, సామెతలను, అన్య దేశ్యములను సాధ్యమైనంత ఎక్కువగా వాడియు, లలితములైన అలతి యలతి తెలుగు పదములను చిఱుసమాసములను చొప్పించియు, బుద్ధారెడ్డి తన కావ్యమునకు దేశీయత నలవఱుచుటలో కృతకృత్యుడైనా డనుట నిస్సందేహము.

పై రీతిగా "ఛందస్సు, ఇతివృత్తము, భాష" అను మూడింటియందునుదేశీయత పొందుపరచఁ బడి రచితమైన రంగనాథ రామాయణము దేశి కావ్యమనుట సముచితమే.



రంగనాథ రామాయణము-వైష్ణవ తత్త్వము.

వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణము విష్ణు పారమ్య బోధక గ్రంథము. వైష్ణవులైన రామానుజ మతస్థులు తమసంప్రదాయ రహస్యార్థముల నెన్నింటినో శ్రీమద్రామాయణము వ్యంగ్యముగాఁ దెలియఁజేయుచున్నదని లక్ష్యలక్షణ సమన్వయము చేసి తమసిద్ధాంత సంప్రదాయ గ్రంథములందు బాగుగా విశద పఱచియున్నారు. శ్రీ మద్రామానుజుల వారు క్రీ.శ. 11, 12 శతాబ్దులందు వెలసి విశిష్టాద్వైత మతమును పునరుద్ధరించి, గీతా-బ్రహ్మసూత్రభాష్యాది గ్రంథముల ద్వారా బహుళ ప్రచారము గావించి దక్షిణ దేశమునందు వైష్ణవ మతమునకు ఒక ప్రత్యేకతను గలిగించినారు. వారి యనుయాయులైన యాచార్యులెందరో తమిళ దేశమునుండి ఉత్తర దిశగా సంచారము చేయుచు, మత సంప్రదాయములను ప్రచారము చేయుచు, తెలుగుదేశమునకుఁ గూడ వచ్చి వానిని వ్యాపింపఁ జేసినారు.”[1] వీరు భగవద్విషయము (తిరువాయ్ మొళి) ఇత్యాది ద్రావిడ గ్రంథములే కాక రామాయణాదులను గూడ కాలక్షేపము చేయుచు వైష్ణవ మతమును ప్రచారము చేసినారు

అప్పటికే తెలుగు దేశమున మతసహనము నపేక్షింపనిదియు, బసవేశ్వర స్వోపజ్ఞమునునైన వీరశైవము పాల్కురికి సోమనాథాదులచే బహుళముగా ప్రచారము గావింప బడుచుండెను. అనేకులు వీరశైవులై, తిర్యక్పుండ్ర ధారులై భవిజనుల నీసడించుచు విద్వేషమును పెంచుకొనుచు, ఒక్కొక్కప్పుడు రక్తపాతమునకును వెనుదీయకుండిరి. ఇట్టిపరిస్థితులలో బసవపురాణ. పండితారాధ్య చరిత్రాది గ్రంథములకు ప్రతిభటముగా శాస్త్రీయమైన, సర్వారాధ్యమైన నేదేనొక వైష్ణవగ్రంథమును పండిత పామరజన హృద్యముగా రచించి, వీరశైవమునకు ప్రతిగా వైష్ణవమును ప్రచారము చేయవలెనని అలనాటి వైష్ణవాభిమానులైన కవులు పండితులు తలంచియుండ వచ్చును కాని ఎవరు ముందుకు రావలెనన్నది ప్రశ్న? దానికి కాలము, దైవము అనుకూలముగా నుండవలెను దేశ ప్రభువుల తోడ్పాటు కూడ నెంతయో అవసరము. అది క్రీశ. 14వ శతాబ్దమున ఫలపూర్ణమైనది. ఇదియే రంగనాథ రామాయణము.

రంగనాథ రామాయకు కర్తృత్వ విషయమున వాదోపవాదములున్నను, అతడు రామానుజ మతస్థుడనుట నిస్సందేహము. “ప్రతి కవియు తన మనస్తత్త్వమునకును మతాభిమానమునకు అనుగుణమైన గ్రంథమునే చేఁబట్టును: కాని తద్భిన్నములైన వానిని గ్రహింపడు; కాన రంగనాథ

---

1. వైష్ణవమును ఆంధ్ర దేశమున విస్తరింపఁ జేసిన యాచార్యులలో పరాశరభట్టు అగ్రగణ్యుడు. గోదావరీ తీరమున నివసించు పలువురు సామంత రాజులకు శ్రీవైష్ణవ దీక్షనిచ్చి శిష్యులఁ జేసికొనెను.”

(నెలటూరి వెంకట రమణయ్య-ఆంధ్రుల చరిత్ర-ఘట్టములు- భారతి-అక్టోబర్ 1953)

రామాయణ కర్త వైష్ణవ మతాభిమాని యని భావించుట దోషమెన్నటికిని గాదు"1

"నన్నయ కూడ భారతాంధ్రీకరణమును వైదిక మతాభిమానులగు చాళుక్య రాజులు వైదిక మత వ్యాపనము కొఱకు ప్రోత్సహించుటచే ప్రారంభించినాడు;"2 అనియు

"బౌద్ధ జైన మతములు కుమారిల భట్టుని ఖండనముతో కొంత సన్నగిల్లిన కాలములో వైదిక మతధర్మములను ప్రజాసామాన్యమునకు సులభముగా తెలియునట్లు ప్రకటించుట అత్యంతావశ్యకమని గుర్తించియే రాజరాజు మహాభారతమును తెనిగింపుమని నన్నయను కోరెను. వైదిక మతధర్మమును ప్రతిపాదించుటలో వేదశాస్త్రములకు తర్వాత మహాభారతమే గొప్ప అధికారముగల గ్రంథము..... (కావున) వేదమంతటి ఉన్నత స్థానము గల మహాభారతమును ప్రజాక్షేమమును గోరి నన్నయ భట్టారకుడు ఆంధ్రీకరింప మొదలిడెను"3

అనియు పలువురు భారతాంధ్రీకరణమునకు గల కారణములలో మతాభిమానమును ఒకటి యనితెల్పిరి.

ఇట్లే నన్నెచోడుడు, పాల్కురికి సోమనాథుడు, మల్లికార్జున పండితారాధ్యుడు మున్నగువారు శివభక్తి తత్పరులై, శైవమత ప్రచారమును దృష్టియందుంచుకొని రచనలు సాగించినారు."4 20వ శతాబ్ది ప్రారంభము వరకు, శుకసప్తతివంటి కొన్ని కావ్యములు తప్ప మిగిలిన కావ్యజాలమంతయు మతప్రేరణ చేతనే వెలువడినవి.

ఇట్లే రంగనాథరామాయణము కూడ వైష్ణవ మత ప్రచారము నిమిత్తమై, వైష్ణవమతాభిమానియైన, రామానుజ మతస్థుడైన బుద్ధభూపతిచేత విష్ణు పారమ్య బోధకమైన వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణము ననుసరించి వ్రాయబడినది. ఇది ఆనాటి సామాజిక, చారిత్రక పరిస్థితులను పరిశీలించినప్పుడు సత్యమని ఋజువగును పూర్వాచార్యులు చెప్పిన వైష్ణవ మత రహస్యములు మూలము నందెట్లున్నవి? వానిని రచయిత యెట్లు తన గ్రంథమున తీర్చి దిద్ది, తన్మతమునకు దోహద మొనర్చినాడు? అనునవి పోల్చి పరిశీలించినపుడు నిరూపితములగును. ఆ ప్రయత్నమే ఇచ్చట జరిగినది.

1. విష్ణువే జగత్కారణుడు ;-

"యతో వా ఇమాని భూతాని జాయంతే। యేన జాతాని జీవంతి। యత్ప్రయంత్యభిసంవిశంతి। తద్విజిజ్ఞాసస్వ। తద్బ్రహ్మ"5

అని ఉపనిషత్తులందు జగత్కారణము బ్రహ్మమని చెప్పబడినది. ఆ బ్రహ్మము శివుడని, విష్ణు

---

1. శిష్టారామకృష్ణ శాస్త్రి "ఆంధ్రవాఙ్మయ చరిత్ర సర్వస్వము." సంపుటి-1. అష్టమప్రకరణము. పుట-559. (రంగనాథుడువ్యా.)
2. కోరాడ రామకృష్ణయ్య. సారస్వత వ్యాసములు పుట. 87.
3. ఖండవల్లి లక్ష్మీరంజనంగారు- ఆంధ్ర సాహిత్య చరిత్ర పుట. 22
4. " " ,, " సంగ్రహము పుటలు. 27, 29.
   మరియు పింగళి లక్ష్మీకాంతం-ఆంధ్రసాహిత్య చరిత్ర పుట. 70.
5. తైత్తిరీయ-ఉపనిషత్తు-భృగువల్లి-మంత్ర-1.

వని, శక్తియని నానా విధములుగా చెప్పబడుచుండగా. ఈ రామాయణము విష్ణువేయని ప్రతిపాదించి విశదీకరించుచున్నది. ఈ ప్రతిపాద్య విషయమును షడ్విధముల నిశ్చయింపవచ్చును.

ఉపక్రమోపసంహారౌ అభ్యాసోఽపూర్వతా ఫలం।
అర్థవాదోపపత్తీ చ లింగం తాత్పర్య నిర్ణయే॥"

"గ్రంథాది, గ్రంథాంతము, గ్రంథ మధ్యము, అపూర్వత, ఫలము, అర్థవాదయుక్తులు" అను షడ్లింగములచే గ్రంథమునందలి ప్రతిపాద్య విషయము సమర్థింపబడును. రామాయణమునం దివి యన్నియు విష్ణువు విషయమునందు ఏకీభవించుచున్నవి. రంగనాథ రామాయణమునందును వీనిని చూడవచ్చును.

i) గ్రంథాది-

"ఎవ్వడు శ్రీమంతు డెవ్వడు శాంతు-డెవ్వడు ఘనపుణ్యు డెవ్వ డున్నతుడు

....

అట్టి వాడిలఁ బుట్టి యరిగెనో యిప్డు-పుట్టెనో యికమీదఁ బుట్టనున్నాడో"[1]

అని వాల్మీకి నారదుని ప్రశ్నించెను. త్రిలోకజ్ఞుడైన నారదుడు తన బుద్ధి నెంతయు తలపోసి చూచి, వేదాంతములందు చెప్పబడిన సకల కల్యాణ గుణగణములు గలవాడు త్రిమూర్తులలో నెవ్వడని వాల్మీకి ప్రశ్న తాత్పర్యమని గ్రహించి, సమాధానముగా

"ఈ మహి శ్రీవిష్ణుడిపుడు జన్మించె-రాముడై దశరథ రాజున కతడు"[2]

అని నారదుడు ప్రారంభించినాడు. ఇచట మూలమునందు "ఇక్ష్వాకు వంశ ప్రభవో రామనామ జనైః శ్రుతః।"[3] అని మాత్రమే యున్నది. నారదోపదేశ సర్గయందు ఎచ్చటను రాముడు విష్ణువని చెప్పబడలేదు. ఒకచోట రాముని వీర్యమున కుపమానముగా "విష్ణునా సదృశో వీర్యే"[4] అని చెప్పబడినది. కాని బుద్ధభూపతి "శ్రీరాముడు విష్ణువే" యగుటచేత మొదటనే దానిని ప్రతిపాదించి, తాను వ్రాయుచున్న రామాయణమున విష్ణుగాథయేకాని వేరుకాదనియు సూచించుటకుగాను మూలమున లేని విష్ణు శబ్దమును ప్రయోగించి తన వైష్ణవాభిమానమును ప్రకటించినాడు.

ii) గ్రంథాంతము :-

ఉత్తరకాండాంతమున బ్రహ్మస్తుతిలో "సృష్టికారకుడైన బ్రహ్మకును కారణము విష్ణువే"[5]యని తెలుపబడినది. ఇది గ్రంథాంతము. కాని బుద్ధారెడ్డి యుద్ధకాండమువరకే వ్రాసినాడు. ఆ కాండాంతము నందలి దేవతాస్తుతి[6]

"...వేదాంతవేద్యుఁడ వఖిల-సాక్షివి కర్తవు సంవిదాకృతివి

....

---

1. రంగనాథ రామాయణము, బాలకాండము. ద్వి. 106-111.
2. రంగనాథ రామాయణము. బాలకాండము. ద్వి. 113.
3. దా. ప్రతి. వాల్మీకి రామాయణము బాలకాండము. సర్గ. 1, శ్లో. 8,
4. ,, ,, బాలకాండము. సర్గ. 1 శ్లో. 11
5. ,, ,, ఉత్తరకాండము. సర్గ 104 శ్లో. 2-7.
6. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి. 8138-8153.

.. ...అక్షర|త్రయమూర్తి వాద్యంతపరివి
నరనాథ, నీ వాది నారాయణుండ-వరయ నా జానకి యయ్యాది లక్ష్మి"1

అను ద్విపదలలోని "సాక్షివి, కర్తవు, ఆద్యంతపరివి, అక్షర త్రయమూర్తివి, ఆదినారాయణుండవు" అను పదములచే రాముడైన విష్ణువే జగత్కారణుడని ప్రతిపాదితమైనట్లు చెప్పవచ్చును ఇంతేకాక కావ్యాంతమున మూలమునందు లేనిదైన రంగనాథ ప్రతిష్ఠా వృత్తాంతము చెప్పబడినది

పట్టాభిషేకమునకు వచ్చి తిరిగి పోవుచున్న విభీషణునకు శ్రీరామచంద్రుడు శ్రీ రంగనాథ సంపుటి నొసంగెను. ఇది ఇక్ష్వాకువు మొదలుకొని సూర్యవంశ రాజులచేత ఆరాధింపబడుచువచ్చు చున్న అర్చావిగ్రహము. ఇది కారణాంతరములచే ఉభయ కావేరీ మధ్యమున నెలకొనిపోయెను.

నిత్యనిత్యము నీవు నిచటికి వచ్చి-యత్యంత భక్తి సమర్పింపు పూజ"2

అని శ్రీ రంగనాథుడు విభీషణున కాన తీయగ, నతడట్లే పూజించి లంకకు చనెను, శ్రీరాముడు వేదోదితాచార మార్గముల పరిపాలించుచుండెను. ప్రజలు సుఖులై యుండిరి" అని గ్రంథము సమాప్తమైనది.

"ఈశ్వరః పంచధా" భగవానుడు పర, వ్యూహ, విభవాంతర్యా, మ్యర్చా రూపుడై ఐదు విధములుగా విరాజిల్లును. పరరూపము పరమపదమునందేకాని లీలా విభూతికి సంబంధించినది కాదు వ్యూహరూపము క్షీరసాగర శాయిత్వము, ఆపదలందు చిక్కుకొన్న బ్రహ్మాదిదేవతలు క్షీరసాగరము శ్వేతద్వీపము వరకే చేరి భగవంతునికి మొరబెట్టుకొందురు. వారి ఆర్తిని దీర్పనాతడు రామకృష్ణా దులుగా నవతరించుచుండును. ఈ రామకృష్ణాది రూపములను విభవ రూపములందురు. చరాచరము లందంతర్యామిగా నుండి సత్తను కాపాడుచుండును. లీలా విభూతిలో భక్తులకు దృష్టిగోచరుడై అర్చనకు యోగ్యుడై యున్న రూపమే అర్చారూపము. (అర్చావతారము)

ఈ అయిదింటిలో పర-అంతర్యామి స్వరూపములు స్పష్టముగా నందుబాటులోనివి కావు. వ్యూహ, విభవ, అర్చాస్వరూపములే చేతనా చేతనముల కందుబాటు లోనివి. కావున రంగనాథ రామాయ . వ్యూహవర్ణనచే ప్రారంభింపబడి, విభవరూపుడైన శ్రీరాముని గుణచేష్టాలీలా వ్యాప్తమై అర్చారూప శ్రీరంగనాథ ప్రతిష్ఠార్చనాదులచే పరిసమాప్తమైనది.

జనులకు పర, వ్యూహ రూప పరమాత్మ సమీపమునకు పోవుట సాధ్యముగాదు. ప్రస్తుతము విభవావతార మేదియో తెలియదు యోగులకు మాత్రమే గోచరమగు అంతర్యామి స్వరూపము సామాన్యులకు లభ్యమగునది కాదు. కావున సకల జన నయన గోచరుడై, రూపముచే నేత్రము లకు, భోగనివేదనాది పదార్థ ప్రసాదముచే రసనకు, స్తుతి కీర్తనాది శ్రవణాదులచే శ్రవణమునకు, నిర్మాల్యాదుల పరిమళముచే ఘ్రాణేంద్రియమునకు, పారతంత్ర్యముచే స్పర్శేంద్రియమునకును, ధ్యానముచే మనస్సునకును ఆనందము కలిగించువాడై. భక్తరక్షణ తత్పరత్వమున వెలసిన ఈ రంగనాథ-అర్చారూపమునే సేవించి తరింతురుగాక" అనెడి పరమ వైష్ణవోపదేశము ఈ రంగనాథ సంబంధ ద్విపదలచే వ్యంజింపబడినది. రంగనాథుడే-విష్ణువు, విష్ణువే-శ్రీరాముడని అభేదముకూడ

1. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి. 8138, 8140, 8150.

2. ,, ,, ఆం-వి-క-పరిషత్తు. ప్రతి-అనుబంధము. 2. పుట. 842.

ప్రతిపాదించినట్లయినది. —

(ii) అభ్యాసము :—

నేర్చినది (చెప్పినది—తెలిసినది) మరచిపోకుండ మాటిమాటికి దానిని జ్ఞాపకము చేయుటను-గుర్తుచేసికొనుటను, ఆచరించుటను అభ్యాసమందురు.[1]

రామాయణమునందు ఎడనెడ ఆయా పాత్రల చేత శ్రీరాముడు విష్ణువనియు, అతడే సకల జగత్కారణుడనియు, అతనిని నాశ్రయించిన వారికి కొదువ లేదనియు, అతని నెదురించువాడు ముల్లోకములందును లేడనియు, శ్రీరాముని గుణము లిట్లనేకములు ప్రకటింపబడినవి.

దశరథుని పుత్రకామేష్టి సందర్భమున, బ్రహ్మాది దేవతలు విష్ణుని గాంచి స్తుతించిన ద్విపదలలో అతని జగత్కారణత్వము, సర్వేశ్వరత్వము, సర్వ శరణ్యత్వము వివరింపబడినవి.[2]

విశ్వామిత్రుడు దశరథుని యొద్దకు వచ్చి యాగ విఘ్నకారులైన రాక్షసులను సంహరింపగా రాముని తన తోడ పంపుమని కోరెను. అట్టిచో రచింపబడిన ద్విపదలలో తపోబలముచేత తెలియ సాధ్యము కానట్టి శ్రీరాముని మహత్వమను గుణమే[3]కాక, మూలాతిశయముగా అతని సర్వలోకారాధ్యత్వ, యజ్ఞకర్తృత్వ, భోక్తృత్వములనెడి గుణములు విశదీకరింపబడినవి.[4]

శ్రీరాముని పాదరాజీవ పరాగముచే దూరీకృతాఘ సందోహయైన యహల్య శిలారూపమును మాని, తనతొల్లి దేహమును పూని శ్రీరాముని స్తుతించెను. ఆసందర్భమునందలి ద్విపదలు శ్రీరాముని పతిత పావనత్వ గుణమును, సర్వవ్యాపిత్వ లక్షణమును దెలుపుచున్నవి.[5]

సీతావివాహ సందర్భమునందు వసిష్ఠ-శతానందులు ఇక్ష్వాకు-నిమి వంశ క్రమములను వివరించిరి అందు వసిష్ఠుడు-

"నరనాథ విను- నిర్గుణ బ్రహ్మమైన — హరి సగుణైక లీలాకృతిఁదాల్చి
నిజలీలకై నాభి నీరజం బందు — నజుని కల్పింపంగ హరికజుఁడొదవె"[6]

అనియు, శతానందుడు

సద్విజ పరమహంస ప్రతి పాద్యు — డద్వితీయ బ్రహ్మమైన యచ్యుతుని
నాభి సరోజంబునను బ్రహ్మ పుట్టె"[7]

నని ప్రారంభించినారు. కాని మూలమునందు —

"అవ్యక్త ప్రభవో బ్రహ్మ శాశ్వతో నిత్య అవ్యయః"[8]

---

1. ఆరంభణ సంశీలనం పునఃపున రభ్యాసః।
2. రంగనాథ రామాయణము. బాలకాండము. ద్వి 482-487.
3. దా. ప్రతి వాల్మీకి రామాయణము బాలకాండము. సర్గ. 19. శ్లో. 14 1/2.
4. రంగనాథ రామాయణము బాలకాండము. 623-625.
5. ,, ,, ,, ద్వి. 1500-1504.
6. ,, ,, ,, ద్వి. 2030-2031.
7. ,, ,, ,, ద్వి. 2112-2118.
8. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. బాలకాండము. సర్గ. 70. శ్లో. 17.

అని ఇక్ష్వాకు వంశోపక్రమమును,

"రాజా౽భూత్రిషులోకేషువిశ్రుత స్స్వేన కర్మణా।
నిమిః పరమ ధర్మాత్మ సర్వసత్త్వవతాం వరః"[1]

అని జనక వశోంపక్రమమును కనబడు చున్నది. -

ఇచట బుద్ధారెడ్డి స్వాతంత్ర్యమును వహించి "సగుణ, నిర్గుణ శబ్దవాచ్యుడైన బ్రహ్మయు హరియే" యనియు,

"సదేవ సోమ్యేద మగ్ర ఆసీ దేకమేవా ద్వితీయం"[2]

అనెడి వేద వాక్యార్థము వ్యంజించునట్లు వ్రాసిన

"సద్విజ ప్రతి వాద్యుడైన అద్వితీయ బ్రహ్మము అచ్యుతుడే"

యనియు మూలాతిశయముగా వ్రాసి తన వైష్ణవాభిమానమును సంపూర్ణముగా ప్రకటించు కొన్నాడు. ఈ ద్విపదయందు హరియొక్క సకల మూల కారణత్వ గుణము ప్రకటితమైనది —

సీతారామ కల్యాణానంతరము దశరథుడు కొడుకులతో కోడండ్రతో బంధు మిత్రాదులతో తరలి అయోధ్యకు పోవుచుండ మధ్యేమార్గమున పరశురాముడు శ్రీరాము నెదుర్కొనెను. తన చేతి వైష్ణవ చాపము నతని కందించుచు "శైవ, వైష్ణవ చాపముల వృత్తాంతమును, హరిహరుల పరస్పర పోరాటమును, అందు హరిశక్తి ఘనమని యమరులు తలంచి యాయిరువుర పోరాటమును మాన్పగా, ఈశుడా విల్లును దేవరాతున కిచ్చినాడని"[3]యు జామదగ్న్యుడు తెలిపెను. ఈ కథనము చేత విష్ణువునకు శివాది సర్వదేవతాధిక్యత్వగుణము వాచ్యము చేయబడినది..

శ్రీరాముడు తండ్రియానతి మీఱజాలక, 14 సంవత్సరము లరణ్యవాసము చేయదలంచి తత్కాలమున భరతుని కోరికను తిరస్కరించెను. అప్పుడు వశిష్ఠుని యుపదేశమున శ్రీరాముడు భరతునకు పాదుకల నొసంగెను ఇచ్చట కవి

"......సంపూల్లారుణార — వింద పల్లవ గర్వ విభవ భేదములు
యతి వధూ తిలక శాపాపనోదములు — శ్రుతి శిరో భవన విశ్రుత వినోదములు
తనదు పాదుకలు సంతతసనకాది — ముని వివాదములు రాముడు మోపి యొసగ"[4]

అని అమూలకముగా సహజ సుందరముగాను ఆ పాదముల మహత్త్వమును వర్ణించి సంప్రదాయ బద్ధమైన, పూర్వాచార్యులు చాల అధికముగా చెప్పియున్న రహస్యమును తెలియ జేసినాడు అది యి ది—

"శేషి పక్కల్ శేషభూత నిజ్ఞియుమ్ తుఱై; ప్రజైములై ములే వాయ్ వైక్కు మాప్పోలే"

---

1. దా. ప్రతి వాల్మీకిరామాయణము. బాలకాండము. సర్గ. 71. శ్లో. 3.
2. ఛాందోగ్యోప నిషత్తు. షష్ఠప్రపాఠకము. ద్వితీయఖండ. మంత్ర-1.
3. దా. ప్రతి. రామాయణము బాలకాండము. సర్గ 75. శ్లో. 11-20.
   ఇది రంగనాథ రామాయణమున యథాతథముగా ననుసరింప బడినది. బాలకాండము. ద్వి 2350-2364
4. రంగనాథ రామాయణము. అయోధ్యా. 1782-1784.

పిరాట్టియుమ్ అవనుమ్ "విడిలుమ్ తిరువడికళ్ విడాతు తిణ్ణజ్జల్" అ యిరుక్కుమ్"[1]

(శేషియందు శేషభూతుండు ప్రవేశించు నట్టిదేవు ఈ శ్రీపాదములే-చంటి బిడ్డస్తనముల యందు నోరుపెట్టినట్లని యెఱుంగునది.

పిరాట్టియును పెరుమాళ్ళును విడనాడినను, శ్రీపాదంబులు విడనాడవు. ఇవి ఆశ్రితులను విడనాడనంత దార్ఢ్యము గలవిగా నుండ గలవు.)[1]

కావున భరతుని శరణాగతి వ్యర్థము కాలేదు. శ్రీరాముడయోధ్యకు తిరిగి రాకపోయినను, ఆతని శ్రీపాద చిహ్నములు లభించినవి. భరతుడు వానిని పట్టుకొని శిరమ్మున దాల్చినాడు. ఆ శ్రీపాదములు భరతుని ప్రారబ్ధకర్మను పరి సమాప్తి గావించి ఆ పిదప శ్రీరాముని సంపూర్ణాను గ్రహమును గలిగించినవి. భక్తుడు, బిడ్డస్తనములందు నోరు పెట్టినట్లు, సులభముగా చరణములను పట్టుకొనును. చేతిని పట్టుకొనిన దులుపరించుకొని పోవచ్చును గాని. పాదములు పట్టుకొనిన. ఎంత కఠినాత్ముడైనను దులుపరించుకొని పోజాలడు. అతనియందు దయాగుణ ముద్బుద్ధమగును. దానితో నతడు రక్షించుట కుద్యుక్తుడగును. ఇక భగవంతుని విషయమున చెప్పవలెనా? అతని పాదములు పట్టుకొన్న పిదప వానిని మనము ఏదేని యొక కారణముచే వదలదలచినను, ఆ పాదములే మనను దృఢముగా భగవదనుగ్రహము కలుగు వరకు నంటిపెట్టుకొని యుండును భరతుని ప్రారబ్ధకర్మ యడ్డు వచ్చినట్లు, మనకు ప్రారబ్ధకర్మ యడ్డు వచ్చి తత్కాలమున భగవత్సాక్షాత్కారము లభింప కున్నను, అహల్యా పాపమును క్షాళిత మొనర్చినట్లు. ఆపాదములు మన పాపమును కడిగివైచి భగవద్దర్శన మొనగూర్చును. కావున భగవంతుని యాశ్రయించుటలో మనము సులభముగా పట్టుకొనునవి శ్రీపాదములే. ఇది "శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే" అను ద్వయ మంత్ర పూర్వార్థమును దెలియజేయు చున్నది.

ఇక, భరతుడు ఆ పాదుకలను దీసికొని పోయి, నంది గ్రామ పురిని వసించి, వానిని సింహా సనముపై నెలకొల్పి,

"శ్రీరామునకుంబోలె సేవ చేయుచును — ....

ఆ రాఘవుని పునరాగమనంబుఁ | గోరుచు నతని సద్గుణంబు లెన్నుచును"

పాలించుచుండుట అర్చాపూజను దెలియజేయు చున్నది. అనగా ఇది విగ్రహారాధనకు నిదర్శనము. "యద్భావం తద్భవతి "- "యాదృశీభావనా యత్ర సిద్ధిర్భవతి తాదృశీ" యన్నట్లు. భరతుడు శ్రీరాముని సద్గుణము లెన్నుచు, శ్రీరామునకుఁ బోలె పాదుకలకు సేవచేసినట్లే భక్తుడైన వాడు భగవదర్చా విగ్రహమును భగవంతుడను భావన తోడనే సేవించ వలెను. అప్పుడే సిద్ధి కలుగును. భావన ప్రధానముకదా! ఇట్లు రామాయణము విగ్రహారాధనను సమర్థించుచున్నదన వచ్చును. ఈ భావనా దార్ఢ్యము లేనివారు విగ్రహారాధనను ఖండించుటయు, విగ్రహారాధనము చేయువారిని ఈసడించుటయు భావ్యము కాదని వేఱ చెప్పనేల?

---

1. పిళ్ళైలోకాచార్యులు. ముముక్షుప్పడి ద్వయ ప్రకరణము. సూత్రము. 32, 31. తెలుగు అనువాదము. కందాడై శేషాచార్యులు పుట. 132.
2. రంగనాథ రామాయణము అయోధ్యాకాండము. ద్వి. 1805-1806.

రావణునిచే ఱెక్కలు తెగి నేలఁగూలిన జటాయువు శ్రీరామునితో రావణుని గూర్చి కొంత చెప్పి, నీరసత్వము చేత నిక చెప్పఁజాలక

"అతుల పుణ్యోదయుండగు రాముఁ జూచి-మతిలోన నతని సంస్మరణ మేమఱక

మోక్షపథానందమునఁ బులకించి-పక్షివల్లభు డంతఁ బ్రాణముల్ విడిచె"[1]

ఈ ద్విపదలపై భగవద్గీతా ప్రభావము పడినది.

అంత్యకాలే చ మామేవ స్మరన్ ముక్త్వా కళేబరం।

యః ప్రయాతి సమద్భావం యాతి నాస్త్యత్ర సంశయః॥"[2]

అని కృష్ణ భగవానుని వాక్యము. నిరంతర నామస్మరణాభ్యాస వశమున అంత్యకాలమున నదే గుర్తు వచ్చును. దానిచే ముక్తి కలుగును ఈ ఘటనచే శ్రీరామునికి మోక్షదాయిత్వ గుణము గలదని చెప్పబడినది.

శబరియు

"నీ వాద్యుడవు సర్వ నిగమవేద్యుడవు-గావున నిను నుతుల్ గావింపఁ దరమె."[3]

అని చేసిన స్తుతిలో శ్రీరాముని సనాతనత్వము చెప్పబడినది.

సుగ్రీవుని ఆదేశమున ఆంజనేయుడు భిక్షుక రూపముతో శ్రీరామునొద్దకు వచ్చెను. శ్రీరాముడాతని మేని యురుభూషణములను కనుగొనెను. అపు డాంజనేయుడు శ్రీరాముని విష్ణువుగా గుర్తించి తన పూర్వ వృత్తాంతము నిట్లు చెప్పెను; "తన తపమునకు ప్రత్యక్షమైన బ్రహ్మ "గతిమోక్ష కామ్యార్థ కారణములకు పతియు, ధాతయు, సకల భూత జాలములకు భువికెల్ల కర్తయు నైనవాడు విష్ణువు; అతడే నీ మేని యురు భూషణములను కనుగొనజాలునని పలికెను. నాటినుండి ఎవరును వానిని కనుగొనజాలకపోయిరి." అని.

ఇది అమూలక విషయము. కవి దీనిని వ్రాసి

"యత్ప్రయం త్యభిసంవిశంతి"[5] అను శ్రుత్యర్థమును

"వాసుదేవాశ్రయో మర్త్యో వాసుదేవ పరాయణః।

సర్వ పాప విశుద్ధాత్మా యాతి బ్రహ్మ సనాతనం॥"[6]

అను స్మృత్యర్థమును వాచ్యముగా విశదపరచి, విష్ణువే మోక్షదాత యని స్పష్టపరచినాడు.

---

1. రంగనాథ రామాయణము. అరణ్యకాండము. ద్వి. 1384-1385,
2. భగవద్గీత అధ్యాయము-8 శ్లో. 5.
3. రంగనాథ రామాయణము. అరణ్యకాండము. ద్వి. 1453.
4. రంగనాథ రామాయణము; కిష్కింధాకాండము. ద్వి. 130-140.
5. తైత్తిరీయోపనిషత్తు- భృగువల్లి. ప్రథమానువాకము మంత్ర-1.
(యత్ప్రయంతీతి మోక్షః — అభిసంవిశంతీతి ప్రళయః") విషయవాక్య దీపిక. పుట-1
రంగరామానుజులు
6. భారతము. విష్ణు సహస్ర నామ స్తోత్రము. ఫలశ్రుతి శ్లో. 10. (ఆనుశాసనిక వర్వము)

తార వాలితో

"ఆ రాఘవుడు విష్ణు డంబుజోదరుడు-వైరంబు గొని గెల్వ వశము గాదతని"[1]

అని యుపదేశము చేసినది

విభీషణుడు దశకంఠునితో

"ఆదినారాయణుం డర్కవంశమున-నీ దాశరథి గాగ నిట్లు జన్మించె

వనజాసనాదులు వర్ణింపలేరు-సనకాదులును గూడ చర్చింపలేరు

ఆ మహామహిమ నీ కలవియే తెలియ-రాముడు మర్త్యుండె రాక్షసాధీశ"[2]

అని పల్కెను ఈ ద్విపదలు అమూలకములు. ఇందులో

"యతో వాచో నివర్తంతే। అప్రాప్య మనసా సహ।

ఆనందం బ్రహ్మణో విద్వాన్"[3]

అనెడి శ్రుత్యర్థమును, అతని వాఙ్మనసాతీత గోచర మహత్వమును ప్రకటింపబడినవి.

ఆంజనేయుడు ఇంద్రజిద్బ్రహ్మాస్త్ర బంధితుడై రావణుని గాంచినపుడు శ్రీరాముని శక్తిని గూర్చి పలికిన పలుకులు[4] అతని సర్వసంహారకత్వ గుణమును మూలానుసారముగా విశదీకరించుచున్నవి.

విభీషణుడు శ్రీరాముని శరణాగతి నొంది అతనిని స్తుతించెను ఈ స్తుతి ద్విపద లమూలకములు.[5] ఇవి శ్రీరాముని విరాడ్రూపమును, "సర్వం ఖల్విదం బ్రహ్మ తజ్జలాన్"[6] అనెడి శ్రుత్యర్థమును విశదీకరించినవి.

"రావణుని తల్లి కైకేశి, పతివ్రతా శిరోమణియైన భార్య మండోదరి, సోదరుడైన కుంభకర్ణుడును రావణునకు హితోపదేశము చేసిరి.[7] వీరి హితోపదేశ సారాంశము శ్రీరాముడు విష్ణువని తెలుపుటయే.

ఇంతేకాక, మూర్ఖుడై, కామాంధుడై పట్టుదలతో యుద్ధమునకు దిగిన రావణుడు గూడ

"......... శ్రీరామ శరములచే జత్తునేని

నాకవాసులు మెచ్చ నా కోరుచున్న-వైకుంఠ మెదురుగా వచ్చు నిచ్చటికి

---

1. రంగనాథ రామాయణము. కిష్కింధాకాండము ద్వి 471-472.
2. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి. 520-522.
3. తైత్తిరీయోపనిషత్తు-ఆనందవల్లి-చతుర్థోఽనువాకము.
4. రంగనాథ రామాయణము. సుందరకాండము. అనుబంధము-2 పుట.735 ఆం.వి.క.ప. ప్రతి
5. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి 670-690.
6. ఛాందోగ్యోపనిషత్తు-తృతీయ ప్రపాఠకము. చతుర్థ ఖండము. 1 మంత్ర.
7. రంగనాథ రామాయణము. యుద్ధకాండము.
   i) కైకేశి ఉపదేశము. ద్వి. 1368-1378
   ii) మండోదరి ఉపదేశము. ద్వి. 3137-3146.
   iii) కుంభకర్ణుని ఉపదేశము. ద్వి 3689-3691.

లలన నీ వేటికి, లంక యేమిటికిఁ-దలకొన్న ముక్తి సత్పథముఁ గైకొందు."[1]

నని శ్రీరాముని శ్రీమహావిష్ణువుగానే తుదకు తలంచినాడు.

ఇట్లు బుద్ధ భూపతి ఒక్కొక్క చోట మూలాను సారిగాను, ఒక్కొక్క చోట మూలమున లేకున్నను వైష్ణవాభిమానమును పురస్కరించుకొనియు, విష్ణ్వవతారుడగు శ్రీరాముడే సకల జగత్ సృష్టిస్థితి లయకారణుడనియు, మోక్షప్రదాతయనియు, శరణాగత తత్పరుడనియు, సకల జగత్స్వామి యనియు తన రంగనాథ రామాయణము నందు పలుచోట్ల సందర్భోచిత్యముగ ప్రకటించినాడు

ఇట్లనేక స్థలములయందు పరమాత్మకు గల యసాధారణ గుణములతో శ్రీరాముని జెప్పుట చేత శ్రీరామచంద్రుడే జగత్కారణమగుట సిద్ధమగుచున్నది."[2]

(vi) అపూర్వత :—

అపూర్వత యనగా "ప్రమాణాంతరా ప్రాప్తిః"[3]

(ఇతరమైన ప్రమాణములచే తెలియరాని దానిని దెలుపుట).

పరతత్త్వము విష్ణువేయని ప్రత్యక్షాను మానాది ప్రమాణములచే తెలియ సాధ్యముగాదు. ఇట్టి రామాయణాది గ్రంథముల చేతనే తెలిసికొనవలయును. ఇందు రాముని దైవత్వము, ఆ దైవము విష్ణువగుట, అతడే బ్రహ్మరుద్రాది చరాచర జగత్తు నకు కారణ భూతుడగుట మొదలగునవి ఈ రామాయణ కథా సూత్రమున నిబంధింపబడి ప్రతి పాదింపబడినవి. ఇది మూలముకన్న నెక్కువగా రంగనాథ రామాయణమున వాచ్యము చేయబడినది.

(v) ఫలము ;—

భగవత్సేవకు ఫలము ఇహపరసుఖము; పునర్జన్మ రాహిత్యము.

సుగ్రీవ విభీషణులు రాజ్యలాభమునొందుట దేవతలు ఋషులు రాక్షస బాధనుండి విముక్తులగుట, రాముడు రాజ్యము చేయునప్పుడు ప్రజలొందిన అభ్యుదయము ఇహలోక సుఖమునకు తార్కాణము. శరభంగ, జటాయు, శబర్యాదులకు నుత్తమ లోకము నొసంగుట శ్రీరాముడవతారము చాలించువేళ తనయందుఁ బ్రీతిగల కోసల వాసులందఱకు సాలోక్య ముక్తినిసి ప్రసాదించుటయు శ్రీరామచంద్రుడు పరాత్పరుడనుటకు నిదర్శనము. ఈ యిహపర ప్రదాతృత్వము పరమాత్మకుగాక తక్కిన వారికి సాధ్యముకాదు గదా!

(vi) అర్థవాదోప పత్తులు :—

అర్థవాదమనగా స్తోత్రము; ఉపపత్తులనగా యుక్తులు

(a) అర్థవాదము ;— "ప్రాశస్త్యనింధాన్యతర లక్షణయా విధి శేష భూతం వాక్యం అర్థవాద ఇత్యుచ్యతే"[4] అని నిర్వచనము.

---

1 రంగనాథ రామాయణము. యుద్ధకాండము. 7279-7281

2. వావిలకొలను సుబ్బారావు మందరము. బాలకాండము పుట. 373.

3. దా. ప్రతి. వాల్మీకి రామాయణము గోవిందరాజీయ వ్యాఖ్య. బాలకాండము. పుట. 102 (శ్రీమన్నారాయణ జీయర్‌స్వామి ప్రచురణము)

4. లక్కావఝుల వెంకట కృష్ణశాస్త్రి. ఆశ్చర్య రామాయణము. కిష్కింధాకాండము పుట. 70

ఉదా:- "తరతి బ్రహ్మహత్యాం యోఽశ్వమేధేన యజతే।"[1]

దేవతా, మంత్ర, కర్మలయందు శ్రీమాభిరుచులను కలిగింప జేయుటకై ఫల నిరూపణ పురస్సరముగా నొనరింపబడు స్తోత్రములు, ప్రశంసా వాక్యములు అర్థవాదములని సాధారణముగా జెప్పవచ్చును.

ఉదా ;- "యోహవై నారాయణ స్యాష్టాక్షరం పదమధ్యేతి। అనపబ్రవస్సర్వ మాయురేతి। విందతే ప్రాజాపత్యగ్ం రాయస్పోషం గౌపత్యం। తతోఽమృతత్వ మశ్నుతేత తోఽమృతత్వ మశ్నుత ఇతి॥"[2]

(b) ఉపపత్తులు :— తాను నిరూపింపదలచు విషయమునకు ఉపబలకములైన, ఖండన కసాధ్యములైన ఉదాహృతాంశములను యుక్తులనియు ఉపపత్తులనియు నందురు.

ఉదా:- సీతల్లి వంధ్యకాదు.

రామాయణమునందలి అహల్యా పరశురామ, నదీసముద్ర, విభీషణ, బ్రహ్మాదుల ప్రత్యక్ష స్తోత్రములు రంగనాథ రామాయణ కర్త చే మూలాతిశాయిగా వర్ణింపబడి శ్రీరాముడే పరతత్త్వమని నిర్ణయించుటలో సహకరించుచున్నవి. దశరథ విశ్వామిత్రుల యొక్క, తారావాలుల యొక్క, రావణ విభీషణుల యొక్క, కైకసీ రావణ మండోదరీ రావణుల యొక్క సంభాషణలు పరోక్షముగా శ్రీరాముడే పరబ్రహ్మమని నిర్ణయించు చున్నవి. పరశురాముడు శ్రీరామునకు జెప్పిన విష్ణురుద్రుల యుద్ధము విష్ణువే రుద్రుని కంటె నధికుడని ప్రతిపాదించుచున్నది.

శ్రీరాముడు ప్రయోగించిన ఇషీకాస్త్రము కాకమును వెంబడించగా,

……తడయక యది జగత్త్రయ మెల్ల దిరిగి.

కావుకావనుచు దిక్పాలుర బ్రహ్మ — దేవుని, నమ్మహాదేవు బ్రార్థింప

వారలు తమచేత వారింప బడునె — శ్రీరామ శరమన్న శీఘ్ర బె మగుడ

జనుదెంచి మఱి తన్ను శరణు సొచ్చుటయు — ఘనమైన కృపతోడ కాకంబును"[3]

రక్షించుట,

దిక్పాలక, శివ, బ్రహ్మాది సకల దేవతలును వెనుద్రిప్ప సాధ్యముకాని నిగ్రహానుగ్రహశక్తులు కలవాడు శ్రీరాముడని అతని పరత్వమును జెప్పుటయే గదా! ఈ ద్విపదలు మూలాతిశయములు. మూలశ్లోకములందు బ్రహ్మదేవుని, మహాదేవుని ప్రస్తావనయే లేదు.[4] "కాకము తండ్రి చేతను దేవతల చేతను, మహర్షుల చేతను పరిత్యక్తమై ముల్లోకములు తిరిగి తిరిగి చివరకు శ్రీరామునే శరణు పొందెనని" మూలమునందుండగా, శివబ్రహ్మలచేత గూడ శ్రీరామ శరము వారింపబడక

---

1. శ్రీ శివపూజ-పంచమ వారాభిషేకాంతర్గత వారుణాను వాకములు. 10వ అనువాక మంత్రము.
2. నారాయణోప నిషత్తు-అనువాకము. 3.
3. రంగనాథ రామాయణము. అయోధ్యా. ద్వి. 1150-1153.
4. దా. ప్రతి రామాయణము. అయోధ్యాకాండము. అధిక పాఠసర్గ. 96. శ్లో. 49-51 మరియు సుందర కాండము. సర్గ. 38 శ్లో. 32-34.

పోగా, తిరిగి రాముని శరణు పొందినదని రంగనాథ రామాయణమునందుండుట శివబ్రహ్మల కంటె రాముని కాధిక్యము గలదని వాచ్యము చేయుట అనెడి యుక్తియే ఇట అనుసంధేయ మగును.

ఈ విధముగా ఉపక్రమ, ఉపసంహార, అభ్యాస, అపూర్వతా, ఫల అర్థవాదోపపత్తు లనెడి షడ్విధ తాత్పర్యములచే వేదాంతవేద్యుడైన, పరబ్రహ్మయైన విష్ణువే రాముడుగా నవతరించినాడని చెప్పుటయు. అతని నాశ్రయించిన భుక్తిముక్తులు (ఇహపరములు) సులభములని యుపదేశము చేయుటయు ముఖ్యోద్దేశ్యము.

పాల్కురికి సోమనాథాదులు వీరశైవ మత ప్రచారము చేయుచు,

"ఆదికి నాది నిత్యానందమూర్తి-శ్రీ దివ్యలింగమూర్తి యనుదైవంబు"[1]

అనియు,

"మంత్రంబులకు రాజమంత్రమై వెలయు-మంత్రంబు దానికి మఱి షడక్షరియు
భవ దూరమగు జటా భసిత రుద్రాక్ష-సవిశేష మోక్షానుసారి వేషంబు"[2]
"సకల లోకైక రక్షకుడగు శివున-కొక నిన్ను రక్షించుటకు నెంత పెద్ద"[3]
"పార్వతీకాంతుండు భక్తవత్సలుడు-శర్వుడర్వాచీన సౌమ్యస్వరూపి
గీర్వాణవంద్యుండు సర్వేశ్వరుండు-సర్వజ్ఞు డజ హరి శతమఖార్చితుడు"[4]

అనియు నిట్లనేక సందర్భములందు శివపారమ్యమును బోధించుటయే కాక,

"అదరంగ వేదభరాక్రాంతు లనంగ-బడిన బ్రాహ్మణ గార్దభంబులతోడ"[5]
"కాన విప్రులు భక్తగణముల యిండ్ల-శ్వానంబులకు నెట్లు సరియన వచ్చు"[6]
"అసమాక్షుఁ గొలువని యగ్రజుండైన-వసుధ మాలల మాల వాడ కాకెట్లు"[7]
"శ్రీ మహాదేవుఁ బూజించు చేతులను-నామాల కుక్కల నర్చింపఁ దగునె"[8]

అని బ్రాహ్మణ వైష్ణవులను దూషించుచుండిరి మఱియు

"అజుని గుదంబున హరి పుట్టుటకును-నిజ నామ మది యధోక్షజు డయ్యెగాదె"[9]
"హరుడు విసము ద్రాగి యమృతంబుఁ బనుప-హరి మగటిమి విడ్చి యాటదిగాడె"[10]
"ఆలి గోల్పడి రాముడట బ్రహ్మహత్య-పాలయి ధరచుట్టు భ్రమరించెఁ గాదె"[11]

---

1. పాల్కురికి సోమనాథుడు. బసవపురాణము. ఆశ్వా. 1 పుట-45.
2. ,, ,, ఆశ్వా. 1 పుట-45 వావిళ్ళ ప్రతి.
3. ,, ,, ఆశ్వా. 2 పుట-69.
4. ,, ,, ఆశ్వా. 3 పుట-177.
5. ,, ,, ఆశ్వా-7 పుట-533. (వావిళ్ళ ప్రతి)
6. ,, ,, ఆశ్వా-7 పుట-503.
7. ,, ,, ఆశ్వా-7 పుట-514.
8. ,, ,, ఆశ్వా-7 పుట-562.
9. ,, ,, ఆశ్వా-6 పుట-478.
10. ,, ,, ఆశ్వా-6 పుట-479.
11. ,, ,, ఆశ్వా-6 పుట-479.

"తగిలి దూర్వాసుండు దన్నినఁ గాదె-నగధరు వక్షంబునను మచ్చయయ్యె"[1]

"వేయేల వ్రేవాడ వెన్న మ్రుచ్చిలుచుఁ-బోయి అంకాడదే పొలతులతోడ"[2]

"శరభ రూపముఁ దాల్చి పరి మార్చికాదె-నరసింహు తోలు శంకరుడు దాఁ గప్టె"[3]

అని విష్ణులీలల కపార్థము గల్పించి చిన్నచేయుచు తెనుగు దేశమున 12, 13 శతాబ్దముల కాల మందు విజృంభించుచుండిరి అట్టివారికి ప్రతిభటముగా నిలిచి, అదే ద్విపద చ్ఛందములో, సలక్షణ మైన సరళమైన శైలిలో, ఏ జాతినిగాని, ఏ మతమునుగాని నిందించక, విష్ణుపారమ్యమును బోధించుచు ఆదికావ్యముగా ప్రసిద్ధి పొందిన శ్రీ మద్రామాయణమును వైష్ణవ మత ప్రచారమునకై తెనుగున బుద్ధభూపతి వ్రాసినాడని నిస్సందేహముగాఁ జెప్పవచ్చును రంగనాథ రామాయణమునందు శైవదూషణము దివ్వటీ గొని గాలించినను ఎచ్చటను కనబడదు. నిష్పక్షపాత దృష్టితో పరిశీలించిన వారికి యథార్థము తెలియును. కావున రంగనాథ రామాయణము వైష్ణవ మత ప్రచారమునకై వ్రాయబడినది. ఇందు విష్ణువే జగజ్జన్మాది కారణుడని స్పష్టపరచబడినది —

"ఇచ్చట "పరమాత్మయైన విష్ణువునకు రామాది జన్మము లెట్లు సంభవము ? జన్మ కర్మచేత కలుగును. పరమాత్మ నిష్కర్ముడు గదా ?" అని యొకటి రెండు శంకలు కలుగును.

జన్మము రెండు విధములు (1) కర్మాయత్త జన్మము, (2) ఇచ్ఛాయత్త జన్మము. జీవులు కర్మ లొనరించి, తత్ ఫలానుభవమునకై జన్మ లెత్తుదురు. కావున జీవులది కర్మాయత్త జన్మము. కాని భగవంతుడు "దుష్టశిక్షణ శిష్టరక్షణ, ధర్మస్థాపనమునకై "[4] ఆయా కాలముల కనుకూలముగా, "స్వప్రకృతి నధిష్ఠించి"[5] స్వేచ్ఛగా స్వశక్తిచే జన్మల కలిగించుకొనును ఇట్టి వానిని అవతారములందురు. వీనియందాతని పరత్వశక్తి తప్పదు, తగ్గదు కూడ.

"సంపూర్ణముగా నాశక్తి యవతారరూపము నందుండును"[6]

పరమాత్మ ఈ యిచ్ఛాయత్త జన్మల పరిగ్రహించుననుటకు —

1. "అజాయమానో బహుధా విజాయతే"[7]

2. "సశ్రేయన్ భవతి జాయమానః"[8] యాను శ్రుతి వాక్యములును,

---

1. పాల్కురికి సోమనాథుడు బసవ పురాణము. ఆశ్వాసము. 6. పుట. 478.
(తన్నినది దూర్వాసుడు కాదు. భృగుమహర్షి)
2. " " " " 6. పుట. 479-480.
3. " " " " 6. పుట. 480.
4. భగవద్గీత-అధ్యాయము. 4. శ్లో. 8.
5. " " శ్లో. 6.
6. ఈశావాస్యోపనిషత్తు-శాంతిపాఠః.
పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే।
పూర్ణస్యపూర్ణ మాదాయ పూర్ణ మేవావ శిష్యతే॥
7. పురుష సూక్తము-అను వాకము. 13. మంత్రము. 2.
8. కృష్ణయజుర్వేదము. బ్రాహ్మణము. అష్టకము. 3. ప్రపాఠకము. 6. మంత్ర. 3.

1. "ఇచ్ఛాగృహీతాభిమతోరు దేహః"[1]

2. "ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మ మాయయా।"[2]

అను పురాణ స్మృతి వాక్యములును.

ఏవందత్వా వరం దేవో దేవానాం విష్ణు రాత్మవాన్।

మానుషే చింతయామాస జన్మభూమి మథాత్మనః॥"[3]

అని రామాయణమును, దీని ననుసరించి వ్రాసిన రంగనాథ రామాయణము నందలి

"తిరిగి మర్త్యమున నేనవతారమంది"

అనుపంక్తియు స్వతః ప్రమాణములు. కావున భగవంతునికి ఇచ్ఛాయత్తమైన జన్మకలదనియు ఇట్లవతరించిన రూపమునందు అప్రాకృత భగవత్తత్త్వమున కెట్టిలోపము లేదనియు తెలియ నగును.

"రాముడు పరతత్త్వమైనచో జీవులు చేసినట్లు సంధ్యా వందనాది కర్మలు[4] చేయుటేల?" యని మరియొక శంకపొడమును.

ఇది "స్వధర్మము శ్రేయస్కరమని భావించి లోకులు కర్మ త్యాగము చేయక, వర్ణాశ్రమా చారోచిత కర్మలను తప్పకచేయ వలెనని" స్వయముగా నాచరించి బోధించుట కొఱకై శ్రీరామ చంద్రుడట్లు వర్తించినాడనుట శ్రీరాముడు ఆదర్శ మానవుడుగా అవతరించినాడు. ఉత్తమ మాన వుడుగా మానవులకు ఉన్నతాచారములను చూపించుటమే ఇట్టి లౌకిక కర్మలకు కారణము. "శ్రేష్ఠుని నడవడియె లోకమునకు ప్రమాణము. ఆయాచరణకు లోకసంగ్రహమే పరమ ప్రయోజనము",[6] కావున శ్రీరాముడు సంధ్యావందనాది కర్మల నాచరించుట "Example is better than precept" అను సామెతకు నిదర్శనముగా నుండఁగోరుటయే. అయినను శ్రీరాముని రూపగుణ చేష్టాదులు అతని దైవత్వమును స్థిరపరచుచునే యున్నవి.

2. రామాయణము దీర్ఘ శరణాగతి ;—

పరతత్త్వమును బొందుటకు మూడు ఉపాయములు త్రివిధ మార్గములు కలవు. 1. కర్మము. 2. జ్ఞానము. 3. భక్తి. విశిష్టాద్వైత మతమునకుఁ జెందిన రామానుజీయ వైష్ణవులు ప్రపత్తిని (శరణాగతిని) నాల్గవ యుపాయముగాఁ జెప్పుదురు.

దీనికి వేదమే ఆధారము.

(1) యోబ్రహ్మాణం విదధాతి పూర్వం — యో వై వేదాగ్ంశ్చ ప్రహిణోతి తస్మై।

---

1. విష్ణుపురాణము, అంశము. 6. అధ్యాయము. 6. శ్లో. 84.
2. భగవద్గీత. అధ్యాయము. 4. శ్లో. 6.
3. దా. ప్రతి. రామాయణము. బాలకాండము. సర్గ 15. శ్లో. 29 1/2.
4. రంగనాథ రామాయణము. బాలకాండము. ద్వి. 498.
5. " " " ద్వి. 701. 1037. అయోధ్యా. 120. 121, 1014, యుద్ధకాండము 1002, 8411-8418. ఇత్యాదులు.
6. భగదీత. అధ్యాయము. 3. శ్లో. 21-25.

తగ్ంహదేవ మాత్మబుద్ధి ప్రకాశం — ముముక్షుర్వై శరణ మహం ప్రపద్యే॥"
కర్మ, జ్ఞాన, భక్తి, ప్రపత్తులనెడి చతుర్విధోపాయములలో ప్రపత్తి అన్నింటికంటె శ్రేష్ఠమైనది; భగవత్ప్రాప్తికి సులభమైనది.

"అన్యథా శరణంనాస్తి త్వమేవశరణం మమ।"
అని తన సర్వస్వమును సమర్పించి, భగవదధీనము చేసి ఆశ్రయించుట శరణాగతి యనబడును. ఈ ప్రపత్తికి అంగములు ఆరు.

"1) అనుకూల్య సంకల్పము. 2) ప్రాతికూల వర్జనము.
3) రక్షించునను విశ్వాసము. 4) గోప్తృత్వవరణము.
5) ఆత్మనిక్షేపము. 6) కార్పణ్యము "[2]

1) సర్వభూత హితము అనుకూల్య సంకల్పము,(భగవంతుని కభిముఖుడగుట- పూజాదుల యందు ఆసక్తి గలవాడగుట)

2) హింసింప శక్తియుండియు ఎవరిని హింసింపకుండ నుండుట ప్రాతికూల్య వర్జనము- (భగవంతునికి విముఖుడు గాకుండుట- పూజాదులందు అనాసక్తి పొందకుండుట. నాస్తికుడు గాకుండుట).

3) తన్ను తప్పక రక్షించునని ముందు వెనుక జూడక, ఇతరాలోచనలు లేక నమ్మి యుండుట విశ్వాసము.

4) నీవు నాకు రక్షకుడవని తన యభిప్రాయమును దెలుపుట గోప్తృత్వవరణము.

5) నేను నీ వాడను, నాది సమస్తము నీది యనుట ఆత్మ నిక్షేపము (ఇదియే అనన్య గతికత్వము).

6) భయపడి దీనుడై యుండుట కార్పణ్యము (ఇదియే ఆకించన్యము).

ఈ ప్రపత్తికి దేశ కాలాది నియమములు లేవు ఏ జాతివాడైనను, ఏ నీతి వాడైనను, స్త్రీలైనను, పురుషులైనను, బాలురైనను, వృద్ధులైనను శరణాగతులు కావచ్చును. ఈ శరణాగతి వ్యర్థముగా పోదు.

ఇట్టి ప్రపత్తికి ప్రధానాంగము భక్తి, సహకారులు కర్మజ్ఞానములు.

1) పూజ్యేష్వనురాగః భక్తిః"[3]

2) స్నేహపూర్వమనుధ్యానం భక్తిరిత్యభిధీయతే"[4]

---

1. శ్వేతాశ్వతరోపనిషత్తు- అధ్యాయము-6 మంత్రము-18.
2. అనుకూల్యస్య సంకల్పః ప్రాతికూల్యస్య వర్జనం।
రక్షిష్యతీతి విశ్వాసః గోప్తృత్వవరణం తథా।
ఆత్మ నిక్షేప కార్పణ్యౌ షడ్విధా శరణాగతిః।
బ్రహ్మాండపురాణము- ఉత్తరభాగము- లలితోపాఖ్యానము. అధ్యాయము-41, శ్లో. 76, 77.
3. కల్యాణ్-భక్త్యంక్- పుట-3.
4. శ్రీ భగవద్రామానుజాచార్యులు- గీతాభాష్యము- అధ్యాయము-7 అవతారిక,

3) "సాత్వస్మిన్ పరమ ప్రేమరూపా"¹

4) పరానురక్తి రీశ్వరే"²

అని భక్తికి పలు నిర్వచనములు గలవు. భగవంతుని ఉత్తమ పూజ్యునిగా తలంచి పరమస్నేహ పూర్వకముగా ధ్యానించుట భక్తియని సమన్వయించి చెప్పవచ్చును. అట్టి "అనన్య భక్తి చేతనే పరమాత్మ సాధ్యుడు."³ బుద్ధభూపతి ఈ భక్తివిశేషమును మూలమునందు లేకున్నను సందర్భమును పురస్కరించుకొని ప్రతిపాదించినాడు

దేవతలు క్షీర సాగరమున కేగి విష్ణువును

"భక్తవత్సల నిన్నుఁ బరికింపఁ దరమె-భక్తియోగము దక్క బయలు మాటలను"⁴

అని ప్రార్థించిరి ఇవి భక్తిలేనిచో భగవంతుని గాంచుట అసాధ్యమని తెలుపుచున్నవి. ఇట్లే సీతాగ్ని ప్రవేశానంతరము దేవతల స్తుతిలోని—

భవదీయ మాయా ప్రభావంబు దెలియ-భవదీయులకుఁ గాక పరులకు వశమె.

....

దాస భావంబునఁ దక్క నొండొకట-నీ సంవిదాకృతి నెఱయ దుర్ఘటము"⁵

అనునవి "భక్తులకు భగవంతుని మాయ వశమగును. అనగా భక్తుని మాయ లోఁగొనదు; సంసృతి బాధలను కలిగించదు" అని చెప్పినట్లయినది. భవదీయు డనగా భక్తుడు. భక్తుడే భగవంతునికి దాస్యము (సేవ) చెయును. కావున అతడు దాసు డనఁబరగును,

ఈ దాస్య స్వరూపమును—

బాణ బాణాసన పాణినై వెనుకఁ-దూణీరములఁ బూని దుర్గమాటవులఁ

బొందుగా మిమ్ము నిమ్ములఁ గొల్వవలయుఁ-గందమూలాదులు కడకఁ దేవలయు

నటఁ దృణ పర్ణాదు లరసి మీరుండఁ-గుటజము పజ్జగాఁ గూర్పంగ వలయుఁ

బదునాలుగేండ్లును బగలును రేయి-సెదుర వోవక సేవ నెఱి సేయవలయు"⁶

అని వనమునకు దన్ను వెంట గొని పొమ్మని ప్రార్థించు లక్ష్మణుని వినతి వాక్యములు స్పష్టపరచు చున్నవి.

ఇట్లు పురుషోత్తముడే సేవ్యుడని తెలిసికొని, దాస భావమును వహించి, అనన్య భక్తితో ఆత్మీయతా సమర్పణ గావించి అభయము తప్పక నిచ్చునని మహా విశ్వాసముతో అతని యందు చేరుటయే శరణాగతి యనిపించుకొనును.

ఈ శరణాగతి రామాయణమునం దాదినుండి యంతమువరకు అడుగడుగునకనిపించుచున్నది.

---

1. నారద భక్తి సూత్రములు- సూత్రము-2
2. శాండిల్య భక్తి సూత్రములు- సూత్రము-2
3. భగవద్గీత- అధ్యాయము-11 శ్లో. 54.
4. రంగనాథ రామాయణము. బాలకాండము. ద్వి. 482
5. ,, యుద్ధకాండము. ద్వి 8146-8149
5. ,, అయోధ్యా. ద్వి. 685-688

దేవతలు రావణుని బాధ పడలేక విష్ణువును శరణాగతి నొందిరి[1] ఇట్లే విగతగర్వుడైన పరశురాముడు.[2] తపోధ్యాన నిరతులైన మునీశ్వరులు,[3] కాకాసురుడు,[4] సముద్రుడు.[5] విభీషణుడు,[6] సుగ్రీవాదులు[7] శ్రీరాముని శరణాగతి నొందిరి. వీరందరు శ్రీరాముడు దప్ప అన్యులు తమకు రక్షకులు కారని తలంచి వచ్చినవారే. శ్రీరాముడు వారందరికి అభయము నొసంగి రక్షించెను. వారు కామిత ఫలముల నొంది సుఖించిరి.

"ఇతడు మిత్రునే రక్షించును. శత్రువును రక్షించ డను భయ మవసరము లేదు. శత్రుడైనను వచ్చి శరణాగతి నొందినచో తప్పక రక్షింపబడును- శ్రీరాముడీ విషయమును—

"శరణని వచ్చిన శత్రువునైనఁ-బరికింపగా రాచపాడి రక్షింప

....

ఈ విభీషణుడేల యింక సుగ్రీవ — రావణుండైన గర్వము దక్కి వచ్చి

శరణన్నఁగాతు నేచందంబు నైన"[8]

అని స్వయముగా స్పష్టపరచి యున్నాడు.

"రాముని శరణాగతినొంది రక్షించుకొనుమ"ని ఆంజనేయాదులేకాక సోదరుడైన విభీషణుడు తల్లియైన కైకసి, భార్యయైన మండోదరి మున్నగువారు రావణునకుఁ జెప్పిరి. కాని మూర్ఖుడైన రావణుడు వినలేదు. ఇచట తెలియఁదగిన ముఖ్యవిషయమేమనగా, ఎట్టి పాపాత్ముడైనను భగవంతుని శరణాగతి నొందినచో రక్షింపబడి తన యస్తిత్వమును నిలుపుకొనుననుటయే -

ఇచట ఒకటి రెండు సందేహములు కలుగుచున్నవి.

1. భరతుడు చిత్రకూట పర్వతమునకు వచ్చి. హస్తముల్ మొగిచి, పాదములు వాలి.

"నీవయోధ్యకు నింక నెమ్మివిచ్చేసి — పెంపన మతితోడఁ బట్టంబుఁ బూను,
వల్లభునెడఁ బాసి వగలఁ బెల్లడలు — తల్లుల నూరార్పు, తక్కిన హితుల
సచివులఁ జుట్టాల సకల పౌరలను — సుచరిత్ర! కృపతోడఁ జూచి పాలింపు
నన్ను నీబంటు మన్ననఁ జేసినాడు — విన్నపం బాలింపవే దయామూర్తి!"[9]

యని శ్రీరాముని శరణాగతి నొందెను. అదియేల ఫలింపలేదు?

ఇంతకు పూర్వమే దేవతలు రావణ సంహారమునకై విష్ణువును శరణుపొంది యుండిరి.

---

1. రంగనాథ రామాయణము. బాలకాండము. ద్వి-487-488.
2. ,, ,, ,, ద్వి-2388-2390.
3. ,, ,, అరణ్యకాండము ద్వి-105-106.
4. ,, , అయోధ్యా ,, ద్వి-1150-1153.
5. ,, ,, యుద్ధ ,, ద్వి-926-935.
6. ,, ,, ,, ద్వి-696-697.
7. ,, ,, కిష్కింధా ,, ద్వి-207-210.
8. ,, ,, యుద్ధకాండము. ద్వి-658, 661, 662.
9. ,, ,, అయోధ్యా కాండము. ద్వి, 1701-1704.

తల్లికోరికపై తండ్రి యానతిపై శ్రీరాముడు అరణ్యవాసమునకు వచ్చెను. ఈ రెండు కారణములు భరతుని శరణాగతి తత్కాలము నఫలించుట కడ్డుపడినవి: ఫలములో ఆలస్యమేకాని, వ్యర్థము కాలేదు; అయినను తత్కాలమున పాదుకా లాభమను ఫలమును భరతునకు లభించినది కావున ప్రారబ్ధమడ్డుపడినచో శరణాగతికి ఫలము ఆలస్యముగా వచ్చునేకాని శరణాగతి వ్యర్థము కాదని ఈ ఘటన సూచించుచున్నది

2. శ్రీరాముడు సముద్రుని శరణాగతి పొందినను, ఆతడు కోరిక పూర్తిచేయక పోవుటయే కాక ఇంకను గర్వించినాడు. అ పైదండనుచేత గాని సముద్రుడు చక్కబడలేదు. కావున శరణాగతి ఫలించుననుటలో విశ్వాసమేమి?

శ్రీరాముని కంటె సముద్రుడు అల్పుడు, అసమర్థుడు. జగజ్జన్మస్థితిలయ కారకుడైన రాముడెక్కడని పంచభూతములలో నొక్కడైన జలములలో నేకదేశప్రభువైన సముద్రు డెక్కడ? కావున అసమర్థుని శరణాగతి పొందిన ఫలించ దనియు, అల్పుడు దండము చేతనే చక్కబడు ననియు ఈ ఘటనచే సూచితమైనది.

శరణాగతి మనోవాక్కాయములనెడు త్రివిధ కరణముల చేతనైనను, అందులో నేయొక్క కరణము చేతనైనను చేయవచ్చును. ఫలితమందు వ్యత్యాస మేమాత్రముండదు. కాని శరణాగతి పూర్తికి త్రివిధకరణము లవసరము.

ఇట్లు రంగనాథ రామాయణమునందును ఒక్కొక్కసారి మూలానుసారముగాను, ఒక్కొక్క సారి మూలాతిశయముగాను ఆదినుండి యంతము వరకు ఈ శరణాగతి ఘటనలే వర్ణింపబడి శ్రీరాముడు శరణాగతత్రాణ పరాయణుడనుట నిరూపింపబడినది,

ఈ శరణాగతికి ప్రధానమైన ఫలము, మోక్షము: ఆనుషంగిక ఫలములు విరోధినాశనము, రాజ్య ధనలాభములు: పాపవిమోచనము మున్నగునవి. దేవతలు విరోధి నాశనమునకై, సుగ్రీవుడు రాజ్యలాభామునకై, విభీషణాదులు సేవకై, సముద్రాదులు ఆపన్నివారణకై, శబరీ శరభంగాదులు మోక్షమునకై శరణాగతి నొందిరి.

"సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతిచ యాచతె।
అభయం సర్వభూతే భ్యోదదామ్యేతద్వ్రతం మమ॥"[1]

అని శ్రీరాముడు చెప్పినట్లే శ్రీకృష్ణభగవానుడును

"సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణంవ్రజ।
అహంత్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః"॥[2]

అని చెప్పియున్నాడు.

ప్రపత్తియని చెప్పబడుచున్న శరణాగతియే రామాయణమునందు ప్రధానము. ఆయాపాత్రల కథాంశముల ద్వారా, ఘటనలద్వారా ఇది నిరూపితమైనది. కావున దీనిని దీర్ఘశరణాగతి యని యందురు. విశ్వామిత్రయాగ సంరక్షణ, శివధనుర్భంగ, పరశురామ విజయ, సప్తతాలభేద, సేతు

---

1. దా ప్రతి వాల్మీకి రామాయణము యుద్ధకాండము. సర్గ-18. శ్లో-33 1/2.
2. భగవద్గీత-అధ్యాయము. 18. శ్లో. 66.

బంధాములు శ్రీరాముని సర్వసామర్థ్యములను తెలుపుచున్నవి.

(3) పు రు ష కా ర ము :—

పురుషకారమును "సిఫారసు" (Recommendation) అనియు నందురు. శరణాగతుని దోషములను జూచి కోపించి కార్యభంగము చేయకుండ నుండుటకై, యేవిధముగానైనను రక్షకుడు రక్ష్యుని రక్షింమనట్లు చేయుటకును మధ్యవర్తిత్వ మవసరము. రక్ష్య రక్షకులకు సంబంధమును కలిగించి, రక్షకునిచే రక్ష్యుని రక్షింపజేయు మధ్యవర్తిత్వము యొక్క ప్రయోజనము ఈ మధ్యవర్తిత్వమే పురుషకారము. ఈ పురుషకారము లేక పోయినచో, రక్షకుడు శరణాగతుని రక్షించ వచ్చును; లేదా అపరాధియైనందున శిక్షించను వచ్చును. శరణాగతియందు పురుషకారమావశ్యకము. పురుషకార స్వరూపురాలు లక్ష్మీదేవి (సీతాదేవి)

(a) వాయసము సీత యెడ నపరాధ మొనర్చి, రాముని యిషీకాస్త్రమునకు తట్టుకొన లేక తిరిగి తిరిగి చివరకు రాముని శరణుసొంగ నతడు కృపతోడ దాని ప్రాణములను కాపాడెను (బుద్ధి పూర్వకముగా చేసిన యపరాధమునకై యొక కన్ను మాత్రము పోగొట్టబడినది.) కాని కాకము చేసి నంతటి యపరాధమును రావణుడు చేయకపోయినను శ్రీరాముడతనిని సంహరించెను. దీనికి కారణము పురుషకార భావాభావము లేయని సంప్రదాయజ్ఞులు చెప్పుచున్నారు.

"ఇవళ్ సన్నిధియాలే కాకమ్ తలై పెత్తతు;
అత్లామైయాలే రావణన్ ముడిందాన్॥"[1]

(కాకమునకు సీతాదేవి పురుషకారము లభించినది. ఆ పురుషకారము లేనందున రావణుడు సంహరింపబడినాడు.)

కావున సీతాదేవి యిచ్చట పురుషకారమును వహించినది.

(b) ఆంజనేయుడు రామ సుగ్రీవుల మధ్య స్నేహమును కలిగించినాడను2ట ప్రత్యక్షము. కాని సీతాదేవి తన యాభరణములను పడవేసి సుగ్రీవుని మొదట ననుగ్రహించినది.

(c) విభీషణుడు సుగ్రీవాది వానరుల పురుషకారమును పురస్కరించుకొని శ్రీరాముని శరణాగతి నొందినాడు [3]

ఇచట సుగ్రీవాదులు విభీషణుని చేరదీయ రాదని పలికిరి. కాని హనుమంతుడు సుగ్రీవాదుల వాదనను ఖండించి, స్వాను భవమును దెలిపి, విభీషణుని చేరదీయుమని ఆలోచన జెప్పినాడు. సీత యనుగ్రహమునకు పాత్రుడైన విభీషణుని చేరదీసి, రాముడతని కభయ మొసంగినాడు.

(d) సముద్రుడు గంగాది నదులతో వచ్చి రాముని శరణాగతి నొందినాడు. గంగాది నదులు.

"......... ఈ యబ్ధీశుఁగాచి — శుభతర మంగళ సూత్రముల్ నిలుపు

....

అపరాధిఁ గామటయదియె నీగుణము — కృపఁజూచి రక్షించు గీర్వాణవంద్య"[4]

---

1. పిళ్లయి లోకాచార్యులు ముముక్షుప్పడి ద్వయప్రకరణము-సూత్ర-20
2. రంగనాథ రామాయణము. కిష్కింధా కాండము. ద్వి. 199-219.
3. రంగనాథ రామాయణము. యుద్ధకాండము ద్వి. 629-638.
4. ,, ,, ,, ద్వి. 933-935.

అని శ్రీరాముని ప్రార్థించినవి గంగాది నదులు శ్రీరాముని ప్రార్థించుట అవాల్మీకము. ఈ కల్పన మూలమునకు వన్నె కూర్చినది. గంగ విష్ణుపాదోద్భవి-విష్ణుతనూజ, ఆడ బిడ్డఇటమధ్య వర్తిత్వము వహించి పురుషకారము చేసి అల్లుని ప్రాణములను రక్షింపఁజేసినదనుట అభిప్రాయము.

ఇట్లు సీతా, హనుమ, త్సుగ్రీవ, గంగాదినదుల పురుషకారము చెప్పబడుటచే భార్యా, మిత్ర, పుత్ర, దాసాదులు పురుషకారము వహించుటకు యోగ్యులనుట. ఈ పురుషకారము పారమార్థిక విషయములందే కాక, లౌకికమైన "అల్ప విషయములందును నిది అవసరమని లోకమంగీకరించియే యున్నది"[1]

(4) ఊర్ధ్వపుండ్రధారణాది పంచ సంస్కారములు :—

"కట్టు, బొట్టు, జుట్టు" చేత ఒకవ్యక్తి ఏ మతస్థుడో ఇట్టే పసిగట్ట వచ్చును. ఇది పూర్వకాలమునందలి మాట ఇప్పుడు అల్పసంఖ్యాకులు దప్ప ఎవరును దేనిని నిక్కర్షగా పాటించుచు లేరు. అయినను నియమములు నియమములే.

వైష్ణవుడు తప్పనిసరిగా పాటించు సంస్కారములు (నియమములు) ఐదు —

తాపః, పుండ్రం, తథానామ, మంత్రో, యాగశ్చ పంచమః।

అమీపరమసంస్కారాః పారమైకాంత్య హేతవః॥"[2]

1. తాపము 2. పుండ్రము 3. నామము 4. మంత్రము 5. యాగము. ఈ అయిదు పరమ సంస్కారములచే పరమైకాంతిక భావము ప్రాప్తించును. "ఈ తాపాది పంచసంస్కారములు గల వైష్ణవుడు జగత్పూజ్యుడై పరమపదప్రాప్తి చెందును "[3]

ఈ సంస్కారములలో ప్రధానమైనది యూర్ధ్వపుండ్రధారణము.

1. ఊర్ధ్వపుండ్రము:—

భారతదేశమున విలసిల్లిన మతములో-వేద పురాణానుమోదితములైన వానిలో ప్రధానమైనవి రెండు.

1 శైవమతము 2. విష్ణుమతము.

శివమతస్థులు శివుని పరదైవతముగా భావించి, కొల్చుచు, తచ్చిహ్నముగా తిర్యక్పుండ్రధారణము (అడ్డబొట్టు) గావింతురు. విష్ణుమతస్థులు నారాయణుని సేవించుచు తచ్చిహ్నమైన ఊర్ధ్వపుండ్రములను (నిలువుబొట్టు) ధరింతురు. వీనిని వ్యవహారము నందు నామములనుచున్నారు. "ఈ ఊర్ధ్వపుండ్ర మాహాత్మ్యము గూర్చి, అథర్వణ మహోపనిషదాదులు పలువిధములుగా ప్రశంసించినవి-"

---

1. వావిలకొలను సుబ్బారావు-మందరము-బాలకాండము పుట—382
2. భారద్వాజ సంహిత పరిశిష్టము. అధ్యాయ. 2. శ్లో 2.
3. వృద్ధ హారీతస్మృతి. అధ్యాయము. 8. శ్లో. 26.
4 (i) "హరేః పదాకృతి మాత్మనోహితాయ మధ్యేచ్ఛిద్ర మూర్ధ్వ పుండ్రం యో ధారయతి। సపరస్యప్రియో భవతి। సపుణ్యవాన్ భవతి। సముక్తివాన్ భవతి॥"

అథర్వణోపనిషత్తు.

"ఇతడు వైష్ణవుడు" అనుటకు బాహ్యచిహ్నమైన ఊర్ధ్వ పుండ్రధారణము విష్ణుభక్తులకు ప్రథమ కర్తవ్యము.

పాల్కురికి సోమనాథు డెట్లు "తిర్యక్పుండ్రములను ప్రశంసించుచు" రచియించియున్నాడో, అట్టె బుద్ధారెడ్డియు రంగనాథ రామాయణమునందు తత్ర్పకటముగా ఊర్ధ్వపుండ్ర విషయమును నుట్టంకించి యున్నాడు. చూడుడు.

a) నాగపాశబద్ధులైన రామలక్ష్మణుల యొద్దకు నారదుడు

"పొనర నుదుట నూర్ధ్వపుండ్రంబు వెట్టి"[2]

తనరగా వచ్చియున్నాడు.

b) నారదోపదేశముచే రాముడు వైనతేయుని మనమునందు స్మరించగా, వెంటనే యతడు

"లలితోర్ధ్వ పుండ్ర లలాట పట్టికయు"[3]

వెలుగగా వచ్చినాడు.

ఈ నారద,[4] వైనతేయ[5] స్వరూప వర్ణనావసరమునందు మూలమున నెచ్చటను ఊర్ధ్వపుండ్ర ప్రస్తావన కావింపబడలేదు

సరే; వీరిరువురు విష్ణుభక్తులు; ఊర్ధ్వపుండ్రములు ధరించిరని తలంపనచ్చును. కాని, రావణాసురుడు కుహనా భిక్షుక వేషమువేసి సీతాపహరణార్థమై రామలక్ష్మణులు లేనివేళ పర్ణశాల యెదుటికి వచ్చెను. అపుడు బుద్ధారెడ్డి అతనికి అచ్చముగా విశిష్టాద్వైత వైష్ణవ సన్న్యాసి వేషమును వేసినాడు.

"..

కరమున దండంబు ఘన కమండలువు-నురు లలాటంబున నూర్ధ్వపుండ్రంబు

.......పొలుపొందు పేరురంబున జన్నిదములు

......సరిఁ బూనియున్న కాషాయ వస్త్రములుఁ

దులసి పూసల పేర్లతోడ...... - ...వెడమిడి గొన్నట్టి శిఖయు

(ii) ధృతోర్ధ్వ పుండ్రః పరమీశితారం నారాయణం సాంఖ్య యోగాది గమ్యం।
జ్ఞాత్వా విముచ్యేత నరస్సమస్తై స్సంసారపాశై రిహచేతి విష్ణుం॥"
మహోపనిషత్తు

(ఇవి ఆచార్య సూక్తి ముక్తావళిలో ఉద్ధరింపబడినవి- పుట-437)

1. పాల్కురికి సోమనాథుడు, బసవ పురాణము, వావిళ్ళ ప్రతి.
   i) బూది ఫాలంబునఁ బూసిపైఁ జల్లి, ఆశ్వాస-1, పుట-38.
   ii) రుద్రాక్ష భసితాది ముద్రలుదాల్చి" ఆశ్వాస-1, పుట-41 మొదలగునవి.
2. రంగనాథ రామాయణము యుద్ధకాండము. ద్వి. 2629.
3. ,, ,, ద్వి. 2682.
4 ప. ఉ. ప్రతి వాల్మీకి రామాయణము, యుద్ధకాండము, సర్గ-27, శ్లో. 14.
5. దా. ప్రతి. వాల్మీకి రామాయణము, యుద్ధకాండము, సర్గ-50, శ్లో. 36-44.

నేలపడ... - ...అంతంత నిలుచుచు హరిహరి యనుచు"[1]

అనెడి ద్విపదలయందు నున్న "ఊర్ధ్వపుండ్రము, తులసి పూసల పేరులు శిఖ, హరిహరి యనుట" యనునవి గమనార్హములు.

సీతాదేవి వైష్ణవి- విష్ణుభక్తులు ఆమెకు ప్రీతిపాత్రులు తద్వేషమున ఆమెను సులభముగా మోసగించవచ్చును. ఇది రావణుని యూహ"యని కవి తలంచి తదనుగుణ కల్పనచేసి యున్నాడు; రూపమునకు తగిన భాషణ ముండవలెను; లేనిచో కార్యవిఘ్నము జరుగును ఈ తత్త్వము దెలియని కొందరు కవులు వేషభాషణములను పరస్పర విరుద్ధముగా వర్ణించియున్నారు. చూడుడు-

"విబూది రుద్రాక్ష లమరంగ బెట్టి-దర్భాసనంబును చేత ఝూరియును

చేబూని వణకుచు చెలియ దగ్గరకు-అడుగడుగుకూ ఆదినారాయణనుచు

కపటంపు సన్న్యాసి కడువేగ వచ్చె."[2]

ఇచ్చట వేషమునకు, నోటి మాటకు పొంతనలేదు. శంకర మతానుయాయులైన అద్వైతులు విభూతి, రుద్రాక్షలను ధరింతురు. సన్న్యాసులైనచో "నారాయణ" నామ మవశ్య ముచ్చరింతురు. కావున పై పాట యందలిది అద్వైత సన్న్యాసి వేష మనవచ్చును. కాని రంగనాథ రామాయణము నందలి రావణ సన్న్యాసి అచ్చముగా విశిష్టాద్వైత వైష్ణవ సన్న్యాసి యనుటలో నెట్టి సందేహము లేదు.

"యే కంఠ లగ్న తులసీ నలినాక్షమాలా-యే బాహుమూల పరిచిహ్నిత శంఖచక్రాః।

యే వా లలాట ఫలకే లసదూర్ధ్వపుండ్రాః-తే వైష్ణవా భువన మాశు పవిత్రయంతి॥"[3]

అనెడి శ్లోక భావ రూపమే ఇచటి కపట సన్న్యాసి రూపము.

వాల్మీకి రామాయణమునందు "ఊర్ధ్వ పుండ్ర తులసీ మాలాదిధారణము, హరిహరి యనుట" లేదు. బుద్ధారెడ్డి వ్రాసిన ఈ అమూలక విషయములకు అతని వైష్ణవాభిమానమే కారణము.

ఊర్ధ్వపుండ్ర ధారణము వైష్ణవునికి- స్త్రీకి మంగళసూత్రమువలె- అత్యంత ప్రధానమైనది. పతి సామీప్యమునందు లేకున్నను, మంగళసూత్ర మెట్లు సతిని ముత్తైదువుగా రూపించునో, అట్లె కేవలము ఊర్ధ్వపుండ్ర ధారణమే విష్ణుభక్తునిగా పరిగణింపజేసి మోక్షార్హతను కలిగించును.

2) మంత్రము :—

వైష్ణవ మతమందు ఆచార్యుని వలన శిష్యు డుపదేశముగా గ్రహించునది నారాయణాష్టాక్షరి మంత్రము. బుద్ధారెడ్డి దీనిని నారదునిద్వారా స్పష్టపరచినాడు. నారం దదాతీతి నారదః (జ్ఞానము నొసంగువాడు నారదుడు) భాగవతోత్తములలో- తదీయులలో ప్రథముడు. ఇతడు నాగపాశబద్ధులైన రామలక్ష్మణుల యొద్దకు—

---

1. రంగనాథ రామాయణము యుద్ధకాండము, ద్వి. 2682.
2. స్త్రీల రామాయణపు పాటలు- "సంక్షేప రామాయణము" కృష్ణ సంకలితము- ఆంధ్రసారస్వత పరిషత్తు ప్రచురణము.
3. అణ్ణంగరాచార్య సంగ్రహితము "నిత్యానుష్ఠాన పద్ధతి"— పుట-7 లో నుద్ధరింప బడినది.

"రమణమై నొప్పు నారాయణమంత్ర — మమలత(దన వీణయం దొప్పి మెఱయ"[1]

గా వచ్చినాడు. రావణుడు కుహనాసన్యాసి వేషమున

" కొన్ని మంత్రంబులు గొణుగుచు"..... ....హరి హరి యనుచు"[2]

వచ్చినాడు-రావణుడు ఛద్ముడు-భగన్నామములలో నొకదానిని పలికినాడు. నారదుడు జ్ఞానానుష్ఠానవ్రులు కలవాడు. కావున ప్రధాన మంత్రము నుచ్చరించినాడు. సదాచారానుష్ఠాన సంపన్నుడైన ఆచార్యోత్తముడే ఉపదేష్టృత్వమునకు యోగ్యుడు, వాల్మీకికి నుపదేశించిన వాడును నారదుడే కదా! ఆమూలకమైన ఈ రచన ప్రత్యేకముగా మంత్రమును ప్రకటించుటకే కాని వేరుగాదు.

(3) నామము :—

భగవద్భక్తులు తల్లిదండ్రులచే పెట్టబడిన పేరులు. శక్తిసామర్థ్యముల వలన వచ్చిన బిరుద నామము లెన్నియున్నను. "దాస" నామమును (అడియేన్) ముఖ్యముగా దాల్తురు-

ఆంజనేయుడు లంకలో—

"దాసోఽహం కోసలేంద్రస్య రామస్యాక్లిష్టకర్మణః॥

హనుమాన్ శత్రుసైన్యానాం నిహంతా మారుతాత్మజః॥"[3]

అని తన పేరును రాక్షసులకు(దెలిపినాడు.

లక్ష్మణుడు వటురూపుడైన ఆంజనేయునకు

"అహమస్యావరో భ్రాతాగుణైర్దాస్య ముపాగతః।"[4]

అని తనను పరిచయము చేసికొన్నాడు.

రంగనాథ రామాయణమునందు "దాస" శబ్దమునకు బదులు "బంటు" శబ్దము వాడబడినది. దీనిని అచ్చమైన తెలుగు పర్యాయ వాచక శబ్దముగా నెన్నవచ్చును.

సౌమిత్రి మారుతితో—

"అతిలోక విక్రముండతి సత్యవాది — హితుడనై బంటనై యేను వర్తింతు"[5] ననియు

అంగదుడు రావణునొద్దకు రాయబారమునకై పోయి

నీవెవ్వడని పల్క నెరుగవే నన్ను — రావణ! యేనురా రాముని బంట"[6]

ననియు లంకలో తనను పరిచయము చేసికొన్నాడు. ఇక హనుమంతుడు లంకలో

"ఓరి! రాక్షసులార: యుర్విపై నేను — శూరత విలసిల్లు సుగ్రీవు బంట

---

1. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి-2630.
2. ,, ,, అరణ్య కాండము. ద్వి. 371, 373
3. దా. ప్రతి వాల్మీకి రామాయణము. సుందరకాండము. సర్గ. 42. శ్లో. 34.
4. ,, ,, ,, కిష్కింధా కాండము. సర్గ. 14. శ్లో. 12.
5. రంగనాథ రామాయణము. ,, ,, ద్వి. 173.
6. ,, ,, యుద్ధకాండము. ద్వి 1919.

రాముని దూతను''[1]

అనిచెప్పుట మూలమునందు మార్పు చేయుట. 'రామునిబంట' నని యనక "సుగ్రీవుని బంట" ననుట "దాసానుదాసః" అనెడివిశేషమును ప్రకటింప జేయుట. రాముని దాసుడు సుగ్రీవుడు "అనిచిన బంటుగా నన్నుఁగైకొంటి"[2] అని సుగ్రీవుడే చెప్పుకొన్నాడు. ఇట్టి సుగ్రీవుని బంటు హనుమంతుడు. దాసానుదాసుడు (బంటు బంటు). కావున ఇచ్చట

"త్వద్దాసదాస గణనా చరమావధౌయః"[3]

అని నైచ్యానుసంధానమును గుర్తుచేయుటయే విశేషము.

ఈ బంటు శబ్దము నాగరికులకు కొంత ఎబ్బెట్టుగా కనిపించును. రామదాసు, రంగదాసు, కృష్ణదాసు, సూరదాసు, ఇత్యాది నామములు సుప్రసిద్ధములే కదా!

(4) యాగము :— యాగమనగా యజనము (యజపూజాయాం). భగవంతుని . పూజించుట. వైష్ణవుడు ప్రతి నిత్యము విష్ణ్వర్చా విగ్రహమున కారాధనాదులను భక్తితో గావింపవలెను. మనో నిగ్రహులకు మానసపూజ శ్రేష్ఠము. సామాన్యులకది సాధ్యము కాదు. కావున అర్చాపూజయే నిత్య మనుసరణీయము.

భరతుడు రఘురాము పాదుకాయుగళమును సింహాసనము పైనిడి "శ్రీరామునకుఁ బోలె సేవ చేయుచును"[4] వానిపై రాజ్యభారమును మోపి మహియెల్ల పాలించు చుండెను. ఆంజనేయుడు సీతాదేవికి శ్రీరామ ముద్రిక నీయగా నామె -

"రాముఁజూచిన కంటె రమణ రాగిల్లి — సేమ మేర్పడ భద్రసింహాసనమునఁ
బ్రేమతోఁ గూర్చుండఁ బెట్టిన కరణి — నామణి ముద్రిక నక్కునఁ జేర్చి
యనురక్తి నర్ఘ్యపాద్యము లిచ్చినట్లు — కనుగవ హర్షాశ్రుకణములు దొరుగ
ధూపంబు దీపంబు దోడ్తోన యొసగి — యేపార సాష్టాంగ మెఱగిన పగిదిఁ
బులకించి తిలకించి పోలతి మూర్ఛిల్లి — తెలిసి యా హనుమంతు దెసఁజూచి"[5]

పల్కినది. ఇది అమూలక వర్ణన. సీతమానసిక పూజను దెలుపుచున్నది. ఇచ్చట వక్షస్థలము భద్రసింహాసనము. హర్షాశ్రు కణములు జారుట అర్ఘ్యపాద్యాదు లొసంగుట పులకాంకురము ధూపము నేత్రకాంతులు దీపము, మూర్ఛిల్లుట సాష్టాంగ నమస్కారము చేయుటగా రూపింపబడినది. ఈ రూపకల్పన షోడశోపచార పూజ కుపలక్షణము; అర్చారాధనకు (విగ్రహారాధనకు) నిదర్శనము.

వైష్ణవులు భగవంతుని సకల కల్యాణ గుణపరిపూర్ణునిగాను, సర్వమంగళ విగ్రహునిగాను దలంతురు. వీరు నిత్యారాధనలో "సమస్త పరివారాయ సర్వమంగళ విగ్రహాయ శ్రీమతే నారాయ

---

1. రంగనాథ రామాయణము. సుందర కాండము. ద్వి 651, 652
2. ,, ,, కిష్కింధా ,, ద్వి. 215.
3. మణవాళ మహామునులు. యతిరాజ వింశతి. శ్లో. 16.
4. రంగనాథ రామాయణము. అయోధ్యాకాండము. ద్వి. 1805.
5 ,, ,, సుందరకాండము. ద్వి. 528-532.

ణాయనమః" అని యందురు. సాకారుడైనప్పుడే అర్చన సాధ్యము. అదియు అర్చారూపమున నున్నప్పుడధిక సౌలభ్యము కలిగి యానందప్రదమగును.

ఇచ్చట రామాంగుళీయకము అర్చారూపము (భగవత్సంకేతము-చిహ్నము) దానికి సీతాదేవి ఆసనాద్యర్చన గావించినది ఇట్లే భక్తుడు సాక్షాన్నారాయణుని గాని, విభవావతారములలో నేదైన రూపమునుగాని, లేక భగవన్నామ చిహ్నిత వస్తువునుగాని భగవంతునిగానే భావించుచు నిత్య మర్చించునది యని ఈ వర్ణనము తెలుపుచున్నది.

(5) తాపము —

బాహువులందు శంఖ చక్రములను తాపసంస్కారము ద్వారా ధరించుట ఈతాపసంస్కారము సకల తపస్సులకు ప్రతిబింబము"[1]

"యే బాహుమూల పరిచిహ్నిత శంఖచక్రాః"

అని వైష్ణవులు కొనియాడ బడుచున్నారు.

రంగనాథ రామాయణమునందిది ప్రత్యేకముగా చెప్పబడకున్నను పై నాల్గింటిచేత దీనిని ఊహించుకొనవలసినది.

ఇట్లు పంచ సంస్కారములను స్వీకరించుటను సమాశ్రయణమందురు. బుద్ధారెడ్డి దీనిని తన గ్రంథమునందు సందర్భమును బురస్కరించుకొని, ఆయా తావులందు చక్కగా వ్యంజింపఁ జేసినాడు.

5. శ్రీరాముని వాత్సల్యాది దివ్యగుణసంపత్తి -

భగవంతుని అవతారమునకు కారణములు మూడు

"1. సాధురక్షణము, 2. దుష్టశిక్షణము. 3. ధర్మసంస్థాపనము"[2]

ఈ గీతా తాత్పర్యమును భంగ్యంతరముగా రావణున కుపదేశము చేయు సందర్భమునందు బుద్ధారెడ్డి విభీషణుని చేత,

"ఎసగి దివ్యులఁ బెంప ఋషుల రక్షింప — నసురుల శిక్షింప నవనిఁ బాలింప

నాది నారాయణుం డర్క వంశమున — నీదాశరథిగాగ నిట్లు జన్మించె"[3]

నని యనిపించినాడు. ఈమాట లమూలకములు. వనజాసనాదులును వర్ణింపనలవిగాని, సనకాదులును చర్చింపలేని మహామహిమ కల శ్రీరాముడు మర్త్యుడు కాడు

ఇంద్రజాలాది విద్యల నెఱింగిన, తపశ్శక్తి చేత అతీంద్రియ శక్తి (అంతరింద్రియ శక్తి) గలిగిన మహామహిమోపేత మానవు డంతకంటెను కాడు; సాక్షాత్తుపరబ్రహ్మస్వరూపము. ఈ

---

1. భారద్వాజ సంహిత.పరిశిష్టము. అధ్యాయము. 2. శ్లో. 57.
"తాపస్త పాంసి; తీర్థాని పుండ్రం, నామ నమస్క్రియా।
ఆమ్నాయాః సకలామంత్రాః, క్రతవః పూజనం హరేః"
2. భగవద్గీత. అధ్యాయము. 4 శ్లో. 8.
3. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి. 519, 520.

పరబ్రహ్మ నిర్గుణ మని కొందరు,[1] సగుణమని కొందరు వేదోపనిషదాధారముగా చర్చించి చర్చించి ఇదమిత్థమని నిర్ణయింప జాలక వేదము[2]వలెనే మౌనము వహించినారు. "మరికొందరు నిర్గుణ, సగుణ శబ్దములను సమర్థించి, సమన్వయించి, పరబ్రహ్మతత్త్వమును దర్శింపఁ జేసినారు పరబ్రహ్మ నిర్గుణము-అనగా హేయగుణములు లేనిది అనియు, పరబ్రహ్మ సగుణము-అనగా అనంత కల్యాణ గుణగణములు గలది యనియు' [3] సారార్థము

బుద్ధారెడ్డి ఈ రెండింటిని సందర్భానుసారముగా సూచించినాడు. వసిష్ఠుడు దశరథుని అన్వయక్రమమును "అవ్యక్త ప్రభవో బ్రహ్మ"[4] అని ప్రారంభించెను. అవ్యక్తము-ప్రత్యక్షాద్య గోచర వస్తువు; ఇది కారణముగా కలవాడు బ్రహ్మ.

రంగనాథ రామాయణమునందు-

"నరనాథ విను నిర్గుణ బ్రహ్మమైన — హరి సగుణైక లీలాకృతిఁదాల్చి

నిజలీలకై నాభి నీరజంబందు — నజునిఁ గల్పింపంగ హరి కజుఁడొదవె"[5]

నని ఈ అవ్యక్త శబ్దము వ్యాఖ్యానింప బడిన రీతి పొడకట్టును.

జనక వంశక్రమము మూలమునందు 'నిమి'[6] చక్రవర్తి యొద్దనుండి ప్రారంభింపబడగా, నిందు

"సద్విజ పరమహంస ప్రతిపాద్యు — డద్వితీయ బ్రహ్మమైన యచ్యుతుని

నాభి సరోజంబునను బ్రహ్మపుట్టె"[7]

నని ప్రారంభింపబడినది.

"సదేవ సోమ్యేద మగ్ర ఆసీదేక మేవాద్వితీయం"[8]

అను శ్రుత్యర్థమిందు పొదిగింపఁబడినది.

సగుణ లీలాకృతి దాల్చిన నిర్గుణ బ్రహ్మమును, అద్వితీయ బ్రహ్మమును అచ్యుతుడైన హరి యనియె బుద్ధారెడ్డి ప్రతిపాదింప దలంచినాడు అమూలకముగా నిట్లు వ్రాయుట పరమాత్మ అఖిల హేయ ప్రత్యనీకానంత కల్యాణ గుణైకతాన ధనుట.

"శ్రీరాముని కల్యాణగుణములు అనంతములు. అతని పట్టాభిషేకము గోరుచున్న దశరథునకు

---

1. శంకరాచార్య భగవత్పాదులు.
2. తైత్తిరీయోపనిషత్తు-ఆనందవల్లి నవమోఽనువాకము
"యతో వాచో నివర్తంతే। అప్రాప్య మనసా సహ।"
3. శ్రీభగవద్రామానుజాచార్యులు- శ్రీభాష్యము జిజ్ఞాసాధి కరణము మహాసిద్ధాంతము.
4. దా-ప్రతి-వాల్మీకి రామాయణము-బాలకాండము-సర్గ-70 శ్లో-17
5. రంగనాథ రామాయణము-బాలకాండము. ద్వి-2030,2031.
6. దా-ప్రతి-వాల్మీకిరామాయణము-బాలకాండము-సర్గ-71, శ్లో-3.
7. రంగనాథ రామాయణము. బాలకాండము. ద్వి-2111-2113
8. ఛాందోగ్యోపనిషత్తు-షష్ఠప్రపాఠకము-ద్వితీయ ఖండము-మంత్ర-1.

పౌర జానపదులు తమ శక్తి కొలంది కొన్నింటిని వాచ్యము చేసినారు."[1] ఈ గుణములకు లక్ష్యములుగా రామచరిత్రయందు ఆయా సంఘటనలు ప్రతి పాద్యములైనవి.

విశిష్టాద్వైత మతమున, భగవంతుని ఈ అనంత కల్యాణగుణ గణములలో ఆరింటికి అధిక ప్రాధాన్యము కలదు కావున నతనిని షడ్గుణైశ్వర్య సంపన్నునిగా నుతింతురు.

"భరణః పోషణాధారః శరణ్యః సర్వవ్యాపకః।
కరుణః షడ్గుణైః పూర్ణో రామస్తు భగవాన్ స్వయం॥

అని మహారామాయణమునం జెప్పబడినది

ఐశ్వర్యస్య సమగ్రస్య వీర్యస్య యశసః శ్రియః।
జ్ఞానవైరాగ్యయోశ్చైవ షణ్ణాం భగఇతీరణా॥"[3]

అని భగవచ్ఛబ్దమునకు వ్యుత్పత్తి కలదు. ఇట్టి షడ్గుణైశ్వర్యము కలవాడు భగవంతుడని తాత్పర్యము

"పరబ్రహ్మ యొక్కడే భగవచ్ఛబ్ద వాచ్యార్థుడు. తదితరులందు తదంశ కొంత ప్రకటింపబడినపుడు అట్టివారికి భగవత్పదము నౌపచారికముగా చేర్తురు"[4] భగవద్బోధాయనులు; వాల్మీకి భగవానుడు, మున్నగువారు.

విశిష్టాద్వైత మతావలంబులైన వైష్ణవులు ఐశ్వర్యాది గుణములకు ప్రాధాన్యమీయక "వాత్సల్యస్వామిత్వ, సౌశీల్య, సౌలభ్య, జ్ఞానశక్తులను"[5] షడ్గుణములకు ప్రాముఖ్య మొసంగుదురు. కారణమేమనగా,

"అపరాధంబులను దలంచుకొని భయపడకుండుటకు గాను వాత్సల్యము, కార్యమును తప్పక నిర్వహించునని నమ్మి యుండుటకు గాను స్వామిత్వము, స్వామిత్వము దలంచుకొని వెనుదీయ కుండుటకుగాను సౌశీల్యము, సేవించి యాశ్రయించుటకుగాను సౌలభ్యము, విరోధులను నివర్తింపంజేసి తనను లభింప జేయుటకుగాను జ్ఞానశక్తులు"[6] అని ఈ షడ్గుణములకు ప్రయోజనము కనబరుతురు.

శరణాగతుని కావశ్యకమైన ఈ యాఱు గుణము లెవ్వని యందు సంపూర్ణముగా నుండునో, ఆతడే ఆశ్రితుని రక్షించును. దానివలన శరణాగతి ఫలవంతమగును.

రామాయణము శరణాగతి శాస్త్రముగాను ప్రసిద్ధి చెందినది. శ్రీరాముడు శరణాగత త్రాణ పరాయణుడుగా కీర్తింపబడినాడు. మోక్షమను పరమ పురుషార్థ సిద్ధికి శరణాగతి కంటె మించిన

---

1. (a) దా-ప్రతి-వాల్మీకి రామాయణము-అయోధ్యాకాండము. సర్గ-2 శ్లో-26-47.
   (b) రంగనాథ రామాయణము-అయోధ్యాకాండము. ద్వి. 48-56.
2. శ్రీరామ వచనామృతాంక్. (కల్యాణ్-హిందీ) పుట-28.
3. గురుబాలప్రబోధిక-(అమరకోశ వ్యాఖ్యానము) ప్రథమకాండము. స్వర్గవర్గము 13వ శ్లోక వ్యాఖ్య-పుట 23.
4. భగవద్రామానుజాచార్యులు-శ్రీభాష్యము-జిజ్ఞాసాధికరణము. పుట-1.
5. పిళ్లైలోకాచార్యులు-ముముక్షుప్పడి. ద్వయప్రకరణము. సూ. 22
6. కందాడై శేషాచార్యులు. తెనుగు ముముక్షుప్పడి. ద్వయప్రకరణము. సూ-23.

సులభోపాయము లేదు.

రామాయణము శ్రీరాముని యొక్క వాత్సల్యాది షడ్గుణములను ప్రతిపాదించు చున్నది. బుద్ధభూపతి వీనిని ఒక్కొక్క సారి మూలాను సారముగాను, మరొక్కసారి మూలాతిశయముగాను ప్రకటించినాడని పరిశీలించినచో స్పష్టమగును.

(1) వాత్సల్యము :—

వత్సం లాలయతీతి వ్యుత్పత్త్యయే వత్సలశబ్దః। తస్యభావో వాత్సల్యం। అద్యజాతే వత్సేధేనో ర్దోషా నాదర హేతుస్నేహ విశేషః। తాదృశ్యస్నేహకార్యం దోషాదర్శనం। తదుత్కటావస్థాకార్యం దోషేషు గుణత్వబుద్ధిః॥"[1]

అని యిట్లు వాత్సల్యము వివరింపబడినది.

ఆవు తనలేగ యందలి దోషమును (మాలిన్యమును) భోగ్యముగా స్వీకరించును. మధురక్షీర ముల నొసంగి పోషించును; కొమ్ములతో పొడిచియు, కాళ్ళతో తన్నియు శత్రువుల బారిబడ కుండ రక్షించును. లేగ విషయమునఁ గనబరచు ఆవుయొక్క యిట్టి స్నేహగుణమే వాత్సల్యమనబడును.

రామునియందీ వాత్సల్య మపారముగా గలదు. ఇతడు తననాశ్రయించిన వారి దోషములను చూడడు; ఇష్టార్థముల నొసంగి పోషించును; ఆపదలనుండి, పగతుర నుండి రక్షించును.

(a) శరణాగతి నొందిన విభీషణుని గూర్చి సుగ్రీవాదులు శ్రీరామునకు చెడుగాఁ జెప్పినను శ్రీరాముడు వాని నన్నింటిని త్రోసి రాజని

"మిత్రభావేన సంప్రాప్తం నత్యజేయం కథంచన।
దోషోయద్యపి తస్యస్యాత్సతా మేత దగర్హితం॥"[2]

అనిపలికి విభీషణుని చేరదీసి, లంకారాజ్యము నొసఁగి రక్షించెను. బుద్ధభూపతి శ్రీరాముని వాత్సల్య గుణమును స్పష్టపరచుటకై ఈ సందర్భము నింకను కొంచెము విశేషముగా పెంచివ్రాసి నాడు. ఈ పెంపుదల మూలమున లేని శిబి కథను జొప్పించుట.

"శరణని వచ్చిన శత్రువు నైనఁ — బరికింపగా రాచపాడి రక్షింప
నొక కపోతము డేగ యుద్ధతిఁదఱుమ — వికల భావంబున వేగంబు వచ్చి
శిబి మాటుసొచ్చెఁ జొచ్చిన డేగ వడుగ — శిబితను విచ్చి చెచ్చరఁ గువ్వఁగాచె

....

ఈ విభీషణుడేలయిఁక సుగ్రీవ- రావణుండైన గర్వము దక్కివచ్చి
శరణన్నఁగాతు నేచందంబునైన"[3]

అమూలకమైన ఈ శిబిచక్రవర్తి కథ శ్రీరాముని వాత్సల్యగుణ ప్రతిపాదన కద్దము పట్టినది.

(b) శ్రీరాముడు ఇషీకాస్త్రమునుండి తప్పించుకొన లేక తిరిగి తిరిగి వచ్చి శరణాగతి పొందిన కాకాసురుని తన భార్య కపకృతి గావించిన యతని దోషము జూడక రక్షించెను

(c) రావణ వధానంతరము శ్రీరామ విజయ సందేశమును దెచ్చిన హనుమంతుడు సీతాదేవితో

---

1. తాత్పర్యదీపిక ద్వయాధికారము పుట. ౪౩౬.
2. దా-ప్రతి-వాల్మీకి రామాయణము. యుద్ధకాండము. సర్గ. 18, శ్లో 3.
3. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి. ౬౬౪-౬౬౩.

ఆమెను బాధించిన రాక్షసస్త్రీలను సంహరింతునని పలికెను. అపుడు సీతమ్మ

" ఏసిన వాడుండ నిపువేమి సేయు; — ....

తొల్లినేఁ జేసిన దుష్కర్మ ఫలములెల్లను గంపి వీరేమి సేయుదురు;

అనఘ చారిత్ర పాపాత్ములందైన — ఘనులు దయాబుద్ధిఁ గలిగి యుందుదురు;

గాన నీరాక్షస కాంతలఁజంప — వానరోత్తమ నీకు వలద"ని[1]

ఆంజనేయుని నిరుత్తరుని జేసి రాక్షసస్త్రీలను కాపాడినది. ఇట్టి ఘటనలు శ్రీసీతారాముల వాత్సల్య గుణమును స్పష్టపరచుచున్నది. ఇట్లే సుగ్రీవాదుల సంరక్షణము శ్రీరాముని వాత్సల్యగుణ ప్రకటనమే!

(2) స్వామిత్వము :-

"స్వామిత్వంతు పూర్వోక్త వాత్సల్య హేతు స్తదీయ లాభస్య స్వలాభత్వాపాదక స్సంబంధ విశేషః। ఏతేనబంధ విశేషాభావద్దోషేష్వాను కూల్య వేదన హేతుస్నేహ విశేషో న సంభవతీతి శంకా వ్యావర్తతే। ఏవంచ అస్యాపరాధ భయ నివర్తకత్వమేవ ఫలితం"[2]

అని స్వామిత్వ గుణము వివరింపబడినది,

స్వమ్ము అనగా సొత్తు; అది గలవాడు స్వామి చరాచర ప్రపంచమంతయు భగవంతుని సొమ్మే అతడిహపరములనియెడి ఉభయ విభూతులకు నాయకుడు. సొమ్ము చెడినను, పోయినను స్వామికే దుఃఖమును, నష్టమును కలుగును. కావున చెడిన సొత్తును బాగుపరచుటకును, పోయిన సొమ్మును మరల పొందుటకును స్వామియైన వాడే స్వయముగా ప్రవర్తించును.

ఆత్మభరన్యాస మొనర్చిన శరణాగతులందరును, తమ రక్షణయందు తాము ప్రవర్తించక స్వామియైన భగవంతునికే వదలి పెట్టుదురు. తమ దోషములను జూచి, అతడు తమ్ము రక్షించునో, రక్షింపడోయను సందేహమునుకూడ విడిచి తప్పక స్వామి తమ పనిని నెరవేర్చుననెడి భావనతో నిర్భయముగా నుందురు. ఇట్టి భక్తుల రక్షణ భారమును తనదిగా భావించి తనకు తానే వారిని రక్షించుటకు ప్రవర్తించుట స్వామిత్వమనఁ బడును ఇది వాత్సల్య గుణమునకు కారణమై, తదీయుల లాభమును తన లాభముగా నాపాదించుకొనునట్టి సంబంధ విశేషము. దీనిచే భగవంతుడు తప్పక తమను రక్షించు ననెడి విశ్వాసము భక్తులకు కలుగుటయే కాక, యపరాధభయ నివారణ మగుటయే ఫలితార్థము—

ఈ స్వామిత్వము రామాయణమునందు చక్కగా ప్రతి పాదింపబడినది.

(a) శ్రీరాముడు పితృవాక్య పరిపాలన నెపమున నడవికి వచ్చి, ఇతఃపూర్వమే శరణాగతినొంది తనయాగమనమును గోరుచున్న సుతీక్ష్ణ శరభంగాది మునుల కభయంబు లిచ్చి.[3] యూరడించి దానవులను వధించి వారిని రక్షించెను.

---

1. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి. 8034-8037.
2. తాత్పర్యదీపిక. ద్వయాధికారము. పుట. 338.
3. రంగనాథ రామాయణము. అరణ్యకాండము. ద్వి. 108-109.
4. ,, ,, ,, ,, 122-123.

(b) సుగ్రీవుడు తొలిసారి యుద్ధమున వాలిచే తన్నులు దిని చావు దప్పి కన్నులొట్ట వోయిన రీతి వచ్చి రాముని యెడ ననుమాన పడగా, నతడు "వాలి సుగ్రీవుల రూపు రేఖలు సమమగుటచే నేయ వెఱచితి"[1]నని సమాధాన పఱచి, భయముడిపి, లక్ష్మణునిచే గజపుష్పమాలను గుర్తునకై సుగ్రీవుని కంఠమున వేయించి, మరల యుద్ధమునకు బంపి, తత్సంగరమున వాలిని హతమార్చి సుగ్రీవుని రక్షించెను.

(c) దశకంఠుడు వదలిన శక్తి విభీషణుని క్షణములో రూపఱ జేయనుండగా, లక్ష్మణుడాశక్తి కడ్డువచ్చి విభీషణుని రక్షించుటకు మూల కారణము శ్రీరాముని అభయ ప్రదానమే కదా!

ఇట్లు శ్రీరాముడు శరణాగతులైన వారిని స్వయముగా రక్షించియు, తనవారివలన రక్షింప జేసియు నుద్ధరించినాడు. ఈ ఘటనలు అతని స్వామిత్వమును నిరూపించు చున్నవి.

(3) సౌశీల్యము :—

"శీలం—మహతో మందైస్సహ నీరంధ్రేణ సంశ్లేష స్వభావత్వం; తస్యసౌష్ఠవమ్- సౌశీల్యమ్; మందసం శ్లేషదశాయామపి స్వమహత్వ బుద్ధి రాహిత్యమ్॥"[2]

అని సౌశీల్యము వివరింపబడినది.

మహాపురుషులు తమకన్న తక్కువ వారితో కలసి మెలసి కూడియుండు స్వభావము సౌశీల్యము. అట్లు తక్కువ వారితో కలసి యున్నవేళ మహాపురుషులు తమ మహత్వమును దలంచక పోవుటయును సౌశీల్యమే.

శ్రీరామచంద్రుని యందీ గుణమతిశయముగా నున్నది.

(a) పౌరులు దశరథునికి—

"సంగ్రామాత్పున రాగమ్యకుంజరేణ రథేనవా।
పౌరాన్ స్వజన వన్నిత్యం కుశలం పరిపృచ్ఛతి॥

....

వ్యసనేషు మనుష్యాణాం భృశంభవతి దుఃఖితః।
ఉత్సవేషుచ సర్వేషు పితేవ పరితుష్యతి॥"[3]

అని శ్రీరాముని గుణములను గూర్చి విన్నవించిరి. ఈ శ్లోకములకు సరియైన ద్విపదలు రంగనాథ రామాయణమున లేవు; అయినను ఈ యర్థమునే భంగ్యంతరముగా -

"అనుదినంబును బేదలగు వారినెల్ల — మనమున ముదమొంద మన్నించువాని,

....

తలప నీతడు తలిదండ్రు లర్భకుల — నలరించు గతి మమ్ము నలరింప గలడు"[4]

అను ద్విపదలందు రచయిత విశద పరచినాడు. ఇంతే కాక శ్రీరాముడు గుహునితో, సుగ్రీవునితో,

---

1. రంగనాథ రామాయణము. కిష్కింధాకాండము. ద్వి. 437-443
2. తాత్పర్యదీపిక. ద్వయాధికారము. పుట 49
3. దా ప్రతి వాల్మీకి రామాయణము. అయోధ్యాకాండము. సర్గ 2 శ్లో. 37 1/2, 40 1/2.
4. రంగనాథ రామాయణము. అయోధ్యాకాండము. ద్వి. 5, 37.

విభీషణునితో, జటాయువుతో, ఉడుతతో, కలసియున్న విధము అతని సౌశీల్యమునకు నిదర్శనము.

(b) గుహుడు చెంచురాజు. రాఘవుడు

"అతని సద్భక్తికి నతని శక్తికిని — అతని ధీరోక్తుల కానందమంది
అతనిఁ గౌగిటఁజేర్చి యాదరంబెసఁగ"[1]

నతనితో సంభాషించినాడు తమదుర్దశకు శోకింపగ,

"రాముడప్పుడు కృపారస మగ్నుడగుచు — సౌమిత్రియును దాను సముచిత భణితి
గుహుశోకముడిపి"[2] నాడు.

ఇంతేకాక, "శ్రీరాముడు గుహుని తనతో సమానుడైన సఖునిగా సంభావించినాడు."[3] కావున మిత్రుడు మిత్రుని జూడగనే ఆప్యాయతతో నాలింగనము చేసి కొన్నట్లు, పరస్పర సుఖదుఃఖములను గూర్చి ప్రేమతో మాట్లాడు కొన్నట్లు ఇచట శ్రీరామ నిషాద పతుల ప్రవర్తన యున్నది. చెంచు జాతికి చెందిన గుహుడెక్కడ? చక్రవర్తి కుమారుడైన శ్రీరాము డెక్కడ? ఇరువురికి హస్తిమ శకాంతరము. ఆత్మతుల్యుడైన మిత్రునిగా భావించి గుహునితో ప్రవర్తించిన శ్రీరాముని సౌశీల్య మాశ్చర్యకరము.

(c) సుగ్రీవుడు వానరుడు. అతడు భక్తితో శ్రీరాముని డాసి. సాష్టాంగ నమస్కారము చేసి ముకుళిత హస్తుడై ముందర నిలబడగా, శ్రీరాముడతనిని కౌగిలించి,

"నీవాయు పుత్రుచే నినసుతయేను — నీ విక్రమంబును నీగుణావళులు
విని ప్రీతి నొందితి వెఱవకు మింక — నెనసి నీపగవాని నేనె చంపెదను
నాకాప్త బంధుండు నమ్మిన సఖుడు — నీకంటు నొకడు గణించిన గలడె"[4]

యని యూరడించి, మిత్రునిగా స్వీకరించి యుద్ధరించెను ఇచ్చట శ్రీరాముడు తనపనికి సుగ్రీవుని శరణాగతి నొందనాడనుట లౌక్యము. జగదేక నాథుడగు నతడు సుగ్రీవుని చేరదీసి ఆత్మసమానునిగా నెన్నుటయను సౌశీల్యగుణ ప్రకటనము పరమార్థము

(d) శ్రీరాముడు విభీషణుని యెడ ప్రవర్తించిన తీరులో సౌశీల్య గుణము పరాకాష్ఠకు చేరినది- మూలమునందు శరణాగతినొందిన విభీషణుని చేరదీసి "ఆలింగన మొనర్చి తగిన రీతి సంభాషించి నట్లు[5]" సామాన్యముగాఁ జెప్పబడగా' రంగనాథ రామాయణమునందు—

"అనవుడు నతని కృపాంబుధిలోన, మనుజేశ్వరుండు క్రమ్మఱనోలలార్చి.
నమ్ము విభీషణ! నాకేశ వైరి — తమ్ముడవా? నాకు తమ్ముడవీవు
మఱుగకు మింక లక్ష్మణుకంటె నిన్ను — నఱలేని వానిగా నాత్మఁ గైకొంటి
నని భయంబుడిపి పయార్ద్ర వాక్యముల — జననాయకుడు విభీషణు నాదరించి
నెయ్యంబుతోడ నా నృపు"[6] — దుండినట్లు వర్ణింపబడినది.

---

1. రంగనాథ రామాయణము అయోధ్యాకాండము. ద్వి-1045-1046
2. ,, ,, ,, ,, ద్వి-1049-5050
3. దా ప్రతి వాల్మీకి రామాయణము అయోధ్యాకాండము సర్గ. 50,శ్లో-32 1/2
4. రంగనాథ రామాయణము కిష్కింధాకాండము, ద్వి. 212-214
5. దా ప్రతి వాల్మీకి రామాయణము యుద్ధకాండము ది. 698-702
6. రంగనాథ రామాయణము. యుద్ధ-ద్వి-698-702.

దానవ జాతికి , శత్రుపక్షమునకు చెందిన విభీషణుని తమ్మునివలె భావించి దగ్గరకు దీసి యాదరించి, నెయ్యముతో నుండుట సౌశీల్యమునకుఁ బరాకాష్ఠ కాక మతేమి?

(e) జటాయువు గ్రద్దలకు రాజు. ఇతడు పంచవటికి పోవుచున్న శ్రీరామునితో—

............మీతండ్రి సఖుఁడ సుమీయేను రామ

యితరుండగాను మీహిత కార్యపరుఁడ — నతుల సాహసుఁడ జటాయువన్ వాఁడ[1]"

నని తనను పరిచయము చేసికొనెను. శ్రీరాముడును

............దశరథునట్లుగా నతని — మనమున యోజించి మైత్రిఁబూజించి"[2]

పంచవటి కేగెను. ఇట్టి జటాయువు సీతాపహరణ సమయమున సీతను రక్షించుటకై రావణునితో పోరి, ఱెక్కలు ఖండింపబడగా, నేల మీద పడి మూలుగుచుండెను. పిదప సీతనన్వేషించుచు వచ్చుచున్న శ్రీరాముడు జటాయువును గాంచి దుఃఖితుడై

"అయ్యో మహాత్మ జటాయువా నీకు — నియ్యవస్థలు వచ్చెనే మదర్థముగ

నని జటాయువు దేహమందందఁ దడవి — తను రక్తమంతయుఁ దానె తుడుచుచును

దమ్మునిఁ జూచి యీతఁడు మన కొరకు — నిమ్మాడ్కి రావణునెదిరి పోరాడె

నిటువంటి పుణ్యాత్ముడెందైన గలడె"[3]

యని ప్రశంసించుటయే కాదు. అతని మరణానంతరము తన తండ్రి మరణంబు కంటెను అధికముగా దుఃఖించి,

విహగ వల్లభునకు వేదోక్తయుక్తి — దహనాది కృత్యముల్ దగనాచరించెను[4]

దశరథుడు కూడ శ్రీరామునిచే దహనాది కర్మలకు నోచుకొన లేదు. స్వయముగా జటాయువున కట్టి మహద్భాగ్యము కలిగించిన శ్రీరాముని సౌశీల్యము వర్ణనాతీతము.

(f) "ఉడుత సామాన్యమైన జంతువు. ఇది సేతునిర్మాణ సందర్భమున వార్ధిమున్గి వచ్చి, ఇసుకలో పొరలాడి తన మేనికంటిన ఇసుకను కట్టపై రాల్చుచుండగా, శ్రీరాముడు చూచి, సుగ్రీవుని చే దానిని దెప్పించి, పలువిధముల ప్రస్తుతించి, దక్షిణ కరాగ్రమున దానిని దువ్వెను"[5] ఉడుత జన్మ ధన్యమయ్యెను.

గుహ సుగ్రీవ, విభీషణులు నర, వానర, దానవ జాతులకు సంబంధించినవారు. శ్రీరాముడో పురుషోత్తముడు ఇతడు తన మహత్వమునుండి, మహోన్నత స్థానము నుండి దిగివచ్చి తన నాశ్రయించిన వారెట్టి తక్కువస్థాయికి చెందిన వారైనను, వారితో గాఢమైన స్నేహబంధము కలిగి తన మహత్వమునే మరచిపోయి సంచరించినాడు, పాలలో వెన్నవలె రామాయణమంతయు శ్రీరాముని సౌశీల్య గుణముచే విరాజిల్లుచున్నది.

---

1. రంగనాథ రామాయణము అరణ్యకాండము ద్వి. 228-229
2. ,, ibid ,, అరణ్యకాండము ద్వి. 231
3. ,, ibid ,, అరణ్య ,, ద్వి. 1376-1379
4. రంగనాథ రామాయణము అరణ్యకాండము. ద్వి. 1387
5. ,, ibid ,, యుద్ధకాండము . ద్వి. 1098-1116

(4) సౌలభ్యము :—

"భగవంతుని రూపము మాంసచక్షువులచే చూడరానిది"1. "ఇంద్రియములకు గోచరింపనిది కూడ"2, ఇట్లు ఇంద్రియములకు విషయభూతుడు కాదనుకొని వెనుదీయకుండ కంటితో చూచి యాశ్రయించుట కనుకూలమగునట్లు తన స్వరూపమును చక్షురింద్రియ గోచరమైనదిగా చేయుటను సౌలభ్య గుణమందురు.

"అతీంద్రియత్వేన శ్రుతి సిద్ధస్య విగ్రహస్యసకల మనుజ నయన విషయతాపాదన పూర్వకం నిత్య సాన్నిధ్య కరణం; తస్యచ ప్రయోజనం దౌర్లభ్య భయ నివృతిః"3 అని యిది వివరింప బడినది. కావున భక్తుడాశ్రయించుటకుపయుక్తమైన పరబ్రహ్మ గుణము సౌలభ్యము. ఆ పరబ్రహ్మ ఆదినారాయణుడే శ్రీరాముడుగా నవతరించినాడు గదా! కావున ఈ గుణమతని యందు సంపూర్ణముగా నెలకొని యున్నది.

"సర్వదాభిగతః సద్భి రదీనాత్మా విచక్షణః4"

....

శీల వృద్ధైర్జ్ఞాన వృద్ధై ర్వయో వృద్ధైశ్చ సజ్జనైః।

కథయన్నాస్తవై నిత్యం అస్త్ర యోగ్యాంతరేష్వపి॥"5

అనునవి యిందుకు ప్రమాణములు. సజ్జనులు తన సమీపమునకు ఎట్టి వేళయందైనను నిరాటంకముగా రావచ్చునంతటి సౌలభ్యగుణము కలవాడు శ్రీరాముడనిపై శ్లోకములు వ్యక్తము చేయుచున్నవి

(a) జగదభిరాముడైన శ్రీరాముడు పితృవాక్య పరిపాలనమును మిషచే వనమునకు వచ్చుట పల్లెలు పట్టణములు అడవులు కొండల యందు నివసించు తపోధనులకును, సామాన్యులకును, పశు పక్ష్యాదులకును దర్శనమొసంగి వారిని తరింపఁజేయుటకే.

(b) రావణవధానంతరము విభీషణుడు సీతామహాలక్ష్మిని పల్లకి యందు కూర్చుండ జేసి అశోకవనమునుండి రాముని యొద్దకు తీసుకొని వచ్చుచుండగా నామెను జూడఁగపులు, రాక్షసులు చుట్టు ముట్టిరి. విభీషణుడదయుడై సందడి తొలగుటకై చేతిబెత్తముతో కొట్టుచుండెను. శ్రీరాముడిది చూచి —

"ఓహో విభీషణ! యుచితమే నీకు — నూహింపగా నిట్టి యుగ్ర కృత్యములు
వింతవారెవ్వరు వీరిలో మనకు —, నింత నొప్పింతురే యిబ్బంగిఁగడగి
వలవదు వారింప, వచ్చియందఱును. గలసి చూతురుగాక కలదె యెగ్గిందు"6

---

1. ఋగ్వేదము, "నమాంసచక్షు రభివీక్షతే తం"
2. తైత్తిరీయమునా-రాయణోపనిషత్తు అనువాకము.3
"నసందృశే తిష్ఠతి రూపమస్య నచక్షుషాపశ్యతి కశ్చనైనం"
3. తాత్పర్య దీపిక ద్వయాధికారము. పుటలు. 339-340.
4. దా. ప్రతి వాల్మీకి రామాయణము బాలకాండము. సర్గ-1 శ్లో. 16
5. ,, ibid ,, అయోధ్యాకాండము. సర్గ. 1 శ్లో-12
6. రంగనాథ రామాయణము-యుద్ధకాండము-ద్వి. 8069-8071.

అని ఆవరణమును దొలగింపఁ జేసి కాలినడకను రప్పించి, దుర్లభమైన సీతామహాలక్ష్మి దర్శనమును సర్వదర్శన యోగ్యముగాఁ జేసినాడు రామునే యాచేష్ట అతని సౌలభ్యగుణమునకు బరాకాష్ఠ

(c) రాయియై పడియున్న యహల్యయొద్దకుఁ బోయి శాపవిముక్తిని కలిగించినాడు.

(d) తనకై యెదురుచూచుచున్న శబరియొద్దకు (బోయి దర్శనమొసంగుటయే కాక ఆమె యొసంగిన వన్యమూల ఫలాదులను నెలమి మీఱి భుజించినాడుఁ (శబరి యెంగిలి పండ్లను తిన్నాడని లోక ప్రసిద్ధి)

ఇట్టిఘటనలు శ్రీరాముడు సజ్జనకోటికి దుర్లభుడుకాడని సౌలభ్యమును వ్యక్తముచేయు చున్నవి.

5. జ్ఞానము—

ఆశ్రయించిన వారికి కావలసిన దానిని తెలిసికొనుట యందు, దానిని సమకూర్చుటలో గలుగు నాటంకములను గుర్తించి వానిని నివారింపఁ జేయుటయందును సరియైన సమ్యగ్జ్ఞాన మవసరము. అది పరమాత్మయందు సమగ్రముగా కలదు. వేదములతనిని సర్వజ్ఞుడని, సర్వవిదుడని నుతించినవి. తదవతారుడైన శ్రీరాముడును ఏతద్గుణ విశిష్టుడే.

రంగనాథ రామాయణము నందు "వేదవేదాంగ కోవిదుడు, వివేక భూషణుడు, సజ్జన రక్షణ విచక్షణుడు, చతుర్విధ పురుషార్థగతుల నోలిచిత్తంబున నూహించువాడు, వెలయుధనుర్వేద వేదశాస్త్రముల వలయు విద్యలయందు వలనొప్పువాడు, రాజనీతిజ్ఞుడు, ధీగుణస్తోముడు" ఇత్యాది విశేషణములు సందర్భోచితముగా ప్రయుక్తములై శ్రీరాముని జ్ఞానాతిశయమును ప్రకటించుచున్నవి శాస్త్రజ్ఞః వేద వేదాంగతత్వజ్ఞః" అని యిట్లు మూలమునందును జూడవచ్చును.

6. శక్తి :—

ఆశ్రితుల విరోధి నిరసనమునకును, కామితార్థ పూరణమునకు నుపయోగ పడునది శక్తి "సుకర దుష్కర విభాగానాదరేణ ఇచ్ఛా విషయ మాత్రకరణ సామర్థ్యం శక్తిః"[1] అనియు అఘటిత ఘటనా సామర్థ్యం శక్తిః[2] అనియు పెక్కు నిర్వచనములు కలవు

ప్రత్యేక వ్యక్తియందు అన్నిగుణములు కలవు కాని మనపనిని నెరవేర్చు సామర్థ్యముమాత్రము లేదు" అని గ్రహించినచో ఎవ్వరును అతని నాశ్రయింపరు. ఈ యొక్కటి లేక పోయినచో తదితర గుణములు అజాగళస్తనము వలె నిరర్థకములు నిరుపయోగములు. కావున ఆశ్రిత విరోధి నిరసన మొనర్చి, తత్కామితార్థముల నెరవేర్చునట్టి శక్తి ఆశ్రయదాత యందుండి తీరవలెను

"పరాఽస్య శక్తి ర్వివిధైవ శ్రూయతే స్వాభావికీ జ్ఞాన బలక్రియాచ"[3] అని పరబ్రహ్మము యొక్క అపారమైన శక్తి వేదాదుల వలన వినిపింపబడుచున్నది. తదవతారమైన శ్రీరాముని యందిది సంపూర్ణముగా కలదనుట పునరుక్తమగును.

---

1. తాత్పర్య దీపిక. ద్వయాధికారము. పుట. 841.

2. రహస్య త్రయ సారము ద్వయప్రకరణము. సూ. 20 వ్యాఖ్యానము.

3 శ్వేతాశ్వతరోపనిషత్తు- షష్ఠోఽధ్యాయః మంత్రము 8.

"తప్పుని కోపంబు దగు ప్రసాదంబు-రొప్పుగు ప్రభుశక్తి నొనరెడు వాడు"[1]

అని బుద్ధారెడ్డిచే అమూలకముగా వాచ్యము చేయుచున్న శ్రీరాముని యీ శక్తి సామర్థ్యములు "అహల్యోద్ధారణము, సముద్ర గర్వాపహరణము, కాకాసుర సంరక్షణము, జటాయు మోక్షము, సుగ్రీవ రక్షణము, రావణాది రాక్షస సంహారము ఇత్యాద్యనేక విషయములందు ప్రకటితమైనవి.

ఈ రీతి సనాతన ధర్మ విగ్రహుడు, మర్యాదా పురుషోత్తముడు, ఆదర్శమూర్తియైన శ్రీరాముని వాత్సల్య, స్వామిత్వ, సౌశీల్య, సౌలభ్య, జ్ఞాన, శక్తులనెడి షడ్గుణములు ప్రధానముగాను, సత్య, ధర్మ, దయా, క్షమా, ధైర్య, సాహసాద్యనేక గుణములు గౌణముగాను రామాయణమున ప్రతిపాదితములై నవని పరిశీలించిన తెలియగలదు. బుద్ధభూపతి శ్రీరాముని ఈ షడ్గుణైశ్వర్య సంపత్తిని అన్యకారి మతములను దూషింపని మార్గమునం దేర్పరచి, శ్రీరాముని తేలగించి ఇలవేల్పుగా వెలయజేసినాడు. శ్రీరాముడే విష్ణువు విష్ణువే గతిమోక్ష కామ్యార్థ కారణములకు బతి, కావున దేవతాంతరములను విడిచి ఆ శ్రీ మహావిష్ణువునే ఆశ్రయింపుడు; తరింపగలరని శ్రీరాముని గుణ వర్ణన వలనను, చరితము వలనను ధ్వనింపజేసినాడు—

6. ఆత్మ పరమాత్మల నవ విధ సంబంధము

"సదేవ సోమ్యేద మగ్ర ఆసీ దేక మే వాద్వితీయం"[2]

ఈ జగత్సృష్టికి పూర్వము ఒక్కటే అద్వితీయమైన సత్పదార్థము గలదు. అది "బహుస్యాం ప్రజాయేయ"[3] అని సంకల్పించి చరాచర విశ్వమును సృష్టించెను. అంతమాత్రమే కాక "అనేన జీవేనాత్మనానుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి"[4] అని చరాచరములం దంతర్యామిగా ప్రవేశించి, ప్రత్యణువునకు నామరూప భేదములను కలిగించెను. మఱి "అంతః ప్రవిష్టశ్శాస్తా జనానాగ్ం సర్వాత్మా"[5] అన్నట్లు ఈ చరాచరములను వశీకరించుకొని శాసించుచు, అన్నింటికి నతీతుడై వెలుగొందుచున్నాడు- ఆతడే పరమాత్మ. పరబ్రహ్మ

"నిత్యోనిత్యానాం చేతన శ్చేతనానా-మేకో బహూనాం యోవిదధాతి కామాన్."[6]

అనెడి శ్రుతి పరబ్రహ్మ ఒక్కడనియు, ఆత్మలనంతములనియు ఆ యొక్కడైన పరమాత్మ ఈ యనంతాత్మల కామములను పూర్తిచేయుచున్నాడనియు తెలుపుచున్నది

"స కారణం కరణాధిపాధిపో-న చాస్య కశ్చి జ్జనితా న చాధిపః॥"[7]

అనెడి శ్రుతి పరబ్రహ్మ యనాదిత్వమును, సృష్టికారకత్వమును స్పష్ట మొనర్చుచున్నది.

ఈ యొక్కడైన పరమాత్మకు, అనేకులైన జీవాత్మలకు అనాదిసిద్ధమైన, అనుస్యూతమైన,

---

1. రంగనాథ రామాయణము. అయోధ్యాకాండము. ద్వి. 11.
2. ఛాందోగ్యోపనిషత్తు- ప్రపాఠకము-6 ఖండము 2 మంత్రము 1.
3. తైత్తిరీయోపనిషత్తు- ఆనందవల్లి- అనువాకము 6. మంత్రము-2.
4. ఛాందోగ్యోపనిషత్తు- ప్రపాఠకము-6. ఖండము-3 మంత్రము 2, 3.
5. యజురారణ్యకము తృతీయ ప్రశ్న. అనువాకము-21, వాక్యము-1.
6. కఠోపనిషత్తు- పంచమీవల్లి. మంత్రము-13.
7. శ్వేతాశ్వతరోపనిషత్తు- అధ్యాయము 6 మంత్రము 9.

అవినాభావ సంబంధమున్నది. సృష్ట్యనంతరము చరాచరముల కంతర్యామిగాను, ప్రళయకాలమున వానితో సకిభూతుడయియు నుండును. కావున ఆత్మపరమాత్మల సంబంధ మనాదిసిద్ధము. విడదీయ రానిదియు ఈ సంబంధము నవవిధములుగా నున్నదని శ్రీరామానుజీయ వైష్ణవ సంప్రదాయము పేర్కొనుచున్నది.

పితాచ రక్షకశ్శేషీ భర్తాజ్ఞేయో రమాపతిః।

స్వామ్యాధారో మమాత్మాచ భోక్తా చాద్యమనూదితః॥"1

అనుశ్లోకము ఈ నవవిధ సంబంధములను పేర్కొనుచున్నది.

1. జన్యజనక సంబంధము. 2. రక్ష్యరక్షక సంబంధము. 3. శేష శేషి సంబంధము. 4 భార్యాభర్తృసంబంధము.

5. జ్ఞాతృజ్ఞేయ సంబంధము. 6. స్వస్వామి సంబంధము. 7. ఆధారాధేయ సంబంధము 8. శరీర శరీరి సంబంధము. 9. భోక్తృభోగ్య సంబంధము.

బుద్ధభూపతి తన గ్రంథమునందు మూలాను గుణముగా కొన్నింటిని, అమూలకముగా కొన్నింటిని వర్ణనలను, స్తుతులను పదబంధములను రచించి ఈ నవవిధ సంబంధములను వ్యక్తము చేసినాడు.

1. జన్యజనక భావ సంబంధము :—

దీనినే కార్యకారణ సంబంధము, పితాపుత్ర సంబంధము అనియు నందురు. కుమారుని పుట్టించి పోషించువాడు తండ్రి. పుత్రజనన కార్యమునకు కారణ భూతుడు తండ్రి. ఇట్లే భగవంతుడును సకల చేతనా చేతనములను బుట్టించి పోషించువాడు, చేతనా చేతనముల హితమే ప్రధాన గుణముగా గలవాడు.

"యతోవా ఇమాని భూతాని జాయంతే। యేనజాతాని జీవంతి। యత్ప్రయంత్యభి సంవిశంతి॥"

....

ఆనందాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయంతే। ఆనందేన

జాతాని జీవంతి। ఆనందం ప్రయంత్యభిసంవిశంతి॥"2

అనెడి వాక్యము లిందుకు ప్రమాణములు.

(i) సీతాదేవి తన పాతివ్రత్యమును చాటుటకై అగ్నిని ప్రవేశింపగా, బ్రహ్మరుద్రేంద్రాది దేవతలు వచ్చి శ్రీరాముని స్తుతించిన యపుడు బ్రహ్మదేవుడు.

" వేదాంత వేద్యుండవు విభుల — సాక్షివి కర్తవు సంవిదాకృతివి

....

నరనాథ నీవాది నారాయణుండ — వరయ నీజానకి యయ్యాదిలక్ష్మి"3

అని తత్త్వమును ప్రకటించినాడు. ఈ ద్విపదలలోని "కర్తవు"4 అనుపదము మూలాను గుణమై

---

1. ఆభాణక శ్లోకము.
2. తైత్తిరీయోపనిషత్తు భృగువల్లి అనువాకము. 1 మరియు అనువాకము. 6.
3. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి. 8138-8150.
4. వా-ప్రతి-రామాయణము ,, సర్గ 120. శ్లో 19.

"త్వం త్రయాణాం హి లోకానాం ఆదికర్తా స్వయంప్రభుః॥"

చేతనా చేతనముల కర్తృత్వమాది నారాయణునకు, తదవతార పురుషుడైన రామునకు నున్నట్లై స్పష్టపరచ బడినదిగదా!

(ii) అయోధ్యాకాండములో శ్రీరాముని గుణవర్ణనమునందు-

"పౌరాన్ స్వజనవన్నిత్యం కుశలం పరిపృచ్ఛతి॥
పుత్రేష్వగ్నిషు దారేషు ప్రేష్యశిష్య గణేషుచ।
నిఖిలేనాను పూర్వ్యాచ్చ పితాపుత్రానివౌరసాన్॥

....

ఉత్సవేషుచ సర్వేషు పితేవ పరితుష్యతి॥"[1]

అని రామునికి పితృత్వోపమానము చెప్పబడినట్లు రంగనాథ రామాయణమునందును-

"తలపనీతడు తలిదండ్రు లర్భకుల — నలరించుగలి మిమ్ము నలరింపగలడు"[2]

అని వాడబడినది.

(iii) ఇంతేకాక, అమూలకమైన కైకేశి వృత్తాంతమునందు-

"ఆమె రావణునికి ప్రత్యేకముగా సృష్టిక్రమమును వివరించినది." ఇందు-

"బాలుడై యటవట పత్రముమీద — లోలత(దేలాడు లోకరక్షకుడు
కమనీయమగు సృష్టి కార్యంబునందు — విమల చిత్తంబున వెదనున్న నంత
కమలోదరుని నాభి(గమలంబు వుట్టె(— గమలంబులో(బుట్టె(గమల సంభవుడు.
కమలాసనుడు సృష్టికార్యంబు కొఱకు — నమర నవబ్రహ్మ లనువారి(బడసె"[3]

అని జగత్స్రష్టయైన కమలభవునికి స్రష్టయైనవాడు వట పత్రశాయియైన ఆదినారాయణు డనియు, ఆ —

"ఆదినారాయణుండు.. ఆదశరథునకు నాత్మ జుండయ్యె"[4]

అని చెప్పుట సకల చేతనా చేతనములకు కారణ భూతుడు, జనకుడు నారాయణుడు - శ్రీరాము డనుటయే-

(iv) కాకాసుర వృత్తాంతమిందుకు నిదర్శనము కుమారుడు దురహంకారి యైనపుడు తండ్రి శిక్షించును; తప్పుదెలిసికొని మరల తండ్రిని జేరినపుడు కారుణ్య వాత్సల్య బుద్ధితో నాకుమారుని రక్షించును. ఈ లోకస్వభావమునకు ప్రతిబింబమే కాకాసుర వృత్తాంతము.

(2) రక్ష్య రక్షక భావసంబంధము :—

భగవంతుడు సర్వతంత్ర స్వతంత్రుడు; జీవులు పరతంత్రులు ఈ స్వాతంత్ర్య పారతంత్ర్యములు పరమాత్మ జీవాత్మలకు సహజ స్వరూపములు. కావుననే రక్షకత్వము శియః పతికి,

---

1 దా-ప్రతి-రామాయణము. అయోధ్యాకాండము. సర్గ. 2. శ్లో. 38, 39, 41.
2. రంగనాథ రామాయణము. ,, ద్వి. 37.
3. ,, ,, యుద్ధకాండము. ద్వి. 1345-1348.
4. ,, ,, ,, ద్వి. 1370, 1371.

రక్ష్యత్వము చేతనులకు ధర్మములైనవి. "యేనజాతానిజీవంతి"—
....ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్. . .ఆనందేన జాతాని జీవంతి"1 అనెడి శ్రుతివాక్యము లిందుకు పరమ ప్రమాణములు

(1) సీతాదేవి హనుమంతునితో—

"రక్షితా జీవలోకస్య స్వజనస్యాభి రక్షితా।
రక్షితాస్వస్య వృత్తస్య ధర్మస్యచ పరంతపః"2

అని ప్రకటించిన రామస్వభావము రంగనాథ రామాయణమున-

"స్వజన రక్షణ విచక్షణుడు"3; "సకల ప్రజానంద కరుని"4 "దీనైకబంధు"5 ఇత్యాది విశేషణముల ద్వారా వ్యక్తచేయ బడినది.

రామావతారమే దేవ ఋష్యాది సాధుజన రక్షణార్థము వచ్చినది. ఖర దూషణాదుల సంహరించి దండకారణ్య తాపసులను రక్షించుట, వానిని చంపి సుగ్రీవుని రక్షించుట, రావణునిచే నిర్వాసితుడైన విభీషణుని చేరదీసి రక్షించుట, దోషియైనను కాకాసురుని రక్షించుట ఇత్యాదులు ఈ రక్ష్య రక్షక సంబంధమును పురస్కరించు కొనియె జరిగినది ఈ రక్షణము మాత్రము చేతనులు కోరిన మీదట సంభవించును. భగవంతుడు "లోకరక్షణ కళాలోలచిత్తుండై"6 రక్షణ కదను వెదకుచుండును. ఆ సమయము తారసిల్లిన రక్షింపగలడు. ఇందు వెనుకాడుట కాని, ఆలస్యమగుట కాని యుండదు. దీనికి నతడు అంతర్యామి రూపమున అన్నింటనుండి ఆయా బుద్ధులను కల్గింపజేయు చున్నాడు.

"సర్వస్య చాహం హృది సన్నివిష్టో — మత్తః స్మృతిః జ్ఞాన మపోహనంచ॥"7

అను గీతా వాక్యమిచట అను సంధేయము.

(3) శేష శేషి భావ సంబంధము.

తనకొక యతిశయము కలుగు నట్లుగా, తన యిష్టము వచ్చినట్లుగా, చేతనా చేతనములను వాడుకొన గలవాడు. శేష శేషిచే వాడుకొనబడు వస్తువులు శేషములు.

"యథేష్ట వినియోగార్హత్వం శేషత్వం"8 అని నిర్వచనము. దీనిని సేవ్యసేవక భావ సంబంధమనియు నందురు. పరమాత్మ సేవ్యుడు; ఆత్మలు సేవించువారు (సేవకులు).

రామాయణము నందిది భరత, లక్ష్మణాంజనేయాది వృత్తాంతముల ద్వారా ప్రతిపాదింప బడినది.

---

1. తైత్తిరీయోపనిషత్తు—భృగువల్లి. అనువాకము. 1 మరియు అనువాకము. 6.
2. దా-ప్రతి వాల్మీకి రామాయణము. సుందర కాండము. సర్గ. 35. శ్లో. 10.
3. రంగనాథ రామాయణము. బాలకాండము. ద్వి 114.
4. ,, ,, అయోధ్యాకాండము, ద్వి. 48.
5. ,, ,, ,, ద్వి. 49.
6. రంగనాథ రామాయణము. బాలకాండము. ద్వి. 1484.
7. భగవద్గీత. అధ్యాయము. 15. శ్లో. 15.
8. "వరదాచార్యోక్తి" యని తాత్పర్యదీపిక. పుట 184లో ఉద్ధృతము.

(i) భరతుడు :—

వసిష్ఠ మహర్షి భరతునితో "పితృదత్తమైన అయోధ్యా రాజ్యమునకు పట్టము గట్టుకొని పాలించవలసినది" పలికినపుడు అతడు.

"రాజ్యం చాహం చ రామస్య ధర్మం వక్తు మిహార్హసి॥"[1]

అని సమయోచితముగా సమాధాన మిచ్చియున్నాడు. ఇచ్చట గోవింద రాజీయ వ్యాఖ్యానమందు-

"రాజ్యమపి రామసంబంధి: అహమపి రామసంబంధీ;

ఉభయ మపి రామశేష మిత్యర్థః।"[2]

అని వ్రాసి రత్నపేటికాన్యాయము ఉదాహరింపబడినది —

రత్నము రత్నము; పేటిక రక్షకము. అట్లే రాజ్యము రత్నము వంటిది; భరతుడు పేటిక వంటివాడు. కాని పేటికయు కుంచికాది వ్యాపారమున యజమానిచేత రక్షణ చేయుటకై నియమింపబడునది. అనగా రత్నమును చక్కగా దాచియుంచుట మొదలగు వ్యాపారముచే పెట్టెను భద్రపరచిన నాడు ఆ పెట్టె రత్నమును కాపాడలేదు. యజమాని స్వతంత్రుడు; అతడు పెట్టెను తెరువవచ్చును, మూయవచ్చును; రత్నమును అందులో పెట్టి భద్రపరచవచ్చును లేక హారముగా చేయవచ్చును. ఇచ్చట పెట్టె రత్నములు అస్వతంత్రములు; యజమానికి యథేష్ట వినియోగార్హములు. అట్లే రాజ్యమున్న భరతుడు శేషియైన రామునికి యథేష్ట వినియోగార్హములైన వస్తువులే శేషములే

రంగనాథ రామాయణమున నింత స్పష్టముగా లేకున్నను—

......................................ఇంక రాజ్యంబు — పాలింతునే యేను చెప్పను మింక

.... — ఈ తలపులు నాయందు గలవే

నిట్టున్న రూపున నేన మా రామ-పట్టంబు గట్టెదం బ్రార్థించి తెచ్చి"[3]

అని శేష శేషిభావ సంబంధము ధ్వనించునట్లు వ్రాయబడినది. ఆ పిదప శ్రీరాముడు పాదుకాప్రదానమొసంగుట యనెడి కుంచికా వ్యాపారమున భరతుడనెడి పేటిక రాజ్యరత్నమును గాపాడినది

(ii) లక్ష్మణుడు —

ఇతడు సుగ్రీవుని యొద్దనుండి వచ్చిన ఆంజనేయునితో

"అహమస్యావరో భ్రాతా గుణైర్దాస్య ముపాగతః"[4]

అని తనను పరిచయము చేసికొనెను. ఇది రంగనాథరామాయణము నందును—

అతిలోక విక్రముండైన సరివాది — హితుడనై యుంటినై యేను దాసుండ"[5]

---

1. దాశరథి వాల్మీకి రామాయణము అయోధ్యాకాండము. సర్గ. 82 శ్లో. 12.
2. " " " గోవింద రాజీయ వ్యాఖ్యానము. అయోధ్యా. సర్గ. 82, శ్లో 12.
3. రంగనాథరామాయణము-అయోధ్యాకాండము. ద్వి-1491—1493
4. దాశరథి వాల్మీకి రామాయణము. కిష్కింధాకాండము-సర్గ.4 శ్లో-12
5. రంగనాథ రామాయణము-కిష్కింధాకాండము. ద్వి-1[illegible]3.

నని మూలాను సారముగా వ్రాయబడినది

బంటు (దాసుని) లక్షణము సేవచేయుట. "బాల్యాత్ ప్రభృతి సుస్నిగ్ధః"[1] సౌమిత్రి రామునితో అరణ్యమునకు వచ్చినది సేవచేయుటకే కదా! అరణ్యమునకు రావలదని రాముడు లక్ష్మణుని నిర్బంధించినపుడు. అతడు

బాణ బాణాసన పాణినై యుండి — తూణీరములఁ బూని దుర్గమార్గముల
నిండుగా నిమ్మ నిమ్ముల గొల్చువాఁడ — గంధమూలాదులు కడకఁ దేవలయు
నట్టి దృణ పర్ణముల నరసి మీరుండ — నట్టి కమ్ము సెజ్జయు నొనరింప వలయుఁ
బదునాలుగేండ్లును బగలును రేయి — నిదుర వోక సేవ నెఱి సేయువాఁడ."[2]

నని ప్రార్థించి యనుమతి బడసి సేవింప వచ్చినాడు.

నిజమైన సేవకుడు తన యిష్టప్రకారము పనులు చేయక యజమాని యిష్టము ననుసరించి చేయును. పంచవటి యందు శ్రీరాముడు లక్ష్మణునితో పర్ణశాల నిర్మించుమని పలుకగా, లక్ష్మణుడు

పరవానస్మి కాకుత్స్థ త్వయి వర్షశతం స్థితే।
స్వయం తు రుచిరే దేశే క్రియతామితి మాం వద॥"[3]

అని విన్నవించి, రాముడు నిర్దేశించిన చోటనే నిర్మించినాడు. రంగనాథ రామాయణము నందు నింత స్పష్టముగా లేదు; కాని

"తాను లక్ష్మణుడును దగు పర్ణశాల — నూనిన క్రమముతో నొప్పారఁ గట్టి"[4]

అను ద్విపదలో "తాను లక్ష్మణుడును" అనగా "తనననుసరించి నడచు లక్ష్మణుడు" అని యర్థము ధ్వనించుచున్నది.

(iii) హనుమంతుడు:—

ఇతడు లంకలో—

దాసోఽహం కోసలేంద్రస్య రామస్యాక్లిష్ట కర్మణః।
హనుమాంఛత్రుసైన్యానాం నిహంతా మారుతాత్మజః॥"[5]

అని తనను రాముని దాసునిగా ప్రకటించుకొన్నాడు.

రంగనాథ రామాయణమున "నిచ్చట దాస శబ్దమునకు బదులు దూత శబ్దము వాడబడినది"[6] దూతయైనను యజమాని పంపగా వచ్చి అతని యభిమతము ననుసరించి నడచుకొను సేవకుడే కదా!

---

1 దా-ప్రతి వాల్మీకి రామాయణము-బాలకాండము సర్గ 18 శ్లో 27.
2. రంగనాథ రామాయణము-అయోధ్యకాండము-ద్వి 685-688 దీనికి మూలము. దా-ప్రతి వాల్మీకిరామా. అయోధ్యా-సర్గ 31 శ్లో 22-25.
3. దా-ప్రతి వాల్మీకిరామా. ఆరణ్యకా. సర్గ 15 శ్లో 7.
4. రంగనాథరామాయణము-ఆరణ్యకాండ ద్వి 238.
5. దా ప్రతి వాల్మీకిరామాయణము-సుందరకాండ-సర్గ 43. శ్లో 9.
6. రంగనాథరామాయణము-సుందరకాండము ద్వి 351-352.

ఈ లక్ష్మణాంజనేయులు రామునికి సర్వకాలము లందు సర్వవిధముల సేవఁజేసినారు. యుద్ధములందు ప్రాణములను దాచుకొనక పోరాడి యజమానివి జయమునకు కారకులైనారు. ఇట్లు సేవ్యసేవక (శేష శేషి) సంబంధము చక్కగా ప్రతిపాదింపఁబడినది.

(iv) భార్యా భర్తృసంబంధము:—

"భగవంతుడొక్కడే పురుషుడు; తక్కిన జగత్తంతయు స్త్రీ ప్రాయము-"[1] వేదముకూడ భగవంతుని "విశ్వపతి"[2]గా, "ఆత్మేశ్వరుని"[2]గా నిరూపించుచున్నది. రామాయణము శ్రీరామచంద్రుని "లోకభర్త"[3]గా వర్ణించినది. కావున వైష్ణవ సంప్రదాయము ఆత్మ పరమాత్మలకు భార్యా భర్తృ సంబంధమును తెలుపుచున్నది

అన్ని సంబంధములలో భార్యాభర్తృ సంబంధమే ప్రగాఢమైనది భరింపబడునది భార్య. ఈమె అస్వతంత్రురాలు; తనధారణ పోషణములకై పతిమీద యాధార పడియుండును; భర్తృసేవయే తన ప్రధాన లక్ష్యమని భావించును. అవ్యభి చరిత పరిభక్తిచే పతివ్రతనామ మొందును, కావున భార్య పతిచేత భర్తవ్యురాలు. ఇక భరించువాడు భర్త. ఇతడు స్వతంత్రుడు; తన భార్యధారణ పోషణాదుల కాధారమైనవాడు; తన్నాశ్రయించిన భార్య యొక్క సర్వబాధ్యతలను తనపైవేసికొని కాపాడుచు, సర్వవిధములుగా నామెకు సౌఖ్యమును కలిగించును—

ఇట్లే ఆత్మ (జీవుడు) అస్వతంత్రుడు; తన ధారణ పోషణాదులకై పరమాత్మపై నాధారపడి, అతనిని అవ్యభిచరిత భక్తితో సేవించువాడు; పరమాత్మ స్వతంత్రుడు; సత్యసంకల్పుడు: సర్వాత్మల ధారణ పోషణాది బాధ్యతలు వహించి, తద్రక్షణ కార్యమునందు నిమగ్నుడై, వారికి ఐహికాముష్మిక సౌఖ్యములను గలిగించు వాడని తెలుచున్నది—

రామాయణము నందలి శ్రీరామ సుగ్రీవ సఖ్యము ఆత్మపరమాత్మల ఈ భార్యాభర్తృ సంబంధమునకు నిదర్శనము—

హనుమంతుడు ఇచ్చట మధ్యవర్తియై ప్రేయసీప్రియుల (సుగ్రీవ శ్రీరామ) సంబంధమును సమకూర్చినాడు.

సుగ్రీవుడు శ్రీరాముని యెదుటికి వచ్చి స్నేహమును గోరుచు చేతినిచ్చుట,[4] శ్రీరాముడు సంతసించి తన యరచేత సుగ్రీవుని చేతిని పట్టుకొని దగ్గరకు చేర్చుకొనుట,[5] హనుమంతుడు వహ్నిని

---

1. "స ఏవ వాసుదేవోఽసౌ సాక్షాత్పురుష ఉచ్యతే,
   స్త్రీప్రాయ మితరత్సర్వం జగద్బ్రహ్మ పురస్సరమ్॥"
   ఇది విష్ణు ధర్మము లోనిదని ద్రావిడ వేదాంత ప్రమాణత్తిరట్టు" పుట. 89లో ఉద్ధరింప బడినది.
2. తైత్తిరీయ నారాయణోపనిషత్తు. అనువాకము. 13. మంత్రము. 30.
   పతిం విశ్వస్యాత్మే శ్వరగ్ం శాశ్వతగ్ం శివ మచ్యుతం॥
3. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. సుందరకాండము. సర్గ. 38 శ్లో. 56 1/2.
4. దా. ప్రతి వాల్మీకి రామాయణము-కిష్కింధాకాండము. సర్గ 5 శ్లో-12.
5. ,, ibid ,, ,, సర్గ 5 శ్లో-13.

జ్వలింపఁజేయగా, ఇరువురు దాని నభ్యర్చించి, ఒకరి చేయి నొకరు పట్టుకొని, అగ్నిచుట్టు ప్రదక్షిణము చేయుట,[1] పరస్పరము చూచుకొనుట,[2] పదార్థములను నీవి, నావి యని భేదము లేక యనుభవించుట, సుఖదుఃఖములందు సమాన భావము నొందుట-[3] ఇవి యన్నియు[4] పాణిగ్రహణ దాంపత్య విషయములనే సూచించుచున్నవి

వివాహ మాడిన తర్వాత గుణవంతుడైనను, గుణహీనుడైనను సతి భర్త నవ్యభిచరితముగా సేవించుట; అట్లే పతి తన భార్యను విడనాడక సర్వవిధ రక్షాభారము వహించుట ఉత్తమధర్మము. మిత్ర లక్షణము కూడ నిట్టిదే.

"అర్ధోవా ఏష ఆత్మనో యత్పత్నీ"[5]

అన్నట్లు సుఖదుఃఖములలో సమాన భావమున తోడ్పడు అర్ధాంగి పరమ మిత్రముగదా!

ఈ విషయమును మూలానుసారముగా రచించిన బుద్ధభూపతి ఇచ్చట ప్రత్యేకముగా—

"ఆపదకును సఖుడైనట్లు చుట్ట-మాపాటి గానేర డారసి చూడ
గుణవంతుడైనను గుణహీనుడైన-గణియింప సఖుడు సద్గతియంద్రు బుధులు
గావున నీ చెల్మి గలిగిన నాకు-నే వెంటఁ గొదువ లేదిది నిశ్చయంబు"[6]

అని రామునిచే ననిపించినాడు.

ఈ యర్థమునే హనుమంతుడు సుగ్రీవునకు (సమయము మీఱగా నన్నయాజ్ఞచే సౌమిత్రి క్రోధముతో కిష్కింధకు వచ్చినపుడు)

"తస్మాన్మూర్ధ్నా ప్రణమ్య త్వం సపుత్ర స్స సుహృజ్జనః।
రాజం స్తిష్ఠ స్వ సమయే భర్తుర్భార్యేవ తద్వశే॥"[7]

అని బోధించినాడు-

ఆ తర్వాతి సుగ్రీవుని వృత్తాంతము భార్యభర్తకు చేసిన సేవ, మిత్రుడు తన మిత్రునికి చేసిన తోడ్పాటు, జీవుడు జీవేశ్వరునికి చేసిన కైంకర్యమని తలంపవచ్చును.

సీతారాముల సంబంధము ఆత్మాత్మేశ్వరుల సంబంధమును చెప్పినదైనను, "స్త్రీ ప్రాయ మితర త్సర్వం" అనుదానికి రామ సుగ్రీవ సఖ్యము చక్కని నిదర్శనము. జీవపరమాత్మల ఈ భార్యాభర్తృ సంబంధ మనాది సిద్ధము

5) జ్ఞాతృ జ్ఞేయ సంబంధము-

ఆత్మజ్ఞాత (ఎఱుంగువాడు), సర్వేశ్వరుడు జ్ఞేయము. (ఎఱుఁగఁబడు పదార్థము)

---

1. దా. ప్రతి వాల్మీకి రామాయణము. కిష్కింధాకాండము. సర్గ 5, శ్లో. 15-16 1/2.
2. ,, ,, ,, సర్గ 5, శ్లో. 17 1/2
3. ,, ,, ,, సర్గ 5 శ్లో. 18 1/2
4. వీని యన్నింటికి. రంగనాథ రామాయణము- కిష్కింధాకాండము ద్వి. 207-219.
5. కృష్ణయజుర్వేదము. కాండము-6, ప్రశ్న-1, మంత్రము-58 (పుట-148)
6. రంగనాథ రామాయణము కిష్కింధాకాండము ద్వి. 257-259.
7. దా. ప్రతి వాల్మీకి రామాయణము. కిష్కింధాకాండము సర్గ 32 శ్లో. 21.

రామాయణ ప్రారంభము జ్ఞాతృజ్ఞేయ సంబంధమున కుదాహరణము.

వాల్మీకి మహర్షి వాగ్విదాంవరుడైన నారదుని గాంచి

"ఎవ్వడు శ్రీమంతు డెవ్వడు శాంతు-డెవ్వడు మనపుణ్యు డెవ్వ డున్నతుడు"1

అని మొదలైన ప్రశ్నలను వేసెను- నారదుడున.

"తన బుద్ధి నెంతయుఁ దలపోసి చూచి...............

ఈ మహి శ్రీవిష్ణు డిపుడు జన్మించె-రాముడై దశరథ రాజున కతడు"2

అన ఆతని చరిత్రను సంక్షిప్తముగాఁ జెప్పెను-

ఇచ్చట జ్ఞాతయైన వాల్మీకి జ్ఞేయమైన, స్వరూప రూప గుణాదులచే నవతరించిన భగవత్స్వరూపమును తెలియఁగోరెను. బోధకుడైన నారదుడు "తన బుద్ధి నెంతయుఁ దలపోసి చూచి (బుద్ధ్వా) జ్ఞేయమైన విష్ణు స్వరూప రూప గుణాదులతో నవతరిల్లిన శ్రీరాముని చరితను దెలిపెను. ఈ జ్ఞేయము దుర్గుణదూరము, సద్గుణాకరము ఇట్లు భగవత్తత్త్వము నెరుగఁ గోరువానిని జ్ఞాతగాను, పరమాత్మను జ్ఞేయపదార్థముగాను గుర్తించవచ్చును. జీవాత్మలందరు జ్ఞాతలే. "జ్ఞోఽత ఏవ" అను బ్రహ్మ సూత్రమున నిది ప్రతిపాదితమైనది.

b) విశ్వామిత్రుడు దశరథునితో

"ఇతని మహత్వ మే నెఱుంగుదు బ్రహ్మ-సుతుడైన యీ వసిష్ఠుండు నెఱుంగు"3

అని పలికిన మాటలు జ్ఞేయమైన రాముని, ఆతని మహత్వమును నెఱింగిన వసిష్ఠ విశ్వామిత్రాదులు ప్రప్రథమున జ్ఞాతలే యని సూచించుచున్నవి ఇంతేకాక జ్ఞాతలైన దశరథాదుల జిజ్ఞాస నుద్బుద్ధ మొనర్చుచున్నవి.

6) స్వస్వామి భావ సంబంధము:—

స్వమ్ము అనగా సొత్తు. అది కలవాడు స్వామి. తన సొత్తును స్వేచ్ఛగా వాడుకొను నధికారము స్వామికి కలదు; దానిని కాపాడు బాధ్యతయు అతని కుండును.

"భూమి రాపోఽనలో వాయుః ఖం మనో బుద్ధి రేవ చ।

అహంకార ఇతీయం మే భిన్నా ప్రకృతి రష్టధా॥"4

అనెడి అష్టవిధ ప్రకృతియు,

"అపరేయ మితస్త్వన్యాం ప్రకృతిం విద్ధిమే పరాం।

---

1. (a) రంగనాథ రామాయణము. బాలకాండము. ద్వి. 106.
   (b) దా-ప్రతి-వాల్మీకి రామాయణము. బాలకాండము. సర్గ. 1 శ్లో. 2.
2. (a) రంగనాథ రామాయణము. బాలకాండము ద్వి 112-113.
   (b) దా-ప్రతి-వాల్మీకి రామాయణము. బాలకాండము. సర్గ. 1. శ్లో. 7. మొదలు-
3. రంగనాథ రామాయణము బాలకాండము. ద్వి-623. దీనికి మూలము-దా-ప్రతి-వాల్మీకి రామాయణము బాలకాండ. సర్గ. 19. శ్లో. 14, 15.
4. భగవద్గీత-అధ్యాయము. 7. శ్లో. 4.

జీవ భూతాం మహాబాహో యయేదం ధార్యతే జగత్॥"[1]

అనెడి జీవభూత ప్రకృతియు పరమేశ్వరుని స్వమ్ము. అనగా చేతనా చేతనాత్మకమైన జగత్తు సర్వము అతని సొత్తనుట.

"భీషాస్మాద్వాతః పవతే। భీషోదేతి సూర్యః।

భీషాస్మా దగ్నిశ్చేంద్రశ్చ। మృత్యుర్ధావతి పంచమం॥"[2]

అని చెప్పబడినట్లు సర్వమతని శాసనమునకు లోబడి నడువవలసినదే; పడవేసిన చోట పడి యుండవలసినదే.

(a) శ్రీరాముడు తనకు దారిచూపని సముద్రునిపై బ్రహ్మాస్త్రమును ప్రయోగించెను. అపుడు సముద్రుడు భయభక్తులతో పొడసూపి

"......భూనాథ నీవాది పురుషోత్తముడవు

వాయు భూజల నభో వహ్నులాదిగను — నీ యాజ్ఞ లోనివి నిక్కువంబరయ

....

నీ యధీనంబులు నిఖిల లోకములు — ....

అలరి సేతువు గట్టియైనను నడువు — మలఘు విక్రమ, యూరకైనను నడువు"[3]

అని ప్రార్థించెను. ఈ ద్విపదలు యజమాని స్వేచ్ఛగా తన వస్తువు నుపయోగించుకొను అధికారి యని సూచించుచున్నవి.

ఇట్లే అకంపనుడు శ్రీరాముని పరాక్రమాతిశయమును వర్ణించి రావణునికి దెలిపెను.[4] అచ్చటి యా వర్ణనము రాముని సర్వ స్వామిత్వమును, సర్వాతిశాయి శక్తిని ప్రకటించు చున్నవి.

(7) ఆధారాధేయ సంబంధము.

దీని ధార్య ధారక సంబంధమనియు నందురు. సకల చేతనా చేతన పదార్థములు ఆధేయ ములు. పరమాత్మ యాధారము. ఇతడన్నింటిని తనలో నుంచుకొనుటచే, వాని కాధారభూతు డగు చున్నాడు మూలమునందు -

"త్వం ధారయసి భూతాని వసుధాంచ సపర్వతాం।

త్రీన్ లోకాన్ ధారయన్ రామ దేవగంధర్వ దానవాన్"॥[5]

అని బ్రహ్మస్తుతిలో నిది స్పష్ట పరచబడినట్లె

---

1. భగవద్గీత. అధ్యాయం. 7. శ్లో. 5.
2. తైత్తిరీయోపనిషత్తు ఆనందవల్లి. అనువాకము 8. మంత్రము. 1
3. రంగనాథ రామాయణము యుద్ధకాండము. ద్వి. 926-928. 945. దీనికి మూలము. ప-ఉ-ప్రతి-వాల్మీకి రామాయణము సుందరకాండ సర్గ. 96
4. రంగనాథ రామాయణము. అరణ్యకాండము. ద్వి 684-690.
5. దా-ప్రతి వాల్మీకి రామాయణము. యుద్ధకాండము. సర్గ. 120. శ్లో. 20, 23.

"ఆధార భూతమై యఖిల లోకములు — సాధవ దాల్చు నీ మహనీయ తనువు"[1]
అని దేవతల స్తుతిలోను,

పద్మ సన్నిభ నేత్ర బహుజీవ సూత్ర"[2]— అనివిభీషణ స్తుతిలోను,

"నీయందు నున్న వానికి లెక్కలేదు — నీయధీనంబులు నిఖిల లోకములు"[3]
అని సముద్ర స్తుతియందును రంగనాథ రామాయణమునందు ఆయా పదముల ద్వారా ఈ ఆధారాధేయ సంబంధము సూచితమైనది.

(8) శరీర శరీరిభావ సంబంధము :—

జీవునికి జడమైన పాంచభౌతిక ప్రకృతి శరీరమైనట్లే, పరమాత్మకు జీవుడు శరీరభూతుడు. శరీరములో ఆత్మయున్నట్లు, ఆత్మలో పరమాత్మ అంతర్యామిగా నున్నాడు. అష్టవిధ ప్రకృతియు, జీవభూత ప్రకృతియు పరబ్రహ్మకు శరీరమనుట సారాంశము

(a) ఇంద్రజిన్నాగపాశములచే బంధితులైన రామలక్ష్మణుల యొద్దకు నారదుడు వచ్చి

"ఆది దేవుడవు సర్వాత్ముడవు — వేద వేద్యుండవు విశ్వరూపుడవు.

....

ధరణి యంఘ్రులు, వియత్తలము మస్తకము — పరపైన నిటలంబు పద్మాసనుండు
కన్నులు చంద్రుడుం గమలమిత్రుండు — నున్నతంబగుచున్న యూర్పు మారుతము
వదనంబు శిఖి; సరస్వతి జిహ్వయొప్పు."[4]—

అని రాముని విరాడ్రూపమును సర్వాంతరాత్మత్వమును వర్ణించెను.

(b) విభీషణుడు శ్రీరాముని శరణాగతినొంది

....

"చంద్రార్కులును నీవ జలధులు నీవ యింద్రాదులును నీవ, యిలయును నీవ,
శబ్దార్థముల్ నీవ శబ్దముల్ నీవ ....
క్షరమునును నీవ యక్షరమును నీవ"[5]

....

అని యిట్లు చేతనా చేతనములకు పరమాత్మకును అభేదమును గణించిస్తుతించెను.

(c) పరశురాముడు శ్రీరాముని నిజరూపంబును వైష్ణవ ధనురారోపణ వలన గ్రహించి

"నాబలంబును నీవె నాయాత్మనీవె" యని స్తుతించెను-

ఈ స్తుతి వాక్యంబులు పరమాత్మయంతరాత్మత్వమును, జగచ్ఛరీరత్వమును ప్రతిపాదించుచు,

---

1. రంగనాథ రామాయణము. బాలకాండము. ద్వి. 485
2. ,, ,, యుద్ధకాండము. ద్వి 677.
3. ,, ,, ,, ద్వి. 928.
4. ,, ,, ,, ద్వి. 2643-2651.
5. ,, ,, ,, ద్వి. 679-688
6. ,, ,, బాలకాండము ద్వి. 2390.

ఆత్మపరమాత్మల శరీర శరీరి భావ సంబంధమును దెలియ జేయుచున్నవి.

(9) భోగ్యభోక్తృత్వ భావ సంబంధము :—

పరమాత్మ భోక్త (అనుభవించువాడు), జీవాత్మ భోగ్యము. (అనుభవింపబడునది).

జీవాత్మయే భోక్తయనియు, పరమాత్మ భోగ్యమనియు మరియొక వ్యవహారమున్నది.

(a) విశ్వామిత్రుడు.

"క్రతుకర్త క్రతుమూర్తి క్రతుభాగభోక్త — యతడు లోకారాధ్యు డతనిం బుత్తెంపు"1

మని శ్రీరాముని యజ్ఞ కర్తృత్వ భోక్తృత్వములను దశరథునికి దెలిపి యున్నాడు. ఈ పంక్తుల మూలకములు-వీనికి

"యజ్ఞభృద్యజ్ఞకృద్యజ్ఞీ యజ్ఞభుగ్యజ్ఞ సాధనః" 2

అను విష్ణుసహస్రనామ శ్లోక మాధారము కావచ్చును.

(b) శబరి అగ్నిని రగుల్కొల్పి, ఆ

"అనలుని యందు రామార్పణంబుగను — దన శరీరమును వేల్చి"3

నదనుట శ్రీరాముడు భోక్తయగుట చేతనే.

ఈ రీతిగా పరిశీలనచే ఆత్మపరమాత్మల నవవిధ సంబంధము తెలియుచున్నది.

7. రంగనాథ రామాయణము — అర్థపంచక జ్ఞానము.

లీలావిభూతి యందలి 84 లక్షల జీవరాసులలో మనుష్యుడుత్తమోత్తముడు. అనేక జన్మ సంచిత పుణ్య విశేషముచే జీవునికి మానవ దేహమలవడును. కావున "మానవ దేహమతి దుర్లభము"4 ఇది క్షణ భంగురము, బుద్బుద ప్రాయము. ఎప్పుడీ శరీర పాతము జరుగునో ఎవరును దెలిసికొన లేరు ప్రతి జీవియు తానాచరించిన పుణ్య పాప రూప కర్మల ఫలమైన సుఖదుఃఖములను అనుభవించుటకే శరీరమును దాల్చుచున్నది.

ఉత్తమ జన్మగా భావింపబడిన, మనుష్యతనువును దాల్చినట్టి ప్రాణికి ఇతర ప్రాణులకంటె జ్ఞాన మధికము; ఆలోచనా శక్తియు, సుఖసాధన ప్రయత్న పాటవమును అధికమే. ఈ జ్ఞానము (1) లౌకికము (2) పారమార్థికము. అని రెండు విధములు. జ్ఞాన భేదముచే మానవులుగూడ '(1) బుభుక్షువులు. (2) ముముక్షువులు' అని ఇరు తెగలుగా వర్గీకరింపబడినారు.

(1) బుభుక్షువులు :— కేవల లౌకిక రూపజ్ఞానము కలిగి, ఇహలోక సుఖ సంబంధమైన ప్రయత్నములు జేయుచు,అహంకార మమకారాదులకు లోనయి, తత్ఫలితముగా రాగ ద్వేషాదులను బొందువారు. సుఖ దుఃఖములను అనుభవించువారు బుభుక్షువులు.

---

1. రంగనాథ రామాయణము. బాలకాండము. ద్వి. 625.
2. విష్ణు సహస్రనామము శ్లో 105.
3. రంగనాథ రామాయణము. అరణ్యకాండము ద్వి. 1481.
4. భాగవతము. స్కంధము 11 అధ్యాయము 2 శ్లో 29.

"దుర్లభో మానుషో దేహో దేహినాం క్షణభంగురః।
తత్రాపి దుర్లభం మన్యే వైకుంఠ ప్రియదర్శనం॥"

(2) ముముక్షువులు :— జనన మరణములను, బాల్యవృద్ధావస్థలను, రోగాది బాధలను గాంచి, అనుభవముచేత. ప్రత్యక్ష జ్ఞానముచేత దేహము నశ్వరమని గుర్తించి, పునర్జన్మ రాహిత్యమును గోరి. మోక్షమందిచ్ఛ గలిగి. తత్పరమార్థ జ్ఞాన ప్రాప్తికి ప్రయత్నించువారు ముముక్షువులు; సంసార నివృత్తి, భగవదానందావాప్తి విషయమున ఇచ్ఛగలవారు. ముముక్షువులు; మోక్షమునందిచ్ఛ గలవారు ముముక్షువులని వ్యుత్పత్త్యర్థము. ఇట్టి ముముక్షువులకు అర్థ పంచక జ్ఞాన మత్యవసరము

అర్థపంచక జ్ఞానము :—

1. పరస్వరూపము. (ప్రాప్యుడైన పరమాత్మస్వరూపము)
2. స్వస్వరూపము. (ప్రాప్తయైనఆత్మతత్త్వము)
3. ఉపాయ స్వరూపము. (పరబ్రహ్మను పొందు మార్గము)
4. పురుషార్థ స్వరూపము. (ఫలస్వరూపము)
5. విరోధి స్వరూపము. (ఫలప్రాప్తికి విరోధులైన వానితత్త్వము)

ఈ ఐదింటికి అర్థపంచకమని పేరు"[1] వీని యాథార్థ్యజ్ఞానము అర్థ పంచక జ్ఞానము.

శ్రీమద్రామాయణమునందును, దాని ననుసరించి వ్రాయబడిన రంగనాథ రామాయణము నందును ఈ అర్థ పంచకము సందర్భానుసారముగా సంక్షిప్తవివరములతో ప్రస్తావింప బడినది. సౌమ్యసహనములతో పరిశీలించిన నివి తెలియగలవు.

(i) పరస్వరూపజ్ఞానము:—

మనము చూచెడి. వినెడి ప్రపంచవైచిత్ర్యములు మహదాశ్చర్యకరములు. క్రమబద్ధములైన ఉదయాస్తమయములు సూర్యచంద్రాది గమనములు, ఋతుషట్కము, జనన మరణములు, ఇత్యాదులను గాంచినపుడు వీనివెనుక శాసనకర్త ఎవడైన నొకడుండ వలెనని కొంచమాలోచించిన తోపక నూనదు అతడు భారతీయులు చెప్పినట్లు సగుణ. నిర్గుణ. శివ. కేశవాది నామరూపుడైన పరబ్రహ్మ కావచ్చును; శక్తి (Spirit) కావచ్చును; అల్లా కావచ్చును, All mighty కావచ్చును ఏ పేరుతో చెప్పినను ఏదోయొకటి, ఎవరో యొకరు గలరని నిర్ధరింపవచ్చును. "ఇట్లు నానావిధములుగా చెప్పబడెడి పరమాత్మ ఐదురూపముల నొప్పుచుండునని వైష్ణవ సంప్రదాయము. 1. పరరూపము. 2. వ్యూహరూపము 3. విభవ రూపము 4. అంతర్యామి రూపము. 5 అర్చారూపము"[2]

---

1. ప్రాపస్య బ్రహ్మణోరూపం, ప్రాపుశ్చప్రత్యగాత్మనః।
ప్రాప్త్యుపాయం ఫలం ప్రాప్తేః తథాప్రాప్తి విరోధిచ॥
వదంతి సకలావేదా స్సేతిహాస పురాణకాః।
మునయశ్చ మహాత్మానో వేద వేదార్థ వేదినః॥" హారీతసంహిత. (ఇది ముముక్షుప్పడి తిరుమంత్ర ప్రకరణము. 5వ సూత్ర వ్యాఖ్యలో గ్రహీతము.)

2. శ్రీనివాసాచార్యులు. యతీంద్రమత దీపిక. నవమావతారము.
ఏవంప్రకార ఈశ్వరః పరవ్యూహవిభవాంతర్యామ్యర్చావతార రూపేణ పంచ ప్రకారః।"

ప్రతి రూపమునుకూడ (పూర్ణమునుండి వెలువడిన) పూర్ణ రూపమేకాని అసమగ్ర మేదియును కాదు.

ఓంపూర్ణ మదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణ ముదచ్యతే।
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణ మేవావ శిష్యతే॥"1

1. పరరూపము :—

ఈ సమస్త విశ్వము 1. నిత్యవిభూతి 2. లీలా విభూతి యని రెండు విధములు. నిత్య విభూతికి పరమ పదస్థానము అప్రాకృత దివ్యలోకము అని నామాంతరములు. లీలావిభూతిని ప్రాకృత లోకమనియు, పాంచ భౌతిక లోకమనియు పిలుతురు. నిత్యవిభూతి లీలావిభూతికిమూడు రెట్లధికము. కావున త్రిపాద్విభూతి యనియు నందురు.

"పాదోఽస్య విశ్వాభూతాని। త్రిపాదస్యామృతందివి"2

ఈ నిత్యవిభూతి అమృతమైనది. అచటికి పోయిన వారికి సంసార సంబంధము లేదు; తిరిగి జన్మరాదు ఇచట పరమాత్మ అష్టభుజములు గలిగి, దివ్యమంగళ విగ్రహములతో పరవాసుదేవ నామమున విరాజిల్లుచు, నిత్యముక్తుల సేవనొందుచు, వారి కపరిమితానందము గలిగించుచు సదాసర్వకాల ముండును.

వైకుంఠస్థానగా మూర్తిః భుజాష్టక విభూషితా।
సునందనంద ప్రముఖైః సేవితా నిత్య సూరిభిః॥"3

అను శ్లోకమును ప్రమాణముగా గొనవచ్చును.

(కొందరు సంప్రదాయ వేత్తలు ఇచట మూర్తి చతుర్భుజుడై విరాజిల్లుచుండునని తెలిపినారు.)4

రంగనాథ రామాయణమునందు దశరథుడు

అష్టాక్షరముల బాహాష్టకంబులను — స్రష్టయై వెలయు నారాయణు కరణి"5

ఎనమండుగురు మంత్రులు తన్ను గొలువగా నయోధ్యయం దలరెనని" వర్ణింపబడినది. ఇది అమూలక కల్పనము. ఈ కల్పనముచే కవి మహత్తర ప్రయోజనమును సాధించినాడు.

అయోధ్యకు వైకుంఠమునకును, దశరథునికి పరరూపుడైన నారాయణునికి అభేదము చెప్పుటయే, త్రిపాద్విభూతి యందలి పరబ్రహ్మ స్వరూపమును దెలుపుటయే కవి యుద్దేశ్యము.

"అష్టాచక్రా నవద్వారా। దేవనాంపూరయోధ్యా"6

అను శ్రుతియందు అయోధ్య దేవతల (నిత్యసూరుల) పురముగా, పరమాత్మ స్థానముగాఁ జెప్పబడినది.

---

1. శుక్ల యజుర్వేదీయ సంహితోపనిషత్తుల శాంతిపాఠము.
2. పురుష సూక్తము- అనువాకము-2.
3. స్కందోప పురాణము. పురాణవైభవ ఖండము. శ్రీ రామాయణ మాహాత్మ్యము. అధ్యాయము 3, శ్లో. 105.
4. యతీంద్రమత దీపిక- నవమావతారము.
5. రంగనాథ రామాయణము బాలకాండము. ద్వి. 259.
6. యజురారణ్యకము- ప్రశ్న 1 అనువాకము-27 మంత్రము 114.

దశరథుడు = "రథ శబ్దమునకు దేహమనియు నర్థము కలదు."1 కావున మత్స్యకూర్మాది దశవిధ దేహములు ప్రధానముగా కలవాడు దశరథుడని ఒక వ్యుత్పత్తి. దశతీతి దశః = పక్షి (గరుడుడు). గరుడ వాహనుడు అని మరియొక వ్యుత్పత్తి. ఈ రెండు వ్యుత్పత్త్యర్థముల చేత దశరథుడనగా విష్ణువని తెలుసు. ఈ విష్ణు ననంత నామములలో ప్రధానమైనది, ప్రథమమైనది నారాయణ నామము కనుకనే "విష్ణు గాయత్రిలో మొదట పేర్కొనబడినది."2 ఈ నామము ప్రణవ నమస్సులతో గూడి "ఓం నమో నారాయణాయ"అని అష్టాక్షరీ మంత్రమగును. కేవలము నారాయణ' శబ్దమును గణించినను, 'కాదినవ, టాదినవ, పాదిఃపంచకమ్, యాద్యష్టకమ్" అనెడి సంఖ్యాశాస్త్ర సూత్రముచేత (నారాయణ $= 0 + 2 + 1 + 5 = 8$) ఎనిమిది అక్షరములువచ్చును. ఈ అక్షరములే బాహువులు దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మ సంస్థాపనము చేయునవి బాహువులేకదా! అష్టబాహువులే అష్ట సచివులు- రాజునకు రాజ్యపాలనలో తోడ్పడు మంత్రులు. దీపాదుత్పన్న ప్రదీపమువలె, పూర్ణమునుండి పూర్ణము బయలువెడలినట్లు దశరథుని (నారాయణ పరరూపము) నుండి విభవరూపుడైన శ్రీరామచంద్రుని అవతారమయినది.

అవతార మనగా దిగుట- ఉన్నత స్థానమునుండి క్రిందికి వచ్చుట. పరమపద స్థానమున నున్న పరమాత్మ స్వరూపము ప్రథమమైనది జగజ్జన్మ స్థితి లయాదుల లీలా నిమిత్తమై ఆ పర స్వరూపమునుండి వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చా రూపములు తర్వాత నవతరించునవి.

బుద్ధభూపతి "ఈ పరస్వరూపమును ధ్వనింపచేయుటకై కథా ప్రారంభముననే దశరథుని వర్ణనావసరమున అమూలకమైన చక్రిని కల్పనచేసి ఉపమించి" యున్నాడు.

2. వ్యూహ రూపము:—

జగత్సృష్టి స్థితి సంహారములకు కారకులు బ్రహ్మ విష్ణు మహేశ్వరులు వైష్ణవ సంప్రదాయమున ఈ కార్యముల నొనరించువారు ప్రద్యుమ్నానిరుద్ధ సంకర్షణులని చెప్పబడుచున్నారు3 ఈ మూర్తులకు మూలరూపము క్షీరార్ణవశాయియైన వాసుదేవుని వ్యూహరూపము దీనికి మూలము వటపత్రశాయి ఇట్టి నారాయణుని (వ్యూహ వాసుదేవుని) నాభికమలమునుండి బ్రహ్మయు4 బ్రహ్మ వలన సంహారమునకై రుద్రుడును5 అవతరించిరి. బ్రహ్మరుద్రులు నారాయణుని వలననే కలిగిరని

---

1. త్రికాండశేషము "రథః పౌరుషదేహయోః" మరియు
కఠోపనిషత్తు- "ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవతు।"
2. నారాయణాయవిద్మహే వాసుదేవాయ ధీమహి।
తన్నో విష్ణుః ప్రచోదయాత్॥ (ఇది విష్ణు గాయత్రి)
3. యతీంద్ర మత దీపిక నవమావతారము.
4. దా ప్రతి. వాల్మీకి రామాయణము ఉత్తరకాండము. సర్గ 101, శ్లో. 4
"సంక్షిప్య చ పురాలోకాన్ మాయయా స్వయమేవ హి।
మహార్ణవే శయానోప్సు మాంత్వం పూర్వః మజీజనః"
5. గోవింద రాజీయ వ్యాఖ్యానమున (సుందరకాండము, సర్గ 51, శ్లో. 45)
"బ్రహ్మణః పుత్రాయ జ్యేష్ఠాయ శ్రేష్ఠాయేత్యుక్త రీత్యా రుద్రస్యాపి పితా బ్రహ్మ" అని ఆధార ముద్ధృతము.

మరియొక యభిప్రాయము కలదు[1] "ఒక్కడే భగవంతుడు సృష్టిస్థితి లయ కారకుడై బ్రహ్మవిష్ణు శివాత్మిక సంజ్ఞను పొందుచున్నాడు. అతడే జనార్దనుడని"[2] భగవదేకత్వ ప్రతిపాదకాభిప్రాయము సర్వమత సారము.

పైతత్త్వమును ప్రకటించుటకు బుద్ధభూపతి ఆయా సందర్భములందు అమూలకమైన విషయములను వర్ణించి యున్నాడు, పరిశీలింపుడు.

(a) దేవతలు రావణాది రాక్షస బాధలకు తట్టుకొన లేక వ్యూహరూపుడైన క్షీరార్ణవ శయానుడగు విష్ణువును చేరి ప్రార్థించిరి.[3] ఈ ప్రార్థనయందు-

"జగదుద్భవస్థితి సంహారగతులు — దగ వినోదంబులై తనరు నీమాయ"[4]

అనుట గమనింప దగినది. సృష్టిస్థితి లయ కారకుడు ఒక్కడే యనుట కర్త ప్రధానాశయము.

(b) కైకేసియు రావణునికి హితోపదేశము చేయుచు జల ప్రళయ సృష్టి కార్యక్రమములను ఈ క్రింది రీతి దెలిపినది.

"చేకొని లోకముల్ జెడిన పిమ్మటను — నేకమై యుదకంబు లేపారుచుండ,
మక్కువ నాజల మధ్యంబులోన — నొక్కడై తనకు తోడెవ్వరు లేక
బాలుడై యట వటపత్రంబుమీద — లోంగ(దేలాడు లోకరక్షకుడు
కమనీయమగు సృష్టికార్యంబునందు — విమల చిత్తంబున వెసనున్ననంత(
గమలోదరుని నాభి(గమలంబుపుట్టె(— గమలంబులో(బుట్టె(గమల సంభవుడు"[5]

ఇచట వటపత్రశాయి, ప్రజాపతి ప్రాదుర్భావము ప్రస్తావింప బడినవి.

(c) శ్రీరాముడు సీతను వెదకి వెదకి, ఎవరును జాడ(దెల్పుచు లేరని యాగ్రహించి లోకములను భస్మముచేయ ధనువెత్తెను

అప్పుడు శ్రీరాముడు

బలసి జీవుల తోడ బ్రహ్మాండమెల్ల — నలిజేయు సంకర్షణ స్వరూపంబు
రూపించు లయకాల రుద్రుండు వోలె(— గోపించి విల్లందు"[6]

---

1. (a) "నారాయణాద్బ్రహ్మా జాయతే। నారాయణాద్రుద్రో జాయతే।"
నారాయణోపనిషత్తు అనువాకము. 1.
(b) "అథపునరేవ నారాయణస్సోఽన్యత్కామో మనసా ధ్యాయత। తస్యధ్యానాంతస్థస్య లలాటాత్ త్ర్యక్షశ్శూల పాణిః పురుషో జాయతే।" మహోపనిషత్తు. అధ్యా-1

2. "సృష్టి స్థిత్యంత కరణీం బ్రహ్మవిష్ణు శివాత్మికాం।
ససంజ్ఞాం యాతి భగవాన్ ఏకఏవ జనార్దనః॥ విష్ణుపురాణము-1-2-66.

3. రంగనాథ రామాయణము. బాలకాండము. ద్వి. 473-475.
4. ,, ,, ,, ద్వి. 484.
5. ,, ,, యుద్ధకాండము, ద్వి. 1343-1346.
6. ,, ,, అరణ్యకాండము. ద్వి. 1334-1335.

కొన్నట్లు వర్ణింపబడినాడు. ఇది అమూలకము. ఇచట కవి భగవంతుని సంకర్షణ స్వరూపమే రుద్రుడని చెప్పదలంచుట ప్రధానము.

(d) ఇట్లు కమల భవుడు, రుద్రుడు, విష్ణువు సృష్టి, లయ, స్థితి కర్తలై భిన్నులుగా చెప్పబడినను ఈ త్రివిధ కార్యములను జేయు వాడొక్కడేయని కైకసి హితోపదేశము ద్వారా వెల్లడి చేయ బడినది.

"పుట్టించు పోషించు బొలియించుఁ బిదప — నెట్టును గాక తానేకమై యుండు"[1]

ఇది భిన్నత్వములో ఏకత్వమును గాంచుట- ఇది

"ఏకం సద్విప్రా బహుధా వదంతి"[2] యనుశ్రుత్యనుసరణముగాని వేరుగాదు.

(3) విభవరూపము :—

సాధురక్షణ, దుష్టశిక్షణ, ధర్మోద్ధరణములకై పరమాత్మ రామకృష్ణాది రూపములతో నవతరించి, తన కల్యాణ గుణములను ఆయా సందర్భములకు తగినట్లు ప్రకటించును. ఈ భగవద్గీతా రహస్యమును రంగనాథ రామాయణకర్త విభీషణుని చేతను[3] కైకేశి చేతను[4] రావణు నికి హితోపదేశము చేయు సమయములందు ప్రకటింపఁ జేసినాడు.

ఈ జన్మము భగవంతునికి జీవులవలె కర్మవశ్యమైనదికాదు. ఇది స్వేచ్ఛా గృహీతమైన శరీరము. సమర్థుడైన నటుడు కథలోని పాత్రోచిత వేషమును ధరించునట్లు, సర్వజ్ఞుడు సర్వశక్తి యుతుడైన పరమాత్మ తత్తత్కాలోచితమైన శరీరము దాల్చి ఈ లీలా విభూతిలో నవతరించును. కావున అతనిది అప్రాకృతమైన దివ్యశరీరము. స్వరూపతః, స్వభావతః, ఆతడు తన దివ్యత్వ మును వదలిన వాడుకాడు. సుఖదుఃఖాదుల ననుభవించుట లీలానిమిత్త నటనమేకాని వేరుకాదు.

ఈ యవతారములనేకములు. అందు దశావతారములు ప్రముఖములు.

"మనుజాదులతో సమాన రూపమున నావిర్భవించిన ఈ రామాది రూపములను పరమాత్మ యొక్క విభవరూపము అందురు."[5] ఇవి పూర్ణావతారములు, అంశావతారములు, ఆవేశావతారములు నని బహువిధములు రామకృష్ణాద్యవ తారములు పూర్ణములు; పరశురామాదులు ఆవేశావతారములు; వ్యాసాదులు అంశావతారములు

రంగనాథ రామాయణము నందు శ్రీరామునికంటె ముందు వచ్చిన అవతారములు ఉట్టంకింప బడినవి.

(a) కైకేశి రావణునకు శ్రీరామ తత్త్వమును దెలుపుచు

---

1. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి 1318
2. ఋగ్వేదము-1-164-46. మరియు
యాజుషస్మార్త మంత్రపాఠము. "మహాసౌరము" పుట 83లో ఉద్ధృతము-
3. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి. 519-520.
4. ,, ,, ,, ద్వి. 1316.
5. యతీంద్రమత దీపిక-నవమావతారము.
"విభవోనామ తత్తత్స జాతీయ రూపేణా విర్భావః"

"వొచ్చిసోమకుఁ జంపి శ్రుతులర్థితోడ — దెచ్చి బ్రహ్మకు నిచ్చి దీపించె నితడు

............................మొదలుకొని...

ఇప్పుడు దేవతా హితము చింతించి

రాముడై జనియించె రవి వంశమునను"1

అనెడి ద్విపదలలో (1) మత్స్య (2) కూర్మ (3) వరాహ (4) నారసింహ (5) వామన (6) భృగురామ (7) శ్రీరామావతారములను, ఆయవతారములందు అతడొనర్చిన కార్యములను వర్ణించినది. ఇంతేకాక గజేంద్ర రక్షణమును, మధుకైటభ సంహారమును ప్రత్యేకముగా ప్రస్తావించి నది. ఇవి దుష్టశిక్షణ, శిష్టరక్షణలకు నిదర్శనములు-

(b) పాతాళ హోమధ్వంసానంతరము మండోదరి దశగ్రీవునకు శ్రీరామ మహాత్మ్యమును దెలుపుచు-

"ఆమేటి తొల్లి మత్స్యావతారమున — సోమకు నిర్జించి శ్రుతులుద్ధరించె

.............................మొదలుకొని..

దిశల తేజంబులు దీపింపఁ జేసి — దశరథేశ్వరునకుఁ దనయుడై పుట్టె"2

నని శ్రీరామునికి పూర్వము వచ్చిన అవతారములను, తన్మహత్తర కార్యములను వివరించినది.

కేకేశి మండోదరుల కథనములలో భేదమేమనిన, కైకేశి అవతారముల పేర్లను దెలుపక (భృగురాముడనునది మినహాయింపు) తత్కార్యములచే వానిని ధ్వనింపఁ జేసినది; మండోదరి స్పష్టముగా వాచ్యము చేసినది—

ఇక రామాయణ మంతయు విభవమూర్తి పూర్ణావతారుడైన శ్రీరాముని దివ్యకల్యాణ గుణ లీలా ప్రకటనమే కదా!

(4) అంతర్యామి స్వరూపము :—

పరబ్రహ్మ ఆదినారాయణుండు చరాచరములను సృజించి, వానియందు తాను ప్రవేశించి అంతర్యామి రూపమున నుండి శాసించుచున్నాడు. ఉపనిషత్తులందును3 భగవద్గీతాదు4 లందును

---

1. రంగనాథ రామాయణము యుద్ధకాండము. ద్వి-1323-1330
2. ,, ,, ,, ద్వి-7228-7240.
3. (a) "అనేన జీవేనాత్మనాను ప్రవిశ్యనామరూపే వ్యాకరవాణి"

ఛాందోగ్యోపనిషత్తు-ప్రపాఠకము. 6 ఖండము. 3 మంత్ర. 2.

(b) (i) అంతః ప్రవిష్టశ్శాస్తా జనానాగ్ం సర్వాత్మా।

(ii) "అంతః ప్రవిష్టం కర్తార మేతం"

యజురారణ్యకము-చిత్తి (తృతీయప్రశ్న) అనుకాక 11 మంత్రి, 21

(c) యఆత్మని తిష్ఠన్ ఆత్మనోంతరో యమాత్మానవేద యస్యాత్మాశరీరం యఆత్మాన మంతరోయమయతి సతఆత్మాంతర్యామ్యమృతః॥" అంతర్యామిబ్రాహ్మణము.

4. భగవద్గీత-అధ్యాయము 15 శ్లో 15 మరియు అధ్యా-18 శ్లో 61

(i) సర్వస్య చాహంహృది సన్నివిష్టః"

(ii) ఈశ్వరస్సర్వభూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి।

ఈ విషయము స్పష్టపరచ బడినది.

"జీవాత్మలకు సుహృత్తై, యోగులకు మాత్రము చూడఁదగి యుండు రూపముతో హృదయ ప్రదేశమున వసియించి యుండు రూపము అంతర్యామి యనబడును జీవునితోకూడి యున్నను జీవగతదోషములు మాత్రము ఇతనిని స్పృశింపవు."[1]

చిదచిద్వస్తువులు (చరాచరములు) సూత్రమునందు మణి గణమువలె[2] అంతరాత్మగానున్న పరమాత్మనాశ్రయించి యున్నవి. సూత్రము (దారము) లేకున్న మణులకు మాలాకార మెట్లురాదో, అంతర్వ్యవస్థితుడై పరమాత్మలేకున్న చిదచిత్తులకు సత్తయే లేదు.

కావుననే

"ఇందు గలఁడందు లేఁడని-సందేహము వలదు చక్రి సర్వోపగతుం

డెందెందువెదకి చూచిన నందందే గలడు"[3]నియు

నీలో నున్నాడు,నాలో నున్నాడు, అంతట నున్నాడ"[4]నియు ననుటకు ఆస్కారమేర్పడు చున్నది.

రంగనాథ రామాయణము నందీవిషయము స్తుతులందలి ప్రత్యేక పద ప్రయోగములచే నిరూపింపబడినది,

బుద్ధభూపతి గ్రంథ ప్రారంభమునందు—

"అఖిలాండ మౌక్తికాయత నిత్యసూత్ర"[5]

అనియిట్లు విష్ణుని స్తుతించి యున్నాడు. ఇది

"మయి ప్రోత మిదం సర్వం సూత్రే మణిగణా ఇవ"[6]

అనుదాని భావానుసరణమే. సమస్తమైన అండములే (లోకములే) మౌక్తికములు. వానిలో వ్యాపించిన నిత్య సూత్రమే పరమాత్మ. ఈ రూపకము భగవదంతర్యా మిత్వమును వెల్లడి చేయుచున్నది.

శబరి "అవ్యయు నవికారు నఖిలాంతరాత్ము"[7] అనియు

నారదుడు "ఆదిదేవుడవు సర్వాంతరాత్ముడవు"[8] అనియు. శ్రీరాముని స్తుతించిరి. ఇచ్చటి "అఖిలాంతరాత్మ, సర్వాంతరాత్మ" పదములు అంతర్యామి పరమాత్మ సూచకములు.

---

1. యతీంద్రమత దీపిక—నవమానతారము.
2. భగవద్గీత-అధ్యాయము 7 శ్లో 7.
3. పోతనామాత్యుడు. భాగవతము. స్కంధము. 7. పద్య. 275.
4, "అంతర్బహిశ్చ తత్సర్వంవ్యాప్య నారాయణ స్థితః।"
   అనుదాని యనుసరణము. మంత్రపుష్పము. (నారాయణోపనిషత్తు)
5. రంగనాథ రామాయణము. పీఠిక. ద్వి. 9.
6 భగవద్గీత. అధ్యాయము. 7. శ్లో. 7.
7. రంగనాథ రామాయణము. అరణ్యకాండము. ద్వి. 1478.
8. ,, ,, యుద్ధకాండము. ద్వి. 2643.

(5) అర్చారూపము :—

"ఉపాసకానాం కార్యార్థం బ్రహ్మణో రూపకల్పనా"[1]

యన్నట్లు "చేతనులకు (ఆశ్రితులకు) అభిమతమైన ద్రవ్యమునందు (స్వర్ణ, రజత, తామ్ర, లోహ దారు, శిలా, పటాది పదార్థములందు) వారుకోరిన రూపమున, దేశకాలాధికారు లనెడి నియమములు లేక అంతట అన్ని కాలములందు. అందరికిని దృష్టిగోచరమై శుభాశ్రయమగు దివ్యమంగళ విగ్రహ విశిష్టుడై యవతరించి. అర్చకునికి స్వాధీనుడై,అర్చకుల పూజాదులను స్వీకరించి రక్షించుచు, నిరుపాధిక బంధు భూతుడైన భగవద్రూపము అర్చారూపము."[2] అనగా పరమాత్మ భక్తుల ఇచ్చ కొలది పూజాదుల స్వీకరించి యనుగ్రహించుటకు విగ్రహరూపమున అవతరించునని తాత్పర్యము.

భగవంతుని యొక్క పర, వ్యూహ రూపములు దూరమునందుండుట చేతను విభవరూపము కాలాంతరము నందున్న దగుట చేతను, అంతర్యామి స్వరూపము ఏకాగ్రమనస్కులు జితేంద్రియు లైన యోగీశ్వరులకుఁ దప్ప ఇతరులకు గోచరింపని దగుటచేతను, ఈ నాలుగు రూపములు సామాన్య భక్తులకు అందుబాటు లోనివి కావు. గృహ గ్రామ, నగర, శైల, వనాదులందు నెలకొన్న ఈ అర్చారూపమే చేతనులకు అందరికిని సులభముగా నాశ్రయించుటకు వీలైన రూపము. ఈ అర్చారూపార్చనమే విగ్రహారాధనము.

ప్రతి మాపూజ వేదశాస్త్ర సమ్మతమే. దీనిని గూర్చి అనేక సూక్తములు ఆయా వేదభాగ ములందు కనబడుచున్నవి"[3] కావున రామాయణ కాలము నాటికే ఈ అర్చాపూజ బహుళ వ్యాప్తి గాంచినది. దేవాలయములును వెలసి యున్నవి.

(a) విష్ణు ప్రసాదమున లభించిన శ్రీరంగనాథ విగ్రహమును ఇక్ష్వాకువు మొదలుకొని సూర్య వంశ రాజులు ఆరాధించుచుండిరి. శ్రీరాముడు దీనిని విభీషణుని కొసంగగా, కారాణాంతరముచే నది ఉభయ కావేరీ మధ్యమున నెలకొన్నది. అదియే నేటి శ్రీరంగము.

(b) కౌసల్యయు పుత్రహితైషిణియై విష్ణుపూజచేసినది.[4]

---

1. ఆధర్వణీయ రామతాపిన్యుపనిషత్తు- ఉపనిషత్తు. 1. మంత్ర. 7.
2. యతీంద్ర మతదీపిక. నవమావతారము మరియు
   పిళ్ళైయిలోకాచార్యుల "తత్త్వత్రయము" ఈశ్వర ప్రకరణము.
3. (i) "సురూపాం ప్రతిమాం విష్ణోః ప్రసన్న వదనేక్షణాం।
   తామర్చయేత్తాం ప్రణమేత్ తాంయజేత్తాం విచింతయేత్॥"
   (తైత్తిరీయము. కాణ్వసంహిత. కాండము. 4. ప్రశ్నము. 3. ఖండము. 4.)
   (ii) "పాషాణ లోహమణి మృణ్మయ విగ్రహేషు
   పూజా పునర్భోగ కరీ ముముక్షోః॥"
   (యజుర్వేదము. మైత్రాయణ్యా సంహిత. కాండ. 13. ప్రశ్న. 1.)
   (iii) "ఏహ్యశ్మాన మాతిష్ఠ అశ్మా భవతు తేతనూః॥"
   (అధర్వణవేదము. కాండము. 1. కల్పము. 2-ధ్వని 3)
4. దా-ప్రతి-వాల్మీకి రామాయణము. అయోధ్యాకాండము. సర్గ. 20. శ్లో. 14.

(c) కేకయ నగరమునుండి వచ్చిన భరతుడయోధ్యలో "అలంకార విహీనములైన, శూన్యములైన దేవాలయములను"[1] గాంచెను. "అపుడు దేవతాయతన చైత్యములందు పక్షులు దీనములై కూర్చుండి యున్నవి"[2]

ఇవి విగ్రహారాధనము, దేవాలయములు రామాయణ కాలమున నున్నవనుటకు నిదర్శనములు.

రంగనాథ రామాయణమునందు మూలమునందు కంటె విశేషముగా ఒకటి రెండు క్రొత్త విషయములను జేర్చి ఈ అర్చారూపమును, తత్పూజను వివరించి యున్నాడు.

(a) శ్రీరాముడు పట్టాభిషేకమున కంగముగా
"జానకితోఁ గృతస్నానుడై విష్ణు — మానుగాఁ గూర్చి హోమంబు గావించి
యాహవిశ్శేషంబు నమరఁ బ్రాసించి — యూహ విష్ణుధ్యాన మొనరఁ జేయుచును,
విశద నిశ్చయ బుద్ధి విష్ణుగేహమునఁ — గుశ శయ్యపైఁ బొల్చి"[4]
ఉపవాస దీక్షయందుండెను.

(b) కౌసల్య తన కుమారుడైన శ్రీరాముడు క్షేమముగా వనమునుండి తిరిగి వచ్చుటకై,
"పౌలుపొంద వేల్పులఁ బూజించి రాము — వంచేత నొకరక్ష వలనొప్పఁగట్టి"[4]నది.
ఇవి మూలాను సరణములు.

(c) ఆంజనేయుడు లంకలో సీతను వెదకుచు
"దేవాలయంబులు తిరిగి యిల్లిల్లు — భావించి గొందులు పరికించి చూచి"నాడు.[5]

(d) నలుడు బాల్యమున పశుకణ్వుడను ముని పూజావిగ్రహములను సముద్రమునందు మోలు తోపున పాఱ వేయువాడు. దానిని గుర్తించి మునినలునిచేత పాఱ వేయబడినవి మునుగకుండ తేలునట్లు వరమొసంగెను.

(e) శ్రీరాముడు రామేశ్వర లింగ ప్రతిష్ఠను బ్రహ్మహత్యాపాతక నివారణకై గావించి షోడశోపచారములతో పూజించెను.

(f) విభీషణుడు శ్రీ రంగనాథ విగ్రహమును రామప్రసాదమున గొనిపోయి. ఉభయ కావేరీ మధ్యమున కారణాంతరములచే నెలకొల్పి పూజించెను.

ఇట్లు బుద్ధ భూపతి ప్రత్యేకముగా అమూలకములఁజేర్చి విగ్రహ ప్రతిష్ఠా పూజలనుగూర్చి తెలియ జేయుటేకాక, ఆ దేవతా విగ్రహములకుఁ జేసెడి పూజావిధానమును గూడ శ్రీరామ ముద్రికను పొందిన సీతాదేవి ప్రవర్తన ద్వారా విశద పరచినాడు.

హనుమంతు డానవాలుగా నిచ్చిన శ్రీరామ ముద్రికను గ్రహించి

---

1. దా-ప్రతి వాల్మీకి రామాయణము. అయోధ్యాకాండము. సర్గ 72. శ్లో. 40, 41.
2. ,, ,, ,, ,, సర్గ. 72. శ్లో. 42 1/2.
3. రంగనాథ రామాయణము. అయోధ్యాకాండము. ద్వి. 120-122.
4. ,, ,, ,, ద్వి. 568.
5. ,, ,, సుందర కాండము. ద్వి. 71.

"రాముఁ జూచిన కంటె రామగాఁగల్గి — సేమమేర్పడ భద్రసింహాసనమునఁ
బ్రేమతోఁ గూర్చుండఁ బెట్టిన కరణి — నామణి ముద్రిక నక్కనఁ జేర్చి
యనురక్తి నర్ఘ్యపాద్యము లిచ్చినట్లు — కనుగవ హర్షాశ్రు కణములు దొరుగ
ధూపంబు దీపంబుఁ దోడ్తోడ నొసంగి — యేపార సాష్టాంగ మెఱగిన పగిది
పులకించి తిలకించి పొలతి మూర్ఛిల్లి — తెలసి యాహనుమంతు దెసజూచి పలికె."[1]

ఇందలి ఆసన, అర్ఘ్య, పాద్య, ధూప, దీప, నమస్కారములు విగ్రహమునకుఁ జేయు ధ్యానావాహనాది షోడశోపచార పూజలకు నుపలక్షణము. ఈ అమూలక వర్ణనచేత, భక్తుడు భగవంతుని ప్రతిమనిట్లు ఉపచరించ వలెనని నిర్దేశించి నట్లయినది. ఇట్టి అర్చావతార పూజ భగవదను గ్రహము పొందుటకు, సర్వాపేక్షితములు సిద్ధించుటకును సాధన భూతమైనది.

ఇట్లు వాల్మీకమునందు స్పష్టాస్పష్టము గానున్న పర, వ్యూహ, విభవాంతర్యామ్యర్చా రూపముల తత్త్వమును వివరించుటకై కవి యథాశక్తి ప్రయత్నించినాడనుటలో అతిశయోక్తి లేదు.

II. జీవాత్మస్వరూపము :—

జీవాత్మను ప్రత్యగాత్మయనియు నందురు. జీవాత్మ స్వరూపమే స్వస్వరూపము.

పరమాత్మవలెనే జీవుడు నిత్యుడు, చేతనుడు, సనాతనుడు, అణుస్వరూపుడు పరమాత్మకు పరతంత్రుడు. (శేషభూతుడు). ఇట్టి జీవుడొక్కడుగాడు; అనేకులు.

"నిత్యో నిత్యానాం చేతనశ్చేతనానాం — ఏకో బహూనాం యో విదధాతి కామాన్"[2]

అనెడి శ్రుతి జీవుల యనేకత్వమును స్పష్టపరచుచున్నది.

"బద్ధులు, ముక్తులు, నిత్యులు" నని జీవులు మూడు విధములు. బద్ధజీవులు బుభుక్షువులు, ముముక్షువులని రెండు విధములు. మరల ముముక్షువులు కైవల్యపరులు, భగవత్ప్రాప్తి పరులు అని రెండు విధములు.

ఇది మరియొక విధముగాను చెప్పవచ్చును.

1. నిత్యులు 2. ముక్తులు, 3. కేవలులు (కైవల్యపరులు) 4. మోక్షపరులు. (భగవత్ప్రాప్తి పరులు) 5. బుభుక్షువులులు.

ఈ విభాగము విశాలమై, స్పష్టమై "అర్థపంచకమును సార్థక మొనర్చు చున్నది.

(1) నిత్యులు :—

ఎప్పుడును సంసార సంబంధము లేనివారు. భగవత్సన్నిధానముననుండి, భగవత్సేవ సేయుచు. భగవదను భవానుకూల్యైక భోగము- ఆనందము కలవారు. ఈశ్వర నియోగముచే సృష్టి స్థిత్యాదులను జేయ శక్తిగలవారు. తాము ను భగవదాజ్ఞ చే నవతరించువారు.

వీరు శ్రీ, భూ, నీళలు, అనంత గరుడాదులు. ఆదినారాయణుడు శ్రీరాముడుగా నవతరించగా. లక్ష్మీదేవి సీతగాను, అనంతుడు లక్ష్మణునిగాను నవతరించిరి—

---

1. రంగనాథ రామాయణము. సుందరకాండము. ద్వి. 528-532.
2. కఠోపనిషత్తు.

"సీతా లక్ష్మీర్భవాన్ విష్ణుః"[1] అని దేవతాస్తుతి

"నరనాథ నీవాది నారాయణుండ-వరయ నజ్జానకి యయ్యాది లక్ష్మి"[2]

అని రంగనాథ రామాయణము. ఇట్లు చాలా చోట్ల ప్రస్తావింపబడినది.

లక్ష్మణుడు "విష్ణునియంశజుండగుట"[3] యని బుద్ధ భూపతి మూలానుసారముగా వ్రాసినను లోకమున నతడు శేషాంశజుడనియే ప్రఖ్యాతి గలదు. ఇది పద్మ పురాణమునందు

"అనంతాంశేన సంభూతో లక్ష్మణః పర వీరహా"[4]

అని కలదు. రామాయణ వ్యాఖ్యాకారులలో నొకరైన మహేశ్వర తీర్థులు

"శంఖ చక్రానంతానామపి భగవద్రూపతా సూచితా।"[5] అని వ్రాసినారు.

తారాసారోపనిషత్తులో

"కలాయాః పురుషః సాక్షాత్ లక్ష్మణో ధరణీధరః"[6] అని కలదు.

ధరణీధరుడనగా ఆది శేషుడు.

కావున విష్ణు నంశజుడైన లక్ష్మణుడాదిశేషుడనుటలో సందేహము లేదు.

నాగపాశ బద్ధులైన రామలక్ష్మణుల యొద్దకు వైనతేయుడు శ్రీరాముని సంకల్ప మాత్రమున రాగా, నాగపాశములెల్ల వెఱచి పాఱినవి. ఈ ఘటనము గరుడని శ్రీ రామాయణమున ప్రవేశ పెట్టుటకే కాని వేరుగాదు. కాకపోయినచో "తనబంధంబులఁ ద్రోయజాలనివాడు ఆశ్రితుల బంధంబులెట్లు పోగొట్టును?" అని సందేహము పొడమును. దీని సమాధానమును.

అది యట్టిదియ కాదె; యతనిఁ జింతింప-వదలు బంధంబు లెవ్వారలకైనఁ

దనుదానె చింతించి తనదు బంధములు-చనఁద్రోవ రాముండు చాలడే తలప"[7]

అని బుద్ధ భూపతి అమూలకముగా నిచ్చియున్నాడు.

శిఱియ తిరువడి (ఆంజనేయుడు) రాముని సేవ చేసినట్లు, పెరియ తిరువడికి (గరుడాళ్వారుకు) తన్ను సేవింప నవకాశము కలిగింపవలసి యున్నది అదియట్లు సమకూడినది

జయవిజయులు సనక, సనందనాదులచే శప్తులై, రావణ కుంభ కర్ణులగా జనించి, విరోధి స్వరూపము వహించి భగవద్గుణ గణ ప్రకటనకు కారణభూతులైరి.

ఇట్లు రామాయణమున రామునితో పాటు నిత్యాత్మల ప్రవేశమును, తత్సేవను చూపినట్లైనది.

(2) ముక్తులు;—

సంసారమునందు జనించి, భగవంతుని శరణాగరి నొంది, భక్తి జ్ఞాన వైరాగ్యాదులు కలిగి

---

1. దా. ప్రతి. రామాయణము. యుద్ధకాండము. సర్గ. 120. శ్లో. 28.
2. రంగనాథ రామాయణము. యుద్ధ. ద్వి 8150.
3. రంగనాథ రామాయణము. యుద్ధ కాండము. ద్వి. 3840.
4. పద్మపురాణము.
5. మహేశ్వర తీర్థీయము.
6. తారాసారోపనిషత్తు. ద్వితీయ పాదము.
7. రంగనాథ రామాయణము. యుద్ధకాండము, ద్వి. 2672-2673.

ప్రారబ్ధముల ననుభవించుచున్నను, భగవత్సంస్మరణమును మానక, ధ్యాన తపో యజ్ఞ యాగాదులచే యథాశక్తి భగవంతునారాధించి, భగవత్స్వరూప రూప గుణ విభవాదులను గీర్తించి, తదనుభవ జనిత ప్రీతిచే ఆనందమయులై లబ్ధభగవత్ప్రసాదులై, కైంకర్య పరులై, శరీర త్యాగానంతరము పునర్జన్మ రహితమైన ముక్తిని పొందినవారు ముక్తులు. నిత్యుల వలెనే ముక్తులును పరమపదమున ఆనందమయులై యుందురు.

ఎ) "నచపునరావర్తతే నచపునరావర్తతే"[1]

బి) "మాముపేత్య పునర్జన్మ దుఃఖాలయ మశాశ్వతం।
నాప్నువంతి మహాత్మానః సంసిద్ధిం పరమాంగతాః॥"[2]

అని శ్రుతిస్మృతులు చెప్పినట్లు ముక్తులు లీలా విభూతికి తిరిగిరారు. అట్టివారిని దర్శింపఁ జేయుటకై రామాయణము ముక్తిని పొందు ఆత్మల స్వరూపమును. (వారిశీలచరితాదులను) వర్ణించియున్నది.

శరభంగ,[3] జటాయు,[4] శబర్యా[5]దులు, భగవత్సేవచే, (ఆచార్యసేవచే) ముక్తిని పొందిన ముక్తులు.

(3) కైవల్య పరులు : —

"ఉపాసనము రెండు విధములు 1) బ్రహ్మాత్మకస్వాత్మోపాసనము. 2) స్వాత్మ విశిష్ట బ్రహ్మోపాసనము.[6]

ఇందు మొదటి విధమైన ఉపాసనము చేయువారు కైవల్యపరులు. (కేవలులు) వీరు భగవదాత్మకః అహం- బ్రహ్మోఽహమ్, సోఽహం (భగవచ్ఛరీరమును నేను-బ్రహ్మను నేను-అతడే నేను) అని ఉపాసింతురు, వీరు పొందునది కైవల్యము.

"జ్ఞానయోగము నవలంబించి ప్రకృతి బంధమునుండి విడివడిన యాత్మ స్వరూపానుభవము కైవల్యమనఁబడును. ఇట్టి యనుభవము గలవారు కైవల్యపరులు వీరికి పునర్జన్మ లేదు. వీరు భర్త విడిచిన భార్యవలె భగవదనుభవానందము లేక యాత్మానుభవానందమును పొందుచు పరమ పదమున నొక మూలనుందురు "[7]

"విరజా పరమవ్యోమ్నోః అంతరా కేవలా స్మృతా॥" (పద్మపురాణము)

కరుణామయుడైన పరమాత్మ వీరికి దయతో తన యానందమును కలిగించినను కలిగించవచ్చును.

రామాయణమునందు- మతంగ మున్యాదులు కేవలులు. మతంగముని, అతని శిష్యులు శబరి గురువులు. శ్రీరాముడు చిత్రకూట పర్వతమునకు వచ్చినాడని తెలిసికొనియు, శబరికి తెలిపిను

---

1. ఛాందోగ్యోపనిషత్తు- అష్టమ ప్రపాఠకము. ఖండము. 15 మంత్రము. 1.
2. భగవద్గీత-అధ్యాయము. 8. శ్లో. 15.
3. రంగనాథ రామాయణము. అరణ్యకాండము. ద్వి 92-97.
4. రంగనాథ రామాయణము. అరణ్యకాండము. ద్వి. 1384-1385.
5. రంగనాథ రామాయణము. అరణ్యకాండము. ద్వి. 1479-1483.
6. శ్రీ సుదర్శనసూరి. శ్రుత ప్రకాశిక. బ్రహ్మ సూత్రభాష్యవ్యాఖ్యానము. కార్యాధికరణము. సూత్రము. 14. (అధ్యా 4 పాదము-3)
7. యతీంద్ర మత దీపిక. అష్టమావతారము.

శరభంగాదుల వలె అతడు తమ యాశ్రమమునకు వచ్చువరకు వారు బ్రతికి యుండిన వారుకారు. అనగా వారికిచ్చట భగవద్దర్శనము లేకపోయినది. మరియుశబరీ శరభంగాదులవలె వారు ముక్తిని బొందినట్లు (భగవత్ప్రాప్తి నొందినట్లు) వర్ణింపబడలేదు. పరమ పదమున వారికి భగవద్దర్శనానందము లేదనియే ధ్వని కదా, కాని వీరు తపోజ్ఞాన యోగాభ్యాసాదులవలన మహా మహిమ కలవారు. శబరి ఈ మతంగ, తచ్ఛిష్యమాహాత్మ్యమును జూపగా, శ్రీరాముడు జూచి ఆశ్చర్యమొందెను.

(4) మోక్షపరులు :—

ఈషత్ పుణ్యవశమున ఆస్తికులై, భగవన్నిర్హేతుక జాయమాన కృపా కటాక్షమున జ్ఞానము కలవారై మోక్ష మందిచ్ఛకలవారై, తాపత్రయ నివృత్తిని, సంసార సాగర తరణమును గోరి, పరభక్తి పరజ్ఞాన పరమ భక్తులవలంబించి భగవత్సేవ చేయువారు మోక్ష పరులైన ముముక్షువులు వీరు స్వాత్మ విశిష్ట బ్రహ్మోపాసనము చేయువారు, అనగా "చిదచిత్తుల కంటె విలక్షణము పర బ్రహ్మమనియు, అది నిఖిలహేయ ప్రత్యనీక సమస్త కల్యాణ గుణాత్మక స్వరూపమనియు తలంచి యుపాసించువారు"[1] (మచ్ఛరీరకః బ్రహ్మ-నన్ను శరీరముగా గలవాడు పర బ్రహ్మయని యుపాసించువారు.) వీరు విభిన్న సాధన నిష్ఠులై యుండవచ్చును. ప్రపన్నులై యుండ వచ్చును.

రామాయణమునందీ యుభయులును నుట్టంకింప బడినారు.

(ఎ) ... . సంయములు-వాయుభక్షకులును, వైఖానసులును
వాలఖిల్యులు మౌన వంతులు పర్ణ-శాలా విహీనులు స్థండిలశయులు
మనన శీలురుదాత్త మౌను లేకాంతు-లనశన వ్రతులుఁ బంచాగ్ని మధ్యగులు"[2]

మొదలగువారు విభిన్నసాధన నిష్ఠా పరవర్గమునకు చెందినవారు,

బి) విభీషణాదులు ప్రపన్నులు. ఆత్మాత్మీయములను భగవదర్పణముచేసి రక్షించుమని శరణాగతికోరువారు ప్రపన్నులు. ఆకించన్యము అనన్యగతికత్వము అనురెండు ధర్మములు గలిగి భగవంతుని ఆశ్రయించినవారు ప్రపన్నులు. అనగా సాధనాంతర దేవతాంతరాశ్రయణములేక భగవంతుని ఆశ్రయించిన వారని భావము

విభీషణుని యందీ లక్షణములు సంపూర్తిగా గలవు.

5) బుభుక్షువులు :—

కర్మవశముచే సుఖ దుఃఖాదులకు లోనగుచు, అజ్ఞాన, అన్యథాజ్ఞాన, విపరీతజ్ఞాన జనకమైన దేహమునే ఆత్మగాఁ దలంచినవారైఁ దేహాత్మ భ్రాంతి గలవారై, శబ్దాది విషయాను భవ జనితమైన ఇంద్రియానందమునే పరమ పురుషార్థముగా భావించి, తల్లాభమునకై వర్ణాశ్రమాచార ధర్మములను విడిచి, జీవహింస చేయుచు పరదార, పరద్రవ్యాపహరణములను కావించుచు, నీచులను సేవించుచు. అహంకార మమకారములకు, కామ క్రోధాదులకు లోనైన భగవద్విముఖులగు చేతనులు బుభుక్షువులు "ధర్మార్థ కామములనంబడు పురుషార్థములు మూడింటి యందును నాసక్తులగు వారని"[3] తాత్పర్యము.

---

1. యతీంద్ర మత దీపిక - అష్టమావతారము.
2. రంగనాథ రామాయణము ఆరణ్యకాండము ద్వి 98-100.
3. యతీంద్ర మత దీపిక అష్టమావతారము.

వీరు 1) అర్థకామ పరులు. 2) ధర్మపరులు. అని రెండు విధములుగానుందురు.

కైకేయి, శూర్పణఖ, రావణ, కుంభకర్ణ-ఇంద్రజిదాదులు అర్థకామ పరులు. దశరథుడు మున్నగు వారు ధర్మపరులు. వీరి చరిత్రను వివరముగా తెలుపుటయే రామాయణ ముఖ్యోద్దేశ్యము.

ఇట్లు రామాయణమున పంచవిధ జీవాత్మల స్వరూపము తెలియజేయబడినది.

III ఫలస్వరూపము :—

ఫలమనగా పురుషార్థము. పురుషునిచే అర్థింపబడునది. ఇది చతుర్విధము.

1. ధర్మము. 2. అర్థము 3. కామము 4. మోక్షము మరల మోక్షము ద్వివిధము 1. ఆత్మప్రాప్తి 2. భగవత్ప్రాప్తి ఇపుడు పురుషార్థముల సంఖ్య అయిదగును.

రామాయణమునందు వీని స్వరూపము చక్కగా వివరింపబడినది. ఇందు

"మహదుత్పన్న మాఖ్యానం రామాయణ మితి శ్రుతం

....

ధర్మకామార్థ సహితం శ్రోతవ్య మనసూయయా॥"[1]

అని త్రివర్గమున ప్రాధాన్యముగాను,

ఎ) చతుర్వర్గ ప్రదం నిత్యం చరితం రాఘవస్యతు"[2]

బి) ఇదం పవిత్రం పాపఘ్నం పుణ్యం వేదైశ్చ సమ్మితం"[3]

సి) వేదోపబృంహణార్థాయ తావగ్రాహయత ప్రభుః"[4]

అని వేదోప బృంహణార్థముగా రచితమై, వేద సమ్మతమైనందున మోక్ష పురుషార్థమును వివరింప బడినదనుట కాధారములు పై శ్లోకములే.

ఈ యభిప్రాయమును గమనించియే రంగనాథ రామాయణమునందు.

"ఏకథఁ జెప్పిన నిహపరోన్నతులు-ప్రాకటంబుగఁ జేర్చి ఫలియించుఁ బ్రీతి"[5] అనియు,

"ఇది మోక్ష సాధనంబిది పాపహరము"[6] అనియు ఆద్యంతములందు వ్రాయబడినది.

ధర్మార్థకామములు ఇహలోక పురుషార్థములు; మోక్షము పరలోక పురుషార్థము.

(1) ధర్మము :—

ధర్మేణ పాపమపనుదతి"[7] అని శ్రుతి. సాక్షాద్ధర్మము శ్రీరామచంద్రుడే.[8] లక్ష్మణుడు "ఆ

---

1. దా. ప్రతి వాల్మీకి రామాయణము. బాలకాండము. సర్గ. 5 శ్లో. 3,4.
2. ,, ,, ఉత్తరకాండము. సర్గ. 111 శ్లో. 23.
3. ,, ,, బాలకాండము. సర్గ. 2 శ్లో. 98.
4. ,, ,, బాలకాండము. సర్గ. 4 శ్లో. 6,
5, రంగనాథ రామాయణము, బాలకాండము, ద్వి. 38,
6, ,, ,, ,, ద్వి. 2488,
7. తైత్తిరీయ నారాయణోపనిషత్తు. అనువాకము 79. మంత్ర. 101.
8. "రామో విగ్రహవాన్ధర్మః" రామాయణము. అరణ్యా. సర్గ. 37. శ్లో, 13.

రామవిభుడు. ధర్మాత్ముడౌనేని"[1] అని భావించి ప్రయోగించిన బాణము ఇంద్రజిత్తు తలఁదీసెను. కావున రాముడు నడచినట్లు నడచుటయే ధర్మము. "రామాదివద్ వర్తితవ్యం, నతు రావణాదివత్" అని ఆభాణకము. మానవుడు తల్లిదండ్రులయెడ, సేవకులయెడ, మిత్రులయెడ, శత్రువులయెడ, ఆశ్రితుల యెడ, సకల జీవుల యెడ, యెట్లు ప్రవర్తింప వలెనో, అట్లు ప్రవర్తించి మార్గదర్శకుడైనాడు. శ్రీరామచంద్రుడు. "మహాజనోయేన గతః సపంథాః"[2] శ్రీరాముడు పురుషోత్తముడు గదా!

ఇంతేగాక రాజధర్మము, సంఘధర్మము, పాతివ్రత్య ధర్మము. మోక్షధర్మము ఇత్యాదులెన్నియో యిందు వివరింపఁబడినవి.

(2) అర్థము :—

మానవుని ఐహిక సుఖమునకు అర్థమవసరము. అది న్యాయార్జితము కావలెను. ధర్మాపేత ద్రవ్యార్జనాదులు దుఃఖహేతువులే కాక అపయశస్కరములు. ఇది కైకేయి వృత్తాంతముద్వారా స్పష్టపరచబడినది. స్థూలదృష్టికి కైకేయిచర్య సమంజసమనియె తోచును. కాని మంథర దుర్బోధచే అసూయావిష్టురాలైన కైక తన పతిని లెక్కించక, పుత్రరాజ్య వ్యామోహముచే వరములు కోరి శ్రీరాముని అరణ్యమునకు పంపించి, వంశ ధర్మమును ప్రజలయభీష్టమును కూడ మంటఁ గలిపినది. అపకీర్తిపాలైనది

తల్లిదండ్రుల. సోదరుల సుఖక్షేమములకై అర్థాదులందలి వ్యామోహమును విడిచి మానవుడు స్వార్థరహితుడు కావలెనని శ్రీరాముని నడవడి వ్యక్తము చేయుచున్నది. అతడు సుగ్రీవుని రాజ్యమును, రావణ రాజ్యమును కూడ కోరినవాడు కాదు.

(3) కామము :—

కామము జంతుసహజము. మానవుడు దానిని ధర్మబద్ధముగా ననుభవింపవలెను; కనియది ధర్మాపేతముగా నుండకూడదు.

శూర్పణఖ శ్రీరాముని కామించి ముక్కుసెవులు పోగొట్టుకొనుటయే కాక రాక్షసవంశ నాశనమునకు మూలకారణమైనది. మారీచుడు రావణునికి

"....... - నలిమీఱి మన శూర్పణఖయ తాఁబోయి

యనుపమ గుణధాము నభిరాము రాముఁ-గనుగొని యీరీతిఁ గామింపఁ దగునె

తనకు నీ వేషంబు తానె కావించి-కొనియె"[3]

నని శూర్పణఖ రహస్య చర్యను బయలుపఱచినాడు.

వాలియు సుగ్రీవుని భార్యయైన రుమను చేఁబట్టి ప్రాణములను బోగొట్టుకొన్నాడు. రుమ వాలికి మరదలైనను ధర్మము ననుసరించి కోడలగును.

---

1. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి. 5679. దీనికి మూలము. "ధర్మాత్మా సత్యసంధశ్చ" యుద్ధకాం. సర్గ. 91. శ్లో. 73.
2. యస్వీజోగారావు. "భారతీయ సంస్కృతి" (వ్యాసము) పుట. 2లో ఉద్ధృతము.
3. రంగనాథ రామాయణము. అరణ్యకాండము. ద్వి. 811-813.

"భ్రాతుర్జ్యేష్ఠస్య భార్యాయా- గురుపత్న్యనుజస్య సా।
యవీయ సస్తు యా భార్యా-స్నుషా జ్యేష్ఠస్య సా స్మృతా॥"[1]

కావున శ్రీరామచంద్రుడు "కూతురితో, చెల్లెలితో, తమ్ముని భార్యతో, కోడలితో సంగమించువానికి శిక్ష వధ యొక్కటే"[2] శాస్త్రమందు తెలుపబడినదని వాలికి సమాధానమిచ్చెను.

ఈ విషయము మూలానుగుణముగానే రంగనాథ రామాయణమందును స్పష్టపరచబడినది.[3]

రావణాసురుడు కామాంధుడై ధర్మాపేతముగా పరద్రవ్య, పరదారాపహరణములఁ గావించి, తత్ఫలితముగా బంధుమిత్ర పరివార సహితముగా నాశనమొందినాడు; ఆచంద్రార్కముగా నపకీర్తి పాలైనాడు.

హనుమంతుడు తొలుత రావణుని చూడగానే ఇదే యభిప్రాయమును వ్యక్తము చేసినాడు.[4]

కావున ధర్మ విరుద్ధములైన అర్థకామములవైపు మానవుడు పోకూడదని రామాయణోపదేశము.

4) ఆత్మప్రాప్తి (మోక్షము)

దుఃఖ నివృత్తియే, కేవలాత్మానందానుభవమే మోక్షమని కొందఱందురు. మతంగ ముని వృత్తాంత మిందుకు నిదర్శనము. స్వయంప్రభను కూడ నిందుకు నిదర్శనముగా చెప్పవచ్చును. ఈమె స్వయముగా

"...అతి తపోనిష్ఠ-బాయకుండుదు స్వయంప్రభ యనుదాన"[5]

నని హనుమదాదులకుఁ దెలిపి, ఆతిథ్య మొసగి, తన తపశ్శక్తిచే వారిని బిలమునుండి వెల్వడఁ జేసినది; శబర్యాదులు రామ దర్శనమునకు తహతహ లాడినట్లు, సేవించి తరించినట్లు ఈమె వృత్తము లేదు.

5) భగవత్ప్రాప్తి (మోక్షము)

కోసల దేశ వాసు లౌ బాలవృద్ధులు

a) "సర్వాన్దేవాన్ సమస్యంతి రామస్యార్థే హితైషిణః"[6]

b) "రామో రామో రామ ఇతి ప్రజానామభవన్ కథాః"[7]

అని చెప్పబడినట్లు శ్రీరాముని స్మరించి, కీర్తించి, సేవించి అతని యనుగ్రహమును పొంది అతనితో పాటు శరీరమును త్యజించి సాయుజ్య ముక్తిని చెందినారు.

---

1. మనుస్మృతి- అధ్యాయము 9. శ్లో.57.
2. దా. ప్రతి వాల్మీకి రామాయణము- కిష్కింధా. సర్గ-17. శ్లో. 22, 23.
3. రంగనాథ రామాయణము. కిష్కింధా. ద్వి. 563-566, 576.
4. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. సుందరకాండ. సర్గ-49, శ్లో. 18.
   యద్యధర్మో బలవాన్ స్యాదయం రాక్షసేశ్వరః ।
   స్యాదయం సురలోకస్య స శక్రస్యాపి రక్షితా॥
5. రంగనాథ రామాయణము. కిష్కింధా. ద్వి. 1051.
6. దా ప్రతి. వాల్మీకి రామాయణము- అయోధ్యా. సర్గ. 2. శ్లో. 52
7. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. యుద్ధకాండము. సర్గ-131, శ్లో. 97.

శ్రీరాము డిట్లు కోసలవాసుల నందరిని తనతోపాటు పరమపదమునకు తీసికొనిపోవుట తాను జేసిన వాగ్దానమును నెరవేర్చుటకు[1] నిదర్శనము.

ఇట్లు రామాయణమునందు ఫలస్వరూపము ఆ యా ఘటనలద్వారా వివరింపబడినట్లు గ్రహించ వచ్చును.

(iv) ఉపాయ స్వరూపము ;—

పరమాత్మను పొందుటకు (ముక్తిని పొందుటకు) అనువైన సాధనము ఉపాయము. బ్రహ్మ సూత్రములందు దహర వైశ్వానర విద్యాది ద్వాత్రింశ ద్విద్యలు చెప్పబడినవి. భగవద్గీతయందు కర్మ, జ్ఞాన, భక్తి, యోగాభ్యాసావతార రహస్యజ్ఞానాత్మ సన్న్యాస యోగాదులు భగవత్ప్రాప్తి సాధనములుగా ప్రవచింపబడినవి. వీనినన్నింటిని క్రోడీకరించి వర్గీకరించినచో ముఖ్యముగా ఐదగును 1. కర్మయోగము, 2. జ్ఞానయోగము, 3. భక్తియోగము, 4. ప్రపత్తి 5. ఆచార్యాభిమానము.

రామాయణమునందీయుపాయ పంచకము విశదీకరింపబడినది-

(1) కర్మయోగము :—

తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషంతి

యజ్ఞేన దానేన తపసానాశకేన"[2] అను శ్రుతి వాక్య ప్రకారము యజ్ఞ, దాన, తపో, ధ్యాన, సంధ్యావందన, పంచమహాయజ్ఞ తీర్థయాత్ర, పుణ్యక్షేత్రవాస, కృచ్ఛ్రచాంద్రాయణ జప, హోమ. తర్పణాదుల చేతను, యమనియమాసన, ప్రాణాయామ. ప్రత్యాహార, ధ్యాన, ధారణ సమాధి రూపమైన అష్టాంగయోగము చేతను పరమాత్మను సేవించి, సంసారబంధ నివృత్తి పొందుట కర్మయోగము. ఈ కర్మలు నిత్య నైమిత్తిక, కామ్యరూపమున త్రివిధములు. సంధ్యావందనాదులు నిత్యకర్మలు; గ్రహణాంగ జప తర్పణాదులు నైమిత్తిక కర్మలు: ఐశ్వర్యాదులను గోరి చేయబడు నవి కామ్యకర్మలు.

భగవదర్పణముగా చేయబడు కర్మల వలన పాపముంటదు[3] నిష్కామ కర్మయోగము శ్రేష్ఠము.

---

1. ఈ వాగ్దానము వరాహ చరమ శ్లోకమునందు కలదు.
   స్థితే మనసి సుస్వస్థే శరీరేసతి యోనరః। ధాతుసామ్యే స్థితేస్మర్తా విశ్వరూపంచ మామజం॥
   తతస్తం మ్రియమాణంతు కాష్ఠపాషాణ సన్నిభం। అహంస్మరామి మద్భక్తం నయామి పర మాంగతిం॥
2. శుక్లయజుర్వేదీయ బృహదారణ్య కోపనిషత్తు. అధ్యాయ. 6. బ్రాహ్మణము. 4. అనువాకము. (మంత్రము) 22.
3. "బ్రహ్మణ్యాధాయ కర్మాణి సంగంత్యక్త్వాకరోతియః।
   లిప్యతే ననపాపేన పద్మపత్ర మివాంభసా॥

   భగవద్గీత. అధ్యాయ 5. శ్లో. 10.

సిద్ధినాశించి చేయు కర్మలందు అడుగడుగున విఘ్నములు పొడ సూపును. వాని నిర్విఘ్న పరిసమాప్తికి భగవత్సహాయ మవసరము. ఈ కర్మలు మానవునిచే సాధింపబడునవి: కావున వీనిని సాధ్యోపాయము లందురు.

(a) విశ్వామిత్రుడు సిద్ధిని గోరి సిద్ధాశ్రమమున యజ్ఞము చేయదలచెను. కాని యది యెప్పుడు మొదలు పెట్టబడినను మారీచ సుబాహ్వాది రాక్షసులచే విఘ్నము కావింపబడు చుండెను. అపుడు "క్రతుకర్త, క్రతుమూర్తి, క్రతుభాగభోక్త. లోకారాధ్యుడైన"[1] పరమాత్మ దశరథ రాముడై యవతరించినట్లు తెలిసికొని, అయోధ్యకువచ్చి, అతని వెంటగొని పోయెను. రాముడు యజ్ఞశత్రువులను శిక్షించి యాగమును రక్షించెను, విశ్వామిత్రుడు కృతార్థుడయ్యెను

ఇది కామ్యబుద్ధితో చేసెడి కర్మలు విఘ్నోపహతము లగుననియు, అపుడు కర్త భగవత్సహాయ మపేక్షింపగా, నతడు తోడ్పడి తత్కర్మ సంసిద్ధిని కలిగించుననియు ననుటకు నిదర్శనము —

(b) జనక చక్రవర్తి కర్మలు చేసి సిద్ధిపొందిన మహానుభావుడు.[2] నిష్కామ కర్మయోగి; నిరంతరము భగవదర్పణ బుద్ధితో యజ్ఞయాగాదులను చేయువాడు.

ఒకప్పుడు జన్నంబు గావింప సమకట్టి, క్రతుశాల దున్నుచుండగా, ఇతః పూర్వము చేసిన యజ్ఞాది కర్మల ఫలముగా నాగటి చాలులో సీత లభించినది. నిష్కామ కర్మ యోగి ఫలము నేదేవత కర్పితము చేయవలెను; ఏదేవత సర్వశక్తిమంతుడని విచారించునట్లు జనకుడు యుక్త వయస్కురాలైన సీతాతనూజను చూచి యోగ్యుడైన వరునికై చింతించుచుండెను. స్వయంవర పణముగా పరమశివుని విల్లు నేర్పాటు చేసెను. ఎత్తలేనివారు నిర్వీర్యులని గ్రహించెను. శాస్త్రజన్య జ్ఞానము చేతను, గురూపదేశమునను, ప్రత్యక్షానుభవము చేతను భగవంతుని గుర్తించి యోగి ఫలార్పణము గావించునట్లు , శ్రీరాముడు విల్లు విఱువగా, జనకుడు సీతనతని కర్పించెను. రాముడు శ్రీరాము డయినాడు. కావున సంసారులిట్లే కర్మలను బ్రహ్మార్పణ బుద్ధితో చేయవలెనని ఈ సీతా కల్యాణ ఘట్టము బోధించుచున్నది.

(c) కర్మలనేకములు, పద్ధతులు బహువిధములు. అరణ్యమునందు శ్రీరాముని దర్శింప వచ్చిన నానామునుల వర్ణనము-

"ఆయాశ్రమావాసులైన సంయములు — వాయు భక్షకులును, వైఖానసులును
వాల ఖిల్యులు మౌనవంతులు పర్ణ — శాలా విహీనులు స్థండిల శయులు
మనన శీలురు దాంతిమంతు లేకాంతు — లనశన వ్రతులుఁ బంచాగ్ని మధ్యగులు
మొదలైన తాపసులు"[3]

అనునది యుదాహరణము

---

1. రంగనాథ రామాయణము. బాలకాండము. ద్వి. 625.
2. కర్మణైవహి సంసిద్ధి మాస్థితా జనకాదయః॥
భగవద్గీత-అధ్యాయ-3 శ్లో. 20.
3. రంగనాథ రామాయణము. అరణ్యకాండము. ద్వి. 98-101.

(b) "మాతాపితృ సేవయు ఉత్తారక" మనుటకు యజ్ఞదత్తుని కథ నిదర్శనము.

(c) స్వార్థమును గోరి అహంకరించి భగవద్విముఖముగా చేసిన కర్మలు కొనసాగక కర్తకు కీడొనరించును. ఇందుకు ఇంద్రజిత్తు నికుంభిళాయాగ, రావణ పాతాళ హోమాదులు సాక్ష్యములు

(మోక్షోపాయమైన కర్మయే ఉపాయమనియు ధర్మార్థ కామములను త్రివర్గ ఫలసాధన కర్మలు ఉపాయములు కావనియు ప్రత్యేకముగా నిచట గమనింప వలసినది.)

(2) జ్ఞానయోగము :—

మైల కడుగగా మణి నిర్మలమై ప్రకాశించునట్లు భగవదర్పిత బుద్ధితో కర్మలు చేయుట వలన పాపము నశించి, చిత్తయికాగ్రత కలిగి జ్ఞానముదయించును. అప్పుడు జ్ఞానియోగ జన్య జ్ఞానముచే వికసించిన హృదయ కమలమునందు భగవత్సాక్షాత్కారము కలుగగా నానందాను భూతి నొందును. తాను ఉన్నచోటునుండియే భగవల్లీలలను దర్శించి యానందింపును: పరమాత్మాను గ్రహమునకు పాత్రుడగును

(a) భరద్వాజుడిందుకు నిదర్శనము-

శ్రీరాము దరణ్యమునకుఁ బోవుచు, మార్గ మధ్యము నందలి భరద్వాజు నాశ్రమమునకు రాగా, అతడు

"...రఘురామదేవు వర్తనము — భాపించి యచ్చెర్వుపడి తత్త్వమెఱిఁగి"[1]

కందమూలాదుల నాతిథ్య మొసగి యర్చించెను. ఇట్లే లంకనుండి తిరిగి వచ్చినపుడు భరద్వాజుడు శ్రీరామునితో—

— "నిఖిల లోకారాధ్య-నీవు జన్మించి — నిఖిల లోకంబులు నిష్ఠఁబాలింపఁ

గలవె సంకటములు గలవెదుఃఖములు — గలవె బాధలు పుణ్యకర్ములకెందు

....

నీవిందు విచ్చేసి నెమ్మి నేఁ బనుప — గావీడుకొని పోయి క్రమ్మఱనిందు

విచ్చేయు నీలోని వృత్తాంత మెల్ల — నచ్చుగాఁ బొడగంటి నధ్యాత్మదృష్టి"[2]

అని తెలియఁజేసినాడు. వీరికి భూతభవిష్యద్వర్తమాన జ్ఞానముండునని భరద్వాజుని మాటల సారాంశము. వీరి యోగశక్తి మహత్తరమైనది. ఇతడు భరతుని సైన్యమునకుఁ జేసిన విందు దీనికి సాక్ష్యము. వసిష్ఠ, అత్రి, అగస్త్యాదులు ఈ కోవలోని వారే. రామాయణమునందు-

"ఇతని మహత్త్వమే నెఱుగుదు; బ్రహ్మ

సుతుడైన యీ వసిష్ఠుండును నెఱుగు ... .

యతడు లోకారాధ్యుడు"[3]

అని విశ్వామిత్రుడు పలికిన మాటలు జ్ఞానుల జ్ఞానపూర్ణతను ప్రకటించుచున్నవి—

---

1. రంగనాథ రామాయణము. అయోధ్యాకాండము. ద్వి. 1124.
2. ,, ,, యుద్ధకాండము.ద్వి. 8484-8489.
3. ,, ,, బాలకాండము. ద్వి. 623-625.

(3) భక్తి యోగము :—

"భజ సేవాయాం" అను ధాతువునుండి నిష్పన్నమైనది భక్తి శబ్దము. "భక్తిశ్చ జ్ఞానవిశేషః"1 అనునది జ్ఞానము భక్తి యొక్క రేయని తెలుపును. పరమాత్మను దెలిసికొని సేవించుట భక్తియని తాత్పర్యము. ఆచార్యోపదేశము వలన జ్ఞానము కలుగగా, సాధన సప్తకము2 వలన భక్తి యేర్ప డును పూర్వజన్మ పుణ్య విశేషము చేతను, భగవన్నిర్హేతుక జాయమాన కృపాకటాక్షము చేతను భక్తి కలుగును మానవులందేకాక పశుపక్ష్యాదులందును.3 ఈ భక్తిని గాంచవచ్చును.

కర్మజ్ఞానాదులకంటె "తైలధారావ దవిచ్ఛిన్న స్మృతి సంతాన రూపమైన4 భక్తికి భగవంతుడు పరవశుడగును. అతడు భక్త సులభుడు గదా!

రంగనాథ రామాయణమునందు మూలమునందుకంటె విశేషముగా ఈ భక్తి ప్రాధాన్యమును గూర్చి వివరింపబడినది.

(a) దేవతలు రావణాదుల బాధలకు తట్టుకొనలేక అమృతాబ్ధి కడకేగి అచ్యుతుని ప్రార్థించుచు- "భక్తవత్సల నిన్నుఁ బరికింపఁదరమె — భక్తియోగము దక్క బయలు మాటలను"5

---

1. శ్రీభగవద్రామానుజాచార్యులు. వేదార్థసంగ్రహము. (చివరి వాక్యము) పుట. 45.

2. శ్రీభగవద్రామానుజాచార్యులు. శ్రీభాష్యము. జిజ్ఞాసాధికరణము.

లఘుసిద్ధాంతము —

సాధనసప్తకము :— తల్లబ్ధి ర్వివేక, విమోకా, భ్యాస, క్రియా, కల్యాణా, నవసాదా, నుద్ధర్షేభ్యస్సంభవాన్నిర్వచనాచ్చ॥

1 జాతిదుష్ట పదార్థముఁ చేత. ఆశ్రయ దుష్టపదార్థములచేత. నిమిత్తదుష్ట పదార్థములచేత దూషితముగానట్టి యాహారముచే శరీరమను పరిశుద్ధము చేసికొనుట వివేకమనబడును.

2. కామముయొక్క అభిష్వంగము (విషయముల ననుభవించిగాని నిలువలేక పోవుట) లేక పోవుట విమోకమనబడును,

3 ధ్యానింప వలసిన దానిని మాటి మాటికిఁ దలంచుట అభ్యాసమనఁబడును.

4, పంచమహా యజ్ఞాదులను శక్తికొలది యనుష్ఠించుట క్రియ.

5. సత్యము, ఆర్జవము, దయ, దానము; అహింస, అనభిధ్య (పరులొనర్చిన అపకారమును చింతింపకుండుట) యనునవి కల్యాణములు.

6. దేశకాలములు మంచివి కాకపోవుటవలనను, గతించిన దుఃఖములను కలుగజేసెడి వస్తువులు మొదలగు వానిని స్మరించుకొనుట వలనను గలిగెడి మనస్సు యొక్క దైన్యము అవసాదనము. అట్టిదైన్యము నొందక మనస్సును స్థిరముగా నుంచుకొనుట అనవసాదము.

7. దేశకాలములు మంచివి యగుటచేతను, ప్రియవస్తువును స్మరించుట చేతను గలుగు సంతోషము ఉద్ధర్షము. అట్టి సంతోషము లేకుండుట అనగా అతిసంతోషముచే మనోవికారము నొందక మనస్సును స్థిరముగా నుంచుకొనుట అనుద్ధర్షము.

3. వానరులు. జటాయువు ఉడుత మున్నగునవి

4. శ్రీభగద్రామానుజాచార్యులు శ్రీభాష్యము. జిజ్ఞాసాధి కరణము. లఘుసిద్ధాంతము

5, రంగనాథ రామాయణము. బాలకాండము. ద్వి. 482.

అని నుతించిరి.

(b) జానకీ మాత అగ్నిలో ప్రవేశించిన తర్వాత బ్రహ్మరుద్రేంద్రాది దేవతలు వచ్చి శ్రీరాముని ప్రార్థించుచు,

భవదీయ మాయా ప్రభావంబుఁ దెలియ — భవదీయులకుఁ గాక పరులకు వశమె.

....

దాస భావంబునఁ దక్క నొండొకటి — నీసంవిదాకృతి నెఱయ దుర్ఘటము"

అని నుతించిరి. ఈ నుతులు భక్తియోగ ప్రాముఖ్యమును దెలుపుచున్నవి,

c) వారిధిపై సేతు నిర్మాణము జరుగుచుండగా, ఒక్క ఉడుత సేతువు తొందరగాఁ గొనసాగవలెనని

"....శ్రీరాముని యడుగుఁ దామరలు-మనమునఁ జేర్చి యా మనుజేశు నెదుర

నచ్చపు భక్తితో నట వార్ధి మునిగి-వచ్చి తా నిసుకలో వడిఁ బొరలాడి

తడయక చనుదెంచి తనమేని యిసుక-వడిఁగట్టపై రాల్చి వనధిలో మునిగి

తేలి గట్టునకేగి తిరుగంగఁ బొరలి-వాలిన భక్తితో వచ్చి విదల్చు"[2] చుండెను.

ఇది భక్తుడు భగవత్పాదారవిందములను మనమున నిల్పి యథాశక్తి యథోచిత కైంకర్యమును చేయునని తెలుపుచున్నది.

శ్రీ రాముడు సౌమిత్రికి ఆ యుడుత భక్తిని జూపుచు

"నామీద భక్తి నున్నత గతిఁబూని- ... ...

తానెంత యని మదిఁ దలపక ప్రేమఁ--బూని సహాయమై పొదలుచున్నదియు

కనుగొంటివే"[3]

యని పలికినాడు. ఇందు "తనశక్తి యెంతయని వెనుకాడక ప్రేమతో యథాశక్తి యథోచిత కైంకర్యము చేయుట భక్తి లక్షణమని ప్రతిపాదింపబడినది.

అంతట లక్ష్మణుడు

"... .... -భవదంఘ్రికమలముల్ భక్తి

నెవ్వడు మది నిల్పి యొసగుఁదృణంబు- నవ్వేల్పు గిరిఁబోలు ననినఁ గాకున్నె

కావున భక్తియ కారణంబనఘ"[4] యని పలికెను. ఇది

పత్రం పుష్పం ఫలం తోయం యోమే భక్త్యాప్రయచ్ఛతి।

తదహం భక్త్యు పహృత మశ్నామి ప్రయతాత్మనః॥"[5]

అనెడి శ్లోకార్థమునకు భంగ్యంతర వివరణమే.

---

1. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి. 8146-8149.
2. రంగనాథ రామాయణము. యుద్ధకాండము. ద్వి. 1100-1103.
3. ,, ,, ,, ,, 1106-1110.
4. ,, ,, ,, ,, 1110-1112.
5. భగవద్గీత అధ్యాయము. 9. శ్లో. 26.

ఇట్లు మూలములో లేనట్టి, భక్తి ప్రాధాన్యమును వివరించునట్టి "ఉడుత కథ"ను జొప్పించి ఉడుతాభక్తి యనెడు సార్థకమైన సామెతకు తోడ్పడినవాడు కవి

ఇక ఆంజనేయాదుల భక్తి ప్రసిద్ధమే కదా! ఆంజనేయుడు స్వయముగా "మత్తః ప్రత్యవరః కశ్చినాస్తి సుగ్రీవసన్నిధౌ"1 యని సీతతో చేప్పిన మాటలు భక్తుని నైచ్యాను సంధానమునకు గుర్తు. వైష్ణవులు "హనుమంతుని" "శిరియ తిరువడి" యందురు. కావున భక్తులు (దాసులు)

త్వద్భృత్యభృత్య పరిచారక భృత్య భృత్య-భృత్యస్య భృత్య ఇతిమాం స్మరలోకనాథ"2 అని నైచ్యాను సంధానముతో తమ్ము దెలుపుకొనుచు ప్రార్థింతురు. ఇట్లు రామాయణమున భక్తి విషయము మూలాతిశయముగా వివరింపబడినది.

4) ప్రపత్తియోగము :—

కర్మ, జ్ఞాన, భక్తి యోగములందశక్తులైనవారికి సుకరమును, శ్రీఘ్ర ఫలప్రదమును అగు ఉపాయము ప్రపత్తి. దీనినే శరణాగతి యందురు.

"అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ।
తస్మాత్కారుణ్య భావేన రక్ష రక్ష జనార్దన॥"3

అని భగవచ్చరణారవిందములపై పడి నమస్కరించి రక్షించుమని ప్రార్థించుట ప్రపత్తి.

"ఈ ప్రపత్తికి దేశ, కాల, ప్రకార, అధికార, ఫల, నియమములు లేవు;"4 అనగా పుణ్య దేశములందే, వసంతాది కాలములందే, పాద ప్రక్షాళన స్నానాది పూర్వకముగానే, త్రైవర్ణికులే, ప్రత్యేక దృష్టాదృష్ట ఫలములను గోరియే ఈ ప్రపత్తి చేయవలయునుగాని, ఇతర దేశములందు, ఇతర కాలములందు అశుచిగా, త్రైవర్ణికులు గానివారు పేర్కొన్న ఫలమునకై చేయరాదని నియమము లేదు. ఎవరైనను, ఎచ్చటనైనను, ఎట్టి కాలమునందైనను, ఎట్లున్నను, ఎట్టి ఫలమును గోరినను ఈ ప్రపత్తి చేయవచ్చును.

ఈ ప్రపత్తికి అద్వేషము, ఆభిముఖ్యము అనునవి రెండు ప్రధానాంగములు. మఱికొందఱు5

1. అనుకూల్య సంకల్పము 1) ప్రాతికూల్య వర్జనము. 3(రక్షించుననెడి దృఢ విశ్వాసము 4) గోప్తృత్వవరణము 5) ఆత్మ సమర్పణము 6) కార్పణ్యము (వేరుగతి లేదనుట)

---

1 దా. ప్రతి వాల్మీకి రామాయణము. సుందరకాండము. సర్గ. 39 శ్లో. 38.
రంగనాథ రామాయణమున "నాకంటె ఘనులైన నగచరాధిపులు" అని ఈ భావము వచ్చునట్లు వ్రాయబడినది. (సుందరకాండ. ద్వి. 550)

2. కులశేఖరాళ్వార్లు-ముకుందమాల శ్లో. 27.

3. ప్రతివ్రతము (పూజ) నందలి ఆత్మప్రదక్షిణ నమస్కారశ్లోకము.

4. శ్రీ వచన భూషణము.

5. వేదాంత దేశికులు.

అని ప్రపత్తియుపాయమునకు అంగములారందురు. ఈ ఆరింటిలో భరసమర్పణము (ఆత్మ నిక్షేపము) ప్రధానము.

"ఇది 1) ఆర్తప్రపత్తి 2) దృప్తప్రపత్తి"[1] యని రెండు విధములు.

1) ఆర్త ప్రపత్తి :— తాను జేసిన తప్పులకు భయపడుచు, ఉద్దేశించిన ఫల ప్రాప్తికి త్వరపడుచు చేయు శరణాగతి ఆర్త ప్రపత్తి యనబడును.

పునర్జన్మ భీతిచే సంసారమునందు విరక్తి కలిగి, తన్నివారణకై భగవత్ప్రాప్తి గోరి, సదాచార్యోపదేశమున సిద్ధోపాయమును స్వీకరించి (సాక్షాద్భగవంతునినే శరణాగతినొంది) వర్ణాశ్రమాచార ధర్మములను పాటించుచు, నిరంతర భగవద్భాగవత కైంకర్యము చేయుచు, ఆత్మ పరమాత్మల అనాది సంబంధమును పాటించి అతనిపై సర్వభారములనుంచి, తద్దర్శనార్థమై తపన చెందుట ఆర్త ప్రపత్తియని కొంచెము వివరించవచ్చును. సంసార మసహ్యముగా ఇతనికి దోచును.

భరతుని చరిత్ర ఈయార్త ప్రపత్తికి నిదర్శనము తన తల్లి కైక అర్థకామనచే చేసిన చర్యకు భరతుడు మిగుల దుఃఖించి, అపనిందకు భయపడి

"ఇంక నీ పురమేల నా భోగమేల-శంకింప కడవియే శరణంబునాకు"[2]

అని వైరాగ్యమునొంది, ఆచార్య వసిష్ఠుని పరీక్షయందు నెగ్గి తదనుమతిని చిత్రకూటమునకు వచ్చి పాదములందు వ్రాలి.

"నన్ను నీ బంటు మన్ననఁ జేసి నాదు-విన్నపంబాలింపవే దయామూర్తి"[3]

యని ప్రార్థించి, అయోధ్యకు వచ్చి పట్టము కట్టుకొమ్మని కోరెను ఈ శరణాగతి ఫలించుటయందు కైకవరము, పితృాజ్ఞాపాలనము" అనెడి ప్రారబ్ధమడ్డు పడినను పాదుకా ప్రదానమను శ్రీరామ కృపకు పాత్రుడైనాడు అతడు వానిని శ్రీరామ ప్రతినిధులుగా భావించి, వానిపై సకల భారములు మోపి, సేవ చేయుచు, రామాగమనమును కోరుచు, ఎప్పుడు 14 వత్సరములు గడచునా, ఎప్పుడు రాముని చూతునా యనెడి యార్తితో నున్నాడు. కాలము గడచిన తర్వాత, క్షణకాలమును సహించక అగ్ని ప్రవేశము చేయుటకు సిద్ధపడినాడు.

2) దృప్త ప్రపత్తి :— తానుద్దేశించిన ఫలమునందు త్వరపడక, తన తప్పులకై భీతిల్లక, తనకు వినయము లేదనియు జంకక. ఫలకాంక్షతో శరణాగతి నొందుట దృప్త ప్రపత్తి

భ్రష్టైశ్వర్య కాములును, అపూర్వైశ్వర్యకాములును స్వప్రయత్నమెందుకు కొరగాదని జ్ఞానమును పొంది తత్తత్ కామనాసిద్ధికి భగవంతుని శరణాగతి నొందుట దృప్త ప్రపత్తి యని వివరణమొనర్చ వచ్చును.

ఎ) సుగ్రీవుడు భ్రష్టరాజ్య, పత్నుల నొందుటకై శ్రీరాముని శరణాగతి నొందెను.

బి) ఋషులు రాక్షస బాధా నివారణార్థము శరణాగతి నొందిరి.

---

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. యుద్ధకాండము. సర్గ 18 శ్లో. 28.
"ఆర్తోవా యదివాదృప్తః పరేషాం శరణాగతః"
2. రంగనాథ రామాయణము. అయోధ్యాకాండము. ద్వి. 1417.
3. ,, ,, ,, ద్వి. 1704.

సి) సముద్రుడు భగవన్నిగ్రహము వలన కలుగు శిక్షనుండి తప్పించుకొనుటకై శరణాగతి నొందెను.

డి) రావణ వధానంతరము రాక్షసస్త్రీలు ఆంజనేయునిచే శిక్షింపబడకుండ నుండుటకై సీతాదేవిని శరణు పొందిరి.

ఇట్లు వారు వారాయా ఫలముల నాశించి సీతారాములకు ప్రపత్తి చేసి తత్కృపకు పాత్రులైరి.

విభీషణ శరణాగతి షడంగములతోఁ గూడిన సంపూర్ణ ప్రపత్తికి లక్ష్యము.

1) ఇతడు మొదటి నుండియు శ్రీరామునియెడ ఆనుకూల్య స్వభావము గలవాడు సీతాపహరణము తప్పనియు, రామునికామె నప్పగించి, శరణువేడి లంకను, తనను రక్షించుకొమ్మనియు నేటున చాటున, అడుగడుగున రావణునకుపదేశ మొనర్చినాడు.[1]

2. తన హితవచనమునములను పెడచెవిని బెట్టి, తనను తన్ని వెడలగొట్టిన రావణాది ప్రతికూలుర నందరిని వర్జించినాడు.

3. రామజనపాలుడు తప్ప ఇతరులు రక్షకులుకారని అతనినే వరించినాడు.

4. "పోయెద నారామ భూపాలుఁగాన-బోయి యాయన కృపఁ బొందియుండెదను"[2]

అని రాముడు తప్పక తనను రక్షించునను దృఢ విశ్వాసముతోనే తల్లియనుమతి నొంది వచ్చినాడు.

5) సభయుండ నగునాకు సంప్రీతి వెలయ-నభయ మిప్పింపుడీ యవనీశుచేత"[3]

ననెడి మాటలలో విభీషణుని కార్పణ్యము (ఆకించన్యము) వ్యక్తమగుచున్నది.

6) "నరనాథ యార్తుని నన్ను రక్షింపు- .... ••• ....

అఖిల శరణ్యుఁడవైన నీ మఱుగు-సుఖమని యేవచ్చి చొచ్చితిఁ బ్రీతి"[4]

అనెడి పలుకులలో ఆత్మ సమర్పణ ధ్వనించుచున్నది.

ఇట్టి శరణాగతి షడంగములలో ఏ యొక్కటియున్నను, పరమాత్మ జీవుని రక్షించును. ఇట్లనుట అతని కారుణ్యాతిశయమును వెల్లడించుటయే.

ఇతః పూర్వము శరణాగతి నొంది ఆశ్రయించియున్నవారు నూతనముగా వచ్చిన శరణాగతుని గూర్చి చాడీలు చెప్పుచు వలదన్నను, సమర్థుడు వారిని వదలక చేరదీయును. వానరులు విభీషణుని వలదన్నను, శ్రీరాముడు అతనిని దగ్గరకుఁ దీసి, రక్షించి, తన మాటను నిలుపుకొనెను.

5) ఆచార్యాభిమానము :—

ఆత్మ, పరమాత్మ ప్రకృతుల విషయమున జ్ఞానము కలిగించి, తత్త్వబోధ చేసి, ఆత్మోద్ధరణయందు పరమోపకారకుడైన ఆచార్యునందు (గురువునందు) దేవునియందు వలెనే నిర్మల భక్తి కలిగి సేవ చేయువారికే మహాత్ములకే తత్త్వ రహస్యములు మనస్సున ప్రకాశించుచు

1. రంగనాథ రామాయణము యుద్ధకాండము ద్వి. 519-523, 353
2. ,, ,, ,, ,, 690.
3. రంగనాథ రామాయణము యుద్ధకాండము. ద్వి. 637
4. ,, ,, ద్వి. 696, 697.

ప్రత్యక్ష గోచరము లగుచుండును.[1]

"ఆచార్యవాన్ పురుషోవేద"[2] అని చెప్పినట్లు గురుభక్తి గలవాడే పరమాత్మను దెలిసికొనును. అది లేనివానికి గురువు బోధించిన విషయములు మనసునకే రావు ఇక ఫలానుభవ మెట్లు పొడసూపును.

దైవాధీనం జగత్సర్వం, మంత్రాధీనం తు దైవతం।
తన్మంత్రం బ్రాహ్మణాధీనం, బ్రాహ్మణో మమదేవతా॥"[3]

అన్నట్లు ఒక్క ఆచార్యాభిమానము చేతనే తరించవచ్చును.

పాపిష్ఠః క్షత్ర బంధుశ్చ పుండరీకశ్చ తావుభౌ।
ఆచార్య వత్తయాముక్తౌ తస్మాదాచార్యవాన్ భవేత్॥

పాపిష్ఠుడైన క్షత్రబంధువు, పుండరీకుడు అను ఇరువురును ఆచార్యానుగ్రహము నొంది తరించిరి.

రామాయణమునందు శబరీ వృత్తాంత మిందుకు నిదర్శనము.

"అనఘాత్మ నాగురుడైన మతంగ — మునిచేత నీకథల్ మును వినియుందు
నీవాద్యుడవు సర్వనిగమ వేద్యుడవు — గావున నిను నుతుల్ గావింపఁ దరమె"[4]

అని శబరి తనకు తత్త్వజ్ఞానోపదేశము చేసిన గురువు మతంగ మహామునియెడ కృతజ్ఞత కనబరచుచు శ్రీరామునితో పలికినది. అంతేకాక, "నిన్ను గాంచుటచేత గురుశుశ్రూష ఫలించినద"ని విన్నవించినది. గురు శుశ్రూషకు ఫలము భగవద్దర్శనమే కదా! "గురుం ప్రకాశయేద్ధీమాన్"[5] అన్నట్లు తన గురువుల మహత్వము లన్నియు శ్రీరామునకు దెలిపినది చివరకు "తన గురు వాక్యంబులఁ దలచి యనలంబు దరికొల్పి, యందు రామార్పణంబుగ తన శరీరమును వేల్చి దివ్య విమానంబు నెక్కి దేవ లోకమునకు పోయినది.[6]

దీని వలన గురు శుశ్రూష భగవదనుగ్రహమును సంపాదించి మోక్షమునకు కారణమగునని యేర్పడుచున్నది.[7]

శబరి బోయ వనిత యైనను, పూర్వ పుణ్య విశేషముచే మతంగ మహామునిని సేవించి తరించినది. "ఆచార్య దేవోభవ"[8] అను శ్రుతి వాక్యమునకు ఉదాహరణ భూతురాలయినది.

ఇట్లు రంగనాథ రామాయణము నందు మూలానుసారముగా, అచ్చటచ్చట విశేషముగాను, కర్మ

---

1. శ్వేతాశ్వతరోపనిషత్తు-అధ్యాయము-6 మంత్రము-23. యస్యదేవే పరాభక్తి ర్యథాదేవే తథా గురౌ। తస్యైతే కథితాహ్యర్థాః ప్రకాశంతే మహాత్మనః॥
2. గోవింద రాజీయము బాలకాండ. సర్గ. 1 శ్లో. 1. వ్యాఖ్యానములో ఉద్ధృతము)
3. నీతిశాస్త్రము. భాగము. 1. శ్లో. 64.
4. రంగనాథ రామాయణము. అరణ్యకాండము. ద్వి. 1452, 1453.
5. "శేషసంహిత" లోనిదని "ముముక్షుప్పడి" తిరుమంత్రప్రకరణము. సూత్ర 4. మణవాళ మామునుల వ్యాఖ్యానమునందుద్ధృతము.
6. రంగనాథ రామాయణము. అరణ్యకాండము. ద్వి. 1472-1483.
7. గోవిందరాజీయ వ్యాఖ్యానము. అరణ్యకాండము. సర్గ. 74. శ్లో. 36.
8. తైత్తిరీయోపనిషత్తు. శీవల్లి. అనువాకము. 11, మంత్రము. 2.

జ్ఞాన, భక్తి, ప్రపత్తి ఆచార్యాభిమానము లనెడి ఐదుపాయములు వివరింప బడినవని తెలిసికొన వచ్చును.—

(v) విరోధి స్వరూపము :—

ఉద్దిష్టార్థమునకు అడ్డుపడునది విరోధి; వ్యతిరేకించునది విరోధి యనవచ్చును.

ఇదియు నైదువిధములు.

1 స్వరూపవిరోధి, 2 పరత్వవిరోధి, 3 పురుషార్థవిరోధి 4 ఉపాయవిరోధి, 5 ప్రాప్తి (ఫల) విరోధి.

ఈ విరోధిస్వరూపమును రావణ కుంభకర్ణాదుల యందు చూడవచ్చును.

1. స్వరూప విరోధి :—

దేహాత్మాభిమానము, ఇతరులకు సేవచేయుట, తాను స్వతంత్రుడ ననుకొనుట, ఆత్మస్వరూపమునకు విరోధి.

రావణుడు సీతాదేవి యొద్దకు వచ్చునపుడు చేసి కొనిన యలంకారము[1] దేహాత్మ భ్రాంతిగల వానియొక్క (ఆత్మ సుఖముకంటె దేహసుఖమే ప్రధానమని భావించెడి వానియొక్క) విలాసమునకు నిదర్శనము.

ఉత్తర గోపురంబున కొలువున్న దశకంఠుని తీరు[2] నేను స్వతంత్రుడను, నన్నుమించిన వైభవము గలవాడులేడు" అని తలంచెడు అతని తలంపునకు నిదర్శనము-

ఈ రావణుడు "నీపాదములపై బడెదను, నన్ను కనికరించుము."[3] అని సీతను ప్రార్థించి నాడు; కాని "ఎవరికిని తలవంచన"ని[4] యన్నాడు. ఇది యతని యహంకారమునకు సాక్ష్యము.

ఇట్టి యీ యహంకారము ఆత్మస్వరూపమునకు విరోధియైజ్ఞానోత్పత్తి కవరోధము కలిగించి ఆత్మవినాశనమునకు దారితీయును రావణుడట్లే నశించినాడు.

(2) పరత్వవిరోధి :—

దేవతాంతరములందు పరత్వత భావన, క్షుద్రదేవతలశక్తి అత్యధికమని విశ్వసించుట, పరమాత్మశక్తిని కించపరచుట అవతార విషయమున మానుషభావన కలిగి యుండుట ఇత్యాదులు పరత్వ విరోధులు.

రావణ కుంభకర్ణ ఇంద్రజిదాదులు బ్రహ్మాదుల వలన వరముల నొందితిమి, మాకేమి తక్కువ" యని విఱ్ఱవీగినారు. బ్రహ్మాదులే గొప్పవారు. అంతకంటె పరుడు లేడని వారి తలంపునకిది నిదర్శనము-[5]

---

1. రంగనాథ రామాయణము సుందరకాండము. ద్వి. 259-278.
2. ,, ,, యుద్ధకాండము. ద్వి, 2111-2141.
3. దా-ప్రతి-వాల్మీకి రామాయణము. అరణ్యకాండ. సర్గ. 55. శ్లో. 35 1/2.
4. ,, ,, ,, యుద్ధకాండము. సర్గ. 36. శ్లో, 11

"ఏషమే సహజోదోషః ననమేయం కథంచన"

5. (a) రంగనాథ రామాయణము. సుందరకాండము. ద్వి. 338-343.
(b) ,, ,, యుద్ధకాండము. ద్వి. 339-401.

రాముడు పరంధాముడని స్వయముగాఁ దెలిసికొన జాలక, విభీషణాదులు తెలిపినను వినిపించుకొనక క్షుద్రమానవుని క్రింద జమకట్టి నిందించిన రావణుని మాటలు[1] పరత్వ విరోధి సూచకములు.

(౩) పురుషార్థ విరోధి :—

కేవలము ధర్మాపేతమైన అర్థకామములందలి యిచ్ఛయు, భగవత్కైంకర్యము నందలి విముఖత్వమును పురుషార్థ విరోధి యనబడును.

కైకయొక్క అర్థకాంక్ష, వాలి, శూర్పణఖల యొక్క కామవాంఛ, రావణుని అర్థకామముల కాంక్ష ఉత్తమ పురుషార్థమైన భగవత్కైంకర్యమునకు విరోధియైనవి.

(4) ఉపాయ విరోధి :—

హింసా ప్రవృత్తితోఁగూడి, స్వప్రయోజనమునకై చేయబడెడు అశాస్త్ర విహిత కర్మలైన యజ్ఞయాగాది క్రతువులు భగవత్ప్రాప్తికి విరోధములు.

ఇంద్రజిత్తు నికుంభిళాయాగము, రావణుని పాతాళ హోమము, శివానుగ్రహమునకై అతడు స్వశిరములను ఖండించి వేల్చుట, ఇత్యాదులు ఉపాయవిరోధులు.

(౫) ప్రాప్తి విరోధి :—

తప్పుచేసియు (అధర్మమాచరించియు) పశ్చాత్తాపపడక తన తప్పును సమర్థించుకొనుట, భగవదపచార, భాగవతాపచార, అసహ్యాపచారములు చేయుట భగవత్ప్రాప్తికి విరోధములు.

రావణుడు సీతనపహరించి, అది తప్పని తెలిసికొనలేదు; మీదు మిక్కిలి విభీషణాదులు చెప్పినను విని, "అయ్యో తప్పుచేసితిని గదా!" యని పశ్చాత్తాపపడి, సరిదిద్దుకొనలేదు, అనగా సీతను రామునికప్పగింప లేదు.

ఇతడు రాముని నుండి సీతను విడదీసి, అపహరించి భగవదపచారము గావించినాడు. [సూర్యుని నుండి ఎండను విడదీయజాలనట్లు, రాముని నుండి సీతను వేఱు పఱచలేమని గ్రహింపజాలలేదు.]

రామభక్తుడైన ఆంజనేయుని తోకకు నిప్పంటించి, విభీషణుని తన్ని వెడల గొట్టి భాగవతాపచారము గావించినాడు.

ఇంతేకాక పరద్రవ్య పరదారల నపహరించినాడు; సాధుమునుల తపోయజ్ఞాదులకు విఘ్నమాపాదించి వారిని చంపుక తిన్నాడు. అన్నయైన కుబేరుని లంకనుండి వెడల నడచినాడు; ఇవి రావణుడొనర్చిన అసహ్యాప చారములు. ఈ దోషములు భగవత్ప్రాప్తికి విరోధములైనవి.

ఇట్లు రామాయణమునందర్థ పంచకజ్ఞానము ఆయాఘటనల, సంభాషణల ద్వారా ప్రతిపాదింపబడినది.

పై పరిశీలన వలన బుద్ధభూపతి వైష్ణవమత ప్రచారమునిమిత్తమై రామాయణమును సముచితముగా అనువదించినాడనుట అతిశయోక్తి కానేరదు.

---

1. (a) రంగనాథ రామాయణము. యుద్ధకాండము ద్వి. 511-517.
   (b) ,, ,, ,, ద్వి. 3695-3713.

రంగనాథ రామాయణము - కావ్యశిల్పము

కవి కర్మకావ్యము. "కీర్తి, ధనము, అమంగళక్షతి, వ్యవహార వేతృత్వము, సద్యః పర నిర్వృతి, కాంతాసమ్మితోప దేశము"1 ఫలములుగానెంచి కవి కావ్యమును రచించును. "సత్కావ్య నిషేవణము ధర్మార్థకామ మోక్షములయందు కళలయందు నైపుణ్యమును, ప్రీతి, కీర్తులను కలిగించును"2 "కావ్యాలాపాంశ్చ వర్జయేత్" అనెడి స్మృతివాక్య నిషేధము ఉత్తమ పురుష చరిత్ర నిబద్ధముకాని అసత్కావ్యములను గూర్చికాని సత్కావ్యముల గూర్చికాదు. "సంసార విషవృక్షమునకు పొడమిన అమృతోపమానమైన ఫలములలో కావ్యామృత రసాస్వాద మొకటి"3 లోకమునందు బుద్ధిమంతులకు కావ్యశాస్త్రవినోదముల తోడను, మూర్ఖులకు నిద్రాకలహ వ్యసనాదుల తోడను కాలము గడచును"4 కావున కవులు కావ్యముల రచించుటయు, సహృదయులు పఠించి రసానుభూతి నొందుటయేకాక తమ జీవితమును బాగు పరచుకొనుటయు: పండితులు పరిశీలించి తత్కావ్యశోభా హేతువైన విమర్శనలు వెలయించుటయు, సహజము, గిట్టనివారు పక్షపాత దృష్టితో అసద్విమర్శలు చేయవచ్చును. కాని, నిష్పక్షపాత బుద్ధికలిగిన సరసులకవి శిరోధార్యములుకావు.

కావ్యమునకు ప్రధానాంగములు మూడు 1. ఇతివృత్తము. 2. నాయకుడు. 3. రసము"5 ఉపాంగములు అలంకార వర్ణనాదులు. వీనియొక్క సమ్మేళనమే మహాకావ్యము. ముఖ్యముగా ప్రధానాంగములను పోషించిన తీరుపై కావ్యప్రతిష్ఠ ఆధారపడియుండును. వీనిలో నేయొక్కటి యద్భుతముగానున్నను ఆ కావ్యమును లోకమాదరించును.

---

1. మమ్మటానాద్యుడు-కావ్యప్రకాశము. ప్రథమోల్లాసము శ్లో-2.
కావ్యం యశసేఽర్థకృతే వ్యవహారవిదే శివేతరక్షతయే।
సద్యఃపర నిర్వృతయే కాంతా సమ్మితతయోపదేశయుజే॥"

2. భామహుడు-
ధర్మార్థకామ మోక్షేషు వైచక్షణ్యం కలాసుచ॥
కరోతి కీర్తిం ప్రీతించ సాధుకావ్య నిషేవణం॥

3. ఆభాణక శ్లోకము.
సంసార విషవృక్షస్య ద్వేఫలే అమృతోపమే।
కావ్యామృత రసాస్వాదః సల్లాప స్సజ్జనైస్సహ॥

4. ఆభాణక శ్లోకము :—
"కావ్యశాస్త్ర వినోదేన కాలోగచ్ఛతి ధీమతాం।
వ్యసనేనచ మూర్ఖాణాం నిద్రయా కలహేనచ॥"

5. "వస్తు నేతా రసస్తేషాం భేదకః॥"

(1) ఇతివృత్తము :—

కావ్యమునందితి వృత్తము ప్రధానమైనది. ఇతివృత్తము (కథ) లేక కేవల వర్ణనాప్రధానము లైన ఋతు సంహారమువంటి కావ్యములున్నను, లోకమునకు వానివలన ప్రయోజన మంతగా నుండదు. ఈ యితివృత్తమే ఇహపర సుఖహేతువైన భగవత్కథగా నుండవలెననియు, చరిత్రను సంఘచరిత్రను ప్రతిబింబించునవిగా నుండవలెననియు, కళాత్మకమై ఆనందానుభూతిని కలిగించు నవిగా నుండవలెననియు, ఉపదేశాత్మకములుగా, నీతి ప్రబోధకములుగా నుండవలెననియు, పలువురు పలువిధములైన అభిప్రాయములను దెలియజేయుచున్నారు. రామాయణ మహాభారతముల వంటి మహాకావ్యములు అందరిని సంతృప్తిపరచునవిగా నున్నవి.

ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని — యధ్యాత్మవిదులు వేదాంతమనియు,

నీతి విచక్షణుల్ నీతిశాస్త్రంబని — కవివృషభులు మహాకావ్యమనియు,

లాక్షణికులు సర్వలక్ష్య సంగ్రహమని — యైతిహాసికులితి హాసమనియుc

బరమ పౌరాణికుల్ బహుపురాణసముచ్చ — యంబని మహిఁ గొనియాడుచుండ"[1]

గా వివిధ వేద తత్త్వవేదియైన వేదవ్యాసుడు మహాభారతమును జేసినాడని నన్నయ్యగారు భారతమును ప్రశంసించిరి. ఇట్లే రామాయణముకూడ ధర్మశాస్త్రముగా, వేదాంతముగా, నీతిశాస్త్రముగా, కావ్యముగా, లక్షణగ్రంథముగా, ఇతిహాసముగా, పురాణ సముచ్చయముగా, పరిశీలకుల దృష్టిభేదమును బట్టి గోచరించు ననుటలో సందేహములేదు. నన్నయ్యగారి పద్యమును రామాయణమునకును అనువర్తింపc జేయవచ్చును. "ఇందు చెప్పబడినది యంతటను గలదు; ఇందులో లేనిది యెచ్చటను లేదు"2 ఈ రామాయణ గ్రంథము ఏదికావలెనని కోరువారికి దానినొసంగును; అనగా సర్వులను సంతృప్తి పఱచును.

రామాయణ కథ జగత్ప్రసిద్ధము; ముఖ్యముగా ఐతిహాసికము, రసాన్వితమైన ఉపదేశాత్మకము; ఆశ్లేయముగూడ. సత్యసంధుడు, ధర్మాత్ముడు, పౌరుషమునం దప్రతిద్వంద్వుడు, మర్యాదా పురుషోత్తముడు, ఇహపర సుఖ హేతువైన భగవదవతారమూర్తియునైన శ్రీరాముని చరిత్రమును వర్ణించునట్టిది, కావుననే బుద్ధారెడ్డి ఈ కథను తన కావ్యరచన కనుకూలమని తలంచి గ్రహించెను.

బసవపురాణము నందలి నాయకుడు బసవడు. ఇతడు శివుని వాహనమైన వృషభావతారము. రామాయణము నందలి నాయకుడు రాముడు సాక్షాన్మహావిష్ణువవతారము. రుద్రావతారుడైన ఆంజనేయుడు రాముని బంటు. కావున ఈ కథను గ్రహించుటలో మత ప్రచారము నుద్దిష్టమై యున్నది. సాధారణముగా ప్రాచీనాంధ్ర కావ్యములలో ఏ యొకటి రెండు తప్ప అన్నియు మత ప్రమేయ దృష్టితో రచింపబడినవే.

---

1. నన్నయ భారతము. ఆదిపర్వము. ప్రథమాశ్వాసము. ప-32.
2. ఆభాణక శ్లోకము .—

యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి నతత్ క్వచిత్

2. నాయకుడు (Hero)

"ప్రబంధములకును ప్రబంధ కర్తలకును కీర్తి ప్రతిష్ఠలను కలిగించునది కావ్యము నందలి నాయక గుణగణ నిరూపణమే."[1] రామాయణమునందలి నాయకుడు శ్రీరాము డనంత కల్యాణ గుణాకరుడు; ధీరోదాత్తుడు, దుష్టశిక్షణ, శిష్టరక్షణ ధర్మోద్ధరణకై అవతరించిన భగవంతుడు; మాతృభక్తి, పితృభక్తి, గురుభక్తి, సోదరప్రేమ, ఏకపత్నీత్వము, ఆశ్రిత వాత్సల్యము సత్యసంధత, ఇత్యాది ధర్మముల నాచరణ రూపమున ప్రతిపాదించిన ఆదర్శమూర్తి-త్యాగజీవి, శైవ వైష్ణవ జైన బౌద్ధ చార్వాకాది మతముల ప్రాబల్యమున ప్రజలు పరస్పర దూషణ భూషణ తిరస్కారాదుల నొనర్చుకొనుచు అస్తవ్యస్త జీవితమును గడుపుచుండు కాలమున వారి మధ్య సామరస్యమును గుదుర్చుటకును, శాంతి నెలకొల్పుటకును, సమర్థుడైన, అనువైన కథానాయకుడు పరిపూర్ణ మానవుడైన (perfect man) శ్రీరాముడు దప్ప మరొక్కడు కాడు." "అష్టాక్షరీ మంత్రమునందలి 'రా' వర్ణమును, పంచాక్షరీ మంత్రము నందలి 'మ' వర్ణమును గ్రహించి మేళగించగా నేర్పడిన రామ నామాంకితుడు"[2] అపర బోధిసత్త్వుడు. కావుననే సర్వ మతస్థులచేత సమాదరింపబడువాడు. అందువలన బుద్ధారెడ్డి శ్రీరాముని తన కావ్య కథానాయకునిగా వరించి, అతనిచేత (అతని అనుయాయులచేత) వాల్మీకమున లేని గణపతి నమస్కార, లింగ ప్రతిష్ఠాదుల నొనరింపఁజేసి మత సహనము గలిగిన పరమపురుషునిగాఁ దీర్చిదిద్దినాడు.

3. రసము :—

"రసాత్మకమైన వాక్య (సముదాయ) ము కావ్యము"[3] ఆస్వాదింపబడునది రసము.[4] విభావానుభావ వ్యభిచారులయొక్క సంయోగమువలన రసము నిష్పన్నమగును,[5] అనగా "విభావానుభావ వ్యభిచారి భావములచే నాస్వాద్యమానమగు స్థాయిభావము రసమని"[6] యభిప్రాయము. సజాతీయ

---

1. విద్యానాథుడు- ప్రతాపరుద్రీయము. "ఉపోద్ఘాతము శ్లో. 7.
ప్రబంధానాం ప్రబంధౄణా మపి కీర్తి ప్రతిష్ఠయోః।
మూలం విషయ భూతస్య నేతుర్గుణ నిరూపణం॥

2. ఆథర్వణీయ రామరహస్యోపనిషత్తు- అధ్యాయ. 5
"శ్రీరామ మంత్ర రాజస్య సమ్యగర్థోఽయ ముచ్యతే।
నారాయణాష్టాక్షరే చ శివ పంచాక్షరే తథా॥
సార్థకార్ణద్వయం రామో రమంతే యత్రయోగినః॥

3. విశ్వనాథుడు సాహిత్యదర్పణము- పరిచ్ఛేదము-1 శ్లో-3 వాక్యం రసాత్మకం కావ్యమ్.

4 రస్యతే ఇతి రసః-రస ఆస్వాదనే అని వ్యుత్పత్తి

5. భరతుడు- నాట్యశాస్త్రము. అధ్యాయము 6. శ్లో. 31.
"విభావానుభావ వ్యభిచారి సంయోగాద్రస నిష్పత్తిః॥

6. ధనంజయుడు- దశరూపకము.
విభావై రనుభావైశ్చ సాత్త్వికై ర్వ్యభిచారిభిః।
ఆనీయమాన స్స్వాదుత్వం స్థాయీభావో రసస్మృతః॥"

విజాతీయ భావములచే భంగపడక రసపూర్తి పర్యంతము సహృదయ హృదయములందు చిర స్థాయిగా నిలుచునది స్థాయి భావము.[1] ఈ స్థాయిభావము అనుకూలమగు సంచారి భావములచే నొకసారి యావిర్భావమును, మరొకసారి ప్రతికూల సంచావ భావములచే తిరోభావమును బొందు చున్నను సంస్కారరూపమున రససూర్తివరకు స్థిరముగా నిలుచును.[2] ఇట్టి స్థాయిభావము పరిపుష్టమై రసమగును. "ఎంతకాలము సహృదయుడు విభావాదుల ననుసంధించుకొని చర్వణము సేయునో యంతకాల మాత డట్లే యానందించును- ఆచర్వణము ముగియగానే యా యానందమును ముగియును- ఈ యానందమునకు రసానంద మనిపేరు. ఇది బ్రహ్మానంద సహోదరము; విభావాదియుక్తము"[3] "రసోవైసః, రసగ్గ్ హ్యేవాయం లబ్ధ్వానందీ భవతి"[4] యనెడి శ్రుతి స్వారస్యముచే స్థాయి భావము గూడిన యానందమే రసమని జగన్నాథుడు సిద్ధాంతీకరించెను.

"లౌకికములగు హర్షశోకాదుల వలన నరులకు హర్షశోకాదులే కలుగును- కాని కావ్యశిల్పమలౌకిక మగుటవలన (కావ్యగత నాయకాదులు లౌకిక నాయకాదుల యనుకర్తలు; గాని, లౌకిక నాయకులుగారు) సామాజికునకు నన్నింటివలనను హర్షమే కలుగును."[6] హరిశ్చంద్రాది నాటక దర్శనము వలన, సీతాపహరణాది కావ్య శ్రవణమువలన అశ్రుపాతాదులు కలుగుట దుఃఖము వలనగాదు; తత్సందర్భమున సామాజికుల, పఠితల హృదయము కరిగి కన్నులవెంట నీరై వచ్చును."[7] ఇవి ఆనంద బాష్పములే. కావున కావ్యమున శోకాది కారణమువలనను ఆనందమే కలుగును. నాటక ప్రదర్శనము వేళ సామాజికుడు తత్తత్ పాత్రలతో తాదాత్మ్యము చెంది రసము నాస్వాదించునట్లు, "శ్రవ్య కావ్యమున వర్ణితులైన కంసాదులు తత్తద్వర్ణనములచే రూపమును బొంది హృదయమునం ప్రవేశించి ప్రత్యక్షముగా గోచరింపగా, పఠిత తదభేదముతో రసాస్వాదము చేయును."[8] కావున ప్రధానమైన కావ్యరచనా ప్రయోజనము రసానందము గూర్చుటయే. అందుచేత

---

1. ధనంజయుడు- దశరూపకము
   "సజాతీయై ర్విజాతీయై రతిరస్కృత మూర్తిమాన్
   యావద్రసం వర్తమానః స్థాయీభావ ఉదాహృతః॥"
2. ధనంజయుడు- దశరూపకము.
   "విరుద్ధై రవిరుద్ధైర్వా భావై ర్విచ్ఛిద్యతే న యః।
   ఆత్మభావం నయత్యన్యాన్ స్థాయీవ లవణాకరః॥"
3. సన్నిధానము సూర్యనారాయణశాస్త్రి. కావ్యాలంకార సంగ్రహము (వ్యాఖ్య) పుట-288.
4. తైత్తిరీయోపనిషత్తు. ఆనందవల్లి. అనువాకము 7, మంత్రము 1.
5. సన్నిధానము సూర్యనారాయణశాస్త్రి- కావ్యాలంకార సంగ్రహము (వ్యాఖ్య) పుట. 288.
6. విశ్వనాథుడు- సాహిత్య దర్పణము. పరిచ్ఛేదము 3 శ్లో. 6, 7ల తర్వాతివాక్యములు. పుట-78.
7. విశ్వనాథుడు-సాహిత్యదర్పణము. పరిచ్ఛేదము 3. శ్లో 8 ముందువాక్యము. పుట-78.
8. భర్తృహరి "వాక్యపదీయము"లోనిదిగా "కావ్యాలంకార సంగ్రహము" (వ్యాఖ్య) పుట-290 లో ఉద్ధృతము.

రసాత్మకమైనదే కావ్యము. నీరసకావ్యము జీవములేని దేహము వంటిది. ఉత్తమ కవులు నాటినుండి నేటివరకు కావ్యమున రసపోషణకై ప్రయత్నించుచున్నారు.

రస సంఖ్యా విషయమున లాక్షణికులలో మతభేదము లున్నను, సాధారణముగా "నవరస ములని" యందరు నంగీకరించిరి. "శృంగార, హాస్య, కరుణ, రౌద్ర, వీర, భయానక, భీభత్స, అద్భుత శాంతములని ఆ నవరసముల పేరులు. రతి, హాస, శోక, క్రోధ, ఉత్సాహ, భయ, జుగుప్స, విస్మయ శమములు వీనికి స్థాయి భావములు"[1]

రామాయణ మహాకావ్యము శృంగారాది రసములతో కూడియున్నదని

"రసైః శృంగార కారుణ్య హాస్య వీర భయానకైః।

రౌద్రాది భిశ్చ సంయుక్తం కావ్యమేతదగాయతాం।"[2]

అని వాల్మీకియే చెప్పియున్నాడు. వాల్మీకి జాడ ననుసరించి వ్రాసిన బుద్ధారెడ్డియు —

రసము(ల)లు కల్పనల్ (ప్రాస సంగతులు)

అసమాన రీతుల నన్నియుఁ గలుగఁ"[3]

గా శ్రీరామ చరిత మొప్పఁజెప్పెదనని ప్రతినబట్టి వ్రాసెను. వ్రాసిన దానియందు విశ్వాసముండుట చేతనే, ప్రతి కాండాంతమునను "రసికమై చెలువొందు రామాయణంబు"[4] అనియు, "రసికానందమై యెల్లనాడు నివ్వసుమతినొప్పు నీ పుణ్యచరిత"[5] మనియు గట్టిగాఁ జెప్పియున్నాడు. "రసికమై" యనగా "రసయుతమై" యనిగాని, రసమయమైయనిగాని యర్థము చెప్పుట సమంజసము. ఈ ద్విపద రామాయణమునందు నవరసములు పోషితము లైనవని కవి యుద్దేశ్యము—

—: రామాయణములో అంగిరసము :—

"కావ్యనాటకాది ప్రబంధములలో నానారసములు నిబంధింపబడుట సుప్రసిద్ధము: కాని కావ్యమున కుత్కర్షను గలిగింపఁగోరు కవి వానిలో నొకదానిని ప్రధాన రసముగా (అంగి రసముగా) నంగీకరించి పోషించుట యుక్తతర మార్గమ"[6]ని ఆనంద వర్ధనాచార్యుల వారి వక్కణ. ఈ దృష్టితో—

'రమణ శృంగారాది రసములేర్పడగ"[7]

రచితమైన రామాయణమునందు అంగిరసమేదియని పరిశీలించిన లాక్షణికులలో ముఖ్యముగా

---

1. విశ్వనాథుడు. ప్రతాపరుద్రీయము. రసప్రకరణము. శ్లో. 1, 2.
2. డా-ప్రతి-వాల్మీకి రామాయణము. బాల. సర్గ. 4. శ్లో. 9.
3. రంగనాథ రామాయణము. బాలకాండము. ద్విపద 101.
4. " " " ద్వి. 2474.
5. " " " ద్వి. 2486, 2477.
6. ఆనందవర్ధనుడు. ధ్వన్యాలోకము, ఉద్యోతము. 3, శ్లో. 21.

"ప్రసిద్ధేఽపి ప్రబంధానాం నానారసనిబంధనే।
ఏకోరసోఽఙ్గీ కర్తవ్యః తేషాముత్కర్ష మిచ్ఛతా॥

7. రంగనాథ రామాయణము. బాలకాండము. ద్వి. 224.

త్రివిధ మతములు పొడసూపినవి. కొందఱు కరుణము ప్రధానమనిరి. మఱికొందఱు శృంగార మనిరి. ఈ రెంటిని త్రోసిరాజని మఱికొందఱు వీరమని ప్రతిపాదించిరి.

(1) కరుణ రసము అంగి.

ఆనంద వర్ధనుడు కరుణ రస ప్రాధాన్యవాది. ఇతడు

(1) వాల్మీకి శోకము శ్లోకత్వమొంది పిదప అది రామాయణ కావ్యముగా పరిణతి చెందుట.

(2) కావ్యావసానములో రామునికి సీతాత్యంత వియోగదుఃఖము కలుగుట.

అనెడు రెండు విషయములు కావ్యప్రారంభ పరిసమాప్తులై రామాయణమునందు కరుణ రసాంగిత్వమును నిర్ణయించుటకు కారణములగు చున్నవని"[1] తెలిపెను.

కాళిదాస,[2] భవభూత్యా[3]దులు ఈ భావమును సమర్థించిరి. ఇదియే విద్వల్లోకమున అధిక ప్రచారమున నున్నది

కాని, "శోకమేశ్లోకముగా వచ్చుట" అను హేతువుచేత కరుణ మంగి రసమని చెప్పవలను పడదు. ఇది గ్రంథమున కుపోద్ఘాతమేకాని కథాశరీరమున చేరదగినదికాదు. కథ దశరథుని పరిపాలనతో ఆరంభించును. కనుక అచట దుఃఖప్రసక్తి కవకాశమే లేదు "[4] అనియు "భార్యా వియోగశోకంతో రాముడు కుమిలి పోయాడని చెపితే ఆయనకు దక్కేమనత తక్కువే"[5] అనియు "ఏకోరసః కరుణఏవ" అన్న భవభూతి వాక్యానికి కేంద్రము కేవల ముత్తర రామాయణము .... దీనిని కాదంటే, యుద్ధకాండాంతము వరకు ఉన్నరామాయణము కరుణ రస ప్రధానమని అనుట సాహసం"[6] అనియు కరుణ రసవాదము ఖండింపబడు చున్నది—

---

1. ఆనందవర్ధనుడు. ధ్వన్యాలోకము. ఉద్యోతము. 4. శ్లో. 5. తద్వ్యాతివచనము.
   "రామాయణే హి కరుణోరసః। స్వయం ఆదికవినా సూచితః। శోకః శ్లోకత్వమాగతః॥ ఇత్యేవంవాదినా నిర్వ్యూఢశ్చ సఏవ సీతాత్యంత వియోగ పర్యంతమేవ స్వప్రబంధముప రచయితా॥"
2. కాళిదాసు. రఘువంశము. సర్గ. 14. శ్లో. 70
   నిషాద విద్ధాండజ దర్శనోత్థః శ్లోకత్వ మాపద్యత యస్యశోకః॥
3. భవభూతి ఉత్తర రామచరితము. అంకము. 3. శ్లో-41.
   ఏకోరసః కరుణఏవ నిమిత్త భేదాత్ — భిన్నః పృథక్ పృథగి వాశ్రయతే వివర్తాన్.
   ఆవర్త బుద్బుద తరంగ మయాన్ వికారాన్ — అంభో యథాసలిల మేవ హి తత్సమస్తమ్.
4. డా॥ జి. వి. సుబ్రహ్మణ్యం వీరరసము. పుట. 217.
5. " " రసోల్లాసము. పుట. 14.
6. " " " పుట. 15.

(2) శృంగార రసము అంగి :—

గోవిందరాజా[1]దులు శృంగార రస ప్రాధాన్యవాదులు. రామాయణమునకు "సీతాచరిత్ర"[2] మనియు నామాంతరమున్నది. కథయంతయు సీతను కేంద్రబిందువుగాఁ జేసికొనియె నడచినది. తాటకవధ, విశ్వామిత్ర యాగసంరక్షణ, ధనుర్భంగాదులు సీతాకల్యాణమునకు పూర్వరంగములు; ప్రత్యేకముగా సీతను వలపింపఁజేయుటకు కారణ భూతములైన రాఘవఘన కార్యములు; విరాధ, ఖర, దూషణాది సంహారము సీతారక్షణార్థమును, వాలి, రావణ, వధాదులు అపహృత సీతను తిరిగి పొందుటకును జేయబడిన యనంతర కృత్యములు,

సీత లక్ష్మీదేవి; పురుషకార స్వరూపురాలు. "సూర్యుని వీడి యెండ,[3] రత్నమును వీడికాంతి, పూవును వీడి పరిమళము. ఉండని యట్లు సీత రాముని యెడబాయకుండ నుండినది. రాముడు సీతను విడిచి యుండడు. "వీరి యనురాగము నీలీరాగము"[4]

ప్రతినాయకుడైన రావణుడును సీతా సౌందర్యమునకు ముగ్ధుడైయనుభవింపఁ గోరియే అపహరించెను. రావణవధ ప్రధానముగా సీతను పొందుటకే జరిగినది ఒకవేళ రావణుడు సీతను రామున కప్పగించియుండిన కథమలువు ఎట్లు తిరిగి యుండెడిదో చెప్పజాలము—

ఇక, రజకుని యపనింద కారణముగా సీతను పరిత్యజించినను, యాగసందర్భమున స్వర్ణ సీతా సంబంధమును కలిగియున్నాడు. ఆమె పృథివిలో ప్రవేశించి కనబడని దైనను లవకుశులలో తద్రూపమును గాంచి ప్రాణాలు వదలక తమాయించుకొన్నాడు.

సీతాత్యంతిక వియోగము జరిగినదని మనము చెప్పినను, కథ ఆద్యంతములను విచారించినచో ఆది దంపతులయిన వారికి ప్రకృతి పురుషులకు వియోగమనునది సంభవముకాదు ఆమె సదా

---

1. గోవిందరాజు రామాయణ భూషణ వ్యాఖ్యాత. ఇతనివ్యాఖ్యానము గోవిందరాజీయమని కర్త పేరున ప్రసిద్ధి పొందినది. ఇతడు బాలకాండము సర్గ-4-శ్లో-9వ వ్యాఖ్యానములో —

"వయంతు శృంగార ఏవ ప్రధానరసః సీతా యాశ్చరితం మహత్ ఇత్యుక్తేః తథోక్తం- ఏకోరసోఽవేదంగీ వీర శృంగారయోర్ద్వయోః అంగాన్యన్యే రసాస్సర్వే తస్య నిర్వహణోద్యతా" యని (సా-ద-పరి-6-శ్లో-10) లాక్షణిక శ్లోకము నుట్టంకించి రామాయణమున శృంగార రసము ప్రధానమను అభిప్రాయమును వ్యక్తీకరించెను. వావికొలను సుబ్బారావు మున్నగువారు ఈ పక్షమువారు (సుబ్బారావు మందర వ్యాఖ్యాత.)

2. దా-ప్రతి-వాల్మీకి రామాయణము బాల. సర్గ. 4. శ్లో. 7.
"కావ్యం రామాయణం కృత్స్నం సీతాయాశ్చరితం మహత్।
పౌలస్త్య వధ మిత్యేవ చకార చరితవ్రతః"

3. దా-ప్రతి-వాల్మీకి రామాయణము. సుందర. సర్గ. 21. శ్లో. 16.
అనన్యా రాఘవేణాహం భాస్కరేణ ప్రభాయథా।

4. విశ్వనాథుడు. సాహిత్యదర్పణము. పరిచ్ఛేదము. 3. శ్లో. 196.
"తన్నీలీరాగ మాఖ్యాంతి యథాశ్రీరామ సీతయోః॥"

విష్ణు వక్షస్థలి. శృంగార రసాధి దేవత విష్ణువు[1] లక్ష్మీనారాయణులు సీతారాములైనప్పుడు తదితి వృత్తము శృంగార రస భరితము కాక మరేమగును ?

రామాయణము మహాకావ్యము గదా ! మహాకావ్యమునందు "వీరశృంగారములలో నేదైన యొక్కటే రసము అంగిగాను, మిగిలినవి అంగములుగాను నుండవలెనని"[2] ప్రాచీన లాక్షణిక వాక్యముగదా! ఈ లక్షణమును విద్యానాథాదులును అంగీకరించి యున్నారు. సాహిత్య దర్పణ కారుడు శాంతము అంగిరసముగా నుండవచ్చునని[4] చెప్పియున్నాడు; కాని లాక్షణికులెవ్వరును కరుణ రసమును మహాకావ్యమున ప్రధాన రసముగా నుండదగినట్లు చెప్పినవారు కారు. కావున రామాయణము నందు శృంగార రసము ప్రధాన (అంగి) మని చెప్పవచ్చును.

3. వీర రసము అంగి :—

శృంగారము ప్రధానమనుట ఎంతమాత్రము సమంజసము కాదు. "శ్రీరాముడు సీతకొఱకే జీవిస్తే ఆయన శృంగార నాయకుడయ్యేవాడు. అంగిరసము శృంగార మయ్యేదిది. కాని యతడు ప్రతిజ్ఞను (శపథమును) నిలబెట్టు కొనుటకు జీవించాడు;5 లోకారాధన కొఱకు జీవించాడు.6 లోక ధర్మం వ్యక్తి ధర్మం కన్న మిన్న.7 ధర్మంకోసము ఆయన స్వీయసుఖాన్ని సర్వస్వాన్ని త్యాగం చేస్తూపోతాడు. అతనికి ధర్మము ధ్యేయము; ధర్మాచరణమే ఆయన శీలము."8 అతడు రూపెత్తిన ధర్మము.9 కావున "రాముని జీవితంలో శోకంకాని, రతికాని స్థాయికాక సంచారి మాత్రమే అయి

---

1. అహోబలపతి అహోబల పండితీయము. సంజ్ఞా 3వ సూత్ర వివరణము. పుట-116.
   ఆంధ్ర రచయితల సంఘ ప్రచురణము.
   శృంగార ఉత్పలాభస్స్యాత్ విష్ణు స్తస్యాధిదేవతా।
2. గోవిందరాజు- "భూషణ వ్యాఖ్యానము" బాల. సర్గ. 4 శ్లో. 3లో ఉద్ధరింపబడినది.
   "ఏకో రసో భవేదంగీ వీర శృంగార యోర్ద్వయోః।
   అంగాన్యన్యే రసా స్సర్వే తస్య నిర్వహణోద్యతా॥"
3. విద్యానాథుడు- ప్రతాప రుద్రీయము నాటక ప్రకరణము- శ్లో 2 తరువాతి వచనము
   "శృంగార వీర రసయోః అన్యతరస్య ప్రాధాన్యం।
   అన్యేషాం రసానా మంగత్వేన ప్రవేశః॥
4. విశ్వనాథుని సాహిత్య దర్పణము. పరిచ్ఛేదము 6 శ్లో. 317.
   శృంగార వీర శాంతానా మేకో౽ంగీ రస ఇష్యతే॥
5. రంగనాథ రామాయణము ఆరణ్య. ద్వి, 144.
6. భవభూతి- ఉత్తర రామచరిత్రము- అంకము-1 శ్లో, 5.
   "స్నేహం దయాం చ కీర్తిం చ యదివా జానకీ మపి।
   ఆరాధనాయ లోకస్య ముంచతో నాస్తి మే వ్యథా॥
7. డా. జి.వి. సుబ్రహ్మణ్యం. రసోల్లాసం. పుట-15.
8. ,, ,, ,, పుట-14.
9. దా. ప్రతి వాల్మీకి రామాయణము. అరణ్య. సర్గ. 37 శ్లో.13. "రామో విగ్రహవా ధర్మం॥"

ధర్మోత్సాహం స్థాయి వహించింది. కాన ధర్మవీరం అంగిరసము,"[1] కాని కరుణ శృంగారములు కావు.

ఈ ధర్మ వీర ప్రాధాన్యవాదము అర్వాచీనము కాదు; ప్రాచీనమైనదే. ప్రత్యేకముగా లాక్షణికుల నామములు తెలియవుగాని వ్యాఖ్యానములలో నిది ఉట్టంకింపబడి యున్నది.[2] ఆధునిక కాలమున శ్రీ భిదుర వేంకటశేషయ్యగారు,[3] డా. జి.వి. సుబ్రహ్మణ్యం[4] గారలు రామాయణములోని ధర్మవీర ప్రాధాన్యమును గుర్తించి, బలపఱచి శాస్త్రీయ ప్రమాణములతో చక్కగా నిరూపించి యున్నారు.

"రసస్తు కథానాయకాశ్రయస్త ద్విపక్షాశ్రయోవా,"[5] అని ఆనంద వర్ధనుల వక్కణ. రామాయణమున కథానాయకుడు శ్రీరాముడు; ఇతడు ధీరోదాత్తుడు; "ధర్మయుద్ధవీర ప్రధానుడు"[6] అతడు సాధించినది చతుర్విధ పురుషార్థములలో ప్రథమమైన, ప్రధానమైన ధర్మపురుషార్థము. ఏ తత్సాధనలో నతని నాశ్రయించినది ఉత్సాహము. "నాయకులు కావ్య కథలో సాధించే పురుషార్థాలను బట్టి తరగతులు, వారి నాశ్రయించిన స్థాయి భావాలనుబట్టి ఆయా రసాలు సంకేతింపబడతాయి."[7] కావున ధర్మమును సాధించి, స్థాపించి రక్షించుటలోని శ్రీరాముని ఉత్సాహము రామాయణమున వీర రసముగా పరిణమించినది. అదే ధర్మవీరము.

"పౌలస్త్యవధ"[8] మనియు రామాయణమునకు పేరున్నది శిష్టరక్షణ, దుష్టశిక్షణ ధర్మసాపనకే భగవంతుడవతరించును[9] సురముని రక్షణము రావణాద్యసురశిక్షణము, ఉత్సన్నధర్మోద్ధరణము రామావతార ప్రయోజనములు. వీనిలో రావణ వధయే ప్రధానము.

---

1. డా॥ జి. వి. సుబ్రహ్మణ్యం, రసోల్లాసం. పుట 15.
2. గోవిందరాజీయము. బాల. సర్గ 4 శ్లో 9 వ వ్యాఖ్యానము.
"అన్యేతు వీర ఏవ ప్రధానభూతః। పౌలస్త్యవధ ఇతినామ కరణాత్।
3. కావ్యకళాతత్త్వప్రకాశిక - వ్రాతప్రతి.
4. వీరరస రసోల్లాసాది గ్రంథకర్తలు.
5. ధ్వన్యాలోకము, ఉద్యోతము 3 పుట 347.
6. ,, Ibid ,, ఉద్యోతము 3. (లోచనము) పుట 347,
ధర్మయుద్ధ వీర ప్రధానోధీరోదాత్తః॥
7. డా॥ జి. వి. సుబ్రహ్మణ్యం, రసోల్లాసం. పుట 4.
8. దా. ప్రతి వాల్మీకిరామాయణము. బాలకాండము. సర్గ 4. శ్లో 7.
కావ్యంరామాయణం కృత్స్నం సీతాయాశ్చరితం మహత్।
పౌలస్త్యవధమిత్యేవ చకార భగవాన్ ఋషిః॥
9. భగవద్గీత. అధ్యాయము 4 శ్లో 8.
పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం।
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే॥

"బీజమే దైతే ఫలమదే అవుతుంది. రామాయణకథకు బీజము విష్ణువు దేవతల కిచ్చిన శపథము; వారికిచ్చిన అభయము. అది అతడు రాముడుగా అవతరించి రావణుని సంహరించుటతో ఫలవంతమైనది."[1]

"రామాదివద్వర్తితవ్యం, న రావణాదివత్"[2] అనెడి లోకహితార్థమైన ధర్మము ఆచరణ పూర్వకముగా ప్రతిష్ఠాపింపబడినది.

శ్రీరాముడు వీరుడు. రఘువీరుడని కీర్తితుడు. "రామశ్శస్త్ర భృతామహం"[3] అని గీతావాక్యము.

"ధర్మాత్మా సత్యసంధశ్చ రామోదాశరథి ర్యది ।
పౌరుషేచాప్రతిద్వంద్వః శరైనం జహిరావణిం ॥"[4]
అనునది రామాయణ మూలమంత్రము.

"రామోవిగ్రహవాన్ ధర్మః సాధుః సత్యపరాక్రమః।"[5]
అనునది అతని స్వరూప స్వభావములను వ్యక్తము చేయునట్టిది.

"తం మన్యేరాఘవం వీరంనారాయణ మనామయం"[6]
అనునది ప్రతి వీరుడైన రావణుని ప్రశంసావాక్యము.

ఇట్లు వివృకోణముచే గాంచినను రాముడు ధర్మవీరుడైనాడు.

ఇక, "కవి కావ్య కీర్తి ప్రతిష్ఠాకారణము నాయక గుణ నిరూపణము"[7] శ్రీరాముడు అనంత కల్యాణ గుణాకరుడు. "బహవోనృపకల్యాణగుణాః పుత్రస్యసంతితే" అని ప్రజలు శ్రీరాముని గుణ ప్రశంస చేసినారు. "ఇతని గుణ వర్ణనముచే వాల్మీకికి, రామాయణమునకు ఎనలేని కీర్తిగౌరవములు లభించినవి."

"కోఽన్వస్మిన్ సాంప్రతం లోకే గుణవాన్ కశ్చవీర్యవాన్"[9] అనువానియందలి గుణశబ్దము సద్గుణములను బోధించును; ఇవి సత్త్వగుణ జన్యములు. సత్త్వగుణము ధర్మస్వరూపము. కావున గుణవంతుడన ధార్మికుడని యర్థము "[10] తద్గుణములు ప్రకటించి స్థాపించుటలో వీర్యమవసరము.

---

1 డా॥ జి. వి, సుబ్రహ్మణ్యం - రసోల్లాసము. పుట 15.

2. విశ్వనాథుడు - సాహిత్యదర్పణము పరిచ్ఛేదము 1 పుట 18 (పరమత కావ్యలక్షణ ఖండనము.

3. భగవద్గీత - అధ్యాయము 10 శ్లో 31

4. దా. ప్రతి వాల్మీకిరామాయణము యుద్ధ. సర్గ 41 శ్లో 73.

5, ,, ibId ,, ఆరణ్య సర్గ 37 శ్లో 13.

6. ,, ibid ,, యుద్ధ సర్గ. 72 శ్లో 11,

7. విద్యానాథుడు, ప్రతాపరుద్రీయము. ఉపోద్ఘాతము శ్లో 7.

8. ,, ibid ,, ఉపోద్ఘాతము, 7వ శ్లోకము తర్వాతి వచనము.

9. దా. ప్రతి వాల్మీకిరామాయణము, బాల సర్గ 1 శ్లో 2.

10, డా॥ జి. వి. సుబ్రహ్మణ్యం "వీర రసము" పుట 194.

"రాముడు వీర్యవంతుడు; అనగా వీరుడు, ఈ రెండింటిని కల్పి అన్వయించిన యెడల రాముడు ధర్మ వీరుడగును."1 ఈ ధర్మవీరమె ఆయాకథాంశముల ద్వారా రామాయణము నందు ప్రతిపాదింపబడినది.

కావున, కావ్యనామము "పౌలస్త్యవధ" మనియు నుండుట చేతను, బీజము, ఫలము, గుణములు ప్రధానముగా ధర్మయుత వీరమును ఆధారముగాఁ జేసికొని ప్రతిపాదితము లగుటచేతను రామాయణము నందు ధర్మవీరము ప్రాధాన్యము వహించి అంగిరసముగా పోషితమైనదనుట సమంజసము—

రంగనాథ రామాయణము — ధర్మవీరము

బుద్ధ భూపతి వ్రాసిన ఈ ద్విపద రామాయణము శ్రీరామపట్టాభిషేకము తోడనే పరిసమాప్తమై కథ శుభాంతమగుచున్నది సీతాపరిత్యాగ-ఆత్యంతిక వియోగములు గల ఉత్తర కాండము నితడు వ్రాయలేదు. (ఇతని ఆదేశమున కుమారులు రచించిరి)

పట్టాభిషేకముతో ముగియుచున్న నీ గ్రంథమునందు కరుణరసము ప్రాధాన్యము వహింపఁ జాలదు. ఇందు యుద్ధకాండము మిగిలిన కాండముల కంటె పెద్దది; దాదాపు గ్రంథమునందు సగము కంటె నెక్కువ భాగమాక్రమించి యున్నది. బంధు మిత్రాది సహితులైన రామరావణుల యుద్ధతంత్రములు, నైపుణ్యములు విశదముగా వర్ణింపబడినవి, తాటకవధ, విశ్వామిత్ర యాగసంరక్షణ, శివధనుర్భంగ, పరశురామ గర్వభంగ, విరాధఖరదూషణ కబంధ వాలి కుంభకర్ణ రావణాది సంహారములందు ధర్మానుప్రాణితమైన రాముని వీరము యథోచితముగా ప్రదర్శింప బడినది. ఈ వీర ప్రదర్శనాదులకు సీత నిమిత్తమె కాని, వేరుకాదు. ప్రధాన లక్ష్యము దుష్టదమనమే, కావున రంగనాథ రామాయణము నందును మూలానుగుణముగా, ఒక్కొక్కచోట మూలమునకన్న మిన్నగా రాముని ధర్మ,వీర, పరాక్రమాదులు వర్ణితములై వీరరసమంగియైనది. శృంగారమును మిగిలిన రసములతో పాటు అంగమైనది.

—: వీ ర ర స ము :—

"లోకోత్తర కార్యములను నెరవేర్చుటయందు దృఢమైన దీక్షతోడి ప్రయత్నము ఉత్సాహము,"2 "ఉత్తమ నాయకాశ్రయమై ఈ యుత్సాహము స్థాయి భావముగాగలది వీరరసము,"3

దుర్జయులైన శత్రువులను జయించుట వంటి అసాధారణములైన కార్యములను సాధింపఁబూను ఉత్సాహమె విభావాదులచే సముల్లసితమై వీర రసమగును."4

భరతముని "(1) దానవీరము (2) ధర్మవీరము (3) యుద్ధవీరము అని వీరములు ముర్విధములుగా పేర్కొనెను "5

---

1. డా॥ జి. వి. సుబ్రహ్మణ్యం వీర రసము. పుట 195,
2. ప్రతాపరుద్రీయము రసప్రకరణము పుట - 195.
   "లోకోత్తరేషు కార్యేషు స్థేయాన్ ప్రయత్న ఉత్సాహః ।
3. సన్నిధానము సూర్యనారాయణ శాస్త్రి - కావ్యాలంకార సంగ్రహము - పుట - 438.
4. అహోబల పండితుడు - కవి శిరోభూషణము - సంజ్ఞా - శివ సూత్ర వ్యాఖ్య.
5. భరతముని - 'నాట్య శాస్త్రము' - అధ్యాయము - 6 శ్లో. 80.
   దానవీరం యుద్ధవీరం ధర్మవీరం తథైవచ ।
   రసం వీర మపి ప్రాహ బ్రహ్మా త్రివిధ సమ్మతం ॥

ధనికుడు ధర్మవీర స్థానమున దయావీరమును నిలిపెను,[1]

ప్రతాపరుద్రీయ వ్యాఖ్యాత కుమారస్వామి సోమపీథి వీనిని కలిపి సమన్వయించి, దాన ధర్మ,దయా, యుద్ధ వీరములని చతుర్విధములుగా విoగడించెను.[2] రసగంగాధర కారుడు వీనికి, సత్య, పాండిత్య, క్షమా. బలములను చేర్చి అష్ట విధ వీరములను ప్రతిపాదించెను.[3]

రంగనాథ రామాయణమునందు ఉత్తమ ప్రకృతియైన శ్రీరాముని ఆలంబనముగాఁజేసికొని ఈయన్ని వీరములు సందర్భాను గుణముగా చక్కగా పోషింపబడినవి.

ధర్మవీరము :—

శ్రీరాముడెప్పుడును ధర్మము తప్పినవాడు కాడు; ఎచ్చటను ధర్మవిరుద్ధముగా యుద్ధముచేసిన వాడుకాడు. అతడు నడచిన నడకలు, చేసిన యుద్ధములు ధర్మసాధన కుపకరించినవి- కావుననే ఆదర్శ పురుషుడైనాడు-

(1) తాటకా సంహారము :—

"ఆడదానిని చంపుట యధర్మమని" ప్రతి వ్యక్తియు విమర్శించుటకు పూనుకొనిన ఘట్టమిది. ధర్మసూక్ష్మముచే పూర్వాపర విషయములను వితర్కించినపుడిది అధర్మము కాదని తేలును.

రాముడు తండ్రియానతి తలదాల్చి విశ్వామిత్ర మౌని వెంట వచ్చెను. ముని దుష్టతాటకను సంహరింపుమని అతనిని హెచ్చరించెను. ఆడది యని చంపకుండునేమో యని తలంచి

"ఎనయ గోబ్రాహ్మణ హితమైనఁ జాలుఁ - జుము । జంపఁ గామినీ జనుల రాజులకుఁ
దొల్లి ధారుణి యెల్లఁ ద్రుంపఁ జింతించుఁ ప్రల్లదురాలైన పడితి మంథరను
సంపన్నమతి విరోచను కూతు వజ్రి - చంపడే ? యిది ప్రశస్తముగాదె యెందు ?
నెఱయ లోకంబు లనింద్రములు గాగఁ - జెఱుపఁ జిత్తంబునఁ జింతింపుటయును
నలిగి దృఢ వ్రతయగు భృగు పత్నిఁ - జలమొప్ప విష్ణుఁడు సంపడే తొల్లి !
యది గాన లోకహితార్థమై సతులఁ - బొదివి చంపుటయును బుణ్యంబె యనఘ ।"[4]

యని తన మాటను సమర్థించుకొనుటకు వజ్రి విరోచను కూతును జంపుట, విష్ణువు భృగు పత్నిని జంపుట యను వాని నుదాహరించెను.

---

1. "ధర్మవీర స్థానే దయావీర ముక్త్వా త్రైవిధ్య మాహ ధనికః ॥
ధనంజయుడు - దశ రూపకము. ప్రకాశము - 4 శ్లో. 79.
2. ప్రతాపరుద్రీయము. రత్నాపణ వ్యాఖ్య - పుట 195.
"తత్రదాన వీరోబలి జామదగ్న్యాదిః । యుద్ధవీరోరామాదిః।
ధర్మవీరో యధిష్ఠిరాదిః । దయావీరోజీమూత వాహనాదిః ॥
3. జగన్నాథుడు - రసగంగాధరము - ప్రథమాననము. పుట - 175 - 178.
(చౌఖంబా ముద్రణము)
4. రంగనాథ రామాయణము - బాలకాండము - ద్వి. 764 - 769.

అపుడు - "విశ్వామిత్రునతుల వాక్యములఁ - దన తండ్రి పనుపును దలచి రాఘవుడు
హాటక గర్భాభుఁడగు మౌని మాట - దాటకతాటక దండింతుననుచు" (బాల-ద్వి-770-771)
ఉత్సహించి ధనుష్టంకార మొనరించెను; మీదికి వచ్చిన తాటకను సంహరించెను.

తండ్రి యాజ్ఞను పాలించుట పుత్రధర్మము. గుర్వాజ్ఞను నెరవేర్చుట శిష్యధరను. ప్రజా రక్షణము క్షత్రియ ధర్మము. దుష్ట సంహారము జగద్ధితము. ఆజ్ఞాపాలనమునందలి యుత్సాహము ధర్మా ధర్మ విచక్షణమును వెనుకకు నెట్టును; కార్యమును నిర్వర్తించుటయే ప్రధానమని భావింప జేయును ఇచ్చట శ్రీరాముడు గుర్వాజ్ఞా బద్ధుడై లోకహితార్థమై దుష్టశిక్షణ మొనర్చి ప్రథమ పరీక్ష యందే తన ధీరోదాత్తతను నిరూపించుకొన్నాడు.

"గుర్వాజ్ఞా పాలనము నందలి యుత్సాహము ధర్మవీరమునకును, దుష్ట తాటకా హననము నందలి యుత్సాహము యుద్ధ వీరమునకు కారణములై రాముని ధర్మయుద్ధ ప్రధానుడైన ధీరోదాత్తునిగా తీర్చుదిద్దుచున్నవి."[1]

(2) విశ్వామిత్ర యాగ సంరక్షణము :—

ఈ ఘట్టము నందు రాముని ధర్మోత్సాహము పరిస్ఫుటముగా వ్యక్తమగుచున్నది. సిద్ధాశ్రమమునకు చేరిన తర్వాత రాముడు విశ్వామిత్రుని సంతోషముతో—

"...... ...మునీశ్వర నేడు మీరు
యాగ దీక్షకుఁ జొరుండనుమాన ముడిగి యాగ శత్రుల నెల్ల నడచెద నేను"
(బాల - ద్వి - 884 - 885)

అని పలికెను. యాగము ప్రారంభమయ్యెను. అప్పుడు

"రామ భద్రుడు ధనుర్ధరుడునై మైత్రి - సౌమిత్రియును దాను జాగరూకతను
రక్కసుల్ వచ్చు మార్గము మున్నె యెఱిగి - యకౌశికుని మౌనియై యున్నవాని
విశ్వమంతయు తమో వృతము గాకుండ - శశిమిత్రప్రభలఁ గాచు చంద్రార్కుల నగఁ
గాచిరి కంటికిఁ గనుఱెప్ప కరణి - నేచిన భక్తి నయ్యెడ నైదు నాళ్ళు."
(బాల. - ద్వి - 892 - 895)

ఇందు శ్రీరాముని భక్తి, గురుకార్యమును నిర్వహించుట యందలి యాతురత శ్రద్ధ, ధైర్యము ఉత్సాహము, శత్రువుల హత మార్చు నట్టి పరాక్రమాదులందలి ఆత్మవిశ్వాసము, యుద్ధ సంసిద్ధత, రక్షా కార్యమునందలి జాగరూకత ఇత్యాదులు వ్యంజ్యమానము లగుచున్నవి. ఇచ్చటి ఉపమానములు తద్రక్షణా కార్య వ్యగ్రతను కనులకు కట్టినట్లు తోపింపఁజేయుచున్నవి.

ఆ తర్వాత యాగ విఘ్నము చేయు మారీచుని వాతూలాస్త్రము చేత తూలనేసి, సుబాహుని ఆగ్నేయాస్త్రముచే నేలఁగూల్చి శేష రాక్షసులను మానవాస్త్రమున కడతేర్చి విజయులై యొప్పుట శ్రీరాముని వాతూలాగ్నేయాద్యస్త్ర ప్రయోగ కౌశల్యమును ప్రకటించుచున్నది.

ఇట్లు యాగ రక్షణ మొనర్చి విశ్వామిత్రునిఁజూచి
"...... తాపస ప్రవర !

---

1. డా. జి. వి. సుబ్రహ్మణ్యం. వీరరసము, పుట - 199.

యిక నెయ్యేది కార్య మెఱిఁగింపు; నీకు - కింకరులము, నీదు కృపకు పాత్రులము"

(బాల. - ద్వి - 893-895)

అని వారు మౌనికి నమస్కరించిరి. ఇందు రామలక్ష్మణుల అపూర్వ భక్తి వినయములు తేట పడుటయే కాక, భావికార్య నిర్వహణము నందలి యుత్సాహము వ్యక్తము చేయబడినది.

(3) వనవాసము :—

రాముని అరణ్యవాస ఘట్టము నందు ధర్మవీరము, తత్పోషకముగా త్యాగ భక్తి సత్య వీరములు ప్రతిపాదింపబడినవి.

కైకేయి శ్రీరామునికి దశరథు డొసంగిన వీర వృత్తాంతమును వివరించి,

"........జడలు వల్కలములు గట్టి - నీవింక తపసివై నృప వేషముడిగి

జనులచే దశరథ జనపతి బొంక - డనిపింప వలతేని నడువుల కరుగు పొమ్ము"

(అయోధ్యా - ద్వి - 395-397)

అని చెప్పగా శ్రీరాముని

"......మొగంబునఁ జిరునవ్వు - గ్రమ్మ మాటల నొండు గసటు లేకుండఁ

గరుణయు దెగువయు గరిమంబు" తోచినవి (అయోధ్యా - ద్వి - 397-398)

తండ్రి మాట నెరవేర్చుట పుత్ర ధర్మము అతడు సత్యవంతుడని యనిపించుట రాముని వనవాసము మీద ఆధారపడి యున్నది. అది యతనికి గరిమంబు గలిగించును. ఇంతేకాక, తమ్ముని యందలి కరుణయు, త్యాగము నందలి తెగువయు. తండ్రి యందలి భక్తియు రాముని ధర్మాచరణము నకు ప్రేరక పోషకములైనవి. కావుననే శ్రీరాముడు

"తన జనకుని మాట దాటిన వాడు - దనయుడె తలపోయ ధరదాయ గాక,

యేనేమి నా తమ్ముడేమి యీ భూమిఁ - బూనుటకును ? బుణ్య పురుషుడై యున్న

భరతుని దెస నాకుఁ బ్రాణ-బులైన - సరకు గాపసిన రాజ్యము నాకు సరకే"

(అయోధ్యా - ద్వి - 402-404)

యని పలికెను- ఇంకను

"పరికించి ధర్మంబు పాటింతుఁ గాని, - కరమర్థి వ్యర్థంబు గావింప నేను

వేయేల ? విభునాజ్ఞ వినఁబడకున్న - నీ యాజ్ఞ, గడవను నిక్కవంబరయ"

(అయోధ్యా - ద్వి - 412-413)

అని తన దృఢ నిశ్చయమును తెలియజేసెను.

ఇచ్చట రాముని ధర్మాచరణోత్సాహము త్యాగ భక్త్యనుప్రాణితమై వరలుచున్నది.

మాతా పితరుల యాజ్ఞను పాటించుట యందు సంఘర్షణము కలిగినపుడు పితృాజ్ఞను పాటిం చుట ఉత్తమ ధర్మము. కౌసల్య రాముని వనవాసమునకు దుఃఖించి,

"నా యింట నుండుము, నాకు శుశ్రూష - సేయు, మింతటి కంటె క్షితి ధర్మమెద్ది ?

జనకు వాక్యము సేయఁ జాలిన నీకు - జనని వాక్యంబెన్న సన్నమే యన్న ?"

(అయోధ్యా - ద్వి - 511-512)

యని పలికినది. సకల ధర్మములు తెలిసిన రామునకు దీని సమాధానము చెప్పి తల్లి నూరార్చి యొప్పించుట యంత మహత్కార్యము కాదు. కావుననే-

"నీ వల్లభుని మాట నీకును నాకు - భావించి చేయుట పరమధర్మంబు
జనకుని పనుపవశ్యము నీకు నాకు - జనులకును జేయ సహజ ధర్మంబు
గాన నాతని పంపుఁ గైకొని నేను - కానల కేగుట కాదన వలదు''

(అయోధ్యా - ద్వి - 520-532)

అని నచ్చజెప్పెను- ఇట్టి ధర్మబద్ధ సమాధానము చేతనే ఎదిరించు లక్ష్మణుని నోరు మూయించెను. ఇట్లు తండ్రి మాటను పాటించుట యందలి రాముని దృఢమైన యుత్సాహము ధర్మవీర స్ఫూర్తిని గలిగించుచున్నది.

చిత్రకూట పర్వతమునందున్న రాముని యొద్దకు భరతుడు వచ్చి అయోధ్యకు మరలి రమ్మని భిక్షించెను అపుడు శ్రీరాముడు భరతుని కనేక విధముల బోధించి,

"ఏనె నా తండ్రి పల్కిటు సేయనైతి - నేనిఁ దండ్రుల పలు కెవ్వడు సేయు
ధర 'యథా రాజా తథా ప్రజా' యనుచు - నరులెల్ల మన యట్ల నడతురు; గాన
పరబుద్ధిఁ గైకొన్న వ్రతము నిందించి - యరుదెంతు నేను; నీ వాగ్రహంబుడుగు"

(అయోధ్యా - ద్వి - 1746-1748)

మని నచ్చ చెప్పెను.

అయోధ్యకు మరలి వచ్చి పట్టము గట్టుకొమ్మని నాస్తిక బుద్ధి బోధించిన జాబాలిని గాంచి
"సత్యమూలంబులు సకల ధర్మములు - సత్యంబు కంటె నెంచగా ధర్మ మెద్ది
అట్టి సత్యము దప్ప కనఘ! మా తండ్రి - పట్టిన ధృతి నన్నుఁబనిచెఁ గానలకుఁ
గాన నాతని యాజ్ఞ గడిచినఁ బుణ్య - హీనుడు నా కంటె నితరుండు గలడె"

(అయోధ్యా - ద్వి - 1764-1766)

అని పలికి సత్యమే ధర్మమని స్థాపించి దానిని పాటించుటలో ఉత్సాహమును గనబరచెను.

ఇచ్చట పుత్ర ధర్మము, రాజధర్మ, సత్యాను ప్రాణితమై ధర్మవీరమును పతాకాస్థాయికిఁ జేర్చినది—

(4) వాలి వధ :—

"నాయకుని ధర్మ చర్యను దూషింపఁజేసి, విపులముగా కవి తత్ఖండనను నాయకునిచే జేయించి ధర్మనిరూపణమునందు ఉత్సాహము ప్రకటింపఁ జేసినచో నదియు ధర్మవీరమే యగును."[1]

రాముడు చెట్టుచాటున నుండి వాలిని కొట్టి చంపెను. అపుడు వాలి రాముని యాకృత్యమధర్మ మని బహుభంగుల దూషించెను.

(i) వాలి రామునికి సాక్షాత్తు శత్రువుకాడు; శత్రువులతో కూడలేదు.

(ii) రాజులు కోతులను వేటాడరు.

(iii) వేరొకనితో యుద్ధము చేయుచుండగా, నడుమ సొచ్చి కొట్టకూడదు.

---

1. డా॥ జి. వి. సుబ్రహ్మణ్యం, "వీరసము" పుట 212.

(iv) ఎదురుగా వచ్చి యుద్ధము చేయఁజాలక, చాటున దాగి చంపెను.

(v) తప్పు చేసినచో శిక్షించునధికారము రాజైన భరతునకుండును గాని, రామునకు లేదు.

ఇవి ధర్మాత్ముడు చేయదగిన పనులు కావు.

శ్రీరాముడు వీని కిట్లు సమాధాన మొసంగెను.

(i) తమ్ముడు కొడుకు వంటి వాడు- సుగ్రీవుని భార్యను రుమాదేవిని, కోడలు వంటి దానిని తమ్ముడు బ్రతికి యుండగా, బల్మిని బట్టి భోగించుట మహాపరాధము- దానికి మరణ శిక్షయే దండన మని శాస్త్రములు చెప్పును.

(ii) రాముడు సుగ్రీవునితో మైత్రి చేసెను. వాలి అతని శత్రువు, అగుటచే రామునకును వైరియయ్యెను. వాలిని జంపెదనని వానర సభలో శ్రీరాముడు ప్రతిజ్ఞ చేసెను. ప్రతిజ్ఞా పాలనము ధర్మబద్ధమే.

(iii) జంతువుల నెట్లైనను చంపవచ్చును. అందువలన చెట్టు చాటున నుండి చంపినాడను అధర్మము రామునకు లేదు.

(iv) భరతుని పనుపుననే శ్రీరాముడు అరణ్యమునందలి దుష్ట మృగ రాక్షసులను శిక్షించుచున్నాడు.

ఈ రీతి రాముని సమాధానము ధర్మబద్ధమై ధర్మవీరమును పోషించినది. ధర్మబద్ధమైన ఉత్తరము కావుననే వాలి మరల దానిని ఖండించలేదు-

యుద్ధ వీరము :—

వీరమనగా సాధారణముగా యుద్ధ వీరమనియే తలంపు, ధర్మబద్ధముగా, ప్రయుక్తమై, ధర్మ సాధన కుపకరించు యుద్ధమే వీరరస పరాకాష్ఠ నొందును. కూట యుద్ధములు, న్యాయ విరుద్ధ యుద్ధములు వీరమనబడవు.

శ్రీరాముడు ఖర దూషణాదులతో, రావణ కుంభకర్ణులతోఁజేసిన యుద్ధములు వీరరసమున కాలవాలములు.

(1) ఖర వధ : —

శూర్పణఖ యవమానమునకుఁ బ్రతీకారము చేయఁదలచి ఖరుడు పదునల్వురు రాక్షసులను శ్రీరాముని మీదికి పంపెను. వారు క్షణములో శ్రీరాముని నారాచ వహ్ని కాహుతులయిరి. పిదప శూర్పణఖా ప్రేరితులై ఖరదూషణాదులు పదునాల్గు వేల మంది రాక్షస బలములతోఁగూడి ఒక్కుమ్మడిగా రామునిపై దాడి చేసిరి. అప్పుడు రఘురాముడు సౌమిత్రితో-

"సౌమిత్రి ! సమర సూచక నిమిత్తములు - భూమిపైఁ బెక్కులు పుట్టుచున్నవియు;
రట్టడి ముక్కిడి రక్కసి మఱియు - దిట్టయై బలములఁ దెచ్చెఁ గావలయు
నదె సైన్య ఘోషంబు లట్లు కానోపు - ... ...
నవమైన రణమబ్బు నాకట్లు గాన - నవహితమతిఁబూని యాలస్యముడిగి
జనకజ నిక్కడఁ జనదుంపనింకఁ - గొనిపోయి యగ్గిరి గుహనుండు"

(అరణ్య - ద్వి - 510-514)

మని పలుకగా లక్ష్మణుడు తాను యుద్ధము చేయుదననెను- కాని రఘువీరుడు

"..........వీరితో నాలంబు సేయ
నెనసె వేడుక నాకు నీవుండ వలదు - జనకజ దలకెడుఁ జనుమ"ని
(ఆరణ్య - ద్వి - 517-518)

పంపించి, ప్రళయాంతకుని పగిది కోపించి, వజ్ర కవచము ధరించి, తూణీరములు బిగించి. శర శరాసనములు తాల్చి

"కొండ విల్లుగ వంచు కుండలికుండ - లుండన విల్లు పెల్లుగ నెక్కు-వెట్టి"
(ఆరణ్య - ద్వి - 522)

మిన్నంతయు పగులు నట్లు గుణ ధ్వని చేసెను - ఆ సమయమున నతని తేజము-
"పదివేల కోటుల భాను తేజములు - పొదిగొని లోకముల్ పొదివిన యట్లు"
(ఆరణ్య - ద్వి - 529)

భూనభో వనాద్రులు సర్వము గప్పి కన్నులు మిఱుమిట్లు గొల్పెను. ఇట్టి శ్రీరాముని యుద్ధోత్సాహము శత్రు సందర్శనానంతరము పరాకాష్ఠ చేరినది. రాక్షస బలములు

"మందు కార్చిచ్చుపై మలయుచు మిడుత - తండంబు లొక్కటఁ దార్కొన్న కరణి"
(ఆరణ్య - ద్వి - 538)

రాముని చుట్టు ముట్టిరి అతడు కవదొనలోని శరము లన్నియు నొక్క-సారి సంధించి,

"పదియు, నూఱును వేయుఁబదివేలు లక్ష - పదిలక్ష పదికోట్లుఁ బదినూఱు కోట్లు"
(ఆరణ్య - ద్వి - 548)

గాదైత్య సైన్యము మీదఁ బ్రయోగించిన కరశర లాఘవము ఆశ్చర్యావహము. ఖర దూషణ త్రిశిరులు రామునిపైఁ బ్రయోగించిన బాణములు, రాముఁడు ప్రతి బాణములతో వానిని ఖండించి రథ తురగ సారథి సహితముగా వారి తలలను ద్రుంచిన రీతి యుద్ధ వర్ణనము మేన పుల్క-ల పొడమఁజేయును. ఇచ్చట రఘు వీరుడు

"నీ బలంబులు నచ్చె. నీ వారు దెగిరి - నీ బాణ సంపద నిర్మూలమయ్యె
నరుదుగా దండకాటవిఁ దొల్లి - పెరిగి సన్మునులఁ జంపిన పాప ఫలముఁ
గుడువఁ గాలము వచ్చెఁ గుడుతుగా కింక - నదరి వధింతు ఘోరాజిలో నిన్ను"
(ఆరణ్య - ద్వి - 643-645)

అని పల్కి-న పలుకులు, సాధుజన రక్షణకై చేసిన ప్రతిజ్ఞా నిర్వహణ మందలి పట్టుదల. యుద్ధము నందలి ధైర్య స్థైర్యములు శరసంధాన ప్రయోగకర కౌశలము, ఎంత మంది చుట్టుకొనినను చలింపని తనము, శత్రు దర్శన జనిత యుద్ధోత్సాహము, కర్మఫలానుభవ- ఆత్మసామర్థ్యము లందలి విశ్వాసము, అలపులేమి, ఖల సంహారకాంక్ష- ఇవి యన్నియు యుద్ధ వీరమునకు పోషకములై తద్రసాస్వాదనను గలిగించుటకు నర్హములై యున్నవి-

(2) కుంభకర్ణ వధ :—

ఇత్తడాకపంబును నవనీతలంబును గదిసిన దేహము గలిగినవాడు; ఘన రౌద్ర రసము రాక్షస రూపుదాల్చియునికి నేతెంచెనో యను నట్లుండిన వాడు. వీర రసావేశ వేషంబువాడు. ఈ కుంభకర్ణుడు

రావణుని ప్రేరేపణమున యుద్ధమునకు వచ్చి, వానరులను మ్రింగుచు, హత మార్చుచు నానా బీభత్సమును సృష్టించెను. అట్టి వానిని జూచి శ్రీరాముడు-

"నారికై పుట్టిన నాకోపమెల్ల - నారిచేఁ జూపెద నాకారికిపుడని" (యుద్ధ - ద్వి - 4195)

యుద్ధోత్సాహముతో వచ్చి ధనుర్గుణము మ్రోయించి, కుంభకర్ణుడెటుపోయినను పోనీయనని నిలబడెను. అంతట కుంభకర్ణు డట్టహాసము చేసి,

"వెఱ మాయలను వన్ని వెఱచి నీచేత - మడియంగ మారీచ మనుజాశి గాను,
రయమున నీచేత రఘురామచంద్ర - భయమునఁ జావఁ గబంధుండ గాను
... .
జేతి విల్లిచ్చి నీచే భంగ మొందఁ - బూతాత్ముడగు భృగు పుత్రుండఁగాను,
రావణు తమ్ముడ రాక్షసేశ్వరుడ - దేవ కంటకుడను, దీప్త విక్రముడ
నన్నెఱుంగవె ! రామ !" (యుద్ధ - ద్వి - 4122-4127)

యని యాత్మ విషయమును ఘనముగా వెల్లడించుకొనుటయె కాక,

ఘనమైన యట్టి రాక్షస భాషణములు - సనకాది యోగీంద్ర సన్నుతుల్ గావు.

— — — —

యుద్ధ రంగం బమృతోదధి గాదు - యుద్ధంబు నీ కొలువుండుట గాదు
బలమును శౌర్యంబు బాహు విక్రమముఁ - గలదేని ఘోరాజిఁ గదియుము నన్ను"

(యుద్ధ — ద్వి - 4137-4139)

అని తర్జించుచు గదగొని రాముని మీదఁబడెను. రాముడతనిని లెక్కింపక, కినిసి, ఆతని బాహువులు, పాదములు తెగనరికి, నోట బాణములు జొనిపి, వక్షమును పగిల్చి తలఁద్రెంచెను

ఇచట కుంభకర్ణుని అధిక్షేపణ వాక్యములు నాయకుడైన శ్రీరాముని పరాక్రమాదులను, పూర్వపు టౌన్నత్యమును వ్యంగ్యముగా ప్రకటించుచు, తర్వాత రాముడు ప్రదర్శించిన వీర కర్మకు పోషకములుగా నున్నవి. బుద్ధి సామర్థ్యములు లేని కేవల దేహము పెంపు నాయకుని తృణీకారమున కాస్కారమైనది.

(3) రావణ వధ :—

రఘు రాముడు రావణునితో మూడు పర్యాయములు యుద్ధము చేసెను. ఈ మూడు యుద్ధములు మూడు విధములయిన యుద్దేశములకు తావలములై, నాయకుని ధర్మయుద్ధ వీరమును పతాకా స్థాయికిఁ గొనివచ్చినవి—

మొదటి యుద్ధము :—

దశగ్రీవుడు వానరులతో తలపడి యనేకులను హత మార్చుటయే కాక, ప్రధానులైన సుగ్రీవ నీలాదులను నొప్పించి, బ్రహ్మ శక్తిచే లక్ష్మణునికిఁ బరిభ్రాంతిని గలిగించెను. అపుడు రాఘవు దనిల తనూభవునంస మెక్కి విల్లుగుణ ధ్వని సేయగా దశకంఠుడు పావని నిటల తలము నర్ధ చంద్ర బాణమునఁ గొట్టెను. రాముడు కోపించి రావణుని విల్లు విఱిచి, రథాదులను జూర్ణ మొ

రి-చెను; సమంత్రక శరమును రావణు వక్షంబు గాడనేసెను; కిరీటంబు డొల్ల నేసెను; నిశ్చేష్టతతో నున్న యతనిని జూచి—

"ఇప్పుడు కపులతో నిబ్బంగిఁ బోరి
కడు డస్సినాడవు. కాననిన్ జంప; - విడిచితి, నీవింక వేగంబ మరలి
పో లంక కనుడు నప్పుడు చిన్నవోయి - యోలిన వేడి నిట్టూర్పులు నిగుడ
మండెడి కోపంబు మలిపి చిత్తమున - దండి గర్వము దక్కి దశకంధరుడును
బలమెల్లఁ బొలిసి దర్పము పేర్మిఁదూలి - వెల వెలఁ బాఱుచు విరథుడై నడచి"

(యుద్ధ - ద్వి - 3429-3433)

భూతంబు లార్వగా, వానరులు కేలిసేయగా, లంక కేగెను.

ఈ ప్రథమ యుద్ధ వర్ణన మధికంబుగాఁ జేయబడలేదు. అలసియున్న ప్రతి నాయకునితో వీరుడైన నాయకుడు చిరకాలము యుద్ధము చేయుటేమి ? అది సమానతకు భంగము. కావున క్షణము లోనే అతడు విరథుడు, నిరాయుధుడు నిశ్చేష్టుడు గావింపబడినాడు. ఇచట నిరాయుధుడైన రావణుని యందలి దయ, నిరాయుధులతో యుద్ధము చేయరాదనెడి రణధర్మము, దీనికిఁదోడు అతడు డస్సి యుండుట, — ఇవి రాముడు రావణుని విడుచుటకు కారణభూతములైనవి. ప్రతినాయకుడైన దశకంఠుడు చిన్నవోవుట, నిట్టూర్పులు విడుచుట. వెలవెలఁబాఱుట, నడచిపోవుట, ఇత్యాదులు నాయకుని వీరము నినుమడింపఁజేయుచు, దయాను ప్రాణిత ధర్మయుద్ధ వీర స్ఫూర్తిని గలిగించు చున్నవి.

ద్వితీయ యుద్ధము :—

ఇది మొదటి దాని కంటె కొంత అధికముగా వర్ణింపబడినది. ఇందు నాయక ప్రతి నాయకులు ఒండొరులపై ఆగ్నేయాద్యస్త్రములను ప్రయోగించునప్పటి కరలాఘవము, వారి విద్యా సామర్థ్యము ఆశ్చర్యావహము.

విభీషణునిపై వైచిన రావణునిశక్తికి అడ్డుపడి లక్ష్మణుడు మూర్ఛిల్లెను. అప్పుడు రఘు వీరుడు-

"బ్రదికి పోనీనింకఁ బంక్తికంధరునిఁ — బ్రదర పరంపర పాలు సేసెదను
— — — —
రణము లోపల నేను రఘు రాముడగుట - ప్రణుత విక్రమలీలఁ బరికింప నిందు
సురకంటకుడు దాగి సురలోకమునకు - నరిగిన, నబ్ధి మధ్యమునఁ గ్రుంకినను,
ధరణిఁ దూఱిన రసాతలముఁ జొచ్చినను, - బొరిపుత్తు గాకేల పోనిత్తు నింక ?
భువి నర్కకులమునఁ బుట్టితి నేని, - రవితేజుడగు దశరథు తనూజుండ
నైతినే, రాముడి నైతినేనింక, - దైతేయ పతి రణస్థలి నిల్చెనేని
నేవిధంబుననైన నిపుడ నిర్జింతు - రావణుడయ్యెడి రాముడయ్యెడిని,
నిల రామ రావణు లిరువురి యునికి - గలుగంగ నేరదీ కదన రంగమున

(యుద్ధ - ద్వి - 6472-6481)

ననుచు దశకంఠునిపై సుగ్రనారాచంబు లేయగా, రావణుడు ప్రతిశరములు ప్రయోగించియు, లాభము లేనివాడై —

"అంతజర్జరితాంగుడై రాము విశిఖ - సంతాన వేగంబు సైరింప లేక
గజవైరిఁగని పాఱు గజము చందమున - రజనీ చరేంద్రుడు రణ భూమి విడిచి
కచభారములు వీడఁ గమనీయ రత్న - ఖచిత భూషణములు గనుకనిఁజెదరఁ
జేరి యొండొరువులఁ జేతులు పరచి - బోరన నవ్వుచు భూతంబు లార్వ
ఘన పాదహతి నేలఁ గంపింపఁ బాఱి - వనచరులార్వంగ వడిలంకఁ జొచ్చె"

(యుద్ధ - ద్వి - 6486-6490)

ఇచట రాముడో, రావణుడో ఉండవలెననెడి నాయకుని దృఢనిశ్చయము, రావణుని నిర్జించుటకైన శపథము, ధైర్య స్థైర్యములు రాముని యుద్ధోత్సాహమును వెల్లి విరియించుచున్నవి. అతని బాణ పరంపరలకు తట్టుకొనలేక ప్రతి నాయకుడు తనంతట తానే రణ భూమి విడిచి పాఱిపోవుట ఆ సమయమున అతని వెంట్రుకల ముడులు వీడుట, భూషణములు సెదరుట, భూతములు వానరు లార్చుట, రాముని యుద్ధోత్సాహము నినుమడింపఁ జేయుచున్నవి. రావణుడే రణస్థలి నిలువక పాఱిపోయినందున రాముని ప్రతినకు భంగము కలుగలేదు.

మొదటి యుద్ధమున రాముడు దయతో వదలగా రావణుడు పారిపోయెను. ఇప్పుడు అతని పరాక్రమమునకు తట్టుకొనలేక భీతిలి, పిరికియై, ప్రాణ రక్షణార్థమై పారిపోయెను. ఇది రెండవ యుద్ధము నందలి ప్రత్యేకత.

తృతీయ యుద్ధము :—

ఇది మొదటి రెండు యుద్ధముల కంటె ఎక్కువగా వర్ణితమైనది; ప్రతినాయక సంహారము నందలి నాయకుని పట్టుదలను, ప్రతిజ్ఞా నిర్వహణమును ప్రతిబింబించుచున్నది—

సూర్యాస్తమయములోపల రావణుని చంపుమని లక్ష్మణుడు రాముని ప్రార్థించెను. రావణుడిది తెలిసికొని, శుక్రోపదేశమున పాతాళ గుహను జేరి హోమము చేయుచుండెను. విభీషణుని సలహా మీద రామునిచే పంపబడిన హనుమదాదులు పాతాళ హోమ విఘ్నము గావించిరి. రావణుడు మండోదరి హితమును వినక

——"శ్రీరామ శరములచేఁ జత్తునేని
నాకవాసులు మెచ్చ నా కోరుచున్న - వైకుంఠ మెదురుగా వచ్చు నిచ్చటికి"

(యుద్ధ - ద్వి - 7279-7280)

అని, ప్రాణములకుఁ దెగించి రథముపై యుద్ధమునకు వచ్చెను. యుద్ధము నందలి సమానతకై రాముడు మాతలి రథము నారోహించి దివ్యశర చాపముల ధరించి సంసిద్ధుడై నిలబడెను.

ఇరువురు తెగించిన వారే; ఇరువురు పంతముల పట్టిన వారే; అరావణమైనను, అరామమైనను జరుగవలెనని దృఢ నిశ్చయములతో ఇరువురి నడుమ పోరు మహాభయంకరముగా జరిగినది. ఇందలి నాగ, గరుడ, రాక్షస, వైష్ణవ, వారుణ, వాయవ్యాద్యస్త్ర ప్రయోగ ఘట్టము పాఠకుల వీరము నుత్తేజింపజేయును.

నాయక, ప్రతినాయక, పరస్పరాధి క్షేపణములు, వీరాలాపములు వీరరస పోషకములు.

రావణుడు జానకీ జానిని జూచి,

"దురమునఁ గొందఱు తుచ్ఛ రాక్షసులఁ - బెరిగి చంపితినని పేర్చెదు కడగి,
నన్నెఱుంగవు నీవు; నీలావు కొలది - మున్నెఱుంగవు; నేను మును మిడి తొల్లి
యతిలోక కృతులైన యక్ష గంధర్వ - పతుల దేవతల దిక్పతులఁ బెక్కండ్ర
బలువిడిఁ గారించి భంగించి నొంచి - చెలగి వర్తింతు విశృంఖల వృత్తి
సమబల ప్రౌఢి విచారింపకేను - సమరంబులో నిన్ను నరకు సేయుదునె?
నిన్ను నీ తమ్ముని నేడాజిఁ జంపి - కన్నుల పండువుగాఁ జూచి కాని
యీ లంకఁ జొర నింక నేనని" (యుద్ధ - ద్వి - 7582-7588)

గొప్పలు ప్రేలెను.

అప్పటికే రావణుడు రెండు సారులు యుద్ధము నుండి పారిపోయినవాడు: "చావు దప్పి కన్ను లొట్టబోయిన రావణుడీ పల్కులాడుటఁ గాంచి పఠిత యతనిపై సానుభూతిని కోల్పోవును.[1]" ఒక విధముగా నిది నాయకౌన్నత్యమును పోషించుచున్నది.

శ్రీరాముడును దశకంఠునిఁ జూచి,

"పెరిగి మీ యన్నఁ గుబేరుఁ గారించి - పరుని చందమునఁ బుష్పకముఁ దెచ్చుటయు,
మఱి యరణ్యములందు మము డాగురించి - చెఱిగొని లంకకు సీతఁ దెచ్చుటయు,
నివి వీర కృత్యములే దశగ్రీవ - యివి పౌరుషములని యేల గర్వింప?
హరి హర బ్రహ్మాదు లడ్డమైరేనిఁ - బోరిగొందుఁ బోనీను, బోర సాధింతు.

— — — —

ఇంక నొక్కటి నీకు నెఱిగింతు వినుము - శంకింప వలదు; జనకజ నిచ్చి
శరణను; గాచెద, సమరంబు సేయ - నురుజయంబేది.? నీ కోటమి గాక"
(యుద్ధ - ద్వి - 8563-7576)

అని యుదగ్రుడై పలికెను.

ఇచట జనకజ నిచ్చి శరణన్న తప్ప, పారిపోయినను విడువ ననుట ప్రధానము. డాగురించి సీత నెత్తుకొని పోవుట రావణుని దోషము. ఈ యధర్మ కారణముగా, రావణుడు రెండుసారులు ధర్మ విగ్రహునితో పోరి యోడిపోయెను ఇపుడు మూడవ పర్యాయము యుద్ధమునకు వచ్చెను. "One, Two, Three" అని మూడు సారులు క్షమించవచ్చును. నాల్గవ సారి నదలరాదు. కావున శ్రీరాముడు "జనకజ నిచ్చి శరణన్న రక్షింతు" ననుట రాముని ధర్మోత్సాహము నందలి శిఖరాగ్ర స్థితి.

రావణుడు రథముపై మూర్ఛిల్లగా, సారథి రథమును రణ రంగము నుండి దూరముగా తోలుకొని పోయి అతనిని రక్షించెను. తేరుకొన్న రావణుడు సారథిని ఛీవాట్లు పెట్టి మరల యుద్ధమునకు వచ్చెను. ఇది నాల్గవసారి. ఈ యుద్ధము షడహోరాత్రములు భయంకరముగా జరిగెను.

---

1. డా. జి. వి. సుబ్రహ్మణ్యం- వీరరసము. పుట. 215.

"రామ రావణుల సంగ్రామంబు తోడ - రామ రావణుల సంగ్రామంబెపోలును"

(యుద్ధ - ద్వి - 7672)

మరియొక ఉపమానము పనికిరాదు. ప్రతినాయకుని మరణ సూచకములైన అపశకునములు, నిమిత్తములు పొడసూపినవి. ఇవి రాముని యుద్ధోత్సాహమును ఇనుమడింపఁజేసినవి. రామా బాణములచేఁ దెగిన రావణకర శిరములు మరల మరల మొలచినను, రాముడు ప్రయత్నమును వీడిన వాడు కాడు. విభీషణుడు రావణ మరణ మర్మమును దెలుపగా, రాముడు అతని నాభియందలి యమృతమును శర వహ్నికాహుతి జేసెను. విభీషణునిపై ప్రయోగించిన శక్తిని ఖండించెను. బ్రహ్మాస్త్రమున రావణుని హతమార్చెను.

ఈ ప్రతినాయకుడైన రావణుని మరణముతో రాముని వీరము తారాస్థాయి నందుకొని, రస పరిణామము చెంది రాముని యుత్సాహమునకు ఫలమయినది

ప్రతినాయకుడు నాయకుని శక్తి సామర్థ్యములను ప్రత్యక్షముగాఁ జూచి, ప్రశంసించినచో, అదియు వ్యంగ్యముగా నాయక వీరమును పోషించును.

రాముడుత్తర గోపురమున కొలువున్న రావణుని వేల కొలది ఛత్ర చామరాదులను ఒకే యొక యస్త్రముచేత తెగవేసెను. వానిని ధరించిన వారి తలలు, చేతులు, మాత్రము తెగ లేదు. రావణుడు వెఱగంది రఘురాము విలువిద్య పెంపును దలంచి, తలలూచి బట్టుకైవడి యిట్లు పొగిడెను.

"నల్లవో రఘు రామ నయనాభిరామ! - విల్లు విద్య గురుప వీరావతార!

— — — —

బాపురే! రామ భూపాల లోకముల - నీపాటి విలుకాడు నేర్చునే కలుగ

పాటించి పురములపైఁబడ్డ హరుని – యేటొప్పు నిందు నీ యేటొప్పు గాక."

(యుద్ధ - ద్వి - 2194-2200)

మంత్రులు పగవాని నిట్లు పొగడుట పలుచదనమనిరి. అప్పుడు రావణుడు-

విలువిద్య పెంపును విక్రమ క్రమముఁ - గలితనంబును బాహుగర్వ రాజసము

లాదియౌ గుణముల నధికుడైనట్టి - కోదండ దీక్షాది గురునితో రాజ

వరునితో రామ భూవరునితో నొరులు - పరికించి చూడనే పుట్టున సైన

సాటియే యిమ్మాడు జగముల యందు? - మేటి సూరుల పెంపు మెచ్చంగ వలదె."

(యుద్ధ - ద్వి - 2205-2208)

అని తాను జేసిన పొగడ్తను సమర్థించి చెప్పెను.

శ్రీరాముడు కరుణా సముద్రుడు. "కావుననే గొడుగులు మాత్రమే త్రుంచినాడు కాని, అవి పట్టుకొనిన వారి తలలు ద్రుంచ లేదు. నాయకుని గొప్పతనమును మెచ్చు నంతటి సహృదయుడు ప్రతినాయకుడని రావణుని మెచ్చుకొన వచ్చును గాని, భయాధిక్యము గల ప్రతి నాయకుని ప్రశంస నాయకుని యందలి వీరమునకు పోషకమై యొప్పును.

"ప్రతి నాయకుడు మిత్రునొక్కని నాయకునిపైఁ బ్రయోగింప నుద్యమింప నాతడు నాయక పరాక్రమాదుల బోధించి, తత్ప్రయత్న వైఫల్యమునకుఁ గృషి చేసినచో నది వ్యంగ్యముగా నాయక వీరమును పోషించును."[1]

దశకంఠుడు సీతాపహరణమున సహకరించుమని, మాయ లేడియైపోయి సీతారాముల బ్రతారించుమని మారీచుని సహాయ మర్థించెను. అప్పుడు మారీచుడు శ్రీరామునితో విరోధము మంచిది కాదని రావణుని వారించుచు తన పూర్వానుభూత శ్రీరామ పరాక్రమాదుల నిట్లు వర్ణించెను.

"నేను బాల్యంబున నెఱుగుదుఁ గొంత - యానిత్య కల్యాణు డసమ సాహసుడు
అడరి విశ్వామిత్రు యాగంబుఁ గావ - గడగి యాతడు వచ్చి కాపున్న చోట
బలిమియై నేను సుబాహుండుఁ బోర - నలుక సుబాహునొక్కమ్మునఁ ద్రుంచె
నొక కోలఁబుచ్చి పయోధి మధ్యమునఁ - బ్రకటిత రతి నమ్మఁబడవైచె నుఱక
యకృతాస్త్రుడై బాలుడై పిన్ననాడె - యకలంకు డిట్టి శౌర్యమునుఁ జూపినాడు
నేడస్త్ర బల శౌర్య నిధియైన యతని - వాడిమిఁ జెనకి యెవ్వరు నిల్చువార
లిప్పటి శౌర్యంబు నెఱుగుదుఁ గొంత - — — —
నిరువురదోకొని యేఁబూర్వ రోష - భరమున వ్యాఘ్ర రూపముఁ దాల్చి యతనిఁ
దపమునఁ గృశుఁ గాగఁదలచుచు బోవ - నిపుడేమి చెప్ప మూడంబకంబులను
ముగ్గురి నేసిన మ్రొగ్గి యిద్దఱును - మ్రగ్గి, రాయుశ్శేష మహిమ యెట్టిదియొ ?
యే నొక్క విధమున నిక్కడఁ గూలి - ప్రాణంబు లుండుటఁ బట్టి చూచుకొని
యంతనుండియు రాము నతుల విక్రమము - జింతించి నాలోని చేవవో విడిచి
రవమన్న రథమన్న రమణీయమన్న - రవియన్న రతియన్న రత్నంబులన్న
మఱియు రేఫాది నామము లెవ్వివిన్నఁ - దఱుచైన భీతి నాతనిగ నెన్నుచును
ఈ విధిఁ దపసినై యిందున్న వాఁడ; - రావణ ! యెఱుగవు రాము పౌరుషము"

(ఆరణ్య - ద్వి - 796-810)

అని రావణునకు హితోపదేశము చేసెను.

ఇందు రాముని వలని భయము రేఫాది నామోచ్చారణ చేతనే వ్యాపించి, మారీచుని వ్యాకుల మనస్కుని గావించినట్లు వర్ణింపబడినది ఇంతటి తీవ్రానుభూతిని గలిగించిన రాముని పరాక్రమాతిశయ మెట్టిదో యూహాతీతమని యిందు వ్యంజింపఁబడినది.

ఇట్లే విభీషణుడు, కైకసి, అతికాయుడు, కుంభకర్ణుడు రావణుని గూఢచారులైన శుకుడు, శార్దూలుడు- మున్నగు వారు శ్రీరాముని వీర పరాక్రమాదులను రావణునికిఁ దెలిపిన వారే.

ఇంతేకాక, 'నాయక కార్యసిద్ధికిఁ దోడ్పడిన యుపనాయకాదులగు సుగ్రీవ, హనుమ ద్విభీషణాంగదాదుల యందు గోచరించు నుత్సాహము, శ్రీరామున కండయై నిలిచి, యనునాయకుడై సర్వ విధముల నాయకునకు దీటైన లక్ష్మణుని ధర్మోత్సాహము, నాయిక యగు సీతాదేవి భర్తృవ్రత దీక్షా మతియై ప్రకటించు భక్తి శ్రద్ధోత్సాహము, శ్రీరాముని ధర్మ నిర్వహణమున కంగములై నాయ

1. డా. జి. వి. సుబ్రహ్మణ్యం- 'వీరరసము'- పుట. 210.

కాశ్రయమైన వీర రసమును పోషించుచున్నవి",[1] అవి యన్నియు గ్రంథ విస్తర భీతి నిచట వివరించుట జరుగలేదు—

—: దానవీరము :—

"దానవీరమునకుఁ దగు పాత్రమాలంబనము"[2]

శ్రీరాము డుదారుడు

"ధనదుని త్యాగంబుఁ దనయందు మిగుల - ననువొందు నిత్య కల్యాణ విగ్రహుఁడు"

(బాల-ద్వి-119)

ఇతడు వనవాసమునకు పోవుసమయమున "తన ధనముల నన్నింటిని పురోహిత తనయుడైన సుయజ్ఞునికి, విప్రులకు, దీనులకు, అర్థులకు, పేదలకు, బంధు మిత్రాశ్రితాళికి" నొసంగెను.

తన చేయస్టిని సరయువుదాకా విసరి వేసిన పేద బాపడగు త్రిజటునకు తనియునట్లు గోవులను ధనముల నొసంగెను. విభీషణ శరణాగతి వేళ అడ్డుపడిన సుగ్రీవునికి శిబి నుదాహరించి చెప్పి, "విభీషణుడేకాదు. రావణుడే గర్వము దక్కివచ్చి శరణన్న రక్షించెద"ననెను, ఇట్లు వారు వారు కోరిన వాని నిచ్చుటలో రాముడు చూపిన యుత్సాహము దాన వీర స్ఫూర్తిని కలిగించు చున్నది. అడిగిన వారికి లేదనక యిచ్చుటయే పరమార్థముగా జీవించిన శ్రీరాముని దానము ధర్మ బద్ధమగుచు దానవీరముగా భాసించి ధర్మవీరములలో నంతర్భవించుచున్నది.

—: దయా వీరము :—

"దయా వీరమునకు దీన పురుషుడాలంబనము"[3]

"దయాగుణము సంపూర్ణమానవత్వమునకొక విశిష్టలక్షణము"[4]

శ్రీరాముడు పరిపూర్ణ మానవుడు; ఉత్తమప్రకృతి: పురుషోత్తముడు: కృపాజలధి, అవాప్త సమస్తకాముడైన వైకుంఠధాముడే దీనులైన, భక్తులైన సురమునుల యార్తిని దొలగింపఁగోరి రాముడుగా నవతరించెను. ఇదియతని దయాగుణ ప్రకటనమునకై జరిగినదే. అపరాధుల రక్షించు టయు దయానుప్రాణిత ధర్మవీరమే.

కాకాసురుడు క్షమింపరాని మహాపరాధముచేసి రాముని ఇషీకాస్త్రమునకు గురియయ్యెను. తన్ను రక్షించువారు లేమి, ఆతడు తిరిగి తిరిగి "మగుడఁ

"జనుదెంచి మఱి తన్ను శరణు సొచ్చుటయు —— ఘనమైన కృపతోడఁ గాకంబుఁ జూచి"

(అయోధ్యా. ద్వి. 1152-1153)

రక్షించెను. (వధార్హమపి కాకుత్స్థః కృపయా పర్యపాలయత్.)

అరణ్యమందలి మునులు రాక్షస బాధలకు తట్టుకొన లేక రాముని దర్శించి,

"ఈ తతి దైత్యులనెల్ల ఖండించి —— మా తపోవ్రతములు మైత్రి నిండించు

---

1. డా. జి.వి. సుబ్రహ్మణ్యం. 'వీరరసము' పుట. 216.
2. విన్నకోట పెద్దన. కావ్యాలంకార చూడామణి. ద్వి. ఉ-ప-114.
3. " " " " ద్వి. ఉ-ప-114.
4. డా. జి.వి. సుబ్రహ్మణ్యము. "వీరరసము" పుట. 74.

సొరిది నీ శరణంబు సొచ్చితి మనిన — శరణాగత త్రాణ చరితుండుగాన
మీ యనుగ్రహమున మేటి రక్కసుల — దాయల ఖండింతుఁ దలకకు డనుచు
నా యాశ్రమంబుల యందుండు మునుల — కాయతమతి రాముడభయంబు లిచ్చి

(అరణ్య. ద్వి. 105-107)

రక్షించెను.

దశకంధరుడు పంపగా చారుడైన శుకుడు వచ్చి సుగ్రీవుని కతని సందేశము వినిపించుచుండ వానరులు కోపించి, శుకునిఁబట్టి, పిడికిళ్ళ బొడిచి, తెక్కలు త్రుంచివైచి, ముక్కులును చెవులును కోసివైవ గడగిన శ్రీరామచంద్రుడు దయగలవాడై

"దూతనేటికి నింత దొసగులఁ బెట్ట — బ్రాతిగా వీని నేపక పోవనిండని"

(యుద్ధ. ద్వి. 810)

విడువఁబుత్తెంచెను

ఇట్లు కరుణా సముద్రుడై కడుమించు శ్రీరాముని సకల భూతానుకంపిత్వము రామాయణమున నటనట తళుక్క తళుక్కన మెరయు చున్నది. "ఆర్తులయెడ దయ గలిగి రక్షించు వీరుల ధర్మము దయ"[1] కావున నిదియు ధర్మవీరమున నంతర్భవించును.

—: బల వీరము :—

బలము రెండు విధములు. 1. శరీర బలము. 2. మనోబలము. (ఆత్మబలము) శివధనుర్భంగము శ్రీరాముని శరీర బలమునకును, తాళ భంజనము ఆతని మనో బలమునకు నిదర్శనములు.

శివధనుర్భంగము :—

జనక చక్రవర్తి యింట ఇల్లడముగా నుంపబడిన శివుని విల్లు సామాన్యమైనది కాదు.

భవుడంధకాసుర భస్మాసురాది — దివిజారి వీరుల మర్దించె నావింట,
నుల్లోకుడై రుద్రుడుగ్ర దానవులఁ — తొల్లి యనేకులఁ ద్రుంచె నావింట
విపుల కోపాటోప విభవుడై భవుడు — త్రిపుర దుర్గములు సాధించె నావింట
నావింట మఱి దక్షు యాగంబునాడు — దేవేంద్ర ముఖ్యులఁ ద్రిదశులఁ దోలె.

(బాల ద్వి. 1849-1852)

అట్టి విల్లు జానకీ పరిణయమునకు ఉంకువగా చేయబడినది. నరేశ్వరులెందరోవచ్చి, తద్ధనువు నెత్త లేక సిగ్గుతో తలలు వంచుకొని తిరిగి పోయిరి.

ఇది బలవీర్య నిరూపణకు కవి కల్పించిన (జనకునిచే చెప్పించిన) పూర్వరంగము. దాని నెక్కు పెట్టిన బలవంతుడే సీతాపతి యగును.

శ్రీరాముడు ముని యనుమతిని ఆమేటి శివుని విల్లును సమీపించి, లేవనెత్తి, గొనయమెక్కించి కైకొనక, తన బాహుసత్వంబు దర్పంబు మెఱసి జనకునితో నిట్లు పల్కెను.

"ఇది చాల చుల్కన: యిది చాలఁ బ్రాత — యిది చాల నిస్సార మిది చాల నలతి.

---

1. డా. జి. వి. సుబ్రహ్మణ్యం. "వీరరసము" పుట—74.

తెగఁగొన నిల్వదు: దీని నాయెదుట — బొగడితి పలుమారు భూపాల యనుచు"

(బాల. ద్వి. 1644-1945)

తన జయంబెల్లెడ చాటు రీతి విలుగుణధ్వని సెలఁగించి నారిని తిరిగి పిడిపట్టు వదలగా, నది పెటపెట ధ్వనులతో విఱిగెను.

ధనుస్సు నెత్తుట యందలి యుత్సాహము, దాని నవలీలగా నెత్తుట, చులకనగా నెంచుట, విఱుచుట ఇత్యాదులు శ్రీరాముని యగణిత బలసత్త్వములు భావి కార్య నిర్వహణ సామర్థ్య ప్రతిపాదకము లై బలవీర స్ఫూర్తి ని కలిగించు చున్నవి.

ఇట్లే శ్రీరాముడు సుగ్రీవునికి నమ్మిక కలిగించుటకై

"ఘన మేరు మందరాకారమై యున్న"

(కిష్కింధా-ద్వి-360)

దుందుభి కళేబరమును

"అంగుష్ఠమునఁ బదియోజనములు మీటి వైచుటయు" బరవీరమునకు శిఖరాగ్రస్థాయిని కలిగించుటయే.

తాళభంజనము —

దుందుభికాయమును మీటి వైచినను, శ్రీరాముని బలమునందు సుగ్రీవునకు విశ్వాసము కుదురకుండెను. అతనిని విశ్వసింపఁ జేయుటకై యతడు సప్తతాళముల ద్రుంచెను.

అశని సంకాశమై యసదృశంబైన యొక్క నిశితాస్త్రము

"అవనిపై వక్రంబులైయున్న తాళ్ళ — నవిరళంబుగ వడినటు గాడి పాఱి

చేరువ గిరిదాటి చెచ్చెరఁ బోయి — ధారుణి దూరి పాతాళంబు చేరి

యలయక తీవ్రత నమ్మహాశరము — తొలగక రఘురాము దొనవచ్చి చొచ్చుట"యు

(కిష్కింధా-ద్వి-381-383)

రాముని ఆత్మబల వీరమును పోషించు చున్నది—

ఇదే విధముగా, రామాయణమునందు రాముని నాశ్రయించి క్షమా, దాన; సత్య, వీరాదులు చక్కగా పోషితములై ధర్మయుద్ధ వీరమున కంగ భూతములై యొప్పుచున్నవి—

2. శృంగార రసము :—

"పరస్పరానంద జనకమై దర్శనాలింగనాదికమైన యువకుల కర్మ సంభోగము"[1] ఇట్టి

---

1. భావప్రకాశము :—

కామోపచార స్సంభోగః కామః స్త్రీ పుంసయోస్సుఖం।

సుఖమానంద సంభేదః పరస్పర విమర్దితః।

ఉపచార స్తదానంద కారకం కర్మ కథ్యతే॥

(ప్రతాపరుద్రీయ రత్నాపణ వ్యాఖ్యయందుద్ధృతము)

సంభోగ విషయమైన ఇచ్ఛావిశేషము రతి"1 ఈ రతి స్థాయిభావముగా పరిపుష్టమగునది శృంగార రసము. "ఇది సంభోగశృంగారమని, విప్రలంభశృంగారమని రెండు విధములు"2

రంగనాథ రామాయణమునందు రెండు విధముల శృంగారము వర్ణింపబడినది.

"సీతయుఁ దానును జెలువొప్పుగూడి — నూతన రతి సుఖార్ణోరాశిఁదేలి"

(బాల. ద్వి. 2462)

మొదలుకొని సీతాపహరణ పర్యంతము సంభోగ శృంగారమును ఆపై రావణవధ వఱకు విప్రలంభశృంగారమును వర్ణింపబడినది.

సంభోగశృంగారము; —

అట్టి విల్లును బట్టి యటులెక్కు వెట్టి - గట్టిగా నెత్తిన ఘనునకు నతడు

తనకూతు నిచ్చెదఁ దప్పక నెను - నను చున్నవాడని" (బాల - ద్వి. 928-929)

విశ్వామిత్రు నాశ్రమమున ఋష్యాదులు శ్రీరామునితో పలికిరి. ఇది సీతను గూర్చి రామాయణము నందు చెప్పబడిన మొదటి మాట. మూలమునందించట కేవలము ధనుః ప్రస్తావమే యున్నది గాని సీతాప్రస్తావము లేదు. కవి ఈ అమూలక ప్రస్తావన ద్వారా సీతా సౌందర్య గుణాదులను గూడ రామునికి మహర్షులు విన్నవించినట్లు ధ్వనింపఁజేసినాడు.

ధనుర్భంగ సందర్భమున "జనకునంతఃపుర పరిచారికలు జనకుని దేవినిగాంచి రామలక్ష్మణుల కుల, రూప, శౌర్యగుణాదులను పొగడి, అట్టి వారిని సోరణ గండ్లలో నుండి చూడవచ్చు"నని పలుకగా,

......"వెలగి చెవుల సుధ చిలికి నట్టుండఁ

బ్రేమ వెగ్గలమైనఁ బృథివీజ కపుడు - రోమాంచమయ్యె నారూఢమై మేనిఁ

బ్రియమును భయమును బిరిగొని పొదల - నయమెంచి తలవాంచి ననఁబోణియుండె

అలివేణి సిగ్గున నటఁ బల్కకున్న" (బాల - ద్వి - 1890-1894)

సఖులామె యింగితమును గ్రహించి, ఆమెకు చక్కగా పరిచర్య చేసి అందముగా నలంకారము చేసిరి అంతట తల్లి

"కనక సౌధ గవాక్ష కలితగా నపుడు - వనజాక్షిఁ దోడ్కొని వచ్చె నాయెడకు"

(బాల - ద్వి - 1905)

ఇదియు అమూలకమే. రాముని రూప గుణాదుల వర్ణనచే సీత హృదయమున ప్రేమను, దర్శనాభిలాషను మొలకెత్తింపఁ జేయుట ఈ కల్పన యొక్క పరమార్థము.

శ్రీరామచంద్రుడు విశ్వామిత్రునానతిపై ఆసనము నుండి లేచి, శివధనువునేత్తుటకై కదలి

......"ప్రేమయుఁ దమకంబు పెనఁగొనుచుండఁ

జెలగుచుఁ దనమీది చెఱగు రాదిగిచి - మొలనూలు బిగఁజుట్టి మోహనా కృతులఁ

---

1. విద్యానాథుడు- ప్రతాపరుద్రీయము. రస ప్రకరణము. పుట. 192 "తత్ర సంభోగ విషయ ఇచ్ఛా విశేషో రతిః"

2. సంయుక్తయోస్తు సంభోగో విప్రలంభో వియుక్తయోః (గోవిందరాజీయోద్ధృతము).

దిరముగా నిగ్గులు దిశల శోభిల్ల - నరవింద లోచను డసమ సాహసుడు

— — — —

కోటి మన్మథలీలఁ గొమరు దీపింపఁ - నీటుగా నటు వచ్చి"

(బాల - ద్వి - 1924-1931)

నట్లు వర్ణింపఁబడినది- ఇది యమూలక వర్ణనము- రాముడు సీతను జూచి యున్నాడు. అందుకే తన సౌందర్యమును గనఁబఱచగా "కోటి మన్మథలీలగాఁ గొమరు దీపింపగా నీటుగా వచ్చినాడు; ధనువును లేవనెత్తి-

సీత గుణంబులు చెవి సోకెననగఁ - చేతి వింటి గుణంబు చెవిసోకఁ"

(బాల - ద్వి - 1948)

దిగిచినాడు. అంతట శివుని విల్లు విఱిగినది.

యువతీ యువకుల మధ్య ప్రేమ కనుకలి, వినుకలి ద్వారా కలుగును- వినుకలి ద్వారా కలిగినది కనుకలి ద్వారా దృఢమగును. మహర్షుల వలన సీతను గూర్చి రామునకు దెలుపుటయు, చెలుల ద్వారా రాముని గూర్చి సీత కెఱుక పఱచుటయు వినుకలి వలన యుభయులలో ప్రేమ కలిగించుటకై చేసిన బీజా వాపనము- సొరణ గంద్ల యొద్ద నున్న సీతను రాముడును, సభలో మోహనాకృతిఁ నొప్పు రాముని సీతయు గాంచుట పరస్పర హృదయ క్షేత్రమున నాట బడిన ప్రేమ బీజమును కనుకలి ద్వారా మొలకెత్తింప జేయుట యగును

వారి కళ్యాణ వేళ సుముహూర్తమని నడుమ కట్టబడిన తెఱ తొలగింపబడినది. అప్పుడు

——"కాంతనెమ్మోము మున్గనుగొని యలరె

రాముని కనుగవ రాకాసుధాంశు - గోముని నలరెడు కుముదంబు లనగ

భామ చూపులు నిల్చెఁ బతి పాదయుగళిఁ - దామరపై తేటి తండంబవోలె

ఇంతి లావణ్యాబ్ధి కెదురెక్కు మీన – సంతానమై రామచంద్రుదు చూపడరె

— — — చెలికేలఁ గెందమ్మి చెలువునఁ బట్టి

యొండొరుల్ పులకించి యొక్క పీఠమున - నుండి హోమము చేయుచుండిరి ప్రీతి"

(బాల - ద్వి - 2253-2260)

ఈ అమూలకమైన వర్ణనము మొలకెత్తిన యాయనురాగ లతను వికసింపఁజేయుటయే- శృంగార భావమును ప్రాథమికావస్థ నుండి, ఉన్నతావస్థ వరకు క్రమ క్రమముగా పోషించుటయే ఈ వర్ణనల ప్రధానోద్దేశ్యము-

అయోధ్యలోని వీరి సంభోగ శృంగారము- మూలము నందు "రామస్తు సీతయా సార్థం విజహార బహూన్ ఋతూన్। మనస్వీ తద్గత స్తస్యా నిత్యం హృది సమర్పితః॥"1 అని ఒక్క శ్లోకమునఁ జెప్పబడగా, రంగనాథ రామాయణమున-

"సీతయుఁ దానును జెలువొప్పఁగూడి - నూతన రతి సుఖార్ణోరాశిఁ దేలి

చంద్రశాలలఁ గేళి సౌధ వీధి కఁ - — — —

1. ద్విపతి వాల్మీకి రామాయణము. బాల" సర్గ. 77. శ్లో 25.

జాతురి మెలగుచు సకల భోగములు - నాతత సౌఖ్యంబు లందుచు నుండె."

(బాల - ద్వి - 2463-2467)

అని రద్వీపదలలో వర్ణింపబడినది.

సుమంత్రుడు దశరథు నానతిపై శ్రీరాముని బిలుచుకొని పోవుటకు వచ్చినపుడు "చిత్రాఖ్య తారతో సిగులుల్ల సిల్ల - మైత్రి యెప్పుడు చందమామ చందమున సీతాసమేతుడై" రామ భూతల నాథుడు చెలువొందుచుండెను.

(అయోధ్యా - ద్వి - 370)

అరణ్యముల కరుగుచున్నప్పుడు-

——"రాముడయ్యడవుల నడుమ - ఉరుచాపరవమున కురుకుచుఁ బొలు
మృగములఁ జూపుచు మేదినీ సుతకు - నగవుఁ బుట్టించుచు నడతెంచునడల
నలసి డస్సిన చోట నవనీ తనూజ - నిలిచిన చోటనే నిలిచి తోడ్కొనుచుఁ
గరమర్థిఁ బెక్కు దుర్గంబులు గడచి" ప్రయాణము చేసినాడు.

(అయోధ్యా - ద్వి - 1129-1132)

అడవిలో శ్రీరాముడు జానకి తొడను, జానకి శ్రీరాముని తొడను తలయంపిగా జేసికొని పర్యాయముగా సుప్తి చెందువారు,

ఖర దూషణాది సంహారానంతరము గుహ నుండి లక్ష్మణునితో పర్ణశాలకు వచ్చి,

"సునిశితాస్త్ర క్షత శోభిత వక్షు - గని సీత రాము వేడ్కను గౌగిలించె"

(అరణ్య - ద్వి - 669)

రాముడును-

కలనిలో తెగిన రాక్షసుల భూమిజకుఁ - దెలియఁజెప్పుచు వినోదించుచు నుండె"

(అరణ్య. ద్వి. 671)

ఈ విధముగా శ్రీసీతారాముల సంయోగ శృంగారము అమలినముగా, మహోదాత్తముగా, అశ్లీలము గాని రీతి వర్ణింపబడినది.

సీతాపహరణానంతరము నుండి సీతాప్రాప్తి వరకైన శృంగారము విప్రలంభ శృంగారము

"ఏణాక్షి నినుఁబాసి యీ శరీరమునఁ — ప్రాణంబు లెట్టుంగిఁ బట్టుదు నింక
మేదినీ తనయ నీ మేనుతోఁ బాసి — యేదెస భరియింతు నీదేహమింక

....

మగువ నీ పాలిండ్ల మఱుగులేకున్న — నొగిఁగాము శరవృష్టి కోర్వంగరాదు."

(అరణ్య. ద్వి. 1262-1266)

అని యిట్లు సీతను దలచుచు. గుట్ట గుట్టకు, చెట్టు చెట్టునకు అన్వేషించుచు శ్రీరాముడు చేసిన విలాపము;

పంపా సరోవరమును ఒర్కించి

"[illegible] పంపలోఁ పద్మములేఁ జూచినట్లు — భూపుత్రి వదన మెప్పుడు చూతునొక్కో,

....

తేటి యిచ్చటఁ దమ్మితేనె గ్రోల్కరణి — బో కెమ్మోవి నెప్పుడు గ్రోలువాడ"
(కిష్కింధా. ద్వి. 38-41)

ననియిట్లు సీతను స్మరించుచు చేసిన శ్రీరాముని విలాపము,

సుగ్రీవుడు సీత యాభరణములను జూపినపుడు-

"... ... ... ప్రాణనాయకయైన సీత-కుదురు నిండిన గబ్బి గుబ్బలమీదఁ
బాయని యీ జిల్గు పయ్యెద చీర — కీయవస్థలు వచ్చె నేమన వచ్చుఁ
....
మెఱుగారు మైదీగ మెఱయు చుండఁగ — మఱి యడుగులకును మడుగులు వైచు"
(కిష్కింధా, ద్వి. 237-241)

నని యిట్లు ఏడ్చిన శ్రీరాముని శోకము, విప్రలంభశృంగారమునకు పరాకాష్ఠ. అతని విలాపమును జూచి "కొండలే యేడ్చినవి, వజ్ర హృదయమే పగిలిపోయినది."1

..............నాకూర్మి విభుడు — లోకరక్షణ కళా లోలమానసుడు
రాకేందు వదనుండు రామచంద్రుండు — నాకుగా ఘోర కాంతార మధ్యమున
సౌమిత్రియును దాను జాలిమై దూలి — యేమిగాఁ గలవాడొ యెట్లున్నవాడొ,
.... — ఇదియెన్నటికిఁ గూడు నిది యెట్లుపొసగు"
(సుందర. ద్వి. 437-441)

నని సీతయు రాముని గూర్చి అతిగా విలపించినది. ఇవి విప్రలంభ శృంగారమునకు ఉదాహరణములు-

తుదకు శ్రీరామచంద్రుడు దశకంఠుని వధానంతరము అగ్ని శుద్ధియైన సీతతోఁగూడ అయోధ్యా నగరమునకు వచ్చి పట్టాభిషిక్తుడై

"తగిలిసుఖించుచుఁ దాను సీతయును — సకల భోగంబుల సౌఖ్యంబు నొందె"
(యుద్ధ. ద్వి 8848)

ప్రజారక్షణము చేయుటతో గ్రంథము పరిసమాప్తమైనది.

ఇట్లు సీతారాములయొక్క సంయోగ. విప్రలంభాత్మకమైన శృంగారము పౌలస్త్యవధకు, ధర్మసంస్థాపనమునకు సీత ముఖ్యకారణమగుటచేత వీరమునకు పోటీ పడినదివలె వర్ణితమైనది అయినను ప్రబంధ కావ్యముల రీతి పచ్చిగా నుండక మహోదాత్తముగా తీర్చిదిద్దబడినది. ఆదర్శ దంపతుల నడవడి కనుగుణముగా నుండి అమలినమై, పవిత్రమై యొప్పుచున్నది—

3. హాస్యరసము :—

వికృతి దర్శనాది జన్యమనోవికారము హాసము.2 అనగా వికృతములైన ఆకార, వేష, భాషా, చేష్టాదులను చూచుటచేతను, వినుట చేతను, గలిగెడి మనో వికారము హాసము. ఆ హాసమును

---

1. భవభూతి. "ఉత్తర రామచరిత్రము" అంకము. 1. శ్లో. 21,
"అపిగ్రావా రోదిత్యపి దళతి వజ్రస్య హృదయమ్।"
2. విద్యానాథుడు. ప్రతాపరుద్రీయము. రస ప్రకరణము.

స్థాయి భావము పరిపుష్టమై హాస్య రసముగా[1] పరిణమించును.

రంగనాథ రామాయణమునందు ఈ హాస్యరసము ఋష్యశృంగ, త్రిజట, శూర్పణఖాది వృత్తములందు పరిపోషింపఁబడినది.

1. ఋష్యశృంగుడు తన్నుఁజేర వచ్చిన వేశ్యా కాంతలను జూచి-

"చన్నుల పెరఁగ్గి చన్నుల మీద-నున్న హారములకు నుద్దేశ మడిగి
మాకు కొమ్మొక్కటి మస్తకమ్మునను-మీకుఁ గొమ్ములు రెండు మెఱసె రొమ్మునను
నే వృక్షములఁగల్గె నివి యపూర్వములు-మీ వల్కలము లతి మృదులంబు లరయ
మా జటా బంధంబు మాడ్కి-విగావు- మీ జటా బంధముల్ మెఱుగులఁబొదలె
(బాల. ద్వి. 324-327)

అనియిట్లు అమాయకముగా ప్రశ్నించినాడు.

ఆ వేశ్యలు ఫలములని యిచ్చిన లడ్వములు, అతిరసములు మండెగలు మొదలైన భక్ష్యములను నమలుచు, రుచుల మెచ్చుచు, వారిని జూచి.

"గ్రుక్కిళ్ళు మ్రింగుచుఁ గొసరి యడుగుచు-జొక్కుచు నందంద సొరిదిఁ జేచాచి
మున్నిట్టి ఫలముల మునివరులార-యెన్నడేనెఱుగను సేవనంబులను
మీ తపంబె తపంబు మీ తపోవనమె-యీతపోవనముల కెక్కుడు ధరణి"
(బాల. ద్వి. 350-352)

అని ఋష్యశృంగుడు మెచ్చుకొనగా, ఆ వారకాంతలు నవ్వుచు పలుకుల చేత, పాటల చేత, తావి యూర్పుల చేత అతని

హృదయంబుఁ గరఁగఁగ నిరుచన్నుగవలు-గదియించి బిగియారఁగౌగిళ్ళ మరపి
(బాల. ద్వి. 356)

పోయివచ్చెదమని పోయి చేరువనున్నారు.

అమాయకుడైన ఋశ్యశృంగునికి రాత్రి నిద్రపట్టలేదు. ఎట్టులో ఆ రాత్రి వేగించి, మరునాడు ఆస్త్రీలున్న చోటికి రాగా, వా రతని మనస్సుకరఁగునట్లు మఱి మఱి పలికి తమ యాశ్రమమునకు రావలయునని కోరి, తమ విలాసంబులచేత తమకంబు పుట్టించి-

"ఒనరెడు దీమంబు లోకవింత మృగము - గొనివచ్చు తెఱగున" (బాల. ద్వి. 367)

రోమపాదుని నగరమున కతని గొనివచ్చిరి.

కొమ్ములేవో, చన్నులేవో, పదార్థములేవో, ఫలములేవో, తపసులేవరో, తరుణులెవరో తెలి యని ఇంత యమాయకుడా? యనియు, లోకముననిట్టి వారుందురా? యనియు నాశ్చర్యము కలిగి ఋష్యశృంగుని చేష్టాదులచే హాస్యము జనించుచున్నది జన్మప్రభృతి తండ్రిని దప్ప మరొక స్త్రీని గాని, పురుషుని గాని, నగర రాష్ట్రములందలి ఆశ్వకుక్కుటాదులను గాని చూడనివాడు వింత మృగము గాక మరేమి యని నవ్వుపొడమును. అతని యమాయకత్వ ప్రవర్తనము హాస్యరసమునకు స్ఫోరక మైనది.

---

1. విద్యానాథుడు. ప్రతాపరుద్రీయము. రస ప్రకరణము.

2) శూర్పణఖ తనకుమారుని మరణమునకు దుఃఖించుచు తద్వ్యథకు కారకులైన రామ లక్ష్మణులపై కనలి పర్ణశాలకు వచ్చినది. అప్పుడా శూర్పణఖ-

"ఉత్తుంగ నాసికం బుగ్రఖాలంబు
గురువిలోచనములు కోఱ దౌడలును-పఱపైన కడుపును బల్ల వెండ్రుకలుఁ
దెఱనోరు కఱిమేని దీర్ఘ జిహ్వయును-వెఱపైన రూపును విషమ దృష్టియును"

(అరణ్య. ద్వి. 389-391)

గలిగి యుండెను. అట్టి సుప్పనాతి

"ఇందీవరశ్యాము నినకోటిధాము-సౌందర్యజితకాము, జగదభి రాము రాముని"

(అరణ్యా. ద్వి. 396-397)

గాంచి, కామభూతము సోకగా, తామసగుణమేచగా, తన్ను లోకాభిరామగా దలచి, నిక్కి-

"తన మొద్దుమొగము నాతని ముద్దుమొగము-తన మహోదరము నాతని తనూదరము
తనకప్పు గన్ను లాతని గొప్పకన్ను-లెనయంచుఁ దనకితడే తగునంచు
మొగముచేటంతగా ముసిముసినగవు-లిగురింప రఘురాము నీక్షించి"

(అరణ్యా. ద్వి. 399-401)

అతనిఁగూర్చి యడిగినది. తనగొప్పతనము గూర్చి చెప్పినది; కుల గుణహీన, వికృతాంగియైన సీతను వీడి తనను పెండ్లాడి భోగింపుమన్నది. కాని రాముడు సవతి పోరు పడజాలవని సౌమిత్రిని జూపెను. అది లక్ష్మణుని జేరి కోరగా, నతడు మొదట మాయన్నను గామించితివి; గాన నిన్ను పొందరాదు; అందమునందు సీత నీతో సరిగాదు: నీయందచందములను రాముడు మరల నొకసారి చూచెనేని సీతను వీడి తప్పక నిన్నుపొందున"ని పలుకగా, శూర్పణఖ నిజమని నమ్మి రాముని యొద్దకు పోయి రతికి ప్రార్థించినది. ఇట్లు

"తమ్ముడన్నను, నన్న తమ్మునిఁ జూపఁ-ద్రిమ్మరి తనకోర్కి తీదీపులాడ
మఱీ మన్మథుని సూత్ర మహిమచేఁ దిరుగు-తెఱ బొమ్మయోయన"

(అరణ్యా. ద్వి. 435, 436)

పేరాసతోఁ దిరిగి, వేసరి, గాసిల్లి, సీతను మ్రింగ బోవగా, రాముడు 'ఇంక మేలము చాలు. దీని శిక్షింపు' మని లక్ష్మణుని హెచ్చరించెను. అపుడతడు పర్ణశాలకు వెలుపల నిలిచి

"పడతి నీకింత కోపఁబేల రమ్మ-కడముట్ట నీకోర్కిఁ గావింతు నిపుడె" (అరణ్యా. ద్వి. 445)

యని శూర్పణఖను తనయొద్దకు పిలిచి, ఒరనుండి ఖడ్గమును దీసి, సుప్పనాతి యొక్క-

— — — "ఘన నాసికము చెవుల్ గరమునఁబట్టి
యే సీమ సరసమో యిదియన నతడు-మా సీమ సరసమో మగువరో యనుచు
చేయొడ్డి వలచి వచ్చినఁ జెవుల్ ముక్కు-పోయెనన్ సామెత పుడమి పుట్టించి
ముక్కును జెవులును మొదలంట గోయ" (అరణ్యా. ద్వి. 448-451)

గా శూర్పణఖ వెక్కుచు ఖరుని యొద్దకు పోయినది.

ఇచ్చటి శూర్పణఖ వికృతాకారము, కామ పరవశురాలై రామునికి తాను సరియని పోల్చు కొనుట, రతికి ప్రార్థించుచు తెర బొమ్మవలె తిరుగుట, సౌమిత్రి తన చేత ముక్కు చెవులు ఖట్టి

కోయ బూనినపుడు "అమాయకముగా" ఇదియే సీమ సరసమో"యని యడుగుట, మొదలైన ఆకార వేష భాషా చేష్టాదులచే హాస్యము పొదము చున్నది.

(3) త్రిజటాఖ్యుడొక విప్రుడు. ఇతడు తన జీవనస్థితికి చేను దున్నుచుండెను. వనవాసమునకు పోవు రాముడు తన ద్రవ్యమును దానము చేయుచుండగా, నితడు భార్య ప్రోద్బలమున శ్రీరామునిజేరి యాచించెను. అప్పటికి రాముని యొద్ద ఆల మందలు మాత్రము మిగిలి యున్నవి. శ్రీరాముడు విప్రుని జూచి "నీ చేయష్టిని నిజ శక్తితో నెందాక విసరి వేసెదవో, ఆలోపలి పసుల మందలు నీవే"యని పలికెను. అంత త్రిజటుడు సంతసిల్లి-

"అఱచి దోవతి మొలనంట బిగించి - కుఱుచైన శిఖముడిగొని యేడు గఱచి
నరములఁ బ్రాణముల్ నలినంటఁ బట్టి - బిరబిర తన యష్టిఁ బెట్టుగాఁ ద్రిప్పి
యురమున బందెము లుబ్బుఱూతలూగ - సరయువుదాక విచ్చలవిడి నేసె.
బ్రదుకు జీవమయని బ్రాహ్మణుండట్టి - మొదవులఁ గొన్న" రాముడు చోద్యమందెను.

(అయోధ్యా. ద్వి. 740-744)

"ఇచ్చు వాడున్నచో, చచ్చిన వాడును లేచివచ్చును, వచ్చినవాడు మొత్తమును తానె పొంద వలెనని ఆశపడును". శ్రీరాముని మాటచే ఒక్క బాపనికి ఆశకలుగగా, తన యష్టిని చాలదూరము వేయుటకు అతడు చేసిన చేష్టాప్రయత్నములు నవ్వు పుట్టించుచున్నవి; లోక స్వభావమును బట్టి యిచ్చుచున్నవి.

(4) కుంభకర్ణుడు తనగుహలో మహానిద్ర పోవుచుండెను. రాక్షసులు రావణాదేశమున నతని మేలుకొలుపు చుండిరి. వారు శంఖాది ధ్వనులు చేయుచు -

ఉరు లులాయములచే నురముద్రొక్కించి ....
పేలుచ శిరోజముల్ పెరికి పైచియురు ....
క్రందగాఁ గూబలు గఱచి పట్టియును - ....
తెరల గాచిన నూనె దెచ్చి కర్ణములఁ - గరముగ్రముగ వేయు ఘటములు వోసి
మునుకొని యాతని ముక్కు గోళ్ళందు - ఘనమైన పారలఁ గనల బెట్టియును"

(యుద్ధ. ద్వి. 8500-8513)

అతి ప్రయత్నమున మేలుకొల్పిరి. కుంభకర్ణుని మేలుకొల్పుటకు రాక్షసులవలంబించిన పద్ధతులు హాస్యమును (ఆశ్చర్యమును) బుట్టించు చున్నవి.

ఇట్లు రంగనాథ రామాయణమునందు మూలార్థము చెడకుండ హాస్యరసము పోషింపఁ బడినది—

(4) కరుణ రసము.

కరుణ మనగా దుఃఖము (ఏడ్పు). ఇష్టజన వియోగాదులచేత మనస్సునకు ప్రాప్తించు దుఃఖాతిశయము శోకము"1 ఆది గ్రహణముచే అనిష్టప్రాప్తి వలనను శోకము గలుగునని యర్థము 2

1. విద్యానాథుడు- ప్రతాప రుద్రీయము- రసప్రకరణము.
2. సన్నిధానము సూర్యనారాయణశాస్త్రి, కావ్యాలంకార సంగ్రహము. పుట. 435.

ఈ శోకము స్థాయి భావముగా గలది కరుణ రసము. దీనినే "ఇష్టనాశము వలన, అనిష్ట ప్రాప్తి వలనను కరుణ రసము గలుగు"నని చెప్పవచ్చును. "ఇష్టనాశమనగా ఇష్టులగువారి మరణము గావచ్చును. లేక వారి సంగమము తిరిగి తటస్థింపనే తటస్థింపదనియు నమ్మకము కలుగుటచే సంభవించిన నిరపేక్షభావము కావచ్చును"[1] ఇట్టి నిరపేక్ష భావము దుఃఖాతిశయ హేతువై కరుణము నుప్పతిల జేయును.

రంగనాథ రామాయణమునందీ కరుణ రసము దశరథ చరిత్ర, యజ్ఞదత్త చరిత్ర, తారా విలాపము, మండోదరీ విలాపము. సులోచనా సహగమనములందు చక్కగా పోషింపఁ బడినది-

(1) దశరథ చరిత్ర :—

శ్రీరాము డరణ్యమునకు రథముపై సీతాలక్ష్మణ సహితుడై యేగుచుండగా,

"..........దశరథుడటు పోక నిలిచి, - తనసూను రథమును దప్పక చూచి,

అదియుఁ గానక ధూళి నటుసూచి చూచి - యదియుఁ గానక బయ లటు చూచి చూచి

హాయని యెలుగెత్తి హా రామ రామ - హాయని మూర్ఛిల్లి యవనిపైఁ ద్రెళ్ళి"

(అయోధ్యా - ద్వి - 986-989)

కెందూళిఁ బొరలుచు దుఃఖించుచుండెను. ఆపిదపి

"........................ కౌసల్య

నగరంతఁ జొచ్చి యానన ధూళి తోడఁ - బొగులుచు సెజ్జపైఁ బొరలుచు మిగుల

... ...

నని రామ సీతల యాయాసములకుఁ - దనమది నడలుచుఁ దలపోయు చుండె."

(అయోధ్యా — ద్వి - 996-1003)

ఆతలపోత దుఃఖముతోనే దశరథుడు మరణించెను. ఇచ్చట "రాముని దర్శనము తిరిగి తనకు తటస్థింపనే తటస్థింపదని నమ్మకము కలుగుటచే సంభవించిన నిరపేక్ష భావము దశరథుని దుఃఖాతిశయమునకు కారణము. అది యతనికి మృత్యువును గలిగించెను.

(2) యజ్ఞదత్తుని చరిత్ర :—

యజ్ఞదత్తుడను ముని కుమారుడు దశరథ శబ్ద వేధి శరవిద్ధుడై హతుడయ్యెను. దశరథుని వలన నీ సంగతి విని, తత్సహాయమున కొడుకు కళేబరము నొద్దకు వచ్చి తల్లిదండ్రులగు అంధ మునులు చేసిన విలాపము కరుణోద్వేలమైనది అంధురాలైన ముని కుమారుని తల్లి-

"వేడి దయోదార విమల మానసుడు - వేడి తపోధన విపుల పుణ్యుండు

— — — —

అనుచుఁ జేతులు చాచి యందంద తడవి - తనయునిపైఁబడి తల్లి శోకించి

తొడలపైనునిచి నెత్తుటఁ దోగియున్న జడలతోఁ దలజేర్చి సంతాప మంది

యో విమలాత్మక యో యజ్ఞదత్త — —

ఎక్కడి నీ ప్రాణ మెక్కడి బాణ - మెక్కడి దశరథుం డెక్కడి నీవు

---

1. సన్నిధానము సూర్యనారాయణశాస్త్రి, కావ్యాలంకార సంగ్రహము. పుట. 485.

ఇన్నియు నొడఁగూర్చ నిటు నేడు గలిగి - నిన్ను ద్రెక్కొనియెనా నీ కర్మఫలము"
(అయోధ్యా. ద్వి. 12387-1298)

అని యేడ్చిన యేడ్పును; అంధుడైన వృద్ధుడగు తండ్రియును తనయునిపైఁబడి

"నీవు నా కడ కతినిష్ఠతో వచ్చి - కావింతు ప్రీతి సత్కారముల్ తొల్లి
యేను నీకడ కిప్పుడే తెంచి యుండ - నే నెయ్యములు సేయ విటు నీకుఁ దగునె
... ...
నీ యట్టి కొడుకును నిజముగాఁ బూని - యే యుగంబులఁ గందు నింక నేననఘ
(అయోధ్యా. ద్వి. 1300-1310)

యని యేడ్చిన యేడ్పును హృదయ ద్రావకములై కరుణ రసమునకు పతాక స్థాయులై యొప్పు చున్నవి.

(3) కౌసల్యాదుల విలాపము :—

దశరథ మరణానంతరము

"అదరి కౌసల్యయు నా సుమిత్రయును - బెదరి యందఱఁజూచి పృథివీశుఁ జూచి
హాయని యెలుగెత్తి హా ప్రాణనాథ - పోయితే దశరథ భూనాథ యనుచు
.... సడికోర్చి శరథేశ్వరుఁ జంపుకొంటి
నెలకొని యిట మీద నీవు నీ సుతుడు - నిలయెల్లఁ గైకొని యెలమి భోగింపు"
(అయోధ్యా. ద్వి. 1340-1345)

దనుచు నేడ్చిరి.

భరతుఁడును తండ్రి మరణ వార్త విని, అడలుచు అంతఃపురమునకుఁబోయి యచ్చట

"కను గవ మూసిన గతినున్న తండ్రిఁ - గనుగొని భరతుండు కడుమూర్ఛఁబొంది
తెలసి క్రమ్మఱఁ జూచి తీవ్రంపు వగల - వెలువరింపగ రాక విలపింపఁదొడగె
ఈ కష్ట వర్తనం బేమిటఁ గడవఁ - జేకురు నికనేమి సేయుదు ననుచు"
(అయోధ్యా. ద్వి. 1453-1465)

పలు విధములుగా పలవింపఁ దొడగెను.

శ్రీరామ జనపతి భరతుని వలనఁ దండ్రి మరణ వార్త విని కన్నీరు జలజల రాలగానడలుచు
నేలేనిచోఁ దండ్రి యేపెల్లఁ దీర్చి - మేలుగైకొంటిరి మీరలిద్దఱును
ఎందుకు నా జన్మ మిక నను వంటి - నందనుఁడుండి యుండని చందమయ్యె
... ...
ఏ మందునని విను మిందీవరాక్షి - మీ మామ దివి కేగె మేదినీ తనయ
వినుమన్న లక్ష్మణ విభుడు దిక్కేది - మనలను నెడబాసి మరణంబు నొందె[1]"

1. రంగనాథ రామాయణము. అయోధ్యా - ఆం. వి. ప. ప్రతి. అధిక పాఠము-అనుబంధము. 2. పుట. 77.

నని పెక్కు భంగుల విలపించుచు మూర్ఛిల్లెను.
ఇట్టి దశరథ చరిత్ర కరుణరసభరితమై వరలుచున్నది.

(4) తారావిలాపము :—

"వాలి రాఘవు చేత వసుధపైఁ గూలె" ననువార్త విని తార

(కిష్కింధా. ద్వి. 596)

"తన మదిలో వాలిఁ దలపోసి పోసి - ఘన శోకమునఁ జనుగవఁ జూచి చూచి

....

కడునల్క వెప నుగ్రగతి మోదుకొనుచుఁ - బుడమి గంపింప నద్భుత శోకమడర

....

ఆవాలిపైఁ బడి యందఱుఁ బొగుల - ... .

హృదయేశ నినుఁబాసి యే నిల్వఁజాలఁ - గదిసి నీ వున్న లోకమునకు వత్తు

....

శిరము మూర్కొని ముద్దు చెక్కిళ్ళు పుణికి - కరము ముద్దాడు నీగారాపుఁ బట్టి

వరుస నంగదు నేల వారింప వధిప" (కిష్కింధా. ద్వి. 603-634)

యని కన్నీరు మున్నీరుగా విలాపించిన తీరు కరుణరస స్ఫూర్తిని గలిగించుచున్నది.

(5) సులోచనా సహగమనము :—

సులోచన తన పతియైన ఇంద్రజిత్తు మరణ వార్త విని, అధికముగా వగచుచు వివశత నొంది, కొంత ప్రొద్దునకుఁ దెలివొందె.

"హా ప్రాణనాయక హా జీవితేశ ...

....

నాకుఁ జెప్పిన నీకు నాథ యీ చావు - చేకూరునే శత్రుచేత నీలాగ"

(యుద్ధ. ద్వి. 5839-5843)

అని యిట్లు పలవించి పలవించి, మామ దశకంఠు ననుమతిపై రాముని సన్నిధిఁజేరి, స్తుతించి, పతి తలను, కళేబరమును దెచ్చుకొని సహగమనము చేసినది ఈమె చరిత్ర యెట్టి వారినైనను కంట తడి పెట్టునట్లు చేయును.

(6) మండోదరి విలాపము :—

శ్రీరాముని బ్రహ్మాస్త్రమున రావణుడు నేల గూలెను. మండోదరి మొదలైన దనుజ కాంతలు లంకాపురి వెడలి దశకంఠుని సమీపించి గోడు గోడున దుఃఖించిరి అందు మండోదరి శోకాబ్ధి పారము లేనిది. ఆమె బాష్పంబులు కన్నులు దొఱుగఁ బలుమాఱు నెలుగెత్తి-

"హా రాక్షసేశ్వర ! హా వీరవర్య ! - హా రణాలంకార హా నాథ యనుచు

....

నాథ ! భాగ్యము లేని నను జూడు దుఃఖ - పాథోధి లోపలఁ బడి మునింగెదను

....

వైరుల సతులకు వైధవ్య మిచ్చు - నీ రామలకుఁ గల్గె నేదా ఫలంబు"

(యుద్ధ. ద్వి. 7901-7941)

అని యసురేశు మోము గనుగొని పలవించుచు, కన్నీరునించుచు, తన దిక్కు లేమికి నెంతేవగచినది. ఈ ఘట్టము కరుణరస పరిపూర్ణమైనది.

ఇట్లు రంగనాథ రామాయణమునందు మూలమునకు భంగము కాని రీతి చక్కగా కరుణ రసము ఆయా కథాంశముల కనుగుణముగా పోషింపఁబడినది—

(5) భయానక రసము :—

"రౌద్రములైన స్వరూపములను కనుట వలనను భీకరములై శబ్దములను వినుట వలనను కీడు కల్గునేమో యని శంకించుట భయము"[1] భయము స్థాయి భావముగాగలది భయానక రసము. వికారములగు క్రూర జంతువులను, శత్రువులను జూచినపుడు భయానక రస మేర్పడును—

మారీచ వృత్తాంతము, సీతకుఁగాపున్న రాక్షస స్త్రీలు- వారి చర్యలు ఇత్యాదులందు భయానక రసము పోషింపబడినది—

(1) మారీచుడు కపట సారంగమై సీతారాముల భ్రమింపఁజేసి, రాముని చాల దూరము గొనిపోయి అలసట పెట్టినాడు శ్రీరాముడు చివరకు వేసిన బ్రహ్మాస్త్రముచే కొట్టుబడి నేలఁగూలుచు జానకీ విభుని కంఠస్వర మనుకరించి, "హా లక్ష్మణా" యని యార్త రవ మొనర్చినాడు-

"———ఆ యార్త రవము - విని సీత భీతిల్లి వెసనుర్విఁ ద్రెళ్ళి
తెలిసి దిక్కులు చూచి ధృతి దీఱండించి — అలిఁదూలి యెలుగెత్తి లక్ష్మణుఁ జూచి
సౌమిత్రి యిదియేమి చందమో నేడు - రాముడు నిన్నార్త రవమునఁ జీరే
....
అడవుల కొంటిమై యట పోయినాడు — తడవాయె, రాడు, యుద్ధంబున నేడు
కడిది రక్కసుల కెక్కడఁ జిక్కినాడొ — తడయక పోవయ్య ధరణీశు కడకు"

(అరణ్య. ద్వి. 928-930)

నని కన్నీళ్ళు కారగా జనక నందన పలికిని పలుకులు ఆమెలోని భయమును జక్కగా ప్రకటించు చున్నది—

(2) రావణుడు రాక్షస స్త్రీలను బిలిచి, సీతను బెదిరించియైన భయద చేష్టలచే బాధించి యైనను రెండు మాసములలో నామెను తన సొమ్ముగాఁజేసి తెండని హెచ్చరించి, అట్లు జరుగకపోయిన నా సీతను జంపి యింతలింతలు కండ లిందఱుగొనుడని శాసించి తనయంతః పురమునకుఁ బోయెను. అప్పుడా దానవకాంతలు దయమాలి రావణుని పొందుమని సీతను బాధించుచుండిరి.

"———శూలపాణియై యొక్క
రక్కసి బెదరించు, "రాముడీ లంక - దిక్కు చూడగ లేడు. తెలవ యీ యాస
విడుమంచు నొకయింతి వెడనీతిఁ బలుకు ....
ధారణీతనయ కొందల మంది కుంది
కన్నీరు దొరుగఁ గద్గద కంఠఁ - దన్ను గారించుఁ దైత్య స్త్రీల కనియె"

(సుందర. ద్వి. 390-397)

---

1. విద్యానాథుడు. ప్రతాపరుద్రీయము. రసప్రకరణము- పుట. 196.

ఇచ్చట రాక్షస వనితల బెదిరింపు, తచ్చేష్టలు భయమున కుద్దీపనములై, సీత భయపడుట, కన్నీరుదొరుగుట, గద్గద కంఠ యగుట అను భావములై భయానక రస పోషకములై యొప్పు చున్నవి.

(3) తనను త్రోవ చూపని సముద్రునిపై శ్రీరాముడు బ్రహ్మాస్త్రమును ప్రయోగించెను. అంతట సముద్రుడు సత్వము చెడి, భ్రమణంబు నొంది, గంగాది నదులతో వచ్చి, సాష్టాంగ మెఱిగి, చేతులు జోడించి తప్పును క్షమింప వలసినదని ప్రార్థించెను. గంగాది నదులును నతించి తమ మంగళ సూత్రములు నిలుపుమని శ్రీరాముని వేడినవి. రాముని బ్రహ్మాస్త్ర ప్రయోగముచే భయపడిన నదీ సముద్రుల స్వరూపము, తత్ప్రార్థనము భయానక రస స్ఫూర్తిని గలిగించుచున్నది.

(4) రావణు డింద్రజిత్తు మరణమునకు శోకించి "యీ యింద్రజిత్తు మాయ సీతఁ జంపె......... నేనింక నిజముగా నిప్పుడ పోయి జానకిఁ దెగటార్చి చలము సాధింతు"నని చేత చంద్రహాసము పూని ధరణి గంపింపగా వచ్చి జానకి యెదుట నిలిచెను.

"అప్పుడా పాపాత్ము నత్యుగ్ర దృష్టి - కప్పుణ్యవతి స్రుక్కి యసద చందమున
నొందిన భీతితో నుగ్ర గ్రహంబు - ముందఱ నిల్చిన మోదంబుఁ దక్కి

....

అక్కటా దైవంబ యతి పుణ్య ధనులఁ - బెక్కు సంకటములఁ బెట్టితే తెచ్చి
రామాభి రాముల రామలక్ష్మణుల - నా మీఁది పగ నంచు నలినాయతాక్షి"

(యుద్ధ. ద్వి. 5811-5819)

దుఃఖించి. దుఃఖించి రాముని మది నిలిపి పరవశమై తూలిపడి మూర్ఛపోయెను. తన్నుజంపునేమో ? రామలక్ష్మణులను జంపినాడేమో ? యని రావణుని గాంచి భయపడిన సీత స్వరూప స్వభావములు చక్కగా వర్ణితములైనవి.

(5) కుంభకర్ణుడు కోపించి, శూలంబుగొని పెచ్చు పెరిగి, కాలుడో యనగ నేతెంచి వనచర కోటి నడిగింపఁజొచ్చెను అప్పుడు వానరులు——

కఱకైన యా కుంభకర్ణుని యెదుర - నెఱపైన కడిమికి నిలువలేకపుడు
వడి మూర్ఛనొంది యుర్వరఁ బడువారు - కడుపడి నెతురుల్ గ్రక్కెడు వారు
వాతూల గతి దివి వడిఁ బ్రాకువారు - సేతువు త్రోవనే చెడి పాఱువారు"

(యుద్ధ. ద్వి. 3891-3898)

నై యుండిరి.

(6) ఆంజనేయుడు తోకనిప్పుచే లంకా పట్టణమును వడిగఁ గాల్చుచుండెను అపుడు దైత్యవరులు.

... ... "కరము భయభ్రాంతిఁ గంపించువారు,
దలలును జీరలు దరికొని మండ - బలమేది నలుగడఁ బాఱెడు వారు

....

హా హా నినాదంబు లడరించువారు - నా హనుమంతుపై నరిగెడువారు."

(సుందర. ద్వి. 956-959.)

నైయుండిరి.

ఇందు ప్రతిపక్షులైన కుంభకర్ణ, ఆంజనేయులను గాంచి బయపడి ప్రాణములమీది యాశచే పలుపాట్లు పడుచున్న వానర దైత్యుల భయావస్థ వర్ణింపఁబడినది

ఇట్లాయా పట్టుల వర్ణితమైన వారివారి భయము భయానక రసస్ఫూర్తిని గలిగించు చున్నది.

(6) రౌద్రరసము :-

"శత్రువులు (భృత్యులు, బంధువులు) మొదలగువారు చేసిన చెడుకార్యములవలన గలిగెడు మనః ప్రజ్వలనము క్రోధము"1 క్రోధము రౌద్రరసమునకు స్థాయిభావము. స్థాయిభావ, నాయిక భేదముచే రౌద్రరసము వీరముకన్న వేఱయినది. రౌద్ర రసమున నాయకుడు ధీరోద్ధతుడు. కొట్టుట, చీల్చుట, చంపుట మొదలగు కార్యములచే రౌద్ర రసము జనించుచున్నది.

రావణ చరిత్రాదు లిందుకు నిదర్శనము.

(1) విభీషణుడు రాముని పరాక్రమ మహాత్మ్యములను అన్నయైన రావణునకు నివేదించి, అతడొనర్చిన యధర్మమును దెలిపి, శ్రీరామునకు సీతనప్పగింపుమని హితోపదేశము చేసెను దశకంఠుడు పగవాడివని తమ్ముని నిందించెను. అయినను విభీషణుడు హితోపదేశమును మానలేదు. అందువలన దశగ్రీవుడు,

"....... విభీషణు నదరంటఁ జూచి — మునుకొని పదిమొగంబులు జేగుఱింపఁ
గటములువొంగ నొక్కట నూర్పులెసగఁ — ....
అద్దిరా! యితని కోపావేశ మనగ - గద్దియనుండి దిగ్గన దిగ్గనుఱికి
యడిదఁబు ఝళిపించి యట్లువ్రేయఁబూని - యడిగి విభిషణు నుగ్రితఁ దన్నె"

(యుద్ధ, ద్వి. 535-539)

తన్నుటయే కాక పురమునుండి వెడల గొట్టును.

విభీషణుని హితోపదేశము తన మనోభీష్టమునకు విరుద్ధమగుటచే ఆతనిని పశదాయగానెంచి కోపించి రావణుడతనిని దన్నుట. వెడలగొట్టుట యనెడి కార్యములచేత రౌద్రరసము చక్కగా ప్రకటిత మగుచున్నది.

(2) అశోకవనమును బెరికి, రాక్షసులను హతమర్చి చివరకు మేఘనాదునిచే బంధితుడై సభలో రావణుని యెదుట నిలుపబడిన ఆంజనేయుడు రాముని ఘనతను బొగడి సీతనొప్పించి యతని శరణు వేడుమని రావణునకు బుద్ధిసెప్పెను. అట్లు బుద్ధిచెప్పిన హనుమంతుని జూచి, రావణుడు—

——"కనలుచుఁ బెంపు మొక్కలమునఁ గదుర
ఘన ఘనా ఘన మేచి గర్జించినట్లు - తనియక భర్జించి దశకంఠు డలిగి
వెఱవక చనుదెంచి వీడు నా యెదుట - నఱు క్రమ్మి దుర్భాష లాడుచున్నాడు
కొనిపోయి చంపుడీ కోతి కీటంబు"

(సుందర. ద్వి. 888-891)

నని ప్రహస్తుని హెచ్చరించెను. విభీషణుని ధర్మోపదేశముచే కొంత తగ్గి, దైత్య వీరులఁ జూచి

"కోతుల కెల్లను గుఱుతు వాలంబు - ప్రీతిగా, నటుగానఁ బ్రజలెల్లఁ జూడ
వీని వాలము గాల్చి వీథులఁ ద్రిప్పి పోనిండు"

(సుందర. ద్వి. 901-902)

అని యలుక మీఱి శాసించెను.

ఇచ్చట తన వనమును జెఱచిన, తన కుమారుని, సైన్యమును నశింపఁజేసిన అంజనేయుడు రావణునకు శత్రువు. అతని చెడు కార్యముల వలనను, వ్యతిరేక బోధ వలనను కలిగిన మనః ప్రజ్వలనము క్రోధము. అది రావణుని శాసనమున దైత్యులు మారుతిని బట్టి, చేతులు కాళ్ళు కట్టి వాలమునకు నిప్పంటించి, తూర్యంబులు వాయించుచు వీథుల ద్రిప్పుట యనెడి కార్యములచే రౌద్రి రస స్ఫూర్తి యగుచున్నది.

(2) వాలి మాయావితో గుహ యందు యుద్ధము చేయుచుండ, సుగ్రీవుడు కొండ శిఖరమును నొక దానిని గుహ కడ్డముగా నునిచి కిష్కింధకు వచ్చి పట్టము గట్టుకొనెను. వాలి మాయావిని చంపి, అడ్డముగా నున్న కొండను పిండిగాఁదన్ని కిష్కింధకు వచ్చి, సుగ్రీవుడు చేయు వందనమును గైకొనక కినుకతో,

"ఓరి తమ్ముడవని యూఱడి నమ్మి - పోరాడఁ బగతుపైఁ బోయిన చోట
ననుడించి చనుదెంచి నా రాజ్యపథముఁ - గొని ప్రీతి నేలుట కూడునే నీకుఁ
గడుపాప బుద్ధివి గావున నిన్నుఁ - దొడరి చంపిన నాకు దోసంబు లేదు"

(కిష్కింధా. ద్వి. 306-308)

అని పలికి, సుగ్రీవుడెంత ప్రార్థించును మంత్రులెంత దెల్పినను వినక అనయుడై అతని పత్నియైన రుమను. రాజ్యమును బుచ్చుకొని, అతనిని చంపఁ గడగెను. సుగ్రీవుడు వెఱచి ఏకాకియై పాఱగా, వాలి యతనిని వెన్నంటెను.

ఇచ్చట సుగ్రీవుడు తెలియక చేసిన కార్యము (గుహోపధానము) వాలికపకారమై క్రోధహేతు వైనది. తత్ఫలితముగా, వాలి సుగ్రీవుని భార్యను గ్రహించి, అతని వెనుకొని తఱుముట, చంప యత్నించుట రౌద్రమును ప్రకటించుచున్నది.

(3) విభీషణ రామ సుగ్రీవాదులు సువేలాద్రిపై నున్నపుడు రావణుడుత్తర గోపురమెక్కి తన వైభవమును గనఁబఱచెను. సుగ్రీవుడా రావణ వైభవమును గాంచి కుపితుడై

"..... బిఱ బిఱఁ బడవచ్చు పిడుగు చందమున
వెస నగ్గలముగ సువేలాద్రి నుండి - యసురేశ్వరుని మీది, కర్గుఱం డెగసి
.... వీకతో మకుటముల్ వెసడొల్ల నేసె
— — — —
చాలఁ గోపించి దశగ్రీవుడంత వాలి తమ్మునిఁ బట్టి వడిఁ బడవైచె

(యుద్ధ. ద్వి. 1809-1815)

ఆ పిదప నిరువురికి మల్ల యుద్ధము ఘనముగా సాగినది. రావణుడు మాయఁ బన్న తలంచగా, గుర్తించి సుగ్రీవు డెగసి వచ్చి శ్రీరాముని చేరెను.

ఇచ్చట రావణుడు చూపిన వైభవము సుగ్రీవునకు క్రోధ హేతువైనది. తత్కోపము నాపు కొనలేక అతడమాంతముగా రావణునిపై దుమికి అతని మకుటముల్ పడవేయుట, ఇరువురు కోపముతో మల్ల యుద్ధము చేయుచు పరస్పరము తన్నుకొనుట, పొడుచుకొనుట, ఇత్యాది కార్యములు రౌద్ర రసోద్వేలకములై యున్నవి.

ఇట్లే యుద్ధ కాండములో రామ రావణాది వీరుల పరస్పర హననాదుల యందు రౌద్ర రస తరంగములు వార్ధి యందలి కరడుల వలె లేచుచు, పడుచునుండుటను గమనింపవచ్చును.

(7) బీభత్స రసము :—

"నెత్తురు, వమనము మొదలగు కుత్సిత వస్తువుల దర్శనము చేతను, తచ్ఛ్రవణము చేతను మనస్సులో కలుగు ఏవగింపు (అసహ్యము) జుగుప్స"1 ఇది స్థాయి భావముగా గలది బీభత్స రసము. అసహ్యమగు వస్తువులను చూచుట వలన, వినుట వలనను బీభత్స రస మేర్పడునని తాత్పర్యము.

విరాధ కబంధాదుల చరిత్ర లందు నిది కనుగొనవచ్చును.

(1) విరాధుడు :—

"గంభీరాక్షం మహావక్త్రం వికటం విషమోదరం ।
బీభత్సం విషమం దీర్ఘం వికృతం ఘోర దర్శనం ॥
వసానం చర్మ వైయాఘ్రం వసార్ద్రం రుధిరోక్షితం ।
త్రాసనం సర్వ భూతానాం వ్యాదితాస్య మివాంతకం ॥
త్రీన్‌సింహాంశ్చతురో వ్యాఘ్రాన్ ద్వౌవృకౌ పృషతాన్ దశ ।
సవిషాణం వసాదిగ్ధం గజస్యచ శిరోమహత్ ॥
అవసజ్యాఽఽయసే శూలే వినదంతం మహాస్వనం ।"2

అని మూలమునందు విరాధ వర్ణనము జుగుప్సాకరముగా నున్నది. కాని రంగనాథ రామాయణము నందు—

——"ఉరు పర్వతాకారు డుగ్రలోచనుడు
ఘన వక్త్రనాసుండు కఠిన విగ్రహుడు - ఘనుడు విరాధుడన్ గడిది రాక్షసుడు"

(ఆరణ్య. ద్వి. 36-37)

అని మాత్రము వ్రాయఁబడుట చేత జుగుప్స సరిగ పోషింపబడనందున, మూలము నందు వలె నిట బీభత్స రసము చక్కగా నావిష్కరింపబడుచు లేదు.

(2) అయోముఖి :—

క్రౌంచారణ్యమును ప్రవేశించిన రామలక్ష్మణులు—

"నెఱసిన కుఱులును నిడుద కోఱలు - బఱపైన కడుపును బడబాకి నోరు
మిడి గ్రుడ్ల కన్నులు మీఁగాళ్ళ దాక - విడఁబడ్డ చన్నులు వెట్టి చిన్నెలును
కుదియ గట్టిన మెడ గొప్ప పిక్కలును - మొదలంటఁ బలసిన మొద్దు పెందొడలు"

(ఆరణ్య. ద్వి. 1390-1392)

గలిగిన యయోముఖి యను దైత్య వనితను గాంచిరి.

---

1. విద్యానాథుడు. ప్రతాప రుద్రీయము. రస ప్రకరణము. పుట. 196.
2. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. ఆరణ్యకాండము సర్గ. 2. శ్లో. 5, 6, 7 1/2.
3. రంగనాథ రామాయణము. ఆరణ్యకాండము- ద్వి. 36-37

ఈ పై వర్ణనము మూలమును మించి జుగుప్సాతిశయమును గలిగించుచున్నది.

(3) కబంధుడు :—

అయోముఖి పారిపోయిన తర్వాత, రామలక్ష్మణులు—

"యోజనాయత బాహులొగిఁ బారసాచి - యే జంతువులనైన నేపుమై నొడిసి
యటి ముటి మ్రింగుచు నావలించుచును - జుఱువుచ్చి మస్తక శూన్యుడై నిలిచి
యుదరంబు నోరుగా నున్న కబంధుని (ఆరణ్య - ద్వి - 1398-1400)

గాంచిరి. ఈ కబంధ రూప వర్ణనము

దదర్శ సుమహాకాయం రాక్షసం విపులోరసం ॥
వివృద్ధ మశిరోగ్రీవం కబంధ ముదరే ముఖం ॥

— — — —

ఆకర్షంతం వికర్షంతం అనేకాన్ మృగ యూధపాన్ ॥"[1]

అని మూలము నందున్నంత జుగుప్సావహముగా లేదు—

(4) యుద్ధ భూమి :—

శ్రీరాముడు గాంధర్వాశరముచే ఖరుని సేనలను చీకాకు గావించి, దండించి, ఖండించి తలలు త్తరించి చెండాడుచో, రణక్షితి యంతయు—

ఎందుఁజూచినఁ దురంగేభ ఖండమ్ము - లెందుఁ జూచిన నింగి కెగయు మొండెములు
నెందుఁ జూచినఁ బ్రేవు లెఱచియు మెదడు - నెందుఁ జూచిన నెత్తురుటేర్లు నైయుండెను-"
(ఆరణ్య - ద్వి - 566-567)

ఇట్లే ఆయా సందర్భము లందలి యుద్ధ భూమి వర్ణనము బీభత్స రస స్ఫూర్తిని కలిగించుచున్నది. మొత్తముపై బుద్ధారెడ్డి బీభత్స రసము నంతగాఁదన గ్రంథమునఁ బోషించ లేదన వచ్చును.

8. అద్భుత రసము :—

"అపూర్వములైన (అసాధారణములైన) వస్తువుల దర్శనముచే- వర్ణనముచే కలుగు ఆశ్చర్యము విస్మయము"[2] విస్మయము అద్భుత రసమునకు స్థాయి భావము. విచిత్రములు, లోకాతీతములు నగు వస్తువులను జూచుట వలన నద్భుత రసము జనించును —

ఇంద్రజిద్రావణాది యుద్ధములు ముఖ్యముగా నిందుకు నిదర్శనములు.

(i) జలచరములు పర్వతములను మ్రింగుట.

వానరులు సేతు నిర్మాణమునకుఁ బూని పర్వతములు దెచ్చి, సముద్రమునఁ బడవేయగా, నవి నీటిపై నొకటియు నుండక మునుగుచుండెను. వానరులు వెఱగంది వచ్చి రామునితోఁ జెప్పగా నతడును విస్మయమంది సముద్రు నడిగెను. అంత సముద్రుడు =

"పరమేశ వినుము లోపలి కవ్విపోవఁ - బోరి పోరి జలచరంబులు మ్రింగువాని
నమరంగ శతయోజ నాయత మగుచుఁ - దిమియను మత్స్యంబు దిరుగు నాయందు

---

1. దా. ప్రతి వాల్మీకి రామాయణము. ఆరణ్య. సర్గ. 69. శ్లో. 26-33.
2. విద్యానాథుడు. ప్రతాపరుద్రీయము. రసప్రకరణము.

మ్రింగు నామీను దిమింగిలం బొకటి - మ్రింగు నామత్స్యమ్ము మిగులఁ దద్గిలము
నిటువలె నొండొంటి నెఱగొనుచుండుఁ - జటుల సత్త్వంబులసంఖ్యముల్ దేవ"

(యుద్ధ - ద్వి - 970-973)

అని చెప్పెను- ఈ భావమమూలకము.

అమరకోశ గురుబాల ప్రబోధికలో-

"తిమింగిల గిలోఽప్యస్తి తద్గిలోప్యస్తి రాఘవ" అని రామాయణోక్త శ్లోకార్థము. "తిమింగిలాదయః"లోని ఆది శబ్దము చేత తిమింగిల గిలాదులును గ్రహింపబడుచున్నవి."[1] అనుటను సమర్థించుటకు గ్రహింపఁబడినది. ప్రస్తుత మిది త్రివిధ రామాయణ పాఠములందును లేదు-)

చిన్న చేప పెద్ద చేపను మ్రింగుట యెఱుంగుదుము కాని, పర్వతములను మ్రింగు చేపలుండు నసుట అపూర్వము, అసాధారణము. విచిత్రమైన లోకాతీతమైన ఈ విషయము విస్మయమును కలిగించుచు అద్భుతమావిర్భవింపఁ జేయుచున్నది.

(2) ఛత్ర చామర చ్ఛేదనము :—

దశకంఠుడు చక్కగా నలంకృతుడై, ఎనుబది వేల ధవళాత పత్రములను దనుజులు పట్టగా, సకియలు అన్ని వేల వ్యజనములు పూనగా, అదే సంఖ్య గల చామరములను కాంతలిర్వంకల బట్టి వీవగా, మంత్రి సామంతాదులతో నుత్తర గోపురంబున మహావైభవముతోఁ గొల్వుతీరి యుండెను. ఆగొడుగుల నీడ యాదిత్యుని గప్పగా చీకటి విలసిల్లెను. ఆ సమయమున, సుగ్రీవుని తొడలపై తలమోపి పరుండియున్న శ్రీరాముడు తమ్ముని చేతివిల్లుసు డాచేత నందికొని, దక్షిణాంఘ్రి యంగుష్ఠాన వింటి గొనయంబుఁ బూని, ఎక్కుపెట్టి, అర్ధచంద్ర బాణమును సంధించి, తిగిచి, పవళించిన యట్లనేయుండి చామర, వ్యజనాతపత్ర సమూహముల మీద విడిచెను,
అప్పుడద్భుత వృత్తి మెఱయగా,

"శరమొక్కటియుఁ బది శరములై నూఱు - శరములై పదివేల శరములై మఱియు
లక్షయై కోటియై లక్షించి చూడ - నాక్షణంబున సంఖ్యలన్నియుఁ గడచి
తాల వృంతములు దాల్చు చేడియల - మేలి చామరములు మెఱయించు సతుల
....
ధవళాత పత్రముల్ ధరియించు దైత్య - నివహంబులను, గొల్చి నిల్చిన భటులఁ
గరములు ద్రుంచక, శళములు ద్రెంచ - కురములు నాటక యురుకిరీటములు
ధరడొల్లఁ జేయక తలలు ఖండింప - కరు దరు దిది యని యమరులు వొగడ
నాలవట్టంబులు నాత పత్రములు - చాల శోభిల్లు వింజామరంబులును
కత్తించుకొని పోయెఁ గంఠ సూత్రముల"

(యుద్ధ. ద్వి, 2177, 2184,)

---

1. అమరకోశము. గురు బాల ప్రబోధిక- ప్రథమకాండము. వారి వర్గము. శ్లో. 20.

అవిదివి యందు, దిక్కులందు, లవణాబ్ధిపై, కొలువులో అంతట లఘులీలఁ బడియెను. ఛత్రచామర తాలవృంత రహిత దండములను ధరించిన యసురుల నడుమ నున్న రావణుడు యమ దూతల నడుమ నున్నట్లొప్పెను.

ఇచ్చట రాముని బాణ ప్రయోగ కౌశలము, అదిచేసిన చిత్రకార్యము అద్భుతమున కాలవాలమై యొప్పుచున్నది —

(3) సులోచన పతి శిరమును మాట్లాడించుట :-

ఇంద్రజిత్తు మరణానంతరము, సహగమనము చేయగోరిన అతని భార్య సులోచన పతి కళేబరమునకై రాముని సమీపించి ప్రార్థించెను. సుగ్రీవుడు సులోచనతో

"....పతివ్రత వౌదువేని - నీదుపురుషునితో నీ చందమెల్ల

తగఁబల్కు మిప్పుడ తడయక" (యుద్ధ. ద్వి. 5929-5930)

యని యెగతాళి చేసినట్లు పలికెను. సులోచన ప్రాణేశు మీదబడి పలువిధంబులుగా నేడ్చి, చివరకు ధైర్యంబు వహించి,

......"వలనొప్ప నామనో వాక్కాయ కర్మ

ములయందుఁ బతిభక్తి మొనసితి నేని-సలలిత ధర్మ సంచారంబునందు

పతియె దైవంబని భావంబులోన - సతతంబు వ్రతముగా సలుపుదునేని

చెలగి నావిభునకు జీవంబు వచ్చి - యలమి నాతోమాటలాడు గాక

(యుద్ధ. ద్వి 5935-5938)

యని పలుకగా, ఇంద్రజిత్తు కనువిచ్చి మాటలాడెను. చచ్చిన వానితో మాటలాడుట అపూర్వము ఆశ్చర్యము—

ఇట్లే సీతా పాతివ్రత్యమహిమచే మారుతి తోకనిప్పు చల్లదనము నొందుట, అగ్నిలో పరీక్షార్థమై ప్రవేశించిన సీతాదేవి అవంతయు గందక వెలికి వచ్చుట; నూఱు యోజనముల వెడల్పుగా తెఱచిన సురస నోటిలో ఆంజనేయు డంగుష్ఠ మాత్రుడై చొచ్చి వెడలుట, సంజీవనీ పర్వతానయనము, రావణుని కరశిరములు ఖండితములై మరల మొలచుట. ఇత్యాదులు విస్మయమునకు తావలములై అద్భుత రసము నావిర్భవింపఁజేయుచున్నవి—

(9) శాంత రసము

"వైరాగ్యము, భక్తి, సత్సంగము మున్నగు వానిచే జనించు నిర్వికార చిత్తవృత్తి శమము[1]"

ఈ శమము శాంత రసమునకు స్థాయి భావము.

శబరి చరిత్రాదులు శాంతరసమున కుదాహరణములు.

(1) శబరి :—

కబంధుని మాట చొప్పున రామలక్ష్మణులు పుణ్యముల కాట పట్టైన శబరి యాశ్రమమునకు వచ్చిరి శబరి

"ఎదురుగా వచ్చి యయ్యింతి సద్భక్తిఁ-బదముల కటు సాగఁబడి మ్రొక్కి లేచి

---

1. విద్యానాథుడు. ప్రతాపరుద్రీయము. రసప్రకరణము. పుట. 197.

... ... వనమూల ఫలములు వలనొప్పఁ దెచ్చి"

(ఆరణ్యా - ద్వి - 1441-1455)

యిచ్చి అతిథి మర్యాద జేసెను ఆ తర్వాత సుగ్రీవుని వృత్తాంతమును దెలిపి, "తన గురు వాక్యమును దలంచి, యాక్షణమె అగ్నిని దరికొల్పి, రాముని తనమది నిల్పి, ప్రదక్షిణించి, వినుతించి, ఆతని సన్నిధి రామార్పణముగా తన శరీరమును అనలునియందు వేల్చెను."

ఇది శబరి వైరాగ్యము, భక్తి, గుర్వనుగ్రహము, నిర్వికార చిత్తత, మున్నగువానిని స్ఫురింపఁజేయుచు శాంత రస స్ఫూర్తిని గలిగించుచున్నది.

(2) శరభంగ మహర్షి :—

ఇతడు మహా తపస్వి- దేవేంద్రు డతనిని స్వయముగా బ్రహ్మలోకమునకు గొనిపోవుటకై విమానముతో దివి నుండి భువికి వచ్చెను. కాని, శ్రీరాముని పూజించనిది రానని అతడు దేవేంద్రుని మరల గొట్టెను. ఇది అతని దృఢ నిశ్చయమును నిర్వికార చిత్తమును నిరూపించుచున్నది.

ఇతడు శ్రీరాముని కాతిథ్య మొసగి—

"ధరణీశ ! నీ ప్రసాదంబునఁ దపము - నరుదార నొక విఘ్నమైనను లేక

సలిపితి, నిష్ఠలు సఫలంబులయ్యె - నెలకొని శ్రీరామ నినుజూడఁ గంటి

— — — —

పని వినియెద నింక బ్రహ్మలోకమున - కని చెప్పి రాము సమక్షంబు నంద

ననల ముఖంబున నమ్మునీశ్వరుడు-తనమేను మంత్ర పూతము సేసి వేల్చి"

(ఆరణ్యా - ద్వి - 92-96)

ఇంద్రాదులు గొలువగా, బ్రహ్మలోకమున కేగెను.

ఈ శరభంగుని చరిత్ర- వైరాగ్యము. శరీరమంచలి నిరీహ, ఎవదిగి యొసంగ వచ్చినను వానిని గ్రహింపక భగవద్దర్శనమునే కాంక్షించుట, అది కలిగిన తోడనే జీవిత పరమ లక్ష్యము సిద్ధించుటచే, నిక కోరదగినది లేనంచున దేహమును వీడుట యనెడి శాంతాత్ముల జీవిత విధానమును ప్రకటించుచున్నది. శమము మోక్షము ఫలముగా గలది గదా !

ఈ రీతి రంగనాథ రామాయణము నందు మూల విరోధము కాకుండునట్లు నన్నిరసములు చక్కగా పోషింపబడినవి :—

—: అలంకారములు :—

కావ్యాంగములలో నలంకారముల కతి ప్రాధాన్యమున్నది "కావ్యముపాదేయ మగుటకు అలంకార మావశ్యకమనియు"[1] "సౌందర్య మలంకార మనియు"[2] వామనాచార్యులు చెప్పియున్నారు. "కావ్యమునకు సౌందర్యమును గలిగించునవి అలంకారములని"[3] దండ్యాచార్యుని భాషణము. కాని

1. వామనుడు. కావ్యాలంకార సూత్ర వృత్తి. అధికరణ. 1. అధ్యా. 1. సూ. 1
2. ,, ibib ,, ,, అధికరణము. 1. అధ్యాయ. 1. సూత్ర. 2
3. దండి. కావ్యాదర్శము. అధ్యాయ. 2. శ్లో. 1.

"కావ్యమునకు సొగసును గలిగించు ధర్మములు గుణము"[1] లనియు, "దాని గొప్పదనమునకు హేతువులు అలంకారములనియు"[2] వామనుడు అలంకార తత్త్వమును నిరూపించియున్నాడు.

'అలం' అనుశబ్దమునకు 'కృ'ధాతువు చేరగా, అలంకారమను పదమేర్పడుచున్నది. "కావ్యము నిది యలంకరించును" ("అలంకరోతీత్యలంకారః") అని కాని "కావ్యము దీనిచే నలంకరింపబడును" "అలంక్రియతే అనేనేత్యలంకారః" అని కాని అలంకార శబ్దమునకు వ్యుత్పత్తిని చెప్పుదురు. 'అలం', అన్నను 'అలంకార' మన్నను భూషణము (నగ) అని యర్థము. ఆకాశమునకు చుక్కలు, తీగకు పువ్వులు, శరీరమున కాభరణములు అంకారమైనట్లు కావ్యసుందరి కలంకారము అలంకారములు. నిత్యజీవితమునందు మనము తెలియకుండగనే పెక్కు అలంకారములను వాడుచున్నాము. "వాడు వట్టిమొద్దు" "తల్లి దయ్యము" "పెండ్లాము బెల్లము.", "అదిసుప్పనాతి" "నీవంటివారు లేరు." "అతడొక బండ" మొదలగునవి. సంఘమునందుండి ప్రకృతి సౌందర్యమును దర్శించిన కవికి తన్మథనమున అలంకారము లప్రయత్నముగానే వెలువడుచుండును. వానిని అవసరమైన చోట్ల కావ్యమునందు అతడు నిబద్ధించుచుండును. తదాధారమున పండితులు భావించి, భావించి, కృత్రిమములైన అలంకారములు కల్పించుచుందురు.

కరచరణాదులు దేహమున కంగమైనట్లు, శబ్దార్థములు కావ్యమున కంగములు కరచరణాదుల కలంకరింపబడన కంకణ నూపురాద్యాభరణములు అంగియైన శరీరము నలంకరించునట్లు, శబ్దార్థముల నాశ్రయించియుండు నలంకారములు కావ్యము నలంకరించును. కావ్యము నిరలంకారముగా నుండవలెనని కొందరు ప్రబుద్ధులు వాదింతురు; కాని; యదియంత గ్రాహ్యముకాదు.

"తతః కుముదషండాభో నిర్మలో నిర్మలం స్వయం।
ప్రజగామ నభశ్చంద్రో హంసో నీల మివోదకం॥"[1]

అనుశ్లోకమునందలి 'కుముదషండాభః' హంసోనీల మివోదకం", అను అలంకార భాగమును దొలగించినచో, సొగసే పోయినదని, అందమే చెడినదని విజ్ఞు లెరుంగక పోరు. కావ్యమునం దలంకారము లవశ్యోపాదేయములు; కాని, అవి అయత్నాగతములై అత్యంత సహజ మైనవిగా నుండవలెను; అలంకారార్థమే తెచ్చి పెట్టికొనినట్లు కృత్రిమములుగా, శవాలంకార ప్రాయములుగా (వికార జనకములుగా) నుండకూడదు. అలంకారములు. "రసపర్యవసాయులు గావలెను."[2]

2. "రసాదిరూప వ్యంగ్యశోభా సంపాదకములై యుండవలెను" "ఉపమాద్యలంకారములు లేని సరస్వతి (కావ్యము) విధవ (మంగళసూత్రములేని మగువ) వంటిది."[4] అనెడి అగ్నిపురాణ వచనము అలంకార విశిష్టతను చాటుచున్నది.

---

1. వామనుడు. కావ్యాలంకార సూత్ర వృత్తి. అధికరణ 3. అధ్యా 1
2. ,, Ibid ,, అధికరణము 3. అధ్యాయ. 1. సూ. 2
3. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. సుందరకాండము. సర్గ. 17 శ్లో. 1.
4. అభినవగుప్తుడు. లోచనము. ఉద్ద్యోతము. 2. శ్లో. 18, 19ల వ్యాఖ్యానము.
5. జగన్నాథ పండితరాయలు. రసగంగాధరము. ద్వితీయాననము. అలంకార నిరూపణము.
6. అగ్నిపురాణము. అధ్యాయము, 344. శ్లో. 2.

ఆనంద వర్ధనాచార్యులు అలంకార ప్రయోగమునందు కవి పాటించు నియమముల నిట్లు ప్రస్తావించి యున్నాడు.

"1. అలంకారములను రసమున కంగముగాఁ గూర్పవలెను.

2 అవసరమున్న వానినే స్వీకరింపవలెను.

3. సమయానుకూలముగా వానిని త్యజించుచుండవలెను.

4. అతి నిర్వహణేచ్ఛ లేకుండవలెను.

5. అయత్నసిద్ధములైనను అంగముగా నుండునట్లు సమీక్షింపవలెను."[1]

"భగవదుచ్ఛ్వాస నిశ్వాస రూపములైన వేదములందే"[2] అలంకార ప్రయోగము ప్రాథమిక దశయందుండినది. ఆవేదము రామాయణ రూపమున నవతరించగా, ఆ లంకార ప్రయోగమును చిగురుతియై భాషాకావ్యములందు విస్తరిల్లినది.

అలంకారములు రెండువిధములు.

1. శబ్దాలంకారములు. 2. అర్థాలంకారములు.

1. వృత్త్యను ప్రాసాదులు. శబ్దాలంకారములు 2. ఉపమా రూపకాదులు అర్థాలంకారములు.

గోనబుద్ధారెడ్డి తన ద్విపద రామాయణమునందు ఈ ద్వివిధాలంకారములకు సముచితమైన ప్రాధాన్యము నొసంగినాడు. ఇతడు-

"పదము లర్థంబులు భావముల్ గతులు - పదశయ్య లర్థ సౌభాగ్యముల్ యతులు
రసములు కల్పనల్ ప్రాస సంగతులు - నసమాన రీతులు నన్నియుఁ గలుగ"

(బాల. ద్వి. 100-101)

అని అవతారికా ద్విపద పంక్తులందు "అలంకారముల ఊసెత్తుక పోయినను ప్రతికాండాంతమునందు—

"పరగ నలంకార భావనల్ నిండ - కరమర్థి (నీబాల) కాండంబుఁ జెప్పె"

(బాల - ద్వి - 2475)

నని వ్రాసి యుండుటచే అలంకారములఁగూర్చి అమిత శ్రద్ధను వహించినాడనియు, ఈ శ్రద్ధ శబ్దార్థోభయ విధాలంకార రచనములందు సమానముగా నున్నదనియు గ్రంథ పరిశీలనము వలన విశదమగును

వాల్మీకి రామాయణముతో రంగనాథ రామాయణము నందలి అర్థాలంకారములను పోల్చగా, వాని నీ క్రింది విధమున వింగడించ వచ్చునని తోచుచున్నది.

1. యథా మూలములు. 2. వి స్పష్టీకరణములు. 3. మూల భిన్నములు. (అన్యథాకరణములు)
4. అమూలకములు. (స్వయం కల్పితములు) 5. పరిత్యక్తములు.

---

2. డా. జి వి. సుబ్రహ్మణ్యం. ప్రథమాంధ్ర మహాపురాణపుము పుట 85లో అనూదిత వాక్యములు.

3. "యస్య నిశ్వసితం వేదాః" వృక్ష ఇవ స్తబ్ధో దివి తిష్ఠతి ।

ప్రధానముగా ఉపమా, రూపకాలంకారములందు ఈ పంచ విధ భేదములను గుర్తించనగును.

ఉపమాలంకారము :—

అర్థాలంకారములలో ప్రథమమైనది, ప్రధానమైనది ఉపమాలంకారము. సర్వాలంకారముల కిది బీజ భూతము. వామనాచార్యుడు —

"సంప్రత్యర్థాలంకారాణాం ప్రస్తావః । తన్మూలం చోపమేతి సైవ విచార్యతే[1]

అని నుడివి యున్నాడు. కవులలో నుపమ నుపయోగింపని వాడు లేడు. ఉపమాలంకార ప్రయోగము నందు కాళిదాసు సిద్ధహస్తుడు.[2] "ప్రకృతిని పరిశీలించిన కవి ఈ ఉపమాలంకారమును సామర్థ్యముతో నిర్వహించును. వర్ణ్య వస్తు స్వరూప స్వభావ నిరూపణ సమర్థమును, రమణీయోదాత్తమును నైన యుపమాన ద్రవ్యము నెన్నుకొనుటలోను, దాని నౌచిత్య భరితమైన వాగ్వృత్తిచే నావిష్కరించుటలోను కవి యొక్క ఉపమాలంకార కౌశలము వ్యక్తమగుచుండును. సామాన్యముగా నిట్టి నైపుణ్యము రసవత్కవితాత్మగల కవికి గాని యబ్బదు."[3] అని చెప్పిన డా. జి. వి. సుబ్రహ్మణ్యం గారి మాటలు అక్షరశః సత్యములు.

"ఉపమ ఒక నటి- అది చిత్ర విచిత్రములైన వేష భేదములను ధరించి కావ్య రంగమున నాట్యము చేయుచు రసజ్ఞుల చిత్తమును రంజింపజేయును."[4] అని అప్పయ్య దీక్షితుల వారు ఉపమా స్వరూప స్వభావములను స్పష్టము చేసి యున్నారు.

రంగనాథ రామాయణము నందలి యుపమాలంకారములు సందర్భ శుద్ధి కలిగి, వస్తు స్వరూప స్వభావ నిరూపకములై రసికజన హృదయావర్జకములై ఔచితీ శోభితములై యొప్పుచున్నవి. ఉదాహరణార్థము కొన్నింటి నిట పరిశీలింతును—

1) యథా మూలములు ;—

(a) విశ్వామిత్రుడు యజ్ఞ రక్షణార్థము రాముని గొని పోవు నిమిత్తము దశరథ చక్రవర్తి యొద్దకు రాగా, నా మహారాజు ముని కెదురుగాఁబోయి స్వాగతము చెప్పెను.

మూలమునం దిచ్చటనున్న-

"ప్రత్యుజ్జగామ తంహృష్టో బ్రహ్మాణ మివ వాసవః"[5] అను అలంకారము

"పరమేష్ఠి కెదురేగు పాకశాసనుని కరణి నెదుర్కొని" (బాల - ద్వి - 609)

అని యథా తథముగా ననువదింపబడినది.

అమిత తపోనిధియు. సృష్టికి ప్రతి సృష్టి యొనర్చిన వాడును, త్రిశంకు మహారాజు కాలము నుండియు నున్న వృద్ధుడును నగు విశ్వామిత్ర మునీంద్రుని సృష్టికర్తయు, పితామహుడునునైన

---

1. వామనుడు. కావ్యాలంకార సూత్రవృత్తి. అధికరణము- 4. అధ్యా- 2. సూత్ర-1 అవతారిక
2. "ఉపమా కాళిదాసస్య." ఆభాణక శ్లోకము.
3. డా. జి. వి. సుబ్రహ్మణ్యం. ప్రథమాంధ్ర మహాపురాణము. పుట. 356.
4. అప్పయ్య దీక్షితులు. చిత్రమీమాంస- పుట. 5.
   "ఉపమైకా శైలుషీ"......"తద్విదాం చేతః" ॥
5. దా. ప్రతి. వాల్మీకి రామాయణము- బాలకాండము- సర్గ. 18. శ్లో. 42.

బ్రహ్మతోడను, త్రిలోకాధిపతియైన ఇంద్రునితో మైత్రి గలిగిన నరేంద్రుడగు దశరథుని ఇంద్రుని తోడను బోల్చుట ఎంతయో సముచితము. పితామహాగమనము ఇంద్రునికే శ్రేయస్సు గలిగించునట్లు, విశ్వామిత్రుని రాక దశరథునికి శ్రేయస్సు కలిగించునని సూచితము. భూత భావ్యర్థ సూచకమైన యీ యుపమాన మిచ్చుట నెంతయో సొగసును కలిగింపఁజేయుచున్నది—

(b) కైకేయి మందిరమున నున్న దశరథు నాజ్ఞపై సుమంత్రుడు శ్రీరాముని పిలిచికొని వచ్చుటకై అతని సౌధమునకు వచ్చి శ్రీరాముని దర్శించెను. అప్పుడు రఘు రాముడు—

స్థితయా పార్శ్వతశ్చాపి వాలవ్యజన హస్తయా।
ఉపేతం సీతయా భూయ శ్చిత్రయా శశినం యథా ॥1

అను రీతి విరాజిల్లుచుండెను. ఇచ్చటి యలంకారము-

చిత్రాఖ్య తారతో సిరులుల్ల సిల్ల - మైత్రి యొప్పెడు చందమామ చందమున
సీతా సమేతుడై చెలువొందు రామ - భూతల నాథునిఁ బొడగాంచి మ్రొక్కి"
(అయోధ్యా - ద్వి - 370-371)

ౘని సరిగా అనూదితమైనది. 'వాలవ్యజన హస్తయా' అనుమూలము నందలి విశేషణము విడువఁబడినది: కాని అలంకారమునందు మార్పులేదు.

పౌర్ణమినాడు చంద్రుడు ఏ నక్షత్రము నొద్ద నుండునో, తన్నక్షత్రము ననుసరించి యా మాసమునకు ఆపేరువచ్చినది. చైత్రమాస పౌర్ణమినాడు శశాంకుడు చిత్రానక్షత్ర సమీపగతుడై ఇతర మాసము లందుకంటె నధిక ప్రకాశవంతుడై, జనరంజకుడై యుండును. శ్రీరామ పట్టాభిషేకమునకు దశరథుడు నిర్ణయించిన మాసముచైత్రమాసము. ఆతడవతరించిన మాసమును చైత్రమాసమే. ఆనెల యందలి శుక్లపక్షమీ రాత్రులు అత్యంత మనోహరములై, సకల జనావళికి ఆహ్లాదకరములై యొప్పును. పట్టాభిషిక్తుడై జనరంజకుడు కాబోవుచున్న సీతాసమేతుడైన రామచంద్రుని చిత్రానక్షత్రయుక్త చంద్రునితోఁ బోల్చుట అత్యంత సముచితము సరసముకూడ. చంద్రుడు చల్లని వెన్నెలద్వారా జగదాహ్లాదము కూర్చునట్లు, రామచంద్రుడును చల్లని చూపుద్వారా దానిని సమకూర్చునని ధ్వని.

భౌతిక నేత్రములకు గోచరముకాని సీతారాముల స్వరూపవిశేషమును తత్ప్రతిబింబమనఁదగిన చిత్రాచంద్రుల దర్శనమున మనోనేత్రమునకు గోచరింపఁజేయుట కవి ప్రయోగించిన అలంకార ప్రయోజనము.

(c) శ్రీరామ లక్ష్మణులు విరాధుని బాహువులు ఖండింప, నతడు నేలఁగూలి యసువులఁ బాసెను.

ఇచ్చట మూలమునందున్న—

"స భగ్న బాహుస్సంవిగ్నో నిపపాతాऽశు రాక్షసః।
ధరణ్యాం మేఘసంకాశో వజ్రభిన్న ఇవాऽచలః॥"2

అనునది

"..........వాని బాహువులు రెండుదునుమ

---

1. దా. ప్రతి వాల్మీకి రామాయణము. అయోధ్యా. సర్గ. 16. శ్లో. 10.
2. దా-ప్రతి-వాల్మీకి రామాయణము. అరణ్యకాండము. సర్గ. 4. శ్లో. 6.

గిరి వజ్రమునఁ గూర్రియ దిక్కులెల్ల దువ - నురవడి నొరలుచు నుర్విపైఁగూలి"

(అరణ్య. ద్వి 63, 64)

అని తెనిగింపఁ బడినది. ఈ ద్విపదలయందు "మేఘసంకాశః" అనెడి రాక్షసునికైన విశేషణము లేదు. కాని అలంకారము యథా తథముగానే గ్రహింపబడినది.

పూర్వకాలమున పర్వతములకు ఱెక్కలుండెడివి వాని నిందుడు వజ్రములచే ఖండించగా, నాగిరులు నేలఁగూలిపడియున్నవి. ఈ వృత్తాంతము పౌరాణికము. ఇది రామాయణమునందు హనుమన్మైనాక సంభాషణ సందర్భమున వర్ణింపబడినది

వ్యక్తిమకి బాహువులు ఱెక్కల వంటివి. బాహువులు దునుమగా నేలఁగూలిన రాక్షసుని, వజ్రఘాతమున నేలఁగూలిన పర్వతముతోఁ బోల్చుట ఔచిత్యశోభితము. బృహదాకారము గల పర్వతము శక్తివంతమైన చిన్నవజ్రమునకు లోకువయైనపుడు. సర్వశక్తివంతులైన శ్రీరామ లక్ష్మణులకు రక్కసులు లోకువయనుట ప్రత్యేకముగాఁ జెప్పవలెనా! అను వ్యంగ్యార్థమును. పురాణకథయు పై అలంకారమున సూచితమై సందర్భశుద్ధి కలిగి యొప్పుచున్నది.

(2) విస్తృతీకరణములు:—

విషయ విశదీకరణమునకై గుప్తముగా నున్నవానిని వెలిపఱచుట, ఉన్నదానికి ఒకటి రెండు క్రొత్తవి చేర్చుట కొన్ని పట్టుల కనబడుచున్నది. విషయ విస్తరద్దోశముతో కూర్చబడినందున విస్తృతీకరణములయినవి—

(a) సుగ్రీవుడు శ్రీరామునకు వాలి సామర్థ్యమును జెప్పుచోట.

"అగ్రాణ్యారుహ్య శైలానాం శిఖరాణి మహాంత్యపి।
ఊర్ధ్వ ముత్క్షిప్య తరసా ప్రతిగృహ్ణాతి వీర్యవాన్॥[1]

అని మూలమునందు నిరలంకార శ్లోకము గలదు.

"శిఖరముల నెగుర వేసి పట్టుకొనుట" కేదియు నుపమానము చెప్పబడలేదు. కొందరు వ్యాఖ్యాతలు "కందుకానీవేతి భావః"[2] అని గుప్తవిషయమును (అధ్యాహారముచే) వెలిఁ బరచియున్నారు.

బుద్ధారెడ్డియు దీనిని గ్రహించినవాడె. కావున నీవిషయమును గుప్తముగా నుంచుట కంటె వాచ్యము చేసిన "భావస్పష్టత యగుటయే కాక రచనకు సొగసు వచ్చును" అని తలంచి,

"......... అలవొప్ప మీటు — క్షితి ధరంబులు పుట్టి చెండుల మాడ్కి"

(కిష్కింధా-ద్వి-36)

అని అలంకార యుక్తముగా రచించినాడు.

"పుట్టచెండులు = ఎగురగొట్టి యాడెడి వస్త్రపుబంతులు"[3] అనియర్థము. వస్త్రపు బంతుల ననాయాసముగా మీది కెగురవేసి మరలచేత గ్రహించుట జనవిదితము. కాని పర్వత శిఖరములను పెల్లగించి

1. దా-ప్రతి-వాల్మీకి రామాయణము. కిష్కింధాకాండము. సర్గ. 11. శ్లో. 5.
2. గోవింద రాజీయము. కిష్కింధా సర్గ. 11. శ్లో. 5 (వ్యాఖ్యానము.)
3. శబ్దార్థ చంద్రిక. పుట 874.

బంతుల వలె నెగురవేసి పట్టుకొనెడి వాడెంతటి బలాఢ్యుడో, ఊహకందని విషయము. కావున రచయిత అధ్యాహారముగా నున్న యీ యుపమానమును వాచ్యముఁజేసి, వాలియొక్క అసాధారణ బలమును పామరులకు గూడ దృష్టి గోచర మొనరించినాడు.

(b) కౌసల్యామాత శ్రీరాముని గన్నది· ఇచ్చట మూలమునందు—

కౌసల్యా శుశుభే తేన పుత్రేణామిత తేజసా।
యథా వరేణ దేవానా మదితిర్వజ్ర పాణినా॥"1

అని కలదు. రంగనాథ రామాయణమునందు - ఇదేభావము

"..... కాకుత్సకులు రాముఁగనియెఁ గౌసల్య
అదితి ఇంద్రుని గన్న యనువునఁ దూర్పు - సుదతి చంద్రుని గన్న చొప్పున, నంత"

(బాల. ద్వి. 557, 558)

నని మరొక ఉపమానమును జేర్చి విశదీకరించబడినది. విషయ స్పష్టీకరణమునకై "తూర్పుసుదతి చంద్రుని గన్న చొప్పున" అనునది క్రొత్తగాఁ జేర్చబడిన అమూలకాలంకారము.

ఇంద్రుడు వజ్రహస్తుడై జనింపలేదు. పుట్టిన తర్వాత అతనికి వజ్రమాయుధ మైనది. కావున మూలమునందలి "వజ్రపాణినా" అనెడి ఇంద్రునికైన విశేషణము పరిత్యజింపబడినది.

కౌసల్య రాముని గనుటయు, అదితి ఇంద్రుని గనుటయు మనకపరిచితములు: ఇతిహాసపురాణ-గతములు; కావున రాముని గన్న కౌసల్య స్థితిని (సంతోషమును) అవగాహన చేయుటకై యిచ్చిన మూలమునందలి ఉపమానము "ఇంద్రుని గన్నయదితి" యనునది పాఠకులకు నంత ప్రయోజన కారి కాదు. అతడా యుపమానమువలన కౌసల్యాముఖ వికాసమును దర్శించలేడు. కావున బుద్ధారెడ్డి దీనికి తోడుగా "తూర్పుసుదతి చంద్రుని గన్న చొప్పున" అని మరియొక యుపమానమును జతపరి-చినాడు. దిక్చబ్దము స్త్రీవాచకము. చంద్రుడు తూర్పునఁ బొడమినపుడు తద్దిశాభాగము కాంతిమంతమై యుండుట నిత్యానుభూతసత్యము- లోకమున స్త్రీలు కుమారుని గనినపుడు సంతసింతురు. అప్పుడు గలిగిన వారి ముఖవికాసము ఆనందమునకు చిహ్నము. బుద్ధారెడ్డి ఈ ప్రకృతి జీవుల సత్యమును మేళగించి, రెండవ ఉపమానము మొదటి ఉపమానమునకుఁ దోడుగా। జేసి కౌసల్యా సంతోష ముఖ వికాసములను మనోనేత్రమునకు గోచరింపఁ జేసినాడు.

(3) మూలభిన్నములు :—

మూలమునందలి యుపమానము సామాన్య నిత్య జీవితమునకు సంబంధించినది కానప్పుడు విషయగ్రహణమునందాలస్యమును, రచనయం దరమ్యతయు నేర్పడును. ప్రతిభావంతుడైన కవి అట్టి చోటుల వానిని కొలదిగా మార్చుటయో, లేక పూర్తిగాఁ దొలగించి, తాత్స్థానమునందు క్రొత్త క్రొత్త వానిని చేర్చుటయో జరుగుచుండును. అవి మూలమునకు మార్పులగును.

(అ) శ్రీ రామునితో రణమొనర్పగ, ఖరదూషణులతోఁగూడ త్రిశిరసుడు వచ్చెను. త్రి శిరసుడు మూడు శిరస్సులు గలవాడగుట సార్థక నాముడు మూలమునందితడు.

"అభ్యద్రవద్రణే రామం త్రిశృంగ ఇవ పర్వతః"2

---

2. దా. ప్రతి. వాల్మీకి రామాయణము-బాలకాండము. సర. 18. శ్లో. 18.
1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. ఆరణ్యకాండము. సర్గ 27 శ్లో. 7.

అని మూడు శిఖరముల పర్వతముతోఁ బోల్చబడినాడు. యుద్ధములో శ్రీరామునిచే నామూడు తలలు ఖండింపఁబడగ, నతడు నేలగూలినాడు ఇచట "త్రిశృంగ ఇవ పర్వత" అని యుద్ధమునకు వచ్చెడి త్రిశిరసునికి వాడబడిన యుపమానము, తిరిగి నేలను గూలినపుడదే చెప్పిన పునరుక్తమగును. కావున మూలమున మరల ప్రయోగింపబడలేదు. కాని బుద్ధారెడ్డి ఈ యుపమానమును గ్రహించలేదు. అతడు యుద్ధములో నేలగూలునప్డు

"— — — త్రిశిరుండు దురమునఁ గూలె

మూడు కొమ్మలతోడ మొదలంటఁ ద్రెవ్వి-పోడిమి చెడికూలు భూజంబు కరణి"

(అరణ్య. ద్వి. 621)

అని కవి క్రొత్త ఉపమానమును గూర్చినాడు. ఇదిః త్రిశృంగ "ఇవ పర్వతః" అనుదానికి భిన్నమైన ఉపమానము. మూడు శిఖరములతోఁ గూడిన పర్వతము లోకమునందుండ వచ్చును. గాని ఆ శిఖరములు ఖండింపఁబడుట, తత్పర్వతము నేలఁబడుట అననుభూత విషయము. మూడు కొమ్మల తరువు ప్రకృతిలో నెచ్చట నైనను జూడవచ్చును, ఆ కొమ్మలను కొట్టి వేసి, మొదలంటఁ ద్రెవ్వగా, మొండెములతో నున్న యా వృక్షము నేలగూలునప్పుడు, తత్స్వరూప మెట్లుండునో త్వరగా గ్రహించవచ్చును. ఈ ఉపమానముతో త్రిశిరసుని పోల్చుటనే, అతని స్వరూపము దృష్టి గోచరమై రచనకు రమ్యత యేర్పడినది. ఈ మార్పు ఔచిత్యవంతమై కవియొక్క లోక పరిశీలనకు నిదర్శనమై యొప్పియున్నది.

(బి) శ్రీరాముని ఐంద్రాస్త్ర ముఖమున నాటగా, ఖరుడు నేలఁబడి చచ్చెను. ఇచట మూలమునందు నాలుగుపమానములు ప్రయుక్తములైనవి

"రుద్రేణేవ వినిర్దగ్ధః శ్వేతారణ్యే యథాంతకః
సవృత్ర ఇవ వజ్రేణ ఫేనేన నముచిర్యథా॥
బలోవేంద్రాశని హతో నిపపాత హతః ఖరః।"[1]

ఈ యుపమానములు పురాణ కథలకు సంబంధించినవి వీని ప్రయోగముచే తత్పూర్వవృత్తములను స్మృతికిఁ దెచ్చుట వాల్మీకి యుద్దేశము. నేటి నాగరికుడా పురాణ పఠన, శ్రవణమునందనాసక్తుడగుటచే, వానికీ యుపమానములు దృష్టి గోచరములు కావు అదిగాకను, రామాయణమును చదువువాడా పురాణములను చదివి యున్నవాడనుటకు వీలులేదు. అప్పుడతనికి ఈ కథలు క్రొత్తవగుటచే గ్రంథకర్త యుద్దేశించిన ప్రయోజనము వమ్మగును. కావున బుద్ధారెడ్డి పై వానిలోనే యొక్కదానిని గూడ గ్రహించక వదలి వేసి తత్స్థానమునందు.

"పిడుగడచిన కొండపృథివి పైఁ గూలు-వడువున ఖరుడంత వసుధపైఁ గూలె"

(అరణ్య. ద్వి. 663)

యని క్రొత్త యుపమానమును జొప్పించినాడు. ఒక్కొక్కప్పుడు కొండల మీద పిడుగులు పడుటయు. వానిచే నవి బద్దలై నేలగూలుటయు సంభావిత విషయములు. లోక సామాన్యమైన యీ యుపమానముచే కథాంశమునకు దీప్తి హెచ్చినది. వజ్రము (పిడుగు) ఇంద్రాయుధ మగుటచే,

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. సర్గ. 30 శ్లో. 27, 28.

శ్రీరాముని బింద్రాస్త్రము పిడుగుతోడను, బృహద్రూపముగల ఖరుడు కొండతోడను పోల్చబడుట సముచితమై యున్నది.

(సి) ఆంజనేయుడు సీతాదేవి ఆనవాలుగా నిచ్చిన చూడామణిని శ్రీరామున కొసంగెను. దానిని జూడగానే శ్రీరాముని మనసు కరిగెను అదియిట్లు పోల్చబడినది.

"యథైవ ధేను స్స్రవతి స్నేహాద్వత్సస్య వత్సలా।

తథా మమాపి హృదయం మణిరత్నస్య దర్శనాత్"॥

బుద్ధారెడ్డి మూలమునందలి ఈ యుపమానమును గ్రహించక,

"భానుజ నా ప్రాణపదమైన యట్టి-మానినీమణి శిరోమణి జూచినపుడె

నామది కరగుచున్నది లక్కవోలే"॥ (సుందర. ద్వి 1108)

అని తత్స్థానమున క్రొత్త యుపమానమును నిలిపినాడు.

"వత్సదర్శనమున ఆవు, మణి దర్శనమున శ్రీరాముని మది కరగినదనుట" మూలోపమానము) బాగుగానే యున్నది. కాని, బుద్ధారెడ్డి కిది ఔచిత్యవంతమైనదిగా తోచలేదు. మణిదర్శనము సీతాస్మరణమును కలిగించినది. ఇది మూలమునందే,

"అయంహి శోభతే తస్యాః ప్రియాయా మూర్ధ్ని మేమణిః।

అస్యాద్య దర్శనేనాహం ప్రాప్తాంతామివ చింతయే॥"[2]

అని శ్రీరాముని చేత చెప్పబడినట్లు గలదు కావున సీతాస్మరణముచే రాముని మది కరగినది, కాని కేవల మణి దర్శనము వలన గాదు. మణి దర్శనము సీతా స్మరణకు హేతు భూతమైనది.

ఇది గాక, సీతారాముల సంబంధము వత్సధేను సంబంధము వంటిదిగాదు. మణిని వత్స స్థానమున నిలిపినను పొంతనకలుగదు మణి దర్శనమున సీతాస్మరణము కలిగినట్లు వత్సదర్శనమున ఆవునకు దేని స్మరణ కలుగును? అని ప్రశ్న యుదయించును. మరియు ఉపమానోపమేయములకు లింగవ్యత్యయము కలదు. వాల్మీకి ఇచ్చట కేవల దర్శన స్నేహ సంబంధమును" పురస్కరించుకొని తావత్కాలమునకు దగినట్లు ఉపమానమును సమకూర్చినాడు; కాని, తర్వాతి భావన జోలికి పోలేదు.

చక్కని భావనా సంపత్తిగల బుద్ధారెడ్డి దీనిని "లక్కవోలె" అని మార్చినాడు. లక్క అగ్నికి కరగును. మనస్సు లక్కవంటిది. మణి దర్శనమున సీతాస్మరణ కలిగి, తత్ప్రేరకమున విరహాగ్ని విజృంభించగా, తత్సంబంధమున శ్రీరాముని మది క్రాగి లక్కవోలే కరగుచున్నదనుట ఎంతయు ఔచితీశోభితము

4. అమూలములు. (స్వయం కల్పితములు)

బుద్ధ భూపతి సందర్భౌచిత్య దృష్టితో, నాయాయి పట్టులం దనేకోపమానములను స్వయముగా కల్పించి యున్నాడు. అవి నిత్య జీవితమునకు చెందినవగుటచే రసభావ పోషకములై విస్పష్ట విషయావగాహనకు సమర్థములై యొప్పుచున్నవి రసభంజకములై కథాగతికి నడ్డువచ్చున విందు లేవనియు చెప్పచ్చును. ఇవి స్వయం కల్పితములగుటచే అమూలకములనవచ్చును.

---

1. దా. ప్రతి వాల్మీకి రామాయణము సుందర సర్గ 66, శ్లో. 3.
2. దా. ప్రతి వాల్మీకిరామాయణము సుందర సర్గ 66, శ్లో. 7.

(ఎ) శ్రీరాముడు లంకను జూడఁదలచి సౌమిత్రి సుగ్రీవాదులతో గూడి సువేలాచలం బారోహించెను. వనచర కోలాహలం బాలకించి రావణుడు గోపురమెక్కి చూచెను. అప్పుడు.

"ఆయత రత్నసింహాసనా సీను-డై యుండె నంతఁ బెంపలర రావణుడు
అపరాచలము మీది యర్కుని తోడి-యుపమకుఁ బాత్రుడై యుజ్జ్వలుండగుచు"

(యుద్ధ. ద్వి. 1791, 92)

అని రావణుడు వర్ణింపబడినాడు ఇందలి అలంకారము అమూలకము.[1] రావణుని వృద్ధత్వము, కళాశక్తుల హీనత్వము, ఆసన్న మరణమును సూచించుటయే ఇచ్చటి ఉపమాన పరమార్థము

(బి) రామలక్ష్మణు లింద్ర జిన్నాగ పాశముంచే బంధితులై మూర్ఛాక్రాంతులయిరి. సుగ్రీవాద్యఖిల వానరులు శోకాబ్ధి మగ్నులైరి. అపుడచటికి విభీషణుడు గదాపాణి యగుచు వచ్చి సుగ్రీవున కిట్లు ధైర్యము బోధించెను.

"కై కొని యిది యుద్ధకాలంబు కాని-శోకింప వేళయే సుగ్రీవ మనకు?
దుర్నివారోర్మి బంధురమైన జలధిఁ-గర్ణధారుడు లేని కలము చందమున
మన సైన్యమున్నది మనకింకవేగ-ననికి నుద్యోగించు టదియె కార్యంబు"

(యుద్ధ ద్వి. 2600-2602)

ఈ సందర్భమున విభీషణుడు విలపించినట్లు మూలమునందున్నది.[2] ఈ యలంకారము అచ్చట లేనే లేదు. ఇది బుద్ధారెడ్డి స్వయం కల్పితము.

సుగ్రీవాదులు శోకించువేళ నటకు వచ్చిన విభీషణుడు వారితో పాటు దుఃఖించుచు కూర్చుండుట కంటె, దుఃఖితులకు ధైర్యము గొల్పుట ఉత్తమ లక్షణము. ఆపద వచ్చినవారు దుఃఖిచుటయు, కావలసిన బంధుమిత్రాదులు వచ్చి వారితో పాటు దుఃఖములో పాలు పంచుకొనియు ఓదార్చుటయు ధైర్యము చెప్పుటయు లోక మర్యాద. ఈ పరిపాటిని పాటించి బుద్ధారెడ్డి ఇచ్చట విభీషణునిచే సుగ్రీవునికి ధైర్యము చెప్పించినాడు. ఆ చెప్పుటలో తత్కాల పరిస్థితిని ప్రతిబింబింపఁజేయు అలంకారమును నిబద్ధించినాడు.

కర్ణధారుడు గల యోడ ఉత్తాల తరంగ బంధుర సముద్రమునందైనను, ఒడుదుడుకులు లేక చక్కగా తీరమునకు చేరగలదు. అతడు లేనిచో, సరిగ నడిపించువారు లేనికారణమున, ఆయోడ దుర్వార తరంగములకు తట్టుకొనలేక మునుగుటమో, బ్రద్దలగుటయో జరుగును. ఇది ప్రకృతి సత్యము.

యుద్ధము సముద్రము; పరసైన్యములు తరంగములు; కపి సైన్యము కలము; శ్రీరాముడు కర్ణధారుడు; సుగ్రీవాదులు తత్సహాయకులు. ప్రస్తుతము రాముడు మూర్ఛితుడై యున్నాడు. అతడు లేని కపి సైన్యము కర్ణధారుడు లేని యోడ. సైన్యము చెదిరి పోకుండ ఎవరైనను ఆ బాధ్యత వహించవలెను. లేనిచో ప్రమాదము తటస్థించును. కావున తత్ కార్యబాధ్యత మనము

---

1. దా. ప్రతి. వాల్మీకిరామాయణము. యుద్ధ. సర్గ. 40. శ్లో. 3,4,5.
2. దా. ప్రతి. వాల్మీకిరామాయణము. యుద్ధ. 50 శ్లో. 14-19.

వహించవలసి యున్నదని సుగ్రీవునికి ధైర్యము గొల్పుచు విభీషణుడు గ్రహించిన యీ యుప మానము సందర్భశుద్ధి కలిగి, సముచితమై యొప్పియున్నది.

(సి) ఆంజనేయుడు అశోకవనభంగమొనరింపఁ దలచెను. అప్పుడు.

"— — — వనభంగమొనరించు వాడునై పెరిగి
తొడలందుఁ బొడము వాతూల ఘట్టనలఁ-బడుగుఁ బేకయుఁ బోలెఁబడ మహీజములు"

(సుందర. ద్వి. 620)

అని అమూలకముగా వర్ణితమైన యిందలి యుపమానము స్వయం కల్పితము[1]

పడుగు పేక-తెలుగు జాతీయము దీనికి "వస్తువు నేత యందలి నిడుపునూలు అడ్డపునూలు"[2] అని యర్థము. అడ్డముగా, నిలువుగా, అడ్డ దిడ్డముగా పడిన దట్టమైన వస్తు సముదాయమునకు ఈ జాతీయపదము నుపమానముగా వాడుదురు.

ఆంజనేయుని ఊరు వేగమున జనించిన వాతూలపు తాకిడిచే అశోక వనవృక్షములు వెల్లగిలి నిలువుగా, అడ్డముగా అడ్డదిడ్డముగా పడినవి అదృశ్యమును పాఠకులకు దృష్టి గోచరము చేయుటకు కవి నిత్య జీవితము నందలి పడుగు పేక జాతీయము నుపమానముగా గ్రహించినాడు సందర్భ మున కిది యెంతయుఁ దగినదై కవియొక్క లోక పరిశీలనా నైపుణ్యమును ప్రస్ఫుటము చేయుచున్నది.

(డి) విశ్వామిత్రుని మాటపై శ్రీరాముడు లక్ష్మణునితో గౌతమాశ్రమమును ప్రవేశించెను. అప్పుడు శ్రీరామ పాదధూళిచే శాప విముక్తయైన యహల్య.

బ్రహ్మచే నతిప్రయత్నమున సృష్టించిన దివ్యమైన మాయామయి వలె, మబ్బు మంచులచే నావృతమైన నిండు చంద్రప్రభవలె, పొగచే నావరింపబడిన దీప్తాగ్ని జ్వాలవలె నీటి నడుమ ప్రకా శించు దురాధర్షమైన సూర్యప్రభవలె"[3] నున్నదని మూలమునందు వర్ణితమైనది.

ఇందలి రెండవ, మూడవ ఉపమానములందలి సాభ్ర: సతుషారావృత, ధూమపరీత శబ్దము లచే అహల్య పూర్తిగా నిష్కల్మషురాలుకాలేదని తోచెడిని వ్యాఖాతలు ఈ యనుమాన రాహిత్యము నకై వృక్షలతా కుసుమాంతర్వర్తితేన"[4] అని సమాధానము చెప్పియున్నారు. ఇది మూలమును సమర్థించుటకు వ్రాయబడినదే కాని, యంత సమంజసముగాఁ దోచదు. అందుచేత బుద్ధారెడ్డి ఇచ్చట అహల్యను వర్ణించుచు.

"మొగులెల్ల విరియఁ సోముని కళవోలెఁ-బొగ యడంగిన హవ్యభుక్కీలవోలెఁ
గలఁక దొలంగిన కమలిని వోలెఁ-బలు గసటుడిగిన బంగారు వోలె"

(బాల. ద్వి. 1495,1496)

ఉన్నదని తెలిపినాడు. ఇందలి మూడవ, నాల్గవ యుపమానములు క్రొత్తవి. మొదటి రెండవ ఉప

---

1. దా ప్రతి. వాల్మీకిరామాయణము. సుందర. సర్గ. 41 శ్లో. 14-16.
2. శబ్దార్థ చంద్రిక. పుట. 819, 897.
3. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. బాలకాండము. సర్గ. 49, శ్లో. 14,15.
4. గోవిందరాజీయము. బాలకాండము. సర్గ. 49, శ్లో. 14,15ల వ్యాఖ్యానము.

మానములు మూలమునకు సవరింపులు. మూలమునందలి మొదటి యుపమానము యీ హేజన్యమగుట చేతను, నాల్గవది సముచితము కానందునను వదలబడినవి.

అనువాదము నందలి మొదటి, మూడవ ఉపమానములు అహల్యా సౌందర్య స్వరూపమును నాల్గవది దేహకాంతిని, రెండవది ఆమె పవిత్రతను విశేషించుచున్నవి. ఆమె దోషములు సంపూర్ణ ముగా హరించి పోయినవనియు, సౌందర్య పావిత్ర్యములందు కల్మషము లేదనియు తెలియజేయుట ఈ ఉపమానముల వలని ప్రయోజనము ఇవి వర్ణ్యమాన వస్తు వైశిష్ట్యమును తెలుపుచు ఔచిత్య వంతములై యొప్పారినవి—

ఇట్లు కవి బుద్ధారెడ్డి అనేక స్థలము లందనేక నూత్నోపమానములను నిత్యజీవితము నుండి గ్రహించి, కల్పించి కథాంశములకు స్పష్టతయు, రచనకు రమ్యతయు, సమకూర్చి నాడనుట యథార్థము—

(5) పరిత్యక్తములు :—

మూలము నందలి అనేకోపమానములు రంగనాథ రామాయణమునందు గ్రహింపబడలేదు. వానికిక్రింది కారణముల నూహించవచ్చును.

(i) సంక్షిప్తత (ii) అనౌచిత్య పరిహారము. (iii) అసంభావ్యత.

(1) సంక్షిప్తత :—

సంగ్రహ దృష్టిచే కొన్ని కథాంశములు వదల బడినట్లు, యలంకారములు కొన్ని తొలగింప బడినవి.

(a) "పపాత సహసాతోత్రైర్హ్యతి విద్ధ ఇవ ద్విపః।"1

ఇది రాముని గూర్చి గుహుడు చెప్పిన మాటలను విని భరతుడకస్మాత్తుగా క్రిందబడిన సందర్భములోనిది.

(b) "రవి సంక్రాంత సౌభాగ్య స్తుషారారుణ మండలః।
నిశ్శ్వాసాంధ ఇవాఽదర్శశ్చంద్రమా నప్రకాశతే॥"2
ఇది హేమంత ఋతు వర్ణనములోనిది.

(c) "ఉదరస్థోద్విజాన్ హంతి స్వగర్భోఽశ్వతరీమివ।"3
ఇది మారీచుడు రావణునికి వాతాపి వృత్తాంతమును చెప్పు సందర్భములోనిది—

(2) అనౌచిత్య పరిహారము :—

కింత్వం సంతప్యసే వీర యథాఽన్యః ప్రాకృతస్తథా।
మైవంభూ స్త్యజ సంతాపం కృతఘ్న ఇవ సౌహృదం"4

---

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. అయోధ్యా. సర్గ. 87. శ్లో. 3.
2. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. అరణ్య కాండము. సర్గ. 16. శ్లో. 13.
3. " " " " సర్గ. 40. శ్లో. 3
4 " " " యుద్ధకాండము. సర్గ. 2. శ్లో. 2.

"సముద్రము నెట్లు దాటుదు మని" విషాదమునొందు రామునికి సుగ్రీవుడు ధైర్యము గఱపుచు పలికిన సందర్భములోనిదీ శ్లోకము. ఇందలి యుపమానము విడుచుట యను కార్యమును పురస్కరించుకొని చెప్పబడినది. రాముడు కృతఘ్నునితో నుపమింపబడినట్లు అర్థము తోచును. ఇది సముచితము కాదు. కావున బుద్ధారెడ్డి యీ యుపమానమును వదలి మిగిలినది యథాతథముగా ననువదించినాడు.

"ఇదియేమి? దేవ! నీవితరుల భంగి — మదిలోని శోకంబు మాన వయ్యెదవు
దాట రాదన నేల దాటెద వర్ధి"

(యుద్ధ, ద్వి. 24-25)

(b) రాముడు మహా కపాలాది రాక్షసులను యుద్ధరంగమున నేలఁ గూల్చెను. అప్పుడా రణభూమి యిట్లున్నది—

"తైర్ముక్త కేశై స్సమరే పతితై శ్శోణితోక్షితైః।
ఆస్తీర్ణా వసుధా కృత్స్నా మహావేదిః కుశైరివ॥"[1]

ఇచట బీభత్స-శాంత భావములకు ఉపమేయోపమానముల ద్వారా సంకరము చేయబడినది. నెత్తురుతో తడసి విరబోసిన వెంట్రుకలతో వ్యాపించిన రణభూమి దర్భలతో పరిస్తృతమైన (పవిత్రమైన) మహావేదితో నుపమింపఁబడుట కవికి సముచితమని తోచనందున పరిత్యక్తమైనది.

(3) అసంభావ్యత :—

నిత్యజీవితమునందు కనబడని, లోకమునందెపుడు సంభవించని అసంభావ్యోపమానములు కొన్ని వదలబడినవి.

(a) పంచవటి పర్ణశాల యందున్న సీత యొద్దకు రావణుడిట్లు వచ్చినాడు.

తామాససాదాఽతిబలో భ్రాతృభ్యాం రహితాం వనే।
రహితాం చంద్రసూర్యాభ్యాం సంధ్యామివ మహత్తమః॥"[2]

"చంద్ర సూర్యులు లేని సంధ్యను మహత్తమము (పెద్ద చీకటి) సమీపించినట్లు, రామలక్ష్మణులులేని సీతను రావణుడు సమీపించెను", అను వర్ణనము అద్భుతము. కాని సంధ్యాకాలమున మహత్తమము (కారుచీకటి) అసంభవము; లోకవిరుద్ధము. కావున ఈ అభూతోపమానము రంగనాథ రామాయణమున పరిత్యజింపబడినది.

(b) రావణుడు సీతను బలవంతముగా పట్టుకొనెను. అప్పుడు

"జగ్రాహ రావణస్సీతాం బుధః ఖే రోహిణీమివ"[3]

అని వర్ణింపబడినది.

రోహిణీ బుధులు శశాంకుని భార్యాపుత్రులు. అందువలన రోహిణీ దేవి బుధునికి (పిన) తల్లి యగును. ఆకాశమునందు బుధుడు రోహిణిని అనగా కుమారుడు తల్లిని బలాత్కరించి చెఱబట్టినట్లు,

---

1. దా-ప్రతి-వాల్మీకి రామాయణము. అరణ్యకాండము. సర్గ. 26. శ్లో. 33.
2. " " " సర్గ. 46. శ్లో. 4 1/2.
3. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. అరణ్యకాండము. సర్గ. 49. శ్లో. 16 1/2

జగన్మాతయైన సీతాదేవిని దశకంఠుడు పట్టికొనెనని పై శ్లోక తాత్పర్యము. అలంకార విషయము రమణీయముగానే యున్నది కాని బుధుడెప్పుడైనను రోహిణిని చెఱబట్టెనా? అను ప్రశ్నకు సమాధానము చెప్పదగిన పూర్వగాథలేదు. అప్పుడు "బుధుడు రోహిణిని గ్రహించిన యెట్లుండునో యట్లు" అని అర్థము చెప్పవలెను. అయిననది అభూతోపమ యగును కావున రంగనాథ రామాయణమున విడివదలబడినది—

ఇట్లు సంగ్రహము కొఱకును. అనౌచిత్య పరిహారమునకై, అసంభావ్యత లేకుండుటకై శాస్త్రసంబంధమైనవేకాక, సామాన్యమైన అలంకారములును బుద్ధారెడ్డిచే గ్రహింపబడ లేదని తులనాత్మక పరిశీలనము వలన వ్యక్తమగు చున్నది. వాని నన్నింటిని జూపుట కవకాశ మిచ్చుటలేదు. పాఠకుల సౌకర్యార్థము యథామూల. స్వయంకల్పితమైన కొన్ని ఉపమానముల పట్టిక నిచ్చుట ఈయబడినది—

యథామూలములు.

వాల్మీకి రామాయణము.	రంగనాథ రామాయణము.
1. రమణీయం ప్రసన్నాంబు సన్మనుష్యమనో యథా ।	1. ప్రకటింప సజ్జన భావంబుపోలె సకలుష జీవనంబై కరంబలరు.
2. కాంతార మధ్యే విజనే విసృష్టా బాలేవ కన్యా విలలాప సీతా ।	2. లోలత నడవులలో నొంటిఁబడిన బాలిక యునుబోలెఁ బలవింపఁ దొణగె.
3. ప్రాస్పందతైకం నయనం సుకేశ్యా మీనా హతం పద్మమివాభి తామ్రం ।	3. ఆలోన నెడమ కన్నదిరెను సతికి వాలగు మీనుచే వనజంబువోలె.
4. గజేంద్రహస్త ప్రతిమశ్చపీనః — — ప్రస్పందమానః పునరూరురస్యాః ।	4. అయ్యెడ మదహస్తి హస్తంబు పోలెఁ దొయ్యలి దాపలి తొడయును నదరె.
5. క్రమేణ జగ్రాహ సపాదయోర్దృఢం — — మహోరగం గృహ్య ఇవాండజేశ్వరః ।	5. ఖగనాథు డురగంబు కబళించినట్టు లొగి వాని చరణంబు లొడిసిరా దిగిచి
6. భగ్నదర్పస్తదా రాజా బభూవ వ్యథితేంద్రియః । మాతంగ ఇవ సింహేన గరుడేనేవ పన్నగః ॥	6. అటులంకలోపలి కరిగి రావణుడు పటుతరంబగు చింతఁబడి తల్లడిలుచు పంచాననంబు చేఁబడియుఁ జావునకు నించుక తప్పిన యేనుగు పగిది గరుడునిచేఁబడి క్రమ్మఱ బ్రదికి సురిగిపోయిన దంద శూకంబు వోలె.
7. అమృతోత్పాదనే బద్ధో భుజగేనేవ మందరః ।	7. అహిరాజ బద్ధ మంథాద్రి చందమున
8. భక్షయామాస సంక్రుద్ధో గరుడః పన్నగా నివ.	8. గరుడుండు వెసనురంగంబు మ్రింగు — కరణి

9. గుహాఽచలం క్రౌంచ మివోగ్ర శక్త్యా

10. త్వష్టు స్సుతస్యేవ శిరాంసి శక్రః।

11. సభాం సద్భిః ప్రవివిశుః
సింహో గిరి గుహామివ

12. వజ్రపాత హతః శ్రీమాన్
విశీర్ణ ఇవ పర్వతః ।

13. పురా హిమవత శ్శృంగం
వజ్రేణేవ విదారితః ।

14. పురాహి నముచిం సంఖ్యే
వజ్రేణేవ పురందరః ।

15. పుష్పితాశోక సంకాశః ।

16. వృత్ర వాసవయోస్సమౌ !

17. స తత్తదా సూర్య ఇవాభ్ర జాలం
ప్రవిశ్య రక్షోధి పతేర్నివేశం ।

18. సంధ్యాభ్ర సంవీత ఇవాద్రిరాజః ।

19. సవితే వాస్త మూర్ధని

20. నభశ్చంద్ర మసాయథా

21. బభూవతుర్దాశరథీ
పుష్పితా వివ కింశుకౌ ।

22. వ్యుచ్ఛిద్యంతే క్రియా స్సర్వాః
గ్రీష్మేకుసరితో యథా ।

23. అభ్యద్రవత కాకుత్స్థం
స్వర్భానురివ భాస్కరం

24. పురీం మహేంద్రస్య యథామరావతీం ।

25. నక్షత్రైరివ చంద్రమాః ।

26. మాలయేవ బలాకానాం
సస్సంధ్య ఇవతోయదః ।

27. ప్రతిలోమేన వాతేన
మహానౌరివ సాగరే

28. పంచ శీర్షా వివోరగౌ ।

9. మదవక శక్తి కుమారుండు పేర్చి
వడిఁ గ్రౌంచగిరి మీద వైచిన కరణి

10. రూపించియా విశ్వరూప మస్తకము
లేపునఁ ద్రుంచు సురేంద్రు చందమున -

11. .... తనరు సింహములు
కొమరారగాగిరి గుహఁజొచ్చు కరణి
నా మంటపముఁజొచ్చి·

12. తన్నిన వజ్రంబు తాకునఁ గూలు
నున్నత గిరివోలె నుర్విపైఁ బడియె

13. అది వజ్రహతిఁ దుహినావనీధరము
తుదిఁగూలు పగిదిఁ దుత్తునియలై -

14. ....నముచిపయి వజ్రి
వజ్రంబు వైచిన చందాన-

15. అప్పుడు నెత్తురు లడర నశోక
మొప్పఁబూచిన క్రియ.

16. గండు మీఱిన వృత్రకౌశికులనగ

17. పరగిన ధవళాభ్రపటలంబు సొచ్చు
సురుచిర కరుడైన సూర్యుని భంగి,

18. వినుత సంధ్యాంబుదావృతగిరి వోలె

19. ఇనుడస్త శిఖరిపై నెక్కిన కరణి

20. ఆసుధాకరుతోడి యాకాశ మనగ

21. ......పార్థివ సుతులు కమియఁబూచిన
కింశుకంబుల తోడి సమత నొప్పిరి.

22. ....వెస నిదాఘమున
నడరెడు సెలయేఱు లడగిన భంగి.

23. భానుపై నడుచు స్వర్భాను చందమున

24. అమరావతియుఁబోలె నమరు నప్పురము.

25. నక్షత్ర పరివృత నవచంద్రుభాతి.

26. సరి బలాకలతోడి సంధ్యాభ్ర మనగ.

27. ప్రతికూల వాతూల వాత సంఘాత
హతుల నోడయుఁబోలె యటుపోక నిలిచి.

28. ఐదు మస్తముల ఘోరాహులు బోలె.

29. హిమ హత నళినీవ నష్టశోభా ।　　29. బలుమంచు పొదివిన పద్మిని వోలె.
30. సంధ్యా మేఘ మివోన్నతం　　30. సంధ్యాంబుదంబు చందమున.

మొదలగు వానిని చూడవచ్చును.

అవాల్మీకములు: (కవి కల్పితోపమానములు)

1. అష్టాక్షరముల బాహాష్టకంబునను-బ్రస్టయై వెలయు నారాయణుని కరణి
దశరథుండలరె　(బాల. ద్వి. 259, 260)

2. ————ఆపాయసంబు
తానందుకొనియె సుధాకలశంబు - చేనందుకొన్న శచీపతి మాడ్కి
(బాల - ద్వి - 509-510)

3. రెండు హస్తములెత్తి తెక్కల తోడి - కొండ రివ్వున వచ్చు కొమరు దీపింప
(బాల - ద్వి 774)

4. కాచిరి కంటికి కనుఱెప్ప కరణి　బాల ద్వి 895)

5. ఒనరెడు దీమంబు లోకవింత మృగముఁ-గొని వచ్చు తెఱగునఁ గొనివచ్చిరతని
(బాల ద్వి 36)

6. ప్రళయ మారుతమునఁ బగిలి సంధ్యాభ్ర-మిలఁగూలు తెఱగున నిలగూలె తూలి
(బాల ద్వి 792)

7. దీటుగఁ జీకటి దెసలు నాకసము-కాటుకఁబూసిన కరణి నున్నదియు　(బాల. ద్వి. 1010)

8. నీలాంబరంబున నిండు ముత్తెములు-గీలించి బ్రహ్మాండ గేహ గోళమునఁ
గడునొప్పుగా మేలు కట్లెత్తి నట్లు-యుడుగుణంబుల తోడ నున్నది నింగి
(బాల. ద్వి. 1011, 1012)

9. చెలగి చెవులసుధ చిలికినట్లుండ　(బాల. ద్వి 1891)

10. ముడిగొన్న వగలతో మొదలంటఁద్రెవ్వ-బడియున్న లతవోలెఁబడి మూర్ఛవోయె.
(అయోధ్యా. ద్వి. 446)

11. నీవెంట జనుదెంతు నీ నీడవోలే.　(అయోధ్యా ద్వి 654)

12. పటువజ్ర మద్రిపైఁ బడు భంగిఁదోపఁ-జటుల సత్త్వమున వృక్షము డిగ్గ నఱికె.
(అయోధ్యా. ద్వి. 1606)

13. మణిలేని పెట్టియమాడ్కి.　(అయోధ్యా ద్వి, 1801

14. గరుడుండు కాలనాగముబల్మినొడిసి-యిరవొందగా దివి కెగయుచందమున
(ఆరణ్య ద్వి 39)

15. జలదంబు నెడఁ బాసి చనుదెంచు మెఱుము-చెలువున　(ఆరణ్య ద్వి 57)

16. ఘన విషజ్వాలోరగము పుట్టవెడలు-ననువున.　(ఆరణ్య. ద్వి. 447)

17. మండు కార్చిచ్చుపై మలయుచు మిడుత-తండంబు లొక్కటఁ దార్కొన్న కరణి.
(ఆరణ్య ద్వి 538)

18. భానుని దీప్తి కంధకారంబు-పంతమంతయుఁ బటా పంచలైనట్లు.　(ఆరణ్య ద్వి 556)

19. గాలిచేఁ దూలిన కరాకులనగ- (ఆరణ్య ద్వి. 607)

20. కొఱవి ద్రిప్పిన రీతిఁ గుమ్మరిసారె-తెఱఁగున భ్రమసి దిర్దిర దిరుగు (ఆరణ్య ద్వి 908)

21. అనిమిష యోగ్య పూర్ణాహుతి శునక-మునకు దుర్లభమైన పోల్కి- (ఆరణ్య ద్వి 1013)

22 ఎలుగెత్తి కొదమ కోయిల కూసినట్లు. (ఆరణ్య ద్వి 1036)

23. బాలార్కుచే నొప్పు ప్రథమాద్రియందుఁ-బోలింప మిణుగురుఁ బురుగున్నయట్లు.
(అయోధ్యా ద్వి 1028)

24. ఒక్కట పంక్తిముఖు నాళ్ళతాళ్ళు-ద్రెంచినగతి లాఁకు తెగనేయుటయు. (కిష్కింధా ద్వి 380)

25. కలఁ గొనఁ జుట్టిన కర్మపాశములు-వెలకొని దీటన నిలుపరాకున్న
వెడలు చందమున (కిష్కింధా ద్వి 487,488)

26. నీరజంబునను దేనియ గాఱినట్లు-శోకమై కన్నీరు దొరుగ (కిష్కింధా ద్వి 609)

27 పవన వేగమున-లతిఁ దూలి పడు పుష్పలతికయుఁ బోలె (కిష్కింధా ద్వి 610)

28. (ముద్రికను దలదాల్చిన పవన సుతుడు)
తనరార నుదయాద్రి తనదు శృంగమున- దినమణిఁ దాల్చి యెంతే నొప్పు కరణి
(కిష్కింధా ద్వి 962)

29. కరువలి సుడిగొన్నఁ గారాకువోలెఁ-దిరమేది ధృతి దూలి దిర్దిరఁ దిరిగి
(కిష్కింధా ద్వి 1276)

30. వారిధి పిల్లకాల్వయుఁ బోలె దాటి (సుందర ద్వి 1)

31. ముడిగొన్న సంసార మోహబంధములు-విడఁ దన్ని సుజ్ఞాని వెడలిన మాడ్కి-
(కిష్కింధా ద్వి 1507)

32. పెన్నిధి సాధింపఁ బ్రీతిమై నరుగు-చున్న సాధకునకు నొగి నడ్డపడగ
వడి మహాభూతంబు వచ్చు చందమున-నడరి లంకిణి వచ్చి యడ్డమై నిల్చె
(సుందర ద్వి 45 46)

33. చంద్రునిఁ బాసిన చంద్రిక రీతి (సుందర ద్వి 24?)

34. ఇనరశ్మి వాడిన యెండీగవోలె (సుందర ద్వి 219)

35. చెలగు పిల్లులలోని చిలుకయుఁ బోలె (సుందర ద్వి 227)

36. పులులలో నావును బోలె (సుందర ద్వి 221)

37. బాలుడై యట వట పత్రంబునందు-పేలీలఁ గ్రీడించు విష్ణుండు వోలె (సుందర ద్వి 229)

38. పులిఁ గన్న లేడిని బోలె (సుందర ద్వి 261)

29. సన్నుత నీలాభ్ర జాలంబులోని-క్రొన్నెల వోలె (సుందర ద్వి 463)

40 కొక్కులు వడి గుంటఁ గూలుచందమున- (సుందర ద్వి 759)

41, తెగువఁ గుమ్మరిసారె తీరునఁ ద్రిప్పి (సుందర ద్వి 798)

42, ధరణిజ మదిలోని తాపాగ్నులార్చు-వెరవున వాలాగ్ని విషధిలో నార్చి (సుందర ద్వి 988)

43. చిత్తంబులోనఁ జేర్చిన యింద్రియముల - నొత్తి యడంచిన యోగియుఁ బోలె.
(యుద్ధ ద్వి 287)

44. ఇమ్ముల శైలంబు లిరుచేతులందు - నిమ్మపండుల మాడ్కి నెగుర వైచుచును (యుద్ధ ద్వి 1014)

45. అపరాచలము మీది యర్కుని తోడి - యుపమకు పాత్రుడై యుజ్జ్వలుండగు (యుద్ధ ద్వి 2140)

46. చంద్రదీధితులతో శారదాదేవి - యింద్రు మందిరమున కేతెంచు కరణి (యుద్ధ ద్వి 1204)

47. కాలరుద్రుడు గదగొని వ్రేయ - రాలు తారా గ్రహ రాజి చందమున. (యుద్ధ ద్వి 1814)

48. బట్టు కైవడి మెచ్చి. (యుద్ధ ద్వి 2193)

49. కడునొప్పు నీలమేఘముఁ జొచ్చు మెఱుపు - వడువునఁ జొచ్చె రావణ సభాస్థలము; (యుద్ధ ద్వి 3123)

50. —— —— అరిషడ్వర్గ మారావణునకు - మును మున్నె రాము నిమ్ములఁ దాక బోవు పగిది. (యుద్ధ ద్వి 4250)

51. కుల గిరు లచ్చున గుండుల మాడ్కి - నిలమీద నందంద నెత్తిపైఁ బడియె (యుద్ధ ద్వి 2258)

52. కుబుసంబు లూడ్చిన క్రూర సర్పముల - నుపమింప ననువులై యొడియు రాఘవుని. (యుద్ధ ద్వి 3177)

53. త్రిశిరముల్ త్రేతాగ్ని తెఱగున వెలుగ త్రిశిరస్కుడగు నగ్ని (యుద్ధ ద్వి 4371)

54. అలలు లేనట్టి యాయంబుధి కరణి. (యుద్ధ ద్వి 5456)

55. పటు లులాయంబు - తలద్రుంచి వైచు విధంబచ్చు పడగ (యుద్ధ ద్వి 5691)

56. గజపై రంగని పాఱు గజము చందమున (యుద్ధ ద్వి 6487)

57. కమల బంధుడు లేని కమలిని వోలెఁ - గొమరారు శశిలేని కుముదిని వోలె
రేరాజు లేనట్టి రేయును బోలె - శారిక లేని పంజరమును బోలె
నెనయఁ గోయిల లేని యెల మావి వోలె - దినమణి లేని యా దినమును బోలె
మొదలగునవి—— (యుద్ధ ద్వి 7283-7285)

రంగనాథ రామాయణము నందు లేక మూలము నందున్న అలంకారములు

1.	శశాన శమితామిత్రో నక్షత్రాణీవ చంద్రమాః।	బాల సర్గ 6	శ్లో	8
2.	ముఖపద్మాన్య శోభంత పద్మానీవ హిమాత్యయే।	,, 8	శ్లో	24
3.	బభూవ పరమ ప్రీతః ప్రాప్య విత్తమివాధనః।	,, 16	శ్లో	23
4.	లక్ష్మణో లక్ష్మి సంపన్నః బహిః ప్రాణ ఇవాపరః।	,, 18	శ్లో	29
5.	యథా వర్ష మనూదకే	,, 18	శ్లో	49
6.	ప్రణష్టస్య యథా లాభో	,, 18	శ్లో	50
7.	గుప్తం కుశిక పుత్రేణ జ్వలనేనాఽ మృతం యథా।	,, 21	శ్లో	9
8.	స్థాణుం దేవ మివాచింత్యం కుమారా వివ పావకీ।	,, 22	శ్లో	10

9.	శశీవ గత నీహారః పునర్వసు సమన్వితః।	బాల సర్గ 29 శ్లో 25
10.	సంగతా మునినా పత్నీ భార్గవేణేవ రేణుకా।	,, 51 శ్లో 11
11.	శాశ్వతీ శబళా మహ్యం కీర్తి రాత్మవతో యథా।	,, 53 శ్లో 13
12.	వివర్ధమానో వీర్యేణ సముద్ర ఇవ పర్వణి।	,, 55 శ్లో 20
13.	అతీవ రామ శ్శుశుభేఽతి కామయా - విబుధేశ్వరయా విష్ణు రివామరేశ్వరః।	,, 77 శ్లో 29
14.	స్వశరీరా ద్వినిర్వృత్తాశ్చత్వార ఇవ బాహవః॥	అయోధ్యా. సర్గ 1 శ్లో 5
15.	అలంకృత మివాత్మాన మా దర్శతల సంస్థితం।	,, 3 శ్లో 38
16.	విమల గ్రహ నక్షత్రా శారదీ ద్యౌరివేందునా।	,, 3 శ్లో 37
17.	పితా దశరథః ప్రీత్యాయయాతిం నహుషో యథా।	,, 5 శ్లో 10
18.	చలం హి తవసౌభాగ్యం నద్యాస్స్రోత ఇవోష్ణగే।	,, 7 శ్లో 15
19.	సాహివాక్యేన కుబ్జాయాః కిశోరీవోత్పథం గతా।	,, 9 శ్లో 37
20.	నరేంద్ర పత్నీ విమనా బభూవసా తమోవృతా ద్యౌరివ మగ్న తారకా॥	,, 9 శ్లో 66
21.	అశోభయంత వసుధాం నక్షత్రాణియథానభః।	,, 10 ,, 8
22.	కరేణుమివ దిగ్ధేన విద్ధాం మృగయునా వనే।	,, 10 ,, 26
23.	ప్రచస్కంద వినాశాయ పాశం మృగ ఇవాత్మనః।	,, 11 ,, 22
24.	సనున్న ఇవ తీక్ష్ణేన ప్రతోదేన హయోత్తమః।	,, 14 ,, 23
25.	యథా హ్యపాలాః పశవో, యథా సేనా హ్యనాయకాః।	,, 14 ,, 56
26.	హరియుక్తం సహస్రాక్షో రథ మింద్ర ఇవాశుగం।	,, 16 ,, 30
27.	రామోఽపి భయమాపన్నః పదా స్పృష్ట్వేవ పన్నగం	,, 18 ,, 4
28.	అభిచక్రామ సంహృష్టా కిశోరం బడబా యథా।	,, 20 ,, 20
29.	నేత్రాభ్యాం పరిసుస్రావ పంకజాభ్యామివోదకం।	,, 30 ,, 24
30.	నవిహాతుంమయాశక్యా కీర్తి రాత్మ వతా యథా।	,, 30 ,, 29
31.	ఉపరక్త మివాదిత్యం భస్మచ్ఛన్న మివానలం। తటాక మివ నిస్తోయ మపశ్య జ్జగతీ పతిం॥	అయోధ్యా సర్గ 34 శ్లో 3
32.	సమీక్ష్య చీరం సంత్రస్తా పృషతీ వాగురామివ।	,, 37 ,, 9
33.	మతంగ యోర్మ ధ్యగతో శుభా నాగవధూరివ।	,, 56 ,, 30
34.	స్వయమేవ హతః పిత్రా జలజేనాఽఽత్మజో యథా!	,, 61 ,, 22
35.	ఉచ్ఛోషయతిమే ప్రాణా న్వారిస్తోక మివాతపః।	,, 64 ,, 68
36.	ద్రక్ష్యంతి సుఖినో రామం శుక్రం మార్గగతం యథా।	,, 64 ,, 72
37.	దుఃఖేమే దుఃఖ మకరోర్వ్రణే క్షారమివాఽదధాః।	,, 73 ,, 3
38.	వివ్యథే భరత స్తీవ్రం వ్రణే తుద్యేవ సూచినా।	,, 75 ,, 17
39.	బభాసే బహుభిర్బద్ధా రజ్జు బద్ధేవ వానరీ।	,, 78 ,, 7

40.	ఆనేష్యామి తువైరామం హవ్యవాహ మివాధ్వరాత్।	అయోధ్యా సర్గ 79 శ్లో 11
41.	ఉద్విజంతే యథా సర్పాన్నరా దనృత వాదినః।	,, 109 ,, 12
42.	నాధిగంతుం మయాశక్యా సావిత్రీ వృషలైరివ।	,, 92 ,, 18
43.	ఆయూంషి క్షపయంత్యాశు గ్రీష్మేజల మివాంశవః।	,, 105 ,, 20
44.	చింతామభ్యగ మద్దీనో విత్తనాశా దివాధనః।	,, 118 ,, 24
45.	యావజ్జహామిగా త్రాణి జీర్ణాంత్వచ మివోరగః॥	అరణ్య సర్గ 5 శ్లో 39
46.	నిశ్శ్వాసాంధ ఇవాఽ దర్శశ్చంద్రమా నప్రకాశతే।	,, 19 ,, 13
47.	కృతాభిషేకో గిరిరాజ పుత్ర్యా రుద్రస్సనందీ భవానివేశః॥	,, 16 ,, 43
48.	దక్షస్యేవ క్రతుంహంతుం ఉద్యతస్య పినాకినః।	,, 24 ,, 35
49.	వ్యసృజత్స దృశంనాదం జలార్ద్రస్యతు దుందుభేః।	,, 27 ,, 8
50.	భ్రష్టః పశ్యతి తస్యాంతం బ్రాహ్మణీ కరకాదివ।	,, 29 ,, 5
51.	అద్యతే పాతయిష్యామి శిరస్తాలాగ్రిల ఫలం యథా।	,, 29 ,, 14
52.	లుబ్ధం న బహు మన్యంతే శ్మశానాగ్ని మివప్రజాః।	,, 33 ,, 5
53.	పరపాపైర్వి నశ్యంతి మత్స్యానాగ హ్రదేయథా।	,, 38 ,, 26
54.	చిత్రామివ శనైశ్చరః।	,, 46 ,, 10
55.	కాలోప్యంగీ భవత్యత సస్యానామివ పక్తయే	,, 49 ,, 28
56.	వధాయ బడిశం గృహ్య సామిషం జలజో యథా।	,, 51 ,, 28
57.	పంక మాసాద్య విపులం సీదంత మివకుంజరం।	,, 67 ,, 13
58.	కాలాభిపన్నా స్సీదంతి యథా వాలుం సేతవః।	,, 69 ,, 50
59.	ఖడ్గావేతౌ విరాజేతే నిర్ముక్తా వివ పన్నగౌ।	కిష్కింధా సర్గ 3 శ్లో 19
60.	భయంవాలి సముద్భూతం భుక్త మాల్యమివాత్యజత్।	,, 5 ,, 8
61.	సమజ్జత్యవ శోకే భారా క్రాంతేవ నౌర్జలే।	,, 7 ,, 10
62.	ప్రసూతం క మం క్షేత్రే వర్షణేవ శతక్రతుః।	,, 14 ,, 16
63.	బుధ శుక్రా వివాంబరే ప ఉ ప్రతి.	,, 12 ,, 24
64.	ఆనయేయం తావా దేశాచ్చ్వేతా మశ్వతరీమివ॥	,, 17 ,, 49
65.	వైదేహిం నాధిగచ్ఛామో రాత్రౌ సూర్య ప్రభామివ॥	,, 57 ,, 16
66.	అనుజగ్ముర్హనూ మంతం సైన్యా ఇవ మహీపతిం।	సుందర సర్గ 1 ,, 48
67.	ప్రస్థితం దీర్ఘమధ్వానం స్వబంధు మివబాంధవాః॥	,, 1 ,, 47
68.	వ్యరోచత మహాప్రాజ్ఞః పరివేషీవ భాస్కరః॥	,, 1 ,, 63
69.	మృణాళీ పంకదిగ్ధేవ విభాతి నవిభాతిచ	,, 17 ,, 26
70.	ప్రజగామ నభశ్చంద్రో హంసోనీల మివోదకం।	,, 17 ,, 1
71.	యదతీతం పునర్నైతి స్రోత శ్శీఘ్ర మపామివ।	,, 20 ,, 12
72.	వాతాత పక్లాంత మివ ప్రణష్టం-వర్షేణ బీజం ప్రతి సంజహర్ష॥	,, 29 ,, 6
73.	యథాకలమకేదారైః॥ పక్వైరివ వసుంధరా॥	యుద్ధ. సర్గ 4 ,, 95

74.	సహసా విప్రమోక్ష్యామి వాసఃక్లేతరం యథా॥	యుద్ధ. సర్గ 5 శ్లో. 21
75.	నిహన్యా దంతరం లబ్ధ్వా ఉలూక ఇవ వాయసాన్।	,, 17 ,, 28
76	అసృక్ సుస్రవతుస్తీవ్రం జలం ప్రస్రవణాదివ॥	,, 45 ,, 44
77.	మహార్ణవం మీన ఇవావివేశ॥	,, 69 ,, 69
78.	త్రిదశానాతి వర్తంతే జితేంద్రియ మివాధయః॥	,, 76 ,, 74
79.	త్యాజ్యో మాహఃు ర్దురాచారం వేశ్మప్రజ్వలితం యథా॥	,, 87 ,, 53
80.	అష్టావక్రేణ ధర్మాత్మా తారితో బ్రాహ్మణోయథా॥	,, 122 ,, 17

మొదలగునవి.

రూపకాలంకారము

విషయిమునకు (ఉపమేయమునకు) విషయితో (ఉపమానముతో) అభేదముగాని, తాద్రూప్యము గాని వర్ణించినచో రూపకాలంకారము[1]

వాల్మీకి రామాయణమునందు రూపకాలంకారములకు కొదువ లేదు. రంగనాథ రామాయణ కర్త గూడ వీనిలో చాలావరకు గ్రహించినాడు. ఒక్కొక్కప్పుడు సావయవ వివరణాత్మక రూపకములను సంక్షిప్తత కొఱకై నిరవయవములుగా మార్చినాడు. మూలమునలేని వానిని కొన్నింటిని ఘటించి తన ప్రతిభా పాండిత్యములను ప్రదర్శించుకొన్నాడు.

1. సావయవ రూపకములు నిరవయవములుగా మారుట

వాల్మీకి రామాయణము		రంగనాథ రామాయణము
ఎ)	ధృతి ప్రవాళః ప్రసహాగ్ర్య పుష్ప స్తపోబల శ్శౌర్యనిబద్ధ మూలః। రణే మహాన్ రాక్షస రాజ వృక్షః సమర్దితో రాఘవ మారుతేన॥	ఎ) పరతెంచి రాఘవ ప్రళయ మారుతము సరసరావణ పారిజాతంబు గూల్చె
బి)	తేజో విషాణః కులవంశ వంశః కోప ప్రసాదాపర-గాత్రహస్తః। ఇక్ష్వాకు సింహావ గృహీత దేహః సుప్తః క్షితౌ రావణ గంధ హస్తీ॥	బి) గమివిచ్చి పాఱ రాఘవ నాగవైరి సమద రావణ సామజంబును జంపె
సి)	పరాక్రమోత్సాహ విజృంభితార్చి ర్నిశ్వాసధూమస్స్వబల ప్రతాపః। ప్రతాపవాన్ సంయతి రాక్షసాగ్ని ర్నిర్వాపితో రామపయోధరేణ॥	సి) ఖలతరామోఘ రాఘవ నీలమేఘ శరవృష్టి రావణ సప్తార్చినార్చె,

---

1. చంద్రాలోకము-(రూపకాలంకారము-) శ్లో. 12.

ఎ) దా. ప్రతి, వాల్మీకిరామా యుద్ధ-సర్గ. 112 శ్లో. 10. ఎ) రంగ. రామా. యుద్ధ. ద్వి. 7951.

బి) ,, ,, ,, సర్గ. 112 శ్లో. 11. బి) ,, ,, ద్వి. 7042

సి) ,, ,, ,, సర్గ. 112 శ్లో. 12. సి) ,, ,, ద్వి. 7965

చ్చటవృక్ష, గజ, వహ్నులకు సంబంధించిన ఇతరావయవములతో రావణునకుఁజేసిన అభేదములు వదలబడినవి—

(2) నిరవయవములు లేక సావయవములు ఇంకను వివరింపబడుట.

రాక్షసులతో రావణుడాడిన ప్రగల్భము.

"రామవృక్షం రణేహన్మి సీతాపుష్పఫలప్రదం।
ప్రశాఖా యస్య సుగ్రీవో జాంబవాన్ కుముదోనళః॥"[1]

రంగనాథ రామాయణము నందు—

అవిరళ క్షత్రధర్మైకమూలంబు - నవవయోన్నత లక్ష్మణ ప్రకాండంబు
భానునందన ముఖ ప్లవగశాఖంబు - మానవపతి కీర్తి మంజరీకంబు
ప్రకట సీతానామ ఫలభాసురంబు - సకలామరాశ్రితచ్ఛాయంబునైన
రామద్రుమంబేను రయమారఁ బెఱికి."

అని మూలమునందుకంటె కొన్ని యవయవములు ఎక్కువగాఁ జేర్చి వివరింపబడినది.

(3) రూపమునందలి యవయవములు ఒక్కొక్కప్పుడు ఔచిత్య దృష్ట్యా కొలదిగా మార్పు నొందుట.

రావణునకు విభీషణుడు చేసిన హితోపదేశము—

"వృతోహి బాహ్వంతర భోగరాశిః
చింతావిషః సుస్మిత తీక్ష్ణదంష్ట్రః।
పంచాంగులీ పంచ శిరోతి కాయః
సీతా మహాహి స్తవ కేన రాజన్॥"[2]

బుద్ధారెడ్డి దీనికి చేసిన అనువాదము-

మొనయు నిట్టూర్పులు ప్రోగుట గాగ — ఘనమైన చింతయే గరళంబుగాగఁ
గోపంబుఁ జలమును గోరలుగాగ — నేపరి యుండుటే యెరగొఁటకాగ
నమరంగఁ జెక్కున హత్తిన చేయి — కమనీయ తర ఫణాకారంబు గాగ
నిజ నఖంబులు మణి నికరంబుగాగ — భుజయుగ మధ్యంబు భోగంబు గాగ
దారుణంబైన సీతాకాల సర్ప — మేరూపమునసైన నేల పోనిచ్చు"

(యుద్ధ. ద్వి. 425-429)

ఇచట మూలమునందలి "పంచాంగులీ పంచశిరోతికాయః" అనునది "అమరంగఁ జెక్కున హత్తిన చేయి-కమనీయ తర ఫణాకారంబు గాగ" అని మార్చఁబడినది. ఇది సరసముగానే యున్నది-

ఇట్లు మూలాధారమున రచితములైనవేకాక, అమూలకములైన రూపకములు చాలగలవు. ఇవియన్నియు 'సావయవములు, నిరవయవములు' అని రెండు విధములుగా నున్నవి—

---

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. యుద్ధ కాండము. సర్గ. 100. శ్లో. 4.
2. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. యుద్ధ. సర్గ. 14. శ్లో. 2.

మచ్చునకు ఒకటి రెండు వివరింతును—

సుగ్రీవుడు రావణునకు శుకచారుని ద్వారా ప్రతి సందేశమంపును -

(1) "పటుకార్ముకంబు యూపంబుగా నిలిపి — చటు లాస్త్రముల్ పరిస్తరణముల్ సేసి
పరగఁ గెంధూళ్ళను ప్రభలు గావించి — తదుచర ప్రసుక్స్రువ తతులు చేపట్టి
సమర భూవేదికా స్థలమున నిలిచి — అమరులకెల్లఁ బ్రియంబెక్కుచుండఁ
గరమొప్పు వీరాంగకములఁ బెల్లుబ్బి — తొరగుచునున్న నెత్తురు నెయ్యి వోసి
... ...
ప్రకట రాక్షస వీర పశు పలలములు — సకల భూతవ్రాత సంతృప్తులెసగ
విడువక సంగ్రామ విపుల యజ్ఞంబు — గడునొప్పఁజేయు రాఘవ సోమయాజి."

(యుద్ధ. ద్వి. 816-827)

ఇది యజ్ఞాంగములతో సంగ్రామమునకు తాద్రూప్యము గావించి వర్ణింపఁబడిన విపులమైన సావయవ రూపక కల్పనము—

(2) వానర రాక్షసులు సంకుల సమరము గావించిరి. అప్పుడు సమరభూమియందు ప్రవహించిన రక్తప్రవాహము నదితో తాద్రూప్యము నొందినది.

నెఱి గల్గు మజ్జంబు నెత్తురుఁబొంపి — తఱచైన వెంద్రుక తండంబునాచు
పునుకలు చిప్పలు పొరిఁబొరి నున్న — ఘనమైన పలకలు కమఠ తుండములు
....
కలగొన ఘన తురంగములు గ్రాహములు — నలిఁదూలు పడగ లున్నతినందు తెరలు
ఇవ్విధంబున మీఱి యేఱుల నెల్ల — నవ్వుచుఁ బటురక్తనది యుబ్బి పాఱె"

(యుద్ధ ద్వి. 2351-2359)

ఇది నది యవయవములతో యుద్ధభూమిపై పడిన ఆయా పదార్థములకు అభేదము గావించి వర్ణింపఁబడిన సావయవ రూపకాలంకార యుక్త కల్పనము —

అమూలకములైన రూపకాలంకారములు -

1. అలవడ నాకు నీయట్టి యంజనము — గలుగుటఁ గంటి రాఘవ నిధానంబు.

(కిష్కింధా. ద్వి. 196)

2. జగతిపై నతిశోక సాగర మగ్న — డగు నీకు రఘురాముడను తెప్పదొరకె.

కిష్కింధా. ద్వి. 185

3. ......బోధ మను రవి శోకాబ్ధి నస్తమించుటయు — భ్రాంతియన్ చీకటి ప్రబలమైపర్వి

అరణ్య. ద్వి. 1217

4. కడిది రాముని యంప కార్చిచ్చులోనఁ — బడి శలభంబపై వ్రాలెదవెల్లి.

యుద్ధ. ద్వి. 1973

5. సంకీర్ణ రవికుల జలధి పొంగడిచి — గ్రుంకెనే లక్ష్మణ కువలయ ప్రియుడు

యుద్ధ. ద్వి. 2594

6. జలనిధి ప్రాపునఁ జరియించుచున్న — బలితంపు రావణ పాఠీన వరుని
ననుపమంబగు తన యంపగాలమునఁ — గొని తివుచుటకునై కూర్చున్న పగిది
యుద్ధ. ద్వి. 157, 158

7. వడి తోడఁజేర్చి రావణ పయోరాశి — పడతుక రఘురాము బాణాగ్ని నిగిరె.
యుద్ధ. ద్వి. 7950

8. బలువిడి రాఘవ భయద దావాగ్ని — నలి దశానన కాననము నీరు సేసె.
యుద్ధ, ద్వి. 7954

9. పడతుక! రాఘవాపర పయోరాశిఁ — గడగి రావణ దివాకరుడస్త మించె.
యుద్ధ. ద్వి. 7955

10. ఆర్చుచు వచ్చునీ యసుర కోపాగ్ని — నార్చెద శరవృష్టి.
యుద్ధ. ద్వి. 4106

మొదలగునవి—

ఇవి యన్నియు కవి స్వతంత్రించి స్వయముగాఁ గూర్చినవి.

ఉత్ప్రేక్షాలంకారము—

"విషయికున్న ధర్మములు విషయమునందుండుటచేత విషయియొక్క తాదాత్మ్యమును విషయమునకుఁ జెప్పుట యుత్ప్రేక్ష యనఁబడును. లేదా ఉపమానము యొక్క తాదాత్మ్యమును ఉపమేయమునందు సంభావించుటయు ఉత్ప్రేక్షయగును."[1]

మూలమునందు ఉత్ప్రేక్షలు తక్కువ; (అసలు లేనే లేవని చెప్పవలెను) ఎక్కడనైనను ఉన్నట్లని పించినచో, అవి ఉపమాలంకారములే కాని వేరుగావు) రంగనాథ రామాయణమునందివి యడుగడుగున కనఁబడుచున్నవి. బుద్ధారెడ్డి తన ప్రతిభా పాండిత్యమును ప్రకటించుట కొఱకే వీనిని జొనిపి యున్నాడని తోచును: అయినను మూలకథాంశమునకు, రసమునకు, ఔచిత్యమునకు భంగము కాని విధమునఁ గూర్పబడినవి.

ఉదాహరణమునకై కొన్నింటిని పేర్కొందును :—

1. పవమాన తనయుని వాలమునకు నిప్పంటించఁబడినది. సీతా ప్రార్థనచే నా వహ్నిజ్వాల చల్లదన మొందెను.

అది అనిల సూనునకు —

"ఘన వాల మను పేరి కాలాహితలను — గనుపట్టు మాణిక్య కళిక నా మెఱసి
యనలుండు కడుఁ జల్లనై యుండె" (సుందర. ద్వి. 925-926)

నని కవి దానిని యుత్ప్రేక్షించినాడు.

2. నాగాస్త్ర బంధితులైన రామలక్ష్మణుల యొద్దకు వచ్చిన గరుడడు "మెఱయు ఱెక్కలతోడి మేఘమో యనగనున్నాడట" (యుద్ధ. ద్వి. 2370)

---

1. చంద్రాలోకము. (ఉత్ప్రేక్షాలంకారము) శ్లో. 27

(3) రావణుని తలలపైన కిరీటములు —

దివిజారి చెలఁబెట్టె దినకరునొకని — దివి నొక్కదినమణి దిరుగుచున్నాడు

తలపఁ దక్కిన భాను దశకమో యనగ" (యుద్ధ. ద్వి. 6336, 6237)

ప్రకాశించుచున్నవట

(4) పరశురాముడు-

క్రమ్మిన జడలలోఁ గాపున్నగంగ — చెమ్మనా నుదుటనుఁ జెమట లుప్పొంగ" (బాల. ద్వి. 2398)

ఫాలాక్షు పగిది శ్రీరాముని యొద్దకు వచ్చెను.

(5) ఆ పరశురాముడు -

తమకించి భుజలక్ష్మి తాఁబట్టియాడు — విమల నాశము తోడి విరిఁదమ్మి యనగ

పరశువు మూపున ధరియించి వచ్చె. (బాల. ద్వి. 2304, 2305)

(6) దశరథుడు

"నాల్గు చేతులనొప్పు నలినాక్షుడనగ — నాల్గు కొమ్ములుగల నాకేభ మనగ" (బాల. ద్వి. 2428)

తన నల్గురు తనయులతో నొప్పుచుండెను.

7. హేమంతమను మేఘ మెల్లెడఁబర్వి — ప్రామిగా వడగండ్లు వర్షించె ననగఁ

గురిసిన పెనుమంచు కుంభిని యెల్ల — నెరసి యొప్పారె ఘనీ భవించుచును. (అరణ్య. ద్వి. 245, 246)

(8) శూర్పణఖ రామలక్ష్మణుల యొద్దకు —

.... ద్రిమ్మరి తనకోర్కి తీదీపులాడ

మఱి మన్మథుని సూత్రమహిమచేఁ దిరుగు — తెఱ బొమ్మయో యనఁ దిరిగెఁ జేరాస. (అరణ్య. ద్వి. 435, 436)

9. శ్రీరాముడు విల్లెక్కు వెట్టి-

"యాగ మృగంబు మున్నర్థి వెన్కొనిన — యా గజాసుర వైరి యనఁ జెన్నుమిగిలి" (అరణ్య. ద్వి. 897)

పసిడి మృగమును వెంబడించెను.

10. మారుతి సీతకై లంకను వెదకుచుండగా—

"............... చుక్కల గమికాడు చూపట్టె మింట

పావని పీడెల్ల పరికింప వలసి — దేవత లెత్తిన దీపమో యనగ" (సుందర. ద్వి, 101, 102)

11. వానర సైన్యము లంకకు ప్రయాణము చేయుచుండగా —

"ఇటు సేన నడవంగ నెగసిన ధూళి — పటలంబు మిన్నందె బహువర్ణములను

ఆరవంబున భారమై యిల కెసగు — తోరంపు నిశ్వాస ధూమంబులనగ" (యుద్ధ ద్వి. 108, 109)

12. విభీషణుడు తన నల్వురు మంత్రులతోఁ గూడి-
"రావణు తనువునఁ బ్రాణంబులైదు — నీవిధంబునఁ బోవు నికనను మాడ్కి
వేగంబె యాకాశ వీధికి నెగసె"

(యుద్ధ. ద్వి. 610, 611)

13. లంకాపట్టణము -
ఎసగిన రాము కట్టెదుటికిఁ గాలు — డసురేశుడను లులాయముఁ బట్టి తేర
నొఱపుగాఁ బ్రద్వీన యోదంబు లనగ — నెఱసిన పరిఖంతో నెంకొని" యున్నది.

(యుద్ధ. ద్వి. 1769, 1770)

14. జయలక్ష్మి రాఘవేశ్వరుఁ బొందఁ గోరి — ప్రియమునఁ గై సేయఁ బెట్టియఁ దెఱచె
ననగ నాకరితల యట్టు ప్రసిద్ధి యొప్పె — ననుపమంబైన ముత్యంబులు సెదర.

(యుద్ధ. ద్వి 4384, 4385)

15. నారదుడు-
మెఱుగులతో శుభ్ర మేఘమో యనగ — నెఱయు పింగళ జటా నిచయంబు వెలుగ.

(యుద్ధ. ద్వి. 1628)

వచ్చెను. ఇట్లెన్నియో కలవు.

రంగనాథ రామాయణమునందు ఉపమా రూపకోత్ప్రేక్షలే కాక, సందర్భానుసారముగా, ఇతరమైన అలంకారములును ప్రయుక్తమైనవి. ఇవి అమూలకములు; కవి ప్రతిభకు నిదర్శనములు అట్టి వానిలో కొన్నింటి నిటఁ బేర్కొందును.

(1) విరోధాభాసము :—

భంగంబు లేకయుఁ బరికించి చూడ — భంగంబునకుఁ దాన పట్టినంబరగి
సత్త్వంబు చెడియు నాశ్చర్యంబు గాగ — సత్త్వ సమగ్రుడై చలనంబు దక్కి
భ్రమణంబు లేకయు భ్రమంబు గలిగి — యమిత వేగంబున నధికతఁదక్కి
యారాము చేతి బ్రహ్మాస్త్రంబు తుపకు — బీరంబు సెడివచ్చి బిందువై నిలిచె.

(యుద్ధ. ద్వి 914-917)

భంగంబు లేకయు భంగంబునకు పట్టునుట, సత్త్వంబు చెడియు సత్త్వసమగ్రుడై యనుట, భ్రమణంబు లేకయు భ్రమణంబు నొందియనుట విరోధము భంగమునకు = అల, అవమానము; సత్త్వమునకు = బలము; జంతువు; భ్రమనమునకు = తిరుగుడు, సుడి, అను అర్థద్వయ సమన్వయముచే విరోధము పోవును. ఇచట విరోధమున కాభాసమేర్పడినది —

(2) సారాలంకారము :—

పూర్వపూర్వమున కుత్తరోత్తర ముత్కర్షముగా జెప్పుట సారాలంకారము.
"పరగు రావణు తమః పటలంబు నడప — నరుదెంచు మధ్యందినాదిత్యు కరణి
అసన్నఖల రావణాదిత్యు మ్రింగ — రాసి యుగ్రత వచ్చు రాహుచందమున
వడిఁ జెర్చి కదియు రావణరాహు మ్రింగ — దడయక చనుదెంచు తార్క్ష్యుని భంగి"

(అరణ్య. ద్వి. 1089-1991)

(బి) ఉత్తరోత్తరమునకు పూర్వపూర్వ ముత్కర్షముగా నుండుటయు సారాలంకారమే.

............"రావణయేనురా రాముని బంటు
రాముడెవ్వడు? పరాక్రమమునఁ బరశు - రాముని గెల్చిన రణవిచక్షణుడు
అతడెవ్వడు? ధృతుండై కార్తవీర్యు - నతి వీరు దుర్మించిన యతుల విక్రముడు
అతడెవ్వ? దెఱుగవా యాజిలో నిన్ను - జితుఁజేసికొని పోయి చెఱ నిడ్డవాడు"
యుద్ధ. ద్వి. 1919-1922.

(3) అపహ్నవాలంకారము :—

(a) సౌమిత్రి యిది వనస్థలిగాదు చూడఁ - గాముని యాయుధాగారంబుఁగాని,
చింతింప నివి మావి చివురులు గావు - కంతుని క్రొవ్వాడి కత్తులుగాని
....
వర్ణింప నివి పిక ధ్వనులు గావతను - కర్ణ కఠోర హుంకారముల్ గాని
యటుగాన నావంటి యంగనా రహితు - లెటువలె వేగింతు రీకాననమున
(కిష్కింధా. ద్వి 20-25)

ఇచట వనస్థలీత్యాదులు వర్ణనీయ వస్తువులు ఉపమేయములు ఆయుధాగారాదు లుపమానములు ఉపమేయము లపహ్నవించబడి ఉపమానములు గ్రహించుట జరిగినది.

(b) ఇదిపక్షిగాదు; మమ్మిందఱఁ జంప - నదయుడై యముడిట్టు లరుదెంచినాడు.
(కిష్కింధా. ద్వి. 1013)

(4) ఉల్లేఖాలంకారము.

..............."చిరకాలముల సీమ, శిశువుల మామ,
పొలుపొందు కలువల పోరాని విందు-కలసిన జక్కవ కవఁ బాపు మందు
పాల వెల్లిని దచ్చి పడసిన వెన్న-శూలియౌదల పువ్వు, చుక్కల నవ్వు
....
హరి హర బ్రహ్మల యానంద దృష్టి-సరసిజ రిపుడైన చంద్రుడు పొడిచె
(యుద్ధ. ద్వి. 1027-1032)

ఇచ్చట చంద్రుడొక్కడె అయానుణములు గలవానిగా అనగా శిశువులకు మామగా, కలువలకు విందుగా, శూలి తల పువ్వుగా, చుక్కలకు నవ్వుగా ఇత్యాదిగా నుల్లేఖింపఁబడినాడు.

5) శ్లేషాలంకారము

ఎ) "జడుడైనవాడు దుర్జనుడైనవాడు-కడుఁ గ్రూర జీవ సంగతినుండువాడు
మలుగక తనలోన మండెడు వాడు- కులగోత్రమైనఁ జేకొని మ్రింగువాడు"
(యుద్ధ. 849, 850)

ఇది సముద్రవర్ణనము. ఇచట దుష్టుని యర్థమును చెప్పబడును.

బి) కుంభ కర్ణుని మందిర వర్ణనము:
"ఆతతానంద భోగాస్పదంబగుచుఁ-బాతాళమును బోలెఁ బరగిన దాని

మహనీయ శతకోటి మహిమచే నింద్రు-మహితాలయమ్ము వోలె మానైన దాని

....

ఉరు విభూతికినెల్ల నునికి పట్టగుచు-హరునివాసము వోలె నమరిన దాని"

(యుద్ధ. ద్వి. 3462-3470)

సి) యుద్ధభూమి వర్ణనము.

సురుచిరామృత వార్ధి సుతయునుబోలె-హరియుక్తమైన నిజాంగంబు గలిగి

చారు వసంత మాసంబును బోలె-నారక్తపుల్ల పలాశాలి గల్గి

....

అక్కజంబయ్యె రణావనీస్థలము-   (యుద్ధ. ద్వి. 3107-3112)

6) సందేహాలంకారము.

ఎ) జగతిపై రోహణాచల మొప్పు మిగిలి-మృగ రూపమై వచ్చి మెలగుచున్నదియో?

....

సీతకై తనవిల్లు చేకొని విఱిచే-సీతజే రఘురాము నెలయింతుననుచు

హరుడు పుత్తెరగా నాతని చేతి-హరిణ మిచ్చోటికై యరుదెంచినదియొ

సీత మోమున కోడి సీత భ్రమింప-శీతాంశు డనుప వచ్చిన మాయలేడొ

(అరణ్య. ద్వి. 842-854)

బి) సమర సమాభీల చక్రియుగ్రతను-నముచిపై వైచిన నాటి చక్రంబొ?

కిరణ జాలంబుల గిరికొన్న భాను-పరివేష చక్రమో? పరికింప ననుచు

7) అర్థాంతరన్యాసము :—

ఎ) క్రకచోగ్ర దంష్ట్రలు గలుగు శూర్పణఖ- — — —

కందర్ప సురుచిరాకారుఁ గామించె-అందని పంటికి నఱుచాపఁ దగునే

(యుద్ధ. ద్వి 6142-6144)

బి) తారు పెట్టిన చెట్టు తారు ద్రుంపుదురె-యే రూపమున నితడెంత కీడైనఁ

దగు బుద్ధి సెప్పుట తగవగుఁ గాని-తగదిటు వలె శాప దగ్ధునిఁ జేయ

(యుద్ధ ద్వి. 3609, 3610)

8) యథా సంఖ్యాలంకారము.

ఎ) ఖరుని బాణములు రాఘవుని బాణములు-ధరణీ తలము వియత్తలమును బొదివె

(అరణ్య. ద్వి. 625)

బి) మాట మాత్రంబున మహియు నాకసము-మీటను నాట నమ్మేటియె నేర్చుఁ

గార్చిచ్చునైనను, గరువలినైన-నార్చను నూర్చను నాతడే నేర్చు

(అరణ్య. ద్వి. 684-685)

(9) స్మరణాలంకారము :—

(a) శ్రీరాము డయ్యెడ శీతల వారి - వారి జోత్పల కైరవంబుల నొప్పు

పంపయు మధుమాస ఫల తరుతీర - చంపక సహకార చారు కాంతార

సంపదయును జూచి జానకీ విరహ - కంపితుడగుచు లక్ష్మణున కిట్లనియె
(కిష్కింధా. ద్వి. 1-3)

ఇచ్చట శ్రీరాముడు వారి, వారిజోత్పలాదులు చూచుటచే నతనికి సీతాదేవి లావణ్య, వదన, నేత్ర, కుచ, నాసికాదులు స్మృతికిఁ దట్టగా విరహ కంపితుడయ్యెను.

(b) — — — — చంద్రుడు గాని యర్కుండు గాడు
జననాథ హరిణ లాంచనమదె చూడు - మని లక్ష్మణుడు పల్క హరిణాక్షి పోయె
నని సీతఁ బేర్కొని యట మూర్ఛ వోవ.— (కిష్కింధా. ద్వి. 784, 785)

హరిణ లాంచన శబ్ద శ్రవణముచే హరిణాక్షి స్మృతికిఁ దట్టినది.

(10) సమాసోక్తి:—

"తరుణి నీ కౌగిటఁ దవిలి సుఖించు - పురుషుడే తలపోయఁ బురుషోత్తముండు
కామిని నీ పొందు గలవాడె పూర్ణ - కాముడతడు నిత్య కళ్యాణు డరయ"
(ఆరణ్య. 984-985)

ఇట విష్ణువని అంతరార్థము ధ్వనించుచున్నది.

(11) భ్రాంతిమత్తు:—

"మదనాతురుండనై మదిఁ జాల భ్రమసి - యుదయాద్రిపైనున్న యుడురాజుఁ జూచి
యిది యేమి యుత్పాత మిది యేమి చంద - మిదియేమి యీరాత్రి యినుడెల పొడిచె"
(ఆరణ్య. ద్వి. 781, 782)

శ్రీరామునికి మదనాతురత్వముచే తాపము కలుగు కారణమున చంద్రుని యందు సూర్య భ్రాంతి కలిగినది.

(12) సహోక్తి:—

(a) అంత సూర్యోదయమయ్యె రాఘవుని - చింత తోడనె కూడి చీకటి వాసె"
(యుద్ధ ద్వి. 4817)

(b) "అనుచుండ నుదయించె నంతఁ జందురుడు - వనధితో నాశోక వనధి యుప్పొంగ"
(అయోధ్యా. ద్వి. 1228)

(14) రత్నావళి—

"శరమొక్కటియు పది శరములై నూరు - శరములై పదివేల శారములై మఱియు
లక్షయై కోటియై లక్షించి చూడ - నాక్షణంబున సంఖ్యలన్నియుఁ గడచి"
(యుద్ధ ద్వి. 2177, 2178)

ఇచట ఒకటి, పది, నూరు, పదివేలు, లక్ష, కోటి యని క్రమము తప్పక ఉత్తరోత్తరాతిశయము చెప్పఁబడినది.

(14) విషమాలంకారము:—

అతదేడ నేనేడ యాహవంబేడ - బ్రతికి వచ్చుట యేడ భావించి చూడ
(కిష్కింధా. ద్వి. 438)

(15) నిదర్శనాలంకారము:—

(a) "జయశాలి యగుచున్న సౌమిత్రి లేని - జపము నాకంధుని చంద్రోదయంబు
(యుద్ధ-ద్వి. 2587)

(b) ఉడుగని వగలతో నొక్కొక్క దినము - గడచుటొక్కొక్క వార్ధి గడచుట నాకు
(సుందర ద్వి. 578)

16 దృష్టాంతాలంకారము:—

"తలమీది రఘురామ ధరణీశుఁ దొడరి - పొలియక నిలుతురే పోర రాక్షసులు
మిడుతలు కార్చిచ్చు మీద గర్వించి - పడి నిల్వ నేర్చునే భస్మంబు గాక"
(అరణ్య. ద్వి. 937, 938)

(17) కారణమాలాంకారము:—

"ధర్మమెక్కడనుండుఁ దగిలి దైవంబు - నిర్మల స్థితి తోడ నిలుచు నక్కడను
ఎక్కడ దైవంబు నేపారుచుండు - నక్కడ విజయంబు నమరుచునుండు."
(యుద్ధ.ద్వి. 1358, 1359)

ఇచట పూర్వ పూర్వములు ఉత్తరోత్తరములకు కారణములుగా నిబద్ధింప బడినవి.

18) అనన్వయాలంకారము:—

నలిఁ దిరంబై నిల్చి నభముతో నభము-జలధితో జలధియు సరిఁ బోలు కరణి
రామ రావణుల సంగ్రామంబు తోడ-రామ రావణుల సంగ్రామంబె పోలు
(యుద్ధ. ద్వి. 7671, 7672)

19) వికల్పాలంకారము :—

అలరి సేతువు గట్టియైనను నడవు-మలఘు విక్రమ యూరకైనను నడువు
(యుద్ధ ద్వి. 945

ఇట్లు ఆయా యర్థాలంకారములు రసౌచిత్యముగాఁ బొందుఁ బరుపబడినవి.

శబ్దాలంకారములు

అర్థము నపేక్షింపక శబ్ద మాత్రము నాశ్రయించినది శబ్దాలంకారము వృత్త్యనుప్రాసాదులు శబ్దాలంకారములు. శ్రవణ పేయత ముఖ్యముగా శబ్దాలంకార ప్రయోజనము.

ద్విపదలు పాడుట కనువుగా గేయచ్ఛందస్సున వ్రాయబడి యుండుటచే ఈయను ప్రాసాది శబ్దాలంకారములు శ్రవణసుభగత్వమును సమకూర్చునవై తద్గేయమునకు అధిక రమణీయత నాపాదించును.

రంగనాథ రామాయణమునందు అనుప్రాస, యమకాది శబ్దాలంకారములు విసుగు గొల్పని రీతిగా కావ్యము నిండ ప్రయోగింపబడినవి.

1) అనుప్రాసము :

దీనిని వృత్త్యను ప్రాసమనియు నందురు. ఒక వర్ణము గాని రెండు మూడు వర్ణములుగాని పునరుక్తములైనచో వృత్త్యను ప్రాసము.

ఎ) ఆ యహల్యా నతుల్యా హత మనశ్శల్యఁ-జేయవే శ్రీరామ॥ (బాల. ద్వి. 1493)

బి) రాజ హంసోద్ధూత రాజీవరేణు-రాజీ విరాజిత రంగత్తరంగ
గంగ నాలోకించి" (బాల. ద్వి. 9039, 9040)

సి) నాడెల్ల నేలెడునాడు నాపిన్న-నాడొక్క నాడేను నడురేయిఁ బోయి (అయోధ్యా. ద్వి. 9997)

డి) బర్హిణ పర్ణ నిబర్హణ పవన-గర్హణ చణ కాంతి ఘనవేగతురగ [అరణ్యా. ద్వి. 490)

ఇ) అంత నీహార ధరా క్రాంత దశది-శాంతమై హేమంతమవనిఁ బర్వుటయు
(అరణ్య. ద్వి. 244)

మొదలగునవి.

2. ఛేకాను ప్రాసము.

ఛేకులనగా విదగ్ధులు. వారిచే ప్రవర్తితమైన యను ప్రాసము ఛేకాను ప్రాసము "అవ్యవధానముగా రెండేసి హల్లుల జంటలను ఒకసారికన్న నధికముగా నొడువుడు ఛేకాను ప్రాసము"

ఎ) శిలికంఠు చరణ రాజీవాలి వాలి. (కిష్కింధ. ద్వి. 409)

బి) ఖరునిపై ఖర కర కర సహస్రాళ (అరణ్యా. ద్వి. 659)

సి) ప్రకటిత శుభరతు భరతు నీక్షించి (బాల. ద్వి. 2430)

డి) ఈ కైక లోకైక హితము గావించె (అయోధ్యా. ద్వి. 1575)

ఇ) ఉరుతాపి వాతాపియును నిల్వలుడును (అరణ్యా. ద్వి. 1232)

ఎఫ్) కైలాస నిభకేశి కైకేశి కనియె [యుద్ధ. ద్వి. 1232]

మొదలగునవి.

3) అంత్యాను ప్రాసము.

పదాంతమున గాని పాదాంతమున గాని అక్షర సామ్యముండునట్లు చెప్పుట అంత్యాను ప్రాసము.

ఎ) పదాంతమైన అంత్యాను ప్రాసము.

అ) ఓ రామ! శుభనామ! యుత్పల శ్యామ!-క్రూర దానవ భీమ! గుణధామ నీవు॥"
(అరణ్యా. ద్వి. 211)

ఆ) "రాక్షస పతి యంత రణబలోదారు-నిక్షుచాపాకారు నిర్ధవిచారు
అక్షీణ దోస్సారు నసహాయ శూరు-అక్షకుమారు మహావీరుఁ బిలిచి"
(సుందర. ద్వి. 768, 769)

ఇ) ఇందీవర శ్యాము నినకోటి ధాము-సౌందర్య జితకాము జగదభిరాము
రాము వైదేయ విరాము నీక్షించి" (అరణ్యా. ద్వి 396, 397)

మొదలగునవి.

బి) పాదాంతమైన అంత్యాను ప్రాసము

1) .... సంఫుల్లారుణార - వింద పల్లవ గర్వ విభవ భేదములు
యతి వధూ తిలక శాపాపనోదములు - శ్రుతి శిరో భవన విశ్రుత వినోదములు
(అయోధ్యా. ద్వి. 2782, 2783)

సి) అర్ధ పాదాంతమైన అంత్యానుప్రాసము.

అ) ... . జనక తనూజాత జగదేకమాత
నిఖిల సన్నుత పూత నిర్మలఖ్యాత-యఖిల గుణోపేత యయిన యాసీత
(యుద్ధ, ద్వి. 1375-1376)

ఆ) "లలితా గమస్తోత్ర లక్ష్మీకళత్ర-విలసద్దయా పాత్ర విబుధారి జైత్ర
... ... అనుపమ శుభగాత్ర అఖిలైక సూత్ర
(యుద్ధ. ద్వి. 688. 689)

ఇ) "నిత్య సత్యత్రాణ నిత్య కళ్యాణ-నిత్య జగత్ప్రాణ నిత్య గీర్వాణ" (యుద్ధ ద్వి. 673)
మొదలగునవి.

4) యమకాలంకారము.

సమానమైన వ్యంజన సముదాయమునకు పౌనరుక్త్యము యమకము. అనగా "ఒకే విధమైన క్రమమున నసమానమగు నర్థము గల [సమానార్థకములు గాని] సమాన వర్ణములయొక్క జంట కానీ, పెక్కింటి యొక్కకాని యావృత్తి యమకము"[1]

అ) ఖగములచేఁ జావగలవను కరణి-ఖగములు సుడివడగాఁ బాఱఁ జొచ్చె [యుద్ధ. ద్వి. 3820]
ఖగములు = బాణములు, పక్షులు

ఆ) నారికై పుట్టిన నాకోపమెల్ల-నారిచేఁజూపెద నాకరికిపుడు
నారి = అల్లెత్రాడు. కాంత. [యుద్ధ ద్వి. 4105]

ఇ) దొరమెలుకొనడంచు దొరకొన్న చింత. [అయోధ్యా. ద్వి. 1836]
దొర = రాజు, దొరకొన్న = కలిగిన.

ఈ) అంబకంబేల నాయంబకంబులనే-యంబుధి నింకితు. [యుద్ధ. ద్వి. 901]
అంబకము = బాణము, చూపు.

(ఈ) దుందుభిగిరి మ్రోయు దుందుభిఁదాకి. (కిష్కింధా. ద్వి 335)
దుందుభి = నగారా, రాక్షసుని పేరు.
మొదలగునవి-

(5) ముక్త పద గ్రస్తము :-

పదాంతమునందుగానీ, పాదాంతమునందుగానీ విడువబడిన పదమును పదాది యందును, పాదాదియందును గ్రహించుట ముక్తపదగ్రస్తము. దీనిని అంతాది యమకమనియు నందురు.

(అ) .... మాలూర ఖర్జూర మందార తరులఁ
దరులఁ గ్రిక్కిరిసిన తావి క్రొవ్విరుల - విరుల తేనియాలాని వెలయు తుమ్మెదల
మెదల నింపగునట్టి మేటి పూఁబొదలఁ - బొదలలోఁ బగలేక పొదలు మృగముల
(అరణ్యకాండ. ద్వి 203- 05)

(ఆ) - - - ఇంక నెక్కడి రాముడిందెట్లు వచ్చు?
వచ్చి లంకాపుర వరమెట్లు చొచ్చు? - జొచ్చి నన్నెబ్భంగి సుక్కడక యెదురు?

---

1. సన్నిధానము సూర్యనారాయణ శాస్త్రి. కావ్యాలంకార సంగ్రహము. పుట. 551

నెదిరి నాతోఁ బోర నెబ్బంగిఁ గదియుఁ? - గదిసి నాసత్త్వ మేగతి సైపఁజాలుఁ?
జాలుట యెందొక సమకూరఁ బోలుఁ? - బోలవీ మాటలు పోవిడుమింక.

(సుందర. ద్వి 296-298)

(6) సులలిత నానార్థ పదప్రయోగము-ఇవియు యమకములే-

(ఎ) పుండరీకంబులఁ బోలుపారు వారు - పుండరీ క్షులఁ బోలుపారు వారు.
పుండరీకచ్ఛాయఁ బోలుపారు వారు - పుండరీకోన్నతిఁ బోలుపారు వారు.

(యుద్ధ ద్వి. 4630-4631)

పుండరీకము = తెల్లదామర. తెల్లగొడుగు, పెద్దపులి. అగ్ని. తెలుపు"[1]

(బి) కరములు కడు భయంకరములై రాము - కరములకెందు దుష్కరములు గాక
కరమొప్పుగా నవత్కరములై యిపుడు- కరి కోట్లు వసుమతిఁ గంపింప నడచె.

(యుద్ధ. ద్వి 3196-3197)

కరము = తొండము. చేయి. మిక్కిలి కిరణము[2]

(సి) తొగలు దట్టింతురు దుష్టారి సతుల - తొగలు జానకి యింకఁ దొంగంగ నైనఁ
దొగలార యికమీఁదఁ దొగయిట్టి దనుచుఁ - దొగలెల్లఁ జిదిమి వైతురు పెచ్చుపెరిగి.

(యుద్ధ. ద్వి 141, 142)

తొగ = కష్టము, కలువ, సమూహము, విధము.[3]

మొదలగునవి -

ఇట్టి శబ్దాలంకార ఘటన చేత రంగనాథ రామాయణము మనోహరమై సాహితీ ప్రియ భావుకుల కవిరళ సంసేవ్యమానమై యొప్పుచున్నది

ప్రతికాండాంతమునఁ జెప్పిన "పరగ నలంకార భావనల్ నిండ"యనునది సార్థకమై పరగిన దనుటలో అతిశయోక్తి లేదు.

-: వర్ణనలు :-

"కవయతీతి కవిః, కవృ వర్ణే" అని కవి శబ్ద వ్యుత్పత్తి 'కవయతి' అనగా 'వర్ణయతి'యని యర్థము. వర్ణించువాడు కవి. వర్ణనా శబ్దార్థము కవి శబ్దములోనే కనబడుచున్నది. కవి కర్మ కావ్య మని నపుడు కావ్యము వర్ణనా యుతమని తేలును. "వర్ణనము తోడనే కవిత యుదయించినది."[4] వర్ణనమే కవిత కవిత యనగా వర్ణనమే. కవితకు వర్ణనకు అభేదము.

ప్రపంచమునందలి చెట్లు. చేమలు. వాగులు వంకలు మిట్టపల్లములు, సూర్యచంద్రులు. భూమ్యాకాశములు, ఎండవానలు, శుకపికములు, ఉదయాస్తమయములు ఉబుములు మెఱుపులు ఇత్యాద్యనేక విషయములు ప్రకృతిలోని సుందరదృశ్యములు వానిని దర్శించినపు డానందముతో పాటు ఒక విధమైన యనుభూతి యేర్పడును. ఆ యనుభూతి హృదయ స్పందనము కలిగించును.

1, 2. మహాకాళి సుబ్బారాయుడు. శబ్దార్థచంద్రిక. పుటలు. 872, 293.

3. ,, ,, ,, పుట. 655.

4. "నోదితా కవితాలోకే యావజ్జాతా నవర్ణనా" భట్టతౌతుడు.

ద్రష్ట వర్ణనా నిపుణుడైనచో, అతనికి కలిగిన భావతరంగములు కవితారూపమున జాలువారును. కావున ప్రకృతికిని కవిత్వమునకును విడదీయరాని సంబంధము కలదు. అసలు కవిత్వావతరణమే ప్రకృతి వర్ణనతో ప్రారంభమైనది.

డా॥ సి. నారాయణరెడ్డిగారు "తళుక్కున మెఱుపు చూసికొని పోయినపుడు, ఒక పుష్కలావర్తకము మదగజమువలె ఘీంకరించినపుడు, ఒక మలయ పవన వీచిక అలసగమనముతో వచ్చి మన తనువు నిండ చందనము రాసి పోయినపుడు ఆది మానవుని ఆత్మ పాలకెరటమై పరవళ్ళు ద్రొక్కినది. అప్పుడే కవిత్వమునకు నాంది జరిగినది. అట్టి స్వాదు సమయములలోనే తూర్పున వేద ఋక్కులు తొంగి చూచినవి"[1] అని కవిత్వావతరణములో ప్రకృతి ప్రాధాన్యమును, తద్వర్ణనావసరమును సమర్థించి యున్నారు.

కావున కావ్యమునందు వర్ణనలుండుట సహజసిద్ధము. ఈ వర్ణనా పరిధిలో వన, గిరి, నదీ, తటాకాది ప్రకృతి దృశ్యములే కాక, కథాకథనము, సన్నివేశ చిత్రణము ఇత్యాదులు చేరును. కొంతమంది కవులు వర్ణనా లౌల్యమునకు లోనయి, యేదో యొక విధమున సందర్భమును కలిగించుకొని తమ పాండిత్య ప్రతిభలను ప్రకటించుటకై వర్ణింతురు. కాని సమర్థుడగు కవి కథాసన్నివేశమునకు, పాత్ర పోషణమునకు ఉత్కర్ష నాపాదించునట్లు వర్ణనాంశములనుస మకూర్చి లోకోత్తరముగా హృదయ రంజకముగా నిజమనిపించునట్లు వర్ణించును.

మహాకవులు ప్రకరణౌచిత్యమును బట్టి వర్ణనలను పెంతురు; లేక కుదింతురు. అట్టి పరిమిత వర్ణనలు పఠితకు విసుగు కల్గింపక, కథాంశములకు పూర్వరంగములై చిత్రములకు భిత్తికల వంటి వగును: కథయందు పాలు నీరు వలె విడదీయరాని రీతి కలసి పోవును.

"మహాకావ్యములందు అష్టాదశ వర్ణనలుండ వలెనని లాక్షణికుల నిర్దేశము".[2] ఒకటి రెండు తక్కువగాను నుండవచ్చును మఱికొందఱీ సంఖ్యను ద్వావింశతికి పెంచిరి.[3] కాని వర్ణనలెన్నైనను ఎట్టివైనను, రస కథాభంగ కరములై పఠితలకు విసుగు కొల్పునవి కాకూడదు. కావున వర్ణనా విషయమున కవికి సంయమనము, ఔచిత్యదృష్టి అత్యంతావశ్యకము.

కవులు ప్రకృతిని వర్ణించుటయందు ప్రధానముగా రెండు పద్ధతుల నవలంబించిరి.

1 ప్రకృతిని మానవీకరించుట - అనగా మానవుని కష్టసుఖములతో ప్రకృతి సహానుభూతి చూపుచున్నట్లు, పాలు పంచుకొను చున్నట్లు వర్ణించుట. ఇది ప్రకృతికి కథాంశమునకు రమణీయ సంబంధమును కల్పించుట వంటిది -

2. ప్రకృతి సౌందర్యమును స్వాభావికముగా నున్నదున్నట్లు వర్ణించుట అనగా నాయికా నాయకాది పాత్ర నిరపేక్షముగా ప్రకృతిని వర్ణించుట. ప్రకృతి దృశ్యము లన్నియు మానవ చర్యా సంబంధము లేనివి; అయినను అవితమంతతామే మనోహరములుగా నుండును

ఈ రెండింటిలో మొదటి పద్ధతి ఉత్తమమైనది. ఏలన, "సూర్యోదయ, సూర్యాస్తమయాది

---

1. ఆధునికాంధ్ర కవిత్వము. (సంప్రదాయములు ప్రయోగములు) పుట. 54.
2. ప్రతాప రుద్రీయము కావ్యప్రకరణము. శ్లో. 69-71. పుట. 82.
3. అప్పకవీయము. ఆశ్వాసము. 1. పద్యము. 28.

సుందర దృశ్యములు తమంతట తామే వర్ణనా యోగ్యము లయ్యెను, అవి మానవ చర్యలకు భిత్తిక లయి కావ్య వర్ణనములో మిళితమైనపుడు మరింత సుందరముగా నుండును."[1]

మహాకవులు సందర్భమును ఔచిత్యమును పాటించి ఉభయవిధ వర్ణనలకును తమ కావ్యము లందు సముచిత స్థానమును కల్పింతురు వాల్మీకి మహర్షి మహాకవి. ఇతడు ప్రకృతి వర్ణనలను నిసర్గ రమణీయముగా సంతరించుటకును, ప్రకృతితో పాత్రలకును కథా సన్నివేశములకును తాదాత్మ్యము కల్గించుటకును అనగా మానవీకరించుటకును ఆద్యుడై తరువాతి వర్ధమాన కవులకు మార్గదర్శకుడైనాడు.

మధుమయ ఫణితీనాం మార్గదర్శీ మహర్షిః॥"[2]

ఆ ప్రాచేతసుని అడుగుజాడలలోనే నడచిన బుద్ధారెడ్డియు రంగనాథ రామాయణమునందు రెండు విధములైన వర్ణనలకును సముచితస్థానము నొసంగి యున్నాడు. ఇవి యథామాతృకము లనియు, అమూలకము లనియు రెండు విధములు. యథామూల వర్ణనలలో కొన్ని సంక్షిప్తములు, మరికొన్ని విస్తృతములు.

వాల్మీకి రామాయణము మహాకావ్యము. దీని బృహత్త్వమున కనుగుణముగా నింక పుర నదీ వన పర్వత తటాక సముద్ర సూర్యచంద్ర నక్షత్రోదయాస్తమయాదులు వసంత వర్ష శరద్హేమంత ఋతువులు, నాయికా నాయకాది స్వరూప స్వభావ వర్ణనలు అతివిస్తృతముగా సహజ సుందరముగా సందర్భ సముచితముగాఁ గావింపబడినవి. కాని బుద్ధారెడ్డి ఎక్కువగా కథాదృష్టి కలవాడగుటచే వీనిని సముచితముగా సంక్షిప్తము చేసియున్నాడు—

ఇక రంగనాథ రామాయణమును వాల్మీకి రామాయణముతోఁ బోల్చి ప్రత్యక్షర తులనాత్మక పరిశీలనము గావించి నపుడు, కథాంశమును వదలినచో కేవలము ప్రకృతి గత వర్ణనాంశములందు నూటికి తొంబది పాళ్ళు మూలమున లేని క్రొత్త వర్ణనలను, కల్పనలను బుద్ధారెడ్డి చొప్పించి నట్లుగ పడును. మూలమునందలి ప్రకృతి వర్ణనాంశములు క్వచిత్తుగాఁ దప్ప చాలవరకు నిందు గ్రహింపఁ బడలేదు. తత్స్థానములందు నూతన వర్ణనలు గావింప బడినవి; గ్రహింపబడిన వానిలో కూడ, ఏవో కొన్ని తప్ప చాల వరకు ఔచిత్యమును పురస్కరించుకొని, కథాంశములను దృష్టియందుంచుకొని మార్పుచేయ బడినవి తారతమ్య మీక్రింది విధమున నుండును.

వాల్మీకి రామాయణము	రంగనాథ రామాయణము.
1. ప్రకృతి వర్ణనలందు భావి కథాంశము లెచ్చటను ఉత్ప్రేక్షింప బడలేదు.	1. ప్రకృతిని మానవీకరించి చేసిన వర్ణన లందు భావి కథాంశములు పఠితలకు సూచింప బడునట్లు ఉత్ప్రేక్షిత ములైనవి—
2. ప్రకృతి పాత్రలతో తాదాత్మ్య మొందినట్లు స్పష్టముగా పగపడదు.	2. ఇందు తాదాత్మ్యత స్పష్టముగా వర్ణిత మైనది.

1. దువ్వూరి రామిరెడ్డి "కవికోకిల గ్రంథావళి" సంపుటి. vi. నేటికవిత. ప్రకృతి పూజ. వ్యా.
2. చంపూ రామాయణము. బాలకాండము. శ్లో. 11.

3. వర్ణనలు విస్తృతములు. (దీర్ఘములు)

3. వర్ణనలు నాతి విస్తృతములు.

కవి కథాంశముల యందు దప్ప ప్రకృతి గత వర్ణనాంశములందు చాల వరకు స్వాతంత్ర్యము వహించినాడు కల్పన లనేకములు మూలాతిరిక్తముగాఁ గావింపబడినవి. కథను ప్రక్కకు బెట్టి, కేవలము వర్ణనలను బట్టి పరిశీలించిన ఇది స్వతంత్ర రూపమున వ్రాయబడిన కావ్యమని తోచును —

(I) మానవీకరణ వర్ణనలు —

ప్రకృతికిని పాత్రలకును తాదాత్మ్యమును స్థాపించుట, మానవుని కష్టసుఖాలతో ప్రకృతి సహానుభూతిని చూపుచున్నట్లు, పాలుపంచుకొను చున్నట్లు వర్ణించుట మానవీకరణ మనబడును. ఇది ప్రకృతికి కథాంశమునకును రమణీయ సంబంధమును కల్పించుట యనదగును.

వర్ణనలకును అలంకారములకును అవినాభావ సంబంధము గలదు ఉన్నదున్నట్లుగా, సహజత ఉట్టిపడునట్లుగా వర్ణించి, అలంకారమేదియు లేదనినను, అట్టి సహజ స్వభావమును దెలుపు వర్ణనమే స్వభావోక్త్యలంకారమగును. కావున నిరలంకార వర్ణన ముండదనియే చెప్పవచ్చును.

ప్రకృతిని మానవీకరించి చేసిన వర్ణనలందు సాధారణముగా ఉత్ప్రేక్షలుండును. వీనికొక్కొప్పుడు రూపకమును ప్రాణితమై సౌందర్యము చెప్పరాని దగును. ఇట్టివి వాల్మీకి రామాయణము నందుకంటె రంగనాథ రామాయణమునం దధికములు; అయినను "ప్రకృతిని పాత్రలకును తాదాత్మ్యము తాపించుటకు మహర్షి వాల్మీకియే ఆద్యుడు"[1] పరికించుడు.

అ) శ్రీరాముడు సీతా సౌమిత్రులతో తండ్రిమాటపై అడవులకేగుచుండెను. "ఆ సమయమున పాదపములు రామ వియోగ దుఃఖమున పరితపించుచు, నేలయందు పాదుకొనిన పాదములతో రాముని ననుగమింప లేక, గాలివేగమున హోరని యేడ్చుచుండెను"[2]

చెట్ల కొమ్మలు గాలికూగుట, ఆకులను రాల్చుట, ధ్వనించుట ప్రకృతి దర్మము. దీని నాలంబముగాఁ జేసికొని "ఆకులు రాల్చు చెట్లేడ్చిన"వని తాదాత్మ్యము వర్ణింప బడినది.

ఆ) సుమంత్రు డయోధ్యకు వనమునుండి తిరిగి వచ్చుచు "త్రోవ నడుమ రామ వియోగ శోకాగ్నిచే మరగి పోవుచున్న చెట్ల యందలి పూలు మొగ్గలు మాడియుండుటను, నదీ సరస్సుల జలము సలసల క్రాగుచుండుటను, చెట్ల యాకులు వాడి వరుగులై రాలుచుండుటను"[3] చూచి యుండెను.

ఎండకు పూలు మొగ్గలు మాడుట, నదీ తటాక తోయములు క్రాగుచుండుట, ప్రకృతి గుణము. దీని నాధారము చేసికొని "ఇచ్చట రామ వియోగాగ్నిచే మాడిన వనియు, క్రాగినవనియు"

---

1. చేకూరి చెన్నకృష్ణ "ప్రకృతి ప్రబంధము" పుట. 4.
2. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. అయోధ్యా. సర్గ. 45. శ్లో. 30.
   అనుగంతు మశక్తాస్త్వాం మూలైరుద్ధత వేగినః।
   ఉన్నతా వాయువేగేన విక్రోశంతీవ పాదపాః॥"
3. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. అయోధ్యా. సర్గ. 59 శ్లో. 4,5.

తాదాత్మ్య భావమున వర్ణింప బడినది ఇది ప్రకృతి పాత్రలపై సానుభూతి చూపినదని వివరించుట యగును.

ఇ) "రావణాసురుడు సీతాదేవి తలవెంట్రుకలు పట్టి యీడ్చెను. ఆవేళ జంగమస్థావ రాత్మకమైన జగమునందంతయు చీకట్లు క్రమ్మెను. గాలి విసరలేదు. సూర్యుడు కాంతిహీను డయ్యెను.[1]

ఉత్తముల కన్యాయము జరిగినప్పుడు, చూచువారు ఆ యధర్మమును నిరసించుట లోక ధర్మము. ప్రకృతిలో ఒక్కొక్కప్పుడు గాలి స్తంభించుటయు, సూర్యుని కాంతి మాసినట్లుండుటయు మేఘచ్ఛన్నమున చీకట్లు గ్రమ్ముటయు ప్రకృతి ధర్మము. ఈ రెంటిని మేళగించి, ప్రకృతి రావ ణుడు సీతయెడ ప్రవర్తించిన అధర్మమును చూచి సహింపలేక, నిరసనమును చూపినట్లు నిట వర్ణింపబడినది.

ఈ) రావణుడు సీత నపహరించుకొని పోవుచుండెను. అట్టిచో పర్వతములు ఎత్తైన శిఖ రములనెడు బాహువుల నెత్తి సెలయేళ్ళను కన్నీళ్ళు జారగా నేడ్చినవి."[2]

కొండల మీది నుండి సెలయేళ్ళు క్రిందికి ప్రవహించుట ప్రకృతి దృశ్యము. దీని నాధారముగా జేసికొని, పర్వతములు కన్నీళ్ళు కారగా ఏడ్చుచున్నవని వర్ణించుట ప్రకృతిని మానవీకరించుట.

ప్రకృతి తత్తత్ పాత్రలపై సహానుభూతిని చూపినదని తెలుపుటయే ఇట్టి వర్ణనల ప్రయో జనము ఇటువంటివి వాల్మీకి రామాయణమునందధికముగా లేవు.

బుద్ధారెడ్డి పైన చూపిన పట్టులందలి వర్ణనలను గాని, అట్టి వానిని గాని అనువదించలేదు; అనుకరించలేదనియే తులనాత్మక పరిశీలన వలన తెలియుచున్నది. కాని ఆయా పట్టులందు ప్రకృతిని మానవీకరించి, కథా సంబంధమును కలిగించి, ఉత్ప్రేక్షించిన వర్ణనలు రంగనాథ రామాయణ మున చాల గలవు. అవి యన్నియు కవి యూహాజనితములు, క్రొత్తవి. లేక మూలమునందలి వానిని మార్చి వ్రాయబడినవి. ఉదాహరణార్థమై కొన్నింటిని పేర్కొందును

1) విశ్వామిత్రుడు రామసౌమిత్రులతో మిథిలకు వచ్చెను. జనకుడు శతానందాదులతో నెదురేగి సత్కరించెను. ఆ దినమంతయు కుశల ప్రశ్నలతో, విశ్వామిత్ర బ్రహ్మర్షి ప్రాప్తి కథా వివరణములతో గడచెను ఇంతలో

సూర్యుడస్తమింపబోవు చుండెను "[3]

ఇచట సూర్యాస్తమానము జనక విశ్వామిత్రులు ఒకరి నుండి మరియొకరు కాలకృత్యముల దీర్చుకొనగోరి విడి పోవుటకు కారణ భూతమైనది. కాని ఇంతకంటె నెక్కువగా నిట సూర్యాస్త మానమునకు ప్రాముఖ్యత కల్పింప బడలేదు.

బుద్ధారెడ్డి ఈ సూర్యాస్తమానమును కథాంశముతో ముడిపెట్టి ప్రత్యేకతను కలిగించినాడు.

"ఇల్లడ జనకుని యింట నుగ్రాక్షు — డెల్లరెఱుంగ మున్నిడిన చాపంబు

---

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. ఆరణ్య. సర్గ. 52 శ్లో. 11, 12.
2. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. ఆరణ్య. సర్గ. 52, శ్లో. 39.
3. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. బాలకాండము. సర్గ. 65, శ్లో. 34 1/2.

కడకమై విఱిచి రాఘవుడేపు మెఱసి - కడుమోదమున సీతఁ గైకొను నెల్లి
నని రసాతలమున కంతయుఁ జెప్ప - జనిన చందమున భాస్కరుడస్తమించె

(బాల - ద్వి. 1840-1042)

లోక కల్యాణ కరమైన సీతాకల్యాణమునకు పణభూతమైన శివధనుర్భంగము మరునాడు జరుగును. ఎంతయో కాలమునుండి యెదురు చూచుచున్న దేవతలకిది సంతోషదాయకము. తద్ఘన కార్యము సూర్యవంశీయుడైన రామచంద్రుడు చేయుట సూర్యునకు గర్వకారణము. తనవారి గొప్ప తనమును తాను ప్రకటించుట లోకనైజము. తనవారి శుభ కార్యమునకు రమ్మని బంధుమిత్రాదుల నాహ్వానించుట తనకర్తవ్యము. ఈ లోక ధర్మమును పురస్కరించుకొని సూర్యుడు మరునాడు జరుగు ధనుర్భంగ, సీతాకళ్యాణములను ప్రకటింపగా రసాతలమునకుఁ బోయినాడని సూర్యాస్తమానము వర్ణితమై భావి కథ సూచింప బడినది—

(2) కుంభకర్ణుడు యుద్ధమునకు బయలుదేరెను. అప్పుడు "పిడుగులతో మేఘములొప్పెను. భూమి కంపించెను. ఉల్కలు రాలెను. ప్రతికూల వాయువులు వీచెను"[1] అని మూలమునందు దుర్నిమిత్తములు సాధారణముగా వర్ణింప బడినవి. కాని కవి ఇచ్చట వీనిని మానవీకరించి, భావి కథాంశములతో నుత్ప్రేక్షించినాడు. చూడుడు

అ) "దౌర్జన్యమున దుష్టదానవ! నీవు - పర్జన్యు నేచిన ఫలమెల్లఁ గుడువు
మని రాఘవునకుఁ దోడైవచ్చి పేర్చి - తనరార వాని నదల్చిన మాడ్కి
గలయంగ నప్పుడీ కాల మేఘములు - పలుమాఱు (బిడుగులు పరగించి మ్రోసెఁ.

ఆ). దోరంబుగా నోర్చి ద్రుళ్ళెడు వీడు - ఘోరాహవ క్షోణిఁ గుపితుడై నట్టి
తారాధిపతి చేతఁ దారూపఱుటకు - సీరాజ వరునిచే నిటు గూలుటకును
దారు సాక్షుల మని తగఁజెప్పుకరణిఁ - దారలు మండుచు ధరణిపైఁబడియె

ఇ) తను మున్ను నొంచిన దానికై యనిలు - డనయంబు రాముని యాన నీ యసుర
జడనైతునని పేర్చి పరగిన మాడ్కి - పడిగొని ప్రతికూల వాయువుల్ వీచె

ఈ) రాముడు సంప నీ రాక్షసాధముడు - నామీదఁబడు నప్డు నా కెంతవేగు
పుట్టునో యని భీతి పుట్టి కంపించి - న ట్టచందంబున నవని కంపించె"

(యుద్ధ ద్వి 2809-38 8)

పూర్వమపకారము పొందినవారు కొందరు సమయము వచ్చినపుడు ప్రత్యపకారము చేయుదురు దీనిని Tit for Tot అందురు. పైవానిలో ఒకటను మూడవ, వర్ణనాంశములు ఈ కోవకు చెంది, పూర్వాపకారమునకు బదులు తీసికొనెడి స్వభావముగల వారితో తాదాత్మ్యము కలిగింప బడినది.

భారము పడుట వలనను, బలప్రయోగము వలనను కంపన మేర్పడును. చేతనులందు భయము వలనను కంపన మేర్పడుట విశేష ధర్మము. భయము చేతన సహజ గుణము —

"ఆహార నిద్రా భయ మైథునాని-
సామాన్యమేతత్ పశుభిర్నరాణాం" అనునది అభాణకము-

---

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. యుద్ధ. సర్గ. 65 శ్లో. 49-52.

కుంభకర్ణునిది బృహత్కాయము; అంతటి పెద్ద దేహము భూమిపై పడినపుడు భూమికంపిం పక ఉండలేదు కాని ఇట నాల్గవ దానిలోని భూకంపనము భారవస్తువు- "కుంభకర్ణుని దేహము"- పడక ముందు తమూహ జనిత భయమువలన నేర్పడినట్లు మానవీకరింపబడినది.

తారలు (ఉల్కలు) రాలుట ప్రకృతి ధర్మము. త్రుళ్ళి మిట్టిపడెడువాడు రూపఱుట, నేలగూలుట లోకస్వభావము. మూడవదాని లోని తారా పతన వర్ణనము త్రుళ్ళిపడెడు వారితో తాదాత్మ్యము సమ కూర్పఁబడినది—

ఇందలి ప్రతి యుత్ప్రేక్షయు భావియందు జరుగఁబోవు కుంభకర్ణ పతనంబును సూచించుచు కథాంశముతో ముడివెట్టబడినది—

ఇట్టివి మూలమునందు సాధారణముగా నున్నవానిని మానవీకరించి రచించిన వర్ణనలకుదాహ- రణములు—

(3) శ్రీరాముడు వానరసేనతో సముద్రమును జేరెను. అతడు జలనిధినిజూచి, సీతను గూర్చి శోకించుచుండెను అంతలో సూర్యుడస్తమించెను. ఇచ్చట మూలమునందు—

"ఏవంవిలపత స్తస్య తత్రరామస్య ధీమతః।
దినక్షయాన్మంద రుచి ర్భాస్కరోఽ స్త ముపాగమత్॥"[1]

అని మాత్రము కలదు. సంధ్యాంధ కార, తారా, చంద్రోదయాది వర్ణనలు లేవు.

కాని, బుద్ధారెడ్డి యీ అవకాశమును జారవిడువలేదు. లాక్షణోక్తిని పాటించి, మహ కావ్యోచి- తమయిన సంధ్యాది వర్ణనలను గావించినాడు. ఇవియు సామాన్యముగా లేక, ప్రకృతి పాత్రలతో తాదాత్మ్యము గావింపబడిన ఉత్ప్రేక్షలై స్వతంత్రములై కవి వర్ణనా పటిమకు నిదర్శనములై యొప్పుచున్నవి. పరిశీలింపుడు—

1) అని రామవిభుడు శోకాంబుధిలోన - మునుగుచుండగ మూడు మూర్తులు గలిగి
యతని తోడిదే లోకమనిన చందమున - నతి వేగమున నిను డపరాబ్ధిఁగ్రుంకె

2) ఇనుడు గ్రుంకిన యప్పుడెల్ల లోకములు - పెనుపేదె మణి లేని పెట్టియఁబోలె
మనసిజానల తప్తమానసు రాముఁ - గనుగొని తనువుగాఁ గప్పెడు కొఱకుఁ
జెలువొందు నపరాబ్ధి చెంగావి చీర - నెలమి దెచ్చిన క్రియ నెరసంజ యొప్పె

... .

3) చెలువుగా రాముని శీతల క్రియకు - నలిరెగి యాశాంగనలు గూడవైచు
లలిత తమాల పల్లవరాసులనఁగఁ - గలయంగ దెసలఁ జీకటి పర్వఁజొచ్చె

... .

4) శ్రీరామ దేవుని శితమార్గణముల - నా రత్నములు దక్క నంబుధియింకి
యీ రూపమున నుండు నింక నన్మాడ్కిఁ - దారకావళి చేతఁ దనరారె మిన్ను
అనిశీథిని రామునంగ తాపంబు - కై నిబిడంబుగా నమరించియున్న
సారంపు మల్లికాశయ్య నా నొప్పి - తారలు ప్రతిబింబితములయ్యె నబ్ధి

....

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. యుద్ధకాండము. సర్గ. 5. శ్లో. 22.

5) రాజనై యేను వారాశి యుబ్బింతు - రాజవై నీవు వారాశి యింకింపఁ
దలచుట పాడియే ధరణితలేశ। - విలసిత సత్కళా న్వితుడవు నీవు
నటు చేసితేని దోషాకరత్వంబూ - పటు వృత్తి నీయందుఁ బ్రభవించునంచు
దూఱ వచ్చిన మాడ్కిఁ దోచెఁ జందురుడు.

(6) ... . మీఱిన కరములు మిన్నులు ముట్ట
జనకజకై రామ జననాథ తిలక - ననుఁ దలఁదాల్చి మన్నన చేసినట్టి
హరువిల్లు విఱిచిన యాదోషమునను - విరహి వై తివి సీత వెఱపున ననుచుఁ
జందురు డట్టహాసము చేసెననగ - నందంద చంద్రిక లతిశయంబందె"

(యుద్ధ. ద్వి. 172-195)

ఆపదలో నుండి దుఃఖించు వానికి చెలికాండ్రు సహానుభూతి చూపి సహకరిచుట, గిట్టనివారు దోషమారోపించి దూఱుట ప్రకృతి స్వభావము. విరహావస్థలో నున్న వారికి శైత్యోపచారములు చేయుటయు లోకమున కాననగును. ఈ లోక స్వభావమును పురస్కరించుకొని, సూర్యాబ్ధి తమో నక్షత్రోదయములకు మిత్ర తాదాత్మ్యమును గలిగించి సానుభూతితో సహకరించినట్లును చంద్రోదయ చంద్రికా వ్యాప్తులు వైరి తాదాత్మ్యమును బొంది దూషించి యట్టహాసము చేసినట్లును మానవీకరణ దృష్టితో సరసముగా నుత్ప్రేక్షింపబడినవి. ఇవి కథాంశ సాపేక్షములై యొప్పినవి.

(II) స్వాభావిక వర్ణనలు :—

ఇవి ప్రకృతిని మానవీకరింపక, ఉన్నదున్నట్లు సరసముగా జేసిన వర్ణనలు కథా, పాత్ర నిరపేక్షము లగుటచేత నిపి కావ్యము నందున్నను. లేకున్నను అంత యిబ్బందిలేదు కాని. తత్తత్ కథాఘటనలకు పూర్వరంగముగా, ప్రకరణౌచిత్యముగా, రసపంజకముగాని రీతి వర్ణనలు కావింపఁబడినపుడు, పఠితకు ప్రకృతి సౌందర్య వైవిధ్యమును భూతమై ఆహ్లాదము కలుగును. అతని విషయ పరిజ్ఞాన మినుమడించును.

రంగనాథ రామాయణమునందు ఈ వర్గమునకు చెందిన వర్ణనలు నాతి దీర్ఘములై, సందర్భౌచితీశోభితములై కథా దీప్తికి తావలములై యొప్పుచున్నవి వీనినికూడ.

1, యథామూలములు. 2. స్వతంత్రములు (అమూలకములు) 3. అన్యథాకరణములు.
4. పరిత్యక్తములు.

అని నాల్గువిధములుగా వర్గీకరింపవచ్చును.

1. యథామూలములు ;—

మూలవర్ణనలను యథాతథముగా గ్రహించి చేసిన అనువాద ద్విపదల కిందు కొదవలేదు. ఇవి తెనుగు నుడికారమును పుణికి పుచ్చుకొని, స్వతంత్ర రచనలవలె భాసించుట ముఖ్యవిశేషము. పరిశీలింపుడు.

(ఎ) విశ్వామిత్రుడు రామలక్ష్మణులకు కౌశాంబి వృత్తాంతమును తన వంశక్రమమును వివరించెను. అప్పటి కర్ధరాత్రమయ్యెను ఆనడురేయి దృశ్యమిట్లున్నది—

"నడురాత్రి యరుదెంచె నరలోకనాథ! - కడు డస్సినాడవు కనుమోడ్తుగాక
చలియింప కున్నవి సకల వృక్షములు - మొలగవు వనభూమి మృగ సమూహములు

నెఱి విహంగంబులు నీడముల్ చేరి - మరచి యున్నవి తమ మంజుల ధ్వనుల.
యామినీచరులైన యక్షరాక్షసులు - భూమి విచ్చల విడిఁబోరి చరించెదరు
దీటుగాఁ జీకటి దెసలు నాకసము - కాటుకఁ బూసిన కరణి నున్నదియు
— — — —
అడరంగ జనులకు నానంద మొదవ - నుడురాజు వొడతెంచు చున్నాడటన్న"
(బాల. ద్వి. 1006-108)

దీనికి మూలము-
"గతోఽర్ధ రాత్రః కాకుత్స్థ కథాః కథయతో మమ
నిద్రా మభ్యేహి భద్రంతే మాభూద్విఘ్నోఽధ్వనీహనః।
నిష్పందా స్తరవస్సర్వే నిలీనా మృగ పక్షిణః।
నైశేన తమసావ్యాప్తా దిశశ్చ రఘునందన॥
....
నైశాని సర్వభూతాని ప్రచరంతి తతస్తతః।
యక్ష రాక్షస సంఘాశ్చ రౌద్రాశ్చ పిశితాశనాః॥
... ... —
ఉత్తిష్ఠతిచ శీతాంశు శ్శశీ లోకతమోనుదః।
హ్లాదయన్ ప్రాణినాం లోకే మనాంసి ప్రభయా విభో"[1]

(బి) శ్రీరాముడు పంచవటి యందున్నాడు. హేమంతము వచ్చినది. ఆసమయమున వర్ణితములైన ప్రకృతి దృశ్యములలో నీక్రిందిదొకటి
"అడవి యేనుగులు నీరాన నీనదికి - దుడిదుడి వచ్చి తత్తోయంబుఁ దొడికి
నడికి గిజ్జనుచు దుండములు వేవేగ - ముడిచి పాఱెడినిఁ దమ్ముడ విలోకింపు"
(కిష్కింధా. ద్వి. 738-739)

దీనికి మూలము :-
"స్పృశంస్తు విపులం శీత ముదకం ద్విరద స్సుఖం।
అత్యంత తృషితో వన్యః ప్రతిసంహరతే కరః॥"[2]

(సి) శ్రీరాముడు మాల్యవంత గిరిపై నున్నాడు వర్షాకాలము ప్రారంభమైనది తద్ఋతు వర్ణనలలో నీక్రిందిది యొకటి.
"అలరు ప్రావృట్కాల మను పురుషుండు - లలిమీఱి నాకాశ లక్ష్మిలోఁ గదియ
నోగిసరుల్ దెగి రాలుచున్న ముత్తెముల - పగిదిఁ దొల్చినుకులు పడియెనందంద"
(కిష్కింధా. ద్వి. 738-739)

దీనికి మూలము-

---

1. దా ప్రతి. వాల్మీకి రామాయణము. బాల. సర్గ. 34. శ్లో. 14. 15, 18, 17.
2. ,, ,, ,, అరణ్యకాండము. సర్గ 16 శ్లో 2.

"సురతా మర్ద విచ్ఛిన్నా స్స్వర్గస్త్రీ హారమౌక్తికాః
పతంతీ వాఽఽకులా దిక్షు తోయధారా స్సమంతతః॥"[1]

(డి) ఆంజనేయుడు లంకలో మండోదరి గాంచి సీతయని తలంచి సంతోషించెను. అప్పటి యతని చేష్ట లిట్లున్నవి.-

"అవనిజ నేఁగంటి ననుచు నానంద - వివశుడై గంతులు వేయుచు నచటి
కంబముల్ ప్రాకుచుఁ గలితవాలాగ్ర - చుంబనం బొనరించుచును నటించుచును
గాసేయజాతి వికారముల్ గొంత - సేపు చూపుచు"

(సుందర. ద్వి. 131-143)

దీనికి మూలము :-

ఆస్ఫోటయామాస చుచుంబ పుచ్ఛం - ననంద చిక్రీడ జగౌ జగామ।
స్తంభా నరోహన్నిపపాత భూమౌ - నిదర్శయన్ స్వాం ప్రకృతిం కపీనాం"[2]

పైయుదాహరణములను పరిశీలించి చూచినపుడు తెనుగు ద్విపదలు అచ్చముగా సంస్కృత శ్లోకములకు యథానువాదములనుటలో సందేహముండఁబోదు ఇట్లు బుద్ధారెడ్డి తనకు నచ్చిన వాని వర్ణనలను యథాతథముగా గ్రహించినాడు.

(1) స్వతంత్రములు. (అమూలకములు)

మూలములతో రంగనాథ రామాయణమును తులనాత్మకముగా పరిశీలించినపుడు, స్వతంత్ర మైన అమూలక వర్ణన లనేకములు దృష్టిగోచరము లగును. ఇవియన్నియు కవియొక్క మౌలిక ప్రతిభవలన జనించిన కల్పనలు; కావ్యప్రశస్తికి నెంతయో దోహద మొనర్చినవి.

(అ) మొదటి దినము సముద్రముపై పదునాల్గు యోజనముల సేతువు నిర్మితమైనది. "అపుడు సూర్యుడస్తమించెను; ఎన్నడు సేతువు పూర్తి యగునో, సీత నెన్నడు గాంతుమో"[3] యని వానరులు విచారములతో రాత్రి నతి కష్టముగా వేగించిరి.

ఇచ్చట మూలమునందులేని చంద్రోదయ వర్ణనము రంగనాథ రామాయణమున రచింపబడినది -

బుద్ధారెడ్డి కల్పించిన ఈ చంద్రుడు పై చిత్రీసౌందర్యుడు-
"కృతకృత్యుడగు రామకీర్తి పుష్పములు - చతురతమై వెదజల్లిన యట్లు
కరమొప్పఁ జుక్కలు గాన్పించె మింట - వరకళాయతిసీమ వలరాజు మామ[4]
పొలుపొందు కలువల పోరాని విందు - కలసిన జక్కవ కవఁ బాపు మందు
శూలి యౌదల పువ్వు జుక్కల నవ్వు ....
.... సరసిజ రిపుడైన చంద్రుండు వొడిచె.
నినుపారి కలశాంబునిధి వెల్లి విరిసె" (యుద్ధ. ద్వి. 1026-1033)

---

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. కిష్కింధాకాండము, సర్గ 28. శ్లో. 51, 52.
2. ,, ,, ,, సుందర సర్గ. 10 శ్లో. 54, 55.
3. ప.ఉ.ప్రతి. వాల్మీకి రామాయణము, సర్గ. 97. శ్లో. 18-20.
4. "చిరకాలముల సీమ శిశువులమామ" పాఠాంతరము.

ఇట చంద్రుడు విషయ భేదమును బట్టి అనేక విధములుగా నుల్లేఖింప బడినాడు- డా. సి. నారాయణ-రెడ్డి గారు ఈ వర్ణనకుఁజేసిన వ్యాఖ్యానము అత్యంత సరసము—

"చిరకాలముల సీమ అనడంతో చంద్రుని చిరంతనత్వం, శిశువుల మామ అనడంతో పసి పిల్లలకు నిత్యజీవితాన్ని ప్రతిబింబించే ఒక నిసర్గ సత్యం, పాలవెల్లినిద్రచ్చిపడసిన వెన్న అనడంతో సంప్రదాయ సిద్ధంగా వస్తున్న ఒక విశ్వాసాన్ని సాలంకృతంగా ఎదుట నిలిపేటంత రసవత్తర సత్యం ద్యోతక మవుతాయి. ఇక చివరి చరణాల్లో చెప్పబడిన అభిప్రాయం దానికి ఉడుపులైన పలుకు బడులు-పరమరమణీయంగా ఉన్నవి. ఉరవేది విరహుల నుడికించుమంట అనే చరణము గుండెల కంటు కొని పోయేలాగుంది- మంటల వంటి మాటలకు మధువందించి పల్కడంవల్లనే రంగనాథరామాయణం మామూలు ప్రజల మనస్సుకెక్కింది "[1] ఇది అక్షరాల సత్యము.

(బి) "ఆంజనేయుడు సీతాప్రత్యయార్థము తన శరీరమును పెంచి మేరు మందరములతో సమానుడై ఆమె ముందు నిలఁబడెను"[2] మూలమునందిచట అతడు పెరిగిన రీతి వర్ణింపబడలేదు.

రంగనాథ రామాయణమునందు—

....ఆహనుమంతు డాకాశమెల్లఁ - దనమేను నిండ నుద్దండుడై పెరిగి
మాలతీ మల్లికా మాల్యమై మెడకు - నాలోల తర తార హారమై కటిని
గలధౌత మయ ఘంటికా ధామమగుచు - లలితమౌ పద యుగళమునకు మువ్వ
లను వారువిధమున నందంబు చూడఁ - దనరి చుక్కలపిండు తనమేన నలఁ
సతి భీషణాకారు డగుచు నిల్చినను"   (సు దం ద్వి 674-608)

అని వర్ణితమైనది. హనుమంతుడు పెరుగుచుండగా నక్షత్ర పంక్తి మొదట తలపైని చందమై ఆ పిదప మెడకు తారహారమై, తర్వాత కటిని మొలనూలు ఘంటలై, చివరకు కాలి మువ్వలై పరిఢవిల్లినవి. ఈ వర్ణనా ప్రభావము పోతన్నపై పడినది. అతడు వామనుని పెరుగుదలను వర్ణించుచు—

"రవిబింబంబుపమింపఁ బాత్రమగు ఛత్రంబై, శిరోరత్నమై,
శ్రవణాలంకృతియై, గళాభరణమై, సౌవర్ణ కేయూరమై,
ఛవిమత్కంకణమై కటిస్థలి నుదంచద్ఘంటయై నూపుర
ప్రవరంబై పదపీఠమై వటుడు దాబ్రహ్మాండమున్ నిండుచోన్"[3]

అని వ్రాసిన పద్యము అచ్చముగా పైద్విపదల కనుకరణమే తారకా పంక్తికి బదులు సూర్య బింబమును కొలబద్దగా నిలిపి తదను గుణముగా రచించిన పద్యమిది

పెరుగుదల క్రమముగా జరిగినదని, బ్రహ్మాండమంత నిండినదని తెలుపుటయే ఈ వర్ణన పరమ ప్రయోజనము. మూలమునందలి "మేరు మందర సంకాశః" అనునది పరిమితము ఇచ్చట వర్ధితమైన శరీరము అపరిమితము. ఇది బుద్ధారెడ్డి వర్ణనలోని విశేషము-

---

1. డా॥ సి. నారాయణరెడ్డి. వ్యాసవాహిని. పుట. 68
2. దా. ప్రతి. వాల్మీకి రామాయణము సుందర. సర్గ. 37 శ్లో. 34, 35.
3. బమ్మెర పోతనామాత్యుడు. శ్రీమహాంధ్ర మహాభాగవతము స్కంధము. 8 పద్య. 623.

(సి) శ్రీరాముడు ఋష్యమూక పర్వతమును గనెను మూలమునందీ పర్వతమునుగూర్చి—

"అస్యాస్తీరేతు పూర్వోక్తః సర్వతోధాతు మండితః।
ఋష్యమూక ఇతిఖ్యాతః పుణ్యః పుష్పితకాననః॥"[1]

అని మాత్రము గలదు రగనాథ రామాయణమునందీ ఋష్యమూక గిరిసౌందర్యము మూలాధికముగా వర్ణితమైనది చూడుడు—

"త్రైలోక్య విభులైన తమ రాకఁజూచి - యాలోన మదిఁబొంగి యానందమంది
యనయంబు నొప్పెడు నశ్రుపూరంబు - లన సెలయేరుల నలరెడు దాని
నిలమేరు మందర హిమశైల పతుల - నలిమీఱి నగియెడి నగవులో యనగా
సాంద్రంబులై యుండి చదలదీపించు - చంద్రకాంతోపల చ్ఛాయల దాని

....

....

చింతామణులు నెందఁ జెడని పెన్నిధులు - సంతాన తరువులు సరినొప్పుదానిఁ
గని దాని మహిమకుఁ గడు చోద్యమంది - యిన వంశ వల్లభుడెంతయుఁ బొగడి"[2] నాడు

(అరణ్య ద్వి 1387-1506)

ఈ ఋష్యమూక వర్ణన మమూలకము. ఉత్ప్రేక్షాలంకారములతో నొప్పి మంజుల ప్రకృతి గతమై కథాకథనమునకు అనుకూలమైన పూర్వరంగముగా నున్నది. సుందర శబ్ద శయ్య, మనోహర భావ పరంపర, అలంకారశోభ, ప్రాణి ధర్మారోపణము గలిగిన యీవర్ణనము సహృదయ హృదయావర్జక మనుటలో సందేహము లేదు.

(డి) శ్రీరాముడు మాల్యవంతమున వసించి సీతాన్వేషణ కర్తమగు కాలమును ప్రతీక్షించు చున్నాడు. ఇంతలో వానలు వెనుక బట్టి శరత్తు రానేవచ్చినది. మూలమునందిచ్చట—

"పాండురం గగనం దృష్ట్వా విమలం చంద్రమండలం।
శారదీం రజనీం చైవ దృష్ట్వా జ్యోత్స్నాను లేపనాం

....

దృష్ట్వాచ విమలం వ్యోమ గత విద్యుద్వలాహకం।"[2]

అని శరత్కాల వర్ణనము గలదు రంగనాథ రామాయణమున-

"అంత వానలు వెల్చె నవని నెల్లెడల - నంతంత దివినున్న యభ్రముల్ విరిసెఁ
దెలివొంది కిరణముల్ దిశలెల్ల నిండఁ - జెలువొంద రవి ప్రకాశించె లోకముల;
ధరణి నిష్పంకమై తనరె నెంతయును; - గరమొప్పఁ బగొకులఁ గమలంబు లలరెఁ
గూలముల్ మదకరుల్ గ్రుచ్చి గోరాడె - రేలు నక్షత్ర చంద్రికలఁ బెంపారె
వచ్చెనంచలు సరోవసికిఁ గాపురము - మెచ్చెఁ దామర తూండ్లు మెసగి యుల్లమునఁ
జెఱకు రాజనముల చేనుల పంట - తఱచయ్యె; వృషభ యూథము బంకె వైచెఁ

---

1. దా.ప్రతి. వాల్మీకి రామాయణము. కిష్కింధా. సర్గ. 75, శ్లో. 25.
2. ,, ,, ,, ,, సర్గ. 30, శ్లో. 2, 6.

గలక యంతయుఁ బాసి కనుపట్టె జలము - లిలఁ దెగువరులకు నిచ్చె సౌఖ్యంబుఁ
జదల నిర్మలములై జలదంబు లొప్పెఁ - నదులెల్ల దొంకి కాల్నడలయ్యె; నంత"

(కిష్కింధా. ద్వి. 766-773)

అని చేసిన శరత్కాల వర్ణనము స్వతంత్రము. మూలమునందలి శరత్కాల వర్ణనమునకు[1] దీనికి అంత సంబంధము లేనిదిగా నున్నది. ఇది పొడిపొడి మాటలతో నిరలంకార శోభితమై సరస సుందరముగా నున్నది. సీతాన్వేషణ సమయమునకు పూర్వరంగముగా తత్కాలయోగ్యతను తెలియ జేయుట అత్యంతావశ్యకము. అది మూలమునందు కంటె సామాన్యుని కందుబాటులో నుండునట్లు ఇందు వర్ణితమైనది.

ఇట్లు రంగనాథ రామయణమునందు ప్రకృతి గతమైన వర్ణనలు. 1. గంగావతార వర్ణనము. (బాల. ద్వి. 1255 - 1278), 2. పంపాసరోవర వర్ణనము. (కిష్కింధా. ద్వి. 1-30), 3. వర్షఋతు వర్ణనము. (కిష్కింధా. ద్వి. 728-765), 4. యుద్ధ భూమి వర్ణనము. (యుద్ధ. ద్వి. 3101-3112) 5. మాయలేడి వర్ణనము. (అరణ్య. ద్వి. 838-870.) ఇత్యాదులు కవియొక్క మౌలిక ప్రతిభాజన్య కల్పనలు; అత్యంత మనోహరములు—

ఈ క్రింది యమూలక కల్పనమును గాంచుడు :—

ఖరుని సేనలు శ్రీరామునెదుర్కొన్నవి. అతని గాంధర్వశరము రాక్షస సేనలను చీకాకు గావించి, దండించి, ఖండించి తలలుత్తరించినది యుద్ధభూమి యంతయు నెత్తురు, మాంసము. మెదడు ప్రేవులు, ఎమ్ములు, మొదలగు వానితో నిండియుండెను. అప్పుడు భూతప్రేత పిశాచ శాకినీ భేతా ళాదులు తండ తండంబులై —

"ఏనుగు తలకాయ లెనగు కుండలుగఁ - బూని యందలి ముత్యములు దండులముగ
దండి రాముని రణ ధర్మ సత్రమున - వండి నారిదె రండు వరుస భుజింప
నని వేడ్కఁ బైకొన్న యధికార ముద్ర - గొని రొదగాకుండఁ గూర్చుండఁ బెట్టి
రక్త చందనమును రక్తాక్షతములు - రక్తసంకల్ప పూర్వంబుగాఁ దాల్చి
పదరక చర్మరంభా పలాశములు - పదనైన పునుక దొప్పలు చుట్టమర్చి
శరవహ్ని పక్వ మాంసపు టన్నమును - పొరలెడు మెదడు పప్పును గ్రొవ్వులందు
వఱదలౌ నాజ్యప్రవాహముల్ కండ -లెఱచి కారిజము లనేక శాకములు
పొల్లప్రేవులు సేవె పాశముల్ మేలి - వాలు గుండెలు పిండి వంటలు క్రొత్త
నెత్తురు తీయని నీరుగాఁ దలచి - యత్తరి విప్రయోగ్యా హారమనుచు
నాకంఠ తృప్తులై యధిక సమ్మతము - సేకొని సభగూడి శ్రీరామచంద్రు
తేవిజయోఽస్తని దీవించికొన్ని - యావలఁ గొన్ని "తథాఽస్తు"ని పల్కి
నింతలో మఱికొన్ని యేనుగు జీవ - దంతముల్ చేతలా తలముగాఁ బూని
పొలసులెమ్ముల సంకు పూసలపేర్లు - కళుక కామాక్షులుగా ధరియించి

---

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము కిష్కింధా. సర్గ. 30. శ్లో. 22, 61.

కరిఘంటికా తాళ గతుల కుబ్బుచును - దరిబేసి కోపులత్త జిం జూపందొడగె"[1]
ఇట్లే సంగర మహిస్థలి కాకుత్స రాము నూనెడి జయలక్ష్మికి నునికి పట్టయిన కొలనుగా కల్పిత మైనది.[2] ఇట్టి కల్పనలు రంగనాథ రామాయణమునం దనేకములు గలవు.

పాత్రోచిత వర్ణనలు :—

ప్రకృతి గతవర్ణనములే కాక, పాత్రోచితముగాను జేయబడిన వర్ణనములకు రంగనాథ రామాయణమునం గొదవలేదు.

(ఎ) అన్న చేందన్నులుదిని అవమానింపబడిన విభీషణుడు తల్లియైన కైకేశి యొద్దకు పోయెను. అప్పుడామె—

"...............ఉపవాసకృశయైన మేన - మహిత శుక్లాంబర మానిత యగుచు
వెన్నెల గసమున విదలించి తివిచి - మిన్నేటి నుఱువున మెఱుగిడ్డ కరణి
నరసిన బొమలును, నరప చొళ్ళియమును - గరమొప్పి యెంతయు గౌరవంబొలయం
....
కరుణ ప్రవాహంబుగా వచోభంగి - సరళత్వ మూర్మల చందంబుగాంగ
బొలుపాలు శమదమంబులు తటంబులుగ - గల నరలెల్లం జొక్కపు నుర్వుగాగ

(యుద్ధ. ద్వి. 563-569)

జహ్ను తనయ నా నొప్పినది. ఈమె వార్ధక్యము, పావిత్ర్యము ఎంత గొప్పదో, కవి సరసమైన వర్ణనచే వానిని మన కన్నుల యెదుట ప్రతిబింబింపం జేసినాడు.

(బి) సీతాదేవి అశోక వనమున శింశుపావృక్షము క్రింద రాక్షస కాంతా పరీవృతమై యున్నది, ఆమెస్థితిని గూర్చి కవియిట్లు వర్ణించినాడు.

వ్రతములం గడుడస్సి వనటల గ్రుస్సి - యతి దుఃఖమునం గుంది యలతలం గంది
విపులాశ్రువులం దోగి విరహాగ్నిం గ్రాగి - కపట వృత్తులం జిక్కి కడుముట్ట స్రుక్కి
జీవంబుపై రోసి చెలువంబుం బాసి - యావిధి మది దూఱి యలసత మీఱి
చెక్కిటం జెయ సేర్చి చింతల కోర్చి - దిక్కులేమిం దలంచి ధృతి దూరడించి
యిన రశ్మివాడిన యెలందీగ వోలె - ఘన ధూమ యుత దీప కళికయుంబోలె
జలద మాలికలోని శశికళ వోలెం - బలుమంచు వొదివిన పద్మిని వోలెం
జెలగు పిల్లులలోని చిలుకయుంబోలెం - బులులలో నావును బోలె దుర్వార.
ఘోర రాక్షస వధూ కోటిలో నున్న — నారీ శిరోమణి నళినాయతాక్షి"

(సుందర. ద్వి. 215-222)

ఇందులోని ఒకటి రెండు ఉపమానములు దక్క, మిగిలిన దంతయు కవి ప్రతిభాజన్య వర్ణనమే. సీతాదేవి నిస్సహాయ స్థితి, దుఃఖము, క్షణక్షణ ప్రాణగండము ఇత్యాదులు అద్దము పట్టి

---

1. రంగనాథ రామాయణము. అరణ్య. ద్వి. 569-582.
2. ,, ,, యుద్ధ. ద్వి. 3874-3881.

చూపినట్లు రచింపఁబడినవి—

(సి) శ్రీరాముడు రథముపై వనములకేగు చున్నాడు. దశరథుడు పుత్రవియోగము సహింపలేక రథమాపుమని సుమంత్రుని పిలుచుచుండెను కాని, రథము మాత్రమాగదు. వసిష్ఠుడు దశరథుని "శోకించుట నసుపరాదని" హెచ్చరించెను—

"అనవుడు దశరథుడటు పోక నిలిచి - తనసూను రథమటు తప్పకచూచి
యదియుఁ గానక ధూళి నటు చూచిచూచి, యదియుఁ గానక బయలటు చూచిచూచి,
హాయని యెలుగెత్తి హారామ రామ - హాయని మూర్ఛిల్లి యవనిపైఁ ద్రెళ్ళె"

(అయోధ్యా. ద్వి. 986-990)

ఇది దశరథుని మనస్సులోని ఆందోళనను, మనో వ్యాకులతను అలతి యలతి పదములతో, మాటల పునరుక్తితో రూపు కట్టించునట్లు చేసిన వర్ణనము—

(డి) అంగదుడు రావణుని పాతాళ హోమభంగము చేయుటకై మండోదరిని వెంట్రుకలు పట్టి—

కమ్మ సౌరభములు గలుగు సంపుల్ల - ధమ్మిల్ల మల్లికా దామముల్ నలగఁ

....

గెడగూడి రావణుకీర్తి పుష్పములు - గడివోయి భువిరాలు కైవడిఁదోప
సేస ముత్తియములు సెలువంబు వాసి - గాసిల్లి వసుధపైఁ గనుకని రాల

... ...

ఉదిత రావంబులై యొండొంటిఁ గడవఁ - బదనూపురము లూడిపడి మ్రోయుచుండ"

(యుద్ధ. ద్వి. 7174-7190)

గా నీడ్చుకొని వచ్చెను. ఈవర్ణన ముత్ప్రేక్షాలంకార చమత్కార జనితమై, సహజస్వభావ శోభితమై, కథా కథనాను కూలమై భావికథా సూచకమై యున్నది—

"రావణుడు దుర్మార్గుడు కావచ్చును; మండోదరి చేసిన తప్పేమి? ఆమె రావణుని భార్య యగుటయే?" అనెడి భావ పరంపరలచే పఠితలకు మండోదరియెడ సానుభూతిని కలిగించునట్లుగా నున్నదీ వర్ణనము—

ఆ తర్వాత మండోదరి తన యాత్మేశునిఁ జూచి
"ఇంద్రుగెల్చిన సత్వ మెక్కడఁ బోయెఁ - జంద్రహాసము వాడి సమసేనే నేడు
ఫాలలోచనుతోడఁ బ్రమథుల తోడఁ - గైలాస మెత్తిన గర్వమెందడగె.
మూడు లోకంబులు మునుమిడి గెలిచి - నేడేల తూలెదు నీపేర్మి విడిచి,
ఇంద్రజిత్తుడు నన్ను నిటఁ బాఱవైచి - యింద్రలోకంబున కేగకయున్న
నన్నిట్లు చూచునే? నాకొడుకున్న - నిన్నిచ దుర్దశ యేను బొందుదునే
సిగ్గు లజ్జయులేని చెనటివో? నన్నుఁ - బగ్గించుచున్నారు పగతు లిబ్భంగి
నీహోమ మేటికి నిష్ఠ యేమిటికి - నాహుతుల్ నిన్నుఁ బూర్ణాహుతిఁ జేసెఁ
బటు బుద్ధివై రామ బాణాగ్నిఁ బడుము - కుటిల క్రియల కింకఁ గొలదిగా దుడుగు"

(యుద్ధ. ద్వి. 7194-7210)

మని దూషించిన తీరు- "పగులు మానభంగమును చేయుచుండగా చూచుచు నూరకొన్న భర్తను

మానము గోల్పోయిన వనిత పతివ్రతయైనను నోటికి వచ్చినట్లు తిట్టక ఏమి చేయును? అనెడి స్త్రీ స్వభావమునకు నిదర్శనము—

(ఇ) తారాదేవి శ్రీరామ బాణములచే నేలఁబడిన పతిని (వాలిని) జూచి రాముని నిట్లధిక్షేపించినది.
మెఱసి నిన్నిటు సేయ మీతండ్రి తోడఁ - గఱపెనే రఘురామ గణుతింప వాలి?
వెరవొప్ప నీ రాజ్య విభవంబు గొన్న - భరతుడే రఘురామ పరికింప వాలి?
చెనటియై నీదేవిఁ జెఱగొని చన్న - దనుజుడే రఘురామ తలపోయ వాలి?
వాలి నకారణ వైరంబుపూని - యేలయ్య తెగటార్చి తిబ్బంగిఁ బేర్చి
నీ యట్టి సుకృతికి నీయట్టి పతికి - నీయట్టి కారుణ్య నిధికిట్లు తగునె?"

(కిష్కింధా ద్వి. 643-646.)

ఇది అమూలకమైన భాషణము. ఇందొక్క నిందావాక్యమునులేదు. "నీయట్టి కారుణ్యనిధికి ఇది సమంజసమా"? అనెడి ప్రశ్నలో పత్నీవియోగముచే బాధపడుచున్న నీవు నాకు పతివియోగము కలిగించుట ధర్మమా? యని తార యధిక్షేపించినట్లు ధ్వనించు చున్నది. పతినెడబాసిన స్త్రీ పొందు నట్టి ఆర్తి, ఆవేగము వ్యక్తమగుచున్నది—

ఇట్లనేకములైన అమూలకవర్ణనలు, సంభాషణలు తత్తత్పాత్రోచితముగా విరచితములైన వనుటలో సంశయము లేదు—

3 అన్యథాకరణములు—

బుద్ధభూపతి మూలమునందలి కొన్ని వర్ణనలను ఔచిత్య దృష్టితో మార్చియున్నాడు—

(అ) శ్రీరాముడు వర్షాకాల సౌందర్యమును లక్ష్మణునకు వర్ణించి చెప్పును. అందులోని ఒక దృశ్యము—

నీలమేఘాశ్రితా విద్యుత్-స్ఫురంతీ ప్రతిభాతిమా।
స్ఫురంతీ రావణస్యాంకే వైదేహీవ తపస్వినీ॥[1]

ఇచ్చటి ఉపమానము శ్రీరాముని నోటినుండి వచ్చుట సముచితముకాదు. కవి దీనిని మార్చి-
"రావణురాజ్యంబు రఘురాముచేత — నీవిధి చలియించునింక నన్ పగిది
నొలసి యొండొండ విద్యున్నికాయములు - జలదంబు లందుండి చలియింపఁ దొడగె"

(కిష్కింధా. ద్వి. 730-731)

అని వర్ణించినాడు. ఇందు భావికథా సూచనము కావింపబడినది.

(బి) రావణుడు సీతాదేవిని వెఱపించుటకు విద్యుజ్జిహ్వునిచే రాముని మాయా శిరో ధనువులు తెప్పించి ముందుపడ వేయించెను. అప్పుడు జానకి కైకను నిందించుచు తెగిన అరటి చెట్టువలె భూమి మీద పడిపోయినదని మూలమునందు వర్ణితమైనది—

"ఏవముక్త్వాతు వైదేహీ వేపమానా తపస్వినీ।
జగామ జగతీం బాలా ఛిన్నాతు కదళీ యథా॥"[2]

---

1. దా.ప్రతి. వాల్మీకి రామాయణము. కిష్కింధా. సర్గ. 28. శ్లో. 12.
2. దా.ప్రతి. వాల్మీకి రామాయణము. యుద్ధ. సర్గ. 32. శ్లో. 6.

రంగనాథ రామాయణమునందు—

తలపోసి రాముని తలయ కాఁ దలచి - బలుమూర్ఛ పొల్పడి పడియె ధరిత్రి.
సిడిబొంకు, నీపతి కేమియుఁగాదు, - సుదతి! నీకీ మాయ చూడగాదనుచుఁ
దన యురస్థలికి నాతన్వంగిఁ దివిచి - కౌనియెనో కాక, యాకుంభిని యనగ"

(యుద్ధ. ద్వి. 1685-1687)

నని యుపమానము మార్చి వర్ణింపబడినది—

మూలమునందలి యుపమానము పతన ధర్మమునకుఁ దగియున్నది కాని పతితల కాలోచనా మృతము నొసగదు.

అమాయకమైన, ఆపదలో నున్న కూతురు నిజము గ్రహింపక శోకించుచుండ, యథార్థము దెలిసిన తల్లి కూతును ఉరమునకు చేర్చుకొని బుజ్జగించుట సైజము సీతాదేవి భూమిజ. కావున "భూమిమీద పడుట" యనునది తల్లి తన బిడ్డను దగ్గరకు తీసి కొనుటగా నిట యుత్ప్రేక్షింప బడినది ఇది కథా విషయముతో లోకధర్మమును ప్రతిపాదించుట. మూలము కంటె నెంతయో మనోహరమై యొప్పియున్నది—

(సి) హనుమంతుడు సముద్రమును లంఘించుచున్నాడు. "అతని యూరువేగోత్థములైన వృక్షములు హనుమంతుని వెంట స్వబంధువులు వోలె కొంతదూరమేగి, తరువాత మహేంద్రుని భయమున పర్వతములు వోలె జలధిలో పడెను"[1]

మూలమునందలి యీ వర్ణనము లోకాచార, పౌరాణిక కథల సమ్మేళనముతో నేర్పడినది. కాని బుద్ధభూపతి ఇందలి ఉపమానము లను మార్చి ప్రధాన కథాంశముతో సంబంధము కలిగించి క్రింది విధముగా వర్ణించినాడు—

"ఆ యురవడి మ్రాకు లతనితో నెగసి - తోయధిలోఁ జొచ్చి తుని యల్లైరాలె.
భావిసేతువునకై పవన నందనుడు - తావచ్చి శంకువు స్థాపించె ననగ"

(కిష్కింధా. ద్వి. 1258-1259)

శ్రీరాముడు లంక కేగుటకై సముద్రమున సేతువును నిర్మించుట భావికార్యము. మారుతి తత్సేతువునకై శంకువును స్థాపించినాడో యనునట్లు మ్రాకులు సముద్రములో పడిన వనుట భావికథా సూచన చేయుట. ఇచ్చట ఉత్ప్రేక్షాలంకారముచే మూలమునకు వన్నె పెట్టబడినది—

(డి) హేమంతమున మంచుకురిసి పచ్చిక తడిసినది తొలినాడు వికసించిన పద్మముల రెక్కలు శీర్ణములై సరోవరము నిండ వ్యాపించినవి. ఇచట

"అవశ్యాయ నిపాతేన కించిత్ ప్రక్లిన్నశాద్వలా।
వనానాంశోభతే భూమి ర్నివిష్ట తరుణాతపా॥"[2]

అనుశ్లోకభావము—

"ఉర్విపై నామంచు నొక్కొక్కచోట - దూర్వాంకురంబుల తుదలఁ జూచితివే.

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. సుందర. సర్గ. 1. శ్లో. 47, 50.
2. ,, ,, ,, అరణ్య. సర్గ. 16 శ్లో 20.

పచ్చమిన్న సలాక పౌజుపై వేడ్క - గ్రుచ్చిన మత్యాల క్రోవలై యొప్పె"
(అరణ్య. ద్వి. 247-248)

నని మార్చబడి మూలభావానికి పచ్చల తురాయి తొడిగింపఁ బడినది

జరా జర్జరితైః పద్మైః శీర్ణ కేసర కర్ణికైః।
నాళశేషై ర్హిమధ్వస్తై ర్న భాంతి కమలాకరాః॥"1

అనెడి శ్లోకార్థము

"పొదిగొన్న యకరువల్ పొట్టుగా మీదఁ - గదలు తేటులు పొగల్‌గాఁ జలిగొన్న
కొలను దేవతలకు కుంపట్లువోలె - విలసిల్లు కెంచమ్మి విరులఁ జూచితివె"
(అరణ్య. ద్వి. 252-253)

అని మార్చబడినది.

హేమంత ఋతువులో చలికి తట్టుకొనలేక, వెచ్చగా కాపుకొనుటకు కుంపట్లను (సగళ్ళను) పెట్టుకొనుట లోకదృశ్యము. దీని నాధారముగా చేసికొని. "సరస్సరస్వతులకు ఎఱ్ఱతామరలు కుంపట్లు లాగ ఉపకరించిన వనడం ఔచిత్యహారంలో తరళాయమాన కల్పన"2

ఇట్లు మూల వర్ణనలను ఔచితీశోభితంగా మార్చిన పట్టులు రంగనాథ రామాయణమున ననేకములు గానవచ్చును.

4. పరిత్యక్తములు :—

మూలమునందలి వర్ణనాంశములు చాలవరకు వదలి వేయబడినవి. అట్లు చేయుట సంక్షిప్తత కొఱకు కావచ్చును; అనౌచిత్య పరిహారమునకును కావచ్చును: దేశకాల వాతావరణ పరిస్థితులను బట్టి సామాన్య పాఠకుని యూహకు అందవను తలంపుతోను కావచ్చును. ఉదాహరణమునకై కొన్నింటిని చూడుడు—

(అ) రావణుడు సీత నపహరించుకొని పోవుచున్నాడు —

"సా హేమ వర్ణా నీలాంగం మైథిలీ రాక్షసాధిపం।
శుశుభే కాంచనీ కాంచీ నీలం మణి మివాశ్రితా॥
తరుప్రవాళ రక్తా సా నీలాంగం రక్షసేశ్వరం।
ప్రాశోభయత వైదేహీ గజం కక్ష్యేవ కాంచనీ॥
తస్యా స్తాన్యగ్ని వర్ణాని భూషణాని మహీతలే।
సఘోషా ణ్యవ కీర్యంత క్షీణాస్తార ఇవాంబరాత్॥
తస్యా భూషణ ఘోషేణ వైదేహ్యా రాక్షసాధిపః।
బభౌ స చపలో నీల స్సఘోష ఇవ తోయదః॥"3

ఇత్యాది వర్ణనలు గ్రహింప బడలేదు. ఇట్టివి సంక్షిప్తతకై తగ్గింపఁబడినట్లు తలంచ వచ్చును.

---

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. అరణ్య. సర్గ. 16. శ్లో. 26.
2. డా. శ్రీ సి. నారాయణరెడ్డి. వ్యాసవాహిని. పుట. 68.
3. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. అరణ్య. సర్గ. 52, శ్లో. 25, 27, 34, 28.

(బి) హేమంత ఋతు శోభను లక్ష్మణుడు రామునకు వర్ణించి చెప్పుచున్నాడు.

"సేవమానే దృఢంసూర్యే దిశమంతక సేవితాం।
విహీన తిలకేవ స్త్రీ నోత్తరా దిక్ప్రకాశతే॥
జ్యోత్స్నా తుషార మలినా పౌర్ణమాస్యాం నరాజతే।
సీతేవ చాతపశ్యామా లక్ష్యతే నతు శోభతే॥
నవాగ్రయణ పూజాభి రభ్యర్చ్య పితృదేవతాః।
కృత్వాగ్రయణకాః కాలే సంతో విగత కల్మషాః॥"1

ఇత్యాదులు సాధారణములు కాకపోవుటచే వదలి యుండ వచ్చును.

(సి) రావణుడు కామవశుడై రాత్రి యుండగనే. అశోకవనములో సీతాదేవి యొద్దకు వచ్చెను.

ఆ సమయమున నామె స్వరూపము —

"ధూప్యమానాం గ్రహేణేవ రోహిణీం ధూమకేతునా।

....

అభూతే నాపవాదేన కీర్తిం నిపతితా మివ।
ఆమ్నాయానా మయోగేన విద్యాం ప్రశిథిలా మివ॥
సన్నామివ మహాకీర్తిం శ్రద్ధామివ విమానితాం।
పూజామివ పరిక్షీణాం ఆశాం ప్రతిహతా మివ॥

....

వేదీ మివ పరామృష్టాం శాంతామగ్ని శిఖామివ।"2

ఇత్యాద్యుపమానములతో ఈవింపబడిన వర్ణనమంతయు వదలఁబడినది. ఇందలి అనేకోపమానములు అప్రత్యక్షములై, బుద్ధిజన్యములై, సామాన్యుల యూహ కందరాని వగుటచేత గ్రహింపబడక పోవచ్చును —

(డి) శ్రీరాముని యాదేశమున సుగ్రీవుని సేన లంకాభిముఖమై ప్రయాణము చేయుచున్నది. అప్పుడు పొడచూపిన నిమిత్తముల గూర్చి లక్ష్మణుడిటు వర్ణించెను.

"ప్రసన్నాశ్చదిశ స్సర్వా విమలశ్చ దివాకరః।
ఉశనాశ్చ ప్రసన్నార్చి రనుత్వాం భార్గవోగతః॥
బ్రహ్మరాశి ర్విశుద్ధశ్చ సిద్ధాశ్చ పరమర్షయః।
అర్చిష్మంతః ప్రకాశంతే ధ్రువం సర్వేప్రదక్షిణం॥
త్రిశంకుర్విమలో భాతి రాజర్షిస్సపురోహితః।
పితామహ వరోఽస్మాక మిక్ష్వాకూణాం మహాత్మనాం॥
విమలేచ ప్రకాశేతే విశాఖే నిరుపద్రవే।
నక్షత్ర వర మస్మాక మిక్ష్వాకూణాం మహాత్మానాం॥

---

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. అరణ్య. సర్గ. 16. శ్లో. 8, 14, 6,
2. ,, ,, ,, సుందర. సర్గ. 19. శ్లో. 9, 11, 12, 15.

నైర్ఋతం నైర్ఋతానాంచ నక్షత్ర మభి పీడ్యతే।
మూలో మూలవతా స్పృష్టో ధూప్యతే ధూమకేతునా॥
సర్వం చైతద్వినాశాయ రాక్షసానా ముపస్థితం।
కాలే కాల గృహీతానాం నక్షత్రంగ్రహ పీడితః॥
ప్రసన్నా సురసాశ్చాపో వనాని ఫలవంతిచ।
ప్రవాంత్యభ్యధికం గంధాన్ యథర్తు కుసుమద్రుమాః॥"[1]

ఇవి శాస్త్రీయ విషయములు; పండితైక వేద్యములు. జ్యోతిషశాస్త్ర పరిచయము లేనివారికి వీనివర్ణనా స్వారస్యమంతగా తెలిసిరాదు. కావున రంగనాథ రామాయణమునం దనువదింప బడలేదు—

(ఇ) ఆంజనేయుడు సీతాదేవి ప్రత్యయార్థమై శ్రీరామ స్వరూప గుణశీలములను ప్రపంచించు చుండెను—

"సమస్సమ విభక్తాంగో వర్ణంశ్యామం సమాశ్రితః।
త్రిస్థిర స్త్రిప్రలంబశ్చ త్రిసమ స్త్రిషు చోన్నతః॥
త్రితామ్ర స్త్రిషుచ స్నిగ్ధో గంభీర స్త్రిషు నిత్యశః॥
త్రివలీవాం స్త్ర్యవనత శ్చతుర్వ్యంగ స్త్రి శీర్షవాన్।
చతుష్కల శ్చతుర్లేఖ శ్చతుష్కిష్కు శ్చతుస్సమః॥
చతుర్దశ సమద్వంద్వ శ్చతుర్దంష్ట్ర శ్చతుర్గతిః।
మహోష్ఠహను నాసశ్చ పంచస్నిగ్ధోఽష్ట వంశవాన్॥
దశ పద్మోదశబృహ త్త్రిభిర్వ్యాప్తో ద్విశుక్లవాన్।
షడున్నతో నవతను స్త్రిభి ర్వ్యాప్నోతి రాఘవః॥"[2]

ఇత్యాది వర్ణనలు గ్రహింపబడలేదు ఇవి సాముద్రిక శాస్త్ర విషయమునకు సంబంధించినవి.

ఇట్లు రంగనాథ రామాయణము నందలి అనేక శాస్త్రీయాంశములు రంగనాథ రామాయణమున వదలబడినవి. ఇట్టి పరిస్థితి భారత భాగవతాది గ్రంథములకును దాదాపు సమానమే కావున ఇట్టి గ్రంథములు పండితులకంటె ఎక్కువగా పామరుల నుద్దేశించియే వ్రాయబడినవి. అహోబల పండితుడు "సంస్కృత పురాణ పఠనాక్షమాణాం తచ్ఛ్రవణేఽప్యలాలసానాం ముముక్షూణాం శూద్రాదీనాం ప్రాధాన్యేన జ్ఞానోపయోగి న్యాంధ్ర పురాణాని భవంత్యేవ"[3] అని చెప్పియున్నాడు. ఇచటి "శూద్రాదీనాం" అనుపదమును తొలగించి "పామరాదీనాం" అని చెప్పినచో అహోబల పండితుని వచనము యథార్థమనిపించును. ఈ దృష్టి రంగనాథ రామాయణమును వ్రాయు బుద్ధారెడ్డి కిని ఉండవచ్చును. కావున తత్తద్విషయ వర్ణనలు మూలమునందలివి చాలావరకు వదలిపెట్ట

1. దా. ప్రతి. వాల్మీకి రామాయణము. యుద్ధ. సర్గ. 4. శ్లో. 48-55.
2. ,, ,, ,, సుందర. సర్గ. 35. శ్లో. 16-20.
3. అహోబల పండితుడు. కవిశిరోభూషణము. (అహోబల పండితీయము. సంజ్ఞా పరిచ్ఛేదము. సూత్ర. 4. (వ్యాఖ్యానము) పుట. 148.

బడినవి—

ఇట్లు పరిశీలించిన మీదట, వర్ణనలను గూర్చి ఈ క్రింది తాత్పర్య మేర్పడుచున్నది—

రంగనాథ రామాయణమునందలి వర్ణనలు. యథామూలములు, స్వతంత్రములు, అన్యథా కరణములు. ఎట్టివైనను కథాగమన, రసౌచిత్య దృష్టితో రచింపబడిన వనుటలో సందేహము లేదు. ఎక్కడనైనను ఒకటిరెండు దొసగులున్న, ద్రాక్షపండ్లయందలి గింజలవలె వానిని వదలుట సహృదయ లక్షణము.

ప్రకీర్ణములు :—

1. శయ్యా వైచిత్ర్యము :-

"పదముల పొందిక; లేక పదముల పొత్తుశయ్య" అనగా నేపదము వెంట నేపదము గూర్చిన సొబగో అదిశయ్య"[1]

పద రచనయందు పొత్తుండ వలెననియు, పొత్తుపొసగని పదరచన కూడదనియు తాత్పర్యము ఎగుడు దిగుడులు లేక మృదువుగా, సమతలముగానున్న సెజ్జ ఆహ్లాదము గొలిపినట్లు, పొత్తుపొసగిన పదరచన రసానందము గలిగించును.

ఈ శయ్యను శబ్దపాకమనియు నందురు.

రంగనాథ రామాయణమునందు భావానుగుణ పద రచనా విన్యాస మంతటను గనిపించుచున్నది. కొన్నింటిని ఉదాహరణముగా చూపింతును.

(ఎ) ఆచన్ను లాకన్ను లాముద్దుఁ బలుకు - లాచెక్కు లాముక్కు నాసోయగంబు
లాతరు లాకురు లావాలు జూపు - లాతొడ లాయొడ లాయోయారంబు
లామందహాసంబు లావిలాసంబు - లామందగమనంబు లావివేకంబు
నేముందుఁ బొడఁగాన నేయింతులందు — భూమిజనేమని భూషింతుఁ జెపుమ.

(అరణ్య. ద్వి. 749-752)

(బి) "పెట్టిన సొమ్ములు పెట్టెలోఁబెట్టి - దట్టమౌ కస్తూరిఁ దలపట్టు వెట్టి
మలిన వస్త్రముగట్టి మదినల్కఁ దొట్టి - చలము సేపట్టి భూస్థలిఁ బండెనంత"

(అయోధ్యా. ద్వి. 212-213)

(సి) "మాట మాత్రంబున మహియు నాకసము - మీటను నాట నమ్మేటియే నేర్చు
కార్చిచ్చునైనను గరువలినైన - నార్చను గూర్చను నాతడే నేర్చు
పాల్పడి బ్రహ్మాండ భాండంబునైన - నిల్పఁబగల్పనా నిపుణుండె నేర్చు"

(అరణ్య. ద్వి. 684-687)

(డి) "నారికై పుట్టిన నాకోపమెల్ల - నారిచేఁ జూపెద నాకారి కిపుడు
నార్చుచు వచ్చు నీయసుర కోపాగ్ని - నార్చెద శరవృష్టి నని బిట్టు కినిసి"

(యుద్ధ ద్వి 4105-4106)

ఇట్లెన్నైనను చూపవచ్చును. పదముల పొందిక శ్రవణపేయమై చదివిన కొలదిని చదువ

---

1. సన్నిధానము సూర్యనారాయణ శాస్త్రి. కావ్యాలంకార సంగ్రహము. పుట. 178.

వలెనని చవులూరించుచుండును.

2. చమత్కారము:—

(ఎ) గణిత శాస్త్రమున అంకెలకు ఒకట్లు, పదులు, నూర్లు, వేలు, పదివేలు, లక్ష, కోటి అని స్థాన నిర్ణయము గలదు. అట్టిస్థాన ప్రకటనకై కవి శ్రీరాముని బాణప్రయోగ సందర్భమున నవకాశము కలిగించుకొని గుదిగ్రుచ్చి యున్నాడు-

"ప్రతిసేసి యొకటికిఁ బదియింటి వెనుక - నుతశక్తి దానికి నూటింటి వెనుక
వెసుకొని దానికి వేయింటి వెనుక - బనుగొని దానికిఁ బదివేలు వెనుక
యుడుగక దానికి నొకలక్ష వెనుక - మడువక దానికి మఱి కోటి వెనుక"

(యుద్ధ. ద్వి. 7467-7469)

(బి) రావణునికిఁ బదితలలు. యుద్ధమున నివి రామునిచే ఖండితములై రాలునపుడు వీనికి పది భావములు గలవని కవినే చమత్కరింపఁ బడినవి-

రాలుచున్న యా రావణుని తలలు—

"ఆవులింపవు, నొవ్వ, వలసముల్ గావు - లావుదూలవు, నిజోల్లాసముల్ సెడవు,
గాజు వారవు, మిడుకవు, రెప్పవేయ - వోజఁదప్పవు, వైరముడుగ వెంతయును
బగయొండె, బొమముడి పాటొండె, నిండు - నగవొండె, నార్పొండె, నలుక చూపొండెఁ
బలుకొండె, మెచ్చొండెఁ బైపడిపోరు - నలవొండె, ధృతియొండె' హంకృతి యొండెఁ
గలుగని తలలేదు"

(యుద్ధ. ద్వి. 7711-7715)

ఇట్లు ఆయా చమత్కారములను చూడవచ్చును-

3. కట్టా వరదరాజ రామాయణము:—

డా॥ నేలటూరి వెంకట రమణయ్యగారి సంపాదకత్వమున మద్రాసు ప్రభుత్వమువారు కట్టావరదరాజు ద్విపద రామాయణమును ముద్రింపించి యున్నారు. ఆయా సంపుటముల పీఠికలలో సంపాదకులు రంగనాథ కట్టావరదరాజ రామాయణములను పరస్పరము పోల్చి, రెండు గ్రంథములలో సమానమైన ద్విపదలనెత్తి చూపి ఆభాగములు రంగనాథ రామాయణములో ప్రక్షేపింపఁ బడినవని తెలిపియున్నారు. రంగనాథ రామాయణము ఆంధ్ర విశ్వకళా పరిషత్తువారి సంశోధిత ముద్రిత ప్రతిలో వెంకట రమణయ్యగారు ప్రక్షేపములుగా చూపిన ద్విపద భాగములు చాలవరకు మూల పాఠమునందు లేక 1వ అనుబంధమునఁ జేర్చబడినవి; వావిళ్ళ, రాయల్ అండ్ కో ప్రతులలో మూలపాఠమునందే యున్నవి దీనివలన డా॥ నెలటూరి వెంకట రమణయ్యగారి తలపు సముచితమని తోచును. గ్రంథము పెరుగునను తలంపునను, చర్వితచర్వణమను తలంపునను వాని నిచటపొందు పరచలేదు.

4. దోషములు :—

"కావ్యమందల్ప దోషమైనను ఉపేక్షింపరాదు అని దండియాదేశము"1 కాని గుణాధిక్యము నందు ఒండురెండు దోషములు చంద్రునియందు మచ్చవలె ఇమిడి పోయి, అవి తద్గుణసౌందర్య

1. దండి. కావ్యాదర్శనము. (ద. 1 పరి. 7)

మునకు పోషక మగునని మహాకవి కాళిదాసు తలంపు"[1] దోషములేని వస్తువే ప్రపంచమునందులేదు. ఒక్క పరమాత్మయే నిర్దుష్టుడు. కావున ఎంతటి మహాకవి వ్రాసినను కావ్యమున స్వల్పముగా నైనను దోషములు దొరలక పోవు. వానిని "ప్రమాదో ధీమతామపి" యని భావించి సహృదయుడు నీరమును వదలి క్షీరమును గ్రహించు హంసవలె గుణగ్రహణ మొనరించి రసము నాస్వాదించును.

రంగనాథ రామాయణమునందు ఒండు రెండు దోషములు గలవు. అవి యతి ప్రాసలకు, వ్యాకరణ ప్రయోగములకు చెందినవి—

(ఎ) యతి ప్రాసభంగములు—

(1) అనఘ గంగా యమునలు గూడియునికి.[2]

(2) ఎవ్వడే నీబరుల్ వెసదాటి వచ్చు.[3]

(3) ఓరియావానరు డున్నాడొ లేదొ - వెరవారగా నాకు వివరించి చెప్పు"[4]

మొదలగునవి వావిళ్ళ, రాయల్ అండ్‌కో ముద్రిత ప్రతులందు కాననగును. ఆంధ్ర విశ్వ కళాపరిషత్తు సంశోధిత ముద్రణమునందు పైమూటిలో-

(1) అనగ గంగానది యమునయుఁగూడి[5]

(2) వీరత్వమునఁ బోక వివరింపు మనిన.

అనియిట్లు రెండు సవరింపబడినవి. ఇక రెండవది 1వ అను బంధమునఁ జేర్చబడినది.

అప్పకవి మొదలగు లాక్షణికులచేఁ బ్రమాణ గ్రంథముగా గ్రహింపఁబడిన రంగనాథ రామాయణమునందు యతిప్రాస దోషములు లేవనియె తలంప వలెను. ఎక్కడనైనను యుండినట్లు కనబడిన అవి లేఖకుల, ముద్రాపకుల పొరపాటు వలన జరిగి యుండును అథవా ఒకటో, రెండో యుండియున్న, 'ప్రమాదోధీమతామపి'యని సరి బెట్టుకొన వలెను—

(బి) వ్యాకరణ విరుద్ధ ప్రయోగములు—

(1) యువర్ణము తోడ దుగ్ధకారమునకు తకారము వచ్చిన క్రియా రూపములు—
చేతు, పోతు, ఇత్యాదులు.

(అ) ఏతల్లిపని సేతు నేతల్లిఁ గొలుతు.

(ఆ) వర తపోనియతిని వర్ష సహస్ర - మరుగఁ బారణసేతు నని యున్నచోట.

(ఇ) పడి ప్రాణముల్ వాతు పలుకు లేమిటికి.

2. క్త్వార్థకేకార సంధి రూపములు—

(అ) మునుకొని వార్ధుల ముంచెత్తునీదు.

---

1. కాళిదాసు. కుమార సంభవము సర్గ. 1. శ్లో. 3.
ఏకోహి దోషో గుణసన్నిపాతే నిమజ్జతీందోః కిరణేష్వివాంకః॥

2. రంగనాథ రామాయణము. (వావిళ్ళప్రతి) అయోధ్యా. ద్వి. 1121.

3. ,, ,, (రాయల్-వావిళ్ళప్రతులు) అరణ్యా. ద్వి. 961.

4. ,, ,, ,, ,, యుద్ధ. ద్వి. 1931.

5. ,, ,, (వావిళ్ళప్రతి) అయోధ్యా. ద్వి. 1121.

(అ) అడుగులు చేతులు నంటంటి చూచి.

(ఇ) మొఱపెట్ట వార్ధుల మంచి మంచీశ్రీ.

(3) కొనునకు కాదేశము —

(అ) బహ్మాస్త్ర మవలీలం బట్టుకమింగె.

(ఆ) కత్తిరించుక పోయెం గంతసూత్రముల

(ఇ) తోడుక పొమ్మనం దూలి రాఘవుడు.

(ఈ) తోకం గాల్పించుక తొలగి వచ్చితిని.

(4) కుషష్ఠికి ముందు నగాగము లేమి.

(అ) శరభంగమౌని యాశ్రమముకేతెంచి.

(ఆ) అనవుడు వెఱగంది యాజాంబవంతు - కనియె విభీషణుడతి సంభ్రమమున

(ఇ) తనమది యూహించి ధరణీశు కనియె.

ఇట్టివి శిష్టవ్యావహారికములై యుండవచ్చును. చిన్నయసూరి వంటివారు వీనిని నిషేధించి యున్నను, సీతారామాచార్యుల వంటివారు వార్త్తికములవోలె పూర్వకవి ప్రయోగ ప్రదర్శన పూర్వకముగా సమ్మతించి యున్నారు. ఆర్యవ్యవహారదృష్టములు గ్రాహ్యములుకదా!

ఇంతియేకాక, పితాళ్ళు (పితరులు), అవాఙ్మనస గోచరము, వేఁడి (ఎఁడి లేక ఎక్కడ), అయోధ్యవంటి విశేష పద ప్రయోగములు నిందుకలవు—

కావున బుద్ధనృపతి

పదము లర్థంబులు భావమ్ముల్ గతులు
పదశయ్య లర్థముల్ భావముల్ యతులు
రసముల (లు) కల్పనల్ ప్రాస సంగతులు
నసమాన రీతులు నన్నియుం గలుగ"

(బాల. ద్వి. 100-101)

శ్రీరామచరిత మొప్పం జెప్పెదనని చేసిన ప్రతిజ్ఞను సంపూర్ణముగా నెరవేర్చు కొనినాడు—

మంగళం కోసలేంద్రాయ
మహనీయ గుణాబ్ధయే।
చక్రవర్తి తనూజాయ
సార్వభౌమాయ మంగళం॥

అనుబంధము

వాల్మీకి రామాయణము ఒక పాఠములోనుండి మరొక పాఠములో లేని సర్గస్థ వృత్తములు.
రంగనాథ రామాయణ, భాస్కర రామాయణములలోని అనుసరణలు

కాండము 1		విషయము 2	దా. ప్రతి సర్గ సంఖ్య 3	పశ్చిమోత్తర శాఖీయప్రతి సర్గ సంఖ్య 4	గౌడీయ ప్రతి సర్గ సంఖ్య 5	రంగనాథ రామాయణము 6	భాస్కర రామాయణము 7
బాలకాండము	1.	అనుక్రమణికాధ్యాయము (సప్తకాండ కథావస్తు నిర్దేశము)	—	3వ సర్గ.	4వ సర్గ.	—	—
	2.	యజ్ఞాంతమున ఋష్యశృంగుని తిరుగు ప్రయాణము	—	12వ సర్గ.	17వ సర్గ.	—	—
	3.	ఋష్యశృంగో పాఖ్యానము		18వ సర్గ.	18వ సర్గ.	—	—
	4.	భరత శత్రుఘ్నులు మేనమామ ఇంటికి పోయి అచట నివసించుట. (భరత శత్రుఘ్నుల రాజగృహ వాసము.	కేవలముసూచింపబడినది.	1,2 సర్గలు.	79, 80. సర్గలు (బాలకాండము)	30 ద్విపదలు. (బాలకాండము 2430-2459)	ఇందుసూచనామాత్రముగనైనను లేదు. ఇది గ్రంథపాతముగా నుండును. లేక, యీవిషయము ఒక పాఠములో బాలకాండము చివరను. మరొక పాఠము లో అయోధ్యా కాండము మొదటను నుండుటఁబట్టి భాస్కర రామాయణము లోని తత్తత్కాండ ప్రణేత (రచయిత)లు భిన్నుల

సంఖ్య	విషయము	దా. ప్రతి. సర్గ సంఖ్య	పశ్చిమోత్తర శాఖీయ ప్రతి సర్గ సంఖ్య	గౌడీయ ప్రతి సర్గ సంఖ్య	రంగనాథ రామాయణము	భాస్కర రామాయణము
						గుటచే పరస్పర ప్రత్యయము వలన చెప్పబడ లేదని తోచుచున్నది.
5.	సుమంత్రుడు కైకేయిని కోపించి ఆమె తల్లి పతిచే త్యజింపబడిన వృత్తాంతమును జెప్పి బెదరించుట (చీమల వృత్తాంతము)	35వ సర్గ. (శ్లో. 16-25)	—	—	11 ద్విపదలు (798-808)	5 పద్యగద్యములు (188-192)
6.	సుమిత్ర రామునికై విలపించు కౌసల్య నోదార్చుట.	44వ సర్గ.	—	—	—	—
7.	అయోధ్యావాసులు ఉదయమున తమసానదీ తీరమున రాముని గాంచక విలపించుట.	47వ సర్గ. (19 శ్లోకములు)	—	—	సూచన గలదు.	—
8.	లక్ష్మణ సందేశము.	—	54వ సర్గ. 32 శ్లోకములు.	50వ సర్గ. (మొత్తము)	6 ద్విపదలు (1075-1080)	—
9.	కౌసల్య దశరథుని ఉపాలంభించుట.		65వ సర్గ. (36 శ్లోకములు)	61వ సర్గ.	9 ద్విపదలు (1182-1191)	ఒక పద్యము (301)

అయోధ్యాకాండ

1	2	3	4	5	6	7
10.	సుమిత్ర కౌసల్యను సాంత్వన పరచుట. (కౌసల్యా వాక్యము)	—	68వ సర్గ. (20 శ్లోకములు)	64వ సర్గ.	—	—
11.	భరత విలాపము వసిష్ఠు డోదార్చుట.	—	84వ సర్గ. (24 శ్లోకములు)	80వ సర్గ.	—	—
12.	భరతుడు దశరథ మృతకళేబర మునుజూచి విలపించుట. వసిష్ఠు డోదార్చుట.	—	85వ సర్గ. (33 శ్లోకములు)	81వ సర్గ.	10 ద్విపదలు (1450-1469)	భరతవిలాపము గలదు. కాని వసిష్ఠ సాంత్వనము లేదు. (వచనము. 369)
అయోధ్యాకాండము 13.	ఉదకప్రదానము. ధర్మపాల మంత్రి యొనర్చుట.	—	89వ సర్గ. 26 శ్లోకములు.	85వ సర్గ.	—	—
14.	గుహుడు భరతుని ప్రశంసించుట భరతుడు రాముని ఆహారశయనాదుల గూర్చి గుహుని అడుగుట.	—	97వ సర్గ. (27 శ్లోకములు)	93వ సర్గ.	—	—
15.	భరతుని ప్రయాగ వనగమనము.	—	102వ సర్గ. (24 శ్లోకములు)	98వ సర్గ.	—	—
16.	కాకాసుర వృత్తాంతము.	96వ సర్గ. (అధికపాఠము)	109వ సర్గ, (60 శ్లోకములు)	105వ సర్గ.	14 ద్విపదలు (1144-1157)	3 పద్యములు. (292–294)
17.	భరతుడు శత్రుఘ్న గుహులతో					

1		2	3	4	5	6	7
అయోధ్యాకాండము		చిత్రకూట పర్వతమున రాముని వెదకుచు ఆశ్రమమునకువచ్చుట.	98వ సర్గ. (18 శ్లోకములు)	112వ సర్గ.	—	4 ద్విపదలు (1621-1624)	—
	18.	శ్రీరాముడు నాస్తికమత నిరాకరణమును, వైదికమత ప్రతిపాదనమును జేయుచుజాబాలి కిచ్చిన సమాధానము.	109వ సర్గ. (39 శ్లోకములు)	—	117, 118. సర్గలు.	1/2 ద్విపదలు (1761-1773)	జాబాలి ఊసేలేదు.
	19.	అకంపనుని వృత్తాంతము. రావణుడు మొదటిసారి మారీచుని కలియుట.	31వ సర్గ. (50 శ్లోకములు)	—	—	32 ద్విపదలు (672-704)	15 గద్యపద్యములు. (246-260)
అరణ్యకాండము	20.	మారీచ హితబోధ.	—	45వ సర్గ. (22 శ్లోకములు)	46వ సర్గ.	—	—
	21.	రావణుడు మారీచునికి తన యభిప్రాయమును వెల్లడించుట.	—	46వ సర్గ. (19 శ్లోకములు)	47వ సర్గ.	ఒక శ్లోకమునకు మాత్రము ద్విపద గలదు	—
	22.	బ్రహ్మాజ్ఞను పురస్కరించుకొని ఇంద్రుడు హవిష్యాన్నమును సీత కొసంగుట.	—	63వ సర్గ. (27 శ్లోకములు)	63వ సర్గ.	—	—

1	2	3	4	5	6	7
23.	జటాయు మరణమునకు శోకించు రాముని లక్ష్మణుడు సాంత్వన పఱచుట.		74వ సర్గ. (28 శ్లోకములు)			4 గద్య పద్యములు (360-363)
అరణ్యకాండము 24.	రాముడు సీతను వెదకుచు చెట్లను మృగములను సంబోధించి యడుగుట.	60వ సర్గ. 38 1/2 శ్లో.లు	67వ సర్గ. —		30 ద్విపదలు (వరుసగా కాక స్వేచ్ఛగా వ్రాయ బడినవి.)	—
25.	రామవిలాపము. (అయోధ్యకు రాముడు రాడనియు భరతునినే పాలింపుమనియు లక్ష్మణుని పోయిచెప్పుమని కోరుచు రాముడు దుఃఖించును.)	62వ సర్గ. (21 శ్లోకములు)	—		12 ద్విపదలు (1229- 1240)	—
26.	శ్రీరామ విలాపము.	63వ సర్గ. (20 శ్లోకములు)	...		....	—
కిష్కింధకాండము 27.	తారావాక్యము. (తార వాలికి రామునితో యుద్ధము చేయవలదని హితబోధ చేయుట.)	...	11వ సర్గ. (15 శ్లోకములు)	14, 15సర్గలలో ఈ శ్లోకములు		7 గద్య పద్యములు. (207-218)

1	2	3	4	5	6	7
28.	వాలి మరణానంతరము సుగ్రీవ పశ్చాత్తాపము. తార రాముని పరుషముగా మాటలాడుట. రాముడు తార నోదార్చుట.	24వ సర్గ. (45 శ్లోకములు) (అన్నియు వృత్తములు)	...	23వ సర్గ.	....	ఇందు తార రాముని శపించుట ప్రత్యేకము. పద్య 304, 305
29.	వానర సేనాపతులు తమ తమ సైన్యములతో రామ సుగ్రీవుల యొద్దకు వచ్చుట.	39వ సర్గ. (45 శ్లోకములు)	....	39వ సర్గ.	22 ద్విపదలు 875-595	2 పద్య గద్యములు 544-545
30.	సంపాతి తన కుమారుడైన సుపార్శ్వుని పిలిచి అంగదుని వీపుపై కూర్చుండ బెట్టుకొని సముద్రమును దాటించుమని చెప్పుట.		56వ సర్గ. (41 శ్లోకములు)	62వ సర్గ.	....	ఇందు సాంపాతి సుపార్శ్వునితో సీతను జూచి రమ్మని చెప్పును అతడు సరేయనును. (757-761) గద్యపద్యములు.
31.	వానరులు సముద్రమును దాటను ద్యుక్తుడైన హనుమంతుని దీవింతురు. (హనుమన్మంగలము)		59వ సర్గ. 12 శ్లోకములు	....	....	....
32.	రావణ భవన వర్ణనము.	7వ సర్గ. (17 శ్లోకములు)	అధికపాఠ సర్గగా నున్నది.	....	7 ద్విపదలు (85-92)	2 పద్యములు, (91, 92)

కిష్కింధ కాండ

1	2	3	4	5	6	7
33.	పుష్పక విమాన వర్ణనము.	8వ సర్గ. (8 శ్లోకములు)	అధికపాఠ సర్గగా నున్నది.	—	3 ద్విపదలు (104-107)	4 పద్యములు (99, 100, 101, 102.
34.	సీతా ప్రత్యాశ్వాసనము.	39వ సర్గ. (54 శ్లోకములు)	36వ సర్గ.	—	—	—
35.	హనుమంతుడు చైత్య ప్రాసాద మునువిధ్వంసము చేయుట.	43వ సర్గ. (25 శ్లోకములు)	—	—	—	—
సుందరకాండము 36.	రాక్షసస్త్రీలు "రావణుని పొందుమని" సీతను తర్జించుట.	23వ సర్గ. (21 శ్లోకములు)	18వ సర్గ.	—	12 ద్విపదలు (389-400)	5 గద్య పద్యములు (234-242)
37.	సరమ లంకాదహనమును సీతకు వర్ణించి చెప్పుట. (సరమావాక్యము).	—	51వ సర్గ. (18 శ్లోకములు)	52వ సర్గ.	—	3 పద్యములు (493-495)
38.	కైకేశి విభీషణునితో "రావణునికి సీతి గఅపి నచ్చజెప్పుమ"ని పలుకుట. (విభీషణ మాతృ వచనము)	—	75వ సర్గ. సుందరకాండము (24 శ్లోకములు)	76వ సర్గ. సుందరకాండము	—	—
39.	రావణుడు ఆప్తులతో మంత్రాలోచనము చేయుట. (రావణ సభ)	—	81వ సర్గ. సుందరకాండము (30 శ్లోకములు)	81వ సర్గ. సుందరకాండము	—	—
40.	ప్రహస్తుడు రావణుని యుద్ధము చేయగా ప్రోత్సహించుట. (ప్రహస్త వాక్యము.)	—	82వ సర్గ. సుందరకాండము (25 శ్లోకములు)	81వ సర్గ. సుందరకాండము	—	—
సుందరకాండము 41.	మహోదరుడును రావణుని యుద్ధముచేయ ప్రోత్సహించుట. (మహోదర వాక్యము)	—	83వ సర్గ. సుందరకాండము (28 శ్లోకములు)	82వ సర్గ. సుందరకాండము	—	—

1		2	3	4	5	6	7
	42.	విరూపాక్షుడును యుద్ధమునకై సలహా చెప్పుట. (విరూపాక్ష వాక్యము)	—	84వ సర్గ. సుందరకాండము (23 శ్లోకములు)	83వ సర్గ. సుందరకాండము	—	—
	43.	విభీషణుడు "యుద్ధము వలదనియు, సీతనిమ్మనియు" రావణునికి హితము చెప్పుట. (విభీషణ వాక్యము)	—	85వ సర్గ. సుందరకాండము 21 శ్లోకములు	84వ సర్గ.	—	—
	44.	రావణుడు కోపించి విభీషణుని పరుషముగా దూషించుట, (రావణ వాక్యము)	—	88వ సర్గ. సుందరకాండము 26 శ్లోకములు	85వ సర్గ.	—	—
యుద్ధకాండ	45.	విభీషణుడు రావణునికి సమాధానము చెప్పుట. (విభీషణ ప్రతివ్యాహరణము)	—	89వ సర్గ. సుందరకాండము (21 శ్లోకములు)	86వ సర్గ.	—	—
	46.	సేతు నిర్మాణానంతరము సముద్రుడువచ్చి శ్రీరామునకు రాజోచితాభరణముల నిచ్చుట. (సముద్రదాయము)	—	99వ సర్గ. సుందరకాండము (12శ్లోకములు)	—	12 ద్విపదలు (1146-1157)	5 గద్య పద్యములు. (285-289)
	47.	రావణుని మంత్రాలోచనము.	—	100వ సర్గ. సుందరకాండము 39 శ్లోకములు)	—	రావణ భాషణము ఇంద్రజిత్తుగర్వోక్తులుఅతికాయ హితోపదేశము మాత్రము కలదు. (1418-1445)	100వ సర్గ విషయము మొత్తము అనువదింపబడినది. 14 గద్య పద్యములు. (291-303)

యుద్ధకాండము

1	2	3	4	5	6	7
48.	రావణుడు రెండవసారి సభకు వచ్చి అమాత్య సేనాపత్యాదులతో మంత్రాలోచనను చేయుట	11వ సర్గ. 33 శ్లోకములు	10, 14, 15, సర్గలలో కొంత కనబడుచున్నది.	76, 86, 87, సర్గలలో కొంత చెప్పబడినది.	26 ద్విపదలు (361-387)	ఒక వచనము కలదు. (88)
49.	రావణుడు కుంభకర్ణునికి సీతా వృత్తాంతమును దెలుపుట. కుంభకర్ణుడు రావణుని మందలించి, చివరకు రామలక్ష్మణులను నేన హతమార్చెద ననుట.	12వ సర్గ. (40 శ్లోకములు)	—	—	25 ద్విపదలు. (387-411)	19 పద్యగద్యములు. (89-107)
50.	మహాపార్శ్వుడు కుక్కుటవృత్తి నవలంబించి, బలవంతముగా సీతను భోగింపుమని సలహా చెప్పుట రావణుడు "పుంజిక సలా" బ్రహ్మశాప వృత్తాంతమును దెలుపుట	13వ సర్గ. (21 శ్లోకములు)	—	—	12 ద్విపదలు. (412-423)	8 పద్యగద్యములు. (108-115)
51.	రావణుడు శుకునిద్వారా సుగ్రీవునికి సందేశ మంపుట. అతడు వానరులచే పట్టుబడి దెబ్బలు తినుట సుగ్రీవుని ప్రతిసందేశము	20వ సర్గ. (37 శ్లోకములు)	—	—	36 ద్విపదలు. (793-828)	15 గద్యపద్యములు. (197-211)
52.	శ్రీరాముడు లక్ష్మణునకు విజయ సూచక శకునములను దెలుపుట.	23వ సర్గ. (16 శ్లోకములు)	—	—	—	—
53.	శ్రీరాముడు సీతను గూర్చి చింతించుట. శుకచారుని విడుచుట	24వ సర్గ. (46 శ్లోకములు)	—	—	సేతుబంధన పూర్వమే ఇందు శుకవిమో	ఇందును సేతుబంధన పూర్వమే శుకవిమోచనము అతడు రావణుని

1	2	3	4	5	6	7
	అతడు రావణునికి రామబలమును దెలుపుట రావణుని వీరాలాపములు—				చనము తిరిగి రావణుని వద్దకు వచ్చి విషయమును చెప్పుట యనునది సూచితము రెండు ద్విపదలు (829-830)	యొద్దకు వచ్చి విషయమును చెప్పుట యనునది సూచితమైనది. (211 పద్యము)
యుద్ధకాండము 54	రావణుడు సువేలాద్రి నారోహించిన పిదప గోపురమునన్న రావణునిగాంచి సుగ్రీవుడు కోపించి అతనిపై లంఘించుట. రావణ సుగ్రీవుల మల్లయుద్ధము. రావణుడు మాయను ప్రయోగించుటకుపూనగా, సుగ్రీవుడు తప్పించుకొని రాముని చేరుట	40వ సర్గ. (30 శ్లోకములు) 41వ సర్గ. 10 శ్లో.ల వరకు	—	—	54 ద్విపదలు 1785-1841	24 పద్య గద్యములు. (468-492)
55.	అంగద వజ్రదంష్ట్రుల యుద్ధము. వజ్రదంష్ట్ర సంహారము.	53, 54 సర్గలు 33 + 54 శ్లోలు	—	—	—	—
56.	నారదాగమన వృత్తాంతము.	—	27వ సర్గ. (7-41 శ్లో.లు)	—	35 ద్విపదలు (2627-2660)	18 పద్యగద్యములు (609-626)
57.	ఇంద్రజిత్తు అంగదునిచే పరాజితుడై పోయి హోమము చేయుట. (ఇంద్రజిద్ధోమము)	—	20వ సర్గ. (36 శ్లోకములు)	—	15 ద్విపదలు (2412-2426)	3 గద్యపద్యములు (542-544)
58.	మండోదరీ హితోపదేశము. ప్రహస్త వధానంతరము ఈమె	—	35వ సర్గ. 50 శ్లోకములు	33వ సర్గ.	40 ద్విపదలు (3116-3155)	18 గద్యపద్యములు. (765-782)

1	2	3	4	5	6	7
	సభకు వచ్చి శ్రీరాముల పరాక్రమమును రావణునకు దెలిపి సీత నొసంగుమని బోధించును.) (మండోదరీ వాక్యము)					
59.	రావణుడు మండోదరీ హితమును దిరస్కరించి సమాధానము చెప్పుట.	—	36వ సర్గ. (21 శ్లోకములు)	34వ సర్గ.	18 ద్విపదలు (3156-3172)	6 పద్యగద్యములు. (783-788)
యుద్ధకాండము 60.	కుంభకర్ణ హితబోధ (కుంభకర్ణుడు రావణునకు నారదుడు తనకుజెప్పిన దేవరహస్యమును అనగా విష్ణువు ద్వారా రావణవధ జరుగుటను తెలిపి యుద్ధము చేయవలదని బోధించుట.	—	—	—	—	—
			41వ సర్గ. (24 శ్లోకములు)	40వ సర్గ.	30 ద్విపదలు (3662-3691)	2 పద్య గద్యములు. (891-892)
61.	రావణుడు కుంభకర్ణుని హితబోధను దిరస్కరించి, విష్ణువు వలన మరణము నొంది మోక్షమును పొందగలనని తన యిచ్ఛను ప్రకటించుట.	—	42వ సర్గ. (25 శ్లోకములు)	41వ సర్గ.	40 ద్విపదలు (3692-3732)	8 పద్య గద్యములు. (893-899)
62.	కుంభకర్ణ విభీషణ సంవాదము. (యుద్ధ రంగమున ఎదుటకు వచ్చిన విభీషణుని గాంచి కుంభకర్ణుడు రాముని శరణు పొందినందుకు అతనిని పొగిడి, "నీవాక్య-	—	46 వసర్గ. (82-91 వరకు 10 శ్లోకములు)	—	16 ద్విపదలు (4084-4099)	4 పద్యములు. (944-947)

1	[illegible]	[illegible] 4	5	6	7	
	[illegible] నడిని తన యెదుటి నుండి తొలగి బొమ్మని హెచ్చరించెను.					
	63. కాలనేమి వృత్తాంతము (ఎ) కాలనేమివధ, ధాన్యమాలిని శాప వృత్తాంతము, చిత్రసేనాది గంధర్వులను పారద్రోలుట. భరత స్వప్నము మాల్యవంతాదులతో పోరు. (బి) మరల స్వస్థానమున ఓషధీ గిరిని పెట్టుటకు పోయినపుడు హనుమంతుడు రాక్షసులతో చేసిన యుద్ధము	—	81వ సర్గ. 200 శ్లోకములు మరియు అధికపాఠ సర్గ (ఓషధీ పర్వతం స్వస్థానే స్థాపనం	82వ సర్గ. 83వ " 84వ "	430 ద్విపదలు (6605-7000) (7025-7056)	170, 13 గద్య పద్యములు (1617-1790) (1600-1713)
యుద్ధకాండ	64. కుంభకర్ణ, అతికాయాదుల మరణానంతరము రావణుడు భయపడి రాముని నారాయణునిగా దలంచి. నగర రక్షణమునుగట్టిగా చేయుమని రాక్షసులను హెచ్చరించును.	72వ సర్గ. (16 శ్లోకములు)	—	—	—	—
	65. హనుమద్భరత సంవాదము.	—	—	82వ సర్గ. [10 శ్లోకములు]	—	—
	66. విభీషణుడు రావణ బహిష్కృతుడై కైలాసము పోయి కుబేరుని	—	—	89వ సర్గ.	—	—

1	2	3	4	5	6	7
	కలియును. శివుడు, కుబేరుడును అతనితో "రాముని శరణు పొందుమని" హితము చెప్పుదురు.	...	...	[సుందరకాండ] 5, 42 శ్లో.లు	...	....
67.	మండోదరీ కేశగ్రహణము. [రావణుని పాతాళ హోమము. రాముడు విభీషణుని వలన నిది తెలిసికొని తద్విఘ్నమునకై అంగదాదులను పంపుట. అంగదుడు మండోదరి వెంట్రుకలను పట్టి రావణుని యెదుటికి ఈడ్చుకొనివచ్చుట. రావణుని హోమవిఘ్నము.	...	82వ సర్గ. (65 శ్లోకములు)	...	142 ద్విపదలు (7078-7218)	66 పద్య గద్యములు. (1829-1895)
యుద్ధకాండము 68.	ఆదిత్య హృదయ స్తోత్రము. అగస్త్యుడు రామునకు దీని నుపదేశించును.	107వ సర్గ. (31 శ్లోకములు)	...	...	13 ద్విపదలు (7520-7540)	2 పద్య గద్యములు 2501-2503
69.	సీతాదేవి కోరికపై కిష్కింధలోని వానర స్త్రీలు పుష్పకము నెక్కి అయోధ్య కేతెంచుట.	123వ సర్గ. (29-38 శ్లో.లు)	...	...	5 ద్విపదలు (8336-8440)	3 పద్యగద్యములు. (2501-2503)
70.	రావణుడు విభీషణుని తన్నుట.	....	90వ సర్గ. సుందరకాండ (2,3,4 శ్లో లు)	87వ సర్గ. సుందరకాండ	5 ద్విపదలు (535-540)	148వ పద్యము.
71.	దశరథ సాగర స్నేహము.	....	96వ సర్గ. సుందరకాండ 42-66 శ్లో.లు	94వ సర్గ. సుందరకాండ	7 ద్విపదలు (951-957)	233వ గద్యము.

1	2	3	4	5	6	7
72.	కైకేశి వృత్తాంతము. (విభీషణుడు రావణ బహిష్కృతుడై తల్లియైన కైకేశి యొద్దకు వచ్చి సభలో రావణుడు తన్నన్నదన్నుటను తెలుపును. కైకేశి "విష్ణువు దేవతల కిడిన వరమును దెలిపి రాముని శరణాగతి పొందుమ"ని అనుమతించును.	—	91వ సర్గ. సుందరకాండ 1-83 శ్లో.లు	89వ సర్గ. సుందరకాండ ఇందు తల్లినికలసినాడని సూచన మాత్రమే కలదు.	60 ద్విపదలు (560-611)	8 గద్యపద్యములు. 155-162
యుద్ధకాండము 73.	మొదటిసారి యుద్ధములో ఓడి పోయివచ్చిన రావణుడు "అనరణ్య, వేదవతి, ఉమా, నందీశ్వర, రంభా, పుంజికస్థల శాపములను" స్మరించును.	60వ సర్గ. 8-12 శ్లో.లు	—	—	—	—
74.	శ్రీరామాదుల జన్మతిథి నక్షత్రాదుల ప్రస్తావము.	18వ సర్గ. 8, 9, 14, 15 శ్లో		—	(550-552, 559-562)	167వ పద్యము
75.	వామనావతారము. కశ్యపుని తపస్సు, అదితియందు కుమారుడుగా జనించుమని విష్ణువును కశ్యపుడు కోరుట)	29వ సర్గ. 10-17 శ్లో.లు	...	...	9 ద్విపదలు. 865-875	8 పద్యములు. (283-290)
బాలకాండము 76.	జహ్ను మహర్షి గంగాపానము.	43వ సర్గ. 34-38 శ్లో.లు	....	...	21 ద్విపదలు 1299-1319	4 పద్యగద్యములు (467-470)
77	కూర్మావతార కథనము.	45వ సర్గ. 27-30 శ్లో.లు	...	...	....	....

1		2	3	4	5	6	7
	78.	సీతారామ లక్ష్మణులు చిత్ర కూటముపై వాల్మీకిని దర్శింతురు.	56వ సర్గ. 16, 17, శ్లో.లు	పుష్పకవిమానముపై వచ్చు శ్రీరాముడు సీతకు వాల్మీకీయాశ్రమమును చూపినట్లు సూచింపబడినది.	—	—	—
అయోధ్యాకాండము	79.	బ్రాహ్మణ శాప ఫలితముగా కైకేయి మందరను విశ్వసించి తదను గుణముగా నడచినదనుట.	—	11వ సర్గ. 42-54 శ్లో.లు	8వ సర్గ. 37-47 శ్లో.లు	ధవళాంగముని దయచే మాయా విద్యను పొందినట్లు సూచితము.	ధవళాంగముని వృత్తముసూచితము
	80.	కైకేయి మూర్ఖవేశ బ్రాహ్మణుని వలన పొందిన విద్యాబలముచే రాక్షస మాయలనుండి దశరథుని రక్షించెను.	—	11వ సర్గ. 42-54 శ్లో లు	—	194వ ద్విపద.	63వ గద్యము.
కిష్కింధాకాండము	81.	అయోముఖి వృత్తాంతము.	69వ సర్గ. 11-18 శ్లో.లు	—	—	6 ద్విపదలు. 1390-1395	7 పద్యగద్యములు (378-384)
	82.	శ్రీరాము డాంజనేయుని వ్యాకరణ జ్ఞానమును పరిశుద్ధభాషను పొగడుట.	3వ సర్గ. 28,33. శ్లో.లు	—	—	3 ద్విపదలు 152-154	—
	83.	ప్రస్రవణగిరి వర్ణనము.	27వ సర్గ. 5-28 శ్లో.లు	—	—	—	—

1	2	3	4	5	6	7
కిష్కింధాకాండము 84.	లక్ష్మణుని కోపమును శాంతింప జేయుటకై సుగ్రీవుడు తారను మొదట పంపుట. ఆమె లక్ష్మణుని శాంతింపఁ జేయుట.	33వ సర్గ. 26-62 శ్లో లు	ఇందు సుగ్రీవుడు తారా సహితుడై వచ్చినట్లును, అమె పిదపలక్ష్మణుని శాంతింప జేసినట్లును గలదు. తార ప్రత్యేక మిత్ర బోధ లేదు. 26వ సర్గ.	—	సుగ్రీవుడై తారాసహితుడై వచ్చెను. తార లక్ష్మణుని శాంతింప జేయును. 8 ద్విపదలు 839-846	10 గద్యపద్యములు 486-495
85.	హనుమంతుడు తారనుఓదార్చుట.	21వ సర్గ. 16 శ్లోకములు	—	23వ సర్గ.	3 ద్విపదలు (651-653)	
సుందరకాండము 86.	కేసరి శంఖ శవలమను దిగ్గజమును జంపి, భరద్వాజాది మునుల వరబలమున మారుత విక్రముడైన హనుమంతుని కుమారునిగా బడయుట.	—	58వ సర్గ. 12-36 శ్లో.లు	3వ సర్గ. (సుందరకాండ)	—	5 గద్య పద్యములు 814-819.
87.	ఆంజనేయుడు లంకాదేవితో (లంకిణి) యుద్ధము చేయుట. అది ఓడిపోయి లంకను వీడుట.	3వ సర్గ. 16 శ్లోకములు	—	—	20 ద్విపదలు 44-64	9 పద్యగద్యములు 77-85
88.	ఆంజనేయుడశోక వనము ను ప్రవేశింపబోవుచు రుద్రాది దేవతలను ప్రార్థించును.	13వ సర్గ. 56-57 శ్లో లు	8వ సర్గ. (64-77)	—	—	2 పద్యములు 129, 130

ఉపయుక్త గ్రంథములు (తెలుగు)

1. రంగనాథ రామాయణము. గోన బుద్ధారెడ్డి. వావిళ్ళ ప్రతి
2. రంగనాథ రామాయణము. " రాయల్ అండ్‌కో ప్రతి
3. రంగనాథ రామాయణము. " ఆంధ్ర విశ్వకళా పరిషత్తు సంశోధిత ముద్రణము.
4. శ్రీమదాంధ్ర మహాభారతము (ఆది సభాపర్వములు) నన్నయ
5. శ్రీమదాంధ్ర మహాభారతము (అను శాసనికపర్వము) తిక్కన
6. నిర్వచనోత్తర రామాయణము. తిక్కన
7. శ్రీమదాంధ్ర మహాభాగవతము. బమ్మెర పోతనామాత్యుడు.
8. భాస్కర రామాయణము. హుళక్కి భాస్కరాదులు.
9. కుమార సంభవము. నన్నెచోడుడు.
10. భోజరాజీయము. అనంతామాత్యుడు.
11. సింహాసన ద్వాత్రింశిక. కొఱవి గోపరాజు.
12. మొల్ల రామాయణము. కుమ్మరిమొల్ల.
13. అప్పకవీయము. కాకునూరి అప్పకవి.
14. కవిజనాశ్రయము. భీమన.
15. రంగనాథ రామాయణము. (ఉత్తర కాండము) గోనకాచ విభుడు. పినవిఠల భూపతి.
16. పండితారాధ్య చరిత్రము. పాల్కురికి సోమన.
17. బసవ పురాణము. పాల్కురికి సోమన.
18. ఉత్తర రామాయణము. కంకంటి పాపరాజు.
19. సిద్ధేశ్వర చరిత్రము. కాసె సర్వప్ప
20. శ్రీరామాయణము. ద్విపద. కట్టా వరదరాజు.
21. క్రీడాభిరామము. వినుకొండ వల్లభరాయలు.
22. యయాతి చరిత్ర పొన్నగంటి తెలగనార్యుడు.
23. రామాభ్యుదయము. అయ్యలరాజు రామభద్రుడు.
24. శశాంక విజయము. శేషము వెంకటపతి
25. ఆచార్య సూక్తిముక్తావళి. నంబూరి కేశవాచార్యులు.
26. వేణుగోపాల శతకము.
27. అష్టమహిషీ కళ్యాణము. తాళ్ళపాక చిన్నన్న.
28. ఆంధ్ర కావ్యాలంకార సూత్ర వృత్తి. వేదాల తిరువేంగళాచార్యులు.
29. ప్రథమాంధ్ర మహాపురాణము డా॥ జి.వి. సుబ్రహ్మణ్యము.
30. వీరరసము. " "
31. రసోల్లాసము. " "

32. జానపదగేయ సాహిత్యము. డా. బి. రామరాజు.
33. ఆధునికాంధ్ర కవిత్వము. సంప్రదాయములు & ప్రయోగములు. డా. సి. నారాయణరెడ్డి.
34. వ్యాసవాహిని డా. సి. నారాయణరెడ్డి
35. ద్విపద వాఙ్మయము. డా. జి. నాగయ్య
36. తెలుగు కావ్యావతారికలు ”
37. దాక్షిణాత్య సాహిత్య చరిత్ర ”
38. సింహావలోకనము. వేటూరి ప్రభాకరశాస్త్రి
39. ఆంధ్ర సాహిత్యచరిత్ర. పింగళి లక్ష్మీకాంతము
40. గౌతమ వ్యాసములు. ”
41. సారస్వతా లోకము. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ
42. అవతారికలు-చరిత్ర. తేరాల సత్యనారాయణ
43. ఆంధ్ర కవి తరంగిణి. ii, iii, iv సంపుటములు చాగంటి శేషయ్య
44. కవుల జీవితములు. గురజాడ శ్రీరామమూర్తి
45. ప్రాఙ్నన్నయ యుగము. డా. దివాకర్ల వెంకటావధాని
46. నన్నయ భారతము. ” ”
47. తెలుగు సాహిత్యములో రామకథ. రావూరి దొరసామి.
48. తెలుగు సాహిత్యములో రామకథ. పండా శమంతకమణి
49. సమగ్రాంధ్ర సాహిత్యం ii, iii, iv సంపుటములు ఆరుద్ర
50. ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సర్వస్వము. శిష్టా రామకృష్ణశాస్త్రి
51. తెలుగులో కొత్త వెలుగులు తూమాటి దొణప్ప.
52. తెలుగు సాహిత్యములో దేశికవిత ఆర్వీయస్ సుందరం
53. ఆంధ్రసాహిత్య సంగ్రహ చరిత్ర. వారణాసి వెంకటేశ్వర్లు.
54. కవుల చరిత్ర, కందుకూరి వీరేశలింగం పంతులు 1 సంపుటము
55. ఆంధ్ర సాహిత్య వికాసము. డా. పి యశోదారెడ్డి
56. పంచమి. కట్టమంచి రామలింగారెడ్డి
57. ఆంధ్రుల చరిత్రము. చిలుకూరి వీరభద్రరావు
58. కవిత్రయము. తిక్కన. నండూరి రామకృష్ణాచార్యులు
59. సంస్కృత వాఙ్మయ చరిత్రము. మల్లాది సూర్యనారాయణ శాస్త్రి
60. కావ్యాలంకార సంగ్రహము. (వ్యాఖ్య) సన్నిధానము సూర్యనారాయణ శాస్త్రి
61. ఆంధ్ర ద్విపద సాహిత్య చరిత్ర. డా॥ టి. సుశీల
62. ప్రబంధవాఙ్మయము, డా. పల్లా దుర్గయ్య.
63. అష్టాదశ పురాణసంగ్రహము- వాడ్రేవు శేషగిరిరావు.
64. దక్షిణదేశ భాషా సారస్వతము- దేశి, కోరాడ రామకృష్ణయ్య
65. సారస్వతవ్యాసములు— ”

66. రామాయణ కల్పవృక్షము – విశ్వనాథ సత్యనారాయణ
67. శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణము - (మందరము) వావిలకొలను సుబ్బారావు
68. తెనుగు కంబరామాయణము - నూతలపట్టు శ్రీరామిరెడ్డి
69 స్త్రీల రామాయణపు పాటలు - కృష్ణశ్రీ సంకలితము
70. బాలనాగమ్మకథ -
71. ఛందోదర్పణము - అనంతుడు
72. ఆంధ్రసారస్వతము - రాజకవులు. వేమూరి వెంకటరామయ్య
73. బాలవ్యాకరణము. పరవస్తు చిన్నయసూరి
74. ఆంధ్రసాహిత్య చరిత్ర, ఖండవల్లి లక్ష్మీరంజనం ——
75. శ్రీనాథుని సాహిత్య ప్రస్తావము డా. జంధ్యాల జయకృష్ణ బాపూజీ
76. కవికోకిల గ్రంథావళి. దువ్వూరి రామిరెడ్డి
77. ప్రకృతి ప్రబంధము. చేకూరి చెన్నకృష్ణ
78. శబ్దార్థ చంద్రిక. మహాకాళి సుబ్బారాయడు
79. తెలుగుపై ఉర్దూ పారశీకముల ప్రభావము. డా. కె గోపాలకృష్ణారావు
80. ఆంధ్రకవుల ఔచిత్యవిచారణ. కాశీభొట్ల సత్యనారాయణ

పీ ఠి క లు —— వ్యా స ము లు

81. ఆంధ్రుల చరిత్ర ఘట్టములు (భారతి. అక్టోబర్ 1958) నెలటూరి వెంకటరమణయ్య
82. తమిళ మళయాళ రామాయణాలు చల్లా రాధాకృష్ణశర్మ. (రామాయణసుధాలహరి)
83. రంగనాథ రామాయణము దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డి (భారతి జూలై 1961)
84. వితల రంగనాథ రామాయణము. దేవరపల్లి వేంకట కృష్ణారెడ్డి. (భారతి అక్టోబర్-1961)
85. ద్విపద కవిత్వము పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి. (సారస్వత వ్యాసములు-III)
86. పీఠిక (రంగనాథ రామాయణము) మల్లంపల్లి సోమశేఖర శర్మ. (రాయల్ అండ్‌కో ప్రతి)
87. పీఠిక. (రంగనాథ రామాయణము) పింగళి లక్ష్మీకాంతం. ఆంధ్ర విశ్వకళా పరిషత్తు సంశోధిత ముద్రణము.
88. అనుబంధ పీఠిక. (రంగనాథ రామాయణము) కట్టమంచి రామలింగారెడ్డి, (ఆంధ్ర విశ్వకళా పరిషత్తు సంశోధిత ముద్రణము.
89. పీఠిక. (రంగనాథ రామాయణము) జనమంచి శేషాద్రి శర్మ (వావిళ్ళప్రతి)
90. పీఠిక (రంగనాథ రామాయణము వావిళ్ళప్రతి) వేదము లక్ష్మీనారాయణశాస్త్రి.
91. పీఠిక. (రంగనాథ రామాయణము రాయల్ అండ్‌కో ప్రతి) సమాలోచనము. జనమంచి వేంకట సుబ్రహ్మణ్య శర్మ.
92. పీఠిక. (బసవ పురాణము వావిళ్ళప్రతి) బండారు తమ్మయ్య

ఆం గ్ల గ్ర ం థ ము లు

93. A History of Sanskrit Literature. Arthur. A Macdoneie.
94, Quarterly Journal. Part 12. Mythic Society.

సంస్కృత గ్రంథములు

95. శ్రీమద్రామాయణము. (దాక్షిణాత్య ప్రతి) వాల్మీకి మహర్షి. శ్రీ గోవిందరాజీయ వ్యాఖ్యోపేతము. (ప్రకాశకులు. శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి. విశిష్టాద్వైత ప్రచారకులు. నడిగడ్డపాలెం)
96. శ్రీ మద్రామాయణము. (పశ్చిమోత్తర శాఖీయప్రతి) వాల్మీకి మహర్షి. సంపాదకులు = దయానంద మహావిద్యాలయము. లాహోర్. (లవపురం)
97. శ్రీమద్రామాయణము. గౌడీయప్రతి లేక ఇటాలియన్ ప్రతి.) వాల్మీకి మహర్షి.
98. తనిశ్లోకి. (శ్రీమద్రామాయణ వ్యాఖ్యానము)
99. కతక వ్యాఖ్యానము. (మాహేశ్వరీయము) మహేశ్వరులు.
100. రామాయణ మంజరి. క్షేమేంద్రుడు.
101. ఆనంద రామాయణము. వాల్మీకిముని.
102. అధ్యాత్మ రామాయణము.
103. చంపూ రామాయణము. భోజరాజు.
104. హనుమద్రామాయణము.
105. అద్భుత రామాయణము. (తెనుగు అనువాదము. వేదుల వెంకటశాస్త్రి సాధన గ్రంథమండలి)
106. భుశుండి రామాయణము. పూర్వఖండము. (సంపాదకులు-భగవతీ ప్రసాదసింహ)
107. శ్రీమద్భాగవత మహాపురాణము. 108. నృసింహ పురాణము.
109. పద్మపురాణము. (బ్రహ్మఖండము, సృష్టిఖండము, పాతాళఖండము, ఉత్తరఖండము.
110. వామన పురాణము.
111. విష్ణుపురాణము.
112 కూర్మపురాణము.
113 గరుడ పురాణము.
114. బ్రహ్మవైవర్త పురాణము.
115. బ్రహ్మాండ పురాణము
116 అగ్నిపురాణము.
117. భవిష్యత్ పురాణము.
118. శివపురాణము.
119. స్కాందోప పురాణము. (పురాణ వైభవ ఖండము)
120 స్కంద పురాణము. (బ్రహ్మఖండము, మహేశ్వర ఖండము.)
121. శివమహా పురాణము. (కోటిరుద్రసంహిత. శతరుద్ర సంహిత)
122. తైత్తిరీయోపనిషత్తు. (శిక్షావల్లి, ఆనందవల్లి, భృగువల్లి)
123. తైత్తిరీయ నారాయణోపనిషత్తు.
124. కఠోపనిషత్తు.
125. తైత్తిరీయ యజురారణ్యకము. (చిత్తి)
126. మహోపనిషత్తు.
127. తైత్తిరీయ యాజ్ఞికి మహా నారాయణోపనిషత్తు.
128. రామరహస్యోపనిషత్తు.
129. శ్వేతాశ్వతరోపనిషత్తు.
130. బృహదారణ్యకోపనిషత్తు.
131. తారాసారోపనిషత్తు.

132. సూర్యోపనిషత్తు. 133. ఛాందోగ్యోపనిషత్తు.
134. ఈశావాస్యోపనిషత్తు. 135. అధర్వణోపనిషత్తు.
136. ససూత్రైకాగ్నికాండ మంత్రభాష్యము. 137. పురుషసూక్తము.
138. వివాహోపనయనములు. (భట్టీయము) 139. మంత్ర పుష్పము.
140. అంతర్యామి బ్రాహ్మణము. 141 సంధ్యావందనము
142. విష్ణుదేవతా తిరుక్కళ్యాణము. పుణ్యాహవాచనము. (భట్టీయము)
143. శుక్లయజుర్వేదీయ సంహితోపనిషత్తుల శాంతి పాఠము.
144. తైత్తిరీయము. కాణ్వసంహిత. 145. విష్ణుసహస్రనామములు.
146 యజుర్వేదము. మైత్రాయణ్య సంహిత.
147. యాజుషస్మార్త మంత్రపాఠము. ద్వితీయభాగము. (విచ్ఛిన్నోపాసనము)
148. యాజుషస్మార్త మంత్రపాఠము. 149, ఏకాగ్నికాండము. (మంత్ర పన్నములు)
150. శ్రీవేంకటాచల మాహాత్మ్యము ద్వితీయాభాగము. (తిరుమల తిరుపతి దేవస్థాన ప్రచురణము)
151. శివపూజ. (పంచమ వారాభిషేకాంతర్గత వారుణాను వాకములు)
152. శ్రీమహాభారతము. (అరణ్య, అనుశాసనిక, ఆశ్రమ వాసిక పర్వములు)
153. భగవద్గీత. 154. భగవద్గీతా భాష్యము. శ్రీ రామానుజాచార్యులు.
155. శ్రీభాష్యము. (బ్రహ్మసూత్ర. భాష్యము) శ్రీ రామానుజాచార్యులు.
156. శ్రుతప్రకాశిక. సుదర్శనసూరి. 158. ప్రపన్నామృతము.
158. యతిరాజ వింశతి. మణవాళ మహామునులు.
159. యతీంద్ర మతదీపిక. శ్రీనివాసాచార్యులు.
160. ముకుందమాల. కులశేఖరాళ్వారులు.
161. స్తోత్రరత్నము. యామునాచార్యులు.
162. శ్రీరంగరాజస్తవము. (పూర్వశతకము) శ్రీ పరాశర భట్టరులు.
163. రహస్యత్రయ సారము. వేదాంత దేశికులు. 164. తాత్పర్యదీపిక.
165. రఘువంశము. కాళిదాసు. (సంజీవనీ వ్యాఖ్యోపేతము)
166. హనుమన్నాటకము. దామోదర మిశ్రగ్రథితము.
167. ప్రసన్న రాఘవము. జయదేవుడు. 168. అనర్ఘరాఘవము. మురారి.
169. ఉత్తర రామచరిత్రము. భవభూతి. 170. ప్రతిమా నాటకము. భాసుడు
171. మహావీర చరిత్రము. భవభూతి 172. బాలరామాయణము. రాజశేఖరుడు.
173. మనుస్మృతి. మనువు 174. పరాశర సంహిత.
175. నీతిశాస్త్రము (సంకలనగ్రంథము) 176. వ్రతరత్నాకరము.
177. నారదభక్తి సూత్రములు 178. శాండిల్య భక్తిసూత్రములు
179, కావ్యప్రకాశము. మమ్మటాచార్యులు 180. చంద్రాలోకము

181. ప్రతాపరుద్ర యశోభూషణము. విద్యానాథుడు (రత్నాపణ వ్యాఖ్యాసహితము)

182. సాహిత్యదర్పణము. విశ్వనాథుడు

183. కావ్యాదర్శము. దండి

184. నాట్యశాస్త్రము. భరతముని.

185. దశరూపకము. ధనంజయుడు

186. ధ్వన్యాలోకము, ఆనందవర్ధనుడు

187. అహోబల పండితీయము.

188. కావ్యాలంకార సూత్రవృత్తి. వామనాచార్యుడు

189. రామాయణ సారోద్ధారము. ములుకుంట్ల నరసింహావధాని,

190. ఆశ్చర్య రామాయణము, లక్కావఝుల వేంకట కృష్ణశాస్త్రి.

191. అమరకోశము (గురుబాల ప్రబోధిక)

192. త్రికాండశేషము.

తమిళ గ్రంథములు

193. ముముక్షుప్పడి, పిళ్లైలోకాచార్యులవారు. మణవాళ మహాముని వ్యాఖ్యోపేతము,

194. ముముక్షుప్పడి (తెనుగు అనువాదము) కందాడై శేషాచార్యులు

195. శ్రీవచన భూషణము పిళ్లైలోకాచార్యులు

196. నవవిధ సంబంధము,

197. అర్థపంచకము

198. తత్త్వత్రయము,

199. తిరుమాలై. తొండరడిప్పొడి యాళ్వారు

200. నిత్యాను సంధానము. సుదర్శనాచార్య పీఠికా సహితము,

హిందీ గ్రంథములు

201. राम चरत मानस-तुलसीदास,

202. रामकथा-उत्पत्ति और विकास—कामिल बुल्के रेवरेंड फादर

203. हिंदुत्व. रामदास गौड.

204. पउम चरिअ विमलसूरि

205. श्रीराम वचनामृतांक-कल्याण वार्षिक संचिका.

206. भक्त्वयंक " "

సవరణలు

పు	పంక్తి	తప్పు	ఒప్పు	పుట	పంక్తి	తప్పు	ఒప్పు
1	24	సారస్వతావ లోకము	సారస్వతా లోకము	48	5	కొన్ని ని	కొన్ని
7	3	వైష్ణవుడై	వైష్ణవుడై, పిదప	56	6	విభిషణుని	విభీషణుని
8	30	శవదీక్ష	శివదీక్ష	58	1	పార్వని	పార్శ్వని
11	14	ప్రత్యీక్ష	ప్రత్యక్ష	59	6	చైతన్య	చైత్య
11	29	వాఙ్మయ	వాఙ్మయ	59	12	గాదీయ	గౌడీయ
12	23	వాఙ్మయ	వాఙ్మయ	60	27	యోద్ధ	యుద్ధ
13	8	పుత్రల	పుత్రులు	61	5	యమానా	యమునా
14	17	సంభ్రమయె	సంభ్రమమయ్యె	61	20	ప్రత్యేకమునా	ప్రత్యేకముగా
15	24	రజ్ఞ	రజ్జ	64	1	వాలివారి	వారివారి
17	14	whil	while	68	14	విద్యుజ్జిహ	విద్యుజ్జిహ్వ
17	31	సంగ్రాహ	సంగ్రహ	68	23	ద్విపలు	ద్విపదలు
20	5	గడాంకు	గండాంకు	74	12	అమూలకమున	అమూలకమైన
21	17	నాతాత	నాతత	75	14	రమ్మనుడుగ	రమ్మనుడు
23	2	సరేశత్వ	సర్వేశత్వ	77	18	యెరి	యొరి
24	29	పుటయి	పుటలు	78	25	వాదని	వాడని
25	8	శాయనం	శాయినం	83	14	కొనకున్న	కొనకున్న
25	17	వృత్తాంతాము	వృత్తాంతము	86	17	పోది	పొది
28	9	క్షితీంతుడు	క్షితీంద్రుడు	89	1	నదిరించి	నెదిరించి
30	13	గ్రంథ్రకర్త	గ్రంథకర్త	90	7	యనల	యచల
31	15	రంగనాథోభయ	భాస్కరరంగనాథోభయ	91	1	నుదరు	నుదురు
				91	10	ప్రత్యర్థ	ప్రత్యర్థి
				94	19	వర్తిత	వర్ణిత
32	11	బుద్ధభూతి	బుద్ధభూపతి	96	20	ఏరావతః	ఐరావతః
32	17	మిసర	మీసర	97	22	మర్యాద	మర్యాదా
32	19	కరతాలా	కలతలా	100	6	అప్యూప	అపూప
32	25	తిక్కనమాత్యు	తిక్కనామాత్యు	101	6	ఘార్చి	మూర్చి
36	14	శ్రీక్లీ	శ్రీం, క్లీం	103	15	విపర్యములు	విపర్యయములు
37	20	తసైవం	తస్యైవం	103	19	అంగుళీయ	అంగుళీయ
37	27	ప్రపాకము	ప్రపాతకము	104	7	అంగుళీయకుము	అంగుళీయకము
38	9	మతమలు	మతములు	104	16	మౌ ము	మౌనము
39	12	కాంక్షినాడు	కాంక్షించినాడు	107	12	జాచి	జూచి
40	19	అభావములు	అభావముల	107	13	మనుజశు	మనుజేశు
43	11	పేరుగుట	పెరుగుట	109	10	అవాల్మీకాంశ	అవాల్మీకాంశ
43	22	సంతం:	సంతః	110	2	లతత్సంబం	తత్తత్సంబం
45	12	భరాద్వాజు	భరద్వాజు	110	19	జగమ	జగామ
45	13	వ్యాఘ్రౌ	వ్యాఘ్రౌ	111	24	చంపి	చంపెను
46	20	మధసూదను	మధుసూదను	114	9	భూపచిక	భూపతికి

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
117	17	శ్రీరామ పట్టాభి	శ్రీరామ పాదుకా పట్టాభి
117	26	పతిని	ప్రతిని
117	26	స్వీకృత	స్వీకృత
120	1	రామయణ	రామాయణ
122	23	నున్నాడా	నున్నాడో
123	33	బాలనాం	బాలకాండ
124	9	అకర్థమ	అకర్దమ
125	17	కథాసర	తథాసర
125	24	ఆనుక్రమణి	అనుక్రమణి
126	5	గ్రంథన	గ్రంథస్థ
130	13	దిశను	దిశను
130	24	సిద్వాకోత్యర్థ	సిద్ధార్థోహ్యర్థ
130	27	అభాణక	ఆభాణక
131	11	దిక్షిణ	దక్షిణ
132	19	చావిశిష్టం	చాపశిష్ట
132	24	పద్నపురాణ	పద్మపురాణ
132	29	నమన్వితా	సమన్వితా
137	11	పష్టిర్వర్ష	షష్టిర్వర్ష
138	2	పపు	పంపు
140	5	అవుడు	అపుడు
140	31	గోడ్డు	గొడ్డు
141	14	ఘారీచుని	మారీచుని
144	19	ఉమియు	ఉమియుట
144	26	శ్రోతము	శ్రోత్రము
147	20	ప్రచారము	ప్రకారము
151	9	పిదవ	పిదప
152	21	రాజపురమును	రాజు పురమును
153	5	కాతాత	కాతత
154	33	బితిచి	బిలిచి
155	25	బటినది	బడినది
156	31	అమెతోనే	ఆమెతానే
160	24	మితాత	మీతాత
165	8	ధృడమేనదా	దృఢమైనదా
165	33	మయా	మాయా
167	5	న్వస్త్యయన	స్వస్త్యయన
167	12	ఛాపి	చాపి
168	2	వాల్మీకిమున	వాల్మీకిముని
168	28	రాఘవస్త్వథ	రాఘవ స్త్వథ

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
173	14	నౌకవృక్ష	నౌకవటవృక్ష
175	20	ఆవశ్య	అవశ్య
176	21	అజనేయుని	ఆంజనేయుని
178	16	కాంము	కాండము
178	23	నమాంనం	న మాంసం
182	6	ఈంయూహ	ఈయూహ
182	29	న్మర్థయత్	న్మర్దయత్
183	7	నముంజము	సమంజసము
183	26	చేయిబద్థి	చేయిబట్టి
185	27	ఖండము	ఖండసము
186	2	తయోగుణ	తమోగుణ
186	13	ఉండి	తో అయోము ఖిపృత్తాంతము ఉండి
186	24	సాలంమేకం	సాలమేకం
187	2	సాఖా	శాఖా
188	22	ఆదేశించిన	ఆదేశించిన
190	5	త్తాత్కార్య	తత్తత్కార్య
190	22	తీష్ణ	తీక్ష్ణ
191	6	హనుజ్జన్మ	హనుమజ్జన్మ
193	5	తననంటి	తనవంటి
193	6	నకుగ్రహించె	నన్నుగ్రహించె
193	21	కారిణము	కారణము
198	11	నామసి	నామాసి
198	16	విష్ణ్వవతార	విష్ణ్వవతార
199	26	హనుమంతుల	హనుమంతుని
200	11	అపుడజ్ఞ	అపుడబ్జ
200	12	కలుగొన్న	కనుగొన్న
200	24	మచ్ఛోపవీతి	మచ్ఛోపవీతి
200	25	విక్షిపరతం	విక్షిపంతం
200	30	సంస్కృతిక	సాంస్కృతిక
201	2	ఒంలు	ఒంటి
201	32	వజల	వజ్ఝల
202	14	వాలనెత్తెను	వాలునెత్తెను
208	10	పాంసనం	పాంసనం
213	5	బముద్రుడు	సముద్రుడు
213	7	స్త్రదానస్త్రె	స్త్రదాశాస్త్రే
218	7	అహేశా	అహేడ
213	7	వరుడణే	వరుణే

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
215	15	పరమేషధ	పరమౌషధ
216	20	వాల్మీకి	వాల్మికికి
218	8	నాదస్తుతి	నారదస్తుతి
218	25	ఖకంధాది	కబంధాది
220	4	ఘట్జమును	ఘట్టమును
220	7	నడు	వినడు
221	31	గోపించే	గోపించి
222	14	విష్ణువుకి	విష్ణువని
231	9	రమ్మ్మని	రమ్మని
235	11	అనంద	ఆనంద
237	4+5	రాఘవేద్రుడు	రాఘవేంద్రుడు
237	6	గోవింర	గోవింద
237	17	వాఖ్యాత	వ్యాఖ్యాత
237	26	హనారాయణ	నారాయణ
238	6	జేరి	జేర్చి
240	6	రమనీయ	కమనీయ
240	6	వస్తువునందీభేద	వస్తువునందభేద
241	21	సంబంధిత	సంబంధి
243	25	శత్రూత్	శత్రూన్
244	3	శత్రుఘ్నశత్రు	శత్రుఘ్నశ్శత్రు
244	15	లక్ష్మణగుణు	లక్షణగుణు
245	1	ధర్మించి	ధర్షించి
245	7	క్షేమంద్ర	క్షేమేంద్ర
246	1	ముగికచు	ముగించు
246	5	యాదృచ్ఛయా	యదృచ్ఛయా
246	13	ఆయిన	అయిన
247	10	ఆరణ్యమున	ఆ రణమున
247	11	స్వాంతన	సాంత్వన
247	32	జృంబుడా	జృంభుడా
248	20	మూలాతిశాయ	మూలాతిశాయి
248	24	పోదరి	సోదరి
249	8	నారాయడే	నారాయణుడే
250	18	పఉమచరి	పఉమచరిఅ
250	19	గ్రంథముచు	గ్రంథమును
253	12	దుర్యిలంఘ్య	దుర్విలంఘ్య
254	15	ఆపాయము	అపాయము
254	28	పర్రాక్రమొక్కచే	పరాక్రమమొక్కచే
254	28	ఫలదాయ	ఫలదాయి
255	23	అద్యంత	ఆద్యంత
256	5	నివాపము	నివాసము
260	3	చున్నది	చున్నవి
260	26	గనాంత్యా	గణానాంత్వా
261	7	కాంతియే	కాంతయే
261	24	పభదీర్చెను	సభదీర్చెను
262	20	శశాంకార్థ	శశాంకార్ధ
264	13	మేఘనాధుని	మేఘనాదుని
264	27	ఇంజిత్తు	ఇంద్రజిత్తు
265	7	నెమి	నేమి
266	2	జెప్పకొన	జెప్పుకొన
268	19	వానలతో	వానరులతో
269	12	ఆహ	అహ
270	15	పధాన	ప్రధాన
270	20	విధముతలో	విదములలో
270	30	రంకనాధ	రంగనాధ
271	4	సవరించనచో	సవరించనిచో
273	10	మాదుగావలె	మా[illegible]గావలె
275	5	శిరంబేల	యాశిరంబేల
277	13	ఆహ్వానిచును	ఆహ్వానించును
278	24	अस्विकर	अस्वीकार
278	24	दस्य भत्ति	दास्य भक्ति
278	33	हित्वद्ध	हिद्धत्व
280	4	కావ్యముదా	కావ్యముగా
280	11	శ్టిష్టా	శ్లిష్టా
281	7	వళయ	ప్రళయ
281	17	అధారము	ఆధారము
282	8	జననానీ	జనన్యా
282	20	వ్యాసథాగత	వాస్యథాగతః
283	18	తరలు	తలలు
285	17	పూర్వార్థ	పూర్వార్ధ
285	25	నిహితి	నిహిత
286	1	గంస్కరణ	సంస్కరణ
286	1	ఆకంములు	అంకములు
286	4	పల్లవితయై	పల్లవితమై
286	14	ద్రాయమాణ	ద్రామాయణ
287	1	దినిపద	ద్విపద
287	14	చిన్నవని	చున్నవని
287	17	క్రిందులుగను	క్రిందులగును
287	18	అది కూర్మము	ఆది కూర్మము

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
287	19	వ్యంగార్థము	వ్యంగ్యార్థము
287	20	మహాత్మ	మాహాత్మ్య
287	30	నిని	వని
288	7	అపద్ధర్మ	ఆపద్ధర్మ
288	12	సమానమును	సహనమును
291	19	లేవని	లేదని
291	23	వ్యాఖ్యాన	వ్యాఖ్యాన
292	28	ధూత	దూత
294	5	జలకుని	జనకుని
294	6	దొడ్డు	దొడ్డ
294	22	మాతాస్త్రుణాని	హతాస్త్రుణాని
295	1	అవార్ది	ఆ వార్ధి
295	9	కడ్డున	కడ్పున
295	10	పంగవాని	పగవాని
295	21	బగి	ఒగి
296	12	అంగదు	అంగద
296	24	మృగాజనంబు	మృగజినంబు
296	24	దేపించు	దీపించు
296	27	ఆమర	అమర
297	22	పుర్ణరాకా	పూర్ణరాకా
297	27	వ్యంగ	వ్యంగ్య
298	24	శివి	శీవి
303	4	గూర్పి	గూర్చి
303	10	గవయునో	గవయుచో
307	6	నమియుట	నుమియుట
308	11	కరిగిది	కరిగిరి
308	30	అముని	ఆముని
309	21	ఆథ	అథ
310	10	ధర్మరాజు	ధర్మరాజును
311	10	వసిష్ట	వసిష్ఠ
312	1	బిందుతి	బిందుమతి
312	21	ద్ధియు	వృద్ధియు
314	21	ఇద్రుడు	ఇంద్రుడు
315	26	తేఽస్నాకం	తేఽస్మాకం
318	2	ఈ నమాధాన	ఈ సమాధాన
319	23	దెగవయగా	దెగవేయగా
320	26	ఐరిశీలికపగా	ఐరీశీలింపగా
322	26	కహా	కలహా
323	19	రాషసెం	రక్షసాం
323	28	శైలాగే	శైలాగ్రే
326	18	సముదము	సముద్రము
326	33	భరతోడ	భర్తతోడ
327	2	నేందు	నందు
327	18	కాంచుటయే	కాఁచుటయే
328	9	అత్రత పూర్వం	అత్రతపూర్వం
331	20	విలపించుండెను	విలపించు చుండెను
332	12	దఁలంపమని	దలంపుమని
333	21	అగర్వేమును	ఆగర్వ్యమును
335	22	ప్రాప్తము	ప్రాప్తియు
336	22	షేకానగ	షేకాఁగ
336	29	ముపామగత్	ముపాగమత్
337	1	హావిషో	హవిషా
337	11	యజూగ్ంఫి	యజూగ్ంషి
338	17	పోవుదనని	పోవుదునని
339	14	పట్జుకొని	పట్టుకొని
340	16	ఆను	అను
341	3	శాయనం	శాయినం
341	18	రంగనాథుడు	రంగనాథుని
345	16	యుండుచు	యుండును
346	7	వాద	వాద్య
348	6	పమకూర్ప	సమకూర్ప
348	29	కామ్ముష్మిక	కాముష్మిక
350	9	మథాది	మదాది
350	22	మఱివెతె	మఱి వేతే
350	24	అవతారక	అవతారిక
355	4	మహానీయ	మహనీయ
355	20	దెపివి దీవించి	దెలివి దీపించి
355	32	రామా తాణము	రామాయణము
356	15	శత్రర్దక	శత్రర్థక
356	20	కడిమియై	కడిమిమై
357	17	కడుభీతి	కడుభీతి
358	16	దినియు	దివియు
360	5	పదభేరము	పదభేదము
362	24	కల్పవ	కల్పన
364	8	వచ్చునవే	వచ్చుచునే
364	15	బదినది	బడినది
364	16	చిదకుంభ	ఛిద్రకుంభ
364	19	పూర్యక	పూర్వక

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
365	7	అగ్నినివేదిక	అగ్ని ని వేదిక
365	13	దాశిర్వచన	దాశీర్వచన
367	10	యుగ వేగ	యుగ్ర వేగ
368	8	దామరులు	దామరలు
368	19	యేమే	యోమే
368	26	తొందరపడి పొడి	తొండరడిప్పొడి
368	32	సంధారము	సంధానము
369	4	కురఙ్గగళ్	కురఙ్గగళ్
369	14	ఆశ్చర	ఆశ్చర్య
369	26	ఆంత	అంత
370	6	కశిచ్చిక్రోడా	కశ్చిచ్చిక్రోడా
371	1	అహోరహంబు	అహరహంబు
371	5	గూద	గూఢ
371	33	వదు	వద్దు
373	4	అయాధ్య	అయోధ్య
374	11	ఒంమారు	ఒకమారు
374	23	సీతమ	సీతను
375	3 4	అన్న	అన్న
375	6	పీతావహరణ	సీతాపహరణ
375	24	యోద్ద	యెద్ద
378	3	పెద్ద	పెద్దల
380	8	మొనపి	మొనపి
380	26	ప్రతివ్రతలు	పతివ్రతలు
382	7	ను సాధారణ	సాధారణ
382	13	షేకానంతము	షేకానంతరము
383	15	అనాడు	ఆనాడు
383	28	ఎఱియుంచిన	ఎఱయుంచిన
384	26	ఆమోధ్యా	అయోధ్యా
385	18	యొప్పియుమన్నది	యొప్పియున్నది
386	21	లనంంవలదు	లనంగవలదు
386	31	పండితాతారాధ్యా	పండితారాధ్య
387	23	జాడు	ఔడు
388	33	రరంగాచార్యులు	రంగాచార్యులు
389	7	వదములను	పదములును
390	29	వేల్పుమల	వేల్పుమల
392	4	శ్రీమద్రారామాను	శ్రీమద్రామాను
392	21	రామాయకు	రామాయణ
393	15	వెలువడినవి	వెలువడినది
395	29	అందమును	ఆనందమును
397	4	వశోంప	వంశోప
397	9	వాద్యుడైన	పాద్యుడైన
398	29	దార్ఢ్యము	దార్ఢ్యము
399	7	సముద్రావం	సముద్రావం
404	22	యానుశ్రుతి	యనుశ్రుతి
405	9	ఆప్రాకృత	అప్రాకృత
405	16	చూపించుటమే	చూపించుటయే
405	33	భగదీత	భగవద్గీత
406	2	ప్రవత్తి	ప్రపత్తి
406	9	ఆత్మ	ఆత్మ
407	9	చున్వవి	చున్నవి
409	5 12	ఈ ఘటన	ఈ [illegible]
409	10	రాముడెక్కడని	[illegible]
411	1	ప్రార్థిచినవి	ప్రార్థించినవి
412	4	అట్టె	అట్లే
414	8	ఆమూలక	అమూలక
415	21	పోలతి	పౌలతి
415	26	మంగభ	మంగళ
416	1	అరా	అర్చా
417	22	గుణేక	గుణైక
418	8	శ్రియ!	శ్రియః
419	3	మురొక్క	మరొక్క
419	7	తాద్రుశ్య	తాదృశ
420	7	చున్నది	చున్నవి
420	11	భావద్దోషే	భావాద్దోషే
422	12	రామున సౌశీల్వ	రాముని సౌశీల్య
422	18	నీకంటు	నీకంటె
422	28	దయార్ద	దయార్ద్ర
423	19	మహిద్భాగ్యము	మహద్భాగ్యము
423	27	సంచరింనాడు	సంచరించినాడు
425	2	రామునే	రాముని
428	11	ఆని	అని
428	28	శియః	శ్రియః
429	6	దక్షితా	రక్షితా
429	17	నన్నివిష్టో	సన్నివిష్టో
429	21	గలవాడుశేష	గలవాడుశేషి.
431	32	సుందరకాంము	సుందరకాండము
432	17	ఐహిక ముష్మిక	ఐహికాముష్మిక
434	7	అన	అని

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
435	33	పాల్మీకి	వాల్మీకి
436	5	అని	అని
436	22	క్షరమనును	క్షరమును
438	5,12	అర్ధపంచక	అర్థపంచక
438	15	సహానము	సహనము
438	19	కొంచమాలో	కొంచెమాలో
438	26	పాపస్య, ప్రాపశ్చ	ప్రాప్యస్య, ప్రాపుశ్చ
439	20	కరిణి	కరణి
440	21	మూ రూపము	మూలరూపము
440	27	గాయతి	గాయత్రి
442	12	కేకేశి	కైకేశి
442	16	నవతరిచును	నవతరించును
443	9	మహాత్మ్యము	మాహాత్మ్యము
443	11	శ్రతులు	శ్రుతులు
443	22	అతర్యామి	అంతర్యామి
444	1	సుహృతై	సుహృత్తై
446	1	వినహీము	విహీనము
447	6	అసన, అర్ఘ్య	ఆసన, అర్ఘ్య
447	17	బహూనాక	బహూనాం
447	24	బుభుక్షువులులు	బుభుక్షువులు
452	21	ధర్చ్మాపేత	ధర్మాపేత
454	17	ప్రాణామాయ	ప్రాణాయామ
454	28	బ్రాహ్వణము	బ్రాహ్మణము
456	8	చిత్తయికాగ్రత	చిత్తైకాగ్రత
457	10	బడినరి	బడినది
457	14	భగద్రామానుజ	భగవద్రామానుజ
457	33	,,	,,
458	8	వాదిరి	వారిధి
458	13	బొరతి	బొరలి
459	10	శ్రీఘ	శీఘ్ర
459	23	అనకూల్య	ఆనుకూల్య
460	25	భ్రష్టేశ్వర్య	భ్రష్టేశ్వర
461	26	ఆత్మోదరణ	ఆత్మోద్ధరణ
462	26	తస్యతే...ర్థాః	తస్యైతే...ర్థాః
462	25	శ్వేతాశశ్వ	శ్వేతాశ్వ
462	34	శివల్లి	శిక్షావల్లి
464	10	భదవ	భగవ
464	11	నికుంకాభి	నికుంభిళా
465	16	మమ్మటానాద్యుడు	మమ్మటాచార్యుడు
465	27	మూరాణాం	మూర్ఖాణాం
468	3	సంచాపభావ	సంచారీభావ
468	21	సజాతీమైర్వి జాతీమై	సజాతీయై ర్విజాతీయై
470	4	వర్గనుడు	వర్ధనుడు
470	10	భవభూత్వాదులు	భవభూత్యాదులు
471	21	ఇత్యుకైః	ఇత్యుక్తైః
473	15	ధర్మసాపన	ధర్మస్థాపన
475	3	బీఃము	బీజము
475	15	పరుశురామ	పరశురామ
476	17	పడితి	పడతి
476	28	యధిష్ఠిరాదిః	యుధిష్ఠిరాదిః
377	5	జగతద్ధిము	జగద్ధితము
477	11	తీర్చు	తీర్చి
473	8	విరవృత్తాంత	వరవృత్తాంత
478	10	నడుపుల	నడవుల
478	28	భక్యాను	భక్త్యను
479	8	యుత్పాహము	యుత్సాహము
479	33	వీరపము	వీరరసము
480	1	వన్చి	వచ్చి
480	33	చేయుచననెను	చేయుమననెను
482	32	జూర్ణమొ	జూర్ణమొన
485	7	పౌఢి	ప్రౌఢి
485	16	చెఱిగొని	చెఱగొని
485	27	నదలరాదు	వదలరాదు
486	4	రామా	రామ
486	23	గఅతనంబు	గలితనంబు
486	26	సూరుల	శూరుల
487	10	నమ్మ	నన్ను
488	15	వీరములలో	వీరములో
489	3	శ్రీరా ముని	శ్రీరాముడు ముని
490	12	బరవీరము	బలవీరము
490	17	ఆశని	అశని
491	13	నందించట	నందిచట
491	23	సుఖులామె	సఖులామె
491	27	అమూలకమే	అమూలకమే
491	32	తత్త్వసంభోగ	తత్తుసంభోగ

పుట	పంక్తి	తప్పు	ఒప్పు	పుట	పంక్తి	తప్పు	ఒప్పు
494	1	బో కెమ్మోవి	బోటికెమ్మోవి	515	19	తూడగాతోర్పు	తోడఁగా తూర్పు
495	25	లోకవింత	లొకవింత	513	4	యపమానము	యుపమానము
497	1	ఇదియే సీమ	ఇది యే సీమ	516	19	వినిర్ధక్ష	వినిర్దగ్ధ
497	2	పొదము	పొడము	517	31	చెప్పుచ్చును	చెప్పవచ్చును
497	8	యేడు	యాడు	518	25	మునుగుటమో	మునుగుటయో
497	10	జందెము	జందెము	519	5	మహిజములు	మహీజములు
497	20	పైచియురు	పైచియును	519	8	వస్తుపునేత	వస్త్రపునేత
498	33	పుద	పుట	519	11	వెల్లగిలి	పెల్లగిలి
409	15	శరథేశ్వ	దశరథేశ్వ	520	24	ఉదదస్థో	ఉదరస్థో
500	2	ఇట్టి	ఇట్లి	521	14	తడసి	తడిసి
500	22	కెశెబరము	కళేబరము	521	23	హహత్తమము	మహత్తమము
500	30	పాథాధి	పాథోధి	523	20	శిరరిపై	శిఖరిపై
500	32	నేదా	నేడా	523	31	సస్సంధ్య	ససంధ్య
501	6	భీకరములై	భీకరములైన	524	19	గుణంబుల	గణంబుల
501	15	దీఅండించి	దీఅడించి	525	20	ప్రీతిమే	ప్రీతిమై
501	22	చున్నది	చున్నవి	527	5	శుభభేతి	శుభభేఒతి
502	4	తనను	తనకు	527	12	కిశోరీత్పథం	కిశోరివౌత్పథం
502	24	నెతురుల్	నెత్తురుల్	527	34	బదేవ	బద్దేన
503	4	చున్పది	చున్నది	528	1	అనేష్యామి	ఆనేష్యామి
503	7	నాయిక	నాయక	528	8	భవానివేశః	భగవానివేశః
503	21	పశదాయ	పగదాయ	528	12	స్త్రారాల	స్త్రాల
503	29	వెఱివక	వెఱపక	528	14	హృతే	హ్రదే
504	3	రావణున	రావణుని	528	19	వాలుం	వాలుక
054	14	ప్రార్థించును	ప్రార్థించినను	528	25	తావాదేశా	తవాదేశా
504	17	గుహోపధాన	గుహాపిధాన	529	1	విప్రవమోక్ష్యామి	విప్రపమోక్ష్యామి
505	26	కోఅను	కోఅలును	530	1	చ్చట	ఇచ్చట
507	6	శ్లోకార్థము	శ్లోకార్థము	530	1	ఇతరావయ	ఇతరావయవ
509	20	ఎవదిగి	ఎవరేది	530	2	ఆభేదములు	అభేదములు
510	15	బడన	బడిన	532	26	ఆనిలసూను	అనిలసూను
511	9	ఆ లంకార	ఆయలంకార	534	22	భ్రమంబు	భ్రమణంబు
511	31	పురాణపుము	పురాణము	537	27	భ్రమనము	భ్రమణము
512	28	నామనుడు	వామనుడు	537	26	శారములై	శరములై
514	1	గూరిక్రియ	గూలుక్రియ	540	18	మెలుకొన	మేలుకొన
514	1	నుల్వపై	నుర్విపై	541	4	ప్రయేగము	ప్రయోగము
514	4	బనది	బడినది	542	14	నాపాదించుట్లు	నాపాదించునట్లు
514	6	మునదు	మునందు	543	10	యున్నడు	యున్నాడు
514	7	హనుమన్నైనాక	హనుమన్మైనాక	544	12	సహాజ	సహజ
514	8	వక్తికి	వ్యక్తికి	545	11	ఎతైన	ఎత్తైన
514	15	విస్తరద్దేశోశ	విస్తరణోద్దేశ	545	17	గొని	గాని

546	32	ఆనునది	అనునది
546	32	ఆభాణక	ఆభాణక
547	13	ధీమతాః	ధీమతః
548	3	కరత్వాంబూ	కరత్వాంబు
548	34	మొలగవు	మెలగవు
550	7	గాసేయ	గాపేయ
552	28	లగొకుల	గొలకుల
553	2	డొంకి	నింకి
553	9	రామయణ	రామాయణ
554	7	ఆవమానింప	ఆవమానింప
555	8	రథమపు	రథమాపు
557	10	దెలిసన	దెలిసిన
559	20	గ్రహిప	గ్రహింప
560	16	శ్చతుర్ద్రింష్ట్రి	శ్చతుర్దంష్ట్రి

గ్రంథ ముద్రణకై సహాయము చేసిన విరాళ దాతలు

1. సర్వశ్రీ ఎ. లక్ష్మీకాంతారావు కరీంనగర్.	1116.00
2. పార్శి గంగయ్యగారు. EX M L A. కామారెడ్డి.	516.00
3 K L నర్సింహాచార్యులుగారు Jr Lecturer నిజామాబాద్.	501.00
4. కందాళై నర్సింహాచార్యులుగారు. M R O నిజామాబాద్	501.00
5. ఆకుల మురళీ శ్రేష్ఠిగారు. (శ్రీ ధనలక్ష్మి ఇంజనీరింగ్ కంపెనీ) కామారెడ్డి	501.00
6. గుండి నర్సింహాచార్యులుగారు. వేములవాడ	501.00
7. కిరాణవర్తకసంఘంవారు. కామారెడ్డి	501.00
8. డా॥K అంజల్ రెడ్డిగారు. కామారెడ్డి	509.00
9 డా॥G. గోపాల్‌రావునాయుడుగారు. నిజామాబాద్	500.00
10. శ్రీమతి A. శాంతమ్మగారు; W/O A కాంతారావు. కరీంనగర్	500.00
11. ముష్ణం లక్ష్మీనర్సింహాచార్యులుగారు (వెల్మల) నిజామాబాద్	250.00
12. నారాయణరెడ్డిగారు. H M, & Staff. Z P H S. కామారెడ్డి	200.00
13 L I.C Office Staff కామారెడ్డి	230.00
14. R. D. O. Office Staff కామారెడ్డి	150.00
15. P. తిలక్‌శర్మగారు Lecturer in Zoology కామారెడ్డి	151.00
16, చీల ప్రభాకర్‌గారు. కామారెడ్డి	120.00
17. T. A. రామయ్యగారు Lecturer in mathematics. కామారెడ్డి	116.00
18. V. మనోహర్‌రావుగారు. Lecturer in Botany. కామారెడ్డి	116.00
19. P. దామోదర్‌రావుగారు Lecturer in Economics కామారెడ్డి	116.00
20. B. శ్రీనివాసరావుగారు, Lecturer in Zoology. కామారెడ్డి	116.00
21 నర్సింహారెడ్డిగారు Lecturer in Zoology	116.00
22. డా॥ T. భైరయ్యగారు కామారెడ్డి	116.00
23. డా॥ K. వేంకట్‌రాజంగారు కామారెడ్డి	116.00
24. డా॥ G. నారాయణరెడ్డిగారు. కామారెడ్డి	116.00
25. డా॥ M. భూపాల్‌రెడ్డిగారు. కామారెడ్డి	116.00
26. డా॥ M. వెంకటేశ్వర్లుగారు కామారెడ్డి	116.00
27. N. రాంరెడ్డిగారు. కాల్దీపూర్	116.00
28. కంకణాల కిషన్‌గారు. కామారెడ్డి	116.00
29. మ్యాదం రాములు & సన్స్‌గారు. కామారెడ్డి	116.00
30. ముత్యపురాములు & బ్రదర్స్‌గారు కామారెడ్డి	116.00
31. యాద నాగేశ్వర్‌రావు & కంపనీగారు. కామారెడ్డి	116.00
32. యాద రాములు & కంపనీగారు. కామారెడ్డి	116.00

33	ఠాకూర్‌గారు బాంబేక్లాథ్‌హౌజ్. కామారెడ్డి	116-00
34.	కోపూరు సిద్ధయ్య & రాములుగారు. కామారెడ్డి	116-00
35.	B సత్యనారాయణగారు. Deputy Executive Engineer కామారెడ్డి	116-00
36.	లాభి శెట్టిభీమయ్య & కంపనీగారు. కామారెడ్డి	116-00
37.	రేనికుంటి దత్తయ్య & సన్స్‌గారు. కామారెడ్డి	116-00
38	B. M S V. భద్రయ్యగారు. Extension officer-Edn కామారెడ్డి	116-00
39.	గోజె వెంకటరావు & గోవిందరావుగారు కామారెడ్డి	116-00
40	ముక్కపుమల్లయ్య & సన్స్‌గారు కామారెడ్డి	116-00
41.	బిచ్చులక్ష్మీపతి Market Chairman. కామారెడ్డి	116-00
42	చీల భాస్కర్‌గారు Petrol Bunk. కామారెడ్డి	116-00
43.	మహారాజాబార్‌షాపుగారు కామారెడ్డి	116-00
44.	పార్శిబాలరాజయ్యగారు. నిజామాబాద్	116-00
45.	కాముని రాజవీరయ్యగారు. (కోనాపురం) రామాయంపేట	116-90
46.	చీల బుద్ధయ్యగారిలక్ష్మీపతిగారు కామారెడ్డి	116-00
47.	K. మల్లయ్యగారు. EX B. D O కామారెడ్డి	116-00
48.	నిమ్మలజీవారెడ్డి & మల్లారెడ్డిగారు. కామారెడ్డి	111-00
49.	A. S. గురురాజగారు. Lecturer in chemistry	101-00
50.	తిరునగరి నర్సింలుగారు. Jr Lecturer in Telugu నిజామాబాద్	101-00
51.	యాద మల్లయ్య & రాజశేఖర్‌గారు. కామారెడ్డి	101-00
52.	గరిపెల్లి శేఖరయ్య & సన్స్‌గారు. కామారెడ్డి	101-00
53.	B. రాజేశ్వరశర్మగారు తెలుగు పండిట్. సదాశివనగర్	101-00
54.	కొండా లక్ష్మీనర్సింహగుప్తాగారు. కామారెడ్డి	101-00
55.	డా॥ రాజగోపాల్‌రావుగారు. కామారెడ్డి	101-00
56.	R. రాఘవేందర్‌రావుగారు. F I. (R D. O Office) కామారెడ్డి	101-00
67.	గంజి రాజయ్యగారు. కామారెడ్డి	101-00
58.	ముత్యంరావుగారు. వకీల్. కరీంనగర్	101-00
59.	పొప్పట్‌లాల్‌గారు. కామారెడ్డి	101-00
60	A. భాస్కర్. Supervisor. కామారెడ్డి	101-00
61	గోవర్ధన నారాయణాచార్యులుగారు నిజామాబాద్	101-00
62.	శిరికినహళ్ నంబులాద్రి ఆచార్యులుగారు. నిజామాబాద్	101-00
63	నగునోతు చంద్రమౌళిగారు. మందులదుకాణము వేములవాడ	101-00
64.	కేతం గంగారాంగారు. కామారెడ్డి	75-00
65.	చీల రాములు &సన్స్‌గారు. కామారెడ్డి	51-00
66.	చీల భూమయ్య & సన్స్‌గారు, కామారెడ్డి	51-00

67. చీలజగదీశ్వర్ గారు. కామారెడ్డి 51-00
68 అయిత భూమన్న గారి చంద్రయ్యగారు. కామారెడ్డి 51-00
69. డా॥ ప్రకాశరావుగారు. EYE Speclaiist కామారెడ్డి 51-00
70. వెంకటేశ్వర ఆయిల్ మిల్ గారు. కామారెడ్డి 51-00
71. Ch. సదాశివశర్మగారు తెలుగు పండిట్ కామారెడ్డి 51-00
72. చీల విశ్వనాథంగారు కామారెడ్డి 51-00
73 G. లచ్చయ్యగారు టీచర్. కామారెడ్డి 51-00
74. పాత రామకిష్టయ్య & సన్స్ గారు. కామారెడ్డి 51-00
75. ఐత బాలయ్యగారు కామారెడ్డి 51-00
76 చిదుర కిష్టయ్యగారు. కామారెడ్డి 51-00
77. మోటూరు ఆంజనేయులుగారు. కామారెడ్డి 51-00
78. దుద్దెల్లి చంద్రయ్యగారు కామారెడ్డి 51-00
79 పాత బలరాం & మేడం కిష్టయ్యగారు. కామారెడ్డి 51-00
80. కొక్కొండ శివరాములుగారి సిద్ధిరాములు కామారెడ్డి 51-00
81. పార్శి రాజయ్యగారు. కామారెడ్డి 51-00
82. T. రాజేశంగారు. కామారెడ్డి 51-09
83. ఉప్పు రాజయ్యగారు కామారెడ్డి 51-00
84 తాటికొండ విశ్వనాథం & సన్స్ గారు. కామారెడ్డి 51-00
85. పార్శి రాములు & తాటికొండ కూచయ్యగారు కామారెడ్డి 51-00
86. యాద గంగయ్య & సన్స్ గారు. కామారెడ్డి 51-00
87. నవుబోతు ధర్మయ్యగారు కామారెడ్డి 51-00
88. చిటిమెల్లి విఠల్ గారు. కామారెడ్డి 51-00
89. పాల్తి వెంకటేశంగారు. కామారెడ్డి 51-00
90. V. శ్యాంరావు పటేల్ గారు. కామారెడ్డి 51-00
91. పార్శి పెంటయ్య రాజయ్యగారు. కామారెడ్డి 51-00
92. J. నర్సింహమూర్తిగారు Lecturer in Telugu, ఎల్లారెడ్డి 51-00
93 పార్శి కృష్ణమూర్తిగారు. కామారెడ్డి 51-00
94. లాభిశెట్టి విశ్వనాథంగారు. కామారెడ్డి 51-00
95. పాత బలరాం & కంపనీగారు కామారెడ్డి 51-00
96. M. శంకరయ్య & N. విఠల్ గారు కామారెడ్డి 51-00
97. పాత గంగయ్య & సన్స్ గారు. కామారెడ్డి 51-00
98. R చంద్రయ్య & P. రామలింగయ్యగారు కామారెడ్డి 51-00
99 సుభాష్ చంద్ జైన్ గారు కామారెడ్డి 51-00
100. M సురేందర్ రావుగారు. (Telephone Exchange) కామారెడ్డి 51 00

101.	సేరుమా నారాయణగారు నిజామాబాద్	51-00
102.	శాస్త్రుల పాండురంగశర్మగారు. Jr. Lecturer In Telugu మెదక్	51-00
103.	తాటికొండ శ్రీశైలంగారు రైస్‌మిల్. కామారెడ్డి	51-00
104.	B. లక్ష్మీపతిగారు ఆయిల్ మిల్ కామారెడ్డి	51-00
105.	A కృష్ణమూర్తిగారు Teacher. కామారెడ్డి	51-00
106	K హనుమాండ్లు& సన్స్‌గారు. కామారె	51-00
107.	చింతగారి భైరయ్యగారు. కామారెడ్డి	51-00
108.	చిదురి చంద్రశేఖర్‌గారు. కామారెడ్డి	51-00
109.	M. V. సుబ్బారావుగారు Deputy Insepector. కామారెడ్డి	58-00
110.	చిదుర దత్తాద్రిగారు. కామారెడ్డి	51-00
111	పార్ది నర్సయ్య & పార్శిగంగయ్యగారు. నిజామాబాద్	51-0
112.	K. వెంకట్‌రామారావుగారు. Principal రామాయంపేట	51-00
113.	పలవంచ ఆగయ్యగారు. కామారెడ్డి	51-00
114.	K. మాధవరెడ్డిగారు. Lecturer In English కామారెడ్డి	51-00
115.	T. సాయిబాబాగారు. " "	51-00
116.	K ప్రసాదరావుగారు. Lecturer In Economics. కామారెడ్డి	51-00
117.	G. వేణుగోపాల్ రెడ్డిగారు. Lecturer. కామారెడ్డి	51-00
118.	G. వెంకట్‌రెడ్డిగారు. Lecturer In Political Science. కామారెడ్డి	51-00
119.	V. పుండరీకాచారి Lecturer In Physics. కామారెడ్డి	51-00
120.	విఠల్‌రెడ్డిగారు. Lecturer commerce కామారెడ్డి	51-00
121.	G. సంగయ్యగారు. Lecturer in Physics కామారెడ్డి	51-00
122.	P. మల్లారెడ్డిగారు. Lceturer In Electronics. కామారెడ్డి	51-00
123.	రాఘవర్మగారు. Lecturer In commerce. కామారెడ్డి	51-00
124.	P. మన్‌మోహన్‌రెడ్డిగారు. Lecturer in Zoology. కామారెడ్డి	61-00
125.	K. సుదర్శన్‌రెడ్డిగారు. Lecturer in Chemistry. కామారెడ్డి	51-00
126.	అబ్దుల్ అజీజ్ గారు. Lecturer In chemistry. కామారెడ్డి	51-00
127.	S. నాగేశ్వర్‌రావుగారు. Lecturer lu commerce కామారెడ్డి	51-00
128.	M. మల్లారెడ్డిగారు. Lecturer in Mathematics.కామారెడ్డి	51-00
129.	B. కేశవరావుగారు. Lecturer in Physics. కామారెడ్డి	51-00
130.	B V. కృపానిధి. Librarian. కామారెడ్డి	51-00
131.	K. కామేశ్వర్‌రావుగారు.Lecturer in chemistry.	51-00
132,	L R భాస్కర్‌గారు. Physical Director . కామారెడ్డి	51-00
133	గజవాదనాగరాజం & లక్ష్మీనర్సయ్యగారు. కామారెడ్డి	51-00
134.	B. రవీందర్‌గారు. L. D. C. (R. D. O. Office) కామారెడ్డి	51-00

135	యాదగిరిగారు. తెలుగు పండితుడు చుక్కాపూర్	51-00
136	జి. గణపతిగారు టీచర్. (నవీన్ ఆర్ట్ స్టూడియో) కామారెడ్డి	51-00
137.	S, లక్ష్మయ్యగారు, టీచర్, (కూరగాయలమార్కెట్‌వీధి) కామారెడ్డి	51-00
138.	G శ్రీనివాసశాస్త్రిగారు jr. Lecturer in Telugu కామారెడ్డి	51-00
139.	M. అనంతకుమారశర్మగారు, Lecturer సాయం ప్రాచ్యకళాశాల కామారెడ్డి	51-00
140,	సేనాపతి భాష్యకారాచార్యులుగారు, లెక్చరర్, నిజామాబాద్	51-00
141	ఆచ్చి శ్రీనివాసాచార్యులుగారు. లెక్చరర్, నిజామాబాద్	51-00
142.	సముద్రాల రత్నమాచార్యులుగారు, తెలుగు పండిట్, నిజామాబాద్	5 -00
143.	నమిలకొండ మురళీధరాచార్యులుగారు, తెలుగుపండిట్, నిజామాబాద్	51-C0
144,	వైద్యం వెంకటాచార్యులుగారు Teacher, నిజామాబాద్	51-00
145.	లక్ష్మణాచార్యులుగారు, గూడెం	51-00
146.	G, కృష్ణమూర్తిగారు, Jr Lecturer Telugu, గంభీర్‌రావుపేట	25-00
147.	S, రాజిరెడ్డిగారు, U, D, C, పంచాయితిసమితి, కామారెడ్డి	25-00
148,	వీరమల్లు నాగరాజుగారు, కామారెడ్డి	25-00
149	పాల్తి వెంకటేశంగారు కామారెడ్డి	25-00
150.	S. రాజయ్య & కంపనీగారు, కామారెడ్డి	25-00
151,	జి. బి, శ్రీరామిరెడ్డిగారు, కామారెడ్డి	25-00
152,	చొల్లేటి లింగయ్యగారు, రామాయంపేట	25-00
153,	M, మొగిలిగౌడ్‌గారు. Lecturer in civics కామారెడ్డి	25-00
154	D లక్ష్మీనర్సింహంగారు, Lecturer in chemistry, కామారెడ్డి	25-00
155.	శెట్టిపల్లి విశ్వనాథశర్మగారు (జోషి) దేమె (కలాన్)	51-00
156,	రంగనాథ వాచస్పతిగారు, ఆంధ్రోపన్యాసకులు-సాయం ప్రాచ్య కళాశాల కామారెడ్డి	5 -00
157.	రామస్వామిగారు, ఆంగ్లోపన్యాసకులు సాయం ప్రాచ్య కళాశాల కామారెడ్డి	51-00
158	నటేశ్వరశర్మగారు, సంస్కృతోపన్యాసకులు, ,, ,,	51-00
159.	టి, వెంకటేశ్వరశర్మగారు, ప్రిన్సిపాల్. ,, ,,	101-00

Printed at : KARSHAK ART PRINTERS, Vidyanagar. Hyderabad-44